ఫారిన్ వెళ్ళాల(న)ండీ

ట్రావెలాగ్

- వసుంధర



శ్రీ
కౌముది
మీ మనంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 249

కౌముది మాసపత్రికలో

జనవరి 2016 సంచిక నుంచి జనవరి 2023 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

(ప్రారంభం)

నవలా రచనా పరిచయం

మొక్కపాటి నరసింహశాస్త్రి విరచిత 'బారిస్టర్ పార్వతీశం' అసంఖ్యాక తెలుగు పాఠకులను అలరించి, తెలుగు హాస్యానికి కొత్త ఒరవడి పెట్టిన విశిష్ట నవల. బయటి ప్రపంచం తెలియకుండా పెరిగిన ఓ పల్లెటూరి అమాయకుడు పార్వతీశం - లండన్లో బారిస్టర్ కోర్సు చెయ్యాలని బయల్దేరి - మొదటిసారిగా రైలెక్కి, తర్వాత ఓడెక్కి, నెమ్మదిగా లండన్ చేరుకుని మొత్తమ్మీద అనుకున్నది సాధించడం ఇతివృత్తం. లండన్ చేరుకోవడం మొదటి భాగం. లండన్లో చదువు రెండో భాగం. చదువై దేశానికి తిరిగొచ్చేక మూడో భాగం. ఈ 'ఫారిన్ వెళ్లాలండి' నవల ప్రవాసాంధ్రుడిగా ప్రపంచాన్ని చూసిన ఓ విద్యాధిక వివాహితుడు రాజారావు ప్రభుత్వపు పనుపున ఇష్టాయిష్టాల మధ్య నలుగుతూ, 1973 సంవత్సరంలో, జర్మనీ ప్రయాణానికి ఉద్యుక్తుడు కావడం ఇతివృత్తం. జర్మనీలో అతడి అనుభవాలు 'ఫారిన్ వెళ్లానండి' గా రెండోభాగం. పార్వతీశం, రాజారావులవి పూర్తిగా భిన్న వ్యక్తిత్వాలైనా ప్రపంచ జ్ఞానంలో, స్పందనలో ఇద్దరూ ఒక్కటేనన్నిపించేటంత పోలిక ఉండడం విద్యాధికుల మనుకునేవారందరికీ గమనార్హం. ఎందుకంటే 'బారిస్టర్ పార్వతీశం' మొక్కపాటివారి సృజన కావచ్చు. కానీ ఈ నవలలో పాత్రలు (పేర్లు మార్చి ఉండొచ్చు), సన్నివేశాలు అన్నీ వాస్తవాలు. మొక్కపాటి వారి భవిష్యద్దర్శనానికి అభివందనాలు.

ఇక ఈ నవలా రచన మూడు గొప్ప తెలుగు పద్యాలతో ముడిపడి ఉంది. మొదటిది-

'చిప్పలోన పడిన చినుకు ముత్యంబయ్యె
నీటబడిన చినుకు నీట కలిసె
ప్రాప్తమున్న చోట ఫలమేల తప్పురా
విశ్వదాభిరామ వినురవేమ'.

స్వానుభవాలకి అక్షరరూపం ఇవ్వడానికి ఈ పద్యం ఎందరో రచయితలకిలాగే మాకూ ప్రేరణ. ఈ నవలకూనూ.

రెండవది

'ఎవ్వడవీవు కాళ్లు మొగమెరన ?' 'హంసమ' 'నెందునుందువో?'
'దవ్వుల మానసంబునను 'దాన విశేషములేమి చెప్పుమా?'
'మవ్వపు కాంచనాబ్జములు , మౌక్తికముల్ కలవందు' 'నత్తలో?'
'అవ్వి యెరుంగ'నన్న 'నహహా' యని నవ్వె బకంబులన్నియున్

మానససరోవరం నుండి ఎగిరి వచ్చి ఒక నీటిగుంటలో దిగిన రాజహంసతో అక్కడి కొంగల సంభాషణ ఈ ప్రాచీనపద్యం. మానస సరోవరంలోని విశేషాలేమంటే - అందమైన బంగారు పూలు, మేలి ముత్యాలూ ఉంటాయంది హంస. మరి నత్తలో అనడిగాయి కొంగలు. హంసకు నత్త లంటే తెలియదని తెలుసుకున్న కొంగలు అహహా యని నవ్వి ఎగతాళి చేశాయిట. ఒకవేళ ఓ కొంగ కనుక

అనుకోకుండా హంసల గుంపులోకి వెడితే, బంగారు పూల గురించి తెలియనందుకు అదీ నవ్వుల పాలయ్యేది. ఇక్కడ కొంగలు గొప్పవా, హంసలు గొప్పవా అని కాక, ప్రతి సమాజంలోనూ గొప్పతనానికి ఓ నిర్వచనం ఉంటుందని ముఖ్యంగా ప్రవాసంలో ఉన్నవారు గ్రహించాలి. అప్పుడు ఎవరికీ మిడిసిపాటుండదు. ఇది ప్రవాసాంధ్రులుగా, ప్రవాస భారతీయులుగా, అనుభవాలనుంచి మేమందుకున్న సందేశం. అది ఈ నవల్లో అంతర్లీనం.

మూడవది-

కమలములు నీటబాసిన

కమలాప్తుని రస్మి సోకి కమలిన భంగిన్

తమతమ నెలవులు దప్పిన

తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ

మనకి మన అలవాట్లే మంచిమిత్రులు. స్థలం మారితే అలవాట్లే శత్రువులు కావచ్చు. అప్పుడా అలవాట్లు మార్చుకోవాలా, శత్రువుల్ని మార్చుకోవాలా అన్నది అవగాహనతో తీసుకోవాల్సిన వ్యక్తిగత నిర్ణయం. ఈ విషయంలో మా అనుభవాలు నేర్పిన పాఠాలే ఈ నవల కథాంశం.

కథలకు పేర్లు పెట్టడంలో సిద్ధహస్తులైన మాన్యులు రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన 'సొమ్ములు పోనాయండి' ప్రభావంతో ఈ నవలకు ఫారిన్ వెళ్లాలండి, ఫారిన్ వెళ్లానండి పేర్లు మాకు స్ఫురించడం జరిగింది. ఈ నవల ప్రచురణ సందర్భంగా వారిని సంస్మరించడం మా బాధ్యత.

రెండు భాగాల ఈ నవలకు - సాహితీలోకంలో విశిష్టమైన కౌముది గ్రంథాలయయోగం పడుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. సంపాదకులు శ్రీ కిరణ్‌ప్రభకు ధన్యవాదాలు.

ఉపోద్ఘాతం

ఆకాశంలో చుక్కలు మెరుస్తున్నాయి. దొడ్లో పడక కుర్చీలో కూర్చుని పైకి చూస్తున్న నాలో ఆలోచనలు పరిపరివిధాల పోతున్నాయి.

ఆకాశంలో మెరిసే తారల్ని చూసినపుడల్లా నా మనసు వశం తప్పుతుంది. అందుకు అనేక కారణాలు...

కనిపించే చుక్కల్లో కొన్ని గ్రహాలు, కొన్ని నక్షత్రాలు. మతం వాటిగురించి కథలు చెబుతుంది. సైన్సు వాటి గురించిన నిజాలు చెబుతుంది. నేను కావడానికి సైంటిస్టునే అయినా సైన్సు చెప్పే నిజాలకంటే మతాలు చెప్పే కథలే నాకు బాగుంటాయి. ఆ కల్పితగాథల చుట్టూ జీవితాలనల్లుకుని కోట్లాది ప్రజలు జీవిస్తున్నారు.

మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.

ఆ కల్పితగాథల పేరుతో యుద్ధాలు జరిగాయి. ఆలయాలు వెలిశాయి. సంస్కృతులేర్పడ్డాయి.
ప్రపంచంలో ఈనాడున్న కులం, మతం, జాతి వగైరాలన్నీ కల్పితగాథల్లోంచి పుట్టినవే! ఈ కల్పితగాథల్లో చాలావరకూ ఆకాశం నుంచి పుట్టినవే.

మతం గురించిన నా అభిప్రాయాల సంగతెలాగున్నా - మతంలో చెప్పబడ్డ స్వర్గమంటే చిన్నప్పటినుంచీ నాలో గొప్ప ఆకర్షణ ఏర్పడింది. నా ఆలోచనల ప్రకారం స్వర్గం ఆకాశంలో ఉంటుంది. విమానంలో వెడితే స్వర్గం కనబడుతుందేమో అనుకునేవాడిని మొదట్లో.. కానీ ఎన్నో సంవత్సరాలుగా ఎందరో విమానాలలో ప్రయాణిస్తున్నా ఎప్పుడూ స్వర్గం ప్రసక్తి రాలేదు. ఇటీవల విమాన ప్రమాదాలు ఎక్కువై - విమానప్రయాణం చాలామందిని త్వరగా స్వర్గానికి చేర్చుతున్నదంటే అది వేరేసంగతి.

విమానాలుపోయి రాకెట్ యుగం వచ్చాక స్వర్గం గురించి తెలుస్తుందనుకున్నాను. కానీ రాకెట్లు శాస్త్రజ్ఞులాశించిన ప్రయోజనాలకే ఉపయోగపడ్డాయి తప్ప స్వర్గం గురించి తెలుసుకోలేదు.

ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడిపై అడుగుపెట్టేనాటికి నా బుద్ధి కాస్త వికసించింది. అయినా అక్కడ చంద్రుడు మానవరూపంలో అతడికి ప్రత్యక్షమైతే నేనింకా ఎంతో సంతోషించేవాణ్ణి.

కాలక్రమేణా నా బుద్ధి మతాన్ని వదిలిపెట్టి సైన్సుకు అనుగుణంగా ఆలోచించడం నేర్చుకుంది. స్వర్గం గురించి నా భార్యతోటీ విజ్ఞులైన మిత్రులతోటీ చర్చలు జరిపాక కొన్ని వింత నిజాలు గుర్తించాను. ఆ ప్రకారం స్వర్గం భూమ్మీదనే ఉండొచ్చు.

పుణ్యం చేసిన మనుషులు చచ్చి దేవతలై స్వర్గం చేసుకుంటారంటారు. దేవతలైనంత మాత్రాన వారికే భయమూ లేదని కాదు. దేవతలకు దొంగల భయముంది. మృత్యుభయముంది తప్పుచేస్తే రాజు - అనగా దేవేంద్రుడు శిక్షిస్తాడన్న భయమూ ఉంది. తప్పులు చేసే అవకాశమూ ఉంది.

దేవతల వస్తువులు ఎన్నోసార్లు దొంగలెత్తుకు పోయారు. దేవతలెన్నోసార్లు రాక్షసులతో యుద్ధం చేసి ఓడిపోయారు. ఆ యుద్ధాల్లో చచ్చిన వారిని బ్రతికించడానికి కచుడనేవాణ్ణి కూడా నియోగించారు, శుక్రాచార్యుడి వద్దకు వెళ్ళి మృతసంజీవినీ విద్యనేర్చుకుని రమ్మని. ఆ తర్వాత అమృతం తాగి చావులేనివారయ్యారు. దీన్ని బట్టి దేవతలకు మృత్యుభయమున్నదని తెలుస్తుంది. దేవతలకు వైద్యం చేయడానికి అశ్వనీ దేవతలున్నారు. కాబట్టి వారికి వ్యాధి భయంకూడా ఉండదన్నమాట. కోరికలు తీర్చే కామధేనువు, కల్పవృక్షాలు ఉన్నాయి కాబట్టి వారు కోర్కెలను జయించలేదు. అప్సరసలున్నారు కాబట్టి వారిలో స్త్రీ పురుష భేదాలూ ఉన్నాయి. వారు విషయలోలురనీ, సురాపానాభిలాషులనీ తెలుస్తూనే ఉంది. వారికి నాట్యము, సంగీతము ఇత్యాది కళాభిలాషకూడా ఉంది.

దేవతలలో లేనివల్లా కులమత భేదాలు, ఆకలిదప్పులబాధ. పేదరికం గురించి వారికి తెలియదు.

ఈరీత్యా చూస్తే - తగిన వైద్యసదుపాయాలుండి, అందరికీ ఆహారం లభించి, మనుషులందరూ మనుషుల్లా బ్రతికే దేశముంటే - అదే స్వర్గం.

భూలోకంలో అలాంటి స్వర్గముందా? నేను చదివిన, విన్న విశేషాలను బట్టి - అమెరికా, పశ్చిమ జర్మనీ, ఫ్రాన్సు, ఇంగ్లండు వగైరా పాశ్చాత్యదేశాలు స్వర్గలక్షణాలు కలిగివున్నాయి. ఆ దేశాలు నిజంగా స్వర్గతుల్యమే అయితే - భూమ్మీద కొన్ని దేశాలు మాత్రమే స్వర్గతుల్యమెందుక్కావాలన్న ఆలోచన నన్ను వేధించేది?

స్వర్గప్రాప్తికి తపస్సు చేయాలి. ఆయా దేశప్రజలు తమదేశాలను స్వర్గం చేసుకునేందుకెలాంటి తపస్సుచేశారు? బొందితో స్వర్గాన్ని చూడటానికి నేనిప్పుడెటువంటి తపస్సు చేయాల్సివుంది?

"ఏమండీ - అంత తీవ్రంగా ఆలోచిస్తున్నారు?" అంది నా భార్య వసుంధర.

నే ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చి - "స్వర్గం గురించి వసూ!" అన్నాను.

"అంటే?" అందామె.

"స్వర్గమెక్కడుంటుందా అని!" ఆలోచిస్తూనే అన్నాను.

శ్రీమతి అదోలా నవ్వి - "దానికింత ఆలోచనెందుకు? నా సమక్షంలో స్వర్గముంటుందని చాలాసార్లన్నారు. అది నిజంకాదని మీ అనుమానమా?" అంది.

ఈ ప్రశ్నకు వెంటనే ఏం సమాధానమివ్వాలో తెలియలేదు. భార్య తెలివైనదైతే ఇలాంటి ఇబ్బందులు తప్పవు. ఓక్షణం ఆగి - "అది ఊహాస్వర్గం -" అన్నాను.

కానీ శ్రీమతి నన్ను వదలలేదు - "అయితే నేను అందంగా ఉంటానని కూడా చాలాసార్లన్నారు. అదీ ఊహల్లోని మాట కాదుగదా!" అంది.

శ్రీమతి వంక చూశాను. ఆమె కళ్ళలో ఆర్తుత స్పష్టంగా కనబడుతోంది. నేనామెను ప్రేమిస్తున్నాను. ఒక చూపులో పుట్టిన ప్రేమకాదది. ఆరుసంవత్సరాలకు పైగా కలిసిమెలిసి గడిపిన జీవితంలోంచి పుట్టిన ప్రేమ అది. నా భార్య నాకళ్ళకు అందంగా కనబడడమేకాదు. నానాటికీ ఆమె అందం పెరుగుతోంది. ఆ విషయాన్ని నానోట వినడం ఆమెకు ఇష్టం. తను అందంగా ఉందా లేదా అన్న బాధ ఆమెకులేదు. తన అందం నానోట పొగడబడితే ఆమెకు తృప్తి. ఆ తృప్తితో వెలిగే ఆమె కనులు చూడడం నాకిచ్చే సంతృప్తి ఇంతా అంతా కాదు.

ఎదుటివారికి సంతోషం కలిగించడంలోనే స్వర్గమున్నదేమో?

"ఊహలోని మాటే అనుకో. ఎటొచ్చీ నువ్వెదురుగా ఉంటే నేనెప్పుడు ఊహల్లోనే ఉంటాను. అందువల్ల నువ్వు మామూలుగా ఎలావుంటావో నాకు తెలియదు -" అన్నాను.

సంతృప్తి, కృతజ్ఞతలతో నా భార్య కళ్ళు మెరిశాయి.

ఒక మంచిమాటతో తృప్తిపడి భర్తనారాధించి అతడికి స్వర్గం చూపించే అల్పసంతోషి ఆడది. అయినా ఎన్నో సంసారాల్లో కలతలు పుట్టి నరకంగా ఎందుకు తయారౌతాయో నాకర్థంకాదు.

"నన్నుచూస్తే ఎప్పుడూ ఊహల్లోకి వెళ్ళిపోయే మీతో కలిసి మీ ఊహల్లోని స్వర్గంలో గడపాలని ఉంది నాకు" అంది శ్రీమతి.

"నాకూ ఉంది -" అన్నాను.

"సాధ్యపడుతుందంటారా?" అంది శ్రీమతి ఆశగా.

"ఓ పని చేస్తే సాధ్యపడుతుందండి -" అన్నాను.

"ఏమిటండీ?" అంది శ్రీమతి కుతూహలంగా.

'ఫారిన్ వెళ్ళాలండి!' వేళాకోళంగా అన్నాను.

కథాప్రారంభం:

స్వర్గం గురించి వినగానే ఎవరికైనా వెంటనే అక్కడికిపోయి జీవించాలని ఉంటుంది. కానీ అదేం ఖర్మోగానీ - జీవించి ఉండగా అది సాధ్యపడుతుందంటారా. అంటే చచ్చినవాళ్ళకే గానీ బ్రతికున్నవాళ్ళకు స్వర్గముండదా?

"ఏమైనా సరే - నేను తొందరగా స్వర్గానికి వెళ్ళాలి -" అన్నానొకరోజున ఏదో ఆలోచిస్తూ చటుక్కున.

అక్కడే ఉన్న అమ్మ ఆ మాటలు విన్నట్లుంది - "అవేం మాటల్రా వెధవా -" అని ఓసారి చుట్టూ చూసింది. అలా చూడడమెందుకంటే...

చెట్టంత కొడుకుని వెధవా అని పిలిచి అమ్మ తన మాతృత్వపు హక్కులను తరచుగా నిలబెట్టుకుంటూ ఉంటుంది. అమ్మ నన్ను వెధవా అంటే నాభార్య నన్ను - ఏమండీ అని పిలిచినంత మామూలుగాను ఉంటుంది నాకు. కానీ అలా అంటే - తన ఏమండీని మా అమ్మ వెధవతో పోల్చినందుకు శ్రీమతి కోప్పడుతుంది. ఆమె ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా నాకా రెండు పిలుపులూ ఒకలాగే వినిపిస్తాయి.

నా పేరు రాజారావ్ అయినా నేను శివుడిలా నా భార్యకు అర్ధశరీరం ఇచ్చేశాను. నా భార్య వసుంధరే అయినా పార్వతిలా తనూ నా అర్ధశరీరాన్నాక్రమించుకుంది. నేను ఇచ్చానా, ఆమె ఆక్రమించుకున్నదా అన్నది నా వ్యక్తిగత రహస్యం - కానీ నేను అర్ధశరీరుడినన్నది అందరికీ తెలిసిన నిజం. పెళ్ళాం కొంగు పట్టుకుని తిరుగుతున్నానని కొందరు వేళాకోళం చేస్తారు. చిలకాగోరికల్లా ఉన్నామని కొందరు ముచ్చటపడతారు. అమ్మ ఈరెండూ చేస్తుంది. అయితే అమ్మ మనసులో అసూయతో కూడిన చిన్న అనుమానముంది - నా భార్య నామీద తనకంటే ఎక్కువ అధికారం కలిగి ఉన్నాననుకుంటోందేమోనని. అందుకే శ్రీమతి ఎదుట నన్ను వెధవా అని పిలిచి తన ఆధిక్యతను చూపిస్తుంది. అమ్మకులా పదిమంది ఎదుటా నన్ను వెధవా అనలేదు శ్రీమతి. అయినప్పటికీ అమ్మ వెధవా అన్న ధ్వనితో సరిపోయేలా ఏమండీ అని బదులు తీర్చుకుంటుంది శ్రీమతి. అమ్మకది అర్ధంకాదు.

నేనన్నమాటల్లోని తప్పును చెప్పాలనికాక తన ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని అమ్మ నన్ను వెధవా అని తిట్టింది కాబట్టి - ఆమె చుట్టూచూసింది తప్పితే నన్నాట్టే కోప్పడలేదు. అది తెలిసిన వాడనై - "నేను తప్పేమన్నాను? స్వర్గానికి వెడతానన్నాను -" అన్నాను మళ్ళీ.

ఈసారి నామాటలు అమ్మ బుర్రలోకి వెళ్ళాయి. ఓసారి కళ్ళొత్తుకుని - "కన్నతల్లి ఇలాంటి మాటలు విని ఎలా సహించగలదురా?" అని మళ్ళీ చుట్టూచూసి మరోసారి కళ్ళొత్తుకుంది - తన మాతృప్రేమను చుట్టూవున్నవారు గుర్తించాలన్న తాపత్రయం తప్పితే - నేనేదో అఘాయిత్యం చేయబోతున్నానని అమ్మ అనుకోవడంలేదు. మాములు సందర్భాల్లో కూడా పెద్ద పెద్ద డైలాగులు చెప్పి గంభీరంగా ఉండడం అమ్మకి అలవాటు.

"సహించడానికిందులో ఏముందమ్మా? స్వర్గంలో బాగుంటుంది -" అన్నాను నేను.

"మీరు మళ్ళీ ఇలాంటిమాటలంటే నామీద ఒట్టే!" అంది శ్రీమతి. తనమీద ఒట్టేసుకుని ఎలాంటి అసాధ్యాలనైనా నా చేత సాధ్యాలుగా మారిపించగలనని ఆమె నమ్మకం. నాకు ఒట్లమీద నమ్మకంలేదు. అయినప్పటికీ ఆంజనేయుడు బ్రహ్మాస్త్రానికి కట్టుబడినట్లు నేనూ శ్రీమతి ఒట్లకు కట్టుబడక తప్పదు.

"నేను తప్పేమన్నాను?" అన్నాను ఆశ్చర్యాన్ని నటిస్తూ.

"తప్పుకాక మరేమిటి? ఏ ఆడదైనా తనే ముందు పసుపూకుంకమలతో వెళ్ళిపోవాలనుకుంటుంది -" అంటూ శ్రీమతి ఈ దేశంలో ఆడదానికుండే ఏకైక కోరిక ఏమిటో చెప్పింది. అది చెప్పేటప్పుడు తన గొంతులోని తడిని దాచి పెట్టడానికి ప్రయత్నిస్తోందామె. నా మాటలు నిజంగా ఆమెకు బాధను కలిగించినట్టున్నాయి.

"ఇంతేనా నీ బాధ. నేను స్వర్గానికి వెళ్ళేముందు నీక్కావలసినంత పసుపూ, కుంకుమా కొని మరీ వెడతాను, సరేనా?" అన్నాను.

ఈసారి అమ్మ వెధవా అనకుండా, అందరికేసీ కాక నా వైపు మాత్రమే చూసి తిట్టింది. ఇప్పుడామె నలుగురికోసం కాక నాకోసం మాత్రమే అమ్మగా మారిపోయిదని గ్రహించాను.

"స్వర్గమంటే అక్కడికే వెళ్ళి ఉండిపోను. ఏదో కొన్నాళ్ళుండి మళ్ళీ వెనక్కి వచ్చేస్తాను -" అన్నాను విషయానికి వస్తూ.

అప్పుడక్కడ అమ్మ, శ్రీమతి కాక అన్నయ్య, వదిన, ఇద్దరు తమ్ముళ్ళు, అయిదుగురు చెల్లెళ్ళు, అన్నయ్య కూతురు, నా పిల్లలిద్దరు ఉన్నారు. చివరి ముగ్గురూ కాక మిగతా అందరూ నామాట విని నోళ్ళు తెరిచారు.

"ఏలా సాధ్యం?" అంది వదిన - అందరికంటే ముందుగా నోటిని తన స్వాధీనంలోకి తెచ్చుకుని.

"స్వర్గమంటే ఏమిటి?" అనడిగాను నేను.

అందరూ తలోరకంగా చెప్పారు.

అన్నింటికీ తల అడ్డంగా ఊపాను - "స్వర్గంలో దేవతలుంటారు. వాళ్ళు రాక్షసులతో యుద్ధాలు చేస్తారు. ఆ యుద్ధంలో దేవతలు చనిపోయేవారు మొదట్లో. రాక్షసుల గురువు శుక్రాచారుడి వద్ద మృతసంజీవనీ విద్య నేర్చుకుని రమ్మని దేవతలు కచుణ్ణి నియోగించారు. ఆ విద్య అతడికి ఫలించలేదు. తర్వాత సాగరమధనంతో అమృతం సాధించారు. అప్పట్నించీ వాళ్ళకు చావులేకుండా పోయింది. అంటే దేవతలకు మృత్యుభయముండేది. వైజ్ఞానికంగా అభివృద్ధి చెంది వైద్యసదుపాయాలు పెరిగి వారు మృత్యువును జయించే స్థితికి చేరుకున్నారు -"

"దేవతలకు వైద్యసదుపాయాలేమిట్రా వెధవా?" అని అమ్మ ఓసారి చుట్టూ చూసింది.

"దేవతలకూ రోగాలుంటాయమ్మా - అందుకే కదా స్వర్గంలో అశ్వనీ దేవతలుంటారు...." అన్నాను.

"అంతా వితండవాదం -" విసుక్కుంది అమ్మ.

"వితండవాదం కాదు - నిజమే! చచ్చిన మనిషి ఆత్మకు మళ్ళీ చావుండదంటారుకదా - అంటే దేవతలనబడేవారు మనుషుల్లో ఒక తెగ తప్పితే చచ్చినవాళ్ళ ఆత్మలు కాదన్నమాట. ఈ దేవతలు తెల్లగా బలంగా ఆరోగ్యంగా ఉంటారు. ఎలాంటి జబ్బునైనా తగ్గించే అమృతంలాంటి మందులూ, అశ్వనీ దేవతల్లాంటి వైద్యులూ వారి సేవ చేయడానికి సిద్ధం. కోరినవేమైనా క్షణాలమీద తయారుచేసివ్వగల కల్పవృక్షం, కామధేనువులాంటి యంత్రాలు వారికుంటాయి. శత్రువుని తిప్పికొట్టడానికి వజ్రాయుధంలాంటి తిరుగులేని అస్త్రాలుంటాయి. దూరదర్శని, శబ్దగ్రహిణి వంటి విద్యలు వారికి కరతలామలకం. అక్కడ పేదరికం, ఆకలిచావులుండవు. అందరూ సంతోషంగా విలాసజీవితం గడుపుతూంటారు.."

నేనింకా ఏదో అనబోతూండగా - "ఏదైనా ఫారిన్ ఛాన్స్ చూస్తున్నావా ఏమిటి?" అన్నాడు అన్నయ్య.

"ఫారిన్ అంటే?" అంది ఆఖరు చెల్లాయి.

"ఫారిన్ అంటే చాలా దూరముంటుంది. విమానంలో వెళ్ళాలి -" అన్నాడాఖరి తమ్ముడు. తనకు తెలిసిన విషయాన్ని తనకంటే ముందుగా ఇంకెవరైనా చెప్పేస్తారేమోనని కంగారుగా, హడావిడిగా వాడామాటనేశాడు.

"అయితే ఫారిన్ అంటే స్వర్గమే! విమానంలో వెడితే స్వర్గానికి పోవచ్చునని మా మేష్టారు చెప్పారు-" అంది ఆఖరు చెల్లాయి. అది సెవెన్తుక్లాసు చదువుతోంది. క్లాసులో దాని మేష్టారు జోక్ చేసుంటాడు. అది నిజమేననుకుంది.

మేమంతా ఓసారి ఘొల్లుమంటే ఎందుకో తెలియక అది మా అందరివంకా కంగారుగా చూసింది.

"మీ మేష్టారి జోకుకి మేమంతా పగలబడి నవ్వేమని చెప్పు. ఆయన చాలా సంతోషిస్తారు -" అన్నాను నేను దాంతో.

ఇంతమంచి జోకులు వేయగల బుద్ధిశాలి సెవెన్తుక్లాసు టీచరైనందుకు అన్నయ్య కాస్తబాధపడ్డాడు.

"మీ మేస్టారింకేమైనా జోకులేస్తే చెప్పు" అంది వదిన.

"భారతదేశంలో ఉన్నది ప్రజారాజ్యంట -" అంది ఆఖరి చెల్లెలు.

అమ్మ తప్ప తక్కినవారందరు నవ్వాం. మేమంతా నవ్వేక అమ్మకూడా నవ్వింది. తమాయించుకున్నాక - "ఇంతకీ ఇది జోకని నీకెలా తెలిసిందే?" అన్నాను. చెల్లాయి తెలివిమీద నాకు మరీ అంత నమ్మకంలేదు.

"ఏమో - ఇందాకటిదీ జోకని నాకు తెలియలేదు. మీరు నవ్వుతున్నారు కదా అని ఆయన మాకు చెప్పిన పాఠం చెప్పేశాను -" అంది ఆఖరి చెల్లెలు.

"ఈరోజుల్లో చదువే పెద్దజోకు -" అన్నాడు అన్నయ్య.

"ఈరోజుల్లో అవడానికి మీరోజుల్లో చదువెలాగుందేమిటి?" అంది వదిన చిరుకోపంతో.

అప్పటికి అన్నయ్యకింకా ముప్పైఒకటి నడుస్తోంది. కానీ వాడు మాటిమాటికీ మారోజులు మారోజులు అంటూ పాతతరానికి ప్రతినిధిలా మాట్లాడటం వదినకిష్టముండదు.

"మీరోజుల్లో సంగతి తెలియదుకానీ - మా రోజుల్లో ఎలా ఉండేదంటే..." అన్న కొత్త స్వరం ఆ వాతావరణంలో ప్రవేశించింది.

ఆ గొంతు నాన్నగారిది. అప్పుడే ఆయన వీధిలోంచి దొడ్లోకి వచ్చినట్లున్నారు.

తన రోజుల్లో చదువు గురించి ఆయన చాలాసార్లు చెప్పి ఉన్నారు కాబట్టి మాలో ఎవ్వరికీ వినే ఆసక్తిలేదు. ఆయన్నాపే శక్తి అక్కడున్నవారిలో ఎవరికీ ఉందనుకోను. నేను అసహాయంగా తమ్ముడి వంక చూశాను. వాడికాయనదగ్గర కాస్త చనువెక్కువ. వాడు నా చూపులనర్థం చేసుకుని - "అదికాదు నాన్నగారూ - చిన్నన్నయ్య ఫారిన్ వెడతాననడానికి బదులు - తమాషాకి స్వర్గం వెడతానన్నాడు. దానిమీదే మాటలు నడుస్తున్నాయి -" అన్నాడాయనతో.

హఠాత్తుగా అమ్మకేదో స్ఫురించినట్లుంది - "స్వర్గం వేరే ఎక్కడోలేదురా - ఇక్కడే ఉంది. మీరంతా ఇక్కడిలా కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుతూంటే వేరే స్వర్గం ఎందుకురా?" అంది.

ఈ మాటలకు నాన్నగారు వెంటనే రియాక్టయ్యారు - "నేను బ్రతికుండీ చచ్చినవాణ్ణయ్యాను - నీతో పెళ్ళయ్యాక. అందువల్ల నీతో జీవితం స్వర్గంలాంటిదే మరి నాకు -"

శ్రీమతి, వదిన కూడా ఈ మాటలకు గతుక్కుమన్నట్లు కనబడ్డారు. శ్రీమతి గతుక్కుమనడానికి కారణం నాకర్థమయింది. తనతోటి జీవితం స్వర్గమని ఆమెతో పలుమార్లు చెప్పి సంతోష పెట్టాను. ఆ వాక్యానికిటువంటి విపరీతార్థం తీసిన వ్యక్తికి నేను స్వయానా పుత్రుణ్ణి కావడమూ, ఆమె గతుక్కుమనడానికి కారణమూ ఒక్కటే అయుండాలి. శ్రీమతితోపాటు వదిన కూడా గతుక్కుమందంటే - అన్నయ్యకూడా ఆమెతో నాకులాగే అని ఉంటాడు.

"త్వరలోనే నాకు స్వర్గప్రాప్తి కలగాలని ఆశీర్వదించమ్మా!" అన్నాను అమ్మవైపు తిరిగి. స్వర్గమంటే వేరే ఎక్కడో ఉందని నేననుకుంటున్నట్లు శ్రీమతికి తెలియాలని నా ఆశ.

అన్నయ్య కంగారుపడి - "మళ్ళీ నువ్వు వాణ్ణి వెధవా అని తిట్టేవు గనుక - కథ మొదటికి వస్తుంది. వాడికి ఫారిన్ ఛాన్సు తగలాలని ఆశీర్వదించమ్మా" - అంటూ అమ్మకేం చేయాలో సూచించాడు.

"ఆ మాత్రం నాకు తెలియదుట్రా - నా కడుపున పుట్టినందుకు మీరంతా ఒకరితర్వాత ఒకరు దేశాదేశాలు తిరిగి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటారు. ఇవి తథ్యం" - అంది అమ్మ - మాకేపేరు వచ్చినప్పటికీ అది తన కడుపున పుట్టిన ఘనతేనని స్పష్టం చేస్తూ.

ఆ సంభాషణ అలా చాలాదూరం వెళ్ళినా దానిగురించి నేనెప్పుడంత సీరియస్‌గా ఆలోచించలేదు. అయితే రాత్రి శ్రీమతి నాతో - "మీరు వెడితే స్వర్గానికి నేనూ మీతోపాటు వస్తానండీ" అన్నప్పుడు నా ఆలోచనలు పరిపరి విధాలపోయాయి.

నాకు నిజంగా ఫారిన్ ఛాన్స్ వస్తుందా? వస్తే శ్రీమతిని కూడా తీసుకుని వెళ్ళగల్గుతానా?

2

అందరికీ నేను చెప్పాల్సిన ముఖ్య విషయమొకటుంది.

మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.

ఫారిన్ వెళ్ళడం నా జీవితాశయం కాదు. ఆమాటకొస్తే నా స్వగ్రామమైన పేరవరం దాటి ఎక్కడికో వెళ్ళాలన్న కోరికేలేదు నాకు. పెద్దలు సంపాదించిన ఆస్తి నాన్నగారి చేతిలో కరిగిపోయి ఉండకపోతే నేనసలు కష్టపడి చదువుకునేవాణ్ణో లేదోనని అనుమానమే నాకు.

నా జీవితాశయమేమిటో నాకే తెలియదు.

చదువులో నేను ఏకసంథాగ్రాహిని. పరీక్షల ముందు శ్రద్ధగా కాసేపు చదివి క్లాసులో అందరికంటే ఫస్టుగా వచ్చేవాణ్ణి. పెద్దలు చెడు అలవాట్లుగా గుర్తించినవాటికి దూరంగా ఉండేవాణ్ణి. చిన్నప్పట్నించీ ఇంతవరకూ నేనొక్కసారికూడా కాఫీ టీలు తాగలేదు. సిగరెట్లు కాల్చలేదు నామనసెంత దృఢమైనదంటే వీటిపై నాకెప్పుడూ రవంత మోజుకూడా ఏర్పడలేదు.

చిన్నప్పట్నించీ ఏ పుస్తకం చదివినా, ఎవరేది చెప్పినా విషయాన్ని యధాతథంగా తీసుకోక నా బుర్రలో వాటిగురించి మళ్ళీ ఆలోచించేవాడిని. ఏ విషయం విన్నా - అది చెప్పిన వారి మనస్తత్వానికి ముడిపెట్టడానికి ప్రయత్నించేవాణ్ణి. మనస్తత్వాల పట్ల నాకుగల ఈ ఆకర్షణ నన్ను రచయితను చేసింది.

నేను ఎమ్మెస్సీలో యూనివర్సిటీ ఫస్టుగా ప్యాసై నా సబ్జెక్టులో పి.హెచ్.డీ చేసి, భువనేశ్వర్లో రీజినల్ రీసెర్చి లాబరేటరీలో ఉద్యోగం సంపాదించాను. అంతవరకూ ఒక్కసారికూడా ఫారిన్ వెళ్ళాలని ప్రయత్నించలేదు. ఎమ్మెస్సీ ప్యాసుకాగానే గట్టి ప్రయత్నాలు చేసివుంటే తప్పకుండా ఒకటి రెండు సంవత్సరాల్లో నాకు ఫారిన్ ఛాన్సు వచ్చివుండేది. కానీ అప్పట్లో నాకా కోరికలేదు.

నేను బాగా చదువుకున్నాను. చదువు నా జీవితాశయం కాదు. నేను రచయితనయ్యాను. అయితే రచనలు చేయడం నా జీవితాశయం కాదు. దురలవాట్లకు దూరంగా జీవితం గడుపుతున్నాను. కానీ అలా గడపడమే నా జీవితాశయం కాదు.

అయితే నా జీవితాశయమేమిటి?

ఈ ప్రశ్నకు బదులు దొరకలేదు. కానీ మనిషి జీవించడానికి జీవితాశయముండాలా అన్న మరో ప్రశ్న ఉదయించింది. ఆ ప్రశ్నకు జవాబు వెదకాలంటే అందులోంచి అంతులేని వేదాంతం పుడుతుంది. అదంతా ప్రస్తుతానికి మనకు అప్రస్తుతం.

ఇంతకీ ఫారిన్ వెళ్ళడం గురించి నేనిప్పుడెందుకాలోచిస్తున్నట్లు?

చదువు నా జీవితాశయం కాదు. నా పెద్దలు చదివించారు. నేను శ్రద్ధగా కష్టపడి చదివాను.

దొడ్లో తోటమాలి కూలిడబ్బులు తీసుకుని తోటపని చేస్తాడు. పని ప్రారంభించాక ఆ తోట తన స్వంతంకాకపోయినా దాన్ని అందంగా తీర్చిదిద్దడానికి సలహాలిస్తాడు. పూర్తి పెత్తనమిస్తే తోటను అందంగా తయారు చేస్తాడు. ఆ తోట విరగబూసి, కాస్తే - తనే లాభం పొందుతున్నట్లు సంతోషిస్తాడు. గర్వపడతాడు.

నాన్నగారు చదువు విషయంలో నాకు పూర్తి పెత్తనమిచ్చారు తోటమాలి తోటపట్ల శ్రద్ధ వహించినట్లు నేను చదువుపట్ల శ్రద్ధ వహించాను. పంటకు వచ్చిన తోటలా నేనిప్పుడు నాన్నగారికి ఉపయోగపడుతున్నాను. నా చదువు నాకు తృప్తినిస్తోంది.

మా లాబరేటరీ నుంచి ఇప్పటికయిదుగురు జర్మనీ వెళ్ళారు. నలుగురప్పుడే తిరిగొచ్చేశారు. ఒకతను ప్రస్తుతం జర్మనీలో ఉన్నాడు.

భువనేశ్వర్లో నేను పనిచేస్తున్న లాబరేటరీ కౌన్సిలాఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చి (C.S.I.R) అనే సంస్థకున్న సుమారు నలభై అనుబంధ సంస్థల్లోనూ ఒకటి. జర్మన్ అకడమిక్ ఎక్స్చేంజ్ సర్వీస్ అన్నపదాన్ని జర్మన్ భాషలోకి తర్జుమాచేసి పొడి అక్షరాలుగా రాస్తే DAAD అవుతుంది. మేమంతా ముచ్చటగా దాన్ని డాడ్ అని పిలుస్తాం. ఈ డాడ్ సంస్థ ప్రతి ఏటా ఢిల్లీలో ఇంటర్వ్యూ నిర్వహించి - సీయస్సయ్యార్ (CSIR) నుంచి పదిహేనుమందిని ఎన్నికచేసి పదహారు నెలలపాటు పశ్చిమ జర్మనీలో ఉండి వైజ్ఞానిక పరిశోధనలు జరిపిరావడానికి ఏర్పాట్లు చేస్తారు. ఈ ఇంటర్వ్యూకు సుమారు నలభై లాబరేటరీల నుంచి అనగా దేశం నలుమూలలనుంచీ అభ్యర్థులు వస్తారు. మా లాబరేటరీ డైరెక్టర్ ఈ సంవత్సరం మా సంస్థనుంచి నలుగురి పేర్లు రికమెండ్ చేశాడు. అందులో నాదీ వుంది.

నాన్నగారు చదివిస్తే చదువుకుని అందులో పైకి రావడానికి కృషిచేశాను. డైరెక్టరు నాపేరు రికమెండ్ చేస్తే రానున్న అవకాశం గురించి ఆలోచిస్తున్నాను.

ఇదే నాకూ, ఫారిన్ వెళ్ళాలన్న కోరికకూ గల అనుబంధం.

3

పేరవరం నుంచి భువనేశ్వర్ వెళ్ళాలంటే రెండు ప్రయాణాలున్నాయి. ఒకటి పేరవరం నుంచి రాజమండ్రి చేరుకోవడం, రెండవది రాజమండ్రి నుంచి భువనేశ్వర్ వెళ్ళడం. మొదటి ప్రయాణపు దూరం పది కిలోమీటర్ల లోపు. రెండవది సుమారు ఏడువందల కిలోమీటర్లు. మొదటి పది కిలోమీటర్ల ప్రయాణంలోనూ కలిగిన అలసట - తరువాత ఏడు వందల కిలోమీటర్ల ప్రయాణంలోనూ పోతుంది. అదెలాగంటే..

కోనసీమకు ముఖద్వారమైన బొబ్బర్లంక గ్రామానికి సరిగ్గా రెండుమైళ్ళ దూరంలో ఉంది పేరవరం. మామూలుగా అయితే రెండూళ్ళకూ కాలినడక ప్రయాణం చాలు. సామాన్లున్నప్పుడే అసలిబ్బంది.

ఊళ్ళో రిక్షాలున్నాయి కానీ ముందుగా చెప్పి ఉంచుకోకపోతే దొరకవు. ఇంటిదగ్గర్నుంచి బయల్దేరిన రిక్షా సుమారు అరమైలు దూరం ప్రయాణించాక - నిలువెత్తు కాలవగట్టుమీద చేరాలి. రిక్షాని ఆ గట్టు ఎక్కించడమంటే మనిషికి తాడిచెట్టెక్కడం లాంటిదే! అక్కణ్ణించి అతుకుల గతుకుల రోడ్డుమీద ప్రయాణం చేసి బొబ్బర్లంక చేరుకోవాలి. అక్కడ లాంచీల రేవు రిక్షాస్టాండునుంచి ఫర్లాంగుకు తక్కువకాని దూరంలో ఉంటుంది. ఆ దూరానికి కూలీలు తప్పనిసరి. సామాను లాంచీలో పెట్టించడం, ఆ లాంచీ ఎక్కడం - రెండూ కూడా సర్కస్ ఫీటును మించినవే. డబడబ ధ్వనులతో లాంచీ ముప్పావుగంట ప్రయాణం చేసి మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రి లాంచీల రేవుకు చేరుస్తుంది. లాంచీల రేవునుంచి గోదావరిగట్టు నిలువెత్తు. మళ్ళీ కూలీలు. మళ్ళీ రిక్షాలు. అక్కణ్ణించి రైల్వేస్టేషన్.

అప్పుడు రైల్లో కూర్చుని కాసేపు కబుర్లు చెప్పుకుని రాత్రిభోంచేసి పడుకుని నిద్రపోతే తెల్లారేసరికి భువనేశ్వర్లో వుంటాం.

ఈ ప్రయాణం చేస్తున్నంతసేపూ నేను శ్రీమతితో ఫారిన్ గురించి చర్చించాను. సుమారు పదికిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రికి పేరవరం నుంచి పట్టేసమయంలో ఇండియా నుంచి పశ్చిమ జర్మనీ వెళ్ళవచ్చునన్నాను.

"అయితే ఆ ప్రయాణమే చేద్దాం" - అంది శ్రీమతి.

"సరేలే - ఇది పదిహేను రూపాయలతో అయింది. దానికి పదిహేను వేలైనా చాలవేమో!?" అన్నాను.

"అలాంటప్పుడు దాన్నీ దీన్నీ పోల్చడమెందుకు?" అని మందలించిందామె.

"ఒకసారి ఫారిన్ వెళ్ళిరా. అప్పుడు నువ్వు రెంటినీ పోల్చితీరతావు.."

"ఆ మాటకొస్తే మీరూ వెళ్ళలేదు." అని "ఏమండీ మనం నిజంగా ఫారిన్ వెడతామంటారా?" అంది శ్రీమతి.

"మన సంగతి చెప్పలేను కానీ నేను తప్పకుండా వెడతాననిపిస్తోంది -"

శ్రీమతి అదోలా నావంక చూసింది. వివాహమైన క్షణం నుంచీ మేమొకరినొకరు విడిచి ఉన్న సందర్భాలు చాలా తక్కువ. కలిసి తప్ప సినిమాలు చూడలేదు. ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళ్ళేవాళ్ళం. పిల్లలు పుట్టినా వాళ్ళనెత్తుకునే కలిసి తిరిగేవాళ్ళం తప్ప విడిగా ఎక్కడికీ వెళ్ళేవాళ్ళం కాదు. ఆఖరికి కూరల బజారుక్కూడా ఇద్దరం కలిసే వెళ్ళేవాళ్ళం.

"జర్మనీ పేరు చెప్పి - మీరు నన్ను వేరు చేస్తున్నారు" - అన్నట్లు చూసింది శ్రీమతి నావంక.

"నిన్ను నేను అన్నిచోట్లకూ తీసుకెళ్ళిన మాట నిజం. కానీ ఆఫీసుకు మాత్రం నేనొక్కడినే గదా వెళ్తాను. నేను జర్మనీ వెడితే అది ఆఫీసు పనిమీద... అందువల్ల మనం కలిసి వెళ్ళడం కుదరకపోవచ్చు" అన్నాను సంజాయిషీగా.

శ్రీమతి అదోలా నవ్వి - "జర్మనీలో కూడా నేను ఇంట్లోనే వుంటాను. ఆఫీసుకి రాను -" అంది.

అప్పటికి నా సంజాయిషీలోని తప్పు అర్థం కాగా "ముందు అవకాశం రానీ, తర్వాత విషయం ఆలోచిద్దాం" అన్నాను.

"నన్ను తీసుకు వెళ్ళకపోతే మానేయండిగానీ అలా మాత్రం అనొద్దు. మీరు తప్పక సెలక్టవుతారు -" అంది శ్రీమతి. నేనలాగనడం వల్ల నా సెలక్షన్ ఆగిపోతుందన్న భయం ఆమెలో కనపడింది.

మా లాబరేటరీ నుంచి ఇంటర్వ్యూకి నలుగురం వెడుతున్నాం. ఇలాంటి లాబరేటరీలు నలభైవున్నాయి. ఇందరిలో పదంటే పదిమంది సెలక్టవుతారు. ఆ పదిమందిలో నేనుంటానా?

రాత్రి బెర్తుమీద నిద్రలోకూడా నాకో కల వచ్చింది.

నేను ఇంటర్వ్యూకి వెళ్ళి చాలా చెత్తగా సమాధానాలు చెప్పాను. ఇలాంటివాడు జర్మనీ వెళ్ళడానికి పనికిరాడని ఇంటర్వ్యూలోనే వాళ్ళు చెప్పేశారు. ఆ నిరుత్సాహంతో మెలుకువ వచ్చి ఉలిక్కిపడి లేచికూర్చున్నాను.

"అదేమిటి? అలా ఉలిక్కిపడి లేచికూర్చున్నారు? తెల్లవారుతోంది కానీ భువనేశ్వర్ రావడానికింకా గంట టైముంది?" అంది శ్రీమతి. ఆమె ఎప్పుడో లేచికూర్చుని నావైపే చూస్తున్నట్లుంది.

కల గురించి చెబుదామనుకుని మానేశాను. తెల్లవారు ఝామున వచ్చిన కల నిజమవుతుందని శ్రీమతి బాధపడుతుంది. ఎదుటివాళ్ళు మనకు అదృష్టాన్ని వెతికితేనే ఆనందం. దురదృష్టాన్ని సూచిస్తే నచ్చదు.

జేబులోంచి నోట్‌బుక్ తీసి పెన్నుతో ఏదో రాయసాగాను.

"ఏదైనా కథకు అయిడియా వచ్చిందా?" అంది శ్రీమతి.

"కాదు. కలలోకి ఇంటర్వ్యూ వచ్చింది. ఎందుకైనా మంచిదని ఆ ప్రశ్నలు రాసుకుంటున్నాను -" అన్నాను. ప్రశ్నలింకా గుర్తున్నాయన్న మాట నిజం. వాటికి జవాబులు నాకు తెలియదు. ఇంటికెళ్ళాక పుస్తకాలు చూడాలి.

"తప్పకుండా రాసుకోండి. అసలే తెల్లవారుఝామున వచ్చినకల -" అంది. శ్రీమతి మెరుస్తున్న కళ్ళతో.

"బాబోయ్ - అలాగనకు -" అంటూ తెల్లవారుఝామున వచ్చిన కలలు నిజమవుతాయనుకోవడం మూర్ఖత్వమనిపించుకుంటుందని శ్రీమతితో వాదించాను.

"దీనికింత వాదనెందుకూ? మీకు మంచికలే వచ్చిందిగా -" అంది శ్రీమతి మెరుస్తున్న కళ్ళతో.

"ఏ పరిస్థితుల్లోనూ నేను మూర్ఖత్వాన్ని సహించను." అన్నాను.

సజాతి ధ్రువాలు వికర్షించుకుంటాయి. నేను మూర్ఖత్వాన్ని సహించలేకపోతున్నానంటే - బహుశా నేనూ మూర్ఖుణ్ణయివుండాలి.

4

కొందరికి ఒక్క జీవితాశయం కూడా వుండదు. కొందరికి ఒకటికి మించి ఉంటాయి. అలాంటివారిలో రవి ఒకడు.

అతను నా సహోద్యోగి. మేమంతా ఒకే కాలనీలో ఉంటున్నాం. అతడు కాలనీలో ఉండగా తెలుగువారిలో ఎవరు ఊరికి వెళ్ళి తిరిగివచ్చినా అతడింట్లోనే భోంచేయాలన్నది అతడి జీవితాశయాల్లో ఒకటి. అతడి భార్యది కూడా అదే జీవితాశయం కావడం వల్ల - దానికి తిరుగులేకుండా పోయింది.

రైల్వేస్టేషన్నించి కాలనీకి చేరుకుని ఇంటితాళం తీసేసమయానికి ఆకాశంలోకి సూర్యుడింకా రాలేదుకానీ నాకు రవి దర్శనమైంది. నన్ను చూస్తూనే - "అయితే ట్రయిన్ లేటు కాలేదన్నమాట -" అన్నాడు రవి.

"ట్రయిన్ లేటే - కానీ ఎదురుచూసే మీకిబ్బంది కలిగించడం ఇష్టంలేక బరంపురంలో దిగి టాక్సీలో వచ్చేశాం -" అన్నాను సరదాగా.

రవి ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్నాడు. అది గ్రహించి - "ముఖాలు కడుక్కుని స్నానాలు చేసి టిఫిన్‌కి మీ యింటికి వస్తాం. అక్కణ్ణించి నేనూ, మీరూ కలిసి ఆఫీసుకు వెడదాం. లంచవర్లో భోజనం కూడా మీ యింట్లోనే-" అన్నాను.

రవి ఏమనుకున్నాడో తెలియదు కానీ అతడు పిలవకుండానే నేనలాగన్నందుకు శ్రీమతి కాస్త అభిమానపడి - అదెలా వెలిబుచ్చాలో తెలియక ఇబ్బంది పడుతోంది. రవిమాత్రం - "నాడైలాగు వినకుండా మీ డైలాగు చెప్పేశారు. అయితే టెలిగ్రాం సంగతి తర్వాత చెబుతాన్లెండి -" అంటూ వెనక్కు తిరిగాడు.

టెలిగ్రాం అనగానే నాలో కంగారుపుట్టి - "ఏ టెలిగ్రాం - ఇంటర్వ్యూ గురించా?" అనడిగాను.

రవి టెలిగ్రాం నా చేతిలో పెట్టి - "కంగ్రాట్యులేషన్స్ -" అని వెళ్ళిపోయాడు.

ఆంధ్రసచిత్రవారపత్రిక దీపావళి కథల పోటీని నిర్వహిస్తూ ఆరుకథలను ఎన్నుకుంది. వాటిని చదివేక పాఠకులు ఆ కథలకు వరుసక్రమాన్ని నిర్ణయించాలి. మొదటి ఎన్నికలో ఆరుకథలకూ సమంగా అయిదేసి వందలు చొప్పున బహుమతి ఉంటుంది. పాఠకులు ఎన్నిక అనంతరం వరుసక్రమాన్ని బట్టి హెచ్చుతగ్గులలో మళ్ళీ బహుమతులుంటాయి.

ఇప్పుడు నా కథ ఆరింట ఒకటిగా ఎన్నికైనట్లు ఈ టెలిగ్రాం చెబుతోంది.

ఇది కలం పేరుతో వ్రాసిన కథ. నా అసలు పేరుతో వ్రాసిన కథకు సరిగ్గా పది సంవత్సరాల క్రితం ఆంధ్రప్రభ వారపత్రిక నిర్వహించిన దీపావళి కథల పోటీలో మూడవ బహుమతి వచ్చింది. అది నా రచనా జీవితానికి ఒక మలుపు.

ఈ బహుమతి నా జీవితంలో మరో మలుపును సూచిస్తోందా?

"వసుంధర కలంపేరుకు బహుమతి రావడం ఇదే ప్రథమం కదూ?" అంది శ్రీమతి.

ఆమె అలాగనడానికి కారణముంది. ఇప్పుడిప్పుడే ఆమె తనూ రచనా వ్యాసంగంలో ప్రవేశిస్తోంది. ఆ కలం పేరులో ఇప్పుడామెది అణా వాటా కూడా లేకపోయినా ఏదో ఒకరోజున పదహారణాల వాటా దాకా ఎదుగనున్నదని నాకు తెలుసు.

"అవును -" అన్నాను.

"ఇప్పుడు మీకు వచ్చిన బహుమతి - రాబోయే జీవితం నవరసభరితంగా ఉంటుందని సూచిస్తోంది -" అంది శ్రీమతి.

"నీవడుగు పెట్టిన క్షణం నుంచీ నా జీవితం నవరసభరితం.."

"మీకలా అనిపించిందేమో కానీ - మన జీవితం నవరసభరితంగా ఎప్పుడు మారుతుందా అని నేనెదురు చూస్తున్నాను -" అంది శ్రీమతి. ఆ భావం మాటల్లోనేకాక ఆమె చూపుల్లో కూడా స్పష్టంగా కనిపించింది.

నాకు తెలుసు. శ్రీమతి నాగురించి చాలా త్యాగాలు చేయాల్సివచ్చింది. స్త్రీ సహజమైన ఎన్నో కోర్కెలనామె చంపుకుంది. మా నాన్నగారు నాకప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చడం కోసం ఆమె నా ప్రతి చర్యనూ సమర్థిస్తూ - నాకు అంతులేని బలాన్ని ప్రసాదించింది.

ఆర్థికంగా నా పరిస్థితి బాగోలేదు. ఫారిన్ వెళ్ళే అవకాశం వస్తే నా జీవితం ఆర్థికపరంగా కూడా పెద్ద మలుపు తిరగవచ్చు.

"అయాం రియల్లీ వెరీసారీ వసూ!" అన్నాను.

శ్రీమతి నవ్వేసి - "మాటవరుసకన్నాను గానీ - నాకిప్పుడేం తక్కువైంది?" అంది. కానీ నవరసభరితమైన జీవితమామెకు ప్రసాదించాలన్న కోరిక నాలో అప్పుడే పుట్టింది. బహుశా ఫారిన్ వెడతానేమో!

5

ఇంటర్వ్యూ తేదీ తెలిసింది. వెళ్ళవలసిన నలుగురిలో సుధామ్, ఇంద్రసేన్ ఊళ్ళో లేరు. వాళ్ళకు టెలిగ్రాం ద్వారా మా ఆఫీసువాళ్ళు ఇంటర్వ్యూ తేదీ తెలియబరిచారు. ఇంటర్వ్యూ ఢిల్లీలో.

ఊళ్ళో ఉన్నది నేను, భూషణ్ అనే బెంగాలీ అతడు. మేము కలకత్తాకు రిజర్వేషన్ చేయించుకున్నాం. కలకత్తా నుంచి ఢిల్లీకి టికెట్సు రిజర్వుచేయమని - అక్కడున్న అన్నయ్యకుత్తరం రాశాను నేను.

నేను కలకత్తాకు కుటుంబంతో వెళ్ళాలనుకున్నాను. ఎందుకంటే అన్నయ్య కలకత్తాలో అప్పటికి మూడుసంవత్సరాలనుంచి ఉంటున్నాడు. అన్నయ్య పేరవరం వెళ్ళేటప్పుడు - దారిలో ఉంది గదా అని భువనేశ్వర్లో దిగడమే తప్ప - నేనింతవరకు కలకత్తా వెళ్ళలేదు. అందుకు కారణం నా ఆర్థికపరిస్థితే అయినా - ఆ విషయం అన్నయ్య దగ్గర దాచిపెట్టాను.

అన్నయ్య రిజర్వు బ్యాంకులో ఆఫీసరు. దేశంలో బ్యాంకు ఉద్యోగస్తులకున్న విలువ సైంటిస్టులకు లేదు. వాడు డబ్బును మంచినీళ్ళప్రాయంగా ఖర్చుపెట్టగలడు. నా ఇబ్బంది తెలిస్తే అన్నయ్య నాకు సాయపడతాడు. కానీ అన్నయ్యతో సమంగా నా భాధ్యతలు పంచుకున్నప్పుడే నా వ్యక్తిత్వం నిలబడుతుంది. అందుకే నేను ప్రయాణాలు అవసరమున్నప్పుడే చేస్తాను. ఇలాంటి నా జీవితం శ్రీమతికి నవరసభరితమెలాగౌతుంది?

ఇప్పుడు నా ఢిల్లీ ప్రయాణం కలకత్తా మీదగానే జరుగుతుంది. నా ప్రయాణపు ఖర్చులు ఆఫీసు భరిస్తుంది. కథకు బహుమతిగా కొంత డబ్బుకూడా వచ్చింది. ఈ అవకాశాన్ని నేను ఉపయోగించుకుని శ్రీమతి, పిల్లలు కలకత్తా చూసే ఏర్పాటు చేయాలి. నేను వాళ్ళను

ఢిల్లీ వెళ్లేముందు కలకత్తాలో వదిలి తిరుగు ప్రయాణంలో కలకత్తాలో వారం రోజులుంటానని తెలియబరుస్తూ అన్నయ్యకు ఉత్తరం రాశాను. అన్నయ్య నా రాకకు హర్షాన్ని వ్యక్తపరుస్తూ వెంటనే జవాబు కూడా రాసేశాడు.

రైల్లో కలలో వచ్చిన ప్రశ్నలు లైబ్రరీలో పరిశీలించాను. ఆశ్చర్యమేమిటంటే అవి అర్థంలేనివి కాదు. నా సబ్జక్టుకు దూరపుబంధం ఉన్నవే! ఆ ప్రశ్నలు నాకెలా స్ఫురించాయోగానీ అవి ఇంటర్వ్యూలో వస్తే అదో వింతే అవుతుంది.

"ఇంటర్వ్యూ గురించి మీరు కూడా ఇంతలా ఆలోచిస్తారా?" అంది శ్రీమతి ఆశ్చర్యంగా.

"ఏం - ఎందుకాలోచించకూడదు?" అన్నాను.

"ఎమ్మెస్సీ పి.హెచ్.డి మీరు. కెమిస్ట్రీలో మీకు తెలియనిదుంటుందా?"

నేను నవ్వి - "అది నీకు తెలుసు. నాకు తెలుసు. అడిగేవాడికి తెలియాలి కదా-" అన్నాను అయితే మనసులో నేనావిషయాన్నంత తేలికగా తీసుకొనడంలేదు. అప్పటికి నేను జర్మనీలో ఇద్దరు ప్రొఫెసర్లకు ఉత్తరాలు రాసివున్నాను. ఒకాయన తన సంస్థలో రీసెర్చికి అనుకూల పరిస్థితులు లేవని రాశాడు.

రెండో ఆయన బెర్లిన్ టెక్నికల్ యూనివర్సిటీలో ఓ సంస్థకు డైరెక్టరు. ఆయన రెండవప్రపంచ యుద్ధంనాటికే పేరెన్నికగన్నవాడు. ఆయన నాకు జవాబురాస్తూ - తను కొద్దిమాసాల్లో రిటైరైపోతున్నాననీ - నా అప్లికేషన్ తన జూనియర్‌కిచ్చాననీ - ఆ జూనియర్ ప్రస్తుతం సెలవుల్లో ఉన్నాడనీ రాశాడు. ఆ జూనియర్ సెలవుల అనంతరం నాపట్ల ఆసక్తిని చూపిస్తూ ఉత్తరం రాశాడు.

ఈవిధంగా పశ్చిమ జర్మనీలోని సైంటిస్టు తనవద్ద రీసెర్చి చేయడానికి అంగీకరించడాన్ని "ప్లేస్‌మెంట్" దొరకడం అంటారు. ప్లేస్‌మెంట్ దొరికినవాళ్ళకు ఇంటర్వ్యూలో అవకాశాలు ఎక్కువ వుంటాయి. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సంస్థలో పనిచేయగలిగితే విజ్ఞానసముపార్జన, పరపతి దృష్ట్యాకూడా నాకెంతో లాభదాయకం.

జర్మన్ ప్రొఫెసర్ నాపట్ల ఆసక్తిని కనబరుస్తూ - అంతవరకూ నేను చేసిన పరిశోధనల వివరాలను పంపించమంటూ ఉత్తరం రాయగానే ఇంటర్వ్యూలో నెగ్గిన అనుభూతి చెందాను నేను. అయితే మా లాబరేటరీలోనే ముగ్గురికి ప్లేస్‌మెంట్సు దొరికాయి. అన్ని లాబరేటరీల్లోనూ కలిపి నాలాంటి వారింకా ఎందరున్నారో!

చూస్తూండగానే ఇంటర్వ్యూ ప్రయాణం రోజు వచ్చేసింది.

మేము ముందురోజు రాత్రే అన్నీ సర్దేసుకుని మర్నాడుదయం లేచి ముఖప్రక్షాళనం కావడంతోనే బ్రష్షులు వగైరాలుకూడా దాచేసుకున్నాం. ట్రయిన్ ఆ రాత్రి ఎనిమిదిగంటలకే అయినా అంతవరకూ మిగతా కార్యక్రమాలన్నీ రవి ఇంట్లోనే. అనగా స్నానాలు వాళ్ళింట్లోనే. తువ్వాళ్ళు వాళ్ళవే వాడాం. సబ్బు మాత్రం మాది వాడి మళ్ళీ దాచేశాం.

ఆరోజు మధ్యాహ్నం రవి ఇంట్లో భోంచేసి ఉత్సాహంగా లాబరేటరీకి వెళ్ళాను. వెళ్ళిన అరగంటకే రమేష్ అనే పేరుగల సహోద్యోగి నాకోసం అరగంటనుంచి వెతుకుతున్నట్లు తెలిసింది. అప్పుడు నేనూ అతడికోసం వెతికాను. ఇద్దరూ ఒకరికోసం ఒకరు దోబూచులాడి ఒకర్నొకరం కలుసుకునేందుకు మరో అరగంట పట్టింది.

"నీకేమైనా రైలుప్రయాణముందా?" అన్నాడు రమేష్ సీరియస్‌గా.

అతడు నాసెక్షన్ కాదు - "ఎలా తెలిసింది?" అన్నాను ఆశ్చర్యంగా.

అతడు గంభీరంగా - "రైల్వేవాళ్ళు చెప్పారు -" అన్నాడు.

అతను నా గురించి ఎందుకు వెదుకుతున్నాడోనని ఆత్రుతగా ఉన్న నాకప్పుడు జోకుకి నవ్వే మూడ్‌లేదు. అయినా నవ్వి, "నీకు పలుకుబడీ ఎక్కువని నాకు తెలుసు. విషయం చెప్పు" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇందులో నా పలుకుబడిదేముంది. వాళ్ళు నీగురించే ఫోన్ చేశారు. సమయానికి అక్కడ నేనున్నాను.." అన్నాడు రమేష్. "నాగురించి వాళ్ళకెలా తెలుసు?"

"నువ్వు రిజర్వేషన్ స్లిప్‌మీద అడ్రసు రాశావుట. దాన్నిబట్టి ఫోన్ చేశారు. ఖర్గపూర్ దగ్గర వానల కారణంగా ఏదో వంతెన కూలిపోయిందట. ఈరోజు రైళ్ళు నడవ్వట" అన్నాడు రమేష్.

అతడు జోక్ చేస్తున్నాడేమోనని నవ్వబోయాను. కానీ రమేష్‌కు నావద్ద జోక్ చేసేటంత చనువులేదని గుర్తురాగానే రాబోయిన నవ్వు ఏడుపుగా మారిపోయింది. ఇప్పుడు నేనేం చేయాలి?

నేను వెంటనే నాతో ప్రయాణం చేయాల్సిన భూషణ్ దగ్గరకు పరుగెత్తాను. ఇద్దరం కలిసి ఫోన్ దగ్గరకు పరుగెత్తాం. రమేష్ నిజమే చెప్పాడు. కలకత్తా వైపు ఏ ట్రయినూ వెళ్ళబోవడంలేదారోజు.

సలహా కోసం నలుగురి దగ్గరకూ పరుగెత్తాం.

మా దురదృష్టం కొద్దీ - మొట్టమొదటే ఓ ఫారిన్ రిటర్న్‌డ్ తగిలాడు - "ఫారిన్ వెళ్ళడానికే ఈ యిబ్బందులు. ఫారిన్లో ఇలాంటి యిబ్బందులుండవు -" అంటూ అతడు అక్కడి రైళ్ళ క్రమం తప్పకుండా ఎలా నడుస్తాయో చెప్పబోయాడు. ఇంటర్వ్యూనుంచి తిరిగివచ్చాక అవన్నీ వింటామని హామీ యిచ్చి - అప్పటికి వినే అవకాశం లేకపోయినందుకు విచారాన్ని కూడా ప్రకటించి - హడావుడిగా మరో కొలీగు దగ్గరకు వెళ్ళాం.

"పూరీ నుంచి కలకత్తాకో బస్సుంది. అది రాత్రి ఎనిమిది గంటలకు భువనేశ్వర్ వస్తుంది. బస్‌స్టాండుకు ఫోన్ చేస్తే మీ అదృష్టం బాగుంటే వాళ్ళు ముందుగానే టికెట్సు కూడా రిజర్వ్ చేయవచ్చు -" అన్నాడతడు.

అతడి మాట పూర్తికాకముందే ఒక్కపరుగున ఫోన్ దగ్గరకు పరుగెత్తాం మేమిద్దరమూ. ఇలా మేము జంటగా పరుగులెత్తడం చాలామందికి వినోదాన్ని కలిగించినట్లు తర్వాత తెలిసింది.

"ఖర్గపూరు ప్రాంతంలో రోడ్లు పాడైన కారణంగా కలకత్తా బస్సు కాన్సిల్ చేశారు -" అన్న చావుకబురు బస్సు స్టాండునుంచి వచ్చింది.

ఇంటర్వ్యూలో నెగ్గడం మాట అటుంచి అసలు ఇంటర్వ్యూకి వెళ్ళడమే ఒక పెద్ద సమస్యగా మారిపోయింది మాకు.

మతి పోగొట్టుకుని జంటగా తిరుగుతున్న మాకు ఓ అనుభవజ్ఞుడు - "భువనేశ్వర్నించి రాత్రి ఏడుగంటల ప్రాంతంలో ఒక బస్సు కియోంజర్ వెడుతుంది. కియోంజర్నించి కలకత్తా వెళ్ళడానికి చాలా బస్సులుంటాయి -" అని సలహా యిచ్చాడు.

గాఢాంధకారంలో మిణుగురుపురుగులా ఈ అయిడియా మా యిద్దరికీ ఓ కాంతిరేఖను చూపింది.

"అయితే మీవాళ్ళను ప్రయాణం ఆపేయమను. మనిద్దరం మగాళ్ళం కాబట్టి ఈ అడవి ప్రయాణం ఎలాగోఅలా చెయ్యొచ్చు -" అన్నాడు భూషణ్.

అన్నీసర్దుకుని ఎప్పుడిల్లు కదులుదామా అని కూర్చుంది శ్రీమతి. ప్రయాణం గురించి పిల్లలు మహాసరదాపడిపోతున్నారు. నామటుకు నాకైతే ఏమాత్రం వీలున్నా ఎన్నికష్టాలైనా భరించి భార్యాబిడ్డలతోనే ప్రయాణం చేయాలనుంది. అందుకని బస్సులో వాళ్ళనూ నాతో తీసుకువెళ్ళాలనుకున్నాను.

భూషణ్ కంగారుగా - "నీకర్థంకావడంలేదు డాక్టర్ రావ్! ఇది పిల్లలూ ఆడవాళ్ళు చేయదగ్గ ప్రయాణంకాదు. మనకైతే అర్జంటు కాబట్టి తప్పదు. ఒకటి రెండురోజుల్లో రైళ్ళ పరిస్థితి బాగుపడుతుంది. అప్పుడు వాళ్ళు ట్రయిన్లో రావచ్చు -" అన్నాడు.

కలకత్తా వంటి మహానగరానికి వసు ఒంటరిగా పిల్లలతో చేరుకోగలదా? అన్నయ్యకు వాళ్ళు వస్తున్నట్లు ముందుగా ఎలా తెలుస్తుంది? ఈ రైలుమార్గం ఎప్పటికి బాగుపడుతుందో?.. అందువల్ల వాళ్ళను కూడా తీసుకుని బయల్దేరాలనే నాకు తోచింది.

"సరే - వాదనెందుకుకానీ - పరిస్థితి మీ ఆవిడకు వివరించి ఆమె వస్తానంటే తీసుకునిరా. ఇలాంటి ప్రయాణానికి మీ ఆవిడొప్పుకోదని నా నమ్మకం -" అన్నాడు భూషణ్.

భూషణ్ బెంగాలీ బ్రహ్మచారి. ఆడాళ్ళతో ప్రయాణమంటే అతడికి బెంగ. నేనతడితో వాదించకుండా ఇంటికివెళ్ళి శ్రీమతికి పరిస్థితి వివరించాను.

"ఇప్పుడేం చేయాలి?" అంది శ్రీమతి దిగులుగా.

"నువ్వే అన్నావుగా - కథకు వచ్చిన బహుమతి మన జీవితంలో కొత్తమలుపును సూచిస్తున్నదని. నవరసభరితమైన కొత్తజీవితం మనకీ క్షణంనుంచే ఆరంభమయింది -" అన్నాను.

సాయంత్రం ఆరింటికి నా కుటుంబం, భూషణ్ చెరో రిక్షాలో కాలనీ వదిలిపెట్టాము. నేను దారిలో రైల్వే స్టేషను దగ్గర దిగాను. మిగతావాళ్ళు బస్‌స్టాండుకు వెళ్ళారు.

నేను నావీ, భూషణ్‌దీ టికెట్సు రిటర్న్ చేసి డబ్బు వాపసు తీసుకుని బస్‌స్టాండుకు వెళ్ళాను. అప్పటికి బస్సింకా రాలేదు కానీ ప్రయాణానికి సంబంధించిన వివరాలు కొన్ని తెలిశాయి.

బస్సు ఏడింటికి బయల్దేరి కియోంజర్ మర్నాడు తెల్లవారు ఝామున చేరుకుంటుంది. అక్కణ్ణించి కలకత్తాకు ఒకపూట ప్రయాణం.

బస్సుప్రయాణం నాకు, శ్రీమతికి పడదు. పిల్లలకు పడేదీలేనిదీ ఈ అనుభవంతో తెలుస్తుంది. కానీ గడువనున్న ఆ రాత్రీ, మరుసటి రోజూ భయంకరమైనవని మేమనుకున్నాం.

బస్సువచ్చింది. అదృష్టవశాత్తూ అందరికీ సీట్లు దొరికాయి. కానీ రష్, ఉక్కపోతా కారణంగా బస్సులో అదొకరకమైన చెమటకంపు.

రాత్రంతా నిద్రలేదు. తెల్లవారుఝామున కియోంజర్ చేరుకుంది బస్సు. అక్కడ బస్సు దిగి ముఖాలు కడుక్కున్నాం.

భూషణ్ టీ త్రాగి సింగడాలు తిన్నాడు. నేను పిల్లలకి పాలిప్పించాను.

కియోంజరు ఎంత పెద్ద ఊరో నాకు తెలియదు. కానీ అక్కడ బస్సులాగేచోట మంచి హోటలు లేదు. పిల్లలు కాబట్టి ఆ గ్లాసుల్లో పాలు తాగగలిగారు. మేము తాగలేదు. సింగడాలు నాకు సహించవు. శ్రీమతి వద్దంది. ఒకటికొని పిల్లలకు పెడితే కొద్దిగా రుచిచూసి కింద పారేశారు.

భూషణ్ మమ్మల్నేమైనా తినమని బలవంతపెట్టాడు. ఇబ్బందేమిటంటే కడుపునింపుకోడానికి ఏదో ఒకటి తినాలంటాడతడు. ఇష్టంలేని తిండికంటే ఉపవాసం మేలంటాను నేను. దానిపై ఇద్దరమూ రవంత ఘర్షణ కూడా పడాల్సి వచ్చింది.

"మీగురించే చెప్పాను. మీ కర్మ?" అన్నాడు భూషణ్ చివరికి.

కియోంజర్లో బస్సు ఆరుగంటల ప్రాంతంలో బయల్దేరింది. తెలియని ఊరుకావడం వల్ల బస్సు దారిలేక ఆ ఊళ్ళో ఉండిపోవాల్సివస్తుందేమోనని భయపడ్డ శ్రీమతి బస్సు దొరకడంతో తేలిగ్గా నిట్టూర్చింది.

దారిపొడుగునా భూషణ్ నన్ను సతాయిస్తూనే ఉన్నాడు.

నేను మాడినా ఆకలికి శ్రీమతినీ, పిల్లలనూ మాడ్చడం అతడికి బొత్తిగా నచ్చలేదు. మేమెక్కిన బస్సు ప్రతి ఊళ్ళోనూ ఆగుతూ చాలా తాపీగా ప్రయాణం చేస్తోంది. భూషణ్ బస్సాగిన ప్రతిచోటా ఏదో ఒకటి కొనుక్కుతినడమే కాక ప్రతీదీ నాకు రుచి చూపించి - "బాగుందేమో చూడు -" అనేవాడు.

బాగుండదని నేను రుచి చూసి బాగుండదనే - 'బాగానేవుంది కానీవద్దులే!' అనేవాణ్ణి.

మా యిబ్బంది అతడికి అర్థంకాదు. ఒరిస్సాలోనూ, బెంగాల్‌లోనూ కూడా అన్నీ ఆవనూనె వంటకాలు. మాకు ఆవనూనె వాసన గిట్టదు. పైగా మేము చూసిన పదార్థాలన్నింటి నిండా మసాలా బాగా దట్టించబడింది. అదీ మాకు పడదు. ఈ రెండింటికీ తోడు బస్సు ప్రయాణంలో మాకు కడుపులో ఏదీ ఇమడదు. అప్పటికే కడుపులో తిప్పుతోంది. ఇది ముందుగా ఊహించి కూడా కొంత వక్కపొడి కూడా తెచ్చుకున్నాం. ప్రస్తుతానికదే నములూ్తా వికారాన్ని జయించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్రతి ఊళ్ళోనూ భూషణ్ సతాయింపు భరించలేక - "నువ్వుమరీ ఎక్కువ తింటున్నావు. వంటికి మంచిదికాదు -" అన్నాను నేను వ్యంగ్యంగా.

భూషణ్‌కి నా మాటల్లో వ్యంగ్యం అర్థం కాలేదు - "ఏం చేయను? కొత్తరకం తినుబండారం కనబడినపుడల్లా కొని మీకు నచ్చుతుందేమోనని రుచిచూపిస్తున్నాను. ఏదీ మీకు నచ్చడంలేదు. పారేయడం ఇష్టంలేక నేనే తినేస్తున్నాను. తినడం నాకూ ఇబ్బందిగానే ఉంది -" అన్నాడు బాధగా.

ఈ మాటలు వినగానే ఒక మంచి మిత్రుడి సహృదయాన్నర్థం చేసుకోలేని నా తెలివితేటల్ని నేనే నిందించుకుని అతడికి సారీ చెప్పాను.

ఆ తర్వాత గ్రామంలో అతడు కొన్న అయిటమ్ నాకు నచ్చడానికి నేనతడి మంచి హృదయాన్ని గుర్తించడం కారణమేమో తెలియదు. మన పుణుకులకు దరిదాపుల్లో ఉన్న ఆ అయిటమ్ వసుకూ, పిల్లలకూ కూడా నచ్చింది. వాళ్ళిష్టపడ్డారని భూషణ్ కండక్టరుకి నచ్చజెప్పి బస్సాపు చేయించి పరుగున వెళ్ళి మరికొన్ని తెచ్చాడు. అప్పుడు మేమంతా కలిసి అతడివంక చూసిన చూపులకతడు సిగ్గుపడ్డాడు.

మా కళ్ళలో కృతజ్ఞతాభిమానాలతడికి స్పష్టంగా కనబడి ఉంటాయి.

"మేమింకేమీ తినం. నీ మంచిమనసుకీ, సహాయానికీ ధన్యవాదాలు మా గురించి అనవసరంగా ఇంకేమీ కొని పరీక్షించకు -" అన్నాను నేను.

భూషణ్ తలాడించాడు. తర్వాత సరదాగా కబుర్లు చెప్పుకున్నాం.

"మనలో ఎవరో పాపాత్ముడున్నాడు. అందుకే ఇంటర్వ్యూకింత శ్రమవుతోంది" అన్నాను నేను.

"అంటే నేను పాపాత్ముడినంటావా?" అన్నాడు భూషణ్.

"కాదు నేను. అందుకు ఋజువులు కూడా ఉన్నాయి. చెబుతాను విను -" అంటూ నేనతడికి నా అనుభవాలు కొన్ని వివరించాను.

ఒకసారి నేను, మరో ఇద్దరు మిత్రులు కలిసి బొంబాయిలోని బాబా అటమిక్ రీసెర్చి సెంటర్లో ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెడుతున్నాం. వాల్తేర్నించి హైదరాబాదువరకూ ప్రయాణం బాగానే సాగింది. హైదరాబాదు నుంచి బొంబాయి వెళ్ళే ట్రయిన్ మాత్రం చాలా రష్‌గా ఉంది. ముఖ్యంగా మేమెక్కిన సెకండ్ క్లాస్ కంపార్టుమెంటు (అప్పట్లో థర్డు క్లాసు కూడా ఉండేది) మరీ రష్‌గా ఉంది.

ఎలాగో సర్దుకుని కూర్చున్నాం. హైదరాబాదుకీ బొంబాయికీ మధ్యలో ఓ రాత్రివేళ పొగలో ఉక్కిరిబిక్కిరై అంతా లేచాం. ఏం చేయాలో తెలియక గొలుసు లాగితే ట్రయిన్ ఆగింది. చూస్తే చాలా పెద్ద ప్రమాదమే తప్పింది. బోగీ చక్రాలదగ్గర పట్టాల రాపిడికి నిప్పురవ్వలు పుడుతున్నాయి. కంపార్టుమెంటు అంటుకుంది. అందుకే పొగవస్తోంది. దురదృష్టమేమిటంటే అలా జరిగింది మా ఒక్కబోగీకే. రైలక్కడే రెండుగంటలాగిపోయింది. తర్వాత ఆ బోగీని వేరు చేశారు. అందులోని ప్రయాణీకులు ఇతర బోగీలలోకి పోవలసి వచ్చింది. థర్డ్‌క్లాస్ రిజర్వేషన్ కంపార్టుమెంట్లో సీట్లు సంపాదించడానికి మేము నానా అవస్థలూపడాల్సి వచ్చింది. ఆ ఇంటర్వ్యూలో నేను సెలక్టయే అవకాశం కూడా వెంట్రుక వాసిలో పోయింది.

తర్వాత భువనేశ్వర్లో ఇంటర్వ్యూకి కూడా ఆ సంవత్సరమే నేనూ, నా స్నేహితుడూ బయల్దేరాం. అప్పుడు కూడా తుఫాన్ కారణంగా వాల్తేర్ టు హౌరా ట్రయిన్సన్నీ కాన్సిలైపోయాయి. వెళ్ళే కొద్దీ ట్రయిన్సు రాయపూర్ మీదుగా చుట్టు దారిన వెడుతున్నాయి. నేనూ, నా స్నేహితుడూ బస్సుప్రయాణానికి సిద్ధపడ్డాం కానీ అదృష్టవశాత్తూ బరంపురం దాకా వెళ్ళేందుకు ప్యాసింజరొకటి ఆ రోజే వేశారు. బరంపురం వెళ్ళి అక్కడోపూట గడిపి మర్నాడుదయం అయిదు గంటలకు బస్సు ఎక్కాం. అదీ చుట్టుదారినే పయనించి సాధారణంగా మూడు నాలుగుగంటలు మించని ప్రయాణాన్ని పదిగంటలు చేసింది. బస్సులో అన్నిగంటలూ నిలబడే ప్రయాణం చేశాం. వళ్ళు హూనమై పోయింది. అప్పుడు నాకు మిగిలిన సంతృప్తి ఉద్యోగంలో సెలక్టుకావడమే.

"నేనూ ఆ ఇంటర్వ్యూలోనే కదా సెలక్టయింది!" అన్నాడు భూషణ్ - దుష్టవాతావరణం ప్రభావానికి తన ఉనికి కూడా కారణభూతం కావడానికి అవకాశాలున్నాయని సూచిస్తూ.

అది నిజమే. మేమిద్దరం ఒకే ఇంటర్వ్యూలో సెలక్టయ్యాం. చేరి మూడేళ్ళు కాకుండానే 1971లో మాకు ప్రమోషన్ ఇంటర్వ్యూలు ప్రకటించారు. సరిగ్గా అప్పుడే బంగాళాఖాతంలో అల్పపీడనం. పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చేలాగుంది. యుద్ధం కారణంగా కేంద్రప్రభుత్వోద్యోగులకి జరిగే ఇంటర్వ్యూలన్నీ నిలిపేయొచ్చని పుకార్లున్నాయి. ఆపైన సైక్లోన్ కారణంగా ఇంటర్వ్యూ బోర్డు చైర్మనూ, ఇతర నిపుణులూ రాలేకపోతే ఈ ఇంటర్వ్యూలూ, తద్వారా మా ప్రమోషన్లూ నిరవధికంగా వాయిదా పడొచ్చని నిరాశలో ఉన్నాం. ఎలాగైతేనేం సైక్లోన్ వచ్చినా, బోర్డు చైర్మన్ వచ్చాడు. ఆయన తిరుగు ప్రణణానికి ఇబ్బంది కలిగింది తప్ప మా ఇంటర్వ్యూలు ఆగలేదు. అందులో నాకు ప్రమోషనూ వచ్చింది. కొద్ది రోజుల్లోనే పాకిస్తాన్తో పెద్ద యుద్ధం వచ్చి, ఆ దేశం రెండుగా చీలి, బంగ్లాదేశ్ ఆవిర్భవించింది. ఆ విషయం భూషణ్‌కి గుర్తుచేశాను.

"మనమిద్దరమూ ఒక్కసారేగదా ప్రమోటయ్యాం -" అన్నాడు భూషణ్.

నేను తెల్లబోయాను. నా ప్రొఫెషనల్ జీవితం భూషణ్‌తో ముడిపడి ఉందేమో!

"తుఫాను ప్రయాణం ఇబ్బందులు - మనకు శుభాన్ని సూచిస్తాయి. మనం మళ్ళీ ఇంటర్వ్యూలో జయం పొందుతాం -" అన్నాడు భూషణ్ ఉత్సాహంగా.

"కంసుడు, దుర్యోధనుడు వగైరాలు పుట్టినపుడు అపశకునాలు కనబడ్డాయట. మన విజయ సూచనలు ప్రపంచానికి అపశకునంగా ఉండడం నాకు బాధగా ఉంది -" అన్నాను వెంటనే.

శ్రీమతి కలగజేసుకుని - "అలా ఎందుకనుకోవాలి? సైన్సు ప్రకృతి శక్తుల్ని జయిస్తున్న ఈ రోజుల్లో సైంటిస్టులైన మీకు ప్రతి ఇంటర్వ్యూ ఒక సవాలుగా ఉంటోంది. ఆ సవాలు నెదుర్కొనడమే మీ అసలు ఇంటర్వ్యూ అనుకోండి -" అంది.

"మరైతే బొంబాయి ఇంటర్వ్యూలో నేనెందుకు నెగ్గలేదు?"

"బాగుంది. బయల్దేరిన రైల్లోనే కాస్త ఆలస్యంగా చేరారు. అది చాలదు మీకు. మార్గమధ్యంలో రైల్లోంచి బస్సులోకి మారి నానా అవస్థాపడి ఉంటే తప్పక అక్కడా నెగ్గివుండేవారు -" అంది శ్రీమతి.

శ్రీమతికి ఇంగ్లీషు అర్థమవుతుంది కానీ మాట్లాడాలంటే మొహమాటం. హిందీ బాగావచ్చు కానీ నేను పక్కనుండగా మాట్లాడదు.

భూషణ్‌కి శ్రీమతి మాటలు ఇంగ్లీషులో తర్జుమా చేసి చెప్పాను.

"ఇంకేం - ఈ క్షణం నుంచీ హాపీగా ఉందాం -" అన్నాడు భూషణ్. తర్వాత బస్సేదో ఊళ్ళో ఆగగానే మళ్ళీ ఏదోకొని నాదగ్గరకు వచ్చి నాకళ్ళు చూసి వాటి భాషనర్థం చేసుకుని కొన్నది తనే తినేసి అది గొంతు దిగడం కోసమేమో టీ కూడా తాగాడు.

"భూషణ్‌కి కనుల బాసలర్థమవుతున్నాయి-" అన్నాను నేను శ్రీమతితో.

"అయితే అతను పెళ్ళిచేసుకోవచ్చు -" అంది శ్రీమతి.

"అతడు తెలివైనవాడు. జర్మనీ నుంచి తిరిగి వచ్చేకనే పెళ్ళిచేసుకుంటాట్ట -"

"ఓహో - అయితే జర్మనీ వెళ్ళడం ఖాయమన్నమాట!" అని నవ్వింది శ్రీమతి. కానీ ఆ నవ్వెంతోసేపు నిలబడలేదు.

కొద్దిసేపట్లోనే బస్సాక చెరువు ముందాగింది. అది చిన్న చెరువులా లేదు. బస్సుకడ్డంగా పెద్ద నది ప్రవహిస్తున్నట్లుంది.

"బస్సిక ముందుకు వెళ్ళదుట -" అన్నాడు భూషణ్.

అంతవరకూ తాపీగా ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్న నేనులిక్కిపడి - "అయితే ఏం చేయాలి?" అన్నాను.

అప్పటికి బస్సులోంచి జనం చాలావరకూ దిగిపోయారు.

"అవతలి ఒడ్డుకు వెళ్ళాలి -" అన్నాడు భూషణ్.

"ఎక్కడా బల్లకట్టులాంటిది కనిపించడంలేదు?"

"అదే నేనూ చూస్తున్నాను. కనుక్కుంటాను..." అంటూ భూషణ్ బస్సుదిగి జనం మధ్యకు వెళ్ళాడు.

"ఇదేం ప్రయాణమండీ?" అంది శ్రీమతి.

"విజయానికి సూచన. నువ్వే చెప్పావుగా. కష్టం పెరిగిన కొద్దీ ఫలంకూడా పెరుగుతుంది -" అన్నాను.

"మీ ఇంటర్వ్యూకు మీతోపాటు సమంగా నేనూ కష్టపడుతున్నాను. ఫలం మీతోపాటు నాక్కూడా దక్కుతుందేమో -" అంది శ్రీమతి నిట్టూర్చి.

"నువ్వేకాదు. పిల్లలూ కష్టపడుతున్నారు. అంతా కలిసే జర్మనీ వెడతామేమో -" అన్నాను పిల్లలవంక అభిమానంగా చూస్తూ.

"చల్లనిమాట అన్నారండీ -" అంది శ్రీమతి సంతోషంగా.

"వసూ - నీకు జర్మనీ చూడాలనుందా?" అన్నాను.

"నాకేమీ చూడాలనిలేదు. పదహారు నెలలు మిమ్మల్ని వదిలి ఉండలేను -" అంది శ్రీమతి. నేనూ ఉండలేను. ఏదో అనబోతుండగా భూషణ్ వచ్చాడు.

బస్సు తప్పక కలకత్తా వెడుతుందిట. ఎటొచ్చీ ఈ బస్సుకాదు. అవతల ఒడ్డున వేరే బస్సుంది. మేమంతా నీళ్ళలో నడిచి అవతలి ఒడ్డు చేరాలిట. సామాను మార్చడానికి కొందరు కూలివాళ్ళను బస్సు యాజమాన్యం ఏర్పాటుచేసింది. ఇప్పుడున్న ట్రాఫిక్ పరిస్థితుల్లో కలకత్తా చేరడానికింతకు మించి గత్యంతరం లేదు.

"నాకీతవచ్చు. శ్రీమతికి రాదు -" అన్నాను కంగారుగా.

భూషణ్ నవ్వి - "కంగారుపడకు. బస్సు వాళ్ళు నీళ్ళలో ఒక రూటు కనుక్కున్నారు. ఆ రూటులో నీరు మోకాలులోతు మించదు -" అన్నాడు.

శ్రీమతి గుండెమీద చేయివేసుకుని - "అమ్మ బాబోయ్ - మోకాలు లోతే!" అంది. ఆమెకు నీళ్ళంటే భయం. తర్వాత అంతమంది మగాళ్ళ మధ్య బట్టతడవకుండా మోకాలులోతు నీళ్ళల్లో నడవడానికి సిగ్గు.

ఏమైనా ఆ ప్రయాణం తప్పలేదు.

పిల్లల్ని దాటించడంలో భూషణ్ సాయంచేశాడు. సామాను కూలీలు జాగ్రత్తగా చేరవేశారు.

నేను శ్రీమతిని దగ్గరుండి నడిపించాను. తన చుట్టూ మగాళ్ళున్నారన్న అనుభూతికారణంగా నీళ్ళల్లో సుమారు మోకాలు లోతువరకూ తన బట్టలు తడవడానికే శ్రీమతి సిద్ధపడింది. దారికూడా అంత సుగమంగా లేదు. జోళ్ళులేని కాళ్ళకు చిన్న చిన్నరాళ్ళు గుచ్చుకుంటున్నాయి. అక్కడక్కడ పాకుడుగా వుంటే శ్రీమతిని పడిపోకుండా రక్షించాను. అక్కడక్కడ మొక్కల మొదళ్ళు కూడా ఉన్నాయి. మేము నడుస్తున్నది నదిలోకాదు. వానల కారణంగా ములిగిపోయిన పంటపొలాలు.

సుమారు ఒకటిన్నర ఫర్లాంగు దూరం రవాణాకు మొత్తం రెండుగంటలు పట్టింది. మళ్ళీ అంతా బస్సులో చేరాం. తిన్నది తక్కువ. శ్రమ ఎక్కువ. మా పిల్లలు బాగా వాడిపోయారు. కాసేపట్లోనే బస్సు బయల్దేరి ఖర్గపూర్ చేరుకునేసరికి అందరికీ వికారంగా వుంది. ఎవ్వరూ ఏమీ తినేస్థితిలోలేరు.

భూషణ్ సింగడాలు తిన్నాడు కానీ మమ్మల్ని బలవంతపెట్టలేదు. పైగా - "ఇంత కష్టమైన ప్రయాణంలోకూడా ఇలా ఉండే ఆడవాళ్ళనీ, పిల్లల్నీ నేనెక్కడా చూడలేదు. రిజర్వేషన్ కంపార్టుమెంట్లోనే నానా అల్లరీ చేసి మగాళ్ళనేడిపిస్తూంటారు. నువ్వదృష్టవంతుడివి " అని నా భార్యాబిడ్డలను మెచ్చుకున్నాడు.

ముఖ్యంగా పిల్లల నెమ్మదితనాన్ని తను మెచ్చుకున్నాడు. అందుకు నేను నీరసంలో కూడా గర్వపడ్డాను. భూషణ్ మెచ్చుకున్నట్లు మా అమ్మాయికి చెబితే అది వెంటనే ఇంకాస్త బుద్ధిగా అయిపోయింది. దానికప్పుడు మూడేళ్ళు. అబ్బాయి ఏణ్ణర్ధంవాడు కాబట్టి వాడికేం చెప్పినా ప్రయోజనముండదు. కానీ - పిల్లలతోపాటు నా భార్యకూడా మరింత బుద్ధిగా అయిపోయిందని గ్రహించడానికి నాకాలస్యమయింది.

పొగడ్తలకు చలించడంలో పిల్లలూ, ఆడవాళ్ళూ ఒకటే!

భూషణ్ నివాసస్థలం బస్సాగిన చోటుకు దగ్గరే. అతడు మాతోపాటు టాక్సీలో వచ్చి అన్నయ్యల్లు చూపిస్తానన్నాడు.

"నేను మానేజ్ చేసేయగలను" అన్నాను నేను మొహమాటంగా.

"ఇది కలకత్తా అనుకున్నావా - మరొకటనుకున్నావా? మొదటిసారి కలకత్తా వచ్చావు. అడ్రసుంటే చాలదు. ఇంతదూరం వచ్చి మీ యింటిదాకా తీసుకువెళ్ళకపోతే నాకు బెంగగా ఉంటుంది -" భూషణ్.

నిజం చెప్పాలంటే నాకూ బెంగగా ఉంది. అసలే ఒంట్లో ఓపికలేని నాకా మహానగరాన్ని చూడగానే మతికూడా పోయింది.

భూషణ్ మాతో వచ్చాడు. టాక్సీ అతడే మాట్లాడాడు. కలకత్తాకు స్థానికుడైన అతడికే అడ్రసుప్రకారం ఇల్లుపట్టడం కష్టమయింది. మొత్తం మీద ఇల్లుపట్టాం.

అది పెద్ద భవనంలో రెండో అంతస్తు వాటా. మేము వెళ్ళేసరికి ఇంటిముందు అన్నయ్య నేమ్ ప్లేట్ ధైర్యం చెప్పింది. కానీ ఇంటి తలుపులకు పెద్ద తాళం..

క్రింది వాటావారినడిగాం. వారు తమిళులు. స్నేహపాత్రులు.

"మీకోసం మీవాళ్ళెదురు చూస్తున్నారు. మీ అన్నయ్య స్టేషనుకు వెళ్ళాడు. మిగతావాళ్ళు వాకింగుకు వెళ్ళారిప్పుడే అందాకా మా యింట్లో కూర్చోండి " అన్నారు వాళ్ళు సాదరంగా.

కలకత్తాలో పవర్ కట్. సాధారణంగా రాత్రిళ్ళు కరెంటు ఆలస్యంగా వస్తుందిట. మేము వెళ్ళినప్పటికింట్లో కరెంటులేదు.

నేను భూషణ్‌కి ధన్యవాదాలు చెప్పాను.

అన్నయ్య ఢిల్లీకి టికెట్సు రిజర్వు చేయించినదీ లేనిదీ మర్నాడు వచ్చి తెలుసుకుంటానని చెప్పివెళ్ళిపోయాడు భూషణ్.

అరవావిడ మమ్మల్ని కాఫీ, టీలు తాగమని బలవంతపెట్టింది. మేము తాగమంటే ఆవిడ మొహమాటమనుకుంటోంది. ఆవిడకు తెలుగురాదు. శ్రీమతికి హిందీ మాట్లాడడానికి అందులోనూ నాముందు బాగా సంకోచం.

ఎలాగో కష్టపడి ఆ యిబ్బంది నుంచి తప్పించుకున్నాం.

నేను శ్రీమతి చెవిలో "నవరసభరితమైన జీవితం ప్రారంభమైంది - ఎలా వుంది?" అన్నాను.

అప్పటికింకా అన్నయ్య రాలేదు, వదిన రాలేదు. కరెంటు రాలేదు.

7

కలకత్తాలోని అన్నయ్యల్లు గోల్ పార్కు దగ్గర కేయతలా లేన్లో వుంది. ఇల్లెంతో విశాలమైనది. అంతకంటే విశాలమైనది అన్న, వదినెల అభిమానం.

అయితే ఆ అభిమానంలో విశ్రాంతి తీసుకునే అవకాశం నాకులేదు. మర్నాడే తుఫాన్ ఎక్స్‌ప్రెస్‌లో నా ఢిల్లీ ప్రయాణం. మిగతా ట్రయిన్సు తుఫాన్ ఎక్స్‌ప్రెస్ కంటే ఢిల్లీ వేగంగా చేరుకుంటాయి. కానీ వాటిలో రిజర్వేషన్ దొరకడం సులభంకాదు. అన్నయ్యందుకని తుఫాన్‌లో చేయించాడు.

తుఫాన్‌తో నాకూ, భూషణ్‌కీ ఉన్న అనుబంధం - ఎక్స్‌ప్రెస్‌లో కూడా కలిగింది. మళ్ళీ ఇద్దరం కలిసి ఓ పెద్ద ప్రయాణం చేశాం. నేను టీ తాగకపోవడం, ఏది పడితే అది తినకపోవడం నచ్చక - పక్కన నా భార్యకూడా లేదేమో - భూషణ్ బాగా ఎక్కువగా విసుక్కున్నాడు. అతడి హృదయం మంచిదని తెలిసినవాణ్ణి కాబట్టి నొచ్చుకోలేదు.

"నువ్వు జర్మనీ వెడితే చాలా యిబ్బంది పడిపోతావు -" అన్నాడతడు. నేను నవ్వి ఊరుకుంటే - "టీ తాగితే నీకు నష్టమేమిటి?" అన్నాడతడు మళ్ళీ.

"తాగడం వల్ల నీకు లాభమేమిటి?" అన్నాను.

"తాగకపోతే నాకు మతిపోయినట్లుంది -" అన్నాడు భూషణ్.

"అయితే ఆ అలవాటు లేకపోవడమే మంచిదికదా - చూడు నేనెంత హాయిగా ఉన్నానో -" అన్నాను. భూషణ్ మాట్లాడలేదు.

పాట్నాలో భోజనం వచ్చింది. భూషణ్ అక్కడ మజ్జిగను తిడుతూ - "ఫూల్స్, ఇడియట్స్ - నిక్షేపంలాంటి మజ్జిగలో ఉప్పువేస్తే ఏ రాస్కెల్ తింటాడనుకున్నారు? చక్కెరైనా వేయాల్సింది - లేదా ఏమీ వేయకుండా ఉండాల్సింది -" అన్నాడు.

నాకాశ్చర్యం కలిగింది. ఎక్కడో స్వర్గముందనీ అక్కడి విశేషాలు తెలుసుకోవాలనీ అనుకునే నాకు మనదేశంలో విభిన్న సంస్కృతులు తెలుసా?

"డాక్టర్ భూషణ్! మరీ అంత రాష్ గా మాట్లాడకు మజ్జిగలో ఉప్పుకు బదులు చక్కెర వేస్తే నేనూ నువ్వన్న డైలాగునే కాస్తమార్చి చెప్పేవాణ్ణేమో! నువ్వు రాస్కెల్ అన్నాసరే కానీ - మజ్జిగలో ఉప్పువేస్తే నాకిష్టం. చక్కెర వేస్తే అసహ్యం -" అన్నాను.

భూషణ్ చిన్నబుచ్చుకుని - "అయాం సారీ డాక్టర్ రావ్!" అన్నాడు.

నన్ను చిన్నబుచ్చడం అతడి ఉద్దేశ్యంకాదని నాకు తెలుసు. మజ్జిగలో ఉప్పునభినందించే ప్రాణికి ఉనికి వుందనీ - అతడి ఎదురుగానే ఉన్నదనీ అతడు గుర్తించాలనుకున్నాను తప్ప అతణ్ణి తప్పుపట్టే ఉద్దేశ్యం నాకులేదు.

చాలా ఆలస్యంగా నేను గుర్తించిన విషయమేమిటంటే భూషణ్ నాకు సంరక్షకుడిగా వ్యవహరిస్తున్నాడు. అతడొక తరహా జీవితానికి అలవాటుపడ్డాడు. అందుకు భిన్నంగా ఉన్న నా అలవాట్లతణ్ణి కలవరపరుస్తున్నాయి. ఈ ప్రపంచంలో నా అలవాట్లతో కొనసాగడం అసాధ్యమని అతడి భావన. ముఖ్యంగా ఫారిన్ వెళ్ళబోయే నేనెలా మారాల్సిందీ అతడు దారిపొడుగునా విమర్శనా పూర్వకంగా చెప్పాడు.

అప్పుడే నాలో ఓ పట్టుదల కలిగింది.

చాలామంది రచయితలకు మూడ్ రావడానికి కాఫీ, టీలు సహకరిస్తాయంటారు. పెద్దనామాత్యుడైతే మరికాస్త దూరం వెళ్ళి రమణీ ప్రియదూతిక కప్పురవిడెం ఇవ్వాలన్నాడు.

నేను కాఫీ, టీ, సిగరెట్, బీరు, బ్రాంది, విస్కీ వంటివాటి జోలికిపోకుండా హాయిగా రచనలు చేస్తున్నాను. రవంత సమయం చిక్కడమే ప్రధానం తప్ప మూడ్ కోసం ఎదురుచూడలేదు. నా రచనలు మంచివో కావో - మంచి పత్రికలు ఆదరించాయి - బహుమతులు కూడా తెచ్చిపెట్టాయి.

రచనల విషయంలో మూడ్ కోసం ఏదో కావాలనుకోని నేను ఫారిన్ వెడితే - నా అలవాట్లను యథాతథంగా కొనసాగించగలనా?

మద్యమాంసాలు అభిరుచికే తప్ప అవసరానికి సంబంధించినవికావని ఋజువు చేయడం కోసం నేను ఫారిన్లో నా అలవాట్లను యథాతథంగా కొనసాగించాలన్న పట్టుదల నాలో అప్పుడు కలిగింది. అందుకు కారకుడైన భూషణ్‌ని నేను మనసులోనే అభినందించుకున్నాను.

భూషణ్ చెప్పే సూక్తులు వింటూ, నిద్రవచ్చినపుడు పడుకుంటూ ఎలాగో ఢిల్లీ చేరుకున్నాను.

ఢిల్లీ లాడ్జికోసం వెదకడానికి తనే ప్రయత్నిస్తూ, భూషణ్ నన్ను మరీ చిన్నపిల్లవాణ్ణి చేసేశాడు

ట్రాఫిక్ రూల్సు గురించి పదే పదే హెచ్చరించేవాడు. నన్నెప్పుడూ తన చేయిపట్టుకోనిదే రోడ్డుదాటనిచ్చేవాడుకాదు. లాడ్జింగ్ గురించి కూడా నన్నెక్కడా నోరెత్తనివ్వకుండా తనే ప్రయత్నిస్తున్నాడు. అది నాకు సుఖమే అనిపించినా ట్రాఫిక్ రూల్సు గురించి హెచ్చరికలు వినడం మాత్రం కాస్త ఇబ్బందనిపించింది. అయినా చెప్పలేదు.

నేనిలా భూషణ్ చేయిపట్టుకుని ఢిల్లీ నగర వీధుల్లో తిరుగుతూండగా ఇంద్రసేన్ ఎదురయ్యాడు. అతడికి ఇంటర్వ్యూ సంగతి తెలిసి సెలవు కాన్సిల్ చేసుకుని భువనేశ్వర్ చేరుకుని టైము లేకపోవడం వల్ల అక్కణ్ణించి విమానంలో కలకత్తా చేరి ఎలాగో కలకత్తా మెయిల్లో టికెట్ సంపాదించి మాకంటే కాస్త ముందుగానే ఢిల్లీ చేరుకున్నాట్ట. ఢిల్లీలోనే ఉన్న అతడి బావమరిదింట్లో ఉంటున్నాడు. ప్రస్తుతం అతడితో కలిసి నగర సంచారానికి బయల్దేరితే మా దర్శనమైంది.

"అదృష్టవంతుడివి. ఇంటర్వ్యూకే విమానం ఎక్కేశావు -" అన్నాను.

"ఏముంది - నాకు విమానం ఎక్కే అవకాశం ఇంటర్వ్యూ ముందే అయిపోయింది. మీకు ఇంటర్వ్యూ తర్వాత వస్తుంది -" అన్నాడు ఇంద్రసేన్ నవ్వుతూ.

"మీరు కరోల్ బాగ్ వెళ్ళండి. అక్కడ లాడ్జింగు చౌక. భోజనం చౌక -" అన్నాడు ఇంద్రసేన్ బావమరిది.

కరోల్ బాగ్‌లో సౌతిండియన్ హోటల్సుంటాయి. భూషణ్ బెంగాలి లాడ్జింగుల గురించి అప్పటికి కొన్ని విఫలయత్నాలు చేశాడు. ఒరిస్సా నుండి వచ్చిన వారికి ఆశ్రయమిచ్చే ఉత్కళ భవన్లో కూడా గదికోసం అతడు ప్రయత్నించాడు. దొరకలేదు.

మేము కరోల్ బాగ్ బయల్దేరాం. ఠాకూర్, బావమరిది మర్నాడు కలుస్తామని చెప్పి వెళ్ళిపోయారు.

కరోల్‌బాగ్‌లో కూడా లాడ్జింగులు ఖాళీల్లేవు.

జర్మనీ వెళ్ళడం సంగతెలాగున్నా ఢిల్లీలో ఆశ్రయం దొరకదేమోనని బెంగపుట్టింది నాకు. కానీ భూషణ్ అసాధ్యుడు. నాలుగుచోట్ల లేదన్నాక అయిదోచోట లేదన్నా ఉందనిపించాడు కాళ్ళావేళ్ళాపడి.

అక్కడ గదిలోకి వెడుతూ ప్రపంచాన్ని జయించినంత సంతోషం పొందాను. కానీ ఆ గది చాలాకాలంగా వాడకంలో ఉన్నట్లులేదు. గోడలు పొగచూరి ఉన్నాయి. గదినిండా దుమ్ము.

ఒకతడు వచ్చి గది శుభ్రం చేసి మంచాలు వేస్తాననీ మమ్మల్ని కాసేపు కిందకు వెళ్ళనున్నాడు. గది మొదటి అంతస్తులో వుంది. ఆ గది శుభ్రం చేస్తుండగా దరిదాపుల్లో ఉండడం ప్రమాదమని గ్రహించినవారిమై ఇద్దరం వెంటనే అక్కణ్ణించి కదిలాము. కానీ మేము కింద ఉన్నప్పటికీ మేడమీదగది శుభ్రం చేస్తూండగా రేగిన దుమ్ము మా యిరువురి నాసికాపుటాలనూ చేరిగొట్రు కలిగించింది.

క్రింద హాల్లో చాలామంది టిఫిన్లు తింటున్నారు.

నేనూ, భూషణ్ టిఫిన్ తిన్నాం. సాంబారు నిలవ వాసనవేస్తోంది.

అక్కడున్న జనాలను పరీక్షించి చూడగా అందరూ అమితానందంతో టిఫిన్ తింటున్నారు. అంటే ఇలాంటి గొట్రూ, నిలవ వాసనా వారికి అలవాటన్నమాట.

మన దేశరాజధాని ఢిల్లీ మహానగరంలో అటువంటి హోటల్సూ, అటువంటి టిఫినూ, అటువంటి ప్రజలూ...

ఈ హోటల్లో టిఫిన్ తినేవాణ్ణి ఆరోగ్యరీత్యా భయపడి జర్మన్స్ తమదేశం రానివ్వరనిపించింది నాకు.

భూషణ్ హోటల్ యజమానితో గది గురించి అసంతృప్తి వెలిబుచ్చి - అలాంటి గదికీ రోజుకు పాతిక రూపాయల అద్దె అన్యాయమని వాదిస్తున్నాడు.

హోటల్ యజమాని మేమే ఇంటర్వ్యూకి వచ్చామో అడిగి తెలుసుకుని - "ఈ హోటల్లో ఇదే గదిలో ఉండి ఇప్పటికి ఆరుగురు జర్మనీ వెళ్ళారు" అన్నాడు. గది అద్దె గురించి భూషణ్ అన్నది అతడు పట్టించుకోలేదు.

నాకు మాత్రం వచ్చే సంవత్సరం మళ్ళీ ఇదే హోటలుకు ఇదేగదిలో ఎవరైనా వస్తే - "ఈ హోటల్లో ఇదే గదిలో ఉండి ఇప్పటికీ ఆరుగురు జర్మనీ వెళ్ళారు- " అని హోటల్ యజమాని చెబుతాడేమో వినాలనుంది.

ఆ ఆరుగురూ జర్మనీ వెళ్ళినట్లతడికెలా తెలుసు? తర్వాత వాళ్ళుత్తరాలు రాశారా? అయినా మా విధంగానే ఆరుగురిక్కడ బసచేసినట్లు ఋజువేమిటి?

ఆలోచిస్తూండగానే పైనుండి పిలుపు వచ్చివెళ్ళాం.

గది శుభ్రంగా కడిగి ఉంది. నేల చూడ్డానికి బాగుపడింది. గోడలు మాత్రం నల్లగా ఉన్నాయి. కొంపదీసి ఇప్పుడే వెల్లకూడా వేయించడు కదా అని భయపడ్డాం. కానీ అలాంటిదేమీ జరుగలేదు. కొద్దిక్షణాల్లోనే గదిలోకి నల్లటి పట్టెడ చూసి ఉండని కారణాన - "ఢిల్లీలో నల్లపట్టెడ వాడతారా?" అన్నాను ఆశ్చర్యంగా.

వచ్చినతడు తెగనవ్వేసి - "భలేజోకు సార్! ఏదో కాస్త ఉతికించడం ఆలస్యమైంది కానీ అది తెల్ల పట్టెడేనని మీకు మాత్రం తెలియదా?" అన్నాడు.

పరుపులులేవు. రెండు దుప్పట్లను చాలా నెమ్మదిగా రెండు మంచాల మీదా వేసి తలాపు దిక్కున చెరో తలగడా పెట్టి అతడు వెళ్ళిపోయాడు. అతడంత నెమ్మదిగా దుప్పటి ఎందుకు వేశాడో తర్వాత తెలిసింది.

ఏమాత్రం గాలి తగిలినా, అలజడి అయినా పట్టెడ మీంచి దుమ్ములేస్తుంది.

మర్నాడుదయం ఇంటర్వ్యూ. అదైపోగానే సాయంత్రం ట్రయిన్ ఎక్కేయడం క్షేమమని పించిందా గది చూస్తుంటే. హోటలతణ్ణి అడిగితే టికెట్‌కి ఐదు రూపాయల కమీషన్ మీద రిజర్వేషన్ చేయించగలనన్నాడు. అతడికి అడ్వాన్సిచ్చాం. రిజర్వేషన్ ఇబ్బంది తీరినట్లే కదా!

వెళ్ళబోయేది జర్మనీ - ఎలాంటి గదిలో దిగాం!" అన్నాడు భూషణ్ బాధగా.

"ఇవన్నీ మనకు శుభాన్నే సూచిస్తాయి -" అంటూ నేను మంచం మీద విసురుగా అట్నుంచిటు తిరగబోయి - దుమ్ము రేగడంతో ఆగిపోయాను. ఇంటర్వ్యూ గురించి ఇద్దరం కాసేపు పుస్తకాలు తిరగేశాం.

గదిలో ట్యూబ్‌లైటు లేదు. పాతిక వాట్సు బల్బు వెల్తురు చదువుకుందుకు చాలడంలేదు.

ఎలాగో ఆ రాత్రి గడిచిపోయింది.

మర్నాడుదయం లేచి స్నానం చేశాం. దుస్తుల విషయంలో భూషణ్‌కీ నాకూ తేడాలేదు. ఇద్దరూ సూట్లు వేసుకోలేదు. పాంట్, స్లాక్....

ఢిల్లీలో బూట్‌పాలిష్ చేయించుకుంటే బూట్ల మెరుపు నెలరోజులుంటుందంటారు. నేను, భూషణ్ భూట్లు పాలిష్ చేయించుకున్నాం. టిఫినారగించాం. ఇడ్లీ, దోస.

"నీకోసమే సౌతిండియన్ హోటల్లో మకాం పెట్టాను. నేనైతే ఏదైనా తినగలను. నువ్వు తినలేవుగదా!" అన్నాడు భూషణ్.

అతడు బెంగాలీ లాడ్జింగులో ప్రయత్నించి విఫలమయ్యాడని తెలిసినా నేనేమీ అనలేదు. నేను చేయని తప్పుకు నన్ను సాధించే మిత్రులు చాలామందున్నారు నాకు.

నా మిత్రుడొకడు తనింటికి రావడంలేదని నిష్ఠూరమాడుతుంటే చాలాకాలం తర్వాత అతడింటికి వెళ్ళాను. వాళ్ళావిడ బజ్జీలు వేసింది. మొహమాటానికి - "ఎందుకోయ్ - అనవసరపు శ్రమ -" అన్నాను. నా మిత్రుడు నిర్మొహమాటంగా - "నువ్వు కాఫీ తాగే మాటైతే సింపుల్‌గా అయిపోయేది. కాఫీ తాగని వాళ్ళతో ఈ శ్రమ తప్పదు నాకు -" అన్నాడు. అతడికి నేను కాఫీ తాగని ఆచారాన్ని ఖచ్చితంగా పాటిస్తున్నానని కోపం, ఉక్రోషం. అతడు మా యింటికి వచ్చినపుడు కాఫీతోపాటు టిఫిన్ కూడా యిస్తాం. అయినా సరే అతడలాగన్నాడు. తన మనసులోని మాట చెప్పేసి ఎదుటివాడి మనసు గురించి పట్టించుకోకపోవడం అతడి ప్రత్యేకత. మాటలతో ఇలా బాధించినా అతడి మనసు మంచిదని నాకు తెలుసు. అందుకే అతడికి దూరంగా ఉంటాను తప్ప గొడవ పెంచుకోలేదు.

తొమ్మిదయేసరికి నేను, భూషణ్ ఆటో చేసుకుని (ఇక్కడవాటిని స్కూటర్లంటారు) రఫీమార్గ్‌లోని సీయస్సయ్యార్ (CSIR) ఆఫీసుకి చేరుకున్నాం. అప్పటికే అక్కడ ఇంద్రసేన్, సుధామ్ ఉన్నారు.

ఇంటర్వ్యూకు మొత్తం నలభైఒక్క మందిని పిలిచారు. నా నెంబరు ముప్పై ఒకటి. అది చూసి ఆశ్చర్యపడ్డాను. నా జీవితంలో చాలా ముఖ్యమైన సంఘటనలకు పదమూడు అంకెతో సంబంధముంది. ఒక విధంగా చెప్పాలంటే పదమూడు నా లక్కీ నెంబర్. తిరగమరగగా అది నన్ననుసరించడం - నాకు శుభం జరగడం రివాజు.

వివాహమైనప్పుడు నా భార్య వయసు పదమూడు. ఆమె నాతో కాపురానికి వచ్చిన సంవత్సరం 67. రెండంకెలూ కలిపితే పదమూడు వస్తుంది. బ్యాంకులో నా అకౌంట్ నంబరు - అంకెలు కలిపితే పదమూడుకు దారితీస్తాయి. ప్రస్తుతం నేనుంటున్న క్వార్టరు కూడా మూడవ టైపులో పదమూడో నెంబరు. మూడువందల పదమూడును మధ్యనుంచి ఎటు చూసినా పదమూడే కదా!

నాకంటే భూషణ్ నంబరు బాగా ముందుంది. అప్పుడిద్దరం కలిసి ఒకందుకు బెంగపెట్టుకున్నాం. ఇంతమంది అభ్యర్థుల్ని సాయంత్రం నాలుగు గంటలలోగా ఇంటర్వ్యూ చేయడం సాధ్యమా? మాకారోజు ట్రయిన్ దొరికి - భయంకరమైన హోటల్ గదినుంచి విముక్తి లభిస్తుందా?

"ఆలోచించి, భయపడి ప్రయోజనం లేదు. ఏం జరగాలని రాసిపెట్టి ఉంటే అది జరుగుతుంది -" అన్నాను.

ఈలోగా ఇంటర్వ్యూకు వచ్చిన వాళ్లను రెండు జట్లుగా విడదీశారు. మధ్యాహ్నం జట్టు వాళ్ళు ముందుగానే డాడ్ (DAAD) ఆఫీసుకు వెళ్ళి కొన్ని ఫారాలు నింపాలిట. భువనేశ్వర్ వాళ్లం నలుగురమూ మధ్యాహ్నం జట్లో పడ్డాం. వాకబు చేస్తే వెడితే నడిచిపోయేటంత దగ్గర్లోనే ఉందట ఆ ఆఫీసు. అయినా ఆలస్యమవుతుందని టాక్సీలో వెళ్ళాం మేం నలుగురం.

డాడ్ ఆఫీసులో ప్రత్యేకాకర్షణ - అందరితోనూ తియ్యగా మాట్లాడే నిలువెత్తు పంజాబీ అమ్మాయి. గోధుమవర్ణం, చూడచక్కని ముఖం, ఆధునిక దుస్తులు - అన్నీ ఆమెకు అందాన్ని సంతరించాయి. ఆమెతో పదేపదే మాట్లాడడం కోసం మాలో చాలామందికి సందేహాలు వచ్చాయి. చెరగని చిరునవ్వుతో, తొణకని కంఠస్వరంతో, కోల్పోని ఓర్పుతో అందరికీ ఆమె సహకరించింది. ఫారాలు తొందరగానే పూర్తిచేసి దారిలో ఒకచోట పళ్లు తిని, నడుచుకుంటూనే సీయస్సయ్యార్ ఆఫీసుకి తిరిగి చేరుకున్నాం. అక్కడ కేంటీన్లో ఎవరిక్కావలసిన టిఫిను వాళ్లం తిన్నాం.

ఇంటర్వ్యూ తొమ్మిదికి ప్రారంభం కావాలి. పదకొండుకు ప్రారంభమైంది. అయినా ఒంటిగంటకల్లా మొదటి జట్టు పూర్తయిపోయింది. అప్పుడింటర్వ్యూ బోర్డు మెంబర్స్ లంచ్‌కి వెళ్లారు.

నేనూ, భూషణ్ బెంగపడుతున్నాం. మా ట్రయిన్ ఆరుగంటలకు. మేమిద్దరం హోటలు గదికి వెళ్ళి సామాను సర్దుకుని రైల్వే స్టేషనుకు వెళ్లాలి. ఇంటర్వ్యూ మళ్లీ ఎన్నింటికి ప్రారంభమవుతుందో.

మూడింటికి ఇంటర్వ్యూ మళ్లీ మొదలయింది. అభ్యర్థులు వెడుతున్నారు, వస్తున్నారు. ఒకొక్కక్కరు అయిదు నిముషాలు కూడా పూర్తిగా ఉండడంలేదు. నా మిత్రులు కూడా ఒక్కొక్కరే లోపలకు వెళ్లి వచ్చేశారు. వాళ్లందరి ముఖాల్లోనూ ఏదో అసంతృప్తి.

"ఇంత డబ్బు ఖర్చుపెట్టి ఇంతదూరం మననెందుకు రప్పించారో తెలియదు. రెండు నిముషాల్లో మన గురించి వాళ్ళు కొత్తగా ఏం తెలుసుకుంటారు?" అన్నాడు సుధామ్.

"ఇంటర్వ్యూకి వెళ్ళిన వాళ్లకు తమ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించుకోవాలనుంటుంది. ఆ విషయం ఇంటర్వ్యూ చేసే వాళ్లక్కూడా తెలిస్తే బాగుండును -" అన్నాడు ఇంద్రసేన్.

టైము నాలుగు కాకుండానే నాకు పిలుపు వచ్చింది. ప్రపంచంలో ఆర్థికంగా అత్యున్నత స్థాయి చేరుకున్న రెండు దేశాలలో ఒకటైన పశ్చిమ జర్మనీలో పదహారు నెలలపాటు వైజ్ఞానిక పరిశోధనలు కావించే నిమిత్తం అభ్యర్థులనెన్నిక చేయడానికి జరుగుతున్న ఇంటర్వ్యూ అది. నేను ఉత్కంఠతో లోపల అడుగు పెట్టాను.

విశాలమైన హాలు. మధ్యగా ఓ పెద్దబల్ల. బల్లచుట్టూ ఆరుగురు మనుషులు. వారిలో డాడ్ సంస్థకు చెందిన జర్మన్ వనిత కూడా ఉంది.

బోర్డు సభ్యులంతా నావంక ఒక పర్యాయం కుతూహలంగా చూశారు. ఒకాయన నా పేరు, అర్హతలు అడిగాడు. చెప్పాను. జర్మన్ వనిత జర్మనీలో ప్లేస్‌మెంటుందా అనడిగింది. ఉందని చెబితే పేరు, అడ్రస్ నోటు చేసుకుంది.

"ఇప్పుడు లాబొరేటరీలో చేస్తున్న వర్కు టైటిల్ మాత్రం చెప్పు -" అన్నాడొకాయన. ఉత్సాహంగా చెప్పాను. ఉత్సాహమెందుకంటే అప్పటికి ఇండియా మొత్తం మీద నేనొక్కడినే చేస్తున్న కొత్తరకం రీసెర్చి వర్కు అది. దాని గురించి చాలా వివరాలు చెప్పుకోవాలన్న నా సరదా - సెలక్షన్ గురించిన ఉత్కంఠను కూడా అధిగమించింది.

"ఈ వర్కువల్ల దేశానికి ప్రయోజనముందని నీ భావమా?" అన్నాడాయన.

"ఊ" అన్నాను. ఎందుకని అడిగితే చెప్పాలని ఆశపడ్డాను. కానీ ఆయన తన చుట్టూ వారి వంక చూసి - "ఎనీమోర్ క్వశ్చన్స్!" అన్నాడు. బోర్డు మెంబర్సందరూ అడ్డంగా తలాడించగానే - "నువ్వు వెళ్ళొచ్చు -" అన్నాడాయన.

నేను లేచి వెనక్కు తిరగ్గానే కళ్ల నీళ్ల పర్యంతమయింది. దీనికోసమా నేనింత కష్టపడి ప్రయాణం చేసివచ్చాను.

నేను బయటకు రాగానే మిత్రులు ముగ్గురూ విశేషాలడిగారు.

"మీకులాగే నాకూ జరిగింది" అన్నాను.

"సెలక్షన్ ముందుగానే అయిపోయింది. మన కళ్ళు తుడవడానికే ఈ ఇంటర్వ్యూ. ఇలాంటి అవకాశాలు మనలాంటి వాళ్ల దాకా రానిస్తారా? ఈ మాత్రం దానికి ఎంత టైమూ, డబ్బూ వృధా అయింది." అన్నాడు భూషణ్.

"ఆఫీసు స్పెషల్ లీవు గ్రాంటు చేసింది. దారి ఖర్చులు భరించింది. కాబట్టి టైమూ, డబ్బూ కూడా ప్రభుత్వానిదే వృధా అయింది -" అన్నాను నేను.

ఇంటర్వ్యూకు నలభై ఒక్క మంది వచ్చారు. స్కాలర్ షిప్స్ పన్నెండున్నాయట.

పైకి అనకపోయినా మనసులో మాకు సుధామ్ మీద అనుమానముంది. అతడు ఢిల్లీలో ఓ మెంబరాఫ్ పార్లమెంటు ఇంట బస చేశాడు. ఆ ఎం.పీ అతడికి దూరపు బంధువనీ - సుధామ్ ఈ ఫెలోషిప్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడనీ మాకు తెలిసింది.

ఆర్థికంగా ఎంతో వెనకబడి ఉన్న మన దేశంలో ఇలాంటి అర్థంలేని ఇంటర్వ్యూలు పోవాలని నా మనసుకు తోచింది.

ఎలాగో మళ్ళీ కలకత్తాకు తిరుగు ప్రయాణమయ్యాం.

దారిలో మళ్ళీ మామూలే. భూషణ్ నన్ను నా అలవాట్ల గురించి సతాయించాడు. తొందరగా మంచి అలవాట్లు చేసుకోమనీ లేకుంటే జర్మనీ వెళ్ళాక నానా ఇబ్బందులూ పడతాననీ బెదిరించాడతడు.

అతడు చెప్పిందాంట్లో కొంత నిజముంది. ఉదాహరణకు -

పాశ్చాత్య దేశంలో శాకాహారం ఎంత అరుదంటే - నా మిత్రుడి మిత్రుడొకడు కెనడా వెళ్ళాడు. అతడు పక్కా శాకాహారి. ఈ శాకాహారి ఓ పార్టీకి వెడితే అక్కడ అతడు తినగల పదార్థమొక్కటీ లేదుట. అక్కడున్న వారికతడి పరిస్థితి అర్థం కాకపోతే - ఆ పార్టీలో ఉన్న మరో ఇండియన్ అతడు శాకాహారి అని చెప్పాడుట. ఈ వార్త ఆ నోటా ఈ నోటా పాకిన పదినిముషాల్లో పేరు పొందిన ఓ

ప్రొఫెసర్ పరుగు పరుగున వచ్చి ఈ శాకాహారిని కలుసుకుని - "ఆర్ యూ మిస్టర్ అవధానీ -"
అనడిగి అతడవుననగానే తన్ను పరిచయం చేసుకున్నాట్ట. అవధానికి ఆ ప్రొఫెసరు పేరు తెలుసు. అంత గొప్పవాడికి తన గురించి ఎలా తెలిసిందా అని ఆశ్చర్యపడుతూండగా - "నేనింతవరకూ శాకాహారుల గురించి వినడమే కానీ వాళ్ళెలాగుంటారో చూడలేదు. కేవలం శాకాహారం మీద పెరిగిన మనిషెలాగుంటాడో చూడాలని కొన్నేళ్ళుగా కలలు కంటున్నాను. ఇన్నాళ్ల కు తీరింది -" అన్నాడుట ఆ ప్రొఫెసర్.

అలాంటి దేశంలో భూషణ్ వంటి వ్యక్తికి ఫరవాలేదు. అక్కడివారు బీఫ్ (ఆవు మాంసం) ఎక్కువగా తింటారు. హిందువులు అది తినకపోయినా - ఇతర మాంసాహారం కూడా సమృద్ధిగా లభిస్తుందక్కడ.

"సమస్యలు రెండు రకాలు డాక్టర్ భూషణ్! కొన్నిటికి ముందుగా పరిష్కారం అవసరం. కొన్ని ఎదుటపడ్డాకనే వాటి గురించి ఆలోచించాలి. నువ్వు చెప్పేది రెండవరకం. ఇంకా మన ఇంటర్వ్యూ ఫలితాలే తెలియవు..." అన్నాను.

"ఈరోజు నేను చెబుతున్నాను విను. నువ్వూ నేనూ కూడా ఈ ఇంటర్వ్యూలో సెలక్టవుతామని నాకు నమ్మకంగా ఉంది. ఈలోగా నువ్వు కనీసం కోడిగుడ్డైనా అలవాటు చేసుకో. టీ అయినా తాగడం నేర్చుకో -" అన్నాడు భూషణ్.

"నీతో పాటు నేను కూడా సెలక్టవతానని అనుకుంటున్నందుకు నా థాంక్స్?" అన్నాను. అతడి సలహాకి థాంక్స్ చెప్పలేదు.

కలకత్తా చేరుకోగానే ఇంటిల్లపాదీ నన్ను ఇంటర్వ్యూ గురించి అడిగారు. నేను భూషణ్ గురించి చెప్పాను. "ఇంటర్వ్యూ గురించి చెప్పు -" అన్నాడు అన్నయ్య.

ఇంటర్వ్యూ ఎలా జరిగిందో చెప్పాను.

"ఇంటర్వ్యూ జరిగిన పద్ధతి ప్రోత్సాహకరంగా లేదు -" అన్నాడన్నయ్య నిరుత్సాహంగా ముఖంపెట్టి.

"మనం సంతోషించాల్సినదేమిటంటే - నా ఒక్కడికే కాదు. ఇంచుమించు అందరి ఇంటర్వ్యూ ఇలాగే జరిగింది -" అన్నాను.

"ఫలితం ఎన్నాళ్లలో తెలుస్తుంది?" అన్నాడు అన్నయ్య.

"బహుశా రెండువారాల్లో తెలియవచ్చు. తెలియగానే నీకుత్తరం రాస్తాను." అన్నాను.

నాకంటే ఎక్కువగా ఉంది అన్నయ్య ఆత్రుత నా ఫలితం గురించి!

అన్నయ్యకు నిరంతర ప్రచారం అలవాటు. తన గురించేకాక తనవాళ్ల గురించి కూడా ఇంట్లో ప్రచారం చేసుకుంటాడు. మా యింట్లో ఇంతవరకూ ఎవరూ ఫారిన్ వెళ్లలేదు. నా గురించి తన మిత్రవర్గంలో చెప్పుకోవాలని అన్నయ్య ఆత్రుత. ఉద్యోగరీత్యా నాకంటే ఎక్కువ స్థాయిలో ఉన్న అన్నయ్యకు నా గురించిన ప్రచారమిచ్చే ఆనందమేమిటో అర్థంకాదు. బహుశా అదే అభిమానమేమో!

కలకత్తాలో సరదాగా గడుస్తోంది.

దీపావళి ఆంధ్రసచిత్ర వారపత్రికలో నా కథను నేను కలకత్తాలోనే చదువుకున్నాను. ఎన్నికైన ఆరు కథలూ చదివేక నాకు నా కథే అన్నింటికన్నా బాగున్నదనిపించింది. మిగతా అయిదుగురు రచయితలూ కూడా అలాగే అనుకుని ఉండవచ్చు. కానీ నా మటుకు నేను నా నిర్ణయం నిష్పాక్షికమైనదనే అనుకున్నాను. అన్నయ్య, వదిన, కలకత్తాలోని కొందరు అన్నయ్య మిత్రులు స్వయంగా నన్నభినందించారు.

మా దీపావళి కలకత్తాలోనే జరిగింది.

నేను భువనేశ్వర్ తిరుగు ప్రయాణం కాబోయేముందు అన్నయ్య ఓ హస్తసాముద్రిక వేత్తను మా యింటికి పిల్చుకుని వచ్చాడు. అతడు చేయి చూసి ఎందరికో ఎన్నో వివరాలు ఖచ్చితంగా చెప్పాట్ట. ఇంతవరకూ అతడు చెప్పింది తప్పు కాలేదుట.

అన్నయ్య చేయి చూపించుకోమని నన్ను బలవంతపెట్టాడు.

అది నాకిష్టంలేదు.

జ్యోతిషం మీద నాకు నమ్మకం లేదు. అపనమ్మకమూ లేదు. చేయి చూసి ఫారిన్ చాన్స్ లేదంటే మనసు పాడవుతుంది.

అయినా అన్నయ్య బలవంతంవల్ల నాకు తప్పలేదు. జ్యోతిషుడి ముందు చేయి సాచాను - భవిష్యత్తులో శుభం ప్రసాదించమని అడుక్కుంటున్న బిచ్చగాడిలా!

జ్యోతిష్కుడు నా చేయిని అటూయిటూ తిప్పి రేఖలను పరిశీలించి "ఇది విచిత్రమైన విశిష్టమైన చేయి -" అన్నాడు.

నాకిది ముందే తెలుసునన్నట్లు అన్నయ్య అందరివంకా ఓసారి గర్వంగా చూసి జ్యోతిష్కుడి వైపు తిరిగాడు.

జ్యోతిష్కుడు నా చేతిలోని ఒకో రేఖనే వర్ణిస్తూ దాని గుణగణాలు చెబుతూ గతంలో జరిగినవీ, భవిష్యత్తులో జరగనున్నవీ సూచనప్రాయంగా చెప్పసాగాడు.

గతంలో జరిగినవి చాలావరకూ అతడు సరిగానే చెప్పడంతో నాలోకూడా అనుకోకుండా ఆత్రుత పెరిగింది. రేఖలను బట్టి అతడు నా మనస్తత్వాన్ని నిర్ణయిస్తూంటే నాకాశ్చర్యంగా ఉంది. మనిషి మనస్తత్వం అతడి చేతిలోని రేఖలపై ఉంటుందన్న విషయం నమ్మదగిన నిజంగా కనబడుతోంది నాకు. నా మనస్తత్వాన్నతడు అరటిపండు వలిచి పెట్టినంత సులభంగా చెబుతున్నాడు. శ్రీమతి, వదిన కూడా అతడి మాటలు వింటూ ఒకరివంక ఒకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకుంటున్నారు. ఎందుకంటే వారిద్దరికీ నా మనస్తత్వం గురించి తెలుసు. జ్యోతిష్కుడు చెప్పే విశేషాలు కొన్ని నాకిబ్బందికరంగా కూడా ఉంటున్నాయి.

"నేను చెప్పగలిగింది చెప్పాను. మీరింకా అడగదల్చుకుంటే ప్రయత్నిస్తాను -"

"ముఖ్యమైనది మీరు చెప్పనే లేదు" అన్నాడు అన్నయ్య.

"ఏమిటది?" అన్నాడు జ్యోతిష్కుడు.

"మా తమ్ముడు ఫారిన్ వెడతాడా?"

జ్యోతిష్కుడి ముఖం అదోలాగయింది. ఏదో జవాబు చెప్పబోయి అతడు నా చేయి అందుకుని మరోసారి పరీక్షగా చూశాడు. ఆ చూడడంలో చేతిని బాగా నలిపి నన్ను కాస్త ఇబ్బంది పెట్టాడు కూడా.

"ఇతను చాలా గొప్పవాడవుతాడు. ఏదో ఒక లలిత కళలోనూ, తను చేపట్టిన వృత్తిలోనూ బాగా పేరు సంపాదించుకుంటాడు. కానీ.." అని ఆగిపోయాడు జ్యోతిష్కుడు.

అంతా ఊపిరి బిగబట్టారు. అతడు చెప్పబోయేదానిపైనే నా భవిష్యత్తంతా ఆధారపడి ఉన్నట్లు - ఆ క్షణంలో నాక్కూడా అనిపించింది. అయితే తను చెప్పబోయేదేమిటో అందరికీ ఆ కానీయే సూచించిందన్నట్లుగా అర్ధోక్తిలో ఆగిపోయి ఊరుకున్నాడు జ్యోతిష్కుడు.

కానీ అన్నయ్య మాత్రం అతణ్ణి వదలకుండా "ఊ...కానీ...ఆ కానీ ఏమిటో చెప్పండి!" అన్నాడు.

"ఇతడి చేతిలో ఫారిన్ గీత లేదు. అంటే, విదేశయానాన్ని సూచించే గీత నాకీ చేతిలో కనబడలేదు -" అన్నాడు జ్యోతిష్కుడు.

నేననుకున్నంతా అయింది. ఇంటర్వ్యూ ఫలితం ఆరోజే వచ్చిన భావన నాతోపాటు చాలామందికి కలిగింది.

అప్పుడక్కడ హస్తసాముద్రికానికి వ్యతిరేకంగా చర్చలు జరిగాయి. కానీ ఎవరి ముఖాల్లోనూ తృప్తిలేదు.

"ఈ జ్యోతిష్కుడు చెప్పినది తప్పయిన వ్యక్తి నాకొకడు తెలుసు -" అన్నాడన్నయ్య. వాడి ముఖంలో అభిమానమే తప్ప నిజాయితీ కనపడలేదు నాకు.

జీవితంలో మరెన్నడూ జోస్యం చెప్పించుకోనని శ్రీమతి ఆ రాత్రి నాదగ్గర వాగ్దానం చేసింది.

ఏదో వచ్చిపోయిన అనుభూతి అప్పుడే మా యింట్లో వచ్చేసింది.

8

"ఏమయింది?" అన్నానాశ్చర్యంగా.

"డాడ్ సెలక్షన్ లిస్టు ఆఫీసుకి వచ్చింది. భూషణ్ సెలక్టయ్యాడు. మీ పేరు వెయిటింగ్ లిస్టులో రెండవ నంబరు -" అన్నాడు రవి.

అప్పటికి ఇంటర్వ్యూ జరిగి మూడువారాలు పూర్తికాలేదు. అనుకున్న ప్రకారమే ఫలితం తెలిసినందుకు ఆశ్చర్యపడుతూ ఆఫీసు రూముకు వెళ్ళి లిస్టు చూశాను.

మొత్తం పన్నెండుగురు సెలక్టయ్యారు. వెయిటింగ్ లిస్టులో అయిదుగురున్నారు. అందులో నేను రెండవవాణ్ణి.

ఇది సీయస్సయ్యార్ చేసిన ప్రావిజనల్ సెలక్షన్. ఈ పదిహేడు పేర్లూ వివరాలతో సహా పశ్చిమ జర్మనీ వెడతాయి. అక్కడివారు అందరి వివరాలూ క్షుణ్ణంగా పరిశీలించి ఈ పదిహేడుగురిలోంచీ పన్నెండుగురిని ఎన్నుకుంటారు. అప్పుడు ఈ లిస్టులోని పన్నెండుగురిలో కొందరుపోయి వెయిటింగ్ లిస్టులో కొందరు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఎటొచ్చీ ఈ పదిహేడుగురిలోనూ పన్నెండుగురు జర్మనీ వెళ్లడం ఖాయం. గత సంవత్సరం మా లాబరేటరీ నుంచి జర్మనీ వెళ్ళిన రంజన్ కూడా తొలుత వెయిటింగ్ లిస్ట్ నంబర్ టూయే! అందువల్ల వెయిటింగ్ లిస్టు నంబర్ టూ అంటే మా లాబరెటరీకి అచ్చివచ్చిందనుకున్నాను మనసులో. మనిషెంత చదువుకున్నా, వైజ్ఞానికంగా ఎంతటి ప్రగతిని సాధించినా, ఎంతటి ఆలోచనా శక్తిని కలిగి ఉన్నా అర్థంలేని నమ్మకాలకు లోనవడం మాత్రం తప్పదు. అపోలో - 13 యాత్రికులు ప్రమాదంలో ఉంటే శాస్త్రజ్ఞులు తమ ప్రయత్నాలు చేస్తుంటే మిగతా ప్రజలు వారి క్షేమం గురించి చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అపోలో యాత్రనూ, చర్చిలో ప్రార్థననూ కలిపి ఆలోచించినపుడల్లా మనిషి బలహీనత స్పష్టంగా తెలుస్తుంది.

అందుకే నా పేరు వెయిటింగ్ లిస్టులో కనబడగానే నా ఆలోచనలు రకరకాలుగా మళ్ళాయి. ఎంతటి సానుకూల స్థితీ నా విషయంలో వెయిటింగ్ లిస్టుగా మారి కొంతకాలం కలవర పెట్టి చివరికి సానుకూలమవుతుంది. ఎమ్మెస్సీలో చేరినప్పుడూ, పి.హెచ్.డీ థీసిస్ సబ్మిట్ చేసినప్పుడూ, ఉద్యోగంలో చేరినప్పుడూ ఇలాంటి సంకట పరిస్థితులు నాకేర్పడి ఉన్నాయి. అలాగే ఇప్పుడూ జరగొచ్చు. ఏది ఏమైనా అసలు విషయం తెలియడానికింకా నాలుగైదు నెలలు పడుతుంది. ఈలోగా తెలిసినవారందరూ నేను జర్మనీ వెడుతున్నట్లే మాట్లాడతారు. తీరా చేసి అవకాశం రాకపోతే చిన్నతనంగా కనిపిస్తుంది. ఈ వెయిటింగ్ లిస్టు సంకట పరిస్థితే కొంతకాలం.

నా పేరు వెయిటింగ్ లిస్టులో ఉన్నదని తెలియగానే నా మిత్రుడు మురళీధర్ ఓసారి చేయి చూపించమన్నాడు. అతడికి హస్తసాముద్రికంలో ప్రవేశముంది.

నాకు నమ్మకం లేదన్నాను.

"మీకోసం కాదండి - నాకోసం! నా పరిజ్ఞానాన్ని పరీక్షించుకుందామని అడుగుతున్నాను తప్ప మీకేదో చెప్పాలనీ, చెప్పగలననీ కాదు -" అన్నాడతడు.

నిజం చెప్పాలంటే నాకు చేయి చూపాలనే ఉంది. ఒక జ్యోతిష్కుడు నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్నాడు. రేఖలను బట్టి నా మనస్తత్వాన్ని చక్కగా అంచనా వేశాడతడు. అయితే విదేశయానం కూడా చేతి రేఖలపై ఆధారపడి ఉంటుందా? ఈ విషయం నేను నమ్మినా నమ్మకపోయినా భవిష్యత్తు గురించి తెలుసుకోవాలన్న బలహీనత ఎంతో కొంత నాలోనూ ఉంది. అందువల్లనే మురళీధర్. బలహీనతకు లొంగాను.

అతను నా చేయి కాసేపు పరీక్షించి ఊరుకున్నాడు.

"మాట్లాడరేం?" అన్నాను.

"మీకింట్రస్టు లేదుకదా - ఏదో నా కుతూహలం కొద్దీ చూశానంతే!"

"కాదు. మీరేదో చెప్పలేక దాస్తున్నారు."

"అలా ఎందుకనుకుంటున్నారు?"

"నా చేతిలో ఫారిన్ రేఖ లేదు కదా!" అన్నాను.

"మీకెలా తెలుసు?" అన్నాడతడు.

హతాశుణ్ణయ్యాను. ఒకరు కాదు - ఇద్దరు జ్యోతిష్కులంత ఖచ్చితంగా చెబుతున్నారంటే అందులో కొంతైనా నిజముందేమోననిపించింది.

"కలకత్తాలో ఓ జ్యోతిష్కుడు చెప్పాడు. మీ అభిప్రాయమూ అదేనా?"

"నా అభిప్రాయం సంగతెలాగున్నా మీకు నేనో సలహా యిస్తాను. హస్తసాముద్రికాన్ని నమ్మని పక్షంలో - మీరు మీ అభిప్రాయానికి కట్టుబడి ఉండండి. కొత్త నమ్మకాలకు గురికాకండి. ఈ విషయంలో నా పరిజ్ఞానం పరిమితం -" అన్నాడు మురళీధర్.

నిరుత్సాహం నా ముఖంలో స్పష్టంగా చూడగలిగిన కారణంగానే అతడు నాకు ఆ సలహా యిచ్చి ఉంటాడని గ్రహించాను

" హస్తసాముద్రికం మీద మీ అభిప్రాయమేమిటి?" అనడిగాను.

"నాకు నూటికి నూరుపాళ్ళూ నమ్మకముంది. ఎటొచ్చీ చెప్పేవాడికి కూలంకష పరిజ్ఞానముండాలి - అంతే!" అన్నాడు మురళీధర్.

మధ్యాహ్నం లంచవర్లో ఇంటికి వెళ్ళినపుడు శ్రీమతికి డాడ్ నుంచి వచ్చిన సమాచారం చెప్పి - "మురళీధర్ కూడా నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్నాడు -" అన్నాను.

శ్రీమతి నావంక జాలిగా చూసి - "మీ చేతిలో ఫారిన్ గీత లేకపోతే అది అప్పటికప్పుడు ఉదయిస్తుంది. మీరు జర్మనీ వెళ్ల డం ఖాయం. కానీ నాదొక్కమాట -" అంది.

"ఏమిటి?" అన్నాను.

"లేవులేవంటూనే మీరు చాలా సెంటిమెంట్సుకు గురవుతున్నారు. మీ కోసమే చెబుతున్నాను కాబట్టి నా ఒక్క సెంటిమెంటు కూడా మన్నించాలి -" అంది శ్రీమతి.

"నీ సెంటిమెంటు మీదే నా జీవితమంతా ఆధారపడి ఉంది. తప్పకుండా వింటాను. చెప్పు" అన్నాను.

"మీకీ ఫెలోషిప్ వస్తే మనం కుటుంబంతో తిరుపతి వెళ్ళి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకుందాం. ఇందుకు మీరు కాదనకూడదు -" అంది శ్రీమతి.

"రాకపోతే వెళ్ల ం. అందుకూ ఒప్పుకోవాలి నువ్వు -" అన్నాను.

"ఆ దేవుడికి మొక్కుకున్నాక రాకపోవడమేంటండీ - వచ్చి తీర్తుంది -" అంది శ్రీమతి నమ్మకంగా.

"అంటే - ఆ దేవుడివల్లే నాకు ఫెలోషిప్ వస్తుందంటావు. నావల్ల కాదంటావు -" అన్నాను రవంత అహంకారంతో. కానీ గతంలో నాపట్ల రెండు మొక్కులు ఫలించిన విషయం గుర్తుకువస్తోంది నాకు.

"మీ అర్హతలతో ఉన్నవాళ్ల ంతా మీకులాగే ఉన్నారా?" అంటూ ఎదురు ప్రశ్నవేసింది శ్రీమతి.

నిజమే మరి - కొంతమంది నాకంటే ఇంకా ఉన్నత స్థానంలో ఉన్నారు. కొందరు మరీ దయనీయస్థితిలో ఉన్నారు. స్వయంకృషికి ఫలితముండకపోదు. కానీ అదృష్టాన్ని కాదనడం కష్టం. ఈ అదృష్టాన్ని కాదనడం కష్టం. ఈ అదృష్టాన్నే దేవుడికి ముడిపెట్టుకోవాలేమో మరి!

నేను దేవుడికి మొక్కుకున్నాను. గతంలో మొక్కుకున్నప్పుడూ నా మనసింకా పరిణితి చెందలేదనుకున్నాను. ఇప్పుడలాగనుకుందుకు లేకనేమో నా అంతరాత్మ ఫక్కుమని నవ్వినట్లనిపించింది. అది శ్రీమతికి చెప్పుకుని బాధపడ్డాను.

"దేవుణ్ణి నమ్మేవాళ్లకే అంతరాత్మ ఉంటుంది. అంతరాత్మంటూ ఉంటే అది దేవుణ్ణి నమ్మిన వాళ్లను చూసి నవ్వదు. నవ్వినా ఈపాటి మొక్కుకు అంతగా తటపటాయించారని నవ్వి ఉంటుంది -" అంది శ్రీమతి.

నేనీ విషయమై శ్రీమతితో ఎక్కువగా వాదించలేదు. ఎన్నో విషయాల్లో ఆమెని మూఢనమ్మకాలని గేలిచేసే నేను - ఆమెకు భిన్నం కాదని ఈరోజే ఋజువయింది.

9

బజార్లో అమూల్ స్ప్రే ఎక్కడా దొరకడం లేదు. మా పిల్లలిద్దరూ కూడా రోజుకు గ్లాసెడు పాలుకూడా తాగరు - అదైనా మేము బలవంతం పెట్టాక! అందువల్ల అమూల్ స్ప్రే గురించి నాకంత పట్టింపులేదు. రవి యింట్లో చంటిపాప ఉంది. ఆ పాపకు అమూల్ స్ప్రే తప్ప ఇతర డబ్బాపాలు పడవు. అతడీ ఇబ్బందినెలా ఎదుర్కొనడమా అని చూస్తూండగా అదృష్టవశాత్తూ మా లాబరేటరీ కో ఆపరేటివ్ స్టోర్సుకి కొన్ని అమూల్ స్ప్రే డబ్బాలు వచ్చాయి. వచ్చిన డబ్బాలు తక్కువ, కావలసిన వారెక్కువమంది - ఈ సమస్యకు పరిష్కారంగా కావలసినవాళ్ల పేర్లన్నీ రాసి - వాటిని కలిపి ఓ చీటీ తీసే లాటరీ పద్ధతి పెట్టారు.

ఈ లాటరీకి రవి అమూల్ స్ప్రే అవసరంలేని నాబోటి వారందరి పేర్లూ కూడా తనకోసం ఇచ్చాడు. లాటరీ తీయగా అతడిచ్చిన పేర్లలో నా పేరొక్కటే వచ్చింది.

సరిగ్గా ఆ సమయంలో కొత్త ఆంధ్ర సచిత్రవారపత్రిక వచ్చింది. అందులో పాఠకుల నిర్ణయం ప్రకారం - దీపావళి సంచికలో ప్రచురించబడిన ఆరు పోటీకథల్లోనూ - నా కథకు మొదటి బహుమతి వచ్చినవైనముంది.

ఇలా జరుగుతుందనుకోవడం వేరు. జరగడం వేరు.

నాకు కలిగిన థ్రిల్ ఇంతా అంతా కాదు.

అప్పుడు నా పక్కనే ఉన్న భాస్కర్ - "మీ జాతకం మంచిదశలో ఉన్నట్లుంది. ఓ లాటరీ టికెట్ కొని చూడండి -" అన్నాడు. వేళాకోళంగా అప్పటికి నవ్వేసినా అతడి మాటలు నామీద ప్రభావం చూపించాయి. మర్నాడు శ్రీమతి పేరున మొదటిసారిగా బ్యాంకులో బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేశాను. ఆశ్చర్యమేమిటంటే ఆ అకౌంట్ నంబర్లో అంకెలన్నీ కలిపితే పదమూడు వచ్చింది. పదమూడును నేనేనాడో లక్కీనంబరుగా గుర్తించి ఉండడంవల్ల శ్రీమతికి భాస్కర్ అన్న మాటలు చెప్పాను. వెంటనే ఆమె నన్ను బలవంత పెట్టి ఓ లాటరీ టికెట్ కొనిపించింది. తను బలవంతపెట్టిందనడం కంటే నేనే ఆమెను బలవంత పెట్టేలా చేశాననడం సబబు. లాటరీ ఫలితాలకోసం ఆత్రుతగా ఎదురు చూశాను. మా టిక్కెట్టుకు ఐదు రూపాయల బహుమతి కూడా రాలేదంటే అది వేరే సంగతి.

అదృష్టానికి శుభసూచనలుంటాయి. నాకు శుభసూచనలతో పాటు అపశకునాలు ఎదురయ్యాయి. శుభశకునాలను శుభంగానే భావిస్తూ అపశకునాలను మాత్రం నా ప్రత్యేకతగా భావించి అవీ నా మంచికేనని సరిపెట్టుకున్నాను.

రోజులు గడుస్తున్నాయి.

ఫెలోషిప్ వస్తుందన్న అనుమానమో ఏమో నేను పిల్లల్ని వదిలి ఒక్క క్షణంకూడా ఉండలేకపోతున్నాను. ఫారిన్ వెడితే భార్యాబిడ్డలను వదిలి పదహారు నెలలు ఉండాలన్న భావన నా మనసును పాడుచేస్తోంది. ఈ ఫెలోషిప్‌లో నా ఒక్కడికి మాత్రమే ప్రభుత్వం దారి ఖర్చులు భరిస్తుంది. భార్యాబిడ్డలను తీసుకుని వెళ్ల డానికి స్వంత డబ్బు పదివేలు కావాలి. అంత నేనెక్కణ్ణించి తేగలను?

ఈ ఆలోచన నాలో దిగులు రేపుతూండేది. జర్మనీలో నాకు ప్లేస్‌మెంటిచ్చినాయన పేరు డాక్టర్ రాలెక్. ఆయన్నుంచి నాకో ఉత్తరం వచ్చింది. డాడ్ వాళ్ళు నా గురించి ఆయనకు ఉత్తరం రాశారుట. తను అంగీకరిస్తూ బదులు రాశాడట. నాకు ఫెలోషిప్ రావడం తథ్యమనీ సిద్ధంగా ఉండమనీ ఆయన తెలియబరిచాడు. ఆ ఉత్తరం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఒక పాశ్చాత్య శాస్త్రజ్ఞుడు నా విషయంలో ఇంత శ్రద్ధ తీసుకుని - ఎప్పటికప్పుడు వివరాలు తెలియబరుస్తూండడం అపూర్వంగా కూడా నాకనిపించింది.

ఉత్తరం వచ్చిన పదిరోజులకు నేను లాబరేటరీ పనిమీద సింధ్రీ వెళ్ళి వారం రోజులుండి రావలసివచ్చింది. సింధ్రీ వెళ్ళే ముందు నేను శ్రీమతినీ, పిల్లలనూ ఇంటికి పంపేశాను.

సింధ్రీలో నాకు తెలిసిన నలుగురైదుగురు తెలుగువాళ్ళున్నారు. వారు నన్నెంతో ఆదరించారు. అయినా అక్కడున్న వారం రోజుల్లోనూ భార్యాబిడ్డల్ని తల్చుకోని క్షణం ఒక్కటికూడా ఉండదు. ఇప్పుడే ఇలాగుంటే - ఒకవేళ నేను జర్మనీ వెడితే ఎలాగుండగలనా అనిపించింది.

నేను మితభాషిని. కలివిడి, చొరవ నాకు లేవు. వివాహమైన మరుక్షణం నుంచీ నా ఏకైక స్నేహితురాలు నా భార్య. బిడ్డలు పుట్టేక వారే నా జీవితమయ్యారు. ఇంతగా వారు ముగ్గురితోటీ అనుబంధమేర్పడింది. వారిని వదిలి నేనెలా ఉండగలను?

సింధ్రీలో శర్మ అనబడే నా స్నేహితుడు జ్యోతిషంలోనూ, హస్తసాముద్రికంలోనూ మంచి ప్రావీణ్యం సంపాదించి పేరు తెచ్చుకున్నాడు. అతడు నా వెయిటింగ్ లిస్టు కథ విని చేయి చూపమని అడిగి చూసి మౌనం వహించాడు. నేను వేధించి వేధించి అతడి నుంచి సమాచారంలాగాను.

కథ మాములే - నా చేతిలో ఫారిన్ రేఖ లేదుట!

నాకు బ్రాహ్మణుడు - మేక - నలుగురు దొంగల కథ గుర్తుకొచ్చింది. కథలో బ్రాహ్మణుడు మేకను కుక్క అనుకున్నాడు. నేను లేని దిగులును మనసులో సృష్టించుకుంటున్నాను.

తిరుగుప్రయాణంలో చెప్పుకోతగ్గ అపశకునం ఎదురయింది నాకు. నా టికెట్ ఫస్టుక్లాసు. కానీ రిజర్వేషన్ లేక అందులో ఎక్కనివ్వలేదు. చిత్రంగా జనరల్ కంపార్టుమెంటు ఖాళీగా ఉంది. ఫస్ట్‌క్లాస్ టికెట్‌లో పగటిపూట ప్రయాణానికి రిజర్వేషన్ అవసరముండదు. అయినా ప్రయాణాల అనుభవంలేని నేను జనరల్ కంపార్ట్‌మెంటెక్కి పై బెర్తుమీద సూట్‌కేసు పెట్టుకుని కింద సీట్లో కూర్చున్నాను. కానీ వెంటనే సూట్‌కేసుని నాకంటికి కనిపించేలా పెట్టుకొనడం మంచిదనిపించి లేచి చూస్తే సూట్‌కేసు లేదు. గుండె గుభేల్మంది.

సింధ్రీలో తెల్లవారు ఝామునే టాక్సీ ఎక్కి ధన్‌బాద్ రైల్వే స్టేషను చేరుకున్నాను - అక్కడ దొంగతనాలెక్కువన్న మిత్రుల హెచ్చరిక గుర్తుంది. కానీ మరీ ఇలా కనుమూసి తెరిచేలోగా - సూట్‌కేసు మాయం కావడం నా ఊహకందనిది.

పిచ్చివాడిలా కనిపించిన వాడినల్లా అడిగాను. ఎవరో ఒకరిద్దరు - అప్పుడే ఒక పోర్టరు సూట్‌కేసుతో వెళ్లడం చూశామన్నారు. నా సంగతి విని ఒకాయన - బీహార్ రైల్వే స్టేషన్లు దొంగతనాలకు ప్రసిద్ధి అనీ - కట్టుకున్న వాడికి తెలియకుండా బట్టలు కూడా విప్పుకుని

పోగల సామర్థ్యం వారికున్నదనీ - నాకు చెప్పాడు. ఆయన్ను సమర్థిస్తూ ఇంకొకాయన ఉదాహరణలు ప్రారంభించాడు. ఇంకొకాయన ప్రయాణంలో తనెంత జాగ్రత్తగా ఉండేదీ చెబుతున్నాడు.

అందరూ తమ వాక్చాతుర్యం ప్రదర్శించేవారేకానీ నాకు సాయపడేవారు కనబడ్డం లేదు. ట్రయిన్లో నుంచీ దిగి ప్లాట్‌ఫారం మీదున్న పోలీస్ స్టేషన్‌కు పరుగెత్తాను.

"నన్నేం చేయమంటారు?" అన్నాడక్కడి ఆఫీసరు - చాలా మామూలు విషయం విన్నట్లు.

"ఫిర్యాదు రాసిస్తాను. దొరికితే చూడండి. అందులో నాకు మాత్రమే పనికివచ్చే ఎంతో ముఖ్యమైన సైంటిఫిక్ లిటరేచర్ ఉంది. ఆ పేపర్సు దొరికితే చాలు" అన్నాను.

సింధ్రీలో వారంరోజులు కష్టపడి లైబ్రరీ నుంచి రాసుకున్న లిటరేచర్ అది. అటు లేబరేటరీ ఇటు జర్మన్ ప్రయాణం రెండూ దృష్టిలో ఉంచుకుని సేకరించానది. ముందు ముందు నేను చేయబోయే ప్రయోగాలకు అవసరం. ఆ లిటరేచర్ పోవడం వల్ల నా సింధ్రీ ప్రయాణంలో నాలుగింట ఒక పాలు నిరర్థకమైనట్లే!

రైల్వే పోలీసాఫీసర్ నాకళ్ల లోకి అదోలా చూశాడు. ఎన్నో భావాలున్న ఆ చూపులో జాలికూడా ఉంది.

"ఎప్పుడైనా రైలు ప్రయాణం చేశారా?" అన్నాడాయన.

"చేశాను" - అని తలూపి ఫిర్యాదు రాసిచ్చి ట్రయినెక్కాను. సూట్‌కేసు పోవడానికి మించి ఆ ప్రశ్న నన్ను ఎక్కువగా బాధపెట్టింది.

ట్రయిన్లో పక్కనున్న ప్రయాణీకులు నా దిగులు చూసి కారణమడిగారు. జరిగిందంతా చెప్పి పోలీసు కంప్లయింటిచ్చిన విషయం కూడా చెప్పాను.

"రైలు ప్రయాణం చేయడం మీకిది మొదటిసారా?" అన్నాడతడు.

"కాదు చాలా సార్లు చేశాను -" అన్నాక ఇదే ప్రశ్న కొద్దిసేపటి క్రితం పోలీసాఫీసరు కూడా నన్నడిగినట్లు గుర్తుకొచ్చింది. చిన్నబుచ్చుకున్న ముఖంతో "ఎంతమందికో ప్రయాణాల్లో ఎన్నో పోతూంటాయ్. మొదటిసారి ప్రయాణం చేసేవాళ్లే సామాను పోగొట్టుకోవాలని లేదుకదా!" అన్నాను.

అతడు నవ్వి - "అబ్బే - నా అభిప్రాయమదికాదు. పోలీసు కంప్లయింటిచ్చానంటేనూ - సందేహం వచ్చింది -" అన్నాడు.

అప్పుడు నాకు నా తెలివి తక్కువతనం అర్థమయింది. రైల్వే ప్లాట్‌ఫారం మీద పోయిన సూట్‌కేసు పోలీసు కంప్లయింట్ వల్ల దొరుకుతుందా? - అందులోనూ ఇండియాలో!

మోసం, అన్యాయం దగా, అక్రమం, అవినీతి - అన్నింటికీ ఆలవాలం భారతదేశం - ఈదేశంలో పుట్టడం నాదురదృష్టం.

ఆకలితో పస్తులుండి మాడిమాడి చచ్చే దౌర్భాగ్యులున్న దేశమిది. అలాంటి దేశంలో ఆకలి బాధలేకుండా బ్రతకడమే ఒక పెద్ద అదృష్టం.

నాది అదృష్టమా - దురదృష్టమా?

మనం ఎంత ఆధునికమైనా చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు(డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. - సం.

సూట్‌కేసు పోవడంతో దేశం గురించి మళ్లా నా ఆలోచనలు. అంతలోనే అలా ఆలోచించే అర్హత నాకు లేదనిపించింది.

అన్నార్తుల గురించి పట్టించుకోను, అవినీతికి కారణాలాలోచించని నావంటి వాడికి - నా దేశంలోనే పుట్టి నా పక్కనే ఉంటూ నికృష్టజీవనం గడిపే అసంఖ్యాకుల్ని పట్టించుకోకుండా సుఖజీవనాన్ని గడిపే నావంటి వాడికి - దేశ పరిస్థితులు విశ్లేషించే అర్హత ఉండదు.

అందుకే నా ఆలోచనలను నాకు కలిగిన నష్టం మీదకు మళ్ళించాను.

రెండు కొత్తవి రెండు పాతవి - మొత్తం నాలుగు టెరీకాటన్ పాంట్లు, మూడు కొత్తవి, రెండు పాతవి - అయిదు షర్టు, ఒక కాటన్‌పాంటు, ఒక దుప్పటి, ఒక కొత్త ఉలెన్ రగ్గు, రెండు లుంగీలు, రెండు తువ్వాళ్లు, రేజరు సెట్టు, బ్లేడ్సు, ఆకుజోళ్లు, రెండు సబ్బుబిళ్లలు, ఓ స్టెయిన్‌లెస్ స్టీలు సబ్బుపెట్టి, దువ్వెన, డైరీ, సైంటిఫిక్ లిటరేచర్ - ఇవన్నీ ఉన్న ఆ సూట్‌కేసు కూడా రవినుంచి ఎరువు తెచ్చుకున్నది. దానికో కాకీ కవరుకూడా ఉంది.

ఆర్థికంగా ఈ నష్టం నుంచి తేరుకుందుకు నేనెంత కష్టపడాలో!

తిరుగుప్రయాణంలో కలకత్తాలో ఒకరోజున్నాను.

కట్టుబట్టలతో ఇల్లు చేరిన నన్నుచూసి వదిన ఆశ్చర్యపోయింది. అన్నయ్య మాత్రం - "ఇదీ శుభసూచనే - శనిపోయింది" - అన్నాడు.

దారిలో ఎక్కడైనా అయిదుపైసలు దొరికితే లక్ష్మి రాకను సూచిస్తుందనుకుంటాము. వస్తువు దొరకడం శుభం. పోవడంకాదు. అదే నిజమైతే నేనా పెట్టెను కావాలనే పారేసుకోవచ్చు శనిని వదుల్చుకుందుకు!

వదిన నావాదనను ఖండిస్తూ - "నూరేళ్ళు పైబడ్డ ముసలాడికి కూడా ప్రాణాలమీద ఆశ చావదు. అందుకే భగవంతుడు మృత్యువును సృష్టించాడు. ఎవరికీ తెలియకుండా హఠాత్తుగా దొంగిలించుకు పోతుంది మృత్యువు. అది తెలిసే చూసి చూసి ఎవరూ ప్రాణాలు తీసుకోలేరు. అలాగే మనమనుకునే ఏ వస్తువునీ శని అని తెలిసీ పారేసుకోలేము. మనకు మంచిరోజులు కలిసి వచ్చినప్పుడు మన దగ్గరున్న శనిని తీసుకుని పోడానికి దేవుడు దొంగల్ని సృష్టించాడు -" అంది.

వేదాంతంలో గొప్ప సుఖముంది. భారతదేశంలో కూడూ గుడ్డా లేకపోయినా పాశ్చాత్య దేశీయులకు మించిన మనశ్శాంతి ఉండడానికి కారణమీ వేదాంతమే.

నా అదృష్టం - డబ్బు సూట్‌కేసులో కాక జేబులో ఉండడం. శని సూట్‌కేసులో మాత్రమే ఉండడం.

కలకత్తాలో వదిన సాయం తీసుకుని బజార్లో శ్రీమతి కోసం చీర, పిల్లలకు బటలు, రవికి తిరిగి ఇవ్వడానికలాంటిదే మరో సూట్‌కేసు, నాక్కూడా ఓ జత బట్టలు, రేజరు, తువ్వాలు వగైరా సామాన్లు కొన్నాను. డబ్బు చాలకపోతే అన్నయ్య దగ్గర తీసుకున్నాను.

ప్రయాణం కలకత్తాలో బ్రేక్ చేయడంవల్ల అన్నయ్య, వదినల అభిమానం, ఉపశమన వాక్యాలు నాకు లభించాయి. నాలోని నిరుత్సాహం తొలిగిపోవడమే కాక - కొత్త బలంకూడా చేరుకుంది.

భువనేశ్వర్ చేరుకున్నాక ఈ దొంగతనం విషయం లాబరేటరీలో నా బాస్‌కీ, రవికీ తప్ప మరెవ్వరికీ చెప్పలేదు. ఇతరులకు చెప్పవద్దని వారిద్దర్నీ కోరుకున్నాను. అదృష్టం గురించి తప్ప దురదృష్టం గురించి ప్రచారం చేసుకొనడం నాకిష్టముండదు. రవి మాత్రం నాకు పూర్తిగా వ్యతిరేకం. తన సూట్‌కేసు తీసుకొనడంవల్ల నా వస్తువులు పోయాయని అతడంటే నేను నొచ్చుకున్నాను.

నేను చేరుకున్న నాలుగు రోజులకు శ్రీమతి, పిల్లలు భువనేశ్వర్ వచ్చారు. ఆ నాలుగు రోజులూ నాలుగు యుగాల్లా గడిచాయి నాకు.

స్టేషన్లో నన్ను చూస్తూనే పిల్లలిద్దరూ నన్ను చుట్టేశారు. శ్రీమతి అలా చేయడానికి మొహమాటపడింది.

"వసూ! మనం ఒకర్ని విడిచి ఒకరుండలేము. ఈ సత్యం తెలుసుకుందుకే నేను సింధ్రీ వెళ్లానేమో!" అన్నాను.

"జర్మనీ విషయం తేలిందా?" అంది శ్రీమతి ఆత్రుతగా.

"ఇంకాలేదు. కానీ ఏ క్షణంలో ఫారిన్ అవకాశం వచ్చేస్తుందోనని భయంగా ఉంది -" అన్నాను.

"రాదని భయపడాలిగానీ - వస్తుందని భయమెందుకు?"

శ్రీమతి చెప్పింది నిజమే. అవకాశం వస్తే వెళ్ళడం, వెళ్ళకపోవడమన్నది నా యిష్టం. దానికి భయమెందుకు? రాకపోతే నాకెలాగూ ఛాయిస్ ఉండదు.

నేనేకాదు - చాలామంది ఇలా అర్థంలేని మాటలు మాట్లాడతారు.

సూట్‌కేసు పోయిన విషయం కలకత్తానుంచే శ్రీమతికి ఉత్తరం రాసేశాను. విషాద వార్తలను పెండింగులో ఉంచడం నాకిష్టముండదు.

శ్రీమతి తనకు నా ఉత్తరం అందినట్లు చెప్పి - "కుట్టించుకోక కుట్టించుకోక కొత్తబట్టలు కుట్టించుకున్నారు. అవి ధన్‌బాద్ దొంగల పాలయ్యాయి -" అని చాలా బాధపడింది.

ఇల్లు చేరాం.

శ్రీమతి నేను తనకు చీర తెచ్చానని ఆశ్చర్యపడింది. సాధారణంగా డబ్బు విషయంలో పొదుపరిని నేను. అలాంటిది ఇలాంటి క్లిష్టపరిస్థితిలో చీర కొనడం ఆమెకు ఆశ్చర్యమే! ఆమె ఆశ్చర్యంలో ఆనందంకూడా మిళితమై ఉన్నదని గ్రహించిన నేను - తరచుగా అటువంటి ఆనందాశ్చర్యాలకు ఆమెను గురిచేయగల ఆర్థిక శక్తి నాకివ్వమని అప్రయత్నంగానే భగవంతుణ్ణి ప్రార్థించుకున్నాను.

అప్పుడు తిండిలేని నా సాటి పౌరుడు నా ఊహల దరిదాపుల్లో లేడు.

"నాకు చీర బదులు - మీరే ఇంకో పాంటు గుడ్డ తీసుకోవాల్సింది -" అంది శ్రీమతి బాధగా.

మనం ఎదుటివాళ్ల సుఖసంతోషాల గురించి ఆలోచిస్తే - వాళ్లు మన గురించి త్యాగం చేసే స్థితికి వస్తారు. శ్రీమతి ఆ మాటలు హృదయపూర్వకంగా అన్నదని గ్రహించక నాకు కలిగిన భావమది.

ఆమె కలవారింట పుట్టింది. నా యింట్లో అడుగు పెట్టాక నేనామెను నా వాళ్లగురించి త్యాగానికి ప్రోత్సహించాను తప్ప - ఆమె కోసం నేను చేసిన త్యాగమంటూ ఏమీలేదు. ఇంతకాలం నాకామె ఈ విషయం చెప్పలేదు. ఇప్పుడూ చెప్పలేదు. నేను తెచ్చిన చీరను చూడగానే ఆమె కళ్లలో కనబడ్డ ఆనందాశ్చర్యాలు నాకీ విషయం చెప్పాయి.

"నాకింక పాంటుగుడ్డలెందుకు? జర్మనీ చలిదేశం. ఈ గుడ్డలక్కడి చలిని ఆపలేవు. ప్రయాణం ముందు ఓ జత ఉలెన్ బట్టలు కొనుక్కుంటే చాలు. తర్వాత ఆ దేశంలోనే అక్కడి వాతావరణానికి అనుకూలమైనవి కొనుక్కోవచ్చు" అన్నాను.

శ్రీమతి కళ్లు మెరిశాయి - "నిజ చెప్పండి. మీకు ఫెలోషిప్ వస్తుందని గట్టిగా నమ్ముతున్నారా, లేదా?"

"ఏం?" అన్నాను.

"మీరు గట్టిగా నమ్మితే ఏదైనా జరుగుతుందని నా నమ్మకం -"

"నాకు నమ్మకంగానే ఉంది మరి" అన్నాను. శ్రీమతి అక్కడితో ఆగలేదు. తన కుడి చేతిచూపుడు వేలినీ, మధ్యవేలినీ ఒకసారి ముక్కుకు తాకించి - "బాబీ - ఓ వేలు పట్టుకోరా -" అనడిగింది మా అబ్బాయిని. వాడో వేలుపట్టుకోగానే ఆమె ముఖం దివ్యతేజస్సుతో వెలిగింది.

నాకెదురైన అపశకునాలు, కొన్ని శుభశకునాలు, శ్రీ వెంకటేశ్వరస్వామి, నా గట్టినమ్మకం, మా అబ్బాయి పట్టుకున్న చూపుడువేలు - కలిసి ఏకమై దివ్యంగా పనిచేసి ఉగాది పండగకింకా మూడు రోజులున్నదనగా పశ్చిమ జర్మనీ వెళ్లడానికి ఎన్నికైన పన్నెండుగురిలో భూషణ్‌తో పాటు నేను కూడా ఉన్నానన్న విశేషం తెలిసింది.

నా చేతిలో ఫారిన్ రేఖ లేదన్న విషయం ఆ క్షణంలో నాకు గుర్తులేదు.

10

నేను సెలక్టయ్యానన్న చల్లని కబురు నాకందించినది రవి. ఎన్నో శుభవార్తలను నేనానోట విన్నాను. అసూయపడడం తెలియని అతి కొద్దిమంది విశిష్ట వ్యక్తులలో ఒకడైన రవి నాకీ వార్త అందిస్తున్నప్పుడు ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు.

"మీకీ ఫెలోషిప్ రావాలని నేను చాలా కోరుకున్నాను. మీరైతే నాకు చనువు కాబట్టి నాక్కావలసిన స్టాంపులు తెప్పించుకోగలను - " అన్నాడతడు. అతడికి స్టాంపుల సేకరణ హాబీ.

నా ఫెలోషిప్ వార్త లాబరేటరీ అంతా పాకింది. వచ్చినవారికదో పెద్ద విశేషం. ఆఫీసుకది ఏటా జరిగే ఒక తంతు.

"మీరేమైనా అమ్మేసే మాటైతే నా చెవిన వేయండి -" అన్నాడు భాస్కర్. నాకులాగే అతడూ ప్రాక్టికల్ మనిషి.

జర్మనీ వెళ్లేముందు నేను క్వార్టర్ కాళీ చేయాలి. ఎలాగూ పదహారు నెలల్లో తిరిగే వచ్చే వాణ్ణే కాబట్టి సామాను భువనేశ్వర్నించి తరలించడం వీలుకాదు. ఎవరింట్లోనైనా దాచుకోవాలి, లేదా అమ్ముకోవాలి. మా ముందు - మా లాబొరేటరీనుంచి అయిదుగురు జర్మనీ వెళ్లారు. అందులో ముగ్గురు వెళ్లేముందు చాలా ఫర్నిచర్ అమ్మేసుకుని తిరిగి వచ్చాక మళ్లీ కొత్తవి కొనుక్కున్నారు. ఆ విషయం దృష్టిలో ఉంచుకునే భాస్కర్ నాకలా చెప్పాడు.

నేను, భూషణ్ ముందు మా బాస్ దగ్గరకు వెళ్లి ఆయన అభినందనలందుకున్నాం. తర్వాత డైరెక్టర్ అభినలందుకున్నాం. తర్వాత అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి వెళ్లి ఏం చేయాలో విచారించాం.

మొదట మేము పాస్‌పోర్టు సంపాదించాలి. ఫెలోషిప్ పశ్చిమ జర్మనీ ప్రభుత్వం ఇస్తోంది కాబట్టి మాకు వీసా అవసరం లేదన్నారు.

అప్పటికి భువనేశ్వర్‌లో పాస్‌పోర్ట్ ఆఫీసు లేదు. మేము అప్లికేషన్ కలకత్తా పాస్‌పోర్ట్ ఆఫీసుకి పెట్టుకోవాలి. అందుకు ప్రత్యేకమైన ఫారాలు ఉన్నాయి. అవి అక్కడి ఆఫీసులోనే దొరుకుతాయి. లేదా పోస్టులో తెప్పించుకోవాలి.

నేను వెంటనే ఫారాల కోసం పాస్‌పోర్ట్ ఆఫీసుకీ, అన్నయ్యకూ కూడా ఉత్తరాలు రాశాను.

తర్వాత వచ్చిన ఉగాది నాకెంతో ఉత్సాహాన్నిచ్చింది. కానీ శ్రీమతి - "వచ్చే ఉగాదికి మనం విడివిడిగా ఉంటాం -" అనగానే నా ఉత్సాహం దిగులుగా మారిపోయింది. పెళ్లయ్యాక ఏ ఉగాదికీ మేము విడిగా ఉండలేదు.

"ఫెలోషిప్ రాకుండా ఉంటే బాగుండేదేమో!" అన్నాను.

"అలాగనకండి. మీ పేరు వెయిటింగ్ లిస్టులో వచ్చినప్పట్నించీ మీరు జర్మనీ వెళ్లిపోతున్నట్లే అటు స్నేహబృందంలోను, ఇటు బంధువర్గంలోనూ ప్రచారమైపోయింది. మీరు నిజంగా వెడితే - సంతోషించే వారెందరో తెలియదు. వెళ్లకపోతే ఆక్షేపించేవారు మాత్రం

బోల్డుమంది. ఈ బాధ మీకంటే నాకే ఎక్కువ. మనం విడిపోవలసి వస్తే అది తాత్కాలికమేగదా!
మీరు వెడుతున్నందుకు నాకిప్పుడెంతో గర్వంగా ఉంది -" అంది శ్రీమతి.

ఏదో అనబోయి ఆగిపోయాను. శ్రీమతిని కూడా జర్మనీ తీసుకుని వెళ్లాలన్నది నా కోరిక. ప్రస్తుతం. నా పరిస్థితుల్లో హఠాత్తుగా ఏదో మార్పువచ్చి అసాధ్యం సాధ్యం కావచ్చునని నా నమ్మకం. అయినా ముందుగా ఈ ఆశను శ్రీమతి ముందు కూడా బయట పెట్టదల్చుకోలేదు. ఎందుకంటే ముందుగా చెప్పి చేయలేకపోతే అది శ్రీమతికి ఆశాభంగాన్నీ, అవమానాన్నీ కలిగిస్తుంది.

"ఏదో అన్నాను కానీ - ఇలాంటి అవకాశం ఎంతమందికి వస్తుంది?" అన్నాను.

ఉగాది వెళ్ళిన మర్నాడు భూషణ్ నా దగ్గరకు వచ్చి - "పాస్‌పోర్టు ఆఫీసును నమ్ముకుంటే ఆ ఫారాలెప్పుడొస్తాయో తెలియదు. మనకున్న వ్యవధి తక్కువ. ఈరోజిప్పుడే మార్చి 25. జూన్ మొదటివారంలో మన ప్రయాణం. ఈలోగా చాలా తతంగాలున్నాయి. అన్నిటికీ పాస్‌పోర్టు పెద్ద ప్రతిబంధకమై పోతుంది. అది లేనిదే కథ ముందుకు వెళ్లదు -" అన్నాడు.

"అయితే ఏం చేద్దాం?"

"హోమ్ డిపార్టుమెంట్లో ఫారాలు దొరకవచ్చు. సెక్రటేరియట్‌కు వెడదాం -"

మా అదృష్టం బాగుండి భువనేశ్వర్లోనే మాకు ఫారాలు దొరికాయి.

ఇద్దరం అర్జంటుగా ఫోటోలు తీయించుకున్నాం.

పాస్‌పోర్టు సైజు ఫోటోలు చాలాసార్లు తీయించుకున్నాను కానీ పాస్‌పోర్టు కోసం తీయించుకొనడం ఇదే మొదటిసారి.

నా ఫోటో చాలా ఘోరంగా వచ్చింది. ఫోటో తీసేటప్పుడు నా కళ్ళు మూతపడ్డట్లున్నాయి. స్టూడియోవాడు ప్రింటులో అది దిద్దేసి తనకు తోచిన కళ్లు పెట్టేశాడు నాకు. చూస్తూంటే చాలాకాలం అంధత్వంలో బాధపడి - ఆపరేషన్ చేయించుకున్నాక కళ్లొచ్చిన వాడిలాగున్నాను నేను.

"ఈ కళ్లు మూలంగా మీరు మీరులా లేరండీ - మళ్లీ తీయించుకోకూడదూ..!? -" అంది శ్రీమతి.

"మళ్లీ అంటే ఈ భువనేశ్వర్లో నాలుగు రోజులు పడుతుంది. ఏవో ఒకటి చాల్లెద్దూ" అన్నాను కానీ నాలుగు రోజుల కోసం ఎంత ఘోరమైన తప్పు చేస్తున్నానో అప్పుడు నేనూహించలేదు.

పాస్‌పోర్టు అప్లికేషన్‌లోని విషయాలు నిజమేనని ఒక అండర్ సెక్రటరీ స్థాయి ఉద్యోగి సర్టిఫై చేయాలట. అది మా డైరెక్టరే చేయవచ్చునని తెలియడంతో మా సమస్య సులభంగానే పరిష్కారమయింది. ఏప్రిల్ నాల్గవ తేదీ నాటికి ఆయన సంతకాలయ్యాయి. అప్పటికింకా పాస్‌పోర్టు ఆఫీసు నుంచి మాకు అప్లికేషన్ ఫారాలు రాలేదు. ఫారాలకు ఆఫీసు మీద ఆధారపడకపోవడం మంచి పనే అనుకున్నాను.

ఏప్రిల్ నాల్గవ తేదీ గురువారం. గురువారం మధ్యాహ్నం బెంగాలీలకు చెడ్డదట. భూషణ్ అప్లికేషన్లు మర్నాడు పంపుదామన్నాడు. అతడికలాంటి సెంటిమెంట్లు ఉన్నందుకు నేనాశ్చర్యపడినా సరేనన్నాను. మర్నాడవి పోస్టయ్యాయి. అన్నయ్య కలకత్తాలో ఉండడం నా అదృష్టం. పాస్‌పోర్టు తొందరగా వచ్చే ఉపాయం చూడమని వాడికి ఉత్తరం రాశాను.

ఈలోగా ఇంట్లో సామానుగురించి ఆలోచించాం. బొమ్మలన్నీ ఒకరింట్లోనూ, పుస్తకాలన్నీ ఇంకొకరింట్లోనూ దాచాక - మిగతా సామానంతా రవి ఇంట్లో పెట్టాలనుకున్నాం. కొన్ని సామాన్లు అమ్మేశాం కూడా.

మా అబ్బాయికి దైవసాన్నిధ్యంలో పుట్టువెంట్రుకలు తీయించాలని శ్రీమతి అనుకున్నదట. గతంలో మేము తిరుపతి వెళ్లినపుడు మా అబ్బాయి బొత్తిగా నెలల పిల్లవాడు. నెత్తిమీద కత్తి పడడం మంచిది కాదన్నారు అందుకని అప్పుడు మూడుకత్తెరలు వేయించాం.

ఇప్పుడూ మా అబ్బాయికి రెండేళ్లు నిండనున్నాయి. నేనుండగానే ఆ తంతు అయిపోవాలని శ్రీమతి మనసుపడడంతో పూరీ వెళ్లి శ్రీజగన్నాథుని సమక్షంలో ఆ తంతు కానిచ్చి వచ్చాం. ఇటువంటి తంతులు జరిగినపుడల్లా - నేను చదివిన సైన్సు నాపై చూపుతున్న ప్రభావమేమిటీ అన్న ఆలోచన నన్ను వేధించేది. విశ్వవిఖ్యాతి నార్జించిన శాస్త్రజ్ఞులు ఆదివారం చర్చికి వెళ్లగా లేనిది నేనిలాంటి తంతులకు లోబడడంలో తప్పేముందని సరిపెట్టుకున్నాను తప్ప ఆ విషయమై అప్పట్లో లోతుగా ఆలోచించలేదు

మేము మే ఒకటవ తేదీన బయల్దేరి ఇంటికి వెడదామనుకున్నాం. అంటే భార్యాబిడ్డలను దిగవిడచిరావడానికి.. మాతోపాటు రవి కుటుంబం కూడా వస్తున్నారు. వాళ్లకు ఎవరిదో బంధువుల పెళ్లి. రవి తనతోపాటు నా రిజర్వేషన్ కూడా చూసేశాడు.

ఇంటికి వెళ్ళేరోజు దగ్గరపడుతోంది. ఒకరోజు డాక్టర్ ప్రసాద్ ఇంటికి వెళ్లాం. ఆయన నాకు గురుతుల్యుడు. జర్మనీ నుంచి తిరిగి వచ్చి రెండున్నర సంవత్సరాలయిందాయనకు. తన జర్మనీ అనుభవాలు వివరించి చెప్పాక - "మీ అమ్మాయి బాగా పాడుతోంది కదా - ఈ ఈడులో ఆ పాట ముచ్చటగా ఉంటుంది. నేను మీకో కాసెట్ ఇస్తాను. దానిమీద మా యింట్లోనే రికార్డు చేసుకుని కూడా పట్టుకెళ్లండి. జర్మనీలో కొత్త కాసెట్ కొని నాకు తిరిగివ్వవచ్చు -" అన్నాడాయన. ఆ రోజు అమ్మాయి పాటతోపాటు అబ్బాయి మాటలు కూడా రికార్డు చేసుకున్నాను. కాసెట్ ఆయన వద్దనే వదిలి - "వినడానికి నా దగ్గర రికార్డరెలాగూ లేదు. జర్మనీ వెళ్లే ముందు తీసుకుంటాను -" అన్నాను.

ఆ మర్నాడు డాడ్ ఆఫీసు నుంచి ఉత్తరం వచ్చింది. అందులో స్కాలర్‌షిప్ గురించి వివరాలున్నాయి.

నా ప్రయాణం జూన్ 5న లుఫ్తాన్సా ఎయిర్ లైన్సులో. మొదటి నాలుగునెలలూ ల్యూనబర్గ్ అనే ఊళ్లో జర్మన్ భాష నేర్చుకోవాలి. ఈ నాలుగునెలలూ నాకు నెలకు మూడువందల మార్కులచొప్పున ఇస్తారు. (అప్పట్లో అనగా 1974లో మార్కు విలువ మూడు రూపాయలు) అక్టోబర్ ఒకటినుంచి ఒక సంవత్సరం పాటు బెర్లిన్లో నా రీసెర్చి కొనసాగుతుంది. ఈ కాలంలో నాకు నెలకు తొమ్మిది వందల మార్కులు ఇస్తారు. ఇవికాక వేరే బ్యాగేజి అలవెన్సనీ, పుస్తకాల అలవెన్సనీ, బట్టల అలవెన్సనీ వేరే ఉన్నాయి. వాటి ప్రాముఖ్యత అక్కడకు వెడితే కానీ తెలియదు నాకు. రూపాయల్లోకి మారిస్తే ఎక్కువగానే కనబడుతున్నా అక్కడి ధరల దృష్ట్యా ఇది చెప్పుకోతగ్గ మొత్తం కాదని కొందరన్నారు.

ఆ కాగితాలు చూడగానే శ్రీమతి దిగాలు పడిపోయి - "అక్టోబర్ ఒకటి - 1975 దాకా మనం విడిపోతున్నామన్న మాట - అంది.

"ఊ" అని -" ఉండవలసిన రోజుకొక్క క్షణం కూడా ఎక్కువుండను. నీ ముందు అక్టోబర్ ఒకటికల్లా వాలిపోతాను -" అన్నాను శ్రీమతితో. ఎందుకంటే సాధారణంగా ఇటువంటి అవకాశంపై విదేశాలు వెళ్లినవారు వైజ్ఞానికపరంగా ఆర్థికపరంగా ఉన్న లాభాలు దృష్టిలో ఉంచుకుని గడువుకాలం పెంచమని ఆఫీసును కోరుతూంటారు. నేనలా చేయకూడదనుకున్నాను. నా నిర్ణయంలోని బలం కాలమే నిర్ణయించాలి.

మా ప్రయాణమింకో రెండురోజులున్నదనగా అన్నయ్య దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఫోటోలు సరిగా లేక నా అప్లికేషన్ నిరాకరించబడిందట. ఫోటోలు పంపమని రాశాడు. అన్నయ్య కలకత్తాలో లేకపోతే నాకీ సమాచారం తెలిసేది కాదు. తను కనుక్కోకపోతే వాళ్లు ఆ అప్లికేషన్ మూల పడేసేవారని అన్నయ్య రాసింది చదవగానే నేను వణికిపోయాను. నా ప్రయాణానికెంతో ముఖ్యమైనది పాస్‌పోర్టు. అనుకున్న తేదీకది రెడీ కాకపోతే నా ప్రయాణమే కాన్సిలవుతుంది. ఇంత ముఖ్యమైన పాస్‌పోర్ట్ ఆఫీసులో ఎంతటి నిర్లక్ష్యం? అప్పటికి నా అప్లికేషనిచ్చి మూడు వారాలయింది. అయినా నాకేమీ తెలియబర్చలేదు వారు. అసలు ఫోటోలు అన్నయ్యద్వారా మార్చడానికి వాళ్లొప్పట్టాన అంగీకరించకపోగా - అన్నయ్య ఇన్ఫ్లుయన్స్ ఉపయోగించాల్సి వచ్చిందట.

నేను హడావుడిగా ఫోటో స్టూడియోకు వెళ్లి నా ఇబ్బంది చెప్పుకున్నాను. అతడు వెంటనే ఇస్తానని చెప్పి ఫోటో తీశాడు.

ఫారిన్‌ను స్వర్గంతో పోల్చే నేను అక్కడుండడానికి తగనా అన్న అనుమానం నాకప్పుడే కలిగింది. స్వర్గంలో ఉండే దేవతలను అనిమిషులు - అనగా రెప్పవేయని వారు - అంటారు. అక్కడికి వెళ్లాలనుకునే నేను కనీసం ఫోటోలో పడే క్షణంలో కూడా రెప్పవేయకుండా ఉండలేకపోయాను.

ఇరవైనాలుగ్గంటల్లో నా ఫోటో వచ్చింది. బాగుంది కూడా. అది అన్నయ్యకు పోస్టు చేశాను. అసలైన భయంకర వార్త అప్పుడు తెలిసింది.

మే ఎనిమిదవ తేదీనుంచి రైల్వే బొగ్గుపని వారందరూ సమ్మె చేయబోతున్నట్లు ప్రకటించారు. ఆ సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ప్రభుత్వం సంకల్పించి ముందు జాగ్రత్తగా ఇంధనం నిలవేయాలనుకుని - కొన్ని ట్రయిన్స్ కాన్సిల్ చేసింది. వాటిలో మా ప్రయాణానికి రిజర్వేషన్ జరిగిన హౌరా - హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది.

నేను, రవి కలిసి సమ్మె చేస్తామన్న రైల్వే పనివారలనూ, సమ్మెకు ముందే రైళ్లను ఆపివేసిన ప్రభుత్వాన్నీ తెగతిట్టుకున్నాం. విదేశాలు వెళ్లి వచ్చిన మా మిత్రులు - "ప్రభుత్వోద్యోగులు ప్రజలనింతలా వేధించడం పాశ్చాత్యదేశాల్లో జరుగదు"- అని చెప్పగా ఇలాంటి దేశంలో పుట్టినందుకు తెగ బాధపడ్డాను.

"ప్రభుత్వోద్యోగుల సంగతి సరే - ప్రభుత్వం చూడండి - సమ్మె నిజంగా జరుగుతుందోలేదో తెలియదు. కానీ దాని ప్రభావం అప్పుడే మనపై పడేలా చేసింది -" అన్నాడు రవి. అతడు వెళ్లవలసింది పెళ్లికి కాబట్టి ప్రయాణం వాయిదా వేసుకుందుకు లేదు. పూరీనుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులో ఎలాగో అప్పటికప్పుడు సీట్లు సంపాదించుకుని వెళ్లిపోయాడు.

నేను కొన్నాళ్లు వాయిదా వేసి చూశాను కానీ వృధా. రైళ్ల పరిస్థితి నానాటికీ మరీ అధ్వాన్నంగా తయారయింది. అప్పటికి హౌరా - మద్రాసు మెయిలొక్కటి మాత్రం తిరుగుతోంది. భువనేశ్వర్ రిజర్వేషన్ కౌంటర్ దగ్గర అవినీతి తక్కువ కాబట్టి అలాంటి పరిస్థితిలో కూడా నాలాంటివాడికి మెయిల్లో రిజర్వేషన్ దొరికింది.

ఈ సమ్మె చాలాకాలం కొనసాగేలా ఉందనీ, అందువల్ల భార్యాబిడ్డలను మాత్రమే పంపించి నేను భువనేశ్వర్లో ఉండిపోవడం మంచిదనీ శ్రేయోభిలాషులు నాకు సలహా ఇచ్చారు. కానీ వాళ్లనీ పరిస్థితుల్లో నేను లేకుండా ప్రయాణానికి పంపడం ఇష్టంలేక పోయింది నాకు. రానున్న ఇబ్బందులను కాలానికే విడిచిపెట్టి మెయిల్లో నేనూ, కుటుంబం ఇంటికి వెళ్లాలనుకున్నాను.

నా నిర్ణయం శ్రీమతికెంతో సంతోషాన్నిచ్చింది. హౌరా నుంచి వచ్చే మెయిల్ భువనేశ్వర్‌కు తెల్లవారుఝామున వస్తుంది. ఊరికి బాగా ఓ చివర ఉంటున్న మేము ఇంటివద్ద తెల్లవారు ఝామున రెండుగంటలకు లేచి బయల్దేర వలసి వచ్చింది. అదృష్టమల్లా - ఉన్నదొక్కటే ట్రయిన్ అయినా - మెయిల్ ఆలస్యం కాలేదు.

రిజర్వేషనున్నప్పటికీ మాకు మెయిల్లో ఎక్కడం చాలా కష్టమైపోయింది. ఎందరో జనం ప్లాట్‌ఫారం మీద ఎదురుచూస్తున్నారు. తిరుగుతున్నది ఒక్కటే ట్రయిన్. రిజర్వేషన్ గురించి ఎవరూ పట్టించుకోడం లేదు. అన్ని కంపార్టుమెంట్సూ మనుషులతో కూరుకుపోయి ఉండడంవల్ల నాకు సామాను ట్రయిన్లో కెక్కించడం చాలా కష్టమయింది. కొంత సామాను మా ఊళ్లో మా ఇంటి దగ్గర వదిలేయాలనుకున్నాం. అందువల్ల సామాను కాస్త ఎక్కువగానే ఉంది మాకు.

మాకు బెర్తులున్నాయి కాబట్టి కూర్చునేందుకు సీట్లున్నాయి. అయితే అదే కంపార్టుమెంట్లో రిజర్వేషన్ లేకుండా ఎక్కిన జనం చాలామందున్నారు. వాళ్లు కండక్టరుకి లంచాలిచ్చి ఎక్కిన బాపతు కాదు. కండక్టరు మానవత్వానికి చిహ్నంగా రైలెక్కినవాళ్లు. హౌరా నుంచి మద్రాసుకు వెళ్లే ఒకే ఒక్క ట్రయిన్లో ఎక్కడానికి - ప్రతి రైల్వే స్టేషన్లోనూ - ఒకో ట్రయినుకు సరిపడ్డ జనం ఉన్నారు.

నాకు ముందుగా ఒక బిడ్డతల్లి నిలబడి ఉంది. ఒకచేత్తో బెర్తును ఊతగా చేసుకుని నిలబడ్డ ఆమె రెండోచేత్తో బిడ్డను హృదయానికి హత్తుకుని అలాగే పాలు కుడుపుతోంది. ఆ దృశ్యం నాకు హృదయ విదారకంగా తోచి లేచి నిలబడి కూర్చోమని చెప్పాను. ఎంతో మొహమాటపడుతూ కూర్చున్నదామె.

రైల్వే పనివారల సమ్మె లేనప్పుడు కూడా ఆమె అలాగే ప్రయాణం చేసి ఉండేదని - ఆమెను చూడగానే తెలుస్తుంది. కానీ అప్పుడామెను నేను చూసి ఉండేవాణ్ణికాదు. సాధారణంగా జనరల్ కంపార్టుమెంట్లో నేను ప్రయాణం చేయను. రిజర్వేషన్ కంపార్టుమెంట్లో ఆమె ఎక్కలేదు.

అలాంటి మనుషులున్న ఈ దేశంలో సమ్మెలేమిటి?

అసలే సామాన్య ప్రజలు - నిత్యజీవితంలో ఎన్నో పోరాటాలు కొనసాగిస్తూ నానా అవస్థలూ పడుతూ - ఎన్నో సమస్యలకు సమాధాలు వెతుకుతూంటే - ఈ సమ్మెలు వారికి మరికొన్ని సమస్యలు సృష్టిస్తున్నాయి.

ఆ క్షణంలో సమ్మెలకు వ్యతిరేకంగా ఎన్నో భావాలు నాలో కలిగాయి. మనదేశంలో సమ్మెలు చేయడం అమానుషమనిపించింది.

రిజర్వేషనుండి కూడా నా అవస్థలూ పడి ఇల్లుచేరాం. కొద్దిరోజులు అత్తవారింట్లోనూ, కొద్దిరోజులు అమ్మా నాన్నల దగ్గరా ఉన్నాను.

మా అమ్మ నన్ను చూస్తూనే - "ఏరా ఈ వెధవ ఊళ్లో ఉండలేకపోతున్నాను. మీ నాన్నగారికి బొత్తిగా నా విలువ తెలీకుండా ఉంది. నన్నూ నీతోపాటు జర్మనీ తీసుకు పోకూడదూ -" అంది.

అమ్మ యథాలాపంగా ఆ మాటలంది. తనను జర్మనీ తీసుకుని వెళ్లడం ఎంత కష్టమో ఆమె ఊహించడానికి కూడా ప్రయత్నించలేదు. కానీ..

ఏమాత్రం వీలుపడినా నేను నా భార్యాబిడ్డలను జర్మనీ తీసుకుని వెళ్లాలనుకుంటున్నాను తప్ప - అమ్మ గురించి ఆలోచించనే లేదు. నా జీవితం నా భార్యాబిడ్డలకే పరిమితమైపోయింది. నా ఆలోచనలు వారిచుట్టూ మాత్రమే తిరుగుతున్నాయి. జన్మనిచ్చిన తల్లికూడా నా ఆలోచనల్లోకి రావడంలేదు. కానీ అమ్మ ఎంత గొప్పది.

ఎంతోదూరం నిలబడి రైల్లో ప్రయాణం చేస్తూ ఒకచేత్తో హృదయానికి బిడ్డను హత్తుకుని స్తన్యాన్నిస్తున్న ఆ తల్లి నా కళ్లముందు మెదిలి చలించిపోయాను.

ఈ ప్రపంచంలో తలెత్తుకుని మొనగాడిలా తిరుగుతున్న ప్రతి మనిషీ ఏదో ఒకరోజున ఆ విధంగా మాతృహృదయాన్ని బల్లిలా కరిచి పెట్టుకుని ఉన్నవాడే

అప్పుడే నాకు స్వార్థమంటే తెలిసింది.

అమ్మకు తన బిడ్డమీద మాత్రమే ప్రేమ. నాకు నా భార్యాబిడ్డల మీద మాత్రమే ప్రేమ. రైల్వే యూనియన్ నాయకులకు తమ తోటి ఉద్యోగులపైన మాత్రమే ప్రేమ.

సంకుచితమైన ఈ ప్రేమ సాటి మానవుణ్ణి నిర్లక్ష్యం చేస్తోంది. మనిషిని మనిషి దోచుకునేలా చేస్తోంది. లక్షలాది ప్రజలు అడుక్కుంటుంటే ఈ దేశంలో అక్రమ వ్యాపారం చేసేవాడూ, అయిదు రూపాయల జీతం పెరుగుదల కోసం సమ్మె చేసేవాడూ కూడా ప్రజలను దోచుకుంటున్నట్లే లెక్క.

మరి - విదేశాలు వెళ్లిరావడం!

తప్పని నాకనిపించలేదు.

నా ఖర్చులన్నీ ఒక సంపన్న దేశం భరిస్తోంది. నా శిక్షణ మన దేశానికి పనికివస్తుంది. ఈ విదేశయానం గురించి నేను సమ్మెలు చేయలేదు. ప్రజలకిబ్బంది కలిగించే ఏ పనీ చేయలేదు.

నా ఆలోచనలన్నీ శ్రీమతికి చెప్పాను.

ఆమె నవ్వి - "ఎక్కడ మునిగి ఎక్కడ తేలారండీ?" అంది.

వెన్నెలలు కాయించే ఆ నవ్వుకు నేను అతి త్వరలోనే దూరమవుతున్నానన్న బాధ నన్ను మళ్లీ ఆవహించింది.

రాజమండ్రిలో ఫామిలీ ఫోటో తీయించుకున్నాం. కాపీలు రావడానికి ఆలస్యమవుతుంది. శ్రీమతిని ఫోటోలు కలకత్తాకు పంపమన్నాను. జర్మనీలో పదహారు నెలలపాటు ఆ ఫోటోను చూస్తూనే నేను బ్రతకాల్సి ఉంది.

అత్తవారింట్లో ఇంకో రకం ప్రశ్న ఎదురైంది నాకు. అది నేనూహించనిది.

ఒకటి రెండు నెలలపాటు విదేశాల్లో ఉండాలనుకున్నవారే అక్కడి వినోద, విలాసాలకు దాసులై - అక్కడే శాశ్వతంగా స్థిరపడి వేరే పెళ్లిళ్లు చేసుకుని పాత కుటుంబాల సంగతి మరిచిపోవడం కూడా జరిగిందట. ఈ విషయం మా అత్తగారికే స్ఫురించింది.

మా అమ్మకు నా పైన అనుమానం లేదు. ఆమె నా క్షేమం గురించే ఆలోచిస్తుంది. మా అత్తగారికైతే తన కూతురి గురించే ధ్యాస. ఆ ధ్యాసలో నామీద అనుమానం పుట్టింది.

అదృష్టవశాత్తూ అత్తగారి మాటల ప్రభావం శ్రీమతిలో అనుమానాలను సృష్టించలేదు. ఏడు సంవత్సరాలుగా కలిసి కాపురం చేసినందుకు ఆమె నన్నామాత్రం అర్థం చేసుకుంది.

"పదహారు నెలలంటే మాటలు కాదు. అందరూ తాగితందనాలాడే దేశమది. ఆడది వంటి మీద గుడ్డ సరిగ్గా ఉంచుకోని దేశమది. మగాడొక్కడూ అన్నాళ్లక్కడుంటే చెడిపోయి తీరాల్సిందే -" అని మా అత్తగారంటే -

"నా పెళ్లికి ముందాయన చదువు పేరు చెప్పి వాల్తేర్లో అయిదేళ్లున్నారు. విస్కీ బ్రాందీల విషయమటుంచి - సిగరెట్‌కానీ ఆఖరికి కాఫీ టీలుకానీ అలవాటు కాని మనిషి - ఇప్పుడిద్దరు బిడ్డల తండ్రి అయ్యాక విదేశాలు వెళ్లి ఏదో మారిపోతారని అనుకోవడం చాలా తెలివితక్కువ -" అని శ్రీమతి వాదించిందట.

ఈ విషయమామె నాకు చెప్పడంలో నమ్మకంతోపాటు - హెచ్చరిక, అభ్యర్థన కూడా లేకపోలేదు.

అత్తగారి విషయమలాగుంటే మామగారికి నేనంటే విపరీతమైన నమ్మకమూ, అభిమానమూనూ. ఆయన నా గురించి మరోవిధంగా కంగారుపడ్డారు. "నీవి లేనిపోని ఆదర్శాలు. నువ్వు వెడుతున్నది చలిదేశం. ఏ దేశపు అలవాట్లయినా ఆ దేశపు వాతావరణాన్ని బట్టి ఏర్పడతాయి. అక్కడున్నంతకాలం నువ్వు మాంసాహారానికీ, విస్కీ, బ్రాందీలకూ తటపటాయించ కూడదు -" అంటూ ఉదాహరణగా ఆయన నాకో పురాణగాథ కూడా చెప్పారు.

ఒక పర్యాయం విశ్వామిత్రుడు అడవిలో తిరుగుతూ అంతులేని ఆకలికి గురయ్యాడట. ఎక్కడా ఒక పండుకానీ, గుక్కెడు నీళ్లుకానీ దొరకలేదుట. అలా నడుస్తూండగా ఆయనకో కసాయివాడి గుడిసె కనపడిందిట. అప్పుడా కసాయివాడు గొడ్డు మాంసం తింటున్నాడుట. విశ్వామిత్రుడు వాడిని సమీపించి ఏముంటే అది పెట్టమని అడిగి - వాడెంగిలి చేసిన గొడ్డు మాంసం మినహా మరేమీలేదని గ్రహించి వాడు వారిస్తున్నా వినకుండా ఆ ఎంగిలి మాంసమే తిన్నాడుట. రెండు ముక్కలు తినేసరికాయనకు ప్రాణం తెప్పరిల్లిందిట. ఈలోగా కసాయివాడాయనకు గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిచ్చాడుట.

"గోహత్య చేసి బ్రతికే కసాయివాడివి. నీచేతి మంచినీళ్లు తాగుతాననుకున్నావా?" అన్నాడుట విశ్వామిత్రుడు వాడివంక గ్రుడ్లురిమి చూసి.

కసాయివాడాశ్చర్యపడి - "అదేంటి స్వామీ! నా ఎంగిలి గొడ్డుమాంసం తిన్న మీరు నేను తాగిన నా చేతి నీళ్లు తాగకపోవడమేమిటి?" అనడిగాడట.

"అప్పటి పరిస్థితి వేరు. అప్పుడది తినకపోతే నా ప్రాణం నిలబడి ఉండేదికాదు. అప్పుడు నేను ఆకలి అనే జబ్బుతో బాధపడుతున్నాను. జబ్బుకు ముందుగా ఇది వాడకూడదన్న నిషేధం లేదు. నా ఆకలి జబ్బు నయమై నా ప్రాణం నిలబడగానే - నా ధర్మాలు నేను పాటించవలసి ఉంది. అందుకే పాటిస్తున్నాను.." అని అక్కణ్ణించి వెళ్లిపోయాడట విశ్వామిత్రుడు.

ఈ కథ నాకు చెప్పి - "కాబట్టి ఈ దేశంలో నీకే ఆదర్శాలున్నప్పటికీ విదేశాలు వెళ్లినప్పుడు మాత్రం అక్కడి పరిస్థితులకు అనుకూలంగా వాటిని సడలించుకోవాలి. బీ ఏ రోమన్ ఇన్ రోమ్. తిరిగి రాగానే మళ్లీ నీవు కోరిన విధంగా ఉండవచ్చు." అన్నారు మామగారు.

ప్రాణం నిలబెట్టుకోడం కోసం ఏమైనా చేసి ఆ తర్వాత ప్రాణం నిలబడ్డాక మళ్లీ మానవత్వపు ధర్మాలను పాటించాలన్న వేదాంతం నాకు నచ్చింది. కానీ నాకు కలిగిన ఒక సందేహాన్ని ఆయనకు చెప్పుకోలేకపోయాను.

విశ్వామిత్రుడి ప్రాణం ఒక కసాయివాడి కారణంగా నిలబడింది. ఆ కృతజ్ఞతతో విశ్వామిత్రుడు కసాయివాళ్ల బాగోగుల గురించి ప్రత్యేకంగా ఏమైనా కృషి చేశాడా అన్నది నా సందేహం. అడిగితే మామగారు మరోవిధంగా భావించ వచ్చునని భయపడ్డాను. అయితే ఆయనతో - "నాగురించి లేనిపోని భయాలు పెట్టుకోకండి. అవసరాన్ని బట్టి విదేశాల్లో తప్పక తాగ గలను." అని హామీ యిచ్చాను. ఈ హామీ అత్తగారికి నచ్చలేదు. తాగనని హామీ ఇవ్వాలి కానీ తాగుతానని హామీ ఇవ్వడమేమిటని ఆమె తనలో తాను గొణుక్కుంది.

స్వర్గంలో సురాపానమూ, విదేశాల్లో సారాపానమూ తప్పుకాదని నేను అత్తగారి ముందే శ్రీమతికి చెప్పాను. ఆమె భయపడుతుందని తెలిసినా - అత్తగార్లను భయపెట్టి ఆనందించే అల్లుళ్ల మనస్తత్వం నాకానందాన్నే కలిగించింది.

మే నెల పంతొమ్మిదిన నా ప్రయాణం నిశ్చయమైంది.

ప్రభుత్వం నిక్కచ్చిగా ప్రవర్తిస్తూండడం వల్ల రైల్వే పనివారిలో కొందరు సమ్మెలో చేరలేదు. సమ్మె ఆరంభమైన వారంరోజుల తర్వాత ప్రభుత్వం కొన్ని రైళ్లను నడపడం మొదలెట్టింది. నా ప్రయాణం నాటికి మెయిలు కాక హైదరాబాద్ - హౌరా ఎక్స్‌ప్రెస్ కూడా తిరుగుతోంది. నేను మాత్రం రిస్కు తీసుకోదల్చుకోలేదు. ముందు మెయిలుకు ప్రయత్నించి అందులో దొరక్కపోతేనే ఎక్స్‌ప్రెస్ ఎక్కాలనుకున్నాను.

ప్రయాణం రోజుకు నా మనసంతా బాగాలేదు. నా కూతురికి నా దగ్గర బాగా చేరిక. అది నన్ను విడిచి కొన్ని గంటలు మించి ఉండలేదు. పిల్లలిద్దరికీ కూడా ఆరోగ్యం బాగుండలేదు. ముఖ్యంగా అమ్మాయికి ప్రతిరోజూ ఏదో సమయంలో హఠాత్తుగా కాసేపు వళ్లు వేడెక్కి మళ్లీ చల్లబడుతూంటోంది.

వీడ్కోలు సమయం రానే వచ్చింది.

కంపార్టుమెంట్లో ఎక్కి గుమ్మం వద్ద నిలబడ్డాను.

ప్లాట్‌ఫారం మీద అమ్మ, నాన్నగారు, తమ్ముళ్లు, చెల్లెళ్లు, శ్రీమతి, పిల్లలు - ఉన్నారు. అమ్మాయికి జ్వరంవల్ల వళ్లు తెలియకుండా పడి ఉంది. దానికి నేను ఊరు వదిలి వెడుతున్నట్లు కూడా తెలియదు. అప్పుడది నా చెల్లెలి చేతుల్లో ఉంది. అబ్బాయిని శ్రీమతి ఎత్తుకుంది. వాడేమో నా దగ్గరకు వస్తానని ఏడుస్తున్నాడు. గొంతు మెదిపితే తన దుఃఖం బయటపడుతుందనో ఏమో - శ్రీమతి వాణ్ణి సముదాయించడం లేదు. ఆమె కళ్లలో నీళ్లు తిరగడం మొదలయింది. చీర చెంగుతో ఒత్తుకుంది. కానీ అని ఆగడంలేదు. ఉన్నట్లుండి శ్రీమతి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

అప్పుడు నా హృదయాన్నెవరో పెకలిస్తున్నట్లు తోచింది. అప్రయత్నంగా నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఏదో అందామనుకుంటే గొంతు పెగలలేదు.

నేనింకెవ్వరినీ చూడడం లేదు.

వళ్లు తెలియని జ్వరంలో ఉన్న కూతురు, దగ్గరకు వస్తానని ఏడుస్తున్న కొడుకు, వెక్కి వెక్కి ఏడుస్తున్న శ్రీమతి.. వారినే చూస్తున్నాను. రైలు కదిలింది.

ఒకటి కాదు.. రెండుకాదు.. ఏడేళ్ల అనుబంధం.

ఈ అనుబంధానికి కనీసం పదహారు నెలలైనా దూరం కమ్మని హెచ్చరిస్తూ ఓ పెద్దకూతపెట్టి మెయిలు వేగం పుంజుకుంది.

11

రాత్రి పదకొండు గంటలకు ట్రయిన్ భువనేశ్వర్ చేరుకుంది. రిక్షాలో కాలనీ చేరాను. ఆ రాత్రి సమయంలో నా రాకనెవ్వరూ గుర్తించలేదు. రవి వుంటే అతడు తప్పక మా యింటి వద్ద ఎదురు చూస్తూ కనబడి ఉండేవాడు. సెలవుమీద అతడు కుటుంబంతో సహా ఇంటికి వెళ్లిపోవడంతో - ఇంటి తాళం తీస్తున్న నాకు అసలైన ఒంటరితనపు అనుభూతి కలిగింది.

ఇంట్లో ఏమీలేవు. అన్నీ ఖాళీ. సద్దుకోవడం నాకిబ్బందన్న భావంతో శ్రీమతి మంచాలతో సహా అన్నీ ప్యాకింగు చేసేసి ఎవరింట్లో ఏమివ్వాలో నిర్ణయించేసింది. ఆ రాత్రికి నేను కటిక నేలపై తువ్వాలును దిండుగా చేసి పడుకున్నాను. రాత్రి సరిగా నిద్రపట్టలేదు. తెల్లవారు ఝామున ఎప్పుడో కాస్త కునుకు పట్టింది. బాగా పొద్దెక్కి ఏడయ్యాక భాస్కర్ వచ్చి తలుపు తట్టేవరకు నాకు మెలుకువ రాలేదు. అతడు నన్ను వారింటికి భోజనానికి ఆహ్వానించాడు.

నేనతణ్ణి ముందుగా పాస్‌పోర్టు గురించి అడిగాను. అదింకా రాలేదని తెలియగానే మనసు పాడయింది. అతణ్ణి పంపేసి కాలకృత్యాలు తీర్చుకుని టిఫినుకు వాళ్లింటికి వెళ్లాను.

"మీరుండేది వారం. ఈ వారం రోజులూ మా యింట్లోనే భోంచేయండి -" అంది శ్రీమతి భాస్కర్.

కాలనీలో నాకు తెలిసిన వారింకా ఉండడంవల్ల భాస్కర్‌కు కమిట్‌మెంటివ్వలేదు. ఎటొచ్చీ హృదయపూర్వకంగా ఆహ్వానించిన ఆ దంపతుల చూపులు నేనాకాలనీలో ఒంటరివాణ్ణి కానని స్పష్టం చేశాయి.

లాబొరేటరీలో భూషణ్‌ని కలిశాను. అతడు తన పాస్‌పోర్టు కలకత్తా వెళ్లి తెచ్చుకుని వచ్చాడు. నాది కూడా తయారైపోయిందనీ బెంగపడవద్దనీ అన్నాడు. చేతిలో ఫారిన్ రేఖ లేని నాకు ఈ పాస్‌పోర్టు కారణంగా ప్రయాణమాగిపోదుకదా అన్న భయం మనసులో ఉంది.

లాబరేటరీలో నా పేరున వస్తువులన్నీ స్టోర్సుకి తిరిగిచ్చేసి - "నోడ్యూస్" సర్టిఫికెట్ ఒకటి తీసుకోవాలి. ఆ విషయమై ఒక చోట నుంచి ఒక చోటకు తిరుగుతూ రోజుల్లా ఆఫీసులో గడిపాను.

అన్నయ్య దగ్గర్నించి ఉత్తరం వచ్చింది. మూడురోజుల ముందు పోస్టు చేశాడది కలకత్తాలో. పాస్‌పోర్టు ఒకటి రెండు రోజుల్లో సిద్ధమవుతుందిట. అనవసరంగా పోస్టల్ డిలే ఎందుకూ - నువ్వు వెళ్ళేముందు కలకత్తా వస్తావుగదా - అక్కడ పెర్సనల్ డెలివరీ తీసుకోమని రాశాడు. నేను వెంటనే అన్నయ్య పేరిట ఓ ఆథరైజేషన్ లెటర్ రాసా - దాని సాయంతో వాడినే పాస్‌పోర్టు డెలివరీ తీసుకోమని వేరే ఉత్తరం రాసి రెండూ కలిపి ఒకే కవర్లో పెట్టి పోస్టు చేశాను.

జర్మనీ చలిదేశం కాబట్టి మణికట్టు దాకా చొక్కాతో కవర్ చేయడం అవసరమని అంతా సలహా యిచ్చారు. అందుకు గుడ్డలు శ్రీమతి రాజమండ్రిలో తనే ఎన్నిక చేసింది. సాయంత్రం అవి టౌన్లో టైలరింగ్ షాపులో ఇచ్చాను. ఎప్పుడూ సగం చేతుల చొక్కాలు తప్ప వేసుకోనని తెలిసిన టైలర్ ఆశ్చర్యపడి కారణం కూడా అడిగి తెలుసుకున్నాడు.

భువనేశ్వర్లో ఉన్న వారం రోజులూ నేను తిండి గురించి ఇబ్బంది పడలేదు. ఉన్న టైము తక్కువ కావడం వల్ల పిల్చిన వారందరిళ్లకూ వెళ్లలేకపోయాను. భాస్కర్ దంపతులకులాగే నా సీనియర్ కొలీగ్ భానోజీరావు, అతడి శ్రీమతికూడా నన్నాదరించి - నా ఒంటరితనాన్ని మరిపించారు.

రాత్రి ఇంటికి వెళ్లి పడుకునేసరికి మాత్రం ఏకాకినన్నభావం నన్ను వేధించేది. ఇలాంటి రాత్రులింకా పదహారు నెలలపాటు గడపాలంటే..?!

మే 23న లుఫ్తాన్సా ఎయిర్‌లైన్సు నుంచి నా ప్రయాణానికి సంబంధించిన ముఖ్యమైన కాగితాలు కొన్ని వచ్చాయి. అందులో పీ ఫారం ఉంది. అది నింపి రిజర్వు బ్యాంకువారి అనుమతి పొంది, పాస్‌పోర్టు తీసుకుని లుఫ్తానా ఎయిర్ లైన్సు వారిని కలకత్తాలో కలుసుకుంటే వారు మాకు టికెట్ ఇస్తారు.

ఈ కాగితాలకంటే ముఖ్యమైనవి సీయస్సయ్యార్నించి రావలసి ఉన్నాయి. ప్రభుత్వ ఆర్థికశాఖవారు మాకు వచిన స్కాలర్‌షిప్ గురించి ఒక ఉత్తర్వు జారీ చేస్తారు. ఆ ఉత్తర్వు వస్తే తప్ప మేము బయలుదేరడానికి లేదు. ఆ ఉత్తర్వు కాపీలు అన్ని రాష్ట్రాల రాజధానీ నగరాలలోని రిజర్వుబ్యాంకులకూ పంపుతారు.

మా ప్రయాణం రోజుల్లోకి వచ్చినా ఆ ఉత్తర్వు రాకపోవడంతో మేము అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ని కలుసుకుని మాట్లాడాము. ఆయన వెంటనే ఢిల్లీలోని హెడ్డాఫీసుకి ట్రంక్ కాల్ చేసి - ఉత్తర్వు పోస్టు చేసి రెండు రోజులయిందనీ ఈలోగా మిగతా ఫార్మాలిటీస్ ముగించవచ్చుననీ తెలుసుకున్నాడు. ఆయన వెంటనే అందుకు సంబంధించిన అసిస్టెంటుని పిలిచి బాండ్ తయారుచేయమన్నాడు.

ఈ బాండ్ ఒక పెద్ద తతంగం.

మేము ఈ స్కాలర్‌షిప్ అనుభవించి తిరిగి వచ్చాక సీయస్సయ్యార్లో నాలుగు సంవత్సరాల పాటు ఉంటామని హామీ యివ్వాలి. మా ప్రయాణం ఖర్చులు, ఈ స్కాలర్‌షిప్ సమయంలో ప్రభుత్వం మాగురించి పెట్టే ఖర్చులు - కలిపి హామీ మొత్తమవుతుంది. గడువు సమయానికి తిరిగి దేశానికి రాకపోయినా, అసలు విదేశాలలో ఉండిపోవాలనుకున్నా, తిరిగివచ్చి సీయసయ్యార్లో నాలుగు సంవత్సరాలుండకపోయినా, మేము మొత్తం డబ్బును సీయస్సయ్యార్‌కు ఇచ్చుకోవాలి. అలా ఇచ్చుకుంటానని నా గురించీ భూస్వామి లేక పర్మనెంట్ ఉద్యోగస్థుడైన అయిన వ్యక్తి పూచీ ఉండాలి. అదృష్టవశాత్తూ మా బాస్ నాకూ, భూషణ్‌కీ కూడా పూచీ పడడానికంగీకరించాడు. హామీగా ఉండవలసిన మొత్తం తక్కువ కాదు. మా ఇద్దరి గురించే మా బాస్ తీసుకున్న రిస్కు సామాన్యమైనది కాదు.

ఆఫీసులో అసిస్టెంటు లెక్కకట్టగా - మనిషికి సుమారు ముప్పై అయిదు వేలు హామీ మొత్తం లెక్క తేలింది.

అవును మరి పదహారు నెలల్లో మొదటి ఆరునెలలూ ఇండియాలో నాకు పూర్తి జీతం వస్తుంది. తర్వాత పదినెలలూ కరువు భత్యం మినహాయించుకుని మిగతా జీతం (అనగా బేసిక్ పే) వస్తుంది. దీనికి జర్మనీ ప్రయాణం ఖర్చు కలిపి - రెండు పెట్టి గుణించగా ఈ మొత్తం వచ్చింది. జర్మనీలో నాకు మార్క్సు రూపంలో వచ్చే స్కాలర్‌షిప్ వగైరాలు దీనికి జోడించలేదు కాబట్టి సరిపోయింది కానీ ఈ హామీ మొత్తం లక్షరూపాయలు దాటిపోయేది.

అంటే నేను, భూషణ్ జర్మనీ వెడుతూండడం వల్ల మా బాస్‌కు మొత్తం డెబ్బైవేల రూపాయల జామీను బేరం తగిలింది. మా మీద నమ్మకం, అభిమానంతో ఆయన ఈ బాధ్యత తీసుకున్నాడు.

మేమిద్దరమూ ఎలాగూ తప్పక తిరిగివస్తాం కాబట్టి హామీ మొత్తం ఎంతైనా మాకు బాధలేదు. ఉన్న యిబ్బందల్లా - బాండ్ కోర్టు పేపర్ల మీద వ్రాయాలి. మా హామీ మొత్తానికి కోర్టు పేపర్ల విలువ అయిదువందల పదిరూపాయలు.

మన ప్రభుత్వ వ్యవహారాలెంత అయోమయంగా ఉంటాయో తెలుసుకునేందుకీ బాండు పేపర్ల ఉదంతం చాలు.

మేము ప్రభుత్వోద్యోగుల కిందే లెక్క. ఈ బాండు కేవలం ఫార్మాలిటీ. అలాంటప్పుడు ఏ తెల్లకాగితం మీద వ్రాయించి మా చేత సంతకం పెట్టించుకున్నా సరిపోతుంది. కానీ ఆఫీసలా ఒప్పుకోదు. ఆ అయిదు వందల పదిరూపాయల ఖర్చూ ఆఫీసుదే. అయితే ముందుగా మేము పెట్టుబడి పెట్టి ఆ కోర్టు పేపర్లు కొని తెచ్చుకోవాలి.

ఇందుకు భూషణ్ ఒప్పుకోలేదు. నేను మెత్తబడడం చూసి నన్ను చాటుగా పిలిచి - "నాలుగు రోజుల్లో మన ప్రయాణముంది, ముందుగా ఖర్చు పెడితే మన డబ్బు వెనక్కురాదు. దగ్గరుండి వెంటాడుతుంటేనే ఆఫీసులో పనులకు నెలలు పడుతున్నాయి. మనం విదేశం పోతున్నాం" అన్నాడతడు హెచ్చరికగా.

అతడి మాటల్లో నాకు సబబు కనపడింది. అతడి పట్టుదల వల్ల ఆఫీసు బాండ్ పేపరు కొనడానికి ఇద్దరికీ చెరో మూడొందలూ అడ్వాన్సిచ్చింది. మిగతా డబ్బు మేము పెట్టుబడి పెట్టాం.

ఈ కోర్టు పేపర్లు కొనడం ఒక పెద్ద తతంగం. ముందుగా డబ్బును స్టేట్‌బ్యాంకులో కట్టి చలానా తీసుకుని ట్రెజరీకి వెళ్లి అక్కడ బోలెడు సంతకాలు చేయించుకుని - ఓ గొప్పవాడి రికమెండేషను సంపాదించుకుంటే అప్పుడవి దొరుకుతాయి. లేదా ఎక్కువ డబ్బిచ్చి స్టాంపు వెండర్ల దగ్గర కొనుక్కోవాలి. దేనికైనా కొంత టైము పడుతుంది. మాకు వ్యవధి చాలా తక్కువ. ఈ సందర్భంలో మాకు జానికిరాం అనే అసిస్టెంటు సాయపడి ఉండకపోతే చాలా ఇబ్బంది పడేవాళ్ళం. తెలుగు వాడినన్న అభిమానంతో నాకూ నాతోపాటు భూషణ్‌కీ జానకిరాం సాయపడ్డాడు. ఆ పేపర్ల మీద టైపింగు కూడా అతడే చేశాడు. వాటిపై నేనూ, భూషణ్, మా బాస్ సంతకాలు పెట్టాం.

మా టికెట్స్ 28వ తేదీకి బుక్ చేసుకున్నాం. రైల్వే పనివారల సమ్మె చాలా వరకు దెబ్బతింది. కానీ మేము ఢిల్లీ వెళ్లడానికి కలకత్తాలో ట్రెయిన్స్ దొరుకుతాయో దొరకవోనని నాకు బెంగగా ఉంది. అదృష్టవశాత్తూ కలకత్తా వెళ్లే ట్రయిన్స్ తిరుగుతున్నాయి.

స్కాలర్‌షిప్ విషయం మార్చిలో తెలిసింది. ఇంతవరకూ ఫైనాన్స్ మినిస్ట్రీ నుంచి ఉత్తర్వురాలేదు. భూషణ్, నేను బ్యూరోక్రసీని తెగ తిట్టుకున్నాం. అయితే మార్చి 25కి ఆ కాగితాలు వచ్చాయి. ఆ వెంటనే భువనేశ్వర్నించి ఢిల్లీ వెళ్ళడానికి ట్రావెలింగ్ అలవెన్స్ బిల్లు వెంటనే తయారయింది.

అనుకోకుండా అదేరోజున రిజిస్టర్డు పోస్టులో నా పాస్‌పోర్టు కూడా వచ్చింది. అది అందుకుని సగం ఆనందం పొందుతూ, ఓ క్షణం ఆపాదమస్తకం వణికిపోయాను. పోస్టులో ఇది రావడం రెండు మూడు రోజులాలస్యమయుంటే?

అందుకే కలకత్తా వెళ్లి తీసుకుంటానని అన్నయ్యకు ఉత్తరం రాశాను. అవసరపడితే ఉపయోగమని ఆథరైజేషన్ లెటరు కూడా ఇచ్చాను.

ఏది ఏమైతేనేం, అన్ని అడ్డంకులూ ఒకటొక్కటే తీరిపోతున్నాయి. మనసు తేలికపడుతోంది.

భువనేశ్వర్లో ప్రభుత్వ చేతిపనుల దుకాణం "ఉత్కళిక". అక్కడ నేను రెండు కోణార్క శిల్పాలు కొన్నాను. అవి జర్మనీలో నా ప్రొఫెసరుకు బహుమతి ఇవ్వాలనుకుంటున్నాను.

భూషణ్ కూడా తనకు తోచినవేవో కొన్నాడు.

డిపార్టుమెంట్లో మా యిద్దరికీ ఇరవైఏడో తేదీన వీడ్కోలిచ్చారు.

ఆ రోజే అన్నయ్య నించి ఉత్తరం వచ్చింది. కాళీమాతను ప్రార్థించుకుంటే అంతా శుభమవుతుందని రాశాడన్నయ్య.

మర్నాడే ప్రయాణం. క్వార్టర్ కాళీ చేసి లాబరేటరీ సూపర్‌వైజర్‌కు అప్పగించినపుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ కాలనీలో అడుగు పెట్టినప్పట్నించీ, ఆ క్వార్టరే నాకు, నా కుటుంబానికి, ఆశ్రయమిచ్చింది. అనుబంధం మనిషికీ మనిషికీ మాత్రమే కాదని అప్పుడే నాకర్థమయింది.

స్టేషన్లో మాకు వీడ్కోలివ్వడానికి సహోద్యోగులు చాలామంది వచ్చారు. వారిలో ఎక్కువమంది తెలుగువారు, బెంగాలీలు. సహజమేకదా!

ఆరోజు విశేషమైనదే. కొన్నాళ్లుగా ఎండలు మండిపోతున్నాయి. ముందు రోజు రాత్రే వానపడి వాతావరణం చల్లబడింది. ఆ రోజు ఉదయమే రైల్వే పనివారలు సమ్మె విరమించిన వార్త వచ్చింది.

ట్రయిన్ అరగంట ఆలస్యంగా వచ్చి మిత్రుల వీడ్కోలుతో కదిలింది.

ఫస్ట్‌క్లాస్ కూపేలో లైటు వెలగడం లేదు. ట్రయిన్ కటక్ చేరుకున్నాక ఫిర్యాదు చేశాడు భూషణ్. మెకానిక్ వచ్చి చాలాసేపు కష్టపడి లైట్లు వెలగవనీ, కావాలంటే ఒక ఫ్యాన్ డిస్కనెక్టు చేసి ఆ లైను లైటుకిస్తాననీ అన్నాడు. గతిలేక అంతే చేయమన్నాం. అదీ మన ప్రయాణ సౌకర్య విశేషం.

ట్రయిన్ కుంటి నడక నడిచి మర్నాడు మధ్యాహ్నం పదకొండు గంటలకు మమ్మల్ని కలకత్తా చేర్చింది. భూషణ్ నన్ను ముందుగా తనకు తెలిసిన చిట్టగాంగ్ మెస్సుకు తీసుకుని వెళ్లాడు. ఆ మెస్సు వివరాలందరూ తెలుసు కోవాలి.

ఒకో గదిలో నాలుగు బెడ్లున్నాయి. మంచానికి అద్దె నెలకు పదిరూపాయలు. భోజనం నెలకు ఎనభై రూపాయలు. కలకత్తావంటి మహానగరంలో ఇటువంటి సదుపాయముండడం ఆశ్చర్యం. ఇందులో అందరికీ ప్రవేశం లేదనీ ఏదో ట్రస్టు దాన్ని నడుపుతోందనీ భూషణ్ అన్నాడు. ఒకపుడతడిందులోనే ఉండి చదువుకున్నాడుట. ఇప్పుడతడి స్నేహితులుంటున్నారు. అక్కడ మేము స్నానాలు ముగించుకుని లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ఆఫీసుకు వెళ్లాం. ఆ ఆఫీసులో పనిచేసే ఆడవారు భారతీయులైనా దుస్తుల్లో ప్రవర్తనలో యూరోపియన్స్‌ని అనుసరిస్తూ అసహ్యకరంగా ఎబ్బెట్టుగా అనిపించారు నాకు.

అక్కడ ఓ ఏజంటు సాయంతో పీ ఫారాలు పూర్తిచేసి రిజర్వు బ్యాంకుకు వెళ్లాం. అక్కడ అన్నయ్య నన్ను చూసి ఆశ్చర్యపడ్డాడు. తనకు క్లుప్తంగా వచ్చిన పని చెప్పాను.

అయితే రిజర్వు బ్యాంకులో మా పని కాలేదు. ఫైనాన్స్ మినిస్ట్రీ ఉత్తర్వు కాపీ రిజర్వుబ్యాంకు కలకత్తా బ్రాంచికి చేరలేదట. ఆ ఉత్తర్వుంటే తప్ప పీ ఫారం మీద వారి ఆమోద ముద్ర పడదట.

"మా లాబరేటరీకి ఆ ఉత్తర్వు వచ్చింది. ఎందుకైనా మంచిదని దాని ట్రూ కాపీ ఒకటి తెచ్చాం." అంటూ భూషణ్ అది చూపించాడు.

అక్కడి గుమాస్తా ఆ కాగితాన్నోసారి ఎగాదిగా చూసి "ట్రూ కా పీలు మేము నమ్మం. ఒరిజినల్ ఉండాలి" అన్నాడు.

"ఈ ట్రూ కాపీని సాక్షాత్తూ మా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు అటెస్టు చేశాడు. ఇంకా కావాలంటే ఇక్కడే మీ రిజర్వుబ్యాంకులోనే పనిచేస్తున్న మరో బాధ్యతగల ఆఫీసరు దాని విషయమై హామీ యిస్తాడు" అన్నాను నేను.

ఆ గుమాస్తా చిద్విలాసంగా నవ్వి - "అయ్యా! ఎవరు అటెస్టు చేసినా ట్రూకాపీ ట్రూకాపీయే కదా! మాకు ఒరిజినల్ కాపీ కావాలి. అది ఒకటి రెండు రోజుల్లో ఇక్కడకు పోస్టులో రావచ్చు. అది వస్తేనే మీ పని అవుతుంది. అది రాని పక్షంలో సాక్షాత్తూ దేశానికి ప్రధానిమంత్రి ఐన ఇందిరాగాంధీ అటెస్టు చేసినా ట్రూకాపీలను మేము పట్టించుకోము" అన్నాడు నిర్లక్ష్యంగా.

అక్కడ పని జరుగదని తెలిసిపోయింది. దేశం దాటి వెళ్లడానికి పీ - ఫారం చాలా ముఖ్యమైనది. నా చేతిలో ఫారిన్ రేఖ లేక ఈ ఇబ్బంది రాలేదు కదా అని భయపడ్డాను.

సాయంత్రం నేను, భూషణ్ విడిపోయాం. అన్నయ్యతో కలిసి ఇంటికి వెళ్లాను. వదిన నన్ను చూసి ఆశ్చర్యపడింది. అక్కడ అప్పుడే శ్రీమతి ఉత్తరం నాకోసం ఎదురుచూస్తోంది. అందులో మా ఫామిలీ ఫోటో ఉంది. అద్భుతంగా కనపడింది నాకు.

కలకత్తాలో మూడురోజులున్నాను. ఫైనాన్స్ మినిస్ట్రీ ఉత్తర్వక్కడి రిజర్వ్ బ్యాంకు ఆఫీసుకు రాలేదు. ఢిల్లీ వెళ్లి సీయస్సయ్యారాఫీసు నుంచి ఓ ఒరిజినల్ కాపీ తీసుకుని అక్కడి రిజర్వ్ బ్యాంక్‌లో ఆ పని పూర్తి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. అన్నయ్య మిత్రులు ఢిల్లీలో మాకు సాయపడగల వారి చిరునామాలిచ్చారు. కలకత్తా లుఫ్తాన్సా వారు ఢిల్లీ లుఫ్తాన్సా వారికి మా సమస్య గురించి టెలెక్స్ సందేశంలో మాకు సాయపడమని చెప్పారు.

రిజర్వుబ్యాంకులో పనిచేస్తూ పీ ఫారం విషయంలో నాకు సాయపడలేని తన అసహాయతకు అన్నయ్య చాలా బాధపడ్డాడు.

అన్నయ్య, వదిన నాతోపాటు ఢిల్లీ వస్తామన్నారు. అందర్నీ వదిలి యుద్ధానికి పోతున్న వాడి అనుభూతి నా మొహంలో చూసి వాళ్లలా అని ఉండొచ్చు. వాళ్లలా అనగానే నాకు కొండంత ధైర్యం వచ్చింది.

ఒక్కరోజులో బట్టలు కుట్టిచ్చే ఓ టైలరింగ్ షాపులో రెండు ఉలెన్ పాంట్లు కుట్టించుకున్నాను. జర్మనీలో క్షౌరం చాలా ఖరీదని విన్నాను కాబట్టి బయల్దేరే ముందు జుత్తు పొట్టిగా ఉండేలా క్షౌరం చేయించుకున్నాను.

ఢిల్లీ ప్రయాణం చాలా సుఖంగా జరిగిపోయింది. అన్నయ్య వదిన ఒక రోజు ఢిల్లీ నగర సందర్శనం చేశారు. నేను, భూషణ్ ఢిల్లీ లుఫ్తాన్సా ఆఫీసుకు వెళ్లాం. అక్కడ పీ - పారం పని పూర్తయింది. విమానం టికెట్సు కూడా రెడీ అయ్యాయి. టిక్కెట్ రాసే అతను మమ్మల్ని వెజిటేరియనా, నాన్ వెజిటేరియనా అనడిగాడు.

నేను వెజిటేరియన్. భూషణ్ నాన్ వెజిటేరియన్.

అప్పుడే విమానం ఎక్కుతున్నట్లూ నేనూ, భూషణ్ విడిపోతున్నట్లూ ఫీలయ్యాను.

ఆ రోజు రాత్రి ఢిల్లీ రైల్వే స్టేషన్ రిటైరింగ్ రూంలో భూషణ్ నా అలవాట్లను ఖండిస్తూ - "ఇవే అలవాట్లు మీ వాడు ఫారిన్లో కొనసాగిస్తే ప్రాణాలక్కూడా ప్రమాదం. నేను చెబితే వినడం లేదు. మీరైనా నచ్చచెప్పండి." అని అన్నయ్య వదినలకు చెప్పాడు. వాళ్లిద్దరూ హడలిపోయి "తప్పమ్మా - ఆ భూషణ్ చెప్పినట్లు వినమ్మా" అన్నారు ఏక కంఠంతో.

"తప్పకుండా వింటాను" అన్నాను వినడం మాత్రమే కదా అని.

అన్నయ్య, వదినలతోపాటు భూషణ్ కూడా సంతోషించాడు.

మర్నాడుదయం మాకు డాడ్ ఆఫీసులో వీడ్కోలు విందు ఏర్పాటు చేయబడింది. డాడ్ డైరెక్టరయిన ఆమె రెండు నెలల సెలవు మీద తన ఊరు వెడుతోంది. ఆమె మాతోనే ప్రయాణం చేస్తుంది.

జర్మనీ పరిస్థితులు ఇండియా వాతావరణానికి భిన్నం కాబట్టి ఎవరికే సందేహాలున్నా అడగమన్నారు. ఢిల్లీ డాడ్ ఆఫీసు ఉద్యోగస్థులు. అక్కడ సీయస్సయ్యారు వాళ్లే కాక, యూనివర్సిటీలు, డిఫెన్సు లాబరేటరీస్ వగైరా వివిధ సంస్థలకు చెందిన వారు మొత్తం ముప్పై మంది దాకా ఉన్నారు.

అప్పుడు ఢిల్లీలో ఎండలు మండిపోతున్నాయి. అందువల్ల కాబోలు ఒక జర్మనీ వనిత - "మీరు చలి విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. టెంపరేచర్ ఇప్పుడు ఏకంగా ఇరవై డిగ్రీలుంది. దట్టమైన ఉలెన్ స్వెటర్లుంచుకోండి" అంది.

ఇరవై డిగ్రీలనగానే ఆమె అలాగనడం నాకాశ్చర్యం కలిగించింది. భువనేశ్వర్‌లో నా లాబరేటరీలో నాకో ఎయిర్ కండిషన్డ్ రూముంది. అందులో శీతాకాలం టెంపరేచరు ఒకోసారి పద్దెనిమిది డిగ్రీల వరకూ వస్తుంది. అందులో నేనెప్పుడూ స్వెట్టరు కూడా వేసుకోలేదు. ఒకసారి బెంగుళూరు వెడితే అక్కడ చలిగా ఉన్నా స్వెట్టర్లేకుండానే తిరిగాను. టెంపరేచరు పన్నెండు డిగ్రీలని చెప్పుకున్నారు. అలాంటప్పుడు ఇరవై డిగ్రీలని అంత విశేషంగా ఎందుకు చెప్పిందీ అని ఆలోచించి అతి తెలివి పనిచేయగా "ఇరవై అంటే మైనస్ ఇరవైయా?" అనడిగాను.

ఆమె నా వంక ఓరి అమాయకుడా అన్నట్లు చూసి "మైనస్ ఇరవై అయితే మిమ్మల్నక్కడికిప్పుడు పంపిస్తామా? అసలు మాకే కష్టం" అంది.

ఢిల్లీ ఎండల కామెకు మతిపోయి ఇరవై డిగ్రీలకే మమ్మల్ని భయపెడుతోందని నాకనిపించింది. అదీకాక ఫారినర్సు జీవిత విధానంలో అతిశయోక్తులెక్కువ.

విందైనాక నేను హడావుడిగా అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బ్యాంకుకు వెళ్లి రూపాయలిచ్చి విదేశీ మారకద్రవ్యం కొన్నాను. జర్మనీలో మార్కులు కాబట్టి అవే తీసుకున్నాను. వంద మార్కులు డ్రాఫ్టు రూపంలోనూ, ఇరవై మార్కులు క్యాషుగానూ ఇచ్చాడు. విదేశీ కరెన్సీ చేతిలో ఉంటే విచిత్రంగా అనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నం నేను ఢిల్లీలో ఉలెన్ స్వెట్టరు కొన్నాను. సెలక్షన్ భూషణ్‌ది. జీవితంలో నేను కొన్న మొదటి స్వెటరది.

అన్నీ కొని నాలికబద్ద విషయం మరిచిపోయాను. జర్మనీ భాషలో నాలికబద్దనేమంటారో తెలియదు. అదక్కడ దొరికేదీ దొరకనిదీ తెలియదు. నా నాలికబద్ద విరిగిపోయింది. అందువల్ల అన్నయ్య కూతురికో రాగి నాలికబద్ద ఉంటే తీసుకున్నాను. తన నాలికబద్ద ఫారిన్ వెడుతోందని సంబరపడిందది.

ఢిల్లీలో చెప్పలేని ఎండలు. అయితే అక్కడ ఐస్‌వాటర్ రోడ్ల మీద అమ్ముతున్నారు. గ్లాసు అయిదుపైసలు. చల్లటి నీళ్లంటే నాకు ప్రాణం. చాలా గ్లాసులు తాగాను. అన్నయ్య భోజనం, టిఫిను సౌతిండియా హోటలే కావాలనేవాడు. ఢిల్లీ మహానగరంలో వాటిని పట్టుకోడానికి శ్రమ అయ్యేది.

మాతోపాటే తిరుగుతున్న భూషణ్ - "చిన్నపిల్ల, ఆడవాళ్లను బాధపెట్టడం దేనికి? ఓ పూటకు ఏదో చోట ఏదో ఒకటి తినేద్దాం" అన్నాడు అన్నయ్యతో.

"మా గురించి కాదు బెంగ. ఏమైనా తింటాం మేము. నా తమ్ముడికీ ఒక్క రోజైనా ఇష్టమైనవి తినే అవకాశమిద్దామని" అన్నాడు అన్నయ్య.

భూషణ్ నా వైపు నిష్ఠూరంగా చుసి "నీ మూలంగా చిన్నపిల్ల కూడా శ్రమపడుతోంది" అన్నాడు.

నా మనసు చివుక్కుమంది - "నాకేమీ హితవే లేవు. నా కోసమే అయితే భోజనానికింతలా తిరగొద్దు" అన్నానన్నయ్యతో. నాకేమీ హితవులేని మాట నిజం.

"భూషణ్ మాటలకు నొచ్చుకోకు. మాకేమీ శ్రమలేదు. ఈ ఒక్కరోజూ నీక్కావలసినవి తింటే మాకదో తృప్తి" అంది వదిన. అన్నయ్య వంక తిరిగి "అసలే అతడికి మన బాబి అలవాట్లు నచ్చవు. మీరతడితో అలా మాట్లాడకండి" అంది.

నేను అతిగా ఐస్ వాటర్ తాగుతున్నందుక్కూడా భూషణ్ నన్ను అతిగా మందలించాడు. వదినక్కాస్త కోపం కూడా వచ్చింది. నేను భూషణ్ తత్వమే అంత అని ఆమెకు నచ్చ చెప్పాను.

మా విమానం బయల్దేరే టైము మర్నాడు తెల్లవారు ఝామున నాలుగు గంటల అయిదు నిముషాలు. పాలం విమానాశ్రయం ఊరికి చాలా దూరంలో ఉంది. అర్ధరాత్రి వేళ సామానుతో టాక్సీలో బయల్దేరి వెళ్లడం మంచిది కాదని చాలామంది అన్నారు. విమానాశ్రయం చేరుకుందుకు లుఫ్తానా వారేమీ ఏర్పాట్లు చేయడం లేదు. ఇండియన్ ఎయిర్‌లైన్సు వ్యానుంటుందనీ అందులో ప్రయత్నించమనీ వారు చెప్పారు. అదృష్టవశాత్తూ అందులో మాకు సీట్లు దొరికాయి. శ్రమ అని చెప్పినా వినకుండా అన్నయ్య, వదినలు విమానాశ్రయానికి వస్తామన్నారు నాతో.

రాత్రి పదిగంటల ప్రాంతంలో వ్యాను విమానాశ్రయానికి బయల్దేరింది. అందులో ఎక్కే ముందే నేను ఉలెన్ పాంటూ, పొడుగు చేతుల చొక్కా, జర్మనీ కోసమని ప్రత్యేకంగా కొనుక్కున్న కొత్త షూ వేసుకున్నాను. ఉలెన్ స్వెటరు భుజం మీద వేసుకున్నాను. ఎందుకంటే విమానంలోనే చలిగా ఉంటుందని కొందరన్నారు. బయల్దేరే ముందే సూట్‌కేసు బరువు చూసుకుంటే పదమూడు కేజీలుంది. నా లక్కీ నెంబరు వచ్చినందుకూ, బరువు ఇరవై కేజీలు మించనందుకూ చాలా సంతోషించాను. ఇరవై కేజీలు దాటితే పైన ప్రతి కిలోకూ అరవై డెబ్బైరూపాయల ఛార్జి అవుతుంది.

పాలం ఎయిర్ పోర్టు చూడడం అదే ప్రథమం. అసలు నేను చూసిందే ఒక్క భువనేశ్వర్ ఎయిర్‌పోర్టు. అది చాలా చిన్నది, చాలా తక్కువ మంది జనం ఉంటారు. ఈ విమానాశ్రయం చూడ్డానికి గొప్పగా లేదు కానీ జనం నేల ఈనినట్లుగా ఉన్నారు.

విమానంలో మాతోపాటు వచ్చే డాడ్ స్కాలర్సు కొందరు మేమెక్కిన ఇండియన్ ఎయిర్ లైన్స్ వ్యానులో ఎక్కివచ్చారు. వారిలో ఒకతను ఫుల్ సూట్లో ఉన్నాడు. వదిన అతడ్ని చూసి నవ్వాపుకోలేకపోయింది. పరీక్షించి చూస్తే, అతడప్పుడే చలికి వణుకుతున్నాడు కూడా.

నేను వేసుకున్న పొడుగు చేతుల చొక్కాయే ఢిల్లీ ఉక్కకు నన్నిబ్బంది పెడుతోంది. చేతులు మడిచేశాను. అలాంటిదతడు ఫుల్‌సూట్లో ఎలా ఉండగలిగాడో!

"శరీరానుభూతులు మనసును బట్టి వస్తాయి. ప్రపంచంలో అన్నింటికీ మించిన వేగం మనసుది. అతడి మనసప్పుడే జర్మనీ చేరినట్లుంది" అన్నాడన్నయ్య.

ఎయిర్‌పోర్టు చేరుకున్నాక అతణ్ణి చూడడం ఒక కాలక్షేపం మాకు. అక్కడ రకరకాల వింతమనుషులు. విమానమెక్కేవారంతా ఆధునికులనుకుంటే అది పొరపాటు. కొందరు చూడ్డానికే మరీ పల్లెటూరి వారిలా ఉన్నారు. ఒకరిద్దరి వద్ద గుడ్డ మూటలు కూడా ఉన్నాయి. వాళ్లు లండన్‌లో పనిచేసే భారతీయుల బంధువులని తెలిసింది.

భారతీయులే కాదు. విదేశీయులూ అలాగే ఉన్నారు. ఒక విదేశీయుడు అతుకుల గుడ్డ పాంటు వేసుకున్నాడు. తల జడలు కట్టేసింది. చొక్కాలేదు. వళ్లు మాత్రం తెల్లగా మెరిసిపోతోంది. అయినా మనిషి బికారిలా ఉన్నాడు. అతడు మా పక్కనుంచి వెడితే భరించలేని వాసన గుప్పుమంది. అతడు మనదేశపు ఉక్క భరించలేక అలా ఉన్నాడన్నాడన్నయ్య. అప్పుడే ఫుల్‌సూట్ డాడ్ స్కాలర్ మమ్మల్ని దాటుకుంటూ వెళ్లాడు. అన్నయ్య అతడ్నోసారి పలకరించాలని మనసు పడ్డాడు కానీ జర్మన్ భాష మాట్లాడతాడేమోనని భయపడ్డాడు.

అక్కడ తిరుగుతున్న వారిలో ఒక భారతీయ వనిత ఉంది. ఆమె ఎంతో అందంగా ఉంది. చక్కగా చీర కట్టుకుంది. అంత చక్కటి ఆమె సిగరెట్ కాలుస్తోందని వదిన బాధపడింది. ఆమె షోగ్గా సిగరెట్ కాల్చడమే కాక - దమ్ము పీల్చినప్పుడల్లా తృప్తితో కూడిన ఆనందం పొందుతోంది.

"మనదేశంలో ఇది అరుదైన దృశ్యం. ఫారిన్లో ఆడాళ్లు సిగరెట్లు కాలుస్తారు. ఆల్కహాల్ పుచ్చుకుంటారు" అన్నాడన్నయ్య.

నేను వెడుతున్నదో కొత్త సంస్కృతి గల దేశానికని మరోసారి నాకు స్ఫురించింది. ఎయిర్‌పోర్టులో ఫారిన్ ఎక్స్‌ఛేంజి కౌంటర్లో నా టిక్కెట్టూ, పాస్‌పోర్టూ చూపించగా రూపాయలు తీసుకుని ఎనిమిది డాలర్లు ఇచ్చాడు. విదేశాలు వెళ్లేవారి కది మాములు. 'ఎరౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిట్ డాలర్స్' అన్న పాట గుర్తుకు వచ్చింది. నిజానికా డబ్బక్కడ ఏమూలకీ?

విమానాశ్రయంలో పోస్టాఫీసుంది. ఇంటికో ఉత్తరం రాసి పోస్టు చేశాను. అంతవరకూ నేను చేసిన రైలు ప్రయాణ వివరాలూ, రసీదులూ రిజిస్టర్డు పోస్టులో భాస్కర్‌కు పంపేశాను. అతడవి ఆఫీసులో ఇవ్వాల్సి ఉంది. నా జేబులో ఉన్న రూపాయి నోట్లు, చిల్లర అంతా అన్నయ్యకిచ్చేశాను. కొద్దిసేపట్లో ఆ డబ్బుకు నా దగ్గర విలువుండదు.

విమానం తెల్లవారు ఝామున కావడం వల్ల మాకెవరికీ సరైన నిద్రలేదు.

రాత్రి ఒంటిగంట ప్రాంతాల సెక్యూరిటీ చెకింగ్‌కు పిలుపు వచ్చింది. అంతకు ముందే నా సూట్‌కేసు విమానాశ్రయంలోని లుఫ్తాన్సా ఆఫీసుకు అందజేశాను.

నా స్వెట్టరు వదినకిచ్చి సెక్యూరిటీ చెకింగుకు వెళ్లాను. అక్కడ ఓసారి వళ్లంతా తడిమి చూసి ఓ గదిలో కూర్చోమన్నారు. ఇప్పట్నించీ ఏం కూర్చుంటామని నేను బయటకు రాబోయాను. అక్కడున్న సెక్యూరిటీగార్డు నన్నాపి బయటకు వెళ్లడానికి వీల్లేదన్నాడు. సెక్యూరిటీ చెకింగయ్యాక బయటకు వెళ్లడానికి వీల్లేదట. విమాన ప్రయాణానికి సంబంధించి బొత్తిగా ప్రాథమిక జ్ఞానంలేని నేను దెబ్బతిన్నాను. ఇంకా అన్నయ్య, వదినలతో చాలా మాట్లాడాలి. నా స్వెట్టరు కూడా వారి వద్ద ఉండిపోయింది.

"ఎప్పుడో నాలుగు గంటలకు వెళ్లే విమానానికిప్పట్నించీ సెక్యూరిటీ చెకింగ్ ఏమిటి?" అని నేను సెక్యూరిటీ ఆఫీసర్నడిగాను.

"అలా అనుకుంటే మీరు కాస్త ఆలస్యంగా రావలసింది. మూడున్నరదాకా సమయముంది" అన్నాడు ఆ ఆఫీసరు.

నేనా ఆఫీసర్ని బ్రతిమాలసాగాను. నాకీ విషయం తెలియదనీ, అవతల ముఖ్యబంధువులు నాకోసం ఎదురు చూస్తున్నారనీ నన్ను బయటకు వెళ్లనిమ్మని అతడ్ని కోరాను. కాసేపటికతడు కరిగి "రూల్స్ పర్మిట్ చేయవు. మీ పాస్‌పోర్టు చూడడం అయింది. అన్ని చెకింగ్స్ అయ్యాయి. సెక్యూరిటీ చెకింగ్ మీకు అయిపోయింది. అయినా నా పర్సనల్ రిస్కుమీద మిమ్మల్ని వెళ్లనిస్తున్నాను" అన్నాడు.

అతడి సహృదయతకు మనసులో కూడా ధన్యవాదాలర్పించుకుంటూ నేను కదలబోతూండగా మరొకతడు ఆ ఆఫీసరు దగ్గరకు వచ్చాడు. అతడి పేరు సుందరం. తెలుగు వాడు. నాకులాగే డాడ్ స్కాలర్ అతడిదీ నా పరిస్థితే. నేను సెక్యూరిటీ ఆఫీసరుతో మాట్లాడడం విని అతడూ బయటకు వచ్చాడు. ఆఫీసరతడికీ అనుమతినిచ్చాడు.

నేను వెళ్లేసరికి అన్నయ్య, వదినలు ఊరికే కంగారు పడిపోతున్నారు. భూషణ్ వదిన వాళ్ళని నా గురించడిగి "సెక్యూరిటీ చెకింగ్‌కి అప్పుడే ఎందుకెళ్లాడూ? ఇంక మీరతడ్ని చూడడం కుదరదు. నన్నడిగి వెళ్లాల్సింది. ఇప్పుడేమనుకుని లాభం? ఆ స్వెట్టరు నేను వెళ్లేటప్పుడిస్తాను ఇలాగివ్వండి" అన్నాడుట.

"అతడలాగంటే చాలా కంగారు పడ్డాం. అమ్మయ్య - నువ్వొచ్చేశావు" అంది వదిన.

"భూషణ్ చెప్పింది నిజమే!" అంటూ జరిగింది చెప్పాను నేను. భూషణ్ బంధువులు కొందరు పూర్వపు తూర్పు పాకిస్తాన్లోనూ, ఇప్పటి బంగ్లాదేశ్‌లోనూ ఉన్నారు. అందువల్ల అతడికి విమాన ప్రయాణంలో పూర్వానుభవముంది. ఈ విషయంలో ముందే అతణ్ణి అడిగి ఉండాల్సింది. సెక్యూరిటీ చెకింగవగానే - ఆ పని ముగించుకుని వచ్చి తీరిగ్గా మా వాళ్లతో కబుర్లు చెప్పుకోవచ్చుననుకున్నాను. అదీ నా తెలివి.

కాసేపటికి భూషణ్ అక్కడికి వచ్చి నన్ను చూసి ఆశ్చర్యపడ్డాడు. జరిగింది చెప్పాను. నేను బయటకు రాగలగడం అతడికి నచ్చలేదు. నా కోసం ఎంతో కష్టపడి ఇంత దూరం వచ్చిన అన్నయ్య, వదినలను వదిలి అలా వెళ్లడం బాగోలేదని అతడు మందలించాడు. నాకు తెలియదంటే నన్నడగవలసిందన్నాడు. అది పొరపాటేనని ఒప్పుకున్నాను. అయినా నన్ను క్షమించకుండా తిడుతూనే ఉన్నాడతడు. చివరకి నా సహనం నశించి "చూడు డాక్టర్ భూషణ్! నా అన్నా, వదినలను నేను నీకంటే ఎక్కువగా అభిమానించడంలేదని నీ అభిప్రాయమా? నేను కావాలనే సెక్యూరిటీ చెకింగ్‌కు వెళ్లానంటావా? లేకుంటే పొరపాటొప్పుకున్నా కదా - ఇంకా నన్ను వదలవే. ఆ సెక్యూరిటీ ఆఫీసరే నా పొరపాటు మన్నించాడు. నువ్వు మన్నించవేం" అన్నాను.

ఏమనుకున్నాడో అతడింకేమీ మాట్లాడలేదు. నేను నొచ్చుకున్నా ఫరవాలేదు, కానీ అతణ్ణి నొప్పించానేమోనని భయం వేసింది. కొన్ని విషయాల్లో నాకు లోకజ్ఞానం తక్కువైనట్లే, కొన్ని విషయాల్లో అతడికి లౌక్యం తక్కువ. నా క్షేమాన్ని కోరుతున్నాననుకుంటాడు తప్ప సిల్లీగా వ్యవహరిస్తున్నానని అతడనుకోడు.

అప్పుడు నాకు కలకత్తా రోడ్లపైన అతడు నన్ను చేయి పట్టుకుని రోడ్డు దాటించడం గుర్తుకొచ్చింది. ఒకసారి నేను రోడ్డు దాటుతుంటే - సిటీలో ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. రోడ్డుకి అడ్డంగా జీబ్రాచారలుంటాయి. అక్కడే దాటాలి అని ఆపాడు. అలాగని మరోసారి రోడ్డు దాటడం కోసం జీబ్రాచారలున్న వైపు వెడుతూంటే "మనకున్న టైము తక్కువ. జీబ్రాచారలున్న చోటే రోడ్డు దాటాలనుకుంటే - మన సమయమంతా రోడ్లమీదే సరిపోతుంది" అని మందలించాడు. అతణ్ణి గుడ్డిగా అనుసరించాలి. లేదా నొప్పించాలి. అప్పుడు మొదటిదే చేశాను.

మెత్తం మీద నేను బయలుదేరే క్షణం వచ్చింది.

అప్పుడన్నయ్య, వదిన కూడా నిద్రపోతున్నారు.

లుఫ్తాన్సా డి.సి 10లో ప్రయాణం చేయవలసినవారు సెక్యూరిటీ చెకింగ్ నుంచి బయలుదేరవలసి ఉంది. టైము మూడున్నరయింది. అన్నయ్యను, వదినను నిద్రలేపాను.

"వెడుతున్నాను" అన్నాను. నా గొంతు రుద్ధమయింది.

"వెడుతున్నాను కాదు. వెళ్లొస్తానను" అంది వదిన. ఆమె గొంతు రుద్ధమైంది.

"వెళ్లొస్తాను.."

"వెళ్లగానే ఉత్తరం రాయి.." అన్నాడు అన్నయ్య.

"నువ్వు జర్మనీ ఎనిమిది గంటల్లో చేరతావు. అప్పటికి మేమింకా ఢిల్లీలోనే ఉంటాం. మా ట్రయిన్ సాయంత్రం" అంది వదిన.

వాళ్లిప్పుడు పేరవరం వెడుతున్నారు.

"నేను క్షేమంగా విమానమెక్కానని చెప్పండి" అన్నాను.

"మీ ఆవిడ, పిల్లల గురించి బెంగ పెట్టుకోకు. నేనున్నానని గుర్తుంచుకుని నిశ్చింతగా ఉండు" అంది వదిన.

"భూషణ్ సలహాలు మరిచిపోకు" అన్నాడన్నయ్య.

నేను చటుక్కున భూషణ్ వంక తిరిగి అతడి చేయి పట్టుకుని "ఇంతవరకూ నువ్వెన్నో విధాల నాకు సాయపడ్డావు. నీ మేలు మరువలేను. నీ మనసుకేదైనా కష్టం కలిగించి ఉంటే మన్నించు" అన్నాను.

"నేనూ అదే చెప్పాలనుకుంటున్నాను" అన్నాడు భూషణ్ అభిమానంగా.

"వస్తానన్నయ్యా - వస్తానొదినా!" అంటూ కదలడానికి ప్రయత్నించాను. కాళ్లు సహకరించ లేదు. అన్నయ్య కూతురప్పుడే నిద్రలేచి నాకు టాటా చెప్పింది.

వదిన కళ్లు తుడుచుకుంది. అన్నయ్య దిగులుగా చూశాడు. అక్కడున్న ఓ ముసలాయన అన్నయ్య భుజం తట్టి "మీ వాడెక్కడకు వెళ్లాలేమిటి బాబూ - అంత దిగులుగా ఉన్నారు?" అన్నాడు.

"ఫారిన్ వెళ్లాలండి" అన్నాడు అన్నయ్య నా వైపే చూస్తూ.

నా కళ్లలో నీళ్లున్నాయి కానీ తుడుచుకోలేదు. కాళ్లు ముందుకి చూపులు వెనక్కి.

మనసు నిండా దిగులు. ఏదో పోగొట్టుకుంటున్నట్లు దేనికో దూరమైపోతున్నట్లు... అనుభూతి.

ఒకటి కాదు, రెండు కాదు - పదహారు నెలలు!

కోరి తెచ్చుకున్న విరహమిది.

కథాప్రారంభం

న్యూఢిల్లీ విమానాశ్రయం సెక్యూరిటీ హాల్లో నేను, నాలాంటి మరికొందరు సైంటిస్టులు కూర్చుని ఉన్నాం. అందరి ముఖాల్లోనూ ఏదో ఉద్వేగం. వాళ్లని చూస్తుంటే వాళ్లు వాళ్లులా కాక నా ప్రతిబింబాల్లా అనిపించారు. ఆ ప్రతిబింబాల్ని అసలు మనుషులుగా మార్చుకుందుకు నా మెదడు కొంచెం శ్రమపడింది.

అప్పుడు నేను గుర్తించిన మొదటి మార్పు – భూషణ్ నా పక్కన లేడు. నాకు కాస్త దూరంగా మరెవరి పక్కనో ఉన్నాడు. నా పక్కన కూర్చున్నది సుందరం.

సుందరం తెలుగువాడు. ఆ ఒక్క కారణంగా అప్పుడతడు ఆత్మీయుడనిపించింది. నా మనోభావాలు నా భాషలో ప్రకటించుకునే అవకాశమింకా నాకున్నదన్న గ్రహింపు నాకెంతో ధైర్యాన్నిచ్చింది.

అంతలో ఏదో చప్పుడు వింతగా, కొత్తగా!

ఆస్ట్రేలియానుంచి హాంగ్కాంగ్ మీదుగా బయల్దేరిన లుఫ్తాన్సా డిసి 10 విమానం వచ్చి ఆగిన చప్పుడది. అలాంటి శబ్దాన్ని ఇదివరలో ఎన్నోమార్లు ఎక్కడెక్కడో విని ఉన్నాను. కానీ ఈ శబ్దానికో ప్రత్యేకత ఉంది. ఈ శబ్దం నన్ను పిలుస్తోంది. కాసేపటికి నేనూ ఈ శబ్దంలో భాగమౌతాను.

సెక్యూరిటీ చెకింగ్ మొదలైంది. సెక్యూరిటీ ఆఫీసర్ ఒకతన్ని సోదా చెయ్యగా చాకు ఒకటి కనబడింది.

"అది పళ్లు కోసుకునేది. తాళంచెవులగుత్తితోపాటు ఉంది" అన్నాడతను భయంభయంగా చూస్తూ.

సెక్యూరిటీ ఆఫీసరు ఆ చాకునీ అతన్నీ మార్చిమార్చి చూశాడు. 'దాంతో గొంతులూ కోయొచ్చు' అంటే ముందు అతనే వణికిపోయి మూర్ఛపోతాడనిపించినట్లుంది. ఆఫీసర్ అదోలా నవ్వి, ఆ చాకు అతనికి ఇచ్చేశాడు.

"హైజాకింగ్లు పెరిగిన ఈ రోజుల్లోనూ మన సైంటిస్ట్ల మొహాలు చూస్తే – దగ్గర పిస్టలున్నా వదిలేస్తారీ సెక్యూరిటీ ఆఫీసర్లు" అన్నాను సుందరంతో.

సుందరం నవ్వాడో లేదో, మొహంలో ఉద్వేగం ఇతర భావప్రకటనల్ని కమ్మేసింది. అతనికీ అది తొలి విమాన ప్రయాణమే – అదీ పాశ్చాత్యదేశానికి!

అందరం వెయిటింగ్ హాల్నించి బయటపడ్డాం. విమానం దగ్గరకి తీసుకు వెళ్లడానికి బస్సు ఒకటి సిద్ధంగా ఉంది. ప్రయాణీకులంతా అది ఎక్కాం. ఆ క్షణంలో ఎవరి ధ్యాసవారిదే! ఇతరుల సంగతి గుర్తులేదు.

బస్సు విమానం దగ్గర ఆగింది. మేము బస్సు దిగి ఫ్లైట్ బోర్డింగ్ నిచ్చెన ఎక్కాం.

తొలిసారిగా విమానం లోపల అడుగు పెట్టానేమో, అదోరకమైన వింత అనుభూతి కలిగింది.

అమృత పానమున గగనయానమున

లుఫ్తాన్సా డిసి 10 విమానం. అప్పుడున్న అధునాతన విమానాల్లో ఒకటి. మాది ఎకానమీ క్లాసు. అదే అద్భుతంగా ఉంది. ఇంకా ఫస్టుక్లాసొకటుందిట. అదెలాగుంటుందో మరి!

విశాలంగా ఉంది. ఇంపైన పరిమళం. బయటకులా ఉక్క లేదు. చల్లగా హాయిగా ఉంది. పొగ తాగేవారికి వేరే కంపార్టుమెంట్ ఉంది. నేను పొగత్రాగని వారి కంపార్టుమెంట్లో ఉన్నాను.

అంతవరకూ పక్కనమాత్రమే లేడనుకున్న భూషణ్ – ఇప్పుడు కంపార్ట్మెంట్ కూడా మారాడు. లోపల చాలా సీట్లు కాళీగా ఉన్నాయి. నాది కిటికీ పక్క సీటు. సుందరం నా పక్కనే కూర్చున్నాడు.

విమానం బయల్దేరుతుందట. ప్రయాణీకులు బెల్టులు బిగించుకోవాలని హెచ్చరిక వినబడింది స్పీకర్లో. అది వింటుంటే భయమేసింది. విమానం కదిలేటప్పుడు బెల్టు కట్టుకుని తీరాలని – ఓ అనుభవజ్ఞుడు నన్ను భువనేశ్వర్లో పదేపదే హెచ్చరించాడు. కానీ ఇప్పుడా విషయం మర్చిపోయాను. స్పీకర్లో హెచ్చరిక విని ఉండకపోతే ఏమైపోయేవాణ్ణో అనుకుంటూ బెల్టు కట్టుకున్నాను. నాతోపాటే డిటో భావాలతో సుందరమూనూ.

లుఫ్తాన్సా ఎయిర్ హోస్టెస్ యూనిఫాం రంగు పసుపు కాబోలు. మిసమిసలాడే ఆ పడుచులకా రంగు బట్టలెంతో అందాన్నిచ్చాయి. విమానం కదిలేముందే స్పీకర్లో మరో హెచ్చరిక: లోపల గాలి ఒత్తిడి బాగా తగ్గిస్తారు, కాసేపు మాటలు సరిగా వినిపించకపోతే కంగారు పడొద్దని. ఈలోగా ఎయిర్ హోస్టెస్ వచ్చి నాకూ సుందరానికీ చెరో చిన్న పొట్లం ఇచ్చింది. చాక్లెట్టేమో అనుకుని చింపి చూశాం.

తెల్లగా ఉంది. తినే పదార్థంలా లేదు. ఏమిటా అని నేనాలోచిస్తుండగా, "దూది" అన్నాడు సుందరం.

నిజమే – అది దూదే! కానీ మాకిప్పుడు దూదితో ఏంపని?

నేను సుందరంవంక చూస్తే, అతను మరోపక్కకి చూశాడు. ఎటుచూసినా పక్కకు తిరిగిన తలలే కనిపిస్తున్నాయి. ఒకవేళ ఎవరైనా ఇటు తిరిగినా, వాళ్లలో నా ప్రతిబింబమే కనబడుతోంది.

"నేనిప్పుడు సైంటిస్టు రావుని కాదు. బారిస్టరు పార్వతీశం ఐపోయాను! ఈ దూదిని ఏంచేద్దాం?" అన్నాను సుందరంతో.

సుందరం నవ్వి, "దూదికదా, పోనీ చెవిలో పెట్టుకుందాం" అన్నాడు.

అప్పటికే మాటలు సరిగ్గా వినిపించడం లేదు. కానీ అతను చెవిలో దూది పెట్టుకోవడం చూసి, ఆ మాటల్ని ఊహించుకున్నాను. నేనూ దూదిని చెవిలో పెట్టుకున్నాను. మమ్మల్ని చూసి మరికొందరు అలాచేశారు.

దూది చెవిలో ఉంచుకుంటే కొంచెం హాయిగానే ఉంది. మేము చేసింది సరైనదేనని తరువాత తెలిసింది.

తెల్లవారుఝామున సరిగ్గా నాలుగు గంటల అయిదు నిముషాలకు విమానం కదిలింది. కిటికీలోంచి కిందికి చూస్తున్నాను. అన్నయ్య, వదిన ఒక్కసారి కనబడితే బాగుండుననిపించింది. కానీ అదేమన్నా రైల్వే ప్లాట్ఫారమా – ఎయిర్పోర్ట్లో రన్వే. ఎవ్వరూ కనబడలేదు.

విమానం రన్వే మీద నెమ్మదిగా కదిలి వేగం పుంజుకుని పెద్ద శబ్దం చేస్తూ గాలిలో తేలింది.

చూడ్డంవల్ల ఎగిరినట్లు తెలిసింది కానీ, ఎగిరేటప్పుడు ఏ కుదుపూ లేదు.

కాసేపటికి విమానం లోపల గాలి ఒత్తిడి పరిస్థితి మెరుగైంది. చెవిలో దూది ఉన్నా కూడా మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి. అప్పుడు నేను, సుందరం దూది తీసేశాం. మాతోపాటే చాలామంది తీసేశారు.

స్పీకర్లో ప్రయాణీకులకు స్వాగతం పలుకులు వినబడ్డాయి. కొత్త కదా – ఆత్రుతగా, శ్రద్ధగా విన్నామవి.

మా విమానం థార్ ఎడారి, కరాచీ, టెహరాన్, అంకారా, ఇస్తాంబుల్, సోఫియా, ఆల్ప్ పర్వతాలు మీదుగా పయనించి ఫ్రాంక్ఫర్ట్ నగరం చేరుకుంటుందట. భూమికి నలభైఅయిదువేల అడుగుల ఎత్తున గంటకు అయిదొందల ముప్పైమైళ్ల వేగంతో పయనిస్తుందిట. మొత్తం నాలుగు వేల రెండు వందల మైళ్ల ప్రయాణానికి సుమారు ఎనిమిది గంటలు పడుతుందిట.

విమానంలో టెలివిజనుంది. టెలివిజన్ గురించి వినడమే కానీ మాకది కొత్త. అందులో సంగీత కార్యక్రమాలు చూడొచ్చు, వినొచ్చు. వినడానికి ప్రతి సీటు వద్దా ఇయర్ ఫోన్ ఏర్పాటుంది.

అంతలో ఒక పురుషుడు, ఒక మహిళ వచ్చి – ప్రయాణీకుల ముందు నిలబడి విన్యాసాలు మొదలెట్టారు. వాళ్లేమేమో మాట్లాడుతున్నారు కానీ, రాత్రి తెల్లవార్లూ నిద్రలేక మెదడు మొద్దుబారి ఉంది. ఒక్క ముక్క కూడా బుర్రకెక్కలేదు. టెలివిజన్మీద ఆసక్తి లేనివారికి వినోద ప్రదర్శన కాబోలు అనుకున్నాను.

చాలా తొందరగానే ముగిసిందా ప్రదర్శన!

సుందరంతో, "మనకి స్కిట్ నచ్చలేదని అర్థమైనట్లుంది. తొందరగానే ముగించారు" అని నిట్టూర్చాను.

సుందరం వెంటనే, "అది స్కిట్ కాదు. విమానంలో అనుకోని ప్రమాద పరిస్థితి ఏర్పడితే ఏం చేయాలో చేతలతో చూపిస్తూ చెప్పారు. మీరు సరిగ్గా వినలేదా?" అన్నాడు.

"శుభం పలకరా మంకెన్నా అంటే ఏదో అన్నట్లు, విమానం ఎక్కగానే ప్రమాదం గురించిన ప్రస్తావన ఏమిటి?" అని విసుక్కున్నాను.

"అలాగనకండి. కీడెంచి మేలెంచమని కూడా అన్నారుగా, అందుకని!" అన్నాడు సుందరం.

అప్పుడు నాకు భయమేసింది. "వాళ్లేం చెప్పారో నాకు చెబుతారా?" అన్నాను ఆత్రుతగా.

"వాళ్లేం చెబుతున్నారో తెలిసింది కానీ, ఏం చెప్పారో నా బుర్రకెక్కలేదు. ఐనా భయపడకండి.
వాళ్లు కీడెంచి మేలెంచారు కానీ, మనం మేలొకటే ఎంచుదాం" అని సుందరం నాకు ధైర్యం చెప్పాడు.

అతని ధైర్యం చూస్తే నాకో అనుమానమొచ్చింది. ప్రమాదవేళలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అతనికి అర్థమయ్యాయి కానీ, అవి నాకు చెప్పాలంటే – నా ముందు నిలబడి వాళ్లకిలాగే విన్యాసాలు చెయ్యాలనుకుని ఉంటాడు. అదిష్టంలేక అబద్ధం చెప్పాడు. ఇప్పుడు నిజంగా ప్రమాదం జరిగితే తను తప్పించుకుంటాడు. నేను ఇరుక్కుపోతాను. అసలే ప్రయాణాల్లో నా హిస్టరీ అంతంతమాత్రం. ఒక్కసారి వళ్లంతా భయంతో వణికింది. ఇందాకటి హెచ్చరికని శ్రద్ధపట్టి విననందుకు నన్ను నేనే నిందించుకున్నాను.

ఉన్నట్లుండి సుందరం లేచి నిలబడి, "పడుకున్నా పడుకోకపోయినా, రాత్రి గడిచి తెల్లారేక, బ్రష్ చేసుకోకుండా ఏం తినలేను నేను" అంటూ దగ్గరున్న హ్యాండ్బ్యాగులోంచి ఆ సరంజామా తీశాడు.

"థాంక్ గాడ్" అనుకున్నాను. ఎందుకంటే నాదీ అదే పరిస్థితి. ఈ సమయంలో సుందరం పక్కనుండడం నాకు మార్గదర్శకం. నాకంటే అతనికి చొరవ కూడా ఎక్కువ. టాయ్లెట్ గదిలో ఫ్లషింగ్ ఎలా చెయ్యాలో తెలుసుకుని వచ్చేక నాకు టిప్స్ కూడా ఇచ్చాడు. తర్వాత నేనూ వెళ్లి ముఖప్రక్షాళనం చేసుకొచ్చాను.

కూర్చున్న సీటుని వెనక్కి వాల్చడానికున్న మీటలతో సహా అక్కడ ప్రతీదీ మాకు కొత్తగానే ఉంది. వాటిలో కొన్ని మేము విన్నవే. ఐతే వినడానికీ, చూడ్డానికీ ఉన్న తేడా అప్పుడే మాకు అర్థమైంది.

కాసేపటికి ఎయిర్ హోస్టెస్ ఓ బండి తోసుకుంటూ మా దగ్గరకొచ్చింది. శాకాహారమా, మాంసాహారమా అనడిగింది. నేనూ, సుందరం – ఇద్దరం శాకాహారులమే! ఫ్రూట్సలాడ్, ఆరంజ్ జ్యూస్ వగైరా కొన్ని పదార్థాలు మా ముందుంచబడ్డాయి. వెజిటబుల్ కట్లెట్ ఆకారాన్ని చూసి మేమిద్దరం మాంసాహారమని అనుమానించి దాన్నలాగే వదిలిపెట్టేశాం. అయితే పాపం భూషణ్ పక్క కంపార్ట్ మెంటు నుంచి వెతుక్కుంటూ మా సీటు దగ్గరకొచ్చి, "ఈ కట్లెట్ పూర్తిగా శాకాహారం. నీకు అనుమానం ఎక్కువ కదా, ఎందుకైనా మంచిదని నీకు చెబుదామని వచ్చాను" అని చెప్పి వెళ్లాడు.

నా పట్ల అతడి కన్సర్న్ కి చలించిపోయాను. థాంక్స్ చెప్పాను. అతను వెళ్లిపోయాడు. తరువాత మళ్లీ అతనూ, నేనూ విమానంలో కలుసుకోలేదు.

భూషణ్ ధర్మమా అని నేను సుందరం కట్లెట్ తిన్నాం. రుచి మాట ఎలాగున్నా – అది తినడంవల్లనే కడుపు కాస్త బరువెక్కింది.

ఆ ప్రయాణంలో నాకూ సుందరానికీ కూడా చెప్పుకోదగినవీ, చెప్పుకోకూడనివీ ఎన్నో సందేహాలు వచ్చాయి. ఊహతోనో, అనుకోకుండానో తీరినవి కొన్ని, తీరనివి కొన్ని. తీరనివాటికి నవ్వుకున్నాం తప్పితే తీర్చుకునేందుకు ప్రయత్నించలేదు.

ఫలహారం కాగానే టెలివిజన్ ఆన్ అయింది. ఏదో సినిమా!

ఇండియాకు వచ్చిన విదేశీ చిత్రాలు సెన్సారై వస్తాయి. సెన్సారు కాని విదేశీ చిత్రం చూసే తొలి అవకాశం నాకు వచ్చింది. అందువల్ల శ్రద్ధగా చూడాలనే అనుకున్నాను. కానీ కళ్లు సహకరించలేదు. నాకు తెలియకుండానే అవి మూతపడ్డాయి.

మెలకువ వచ్చేసరికి సినిమా పూర్తి కావస్తోంది. అందువల్ల ఆ సినిమా గురించి నాకేం తెలియలేదు.

మెలకువ వచ్చేసరికి మాకు తెలిసిన విశేషమేమిటంటే – విమానంలో ఈ పర్యాయం చాలామంది శాకాహారు లున్నారుట. డిమాండ్ వారి అంచనాకు మించిపోవడంతో సిబ్బందికి కాస్త ఇబ్బంది అయిందిట.

మేము కాలానికి ఎదురు వెడుతున్నాం. అందువల్ల చీకటినుంచి వెలుతురులోకి రావడానికి కాసేపు పట్టింది.

విమానంలోంచి చూస్తుంటే కింద కనబడే ప్రతి దేశం గురించీ, నగరం గురించీ స్పీకర్లో వివరాలు వినబడుతున్నాయి. నలభైఅయిదువేల అడుగుల ఎత్తునుంచి, కింద కనబడే దృశ్యాలు చూస్తుంటే అద్భుతంగా అనిపించింది. ముఖ్యంగా అరబ్ దేశపు నగరాలు, కటికశిలలపై అక్కడక్కడ ఊళ్లు మొలిచినట్లు చిత్రంగా ఉన్నాయి. ఇస్తాంబుల్, సోఫియా నగరాలను పైనుంచి చూశాం. పూర్తిగా మంచుతో కప్పబడ్డ ఆల్ప్ పర్వతాలను చూస్తూంటే, స్వదేశంలో ఉండి హిమాలయాలను చూడలేకపోయినా, ఈ హిమాలయాలను చూడగలిగాననుకుని తృప్తిపడ్డాను. ఆల్ప్ పర్వతాలు కనబడ్డాయంటే జర్మనీలోకి ప్రవేశించినట్లే! ఆ పర్వతాలనానుకునే మ్యునిచ్ నగరం ఉంది.

విమానంలో ప్రతి సీటువద్దా ఉత్తరాలు రాసుకునేందుకు వీలుగా లెటర్ పాడ్స్ ఉన్నాయి. ఎన్నో ముఖ్యవిశేషాలు నోట్ చేసుకుందుకవి ఉపయోగించాయి.

నేనూ సుందరం చాలా విశేషాలు మాట్లాడుకున్నాం. ఒకరి అడ్రసులు ఒకరు నోట్ చేసుకున్నాం.

ఫ్రాంక్ ఫర్ట్ జర్మన్స్ ఫ్రాంక్ ఫుర్ట్ అంటారు. నా టైమ్ ప్రకారం పన్నెండు గంటల ఇరవైఅయిదు నిముషాలకు ఫ్రాంక్ ఫర్ట్ విమానాశ్రయంలో మా విమానం దిగింది. ఒక్క నిముషం కూడా ఆలస్యం కాలేదట. అదక్కడ మామూలేనని విని ఉన్నప్పటికీ, అప్రయత్నంగా ఆశ్చర్యపోయేశాను.

అప్పుడు జర్మనీలో స్టాండర్డు టైము ఏడు గంటల యాభైఅయిదు నిముషాలు. కొంతకాలంపాటు నా వాచీకింక ఇండియన్ టైముతో పనిలేదు. అందుకని ఆ ప్రకారం టైము సరిదిద్దుకున్నాను. కాలానికి ఎదురు ప్రయాణం చేయడంవల్ల అప్పుడు నా వయస్సు నాలుగున్నర గంటలు తగ్గింది.

ఫ్రాంక్ ఫర్ట్ ఎయిర్ పోర్ట్ అంతర్జాతీయంగానే చాలా పెద్దదిట. ఒకే పర్యాయం రెండువందల విమానాలు కదిలి వెళ్లే సదుపాయముందిట.

న్యూఢిల్లీలో అయితే ఎయిర్ పోర్ట్ నుంచి కొంతదూరం నడిచి, బస్సెక్కి, దిగి – విమానం ఎక్కాం. ఇక్కడలాకాదు. విమానంలోంచి సరాసరి విమానాశ్రయంలోకి దిగాం. అందువల్ల బయట వాతావరణం ఎలాగుందో మాకు తెలియలేదు. విమానాశ్రయం ఎయిర్కండిషన్డ్. చల్లగా ఉంది. ఆ చల్లదనం ఉక్కనుంచి కాపాడేదే తప్ప, వంటిని వణికించేది కాదు. ఢిల్లీలో నేను కొనుక్కున్న స్వెటరింకా నా భుజంమీదే ఉంది.

మాతోపాటు డాడ్ సంస్థకు చెందిన అధికారిణి ఇంగా రావెన్ బయల్దేరి వస్తోంది. ఆమె డాడ్ స్కాలర్స్ అందర్నీ విమానాశ్రయంలో ఒకచోట సమావేశపరిచింది. అక్కడకు జర్మనీలోని డాడ్ సంస్థనుంచి కొందరు వచ్చారు. వాళ్లు అక్కణ్ణించి స్కాలర్స్ని తమ తమ గమ్యాలకు చేర్చే ఏర్పాట్లతో వచ్చారు.

నేను ఫ్రాంక్ ఫర్ట్ నుంచి మరో విమానంలో హనోఫర్ (ఇంగ్లీషులో ఈ నగరం పేరు హనోవర్గా వాడుకలో ఉంది) వెళ్లవలసిఉంది. అక్కణ్ణించి ల్యూనబర్గ్కు ట్రైన్లో వెళ్లాలి. నా గురించి బుక్ చేసిన ట్రైన్ టికెట్ అక్కడే నాకు అందింది.

విమానాశ్రయంలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ సదుపాయముంది. అప్పటికి నా దగ్గర ఇరవై మార్కులూ, ఎనిమిది డాలర్లూ ఉన్నాయి. డాలర్లను మార్చగా పంతొమ్మిది మార్కుల అరవై ఫెన్నిగ్స్ వచ్చాయి. మనకి పైసల్లాగే వీళ్లకి ఫెన్నిగ్స్. వంద ఫెన్నిగ్స్ ఒక మార్కు అవుతుంది.

ల్యూనబర్గ్ వెళ్లవలసినవాళ్లం మొత్తం నలుగురు ఇండియన్సూ, ముగ్గురు మలేషియన్సూ ఉన్నార. ఇండియన్స్ నలుగురూ మగవాళ్లమే కానీ మలేషియన్సులో ఒక యువతి కూడా ఉంది. ఇండియన్స్ నలుగురూ ఒక గుంపుగా చేరాం. మలేషియన్స్ ముగ్గురూ ఒక గుంపు అయ్యారు.

హనోఫర్ వెళ్లే విమానం తొమ్మిది గంటల నలభై నిముషాలకు ఏ–13 ప్లాట్ ఫాం నుండి బయల్దేరుతుందన్నారు. ప్లాట్ ఫారానికి దారి చూపారు. 13 నా లక్కీ నంబర్ అని మనసులో మురిశాను.

భూషణ్, సుందరంల దగ్గర వీడ్కోలు తీసుకున్నాను. తోడు లేదని సుందరం కాస్త దిగులుగా ఉన్నాడు. అతడు వెళ్లే ఊరు ప్రీన్. ఈ బృందంలో ప్రీన్ వెడుతున్న భారతీయుడు అతనొక్కడే.

జర్మనీలో మా కార్యక్రమం మొత్తం పదహారు నెలలు. అందులో మొదటి నాలుగు నెలలూ జర్మన్ భాష నేర్చుకోవాలని నియమం. భాష నేర్చుకునేందుకు అందర్నీ ఒకే ఊరు పంపరు. మమ్మల్ని కొన్ని గుంపులుగా విడదీసి దేశంలో నలుమూలలకూ పంపుతారు. విదేశీయులు జర్మన్ పౌరులతో మరింత బాగా కలసి మెలసి ఉండి వారి భాషనూ, సంస్కృతినీ బాగా అవగాహన చేసుకునేందుకు ఈ విధానం సహకరిస్తుందన్నది వారి ఉద్దేశ్యం. అది సబబైనదే అని నాకు అనిపించింది.

మనం ఎంతటి విభిన్న సంస్కృతిలో మసలాల్సి వచ్చినా, మనలాంటివారే అక్కడ చాలామంది ఉంటే కనుక – ఆ సంస్కృతి ప్రభావం మనపై ఉండక పోవచ్చు. భువనేశ్వర్ లో నేను అయిదు సంవత్సరాలనుంచి ఉంటున్నాను. అక్కడ మా కాలనీలో పాతిక తెలుగు కుటుంబాలున్నాయి. అందువల్ల నాకు ఒరియా భాష కూడా సరిగా పట్టుబడలేదు. పట్టుబడేందుకు కృషి చేయవలసిన అవసరం కూడా నాకు కనబడలేదు. ఎందుకంటే ఆఫీసులో వ్యావహారిక భాష ఆంగ్లం. సామాజికంగా వ్యవహరించడానికి తెలుగువారు తగినంతమంది ఉన్నారు. ఊళ్లో వ్యవహరించడానికి కొంత హిందీ, కొంత పొడిపొడి ఒరియా చాలు.

సరిగ్గా తొమ్మిది గంటల నలభై నిముషాలకు ఫ్రాంక్ఫుర్ట్లో మా విమానం బయల్దేరింది. అంతర్జాతీయ విమాన యానానికీ, ప్రాంతీయ విమానయానానికీ – తేడా ఉంటుందని అప్పుడే నాకు బాగా తెలిసింది. ఈ విమానం చిన్నదిగా, ఇరుగ్గా ఉంది. డిసి 10లో ప్రయాణం చేశాక – రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూసినట్లుగా ఉంది. ఎటొచ్చీ నేనిప్పుడు మరీ పార్వతీశంలా లేను. కాస్త మెరుగయ్యాను. అవసరమైన వివరాలు చాలావరకూ ముందుగానే తెలిశాయి.

నిముషమైనా ఆలస్యం లేకుండా పదిన్నరకల్లా విమానం హనోఫర్ విమానాశ్రయంలో దిగింది. ఇక్కడ కూడా బయటి వాతావరణానికి గురి కాకుండా సరాసరి విమానాశ్రయంలోనే దిగాం.

న్యూఢిల్లీలో లోడ్ అయిన మా సామాన్లు సరాసరి ఇక్కడకు చేరాలి. సామాను కలెక్ట్ చేసుకునే చోటుకి వెళ్లాం. ఈ విమానాశ్రయం చాలా చిన్నది. ఇంచుమించు న్యూఢిల్లీ విమానాశ్రయం అంతే ఉంది. ఉన్న తేడా అల్లా పరిశుభ్రత! సినిమా కోసం వేసిన సెట్టింగులా ఎంతో నీట్గా ఉంది.

సామాన్లు తీసుకోవలసినచోట, వలయాకారంలో ఓ బెల్ట్ తిరుగుతోంది. దానిమీద సామాన్లున్నాయి. నేనొక చోట నిలబడ్డాను. కాసేపటికి నా సూట్కేసు వచ్చింది. గుర్తుపట్టడానికి ఒక్క క్షణం ఆలస్యమైంది. ఆలోగా అది నన్ను దాటి వెళ్లిపోయింది. నా సూట్ కేసు నాకు దక్కదేమోనని భయపడ్డాను. కానీ ఆ భయం క్షణికం మాత్రమే! అది మళ్లీ మళ్లీ అలా తిరుగుతూంటుందని స్ఫురించింది. రెండోసారి నా ముందుకి రాగానే వెంటనే సూట్కేస్ అందుకున్నాను.

భారతీయులం నలుగురం ఎవరి సామాన్లు వారు చేత్తో పట్టుకుని విమానాశ్రయం బయటకు వచ్చాం. అక్కణ్ణించి బస్సులో రైల్వేస్టేషనుకి వెళ్లాలిట. బస్సుకోసం ఎదురుచూస్తూ అక్కడ నిలబడ్డాం.

అదిగో నవలోకం

ఎయిర్ పోర్ట్ లోపలికంటే బయట బాగా చల్లగా ఉంది.

మాలో ఇద్దరు ఫు ల్ సూట్స్ లో, ఒకతను స్వెటర్తో ఉన్నారు. నా స్వెటర్ నా భుజంమీదనే ఉంది. జీవితంలో అంతవరకూ ఎన్నడూ స్వెటర్ వేసుకుని ఉండని కారణంగా ధరించడానికి కాస్త మెహమాటంగా ఉంది.

చుట్టూ చూస్తుంటే అది మనుషులు మసిలే ప్రదేశంలా అనిపించలేదు. ఏదో అద్భుతలోకంలో ఉన్నట్లుంది.

నేలంతా అప్పుడే కడిగి తుడిచిన భోజనాలగదిలా శుభ్రంగా ఉంది. మాకు కాస్త దూరంలో కొందరు జర్మన్ బాలబాలికలు ఆడుకుంటున్నారు. వాళ్లంతా ఏదో పిక్నిక్కి వచ్చిన బాపతులా ఉన్నారు. బలంగా ధృడంగా ఉన్నా వాళ్ల ఆటలు మోటుగా ఉన్నాయి. మిసమిసలాడే వాళ్ల సోయగాల్ని చూసి ప్రపంచంలోని బాలబాలికలంతా అలా కనిపించే మంచి రోజు ఎప్పటికి వస్తుందో అనిపించింది అప్రయత్నంగా.

కాసేపు ఎదురుచూశాక బస్సు వచ్చింది. త్వరగా ఎక్కాం. కాస్త రష్గానే ఉంది. మాకు కూర్చునేందుకు సీట్లు దొరకలేదు. అయితే నిలబడదానికి అనువుగా విశాలమైన స్థలముంది. నిలబడ్డవాళ్లు ఒకరికొకరు తగులుతూ ఉండనవసరంలేదు. బస్సు లోపల సెంట్రల్ హీటింగ్ సిస్టం ఉండడంవల్ల వెచ్చగా, హాయిగా ఉంది.

బస్సులో కండక్టర్ లేడు. డ్రైవర్ సీటు దగ్గరనుంచే ఎక్కాలి. అతను టిక్కెట్ ఇస్తాడు. విమానాశ్రయంనుంచి రైల్వేస్టేషనుకు టిక్కెట్ ఖరీదు ఒక మార్కు. కాస్త ఎక్కువేననిపించింది. జర్మనీలో నేను పెట్టిన మొదటి ఖర్చు ఈ బస్సు టిక్కెట్టే.

అంతా బస్సెక్కగానే డ్రైవర్ ఒక బటన్ నొక్కాడు. వెంటనే చిన్నగా శబ్దం చేస్తూ బస్సు తలుపులు వాటంతటవే మూసుకుపోయాయి. మధ్యలో ఎవరైనా ఎక్కడైనా దిగాలంటే డ్రైవర్ ఓ మీట నొక్కుతున్నాడు. తలుపులు వాటంతటవే తెరుచుకుంటున్నాయి. అందువల్ల డ్రైవర్ ఇష్టం లేనిదే ఎవరూ బస్సు ఎక్కలేరు, దిగలేరు. ట్రాఫిక్ కారణంగా బస్సు మధ్యలో ఆగినా అందులోచి ఎవరూ దిగిపోలేరు. అందులోకి ఎవరూ ఎక్కలేరు. ఈ పద్ధతి చాలా బాగుందనిపించింది.

బస్సు వెడుతున్నప్పుడు కళ్లప్పగించి ఊరు చూశాం. ఆ అందం చూసి ఆనందించాల్సిందే కానీ వర్ణించలేను. బస్సు వెడుతుంటే ఎక్కడా దుమ్ము లేవడంలేదు. ఊరంతా ఉద్యానవనంలా ఉంది.

హనోఫర్ రైల్వేస్టేషన్ వద్ద మేము నలుగురం ట్రయిన్ దిగాం. మలేషియన్స్ కూడా మా వెనుకనే దిగారు. ఇంకా వాళ్లూ, మేమూ విడిగా రెండు గుంపులుగానే ఉన్నాం.

రైల్వేస్టేషన్ చాలా గజిబిజిగా ఉంది. మా ట్రైన్ సరిగ్గా ఒంటిగంటా ఎనిమిది నిముషాలకు రావాలి. అది ఏ ప్లాట్ ఫాం మీదకు వస్తుందో తెలుసుకోవడానికి కాస్సేపు పట్టింది. వివరాలన్నీ జర్మన్ భాషలో రాసి పెట్టి ఉన్న చార్ట్ ఒకటుంది. దాన్ని అర్థం చేసుకుందుకు మాకు కాస్సేపు పట్టింది. అదృష్టమేమిటంటే జర్మన్, ఇంగ్లీషు భాషలకు అక్షరాలు ఒకటే. అది మాకు చాలా సహకరించింది. మేము సేకరించిన సమాచారం సరైనదవునో కాదో అక్కడ మరికొందరిని అడిగి నిర్ధారించుకున్నాం. అప్పుడే మాకు అర్థమైంది – మా ఇంగ్లీషు పరిజ్ఞానం అక్కడ మాకాట్టే సహకరించదని!

ఆ సందర్భంలో మేమూ, మలేషియన్సూ కొంచెం దగ్గరయ్యాం. వాళ్ల స్నేహితుడొకడు హనోఫర్లో ఉన్నట్లున్నాడు. అతను స్టేష న్ కొచ్చి వాళ్లను కలుసుకుని వాళ్లతోపాటు అనుకోకుండా మాక్కూడా సాయపడ్డాడు.

ట్రైన్ సరిగ్గా టైముకి వచ్చింది. రెండంటే రెండు నిముషాల్లో బయల్దేరింది. చాలా పరిశుభ్రంగా ఉంది. మాది సెకండ్ క్లాస్ కంపార్ట్మెంట్. అది మన బోగీల్లా కాక – ఎంతో విశాలంగానూ, కాళీగానూ ఉంది.

ట్రైన్ వెడుతున్నది అడవిదారిలా ఉంది. చెట్లు పొడుగ్గా, పచ్చదనంతో మెరిసిపోతున్నాయి. ఇండియాలో చెట్లకి పచ్చదనం చూశాను కానీ ఆ పచ్చదనానికీ, ఈ పచ్చదనానికీ తేడా ఉంది. లేత ఆకుపచ్చ కొద్దిగా ముదిరినట్లు, ముదురాకుపచ్చ కొద్దిగా లేతపడినట్లు – అదొక రకమైన, అందమైన, అద్భుతమైన పచ్చదనం నన్ను వివశుణ్ణి చేసింది.

ట్రైన్లో మాకో కుర్రాడు తగిలాడు. పది పన్నెండేళ్లుండవచ్చు. అందరు జర్మన్ కుర్రాళ్లలాగే పుష్టిగా ఉన్నాడు. మాతో ఏదో మాట్లాడడానికి ప్రయత్నించాడు. వచ్చీరాని ఇంగ్లీషులో తడబడుతూ మాట్లాడాడు. ఒక యూరోపియన్ బాలుడు ఇంగ్లీషు మాట్లాడడానికి తడబడడం వింతగా అనిపిస్తే – అంతకంటే వింతైనది అతని తీరు. అతనివద్ద పూర్తి టికెట్ కొనడానికి డబ్బులు లేవుట. కొన్ని మార్కులు సాయం చేయమని అడిగాడు.

ఇండియాలో ఇలాంటివి చాలా మామూలే! జర్మనీలో అడుగు పెట్టగానే ఇటువంటి అనుభవం ఎదురౌతుందని మేము అనుకోలేదు.

అయితే అతను చెప్పింది మాకు సరిగా అర్థం కాలేదు. డబ్బు కావాలన్నదొక్కటే సరిగా తెలిసింది. అతని అసలు సమస్య ఏమిటో మాకు తెలియదు. అప్పుడే కొత్తగా ఓ కొత్తదేశంలోకి అడుగుపెట్టిన మేము మా దగ్గరున్న కొద్ది మార్కుల్నీ దానధర్మాలు చేయగల స్థితిలో లేము. అందువల్ల మా అసహాయత అతనికి తెలియబర్చాము. నిరుత్సాహంగా వెళ్లిపోయాడా కుర్రాడు.

దేశం సంపన్నమైనప్పటికీ, ఇక్కడ కూడా మనుషుల తీరు ఇండియాలోలాగే ఉందని అనుకున్నాము. అయితే దానికి ఆలోచనల్లో మరీ ఎక్కువ ప్రాధాన్యతనివ్వలేదు. చేరవలసిన టైమ్ ప్రకారం రెండుగంటల నలభైఅయిదు నిముషాలకు ట్రైన్ ల్యూనబెర్గ్ చేరుకుంది. అది అగిన రెండే రెండు నిముషాల్లో హడావుడిగా సామానులతో సహా ట్రైన్లోంచి దిగాం.

విమానాశ్రయంలోనూ, రైల్వేస్టేషన్లోనూ కూడా సామాన్ల రవాణాకు ట్రాలీలున్నాయి. వాటిలో సామానుంచి లాక్కుంటూ బయటకు చేర్చుకుని, ట్రాలీ అక్కడ వదిలేయొచ్చు. మా సామాను బరువుగా లేకపోవడంవల్ల ట్రాలీ ఉపయోగించాల్సిన అవసరం లేకపోయింది.

స్టేషన్ ఆవరణలో కూడా ఇండియన్సూ, మలేషియన్సూ మళ్లీ విడివిడిగానే ఉన్నాం. మలేషియన్సు మాకంటే ముందు టాక్సీలో వెళ్లిపోయారు. మావద్ద గ్యోతే ఇన్స్టిట్యూట్ అడ్రస్ ఉంది. అక్కడికి ఎలా వెళ్లాలీ అని కాసేపు తర్జనభర్జన పడి, చివరకి టాక్సీ చేసుకుని వెళ్లాలనుకుని దగ్గర్లో ఉన్న టాక్సీని పిలిచాం.

టాక్సీ మనదేశంలో గొప్పగొప్పవాళ్లు వాడే కార్లకంటే గొప్పగా ఉంది. టాక్సీడ్రైవర్ చూడ్డానికి పెద్ద ఆఫీసర్లా ఉన్నాడు. అయితే మేము అడ్రస్ చూపించగానే అతను ఎంతో వినయంగా మా సామాను డిక్కీలో పెట్టాడు. మాకు భాష రాదని తెలిసి మావంక స్నేహపూర్వకంగా చూశాడు. అతనికి ఇంగ్లీషు వచ్చినట్లు లేదు. ఐనా వ్యవహారానికి పెద్దగా ఇబ్బంది కలుగలేదు.

గ్యోతే ఇన్స్టిట్యూట్కి మీటర్ ఛార్జి నాలుగు మార్కులయ్యింది. అది మేము నలుగురం షేర్ చేశాం. టాక్సీ చవగ్గానే ఉంది. అనవసరంగా తటపటాయించాం, అనుకున్నాం.

గ్యోతే ఇన్స్టిట్యూట్ దగ్గర దిగాం. ఇన్స్టిట్యూట్ భవనం చూడ్డానికి చిన్న మేడలాఉంది. ఒకే ఒక్క గుమ్మం. తలుపు మూసి ఉంది. లోపలికెళ్లడానికి మరో దారి లేదు.

టాక్సీ డ్రైవర్ సామాను దింపడంలో సాయం చేశాక, తలుపుకి పక్కనే ఉన్న కాలింగ్ బెల్ చూపించి అది నొక్కమని సూచించి వెళ్లిపోయాడు.

నేను వెళ్లి కాలింగ్బెల్ నొక్కాను. ఒక్క క్షణం అనంతరం తలుపు దగ్గరలో ఏదో గంట మ్రోగింది. కానీ ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు. ఓ క్షణమాగి మళ్లీ బెల్ నొక్కాను. మళ్లీ క్షణమాగి తలుపు దగ్గర్లో గంట మ్రోగింది. కాసేపు ఎదురు చూశాం. ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు.

అలా అక్కడ పావుగంట సేపు గడిపాం. లోపలికెళ్లాల్సిన పద్ధతి ఏమిటో తెలియడంలేదు. కాలింగ్బెల్ మ్రోగించినా వెంటనే వచ్చి ఎవరూ తలుపు తీయకపోవడానికి కారణం తెలియడంలేదు. మేము బెల్ మ్రోగించిన క్షణంలో తలుపుదగ్గర గంట ఎందుకు మ్రోగుతోందో తెలియడంలేదు.

మేమక్కడ అలా అయోమయంలో ఉండగా ఒక వ్యక్తి, జర్మన్ కాబోలు, అక్కడికొచ్చాడు. అతన్ని మేము ఏమీ అడగలేదు. అతనూ మమ్మల్ని పట్టించుకోలేదు. అతను తలుపుదగ్గరకొచ్చి కాలింగ్బెల్ నొక్కాడు. మరుక్షణంలో తలుపు దగ్గర గంట మ్రోగింది. ఏం జరుగుతుందా అని మేము ఆత్రుతగా చూస్తున్నాం.

గంట మ్రోగగానే అతను తలుపు తోసుకుని లోపలకు వెళ్లాడు. అతని వెనుకనే బ్రతుకు జీవుడా అనుకుంటూ మేమూ లోపలికి వెళ్లాం.

తర్వాత తెలిసింది మాకు. ఎవరైనా కాలింగ్ బెల్ మీట నొక్కగానే అది గ్యోతే ఇన్స్టిట్యూట్ ఆఫీసు గదిలో మ్రోగుతుంది. అక్కడ కూర్చున్న సెక్రటరీ తన పక్కనున్న మీట నొక్కుతుంది. అప్పుడు ఈ ప్రవేశద్వారం అన్లాక్ ఆవుతుంది. అందుకు సూచనగా తలుపు దగ్గర గంట మ్రోగుతుంది. వెంటనే తోస్తే తలుపు తెరుచుకుంటుంది. కొద్ది క్షణాల్లో ఆ తలుపుకి దానికదే మళ్లీ తాళం పడిపోతుంది. ఈ ఆటోమేటిక్ డోర్ లాకింగ్ అండ్ఓపెనింగ్ గురించి మాకు తెలియకపోవడంవల్ల కాస్సేపు బయట ఇబ్బంది పడ్డాం.

గ్యోతే ఇన్స్టిట్యూట్ లోపల చాలామంది ఉన్నారు, మాకులాగే! వాళ్లలో మాతో వచ్చిన మలేషియన్సూ ఉన్నారు. మరెందరో వివిధ దేశీయులున్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతీయుల్ని చూశాను. కానీ నోరు విప్పేవరకూ చటుక్కున ఎవరు ఏ ప్రాంతంవారో వెంటనే తెలియదు. కానీ ఇక్కడైతే చైనీస్, జపనీస్, మలేషియన్, ఆఫ్రికన్ వగైరా వివిధ దేశాలకు చెందిన మనుష్యులు చూడగానే విభిన్నంగానూ, తమ దేశాలకు ప్రతినిధుల్లాగానూ అగుపడుతున్నారు.

ఒక్కొక్కరినే ఆఫీసుగదిలోకి పిల్చి ఏదో మాట్లాడి పంపేస్తున్నారు. నాకు పిలుపు రావడానికి సుమారు రెండు గంటలు పట్టింది. చాలా అలసటగా ఉన్నదేమో విసుగ్గా ఉంది అంతసేపు అక్కడ కూర్చోడానికి. ఆ రెండు గంటలల్లోనూ మా జర్మన్ భాషా పరిజ్ఞానాన్ని పరీక్షించడం జరిగింది. నాకు బొత్తిగా ఏమీ రాదని చెప్పాను కాబట్టి నన్ను పరీక్షించలేదు. ఎంతోకొంత వచ్చునన్నవాళ్లని అప్పటికప్పుడు ప్రత్యేకంగా పరీక్ష చేశారు. దాన్నిబట్టి ఎవరెవర్ని ఏయేక్లాసుల్లో ఉంచాలన్నది నిర్ణయిస్తారన్నమాట!

నన్ను ఆఫీసు గదిలోకి పిలిచేక – నా పేరు, వివరాలు నోట్ చేసుకున్నారు. ఒకామె నన్ను – "ఒక గది ఉంది. చాలా చిన్నది. కానీ ఇంటామె చాలా మంచిది. ఉంటావా?" అనడిగింది ఇంగ్లీషులో.

గ్యోతే ఇన్స్టిట్యూట్ వరు మాకు వసతి ఏర్పాటు చేయవలసి ఉంది. ఆమె నన్నలా అడిగిందంటే, నాకు కేటాయించిన గది మామూలుగా ఉండే గదులకంటే బాగా చిన్నదయుంటుందని అనుకున్నాను. కానీ జర్మనీ కదా – ఏ ఇల్లయినా తప్పక బాగుంటుందనే ఉద్దేశ్యంతో – "ఉంటాను" అన్నాను మారాలోచన లేకుండా.

"ఇన్స్టిట్యూట్కి ఆ ఇల్లు కాస్త దూరం. అయితే నువ్వు బస్సు పాసు తీసుకోవచ్చు. ఆ ఖర్చు మా ఇన్స్టిట్యూట్ భరిస్తుంది. బస్సులో రావడానికి అభ్యంతరమా?" అందామె మళ్లీ.

అభ్యంతరం చెప్పదగ్గదిగా నాకది తోచలేదు. లేదని చెప్పాను.

"అయితే సరే!" అంటూ ఆమె నాకో కాగితమిచ్చి, మర్నాడుదయమే ఎనిమిది లోపుగా ఇన్‌స్టిట్యూట్‌కి రావలసి ఉంటుందని చెప్పింది. వివరాలన్నీ ఆ కాగితంలో ఇంగ్లీషులో వ్రాసి ఉన్నాయని చెప్పింది.

నాకు కేటాయించిన అడ్రస్ ఓ కాగితంమీద వ్రాసిచ్చి, "ఈ అడ్రసుకి వెళ్లాలి. కావాలంటే టాక్సీ పిలుస్తాను" అందామె.

నాకైతే బస్సులో వెళ్లాలనుంది. కానీ ఊరు కొత్త కదా, అందుకని టాక్సీని పిలవమన్నాను. ఇందాకటి టాక్సీ అనుభవం కూడా నాకు కొంత ధైర్యాన్నిచ్చింది.

ఆఫీసు గదిలోంచి బయటపడి సూట్‌కేసుతో ఇన్‌స్టిట్యూట్ బయటకు వచ్చాను. అప్పటికి నేనూ, మిగతా ఇండియన్ మిత్రులం విడిపోయాం.

నేను బయట నించున్న మరుక్షణంలో టాక్సీ ఒకటి వచ్చి నా ముందు ఆగింది. కాగితం మీది అడ్రస్ టాక్సీ డ్రైవర్‌కి చూపించాను. అతగాడు టాక్సీ దిగి వచ్చి నా సూట్‌కేసు డిక్కీలో పెట్టాడు. నేను టాక్సీ ఎక్కాను.

భాష రాని వాడను

నేను చేరిన వీధి పేరు హైడ్‌కాంప్ఫ్. ఇంటి నంబర్ పంతొమ్మిది. ఆ ఇంటిముందు టాక్సీ ఆపాడు డ్రైవర్. ఛార్జి అయిదున్నర మార్కులయింది. జర్మనీలో ఖర్చు మొదలైంది అనుకున్నాను.

టాక్సీడ్రైవర్ టాక్సీ దిగి ఇంటావిడను పిలిచాడు. ఆవిడ పేరు యాకేల్. వయసు సుమారు యాభై సంవత్సరాలుండొచ్చు. నన్ను ఆప్యాయంగా చూసింది. చేయి చాపింది. తడబడుతూనే చేయి చాపి షేక్‌హ్యాండ్ ఇచ్చాను. ఆమె ఏదో అంది కానీ అర్థం కాలేదు.

ఆమెను చూడగానే నమస్కరించాలనిపించింది కానీ అదామెకు అర్థం కాదు కదా!

ఆమె కట్టు వేరు, జుట్టు వేరు, పద్ధతి వేరు!

రెండంతస్తుల చిన్న ఇల్లు. కానీ చుట్టూ ఉన్న పెరడు చాలా పెద్దది. ఇంటి చుట్టూ అందమైన తోట ఉంది. ఆమె క్రింది అంతస్తులో ఉంటోంది. నన్ను పై అంతస్తుకి తీసుకు వెళ్లింది. అక్కడ మొత్తం మూడు గదులు, ఒక బాత్రూం ఉన్నాయి. అన్నిటిలోకీ చిన్నగది నాకు కేటాయించబడింది.

టాక్సీడ్రైవర్ నా సూట్‌కేసు లోపలికి తెచ్చిపెట్టాడు. నేను ఒక జర్మన్ దేశీయుడి సేవ అందుకుని అందుకు ప్రతిఫలం ఇస్తున్నానన్న భావన థ్రిల్లింగ్‌గా అనిపించింది.

ఇంటామెకు ఇంగ్లీషు బొత్తిగా రాదు. ఆమె నాకు ఏమేమో చెప్పాలని ప్రయత్నించింది. నాకేమీ తెలియలేదు. ఆఖరికి ఆమె నావద్ద ఉన్న కాగితాలన్నీ తీసుకుని, వాటిలోంచి ఓ రేపర్ బయటకు తీసి ఏదో అడిగింది. నాకు అర్థం కాలేదు. చేత్తో నలుచదరంగా గీసి చూపింది. ఇంకా నాకర్థం కాలేదు. ఏమనుకుందో కిందకు దిగి వెళ్లిపోయింది.

ఆమె వెళ్లిపోయిందనుకుని కాస్త సద్దుకుని కూర్చోబోయాను. అంతలోనే ఆమె మళ్లీ వచ్చింది. ఆమె చేతిలో ఓ ఫొటో ఉంది. అది చూపించి ఏవో సొంజ్ఞలు చేసింది. నాకర్థమైంది – అలాంటిది నాకుందా అనడిగిందని.

ఇండియాలో నా మిత్రుడు ప్రసాద్ ఇచ్చిన సలహాతో చాలా ఫొటోలు కాపీ తీయించి కూడా తెచ్చుకున్నాను. నా దగ్గర నా ఫొటోల కాపీలు చాలా ఉన్నాయి. త్వరగా సూట్‌కేసు తెరిచి ఓ ఫొటో ఆమెకిచ్చాను.

అప్పుడామె ఇందాకా తను బయటకు తీసిన రేపర్ మడత లోపల ఆ ఫొటోని అంటించి – "బుస్, బుస్, పాస్!" అంది.

బస్ అంటే ఏమిటో నాకు తెలియలేదు. కానీ ఒక విషయం గుర్తొచ్చింది. ఆ రేపర్ నకు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో ఇచ్చారు. బస్సుపాసులా ఉపయోగించుకోమని చెప్పారు. ఈమె చెప్పేది పాస్ కోసమే అయుండాలనుకున్నాను. బస్సు స్టాపులో ఇలా ఫొటో అంటించాలని ఆమె ఆంతర్యమని ఊహించాను.

ఆమె నాకు రెండు తాళం చెవులిచ్చింది. ఒకటి నా గదికి. ఇంకొకటి వీధితలుపుకి.

ఆమె చెప్పిన మాటలను బట్టి, పక్క గదిలో ఓ ఇండోనీషియన్ ఉంటున్నాడనీ, అతనికి ఇంగ్లీషు వచ్చుననీ అర్థమయింది నాకు.

ఇంగ్లీషు బొత్తిగా రాని ఈమెతో, ఈ ఇంట్లో ఎన్నాళ్లుండగలనా అని మనసులో భయమేసింది.

ఆమె వెళ్లిపోగానే గది తలుపులు మూసి మంచంమీద కూర్చున్నాను.

గది నిజంగానే చిన్నది. ఓ సింగిల్‌కాట్‌ఉంది. తలుపు వైపు గోడనానుకుని ఓ చిన్నచెక్క బీరువా ఉంది. బీరువామీద టేబుల్‌లాంపుంది. మంచంమీద పడుకుని చేయి చాస్తే గది తలుపు తగుల్తుంది నాకు. మంచాన్ని ఆనుకుని అటువైపు ఓ కిటికీ ఉంది. కిటికీలోంచి ఓ ఆటస్థలం కనబడుతోంది. కొందరు పిల్లలు ఫుట్‌బాల్‌ఆడుతూ కనబడ్డారు. టైము అయిదున్నర దాటుతోంది. వెలుతురు చూస్తే శీతాకాలపు మధ్యాహ్నంలా ఉంది.

మంచంమీద పరుపు బాగా మెత్తగా సుఖంగా ఉంది. మేను వాల్చాలనిపిస్తోంది.

అట్టే చలి అనిపించడంలేదు. గోడకు హేంగర్లున్నాయి. స్వెటర్ దానికి తగిలించాను. బట్టలు మార్చుకుందామా అనుకుంటూండగా ఎవరో తలుపు తట్టారు.

వెంటనే తలుపు తీశాను. ఎదురుగా యాకేల్, ఆమె పక్కన బాగా పొడవుగా ఉన్న ఓ కుర్రాడు ఉన్నారు.

అతను నా పక్కగదిలో ఉంటున్నాడుట. దేశం ఇండోనీషియా. పేరు వైయాంగ్. ముఖం చూడగానే ఆ ప్రాంతానికి చెందినవాడని తక్కున చెప్పేయొచ్చు. వయసు ఇరవై లోపే ఉంటుందనిపించింది.

వైయాంగ్‌ని నావద్ద వదిలిపెట్టి యాకేల్ వెళ్లిపోయింది.

వైయాంగ్‌కి ఇంగ్లీషు బాగా వచ్చని యాకేల్ చెప్పింది కానీ, అతడి ఇంగ్లీషు పరిజ్ఞానం అంతంత మాత్రమేనని తెలుసుకుందుకు నాకు ఎంతో సేపు పట్టలేదు.

హిందీ సినిమాలు చూసి చూసి, రేడియో సిలోన్ విని వినీ, స్కూలుఫైనల్ దాకా ఏదో చదివి, ఒరిస్సాలో మసిలి మసిలి – నేను నేర్చుకున్న హిందీ స్థాయి ఎంతో, అతని ఇంగ్లీషు స్థాయీ అంతే! అయితే ఏం – కొన్ని విషయాలు అర్థం చేసుకోడానికి ఆ పరిజ్ఞానం సరిపోయింది.

అతను నాలుగు రోజుల్నించి ఇక్కడ ఉంటున్నాడుట. తలిదండ్రులు జర్మన్ భాష నేర్చుకోమని అతన్నిక్కడకు స్వంత ఖర్చులమీద పంపించారుట. జర్మనీలో చదువుకుని అక్కడే స్థిరపడిపోవాలని అతని ఆశయమట. ఇంటామె చాలా మంచిదని చెప్పాడు. దగ్గర్లో ఏదో రెస్టారెంట్ ఉన్నదనీ, ఆరున్నరకు తను వచ్చి పిలిచి తీసుకు వెడతాననీ అన్నాడు.

జర్మన్ భాషలో బస్సుని బుస్ అంటారుట. ఇందాకా యాకేల్ ఫొటో అంటించిన రేపర్ని బస్ డ్రయివరుకి చూపిస్తే అతను పాస్ ఇస్తాడుట. పాస్‌కి ఇరవై మార్కుల ఛార్జి అవుతుందనీ, ఆ డబ్బు నెలాఖర్లో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వాళ్లు వాపసు ఇచ్చేస్తారనీ చెప్పాడు. మామూలుగా అయితే బస్సు పాస్ ఇంకా ఖరీదుట. ఇది స్టూడెంట్లకి కన్సెషనల్ రేటు!

"ఓహో! నేను మళ్లీ స్టూడెంటునయ్యాను కదూ" అనుకున్నాను.

అతను వెళ్లగానే కళ్లు కూరుకుపోతున్నట్లనిపించింది. కాసేపు మేను వాల్చాలనిపించింది.

అలవాటు ప్రకారం లుంగీపంచె కట్టుకుని, చొక్కా లేకుండానే మంచంమీద పడుకున్నాను. మంచంమీదున్న రొజాయి కప్పుకున్నాను. చూడ్డానికి సన్నగా బొంతలా ఉంది కానీ కప్పుకుంటే వెచ్చగా, హాయిగా ఉంది.

పీజీ టు కేజీ

ఎవరో తలుపుతడుతున్నట్లనిపించి ఉలిక్కిపడి లేచాను.

గదిలో వెలుతురు బాగాఉంది. తెల్లారిపోయిందన్నమాట !

టైము చూసుకుంటే ఆరున్నరవుతోంది. ఒక్క ఉదుటున వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా వైయాంగ్ ఉన్నాడు. "నిన్నరాత్రి ఎంత పిలిచినా పలకలేదు నువ్వు. సరే, బాగా అలసిపోయావేమో, వళ్లు తెలియకుండా నిద్ర పట్టేసిందేమో అనుకున్నాను" అన్నాడు.

ఏమాత్రం ఇంగ్లీషు రాని యాకేల్ మాటల్ని ఎంతోకొంత అర్థం చేసుకోగలగడంవల్ల నా భాషాగ్రహణ శక్తి బాగా పెరిగినట్లుంది. వైయాంగ్ మాటలు నాకు వెంటనే అర్థమైపోయాయి.

అంటే పన్నెండు గంటలు నిద్రపోయానన్నమాట! నా నిద్రకి కారణం అలసటా, లేక ఇక్కడి వాతావరణమా?

ఇండియాలో నాకు అంత సులువుగా నిద్ర పట్టేది కాదు. అలసట మాటటుంచి, శివరాత్రి జాగరణ చేసిన మర్నాడు రాత్రి కూడా మంచంమీద కాసేపు అటూఇటూ దొర్లితే తప్ప నిద్ర పట్టేది కాదు.

"బస్సు ఏడుగంటల అయిదు నిముషాలకి! త్వరగా తెములు" అని వెళ్లిపోయాడతను.

నేను బాత్రూంకి వెళ్లాను. కాలకృత్యాల్లో అక్కడ ఇండియన్సుకి ఇబ్బందికరమైనది టాయ్లెట్ పేపరు వాడకం. నీళ్లు వాడినా బయట చెప్పొద్దని నాకు ముందే హెచ్చరికలు అందాయి. కానీ వాక్‌ష్‌బేసిన్లో నీళ్లొస్తాయి. అవి పట్టుకుందుకు చెంబంత గ్లాసుంది. బ్రతుకు జీవుడా అనుకుని పావుగంటలో కాలకృత్యాలు తీర్చుకుని షేవింగ్ చేసుకున్నాను. ఇండియాలో అయితే చలికాలంలో చర్మం పెళుసుబారిపోయి గెడ్డం గీసుకోడానికి ఇబ్బందిగా ఉండేది. ఆ రోజు అలాంటి ఇబ్బంది అనిపించలేదు.

షేవింగైన వెంటనే స్నానం చెయ్యడం అలవాటు నాకు. బాత్రూంలో వేణ్ణీళ్ల సదుపాయం ఉంది కానీ స్నానం చేసే అవకాశం లేదు. ఇబ్బందిగా అనిపించినా స్నానం మానక తప్పలేదు.

ఆరూయాబైకల్లా రెడీ అయ్యాను. వైయాంగ్ గదికి వెళ్లి పలకరిస్తే అతను, "ఇంకా తొందరేంలేదు. సరిగ్గా ఏడుకి బయల్దేరవచ్చు" అని ఓసారి నావంక తేరిపార చూసి, "స్వెటర్ వేసుకో" అన్నాడు.

నేను నా గదికి వెళ్లాను. బయట చలిగా ఉంటుందన్నది అప్పటికే స్వానుభవం. జీవితంలో అంతవరకూ ఒక్కసారి కూడా స్వెటర్ వేసుకోకపోవడం వల్ల, నిన్నంతా చలిని భరించాను తప్పితే స్వెటర్ వేసుకోలేదు. ఏడాదికి పైగా ఇక్కడే ఉండాలి కాబట్టి ఇది అలవాటు చేసుకోక తప్పదు.

జీవితంలో మొట్టమొదటిసారిగా స్వెటర్ వేసుకున్నాను. టైము ఏడు కావస్తుండగా వైయాంగ్ వచ్చి పిలిచాడు. ఇద్దరం బయల్దేరాం.

బస్‌స్టాప్ ఇంటికి దగ్గర్లోనే ఉంది. సరిగ్గా రెండు నిముషాల నడక. మేము వెళ్లేసరికి బస్సు సిద్ధంగా ఉంది.

బస్సెక్కి డ్రైవరుకి ఫొటో అంటించిన రేపర్ చూపాను. పాస్ అన్నాను – ఇరవై మార్కుల నోటు అందించి.

డ్రైవర్ నాకు బస్సు టిక్కెట్టు లాంటిది ఇచ్చాడు. దాని మీద ఇరవై మార్కులు అని రాసి ఉంది.
నా రేపర్ మీద ఏదో స్టాంప్ కూడా కొట్టాడు.

వెళ్లి సీట్లో కూర్చున్నాను. బస్సులో వెచ్చగా ఉంది. స్వెటర్ వేసుకోవడంవల్ల ఉక్కబోస్తోంది కూడా. ఐనా స్వెటర్ విప్పలేదు.

వైయాంగ్ నా పక్కనే కూర్చున్నాడు. బస్సులో రష్ లేదు. సీట్లు మెత్తగా, హాయిగా ఉన్నాయి.

ఖరీదైన భవనంలోని హాల్లో, కార్పెట్టు పరచిన నేలలా ఉంది రోడ్డు. భారీ సినిమా సెట్టింగులా ఉంది ఊరు. నాకు బస్సులో వెడుతున్నట్లు లేదు. థియేటర్లో సుఖంగా కూర్చుని సినిమా చూస్తున్నట్లుంది.

నేనూ, వైయాంగ్– బస్ టెర్మినస్ వద్దనే దిగాం.

ఆ ప్రాంతాన్ని అమ్ శాండే అంటారుట. మేము దిగింది మార్కెట్ సెంటర్. చాలా సందడిగా ఉంది. ఆడ, మగ – అందరూ పరుగులు తీస్తున్నట్లు చలాకీగా నడుస్తున్నారు. ఒకళ్లనొకళ్లు పట్టించుకోవడంలేదు. వైయాంగ్ ముందు నడుస్తుంటే నేను వెనుక నడుస్తున్నాను. అద్దాల షోకేసులతో పెద్దపెద్ద షాపులు దాటుకుంటూ పోతున్నాం. నాకైతే ఆగి చూడాలనుంది. కానీ వైయాంగ్ఆగడంలేదు.

రేపట్నుంచి నాకు నేనే వెళ్లొచ్చులే అనుకున్నాను. కానీ ఎలా వెడుతున్నామో, దారి అంత బాగా గుర్తులేదు.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ మార్కెట్ఏరియాకి దగ్గర్లోనే ఉన్నట్లుంది. సరిగ్గా ఏడు నిముషాల్లో అక్కడికి చేరుకున్నాం. నేరుగా బ్రేక్‌ఫాస్ట్ రూంకి తీసుకెళ్లాడు వైయాంగ్. అక్కడంతా బఫే సిస్టం. ఎవరి తిండి వారు తెచ్చుకోవాలి. బాయిల్డ్ ఎగ్ వగైరాలేవో ఉన్నాయి. కాఫీ, టీ కలుపుకునేందుకు ఏర్పాట్లున్నాయి. అక్కడ నాకు నప్పేవి పావులీటరు పాలప్యాకెట్లు, బ్రెడ్ స్లయిసులు, బుల్లి బుల్లి ప్యాకెట్లలో – వెన్న, జాం, చీజ్. పాలు ఒక్క గుక్కలో తాగాను. ఫ్రిజ్ లోంచి తీసినట్లు చల్లగా ఉన్న పాలు రుచి కూడా తెలియలేదు నాకు. బ్రెడ్డుకి వెన్న, జాం రాసుకుని తినేసరికి కడుపు నిండిపోయింది. చీజ్ నకు సహించలేదు.

బ్రేక్‌ఫాస్ట్ కాగానే వైయాంగ్ న్ను ఆఫీసుకి వెళ్లమని చెప్పాడు.

ఆఫీసులో నాకు నెలఖర్చులకిగానూ మూడువందలమార్కులు ఇచ్చారు. కొత్తగా చేరినవారికి బ్యాగేజీ ఎలవెన్స్ఉంటుందట. అందుకని మరో నూటయాభై మార్కులు ఇచ్చారు. మొత్తం నాలుగు వందల యాభై మార్కులు చేతికి అందాయి. ఆ డబ్బు చేతికందగానే బలంగా, ధైర్యంగా ఫీలయ్యాను.

ఆ డబ్బు కాక పగటిపూట భోజనానికి ఓ ఇరవై మీల్సు టిక్కెట్లు కూడా ఇచ్చారు. ఆ టికెట్లు ఊళ్లోని పదకొండు హోటళ్లలో చెల్లుతాయట. ఆ టికెట్లు ఉపయోగించుకోని పక్షంలో – నెలాఖర్లో తిరిగిచ్చేస్తే – టికెట్టుకి నాలుగున్నర మార్కుల చప్పున వాపసు ఇస్తారుట.

ఆఫీసు దగ్గర ఉండగానే అక్కడికి కొందరు టీచర్లు వచ్చారు. వాళ్లు తమవద్దనున్న జాబితాలు తీసి కొన్ని పేర్లు చదివారు. ష్వయిరింగ్ అనే ఆమె జాబితాలో నాపేరుంది. అనగా ఆమె నాకు టీచరన్నమాట.

నాతో పాటు వచ్చిన మిగతా ఇండియన్లు నటరాజన్, బిశ్వాస్, గుప్తాల పేర్లు కూడా ష్వయిరింగ్ జాబితాలోనే ఉన్నాయి. అందుకు ఎంతో సంతోషిస్తూ, మేము నలుగురం ఆమెతోపాటు క్లాసుకి వెళ్లాం.

క్లాస్‌రూం అమరికగా ఉంది. ప్రతి ఒక్కరికీ అందమైన కుర్చీ, దానిముందు బల్ల ఉన్నాయి. ప్రతి బల్లమీదా హెడ్‌ఫోన్సు ఉన్నాయి. ఎదురుగా టీచరు కూర్చునేందుకు కుర్చీ, బల్ల – ఆమె వెనుక గోడకి వ్రాతబల్ల ఉన్నాయి. బల్లమీద టేపురికార్డర్, స్లైడుప్రొజెక్టర్ఉన్నాయి. కాస్త పక్కగా స్లయిడ్ షోకి అనువైన తెర ఉంది.

మా క్లాసులో మొత్తం పాతికమంది ఉన్నారు. అందులో అరేబియా, ఫ్రెంచ్, ఆఫ్రికా, జపాన్, ఇండియా, బ్రెజిల్, స్పెయిన్, అమెరికానుంచి వచ్చిన వారున్నారు. అమ్మాయిలు నలుగురు. నల్లవాళ్లు అయిదుగురు. ఇండియన్సులో నాతోపాటు వచ్చినవారు కాక లాల్, శర్మ అనే మరో ఇద్దరున్నారు. ముందు అంతా ఒకరినొకరు పలకరించుకుని హడావుడిగా పరిచయం చేసుకున్నాం. అక్కడ అంతమంది భారతీయుల్ని చూశాక కొంత ఉత్సాహం కలిగింది. లాల్, శర్మల స్కాలరుషిప్పు డాడ్ కాదు. మరేదోనట. వాళ్లొచ్చి ఒకటి రెండు రోజులయిందిట.

లాల్ నాతో, "ప్రస్తుతం ఇక్కడ చేరినవారిలో సుబ్రహ్మణ్యం అనే తెలుగతనున్నాడు. అతనూ ఇక్కడకు వచ్చి కొద్ది రోజులే అయింది. ఇంకో క్లాసులో ఉన్నాడు. మనం భోజనాలవద్ద కలుసుకోవచ్చు" అన్నాడు.

"క్లాసులెప్పుడు? భోజన విరామమెప్పుడు?" అన్నాను.

"నీకిచ్చిన కాగితం చదవలేదా?" అన్నాడు లాల్.

నేనెక్కడ చదివాను? ఇంటికెళ్లి పడుకుని లేచి ఆదరాబాదరాగా ఇలా చక్కావచ్చాను. ఆ విషయం తెలిసి లాల్ఆ వివరాలు చెప్పాడు.

ల్యూనబర్గులో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ సోమ–శుక్రవారాలు ఉదయం 8–1, మధ్యాహ్నం 3–6 పని చేస్తుంది. ఉత్తరాలకోసమైతే శనివారాలు కూడా ఆఫీసుకొచ్చి 10–10.30 మధ్య తీసుకోవచ్చు. మిగతా రోజుల్లో ఉత్తరాలు తరగతి గదుల్లోకి తెచ్చిస్తారు. క్లాసులు లేనప్పుడు హౌస్ నంబర్ వన్‌లో జర్మన్ భాష సాధన చేసుకోవచ్చు. రూమ్‌నంబర్ 2లో రేడియో, టివి ఉన్నాయి. ఫలహారాల గదిలో పియానో ఉంది. హౌస్‌నంబర్2 లో టేబుల్‌టెన్నిస్ ఆడుకోవచ్చు. అక్కడ ఇంకా టివి గది, శీతలపానీయాల ఆటోమాట్(ఆటోమేటిక్ మెషీన్), రీడింగ్ రూ, రేడియో, టైపురైటర్ ఉన్న వ్రాతగది ఉన్నాయి. ప్రతి రోజూ రాత్రి 6–7 మధ్య సంస్థ మూసేస్తారు.

ఉదయం 7–8 సెల్ఫ్ సర్వీస్ ఫలహారం. 8కి కిచెను మూసేస్తారు. లంచికి వోచర్లిస్తారు. వాళ్లిచ్చిన జాబితాలోని 11 రెస్టారెంట్లలోనూ, ఏదైనా ఎంచుకోవచ్చు. జర్మన్ తిండికే అలవాటు పడడం మంచిదంటారు. వోచర్లు మిగిలిపోతే, ఆఫీసులో ఇచ్చి డబ్బులు వెనక్కి తీసుకోవచ్చు. శనాదివారాలూ, సెలవు దినాల్లో భోజనాల ఖర్చు ఎవరిది వారే భరించాలి. ప్రతి ఇంటా స్నానాల సదుపాయం ఉండదు. ఉంటే అనుమతి తీసుకుని ఉపయోగించుకోవచ్చు. ఇంటివాళ్లు అడిగితే డబ్బిచ్చుకోవాలి. ఇంకా స్వల్పధరలకి ఊళ్లో మునిసిపల్ రిసార్టుల్లోని స్నానశాలల్ని కూడా ఉపయోగించుకోవచ్చు. సాధారణంగా సాయంత్రాలు, శనివారాల్లో ఉదయం 7నుంచి రాత్రి 7 దాకానూ, ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1దాకా అది తెరచి ఉంటుంది. ఇండోర్ స్విమ్మింగ్ పూల్ కూడా ఉందక్కడ. అక్కడ నీళ్లు వెచ్చగా ఉంటాయి. కెరటాలు పడిలేస్తూ ఉంటాయి.

ఉండడానికే ఇల్లు. వంటకీ, బట్టలుతకడానికీ సదుపాయం లేదు. కరెంటు సాధనాలు వాడితే లాండ్‌లేడీకి చెప్పాలి. ఇంటికి మిత్రులొస్తే వాళ్లు రాత్రి 10లోగా వెళ్లిపోవాలి. ఎక్కువమంది మిత్రులుంటే వాళ్లని ఇళ్లలో కాక ఆఫీసులో కలవడం మంచిది. ఇల్లు ఆఫీసుకి దూరమైతే 30–50 నిముషాల నడక ఉండొచ్చు. దారిలో ఎక్కడైనా దొంగతనం జరిగితే, సంస్థ బాధ్యత లేదు. ఆ విషయమై ఎవరికివారు జాగ్రత్తలు తీసుకోవాలి. జర్మన్ పౌరుల పరిచయం చేసుకోవాలనుకుంటే, 'హౌస్ దర్ యుగెన్డ్'లో బుధవారాలు రాత్రిళ్లు 'ఔస్‌లేండర్ క్రెయిస్ ల్యూనబర్గ్' సమావేశాలకీ, శుక్రవారాలు రాత్రిళ్లు 'యుగెన్డ్ క్లబ్ సమావేశాలకీ వెళ్లొచ్చు.

ఈ వివరాలు చెప్పినందుకు లాల్‌కి థాంక్స్ చెప్పాను.

సరిగ్గా 8కి క్లాసు మొదలయింది. పాఠం చెప్పేటప్పుడు టీచరు ఆంగ్ల పదాలు వాడలేదు. సైగలతో జర్మన్ పదాలకు అర్థం తెలిసేలా చేస్తోందామె.

మనకు రాని భాషను మనకు రాని ఆ భాషలోనే నేర్పే ఈ పద్ధతి నాకు తమాషాగా అనిపించింది. అదీకాక పాతికమంది వయోజనులకు ప్రాథమికస్థాయినుండీ భాష నేర్పాలంటే, చాలా ఓర్పు కావాలి. అది చాలా కష్టమని నాకు అనిపించింది. మా టీచర్ చూపిస్తున్న సహనం మొదటిరోజునే నన్ను అబ్బురపరచింది.

మొదటిరోజు క్లాసులో మాకు చెప్పిన ముఖ్య విశేషాలు కొన్ని ఉన్నాయి. వాటిని మాత్రం మాకు ఆంగ్లంలోనే చెప్పడం జరిగింది. వాటిలో కొన్ని అప్పటికే నాకు లాల్ చెప్పాడు.

క్లాస్ రూంలో జర్మన్ తప్ప మరో భాష మాట్లాడరాదు. ఇంటికి ఎక్కువమంది అతిథులను ఆహ్వానించకూడదు. అతిథులెవరైనా రాత్రి పది దాటేక ఇంట్లో ఉండకూడదు. తాము నైట్ డ్రస్సు వేసుకుని ఉన్నప్పుడు జర్మన్ మహిళల్ని పలుకరించరాదు. అది అమర్యాదకరం. భోజనం చేసేటప్పుడు ఫోర్కు ఎడమచేతితోటీ, స్పూను కుడిచేత్తోటీ ఉపయోగించాలి. స్పూను ద్రవపదార్థాలకేగానీ ఘనపదార్థాలకి (అనగా అన్నం వగైరాలకి) ఉపయోగించకూడదు.

మధ్యాహ్నం భోజనవిరామసమయంలో సుబ్రహ్మణ్యాన్ని కలిశాను. అతను అచ్చమైన తెలుగువాడే కాక నాకులాగే ఫక్తు శాకాహారి. హెన్నీ బెక్కర్ అనే వృద్ధమహిళ నడిపే రెస్టారెంట్లో శాకాహారం మనకి కాస్త అనువని అతను అన్నాడు. నేను అతన్ని అనుసరించాను. మాతోపాటు లాల్, శర్మలు కూడా అక్కడికే బయల్దేరారు.

అంతకు ముందురోజు లాల్, శర్మలు ఒక చైనీస్ రెస్టారెంతుకి వెళ్లారుట. భోజనంతో పాటు మంచినీళ్లు అడగ్గా, "గిన్నెలు కడగడానికి మాత్రమే మేమిక్కడ నీళ్లుపయోగిస్తాం", అని వెటకారంగా జవాబిచ్చాడట అక్కడి సర్వర్. అందుకని వాళ్లింక ఆ రెస్టారెంటుకి వెళ్లదల్చుకోలేదు.

జర్మనీలో మేము ముఖ్యంగా గుర్తుంచుకోవలసిన విషయమొకటుంది. ఎవరినైనా పేరు పెట్టి పిలిచేముందు – వాళ్లు మగవాళ్లైతే హెర్ (ఇంగ్లీషులో మిస్టర్ లాంటిది) అనీ, ఆడవాళ్లైతే ఫ్రౌ అనీ, పెళ్లికాని యువతులైతే ఫ్రౌలైన్అనీ – పేరు ముందు తగిలించి పిలవాలి. అంటే మా ఇంటి యజమానురాలిని నేను 'ఫ్రౌ యాకేల్' అని పిలవాలి. పొడిగా 'యాకేల్' అనకూడదు. పలకరింపుకి 'గ్యుటెన్ టాగ్' (గుడ్ డే) అనీ, గుడ్‌బై చెప్పడానికి 'ఔఫ్ వీడర్‌జెహెన్' (సీ యు ఎగైన్) అనీ చెప్పాలి.

కొత్త దేశంలో కొత్త మనుషులమధ్య కొత్త సంప్రదాయాలకి అలవాటు పడ్డానికి ఈ సూచనలు ఆరంభంలో మాకు చాలా బాగా ఉపయోగపడ్డాయి.

ఆకలేసీ అన్నమడిగితే

ఫ్రౌ హెన్నీ బెక్కర్ రెస్టారెంట్లో సర్వింగు చేసేవారందరూ టీనేజర్సు. ఎక్కువమంది ఆడపిల్లలు. వాళ్లు హైస్కూళ్లలో, కాలేజీల్లో చదువుకుంటూ – తీరిక సమయంలో ధన సంపాదనకి ఇలాంటి పనులు చేస్తూంటారుట.

పాశ్చాత్య దేశాల్లో డిగ్నిటీ ఆఫ్ లేబర్ గురించి విన్నాను. ఇక్కడ ప్రత్యక్షంగా చూడగానే ముచ్చటేసింది. కానీ చెల్లెలో, అక్కో, కూతురో – ఇలా రెస్టారెంట్లో పనులు చేసి డబ్బు సంపాదిస్తే ఏ మధ్యతరగతి ఇండియన్ మగాడు సహించగలడు?

మార్పు ఎక్కడ మొదలవ్వాలో అర్థమైంది నాకు. కానీ అదెంత దూరంలో ఉందో తలచుకుంటే....

మిసమిసలాడుతున్న ఒక యువతి వచ్చి మెనూ కార్డు నా ముందుంచింది. నేనది చూడకుండా, "నేను శాకాహారిని" అని చెప్పాను.

అయోమయానికి నిర్వచనం అప్పుడా యువతి ముఖంలో కనబడింది నాకు. ఆమె వెంటనే వెళ్లి హోటలు యజమానురాల్ని పిలుచుకు వచ్చింది.

ఫ్రౌ హెన్నీ బెక్కర్ తెల్లగా, పొడుగ్గా, సన్నగా ఉంది. మోకాళ్లు దిగిన లేత గులాబి ఫ్రాకులో ఎంతో హుందాగా ఉంది. ఆమె నాతో, "నీకేంకావాలో చెప్పు. వండించి పెడతాను" అంది ఎంతో మర్యాదగా.

నాకు గుత్తివంకాయ కూరకావాలి. మాగాయి పెరుగుపచ్చడి కావాలి. ఆమె వండించగలదా?

ఆమె మర్యాదగా నన్నడిగినందుకు, నేనూ మర్యాదగానే బదులివ్వాలి. "నేను శాకాహారిని. శాకాహారం ఏమైనా ఫరవాలేదు" అని చెప్పాను.

"అయితే చికెన్ తింటావా?" అనడిగిందామె.

శాకాహారి చికెన్ తినడమేమిటో, అసలు శాకాహారమంటే ఆమె అవగాహన ఏమిటో నాకర్థం కాలేదు.

ఏమనాలో తెలియక తల అడ్డంగా ఊపాను.

"పోనీ చేపలు తింటావా?" అందామె.

నా ఆశ్చర్యం రెట్టింపయింది. చేపల్ని శాకాహారం అనుకుంటోందంటే – అసలు మాంసాహారమంటే ఏమిటి ఆమె ఉద్దేశ్యంలో!

మళ్లీ తల అడ్డంగా ఊపాను.

ఈసారి ఆమె కళ్లలో కాస్త చిరాకు కనబడింది, "పోనీ ఆమ్లెట్ ఇస్తాలే" అంది.

అదీ తిననేసరికి ఆమెలో ఓర్పు నశించినట్లుంది, "ఏంచేస్తాం? ఉడకబెట్టిన కోడిగుడ్లే గతి నీకు" అంది.

అవీ తినని చెప్పడానికి నాకు చాలా భయమేసింది. అలాగని అలవాటు లేని పని చెయ్యలేను కదా! భయం భయంగా తల అడ్డంగా ఊపాను.

"మరేం తింటావ్?" అందామె. ఈసారి ఆమె కళ్లలో కోపం లేదు. జాలి ఉంది.

అసహనం కంటే జాలి మెరుగు కదా – కాస్త ధైర్యం తెచ్చుకుని, "అన్నం, పప్పుదినుసులు, కాయగూరలు, పాలు, పళ్లు" అన్నాను.

ఆమె ఇంకేమీ మాట్లాడలేదు. అప్పుడు సుబ్రహ్మణ్యం వంకచూసి, "అన్నట్లు నువ్వూ ఇంతేకదూ?" అంది.

అంతవరకూ ఆమెకు స్ఫురించినట్లు లేదు – సుబ్రహ్మణ్యంలాంటి వ్యక్తి మరొకడుండొచ్చని!

అతను తలూపగానే చిన్నగా నవ్వుకుంటూ లోపలకు వెళ్లిందామె.

ఓ పావు గంటలో మా ఇద్దరికీ అన్నం, ఉడకబెట్టిన క్యారెట్లు, పచ్చిటమేటా ముక్కలు, పచ్చి ఉల్లిపాయముక్కలు, పుల్లగా ఉండే సలాడ్ ఆకులు, ఉడకబెట్టిన కుక్కగొడుగులు (మష్రూమ్స్) వచ్చాయి.

కుక్కగొడుగుల్ని చూడగానే నాకు వెలపరం వచ్చింది. నిజానికి వాటిలో పోషకపదార్థాలు చాలా ఎక్కువని నాకు తెలుసు. జర్మనులకెంతో ప్రీతికరమైన ఐటమ్ అది. కానీ నాకే కాదు, అక్కడున్న ఇండియన్సు మాంసాహారులకి కూడా కుక్కగొడుగులంటే జుగుప్సాభావం ఉంది.

జీవితంలో అలాంటి భోజనం తిని ఎరుగను. కానీ ఇది ఈ రోజుతో ఆగదు. ఒకటి కాదు, రెండుకాదు – కనీసం నాలుగు నెలలపాటు ఈ ఊళ్లో ఇదే తిండి తినాలి. తలుచుకోగానే భయమేసింది నాకు.

దానికితోడు మిగతా ఇండియన్సు నన్ను మరికాస్త భయపెట్టారు. శర్మయితే మరికాస్త జోరు పెంచి, "కొంచెం కొంచెంగా మాంసాహారం అలవాటు చేసుకో. లేకుంటే ఈ దేశంలో నిష్కారణంగా చచ్చిపోతావు" అన్నాడు.

శర్మ పంజాబీవాడు. ఉల్లిపాయ కూడా తినని సద్బ్రాహ్మణ వంశంలో పుట్టాడుట. యూరప్ రావడం అతనికి కొత్త కాదుట. దేశకాలానుగుణంగా తన అలవాట్లు మార్చుకున్నాడుట. బీఫ్ తప్ప ఏమైనా తినేస్తాట్ట.

అక్కడున్నవారిలో సుబ్రహ్మణ్యం కాక గుప్తా కూడా శాకాహారి. అతను శర్మ మాటలకు బాగా భయపడ్డట్లు కనిపించాడు. నేను మాత్రం, "సంప్రదాయాన్ని పట్టించుకునే రకం కాదు నేను. శాకాహారంలో పుట్టి పెరిగాను. మాంసాహారాన్ని నిరసించను కానీ, నాకు సంబంధించి ఊహలో కూడా తినలేను. నిజంగా ప్రాణాలు పోయే పరిస్థితి వస్తే ఏమో – నీకంటే ఓ అడుగు ముందుకేసి బీఫ్ కూడా తింటానేమో. సాగినంత కాలం మాంసాహారాన్ని స్వీకరించడానికి మానసికంగా సిద్ధపడి లేను నేను" అన్నాను.

సుబ్రహ్మణ్యం ఐతే శర్మకు జవాబు చెప్పనేలేదు.

ఆ రోజు క్లాసులు పూర్తి కాగానే ఎవరిళ్లకు వాళ్లు చేరాం. నా ఇంటి దగ్గర్లో ఓ షాపు ఉంది. అందులో బ్రెడ్, చిప్స్, అరటిపళ్లు, ఆపిల్ పళ్లు కొనుక్కున్నాను.

మర్నాడు శుక్రవారం. ఆ రోజు గడిస్తే శని, ఆదివారాలు రెండురోజులూ సెలవు.

సెలవురోజు కోసం నేనూ, నా ఇండియన్ మిత్రులూ కూడా ఎదురు చూస్తున్నాం. ఎందుకంటే జర్మనీలో అడుగు పెడుతూనే పాఠాల్లోకి వెళ్లిపోయాం. అదీ నర్సరీ లెవెల్లో జర్మన్ భాష నేర్చుకుందుకు. కానీ ఇంకా ఇక్కడి సాంఘిక జీవితంతో ఇన్వాల్వ్ కాలేదు మేము.

మాయాబజార్లు

ల్యూనబర్గ్ ఒక చిన్న పట్టణం. పురాతనకాలంది. పశ్చిమ జర్మనీలో ఉత్తరభాగాన ఉంది. జనాభా సుమారు యాభైవేలుండొచ్చు. కానీ ట్రాఫిక్ మాత్రం బొంబాయి, కలకత్తా నగరాల స్థాయిలో ఉంటుంది. అందుకు కారణం అక్కడ ప్రతిఒక్కరికీ స్వంత కారుండడమే అయుండొచ్చు. ఊళ్లో రోడ్లమీద కారు కనబడని క్షణముండదు.

జనాభాతో పోల్చితే ఊళ్లో అమ్ శాండేలో ఉన్న మార్కెట్ చాలా పెద్దదే అనాలి. అక్కడ అన్నీ అత్యంత ఆధునికం. చాలా షాపులకి కస్టమర్ అడుగెట్టగానే ఆటోమాటిక్గా తెరుచుకుని, లోపలకి వెళ్లగానే ఆటోమేటిక్గా మూసుకుపోయే అద్దాల తలుపులున్నాయి.

షాపుల్లో సూపర్ మార్కెట్ అనతగ్గవే ఎక్కువ. ఒకోటి మూడూ లేక నాలుగంతస్తుల భవనాల్లో ఉన్నాయి. ఒకో అంతస్తులో ఒకో తరహా వస్తువులు పెడతారు. బట్టలన్నీ ఓ అంతస్తు, పప్పుదినుసులన్నీ ఓ అంతస్తు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఓ అంతస్తు – అలాగన్నమాట! ఒక అంతస్తునుంచి ఇంకో అంతస్తుకి పోవడానికి ఎస్కలేటర్స్ (కదిలే మెట్లు) ఉండడం ఆశ్చర్యం. ఎందుకంటే అప్పటికి (1974) కలకత్తా మహానగరం మొత్తానికి ఒక్క రిజర్వ్ బ్యాంకు భవనంలో మాత్రమే కదిలే మెట్లు ఉన్నాయి. అదక్కడ టూరిస్ట్ అట్రాక్షన్ కూడా. మరిక్కడ ఓ చిన్న ఊళ్లో ప్రతి షాపులోనూ కదిలే మెట్లు! ఇక షాపులోకెడితే, మనవైపు ఉత్సవాలకు జరిగే తీర్థం గుర్తుకొస్తుంది. సూపర్ మార్కెట్లో కెల్లర్ (బేస్మెంట్ లేదా అండర్గ్రౌండ్) కూడా ఉంటుంది. అక్కడ కూరలు, పళ్లు, బ్రెడ్ వగైరా – భోజనానికి సంబంధించినవన్నీ దొరుకుతాయి. షాపులో అడుగు పెట్టగానే ట్రాలీలు (తోపుడు బళ్లు) ఉంటాయి. ఓ ట్రాలీ తీసుకుని తోసుకుంటూ షాపంతా తిరుగుతూ మనక్కావలసిన ఒకో వస్తువే ఏరుకుని అందులో పడేసుకోవచ్చు. వస్తువుమీదే ధర ప్రింట్అయి ఉంటుంది కాబట్టి దేనికి ఎంతవుతుందో మనకు తెలియనే తెలుస్తుంది. కౌంటర్ దగ్గరికి ఆ బండిని తోసుకుంటూ వెళ్లి – బండినక్కడ వదిలేసి వస్తువులన్నీ కౌంటర్లో అందజేస్తే, అక్కడి సేల్స్ వుమన్ (ఎక్కువగా ఆడవాళ్లే ఈ పని చేస్తుంటారు కాబట్టి సేల్స్ వుమన్ అనడం ఓకే) – బిల్లు తయారుచేస్తుంది. బిల్లు తయారుచేయడానికి ఆమె యంత్రాన్ని ఉపయోగిస్తుంది. ఆమె బిల్లు ఇవ్వగానే మనం డబ్బు ఇచ్చేయాలి. సరుకులు వేసుకునేటందుకు అవసరమైనన్ని ప్లాస్టిక్

సంచులిస్తుందామె. చాలా షాపుల్లో ఈ ప్లాస్టిక్ సంచులు ఉచితంగా లభిస్తాయి. కొన్ని షాపుల్లో మాత్రం సంచికి పది ఫెనిగ్స్ ఛార్జి చేస్తారు. ఇవన్నీ అప్పుడు నాకు వింతగా, కొత్తగా అనిపించాయి.

షాపులేమో చాలా పెద్దవి. వస్తువులన్నీ కస్టమరుకి అందుబాటులోనే ఉంటాయి. అందువల్ల దొంగతనానికి అవకాశముంది. అయితే అక్కడి పౌరులు సాధారణంగా చిన్నచిన్న దొంగతనాలజోలికి పోరు. అందువల్ల దొంగతనాలు అరుదే. అయినప్పటికీ ఎవరి జాగ్రత్తలో వారుంటారు. పెద్ద పెద్ద షాపుల్లో నలుమూలలా క్లోజ్డ్ సర్క్యూట్ (సిసి) టివి కెమేరాలు వ్రేలాడదీసి ఉంటాయి. వాటి ద్వారా షాపులో ఏంజరుగుతోందో ఆ దృశ్యాలన్నీ ప్రతి అంతస్తులోనూ ఉండే టెలివిజన్ మోనిటర్లో ప్రదర్శితమౌతాయి. ఆ మోనిటర్ ముందు మనమో కొద్ది నిముషాలు నిలబడితే మనని మనమే చూసుకోవచ్చు.

అన్ని షాపులకూ బయట అద్దాల షోకేసులుంటాయి. షాపు మూసివేసినా – షాపులో ఉండే ఆకర్షణీయమైన వస్తువులు, వాటి ధరల గురించి ఈ షోకేసుల్ని చూసి తెలుసుకోవచ్చు. రాత్రిళ్లయితే దీపాల వెలుగులో ఈ షోకేసులు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి. చాలామంది రాత్రుళ్లు ఒకో షాపే తిరుగుతూ ఈ షోకేసుల్ని చూసి వస్తుంటారు. అలా చూసి ధరల్ని అంచనా వేసుకుని ఏ షాపులో ఏ వస్తువు కొనాలో నిర్ణయించుకోవచ్చు. అందువల్ల మర్నాడు షాపు తెరిచాక సమయం ఎక్కువ వృథా కాదు. అలా షాపు మూసేసాక షో కేసుల్ని చూడడాన్ని పాశ్చాత్యదేశాల్లో విండోషాపింగ్ అంటారు.

విండోషాపింగ్ వల్ల ముఖ్యమైన ప్రయోజనమొకటుంది. సాధారణంగా ఈ దేశంలోని షాపుల్ని ఉదయం ఎనిమిదికి తెరుస్తారు. సాయంత్రం ఆరుకో ఆరున్నరకో మూసేస్తారు. జనాభాలో చాలామంది ఉద్యోగస్థులు కాబట్టి – ఆఫీసు వదిలాక షాపింగ్ చేయడానికి వారికుండే వ్యవధి తక్కువ. ఈ విండోషాపింగ్, వారికి సమయాన్ని బాగా ఆదా చేస్తుంది.

మాకైతే విండోషాపింగ్ వల్లనే ఏయే షాపులో ఏయే వస్తువులు ఏయే ధరలకు లభిస్తాయో తెలిసింది. వస్తువు ఒకటే ఐనా షాపునిబట్టి ధరలు తేడాగా ఉంటాయని కూడా తెలిసింది. ఆపైన విండో షాపింగ్ మంచి కాలక్షేపంగా కూడా ఉండేది.

ఆ షాపులు చూస్తుంటే నాకు కళ్లు తిరిగిపోయాయి. ల్యూనబర్గ్ రాజమండ్రి కంటె చిన్న పట్టణం. కానీ మార్కెట్ ఓ మహానగరానికి ఉండాల్సినంత ఉంది! మనకు ఎంతో కష్టంమీద కానీ దొరకని పాలు, వెన్న, పెరుగు వగైరాలు షాపు తెరిచిఉన్న సమయంలో ఎంత కావాలంటే అంత దొరుకుతాయి. కావాల్సినంతా కొనుక్కునే శక్తి ఉందా అనేది వేరేమాట! ఉంటేమాత్రం ఈ సమృద్ధి అప్పట్లో మనకెక్కడిది?

పిల్లలకు అత్యవసరమైన అముల్ స్ప్రే పాలడబ్బాలు తగినన్ని లేక – లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి కొందరికే ఇవ్వడం భువనేశ్వర్లో నాకు స్వానుభవం. అచ్చమైన ఆవుపాలు – అవసరానికి మించి అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయిక్కడ. ఈ పాలలో కూడా రెండు రకాలున్నాయి. ఓ రకం పాలు ఆరోజుకారోజు పితికిన తాజావి. ఇవి పల్చటి పోలితీన్ పేపర్లో ప్యాక్ చేయబడి ఉంటాయి. రెండో రకం కొద్దిగా కెమికల్ ట్రీట్‌మెంట్ పొందినవి. వీటిని హెచ్‌మిల్క్‌అంటారు. ఇవి చాలా రోజులు నిలవుంటాయి. ఏ తేదీ వరకూ నిలవుంటాయో ప్యాకెట్ మీద వ్రాసి ఉంటుంది. ఆ ప్యాకెట్‌అట్ట మందంగా, గట్టిగా ఉంటుంది.

షాపుల్ని టైం ప్రకారం తెరిచి టైం ప్రకారం మూసేస్తారు. సేల్స్ వుమన్ కస్టమర్సుతో ఆహ్లాదంగా మాట్లాడతారు. ఏ షాపులోనూ చిల్లరకి ఇబ్బంది లేదు. పది ఫెన్నిగ్స్ వస్తువుకొని పది మార్కులిచ్చినా చిల్లర దొరుకుతుంది.

ఆరంభంలో జర్మనీలో అన్నిటికన్నా మమ్మల్ని ఆకర్షించినవీ షాపులే!

మాతోపాటు ఢిల్లీలో విమానమెక్కివచ్చిన డాడ్ స్కాలర్స్‌లో నలుగురు ఈజిల్‌హోర్న్‌అనే ఊరు వెళ్లారు. కొన్ని కారణాలవల్ల అక్కడ వారికి కుదరలేదు. ముఖ్యకారణం ఏమంటే తమకి జర్మన్ భాష కొంత వచ్చునని ముందు చెప్పారుట. ఈజిల్‌హోర్న్‌లో పరీక్షించగా ఆ

నలుగురి పరిజ్ఞానం – ఆశించిన మేరకు సరిపోదని తేలింది. ప్రాథమికస్థాయి బోధనకి ఆ ఊళ్లో సదుపాయం లేదుట. ల్యూనబర్గులో ప్రాథమికస్థాయి బోధనాతరగతుల్లో కాళీలున్నాయని తెలిసి వారినిక్కడకు పంపించారుట. మేము చేరిన నాలుగైదు రోజులకి వాళ్లు వచ్చారు. వారిలో రామచంద్ర అనే అతని మాతృభాష కన్నడమే కానీ అతనికి తెలుగు బాగా వచ్చు. విశేషమేమిటంటే అతను కూడా నాకులాంటి శాకాహారి!

జర్మనీ చేరిన నాలుగైదు రోజుల్లో నాకు తిన్నది అరక్క విరేచనాలు పట్టుకున్నాయి. కల్తీలేని చిక్కని పాలు, వెన్న – యథాతథంగా తీసుకునే అలవాటు నాకు లేకపోవడమే అందుకు కారణమనుకుంటాను. అయితే ఆ విషయమై నేను డాక్టరు దగ్గరకి వెళ్లలేదు. గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్ వద్ద టీ డికాక్షన్ దొరుకుతుంది. ఒక పూట చిక్కటి టీ డికాక్షన్, రెండంటే రెండు చెంచాలు పుచ్చుకున్నాను. అంతే, ఆ డోసుకే విరేచనాలు ఆగిపోయాయి. అంతే కాదు, ఆ తర్వాత నాకు మళ్లీ తిన్నది అరగని సమస్య కూడా రాలేదు. జర్మనీ ప్రయాణానికి ముందు ఈ వైద్యవిధానాన్ని నాకుపదేశించిన మామగార్ని మనసులోనే అభినందించు కున్నాను. మళ్లీ నాకక్కడ టీ డికాక్షన్ తాగవలసిన అవసరం రాకపోతే అది వేరే మాట!

తివిరి ఇసుమున తైలంబు తీయవచ్చు

దేశాల పేర్లు చెప్పి పౌరుల్ని విభజిస్తాం కానీ, మనిషి మనిషికీ ఉండే తేడా అంతకంటే ఎక్కువే. ల్యూనబర్గులో చేరిన ఇండియన్సు అందరూ తలోరకంగానూ ఉండేవారు. వారిలో నాకు మొదట స్నేహమైంది నటరాజన్, బిశ్వాస్‌లతో. వాళ్లిద్దరూ ఒకే ఇంట్లో వేర్వేరు గదుల్లో ఉండేవారు. అదృష్టమేమంటే వాళ్లకి వండుకునే సదుపాయం కలిగించింది వాళ్ల లాండ్‌లేడీ.

బిశ్వాస్ బెంగాలీవాడు. తినడానికి రోజూ చేపలుకావాలి. నటరాజన్ చికెన్, గుడ్లు మించి ఇతర మాంసాహారం తినేవాడు కాదు. వాళ్లకు ఇంట్లో స్నానం చేసే సదుపాయం కూడా ఉంది. అదీ టబ్ స్నానం.

నటరాజన్ ప్రతిరోజూ స్నానం చేసేవాడు. బిశ్వాస్ నెలకు ఒకటి, రెండు రోజులు మాత్రమే స్నానం చేసేవాడు. స్నానం చేస్తే వంటికెంతో హాయిగా ఉంటుందని నటరాజన్ అనేవాడు. జర్మనీలాంటి దేశంలో ఎక్కువగా స్నానం చేయడంవల్ల మనుషులు న్యూమోనియా వచ్చి చచ్చిపోతారని బిశ్వాస్ అనేవాడు. ఒకసారి నేను తనింట్లో ఉండగా నటరాజన్ ఈ స్నానం ప్రసక్తి తెచ్చాడు. నేను వారానికి కనీసం ఐదు రోజులు స్నానం చేస్తాను కాబట్టి, నా మద్దతుతో బిశ్వాస్‌ని ఖండించొచ్చని అతడి ఉద్దేశ్యం.

బిశ్వాస్ నన్ను మాట్లాడనివ్వలేదు, "ఇక్కడివాళ్లని చూడు. తెల్లగా మిసమిసలాడిపోతుంటారు. పక్కన నిలబడితే ఘుమఘుమ లాడిపోతుంటారు. వాళ్లు రోజూ స్నానం చేస్తున్నారా?" అన్నాడు.

"మిసమిసలాడ్డానికి వాళ్ల రంగే అంత. ఘుమఘుమలాడ్డానికి కారణం వంటికి పూసుకునే సెంటు. కానీ కుళ్లుని దాచే సెంటు వాసనకీ, వంటి పరిమళానికి వాడే సెంటు వాసనకీ చాలా తేడా ఉంటుంది" అన్నాడు నటరాజన్.

"ఇంత చలి దేశంలో కూడా వంటి కుళ్లు గురించి మాట్లాడుతున్నావ్. అంత డర్టీయా నువ్వు! ఇండియాలో ఐతే నేను రోజుకి రెండు పూటలు స్నానం చేసేవాణ్ణి. నెల్లాళ్లు స్నానం చెయ్యకపోయినా వళ్లు అంతకంటే ఫ్రెష్‌గా అనిపిస్తుందిక్కడ" అన్నాడు బిశ్వాస్.

అప్పుడు నేను కలగజేసుకుని, "నువ్వు చెప్పింది నిజమే కానీ ఇప్పుడు మనిషెంత డర్టీ అని కాదు, ఫ్రెష్‌గా ఫీలవడానికి ఎంత కుళ్లుని ఎన్నాళ్లు వంటిమీద భరించగలడన్నది ముఖ్యం" అన్నాను.

నటరాజన్ పెద్దగా నవ్వేశాడు. బిశ్వాస్ చిరాగ్గా, "మీతో నాకు వాదనేమిటి? ఈ దేశంలో ఎలా ఉండాలో, మీనుంచి కాదు, ఇక్కడివాళ్లను చూసి నేర్చుకుంటాను" అనేశాడు.

బిశ్వాస్ కాస్త దూకుడు మనిషి. అతను ప్రతివారితోటీ ప్రతి విషయానికీ గొడవ పడేవాడు. మొదట్లో నేనూ ఒకసారి అతనితో గొడవపడ్డాను. జర్మనీ వచ్చి కూడా నేను కనీసం కాఫీ, టీలు తాగకపోవడం అతనికి నచ్చలేదు. ఒకరోజున ఆ విషయం ప్రస్తావిస్తూ, "నీలాంటివాళ్లు కొందరు తెలుసు నాకు. చిన్నప్పటినుంచీ తలిదండ్రుల చాటున పెరిగిన కారణంగా ఇలా ఉంటారు. అలా పాతికేళ్లు గడిచాయంటే ఆ తర్వాత మనిషి మారమన్నా మారడు. ఎవరికైనా ఏ దురలవాట్లైనా పాతికేళ్ల లోపే ఔతాయి" అన్నాడు.

బిశ్వాస్ ఆల్కహాలికుడు. పొగలమారి. తన అలవాట్లు తనవని సంతోషంగా ఉండొచ్చుగా – అడక్కుండా సంజాయిషీలిస్తాడు.

నాకు అతడిమీద జాలేసింది. ఎదుటివాళ్లని సమర్థించడంలో నాకో తృప్తి ఉంటుంది. అందుకని, "ఆల్కహాలు పుచ్చుకోవడం, సిగరెట్లు తాగడం దురలవాట్లని ఎందుకనాలి? అవే దురలవాట్లైతే, పాశ్చాత్యదేశాలింత అభివృద్ధిని ఎలా సాధించాయి? నువ్వు నీవి దురలవాట్లనుకోకు. నా విషయమంటావా – నేను బీయస్సీ అయ్యాక ఎమ్మెస్సీకి రెండేళ్లూ, పీహెచ్‌డికి నాలుగేళ్లూ ఒక్కణ్ణీ మొత్తం ఆరేళ్లు బయటే ఉండి చదువుకున్నాను. నేనుండే రూంలోని కుర్రాళ్లు చిత్తుగా తాగుతుండేవారు. రాత్రంతా పేకాడుతుండేవారు. నేను చుక్క కూడా తాగలేదు. పేకముక్క ముట్టనైనా లేదు. ఒకొక్కరిదొకో మనస్తత్వం. కాఫీ సంగతి చెప్పాలంటే మా అమ్మానాన్నలకు లేచీ లేవగానే కాఫీ కావాలి. ఆ తర్వాత రోజుకి ఐదారుసార్లు కాఫీ తాగుతారు. ఐదారేళ్ల వయసుదాకా నేనూ కాఫీ తాగేవాణ్ణి కానీ, ఎందుకో మానెయ్యాలనిపించి మానేశాను. అది మా అమ్మకి నచ్చక రోజూ బ్రతిమాలేది, కాఫీ తాగమని. అలా ఏడాదిపాటు ప్రయత్నించి, నా మనసు మార్చలేక చివరికి వదిలేసింది. అలవాట్ల విషయంలో నాది దృఢసంకల్పం" అన్నాను.

బిశ్వాస్‌కి నా వివరణ నచ్చలేదు, "నీ మాటలు నిజమైతే నువ్వు మహాత్ముడివై ఉండాలి" అన్నాడు హేళనగా.

"నేను మహాత్ముణ్ణో కాదో తెలియదు. కానీ నేను చెప్పింది నిజం" అన్నాను.

"నువ్వు చెప్పింది నిజం కావడం అసాధ్యం" అన్నాడు బిశ్వాస్.

"సాధ్యమని కనీసం నాకు తెలుసు?" అన్నాను నేను.

ఆ వెంటనే, ఎందుకో మరి, "నేను నీ మాటలు నమ్ముతున్నాను" అన్నాడు నటరాజన్ నాకు మద్దతుగా.

అంతే ఆ క్షణంనుంచీ నటరాజన్‌నీ, నన్నూ – తన శత్రుకూటంలో చేర్చేశాడు బిశ్వాస్.

ఆతర్వాత మరోసారి బిశ్వాస్‌తో అంతకంటే పెద్ద గొడవ వచ్చింది. అతను చెప్పిన ప్రకారం – ఫారిన్లో నాలుగైదేళ్లుండి భారతదేశం తిరిగి వెళ్లినవారికి ఒక విధమైన మతిచాంచల్యం కలుగుతోందిట. ఇక్కడి ఈ సదుపాయాలూ, సౌకర్యాలూ వంటబట్టేక – తిరిగి వెళ్లేసరికి వాళ్లకు భారతదేశంలో ఇమడడం కష్టమై పోతోందిట.

"నువ్వు చెప్పింది కొందరి విషయంలో నిజం కావచ్చు. కానీ అందరికీ అలా జరగదు" అన్నాను నేను.

"అందరికీ అలాగే జరుగుతుంది" నొక్కించాడు బిశ్వాస్. ఆవేశం చోటు చేసుకుంటోందేమో, అప్పుడే అతని ముఖం ఎర్రబడుతోంది.

"మనుషులంతా ఒకేలా ఉండరు. నువ్వన్నది చాలామంది విషయంలో నిజం కావచ్చేమో కానీ అందరికీ అలాగే జరుగుతుందనడం సబబు కాదు. పాశ్చాత్యదేశాలనుంచి ఇండియాకి తిరిగొచ్చి ఎప్పటిలా మామూలు జీవితం గడుపుతున్నవారు కొందరైనా ఉంటారు. కొంచెం కన్సెషనియ్యి" అన్నాను విషయం తేలిక చెయ్యాలని.

బిశ్వాస్ తల అడ్డంగా ఊపాడు, "ఇలా వచ్చినవారు నాకు ముప్పైఇద్దరు తెలుసు. అందరికీ మతి చాంచల్యం కలిగింది. కన్సెషనెలా ఇస్తాను?" అన్నాడు. పాండవులకు సూదిమొన మోపినంత నేలని కూడా ఇవ్వనన్న దుర్యోధనుడి పట్టదల ఉన్నదా గొంతులో.

ఐనా నేను, "భువనేశ్వర్లో మా కాలనీలోనే ఉంటున్నారు ఇద్దరు. ఇద్దరూ చెరో పదేళ్లూ అమెరికాలో ఉండి వచ్చారు. వాళ్లని సంతోషానికీ, సంతృప్తికీ మారుపేరని చెప్పుకోవచ్చు మరి" అన్నాను వెంటనే.

"నన్ను ఖండించాలని, నువ్వు కల్పించి అబద్ధం చెబుతున్నావు. నువ్వన్నట్లు జరగడం అసాధ్యం" అన్నాడు బిశ్వాస్. తను నమ్మని ప్రతి విషయాన్నీ అసాధ్యం అనడం అతడి అలవాటు.

నాకు విసుగొచ్చింది, "నువ్వు మాత్రం నిజం చెబుతున్నావని ఎలా నమ్మేది?" అన్నాను నేను.

"ముందు చెప్పింది నేను. దానికి కౌంటరేసింది నువ్వు. కాబట్టి నాది నిజం. నీది అబద్ధం" తేల్చేశాడు బిశ్వాస్.

నేనూరుకోలేదు. "ఈ ప్రపంచంలో నల్లకాకులుండవని నువ్వన్నావనుకో! నేను కౌంటరేస్తే అబద్ధమైపోతుందా?" అన్నాను.

అక్కడితో ఆగిపోతుందనుకున్నాను. కానీ బిశ్వాస్ మొండిగా వాదన కొనసాగిస్తూనే వున్నాడు. నేనూ బదులిస్తూనే ఉన్నాను.

నా సమస్య ఏమిటంటే, ఏ వాదననీ తేలికగా తీసుకోలేను. ఎదుటివాళ్ల తెలివితేటలపై గౌరవమున్నప్పుడు – వాళ్లు అర్థం లేదనిపించే వ్యాఖ్యలు చేసినా సీరియస్‌గా తీసుకుని, నిజానిజాల అన్వేషణకోసం సిన్సియరుగా ప్రయత్నిస్తాను. ప్రస్తుతం బిశ్వాస్‌లో ఆ సిన్సియారిటీ కనిపించడం లేదు. దాన్ని మూర్ఖత్వమనాలో, మరేమనాలో కానీ – తను పట్టిన కుందేటికి మూడే కాళ్లంటున్నాడు. నేనేమో తర్కాన్ని నమ్ముకున్నాను.

అలా అనుకుని, సపోర్ట్ కోసం పక్కనున్న మిగతా ఇండియన్ మిత్రులవంక చూశాను. అది గ్రహించాడో ఏమో, సుబ్రహ్మణ్యం నవ్వి, "ఒక బెంగాలీవాడూ, ఒక తెలుగువాడూ కలిసి మాట్లాడుకుంటే – పెద్ద గొడవగా మారక తప్పదని సామెత ఉంది" అన్నాడు. దానికి మిగతా ఇండియన్సు కూడా నవ్వారు.

అర్థం చేసుకోవాల్సిన విషయాన్ని వాళ్లు నవ్వులాటకు తీసుకున్నారని అర్థమయ్యేక – నాకు సిగ్గనిపించింది. మా వాదనను ఎవ్వరూ సీరియస్‌గా తీసుకోలేదనీ అంతా వినోదిస్తున్నారనీ తెలియడంతో, అక్కడితో ఆపేశాను. అయితే మనసులో మాత్రం ఆ విషయం నన్ను వేధిస్తూనే ఉంది.

బిశ్వాస్ కేవలం వాదనకోసం అలా చెప్పాడా? లేక నిజంగానే అతనికి తెలిసిన ముప్పైఇద్దరికి, పాశ్చాత్యదేశాల్లో కొన్నేళ్లుండి ఇండియా రాగానే మతిచాంచల్యం కలిగిందా?

ఎందుకో అది అసంభవమని నాకు అనిపించింది.

ఏదేమైనా ప్రతి విషయానికీ మొండిగా వాదించడం బిశ్వాస్‌కి అలవాటని నటరాజన్ కూడా ఆ తర్వాత నాకు చెప్పాడు. వాళ్లిద్దరూ ఉండేది ఒకే ఇంట్లో కాబట్టి ఇంచుమించు ప్రతిరోజూ ఇద్దరూ ఏదో విషయానికి గొడవ పడుతూంటారుట. నటరాజన్‌కి బిశ్వాస్ అంటే ఒకవిధమైన చిరాకు కలిగింది. బిశ్వాస్ పట్ల నాకూ అదే చిరాకుండడంవల్ల మేమిద్దరం మరికాస్త దగ్గరయ్యాం.

ల్యూనబర్గు వచ్చిన కొత్తలో నేనూ, నటరాజన్, బిశ్వాస్ – ఎరోటికా అనే షాపుకెళ్లాం. అక్కడ దొరికేవన్నీ పోర్నోగ్రఫీకి (బూతు) సంబంధించినవే. సినిమారీళ్లు, స్లైడ్స్, ఫొటోలు, సాహిత్యం – అంతా పచ్చి బూతు. అక్కడ కొన్ని పుస్తకాలు చూశాం. పచ్చి శృంగారచేష్టల ఫొటోలున్న ఓ పుస్తకాన్ని చూసి బిశ్వాస్ ముచ్చటపడ్డాడు. దాని వెల పది మార్కులు. అందరం కలిసి కొందామని బిశ్వాస్ ప్రపోజ్ చేశాడు. నాకు ఆసక్తి లేదని వెంటనే చెప్పాను. అప్పటికింకా బిశ్వాస్, నటరాజన్ల మధ్య గొడవలు మొదలవలేదు. బిశ్వాస్ అడిగాడని తనూ షేర్ చేస్తానన్నాడు నటరాజన్. ఆ పుస్తకం కొన్నాక ముగ్గురం కలిసి వాళ్లింటికి వెళ్లాం. ఆ బొమ్మలు చూస్తే నాకవి వెగటుగా అనిపించాయి. నగ్నయువతి అందాలు చిత్రకారులకు ప్రేరణ. నగ్నచిత్రాల సౌందర్యాన్ని ఆస్వాదించే వారిలో నేనూ ఉన్నాను. కళాదృష్టికి – వంపుసొంపులతో,

పొందికైన అవయవాలతో, నాజూకుగా ఉన్న స్త్రీ సౌందర్యం నగ్నత్వంలోనే ఇనుమడిస్తుంది. కానీ ఈ ఫొటోలలో చూపబడినది నగ్నసౌందర్యం కాదు. నగ్నత్వంలోని జుగుప్సకు ప్రతిబింబాలా అనిపించేలా – స్త్రీ, పురుష మర్మావయవాల క్లోజప్ ఫొటోలు అవి.

స్నానమప్పుడు కళాత్మకంగా అనిపించే నగ్నత్వం – బహిర్భూమికి వెళ్లినప్పుడు ప్రదర్శనయోగ్యం కాదు కదా! ఈ ఫొటోలు అలాంటివే.

"ఇలాంటి ఫొటోలు చూస్తే సెక్సు మీద విరక్తి పుడుతుంది" అన్నాను నేను.

"నాకు విరక్తి పుట్టలేదు. ఆసక్తి పెరుగుతోంది. కాబట్టి నీ అభిప్రాయం తప్పు" అన్నాడు బిశ్వాస్ వెంటనే.

"నా విషయంలో నా అభిప్రాయం సరైనదే. అది అందరికీ వర్తించాలని లేదు. ఆమేరకు నా అభిప్రాయాన్ని వెనక్కి తీసుకుంటున్నాను" అన్నాను నేను.

బిశ్వాస్ వెంటనే నటరాజన్వైపు తిరిగి, "ఇతను నిజం చెప్పడు. కాబట్టి ఇతన్ని పక్కన పెడదాం. మనం ముగ్గురం. నీ అభిప్రాయం నా అభిప్రాయంతో కలిస్తే, కనీసం ఇక్కడైనా మెజారిటీ మనదౌతుంది" అన్నాడు.

నటరాజన్ క్షణం కూడా తటపటాయించలేదు, "పోయిన అయిదు మార్కులూ ఎలాగూ పోయాయి. నీకంతగా నచ్చితే ఈ పుస్తకం నువ్వే అచ్చంగా ఉంచేసుకో. నాకిది మళ్లీ మళ్లీ చూడాలని లేదు. ఇకమీదట ఇలాంటి పుస్తకాల కొనుగోలుకి నా షేరింగ్ఉండదు" అన్నాడు.

తనకిష్టమైన పుస్తకం, పది మార్కులది, ఐదు మార్కులకే వచ్చిందన్న సంతోషంతోనేమో – బిశ్వాస్ మరి మాటలు పెంచకుండా ఆ పుస్తకాన్ని తీసుకెళ్లి తన గదిలో దాచుకున్నాడు.

ఆ తర్వాత మరోసారెప్పుడో బిశ్వాస్ ఆ పుస్తకాన్ని సుబ్రహ్మణ్యానికి చూపించాడు. సుబ్రహ్మణ్యం కూడా నాకులాగే స్పందించాడు.

బిశ్వాస్‌కి ఉక్రోషం వచ్చినట్లుంది, "అవున్లే, ఈ పుస్తకంలో ఫొటోలు చూసి మనసులో ఆనందించి, పైకి నిరసించడం పెద్దమనిషి తరహా అనిపించుకుంటుంది. అందుకని ఎక్కువమంది మీలాగే చెబుతారు" అన్నాడు.

సుబ్రహ్మణ్యం అప్పటికేమనలేదు. కాసేపయ్యాక ఏదో సందర్భంలో అతను బిశ్వాస్‌తో, "ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. సాధారణంగా బెంగాలీ కుటుంబాల్లో ఆడపెత్తనం ఎక్కువంటారు. నిజమేనా? నువ్వు మనసులో మాట చెప్పడానికి సంకోచించనివాడివని అడుగుతున్నాను" అన్నాడు.

బిశ్వాస్‌కి ఈ ప్రశ్న నచ్చలేదు. నచ్చని మాట విన్నప్పుడు అతనికి అంతో ఇంతో కోపం కూడా వస్తుంది. ఈసారా కోపం కాస్త ఎక్కువగా వచ్చిందేమో, ముఖం బాగా ఎర్రబడింది. "మీ తెలుగు ఆడవాళ్లకు సెక్స్‌పిచ్చి ఎక్కువటగదా! పెళ్లయ్యాక కూడా ఒక మగాడు చాలక, ఇతరులతో సంబంధం పెట్టుకుంటారుటగదా! అలాగని బెంగాల్లో చెప్పుకుంటారు. ఎంతవరకూ నిజం?" అన్నాడు.

బిశ్వాస్ స్పందన అంత తీవ్రంగా ఉంటుందని ఊహించని సుబ్రహ్మణ్యం గతుక్కుమన్నాడు. ఓ క్షణమాగి, "ప్రశ్నకు ప్రశ్న సమాధానమవుతుందా?" అంటూ సహకారానికి నావంక చూశాడు.

మామూలుగా ఐతే నేనా సందర్భానికి సిన్సియరుగా రియాక్టయ్యేవాణ్ణి. కానీ మనకి తగిలిన దెబ్బకి నొప్పి ఇతరులకి తెలియాలంటే వాళ్లకీ అదే దెబ్బ తగలాలి కదా – అందుకని, "మీరే చెప్పారుగా – ఒక తెలుగువాడూ, ఒక బెంగాలీవాడూ కలిసి మాట్లాడుకుంటే అది గొడవగా మారుతుందని!" అన్నాను.

అది పగ తీర్చుకోవడం కాదు. అవతలివారిలో అవగాహన కలిగించడం. అవగాహన ఉంటే వాదనలు కొనసాగవు. అప్పటికా వాదన అలా తెగిపోయింది.

ఆ తర్వాత ఒంటరిగా కలిసినప్పుడు చెప్పాను సుబ్రహ్మణ్యానికి.

బెంగాలీ స్త్రీలు డామినేటింగ్ అనడం బెంగాలీలకి అభినందన. ఐనా బిశ్వాస్ ఆ మాటకి తీవ్రంగా స్పందించాడంటే, సుబ్రహ్మణ్యం అడిగిన తీరులో తేడా ఉండిఉండాలి. లేదా బెంగాలీ ఆడవాళ్లు నిజంగానే డామినేటింగ్ అయుండొచ్చు. అది కాంప్లిమెంటుగా భావించని పురుషాహంకారం బిశ్వాస్‌కి ఉండిఉండొచ్చు. కానీ దానికి ప్రతిగా తెలుగు మహిళలకు మదపిచ్చి అన్న అతడి మాట ఉక్రోషాన్ని తెలియజేస్తుంది. అది ఉన్నమాట కాదు కాబట్టి తెలుగు మగాళ్లకి ఉలుకు అవసరం లేదు.

ఏదేమైనా బిశ్వాస్‌కి అసహనం ఎక్కువే!

బెంగాలీలు, ఒరియావారు వంటకి ఆవనూనె వాడతారు. అది ఘాటుగా ఉంటుందని వాళ్లూ ఒప్పుకుంటారు. కొరివికారాన్ని ఇష్టపడ్డంతమాత్రాన అది చాలా ఘాటనీ, నోరు మండిస్తుందనీ ఒప్పుకోకుండా ఉండలేం కదా!

అదే స్పిరిట్‌తో నటరాజన్ ఒకసారి మాటల సందర్భంలో బిశ్వాస్‌తో, ఆవనూనెకి చాలా ఘాటైన వాసన ఉంటుందనీ, అది తనకి పడదనీ అన్నాడు.

మామూలే, బిశ్వాస్ ముఖం ఎర్రబడిపోయింది, "వేరుశనగనూనె వాసన, ఆమడ దూరంలో ఉన్నా సరే, నాకు వాంతిని తెప్పిస్తుంది" అన్నాడు.

బిశ్వాస్ అసహనానికి పరాకాష్ఠ జర్మన్ పరీక్ష సందర్భంలో చూశాను నేను. మర్నాటి పరీక్షలో ఓ గ్రామరు పాయింటు చాలా ముఖ్యమైనది. నేనొకటంటే అతనొకటంటున్నాడు. మాటనెగ్గడం కంటే వ్యాకరణ సూత్రం తెలుసుకోవడం ముఖ్యం కాబట్టి నేను వెంటనే పుస్తకాలన్నీ తిరగేసి మొత్తంమీద సమాధానం పట్టుకున్నాను. నేను చెప్పిందే రైటు.

బిశ్వాసుకి అది చూపించబోగా, అతనా పుస్తకం చూడడానికి నిరాకరించాడు.

ఇటువంటి సంఘటనలు కొన్ని జరిగినప్పటికీ – స్వతహాగా బిశ్వాస్ మంచివాడేనని నేను గ్రహించాను. అందువల్లనే చాలామంది అతన్ని దూరం పెట్టినప్పటికీ నేను మాత్రం స్నేహాన్ని కొనసాగిస్తూనే వచ్చాను.

ఎందరో మహానుభావులు

అప్పుడప్పుడు ఆవేశపడడం, ఆవేశంలో హద్దులు మీరడం మానవసహజం! నేను నా అనుభవంలో గ్రహించిన దేమిటంటే శత్రుత్వం మనిషికి ఆనందాన్నివ్వదు. సహనం పెంపొందించుకుంటే చాలు – ఎవరికీ ఎవరితోనూ శత్రుత్వముండదు. ఒకొక్కరిది ఒకో వ్యకిత్వమైనా ప్రతి వ్యక్తిలోనూ ఏదో గొప్పతనం ఉంటుంది. ఈ విషయాన్నే త్యాగరాజు 'ఎందరో మహానుభావులు' కీర్తనలో చెప్పాడు.

మా గుంపులో మరో విచిత్రవ్యక్తి శర్మ. ఇతను పొరపాటున భారతదేశంలో పుట్టాడనిపిస్తుంది. జర్మనీదేశపు అలవాట్లకి ఎంత త్వరగా మారిపోగలిగాడంటే, తాగుడులో ఒకరోజున అతను ఒక జర్మన్‌తో పోటీపడి ఓడించాడు. అతనిలోని మరో ప్రత్యేకత, నోటికొచ్చిన అబద్ధం చెప్పేయడం.

అతను కోపెన్‌హాగన్లో ఉండగా ఓ అమ్మాయితో తిరిగితే, ఆ అమ్మాయి గర్భవతినైనానని చెప్పిందిట. ఎలాగో వదుల్చుకున్నానన్నాడు. స్టాక్‌హోంలో ఉద్యోగం వచ్చిందిట. కానీ దేశాలన్నీ తిరిగేక, అమెరికాలో స్థిరపడాలనుకుని, ఆ ఆఫర్ కాదన్నానన్నాడు. ఇంకా ఓ జర్మన్

పత్రికకి వ్యాసాలు రాస్తున్నానన్నాడు. హాంబుర్గులో తనకి చాలామంది జర్మన్ మిత్రులు ఉన్నారన్నాడు.
అక్కడ ఆడపిల్లలు ఎనిమిది మార్కులకే దొరుకుతారన్నాడు.

ఇలాంటివెన్నో చెప్పి, ఎదుటివాళ్లు నమ్మినంతసేపూ నమ్మిస్తాడు. అది అబద్ధమని ఋజువైనప్పుడు చలించడు. తేలికగా నవ్వేసి ఊరుకుంటాడు. తనని ఎవరెంత వేళాకోళం చేసినా సహిస్తాడు. దేనికీ కోపగించుకోడు. అవకాశం దొరికితే మాత్రం ఉపన్యాసాలు దంచుతాడు. నైట్‌క్లబ్‌లకీ, సెక్స్ సినిమాలకీ తరచుగా వెళ్లేవాడు. కానీ అతనికి సెక్స్ పైన ప్రత్యేకమైన ఆసక్తి లేదు. కంపెనీ కోసం ఏమైనా చేసేవాడు.

శర్మ నాతో, "నువ్వు బ్రాందీ, విస్కీ, బీరు వగైరాలు తాగకపోవడం బాగానేఉంది. కనీసం 'టీ' అయినా పుచ్చుకోవేమిటీ? అదేం పాపం చేసిందీ!" అని నవ్వేవాడు.

శర్మ బాగా ఖర్చుమనిషి. వచ్చే డబ్బు అతనికి సరిపోయేదికాదు. అందుకని అప్పులు చేస్తూండేవాడు. అతనికి తరచుగా అప్పు ఇచ్చేవాడు లాల్. అప్పు అడుగుతాడనే భయంతో కొంతమంది ఇండియన్సు శర్మను తప్పించుకుని తిరిగేవారు. అలాగని శర్మ డబ్బు కక్కుర్తి మనిషి కాడు. అతను తరచుగా అందర్నీ తనింటికి పిల్చి వైన్ ఇస్తుండేవాడు.

ఒకరోజు తన పుట్టినరోజు పేరు చెప్పి ఇండియన్స్ అందర్నీ ఆహ్వానించాడతను. మేమో సిగర్ లైటర్ కమ్ అష్‌ట్రే కొని ప్రజంటేషన్‌గా ఇచ్చామతడికి. పార్టీలలో ఫ్రీగా లభించేటప్పుడు కూడా నేను ఆల్కహాల్ జోలికి పోకపోవడం లేదని శర్మ నన్ను మెచ్చుకున్నాడు.

శర్మ నాకు నచ్చడానికి ముఖ్య కారణం, అందరివద్దా అప్పులు చేస్తూ కూడా అతను నన్ను అప్పు అడక్కపోవడమే!

శర్మ తరచుగా యూరప్‌లో తన అనుభవాలగురించి చెబుతుండేవాడు. అవి కోతలని తెలిసిపోతూనే ఉండేవి. వాటం చూస్తే అతను యూరప్ రావడం అదే ప్రథమం అనిపించేది. కానీ కోతలైనా సీరియస్‌గానే చెప్పేవాడు. ఎదుటివారు వాదించి అవి కోతలని నిరూపిస్తే, 'భలే పట్టేశావే' అన్నట్లు అభినందనపూర్వకంగా చూసేవాడు తప్ప తడబడేవాడు కాదు.

శర్మకి ఎవరినైనా ఆకట్టుకునే గుణముంది. ఒకసారి అతను మా టీచర్ ష్వయిరింగ్‌కి చటుక్కున పాదాభివందనం చేశాడు. ఆమె తెల్లబోయి అదేమిటని నొచ్చుకుంది. "గురువులకి పాదాభివందనం చెయ్యడం, భారతీయ సంస్కృతి" అన్నాడు శర్మ తడుముకోకుండా – అక్కడికి తనేదో భారతీయ సంస్కృతికి ప్రతినిధిలా వ్యవహరిస్తున్నట్లు.

మరి జర్మనీలో గురుశిష్యులు చెట్టాపట్టాలేసుకుని తిరుగుతూ స్నేహితుల్లా మసలుతారు. కలిసి దమ్ము, మందు కొడతారు. ఇంకా ఏమైనా కూడా చెయ్యొచ్చు. అందుకని ష్వయిరింగ్ ఈ సనాతన సంప్రదాయాన్ని నిరసిస్తుందనుకున్నాను. కానీ మ్రొక్కబడినవి తన కాళ్లు కదా! ఆమె ముఖంలో వెలుగు స్పష్టంగా కనిపించింది. తను భారత దేశంలో గురువునై ఉండాల్సిందని క్షణమాత్రమైనా ఆమెకి అనిపించి ఉండాలని నాకు అనిపించింది. కొన్ని విషయాల్లో ఆధునికులమనేవారు కూడా, పైకి కాపిటలిజాన్ని నిరసించే కమ్యూనిస్టుల వంటివారేనని స్ఫురించింది. అందుకు శర్మకు మనసులో ధన్యవాదాలు చెప్పుకున్నాను.

శర్మ స్నేహితుడు లాల్ గంభీరంగా ఉండేవాడు. క్లాసులో అతనికి మంచి మార్కులు వచ్చేవి. అందరూ అతన్ని పెద్దమనిషిలా చూసేవారు. వయసులో మాత్రం అతనూ మాతోటివాడే.

సుబ్రహ్మణ్యం ఇండియాలో రిజర్వ్ బ్యాంకులో పెద్ద ఆఫీసరు. తెలుగు వాళ్లమని అతనూ నేనూ కలిసి ఎక్కువగా తిరుగుతుండేవాళ్లం. శర్మ చెప్పే అబద్ధాలకి అతను బాగా చిరాకు పడేవాడు. ఆల్కహాలు విషయంలో అభ్యంతరముండేది కాదు కానీ శాకాహారం విషయంలో మాత్రం సుబ్రహ్మణ్యం కూడా నా అంత కచ్చితం.

మా మిత్రుల్లో ఇద్దరు గుప్తాలున్నారు. ఇంటిపేర్లు ఒకటైనా ఇద్దరివీ భిన్నధ్రువాలు అనొచ్చు.
జర్మనీలో అడుగు పెట్టగానే ఓ గుప్తా జబ్బు పడ్డాడు. అందుకని అతడికి క్రంకెన్ (రోగి) గుప్తా అని పేరు పెట్టాం. రెండో గుప్తా నిత్యం తన ఆరోగ్యం గురించి ప్రగల్భాలు పలుకుతూండడం వల్ల, అతణ్ణి గెసుండ్(హెల్దీ) గుప్తా అన్న పేరు స్థిరపడింది.

క్రంకెన్ గుప్తా ప్రవర్తన విచిత్రంగా అనిపించేది. ఎప్పుడూ పరధ్యానంగా ఉండేవాడు. తలిదండ్రుల నీడను దాటి బయటకు రావడం అతనికిదే ప్రథమంట. దానికి తగ్గట్లే ల్యూనబర్గులో అడుగుపెట్టిన వారానికే అతనికి జబ్బు చేసింది. వెంటనే హాస్పిటల్లో చేర్చారు

అక్కడ అతను సుమారు నాలుగు రోజులున్నాడు. బిల్లు నాలుగు వందల మార్కులకు పైనయ్యింది. అదృష్టమేమిటంటే మేము జర్మనీలో అడుగు పెట్టిన క్షణంనుంచీ – డాడ్ వారు మాకు హెల్త్ఇన్సూరెన్సు తీసుకున్నారు. అందువల్ల ఆ ఖర్చు మొత్తం ఇన్సూరెన్స్ కంపెనీ భరించింది. ఇన్సూరెన్స్ లేని పక్షంలో – జర్మనీలో వైద్యపు ఖర్చు – మావంటి సామాన్యులకి అందుబాటులో ఉండదు.

మేమంతా గుప్తాని చూడ్డానికి హాస్పిటలుకి వెళ్లినపుడు అతను బాగానే ఉన్నాడు. నిజానికతనికి పెద్ద జబ్బేం చెయ్యలేదు. జలుబు కాస్త తీవ్రంగా వస్తే కంగారుపడ్డాడు. హాస్పిటల్లో చేరేక, మొదటిరోజు పరిస్థితి అంత బాగోలేదు కానీ మర్నాటినుంచీ అనారోగ్యం ఏమీ లేదుట. హాస్పిటల్ సదుపాయాలు ఎంత బాగున్నాయంటే అతనికింకా అక్కడే ఉండాలనిపిస్తోందిట. అందమైన నర్సులు చూపిన ఆదరణ కూడా అతనికి మరో ఆకర్షణ.

మనదేశంలో హాస్పిటల్సుకీ ఇక్కడి హాస్పిటల్సుకీ చాలా తేడా ఉంది. హాస్పిటల్లో ఉన్నన్ని రోజులూ సంతోషంగా కనబడ్డ గుప్తా ముఖంలో డిశ్చార్జ్అయ్యే రోజున దిగులు కనబడింది.

జర్మన్ భాష నేర్చుకోవడంలో ఈ గుప్తా సీరియస్‌గా ఉండేవాడు. అలవాట్ల విషయానికొస్తే – అతనిపై శర్మ ప్రభావం బాగా పడింది. ఆరంభంలోనే జబ్బు పడ్డాడేమో, ఇక శర్మనే గురువుగా స్వీకరించాడు. ఇండియాలో అతను శాకాహారి. జబ్బుపడ్డ మర్నాటినుంచీ మాంసాహారానికి మారిపోయాడు. మాంసాహారం చాలా రుచిగా ఉందనీ, ఇంతకాలం తనా రుచికి దూరం కావడం దురదృష్టమనీ వాపోయేవాడు.

"ఇండియాలో ఉండగా నాకు పాలు తాగడం ఇష్టముండేది కాదు. ఇక్కడ పాలు మరిగాను. కల్తీ లేకనేమో, ఇండియాలో నచ్చని అనేక శాకాహార పదార్థాలు నాకిక్కడ నచ్చుతున్నాయి. మాంసం కూడా ఇండియాలో కంటే ఇక్కడ రుచిగా ఉంటుందేమో! అందుకే గుప్తా మాంసాహారానికి మారిపోయాడు" అన్నాను నేను.

దీనికి నటరాజన్ ఒప్పుకోలేదు. జీవితంలో మాంసాహారం తినని వాళ్లకు ఇక్కడి మాంసాహారం నచ్చవచ్చునేమో కానీ, తనకు మాత్రం ఇండియాలో మాంసాహారమే బాగుండేదన్నాడు. ఇక్కడ మాంసాహారానికి రుచి, పచి లేదుట. మసాలాలు వేసి వండని మాంసం, వంటకమే కాదనేవాడతను.

తనకు దొరికిన శిష్యుణ్ణి శర్మ వదిలిపెట్టేవాడు కాదు. గిరీశం వెంకటేశాన్ని పట్టినట్లు, ఇరవైనాలుగు గంటలూ క్రంకెన్ గుప్తాను, కూడా తిప్పుకుంటూ ఎన్నో లెక్చర్సు ఇస్తూండేవాడు శర్మ.

గెసుండ్ గుప్తా విషయానికొస్తే అతడు పూర్తిగా భిన్నం. ఇండియా వదిలిపెడుతూనే పాశ్చాత్యుల్ని గురించి చాలా ఊహలతో, ఆశలతో వచ్చాడతను. జర్మనీలో అడుగు పెడుతూనే, "ఏరీ, అమ్మాయిలు కనిపించరేం? వైన్ గ్లాసులు అందించరేం?" అని హడావుడి పడ్డాడు.

అతనూ ఇండియాలో ఉండగా శాకాహారిట. మాటల సందర్భంలో ఓసారి నాతో, "ఇప్పుడు నాకు నరమాంసమైనా సరే అభ్యంతరం లేదు" అన్నాడు గొప్పగా.

అతనలా అనడానికి కారణం మాతో ఉన్న మిగతా ఇండియన్స్ఎవ్వరూ బీఫ్ (ఆవుమాంసం) తినకపోవడం.

గెసుండ్ గుప్తా స్వతహాగా మంచివాడు. ఎటొచ్చీ మాటతీరువ లేదు. వస్తూనే అందరితో గొడవ పడ్డాడు. అతని పద్ధతి నచ్చక చాలామంది అతన్ని వెలివేసినట్లు వదిలేశారు. జర్మనీ వచ్చి అక్కడి పరిస్థితులకు అనుగుణంగా మారిపోయిన తనకు ఎవ్వరితో పడకపోవడమూ, ఏ మాత్రమూ మారకుండా ఇండియాలో ఎలా ఉన్నానో అలాగే ఉంటున్న నాతో అందరూ సఖ్యంగా ఉండడమూ అతనికి ఆశ్చర్యంగా ఉండేది.

అది మనసులో పెట్టుకున్నాడేమో, ఒకరోజు అతను నాతో కయ్యానికి కాలు దువ్వుతూ, "నువ్వు శాకాహారివి కదా – మరి పాలు తాగుతావా?" అనడిగాడు.

"ఊఁ" అన్నాను.

"జర్మనీలోనూ శాకాహారులున్నారు. కానీ జంతుసంబంధమని జర్మన్ శాకాహారులెవ్వరూ పాలు కూడా ముట్టరు" అన్నాడతను.

పాలు జంతు సంబంధమన్నది నిజం. జర్మనీలో పాలని శాకాహారంగా భావించనివారున్నారని కూడా నేను విన్నాను. "నువ్వన్నది నిజమే. కానీ నేను జర్మన్ని కాదు, ఇండియన్ శాకాహారిని" అన్నాను.

"ఆవుపాలు మనిషికోసం కాదు. ప్రకృతి వాటిని ఆవుదూడకోసం ఇచ్చింది. ఆ పాలని మనుషులు తాగాలనుకోవడం అన్యాయం. అదలాగుంచితే, ఈ దేశాల్లో పాలెలా తీస్తారో తెలుసా – మిషన్లతో! ఆ పద్ధతిలో హింస ఉంది. ఒకోసారి పొదుగునుంచి రక్తం కూడా వస్తుంది. పాలు తాగడమంటే అలాంటి హింసను ప్రోత్సహించడమే. అది మాంసాహారం తినడంకంటె వెయ్యి రెట్లు ఘోరం" అన్నాడు గెసుండ్ గుప్తా.

నేను కూల్‌గా నవ్వి, "మిస్టర్ గుప్తా! ముందు నాకో విషయం చెప్పు. మాంసాహారం తినడం ఘోరమని నీ అభిప్రాయమా?" అనడిగాను.

"కాదు. పాలు తాగేవాడు కూడా మాంసాహారి అని నా అభిప్రాయం" అన్నాడు గుప్తా.

"ఐతే నాకూ కొన్ని అభిప్రాయాలున్నాయి, విను. ఒకటి – మాంసం తినడం నేరమో, ఘోరమో కాదు. అది న్యాయబద్ధం. చాలామంది ఎంతో ఇష్టంగా తినే ఆహారం. రెండు – శాకాహారి అనిపించుకోవాలన్న కోరిక నాకు లేదు. నా ఆహారపు అలవాట్లగురించి నలుగురికీ అర్థం కావడం కోసం ఓ నిర్వచనాన్ని అనుసరిస్తూ, నన్ను నేను శాకాహారిగా చెప్పుకుంటున్నాను. మూడు – పాలు తాగుతున్న కారణంగా నువ్వు నన్ను మాంసాహారి అని పిలవదల్చుకుంటే నాకేవిధమైన అభ్యంతరమూ లేదు. నేను పాలు తాగుతూనే ఉంటాను. నువ్వు నన్ను మాంసాహారి అను. కానీ నువ్వు తినే మాంసం, నన్నూ తినమని బలవంతపెట్టకు" అన్నాను.

"నువ్వు చాలా మొండివాడివి" అన్నాడు గుప్తా. అన్నాడు కానీ అతను నాకంటే మొండివాడు. నా అలవాట్ల గురించి విమర్శించే అవకాశంకోసం కాచుకుని ఉండేవాడు.

జర్మనీ చలిదేశం కాబట్టి అక్కడ మద్యం తీసుకోవడం అత్యంతావశ్యకం – అని తరచుగా ఇండియన్నుని ప్రబోధించేవాడు గుప్తా.

"ఇక్కడ తాగనివాళ్లం నేనూ, రావే కాబట్టి ఈ లెక్చర్ మా ఇద్దరి కోసమే అనుకోవాలి. మిగతావాళ్లంతా అంతో ఇంతో పుచ్చుకునేవాళ్లేగా!" అనేవాడు రామచంద్ర.

రామచంద్ర కూడా మద్యం పుచ్చుకోకపోవడంలో నా అంత ఖచ్చితంగానూ ఉండేవాడు. ఐతే మనసులో అతడికి మద్యం రుచి చూడాలని కోరిక ఉండేది. బొత్తిగా మద్యం జోలికి వెళ్లకపోవడంవల్ల నా గురించి అంతా విశేషంగా చెప్పుకుంటున్నారని అతడికి తెలుసు. తన గురించీ అలా ప్రత్యేకంగా చెప్పుకోవాలని అతడి కోరిక. కానీ తను కాఫీ, టీలు తాగడంవల్లనో ఏమో, మద్యం విషయంలో నాకొచ్చిన గుర్తింపు అతడికి రాలేదు. అందుకని అవకాశం వచ్చినప్పుడల్లా తననీ నన్నూ కలిపి చెప్పేవాడు.

"ఔను. నేను మీ మేలు కోరేవాణ్ణి. మీ ఇద్దర్నీ మార్చడమే నా లక్ష్యం" అన్నాడు గెసుండ్ గుప్తా. ఆ మాటకు కట్టుబడి, మేమంతా కలిసినప్పుడల్లా రోజూ ఒకసారి, చలిదేశాల్లో మద్యం ఆవశ్యకత గురించి ఉపన్యాసం ఇచ్చేవాడు. అంశమే కాదు, చెప్పే మాటలూ ఎప్పుడూ అవే కావడంవల్ల కొన్నాళ్లకి అది అందరికీ కంఠతా వచ్చేసింది. గుప్తా నోరు తెరవగానే ఎవరో ఒకరు ఆ ఉపన్యాసాన్ని తామే కొనసాగించి పూర్తి చేసేవారు.

"నన్ను చెప్పనివ్వండి" అన్నాడు గెసుండ్ గుప్తా ఒకరోజున.

"వద్దులే, వినడానికి కనీసం గొంతులోనైనా మార్పుండాలి" అన్నాను నేను.

అతని ముఖం ఎర్రబడింది. "ఇంతమందికి నా మాటలు కంఠతా వచ్చి ఏం లాభం, నీలో ఏ మార్పూ లేకపోయాక! ఇక ఇలా లాభం లేదు. రోజూ సాయంత్రాలు నీ గదికొచ్చి చెప్పడం మొదలెట్టాలి" అన్నాడు.

"నీకెందుకంత శ్రమ! ఇవి నాకూ కంఠతా వచ్చు. నా గదికెళ్లి నేనే చదువుకోగలను. ఎవరైనా చూసి ఏం చదువుతున్నావని అడిగితే గుప్తమంత్రమని చెబుతాన్లే" అన్నాను. అని ఊరుకోలేదు. అతనికి నమ్మకం కలిగించడానికి ఆ మాటలు నేనూ ఒకసారి చెప్పాను.

"గుడ్ జోక్" అని నవ్వేశాడు గెసుండ్ గుప్తా.

ఒకసారి అతనే నాకు చెప్పాడు. సెమినార్సులో ఎవరైనా కష్టమైన ప్రశ్న వేసినప్పుడు మనకి జవాబు తెలియకపోతే, "వెరీ గుడ్ క్వెశ్చన్" అని ముందరికాళ్లకి బంధమేసి తప్పించుకోవచ్చని. అలాగే నలుగురు కలిసి మాట్లాడుకుంటున్నప్పుడు తనమీదే జోక్ పడితే, "గుడ్ జోక్" అనడంతో టాపిక్ మారిపోతుందట.

ఏ మాటకామాటే చెప్పాలి. గెసుండ్ గుప్తాకి చాలా మంచి అలవాట్లున్నాయి. రోజూ ఉదయం వ్యాయామం చేసేవాడు. ఆ విషయం కూడా అడక్కుండా అందరికీ చెప్పేవాడు. మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉండేవాడు. ఒకసారి మేము బిశ్వాస్ఇంటికి దగ్గర్లో ఉన్న వాల్డ్‌లో (అడవి) కాలిబాటలో నడుస్తున్నాం. అందులో వ్యాయామం చేసేవారికి సదుపాయాలున్నాయి. మేమంతా అక్కడ పులప్స్ తీస్తే, గెసుండ్ గుప్తా మాకంటే ఎక్కువ తియ్యడమే కాక, విన్యాసాలు కూడా చేశాడు. చూడ్డానికి ఎంత బాగుందంటే, అలా వెడుతున్న ఓ జర్మన్ వనిత అభినందన పూర్వకంగా చప్పట్లు కొట్టి వెళ్లింది.

గుప్తా ఆరోగ్యాన్ని మేమూ అభినందించేవాళ్లం. కానీ ఆ విశేషాన్ని కూడా మద్యపానానికే అంటగట్టే బలహీనత మాత్రం అతణ్ణి వదిలేది కాదు.

ఒకరోజు కొందరు మిత్రులం ఆరుబయట ప్రాంతాన నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నాం. వాతావరణం చల్లగానే ఉన్నా ఎండపొడి బాగా తెలుస్తోంది.

"ఇలాంటి ఎండలో ఇంత చలిగా ఉంటుందంటే ఇండియన్సుకి నమ్మడం కష్టం" అన్నాడు క్రంకెన్ గుప్తా అరచేతుల్ని రాపాడిస్తూ.

అప్పుడు గెసుండ్ గుప్తా అహహా ఆని నవ్వాడు.

"ఎందుకలా నవ్వుతావు?" అన్నాడు బిశ్వాస్.

"వచ్చేముందే గుక్కెడు కోన్యాక్ (బ్రాందీ) పుచ్చుకున్నాను. అందువల్ల వళ్ళు ఎంతగా వెచ్చబడిందంటే స్వెటర్ తీసేసి వచ్చాను?" అంటూ క్రంకెన్ గుప్తాని చూసి, "గుక్కెడు కోన్యాక్‌తో సరిపోయేదానికి – ఇంత లావు స్వెటరు వేసుకుని పైగా చలి అంటుంటే నవ్వు రాదా మరి!" అన్నాడు.

ఆ తర్వాత ఒకొక్కరి దగ్గరకే వచ్చి, "ఎందుకీ స్వెటర్ బరువు వంటిమీద? నాకులా ఫ్రీగా తిరగొచ్చుగా. ఇలా ఎంత బాగుంటుందో – జస్ట్ గుక్కెడు కోన్యాక్ కీప్స్ ఎ స్వెటర్ ఎవే" అంటూ నాదగ్గరికొచ్చి ఆగిపోయాడు. నేను స్వెటర్ వేసుకోలేదు.

నిజానికారోజు బయట వాతావరణం ఆంధ్రాలో చలికాలంలా ఆహ్లాదకరంగా ఉంది. అలవాటైన ఉత్తరాదివాళ్లు వేసుకోవాలి తప్పితే, స్వెటర్ వేసుకుంటే ఉక్కపోసేలాగే ఉంది.

నేను గెసుండ్ గుప్తాతో, "బయల్దేరేముందు ఓ పావు లీటరు చల్లటి పాలు తాగి వచ్చాను. నేను ఉక్కగా ఫీలవడానికి కారణం అదవునోకాదో తెలియదు" అన్నాను.

అంతా నవ్వారు. గుప్తా "గుడ్ జోక్" అనకుండానే టాపిక్ మారింది.

గెసుండ్ గుప్తా తనకిష్టమైనట్లు తనుంటున్నాడు. నేను నాకిష్టమైనట్లు నేనుంటున్నాను. కానీ నాకున్న తృప్తి అతనికున్నట్లు లేదు. నేను తనకిలా ఉండడంలేదన్న అసంతృప్తి అతణ్ణి బాధిస్తోందని నాకు తెలుస్తూనే ఉండేది.

ఒకసారి అతను నాతో, "బాగా చదువుకున్నావు. సంస్కారమున్నవాడిలా కనబడుతున్నావు. ఈ దేశం వచ్చి ఈ దేశస్థుల అలవాట్లను నిరసించడం సభ్యత అనిపించుకుంటుందా?" అన్నాడు.

"నేను ఈదేశస్థుల అలవాట్లను నిరసించడంలేదు. నా అలవాట్లను నిలుపుకుంటున్నానంతే" అన్నాను.

"బీ ఎ రోమన్ ఇన్ రోమ్‌అన్న నానుడి నీకు తెలియదా?" అడిగాడు గుప్తా.

"ఎక్కడకు వెళ్లినా నీ వ్యక్తిత్వాన్ని నిలుపుకోమన్న నానుడి ఒకటుంది. నాకది ఇంకా ముఖ్యం!" అన్నాను.

"ఏం సాధిస్తావ్నీ అలవాట్లను నిలుపుకుని?" నిరసనగా అన్నాడు గుప్తా.

"చూడు మిస్టర్ గుప్తా! ఈ ప్రపంచంలో మంచిచెడ్డలు నిర్ణయించేది నేను కాదు. అందువల్ల నాకు లేని అలవాట్లను చెడ్డవని నేననను. నాకు మద్యమాంసాలపట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. మద్యమాంసాలు ముఖ్యమనుకునే ఈ దేశంలో ఉండే అవకాశం నాకొచ్చింది. నీలాంటి వాళ్లందరూ ఇక్కడికొచ్చి, మీ ఇష్టంమీద మద్యమాంసాలు స్వీకరిస్తూ, అవి లేకుండా ఇక్కడ బ్రతకడం అసాధ్యమని ప్రచారం చేస్తున్నారు. అది నిజం కాదని నా నమ్మకం. ఇక్కణ్ణించి వెళ్లేలోగా ఒక్క కోడిగుడ్డయినా తినకుండా, చుక్క బీరైనా తాగకుండా ఉండగలిగితే – నా నమ్మకం ఋజువు చేసినవాణ్ణవుతాను. నాకదో తృప్తి" అన్నాను.

"పార్టీలకొచ్చి తాగకపోవడం తమకి అవమానంగా భావిస్తారు జర్మన్స్. నీలాంటివాళ్లను వాళ్లు మనసులో ఏవగించుకుంటారు తెలుసా?" అన్నాడు గుప్తా.

"అది నీకు నువ్విచ్చుకుంటున్న సంజాయిషీ. లేదా నాకు కలిగించాలనుకుంటున్న భ్రమ! ఏ సంస్కృతినైనా అర్థం చేసుకుని గౌరవించగల సంస్కారం ఇక్కడి వారికుందని నాకనిపిస్తోంది" అన్నాను.

ఏమనుకున్నాడో కొంతకాలంపాటు గుప్తా నన్ను తప్పించుకు తిరిగాడు. ఇండియాలో అస్పృశ్యతను సృష్టించిన బ్రాహణుల కోవకు చెందినవాడినని నా గురించి అతనన్నట్లు తెలిసింది.

గెసుండ్ గుప్తాలాంటివాళ్లు జర్మనీలోనే కాదు, ఇండియాలోనూ చాలామందే తటస్థపడ్డారు నాకు. నా స్నేహితుల్లోనే చాలామందికి నా అలవాట్లు నచ్చేవి కాదు. రోజుకి పలుమార్లు టీ తాగడమే సంస్కృతిలో భాగం అనుకునే ఒరిస్సాలో, పదిమంది ఒకచోట కలిసినప్పుడు, నేనొక్కణ్ణే టీ తాగకపోవడం బాగా నిరసనకు గురయ్యేది. అయితే నా మానాన నేనుంటూ, ఇతరుల అలవాట్లను నిరసించకుండా స్నేహభావాన్ని మాత్రమే ప్రదర్శిస్తున్న నన్ను, వాళ్లు అర్థం చేసుకుందుకు ఎంతో కాలం పట్టలేదు. జర్మనీలోనూ అదే జరిగింది. గుప్తా నేనూ తొందరగానే బాగా దగ్గర స్నేహితులమయ్యాం!

మా బృందంలో రామచంద్ర ఇంకో తరహా. మనిషిలో చలాకీతనముంది కానీ దానికి కాస్త అమాయకత్వం కూడా జతపడింది. ప్రతీదీ తనకి తెలుసనుకునేవాడు. మిగతావాళ్లు కూడా అలా అనుకోవాలనుకునేవాడు. అందుకోసం ఎంతో కష్టపడి మా అందరికంటే ముందుగా చుట్టుపక్కల సమాచారం సేకరించి అందజేసేవాడు. ఇచ్చిన సమాచారంకంటే తన గురించి చెప్పుకునేదే ఎక్కువ కావడంవల్ల మిగతావాళ్లు అతనికి థాంక్స్ కూడా చెప్పేవాళ్లు కాదు. అతనికి కావాల్సింది మెప్పు. ఆ విషయం నాకు స్పష్టమైంది కాబట్టి, అతన్ని మెచ్చుకోవడంవల్ల నాకొచ్చే నష్టం ఏంలేదు కాబట్టి – నేనతన్ని తెగ పొగిడేవాణ్ణి. నిజం చెప్పొద్దూ, అప్పుడతని కళ్లలోని మెరుపుని చూస్తే, అతన్నింకా ఇంకా పొగడాలనిపించేది. పొగిడేవాణ్ణి. దాంతో రామచంద్ర నాతోనే ఎక్కువగా తిరిగేవాడు. తన సామర్థ్యం గురించి అదే పనిగా చెప్పుకునే అతని కబుర్లు నాకు వినోదాన్నిచ్చేవి.

సుబ్రహ్మణ్యం మాత్రం రామచంద్రని బోరు అనేవాడు. స్వంత డబ్బానతను భరించలేడట.

రామచంద్ర పొదుపరి. అతనికి ఇంట్లో వంట చేసుకుందుకు అనుమతి ఉంది. తను వంటలు బాగా చేస్తానని అతనే చెప్పాడు. అందుకని అతను మాతో హొటలుకొచ్చి భోంచేసేవాడు కాదు. నెలనెలా వచ్చే ఇరవై మీల్స్ టికెట్లనూ, అతను ఇన్‌స్టిట్యూట్లో ఇచ్చేసి ప్రతిఫలంగా తొంభై మార్కులు పుచ్చుకునేవాడు. ఇంటివద్ద వండుకుంటే అతనికి నెలకి ముప్పై మార్కులలోపే ఔతోందిట.

అతనలా చెబితే మిగతావాళ్లు వేళాకోళంగా నవ్వేవారు. రామచంద్ర చిన్నబుచ్చుకునేవాడు కాదు. ఓపికగా ఖర్చుల వివరాలిచ్చేవాడు. అవి నేను తప్ప ఎవ్వరూ వినేవారు కాదు. ఇక్కడైతే నాకు వంటకి సదుపాయం లేదు కానీ బెర్లిన్ వెడితే, వంట సదుపాయమున్న ఇల్లే వెతుక్కోదల్చుకున్నాను కాబట్టి – ఆ వివరాలు నాకు కుతూహలంగానే ఉండేవి.

ఒకసారి రామచంద్ర సంతలో పాతిక నిమ్మకాయలు, ఎండు మిరపకాయల కారం కొన్నాడు. దుకాణంలో సన్‌ఫ్లవర్ ఆయిల్ కొన్నాడు. ఒకరోజు మాలో కొందర్ని భోజనానికి పిలిచి – మాముందే ఆ నిమ్మకాయలు కోసి ఊరగాయ పెట్టాడు. నాకు చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

నిమ్మకాయ ఊరగాయ పెడుతున్నప్పుడు నిమ్మరసం కొంచెం ఉండిపోయింది. ఆ రసాన్ని కొంచెం లెమన్ బాత్‌కీ, కొంచెం సాంబారుకీ ఉపయోగించాడు. అతను చేస్తున్న పద్ధతి చూస్తుంటే – వంట ఎంత సులభమో అనిపించింది.

అతను చేసినవన్నీ బాగున్నాయి. కానీ లెమన్బాత్ పులిహోరలా ఉండి – ప్రాణం లేచి వచ్చినట్లయింది. జర్మనీలో ఇటువంటి వంటకాలు చేసుకునే అవకాశముందని తెలిసి నాకు చాలా సంతోషమైంది. తర్వాత రామచంద్ర, వచ్చిన ఇండియన్సులో వంట సదుపాయం ఉన్నవారికి తలో కాస్తా ఊరగాయ ఇచ్చాడు.

రామచంద్రకు తన గురించి చెప్పుకునే అలవాటుంటే ఉండొచ్చు. కానీ అతనివల్లనే చాలామందికి కొన్ని ఉపయుక్త విశేషాలు తెలిశాయి. ఇండియాలో దొరికే అనేక వంట దినుసులకి జర్మన్ పేర్లను తెలుసుకున్నాడు. ఉప్మాకు వాడే బొంబాయి రవ్వలాంటి దినుసు 'గ్రీస్' పేరిట చాలా షాపుల్లో దొరుకుతుందని అతనే చెప్పాడు. అన్నింటికీ మించి – 'ఆల్‌బ్రెస్ట్' అనే చౌకధరల దుకాణం గురించి మాకు అతనివల్లనే

తెలిసింది. ఎందువల్లనో తెలియదు కానీ మిగతాచోట్లతో పోల్చితే ఆ దుకాణంలో అన్ని దినుసుల ధరలూ చాలా తక్కువ. మిగతా షాపుల్లో బియ్యం అరకిలో ప్యాకెట్ ఒకటిన్నర మార్కులుంటే, అక్కడ మాత్రం ఎనభైఎనిమిది ఫెనిగ్సు. బ్రెడ్ మిగతా చోట్ల కనీసం ఒక మార్కుంటే – అక్కడ యాభైతొమ్మిది ఫెనిగ్సు. పాలు, బొంబాయిరవ్వ వగైరాలన్నీ అక్కడ బాగా చౌక. ఈ 'ఆల్‌బ్రెస్ట్' చెయిన్ షాపులు సాధారణంగా ప్రతి ఊళ్లోనూ ఉంటాయిట. వీటిలో ముఖ్యంగా తిండి సామగ్రి మాత్రమే దొరుకుతుంది. ఈ దుకాణం మా తిండి ఖర్చులో కనీసం ముప్పైఐదు శాతం తగ్గించగలదు.

ఇలాంటి సమాచారం ఎంతో ముఖ్యమైనదే కదా! అందుకని రామచంద్ర మిత్రబృందం నుంచి అభినందన లాశించేవాడు. మిగతావాళ్లు వినడమే గొప్పన్నట్లు ప్రవర్తించేవారు. అవసరమైనప్పుడు మాకు మేమే తెలుసుకోగలమన్నట్లు మాట్లాడేవారు. ఇక్కడికొచ్చింది, వంటల్లో పొదుపుకా అని ఈసడించేవారూ ఉన్నారు. నేను మాత్రం మనస్ఫూర్తిగా అతన్ని మెచ్చుకునేవాణ్ణి. అది స్నేహధర్మం మాత్రమే కాదు. బెర్లిన్ వెళ్లేక కూడా, అతనిచ్చిన సమాచారంవల్ల ప్రయోజనం పొందుతూ, మనసులో తరచుగా అతన్ని మెచ్చుకునేవాణ్ణి. ఒకోసారి మెచ్చుకుంటూ ఉత్తరాలు కూడా వ్రాసేవాణ్ణి. అప్పుడు అతన్నించి మరింత కొత్త సమాచారంతో జవాబొచ్చేది. నాలుగు పంక్తుల సమాచారంలో, నలభై పంక్తులు – అది సంపాదించడానికి ఉపయోగపడ్డ తన ప్రతిభ గురించి ఉండేది. మిగతావారు అతని గురించి అనుకునేది తెలిసినవాణ్ణి కాబట్టి – ఆ నలభై పంక్తుల్లోనూ నాకు అతని అమాయకత్వమే కనిపించి జాలి పుట్టేది.

రామచంద్రకి వితరణ ఉంది. అక్కడ గిఫ్ట్‌స్ ఇవ్వడానికని అతను ఇండియానుంచి చందనం ఐటమ్స్ వగైరాలు చాలా తెచ్చుకున్నాడు. అలాంటివి ఆట్టే తెచ్చుకోలేదని వాటిలో కొన్ని నాకూ, నటరాజన్‌కీ ఇచ్చాడు. మరి నీకు తగ్గిపోవా అని తీసుకుందుకు తటపటాయించాను. "నా సంగతి తెలుసుగా, మరిన్ని తెప్పించుకునే సోర్సెస్ పట్టాను" అంటూ తన గురించి మళ్లీ మొదలెట్టాడు.

అప్పుడతను చేసిన సాయంముందు ఆ స్వోత్కర్ష ఏపాటిది? నాకు రామచంద్ర ఆ వస్తువులివ్వడం అపూర్వంగా అనిపించింది. వాటిలో ఒక చందనం బాల్‌పెన్, తాళాలగుత్తి ఫ్రౌ యాకేల్‌కి ఇచ్చాను. గురివిందంత చిన్న గింజను దొలిచి అందులో ఉంచిన బోలెడు జంతువుల బొమ్మలు (ఇవి మైక్రోస్కోపుతో చూస్తేనే కనబడతాయి) – ఆమె మనవడికని ఇచ్చాను. ఆమె ఎంత సంబరపడిందో చెప్పలేను. థాంక్స్ టు రామచంద్ర!

ఒకసారి ఇండియన్స్ అంతా గ్యోతే ఇన్సిస్ట్యూట్లో భారీ ఎత్తున విందు చేసుకున్నాం. దానికి మా జర్మన్ టీచర్ని కూడా పిలిచాం. లెమన్ బాత్, సాంబారు, పాయసం – పూర్తిగా రామచంద్ర అజమాయిషీలో తయారయ్యాయి. పూరీ, కూర ఉత్తరాదివారు చేశారు. ఒత్తడానికి బీర్ బాటిల్స్ ఉపయోగించాం. వంటకాలు అందరి మెప్పూ పొందాయి.

మాకు శని, ఆదివారాలు సెలవు కాబట్టి ఆ రోజుల్లో నా బోటిగాళ్లు ఒకరిద్దర్ని తరచుగా భోజనానికి పిలవాలనుకున్నాడు రామచంద్ర. ఐతే ఇంటికి తరచుగా అతిథులు రావడం అతని ల్యాండ్‌లేడీకి ఇష్టముండదు. అందువల్ల ఆ ప్రయత్నం విరమించుకోవలసి వచ్చింది.

అడపాతడపా పిక్నిక్స్ వేసుకునేవాళ్లం. ఏ పిక్నిక్కి వెళ్లినా రామచంద్ర ముందుండి అందర్నీ గైడ్ చేయాలని ప్రయత్నించేవాడు. చాలామంది అతన్ని డైరెక్టర్ అనేవారు. అది అభినందన కాదు, హేళన. అతను మాత్రం అభినందనగా భావించి తెగ మురిసేవాడు.

మహారాష్ట్రనుంచి వచ్చిన దేవదార్ నాకు మరో మంచిమిత్రుడు. అందరితో చటుక్కున కలవలేడు కానీ బాగా ఆత్మవిశ్వాసమున్నవాడు. హుందాగా వ్యవహరిస్తాడు. చాలా విషయాల్లో నావీ అతడివీ అభిరుచులు కలిశాయి. కానీ కొన్ని విశేషాలకు అతను ఇట్టే ఎక్సయిటవుతూ అమాయకుడనిపిస్తాడు. మచ్చుకి – కొత్తగా డైరీ రాస్తున్నాననీ, ప్రతి పైసకీ అకౌంట్ వెయ్యడం మొదలెట్టాననీ, అది చాలా గొప్ప అనుభవమనీ నాకు చెప్పాడోసారి. నేనైతే 1958నుంచీ ఆ పని చేస్తున్నాను. కానీ అతనెంతో గొప్పగా ఫీలౌతున్నాడని గ్రహించి, అభినందించి ఊరుకున్నాను.

నేను తరచుగా శ్రీమతి, పిల్లల గురించి తల్చుకోవడం చూసి, "నీకు వాళ్లే జీవితంలా ఉందే!" అన్నాడతను.

"నాకే కాదు, వివాహితులెవరికైనా అలాగే ఉంటుంది" అంటూ భార్యాబిడ్డలకి సంబంధించిన కొన్ని మనోహర ఘటనల్ని చెప్పాను. దేవదార్ వెంటనే దాపరికం లేకుండా – తనకి పెళ్లి చేసుకోవాలనుందనీ, తలిదండ్రులు శ్రద్ధపట్టడం లేదనీ వాపోయాడు. ఆ సమయంలో నా పక్కనే ఉన్న రామచంద్ర, "మావాళ్లూ నా పెళ్లి గురించి శ్రద్ధ పట్టలేదు. వాళ్ల పీకెలమీద కూర్చుని జరిపించుకున్నాను" అంటూ మనిషికి దాంపత్యజీవితం ఎంత అవసరమో, అదెంత మనోహరంగా ఉంటుందో పెద్ద ఉపన్యాసమిచ్చాడు.

దేవదార్ మౌనంగా విని, "నీకు పెళ్లయి ఎన్నేళ్లయింది" అన్నాడు.

నాకు అర్థమైంది కానీ రామచంద్ర మాత్రం, "ఏళ్లేం కాదు, జర్మనీ వచ్చేముందే అయింది. ఆ కాస్త సమయం లోనే మా ఇద్దరికీ వెయ్యిజన్మల అనుబంధం ఏర్పడింది" అంటూ ప్రేమకీ, పెళ్లికీ తేడా చెప్పడం మొదలెట్టాడు.

దేవదార్‌కి వంట సదుపాయముంది. అప్పుడప్పుడు నన్ను తనింటికి పిల్చి సాంబారు తయారు చేసేవాడు. రామచంద్ర అంత గొప్పగా కాకపోయినా, అతని వంటలు కూడా బాగుండేవి. ఆపైన అతడికి సాహిత్యంపట్ల ఆసక్తి ఉంది. అతనొకసారి మహాభారతంలో ద్రోణాచార్యుడి కుమారుడు అశ్వత్థామపై వచ్చిన ఓ మరాఠీ కవిత సారాంశం చెప్పాడు. ద్రోణుడి ఆదాయం చాలక, తల్లి అశ్వత్థామకి నీళ్లలో మైదా కలిపి, అవే పాలని చెప్పి ఇచ్చేదిట. ఒకసారి అశ్వత్థామ దుర్యోధనుడి ఇంటికి వెళ్లినప్పుడు అక్కడ వాళ్లిచ్చిన పాలు తాగి ఇంటికొచ్చి ఆ విషయం తల్లికి చెప్పాట్ట. "అమ్మా, నేను పాలుతాగేను" అని ప్రారంభమైన ఆ కవితలో ఆ ఇంటి పాలకూ, తనింటి పాలకూ ఉన్న తేడాని కవి ఎంత హృద్యంగా వర్ణించాడో కానీ, దేవదార్ చెప్పిన తీరు నాకు కళ్లనీళ్లు తెప్పించింది. ఆ కవిత ఎంత నచ్చిందంటే, ఆ తర్వాతెప్పుడో దాన్ని మా 'అమ్మ' నవల్లో ఉదహరించాను.

మా బృందంలో నాకు దగ్గర మిత్రుడు నటరాజన్. ఇద్దరం కెమిస్ట్రీ వాళ్లమే కావడం, చాలా విషయాల్లో మా అభిప్రాయాలు ఒకటే కావడం, మమ్మల్ని మరీ దగ్గర చేశాయి. నటరాజన్ వయసులో నాకంటే కొంచెం పెద్దవాడు. కానీ ఇంకా పెళ్లి కాలేదు. మనసులోని మాట నిర్మొహమాటంగా పైకి అనేసేవాడు. తను చెప్పింది తప్పైతే వెంటనే ఒప్పేసుకునేవాడు. అలాంటి వాళ్లంటే నాకు చాలా ఇష్టం. నాకులాగే అతనికీ సినిమా పాటల పిచ్చి ఉంది. ఇండియానుంచి ఒక పెద్ద స్పూల్ టేపునిండా హిందీ సినిమా పాటలు రికార్డు చేసుకుని వచ్చాడు. ఇండియాలో అతనికి స్పూల్ టైపు టేపురికార్డరు ఉందిట.

జర్మనీలో అడుగు పెట్టిన పదమూడు రోజుల్లోనే నేను రేడియో–కమ్–టేపు రికార్డరు కొన్నాను. అలాంటివప్పుడు కొత్తగా మార్కెట్లోకి వస్తున్నాయి. దాని ఖరీదు మూడువందలపాతిక మార్కులు. అంత తక్కువ వ్యవధిలో అంత ఖర్చు పెట్టడానికి చాలా ధైర్యం అవసరమని మిగతా ఇండియన్సుని చూసేక అనిపించింది. కానీ నా తొందరకి కారణముంది.

నేను జర్మనీకి బయల్దేరేముందు, భువనేశ్వర్లో ప్రసాద్ అనే నా సీనియర్ కొలీగ్, మా పిల్లల మాటలు, పాటలు రికార్డు చేసి, ఆ కాసెట్ నాకిచ్చాడు. అది వినే అవకాశం ఎప్పుడెప్పుడా అని తహతహలాడిపోతున్నాను. అదే నాకు ధైర్యాన్నిచ్చింది.

అక్కడి మిత్రుల్లో నటరాజన్ నాకు ప్రత్యేకం. ప్రతి ఆదివారం మేమిద్దరం కలుసుకోవాలనేవాడు. తనింట్లో వంట సదుపాయముంది కాబట్టి, నన్నక్కడికి రమ్మని బలవంతపెట్టేవాడు. తన హౌస్‌ఫ్రా చాలా మంచిదిట. అతనింటికి వచ్చే అతిథుల విషయమై ఆమె నియమాలేం విధించలేదు.

రేడియో రికార్డరు కొన్నాక – ప్రతి ఆదివారం నన్నది తీసుకుని రమ్మనేవాడు నటరాజన్.
అతను స్పూల్ టేపులో ఇండియానుంచి తెచ్చుకున్న పాటల్ని క్యాసెట్లలోకి మార్చడానికి అవసరమైన సరంజామా, అతని హౌస్‌ఫ్రా సరఫరా చేసింది. అలా ఆ పాటలు నా రేడియో రికార్డరులో వినడానికి అనువయింది.

మేమిద్దరం ఆ పాటలు వింటూ ఆనందించేవాళ్లం. అతను తెచ్చిన పాటలన్నీ నాకు ఇష్టమైనవే! ముఖ్యంగా బాబీ చిత్రంలోని నరేంద్ర చంచల్ పాడిన 'బేషక్ మందిర్' పాట నన్నేదో లోకాలకు తీసుకుపోయేది.

ఏదో అవసరార్థం చేసుకుంటున్నాడు కానీ నటరాజన్‌కి పెద్దగా వంటలు రావు. వంట చెయ్యాలన్న అభిరుచి కూడా లేదు. నాకోసమని అతను ఒకరోజు ఉప్మా, ఒకరోజు అన్నం, బంగాళాదుంపల కూర – ఇలా మార్చి మార్చి చేస్తుండేవాడు. వంటలకు ఆవాల పోపు మంచి రుచి ఇస్తుందని ఎవరో చెబితే, ఒకసారి అతను ఆవాలు బాగా ఎక్కువ వేసి ఉప్మా చేశాడు. ఆవాలు ఎంత ఎక్కువయ్యాయంటే, ఆవాల ఉప్మాలో పోపుగా బొంబాయిరవ్వ వేసినట్లుంది. చిత్రమేమిటంటే అలా కూడా ఆ ఉప్మా తినడానికి బాగానే ఉంది. ఆత్మీయభావం కూడా వంటకాల రుచికి కారణమౌతుందని అప్పుడు నేను గ్రహించాను. అలాగని ఆత్మీయతనే వంటకం చేస్తే ఎల్లకాలం బాగుండదని అతనికి తెలుసు. ఆ తర్వాత ఆవాల వాడకంలో బాగా నియంత్రణ పాటించేవాడు.

నటరాజన్‌కి నా మనస్తత్వం బాగా అర్థమైంది. నాకు మొహమాటమెక్కువని, వంటకాల రుచిని నిర్ణయించడానికి నా సాయం తీసుకునేవాడు కాదు. 'ఉప్పెక్కువైనా బాగుందంటావ్ తప్ప, అసలు మాట చెప్పవు' అంటూ తనే ముందు రుచి చూసేవాడు. తరచుగా రావడానికి నేను మొహమాట పడుతున్నానని అతనికి అనుమానం. అందుకని శని, ఆదివారాల్లో నా కంపెనీ లేకపోతే – ఇండియాకి తిరిగి వెళ్లిపోయేవాణ్ణని నమ్మించడానికి తంటాలు పడేవాడు. నేను బొంబాయిరవ్వ, బియ్యం వగైరాలు కొని తీసుకెళ్లి అతనింట వదిలితే నొచ్చుకునేవాడు. రావడం కాస్త ఆలస్యమైతే కంగారుపడేవాడు. అక్కడున్న నాలుగు నెలల్లోనూ ఇద్దరం బాగా ఆత్మీయులమయ్యాం.

నటరాజన్ ఉండే ఇంటికి దగ్గర్లో దట్టమైన అడవి ఒకటుంది. మేము అప్పుడప్పుడు అందులో విహారానికి వెళ్లి వస్తూండేవాళ్లం. ఆ అడవిలో చక్కని కాలిబాట, మధ్యమధ్యలో వ్యాయామం చేసుకునేందుకు సదుపాయాలు ఉన్నాయి. ఆ అడవి ప్రత్యేకత ఏమిటంటే – పురుగూ, పుట్రా భయం లేదు.

నా రికార్డర్ నచ్చి అలాంటిదే తనూ ఒకటి కొన్నాడు నటరాజన్. రెండు రికార్డర్లూ పెట్టుకుని మిగతా ఇండియన్సు ఎందరికో పాటలు రికార్డింగ్ చేసిపెట్టేవాళ్లం. ఈ రికార్డింగ్ వల్ల నటరాజన్ ఇల్లు సెలవురోజుల్లో రద్దీగా ఉండేది. అక్కడికొచ్చేవాళ్లలో ఇక్బాల్, తెలుగు జోసెఫ్ నాకు బాగా గుర్తుండిపోయారు.

ఇక్బాల్ పాకిస్తానీ. అతనికి కంటిచూపు సమస్య ఉంది. కొంతకాలానికి పూర్తిగా చూపు పోతుందిట. ఈ విషయంలో అప్పటివరకూ విజ్ఞానం సాధించిన ప్రగతి అతనికి అక్కరకు రాదుట. ఈ ప్రపంచపు అందాల్ని కళ్లారా చూసే అవకాశం తనకి ఎంతోకాలం లేదనీ, కొద్దినెలల్లో అంధుడినైపోతాననీ అనేవాడతను. మనసేదోలా ఐపోయేది. హృషీకేష్ ముఖర్జీ తీసిన ఆనంద్ సినిమాలో రాజేష్‌ఖన్నా గుర్తుకొచ్చాడు. మా ఇద్దరికీ కామన్ టాపిక్ హిందీ పాటలు. 1955 తర్వాతనుంచి అప్పటివరకూ వచ్చిన హిట్ సినిమా పాటలన్నీ ఇంచుమించుగా నాకు తెలుసు. మేము కబుర్లకు కూర్చుంటే ఉత్సాహంలో సమయం తెలిసేది కాదు. జర్మనీలో ఉన్నందువల్లనేమో – అతను పాకిస్తానీ, నేను ఇండియన్ అన్న భావనే మాలో ఉండేది కాదు. మనిషిని పౌరసత్వంతో ముడి పెట్టకుండా – అభిరుచులకే ప్రాధాన్యమిస్తే ఎంత బాగుంటుందో అనిపింపజేసింది అతని పరిచయం. ఇక్బాల్‌కి నేను చాలా కాసెట్లు రికార్డు చేసిచ్చాను. తర్వాత అతను కూడా నా రేడియో–రికార్డరు లాంటిది ఒకటి కొన్నాడు.

తెలుగు జోసెఫ్ లాంగ్వేజ్ కోర్సు రెండవ విభాగంలో వచ్చాడు. ఇండియాలోని ఓ క్రైస్తవ సంస్థ పనుపున వచ్చిన ఇద్దరు జోసెఫ్‌లలో ఇతను తెలుగువాడు. రెండో జోసెఫ్‌ది కేరళ. కేరళ జోసెఫ్‌ఎక్కువగా ఉత్తరాదివారితో తిరిగితే, తెలుగు జోసెఫ్ నాతో ఎక్కువగా తిరిగేవాడు. పాటల విషయంలో మా ఇద్దరి అభిరుచులూ దగ్గర్లో ఉండడం అందుకు కారణం. రికార్డింగుకోసం అతను నటరాజన్ ఇంటికి తరచుగానే వచ్చేవాడు. కేరళ జోసెఫ్ కొంచెం అమాయకుడు. ఉత్తరాదివారు అతనిమీద చాలా జోక్సు వేసేవారు. నవ్వేవాడు తప్పితే నొచ్చుకునేవాడు కాదు.

ల్యూనబర్గ్‌లో గుర్తుండిపోయిన మరో వ్యక్తి చక్రవర్తి. అతను బిశ్వాస్‌కి అంకుల్ ఔతాట్ట. జర్మన్ వనితను పెళ్లాడి ల్యూనబర్గులో స్థిరపడ్డాడు. బిశ్వాస్ అతనింటికి ఒకటి రెండుసార్లు వెళ్లాడు కానీ, ఎందుకో అతడి గురించి మంచిగా చెప్పలేదు. ఒకసారి రోడ్డుమీద మా బృందానికి ఎదురుపడితే మాకు పరిచయం చేశాడు. అప్పుడు చక్రవర్తి తనింటికి రమ్మంటే తర్వాత వస్తానన్నాం.

ఒకసారి నేను, దేవదార్, రామచంద్ర అమ్ శాండే దగ్గర తిరుగుతుండగా చక్రవర్తి ఎదురుపడి బలవంతాన తనింటికి తీసుకెళ్లాడు. ఇంట్లో డ్రాయింగ్ రూం సినిమా సెట్టింగులా చాలా బాగుంది. అతనింట్లో బాగా ఖరీదైన సాఫిస్టికేటెడ్ ఆటోమేటిక్ స్టీరియో రికార్డర్ సిస్టం నన్ను బాగా ఆకర్షించింది. అలాంటిది ఎప్పటికైనా కొనగలనా అనుకున్నాను. అతని దగ్గర మంచి రికార్డ్స్ కలెక్షన్‌ఉంది. చూపించాడు. 'పటాస్కర్'దంటూ ఓ రికార్డు వినిపించాడు. ఆ సిస్టంలో ఎవరి పాటైనా వాయిద్యమైనా అద్భుతంగా ఉంటుందనిపించింది. థియేటర్లో సంగీతం విన్న అనుభూతి కలిగింది.

అతను మాకు విస్కీ, బ్రాందీ సెర్వ్ చేస్తే – ముగ్గురమూ వద్దన్నాం. అతని భార్య నాకు ఆరేంజ్ జ్యూస్, మిగతా ఇద్దరికీ టీ ఇచ్చి ఇండియన్ స్టైల్లో ఆదరించింది. చక్రవర్తి తను మాత్రం విస్కీ తీసుకుంటూ, "మధ్యతరగతి ఇండియన్సుకి ఇంట్లో ఇలా మందు పుచ్చుకునే అవకాశం – ఆశ్చర్యంగా అనిపిస్తుంది కదూ!" అన్నాడు.

విదేశాల్లో స్థిరపడ్డ ఇండియన్సుకి – తాము మామూలుగా ఇండియన్సుకి అందని వైభోగాలు అనుభవిస్తున్నామని చెప్పుకోవాలనుండేది అప్పట్లో.

నేను నవ్వి, "ఇండియా ఇప్పుడు చాలా మారిపోయింది. ఎన్నో మధ్యతరగతి ఇళ్లలో ఇప్పుడు విస్కీ బాటిల్సు కామన్ ఐటమ్" అన్నాను. అది నిజమే కానీ, "అక్కడుండి మేమేం మిస్సవడం లేదుసుమా" అని నిరూపించాలనే సాధారణ ఇండియన్ తాపత్రయం నా మాటల్లో లేదనలేను.

తన ప్రాధాన్యం పలచబడిపోతుందనుకున్నాడేమో, చక్రవర్తి వెంటనే మాట మార్చి, జర్మనీలో ఇండియన్సుకి ఎదురయ్యే తిండి ఇబ్బందిని ప్రస్తావించాడు.

అది రామచంద్ర ఫావరేట్ సబ్జక్టు. అతను వెంటనే, "ఇక్కడ మన సరుకులన్నీ దొరుకుతున్నాయి. చేసుకుందుకు సదుపాయాలు మన దేశంలోకంటే బాగున్నాయి" అంటూ వంట విషయమై తను చేసిన విషయసేకరణా, సాధించిన వంటకాలూ గురించి తన ఊపులో చెప్పాడు.

చక్రవర్తి వెంటనే, "అన్నీ అనుకుంటాం కానీ, మీ దక్షిణాదివాళ్లకి చింతపండు చాలా ముఖ్యం. అది మామూలు షాపుల్లో దొరకదు. హాంబుర్గ్‌లో ఒక ఇండియన్ అపరాల దుకాణముంది. ఇండియాలో అన్ని ప్రాంతాలవారికీ కావాల్సిన దినుసులన్నీ అక్కడ దొరుకుతాయి. ధరలూ చౌక. ఒకేసారి పెద్ద ఆర్డరిస్తే, పోస్టులో తెప్పించుకున్నా కూడా తక్కువే ఔతుంది. ఉదాహరణకి ఇక్కడ షాపుల్లో ఆవాలు 1.50. అక్కడ డెబ్బై ఫెనిగ్సే" అన్నాడు.

అంతే, అప్పుడతన్ని మాలాంటి ఇండియన్‌లాగే ఫీలయ్యాం. ముందు రామచంద్రనీ, ఆవెంటనే మిగతా మా ఇద్దర్నీ ఆకర్షించింది ఈ సమాచారం. చక్రవర్తి మా ముగ్గురికీ ఆ షాపు చిరునామా, ధరల పట్టిక ఉన్న జిరాక్సు కాపీలు తలొకటీ ఇచ్చాడు. తర్వాత ఆ కాపీ – చక్రవర్తి మాకు కలకాలం గుర్తుండిపోయేటంతలా ఉపయోగపడింది.

ల్యూనబర్గులో పరిచయమైన మరపురాని వ్యక్తిత్వాలు మరెన్నో ఉన్నాయి. అవి స్వానుభవాల వివరణలో సందర్భానుసారంగా పరిచయమౌతాయి.

కొత్త ప్రదేశంలో ఉన్నప్పుడు కొన్ని చూసి తెలుసుకోవాలి. కొన్ని అడిగి తెలుసుకోవాలి. ఐనా కూడా అర్థం చేసుకుందుకు ఒకోసారి చాలా చిన్న విషయాల్లో కూడా స్వానుభవమే తప్పనిసరి ఔతుంది.

'తల మాసిన, నొలు మాసిన, వలువలు మాసినను – ప్రాణవల్లభునైనన్ కులకాంతలైన రోతురు' అన్నాడు సుమతీ శతకకర్త. ఆ రోతకు గురి కాకుండా నన్ను నేను కాపాడుకుందుకు స్వదేశంలో సులభమైన మార్గాలు చాలా ఉన్నాయి.

జర్మనీలో ఐతే నా పక్కన కులకాంత ఎలాగూ లేదు. చుట్టూ ఉన్నవారిలో బిశ్వాస్‌వంటి వారే ఎక్కువ. ఇక్కడ ఏం మాసినా నన్ను రోసేవారు లేరు. ఐనా అన్నేళ్లుగా వంటబట్టిన అలవాట్లు – నాపై ఏం మాసినా నన్ను నేనే రోసేలా చేసే ప్రమాదముంది. ఆ ప్రమాదంనుంచి తప్పించుకుందుకు నా ప్రయత్నాలు నేను చెయ్యాలి కదా, వాటిలో కొన్నింటినిక్కడ అదే వరుసలో చిత్తగిస్తాను.

రోసేవారెవరురా నను వినా

ఇండియాలో – తల దాకా ఎందుకు, చెంపలు మాస్తే చాలు – క్షౌరశాలకి స్ప్రింట్ చెయ్యాల్సిందే నేను! సాధారణంగా క్షౌరానికీ క్షౌరానికీ మధ్య వ్యవధి రెండు వారాలు దాటేది కాదు. దాటితే ప్రపంచమంతా నన్ను చూసి రోత పడుతున్న ఏదో ఫీలింగ్.

జర్మనీ వచ్చి రెండు వారాలు కాగానే నా తలలో దురద మొదలైంది. క్షౌరశాల గురించి వాకబు చేస్తే – కటింగుకి ఐదు మార్కులని తెలిసింది. అప్పటికి భువనేశ్వర్లో క్షౌరానికి ముప్పావలా కాబోలు తీసుకుంటున్నారు. ధరల్ని పోల్చితే ఎలాగూ షాకే. ఐదు మార్కులే కదా అని సరిపెట్టుకుంటే, ఇది ఒకసారితో ఐపోయేది కాదు. ఈ ప్రపంచంలో ధరలకంటే వేగంగా పెరిగేది, తలమీద కత్తిరించిన జుత్తు ఒక్కటేనని నేనే అనేవాణ్ణి. ఏంచెయ్యాలా అని మనసులో మథన మొదలైంది. అప్పుడు నా మనసు రెండుగా విడిపోయింది.

'లాంగ్వేజి కోర్సు నాలుగు నెలలు. అంటే నాలుగు – రెండు వారాలు. రెండు వారాల కొకసారి ఐదు మార్కుల చొప్పున, తలమాపును మాఫీ చెయ్యడానికి ల్యూనబర్గులోనే మొత్తం ఇరవై మార్కులు క్షవరం ఐపోతాయి. ఆపైన బెర్లిన్ వెళ్లి పన్నెండు నెలలుండాలి. అంటే ఇరవైనాలుగు నెలలు. అంటే క్షౌరానికి నూటిరవై మార్కులు. అదీ అక్కడకూడా క్షౌరం ధర ఐదు మార్కులే ఐతే. ఇంత డబ్బుని క్షౌరం చేస్తానంటే నేనొప్పుకోను" అంది ఓ మనసు.

"ఇక్కడికొచ్చిన రెండు వారాల్లోగానే రేడియో–రికార్డరు కొనడానికి మూడొందలపాతిక మార్కులు ఖర్చు పెట్టావు. పదహారు నెలలకి నూట నలబై మార్కులౌతాయని, ఇక్కడున్నన్నాళ్లూ తలమాసినవాడిగా ఉండిపోతావా?" అని మందలించింది రెండో మనసు.

"ఐతే నీకు కుబేరుడి కథ చెప్పాలి. కురుక్షేత్ర యుద్ధానంతరం హస్తినలో వానలు పడక తిండికి కరువొచ్చింది. సాయంకోసం ధర్మరాజు భీముణ్ణి కుబేరుడి వద్దకు పంపాడు. ఆ సమయానికి కుబేరుడు అక్కడక్కడ నేలమీదపడ్డ ధాన్యం గింజల్ని ఏరి కుప్పలో వేస్తున్నాడు. 'ఇంత పిసినిగొట్టు మాకేం సాయపడతాడూ' అని సందేహిస్తూనే భీముడు కుబేరుడికి తనొచ్చిన పని చెప్పాడు. కుబేరుడు వెంటనే వెయ్యి బళ్లని ధాన్యం బస్తాలతో నింపి అతడికిచ్చి తోడుగా తనూ బయల్దేరాడు. కానీ దారిలో ఓ చోట ఏరుపొంగి బాటంతా జలమయమై మూసుకు పోయింది. కుబేరుడు వెంటనే ఐదొందల బళ్లమీది బస్తాల్ని నీళ్లలో వేయించి బాట ఏర్పరిచాడు. మిగతా ఐదొందల బళ్లనీ ఆ బాటలో

తీసుకెళ్లమనీ, తనింకో ఐదొందల బళ్లు పంపిస్తాననీ అన్నాడు. అప్పుడు అక్కడక్కడ నేలమీద పడ్డ గింజలకోసం కక్కుర్తి పడ్డవాడు, ఇప్పుడు బస్తాలకు బస్తాల ధాన్యాన్ని నీళ్లపాలు చెయ్యడం భీముడికి ఆశ్చర్యం కలిగించింది. 'ఉత్తప్పుడు గింజ కూడా వృథా చెయ్యకూడదు. అవసరమైనప్పుడు మొత్తం సంపదని వెచ్చించడానికి వెనకాడకూడదు' అని కుబేరుడు భీముడికి ఓ గొప్ప ఆర్థికసూత్రం వివరించాడు. కాబట్టి నువ్విప్పుడు అనుసరించాల్సింది కుబేరుణ్ణి" అంది మొదటి మనసు.

"చిన్న క్షౌరం కోసం ఇంత పెద్ద కథా! అదీ నిన్ను తల మాసినవాణ్ణి చెయ్యడానికి. తల మాస్తే ఏమౌతుందో సుమతీ శతకంలో ఉంది. గుర్తు చేసుకో. ఇక నేను చెప్పేదేం లేదు" అని మాయమైపోయింది రెండో మనసు.

"గుర్తు చేసుకో. రోసేవాళ్లుంటేనే తల మాయకూడదని దానర్థం. తల మాస్తే ఇక్కడ నిన్ను రోసేవాళ్లెవరున్నారు? ఆలోచించుకో – బోలెడన్ని మార్కులు ఆదా నీకు" అని మొదటి మనసూ మయమైంది.

ఇంతవరకూ నాకోసం మనసులు ఆలోచించిపెట్టాయి. ఇక నావంతొచ్చింది. ఆలోచిస్తే, నా పరిసరాల్లో మగాళ్లలో చాలామంది పొడుగు జుట్టుతోనే ఉంటున్నారు. పొట్టి జుట్టుతో ఉన్నవాళ్లలో కూడా నన్ను రోసేవాళ్లు లేరు. అలా అనుకుని క్షౌరాన్ని వాయిదా వేశాను. ఈలోగా మావాళ్లలో నటరాజన్ఓసారి క్షౌరం చేయించు కున్నాడు. "అన్నీ ఆటోమేటిక్మెషీన్లు. ఆపరేషన్బల్లమీద కూర్చున్నట్లుంది" అన్నాడతను.

అలా పొడుగు జుట్టుతో ఎవరూ రోయకుండా మూణ్ణెల్ల పైన గడిపేక, సెప్టెంబర్ 11న వెళ్లాను క్షౌరానికి. ఆశ్చర్యమేమిటంటే క్షౌరశాల బిజీగా ఉంది. నేను వెళ్లేసరికి ముగ్గురక్కడ వెయిటింగ్. అందరివీ పొడుగుజుట్లే. క్షౌరమయ్యేక కూడా అవి పొట్టిగా మారినట్లు నాకు తోచలేదు. ఎలా వెళ్లినవాళ్లు అలా వస్తున్నారనిపించింది. అందుకు ఐదు మార్కులా అని మళ్లీ మథనపడ్డాను కానీ, వెనకడుగు మాత్రం వెయ్యలేదు.

వ్యవహారానికి మాకిచ్చిన ఓ పుస్తకంలో జర్మన్లో ఎక్కడ ఏం చెప్పాలో సూచనలున్నాయి. క్షౌరశాలలో 'ఎట్వాస్ కుర్జర్' (ఓ మోస్తరు పొట్టిగా) అనే పదం మననం చేసుకున్నాను.

జర్మన్ మంగలికి స్పీడెక్కువే. నలభై నిముషాల్లో ముగ్గురికి క్షౌరం చేశాడు. నా వంతు రాగానే వెళ్లి కుర్చీలో కూర్చుని తల అప్పగించాను. నటరాజన్ అన్నట్లు ఆపరేషన్లా లేదు కానీ, ఇరవై నిముషాలు నా తలపై మెషీన్లూ, కత్తులూ, కత్తెరలూ కదలాడినా, అసలు క్షౌరం చేసినట్లు కూడా అనిపించక ఉసూరుమంది. ఇతరుల మనోభావాల్నిబట్టి జుట్టేమైనా తగ్గిందేమో తెలుసుకుందామంటే, అసలే ఇది ఎవరూ ఎవర్నీ పట్టించుకోని జర్మనీ! నాలో ఏదైనా మార్పొచ్చిందో లేదో ఎవరూ చెప్పరు.

అద్దంలో చూసుకుంటే, ఏదో మార్పొచ్చినట్లే ఉంది.

"ఔఫ్ వీడర్జెహెన్" (మళ్లీ కలుద్దాం) అన్నాడు జర్మన్మంగలి.

"మళ్లీనా?" అనుకున్నాను జేబులో పర్సు తడుముకుంటూ.

తల మాపు కథ అయిందిగా, ఇప్పుడు ఒలు మాపుకి వద్దాం.

జలకాలాటలలో

ఫ్రౌ యాకేల్ఇల్లు చిన్నదైనా ఏ సౌకర్యానికీ లోటు లేదు. ఆమె ఆత్మీయత కూడా నన్నాకట్టుకుంది. అక్కడ నాకున్న ఏకైక సమస్య స్నానం. బాత్రూంలో కమోడుంది. వాష్బేసినుంది. స్నానానికి సదుపాయం లేదు.

'ఒలు మాసిన ప్రాణవల్లభునైనన్ కులకాంతలైన రోతురు' అన్నాడు సుమతి బద్దెన. ఇది జర్మనీ, ఇక్కడ ఎవెరూ ఎవర్నీ పట్టించుకోనవసరం లేదు – అని నా మనసొకటి అప్పటికే నాకు జ్ఞానబోధ చేసి ఉంది. కానీ నన్ను నేను పట్టించుకోవాలి కదా! తల మాపుని

భరించినట్లు వంటి మాపుని భరించగల శక్తి నాకు లేదు. దానికి తోడు నా మిత్రులైన కొందరిళ్లలో స్నానానికి సదుపాయముంది. వాళ్ల అదృష్టానికి ఆసూయ పడుతూ, నా దురదృష్టానికి బాధపడేవాణ్ణి.

జర్మనీలో అన్ని ఇళ్లలోనూ స్నాన సదుపాయముండదు. చలి దేశం కావడంవల్ల స్నానం అక్కడ నిత్యావసరం కాదు. స్నానానికని ఊరికి బయటున్న స్నానశాలల గురించి కొంత సమాచారం సేకరించాను. అక్కడ యాభై ఫెన్నిగ్‌స్‌నుంచి ఒకటిన్నర మార్కులవరకూ మూల్యం చెల్లించాలి. నిజానికది పెద్ద మొత్తం కాదు. మేమైతే స్కాలర్‌షిప్ మీద వచ్చాం కాబట్టి అదో ఖర్చు అనుకుంటున్నాం కానీ, ఊరివారికైతే ఆ సదుపాయం బాగుంది. ఇంట్లో స్నానాలగది ఏర్పాటు చేస్తే మెయింటెనెన్సు ఖర్చవుతుందని, కొంతమంది గృహస్థులు వారానికో రెండువారాలకో ఒకసారి సకుటుంబంగా స్నానశాలలకెళ్లి స్నానాలు చేసి వచ్చేస్తూంటారు. అదే చౌక వారికి.

స్నానం విషయమై బాగా ఇబ్బందిపడ్డ ఇండియన్సుమి నేను, సుబ్రహ్మణ్యం, రామచంద్ర. మా ముగ్గురికీ ఇండియాలో రోజుకొక్కసారైనా స్నానం చేసే అలవాటుంది. అక్కడైతే స్నానం ఖర్చులేని పని.

ఇంతకీ జర్మనీ చలి దేశం. ఎంత చలి అంటే, గదిలో ఫ్రిజ్‌లేని కొందరు ఇండియన్స్ – పాలు, వెన్న వగైరా ప్యాకెట్లని గది కిటికీ బయట వ్రేలాడదీసేవారు. "ఇంట్లో ఫ్రిజ్‌కంటే ఈ బయటి ఫ్రిజ్ మోర్ ఎఫెక్టివ్. పైగా దీనికి కరెంటు ఖర్చు కూడా లేదు" అని సంబరపడేవారు.

బయట అంత చలిఉన్నా కూడా, స్నానం చెయ్యని రోజున ఏదోలాగుండేది. క్లాసులున్న రోజుల్లో గ్యోతే ఇన్స్టిట్యూట్లో స్నానం చెయ్యడానికి గదులున్నాయి. ఆ ఐదు రోజులూ ఒక్క రోజు కూడా విడవకుండా – క్లాసులవగానే పరుగున మేం ముగ్గురం స్నానాలగదులకు వెళ్లేవాళ్లం. నడిచి వెళ్లొచ్చు కదా అనుకోవచ్చు, మా పరుగుకు కారణాలున్నాయి. ఒకటి రద్దీ. మేమైతే స్నానం అవసరం ఫీలౌతున్నాం కానీ, ఫ్రీగా వస్తే ఎండ్రినైనా తాగే బాపతు కొందరుంటారు కదా! వాళ్లూ స్నానానికి ఎగబడేవారు. అందువల్ల ఉన్న గదులకంటే స్నానం చేసేవాళ్ల సంఖ్యే ఎక్కువగా ఉండేది. క్లాసు వదలగానే ఒలింపిక్స్‌లో ఈల విన్న స్ప్రింటర్సులా కదిలేవాళ్లం. ఒకోసారి మేము ముందు వెడితే, ఒకోసారి ఇంకెవరో ముందుండేవాళ్లు. వచ్చినవాళ్లు అప్పటికే ఉన్నవాళ్లని 'ఎండ్రిన్ బ్యాచ్' అన్నట్లు చూడ్డం మామూలు. ఆ విషయంలో మాతో సహా అందరూ గురివిందలే.

అక్కడ స్నానానికి కొన్ని నియమాలున్నాయి. స్నానం చేసేటప్పుడు వంటిమీద బట్టలుండకూడదు. తలుపులు మూసుంటే, అది ఇబ్బందే కాదు. కానీ ఇక్కడ స్నానాల గదులు ఒకదాని పక్క ఒకటి వరుసగా ఉంటాయి. వాటికి తలుపులుండవు. పల్చటి తెరలుంటాయి. లోపలి మనుషులు కనిపించరు కానీ, కావాలంటే ఎవరైనా తెర లాగి చూడొచ్చు. లోపల షవర్ సదుపాయముంది. ఒకటి వేణ్ణీళ్లకూ, ఒకటి చన్నీళ్లకూ రెండు వాల్వులున్నాయి. వాటి సాయంతో తగిన పాళ్లలో నీళ్లు తొరుపుకుని షవర్‌బాత్ చేయవచ్చు.

చాలామంది బాత్రూంలో పాటలు పాడేవారు. కొందరి గొంతులు భయంకరంగా ఉండేవి. ఆ విషయం వాళ్లకీ తెలుసు. ఐనా పాడేవారు. ఎందుకంటే లోపల మనిషున్న విషయం తెలియడానికి అదొక్కటే మార్గం. లేకుంటే ఎవరో ఒకరు తెర తొలగించి చూసే అవకాశముంది. అందుకు అభ్యంతరం లేనివాళ్లు పాడనవసరం లేదు. అలా పాడని వాళ్లలో శర్మ ఒకడు. పొరపాటున ఎవరైనా తెర తొలగిస్తే అతడు హాహాకారం కూడా చేసేవాడు కాదు. చిన్న స్మైల్ ఇచ్చేవాడు. ఆ సమయంలో ఆ చిరునవ్వు పాటకన్నా భయంకరం అనిపించేది. "మిగతావాళ్ల విషయమెలాగున్నా, శర్మ పాడి తీరాలి" అని అక్కడ కొందరు రిఫరెండం పెట్టి నిర్ణయించారు. దాన్ని శర్మ వీటో చేస్తూ "నా పాట నేను భరించలేను. నన్ను నేనే శిక్షించుకోవాలంటే నేనొప్పుకోను" అన్నాడు.

అక్కడి వాళ్లలో కొందరితో పోల్చితే పాటల విషయంలో నేను రఫీనో, ఘంటసాలనో అనుకోవచ్చు. ఐనా జనం వినేలా పాడ్డానికి నాకు మొహమాటం. అందుకని, ఎవరేమనుకున్నా సరేనని నేను మోకాలిదాకా వచ్చే చారల డ్రాయర్ ధరించి స్నానం చేసేవాణ్ణి. ఇంతకీ

స్నానాలగదిలో తెరచాటున దిగంబరంగా కళ్లబడడం గురించి ఇలా నాలాంటి కొందరు మొహమాటపడితే, స్నానశాలలో గదుల బయటే దిగంబరంగా తిరిగేవారు కొందరు. ఇబ్బందికరమే ఐనా ఆ దృశ్యాలు భరించడం తప్పనిసరయ్యేది. ఇండియన్సులో మిగతావారిది తెరచాటు స్నానమే కానీ, ఒక్క శర్మ మాత్రం స్నానశాలలో ఏ సంకోచం లేకుండా దిగంబరంగా తిరిగేవాడు. పైగా ఉత్తరభారతంలో అది మామూలేనని చెప్పాడు. ఆ విషయంలో నేను సిగ్గుపడడం అతనికి ఆశ్చర్యంగా ఉండడం నాకు ఆశ్చర్యంగా ఉండేది.

స్నానంకోసం ఎదురుచూస్తూ ఊరికే నించోలేక జోక్సు చెప్పుకునేవాళ్లం. అస్తమానూ అది సాగేది కాదు. జర్మన్ భాషలోనే మాట్లాడాలని కొందరు జర్మన్ భాషాభిమానులు నొక్కించేవారు. అదే మాట క్లాసులో టీచర్లు కూడా చెప్పి ఉండడంవల్ల, సిన్సియారిటీకి మారుపేరైన కొందరు జపనీయులు వాళ్లకి మద్దతిచ్చేవారు. ఒకసారి అక్కడ ఒకే ఒక్క జర్మనూ, మిగతావాళ్లం ఇండియన్సుమీ ఉన్నాం. ఉన్న ఒక్క జర్మన్ పౌరుడూ మంచి డోసు మీదున్నాడు. అడుగు పడ్డంలేదు. మాట రావడం లేదు. ఆ ధైర్యంతో మేము ఇంగ్లీషులో విజృంభించాం. అంత నిషాలోనూ ఆ జర్మన్ పౌరుడు మమ్మల్ని, 'కైన్ఎంగ్లిష్, న్యూర్ డాయిచ్' (నో ఇంగ్లీష్, ఓన్లీ జర్మన్) అని మందలించాడు. 'నీ భాషాభిమానం మండిపోనూ' అనుకున్నాం.

స్నానాలకి వేణ్ణీళ్ల విషయంలో ఓ ఇబ్బంది ఉండేది. ముందుగా ఒకరిద్దరు స్నానం చేసేక, నీళ్లు వెచ్చబడ్డానికి కొంత సమయం పట్టేది. వెంటవెంటనే స్నానాలకి వెడితే, కొందరికి నీళ్లు చల్లగా ఉండేవి. ఆ చల్లదనం హిమాలయంలో గంగాస్నానానికి దీటొచ్చేది. అప్పుడు స్నానాల గదిలోంచి కెవ్వు-కేకలు వినిపించేవి. అందుకని ముందుగా స్నానం చెయ్యడానికి, తిరుపతిలో స్పెషల్ దర్శనానికిలా చాలా పోటీ ఉండేది. తిరుపతిలో వీఐపి దర్శనానికిలా, ఆ అవకాశం రోజుకి కొంతమంది అదృష్టవంతుల్నే వరించేది.

క్లాసులు లేని సెలవురోజుల్లో ఇన్‌స్టిట్యూట్లో స్నానం చేయడానికి అవకాశముండేదికాదు. అందువల్ల నేను శనాదివారాలు స్నానం చేసేవాణ్ణి కాదు. కానీ మొదటి లాంగ్వేజి కోర్సు అయ్యేక, రెండో కోర్సు మొదలయ్యేలోగా మధ్యలో కొన్ని రోజులు సెలవిచ్చారు. ఆ సెలవుల్లో మిగతా రోజుల్లోనూ ఇన్‌స్టిట్యూట్లో స్నానాని కవకాశం లేకుండా పోయింది. అందుకని నేను ఆగలేక ఓ శుక్రవారం ఫ్రయ్‌బాడ్ (ఓపెన్ఎయిర్ బాత్) సదుపాయం ఉన్నచోటకి వెళ్లాను. అది మా ఇంటికి చాలా దూరం. దానికి ప్రవేశ రుసుము అరవై పెన్నిగ్సు. వేణ్ణీళ్లకి ఆటోమేట్లున్నాయి. రెండు నిముషాలకి పది ఫెన్నిగ్సు వెయ్యాలి. నేను ఇరవై ఫెన్నిగ్సుతోనాలుగు నిముషాలు వేణ్ణీళ్ల స్నానం చేశాను. అక్కడ ఔట్‌డోర్ స్విమ్మింగ్‌పూల్ కూడా ఉంది కానీ నేనది చూసి ఆనందించడానికే పరిమితమయ్యాను. ఉన్నంతలో ఇది బాగానే ఉందని ఆ తర్వాత సోమవారం కూడా అక్కడికే స్నానానికి వెళ్లాను. ఆ పూట ఎందుకో ఆటోమాట్ పాడయింది. కానీ 'తాళము వేసితిని, గొళ్లెము మరచితిని' అన్నట్లు గీజర్ పని చేస్తూనే ఉంది. పది ఫెన్నిగ్సుకే బోలెడు సేపు స్నానం. తేరగా వచ్చిన వేణ్ణీళ్లు కాబట్టి, స్నానం మరింత బాగుంది.

ఫ్రయ్‌బాడ్ దూరమెక్కువ కాబట్టి పదేపదే అక్కడికి వెళ్లడం కష్టం. అందుకని నిత్య స్నానవ్రతులు సుబ్రహ్మణ్యం, రామచంద్ర నగరంలో ఉన్న కూర్పార్‌క్‌కి వెళ్లి డబ్బు కట్టి స్నానం చేసేవారు.

కూర్పార్క్ క్యూట్‌గా ఉంటుంది. అక్కడ చక్కని జలయంత్రాలున్నాయి. ఆకుపచ్చని పరుపు పరిచినట్లుండే పచ్చిక మైదానాలున్నాయి. ఆ పచ్చిక రమ్మని పిలుస్తుంటే, ఒక రోజున మేము వెళ్లి దానిమీద కూర్చున్నాం. ఆ పచ్చిక మెత్తగా హాయినిస్తే, మేము కబుర్లు చెప్పుకుంటున్నాం. అంతలో ఒక జర్మన్ వనిత మమ్మల్ని సమీపించింది. ఆమె మాట మెత్తగా లేదు. ఏవో సైగలు చేసింది. అవీ మెత్తగా లేవు.

"మర్యాద లేని మనిషి. తనని పట్టించుకోవద్దు" అన్నాడు సుబ్రహ్మణ్యం. మేమామెవైపైనా చూడకుండా కబుర్లలో మునిగిపోయినట్లు నటించాం. కానీ మా ఆలోచనంతా ఆమెపైనే ఉంది. ఎందుకామె అలా ప్రవర్తిస్తోందన్నది మా కుతూహలం.

ఆమె స్వరం పెంచి ఏమేమో అని, చివరకు ఉన్నట్లుండి, "పోలీచై" అంది. ఉలిక్కిపడ్డాం.

జర్మన్లో పోలీచై అంటే పోలీసులని మాకు తెలుసు. మా విషయంలో ఆమె చాలా సీరియస్‌గా ఉందని అర్థమై చటుక్కున అక్కణ్ణించి లేచి బయటికొచ్చాం. వెంటనే ఆమె కూడా మరి మాట్లాడకుండా వెళ్లిపోయింది. ఆ వెంటనే మాకు తెలిసింది. పార్కులో పచ్చికమీద కూర్చోవడం పోలీసులు అరెస్టు చేసేటంత పెద్ద నేరమని!

చిన్నపిల్లలకి – బూచాడి పేరు చెప్పినట్లు ఆమె మమ్మల్ని పోలీసు పేరు చెప్పి బెదిరించడం తల్చుకుంటే నవ్వొచ్చింది. అంత పచ్చిక పెట్టుకుని కూర్చునేందుకు లేకుండా చేశారని పార్కువాళ్లని తిట్టుకుని, చుట్టూ చూస్తే – పార్కులో బోలెడు బెంచీలున్నాయి.

పాపం – తప్పు పార్కు వాళ్లది కాదు. తగిన ఏర్పాట్లు చేసేకనే పచ్చికపై నడవరాదన్న నిబంధన విధించారు.

పార్కు చాలా పెద్దది. లోపల ఆటస్థలాలున్నాయి. వ్యాయామశాలలున్నాయి. ఈ పార్కులోనే 'కూర్ జెంత్రం' అనే స్నానశాల ఉంది. ఆ స్నానశాల గదుల్లోనే ప్రతి శని, ఆదివారాలు రామచంద్ర, సుబ్రహ్మణ్యం స్నానాలు చేసేవారు. స్నానం చేసేముందు వంటిమీద బట్ట ఉంచుకోకూడదని ఇక్కడ ఖచ్చితమైన నిబంధన ఉంది. అది బోర్డుమీద కూడా వ్రాయబడి ఉంది. అందువల్ల నేను మొహమాటపడి అక్కడ స్నానానికి వెళ్లేవాణ్ణి కాదు. ఐనా కూడా – సుబ్రహ్మణ్యం, రామచంద్ర, నేనూ, మరికొందరు ఇండియన్సూ కూర్ జెంత్రంలో కలుసుకునేవాళ్లం. వాళ్లు లోపలికెళ్లి స్నానం చేస్తూంటే మేము బయట బెంచీలమీద కూర్చునేవాళ్లం. మాకు ఎదురుగా ఓ ఇండోర్ స్విమ్మింగ్‌పూల్‌ఉంది. అందులో అలలు ఉవ్వెత్తున లేచి పడుతుండేవి. సముద్రస్నానం చేస్తున్న అనుభూతి ఇచ్చేటందుకు ఆ ఏర్పాటు చేయబడింది.

మగవాళ్లు చిన్ని డ్రాయర్లతోనూ, ఆడవాళ్లు బికినీలతోనూ అందులో స్నానం చేసేవారు. చాలామంది కుటుంబాలతో అక్కడ స్నానాలకొచ్చేవారు.

తండ్రిముందు వయసొచ్చిన కూతురు బికినీతో నిలబడి స్నానం చేయడం ఎబ్బెట్టుగా అనిపించింది నాకు. అప్పుడే నా ఆలోచనల్లో లోపించిన సంస్కారం స్ఫురించి నాపై నాకే కొంత చిరాకూ కలిగింది.

సెక్సు విషయంలో ఈ దేశానికీ మన దేశానికీ దృక్కోణాలు వేరు. మన మగాళ్లు ఆడది కనబడితే కళ్లప్పగించి చూస్తారు. వళ్లు కాస్త ఎక్కువ కనబడితే కళ్లు మరీ పెద్దవి చేస్తారు. సెక్సు నాలుగు గోడలకే పరిమితమంటూనే, బయట ఆడదాన్ని చూస్తే చాలు, మనసులోకొచ్చే సెక్సు భావనలు ఆపుకోలేరు. అందుకే పరాయి ఆడదానితో కరచాలనం చెయ్యాలన్నా, ఆమెను ముట్టుకోవాలన్నా, ప్రయాణంలో పక్కన కూర్చోవాలన్నా వాళ్లకి సంకోచం.

మరిక్కడి మగవారికి, బికినీతో ఎదురుగా నిలబడ్డ స్త్రీని కూడా నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసే అలవాటు లేదు. అతి తక్కువ దుస్తుల్లో స్విమ్మింగ్‌పూల్లో ఈతలు కొడుతున్న వాళ్లు – చంటిపాపల్లా ఆడుకుంటున్నారు. అప్పుడు వాళ్ల మనసుల్లో స్త్రీపురుష భేదభావన ఉన్నట్లనిపించదు.

నా మనసులోని కాలుష్యం స్త్రీని స్త్రీగా చూస్తోంది. ఇక్కడి జనాలకు స్త్రీని స్త్రీగా చూడడానికి సమయాసమయాలు ఉన్నాయి. మన సమాజంలో అటువంటిదున్నట్లు తోచదు. నిండా పైట కప్పుకున్న స్త్రీ వైపు కూడా ఎన్నో కళ్లు ఆకలిగా చూడడం నాకు తెలుసు. ఆ ఆకలి అప్పుడప్పుడు నా కళ్లలోనూ జతపడేదేమో చెప్పలేను.

ఆలోచించగా ఆలోచించగా, సకుటుంబంగా స్విమ్మింగ్పూల్ స్నానాలు చేయగలగడం ఆశ్చర్యపోవలసిన విషయమే కానీ అసహ్యించుకోవలసినది కాదనిపించింది. ఏదిఏమైనా ప్రతి ఆదివారం కూర్ జెంత్రంలో కాస్సేపు స్విమ్మింగ్‌పూల్ వద్ద గడపడం మాకు మామూలైంది. అక్కడి దృశ్యాలు మమ్మల్ని అలరించాయన్నదీ నిజం.

ఒలు శుభ్రం విషయాన్నింతటితో ఆపి, ఇప్పుడు వలువల మాపుకొద్దాం.

చాకిరేవు బాన ఏమంది?

జీన్సు బాగా వాడకంలో ఉన్న రోజులవి. అక్కడి మనుషుల్ని చూస్తే, నెలల తరబడి వాటితోనే పడుకుని, వాటితోనే లేచి, వాటితోనే తిరుగుతున్నట్లు అనిపించేది.

ఎంత చలి దేశమైనా శరీరానికి అంతో ఇంతో చెమట పడుతుంది. ఎంత సెంటు పూసినా అడపాతడపా బట్టలు మార్చుకోకతప్పదని నేననుకునేవాణ్ణి. మరి బట్టలు మార్చుకోవాలంటే ఎప్పటికప్పుడు ఉతుక్కోవాలి. ఇండియాలో పనిమనిషి ఉతికి పెడుతుంది. లేదా చాకలికి వేస్తాం. కానీ ఇక్కడ?

స్నానానికే ఇంట్లో గతి లేదు. ఇక బట్టలుతికేదెక్కడ? అప్పటికీ ఓసారి ఓ డిటర్జెంటు పౌడరు కొని లోదుస్తుల్ని బాత్రూంలో ఓ మగ్గులో నానబెట్టాను. ఆశ్చర్యమేమిటంటే, వాటిని వాష్‌బేసిన్లో నీళ్లతో కడగ్గానే, మట్టంతా విడిపోయి నీళ్లలోకొచ్చేసింది. అడ్వర్టయిజ్‌మెంట్లలో చూపించినట్లే బట్టలు తళతళ మెరిశాయి. వాటికంత మట్టి ఉందనీ, అది పోతే, అంత తళతళ మెరుస్తాయనీ నేనూహించలేదు. వాటిని రాత్రిళ్లే ఉతికి, రాత్రిళ్లే ఆరవేసుకుని హౌస్‌ఫ్రా కళ్లబడకుండా కొన్ని రోజులు మ్యానేజ్ చేశాను. లోదుస్తులు చిన్నవి కాబట్టి సరిపోయింది. మరి పాంటూ, షర్టూ ఏంచెయ్యాలి? ఎలా ఉతకాలి?

కొంత వాకబు చేశాను. బయట బట్టలుతకడానికి కేజీకి రెండు మార్కులు ఔతుందట. అలాగని ఓ కేజీ బట్టలిస్తే తీసుకోరు. కనీసం మూడు కేజీల బట్టలు ఇవ్వాలట. అంటే ఒకే ఒక బనీను ఇచ్చినా, మూడు కేజీల బట్టలు మూట కట్టిచ్చినా అయ్యేది ఆరు మార్కులే! ఒక్కరికైతే ఎక్కువే కానీ, ఒకరికి ముగ్గురైతే చౌకే అనిపించింది.

ఆ ప్రకారం ఒకరోజు నేను, బిశ్వాస్, నటరాజన్ – మా ముగ్గురివీ కొన్ని బట్టలు, మూడు కేజీల లోపు ఉండేలా చూసుకుని, ఓ లాండ్రీ షాపులో ఇచ్చాం. ఒకొక్కరు రెండు మార్కుల చొప్పున షేర్ చేసుకుందా మనుకున్నాం. అయితే బట్టలు తెచ్చుకోవడానికి వెళ్లేసరికి బిల్లు ఇరవైరెండు మార్కుల ఎనబై ఫెనిగ్స్ అయింది. అదేమని అడిగితే, తన దుకాణంలో బట్టబట్టకీ విడివిడిగా ఛార్జి చేస్తామనీ, కేజీల లెక్కన ఉతికే దుకాణాలు వేరనీ చెప్పాడు షాపువాడు. నావి ఒక పాంటు, షర్టు, రెండు బనియన్లు. షాపతని ఛార్జి ప్రకారం నా వాటా తొమ్మిది మార్కుల అయిదు ఫెనిగ్స్. నటరాజన్‌కైతే బొత్తిగా రెండే బనియన్లు. దానికే అతనికి మూడు మార్కుల ఇరవై ఫె¦నిగ్స్‌అయింది. బిల్లు అనుకున్నకంటే బాగా ఎక్కువవడంవల్ల, మేము ఖర్చు సమవాటాలు చెయ్యకుండా, బట్టల్నిబట్టి లెక్కేసి పంచుకున్నాం.

ఈ మా అనుభవాన్ని క్లాస్‌టీచరుకి చెప్పగా, "మీకీ శ్రమెందుకు? మీ హౌస్‌ఫ్రా మీ బట్టలు ఉతికి పెడుతుంది" అందామె. ఆ తర్వాత మేము బయట లాండ్రీ జోలికి వెళ్లలేదు.

యాకేల్ నా బట్టలుతికిపెట్టేది. ఇస్త్రీ కూడా చేసేది కానీ, చేతకాక మడతలు అడ్డదిడ్డంగా పెట్టేది. అయితే జర్మనీలో అదో సమస్య కాదు. ఇంచుమించు అంతా నలిగిన బట్టలతోనే తిరిగేవారు. జీన్సు అక్కడి ఫ్యాషన్. నలిగుండడమే కాదు, వాటికి చిరుగులూ, అతుకులూ కూడా ఉండేవి. చాలామందిని చూస్తే నెలల తరబడి బట్టలు మార్చనట్లు అనిపించేది. చాలామంది స్నానం కూడా అరుదుగానే చేసేవారు. శరీరంనుంచి వాసన రాకుండా ఉడుకులాం వాడేవారు. దేశంలో అపరిశుభ్రత అంటూ ఉంటే అది మనుషుల వంటిమీదనే ఉండేది.

చిటపట చినుకులు

'వాన రాకడ ప్రాణంపోకడ ఎవరికెరుక?' అంటారు మనవాళ్లు. అది పూర్వమెప్పుడో జర్మనీ వెళ్లి వచ్చినవాళ్ల అనుభవంలోంచి వచ్చిందని నాకిప్పుడర్థమైంది.

జర్మనీలో అడుగెట్టాక మొదటి శనివారమే సాయంత్రం అమ్‌శాండే దగ్గర తిరుగుతుండగా, ఏ సంకేతమూ లేకుండా ఉన్నట్లుండి వానొచ్చింది. సమయానికో షాపు నీడ దొరికి, తడవకుండా నన్ను నేను కాపాడుకోగలిగాను. పది నిముషాల్లో ఎలా వచ్చిందో అలా మాయమయింది వాన. అప్పుడు చూశానో మనోహర దృశ్యం.

కొందరు యువకులు గిటారు వగైరా సంగీతవాద్యాలతో పేవ్‌మెంటుమీదికొచ్చారు. వారు వీనులవిందుగా సంగీతం వినిపిస్తుంటే, ఫ్రాక్స్ వేసుకున్న కొందరమ్మాయిలు లయబద్ధంగా నృత్యం చేస్తున్నారు. టేక్‌స్‌కి బ్రేక్స్‌అవసరం లేని సినిమా షూటింగులా ఉంది ఆ దృశ్యం. వినోదించడానికి వచ్చిన జనం మధ్యమధ్యలో చప్పట్లు కొడుతున్నారు. వాన వెలిసినప్పుడు అలాంటి వేడుకలు అక్కడ మామూలని తర్వాత తెలిసింది.

తర్వాత నాకు అలాంటి దృశ్యం చూసే అవకాశం మళ్లీ రాలేదు కానీ, వానకు చిక్కిన సందర్భాలు చాలా ఉన్నాయి. అక్కడ తీవ్రమైన ఎండ – మనకి శీతాకాలంలో సాయంకాలపుటెండలా ఆహ్లాదకరంగా ఉండేది. అలాంటి ఎండలో తిరుగుతుండగా, ఉన్నట్లుండి ఆకాశంలో నల్లటి మబ్బులు మూసుకొచ్చేవి. భళ్ళున వాన కురిసేది. ఎంతసేపు, జస్టే మినిట్! వెంటనే వెలిసిపోయి, మబ్బులు మాయమై సాయంకాలపుటెండ తిరిగొచ్చేసేది.

ఈ వానల కోసమని మావాళ్లు చాలామంది గొడుగులు కొనుక్కున్నారు. ఇండియాలో ఉన్నప్పుడే నేను గొడుకు వాడడాన్ని నిరసించేవాణ్ణి – చేతికి అదనపు భారమని. హాండ్‌బ్యాగ్‌లోనో, లాంగ్‌కోట్ జేబులోనో ఇమిడిపోయేందుకు అనువుగా మడుచుకునే గొడుగులిక్కడ దొరుకుతాయి. అయినా నేను గొడుగు కొనలేదు. గొడుగు లేదని వాన ఊరుకోదుగా, చాలాసార్లు వానలో తడిశాను. ఇండియాలో అయితే బాగా చలి వేస్తున్నప్పుడు బయట తిరిగితేనే జలుబు చేసేది. ఇక వానలో తడిస్తే చెప్పనే అక్కర్లేదు. కానీ ఇక్కడ నేను ఒక్కరోజైనా జ్రిరున చీదలేదు. ధూళి దూసరాలు లేని పరిశుభ్ర వాతావరణం అందుకు కారణమేమో మరి!

అసమదీయులు తసమదీయులు

ఇండియన్స్ అందరం వీలుని బట్టి తరచుగానే ఎక్కడో అక్కడ కలుసుకునేవాళ్లం. మాలో ప్రతిఒక్కరికీ ఎవరికి వారు సర్వజ్ఞులమన్న భావన ఉండేదేమో – మాటల్లో మన రాజకీయవాదులకి దీటొచ్చేవాళ్లం.

మాలో ప్రతిఒక్కరూ తమ హౌస్‌ఫ్రౌని – తమ పార్టీ మనిషిగా భావించి పొగుడుతుండేవారు. పొగిడినవాళ్లు పొగిడి ఊరుకున్నా, విన్నవాళ్లు విని ఊరుకున్నా ఏ గొడవా లేదు. ఉన్నట్లుండి హౌస్‌ఫ్రౌ మా పార్టీ అభ్యర్థిగా మారిపోయేది. వాళ్లమధ్య ఎన్నికల పోటీ జరుగుతున్నట్లుండేది. ప్రతి ఒక్కరూ తమ హౌస్‌ఫ్రౌ మిగతావాళ్ల హౌస్‌ఫ్రౌల కంటే గొప్పదనేవారు. సాక్ష్యాలతో వాదించేవారు.

రామచంద్ర హౌస్‌ఫ్రౌ అతని బట్టలుతికిపెట్టేది. అందుకు డబ్బు తీసుకునేది. నా హౌస్‌ఫ్రౌ నాకు ఉచితంగా బట్టలుతికి పెట్టేది. ఇద్దర్నీ పోల్చుతూ, "డబ్బు తీసుకుంటే మొహమాటముండదు. ఎన్ని బట్టలైనా వెయ్యడానికి సంకోచముండదు. డబ్బు తీసుకోలేదనుకో, ఉతకమని బట్టలివ్వడానికి మొహమాటపడతాం. అందువల్ల నా హౌస్‌ఫ్రౌ పద్ధతే మంచిది" అన్నాడు రామచంద్ర ఒకసారి.

అతను చెప్పింది కొంతవరకూ నిజమే. నేను మొహమాటపడి ఫ్రౌ యాకేల్‌కి ఉతకడానికి మాసిన బట్టలు ఇచ్చేవాణ్ణి కాదు. అయితే ఆమె, నేను లేనప్పుడు నా గదిలోంచి అవి తీసుకుని ఉతికేసేది. వాదనకోసం కాకపోయినా ఆ విషయం చెప్పడం న్యాయం. అదే అతనికి చెప్పాను.

సుబ్రహ్మణ్యానికి తన హౌస్‌ఫ్రౌ నచ్చలేదు. అతను తరచుగా నా హౌస్‌ఫ్రౌని మెచ్చుకునేవాడు.

ఏదిఏమైనా, నాకు తెలిసినంతలో అందరి హౌస్‌ఫ్రౌలూ అభిమానంగానే ఉండేవారు. వారిలో క్రంకెన్ గుప్తా, శర్మ, నటరాజన్ల హౌస్‌ఫ్రౌలు కాస్త ఎక్కువ మంచివారని నాకు అనిపించింది. అయితే అసమదీయుల విషయంలో నేనూ మిగతావారికి తీసిపోలేదు. ఫ్రౌ యాకేల్ని నేను అమ్మలా అభిమానించాను. ఆమె మంచితనానికి ప్రచారం కల్పించడం నా బాధ్యతగా భావించేవాణ్ణి. మిగతావారూ అలాగే అనుకోవచ్చు కదా, అందుకని ల్యూనబర్గ్ వదిలేదాకా మా మధ్య హౌస్‌ఫ్రౌల గురించిన రాజకీయవాదాలు నడుస్తూనే ఉండేవి.

ఫ్రౌ యాకేల్ ముచ్చట్లు

జర్మనీలో అడుగెట్టగానే – నాకు నిలువ నీడనిచ్చిన ఇంటి యజమానురాలు ఫ్రౌ యాకేల్. ఆమె పరిచయం నా అదృష్టం అనిపించేది.

రోజూ నన్నామె అభిమానంగా పలకరించేది. మద్యం ముట్టనని తెలియగానే ఆమెకు నాపై గౌరవాభిమానాలు పెరిగిపోయాయి. నన్ను తరచుగా తన వాటాలోకి ఆహ్వానించి టివి చూడమనేది. ఆమె ఇంట్లో కలర్ టీవీలో మంచి కార్యక్రమాలు కొన్ని చూసి ఎంజాయ్ చేశాను. ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం ఆమె నాకు తను ఇంట్లో చేసిన కేక్ పట్టుకొచ్చి ఇచ్చేది. అది చాలా బాగుందని మెచ్చుకుంటే ఆమె ముఖం ఇంతయ్యేది.

నిజానికి ఆ కేక్ నాకు నచ్చేది కాదు. తింటుంటే కోడిగుడ్డు సొన రుచి లీలామాత్రంగా తెలిసేది. అలాగని కోడిగుడ్డు నాకు మరీ కొత్తేం కాదు. రీసెర్చి రోజుల్లో డాక్టరు సలహామీద కొన్ని రోజులు పచ్చి కోడిగుడ్డుని పగులగొట్టి సొన తాగాల్సి వచ్చింది. కానీ ఆ సొన రుచి, వాసన కూడా భరించలేక – కోర్సు పూర్తి కాకుండానే ఆ వైద్యానికి స్వస్తి పలికాను. అప్పట్లో అలా ఆ రుచి నన్ను బాధించి ఉండకపోతే, ఇప్పుడు ఫ్రౌ యాకేల్ఇచ్చిన కేక్ ఎంజాయ్ చేసి ఉండేవాడినేమో తెలియదు.

యాకేల్ ఇంటిచుట్టూ చక్కటి తోట ఉంది. అందులో ఆపిల్, పియర్స్ వగైరా చెట్లున్నాయి. తన పెరటిచెట్ల పళ్లతో జామ్ తయారు చేసేదామె. అప్పుడప్పుడు ఓ సీసాడు జామ్ నాకిచ్చేది. అది చాలా రుచిగా ఉండేది.

అమె తరచుగా నన్ను క్షేమసమచారాలడిగేది. నాకు పెళ్లయిందనీ, ఇద్దరు పిల్లలనీ విని చాలా ఆశ్చర్యపడింది. తన కంటికి నేను పద్దెనిమిదేళ్ల కుర్రాడిలా కనపడుతున్నానంటే, చాలా ఆశ్చర్యపడ్డాను.

నిజానికి నాకు అప్పుడు ముప్పై నిండి ముప్పైఒకటి నడుస్తోంది. నేను కుర్రాడిలా కనబడతానని అక్కడ చాలామంది అనేవారు. ఐతే చిన్నవాళ్లలా కనిపించడం అందరికీ ఇష్టమే కానీ, అన్నివేళలా కాదు. ఒకసారి బట్టల షాపుకి వెడితే, అక్కడి సేల్స్‌గర్ల్ నా భుజం కొలత తీసుకుని కిండర్ సెక్షన్‌కి పొమ్మంది. ఒక అందమైన అమ్మాయలా అన్నందుకు కాస్త చిన్నబుచ్చుకున్నాను.

ఫ్రౌ యాకేల్ నా అసలు వయసడిగితే చెప్పడానికి మొహమాటపడి కాస్త తగ్గించి చెప్పాను. ఆమె నా ఫ్యామిలీఫొటో చూసి, నా భార్యాబిడ్డలు అద్భుత సౌందర్యంతో మిలమిల మెరిసిపోతున్నారంది. ప్రతీదీ అద్భుతం అనడం అక్కడివాళ్ల మర్యాదగా మాత్రమే భావించే వివేకం అప్పటికే అలవడింది కాబట్టి నేను మరీ మురిసిపోలేదు.

ఫ్రౌ యాకేల్లో నాకు బాగా నచ్చినది ఆమె సేవానిరతి. తనింట్లో హెర్(మిస్టర్) పాల్అని ఒక వృద్ధుడున్నాడు. ఆయన వయసు ఎనభైరెండు. ఆయన్ని ఆమె అంకుల్ పాల్ అని పిలుస్తుంది.

పాల్ ఆరోగ్యం బాగాలేదు. పట్టుమని నాలుగడుగులు వెయ్యలేడు. అతణ్ణి కంటికి రెప్పలా చూసుకుంటుంది యాకేల్. ఒక సందర్భంలో ఆమె నాకు తన కథ చెప్పింది.

రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ఫ్రౌ యాకేల్ పోలండ్‌లో ఉండేదిట. ఆమె, ఆమె భర్త అక్కడ ఎంతో హాయిగా జీవించేవారుట. రెండవ ప్రపంచయుద్ధం వచ్చిన తర్వాత 1945లో ఆమె డెన్మార్కుకి వెళ్లి మూడేళ్లుందిట. అక్కణ్ణించి కట్టుబట్టలు, చేతిలో ఒకేఒక పెట్టెతో, ఆమె కుటుంబం జర్మనీ చేరుకుందిట. నిరాశ్రయం, నిరాధారం అయిన ఆమె కుటుంబాన్ని అంకుల్ పాల్ చేరదీసి, ఆదరించి చేయూతనిచ్చాడుట. అలా నిలదొక్కుకున్నాక యాకేల్ భర్త క్రమంగా బాగా డబ్బు సంపాదించి 1958లో ఇప్పుడున్న ఈ ఇల్లు కట్టించాడుట. 1959నుంచి ఈ ఇంట్లో పై భాగాన్ని గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకి ఇస్తోందిట. మొట్టమొదట అద్దెకొచ్చిన ముగ్గురు ఆఫ్ఘన్లు బాగా గుర్తున్నారుట. ఆ తర్వాత గుర్తుంచుకోతగ్గ వ్యక్తిని నేనేనంది. అంకుల్ పాల్ వృద్ధుడై ఉన్నదంతా పోగొట్టుకుంటే, చూసేవాళ్లెవ్వరూ లేని ఆయన్ని యాకేల్చేరదీసిందిట. ఒకప్పుడు ఆదుకున్నాడన్న కృతజ్ఞతతో ఇప్పుడాయనకు సేవలు చేసుకుంటోందిట. భర్త ఎప్పుడు మరణించాడో చెప్పలేదు కానీ, ఒకరోజున నేను శ్రీమతికి ఉత్తరాలు వ్రాయడం చూసి, 19 ఏళ్ల వయసులో తనూ భర్తకు ఇలాగే ఉత్తరాలు వ్రాసేదాన్నని గుర్తు చేసుకుంది. ఆమెకు కూతురు, అల్లుడు, మనవడు ఉన్నప్పటికీ కూడా – 'పాల్మరణిస్తే నేను ఒంటరిని ఐపోతాను' అని బాధ పడుతూంటుంది. ఐతే ఆమె కృతజ్ఞతలో ఆత్మీయతకంటే బాధ్యత పాలే ఎక్కువా అన్న సందేహం నాలో కలిగే సంఘటన ఒకటి ఆ తర్వాత జరిగింది.

ఒకసారి ఫ్రౌ యాకేల్ ఏదో పనిమీద ఊరెడుతున్నానని నాకు చెప్పింది. తిరిగి రావడానికి నాలుగు రోజులు పడుతుందిట. పాల్ కోసం అన్ని ఏర్పాట్లూ చేశాననీ, ఐనా మధ్యమధ్య ఓసారి పలకరించి బాగోగులు తెలుసుకోమనీ కోరింది. సరేనన్నాను. ఆ తర్వాత శనివారం నేను సంతకి వెళ్లాను.

ల్యూనబర్గులో ప్రతి శనివారం సంత జరుగుతుందని రామచంద్ర నాకు చెప్పాడు. అక్కడ తాజా కూరలు, పళ్లు చౌకధరలకు దొరుకుతాయనీ, తను వారానికి సరిపడా అక్కణ్ణించే తెచ్చుకుంటాననీ, గుర్తుండిపోయేలా తన పద్ధతిలో పదేపదే చెప్పాడతను. ఆ రోజు సంత ఎలాగుంటుందో చూద్దామని వెడితే అక్కడ నాకు ఫ్రౌ యాకేల్ కనబడింది. అప్పుడే ఊర్నించి వస్తోందిట. ఇంకా ఇంటికెళ్లలేదు.

ఆమె ఏదో అడగబోతుంటే – అంకుల్ పాల్ బాగానే ఉన్నాడని చెప్పబోతూ మాటలకోసం తడుముకుంటుంటే – ఆమె చాలా ఆత్రుతగా తన కుక్క ఎలాగుందని అడిగింది. నేను బాగుందని చెప్పగానే, తనకది ప్రాణసమానమనీ ఎప్పుడో కానీ వదిలి వెళ్లననీ చెప్పింది. పాల్ గురించి అడగలేదు.

ఫ్రౌ యాకేల్ కూతురికి వివాహమై వేరెక్కడో ఉంటోంది. ల్యూనబర్గులోనే యాకేల్ సోదరుడు కూడా ఉంటున్నాడు. ఆమెకీ అతడికీ అంతగా పడదు. అతను అప్పుడప్పుడు వచ్చి సోదరిని పలకరించి వెడుతూంటాడు. ఒకసారి అతను వచ్చినప్పుడు ఆమె నన్ను పిలిచి అతనికి పరిచయంచేసింది. నా అలవాట్ల గురించి చాలా గొప్పగా చెప్పింది. నేను మాంసం, గుడ్లు, చేపలు వగైరాలేమీ తిననని తెలియగానే అతను కాస్త కంగారు పడ్డాడు. "మరేం తింటారు?" అన్నాడు చాలా కన్సర్న్‌తో

"కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు" అని నేనేదో చెప్పబోయాను. అతను నన్ను మధ్యలో ఆపి, "ఎస్సెన్జీ దాస్?'" (అది మీరు తింటారా?) అంటూ తోటలోని లాన్ చూపించాడు.

అతడి హేళన నాకర్థమైంది, "యూరోపియన్ సైంటిస్టులు అందులో ప్రోటీన్సు బాగా ఉన్నాయని అంటున్నారు కానీ, ఇండియన్ శాకాహారులింకా అది తినడం మొదలెట్టలేదు" అని అమాయకత్వం నటిస్తూ బదులిచ్చాను. వజ్రాన్ని వజ్రంతోనే కొయ్యాలంటారు కానీ, వ్యంగ్యాన్ని అధిగమించడానికి అమాయకత్వాన్ని మించింది లేదని చిన్నప్పుడే తెలుసుకున్నాను.

మా తాతగారు నాకో కథ చెప్పారు. ఆయన మిత్రుడొకడు పనివాణ్ణి ఏడిపించడానికి, "ఒరేయ్, నువ్వు సర్వం తెలిసిన పరమ మూర్ఖుడివి" అన్నాడట. దానికా పనివాడు కంగారుపడి, "అంత పెద్ద మాటలకు తమబోటివారే కానీ నేను తగను" అని వినయంగా, అమాయకంగా బదులిచ్చేట్ట.

ఫ్రౌ యాకేల్ మాత్రం తన సోదరుడి ప్రశ్నకు చాలా నొచ్చుకుని తర్వాత అతన్ని నాతో మాట్లాడనివ్వలేదు.

మధ్యమధ్య సెలవురోజుల్లో కాలక్షేపంకోసం ఫ్రౌ యాకేల్ ఇంటికి వెడితే ఆమె తోటపనిలో ఉండేది. చిన్నప్పుడు మా తాతగారు మాలాంటి పిల్లలచేత తోటపని చేయించేవారు. ఆ మాట చెప్పి ఆమెకు తోటపనిలో సాయపడేవాణ్ణి. అలాంటప్పుడు ఆమె నాకు ఏదైనా తినుబండారం ఇవ్వజూసేది. ఆమె వంటకాలు నాకు అంతగా రుచించవు. ఆ మాట చెప్పలేక, "సరదాగా సాయపడ్డం మా దేశంలో నాకు మామూలే. ప్రతిఫలమిస్తే మాత్రం మొహమాటంగా ఉంటుంది" అని సద్ది చెప్పాను.

దానికామె ఇచ్చిన జవాబు నా ఊహకి అందలేదు. "ప్రతిఫలం లేకుండా తోటపనిలాంటివి చెయ్యడం మా దేశంలో మామూలు కాదు" అందామె. అక్కడ ఇంటిపనికి గంటకి ఐదు మార్కులు, తోటపనికి గంటకి పది మార్కులు ఇవ్వాలిట.

ఆమె అలా చెబుతుంటే నాకు సిగ్గేసింది. తెలివైన వాణ్ణి కావచ్చునేమో, కానీ భాష నేర్చుకోవడంలో నా తెలివికి చెప్పుకోతగ్గ నిదర్శనాలు లేవు. అప్పటికి భువనేశ్వర్లో ఐదేళ్లకు పైగా ఉన్నాను కానీ ఒరియా నేర్చుకోలేదు. ఆఫీసులో ఇంగ్లీషు, బయట వచ్చీరాని హిందీతో మానేజ్ చేస్తున్నాను. ఇక్కడ జర్మనీలో జర్మన్ మాట్లాడ్డం తప్పనిసరై ఏదో మాట్లాడుతున్నాను. కానీ నాతో వచ్చిన ఇండియన్సులో చాలామంది నాకంటే బాగా మాట్లాడుతారు. అర్హత లేని పొగడ్త కాబట్టి నాకామె మెప్పు సంతోషాన్నివ్వలేదు.

హైస్కూలు, కాలేజి రోజుల్లోనే క్లాస్‌మేట్సయినా ఆడపిల్లలకి దూరంగా ఉండేవాణ్ణి. ఇక్కడైతే భాష కూడా అంతంతమాత్రం కాబట్టి నాకు బ్రిగెట్టీతో మాట్లాడే ఆసక్తి కలగలేదు. ఆపైన ఉదయం లేచీలేవగానే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లే హడావుడి. తిరిగొచ్చేసరికి రాత్రి ఏడో, ఎనిమిదో! నిజం చెప్పాలంటే ఆమె నా ఎదుటి గదిలో ఉంటున్నదనే మర్చిపోయాను. అలా రెండు రోజులు గడిచిపోయాయి.

యాకేల్ నా గురించి చెప్పిన మాటలు బ్రిగెట్టీకి నేనంటే కుతూహలం కలిగించినట్లున్నాయి. నేను తనని పలకరిస్తానని మూడు రోజులు చూసింది. ఆదివారం రాగానే ఇక ఆగలేక, నా గదికి వచ్చింది. "కాసేపు కబుర్లు చెప్పుకుందాం. నీ గది చాలా చిన్నది కాబట్టి, నా గదిలోకొస్తావా?" అనడిగింది స్నేహపూర్వకంగా.

వెళ్లాను. చూస్తే ఆ గది చాలా పెద్దది. పెద్ద మంచంతో పాటు సోఫా, కుర్చీలు కూడా ఉన్నాయి. ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాక, "నీ గురించి చెప్పు" అంది జర్మన్లో.

నాకొచ్చిన జర్మన్ అంతంతమాత్రం. బయట ఎవరితో మాట్లాడినా, జర్మన్లోనే మాట్లాడమని మా టీచర్ చెప్పింది. బయటివాళ్లు కూడా గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల్ని జర్మన్లోనే మాట్లాడమని ప్రోత్సహిస్తారు.

నాకొచ్చిన చచ్చు భాషలో నెమ్మదిగా కబుర్లు మొదలు పెట్టాను. ఏం చెప్పాలో తెలియక, నేనొక రచయితననీ, నా శ్రీమతి నా రచనలు ఫెయిర్ చేస్తుందనీ చెప్పాను. మామూలుగా ఐతే అంత తక్కువ పరిచయంలో నేను రచయితనని ఇతరులకి చెప్పిన సందర్భాలు లేవు.

ఆమె నావంక అడ్మయిరింగ్‌గా చూసింది.

మొహమాటమేసి, ఎందుకు చెప్పానా అనుకున్నాను. అంతలో యాకేల్ వచ్చింది. మా ఇద్దరికీ కేక్ పెట్టింది.

ఫస్ చెయ్యడం ఇష్టం లేక మాట్లాడకుండా తిన్నాను. మానసిక బలమేమో, ఆ పూట కేక్ బాగుందనిపించింది.

కేక్ తింటూనే బ్రిగెట్టీ తనగురించి చెప్పింది.

ఆమె వయసు ఇరవై సంవత్సరాలుట. మాటల సందర్భంలో, తనకి బ్రౌన్ కలరంటే ఇష్టమంది.

"బ్రౌన్అంటే ?" అన్నాను అర్థం కాక.

"అదే, నీ వంటి రంగు!" అందామె మామూలుగా.

అబద్ధమెందుకూ, నాలో సంతోషం పొంగుకొచ్చింది. ఎందుకంటే, ఒకరోజు నేనూ, నటరాజన్ బస్సులో వెడుతుంటే మా వెనుక సీట్లో ఓ తెల్ల యువతీ, నాలుగైదేళ్ల కొడుకూ కూర్చుని ఉన్నారు. ఆ పిల్లాడు చూడ్డానికి బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. వెనక్కి తిరిగి మరీ ఆ కుర్రాడివంక చూసి ముద్దుగా నవ్వాం. తల్లిమనసు ఉప్పొంగినట్లుంది, ఆ యువతి వెంటనే కుర్రాడితో, "వాళ్లెవరో తెలుసా?" అంది ముచ్చటగా. మా గురించీ, ఇండియా గురించీ నాలుగు మంచి మాటలు చెప్పాలని ఆమె ఉద్దేశ్యమై ఉండొచ్చు. ఆ కుర్రాడు వెంటనే, "ఆఫ్రికానర్" (ఆఫ్రికన్లు) అన్నాడు. ఆ తర్వాత ఆమె కొడుకుని మందలించిన స్వరాన్ని బట్టి తను నొచ్చుకుందని అర్థమైంది. మేము ఇండియన్సుమనీ, ఇండియా చాలా గొప్పదేశమనీ కాస్త ఎక్కువ చేసి చెప్పి కవర్ చెయ్యడానికి ప్రయత్నించింది. మేమిక వెనక్కి తిరగలేదు.

నటరాజన్ కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. "మనం మరీ అంత నల్లగా ఉన్నామా?" అన్నాడు నాతో.

"మనమెలా ఉన్నామన్నది కాదు ముఖ్యం. మనం వాళ్లకెలా కనబడతామన్నది ముఖ్యం. ఆ మాటన్నది మాయామర్మం తెలియని ఓ పసివాడు. మనం ఇతరుల నలుపుని చిన్నబుచ్చేముందు, మనమూ కొందరికి నలుపని హెచ్చరించడానికే ఈ ఘటన" అన్నాను హుందాతనాన్ని నటిస్తూ. కానీ మనసులో నేనూ అతడిలాగే మథన పడుతున్నాను. ఇంతకాలం తెలుపని కాకపోయినా, కనీసం బ్రౌన్గా ఉంటానన్న నమ్మకంలో ఉన్నాను. ఆ నమ్మకాన్ని వమ్ము చేశాడా జర్మన్ పసిబాలుడు.

కానీ ఇప్పుడు నిండు యౌవనంలో ఉన్న ఓ తెల్లమ్మాయి, నా రంగు బ్రౌన్ అని నిర్ధారించడమే కాక అది తనకిష్టమని కూడా చెప్పింది. మొహమాటాన్ని అణచుకుంటూ, "డాంకే (థాంక్స్)" అన్నాను.

"నేనే కాదు. మా జర్మన్స్ అంతా బ్రౌన్ రంగు ఇష్టపడతాం. బహుశా మీ ఇండియన్స్ మా రంగు ఇష్టపడతారనుకుంటాను" అని నేనేమంటానోనని కుతూహలంగా నావంక చూసింది.

నిజం చెప్పేయాలనిపించింది. "మాకైతే యూరోపియన్స్ వంటి రంగు పాలిపోయినట్లుంటుంది. అది మాకు నచ్చదు. మాకూ వంటి రంగు బ్రౌన్గా ఉంటేనే ఇష్టం. అయితే మరీ పాలిపోయినట్లు ఉండకపోతే, మీ రంగు బ్రౌన్ కంటే బాగుంటుంది – నీ వంటి రంగులా" అన్నాను కొంచెం లౌక్యంగా. ఆమె వంటి రంగు బాగుందన్న మాట మాత్రం నిజం.

అప్పుడామె ఎంత సిగ్గు పడిందంటే, ప్రపంచంలో ఎక్కడి ఆడవాళ్లయినా ఒక్కలాగే సిగ్గు పడతారనిపించింది. ఆడవాళ్ల సిగ్గు ఎక్కడైనా మనోహరంగా ఉంటుందని కూడా అనిపించింది.

క్రమంగా కబుర్లలో పడి ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. ఇండియాలో గృహిణులకి వంట పని ఎక్కువనీ, రోజులో చాలా భాగం వంటింట్లోనే గడుపుతారనీ, వంట కూడా కష్టమేననీ చెబితే ఆమె ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత బాధగా నిట్టూర్చింది.

కట్టూబొట్టూ ప్రసక్తి వచ్చి, "ఇండియన్ మహిళలు బరువైన చీరలు కట్టుకుంటారు కదా, కట్టడం కూడా కష్టం అనిపిస్తుంది. మా బట్టలైతే తేలిగ్గా ఉంటాయి. వేసుకోవడం కూడా సులభం!" అందామె.

నేనొప్పుకోలేదు. "అలవాటైతే ఏదీ కష్టమనిపించదు. నీ పెర్సనాలిటీకి నువ్వు గౌన్లో కన్నా చీరలో ఎక్కువ బాగుంటావు" అన్నాను.

మళ్లీ అచ్చమైన ఆడపిల్లలా సిగ్గు పడిందామె.

బ్రిగెట్టీకి సిగరెట్‌అలవాటుంది. ముందు నాకు ఆఫర్ చేసింది. నాకు అలవాటు లేదన్నాను.

అప్పుడామె నా అనుమతి తీసుకుని ఓ సిగరెట్ వెలిగించుకుంది. పొగ పీల్చి గుప్పున వదులుతూ, "పొగ తాగడం మంచిది కాదు. నేనూ మానేయ గలిగితే బాగుణ్ణు" అంది కొంచెం స్వగతంలా.

ఇరవైఏళ్ల అందమైన అమ్మాయి నోట్లో సిగరెట్! నేను పెరిగిన వాతావరణానికి ఆ రెండూ మ్యాచైనట్లు అనిపించలేదు.

తర్వాత ఆమె నా కుటుంబ వివరాలు అడిగింది. మా నాన్నగారికి పదిమంది సంతానమనగానే షాక్ తినేసింది. "అంతమంది పిల్లలుండడంపై నీ అభిప్రాయమేమిటి?" అంది. అదామె మర్యాద. నా అభిప్రాయం తెలిసేదాకా ఆ విషయమై తన స్పందనని చెప్పదు.

"ఇప్పుడు ఇండియాలో చాలామంది ఫామిలీ ప్లానింగ్ పాటిస్తున్నారు. ఇద్దరు లేక ముగ్గురు చాలు అన్నది మా దేశంలో కొత్త నినాదం. ఈ మార్పుని నాలాంటివాళ్లంతా స్వాగతిస్తున్నారు" అన్నాను.

ఆమె కళ్లు మెరిశాయి. "నీకు అంతమంది తోడబుట్టినవాళ్లున్నారని బాధగా అనిపిస్తుందా?" అంది.

"అంతమంది పిల్లలుండడంవల్ల ఆర్థికంగా చాలా ఇబ్బంది పడాలి. అందుకని బాధపడాలి. బాధపడితే, తోడబుట్టినవాళ్లని అవాంఛనీయులుగా భావించినట్లే కదా! కాబట్టి భవిష్యత్తులో అలా జరగనివ్వకూడదని అనుకుంటాను తప్ప, ఇప్పటికే జరిగిందానికి బాధపడను. ఆ విషయమలాగుంచితే – పండుగలకీ, వేడుకలకీ అందరం కలుసుకున్నపుడు – మాకు అంత బలగం ఉన్నందుకు మహదానందంగా ఉంటుంది" అన్నాను.

సరిగ్గా రాని భాషలో మాట్లాడడంవల్ల నా మెదడుకి శ్రమగానే ఉంది. ఐనా మేమిద్దరం అక్కడ కూర్చుని సుమారు అయిదు గంటలు మాట్లాడుకున్నాం.

మధ్యలో ఫ్రౌ యాకేళ్ ఊరించి చెబుతూ, "జీ ఈస్ట్ జేర్ ష్యోన్" అన్నాను. ఆ మాట యాకేల్‌తో కూడా చాలాసార్లు అన్నాను. అన్నప్పుడల్లా ఆమె సిగ్గుపడేది. నా అభిప్రాయంలో ఆ పదానికి అర్థం ఆమె చాలా మంచిదని. మరి ఆ మాటకు ఆమె సిగ్గు పడాల్సిన కారణం నాకు అప్పుడు తెలియలేదు. ఇప్పుడు బ్రిగెట్టీ చెప్పగా తెలిసింది. ష్యోన్ అనే మాటకి నైస్ అన్న అర్థం ఉన్నప్పటికీ, ఆ పదాన్ని ఎక్కువగా అందాన్ని పొగడ్డానికే వాడతారుట. కాబట్టి ఆ మాట అందరికీ వాడొద్దని చెప్పిందామె.

నేను యాకేల్ గుణగణాల్ని పొగుడుతున్నాననుకుని, అందాన్ని పొగుడుతున్నాను. అందుకా వృద్ధురాలు సిగ్గు పడుతోందని అర్థమై, అయ్యో అనుకున్నాను. మంచితనాన్ని అభినందించడానికి ష్యోన్‌కి బదులు నెట్ అనమని బ్రిగెట్టీ చెప్పింది. ఆ రోజుకి మా సమావేశం అలా ముగిసింది.

టేపురికార్డరు కొన్న రోజున, హడావుడిగా ఇంటికొచ్చి ఆబగా పిల్లల మాటలు వింటుండగా – బ్రిగెట్టీ వచ్చి తలుపు తట్టి పలకరించింది. పిల్లల మాటలు ఒకసారి తను కూడా విని వాళ్ల వయసులడిగి తెలుసుకుని, "మీ ఇండియన్సువి ఈడుకి మించిన తెలివితేటలు" అంది.

ఆ మాట హృదయంలోంచీ కాక, మాటవరసకి మర్యాదగా అన్నట్లు నాకు అనిపించింది.

వచ్చీ రాని నా జర్మన్ భాష ఆమెకు ఏమి వినోదాన్నిస్తోందో తెలియదు కానీ మర్నాడు మళ్లీ తన గదికి అహ్వానించింది. వెళ్లాను.

ఈసారి మాటల్లో తనే మాంసాహారం ప్రసక్తి తెచ్చి, "నువ్వు మాంసం తిననంటావు. తింటే తప్పేంటి?" అనడిగింది.

"మాంసాహారమైనా, శాకాహారమైనా ఎంతో కొంత హింస లేకుండా లభించదు. తరతమ భేదాలుంటాయంతే! ఉదాహరణకు – మనం జంతువుల్ని ఆహారంగా భావించి చంపి తింటున్నాం. మనకంటే బలమైన, తెలివైన రాక్షసజాతి ఒకటి ఉండి – రోజూ మనని వేటాడి

తింటుంటే అప్పుడు మన మనఃస్థితి ఎలా ఉంటుంది? అలాంటి మనఃస్థితినే నేను జంతుజాలం విషయంలో ఊహించుకోవడంవల్ల – మాంసాహారం తినలేక పోతున్నాను. వృక్షాలక్కూడా ప్రాణం ఉన్నప్పటికీ, అవి ప్రాణమున్న జీవాలని నా ఊహకు అనిపించకపోవడంవల్ల, శాకాహారం తినగల్గుతున్నాను" అని చెప్పానామెకి.

మనుషులకంటే బలమైన, తెలివైన జాతి మనుషుల్ని తినడం ఆమె ఊహలోకి వచ్చినట్లుంది – బ్రిగెట్టీ కళ్లలో కొంచెం భయం కనబడింది. టాపిక్ మార్చి, "చీర కట్టుకోవాలనుంది. నువ్వు నేర్పగలవా?" అంది.

ముందు రాదన్నాను కానీ ఆమె ఒప్పుకోలేదు. నాకు చీర కట్టడం తెలిసే ఉండడానికి రకరకాల లాజిక్కులు తీసింది. "మీ దేశంలో ఆడవాళ్లందరూ చీర కట్టుకుంటున్నప్పుడు, మీ మగాళ్లకి కూడా ఎంతో కొంత తెలిసుండాలి. ఊహించైనా ప్రయత్నించు" అందామె.

"కానీ, ఇక్కడ చీరలు లేవే!" అన్నాను.

"చీరంటే ఉత్త గుడ్డే కదా! ఈ దుప్పటి పనికిరాదా?" అంటూ అక్కడ మంచంమీదున్న పెద్ద దుప్పటీని తీసింది. ఆ వెంటనే, "అమ్మో! ఇది ఏకంగా ఆరు మీటర్ల పైన ఉంది. దీన్ని కట్ చెయ్యడానికి ఫ్రౌ యాకేల్ ఒప్పుకుంటుందనుకోను" అని నిట్టూర్చింది.

నేను మాట్లాడలేదు. అంతలోనే ఆమె, "ఇంతకీ, చీరకి ఎంత గుడ్డ కావాలి?" అంది.

చెప్పక తప్పలేదు – ఆరేడు గజాలని.

ఆరేడు గజాలనగానే, ముందు అమ్మో అనుకున్నా, ఆ వెంటనే, "ఐతే ఇంకేం, ఈ దుప్పటినే నాకు చీరగా కట్టు" అందామె.

"కట్టడానికేం లేదు. చుట్టబెట్టుకోవడమే" అన్నాను.

"చుట్టబెట్టుకుంటాను కానీ, నువ్వెళ్లి నీ భార్య ఫొటో తీసుకునిరా" అంది ఇంచుమించి ఆజ్ఞాపిస్తున్నట్లు. ఆడవాళ్లు అంతే! తండ్రుల్నీ, అన్నల్నీ, భర్తల్నీ ఆజ్ఞాపించినట్లే – కాస్త పరిచయమైతే చాలు – స్నేహితుల్నీ ఆజ్ఞాపించగలరు.

నేను ఫొటో తీసుకొచ్చేసరికి – బ్రిగెట్టీ వంటికి దుప్పటిని చుట్టబెట్టుకుని ఉంది. ఆ దుప్పటినే కనుక చీర అనుకుంటే – చీరకట్టు ఇంత అసహ్యంగా ఉంటుందా అనిపించింది.

"ఎలా ఉంది?" అందామె. బాగుందన్నాను.

ఆమె తృప్తిపడలేదు. నేను తెచ్చిన ఫొటో అడిగి తీసుకుని చూస్తూ తల అడ్డంగా ఊపింది. నావంక గంభీరంగా చూస్తూ, "ఈ లుక్ రావాలి" అంటూ దుప్పటి విప్పి నాకు అందించింది.

దుప్పటి ఆమెకు చుట్టబెట్టి కుచ్చిళ్లు పెట్టాను. చాలా కుతూహలంగా గమనిస్తోందామె. కట్టడం అవగానే, "ఇంకా ఆ లుక్ రాలేదు" అంది.

"ఆ లుక్ రావాలంటే, పైన జాకెట్ ఉండాలి. పొట్ట భాగం కొంత కనబడాలి" అన్నాను.

నా నోటి మాట పూర్తవలేదు. ఆమె తన వంటిమీదున్న ఓవర్‌కోటు చటుక్కున విప్పేసింది. అప్పుడామె ఛాతీపైన బ్రా తప్పమరో ఆచ్ఛాదన లేదు.

బికినీతో ఆరుబయట మగాళ్లమధ్య తిరిగే సంప్రదాయంలో పుట్టి పెరిగిందామె. అందువల్లనేమో, ఆమెలో ఏ తడబాటూ లేదు.

నేను మాత్రం ఒక్క క్షణం తడబడ్డాను. అది స్పష్టంగా నా కళ్లలో కనబడిందేమో, ఆమె, "అయామ్ సారీ" అని ఓసారి నిట్టూర్చి మళ్లీ కోట్ వేసేసుకుంది.

ఆమె సారీ చెప్పడానికి కారణమైన నా ముఖభావాలు స్ఫురించడంవల్లనేమో నేను సిగ్గుపడి క్షణంపాటు తల దించుకున్నాను. సారీ చెప్పాలనిపించింది కానీ, చెప్పడంవల్ల అప్రయత్నంగా నా ముఖంలో వచ్చిన మార్పులని మనసుకి కూడా అంటగట్టడం సిగ్గుచేటు కదా, ఆమె సారీని స్వీకరించడమే ఆమెకూ నాకూ మర్యాద అనిపించి ఊరుకున్నాను.

ఇక మౌనం బాగుండదని చటుక్కున తలెత్తి ఆమెని చూశాను. నేనిన్ని ఆలోచనలకి గురయ్యాను కానీ, ఆమె చాలా మామూలుగా ఉంది. కళ్లు నిర్మలంగా ఉన్నాయి.

"నాకు చీర కట్టుకోవాలనుంది. ఇండియానుంచి నాకో చీర తెప్పించిపెట్టగలవా?" అందామె నవ్వుతూ.

నేనూ సద్దుకున్నాను. "మా దేశంలో కంటే బట్ట క్వాలిటీ మీ దేశంలోనే బాగుంటుంది. నైలెక్స్ కానీ, పోలీ ఎస్టర్ కానీ – చీరకు అయిదు మీటర్లూ, జాకెట్టుకి ఒక మీటరూ – మొత్తం ఆరు మీటర్లు తీసుకుంటే సరిపోతుంది" అన్నాను.

అయిదు మీటర్ల గుడ్డను వంటికి చుట్టబెట్టుకుని ధరించి భరించడమా – అని గుండెలు బాదుకుందామె.

తర్వాత మేము పలు విషయాలు మాట్లాడుకున్నాం. ఆమెకి తెలుగు మాటలు తనే చదవాలనుంది. అందుకని నాకు తోచిన మాట ఒకటి ఇంగ్లీషు అక్షరాల్లో వ్రాయమని కోరింది. ఆమె ఉత్సుకతకి ముచ్చటపడి, "నీ కళ్లు బాగుంటాయి" అని రాశాను.

ఆమె కూడబలుక్కుంటూ చదివింది. ఆమె ఉచ్చారణని సరి చేశాను. రెండుమూడు ప్రయత్నాల్లో ఆమె నోట తెలుగు తెలుగులాగే పలికితే మెచ్చుకున్నాను.

ఆమె ముఖంలో సంతోషం. "ఇంతకీ నువ్వేం రాశావ్? ఆ మాటకి అర్థమేమిటి?" అనడిగింది. చెప్పాను.

అప్పుడామె సంతోషం పట్టలేక తన కుడిచేతిని ఒకసారి పైకెత్తి విసిరినట్లుగా అరచేతిని కిందికి దింపింది. "నువ్వు మరీనూ? పోదూ" అనడానికి అక్కడివాళ్ల తనుభాష అది.

ఆ సంతోషం కలిగించిన నవ్వు ముఖంతోనే, తన దగ్గరున్న ఓ ఆల్బంలోంచి కొందరు అమ్మాయిల బొమ్మలు చూపించి, "నీకు నచ్చారా?" అనడిగింది.

ఇరవైకి అటూ ఇటూలో ఉన్నవారు. ఆడపిల్లలు. తెల్లపిల్లలు. ఆరోగ్యంతో మిసమిసలాడే వారిలో అందానికి తక్కువేముంటుంది?

"చాలా బాగున్నారు" అన్నాను. అక్కడికి అదేదో అందాల పోటీలో న్యాయనిర్ణేత తీర్పు విన్నట్లు ఆమె ముఖం వెలిగిపోయింది. అంతకుముందు నా మాటలు విని, నాకు ఇండియా అమ్మాయిలు తప్ప ఇంకెవరూ నచ్చరని ఆమె అనుకుని ఉండాలి.

తర్వాత ఆమె నాకు డ్యాన్స్ వచ్చా అనడిగింది. రాదని చెబితే ఆశ్చర్యపడింది. ఆమె ఆశ్చర్యానికి నేనూ ఆశ్చర్యపడి, "ఇష్టమైనవాళ్లు డ్యాన్స్ నేర్చుకుంటారు. లేనివాళ్లు లేదు. ఇందులో ఆశ్చర్యమేముంది?" అన్నాను.

"కానీ జర్మనీలో ప్రతి ఒక్కరికీ డ్యాన్స్వస్తుంది" అందామె.

"మీ డ్యాన్స్ఎలా ఉంటుంది?" అన్నాను కుతూహలంగా.

ఆమె వెంటనే ఉత్సాహంగా కొన్ని స్టెప్స్ వేసి చూపించింది.

ఆ స్టెప్స్ నాకు కొత్త కాదు. మన సినిమాల్లో, ముఖ్యంగా హిందీ సినిమాల్లో, హీరో హీరోయిన్స్ పార్టీల్లో వేసేవే అవి.

"డ్యాన్స్అంటే ఇదనుకోలేదు. సరదా ఉంటే ఇది నేర్చుకోవడం కష్టం కాదు. డ్యాన్సంటే నేను భరతనాట్యం అనుకున్నాను" అన్నాను.

"భరతనాట్యమంటే?" అందామె. నోటి మాటల్లో చెప్పడానికి ప్రయత్నించాను కానీ, ఆమె కొన్ని స్టెప్స్ వేసి చూపించమంది.

నేనడగ్గానే తను స్టెప్స్ వేసి చూపించింది. వచ్చినా రాకపోయినా, ఆమెకు కొంత ఐడియా ఇవ్వడం నా బాధ్యత.

నా జీవితంలో ఒక అపరిచిత యువతి ముందు నిలబడి భరత నాట్యభంగిమలు చూపిస్తానని కలలో కూడా అనుకోలేదు. అందులోనూ నాకు బొత్తిగా డ్యాన్స్ రాదు.

ప్రేక్షకుడిగా నేను చూసిన భంగిమల్లో అప్పటికి స్ఫురణకి వచ్చినవి కొన్ని చూపడానికి ప్రయత్నించానంతే!

శ్రీమతి చూస్తే ఈ నా ప్రయాస ఆమెకు గొప్ప వినోదంగా ఉండేది. బ్రిగెట్టీ ఆ భంగిమలను ఆశ్చర్యంగా గమనించి, "అలా డ్యాన్స్ చెయ్యడం ఎందుకు?" అనడిగింది.

అప్పటికి నాకు అర్థమైంది – ఆమెకీ నాకూ సంస్కృతిపరంగా ఉన్న భేదం.

నిత్యజీవితంలో యువతీయువకులు కలిసి నృత్యం చెయ్యడం భారత సంస్కృతి కాదనీ, అక్కడ నృత్యమన్నది కేవలం వినోద ప్రదర్శన మాత్రమేననీ, కొందరు కళాకారులు నృత్యకళకు తమ జీవితాల్ని అంకితం చేస్తారనీ చెప్పాను. అక్కడ కూడా నృత్య కళకారులు ఉన్నారు కాబట్టి ఆమెకు విషయం అర్థమైనట్లుంది.

ఆ మర్నాడు బ్రిగెట్టీ వెళ్లిపోయింది. వెళ్లేముందామె తనకి పెళ్లి నిశ్చయమైందని చెప్పి ఎంజేజిమెంట్ రింగు కూడా చూపించింది. నాదగ్గర వీడ్కోలు తీసుకుంటూ – తనకో చీర తెప్పించిపెట్టమని మరీ మరీ చెప్పింది. నేనామె విన్నపాన్ని యథాలాపంగా తీసుకున్నాను. కానీ ఆమె గురించి ఇతరంగా చాలా అలోచించాను.

భారత దేశంలో భార్యతో తప్ప మరే యువతితోనూ బ్రిగెట్టీతో అంత సన్నిహితంగా మసలలేదు నేను. నా ఈడు ఆడపిల్లలు కాస్త దగ్గరగా వచ్చి మాట్లాడితేనే ఏదోలా ఉండేది నాకక్కడ. అటువంటిది ఇక్కడ ఈమెతో గంటల తరబడి ఏకాంతంగా, సన్నిహితంగా మసిలాను. అయితే నా బుద్ధి పెడదారులు తొక్కలేదు. ఒక స్నేహితుడితో మాట్లాడుతున్నట్లే ఉంది తప్ప ఆమెలోని స్త్రీని నేను గుర్తించలేదు. ఆమె ముఖభావాలు చూస్తుంటే తనూ అలాగే ఫీలయిందనిపించింది. ఈ తేడాకి కారణమేమిటి?

మన సంస్కృతి స్త్రీలపట్ల కాంక్షనే తప్ప స్నేహభావాన్ని కలుగనివ్వదా? యువతీయువకుల మధ్య దూరాన్ని తగ్గించడం ద్వారా వారి మనసులు మరింత స్వచ్ఛంగా ఉండే అవకాశముందన్న విషయం నిజమా?

ఏదిఏమైనా బ్రిగెట్టీతో గడిచిన ఆ కొద్ది రోజులూ నాకు మరపురాని అనుభవం.

పిక్నిక్ పిక్నిక్ పిక్నిక్

చదువుకుందుకొచ్చినా మేము సందర్శకులం కూడా కదా! మేమక్కడ విహారయాత్రలూ చేశాం. కొన్ని పిక్నిక్స్ సంస్థ ఏర్పాటు చేస్తే, కొన్ని మాకు మేముగా వేసుకున్నవి.

ల్యూనబర్గు వచ్చిన ఇరవై రోజులకి, అంటే జూన్ 25న – గ్యోతే ఇన్స్టిట్యూట్ వారు – విద్యార్థులకోసం ఒక ఔస్ఫ్లూగ్(పిక్నిక్) ఏర్పాటు చేశారు. అందులో ఆయా విద్యార్థుల హౌస్ఫ్రౌలు (ల్యాండ్‌లేడీలు) కూడా పాల్గొనవలసి ఉంది. తనకి వీలు కుదరలేదని చెప్పి ఫ్రౌ యాకేల్ ఈ పిక్నిక్కి రాలేదు.

ఔస్ఫ్లూగ్‌కని మేమెక్కిన టూరిస్ట్ బస్సు అద్భుతంగా ఉంది. లోపలి సీట్ల అమరిక విమానంలో లాగా ఉంది. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పోతున్నా బస్సులో కదుపు గానీ, కుదుపు గానీ లేదు.

మా గమ్యం ఎల్బే నదీతీరం. మధ్యలో ఒక హోటల్ వద్ద ఆగేం. అక్కడ అందరికీ కేక్సు, ఐస్క్రీమ్ సెర్వ్ చేశారు. అవి తిని మళ్లీ బస్సెక్కి ఎల్బే నదీతీరంకి చేరుకున్నాం. అక్కడ మాకోసం ఒక స్టీమ్‌బోట్ సిద్ధంగా ఉంది. అందులో అంతా ఎక్కాం.

ప్రశాంతంగా వీచే చల్లని గాలి, చలి పుట్టిస్తోంది కానీ, ఆ చలిని ఆపడానికి వేసుకున్న స్వెటర్ సరిపోయింది.

ఎల్బే నది వెడల్పు తక్కువే. కానీ అది చాలా యూరప్ దేశాల్లోంచీ ప్రవహిస్తుందిట. నదికి ఈవలి ఒడ్డు పశ్చిమ జర్మనీ. ఆవలి ఒడ్డు తూర్పు జర్మనీ.

నదీవిహారం రెండు గంటల సేపు కొనసాగింది. బోటుమీద ఎంతోమంది ఆడ, మగ జంటలుగా విడిపోయి ఫొటోలు తీయించుకున్నారు. కొందరు బోటులో ఏర్పాటు చేసిన సంగీతానికి అనువుగా నర్తించారు. కొందరు హౌస్‌ఫ్రౌలు తామూ నాట్యం చేశారు. లావుగా ఉన్న ఒక హౌస్‌ఫ్రౌ చేసిన నృత్యం అందరికీ ఎక్కువ వినోదాన్నిచ్చింది. పెద్దా, చిన్నా అంతా కలిసిపోయి పసిపాపల్లా ప్రవర్తించడం హాయిగా అనిపించి, కాసేపు ఈ లోకాన్ని మర్చిపోగలిగాం. కానీ – పక్కన శ్రీమతి లేకపోవడం వెలితిగా అనిపించింది నాకు.

ల్యూనబర్గులో అంకుల్ విల్లీ అనే సమాజసేవకుడున్నాడు. ఆ ఊరొచ్చిన విదేశీయులకోసం ఆయన అప్పుడప్పుడు పిక్నిక్సు ఏర్పాటు చేస్తుంటాడు. ఆయన నిర్వహణలోనే జూన్ 28న మేము హనోఫర్ (హానోవర్) వెళ్లొచ్చాం. హనోఫర్ పశ్చిమ జర్మనీలో నీడర్‌శాక్సెన్ రాష్ట్రానికి రాజధాని. పరిమాణంలో పెద్ద నగరమే కానీ జనాభా మాత్రం ఐదు లక్షలు. అక్కడ తరచుగా ఇంటర్నేషనల్ ట్రేడ్‌ఫెయిర్ నిర్వహిస్తారు. దానికోసం శాశ్వతమైన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ఉంది. ఈ ఫెయిర్ విశ్వవిఖ్యాతం.

ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన రోడ్లు, ఎత్తైన భవంతులు, ఆకర్షణీయమైన బజార్లు ఉన్న ఆ నగరంలో జనసంచారం అంతంతమాత్రం. నగరానికి ప్రత్యేక ఆకర్షణ పూలతోటలు. వాటి అందం వర్ణనాతీతం.

తిరుగు ప్రయాణంలో ఇన్ఫర్మేషన్ అండ్ టూరిస్ట్ సెంటర్లో ఆగాం. అక్కడ దేశవిదేశాల యువతీ యువకుల కార్యక్రమాలౌతున్నాయి. ఫ్రీగా వైన్ పోస్తున్నారు. కోలా మాత్రం కొనుక్కోవాలి. పాటలు, నృత్యప్రదర్శనలు జరిగాయి. చూడ్డానికి కాలేజి స్థాయిలో ఉన్నాయి. అనేక దేసస్థులతోపాటు మన సర్దార్జీలు కూడా బాగా ఎక్కువ సంఖ్యలో కనిపించారక్కడ.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఏర్పాటు చేసిన మరో ఔస్‌ఫ్లూగ్‌లో జూలై 4న హ్యాంబుర్గ్ (హ్యాంబర్గ్) నగరానికి వెళ్లాం. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఓడరేవు అక్కడుంది.

ముందు మమ్మల్ని హార్బరుకి తీసుకెళ్లి స్టీంబోటుమీద చాలాసేపు విహారం చేయించారు. ఆ విహారంలో దేశదేశాల ఓడల్నీ, ఓడల్ని మరమ్మతు చేయడానికున్న సదుపాయాల్నీ చూశాం.

అక్కడ మాకు బంగ్లాదేశ్ ఓడ ఒకటి కనిపించింది. దూరదేశంలో ఉండడం వల్లనేమో, స్వదేశపు ఓడే అనిపించింది.

తర్వాత మమ్మల్ని సెయింట్ పౌలీ చర్చికి తీసుకెళ్లారు. అది బాగా పాతకాలపు చర్చి. చర్చి లోపల ఎలా ఉంటుందో చూడ్డం నాకదే మొదటిసారి.

ఆలయం కాబట్టి చర్చి పవిత్రమైనది. సెయింట్ పౌలీ పేరు కూడా పవిత్రంగా ధ్వనిస్తుంది. కానీ హాంబుర్గ్‌లో సెయింట్‌పౌలీ అనగానే పవిత్రభావం కలిగే అవకాశం తక్కువ. ఎందుకంటే అక్కడ సెయింట్‌పౌలీ అంటే స్ఫురించేది చర్చి కాదు. దానినానుకునే ఉన్న రీపర్‌బాన్ స్ట్రాసే (వీధి). ఆ వీధిలో మనిషికి తన కామతృష్ణ తీర్చుకునేందుకు ఉన్న వివిధ, విభిన్న మార్గాలు ప్రదర్శితమేకాదు, కావాలంటే అనుసరణకూ అక్కరకొస్తాయి. ఎంత ఆధునికమైనా, స్వేచ్ఛకి అవధులు లేకపోయినా – అలాంటి వీధులు ఏ దేశానికీ గర్వకారణం కాదనే అనుకోవాలి. ఎందుకంటే – చెప్పకతప్పదు కాబట్టి మొక్కుబడికి అన్నట్లు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఆ వీధిని మాకు హడావుడిగా చూపించేసి అయిందనిపించారు. ఐనా ఆ కాసేపటికే ఆ వీధి విశేషాలు మా అవగాహనకొచ్చి మాలో ఉత్సుకత రేపాయి. మరోసారి రాత్రి సమయంలో వచ్చి ఆ వీధి విశేషాలు తెలుసుకోవాలని నేను, నా మిత్రులు అనుకున్నాం.

మధ్యాహ్నం పన్నెండునుంచి సాయంత్రం ఆరు గంటలవరకూ మాకా ఊళ్లో ఆటవిడుపు.

కాసేపు రైళ్లలో తిరిగాం. అంతకుముందు శర్మ తనకి హాంబుర్గ్ కొట్టిన పిండి అని చెప్పాడు. కానీ ఈ తిరగడంలో అతనికి హాంబుర్గ్ తెలియకపోవడమే కాదు, యూరప్‌లో బయట తిరిగిన అనుభవం కూడా పెద్దగా లేదని బయటపడింది. వాన పడ్డం వల్ల తిరగడానికి కాస్త ఇబ్బందయింది. తర్వాత నేను, సుబ్రహ్మణ్యం, బిశ్వాస్, దేవదార్ ఒక జట్టుగా విడిపోయాం. కలకత్తా రెస్టారెంటుకి వెడదామన్నాడు బిశ్వాస్. దాని చిరునామా మాకు ల్యూనబర్గులోనే తెలిసింది. కానీ దారి తెలియక టాక్సీని ఆశ్రయించాం. అందుకైన ఐదు మార్కుల ఖర్చునీ నలుగురం సమంగా పంచుకున్నాం.

కలకత్తా రెస్టారెంటుని ఓ బెంగాలీ ఆసామీ నడుపుతున్నాడు. అతని భార్య జర్మన్ వనిత. అతను మమ్మల్ని చాలా ఆప్యాయంగా ఆదరించి భోజనం పెట్టాడు. అన్నం, ఉడికించిన పెసరపప్పు, పచ్చిమిర్చి ఊరగాయ, అప్పడం, పెరుగు – అదీ భోజనం. "హాయిగా చేత్తో కలుపుకుని తినండి" అని అతను ప్రోత్సహించాడు. బిల్లు ఒకొక్కరికి ఆరు మార్కుల ఎనభై ఫెన్నిగ్సు వేసినా – భోజనం తృప్తిని కలిగించింది. ఎటొచ్చీ పనివాళ్లు లేకుండా హొటలు నడుపుతున్నానని చిన్నతనమో ఏమో, అతను మాకు అడక్కుండానే డిగ్నిటీ ఆఫ్ లేబర్ మీద పెద్ద లెక్చర్ ఇచ్చాడు. అది బోరు కొట్టింది.

అక్కణ్ణించి బయల్దేరి కొన్ని షాపుల్లో విండోషాపింగ్‌తో ఆ యాత్ర ముగిసింది. సెయింట్ పౌలీ కోసం హాంబుర్గ్ మరోసారి చూడాలనుకున్నాం కానీ నిజంగా వెడతామనుకోలేదు.

ఒకరోజు నేను, దేవ్‌దార్, కొరియా, నటరాజన్ ఒకచోట కలిసినప్పుడు, మాటల సందర్భంలో, మా అంతట మేముగా ఓ ఔస్‌ఫ్లూగ్‌కి (పిక్నిక్) వెళ్లాలనుకున్నాం. బాగా ఆలోచించేక హాంబుర్గ్ స్ఫురించింది. ఆగస్ట్ 3న వెడదామనీ, ఈసారి బస్సులో కాకుండా ట్రయిన్లో వెడదామనీ అనుకున్నాం. ఆ రోజు ఎవరిళ్ల దగ్గర వాళ్లు బయల్దేరి రైల్వే స్టేషన్లో కలుసుకున్నాం. ట్రయిన్ 9.29కి బయల్దేరి, 10.35కల్లా మమ్మల్ని హాంబుర్గ్ చేర్చింది. కానీ, ఎందుకో లంకణాలబండిలా అనిపించింది.

సుబ్రహ్మణ్యం జర్మన్ లాంగ్వేజ్ కోర్స్ రెండు నెలలే. అతనిప్పుడు హాంబుర్గ్‌లో ఉంటున్నాడు. మేము హాంబుర్గ్‌లో దిగగానే ముందు వెళ్లి అతన్ని కలుసుకున్నాం.

అక్కడ ఏదో థియేటర్లో రాజేష్‌ఖన్నా సినిమా ఉన్నదట. సుబ్రహ్మణ్యం ఆ సినిమాకి వెడదామన్నాడు. ఇండియాలో చూసేవే కాబట్టి, ఇక్కడా హిందీ సినిమాలెందుకని ఆ ప్రపోజల్‌కి మిగతావాళ్లం ఒప్పుకోలేదు.

"ఈ ఊరి మొత్తానికి కేవలం వెజిటేరియన్ రెస్టారెంట్ఒకటుంది. దానికి వెడదామా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

గతంలో ఒకసారి కలకత్తా రెస్టారెంటుకి వెళ్లి ఉన్నాం. అక్కడ ఇండియన్ ఫుడ్ దొరుకుతుంది కానీ, వెజిటేరియ్‌న్‌తో పాటు నాన్‌వెజిటేరియన్ కూడా ఉంటుంది. జర్మన్స్ నడిపే వెజిటేరియన్ రెస్టారెంట్ఎలా ఉంటుందో చూద్దామనుకుని సరేనన్నాం.

రెస్టారెంట్ మేడమీద ఉంది. లోపల అడుగెట్టగానే ఒకతను, "డియర్ ఫ్రెండ్స్! ఇక్కడ మాంసాహారం ఏమాత్రం దొరకదు. లోపలికొచ్చేముందు ఆ విషయం దృష్టిలో ఉంచుకోండి" అన్నాడు. జంతుసంబంధమని అక్కడ పాలు కూడా సర్వ్ చెయ్యరట.

జర్మనీవంటి ఫక్తు మాంసాహార దేశంలో ఆ మాట వినిపించడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

మెనూ చూస్తే నాకు తెలిసినవి అన్నం, బంగాళాదుంపల వేపుడు. నటరాజన్‌కి తెలిసిన మరో వెజిటేరియన్ ఐటమ్ కార్టోఫెల్న్ (బంగాళా దుంపల) సలాడ్. అది చాలా బాగుంటుందని అతనంటే అదీ ఆర్డరిచ్చాం.

అబద్ధమెందుకూ – నాకా సలాడ్ నచ్చలేదు. నటరాజన్ నొచ్చుకుంటాడని బాగుందన్నాను.

అన్నం, బంగాళాదుంపల వేపుడు ఫరవాలేదు. కానీ నాకు పులుపు, కారం లేకుండా ముద్ద దిగదు. అందువల్ల కొంచెం కష్టపడ్డాను. రెస్టారెంట్‌నుంచి బయటకొచ్చేక ఒక షాపుకెళ్లి పావు లీటరు పాలు, ఓ ఆపిల్ కొన్నాను. వాటితో నా కడుపు నిండింది.

మేము రోడ్లు పట్టుకుని తిరుగుతూ ఒకచోట రోడ్డు క్రాసింగ్దగ్గర ఆగాం. పరిసరాల్ని సునిశిత పరిశీలనలో నటరాజన్ దిట్ట. అతను నాకు ఓ యువజంటని చూపించి, "అటు చూడు. వాళ్లిద్దరూ రోడ్డు క్రాస్ చేస్తూ ముద్దు పెట్టుకోవడం కాయం" అన్నాడు.

అని ఊరుకోలేదు. సిగ్నల్ పడగానే తన కెమేరాతో సిద్ధంగా ఉన్నాడు. ఆ జంట రోడ్ క్రాస్ చేస్తూ నిజంగానే రోడ్డు మధ్యలో ఒకరినొకరు ముద్దుపెట్టుకుని అలాగే ముందుకు సాగిపోయారు. వాళ్ల ముద్దుముచ్చట నటరాజన్ కెమేరాలో రికార్డయింది.

అప్పుడు నటరాజన్అన్నాడు, "పదిమందిలో ముద్దు పెట్టుకోవడమే ఒక అడ్వెంచర్ అనుకుంటాం మనం. ఈ ఆరుబయట ముద్దుల్లో వీళ్లకి ఇంకా వేరే అడ్వెంచర్లుంటాయి. ఒకసారి ఓ అమ్మాయీ, ఓ అబ్బాయీ చెరో బైక్‌మీదా వెడుతూ ముద్దు పెట్టుకోవడం చూశాను" అని.

మేము నడుస్తూనే చాలా దూరం తిరిగి టెలివిజన్ టవర్ చేరుకున్నాం. జానపదాల్లో ఒంటి స్తంభం మేడల్ని స్ఫురణకు తెచ్చేలా ఉందా టవర్. ఎత్తైన ఆ టవర్ మధ్యలో ఒక రెస్టారెంటుంది. అది చేరుకుందుకు కిందనుంచి లిఫ్ట్ఉంది. అక్కడి రెస్టారెంటులంటే మాలో ఎవ్వరికీ పెద్దగా ఆసక్తి లేదు. మేమా టవర్ని బయట్నించే చూసి ముందుకు సాగిపోయాం.

అక్కడికి దగ్గర్లో మనోహరమైన వన మొకటుంది. మా టూరిస్ట్ గైడ్‌బుక్ ప్రకారం – ఆ వనంలో రాత్రి ఎనిమిది గంటల నలభైఐదు నిముషాలకి రంగుల జలయంత్రాల ప్రదర్శన ఉంటుంది. సరిగ్గా ఆ సమయానికి అక్కడికెళ్లాం.

అక్కడ టైమంటే టైమే మరి. సరిగ్గా ఎనిమిది గంటల నలభై ఐదు నిముషాలకి ఒక్కసారిగా ఓ సరస్సు లోంచి రంగురంగుల ఫౌంటెన్స్ పైకి లేచాయి. ఆ వెంటనే సంగీతం మొదలైంది. జలయంత్రాలు సంగీతానికి అనుగుణంగా నృత్యం మొదలెట్టాయి. ఆ ఫౌంటెన్స్ వింత మనుషుల్లాగానూ, అదో అద్భుత బృందనాట్యంగానూ అనిపించింది. చూస్తున్నప్పటి ఆ అనుభూతి మాటలకందదు.

మా మిత్రుల్లో ఒకరిద్దరు ఇండియాలో మైసూర్లోని బృందావన్ గార్డెన్స్‌లో ఇలాంటిది చూశారుట. కానీ సంగీతానికి అనుగుణంగా భంగిమలు మారుతూ, జలయంత్రాలు నృత్యం చెయ్యడాన్ని ఎక్కడా కనలేదు, వినలేదని వాళ్లన్నారు. మేము స్టిల్ కెమేరాతో ఫొటోలు తీసుకున్నాం కానీ అది మూవీ కెమేరాతో చిత్రించాల్సిన అపూర్వ దృశ్యం. చాలామంది అక్కడకు మూవీ కెమెరాలతో వచ్చారు.

ఆ అద్భుత ప్రదర్శన తొమ్మిదీ పది వరకూ కొనసాగింది. అక్కణ్ణించి లోకల్ ట్రయిన్లో ఎక్కి దగ్గర్లోనే ఉన్న సెయింట్ పౌలీకి వెళ్లాం.

బొంబాయిలో దాదర్లాగ – సెయింట్ పౌలీ లోకల్ రైల్వే స్టేషన్ పేరు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన రీపర్‌బాన్ స్ట్రాసే (వీధి) అక్కడికి దగ్గర్లోనే ఉంది. ఇదివరలో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు నామమాత్రంగా పగలు మాకది చూపించారు. కానీ పగలంతా మామూలుగా ఉండే ఆ వీధిలో సందడి మొదలయ్యేది రాత్రి అయ్యాకనే. టూరిస్టులకు గొప్ప ఆకర్షణగా చెప్పుకునే ఆ వీధిలో తొమ్మిది దాటేకనే హడావుడి మొదలౌతుంది. మొదలైన కొద్ది క్షణాల్లోనే వీధిలో రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. ఇంతకీ ఆ వీధి ప్రత్యేకత ఏమిటంటే – విశృంఖల శృంగార విహారం.

అక్కడ ఆగకుండా కొనసాగే సెక్స్ షోలున్నాయి. ఒక మార్కు నాణెం వేసి వ్యూయర్లో కన్ను పెట్టి చూస్తే కొద్ది నిముషాలపాటు నీలి చిత్రాలు చూపించే ఆటోమేట్లు (ఆటోమేటిక్ యంత్రాలు) ఉన్నాయి. వాటిపై మాకిప్పుడు పూర్వపు కుతూహలం లేదు కాబట్టి వివరాలు తెలుసుకుని ఊరుకున్నాం. తెరమీద బొమ్మలే కాకుండా స్టేజిమీద మనుషులే స్వయంగా మన కళ్లముందు రతిక్రీడని ప్రదర్శించే లైవ్ షోలున్నాయి. ఇవి కూడా నాన్‌స్టాప్. ఈ ప్రదర్శనల టికెట్ ముప్పై మార్కులనుంచి మొదలౌతుంది.

వీధికి పక్కన చాలా సందులున్నాయి. మేము కొన్ని సందుల్లో తిరిగి చూశాం.

ఓ సందులో విశాలమైన హాల్సు. హాలు గోడలకి, మన దేవాలయాల్ని మించిపోయేలా, రెచ్చగొట్టే పచ్చి శృంగారభంగిమలతో బొమ్మలు. హాల్లో అటూఇటూ గదులు. మధ్యలో బోలెడు స్తంభాలు. ప్రతి స్తంభాన్నీ ఆనుకుని ఓ యువతి నిలబడి ప్రియవిటునికోసం అభిసారికలా ఎదురుచూస్తోంది. దగ్గరకు వెళ్లి బేరమాడుకోవాలి. బేరం కుదిరితే ఆమెతో కలిసి పక్కనున్న గదిలోకి వెళ్లిపోయి కాసేపు కులాసాగా గడిపి వచ్చెయ్యొచ్చు.

ఓ సందులో ఒక హొటలుంది. అక్కడ సర్వింగ్ చేసేది అందమైన యువతులు. వాళ్లకి వంటిమీద నడుం కిందనే ఆచ్ఛాదన. పైన ఏ ఆచ్ఛాదనా లేదు. లోపలికెళ్లాలంటే ఏమైనా తినాలి, తాగాలి. కానీ బయట యాబై ఫెనిగ్సుకి దొరికే కోకాకోలా హొటల్లోపల రెండున్నర మార్కులు.

మేము లోపలకెళ్లలేదు. బయటే నిలబడి ఆ యువతుల అనాచ్ఛాద సౌందర్యాన్ని తిలకించాం. నిజం చెప్పాలంటే ఆ క్షణంలో ఆ యువతుల్ని చూస్తే నవ్వొచ్చింది తప్ప ఉద్రేకం పుట్టలేదు. ప్రేరణ విషయంలో జంతువుకీ మనిషికీ అదేనేమో తేడా. మనిషికి ఏకాంతం కావాలి.

మరో సందులో ఆడపిల్లలు అద్దాల షో కేసుల్లో ఉన్నారు. అద్దాని కివతలనుంచే ప్రేమబేరాలు. బేరం కుదిరితే, అద్దాల తలుపు తెరుచుకుంటుంది. ప్రియవిటుడు, అభిసారిక జంటగా లోపలి గదుల్లోకి వెడతారు. షో కేసులోకి మరో యువతి వస్తుంది.

ఆ వీధిలో పుస్తకాల షాపులు కూడా ఉన్నాయి. వాటిలో బొమ్మలు, కథలు, వార్తలు, విశేషాలు అన్నీ మహిళలకి సంబంధించినవే. ఐతే ఆ వీధి సంప్రదాయంలో ఆడదంటే మనిషి కాదు. కేవలం విలాసవస్తువు. అలాంటప్పుడు అక్కడ లభించే సాహిత్యం ఎలా ఉంటుందో, ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనక్కర్లేదు. మేమా పుస్తకాల జోలికి వెళ్లలేదు

అవి ఇండియాలో పనివాళ్ల నెల జీతాలకంటే ఎక్కువున్నాయని చెప్పాను. ఆమె ఆశ్చర్యపోయి ఇండియాలో వివిధ వస్తువుల ధరలడిగింది. "రెండువేల ఐదొందల మార్కులౌతుందని ఇంట్లో ఓ గదికి కొత్త కిటికీ వేయించలేక పోతున్నాను. ఇండియాలో అన్నీ కారుచౌక" అందామె నిట్టూర్చి.

ఇక్కడ నాకొచ్చే స్కాలర్‌షిప్‌తో ఏడాది తిరక్కుండా ఫ్రిజ్, మిక్సీ, వాష్‌మెషీన్, టేప్‌రికార్డర్ వగైరాలన్నీ కొనుక్కోగలను. ఐదేళ్లుగా ఉద్యోగం చేస్తూ అక్కడ ఇంతవరకూ నిత్యావసరమైన మిక్సీ కూడా కొనలేకపోయాను. ఇక్కడికొచ్చేదాకా నాకు టేపు రికార్డర్ లేదు. ఈ విషయాలు ఆమెకి చెప్పలేదు. మన దేశం గురించి కొంత పాజిటివ్ ఫీలింగ్ వచ్చినప్పుడు దాన్నలాగే ఉండనివ్వడం మంచిదే అనిపించింది.

నేను నిజాయితీగానే సాయపడాలనుకుంటున్నట్లు గుర్తించడం వల్లనేమో, ప్రతిఫలం గురించి నొక్కించడానికి కొంచెం ఇబ్బంది పడిందామె. అది గ్రహించిన నేను, నా బట్టలుతికిపెట్టడంలో ఆమెకు లభించిన ప్రతిఫలం ఏముందనాలనుకున్నాను. ఐతే ఆ మాటనడానికి నేనూ ఇబ్బంది పడ్డాను.

జర్మనీలో కుటుంబ జీవితం సంతృప్తికరంగా ఉండదనీ, సంబంధాలన్నీ ఆర్థికపరమైనవేననీ – ఇండియాలో అనుకోవడం విన్నాను. కానీ ఇక్కడికొచ్చేక నాకది నిజమనిపించలేదు.

ఒకసారి ఫ్రౌ యాకేల్ కూతురు పుట్టింటికి వచ్చింది. తనతో ఆమె భర్త, పిల్లలు కూడా వచ్చారు. అంతా కలిసి నాలుగు రోజులు ఎంతో సరదాగా గడిపారు. ఆ నాలుగు రోజుల్లోనూ అల్లుడామె ఇంటికి కొత్త వాల్‌పేపర్ అంటించాడు (అక్కడ ఇళ్లకు వెల్లకు బదులు వాల్‌పేపర్ వాడతారు). రేడియో బాగుచేసి పెట్టాడు.

ఒకరోజున యాకేల్ కూతురు, పదేళ్ల మనవడు ఇంటి అటకమీద చాలాసేపు గడపడం చూసి ఆశ్చర్యపడ్డాను. పిల్లల బొమ్మలు, ఆటవస్తువులు అటకమీదున్నాయనీ, అటక కూడా ఓ గదిలాగే ఉంటుందనీ తర్వాత తెలిసింది.

ఒకరోజు యాకేల్ మనుమడు నా దగ్గరకొచ్చి కాసేపు గడిపాడు. అతనికి ఇంగ్లీషు సరిగ్గా రాదు. ఐతే నాకొచ్చిన జర్మన్ భాష ఆ కుర్రాడికి బాగానే అర్థమైనట్లుంది. నాతో అతనికి మంచి కాలక్షేపమే అయిందనేందుకు సూచనగా మర్నాడు కూడా అతను నా గదికి వచ్చాడు.

అప్పట్లో పోలరాయిడ్ కెమేరాలు కొత్త. కెమేరాలో ఫిల్ము పెట్టి ఫొటో తీసిన రెండు నిముషాల్లో ఫొటో ప్రింటు బయటకు వచ్చేస్తుంది. ఫ్రౌ యాకేల్ అల్లుడు ఆమెకి ఓ రంగుల ఫొటో తీశాడు. అది నాకు చూపించి ఎంతో సంబరపడిందామె. అప్పుడు నాకు మా మామ్మగారు గుర్తుకొచ్చారు.

యాకేల్‌కి ఎవర్ని ఎక్కడుంచాలో బాగా తెలుసు. మరీ ఎక్కువమంది మిత్రుల్ని గదికి ఆహ్వానించొద్దని ఓసారి చెప్పింది. నా రూంలో రేడియో సౌండ్‌ఎక్కువైందని రెండుసార్లు వచ్చి చెప్పింది, కాస్త తగ్గించమని. వంట చేసుకుందుకు వీలౌతుందా అంటే కుదరదంది. మాట కటువుగా ఉండేది కాదు, విన్నపంలా ఉండేది. ఆమెకి నేను నచ్చాలంటే, ఆమెకి నచ్చేలా ఉండాలని కూడా నేను గ్రహించాను.

ఫ్రౌ యాకేల్‌కి నా పక్కరూంలో ఉండే వైయాంగ్ నచ్చలేదు. అతను బాగా సిగరెట్లు కాలుస్తాడనీ, బాత్రూమ్ అపరిశుభ్రంగా ఉంచుతాడనీ నా దగ్గర విసుక్కునేది.

వైయాంగ్ మిత్రుడొకడు వరుసగా రెండు రాత్రిళ్లు అతని గదిలోనే పడుకున్నాడు. ఆ విషయం యాకేల్‌కి తెలిసింది. అలా కుదరదని చెప్పడానికి అతని రూంకి వెళ్లింది. ఆరోజు వైయాంగ్ పుట్టినరోజు. ఆమె వచ్చినప్పుడు నేనూ అతని రూంలో ఉన్నాను. యాకేల్‌కి విషయం అర్థమైంది. వెంటనే వెనక్కి వెళ్లి కొన్ని బిస్కట్లు తెచ్చి వైయాంగ్‌కిచ్చి శుభాకాంక్షలు చెప్పి వెళ్లింది. ఆ రోజుకి ఏమీ అనక, మర్నాడు హెచ్చరించింది వైయాంగ్‌ని. అరుదైన ఆ సుహృద్భావానికి నా మనసు ఆర్ద్రమైంది.

వైయాంగ్ గది నేనున్న గదికంటే చాలా పెద్దది. నాకంటే ముందు రావడంవల్ల అతడికా పెద్ద గది వచ్చిందట. అతను తొందరగా వెళ్లిపోతే, నాకా గది ఇవ్వాలనుండేది ఆమెకి. ఆమె కోరిక తీర్చడానికే అన్నట్లు రెండు నెలల కోర్సు పూర్తి కాగానే వైయాంగ్ ఆ గది కాళీ చేసి మరో చోటకి వెళ్లిపోయాడు. ఆమె మహా సంతోషంతో వెంటనే నాకా పెద్ద గది ఇచ్చేసింది.

నిజానికి నాకూ వేరే ఇంటికి మారాలన్న కోరిక ఉంది. రెండునెల్ల కోర్సు అవగానే, కావాలంటే నేను ఇంకో ఇంటికి మారవచ్చు. వంట చేసుకునే సదుపాయమున్న ఇల్లయితే బాగుండునని నాకుంది. అప్పటికీ వంట సదుపాయం లేక నాకు చాలా ఇబ్బందిగా ఉందని ఫ్రౌ యాకేల్‌తో రెండు మూడుసార్లు అన్నాను. ఆమె జాలి పడింది తప్పితే వంట చేసుకోమని అనలేదు. అంతకుమించి అడగడానికి నాకూ మొహమాటం వేసింది. ఐనా ఆ రెండు నెలల్లోనూ యాకేల్‌తో ఏర్పడిన ఆత్మీయానుబంధం నన్నా ఇల్లు మారనివ్వలేదు. కేవలం వంట సదుపాయంకోసం ఆమె అభిమానానికి దూరమై వేరే ఇంటికి మారడానికి నాకు మనసొప్పలేదు. కలకాలం ఐతే వేరే మాట – నేనక్కడుండేది మరో రెండు నెలలే!

ఇదీ వరస

ప్రతిరోజూ ఉదయం ఆరున్నర తర్వాత లేచేవాణ్ణి. అంతకు ముందు లేస్తే వ్రాతపనులు చూసుకునేవాణ్ణి. తెమలడానికి నాకక్కడ క్షణం కూడా వృథా అయ్యేది కాదు. ఎందుకంటే బస్సు ఏడూ ఐదు అంటే సరిగ్గా ఏడూ ఐదుకే బయల్దేరుతుంది. ఒక్కరోజు కూడా ఒక్క సెకన్ లేటవదు.

చిన్నప్పట్నించీ గడియారం ముళ్లతో తిరిగే మనిషిని. ఇంట్లో గోడ గడియారాన్నీ, రోడ్లమీద రేడియో కార్యక్రమాల్నీ, కాలేజిలో టవర్‌క్లాక్‌నీ నమ్ముకుని – చేతికి వాచీ ఉన్నవాళ్లకంటే పక్కాగా సమయపాలన చేసేవాణ్ణి. కానీ అక్కడ బస్సులు, రైళ్లు వగైరాలు వేటికీ సమయపాలన లేదు. మనుషుల సంగతి సరేసరి. అందువల్ల నా ప్లానింగులో – నాకు అదుపులేని చాలా విషయాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సివచ్చేది.

ఉదాహరణకి భువనేశ్వర్లో మా కాలనీనుంచి ఊళ్లోకెళ్లాలంటే, కిలోమీటరు నడిచి ఉత్కళ యూనివర్సిటీలోని వాణీవిహార్ స్టాప్ చేరి అక్కడ బస్సెక్కాలి. అప్పట్లో స్కూటరే కాదు, సైకిలుండడం కూడా గొప్ప. వాణీవిహార్‌కి బస్సు టైమ్ సాయంత్రం నాలుగున్నర. అది ఒకోసారి నాలుగుకే వచ్చేసేది. ముందొచ్చిందని నాలుగున్నరదాకా ఆగదు. వెంటనే వెళ్లిపోవడమే. కానీ సాధారణంగా అది ఐదుకు వచ్చేది. ఆ బస్సు మిస్సవకూడదంటే, నాలుగులోపే అక్కడకు చేరుకుని, ఐదు దాకా ఎదురుచూడాలన్నమాట! ఉత్తపుణ్యాన గంట వృథా.

అలాంటిదిక్కడ టౌన్‌బస్సు అంత పంక్చువల్‌గా ఉండడంవల్ల నాకెంత టైం కలిసొచ్చేదో చెప్పలేను. జర్మనీకి వచ్చిన పనికి పూర్తి న్యాయం చేస్తూనే – డైరీ, అకౌంట్, పెద్ద పెద్ద ఉత్తరాలు, కథలు వ్రాసుకుంటూ – మిత్రులతో కలిసి తిరిగానంటే – జర్మనీలోని సమయపాలనా వ్యవస్థకి జోహారులనక తప్పదు.

సమయపాలన విషయంలో నేనిక్కడ గమనించిన మరో విశేషం, నడకలో వేగం. భువనేశ్వర్లో ఇంటినుంచి ఆఫీసుకి పది నిముషాల నడకైతే, నేను పావుగంట ముందే బయల్దేరి, వేగంగా నడిచి ఆరేడు నిముషాల్లో ఆఫీసుకి చేరుకునేవాణ్ణి. పక్కన ఎవరైనా మిత్రులుంటే మాత్రం నన్ను చేయి పట్టుకుని ఆపి, "ఏమిటా పరుగు?" అని మందలించేవారు. నడవడానికి వీలైనంత తక్కువ సమయం తీసుకోవాలని నేను, శ్రీమతి కూడా అనుకునేవాళ్లం కానీ – ఇండియాలో వేగంగా నడిచే ఆడవాళ్లు చాలా తక్కువ కావడం వల్ల ఆమె తరచుగా ఇబ్బంది పడేది. జర్మనీలో ఆడా, మగా అన్న తేడా లేకుండా ఎవరి సామాను వారు మోసుకుంటూ, వెనుక ఎవరో తమని తరుముతున్నారన్నట్లు పరుగులాంటి నడకతో సాగిపోయేవారు. అలా ఒకసారి ఓ జర్మన్ యువతి వేగంగా వెళ్లిపోతూ, నా చేతికి డాష్‌ఇచ్చి, మర్యాదకు సారీ చెప్పి, అదే వేగంతో వెళ్లిపోయింది. తర్వాత చూసుకుంటే నా చేతి వాచీకి అద్దం లేదు. వాచి షాపులో స్పెషల్ రెంచి పెట్టి తిప్పితేనే కానీ ఊడని అద్దమది. అదీ ఆ యువతి వేగపు బలం. కొత్త వాచీ కొనాల్సొస్తుందని భయపడ్డాను కానీ, అదృష్టం కొద్దీ, ఓ షాపతను ఆరు మార్కులకి కొత్త అద్దం వేసిపెట్టాడు. అప్పట్నించీ ఎదురుగా ఎవరైనా వేగంగా వస్తుంటే, ఆ వచ్చేది అమ్మాయిలైనా సరే, వాచీ ఉన్న చేతిని దాచుకుని, ఆమడ దూరం పక్కకి తప్పుకునేవాణ్ణి.

ఉదయం బస్సులో గ్యోతే ఇన్స్టిట్యూట్‌కి వెళ్లి బ్రేక్‌ఫాస్ట్ చేసేవాణ్ణి. జర్మన్ పాఠాలు నేర్చుకున్నాక అక్కడే స్నానం చేసేవాణ్ణి. తర్వాత కాసేపు మార్కెట్లో తిరిగి కావలసినవి కొనుక్కుని బస్సులో ఇల్లు చేరేవాణ్ణి. బ్రెడ్‌స్లైసులు, ఆపిల్సు, అరటిపళ్లు డిన్నరు. ఆపిల్ లేదా ఆరెంజి జ్యూస్ పానీయం. రాత్రి పడుకునేలోగా వీలునిబట్టి వ్రాత, చదువు. ఈ అలవాట్లతోనే ఇక్కడ నెలకి రెండు కేజీల చొప్పున పెరిగి, ల్యూనబర్గు వదిలేటప్పటికి యాభైరెండు కేజీల బరువయ్యాను. అప్పుడు నా అలవాట్లు నా వెన్ను తట్టి మెచ్చుకున్నట్లనిపించింది.

అంతా నన్ను చలి గురించి బెదరగొట్టేశారు కానీ, ఇక్కడ చలి అంటే మంచు కురిసే చలికాలంలో కూడా మనిషిని తినేసే పులేం కాదు. ఇళ్లలో వెచ్చగా ఉంటుంది. షాపులు, బస్సులు, రైళ్లు, కార్లు అన్నీ లోపల వెచ్చగా ఉంటాయి. ఈ మధ్యలో కాసేపు బయట నడక అవసరమైతే, వంటిని రక్షించడానికి స్వెటర్లు, కోట్లు, ఓవర్‌కోట్లు, షూస్ వగైరాలున్నాయి. నిజానికి చలి ఎక్కువ బాధించేది మన దేశంలోనే! ఎటొచ్చీ అక్కడ వేసవి కూడా మన చలికాలంలాగే ఉంటుంది. ఆ చలిలో నేను తరచుగా మన దేశంలోలాగే స్వెటర్లేకుండా, ఆకుచెప్పులతో బయట తిరిగాను. చాలా ఆహ్లాదకరంగా ఉండేది.

నిజం చెప్పాలంటే, మనం చలికి కంటే, అక్కడి వాళ్లు వేడికి పడే భయం ఎక్కువ. ఆగస్ట్ 14న వేసవి మొదలైందని రేడియోలో హెచ్చరిక విన్నాను. ఆ రోజు టెంపరేచర్ ఇరవైఎనిమిదని గుర్తు. ఆ సాయంత్రం మగాళ్లంతా డ్రాయర్లలాంటి నిక్కర్లతోనూ, ఆడాళ్లంతా బికినీలతోనూ ఉఫ్‌ఉఫ్ అనుకుంటూ వీధిన పడ్డారు. మేమూ వీధిన పడ్డాం కానీ – అది వాళ్లని చూడ్డానికి. ఎప్పటిలాగే నిండు దుస్తులు ధరించిన మమ్మల్ని చూసి వాళ్లెవరూ సిగ్గుపడలేదు కానీ, అంతమందికి భిన్నంగా ఉన్నందుకు మేమే సిగ్గుపడ్డాం.

"ఇండియాలో ఐతే 40 డిగ్రీలు దాటిపోతుంది. అక్కడేం చేస్తారో వీళ్లు" అని మాలో మేము మాట్లాడుకోవడం విన్న ఒకరిద్దరు జర్మన్లు ఆగి కళ్లు పెద్దవి చేసుకుని, ఆ తర్వాత గుండెలు బాదుకుంటూ వెళ్లారు. ఆ సాయంత్రం ఊళ్లో ఫ్రైబాడ్, కూర్‌జెంత్రమ్ వగైరా స్థలాల్లో స్విమ్మింగ్‌పూల్సు నీళ్లతో బదులు మనుషులతో నిండిపోయాయట.

ఇండియన్ మిత్రులు నన్ను తోడబుట్టినవారికంటే ఎక్కువగా ఆదరించారు. వంట సదుపాయం ఉన్నవాళ్లు తరచు నన్ను భోజనానికి పిలిచేవారు. అప్పుడప్పుడు పనికట్టుకుని నా ఇంటికొచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించేవారు. ఇంటామె నాకిచ్చిన కేక్సు వాళ్లొచ్చినప్పుడు చెల్లిపోయేవి. లొట్టలు వేసుకుంటూ మరీ తినేవారు.

అక్కడ ఇంచుమించు మిగతా ఇండియన్సందరికీ సాటివారి తోడుంది. నాకు దగ్గర్లో ఎవరూ లేరన్న భావనతో వాళ్లు నన్ను దృష్టిలో ఉంచుకుని తమ కార్యక్రమాలు రూపొందించుకునేవారు. బయటి ఊళ్లకి పిక్నిక్కులే కాక, ఊళ్లోనూ మేమంతా కలిసి బాగా తిరిగేవాళ్లం. అలా మేము చూసినవాటిలో ఫోగెల్ పార్క్ (బర్డ్స్ శాంక్చ్యువరీ), జూ సామాన్యంగా అనిపించాయి. మాకక్కడ ఆసక్తి కలిగించినవాటిలో సెప్టెంబర్లో జరిగిన స్టాడ్‌ఫెస్ట్ (టౌన్‌ఫెయిర్) చెప్పుకోతగ్గది. చూడ్డానికది మనకి పండుగల్లో వచ్చే తీర్థంలా ఉంది. అక్కడ చిన్నపిల్లల వినోదానికి అత్యాధునిక రంగులరాట్నాలు, రోలర్ కోస్టర్లు వగైరాలున్నాయి. వాటిని కాదని, ఒకచోట గడ్డికుప్పలుంటే వాటితోనూ అంత ఉత్సుకతతోనూ ఆడుకునే పిల్లల్ని చూసి, ఎక్కడైనా పిల్లలు పిల్లలే కదా అనుకుంటూ మా పిల్లల్ని గుర్తు చేసుకున్నాను. అక్కడ మొదటి రోజు ఉచితంగా బీరు పోస్తే జనం దానికోసం ఎగబడ్డం ఇండియాని గుర్తు చేసింది. ఐతే అదో సరదాయే కానీ ఆబ కాదు. ఒకరోజు వివిధ వాయిద్యాల ఆర్కెస్ట్రా, ఒకరోజు కొందరు గాయనీగాయకుల పాటలు. ప్రదర్శనలకంటే అక్కడి వాతావరణం ఎక్కువ నచ్చింది మాకు.

అక్కడకొచ్చేక ఇండియన్సులో ప్రాంతీయ, మత, భాషా భేదాల స్ఫురణ తగ్గిపోతుంది. ఇండియన్ అంటే ఇండియన్ అంతే! అంతా మనవాళ్లేననుకుంటూ, ఒకరికొకరు బాసటగా ఉండడం బాగా అనిపించేది నాకు. ఐతే నాకు ఒంటరితనం ఫీలింగ్ కలక్కుండా చెయ్యడం తమ బాధ్యతగా వాళ్లు భావించడంలో, వారితోపాటు నాకూ కొంత ఇబ్బంది ఉండేది. ఎందుకంటే నేను డైరీ వ్రాస్తాను, అకౌంట్ వేస్తాను. వివిధ పత్రికలకు కథలు పంపుతాను. నా మటుక్కు నేను యమ బిజీ. ఆ విషయం వాళ్లు గ్రహించాలని, నేను రచయితనన్న విషయం వారికి చెప్పక తప్పలేదు. వారిలో తెలుగు తెలిసినవారు ఒకరిద్దరున్నా, సాహిత్యాభిలాషులు కారు కాబట్టి, బయటపడ్డానికి నేను సంకోచించలేదు.

ఇంటామె తరచుగా తనింట్లో టివి చూడ్డానికి పిలిచేది. ఒకసారి హిమాలయాల్లో ఎలుగుబంటిని పట్టే డాక్యుమెంటరీ వస్తోందంది. ఒకసారి నేను వెళ్లబోయే బెర్లిన్ మీద డాక్యుమెంటరీ వస్తోందంది. ఒకసారి ఏదో మ్యూజిక్‌బాండ్ కార్యక్రమం వస్తోందనీ, ఆ బ్యాండ్ కొన్నాళ్లక్రితం ల్యూనబర్గు వచ్చినప్పుడు టికెట్ ఏకంగా 19 మార్కులనీ, ఇప్పుడదే కార్యక్రమం టివిలో ఫ్రీగా చూడొచ్చనీ అంది. ఎప్పుడు పిలిచినా ఆమె కళ్లలో ఎక్సయిట్మెంట్. ఆమె ఇంట్లో కొన్ని జర్మన్ సినిమాలు కూడా చూశాను. కథ, చిత్రీకరణ, నటన పరంగా అవి ఉత్తమ స్థాయిలో ఉన్నాయి. ఆ కథాంశాల్నిబట్టి మనోవిశ్లేషణ పరంగా మనుషులంతా ఒక్కటేననిపించింది. ఇంకా ఫెర్‌న్‌జెహె లొట్టో (టెలివిజన్ లాటరీ) కార్యక్రమంలో వచ్చే కొన్ని అంశాలు నన్ను బాగా ఆకర్షించేయి. ఒక హాలండర్ (హాలెండ్ దేశస్థుడు) నిర్వహించిన కుటుంబ కార్యక్రమంలో, తల్లి–కొడుకు, తండ్రి–కూతురుల జంటల మధ్య జరిగిన పోటీ రౌండ్స్, ఆరోగ్యకరమైన వినోదానికి మచ్చుతునక అనిపించింది.

భువనేశ్వర్ తిరిగి వెళ్లేక అదే తరహాలో ఒక తెలుగు కార్యక్రమం కూడా రూపొందించాను. అప్పటికింకా టివిలు లేవు. ఇప్పటి తెలుగు టివి ఛానెల్సులోని కుటుంబ కార్యక్రమాలు ఇంకా ఆ స్థాయికి దరిదాపుల్లో లేవు.

నటరాజన్ ఇంట్లో అతని హౌస్‌ఫ్రా ఆహ్వానంమీద ఒకసారి జర్మనీలోని బవేరియన్ సంగీత కార్యక్రమం చూశాను. బవేరియన్సు యోడ్లింగుకి సుప్రసిద్ధులు. వాళ్లంత సహజంగా యోడ్లింగ్ చెయ్యగల గాయకుడు ఇండియాలో అప్పట్లో కిషోర్‌కుమార్ ఒక్కడే.

స్టాంపులకోసం నేను తరచుగా పోస్టాఫీసుకి వెళ్లేవాణ్ణి. ఎక్కడపడితే అక్కడ ఆటోమాట్లు ఉన్నాయిగా, దూరంగా ఉన్న పోస్టాఫీసుకెందుకూ శ్రమపడి వెళ్లడం అనేవారు మిత్రులు. కానీ ఆటోమేట్లలో స్పెషల్ స్టాంపులు ఉండవు. నా ప్రియమిత్రుడు సూర్యనారాయణ, కేవలం స్పెషల్ స్టాంపులకోసం, నాకు జర్మనీ వెళ్లే అవకాశం రావాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాడు. అతనికోసం పోస్టాఫీసుకి వెళ్లి, స్పెషల్ స్టాంపులు కొనడం ఆనందమే తప్ప శ్రమ అనిపించేది కాదు. కార్డులు, ఏరోగ్రామ్సుతో చౌకగా ఐపోతుందని తెలిసి కూడా, కుబేరుడి సిద్ధాంతాన్ననుసరించి, ఉత్తరాలు వ్రాసి కవర్లో పెట్టి పంపేవాణ్ణి – స్పెషల్ స్టాంపులు అతికించే అవకాశం ఉంటుందని. నాకు ఇండియానుంచి మిత్రుల ఉత్తరాలు వచ్చేవి. కొందరు తమకేవో కావాలని అడిగేవారు. టేపు రికార్డరు వగైరాలు తేలేననీ, ఎలక్ట్రిక్ పరికరాలపై ఐతే నిషేధముందనీ వ్రాస్తే, నొచ్చుకోకుండా సరేననేవారు. క్యాసెట్లు కొని పోస్టులో పంపేవాణ్ణి. వాడని కాసెట్లకి కస్టమ్స్ డ్యూటీ పడుతుందని, వాటిని రేడియో రికార్డర్లోని జర్మన్ మ్యూజిక్‌తో నింపి పంపేవాణ్ణి. వాళ్ల ద్వారా మా కాలనీవీ, దేశంలోవీ విశేషాలు తెలిసేవి. ఒక ఉత్తరంలో ఒకతను బియ్యం ధర కేజీ మూడు రూపాయలైందని గుండెలు బాదుకుంటూ వ్రాశాడు.

చిత్రమేమిటంటే నేను ఒకరికి చిన్న ట్రాన్సిస్టరు, ఒకరికి విల్కిన్సన్ బ్లేడు కవర్లో పెట్టి పంపాను. అవి ఏ స్కానింగుకీ గురి కాలేదేమో, క్షేమంగా వారిని చేరాయి. అలాగే శ్రీమతి ద్వారా నాకు రెండు పిన్నీసులు, ఓవర్‌కోటు బొత్తాం కుట్టుకునేందుకు చిన్న సూది, మొలతాడు, బూటులేసులు కూడా వేర్వేరు సమయాల్లో అందాయి.

రోజుకొకసారైనా కాసెట్టేపులో పిల్లల మాటలు, పాటలు వినేవాణ్ణి. ఆ శబ్దతరంగాలు లేత ఉరుముల్లా చెవులకి తాకగానే, కళ్లలో నీళ్లు చిరుజల్లులై కురిసేవి. అంత దగ్గరగా వినబడుతున్న ఆ మాటలు నన్ను ఎన్నో వేల మైళ్ల దూరం తీసుకుపోతూండేవి.

పిల్లలిద్దరూ నాకు బాగా అలవాటు. నేనేదైనా తింటుంటే వాళ్లిద్దరూ నా దగ్గర చేరి, "నాన్నగారూ, నాకో, నాకో?" అంటుండేవారు. ఇప్పుడు నేను బ్రెడ్ స్లైసులు తింటుంటే వాళ్లిద్దరూ చెరో పక్కనా నిలబడి, "నాన్నగారూ, నాకో, నాకో?" అంటున్నట్లే అనిపించేది.

"ఇక్కడ సదుపాయాలు అపూర్వం. సౌకర్యాలు అద్భుతం. ఈ దేశమొక స్వర్గం. కానీ భార్యాబిడ్డలు దగ్గర లేకపోయాక, ఏంచేసుకోనీ స్వర్గాన్ని?" అని బాధపడేవాణ్ణి.

కలలొచ్చేవి. ఆ కలల్లో శ్రీమతి కనిపించేది కన్నీళ్లతో. ఇలలో ఆమెనుంచి క్రమం తప్పకుండా ఉత్తరాలొచ్చేవి. ఆ ఉత్తరాలు చదువుతుంటే నాకో విషయం అర్థమైంది. పెళ్లయిన ఆడపిల్లకి, భర్త పక్కన లేకపోతే – పుట్టినిల్లయినా, మెట్టినిల్లయినా, తోడబుట్టినవారి ఇల్లయినా – అది పరాయిదే!

అబ్బాయికి రెండేళ్లు నిండాయి. అమ్మాయి వాడికంటే ఏణ్ణర్థం పెద్ద. ఇద్దరిదీ ఎదిగే వయసు. కొత్త మాటలు నేర్చుకుంటూ, ప్రపంచాన్ని తమదైన దృష్టితో చూస్తూ, మన దృష్టికోణానికి అందని ఎన్నో విశేషాల్ని అందించగల దశ వారిది. ఆ వయసు పిల్లలతో జీవించడమే ఒక ఎడ్యుకేషన్. అది నేను మిస్సయిపోతున్నానని బాధొచ్చేది శ్రీమతి ఉత్తరాలు చదువుతుంటే.

అమ్మాయికి దగ్గొస్తే, దగ్గడమయ్యాక, "నాన్నగారుంటే వీపు నిమిరేవారు" అంటుందిట. ఎక్కడైనా తనీడు పిల్ల తండ్రితో కనబడితే, ఆ జంట వంక అసూయగా చూస్తుందిట. అబ్బాయైతే అస్తమానూ, "భువనేశ్వర్వెళ్లిపోదాం. అక్కడ నాన్నగారుంటారు" అని ఏడుస్తాట్ట.

ఇక మా అమ్మ పిల్లలకేమీ తీసిపోలేదు. ఎవరిమీదైనా కోపమొస్తే, "నాకు చిరాకు తెప్పించారంటే, జర్మనీలో బాబి దగ్గరకు వెళ్లిపోతాను" అంటోందిట – అక్కడికి అదేదో పక్క ఊరైనట్లు.

'మేమిద్దరం, మాకిద్దరు' అనే ప్రచారం ఊపులో ఉన్న రోజులవి. ఈ మధ్యలో శ్రీమతి ట్యూబెక్టమీ ఆపరేషన్ చేయించుకుంది. ఆమె ఆపరేషన్ చేయించుకుంటుందని తెలుసు. కానీ వివరాలు తెలుసుకుందుకు ఇప్పటిలా మొబైల్సా, ఇంటర్నెట్టా? మా వాళ్లెవరికీ ఇంట్లో టెలిఫోన్ సదుపాయం కూడా లేదు. ఒక వారం రోజులు నా మనోవ్యథ ఇంతా అంతా కాదు. ఆశ్చర్యమేమిటంటే ఎప్పుడూ ఉత్తరాలు వ్రాయని మా నాన్నగారు, కోడలు ఆపరేషన్ చేయించుకుందనీ, క్షేమంగా ఉందనీ నాకో ఉత్తరం వ్రాశారు. అదే నా శ్రీమతి క్షేమాన్ని తెలియబర్చిన మొదటి ఉత్తరం. ఆ తర్వాత శ్రీమతి వ్రాసిన ఉత్తరం చదివితే, ఆయనకు తెలియని విశేషాలు కొన్ని తెలిశాయి.

మామూలుగా ఐతే ట్యూబెక్టమీ చిన్న ఆపరేషన్. కానీ అందరికీ పావుగంట పట్టేది తనకి గంట పట్టిందిట. ఆపరేషన్ చేయించుకున్నందుకు, 28 రూపాయలిచ్చారుట. 8 రూపాయలు హాస్పిటల్ స్టాఫ్‌కి ఇచ్చేసిందిట. మిగతా ఇరవై రూపాయలకీ మరో ఐదు రూపాయలు వేసి మా అత్తగారికీ, ఆమెకు సాయంగా ఉంటున్న ఓ దూరపుబంధువుకీ చెరో వెండిగిన్నె కొనిచ్చిందిట. ఐతే ఆపరేషన్ సమయంలో తనకి ఆక్సిజన్ పెట్టాల్సి వచ్చిందనీ, వెంట్రుకవాసిలో ప్రాణప్రమాదం తప్పిందనీ తెలిసినప్పుడు నా గుండె ఓసారి ఆగి మళ్లీ కొట్టుకుంది.

ఆమెనుంచి ఉత్తరం అందినప్పుడల్లా నాలో ఉత్సాహం ఉరకలు వేసేది. ఉత్తరం చదువుతుంటే దిగులు కలిగేది. ఉత్తరానికి జవాబిస్తుంటే గుండె బరువెక్కేది.

వివాహమయ్యేక ఇంతటి దీర్ఘ విరహానికి గురిజావడం ఇదే మొదలు.

మా ప్రేమబలం మమ్మల్నిద్దర్నీ దగ్గర చెయ్యదా అనుకుంటూండేవాణ్ణి నేను.

ఇటువంటి దేశాల్లో ఉన్నప్పుడు ఏకాంతం మంచిది కాదనేవాడు సుబ్రహ్మణ్యం. అయితే రచనలు చేయాలన్న తపన నన్ను ఏకాంతానికి సుముఖుణ్ణి చేసేది. విరహంతోనే కథలూ వ్రాసేవాణ్ణి. ఉత్తరంతోపాటు ఆవగింజంత అక్షరాలతో (కాగితాలెక్కువైతే కవరు బరువు పెరిగి స్టాంపులెక్కువ అంటించాల్సొస్తుంది మరి) కథలు కూడా పంపేవాణ్ణి శ్రీమతికి. అవి ఆమె ఫెయిర్ చేసి పత్రికలకు పంపుతూండేది. ఇప్పుడా ఉత్తరాలు చూస్తుంటే, వ్రాసిన నాకంటే, చదివి ఫెయిర్ చేసినవారిదే పూర్తి ఘనత అనిపిస్తుంది.

అక్కడుండగానే జ్యోతి మాసపత్రిక తొలిసారిగా నవలానుబంధాన్ని ప్రవేశపెట్టింది. తొలి అనుబంధంలో బొమ్మ హేమాదేవి నవల అభిలాష, మల్లాది వెంకటకృష్ణమూర్తి సీరియల్(మేఘమాల), మా మినీనవల (మృత్యుదేవత) ఉన్నాయి. ఆ పుస్తకం నేరుగా ల్యూనబర్గ్ చిరునామాకి వచ్చింది. అప్పుడు జ్యోతి చూస్తున్న వేమూరి సత్యనారాయణ – మా అమ్మాయి పుట్టేక ఆ అనుభవాలతో వ్రాసిన, పెళ్లయ్యాక చూడు నవల కూడా పరిశీలనలో ఉన్నట్లు – ఉత్తరం వ్రాశారు. అదే మాకాయనతో తొలి పరిచయం.

నా సాహచర్య ప్రభావం ఊరికే పోలేదు. ఒంటరితనం, విరహాన్ని అధిగమించాలన్న కోరిక – ప్రేరేపించాయేమో – శ్రీమతి కూడా తనకు తానై ఓ కథ రాసి ఓ పత్రికలో ప్రచురించగలిగింది. ఆమె ఆ విషయం తెలియబర్చినప్పుడు నాకెంత సంతోషం కలిగిందో చెప్పలేను.

మిత్రుల సాహచర్యం, ఇంటినుంచి ఉత్తరాలు. ఇవే కాదు, జర్మన్ క్లాసులు కూడా నాకెంతో రిలీఫ్నిచ్చేవి.

బడి ఒడిలో

మా క్లాసులో వివిధ దేశాల వారున్నారు. అంతా మంచివాళ్లు. సరదా అయినవాళ్లు.

అందరిలోనూ నాకు ఫ్రౌలైన్ (కుమారి) కాసింబర్గ్ అనే ఫ్రెంచ్ యువతితో మంచి స్నేహమైంది. చాలా విషయాల్లో అభిప్రాయాలొకటి కావడం అందుకో కారణం.

ఇండియాలో నా మిత్రుడు సూర్యనారాయణకి స్టాంపు కలెక్షన్ హాబీ. నేను జర్మనీ వెడుతున్నాననగానే అతను బ్రహ్మానందపడిపోయాడు – నా ద్వారా చాలా స్టాంపులొస్తాయని. అది నాకు గుర్తుంది. నా క్లాస్‌మేట్సులో ఇతర దేశాలవాళ్లందరికీ అతని హాబీ గురించి చెప్పి – వారి వారి దేశాల పాత స్టాంపులు కావాలని అడిగేవాణ్ణి. నాకోసమే అయితే అంత చొరవ చెయ్యగలవాణ్ణి కాదేమో మరి!

స్టాంపులకోసం కొత్త పరిచయాలకోసం నేను ఇన్‌స్టిట్యూట్లో అప్పుడప్పుడు టేబుల్‌టెన్నిస్ గదికి వెళ్లేవాణ్ణి. అక్కడ ఎక్కువగా జపనీయులు ఉండేవాళ్లు. చూసి ఆనందించడమే తప్ప ఎక్కువ ఆడేవాణ్ణి కాదు. ఒకసారి ఎవరో బలవంతపెడితే ఆటలోకి దిగాను. ప్రథమ ప్రయత్నంలోనే ఓ జపనీయుణ్ణి ఓడించాను. అప్పట్లో టేబుల్‌టెన్నిస్ ఆటకి జపనీయులు పెట్టింది పేరు. ఆ కుర్రాడి స్థాయి ఏమైనా, నా జీవితంలో నేను ఒక జపాన్ ఆటగాణ్ణి ఓడించానని మనసులో గర్వపడ్డాను. నా ఆట చూసి ఫ్రౌలైన్ ఫుకునో అనే జపాన్ యువతి నన్ను పార్టనర్ని చేసుకుని ఒకటి రెండు గేమ్స్ఆడింది. రెండూ మేమే నెగ్గాం. అందుకు మెచ్చిందేమో – తర్వాత నాకు సరికొత్త జపనీస్ స్టాంప్స్ రెండు షీట్లు తెచ్చి ఇచ్చింది. కలెక్షన్‌కి కొత్తవి అవసరం లేదని చెప్పినా వినిపించుకోలేదు. అవి సూర్యనారాయణకు పంపిస్తే అతను మహదానందంతో జవాబు వ్రాసాడు.

జర్మన్ భాష అంత కష్టం కాదు కానీ, వ్యాకరణం సంస్కృతంలా క్లిష్టమైనది. అవగాహనకు చాలా కృషి అవసరం. మా క్లాసులో జపనీయులు ఇద్దరమ్మాయిలూ, ముగ్గురబ్బాయిలూ ఉండేవారు. వాళ్లు క్లాసులో చాలా శ్రద్ధగా పాఠాలు ఫాలో అయ్యేవారు. వాళ్ల సిన్సియారిటీ నాకు ఆశ్చర్యం కలిగించేది. శ్రద్ధలో కాకపోయినా, తెలివితేటల్లో వాళ్లతో పోటీ పడేవాళ్లు ఇండియన్స్.

సాధారణంగా లాల్ క్లాసులో మొదటివాడుగా ఉండేవాడు. నేను మొదటి అయిదుగురిలో ఒకణ్ణి. ఈ ర్యాంకుల విషయంలో మేమంతా స్కూలుపిల్లల్లా ప్రవర్తించేవాళ్లం. టీచర్ మార్కుల విషయంలో అన్యాయం చేసిందని ఆరోపించేవారు కొందరైతే, పరీక్షలో కాపీ కొట్టేవారు కొందరు. ఒకసారి అన్ని స్పెల్లింగులూ కరెక్టుగా వ్రాసిన నాకు ఓ పదానికి తక్కువ మార్కులు వెయ్యడంవల్ల – ఆ రోజుకి ఫస్టుకి బదులు నాల్గవ పొజిషనుకి పడిపోయానని టీచర్‌కి ఫిర్యాదు చేశాను. అబద్ధమెందుకూ, అప్పుడు నేను రోషంగానే ఉన్నాను. కానీ టీచరు చెప్పింది – నేను ఒక వాక్యంలో మధ్యపదానికి మొదటి అక్షరం స్మాల్ లెటర్‌కి బదులు కాపిటల్ లెటర్ వ్రాసేనని. కానీ చిన్నప్పట్నించీ ఎక్కడ వాడినా కె అనే అక్షరాన్ని ఒక్కలాగే వ్రాయడం నాకు అలవాటు. కాపిటల్ ఐతే పెద్దగానూ, స్మాల్అయితే చిన్నగానూ వ్రాసేవాణ్ణి. ఇంగ్లీషు భాషకు సంబంధించిన పరీక్షల్లో కూడా అది చెల్లుబడి ఐపోయేది. ఆ విషయం మరీమరీ చెప్పినా టీచర్ ఒప్పుకోలేదు. స్మాల్ 'కె' కి మొదటి నిలువు గీత చిన్నదిగా ఉండాలని (K, k) నొక్కించింది. అప్పుడు నేను గ్రహించాను – అంతవరకూ నేను చేస్తున్నది తప్పని. మళ్లీ జీవితంలో ఆ తప్పు చెయ్యలేదు.

మా క్లాసులో ఆఫ్రికన్స్ సంఖ్య ఎక్కువే. వారిలో మ్బాయా (Mbaya) అనే అతను చిన్నపిల్లాడిలా చాలా అల్లరి చేసేవాడు. అతనివల్ల క్లాసు సరదాగా ఉండేది. ఐతే ఎక్కువగా అతను సెక్సుకు సంబంధించిన విషయాలు కూడా ఏమాత్రం సంకోచం లేకుండా మాట్లాడేవాడు. టీచరుతో మాట్లాడినప్పుడు పాశ్చాత్యదేశాల్లోని శృంగార విశృంఖలత్వాన్నీ, పాశ్చాత్యుల కాపిటలిజంలో దోపిడినీ నిరసించేవాడు. వాదనలో చతురుడు. తను యునెస్కో ప్రొఫెసరుట. డబ్బు దండిగా ఖర్చు పెట్టేవాడు.

ఒకరోజు అతను క్లాసుకి ఓ స్థానిక పత్రిక తీసుకొచ్చి, అందులోని ఓ ప్రకటనని అందరికీ చూపించాడు. తన కుక్కని ఎంతగానో ప్రేమించిన ఓ మహిళ ఇచ్చిన ప్రకటన అది. ఆ కుక్కను కనుక వెదికి తెచ్చిస్తే – తెచ్చిన వ్యక్తి మహిళ ఐతే నగదు బహుమతి. అదే పురుషుడైతే

అతనితో ఒక రాత్రి గడపడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆమె ప్రకటించింది. పేపర్లో ఆమె ఫొటోతోపాటు,
సాధారణంగా అందాల పోటీకి ఇచ్చే శరీరపు కొలతలు కూడా ఉన్నాయి.

హెర్ మ్బాయా ఆ ప్రకటన చదివి వినిపించి, "ఒక కుక్కపిల్ల పాటి విలువ చెయ్యని శీలం గల మహిళలున్న ఈ దేశం ఏంచూసుకుని గర్వపడాలి? ఇలాంటి ప్రకటనలిచ్చే స్థితికి దిగజారిపోయిన పౌరులుంటే – ఆర్థికంగా ఎంతటి ప్రగతి సాధిస్తే మాత్రం, ఆ దేశానికి విలువుంటుంది?" అని రెచ్చిపోయి మాట్లాడాడు.

ఆ ప్రకటన చదివి నేను షాక్ తిన్నాను. కానీ నాకు మ్బాయా తీరు నచ్చలేదు. ఊరుకోలేక, "ఇలాంటి ప్రకటనలు మానవ మనస్తత్వంలోని వైచిత్ర్యానికి చిహ్నం. ఇలాంటి వ్యక్తులు అన్ని దేశాల్లోనూ ఉండొచ్చు. వారిని అర్థం చేసుకుని జీర్ణించుకునే పరిణతికి ఈ సమాజం చేరుకుందనుకోవాలి తప్పితే, ఆ మహిళ ఇక్కడి పౌరులకు శాంపుల్ అనుకోలేం. ఈ ప్రకటన ఈ దేశ ప్రజల నైతికస్థాయిని ప్రతిబింబించదు. ఎందుకంటే ఇంతకాలంగా ఇక్కడుంటూ, ఈ ప్రకటన చూసి షాక్ తిన్నామంటే, అధిక సంఖ్యాకులైన పౌరులు దీనికి భిన్నంగా ఉన్నారనే అర్థం కదా" అన్నాను వెంటనే.

మ్బాయా నావంక అదోలా చూసి కన్ను గీటాడు. "యూ, ఇండియన్! నువ్వు మాట్లాడకు. నా విషయంలో కలగజేసుకోకు. నేనీ విషయం ఈరోజు క్లాసులో టీచరుకి చెప్పాల్సిందే" అన్నాడు.

అతనీ విషయమై నాతో వాదనకు దిగే ఉద్దేశ్యంలో లేడని అర్థమై నేనిక ఊరుకున్నాను. క్లాసులో అతడా వార్త చదివి వినిపించినప్పుడు, మా టీచరు ముఖం అదోలాగైపోయింది. ఐతే ఆమె అతనికి బదులేమీ ఇవ్వకుండా విషయాన్ని దాటేసి పాఠంలోకి వెళ్లిపోయింది.

ఎందుకో కానీ మ్బాయాకి పాశ్చాత్య వ్యవస్థనీ, సంస్కృతినీ వేలెత్తి చూపడంమీద ఆసక్తి ఎక్కువ. మరోసారి అతను క్లాసులోనే ఇంకో వివాదానికి తెర తీశాడు. పశ్చిమ జర్మనీలో వ్యక్తిస్వాతంత్ర్యం ఉందంటున్నారు కానీ అది నిజం కాదన్నాడు.

ఈసారి మా జర్మన్ టీచర్ ఊరుకోలేదు. తమ దేశం అసలైన స్వేచ్ఛకి మారుపేరంది. దాన్ని కొందరు పౌరులు దురుపయోగం కూడా చేస్తారంటూ, గతంలో ప్రస్తావించిన పత్రికా ప్రకటనకు పరోక్షంగా బదులిచ్చింది.

హెర్ మ్బాయా ఊరుకోలేదు. వెంటనే క్యోల్న్ నగరంలో జరిగిన ఒక సంఘటనని ఉదహరించాడు. ఆ నగరంలో ఒక విద్యార్థి క్లాసులో ప్రొఫెసర్ని ఎదిరించేట్ట. ప్రొఫెసర్ వెంటనే పోలీసులకి ఫోన్ చేసేట్ట. పోలీసులు వచ్చి ఆ విద్యార్థిని అరెస్టు చేసి జైల్లో పడేశారుట.

"నేను నమ్మను" అంది మా టీచర్.

"అందుకు సాక్ష్యముంది" అన్నాడు హెర్ మ్బాయా. ఇంటర్వల్లో అతను మరో జర్మన్ టీచర్ని క్లాసుకి పిలిచి, "క్యోల్న్‌లో ఒక విద్యార్థి ప్రొఫెసర్ని ఎదిరిస్తే – ఆయన పోలీసులకు ఫోన్ చేస్తే, పోలీసులొచ్చి ఆ విద్యార్థిని జైల్లో పడేయలేదూ?" అనడిగాడు.

ఆయన యథాలాపంగా, "అవును. ఏం?" అన్నాడు.

మా క్లాస్‌టీచర్ ముఖం మాడిపోయింది. "అలా ఎలా జరుగుతుంది?" అని తనలో తాను గొణుక్కుంది తప్పితే మరి వాదనని పొడిగించలేదు.

నాకు ఆశ్చర్యంగా అనిపించింది. జాతి పేరిట, రంగు పేరిట – మానసికంగా పౌరుల్లో అసహనం ఉండొచ్చు. కానీ దాన్ని దాచుకునే సంస్కారాన్ని మేమక్కడ చూశాం.

అలాంటి సంస్కారానికి నియమాలూ, చట్టాలూ కూడా కొంత కారణమౌతాయని నా నమ్మకం. సాంస్కృతిక పరంగానో, ఆహారపుటలవాట్ల విషయంలోనో ఐతే మాకా దేశం భిన్నంగా అనిపించవచ్చు. కానీ అక్కడ స్వదేశానికి మించి స్వేచ్ఛ అనుభవిస్తున్నామని

ఒప్పుకోవాలి. అలాంటిది కేవలం ప్రొఫెసర్ని క్లాసులో ఎదిరించిన నేరానికి, ఒక విద్యార్థి జైలు పాలౌతాడా? అలాగైతే ఈపాటికే మ్బాయా జైల్లో ఉండాలి. నాకు అనుమానమొచ్చి హెర్ మ్బాయాను పక్కకు పిలిచి, "ఇంతకీ అ విద్యార్థి ప్రొఫెసర్ని ఏమని ఎదిరించాడు?" ఆనడిగాను.

మ్బాయా కన్ను గీటి అదోలా నవ్వుతూ, "అది వాళ్లడగాల్సిన మాట. వాళ్లే అడగనప్పుడు – నువ్వడక్కూడదు. నేను చెప్పకూడదు" అన్నాడు.

నాకు అర్థమైంది, ఆ రోజు క్లాసులో ఆ విద్యార్థి ప్రవర్తనలో క్రిమినల్ త్రెట్ ఉండొచ్చని!

ఇక్కడే నాకు ఆశ్చర్యంగా ఉండేది. ఈ లాంగ్వేజి క్లాసుల్లో జర్మన్ టీచర్సు ఏ విషయంలోనూ ఎక్కువగా వాదనలోకి దిగడానికి ఇష్టపడేవారు కాదు. ఏదిఏమైనా ఒకటి మాత్రం నిజం. పశ్చిమ జర్మనీలో వ్యక్తి స్వాతంత్ర్యముందన్న విషయాన్ని నిరూపించుకుందుకు వాదన అవసరం లేదు. అందుకు మ్బాయాయే సాక్షి.

హెర్ మ్బాయా తెల్లవాళ్ల గురించి హీనంగా మాట్లాడేవాడు. శ్వేతసుందరీమణుల్ని అనుభవించడంకోసమే తనీ దేశాల్లో తిరుగుతున్నాననేవాడు.

నాకు స్వానుభవమే — మాటల్ని బట్టి వ్యక్తిత్వాల్ని అంచనా వెయ్యలేం. దళితుల్ని కులం పేరు పెట్టి హీనపర్చే ఒక టీచరు – వాస్తవంలో దళితుల్ని ఆత్మీయంగా ఆదుకోవడం నాకు తెలుసు. అగ్రకులాల్ని అనరాని మాటలనే ఓ దళితుడు నన్ను అభిమానించే ప్రాణమిత్రుడు.

శరీరంలో కల్మషాన్ని విడిచిపెట్టడానికి దేవుడు మనిషికి కొన్ని మార్గాలిచ్చాడు. అందుకు కొందరు మనుషులు మాటని కూడా ఉపయోగించుకుంటారు. మాట మంచిదైతే సంస్కారానికి చిహ్నం. చెడ్డదైతే – వ్యక్తి స్వాతంత్ర్యానికి నిదర్శనం. మాటతో వ్యక్తుల్ని అంచనా వేస్తే మన నేతలంత దుష్టులుండరు. కానీ మనం ఎంతో కొంత ముందుకే వెడుతున్నామంటే మన నేతలే కదా, కారణం!

జర్మన్ క్లాసుల్లో గుర్తుండిపోయే మరో విశేషం – క్లాసులో జర్మన్ తప్ప ఇంకేమీ మాట్లాడకూడదని నియమం. నియమం ఉల్లంఘిస్తే పది ఫెనిగ్స్ జరిమానా. అలా వసూలు చేసిన డబ్బుల కోసం, టీచర్ ఓ హుండీ పెట్టింది కూడా. అనుకోకుండా ఎవరి నోటైనా ఆంగ్లపదం జారితే, "చెన్(పది) ఫెనిగ్స్ బిట్టే (ప్లీజ్)" అనేదామె.

ఈవిధంగా ఎక్కువ ఫైన్ కట్టినవారు హెర్ మ్బాయా, బ్రెజిలియన్ అమ్మాయి ఫ్రౌలైన్ కురాసీ. ఆ అమ్మాయికైతే అప్రయత్నంగా ఆంగ్లపదాలు నోట జాలువారిపోతూండేవి. ఒకోసారి టీచరుకే జాలేసి, డిస్కౌంట్ ఇచ్చి జరిమానా తగ్గించేది.

డబ్బు విషయంలో నా జాగ్రత్తకి నిదర్శనంగా, ఒక్క పర్యాయం కూడా నేను జరిమానా కట్టలేదు.

మా క్లాస్‌టీచర్ నా అలవాట్లకు ఆశ్చర్యపడేది. గెమ్యూజే (కూరగాయలు) తప్ప తిననని జాలిపడేది. రావు అన్న నా పేరుని గెమ్యూజేకి పర్యాయపదంగా వాడేటంతగా నా అలవాట్లని గుర్తించుకన్న ఆమె కూడా నన్ను పద్దెనిమిదేళ్ల బాలుడనే అనుకుంది. నేను ఇద్దరు పిల్లల తండ్రినని తెలియగానే ఆమె షాక్ తిని, "ఆల్కహాల్ జోలికి వెళ్లకపోతే అంతా నీకులాగే ఉంటారేమో" అంది అప్రయత్నంగా. కానీ చాలామంది ఇండియన్ల యంగ్లుక్స్‌కి కారణం అండర్‌నరిష్మెంట్ అని ఎక్కడో చదివాను. అలాంటివాళ్లు ముప్పైలలో ఇరవైలనిపించినా, అరవైల్లో ఎనభైలనిపించే అవకాశముందిట. అదామెకి చెప్పలేదు.

క్లాసులో మా గతి చిన్నప్పటి వీధిబడిలోలా ఉండేది. జర్మన్ భాషలో వారాల పేర్లూ, నెలల పేర్లూ, అంకెలూ ఒకరి తరవాత ఒకరిచేత చెప్పించేవారు. బెంచిలో నా పక్కనున్నవాడు జోన్‌టాగ్ (ఆదివారం) అంటే, నేను మోన్‌టాగ్ (సోమవారం) అనాలి. ఆ పక్కనున్నవాడు

డీన్‌స్టాగ్ (మంగళవారం) అంటాడు. ఇలా వరుసగా చెప్పుకుంటూ వెళ్లడమే. మొదట్లో ఇది చిన్నతనంగా ఉండేది. రెండొకట్ల రెండు, రెండు రెళ్లు నాలుగు... అని వల్లె వేయించే వీధిబడులు గుర్తొచ్చి ఒక్కసారిగా చిన్నతనం పసితనంగా మారిపోయేది. మానసికానందానికి పసితనాన్ని మించినదేముంటుంది?

శ్రీమతికీ, పిల్లలకీ ఇది ఎంతో వినోదంగా ఉంటుందనిపించి ఒకరోజు క్లాస్‌రూంలో పాఠాల ఎపిసోడ్స్ రికార్డ్ చేశాను – తర్వాత వినిపించాలని!

నాలుగు నెలల లాంగ్వేజి కోర్సులో మొదటి రెండు నెలలూ ఫ్రౌ ష్వియరింగ్ మా టీచర్. తర్వాతి రెండు నెలలూ హెర్ షీమాంగ్. ఇద్దరికిద్దరూ మంచి మిత్రుల్లా మాతో కలిసిపోయారు.

మా క్లాసులో వాళ్లే కాక, ఇతర క్లాసులవాళ్లు కూడా కొందరు జీవితంలో మరపురాని పరిచయస్థులు. ఒకతనిది ఫిలిప్పీన్స్. అతను విపరీతంగా స్వంతడబ్బాని వాయించేవాడు. అతను చేసిన రీసెర్చికి ఏదో బహుమతి వచ్చిందట. ఆ బహుమతి ఏమిటని అడిగితే పేరు చెప్పలేదు కానీ, "నోబెల్ ప్రయిజ్ ఆఫ్ ది ఈస్ట్" అన్నాడు. వినోదం కావాలనిపించినప్పుడల్లా అతన్నోసారి పలకరిస్తూండేవాణ్ణి. వినోదం అందించడానికి స్వంత డబ్బా వాయించుకునే వాళ్లని మించినవాళ్లుండరు. ఎటొచ్చీ చాలామంది ఇతరుల స్వంత డబ్బాని భరించలేరు. ఇంతకీ ఈ ఫిలిప్పీన్స్ పౌరుడు రామచంద్ర క్లాస్‌మేటు.

ల్యూనబర్గులో గడిపిన నాలుగు నెలల్లోనూ, ఇంకా చాలామందే తటస్థపడి – విచిత్రమైనవీ, మరపురానివీ, ఆసక్తికరమైనవీ ఎన్నో అనుభవాలు అందించారు నాకు. అలా జర్మనీ పాఠాలకంటె ఎక్కువగా జీవిత పాఠాలు నేర్చుకున్నాను. జర్మన్ యువతి ఫ్రౌలైన్ బ్రిగెట్టీ హైనమన్‌తో ప్రారంభమయ్యాయవి.

చీరకట్టీ సింగారించీ

అక్కడ స్వంతిళ్లున్న చాలామంది తమ ఇళ్లని పూటకూళ్లలా కూడా నడుపుతారు. ఆధునిక భాషలో దాన్ని పేయింగ్‌గెస్ట్ సిస్టం అంటారు. అందుకుగానూ కొందరు ఇళ్లవాళ్లు తమ పేర్లను టూరిస్ట్ డిపార్టుమెంట్లో నమోదు చేయించుకుంటారు. ఫ్రౌ యాకేల్ పేరు కూడా అలా నమోదయింది. గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారే కాక బయటివాళ్లు కూడా ఆ సదుపాయం ఉపయోగించుకోవచ్చు.

స్వంత పనిమీద బయటి ఊళ్లనుంచి వచ్చినవాళ్లలో కొందరు లాడ్జిలకంటే ఇలాంటి పూటకూళ్ల ఇళ్లకే ప్రాధాన్యమిస్తారు. ల్యూనబర్గ్ వచ్చిన బ్రిగెట్టీ హైనమన్ అలా ఫ్రౌ యాకేల్‌ఇంటికి వచ్చింది. ఆమెకి యాకేల్ నా గది ఎదుటనున్న పెద్ద గదిని కేటాయించింది. ఆ అంతస్తులోని మూడు గదుల్లోకీ అది చాలా పెద్దది.

జూన్ 5న నేను ఫ్రౌ యాకేల్ ఇంట్లో అడుగెట్టాను. జూన్ 14న యాకేల్ నన్ను ఫ్రౌలైన్ బ్రిగెట్టీ హైనమన్‌కి పరిచయం చేస్తూ, నాకు తెలియని ఓ కొత్త విషయం చెప్పింది. గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారామెకు ఫోన్ చేసి, "చాలా తెలివైన మంచి ఇండియన్ యువకుడు వస్తున్నాడు. నీ ఇంట్లో గది ఇవ్వడానికి నీకేమైనా అభ్యంతరమా?" అనడిగారుట. ఆమె వెంటనే ఒప్పుకుందట. అలా నేనిక్కడికొచ్చాను.

ఆ అమ్మాయి వయసు ఇరవై లోపే వుండవచ్చు. సుమారు ఆరడుగుల పొడగరి. ఎత్తుకి తగ్గ లావుతో ఆకారానికి పెద్దదానిలా ఉన్నా, అందమైన ఆమె ముఖానికి అమాయకత్వం జతపడి – చిన్నపిల్లలాగే అనిపిస్తుంది.

ఆమె తన్ను పరిచయం చేసుకుంటూ, ఫోల్‌క్స్‌వ్యాగెన్ కంపెనీలో సెక్రటరీగా పని చేస్తున్నానంది. ఇంగ్లీషు కొద్దిగా వచ్చునంది. కానీ, కలిసి మాట్లాడుకుందుకు అది సరిపోదని, మాటనిబట్టే గ్రహించాను.

యాకేల్ అందుకుని నా గురించి ప్రశంసలు మొదలెట్టింది. ఏమో అనుకుందిట కానీ, నా తెలివితేటలు ఇంతా అంతా కాదంది. పది రోజుల్లోనే జర్మన్ బోలెడంత నేర్చుకున్నానని గొప్పగా చెప్పింది.

ఆమె అలా చెబుతుంటే నాకు సిగ్గేసింది. తెలివైన వాణ్ణి కావచ్చునేమో, కానీ భాష నేర్చుకోవడంలో నా తెలివికి చెప్పుకోతగ్గ నిదర్శనాలు లేవు. అప్పటికి భువనేశ్వర్లో ఐదేళ్లకు పైగా ఉన్నాను కానీ ఒరియా నేర్చుకోలేదు. ఆఫీసులో ఇంగ్లీషు, బయట వచ్చీరాని హిందీతో మానేజ్ చేస్తున్నాను. ఇక్కడ జర్మనీలో జర్మన్ మాట్లాడ్డం తప్పనిసరై ఏదో మాట్లాడుతున్నాను. కానీ నాతో వచ్చిన ఇండియన్సులో చాలామంది నాకంటే బాగా మాట్లాడుతారు. అర్హత లేని పొగడ్త కాబట్టి నాకామె మెప్పు సంతోషాన్నివ్వలేదు.

హైస్కూలు, కాలేజి రోజుల్లోనే క్లాస్‌మేట్సయినా ఆడపిల్లలకి దూరంగా ఉండేవాణ్ణి. ఇక్కడైతే భాష కూడా అంతంతమాత్రం కాబట్టి నాకు బ్రిగెట్టీతో మాట్లాడే ఆసక్తి కలగలేదు. ఆపైన ఉదయం లేచీలేవగానే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లే హడావుడి. తిరిగొచ్చేసరికి రాత్రి ఏడో, ఎనిమిదో! నిజం చెప్పాలంటే ఆమె నా ఎదుటి గదిలో ఉంటున్నదనే మర్చిపోయాను. అలా రెండు రోజులు గడిచిపోయాయి.

యాకేల్ నా గురించి చెప్పిన మాటలు బ్రిగెట్టీకి నేనంటే కుతూహలం కలిగించినట్లున్నాయి. నేను తనని పలకరిస్తానని మూడు రోజులు చూసింది. ఆదివారం రాగానే ఇక ఆగలేక, నా గదికి వచ్చింది. "కాసేపు కబుర్లు చెప్పుకుందాం. నీ గది చాలా చిన్నది కాబట్టి, నా గదిలోకొస్తావా?" అనడిగింది స్నేహపూర్వకంగా.

వెళ్లాను. చూస్తే ఆ గది చాలా పెద్దది. పెద్ద మంచంతో పాటు సోఫా, కుర్చీలు కూడా ఉన్నాయి. ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాక, "నీ గురించి చెప్పు" అంది జర్మన్లో.

నాకొచ్చిన జర్మన్ అంతంతమాత్రం. బయట ఎవరితో మాట్లాడినా, జర్మన్లోనే మాట్లాడమని మా టీచర్ చెప్పింది. బయటివాళ్లు కూడా గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల్ని జర్మన్లోనే మాట్లాడమని ప్రోత్సహిస్తారు.

నాకొచ్చిన చచ్చు భాషలో నెమ్మదిగా కబుర్లు మొదలు పెట్టాను. ఏం చెప్పాలో తెలియక, నేనొక రచయితననీ, నా శ్రీమతి నా రచనలు ఫెయిర్ చేస్తుందనీ చెప్పాను. మామూలుగా ఐతే అంత తక్కువ పరిచయంలో నేను రచయితనని ఇతరులకి చెప్పిన సందర్భాలు లేవు.

ఆమె నావంక అడ్మయిరింగ్‌గా చూసింది.

మొహమాటమేసి, ఎందుకు చెప్పానా అనుకున్నాను. అంతలో యాకేల్ వచ్చింది. మా ఇద్దరికీ కేక్ పెట్టింది.

ఫస్ చెయ్యడం ఇష్టం లేక మాట్లాడకుండా తిన్నాను. మానసిక బలమేమో, ఆ పూట కేక్ బాగుందనిపించింది.

కేక్ తింటూనే బ్రిగెట్టీ తనగురించి చెప్పింది.

ఆమె వయసు ఇరవై సంవత్సరాలుట. మాటల సందర్భంలో, తనకి బ్రౌన్ కలరంటే ఇష్టమంది.

"బ్రౌన్అంటే ?" అన్నాను అర్థం కాక.

"అదే, నీ వంటి రంగు!" అందామె మామూలుగా.

అబద్ధమెందుకూ, నాలో సంతోషం పొంగుకొచ్చింది. ఎందుకంటే, ఒకరోజు నేనూ, నటరాజన్ బస్సులో వెడుతుంటే మా వెనుక సీట్లో ఓ తెల్ల యువతీ, నాలుగైదేళ్ల కొడుకూ కూర్చుని ఉన్నారు. ఆ పిల్లాడు చూడ్డానికి బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. వెనక్కి తిరిగి మరీ ఆ కుర్రాడివంక చూసి ముద్దుగా నవ్వాం. తల్లిమనసు ఉప్పొంగినట్లుంది, ఆ యువతి వెంటనే కుర్రాడితో, "వాళ్లెవరో తెలుసా?" అంది ముచ్చటగా. మా గురించీ, ఇండియా గురించీ నాలుగు మంచి మాటలు చెప్పాలని ఆమె ఉద్దేశ్యమై ఉండొచ్చు. ఆ కుర్రాడు వెంటనే,

"ఆఫ్రికానర్" (ఆఫ్రికన్లు) అన్నాడు. ఆ తర్వాత ఆమె కొడుకుని మందలించిన స్వరాన్ని బట్టి తను నొచ్చుకుందని అర్థమైంది. మేము ఇండియన్సుమనీ, ఇండియా చాలా గొప్పదేశమనీ కాస్త ఎక్కువ చేసి చెప్పి కవర్ చెయ్యడానికి ప్రయత్నించింది. మేమిక వెనక్కి తిరగలేదు.

నటరాజన్ కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. "మనం మరీ అంత నల్లగా ఉన్నామా?" అన్నాడు నాతో.

"మనమెలా ఉన్నామన్నది కాదు ముఖ్యం. మనం వాళ్ళకెలా కనబడతామన్నది ముఖ్యం. ఆ మాటన్నది మాయామర్మం తెలియని ఓ పసివాడు. మనం ఇతరుల నలుపుని చిన్నబుచ్చేముందు, మనమూ కొందరికి నలుపని హెచ్చరించడానికే ఈ ఘటన" అన్నాను హుందాతనాన్ని నటిస్తూ. కానీ మనసులో నేనూ అతడిలాగే మథన పడుతున్నాను. ఇంతకాలం తెలుపని కాకపోయినా, కనీసం బ్రౌన్‌గా ఉంటానన్న నమ్మకంలో ఉన్నాను. ఆ నమ్మకాన్ని వమ్ము చేశాడా జర్మన్ పసిబాలుడు.

కానీ ఇప్పుడు నిండు యౌవనంలో ఉన్న ఓ తెల్లమ్మాయి, నా రంగు బ్రౌన్ అని నిర్ధారించడమే కాక అది తనకిష్టమని కూడా చెప్పింది. మొహమాటాన్ని అణచుకుంటూ, "డాంకే (థాంక్స్)" అన్నాను.

"నేనే కాదు. మా జర్మన్స్ అంతా బ్రౌన్ రంగు ఇష్టపడతాం. బహుశా మీ ఇండియన్స్ మా రంగు ఇష్టపడతారనుకుంటాను" అని నేనేమంటానోనని కుతూహలంగా నావంక చూసింది.

నిజం చెప్పేయాలనిపించింది. "మాకైతే యూరోపియన్స్ వంటి రంగు పాలిపోయినట్లుంటుంది. అది మాకు నచ్చదు. మాకూ వంటి రంగు బ్రౌన్‌గా ఉంటేనే ఇష్టం. అయితే మరీ పాలిపోయినట్లు ఉండకపోతే, మీ రంగు బ్రౌన్ కంటే బాగుంటుంది – నీ వంటి రంగులా" అన్నాను కొంచెం లౌక్యంగా. ఆమె వంటి రంగు బాగుందన్న మాట మాత్రం నిజం.

అప్పుడామె ఎంత సిగ్గు పడిందంటే, ప్రపంచంలో ఎక్కడి ఆడవాళ్లయినా ఒక్కలాగే సిగ్గు పడతారనిపించింది. ఆడవాళ్ల సిగ్గు ఎక్కడైనా మనోహరంగా ఉంటుందని కూడా అనిపించింది.

క్రమంగా కబుర్లలో పడి ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. ఇండియాలో గృహిణులకి వంట పని ఎక్కువనీ, రోజులో చాలా భాగం వంటింట్లోనే గడుపుతారనీ, వంట కూడా కష్టమేననీ చెబితే ఆమె ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత బాధగా నిట్టూర్చింది.

కట్టూబొట్టూ ప్రసక్తి వచ్చి, "ఇండియన్ మహిళలు బరువైన చీరలు కట్టుకుంటారు కదా, కట్టడం కూడా కష్టం అనిపిస్తుంది. మా బట్టలైతే తేలిగ్గా ఉంటాయి. వేసుకోవడం కూడా సులభం!" అందామె.

నేనొప్పుకోలేదు. "అలవాటైతే ఏదీ కష్టమనిపించదు. నీ పెర్సనాలిటీకి నువ్వు గౌన్లో కన్నా చీరలో ఎక్కువ బాగుంటావు" అన్నాను.

మళ్లీ అచ్చమైన ఆడపిల్లలా సిగ్గు పడిందామె.

బ్రిగెట్టీకి సిగరెట్‌అలవాటుంది. ముందు నాకు ఆఫర్ చేసింది. నాకు అలవాటు లేదన్నాను. అప్పుడామె నా అనుమతి తీసుకుని ఓ సిగరెట్ వెలిగించుకుంది. పొగ పీల్చి గుప్పున వదులుతూ, "పొగ తాగడం మంచిది కాదు. నేనూ మానేయ గలిగితే బాగుణ్ణు" అంది కొంచెం స్వగతంలా.

ఇరవైఏళ్ల అందమైన అమ్మాయి నోట్లో సిగరెట్! నేను పెరిగిన వాతావరణానికి ఆ రెండూ మ్యాచైనట్లు అనిపించలేదు.

తర్వాత ఆమె నా కుటుంబ వివరాలు అడిగింది. మా నాన్నగారికి పదిమంది సంతానమనగానే షాక్ తినేసింది. "అంతమంది పిల్లలుండడంపై నీ అభిప్రాయమేమిటి?" అంది. అదామె మర్యాద. నా అభిప్రాయం తెలిసేదాకా ఆ విషయమై తన స్పందనని చెప్పదు.

"ఇప్పుడు ఇండియాలో చాలామంది ఫామిలీ ప్లానింగ్ పాటిస్తున్నారు. ఇద్దరు లేక ముగ్గురు చాలు అన్నది మా దేశంలో కొత్త నినాదం. ఈ మార్పుని నాలాంటివాళ్లంతా స్వాగతిస్తున్నారు" అన్నాను.

ఆమె కళ్లు మెరిశాయి. "నీకు అంతమంది తోడబుట్టినవాళ్లున్నారని బాధగా అనిపిస్తుందా?" అంది.

"అంతమంది పిల్లలుండడంవల్ల ఆర్థికంగా చాలా ఇబ్బంది పడాలి. అందుకని బాధపడాలి. బాధపడితే, తోడబుట్టినవాళ్లని అవాంఛనీయులుగా భావించినట్లే కదా! కాబట్టి భవిష్యత్తులో అలా జరగనివ్వకూడదని అనుకుంటాను తప్ప, ఇప్పటికే జరిగిందానికి బాధపడను. ఆ విషయమలాగుంచితే – పండుగలకీ, వేడుకలకీ అందరం కలుసుకున్నపుడు – మాకు అంత బలగం ఉన్నందుకు మహదానందంగా ఉంటుంది" అన్నాను.

సరిగ్గా రాని భాషలో మాట్లాడడంవల్ల నా మెదడుకి శ్రమగానే ఉంది. ఐనా మేమిద్దరం అక్కడ కూర్చుని సుమారు అయిదు గంటలు మాట్లాడుకున్నాం.

మధ్యలో ఫ్రౌ యాకేళ్ ఊరించి చెబుతూ, "జీ ఈస్ట్ జేర్ ష్యోన్" అన్నాను. ఆ మాట యాకేల్‌తో కూడా చాలాసార్లు అన్నాను. అన్నప్పుడల్లా ఆమె సిగ్గుపడేది. నా అభిప్రాయంలో ఆ పదానికి అర్థం ఆమె చాలా మంచిదని. మరి ఆ మాటకు ఆమె సిగ్గు పడాల్సిన కారణం నాకు అప్పుడు తెలియలేదు. ఇప్పుడు బ్రిగెట్టీ చెప్పగా తెలిసింది. ష్యోన్ అనే మాటకి నైస్ అన్న అర్థం ఉన్నప్పటికీ, ఆ పదాన్ని ఎక్కువగా అందాన్ని పొగడ్డానికే వాడతారుట. కాబట్టి ఆ మాట అందరికీ వాడొద్దని చెప్పిందామె.

నేను యాకేల్ గుణగణాల్ని పొగుడుతున్నాననుకుని, అందాన్ని పొగుడుతున్నాను. అందుకా వృద్ధురాలు సిగ్గు పడుతోందని అర్థమై, అయ్యో అనుకున్నాను. మంచితనాన్ని అభినందించడానికి ష్యోన్‌కి బదులు నెట్ అనమని బ్రిగెట్టీ చెప్పింది. ఆ రోజుకి మా సమావేశం అలా ముగిసింది.

టేపురికార్డరు కొన్న రోజున, హడావుడిగా ఇంటికొచ్చి ఆబగా పిల్లల మాటలు వింటుండగా – బ్రిగెట్టీ వచ్చి తలుపు తట్టి పలకరించింది. పిల్లల మాటలు ఒకసారి తను కూడా విని వాళ్ల వయసులడిగి తెలుసుకుని, "మీ ఇండియన్సువి ఈడుకి మించిన తెలివితేటలు" అంది.

ఆ మాట హృదయంలోంచీ కాక, మాటవరసకి మర్యాదగా అన్నట్లు నాకు అనిపించింది.

వచ్చీ రాని నా జర్మన్ భాష ఆమెకు ఏమి వినోదాన్నిస్తోందో తెలియదు కానీ మర్నాడు మళ్లీ తన గదికి అహ్వానించింది. వెళ్లాను.

ఈసారి మాటల్లో తనే మాంసాహారం ప్రసక్తి తెచ్చి, "నువ్వు మాంసం తిననంటావు. తింటే తప్పేంటి?" అనడిగింది.

"మాంసాహారమైనా, శాకాహారమైనా ఎంతో కొంత హింస లేకుండా లభించదు. తరతమ భేదాలుంటాయంతే! ఉదాహరణకు – మనం జంతువుల్ని ఆహారంగా భావించి చంపి తింటున్నాం. మనకంటే బలమైన, తెలివైన రాక్షసజాతి ఒకటి ఉండి – రోజూ మనని వేటాడి తింటుంటే అప్పుడు మన మనఃస్థితి ఎలా ఉంటుంది? అలాంటి మనఃస్థితినే నేను జంతుజాలం విషయంలో ఊహించుకోవడంవల్ల – మాంసాహారం తినలేక పోతున్నాను. వృక్షాలక్కూడా ప్రాణం ఉన్నప్పటికీ, అవి ప్రాణమున్న జీవాలని నా ఊహకు అనిపించకపోవడంవల్ల, శాకాహారం తినగల్గుతున్నాను" అని చెప్పానామెకి.

మనుషులకంటే బలమైన, తెలివైన జాతి మనుషుల్ని తినడం ఆమె ఊహలోకి వచ్చినట్లుంది – బ్రిగెట్టీ కళ్లలో కొంచెం భయం కనబడింది. టాపిక్ మార్చి, "చీర కట్టుకోవాలనుంది. నువ్వు నేర్పగలవా?" అంది.

ముందు రాదన్నాను కానీ ఆమె ఒప్పుకోలేదు. నాకు చీర కట్టడం తెలిసే ఉండడానికి రకరకాల లాజిక్కులు తీసింది. "మీ దేశంలో ఆడవాళ్లందరూ చీర కట్టుకుంటున్నప్పుడు, మీ మగాళ్లకి కూడా ఎంతో కొంత తెలిసుండాలి. ఊహించైనా ప్రయత్నించు" అందామె.

"కానీ, ఇక్కడ చీరలు లేవే!" అన్నాను.

"చీరంటే ఉత్త గుడ్డే కదా! ఈ దుప్పటి పనికిరాదా?" అంటూ అక్కడ మంచంమీదున్న పెద్ద దుప్పటీని తీసింది. ఆ వెంటనే, "అమ్మో! ఇది ఏకంగా ఆరు మీటర్ల పైన ఉంది. దీన్ని కట్ చెయ్యడానికి ఫ్రో యాకేల్ ఒప్పుకుంటుందనుకోను" అని నిట్టూర్చింది.

నేను మాట్లాడలేదు. అంతలోనే ఆమె, "ఇంతకీ, చీరకి ఎంత గుడ్డ కావాలి?" అంది.

చెప్పక తప్పలేదు – ఆరేడు గజాలని.

ఆరేడు గజాలనగానే, ముందు అమ్మో అనుకున్నా, ఆ వెంటనే, "ఐతే ఇంకేం, ఈ దుప్పటినే నాకు చీరగా కట్టు" అందామె.

"కట్టడానికేం లేదు. చుట్టబెట్టుకోవడమే" అన్నాను.

"చుట్టబెట్టుకుంటాను కానీ, నువ్వెళ్లి నీ భార్య ఫొటో తీసుకునిరా" అంది ఇంచుమించి ఆజ్ఞాపిస్తున్నట్లు. ఆడవాళ్లు అంతే! తండ్రుల్నీ, అన్నల్నీ, భర్తల్నీ ఆజ్ఞాపించినట్లే – కాస్త పరిచయమైతే చాలు – స్నేహితుల్నీ ఆజ్ఞాపించగలరు.

నేను ఫొటో తీసుకొచ్చేసరికి – బ్రిగెట్టీ వంటికి దుప్పటిని చుట్టబెట్టుకుని ఉంది. ఆ దుప్పటినే కనుక చీర అనుకుంటే – చీరకట్టు ఇంత అసహ్యంగా ఉంటుందా అనిపించింది.

"ఎలా ఉంది?" అందామె. బాగుందన్నాను.

ఆమె తృప్తిపడలేదు. నేను తెచ్చిన ఫొటో అడిగి తీసుకుని చూస్తూ తల అడ్డంగా ఊపింది. నావంక గంభీరంగా చూస్తూ, "ఈ లుక్ రావాలి" అంటూ దుప్పటి విప్పి నాకు అందించింది.

దుప్పటి ఆమెకు చుట్టబెట్టి కుచ్చిళ్లు పెట్టాను. చాలా కుతూహలంగా గమనిస్తోందామె. కట్టడం అవగానే, "ఇంకా ఆ లుక్ రాలేదు" అంది.

"ఆ లుక్ రావాలంటే, పైన జాకెట్ ఉండాలి. పొట్ట భాగం కొంత కనబడాలి" అన్నాను.

నా నోటి మాట పూర్తవలేదు. ఆమె తన వంటిమీదున్న ఓవర్‌కోటు చటుక్కున విప్పేసింది. అప్పుడామె ఛాతీపైన బ్రా తప్పమరో ఆచ్ఛాదన లేదు.

బికినీతో ఆరుబయట మగాళ్లమధ్య తిరిగే సంప్రదాయంలో పుట్టి పెరిగిందామె. అందువల్లనేమో, ఆమెలో ఏ తడబాటూ లేదు.

నేను మాత్రం ఒక్క క్షణం తడబడ్డాను. అది స్పష్టంగా నా కళ్లలో కనబడిందేమో, ఆమె, "అయామ్ సారీ" అని ఓసారి నిట్టూర్చి మళ్లీ కోట్ వేసేసుకుంది.

ఆమె సారీ చెప్పడానికి కారణమైన నా ముఖభావాలు స్ఫురించడంవల్లనేమో నేను సిగ్గుపడి క్షణంపాటు తల దించుకున్నాను. సారీ చెప్పాలనిపించింది కానీ, చెప్పడంవల్ల అప్రయత్నంగా నా ముఖంలో వచ్చిన మార్పులని మనసుకి కూడా అంటగట్టడం సిగ్గుచేటు కదా, ఆమె సారీని స్వీకరించడమే ఆమెకూ నాకూ మర్యాద అనిపించి ఊరుకున్నాను.

ఇక మౌనం బాగుండదని చటుక్కున తలెత్తి ఆమెని చూశాను. నేనిన్ని ఆలోచనలకి గురయ్యాను కానీ, ఆమె చాలా మామూలుగా ఉంది. కళ్లు నిర్మలంగా ఉన్నాయి.

"నాకు చీర కట్టుకోవాలనుంది. ఇండియానుంచి నాకో చీర తెప్పించిపెట్టగలవా?" అందామె నవ్వుతూ.

నేనూ సద్దుకున్నాను. "మా దేశంలో కంటే బట్ట క్వాలిటీ మీ దేశంలోనే బాగుంటుంది. నైలెక్స్ కానీ, పోలీ ఎస్టర్ కానీ – చీరకు అయిదు మీటర్లూ, జాకెట్టుకి ఒక మీటరూ – మొత్తం ఆరు మీటర్లు తీసుకుంటే సరిపోతుంది" అన్నాను.

అయిదు మీటర్ల గుడ్డను వంటికి చుట్టబెట్టుకుని ధరించి భరించడమా – అని గుండెలు బాదుకుందామె.

తర్వాత మేము పలు విషయాలు మాట్లాడుకున్నాం. ఆమెకి తెలుగు మాటలు తనే చదవాలనుంది. అందుకని నాకు తోచిన మాట ఒకటి ఇంగ్లీషు అక్షరాల్లో వ్రాయమని కోరింది. ఆమె ఉత్సుకతకి ముచ్చటపడి, "నీ కళ్లు బాగుంటాయి" అని రాశాను.

ఆమె కూడబలుక్కుంటూ చదివింది. ఆమె ఉచ్చారణని సరి చేశాను. రెండుమూడు ప్రయత్నాల్లో ఆమె నోట తెలుగు తెలుగులాగే పలికితే మెచ్చుకున్నాను.

ఆమె ముఖంలో సంతోషం. "ఇంతకీ నువ్వేం రాశావ్? ఆ మాటకి అర్థమేమిటి?" అనడిగింది. చెప్పాను.

అప్పుడామె సంతోషం పట్టలేక తన కుడిచేతిని ఒకసారి పైకెత్తి విసిరినట్లుగా అరచేతిని కిందికి దింపింది. "నువ్వు మరీనూ? పోదూ" అనడానికి అక్కడివాళ్ల తనుభాష అది.

ఆ సంతోషం కలిగించిన నవ్వు ముఖంతోనే, తన దగ్గరున్న ఓ ఆల్బంలోంచి కొందరు అమ్మాయిల బొమ్మలు చూపించి, "నీకు నచ్చారా?" అనడిగింది.

ఇరవైకి అటూ ఇటూలో ఉన్నవారు. ఆడపిల్లలు. తెల్లపిల్లలు. ఆరోగ్యంతో మిసమిసలాడే వారిలో అందానికి తక్కువేముంటుంది?

"చాలా బాగున్నారు" అన్నాను. అక్కడికి అదేదో అందాల పోటీలో న్యాయనిర్ణేత తీర్పు విన్నట్లు ఆమె ముఖం వెలిగిపోయింది. అంతకుముందు నా మాటలు విని, నాకు ఇండియా అమ్మాయిలు తప్ప ఇంకెవరూ నచ్చరని ఆమె అనుకుని ఉండాలి.

తర్వాత ఆమె నాకు డ్యాన్స్ వచ్చా అనడిగింది. రాదని చెబితే ఆశ్చర్యపడింది. ఆమె ఆశ్చర్యానికి నేనూ ఆశ్చర్యపడి, "ఇష్టమైనవాళ్లు డ్యాన్స్ నేర్చుకుంటారు. లేనివాళ్లు లేదు. ఇందులో ఆశ్చర్యమేముంది?" అన్నాను.

"కానీ జర్మనీలో ప్రతి ఒక్కరికీ డ్యాన్స్వస్తుంది" అందామె.

"మీ డ్యాన్స్ఎలా ఉంటుంది?" అన్నాను కుతూహలంగా.

ఆమె వెంటనే ఉత్సాహంగా కొన్ని స్టెప్స్ వేసి చూపించింది.

ఆ స్టెప్స్ నాకు కొత్త కాదు. మన సినిమాల్లో, ముఖ్యంగా హిందీ సినిమాల్లో, హీరో హీరోయిన్స్ పార్టీల్లో వేసేవే అవి.

"డ్యాన్స్అంటే ఇదనుకోలేదు. సరదా ఉంటే ఇది నేర్చుకోవడం కష్టం కాదు. డ్యాన్సంటే నేను భరతనాట్యం అనుకున్నాను" అన్నాను.

"భరతనాట్యమంటే?" అందామె. నోటి మాటల్లో చెప్పడానికి ప్రయత్నించాను కానీ, ఆమె కొన్ని స్టెప్స్ వేసి చూపించమంది.

నేనడగ్గానే తను స్టెప్స్ వేసి చూపించింది. వచ్చినా రాకపోయినా, ఆమెకు కొంత ఐడియా ఇవ్వడం నా బాధ్యత.

నా జీవితంలో ఒక అపరిచిత యువతి ముందు నిలబడి భరత నాట్యభంగిమలు చూపిస్తానని కలలో కూడా అనుకోలేదు. అందులోనూ నాకు బొత్తిగా డ్యాన్స్ రాదు.

ప్రేక్షకుడిగా నేను చూసిన భంగిమల్లో అప్పటికి స్ఫురణకి వచ్చినవి కొన్ని చూపడానికి ప్రయత్నించానంతే!

శ్రీమతి చూస్తే ఈ నా ప్రయాస ఆమెకు గొప్ప వినోదంగా ఉండేది. బ్రిగెట్టీ ఆ భంగిమలను ఆశ్చర్యంగా గమనించి, "అలా డ్యాన్స్ చెయ్యడం ఎందుకు?" అనడిగింది.

అప్పటికి నాకు అర్థమైంది – ఆమెకీ నాకూ సంస్కృతిపరంగా ఉన్న భేదం.

నిత్యజీవితంలో యువతీయువకులు కలిసి నృత్యం చెయ్యడం భారత సంస్కృతి కాదనీ, అక్కడ నృత్యమన్నది కేవలం వినోద ప్రదర్శన మాత్రమేననీ, కొందరు కళాకారులు నృత్యకళకు తమ జీవితాల్ని అంకితం చేస్తారనీ చెప్పాను. అక్కడ కూడా నృత్య కళకారులు ఉన్నారు కాబట్టి ఆమెకు విషయం అర్థమైనట్లుంది.

ఆ మర్నాడు బ్రిగెట్టీ వెళ్లిపోయింది. వెళ్లేముందామె తనకి పెళ్లి నిశ్చయమైందని చెప్పి ఎంజేజిమెంట్ రింగు కూడా చూపించింది. నాదగ్గర వీడ్కోలు తీసుకుంటూ – తనకో చీర తెప్పించిపెట్టమని మరీ మరీ చెప్పింది. నేనామె విన్నపాన్ని యథాలాపంగా తీసుకున్నాను. కానీ ఆమె గురించి ఇతరంగా చాలా అలోచించాను.

భారత దేశంలో భార్యతో తప్ప మరే యువతితోనూ బ్రిగెట్టీతో అంత సన్నిహితంగా మసలలేదు నేను. నా ఈడు ఆడపిల్లలు కాస్త దగ్గరగా వచ్చి మాట్లాడితేనే ఏదోలా ఉండేది నాకక్కడ. అటువంటిది ఇక్కడ ఈమెతో గంటల తరబడి ఏకాంతంగా, సన్నిహితంగా మసిలాను. అయితే నా బుద్ధి పెడదారులు తొక్కలేదు. ఒక స్నేహితుడితో మాట్లాడుతున్నట్లే ఉంది తప్ప ఆమెలోని స్త్రీని నేను గుర్తించలేదు. ఆమె ముఖభావాలు చూస్తుంటే తనూ అలాగే ఫీలయిందనిపించింది. ఈ తేడాకి కారణమేమిటి?

మన సంస్కృతి స్త్రీలపట్ల కాంక్షనే తప్ప స్నేహభావాన్ని కలుగనివ్వదా? యువతీయువకుల మధ్య దూరాన్ని తగ్గించడం ద్వారా వారి మనసులు మరింత స్వచ్ఛంగా ఉండే అవకాశముందన్న విషయం నిజమా?

ఏదిఏమైనా బ్రిగెట్టీతో గడిచిన ఆ కొద్ది రోజులూ నాకు మరపురాని అనుభవం.

పిక్నిక్ పిక్నిక్ పిక్నిక్

చదువుకుందుకొచ్చినా మేము సందర్శకులం కూడా కదా! మేమక్కడ విహారయాత్రలూ చేశాం. కొన్ని పిక్నిక్స్ సంస్థ ఏర్పాటు చేస్తే, కొన్ని మాకు మేముగా వేసుకున్నవి.

ల్యూనబర్గు వచ్చిన ఇరవై రోజులకి, అంటే జూన్ 25న – గ్యోతే ఇన్స్టిట్యూట్ వారు – విద్యార్థులకోసం ఒక ఔస్ఫ్లూగ్(పిక్నిక్) ఏర్పాటు చేశారు. అందులో ఆయా విద్యార్థుల హౌస్ఫ్రౌలు (ల్యాండ్‌లేడీలు) కూడా పాల్గొనవలసి ఉంది. తనకి వీలు కుదరలేదని చెప్పి ఫ్రౌ యాకేల్ ఈ పిక్నిక్కి రాలేదు.

ఔస్ఫ్లూగ్‌కని మేమెక్కిన టూరిస్ట్ బస్సు అద్భుతంగా ఉంది. లోపలి సీట్ల అమరిక విమానంలో లాగా ఉంది. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పోతున్నా బస్సులో కదుపు గానీ, కుదుపు గానీ లేదు.

మా గమ్యం ఎల్బే నదీతీరం. మధ్యలో ఒక హోటల్ వద్ద ఆగేం. అక్కడ అందరికీ కేక్సు, ఐస్క్రీమ్ సెర్వ్ చేశారు. అవి తిని మళ్లీ బస్సెక్కి ఎల్బే నదీతీరంకి చేరుకున్నాం. అక్కడ మాకోసం ఒక స్టీమ్‌బోట్ సిద్ధంగా ఉంది. అందులో అంతా ఎక్కాం.

ప్రశాంతంగా వీచే చల్లని గాలి, చలి పుట్టిస్తోంది కానీ, ఆ చలిని ఆపడానికి వేసుకున్న స్వెటర్ సరిపోయింది.

ఎల్బే నది వెడల్పు తక్కువే. కానీ అది చాలా యూరప్ దేశాల్లోంచీ ప్రవహిస్తుందిట. నదికి ఈవలి ఒడ్డు పశ్చిమ జర్మనీ. ఆవలి ఒడ్డు తూర్పు జర్మనీ.

నదీవిహారం రెండు గంటల సేపు కొనసాగింది. బోటుమీద ఎంతోమంది ఆడ, మగ జంటలుగా విడిపోయి ఫొటోలు తీయించుకున్నారు. కొందరు బోటులో ఏర్పాటు చేసిన సంగీతానికి అనువుగా నర్తించారు. కొందరు హౌస్‌ఫ్రౌలు తామూ నాట్యం చేశారు. లావుగా ఉన్న ఒక హౌస్‌ఫ్రౌ చేసిన నృత్యం అందరికీ ఎక్కువ వినోదాన్నిచ్చింది. పెద్దా, చిన్నా అంతా కలిసిపోయి పసిపాపల్లా ప్రవర్తించడం హాయిగా అనిపించి, కాసేపు ఈ లోకాన్ని మర్చిపోగలిగాం. కానీ – పక్కన శ్రీమతి లేకపోవడం వెలితిగా అనిపించింది నాకు.

ల్యూనబర్గులో అంకుల్ విల్లీ అనే సమాజసేవకుడున్నాడు. ఆ ఊరొచ్చిన విదేశీయులకోసం ఆయన అప్పుడప్పుడు పిక్నిక్సు ఏర్పాటు చేస్తుంటాడు. ఆయన నిర్వహణలోనే జూన్ 28న మేము హనోఫర్ (హానోవర్) వెళ్లొచ్చాం. హనోఫర్ పశ్చిమ జర్మనీలో నీడర్‌శాక్సెన్ రాష్ట్రానికి రాజధాని. పరిమాణంలో పెద్ద నగరమే కానీ జనాభా మాత్రం ఐదు లక్షలు. అక్కడ తరచుగా ఇంటర్నేషనల్ ట్రేడ్‌ఫెయిర్ నిర్వహిస్తారు. దానికోసం శాశ్వతమైన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ఉంది. ఈ ఫెయిర్ విశ్వవిఖ్యాతం.

ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన రోడ్లు, ఎత్తైన భవంతులు, ఆకర్షణీయమైన బజార్లు ఉన్న ఆ నగరంలో జనసంచారం అంతంతమాత్రం. నగరానికి ప్రత్యేక ఆకర్షణ పూలతోటలు. వాటి అందం వర్ణనాతీతం.

తిరుగు ప్రయాణంలో ఇన్ఫర్మేషన్ అండ్ టూరిస్ట్ సెంటర్లో ఆగాం. అక్కడ దేశవిదేశాల యువతీ యువకుల కార్యక్రమాలౌతున్నాయి. ఫ్రీగా వైన్ పోస్తున్నారు. కోలా మాత్రం కొనుక్కోవాలి. పాటలు, నృత్యప్రదర్శనలు జరిగాయి. చూడ్డానికి కాలేజి స్థాయిలో ఉన్నాయి. అనేక దేసస్థులతోపాటు మన సర్దార్జీలు కూడా బాగా ఎక్కువ సంఖ్యలో కనిపించారక్కడ.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఏర్పాటు చేసిన మరో ఔస్‌ఫ్లూగ్‌లో జూలై 4న హ్యాంబుర్గ్ (హ్యాంబర్గ్) నగరానికి వెళ్లాం. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఓడరేవు అక్కడుంది.

ముందు మమ్మల్ని హార్బరుకి తీసుకెళ్లి స్టీంబోటుమీద చాలాసేపు విహారం చేయించారు. ఆ విహారంలో దేశదేశాల ఓడల్నీ, ఓడల్ని మరమ్మతు చేయడానికున్న సదుపాయాల్నీ చూశాం.

అక్కడ మాకు బంగ్లాదేశ్ ఓడ ఒకటి కనిపించింది. దూరదేశంలో ఉండడం వల్లనేమో, స్వదేశపు ఓడే అనిపించింది.

తర్వాత మమ్మల్ని సెయింట్ పౌలీ చర్చికి తీసుకెళ్లారు. అది బాగా పాతకాలపు చర్చి. చర్చి లోపల ఎలా ఉంటుందో చూడ్డం నాకదే మొదటిసారి.

ఆలయం కాబట్టి చర్చి పవిత్రమైనది. సెయింట్ పౌలీ పేరు కూడా పవిత్రంగా ధ్వనిస్తుంది. కానీ హాంబుర్గ్‌లో సెయింట్‌పౌలీ అనగానే పవిత్రభావం కలిగే అవకాశం తక్కువ. ఎందుకంటే అక్కడ సెయింట్‌పౌలీ అంటే స్ఫురించేది చర్చి కాదు. దానినానుకునే ఉన్న రీపర్‌బాన్ స్ట్రాసే (వీధి). ఆ వీధిలో మనిషికి తన కామతృష్ణ తీర్చుకునేందుకు ఉన్న వివిధ, విభిన్న మార్గాలు ప్రదర్శితమేకాదు, కావాలంటే అనుసరణకూ అక్కరకొస్తాయి. ఎంత ఆధునికమైనా, స్వేచ్ఛకి అవధులు లేకపోయినా – అలాంటి వీధులు ఏ దేశానికీ గర్వకారణం కాదనే అనుకోవాలి. ఎందుకంటే – చెప్పకతప్పదు కాబట్టి మొక్కుబడికి అన్నట్లు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఆ వీధిని మాకు హడావుడిగా చూపించేసి అయిందనిపించారు. ఐనా ఆ కాసేపటికే ఆ వీధి విశేషాలు మా అవగాహనకొచ్చి మాలో ఉత్సుకత రేపాయి. మరోసారి రాత్రి సమయంలో వచ్చి ఆ వీధి విశేషాలు తెలుసుకోవాలని నేను, నా మిత్రులు అనుకున్నాం.

మధ్యాహ్నం పన్నెండునుంచి సాయంత్రం ఆరు గంటలవరకూ మాకా ఊళ్లో ఆటవిడుపు. కాసేపు రైళ్లలో తిరిగాం. అంతకుముందు శర్మ తనకి హాంబుర్గ్ కొట్టిన పిండి అని చెప్పాడు. కానీ ఈ తిరగడంలో అతనికి హాంబుర్గ్ తెలియకపోవడమే కాదు, యూరప్‌లో బయట

తిరిగిన అనుభవం కూడా పెద్దగా లేదని బయటపడింది. వాన పడ్డం వల్ల తిరగడానికి కాస్త ఇబ్బందయింది. తర్వాత నేను, సుబ్రహ్మణ్యం, బిశ్వాస్, దేవదార్ ఒక జట్టుగా విడిపోయాం. కలకత్తా రెస్టారెంటుకి వెడదామన్నాడు బిశ్వాస్. దాని చిరునామా మాకు ల్యూనబర్గులోనే తెలిసింది. కానీ దారి తెలియక టాక్సీని ఆశ్రయించాం. అందుకైన ఐదు మార్కుల ఖర్చునీ నలుగురం సమంగా పంచుకున్నాం.

కలకత్తా రెస్టారెంటుని ఓ బెంగాలీ ఆసామీ నడుపుతున్నాడు. అతని భార్య జర్మన్ వనిత. అతను మమ్మల్ని చాలా ఆప్యాయంగా ఆదరించి భోజనం పెట్టాడు. అన్నం, ఉడికించిన పెసరపప్పు, పచ్చిమిర్చి ఊరగాయ, అప్పడం, పెరుగు – అదీ భోజనం. "హాయిగా చేత్తో కలుపుకుని తినండి" అని అతను ప్రోత్సహించాడు. బిల్లు ఒకొక్కరికి ఆరు మార్కుల ఎనబై ఫెన్నిగ్సు వేసినా – భోజనం తృప్తిని కలిగించింది. ఎటొచ్చీ పనివాళ్లు లేకుండా హొటలు నడుపుతున్నానని చిన్నతనమో ఏమో, అతను మాకు అడక్కుండానే డిగ్నిటీ ఆఫ్ లేబర్ మీద పెద్ద లెక్చర్ ఇచ్చాడు. అది బోరు కొట్టింది.

అక్కణ్ణించి బయల్దేరి కొన్ని షాపుల్లో విండోషాపింగ్‌తో ఆ యాత్ర ముగిసింది. సెయింట్ పౌలీ కోసం హాంబుర్గ్ మరోసారి చూడాలనుకున్నాం కానీ నిజంగా వెడతామనుకోలేదు.

ఒకరోజు నేను, దేవ్‌దార్, కొరియా, నటరాజన్ ఒకచోట కలిసినప్పుడు, మాటల సందర్భంలో, మా అంతట మేముగా ఓ ఔస్‌ఫ్లూగ్‌కి (పిక్నిక్) వెళ్లాలనుకున్నాం. బాగా ఆలోచించేక హాంబుర్గ్ స్ఫురించింది. ఆగస్ట్ 3న వెడదామనీ, ఈసారి బస్సులో కాకుండా ట్రయిన్లో వెడదామనీ అనుకున్నాం. ఆ రోజు ఎవరిళ్ల దగ్గర వాళ్లు బయల్దేరి రైల్వే స్టేషన్లో కలుసుకున్నాం. ట్రయిన్ 9.29కి బయల్దేరి, 10.35కల్లా మమ్మల్ని హాంబుర్గ్ చేర్చింది. కానీ, ఎందుకో లంకణాలబండిలా అనిపించింది.

సుబ్రహ్మణ్యం జర్మన్ లాంగ్వేజ్ కోర్స్ రెండు నెలలే. అతనిప్పుడు హాంబుర్గ్‌లో ఉంటున్నాడు. మేము హాంబుర్గ్‌లో దిగగానే ముందు వెళ్లి అతన్ని కలుసుకున్నాం.

అక్కడ ఏదో థియేటర్లో రాజేష్‌ఖన్నా సినిమా ఉన్నదట. సుబ్రహ్మణ్యం ఆ సినిమాకి వెడదామన్నాడు. ఇండియాలో చూసేవే కాబట్టి, ఇక్కడా హిందీ సినిమాలెందుకని ఆ ప్రపోజల్‌కి మిగతావాళ్లం ఒప్పుకోలేదు.

"ఈ ఊరి మొత్తానికి కేవలం వెజిటేరియన్ రెస్టారెంట్ఒకటుంది. దానికి వెడదామా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

గతంలో ఒకసారి కలకత్తా రెస్టారెంటుకి వెళ్లి ఉన్నాం. అక్కడ ఇండియన్ ఫుడ్ దొరుకుతుంది కానీ, వెజిటేరియన్‌తో పాటు నాన్‌వెజిటేరియన్ కూడా ఉంటుంది. జర్మన్స్ నడిపే వెజిటేరియన్ రెస్టారెంట్ఎలా ఉంటుందో చూద్దామనుకుని సరేనన్నాం.

రెస్టారెంట్ మేడమీద ఉంది. లోపల అడుగెట్టగానే ఒకతను, "డియర్ ఫ్రెండ్స్! ఇక్కడ మాంసాహారం ఏమాత్రం దొరకదు. లోపలికొచ్చేముందు ఆ విషయం దృష్టిలో ఉంచుకోండి" అన్నాడు. జంతుసంబంధమని అక్కడ పాలు కూడా సర్వ్ చెయ్యరట.

జర్మనీవంటి ఫక్తు మాంసాహార దేశంలో ఆ మాట వినిపించడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

మెనూ చూస్తే నాకు తెలిసినవి అన్నం, బంగాళాదుంపల వేపుడు. నటరాజన్‌కి తెలిసిన మరో వెజిటేరియన్ ఐటమ్ కార్టోఫెల్న్ (బంగాళా దుంపల) సలాడ్. అది చాలా బాగుంటుందని అతనంటే అదీ ఆర్డరిచ్చాం.

అబద్ధమెందుకూ – నాకా సలాడ్ నచ్చలేదు. నటరాజన్ నొచ్చుకుంటాడని బాగుందన్నాను. అన్నం, బంగాళాదుంపల వేపుడు ఫరవాలేదు. కానీ నాకు పులుపు, కారం లేకుండా ముద్ద దిగదు. అందువల్ల కొంచెం కష్టపడ్డాను. రెస్టారెంట్‌నుంచి బయటకొచ్చేక ఒక షాపుకెళ్లి పావు లీటరు పాలు, ఓ ఆపిల్ కొన్నాను. వాటితో నా కడుపు నిండింది.

మేము రోడ్లు పట్టుకుని తిరుగుతూ ఒకచోట రోడ్డు క్రాసింగ్దగ్గర ఆగాం. పరిసరాల్ని సునిశిత పరిశీలనలో నటరాజన్ దిట్ట. అతను నాకు ఓ యువజంటని చూపించి, "అటు చూడు. వాళ్లిద్దరూ రోడ్డు క్రాస్ చేస్తూ ముద్దు పెట్టుకోవడం కాయం" అన్నాడు.

అని ఊరుకోలేదు. సిగ్నల్ పడగానే తన కెమేరాతో సిద్ధంగా ఉన్నాడు. ఆ జంట రోడ్ క్రాస్ చేస్తూ నిజంగానే రోడ్డు మధ్యలో ఒకరినొకరు ముద్దుపెట్టుకుని అలాగే ముందుకు సాగిపోయారు. వాళ్ల ముద్దుముచ్చట నటరాజన్ కెమేరాలో రికార్డయింది.

అప్పుడు నటరాజన్అన్నాడు, "పదిమందిలో ముద్దు పెట్టుకోవడమే ఒక అడ్వెంచర్ అనుకుంటాం మనం. ఈ ఆరుబయట ముద్దుల్లో వీళ్లకి ఇంకా వేరే అడ్వెంచర్లుంటాయి. ఒకసారి ఓ అమ్మాయీ, ఓ అబ్బాయీ చెరో బైక్మీదా వెడుతూ ముద్దు పెట్టుకోవడం చూశాను" అని.

మేము నడుస్తూనే చాలా దూరం తిరిగి టెలివిజన్ టవర్ చేరుకున్నాం. జానపదాల్లో ఒంటి స్తంభం మేడల్ని స్ఫురణకు తెచ్చేలా ఉందా టవర్. ఎత్తైన ఆ టవర్ మధ్యలో ఒక రెస్టారెంటుంది. అది చేరుకుందుకు కిందనుంచి లిఫ్ట్ఉంది. అక్కడి రెస్టారెంటులంటే మాలో ఎవ్వరికీ పెద్దగా ఆసక్తి లేదు. మేమా టవర్ని బయట్నించే చూసి ముందుకు సాగిపోయాం.

అక్కడికి దగ్గర్లో మనోహరమైన వన మొకటుంది. మా టూరిస్ట్ గైడ్బుక్ ప్రకారం – ఆ వనంలో రాత్రి ఎనిమిది గంటల నలభైఐదు నిముషాలకి రంగుల జలయంత్రాల ప్రదర్శన ఉంటుంది. సరిగ్గా ఆ సమయానికి అక్కడికెళ్లాం.

అక్కడ టైమంటే టైమే మరి. సరిగ్గా ఎనిమిది గంటల నలభై ఐదు నిముషాలకి ఒక్కసారిగా ఓ సరస్సు లోంచి రంగురంగుల ఫౌంటెన్స్ పైకి లేచాయి. ఆ వెంటనే సంగీతం మొదలైంది. జలయంత్రాలు సంగీతానికి అనుగుణంగా నృత్యం మొదలెట్టాయి. ఆ ఫౌంటెన్స్ వింత మనుషుల్లాగానూ, అదో అద్భుత బృందనాట్యంగానూ అనిపించింది. చూస్తున్నప్పటి ఆ అనుభూతి మాటలకందదు.

మా మిత్రుల్లో ఒకరిద్దరు ఇండియాలో మైసూర్లోని బృందావన్ గార్డెన్స్లో ఇలాంటిది చూశారుట. కానీ సంగీతానికి అనుగుణంగా భంగిమలు మారుతూ, జలయంత్రాలు నృత్యం చెయ్యడాన్ని ఎక్కడా కనలేదు, వినలేదని వాళ్లన్నారు. మేము స్టిల్ కెమేరాతో ఫొటోలు తీసుకున్నాం కానీ అది మూవీ కెమేరాతో చిత్రించాల్సిన అపూర్వ దృశ్యం. చాలామంది అక్కడకు మూవీ కెమెరాలతో వచ్చారు.

ఆ అద్భుత ప్రదర్సన తొమ్మిదీ పది వరకూ కొనసాగింది. అక్కణ్ణించి లోకల్ ట్రయిన్లో ఎక్కి దగ్గర్లోనే ఉన్న సెయింట్ పౌలీకి వెళ్లాం.

బొంబాయిలో దాదర్లాగ – సెయింట్ పౌలీ లోకల్ రైల్వే స్టేషన్ పేరు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన రీపర్బాన్ స్ట్రాసే (వీధి) అక్కడికి దగ్గర్లోనే ఉంది. ఇదివరలో గ్యోతే ఇన్స్టిట్యూట్ వారు నామమాత్రంగా పగలు మాకది చూపించారు. కానీ పగలంతా మామూలుగా ఉండే ఆ వీధిలో సందడి మొదలయ్యేది రాత్రి అయ్యాకనే. టూరిస్టులకు గొప్ప ఆకర్షణగా చెప్పుకునే ఆ వీధిలో తొమ్మిది దాటేకనే హడావుడి మొదలౌతుంది. మొదలైన కొద్ది క్షణాల్లోనే వీధిలో రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. ఇంతకీ ఆ వీధి ప్రత్యేకత ఏమిటంటే – విశృంఖల శృంగార విహారం.

అక్కడ ఆగకుండా కొనసాగే సెక్స్ షోలున్నాయి. ఒక మార్కు నాణెం వేసి వ్యూయర్లో కన్ను పెట్టి చూస్తే కొద్ది నిముషాలపాటు నీలి చిత్రాలు చూపించే ఆటోమేట్లు (ఆటోమేటిక్ యంత్రాలు) ఉన్నాయి. వాటిపై మాకిప్పుడు పూర్వపు కుతూహలం లేదు కాబట్టి వివరాలు తెలుసుకుని ఊరుకున్నాం. తెరమీద బొమ్మలే కాకుండా స్టేజిమీద మనుషులే స్వయంగా మన కళ్లముందు రతిక్రీడని ప్రదర్శించే లైవ్ షోలున్నాయి. ఇవి కూడా నాన్స్టాప్. ఈ ప్రదర్శనల టికెట్ ముప్పై మార్కులనుంచి మొదలౌతుంది.

వీధికి పక్కన చాలా సందులున్నాయి. మేము కొన్ని సందుల్లో తిరిగి చూశాం.

ఓ సందులో విశాలమైన హాల్సు. హాలు గోడలకి, మన దేవాలయాల్ని మించిపోయేలా, రెచ్చగొట్టే పచ్చి శృంగారభంగిమలతో బొమ్మలు. హాల్లో అటూఇటూ గదులు. మధ్యలో బోలెడు స్తంభాలు. ప్రతి స్తంభాన్నీ ఆనుకుని ఓ యువతి నిలబడి ప్రియవిటునికోసం అభిసారికలా ఎదురుచూస్తోంది. దగ్గరకు వెళ్లి బేరమాడుకోవాలి. బేరం కుదిరితే ఆమెతో కలిసి పక్కనున్న గదిలోకి వెళ్లిపోయి కాసేపు కులాసాగా గడిపి వచ్చెయ్యొచ్చు.

ఓ సందులో ఒక హొటలుంది. అక్కడ సర్వింగ్ చేసేది అందమైన యువతులు. వాళ్లకి వంటిమీద నడుం కిందనే ఆచ్ఛాదన. పైన ఏ ఆచ్ఛాదనా లేదు. లోపలికెళ్లాలంటే ఏమైనా తినాలి, తాగాలి. కానీ బయట యాబై ఫెనిగ్సుకి దొరికే కోకాకోలా హొటల్లోపల రెండున్నర మార్కులు.

మేము లోపలకెళ్లలేదు. బయటే నిలబడి ఆ యువతుల అనాచ్ఛాద సౌందర్యాన్ని తిలకించాం. నిజం చెప్పాలంటే ఆ క్షణంలో ఆ యువతుల్ని చూస్తే నవ్వొచ్చింది తప్ప ఉద్రేకం పుట్టలేదు. ప్రేరణ విషయంలో జంతువుకీ మనిషికీ అదేనేమో తేడా. మనిషికి ఏకాంతం కావాలి.

మరో సందులో ఆడపిల్లలు అద్దాల షో కేసుల్లో ఉన్నారు. అద్దాని కివతలనుంచే ప్రేమబేరాలు. బేరం కుదిరితే, అద్దాల తలుపు తెరుచుకుంటుంది. ప్రియవిటుడు, అభిసారిక జంటగా లోపలి గదుల్లోకి వెడతారు. షో కేసులోకి మరో యువతి వస్తుంది.

ఆ వీధిలో పుస్తకాల షాపులు కూడా ఉన్నాయి. వాటిలో బొమ్మలు, కథలు, వార్తలు, విశేషాలు అన్నీ మహిళలకి సంబంధించినవే. ఐతే ఆ వీధి సంప్రదాయంలో ఆడదంటే మనిషి కాదు. కేవలం విలాసవస్తువు. అలాంటప్పుడు అక్కడ లభించే సాహిత్యం ఎలా ఉంటుందో, ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనక్కర్లేదు. మేమా పుస్తకాల జోలికి వెళ్లలేదు

www

మనిషికి ఎంతో పరువైన శృంగారమే అక్కడ విశృంఖలమైంది. ఇక వీధిలో తప్ప తాగినవారుంటారని వేరే చెప్పాలా?

రాత్రంతా ఆ వీధిలో ఒకటే సందడి. వచ్చినవారిలో యాత్రీకులే ఎక్కువ. వారిలో వివిధ దేశాల వారున్నారు. ఆశ్చర్యమేమిటంటే ఆ యాత్రీకుల్లో చిన్నపిల్లలున్నారు. టీనేజి ఆడపిల్లలున్నారు. చంటిపిల్లల్ని తోపుడుబళ్లలో ఉంచి, ఆ బళ్లను తోసుకుంటూ తిరుగుతున్న మాతృమూర్తులు కూడా ఉన్నారు.

న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి అనగల దేశంనుంచి వచ్చిన నాలో, అక్కడి విచ్చలవిడితనం ఏవగింపు కలిగించలేదు. జాతి, వర్ణ, లింగ భేదమెరుగని – ఆంక్షలు లేని ఆ స్వేచ్ఛ నన్ను అబ్బురపరచింది. మన దేశంలో ఇదే వీధి, ఇదే సదుపాయాలతో ఏ నగరంలోనైనా ఉంటే? పురుషలోకం ఇంత సమన్వయంగా వ్యవహరించగలదా? ఈ స్వేచ్ఛని నిరసించేవారు కూడా, ఆ స్వేచ్ఛ ఆ దేశపు ప్రగతికి ఏవిధంగానూ ప్రతిబంధకం కాలేదని ఒప్పుకోగలరు.

ఏదిఏమైనా ఆ రోజు హాంబుర్గ్ సందర్శనం మనసులో రేపిన అలజడి, జీవితకాలం వెంటాడేదే. కానీ సెప్టెంబర్ 1న అంకుల్ విల్లీ ఏర్పాటు చేసిన ల్యూనబర్గర్ హైడే యాత్ర పైదానికి పూర్తిగా భిన్నం.

ల్యూనబర్గర్ హైడే ల్యూనబర్గ్‌కి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ విశాలమైన మైదానముంది. దానిమీదకి మోటారు వాహనాలు అనుమతించరు. వీలైనంతవరకూ నడిచే చూడాలి. ఆగస్ట్‌లో వేసవి మొదలవగానే, ఆ మైదానమంతా పుష్పభరితమౌతుందిట. ఆగస్ట్–సెప్టెంబర్ మధ్యలో నేలంతా ఊదారంగు గడ్డిపూలతో నిండి, చూడ్డానికి ఊదారంగు తివాచీ పరిచినట్లుందట. అది చూడాలని మేమంతా చాలా కుతూహలపడ్డాం.

ఎందరో విదేశీయులతో పాటు పదిహేనుమందిమి భారతీయులం ఉన్నాం. బస్సు ల్యూనబర్గ్ మార్కెట్ సెంటర్నించి 9.30కి బయల్దేరి, 10.10కల్లా అక్కడకు చేర్చింది. దిగీ దిగగానే నడక మొదలు. నేను, నటరాజన్, రామచంద్ర, కొరియా, దేవ్‌దార్, తెలుగు జోసెఫ్ (కేరళనుంచి

వచ్చిన ఇంకో జోసెఫ్ ఉండడంవల్ల ఇతన్ని తెలుగు జోసెఫ్ అనేవాళ్లం. వీళ్లిద్దరూ ఇండియానుంచి ఓ క్రైస్తవసంస్థ పనుపున జర్మన్ భాష నేర్చుకుందుకు వచ్చారు. తెలుగు జోసెఫ్ఎ క్కువగా మాతో తిరిగేవాడు) ఒక జట్టుగా ఉన్నాం.

చిన్నప్పట్నించీ బాగా అలవాటేమో, నడక నాకు చాలా ఉత్సాహంగా అనిపించింది. ఎంత నడిచినా మైదానమే తప్ప ఇంకేం లేదు. ఆరంభంలో నేలమీద ఎండిన గరికగడ్డి లాంటి చిన్న చిన్న పొదలు తప్ప మరేమీ కనిపించక కొంత నిరుత్సాహం కలిగింది. కానీ విదేశంలో పేరుపడ్డ యాత్రాస్థలం. ఉత్తినే దేన్నీ వాళ్లు మెచ్చుకోరని నమ్మకం. అందుకని ఎక్కడైనా నేలమీద నాలుగైదు ఊదారంగు పూలు కనబడగానే ఆగిపోయి, "ఆహా, ఎంతబాగుందో" అనేవాళ్లం. కొంచెం ఫీలింగ్. కొంచెం జోకింగ్.

అలా ఒకసారి రామచంద్ర అన్నప్పుడు, మా పక్కనే ఉన్న ఓ జర్మన్ నడివయస్కుడు మమ్మల్ని చూసి జాలిపడి, "దీనికే ఇంత థ్రిల్లయిపోతున్నారు. మొత్తం నేలంతా ఊదారంగులో ఉంటే ఏమైపోయేవారో" అన్నాడు.

"అది లేకే ఇలా సద్దుకుపోతున్నాం" అన్నాడు నటరాజన్ హిందీలో. మేము నవ్వుకున్నాం.

అలా నడవగా నడవగా, నేలమీద పూల సంఖ్య పెరిగింది. టూరిస్ట్ గైడ్ పుస్తకంమీద గౌరవముంటే, ఊదారంగు తివాచీని ఊహించుకుని సరిపెట్టుకునేలాగే ఉంది. చాలా అందంగా ఉన్నట్లూ అనిపించింది. ఎంత దూరం నడిచామో కానీ చివరకు ఓ కొండ వస్తే పైకెక్కాం. దానిమీద ఓ పెద్ద రాతి పలకమీద – ప్రపంచ దేశాల ముఖ్యపట్టణాల పేర్లూ, అవి ఏ దిక్కులో ఎంత దూరంలో ఉన్నాయో సూచనా ఉన్నాయి. మాతో వస్తున్న ఓ బ్రిటిష్ అమ్మాయి జోన్స్అక్కడ ఆగి వివరాలు శ్రద్ధగా చదివి, వాటిలో పెకింగ్ పేరు కూడా ఉన్నదనీ, మా ల్యూనబర్గ్ అక్కడికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్నదనీ కనిపెట్టింది. బస్సు దిగినప్పట్నించీ వదలకుండా ఆమెనే అనుసరిస్తూ వస్తున్న ఓ అబ్బాయి వెంటనే, 'బ్రిటిష్అమ్మాయిల తెలివే తెలివి అని అభినందించాడు. ఆ పొగడ్త కూడా, ల్యూనబర్గర్ హైదేపై మా పొగడ్తలాగే ధ్వనించినా – ఆమె మాత్రం అభినందనగానే స్వీకరించి ఎంతో అందంగా సిగ్గుపడింది. అప్పుడు నేనోసారి చుట్టూ నేలని చూశాను. మా పొగడ్తలకు కలిగిన సిగ్గువల్లనేమో, నేలకూడా ఆ అమ్మాయంత అందంగానూ ఉంది.

ఆ క్షణంనుంచీ నా దృష్టి జోన్స్మీద పడింది. రంగు పక్కన పెడితే, నాకు భుజాలదాకా మాత్రమే వస్తున్న ఆమె అచ్చం ఇండియన్ అమ్మాయిలా అనిపించి పలకరించాను. ఆమె కూడా స్నేహపూర్వకంగా స్పందించింది.

ఓ కిలోమీటరు దూరం నడిచి ఓ మ్యూజియం చూశాం. దానికి టికెట్ 30 ఫెనిగ్స్. లోపల పాత కాలపు కుర్చీలు, బల్లలు, గిన్నెలు వగైరాలున్నాయి. కొన్ని క్రీస్తుకి శతాబ్దాల క్రితంవని కూడా రాసుంది. స్వతహాగా నాకు మ్యూజియాలంటే భయం. లోపల నా నడక పరుగులా మారింది. నా మిత్రులు టికెట్ డబ్బుకి న్యాయం చెయ్యాలనుకున్నారో, వాళ్లకి నిజంగానే ఆసక్తిగా ఉందో మరి – నేను వారికంటే చాలా ముందొచ్చేశాను.

ఒంటరినయ్యేనా అనుకున్నాను కానీ, నా పక్కన జోన్స్ కనబడింది. మేమిద్దరం కాసేపు మాట్లాడుకున్నాం.

ఆమె అసలుసిసలు బ్రిటిష్అమ్మాయి. మాటల్లో ప్రపంచాధినేతలమన్న రాజసముంది. ఇండియన్ని ఐనా నన్ను బానిసలా చూడకపోవడం నా అదృష్టం. వెంటబడి తనని ఇంప్రెస్ చెయ్యాలనుకునే అబ్బాయిలంటే ఆమెకి ఏవగింపు ఉన్నట్లుంది. ఆ విషయమై నేను విభిన్నమని మెచ్చుకుంది. ఆ మెప్పు యథాలాపంగా ఉంది. ఇంగ్లీషు ప్రసక్తి వచ్చి, జర్మన్లు ఇంగ్లీషు మాట్లాడినా అర్థం చేసుకుందుకు కష్టపడాలంది.

"ఇండియాలో ఉన్నతవిద్య అంతా ఇంగ్లీషులోనే ఉంటుంది. మాకు అన్ని దేశాలవారి ఇంగ్లీషూ బాగానే అర్థమౌతుంది. ఒక్క అమెరికన్ ఇంగ్లీషు విషయంలోనే కాస్త ఇబ్బంది. రేడియోలో వాయిస్ ఆఫ్ ఆమెరికా ఫాలో అవగలం కానీ, బయట అమెరికన్స్ మాట్లాడితే అర్థం చేసుకుందుకు కష్టపడాలి" అన్నాను.

"మరి నా ఇంగ్లీషు?" అందామె వెంటనే. అప్పుడామె ముఖంలో పసితనం కనిపించింది.

"నీ ఇంగ్లీషు స్పష్టంగా అర్థమౌతుంది. మరి నా ఇంగ్లీషు?" అన్నాను తనే అవకాశం ఇచ్చింది కదా అని.

"కొంచెం కష్టపడాలి. కానీ ఫరవాలేదు" అంది, నిజం చెప్పడానికి కొంచెం ఇబ్బంది పడుతున్నట్లు.

తర్వాత టాపిక్ ల్యూనబర్గర్ హైడే మీదకి మళ్లింది. ఆమె కూడా నాకులాగే అనుకుంటోంది.

"కొన్ని ప్రదేశాలు చూసి ఆనందించాలి. ఇది విని ఆనందించాల్సిన ప్రదేశం" అన్నాను. ఆమె ముందు చిన్నగా నవ్వింది. తర్వాత ఆగకుండా నవ్వింది. ఆమె అలా నవ్వుతుండగా, మా మిత్రులు వచ్చారు. ఆ నవ్వు చూసి అప్రయత్నంగా నాకు కన్ను గీటారు. ఏమిటి – వ్యవహారమన్నట్లు!

ఆమె నవ్వు ఆగిపోయింది.

"ఇందుకా, నువ్వు హడావుడిగా వెళ్లిపోయావ్!" అన్నాడు కొరియా నన్ను కొంటెగా చూస్తూ.

నాకు ఇబ్బందిగా అనిపించింది. మాది ఇండియన్ కల్చర్. అదిక్కడ బయటపడ్డం నాకిష్టం లేదు. "లోపల ఏం చూశారో చెప్పండి. నేనేం మిస్సయ్యానో తెలుసుకుంటాను" అన్నాను మాట మార్చుతూ.

"నువ్వేం మిస్ కాలేదు. మేమే మిస్సయ్యాం" అన్నాడు నటరాజన్ నర్మగర్భంగా.

జోన్స్‌కి మా సంభాషణ అర్థం కాలేదు. నావంక ప్రశ్నార్థకంగా చూసింది. "చూడాల్సినవి చాలా ఉన్నాయిట. మిస్సయ్యానంటున్నారు" అన్నాను.

"మళ్లీ లోపలికెడదామా?" అందామె ఉత్సాహంగా.

"కొన్ని వినే ఆనందించాలి. ల్యూనబర్గ్ వెళ్లేక వాళ్లని అడిగి వింటాన్లే" అని ఆమెను వదిలి మిత్రబృదంతో కలిశాను.

అక్కణ్ణించి ఓ కిలోమీటర్ దూరంలో టోటెన్ గ్రుండ్‌ఉంది. చూడ్డానికేం లేదు. మేము కూడా తెచ్చుకున్నవి తినడానికి సిద్ధపడుతున్నాం. అంతలో గెసుండ్ గుప్తా వచ్చి మాతో కలిసాడు. తను ఏం తెచ్చుకోలేదుట. ఎవరో ఒకరు తెచ్చుకోకపోరు, వాళ్లతో కలవొచ్చులే అనుకున్నాట్ట. అతను అనుకున్నట్లే జరిగింది. అంతా కలిసి సరదాగా తిన్నాం. రామచంద్ర తెచ్చిన ఉప్మా ఉఫ్ అని ఊదేసేలా ఉంది. దేవదార్ రవ్వతో సత్యనారాయణ ప్రసాదం లాంటిది అంత బాగానూ చేసి తెచ్చాడు. ఇంకా అన్నం ప్యాకెట్లు, పెరుగు, చిప్సు. గుప్తా కారణంగా తెచ్చుకున్నవి పూర్తిగా సరిపోలేదు. కానీ ఎవరూ అందుకు విచారించలేదు. ముందుగా చెప్పిఉంటే కాస్త ఎక్కువ తెచ్చేవాళ్లమని దేవ్‌దార్‌అనుకున్నాడు. విచిత్రమేమిటంటే, కూడా ఏం తెచ్చుకోకుండా తనలా మాతో కలిసినందుకు గుప్తా మొహమాటంతో కొంచెం సిగ్గుపడ్డాడు. అది పోగొట్టడానికి మేమందరం మనస్ఫూర్తిగా ప్రయత్నించాం.

ఆ తర్వాత మళ్లీ నడక. ఈసారి కాస్త పెద్ద పెద్ద తివాచీలే కనిపించాయి. వాన్నింటినీ కలిపి ఒకే తివాచీగా ఊహించుకుంటే, ఓహ్, అనిపించింది. ఇంకా అక్కడ రకరకాల పూలు కూడా కనిపించాయి. ఎగతాళి భావన లేకుండా, ప్రకృతి సౌందర్యం కనులవిందు చేస్తూ, మేను పులకరింపజేసింది. మాతో వచ్చిన కొందరు పూలు కోసుకున్నారు. అది చూసి నిర్వాహకులు, పూలు కొయ్యడంలో పోటీ పెట్టారు. జోన్స్

అందులో చాలా ఉత్సాహంగా పాల్గొంది. పొటీలో నెగ్గిన నలుగురిలో ఆమె కూడా ఉండడం నాకెంతో సంతోషం కలిగించింది. ఆటలో అసమదీయులు నెగ్గాలనుకోవడం సహజం కదా!

రోజంతా వాన లేకుండా ఎండ కాయడం, ఆ ఎండ కూడా వంటికి ఆహ్లాదంగానూ, ఫొటోగ్రఫీకి అనుకూలంగానూ ఉండడం ఆ రోజు విశేషం. సాయంత్రం 5.15కి మళ్లీ బస్సెక్కి 6 కాకుండా ల్యూనబర్గ్ చేరుకున్నాం. ఇల్లు చేరేసరికి యాకేల్‌కి బిపి కాస్త పెరిగిందని తెలిసి నొచ్చుకున్నాను. ఆమె మాత్రం ప్రయాణమెలా జరిగిందని అడిగి తినమని కేక్‌ఇచ్చింది. కేక్‌ఎలా ఉన్నా ఆమె ఆప్యాయతని ఆస్వాదించాను. ఆశ్చర్యమేమిటంటే, రోజంతా నడుస్తూనే ఉన్నా ఏమాత్రం అలసట అనిపించలేదు.

ల్యూనబర్గులో మా చివరి పిక్నిక్ సెప్టెంబర్ 19న ల్యూబెక్‌కి వేసుకున్నాం. ఆ రోజు వినాయకచవితి. భక్తి విషయమెలాగున్నా సంప్రదాయంలో అలవాటుగా ఆ రోజునైనా లేచీ లేవగానే స్నానం చెయ్యాలనుకున్నాను. కానీ ఇంట్లో ఆ సదుపాయం లేదు. ల్యూబెక్ చేరేక అక్కడ స్నానం చేద్దామని రామచంద్ర ముందురోజే చెప్పాడు. అంతవరకూ ఏమీ తినకూడదనే ఉద్దేశ్యంతో బ్రేక్‌ఫాస్ట్ చెయ్యలేదు. లేచి త్వరగా తెమిలి 6.30కల్లా ఇన్‌స్టిట్యూట్ చేరుకున్నాను. అక్కడ నాలుగు బస్సులున్నాయి. మూడు ల్యూబెక్‌కీ, ఒకటి బ్రెమెన్‌కీ వెడతాయట. అక్కడ అంకుల్ విల్లీ కనిపించి తను బ్రెమెన్ వెడుతున్నానని చెప్పాడు. మా బస్సు 6.45కి బయల్దేరింది. ఓ గంట ప్రయాణం తర్వాత రోజన్‌బర్గ్ చేరాం. అక్కడో అరగంట హాల్ట్. చూడ్డానికేం లేక బోరనిపించింది. ల్యూబెక్ చేరుకున్నాక, ముందు ఒక చర్చి దగ్గర ఆపారు. నాకైతే శిల్పకళ కోసమైతే తప్ప మామూలుగా ఆలయాలు సందర్శించే ఆసక్తి లేదు. మళ్లీ మళ్లీ చర్చిలు ఏం చూస్తామని నేనంటే మావాళ్లు చాలామంది ఆగిపోయారు. ఈలోగా ఒకతను వచ్చి మాకు ఫ్రీగా బోలెడు బుక్స్, ఫైల్సు ఇచ్చాడు. అందరికీ పంచిపెట్టాం. వాటిని చర్చి చూసి వచ్చిన వాళ్లకు కూడా పంచాం. వినాయకచవితి కదా, స్నానంకోసం మనసు పీకుతోంది. అందుకని ముందు స్నానశాలకు వెళ్లాం. తీరా చూస్తే అది మధ్యాహ్నం ఒంటిగంటకు కానీ తెరవరని తెలిసింది. అప్పటికి టైం పది దాటింది. ఆకలేస్తోంది కడుపులో ఏదైనా పడాలంటారు నటరాజన్, కొరియాలు. "అందాకా ఏ చిప్సయినా, బ్రెడ్డయినా కొనుక్కు తినండి. మనం తెచ్చుకున్న భోజనం మాత్రం స్నానం చేశాకనే" అని రామచంద్ర తేల్చి చెప్పేశాడు. దేవుడంటే భక్తికంటే భయమే ఎక్కువ కదా – నేను, రామచంద్ర ఒంటిగంట దాకా ఏమీ తినమనేసరికి – నటరాజన్, కొరియాలు కూడా ఏమైనా తినడానికి వెనుకాడారు. ఆలోగా ఊరు చూద్దామనుకున్నాం.

"పెద్దగా చూసేదేముంది? అన్ని ఊళ్లూ ఒక్కలాగే ఉన్నాయ్. కలిసి రోడ్లమీద తిరుగుదాం. నదురుగా కనిపించిన చోట ఆగి ఫొటోలు తీసుకుందాం. ఎవరైనా అడిగితే ల్యూబెక్ ఫొటోలు అని చెప్పుకోవచ్చు" అన్నాడు నటరాజన్. అంతా ఏకీభవించాం. కాసేపు ఊళ్లో అక్కడా ఇక్కడా తిరిగి ఫొటోలు తీసుకున్నాం. దేవదార్‌కి కెమేరాలో రీలైపోయింది. వాకబు చేసి ఓ ఫొటో షాపుకి వెళ్లాం. అక్కడ అతను రీలు కొన్నాడు. సేల్స్‌గర్ల్ వస్త్రధారణ జయమాలిని, జ్యోతిలక్ష్మిల తరహాలో ఉంది. ఆమె నడుస్తుంటే మాకు వాళ్ల నృత్యం చూసినట్లే అనిపించి వినోదించాం.

"మన దేశంలో క్లబ్బుడ్యాన్సులు చూడొచ్చని సినిమాలకెడతాం కానీ, ఇక్కడ ఏ షాపుకెళ్లినా క్లబ్బుడ్యాన్సులే" అన్నాడు కొరియా. అలా కాసేపు తిరిగి టైం ఒంటిగంట కాగానే స్నానశాలకు వెళ్లి స్నానాలు చేసొచ్చాం. అందుకు మనిషికి ఒక మార్కు, నలబై ఫెనిగ్సు ఐనా, వేణ్ణీళ్ల సదుపాయం బాగుండి చాలా హాయిగా అనిపించింది. తర్వాత భోజనానికి పార్కుకి వెళ్లాం. వాళ్లవాళ్ల అభిరుచుల్నిబట్టి భోజనాలదగ్గర ఇండియన్సులో ఎవరి జట్టు వారిది. మా జట్టులో ఐదుగురం. అన్నం పొట్లాలు, చిప్సు, పెరుగు తెచ్చుకున్నాం తినడానికి. అన్నంలోకి వంకాయ, సిమ్లామిర్చి (అక్కడ పాప్రికా అంటారు) కూర చేసి తెచ్చాడు రామచంద్ర. ఎలా చేశాడో కానీ అది ఊరగాయకన్నా రుచిగా ఉంది. మూడు పెద్ద పెద్ద సీసాల కూరని మేము ఇట్టే ఊదేశాం. నేనైతే కూర అన్నం, పెరుగన్నం తప్ప – చిప్సు ముట్టలేదు. అంతా రామచంద్రని తెగ పొగిడారు. అదీ మనస్ఫూర్తిగా, కృతజ్ఞతతో.

అక్కడ రోజంతా చలిగానే ఉంది కానీ ఓవర్‌కోటు వేసుకుంటే స్వెటర్‌వల్ల ఉక్కబోస్తోంది.

రెండున్నరకి, బస్సులో ట్రావేమ్యుండేకి (టూరిస్ట్ గైడ్) వెళ్లాం. అక్కడ బిశ్వాస్ మమ్మల్ని, "ఈ చలి దేశంలో స్నానాలేమిటి?" అని ఎగతాళి చేశాడు.

"ఆ విషయం ఇక్కడ స్నానశాలలు ఏర్పాటు చేసిన ఈ దేశస్థుల్ని అడుగు" అన్నాను.

అక్కణ్ణించి ఇండియన్సు మళ్లీ జట్లు జట్లుగా విడిపోయాం. మేము బీచ్‌కి వెళ్లాం. ఆ బీచ్ గురించి అంతకుముందే వెళ్లి చూసొచ్చిన కొందరు ఇండియన్సు ఓ వింత విషయం చెప్పారు. అక్కడ ఆడా మగా కూడా నగ్నంగా విహరిస్తారుట. ఐతే దుస్తులు ధరించినవాళ్లెవరైనా దగ్గరగా వస్తే, చటుక్కున నేలమీదకు వాలి బోర్లా పడుకుంటారుట. అదేమి సిగ్గో మరి! వాళ్ల నగ్నవిహారంకంటే అలా బోర్లాపడ్డమే ఎక్కువ ఆశ్చర్యాన్ని కలిగించిందని వాళ్లన్నారు.

ఆ రోజు మాకక్కడ అలాంటి దృశ్యాలేమీ ఎదురవలేదు. బీచి ప్రశాంతంగా ఉంది. కెరటాలు ఇంచుమించు లేవు. స్నానానికి ఆహ్వానిస్తున్నట్లుంది. అక్కడ నేను, రామచంద్ర, తెలుగు జోసెఫ్‌లు కలిసి తిరిగాం. ఆ తర్వాత చెప్పుకోతగ్గ విశేషాలేం లేవు. తిరిగి ల్యూనబర్గు చేరుకునేసరికి 7 అయింది.

క్రీడాస్ఫూర్తి

1955లో వచ్చిన మిస్సమ్మ సినిమాలో నందమూరి తారక రామారావుది, నిరుద్యోగిగా దినపత్రిక కూడా కొనుక్కోలేని దశలో ఉన్న పాత్ర. కిళ్లీకొట్టు దగ్గర ఓ యువకుడు కొనుక్కున్న పత్రికకేసి రామారావు ఆబగా చూస్తాడు. "ఓహ్, వాంటెడ్ కాలమ్సా?" అని ఈసడించి ఆ పేజీని అతడికిస్తాడు యువకుడు. అది తీసుకున్న రామారావు, "చదువుకునే రోజుల్లో నేనూ మొట్టమొదట స్పోర్ట్స్ కాలమే చూసేవాణ్ణి బ్రదర్" అని నిట్టూరుస్తాడు.

ఆ మాట, ఆ దృశ్యం నన్నెప్పుడూ వెంటాడుతూనే ఉంటాయి. ఐతే చదువుకునే రోజుల్లోనే కాదు, నిరుద్యోగిగా ఉన్నప్పుడూ, ఆ తర్వాత కుటుంబ బాధ్యతలతో తలమునకలౌతున్నప్పుడూ, ఇప్పటికీ కూడా నేను దినపత్రిక రాగానే ముందు చూసేది స్పోర్ట్స్ కాలమే. ఆటలంటే అంత ఆసక్తి నాకు. ఆడింది చాలా తక్కువైనా, ఇష్టమైన ఆటల విశేషాల్ని క్రమం తప్పకుండా ఫాలో ఔతాను. నాకిష్టమైన ఆటల్లో అగ్రస్థానం క్రికెట్‌ది. తర్వాతది టెన్నిస్. ఆతర్వాత హాకీ, చదరంగం, బ్యాడ్మింటన్ వగైరాలు. బొత్తిగా ఆసక్తి లేని ఆట ఫుట్‌బాల్.

నేను స్కూల్లో ఎస్ఎస్ఎల్సి చదువుతుండగా, స్కూల్లో ఫుట్‌బాల్ పోటీలయ్యాయి. ఒక జట్టు వారికి ఓ మెంబరు తక్కువై బలవంతాన నన్ను టీములోకి తీసుకున్నారు. పోటీలో మా టీముకి చాలా బలమైన జట్టుతో పడింది. ఐనా మావాళ్లు అసమాన ప్రతిభతో హోరాహోరీగా పోరాడి, ఇంచుమించు చివరిదాకా అవతలి జట్టుని ఒక్క గోలు కూడా చెయ్యనివ్వలేదు. ఆట ఐదు నిముషాల్లో ముగుస్తుందనగా, అవతలి జట్టు ఫార్వర్డు, శరవేగంతో ముందుకు దూసుకొచ్చాడు. అతగాడు గోలు కొట్టేస్తాడేమోనన్న భయంతో నేను గోలు ముందు ఆ బంతిని చటుక్కున చేత్తో పట్టుకుని ఆపాను. రిఫరీ పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చాడు. వాళ్లు గోల్ చేశారు. ఆ తర్వాత కొద్ది నిముషాల్లోనూ వాళ్లు మరో మూడు గోల్సు చేశారు. మా జట్టులోని ఒకతను 'అరచేత్తో ఫుట్‌బాల్' అంటూ ఆ విషయమై నన్ను కనీసం ఏడాదిపాటు ఏడిపించాడు. మా జట్టు పరాజయానికి పూర్తి బాధ్యత నాదేనన్న అపరాధభావమూ నాలో ఉంది. ఈ చేదు అనుభవం ఆ ఆటపై నాకు విరక్తిని పెంచిందేమో తెలియదు. ఆపైన ఆరేళ్లకి ఆంధ్రా యూనివర్సిటీలో అంతర్విశ్వవిద్యాలయ క్రీడల పోటీలు జరిగినప్పుడు – ఫుట్‌బాల్ ఆటగాళ్ల ప్రదర్శన అద్భుతమై అలరించినా కూడా – ఆ ఆసక్తి తాత్కాలికమైపోయింది.

నాకిష్టమైన ఆటల విశేషాల్ని పేపర్లో వార్తల ద్వారా ఫాలో అయ్యేవాణ్ణి. వీలున్నప్పుడు రేడియోలో కామెంటరీ వినేవాణ్ణి. ఆ ఆటల గురించిన ముఖ్య విశేషాలేమైనా డాక్యుమెంటరీగా వచ్చాయంటే – కేవలం అవి చూడ్డానికే సినిమా థియేటరుకి వెళ్లేవాణ్ణి. అలాంటప్పుడు థియేటర్లో ఏ సినిమా ఆడుతున్నదీ అన్నది ప్రధానం కాదు.

జర్మనీలో క్రికెట్ కామెంటరీ రాదు. క్రికెట్ వార్తలు తెలుసుకుందుకు బిబిసి రేడియోలో స్పోర్ట్స్ న్యూస్ వినేవాణ్ణి. ఐతే అక్కడ నేనుండగా ఇండియా ఇంగ్లండ్‌మీద 0–3తో టెస్టు మ్యాచిలు ఓడిపోవడమే కాక, ఒక మ్యాచిలో 42 పరుగుల అతి తక్కువ స్కోరు చెయ్యడం బాధనిపించింది. హాకీలో ఆసియా క్రీడల్లో ఇండియా పాకిస్తాన్‌మీద 0–2తో ఓడిపోవడం కూడా అసంతృప్తిని కలిగించింది. ఐతే టెన్నిస్‌లో నా అభిమాన ఆటగాళ్లు జిమ్మీ కోనర్స్(పురుషుల విభాగం), క్రిస్ ఎవర్ట్(మహిళల విభాగం) వింబుల్డన్ ఛాంప్పియన్స్ కావడం కొంత సంతోషాన్నిచ్చింది. కానీ నేనూహించని విధంగా వీటన్నింటినీ మించిన ఫుట్‌బాల్ ఆకర్షణ – ల్యూనబర్గులో స్వానుభవమైంది.

నాలుగేళ్లకొకసారి ఫుట్‌బాల్లో ప్రపంచకప్ పోటీలు జరుగుతాయని నాకప్పుడే తెలిసింది. ఆ ఏడాది ప్రపంచకప్ పోటీలకు జర్మనీ వేదిక కావడం విశేషం. అసలు టివియే ఎరుగని నాకు ఆ పోటీల్ని కలర్ టెలివిజన్లో ప్రత్యక్షప్రసారంగా చూసే అవకాశం కలగడం మాటలకందని అనుభూతి.

అంరవరకూ అంతగా పట్టించుకోని ఫుట్‌బాల్ ఆటలో, ఉన్నట్లుండి ప్రపంచస్థాయిలో మేటి ఆటగాళ్ల ప్రదర్శన చూడ్డం గొప్ప అనుభవం. జర్మన్లకి ఫుట్‌బాల్ ఆటపై ఉన్న అమితాసక్తి నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. జూన్ 13నుంచి జూలై 7 వరకూ16 దేశాల మధ్య జరిగిన ఆ పోటీల్లో పశ్చిమజర్మనీది అద్భుతమైన ప్రదర్శన. పశ్చిమ జర్మనీ కెప్టెన్ బెకెన్‌బోవర్, జర్మనీ ఆటగాళ్లలో మ్యుల్లర్ – వీళ్ల పేర్లు జనం నోట ప్రతిరోజూ నానుతూండేవి. పరిసరాల ప్రభావమేమో, ఈ పోటీలు చూస్తుండగా నాలోనూ జర్మన్లకి తీసిపోని ఆసక్తి పుట్టింది.

ఆ పోటీలో తూర్పు, పశ్చిమ జర్మనీలు పరస్పరం తలపడ్డం ఒకే ఒక్కసారి జరిగింది. అందులో తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీని 1–0 గోల్సుతో ఓడించినప్పుడు పశ్చిమ జర్మనీ దేశం యావత్తూ దిగ్భ్రాంతికి గురి కావడం గ్రహించాను. అది ఇండియా, పాకిస్తాన్‌లాంటి దాయాదుల పోరు కాదు. పశ్చిమజర్మనీ పౌరులకు, తూర్పుజర్మన్లు తమ అనుంగు సోదరులన్న భావన ఉండేది. కమ్యూనిజం వల్ల వారికి స్వేచ్ఛ లేకుండా పోయిందన్న బాధ కూడా ఉండేది. మనసులో వారా పోటీని – కమ్యూనిజానికీ, కాపిటలిజానికీ జరిగిన పోటీగా తీసుకున్నారు. అదే వారి అసంతృప్తికి కారణం.

వరల్డ్‌కప్ పోటీలు చూడ్డానికి ఫ్రౌ యాకేల్ నన్ను తన ఇంటికి ఆహ్వానించేది. వీలైనప్పుడల్లా చూసేవాణ్ణి కానీ, ఫైనల్ మాత్రం అక్కడ చూడలేదు.

ఆ రోజు జూలై 7, ఆదివారం. సెలవు రోజు కావడంవల్ల నేనా రోజు ఉదయం పదింటికి ఇంట్లో బయల్దేరి రామచంద్ర ఇంటికి వెళ్లాను. నాతోపాటు అక్కడికి నటరాజన్, సుబ్రహ్మణ్యం, దేవదార్ వచ్చారు. రామచంద్ర అందరికోసం సాంబారన్నం వండిన తీరు ఆసక్తికరంగా గమనించాను. అతను క్యాబేజి, ముల్లంగి, మసూర్‌దాల్, బియ్యం, కొబ్బరి – అన్నీ కలిపి ఉడకబెట్టి అందులో కొంచెం వెన్న వేసి చివర్లో నిమ్మకాయరసం పిండాడు. మేమంతా భోజనం చేస్తూ చాలా కబుర్లు చెప్పుకున్నాం. నేను మాత్రం మాటిమాటికీ టైం చూసుకుంటున్నాను. 4కి ఫుట్‌బాల్లో ఫైనల్స్‌లో జర్మనీ, హాలండ్ దేశాలు తలపడనున్నాయి. రామచంద్రకి ఆటల గురించి మాట్లాడ్డంలో ఉన్న ఆసక్తి చూడ్డంలో లేదు. అతను కాసేపు కూర్చుని వెళ్లమని అందర్నీ నొక్కిస్తున్నాడు. టైం 3 దాటగానే నేను లేచాను. మిగతావాళ్లూ లేస్తుండగా, రామచంద్ర కాఫీ ఆఫర్ చేశాడు. సుబ్రహ్మణ్యానికి కాఫీ బలహీనత. దాంతో మేము బయల్దేరేసరికి పావుతక్కువ నాలుగయింది. ఆదరాబాదరాగా అమ్‌శాండే దగ్గర మార్కెట్ సెంటర్ చేరుకున్నాం. అక్కడ బిశ్వాస్ ఎదురై, మార్కెట్ పూర్తిగా మూసేశారనీ, ఎక్కడా టివి

లేదనీ అన్నాడు. చేసేది లేక దగ్గర్లోనే ఉన్న గోతే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లాం. అదృష్టం కొద్దీ అక్కడ బ్లాక్ అండ్ వైట్‌దయితేనేం టివి ఉంది. ఇక్కడ చూడాలని రాసిపెట్టుంది అనుకుంటూ మేము ఆట చూశాం. జర్మనీ చేసిన ఫౌల్ వల్ల ఆట ఇలా మొదలవగానే అలా మొదటి గోల్ చేసింది హాలండ్. అప్పుడక్కడ హాహాకారాలు చేసినవారిలో మేమూ ఉన్నాం. ఆ తర్వాత కాసేపటికి, పెనాల్టీ ద్వారానే జర్మనీ ఓ గోల్ చేస్తే – తేలికగా నిట్టూర్చినవాళ్లలోనూ మేమున్నాం. మొదటి సగం పూర్తి కావస్తుండగా – గ్రబోవ్‌స్కీ, మ్యుల్లర్ల జంట గోల్ చేసి జర్మనీకి 2–1 ఆధిక్యం సాధించినప్పుడు – ఉత్సాహంతో కేరింతలు కొట్టిన మొదటివాళ్లం మేమే.

ఆడుతున్నది స్వదేశం కాదు. ఆట నాకు ప్రియతమం కాదు. నాలోని ఆ ఉత్కంఠ, ఆ జర్మన్ పక్షపాతం నాకు ఆశ్చర్యం కలిగించాయి. చిత్రమేమిటంటే ఆ తర్వాతనుంచి ఆట వరల్డ్‌కప్ ఫైనల్సుకి తగిన స్థాయిలో లేదు. రెండో సగంలో ఏ టీమూ గోల్ చెయ్యలేదు. పశ్చిమ జర్మనీ ప్రపంచకప్ విజేత అయింది. అప్పుడక్కడ మొదలైన ఆ ఉత్సాహం మహోత్సాహమై దేశమంతటా వేడుకలు జరగడం ఈనాటికీ మరిచిపోలేను.

రోగం ఒక తపస్సు

"జ్వరమొస్తే బాగుణ్ణు. బడికెళ్లక్కర్లేదు" అనేవాడు చిన్నప్పుడు నా క్లాస్‌మేట్ శంకరం. ఇంట్లోవాళ్లు ముద్దు పడేవారు. ఒకరోజు వాళ్లింటికో చుట్టమొచ్చాడు. ఆయనకి కాస్త నోటి దురుసు ఎక్కువ. ఆయన శంకరాన్ని విసుక్కుంటూ, "రోగమొస్తే బడికెళ్లక్కర్లేదు. కానీ స్వర్గానికి పోవాల్సుంటుంది" అన్నాడోసారి. అప్పట్నించీ ఆ మాట జోక్‌గా మారి తరచు వాడుతుండేవాళ్లం. కానీ ఒకరోజు ల్యూనబర్గులో క్రంకెన్ హౌస్‌కి (హాస్పిటల్) వెళ్లినప్పుడు ఆ మాట మరోవిధంగా నిజమనిపించింది.

హాస్పిటల్ భవనం విశాలంగా, అందంగా, పరిశుభ్రంగా, దివ్యంగా ఉంది. నర్సులు అప్సరసల్లా ఉన్నారు. వైద్యులు అశ్వినీ దేవతల్లా ఉన్నారు. రోగులు అమృతపానం చేస్తూ, సమస్త సుఖాలూ అనుభవిస్తున్న దేవతల్లా ఉన్నారు. ఇండియాలో ప్రభుత్వ ఆస్పత్రి నరకాన్ని తలపింపజేస్తే, ఇక్కడి ఆస్పత్రి సాక్షాత్తూ స్వర్గంలా ఉంది. రోగం ఆ స్వర్గానికి వెళ్లడానికి చేసిన తపస్సు అనిపించింది.

ఈ భావాలతో ఒకో విభాగమే చూస్తూ పిల్లల విభాగానికి వచ్చాం.

అక్కడ నెలల వయసు చంటిపిల్లల నుంచి, అయిదేళ్ల బాలబాలికల వరకూ ఉన్నారు. వాళ్లు ఎవరికివారు విడివిడిగా చిన్న చిన్న అద్దాల విభాగాల్లో ఉన్నారు. వాళ్లక్కడ ఆడుకుందుకు రకరకాల బొమ్మలు, ఆటవస్తువులు ఉన్నాయి. తినడానికి రకరకాల తినుబండారాలు తగినన్ని ఉన్నాయి. వేళ ప్రకారం మందులిచ్చి వెళ్లే నర్సు ఉంది. పడుకుందుకు మెత్తని పరుపులున్నాయి. తోడుకు పక్కన మనుషులు మాత్రం లేరు.

ఆ పిల్లలు అద్దాల గదుల్లో ఉన్నారు కాబట్టి వచ్చేపోయేవారు వాళ్లని చూడొచ్చు. రోజుకొకసారి తలిదండ్రులు కూడా వచ్చి పిల్లల్ని చూసి వెడతారు. అంత చిన్న వయసులో, అందులోనూ జబ్బు పడ్డప్పుడు, అలా ఒంటరిగా పిల్లల్ని వదిలిపెట్టి ఉండడం, మనదేశంలో తలిదండ్రులు ఊహలోనైనా భరించగలరా?

చిన్నప్పుడు నావంట్లో కాస్త నలత చేస్తే చాలు – రాత్రింబవళ్లు కళ్లలో వత్తులు పెట్టుకుని సేవలు చేసిన అనురాగమూర్తి, ప్రేమమయి అమ్మ చటుక్కున నాకు గుర్తొచ్చింది. ఆ పిల్లల్ని చూస్తే మనసు కలుక్కుమంది.

"అనారోగ్య సమయంలో పిల్లలకి వైద్యమూ, వైద్యసదుపాయాలూ మాత్రమే కాదు. అయినవాళ్ల సమక్షం కూడా అవసరం" అన్నాను అప్రయత్నంగా. అప్పుడే నాకో అనుమానమొచ్చింది. స్వర్గానికి వెళ్లిన పెద్దలకు విలాస జీవితం గ్యారంటీ. మరి చిన్నపిల్లలు స్వర్గానికి వెడితే?

బహుశా వారి జీవితం ఇలాగే ఉంటుంది కాబోలు....

నీమీద మనసాయెరా

'నీమీద మనసాయెరా" అన్న మాట విన్నప్పుడు ఏ పురుషుడికైనా తనువు పులకరిస్తుందంటారు. కానీ ఆ మాట వింటేనే నిలువెల్లా వణికిపోయే సంఘటన ఒకటి నా అనుభవంలోకి వచ్చింది.

అనుభవాలు ఎంత కొత్తవైనా కూడా, ఎంతో కొంత ఊహకి అందొచ్చు. కానీ ఈ అనుభవం ఏ విధంగానూ నా ఊహకందనిది.

జూలై 25. జర్మనీలో అడుగుపెట్టి ఏడువారాలయింది.

ఆ రోజు ఉదయం ఒక జర్మన్ వృద్ధుడు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చాడు. బ్రేక్‌ఫాస్ట్ అయ్యేక మమ్మల్ని కలుసుకున్నాడు. ఆయన ఇండియాలో చాలా కాలం ఉన్నాడట. మద్రాసులో ఉండేవాడుట. అందుకని తమిళం బాగా వచ్చునట. ఆయన తమిళం మాట్లాడుతుంటే తమిళుడి నోట వింటున్నట్లే ఉంది.

ఆయన మమ్మల్ని చూసి, "నమస్కారం" అన్నాడు. ఉచ్చారణ తమాషాగా అనిపించింది.

రామచంద్ర రెచ్చిపోయి ఆయనతో అరవంలో కబుర్లు మొదలెట్టాడు. కానీ ఆయనకి తమిళం మాట్లాడ్డం ముఖ్యం కానట్లుంది. అందరితోనూ మాట్లాడ్డానికి, తొందరగానే ఇంగ్లీషులోకి దిగిపోయాడు. మమ్మల్ని ఆకట్టుకుందుకు ఇండియాలో తన అనుభవాలు కొన్ని చెప్పాడు.

మద్రాసులో ఉన్నప్పుడు ఆయనకి ఓ పల్లెటూరి రైతుతో పరిచయమయిందిట. ఆ రైతు విద్యాధికుడే కానీ, పల్లెటూళ్లోనే స్థిరపడి వ్యవసాయం చేస్తున్నాడుట. అతనోసారి ఈయన్ని తన ఊరు తీసుకెళ్లాడుట. ఆ రైతు కవిత్వమంటే చెవి కోసుకుంటాడుట. ఎంతలా అంటే – తన ఎడ్లకు గ్యోతే, షీలర్ అని పేర్లు పెట్టుకున్నాడుట. ఈయన్ని రెండెడ్ల బండెక్కించుకుని – తన ఎడ్లని గ్యోతే, షీలర్ అని అదిలిస్తుంటే ఈయనకి ముందు బాధగా అనిపించిందిట. అయితే ఆ రైతు ఆ పేర్లు అభిమానంతో పెట్టుకున్నవని గ్రహించేక అ బాధ పోయింది.

కథ చెబుతూ ఆయన తనే పడిపడి నవ్వాడు. అంతలా కాకపోయినా మేమూ కొంత నవ్వాం.

ఆ కథవల్ల ఆయన నాకు బాగా గుర్తుండిపోయాడు. అంతటితో పరిచయం అయిపోయిందనుకున్నాను.

ఆరోజు సాయంత్రం ఇంటికెళ్లేసరికి కాస్త అలస్యమైంది. నేను వెళ్లి తలుపు తీస్తుండగా, వైయాంగ్ గది తలుపు తెరుచుకుంది, వైయాంగ్ కానీ నాకోసం వస్తున్నాడా అనుకున్నాను కానీ బయటికొచ్చింది ఉదయం మమ్మల్ని పలకరించిన జర్మన్ వృద్ధుడు. అతని వెనుకనే వైయాంగ్ గది తలుపు మూసుకుంది.

ఆయన నా దగ్గరకొచ్చి, "వణక్కం" అన్నాడు. నేనేదో అనేలోగానే తమిళంలో మాటలు మొదలెట్టాడు.

నేను ప్రతి నమస్కారం చేసి, నాకు తమిళం అర్థం కాదని చెప్పాను, అతను వెంటనే, "నమస్కారం" అని ఇంగ్లీషులోకి దిగిపోయాడు.

ఆయన వచ్చింది నాకోసమేనని తెలిసి ఆశ్చర్యపోతూనే, నా గదిలోకి ఆహ్వానించాను.

ఆయన నా గదిలోకొచ్చి కాసేపు ఆ కబురూ ఈ కబురూ చెప్పి చటుక్కున నాకు దగ్గరగా జరిగాడు. "మై సన్, మై సన్" అంటూ నన్ను గట్టిగా కౌగలించుకున్నాడు. ఉడుకులాం వాసన గుప్పుమంది.

ఆయన శరీరం వణుకుతోంది. ముఖం ఎర్రబడింది. కళ్లలో ఉద్రేకం కనబడుతోంది.

నాకేదో అనుమానమొచ్చి, చటుక్కున ఆయన్ని విడిపించుకుని దూరంగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"నేను నీకు తండ్రిలాంటివాణ్ణి. దగ్గరగా వచ్చి కూర్చో" అన్నాడాయన.

"ఫరవాలేదు. ఇక్కడే కూర్చుంటాను" అన్నాను.

"దగ్గరగా కూర్చుంటే బాగోలేదా?" అన్నాడతను.

"అన్‌కంఫర్టబుల్‌గా ఉంది" అన్నాను.

"మరి మీ ఇంట్లో నీ తండ్రికి దగ్గరగా కూర్చోవా నువ్వు?" అన్నాడతను.

"తండ్రికి పాదాభివందనం చెయ్యడం మా సంప్రదాయం. కౌగలించుకునే అలవాటు నాకు లేదు" ఆన్నాను.

ఏమనుకున్నాడో, "నేను హోమో సెక్సువల్నని అనుమానిస్తున్నావా?" అన్నాడాయన.

అలాంటి అనుమానం వచ్చిన మాట నిజమే కానీ, ఆయనలా సూటిగా అడిగెయ్యగానే మొహమాటపడి, "లేదు. కానీ నీకు దగ్గరగా కూర్చోలేను" అన్నాను.

"ఇండియాలో మగాళ్లూ మగాళ్లూ కలిసి పడుకోవడం సాధారణం అని విన్నాను. నిజం కాదా?" అన్నాడాయన వెంటనే.

"నిజం కాదు. ఇండియాలో మగవాళ్లకు ఆడవాళ్లంటే పెద్ద సస్పెన్సు ఉంది. అక్కడ వయసొచ్చిన మగాడు – ఆడదానితో అనుభవంకోసం అత్రుతగా ఎదురు చూస్తాడు. అవకాశాలు అంత సులభంగా దొరక్క, ఆడదానిపట్ల అమితంగా ఆసక్తి, ఆకర్షణ ఉంటాయి మగాడికి. పాశ్చాత్యదేశాల్లో అలాకాదు. ఆడవాళ్లు వళ్లు దాచుకోవాలని అనుకోరు. వెంటపడ్డ మగాళ్లతో స్నేహం, చనువు చూపే ఆడవాళ్లని ఇక్కడి సమాజమూ అంతలా వేలెత్తి చూపదు. కానీ కామానికి మితిమీరిన స్వేచ్ఛ లభించడంతో, అది వెర్రితలలు వేసి హోమోసెక్సువలిటీ లాంటివి బయల్దేరి ఉండొచ్చిక్కడ" అన్నాను కాస్త తీవ్రంగా.

నిజానికీ విషయం గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. స్థిరమైన అభిప్రాయమంటూ ఏర్పరచుకోవాల్సిన అవసరమూ రాలేదు. ఆయన ప్రవర్తన నన్ను హర్ట్ చేసింది. డోసు బలంగా ఇచ్చి ఆయన్ని వదిలించుకోవాలనిపించి నోటికొచ్చినదేదో అనేశాను.

ఆయనింకా వదిలేలా లేడు, "నీకేమైనా డబ్బుకి ఇబ్బందిగా ఉందా?" అన్నాడు సంభాషణ దారి మళ్లిస్తూ.

"నాకొచ్చేదాంతో సుఖంగా గడిచిపోతోంది. ఏ ఇబ్బందీ లేదు" అన్నాను సంతృప్తిని ముఖంలో కూడా వ్యక్తపరిచేందుకు ప్రయత్నిస్తూ.

ఆయన ఒక్క క్షణం మౌనం వహించాడు. తర్వాత తనేదో స్కూలు నడుపుతున్నాననీ, అక్కడికొచ్చి ఇండియా గురించి ఏదైనా లెక్చర్ ఇమ్మనీ ఆహ్వానించాడు. సరేనన్నాను.

"చాలా మొండివాడిలాగున్నావు. పట్టుమని ఇరవై ఏళ్లున్నట్లు లేదు. ఇండియనువి. కాబట్టి నా అనుమానం, ఇంతవరకూ నీకు స్త్రీ అనుభవం లేదని!" అన్నాడాయన.

"నా వయసు ముప్పై. నాకిద్దరు పిల్లలు" అన్నాను చప్పున.

ఆయన షాక్ తిన్నట్లు కనబడ్డాడు. "అయ్ థాట్ యు ఆరే బాయ్" అని నెమ్మదిగా గొణిగాడు. ఓ క్షణమాగి, "నువ్వు అబద్ధం చెబుతున్నావు కదూ!" అన్నాడు. ఔనంటానన్న ఆశ ఆయన కళ్లలో కనబడుతోంది.

"అబద్ధం కాదు, నిజమే! కావాలంటే నా ఫామిలీ ఫొటో చూడు" అంటూ పక్కనే బల్లమీద పుస్తకాల వెనకున్న ఫొటో తీసి చూపించాను.

చూశాడు. మళ్లీ ఏదో అస్పష్టంగా గొణుక్కుని, "ఒక్కసారి దగ్గరగా రాలేవా?" అని బ్రతిమాలుతున్నట్లు అడిగాడు.

"రాలేను" అన్నాను కాస్త కటువుగా.

"సరే, ఐతే సెలవు" అని ఓ క్షణమాగి, "నీ క్లాసులో ఎవరైనా ఇరవైఏళ్ల కుర్రాళ్లున్నారా?" అనడిగాడు.

మా క్లాసులో అబూరాసీ అనే ఇరవైఏళ్ల టర్కిష్ కు ర్రాడున్నాడు. అతని పేరు చెప్పాను.

ఆయన లేచి నిలబడ్డాడు. నేనూ లేచాను.

చటిక్కున ఒక అడుగు ముందుకేసి మళ్లీ నన్ను బలంగా కౌగలించుకున్నాడు. అదేం జబ్బో తెలియదు కానీ, మనిషి నన్ను కౌగలించుకున్నంతసేపూ నిలువెల్లా వణికిపోతున్నాడు.

నేను అసహ్యంతో ముడుచుకుపోయాను. బలమంతా ఉపయోగించి విడిపించుకున్నాను.

"నీకు చాలా ఇబ్బందిగా ఉన్నట్లుంది. ఇక సెలవు తీసుకుంటాను. వచ్చే ఆగస్ట్ 14న నా స్కూలు తెరుస్తాం. అప్పుడు నీకు కబురు చేస్తాను. ఇప్పటికి ఇండియన్ పద్ధతిలో సెలవు తీసుకుంటాను" అంటూ రెండు చేతులూ జోడించి, "నమస్తే!" అన్నాడు.

ఆయన తలుపు తీసుకుని వెళ్లిపోగానే, నేను పక్కరూంలో వైయాంగ్ దగ్గరకి పరుగున వెళ్లాను.

"వైయాంగ్! ఆ ముసలాడు నీ గదికెలా వచ్చాడు?" అన్నాను.

"వాడు మంచాడు కాదు. పైగా చాలా ప్రమాదకరమైన మనిషి. హోమో సెక్సువల్" అన్నాడు వైయాంగ్అదోరకమైన ఏహ్యభావంతో.

ఆయన వైయాంగ్‌తో నేరుగానే బేరానికి దిగేట్ట. చాలా డబ్బు ఇస్తానన్నాట్ట.

వైయాంగ్ నాకంటే బాగా కుర్రవాడు. స్పందనలో నాకున్న పరిణతి అతనికుండదు. ఇంచుమించు గెటౌట్ అని చెప్పి వదుల్చుకున్నాట్ట.

నా అనుమానం నిజమేనని రూఢి కాగానే వణికిపోయాను. జీవితంలో ఇలాంటి అనుభవానికి అస్కారం ఉండొచ్చని కలలో కూడా అనుకోలేదు.

నా గదికి వెళ్లి తలుపులు వేసుకున్నాను. ముసలాడు వచ్చి వెళ్లడం నిజమేననడానికి సాక్ష్యంగా గదిలో ఉడుకులాం వాసన ఇంకా తాజాగానే ఉంది.

ఆయన నామీద మనసై వచ్చాడన్నది నిజం. ఆ నిజం ఇప్పటికీ ఎప్పటికీ నా ఊహ కందనిది.

చీకటి వెనుక వెన్నెల

చీకటి మనిషిని భయపెడుతుంది. అందుకే దేవుడు ఆ సమయంలో చాలా భాగాన్ని నిద్రకి కేటాయించాడు. మిగతా సమయంలో చీకటి అంటే భయం పోవడానికిగానూ ఆ చీకటిలోనే అప్పుడప్పుడు వెన్నెలని ప్రవేశపెట్టాడు.

ప్రతి చీకటిలోనూ వెన్నెల నింపొచ్చు. అప్పుడు మనిషికి భయమంటే తెలియదు. కానీ మనిషికి భయమంటే తెలియాలి. తెలిస్తేనే భయానికి విరుగుడు కనిపెడతాడు. ఐనాకూడా ఎప్పుడూ చీకటే ఉంటే మనిషిలో నిరాశా నిస్పృహలు కలుగుతాయి. చీకటి వెనుకనే వెన్నెల వస్తుందన్న భావన మనిషిలో ఆశ నింపుతుంది. ఆశ ఒక్కటే మనిషికి భావిపట్ల ఆసక్తిని పుట్టిస్తుంది.

చీకటి భయం. ఆశ వెన్నెల.

నాకు జర్మన్ వృద్ధుడి పరిచయం చీకటైతే, రెండు రోజుల్లోనే వెన్నెల నన్ను వెతుక్కుంటూ వచ్చింది.

జూలై 26న, మేము రోజూ భోంచేసే హొటల్ ఓనర్ ఫ్రౌ హెన్నీ బెక్కర్ నన్నూ, నటరాజన్, లాల్, శర్మ, బిశ్వాస్, క్రంకెన్‌గుప్తాలనీ – మర్నాడు మధ్యాహ్నం తనింటికి విందుకు పిలిచింది.

ఆ పిలుపుకి మేమందరం కూడా చాలా ఆశ్చర్యపడ్డాం.

ఎందుకు పిలిచిందో తెలియదు. పిలిచేక అక్కడికి వెళ్లినప్పుడు ఏం ఫార్మాలిటీస్‌పాటించాలో తెలియదు.

మాలో మేము బాగా చర్చించుకున్నాం. "ఈ విషయమై ఎక్కువ ఆలోచించొద్దు. ఆమెకివ్వడానికి బొకే ఒకటి కొని పట్టుకెడదాం" అన్నాడు లాల్.

ఆ ప్రకారం శనివారం నాడు ఓ బొకేతో ఆమె ఇంటికి వెళ్లాం.

హెన్నీ బెక్కర్ ఏర్పాట్లు ఘనంగా ఉన్నాయి. ముందామె మాకో అందమైన యువతిని పరిచయం చేసింది. ఆమె తన అన్న కూతురుట. బార్బర్ షాపులో పని చేస్తోందిట. అత్తను చూడ్డానికి సెలవు పెట్టుకునొచ్చింది.

"నాయీ (మంగలి) యార్" అన్నాడు నటరాజన్ అప్రయత్నంగా.

హెన్నీ బెక్కర్ పార్టీకోసం ప్రత్యేకంగా కేక్ తయారు చేయించింది. ఆ కేక్ చాలా రుచిగా ఉంది. నేను కాఫీ తాగనని తెలుసు కాబట్టి నాకోసం పాలు ఉంచింది. మిగతావాళ్లతో, "చిన్నపిల్లాడు కదా, ఇతను పాలే తీసుకోవాలి" అని నవ్వి నాకేసి ముచ్చటగా చూసింది.

లాల్‌వెంటనే, "నీకు తెలియదా, అతనికి పెళ్లయింది. ఇద్దరు పిల్లలు" అన్నాడు.

ఫ్రౌ హెన్నీ బెక్కర్ ఆశ్చర్యంగా, "అయితే, నీ వయసెంత?" అనడిగింది.

నేను చెప్పగానే, "ఇరవై లోపు అనుకున్నాను" అని అస్పష్టంగా గొణుక్కుంది.

బ్రాహ్మణుడు, మేక కథలో లాగా – నా వయస్సు ఇరవై లోపే ఏమోనని నాకూ అనిపించసాగింది.

నాకు పాలు, మిగతా అందరికీ కాఫీలు, కోన్యాక్. మాలో కోన్యాక్ తీసుకున్నది శర్మ ఒక్కడే.

అప్పుడు హెన్నీ బెక్కర్ తన హొటల్‌గురించిన వివరాలు చెబుతూ, "పదిహేను సంవత్సరాలుగా ఈ హోటలు నడుపుతున్నాను. ఇంతవరకూ ఏ కస్టమరునీ నా ఇంటికి ఆహ్వానించలేదు" అంది.

మేము క్రమం తప్పకుండా ఆమె హొటలుకి వెళ్లేవాళ్లం. మా ప్రవర్తనకు ఆమె ముగ్ధురాలైందిట. ఆ మాట చెబుతూ ఆమె టర్కిష్ విద్యార్థుల్ని ఏవగించుకుంది. హోటల్లో పని చేసే యువతుల్ని వాళ్లు చాలా అల్లరి పెట్టేవారు.

ఆమె భావనలో న్యాయముంది. అక్కడి ఆడపిల్లలు మన దేశపు అమ్మాయిల్లా కాక, లిబరల్‌గా ఉంటారు.

ఒకసారి మ్బాయా హుషారుగా కనబడ్డ ఓ అమ్మాయిని, 'హాబెన్‌జీ జైట్' (నీకు టైముందా?) అనడగడం చూశాను. నిజానికలా అడగడంలో భావం, నాతో వస్తావా అనే! ఇండియాలో ఐతే, 'చెప్పు తెగుద్ది' అని బదులొస్తుంది. ఒకోసారి పెద్ద గొడవౌతుంది కూడా. కానీ ఆమె సింపుల్‌గా, 'నైన్' (నో) అని నవ్వేసి వెళ్లిపోయింది. అదక్కడ మామూలేననీ, ఎవరు ఎస్ అంటారో తెలియరు కాబట్టి ఓ ట్రయల్ వేస్తుంటాననీ మ్బాయా అన్నాడు. అలాంటి స్పోర్టివ్ అమ్మాయిలు కూడా నొచ్చుకునేలా ఉండేది హొటల్లో కొందరు టర్కిష్ అబ్బాయిల ప్రవర్తన. అది మేము చూశాం. మీద చెయ్యేస్తుంటే నవ్వుతూ తప్పించుకున్న ఆ యువతుల మనోవ్యథ నాకిప్పుడర్థమైంది.

"పదిహేనేళ్లుగా హోటల్ నడుపుతున్న నాకు ఇన్నేళ్లకి కొందరిని ఇంటికి విందుకి పిలవాలని మొదటిసారిగా అనిపించింది. అందుకు పూర్తిగా మీరు, మీ ప్రవర్తనే కారణం. మీకు నా అభినందనలు" అందామె.

మేమందరం పరస్పరం ముఖముఖాలు చూసుకున్నాం. అందరి ముఖాల్లోనూ గర్వంతో కూడిన సంతోషం.

ఊళ్లో గ్యోతే ఇన్స్‌టిట్యూట్ జాబితాలో రెస్టారెంట్లు చాలానే ఉన్నా, మేము మాత్రం రెండు నెలలుగా క్రమం తప్పకుండా ఆమె హొటల్లోనే తిన్నాం. మిగతా రెండు నెలలూ కూడా అక్కడే తినాలనుకుంటున్నాం. కారణం అక్కడ లభిస్తున్న మర్యాద, మన్నన, ఆత్మీయతాభిమానాలు. అంత మంచి హోటలుకి యజమాని – కస్టమర్సుమైన మమ్మల్ని ఇంటికి పిల్చి మరీ స్వయంగా మా మంచితనాన్ని పొగడ్డం గర్వకారణమే కదా!

తర్వాత మా మధ్య సంభాషణ నెమ్మదిగా ఊపందుకుంది. ముందుగా ఫ్రౌ హెన్నీ బెక్కర్ ఇండియన్సుకి సంబంధించి తన దృష్టికొచ్చిన పరస్పర విరుద్ధమైన అనుభవాలు కొన్ని చెప్పింది.

1957లో ఒక ప్రొఫెసర్ ఆమె హొటల్లోనే భోంచేసేవాట్ట. అతనికి వండిన కోడిని ఇస్తే, ఎముకకూడా మిగల్చకుండా మొత్తం లాగించేసేవాడుట. కొద్ది సంవత్సరాల క్రితం వచ్చిన ఇద్దరు ఇండియన్సు ఉదయమూ, సాయంత్రమూ కూడా కోడిగుడ్లు తప్ప మరే మాంసాహారమూ ముట్టేవారు కారుట. ఈ ఏడు వచ్చినవాళ్లలో నేను, సుబ్రహ్మణ్యం కోడిగుడ్లు కూడా తినని శాకాహారులమట.

ఆమె శాకాహారం గురించి నన్ను కొన్ని ప్రశ్నలడిగింది. వెటకారంగా కాదు, కుతూహలంతో. అవి నాకు కొత్త కాదు. నా పరిజ్ఞానాన్నీ, అనుభవాల్నీ జోడించి చేతనైనంతలో ఆమెకి బదులిచ్చాను. ఆమె థాంక్సు చెప్పింది.

ఆ సమావేశంలో మాకు ఆమె గురించి మరికొన్ని విషయాలు తెలిశాయి. మొదట్లో హొటల్ని రెండు పూటలా నడిపేదిట. నాలుగైదేళ్లుగా, ఒంటిపూట మాత్రమే నడుపుతోందిట. పదిహేనేళ్లుగా గ్యోతే ఇన్స్టిట్యూట్‌వారు ఒకో మీల్సు టికెట్‌కి నాలుగున్నర మార్కులు మాత్రమే ఇస్తున్నారుట. ఏటేటా ధరలు పెరిగిపోతున్న ఈ రోజుల్లో తనకిది చాలా ఇబ్బందిగా ఉన్నదంది ఆమె.

మేము బై చెప్పినప్పుడు ఆమె చిన్న రిక్వెస్టు చేసింది. ఆ ఏడాది అక్కడికొచ్చిన ఇండియన్సు మొత్తం అందరివీ ఫొటోలూ, సంతకాలూ కావాలని అన్నదామె. వాళ్లు ఆమె కస్టమర్సే కానవసరం లేదని చెప్పడంలో ఆమెకి ఇండియన్సుమీద కలిగిన ప్రత్యేకాభిమానం అర్థమైంది.

మేము సరేననడమే కాదు – ఆమె చిత్తశుద్ధితో అడిగిందని గ్రహించినవారిమై, అదే చిత్తశుద్ధితో పూనుకుని, ఆమె అడిగిన విధంగా ఫొటోలూ సంతకాలూ సేకరించి వెళ్లేలోగా ఆమెకి అందజేశాం.

ఇది శృంగారమోయ్

మనిషి జీవితంలో శృంగారం అంతర్భాగం. మన దేవాలయాల్లో పచ్చి శృంగారానికి రూపశిల్పాలు ఉండొచ్చు. మన ప్రబంధాల్లోనూ, చివరికి దేవీ స్తోత్రాల్లోనూ పచ్చి శృంగారానికి తావుండొచ్చు. ప్రపంచాన్నే అబ్బురపరిచే కామసూత్రాలకు మూలాలు మన దేశంలోనే ఉండి ఉండొచ్చు. కానీ మన సంప్రదాయంలో శృంగారంపై ఉన్న అదుపు ఇంతా అంతా కాదు. పాశ్చాత్యదేశాల్లో అడుగెట్టిన ప్రతి భారతీయుడికీ – అక్కడి విశృంఖల శృంగారం పట్ల ఆశ్చర్యంతోపాటు, కుతూహలం కూడా ఎక్కువగా ఉంటే ఆశ్చర్యమేం లేదు.

ల్యూనబర్గులో అడుగెట్టిన వారం లోపే – అక్కడి షాపుల్లో యథేచ్ఛగా లభ్యమయ్యే శృంగార పుస్తకాలు చూశాం. నీలిచిత్రాల థియేటర్ల (కీనో) ముందు వాల్‌పోస్టర్లలో – ఆధునిక స్త్రీపురుషుల నగ్నచిత్రాల్ని మన ఖజురాహో శిల్పాల్ని మించిపోయిన భంగిమల్లో చూశాం.

ఇలాంటి విషయంలో బిశ్వాస్‌కి దూకుడెక్కువ. ముందు కీనోకి వెళ్లి ఓ నీలి చిత్రం చూసొచ్చాడు. ఎవరో అన్నారుట – నైట్‌క్లబ్ ముందు నీలి చిత్రాలు దిగదుడుపని. వెళ్లాలని కోరిక పుట్టింది. మిగతావాళ్ల తత్వం తెలిసింది కాబట్టి, మమ్మల్నెవర్నీ అడక్కుండా, తనకి పక్కనే ఉంటాడు కాబట్టి నటరాజన్‌ని బాగా బలవంతపెట్టాడు. ఇలాంటి విషయాల్లో బలవంతానికి లొంగడమంటే, ఆంజనేయుడు బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డం లాంటిదే. మనసులో ఏదో మూల తనకీ చూడాలనుంది కాబట్టి నటరాజన్ సరేనన్నాడు. వాళ్లిద్దరూ వెళ్లి ఒక రాత్రి నైట్‌క్లబ్ చూసొచ్చేశారు. తర్వాత బిశ్వాస్, "క్లబ్బు కొండయితే, నీలిచిత్రాలు అద్దం మాత్రమే" అని మా కుతూహలాన్ని మరింత పెంచాడు. ఆ తర్వాత హాంబుర్గులో రీపర్‌బాన్ స్ట్రాసే చూసి ముక్కున వేలేసుకున్నాం. సుబ్రహ్మణ్యం కోపెన్‌హాగన్ వెళ్లొచ్చి, మనుషుల్నీ, జంతువుల్నీ, సరీసృపాల్నీ – శృంగార భాగస్వాముల్ని చేసిన వెర్రితలల్ని వివరిస్తుంటే షాక్ తిన్నాం.

"ఇది స్వేచ్ఛ. దీన్ని అభినందించాలి" అంటాడు బిశ్వాస్.

"ఈ స్వేచ్ఛవల్ల ప్రయోజనమేమిటి? సంస్కారాన్ని నమ్మేవారికి కళ్లముందు సాటి మనుషుల సజీవ నగ్న ప్రదర్శన కలిగించే అనుభూతి ఏమిటి?" అన్నవి నా సందేహాలు. ఆ సందేహాలకు నాకు దొరికిన సమాధానాలు, ఈ విశృంఖలతపట్ల కొత్త అవగాహన కలిగించగలదని నాకు అనిపించింది.

ల్యూనబర్గ్ యాబైవేల జనాభా ఉన్న చిన్న ఊరు కావచ్చు కానీ అక్కడా నైట్‌క్లబ్బులున్నాయి. ఇండియాలో పెద్ద నగరాల్లో నైట్‌క్లబ్సున్నాయిట. కానీ అక్కడ వాటికి వెళ్లడం కొందరికి హోదా. చాలామంది మధ్యతరగతివారికి అవి సమాజ సంస్కారపరంగా నిషిద్ధాలు. అందువల్ల అప్పటికి ఎక్కువగా కలిసి తిరిగే మా మిత్రబృందం ఐదుగురిలో ఎవ్వరికీ నైట్‌క్లబ్ చూసిన అనుభవం లేదు. నటరాజన్, బిశ్వాస్ చూసొచ్చేక, మిగతా ముగ్గురిలోనూ వేడి పుట్టింది. ఆ ముగ్గురం – నేను (తెలుగు), దేవదార్(మహారాష్ట్ర), కొరియా (రాజస్థాన్).

జర్మనీలో అది చాలా మామూలు విషయం కాబట్టి ఒకసారి నైట్‌క్లబ్బుకి వెళ్లి రావాలని అనుకున్నాం. పెద్ద సిటీలలో అయితే నైట్‌క్లబ్ ఛార్జిలు బాగా ఎక్కువుండొచ్చుట. ఆ అనుభవానికి ల్యూనబర్గులాంటి చిన్న ఊళ్లే మెరుగని నిర్ణయించుకున్నాం. కానీ టిపికల్ ఇండియన్ మెంటాలిటీ ఎక్కడికి పోతుంది? మనసులో ఏదో తప్పు చేస్తున్న భావన. అందువల్ల మాలో ప్రతి ఒక్కరికీ తటపటాయింపు.

కొంపలు ములిగిపోతున్నట్లు తక్షణం సమావేశమై ఒక బృందంగా ఏర్పడి కార్యక్రమం రూపొందించాం.

ఒక రాత్రి పది ప్రాంతాల మేము ముగ్గురం అమ్‌శాండే మార్కెట్ సెంటర్లో కలుసుకున్నాం. అక్కణ్ణించి బయల్దేరి ముగ్గురం కలిసి ఓ నైట్‌క్లబ్ చేరుకునేసరికి రాత్రి పదకొండయింది.

టికెట్ మనిషికి ఐదు మార్కులు. నేను ఓవర్‌కోట్ వేసుకుని వెళ్లడంవల్ల అది ఉంచడానికి వేరే యాబై ఫెనిగ్సు ఇవ్వాల్సి వచ్చింది.

క్లబ్బులో కోకాకోలావంటి మృదు శీతల పానీయాలు లేవు. ఉన్నవన్నీ బరువైన నిషా ఇచ్చేవే. ఉన్నంతలో నిషాపరంగా తేలికైన పానీయం బీరు ఒక్కటే. లోపలికెళ్లాక ఏదో ఒకటి ఆర్డరివ్వాలి కాబట్టి, మేము తలొక బీరూ ఆర్డరిచ్చాం. బయట కొనుక్కుంటే బీరు బాటిల్ ఒకొక్కటి యాబై ఫెనిగ్స్. ఇక్కడ అదే బాటిల్ ఆరు మార్కుల యాబై ఫెనిగ్స్. మూడు బీరు బాటిల్సు వచ్చాయి. నేను బీరు తాగను కాబట్టి నా బాటిల్‌కూడా వారిద్దరికీ ఇచ్చేశాను.

ఇలా వెళ్లామో లేదో అలా కనబడింది – మా ఊహకందని షాక్‌ఇచ్చే దృశ్యం!

సుమారు ముప్పైఏళ్ల మహిళ – కాళ్లకి మేజోళ్లు, షూస్‌మినహాయించి వంటిమీద మరే ఆచ్ఛాదనా లేదు. ఆమె నిలబడి నృత్యం చేస్తోంది. ఆమె అంగాంగ ప్రదర్శన ఎంత పచ్చిగా ఉందో సరిగ్గా చెప్పడానికి భాష కూడా అంత పచ్చిగానూ ఉండాలి.

అంత వెంటనే అలాంటి దృశ్యం చూడ్డానికి మానసికంగా సిద్ధపడి లేమేమో – మేము ముగ్గురం నిశ్చేష్టులమై కాసేపు అలా నిలబడిపోయాం. ఆమె ప్రదర్శన ఎప్పుడు మొదలయిందో తెలియదు కానీ, మేము వెళ్లేసరికి ముగింపుకి వచ్చినట్లుంది. కాసేపట్లోనే ఆమె పక్కకు తప్పుకుంది.

నగ్న యువతి – మాకు పదడుగుల లోపు దూరంలో. దాపరికం లేకుండా అనాటమీని ప్రదర్శిస్తోంది. మేము వైద్య విద్యార్థులమైనట్లు తన శరీర రహస్యాలన్నీ తనే వివరిస్తోంది. చుట్టూ ఉన్న మగాళ్లు తామేదో గొప్ప ప్రదర్శన చూస్తున్నట్లు, మహోత్సాహంగా ఉన్నారు. మధ్యమధ్య చప్పట్లతో ప్రోత్సహిస్తూ ఆమె ప్రదర్శనని ఆనందిస్తున్నారు.

మా చిన్నతనంలో పెళ్లిళ్లకు, పండుగలకు భోగం మేళాలు ఉండేవి. అక్కడ వయసులో ఉన్న యువతులు నాట్యం చేసేవారు. నేటి ఐటం డ్యాన్సుల్లా కాక ఆ నృత్యాలు చాలా సభ్యంగా ఉండేవి. చేసేవారు వేశ్యలు కాబట్టి ప్రేక్షకులు వారితో సరసోక్తులాడేవారు. నేటి

శాసనసభల్లోలా కాకుండా, ఆ భాష సరసంగానే ఉండేది. నృత్యాంగనలు చిరునవ్వులతో బదులిచ్చేవారు. ఎటొచ్చీ మధ్యమధ్యలో నృత్యాంగనల్లో ఒకరో ఇద్దరో మాయమైపోతూండేవారు. అదే సమయంలో ప్రేక్షకుల్లోంచీ ఒకరిద్దరు పురుషపుంగవులూ మాయమయ్యేవారు.

భోగంమేళాలు ఇలా ఉంటాయని మిత్రులద్వారా వినడమే ఎక్కువ. నేనూ, మా అన్నయ్యా పది పన్నెండేళ్ల వయసులో ఒక భోగం మేళానికి వెళ్లి ఈ విశేషాలు చూశాం. మామూలుగా చూసేవారికి అది సరదాగా ఉండే నృత్యప్రదర్శనలాగే ఉంటుంది. ఐనా ఇంటికెళ్లేక, మేమెక్కణ్ణించి వస్తున్నామో తెలిసి, మా తాతగారు బాగా చీవాట్లు వేశారు. ఆ తర్వాత మళ్లీ భోగంమేళాలు చూడలేదు. సినిమాల్లో పద్మాఖన్నా, జ్యోతిలక్ష్మి, జయమాలిని, విజయలలితల వగైరాల నృత్యాలు చూసినా – వాటిని భోగంమేళాలని అనుకోలేదు. ఎందుకంటే ఆ సినీ నృత్యాలు భోగంమేళాల్లా కాక అసభ్యంగా అనిపించేవి. ఇక ఇక్కడి విషయానికొస్తే –

ఎవరో ఏదో అంటారనీ, అనుకుంటారనో బెంగ లేదు. పోలీసులు దాడి చేస్తారన్న భయం లేదు. ఉన్నదేమో, – అసభ్యత అనే మాటని పవిత్రపదంగా మార్చే వాతావరణం. అలాంటి ప్రదర్శన జరిగే ఆవరణలో ప్రవేశార్హతకి – ఐదు మార్కుల టికెట్టూ, ఆరున్నర మార్కుల బీరూ చాలు. ఎంత సులభం!

ఇందాకటి మహిళ వెళ్లగానే, మరో యువతి వచ్చింది. ఈమె ముఖం బాగా లేతగా ఉంది. వయసు ఇరవై దాటకపోవచ్చు. మళ్లీ మళ్లీ చూడాలనిపించే ముఖసౌందర్యం ఆమెది. కానీ ఆమె ముఖ సౌందర్య ప్రదర్శనకి రాలేదని అక్కడి వాతావరణమే చెబుతోంది.

ఆ యువతి రాగానే కొత్తగా సంగీతం ఆరంభమైంది. సంగీతం మొదలవగానే ముందామె ఓవర్‌కోట్‌తీసేసింది. ఆతర్వాత తాత్సారం చెయ్యకుండానే చకచకా ఒకటొక్కటిగా వంటిమీద దుస్తులన్నీ తీసేసింది. అప్పుడు మొదలైంది అసలు ప్రదర్సన.

ఆమె శరీర లావణ్యం అద్భుతం. కానీ ప్రదర్శన అంతా నాభికి పైనా, క్రిందా మాత్రమే. ఆమె ప్రదర్శన గురించి ఏం చెప్పాలన్నా మామూలు భాష పనికిరాదు. జయదేవుడి సంస్కృతమో, చౌడప్ప తెలుగో కావాలి.

బాగా నల్లగా ఉన్న మనిషి నలుపు గురించి అర్థం కావడానికి, "అతను బొగ్గుని విభూతిగా పెట్టుకోవచ్చు" అనడం సామెత. అలా ఇక్కడ సభ్యత అనిపించుకునే ప్రదర్శన ఒకే ఒక్కటి. అది కాస్త సభ్యంగా చెప్పడానికి వాడిన పదాలు కూడా శ్రీనివాసుని సుప్రభాత పదాలు కదా అని సరిపెట్టుకుంటే – ఆమె తన కుచచూచుకాలను నలిపి గట్టిగా చేసింది. ఆ రెంటికీ కలిపి ఓ సన్నటి బంగారు గొలుసును వ్రేలాడదీసింది. ప్రేక్షకులు చప్పట్లు కొడితే వినయంగా అభివాదం చేసింది. ఆ వెంటనే తన వ్యానిటీ బ్యాగుని గాలిలోకి ఎగరేసి, బంగారు గొలుసు స్థానంలో వ్రేలాడేలా చేసింది. మళ్లీ చప్పట్లు మారుమ్రోగాయి.

ఇంతకుమించి ఆ ప్రదర్శన విశేషాలు చెప్పడం ఈ రచనకు న్యాయం చెయ్యదు. మదపిచ్చి ఉన్న ఒక మగాడు – ఆడదాని గురించిన ఆలోచనల్లో ఎంతటి అసభ్యతకూ, అశ్లీలతకూ తావిచ్చినా కూడా – అప్పుడక్కడ జరిగిన ప్రదర్శన స్థాయికి చేరుకోగలడనిపించదు.

ఆమె కార్యక్రమం ముగిసేక వరుసగా రెండు నీలిచిత్రాలు చూపించారు. స్త్రీపురుషుల కామకేళిని వారు చిత్రీకరించిన విధానం చూస్తే – జయదేవుడి గీతగోవిందం శంకరాభరణం చిత్రంలా అనిపించొచ్చు. కథ ఏమాత్రం లేని యాక్షన్ చిత్రాలవి.

సినిమాలయ్యేక – మరో యువతి వచ్చింది. యూరోపియన్ దేశాలు జాతివివక్షకు తావివ్వవని నిరూపించుకోవాలన్న తాపత్రయం ఈ ప్రదర్శనలోనూ కనిపిస్తుంది. వచ్చినామె ఆఫ్రికన్ యువతి. ఆమె ప్రదర్శన అయ్యాక మళ్లీ మొదటి మహిళ వచ్చింది.

మాలో ఆసక్తి తగ్గిపోయింది. ఏ కాంతతోనైనా ఏకాంతానికి పరిమితం కావాల్సిన నగ్నసత్యాలు – ఇందరి మధ్య సామూహికంగా కళ్లబడ్డం ఏమిటోలా వెగటుగా అనిపించింది.

లేచి వెళ్లిపోవాలనుకున్నాం. కానీ, మా ముగ్గురి ఇళ్లూ కూడా అక్కడికి బాగా దూరం. నడిచి వెళ్లాలి.

అర్ధరాత్రి. దేశం కాని దేశం. అదీ నైట్‌క్లబ్బునుంచి వెడుతూ. నడవడానికి – కొంత రాత్రి భయం, కొంత పరువు భయం.

అప్పటికి టైం రెండు కావస్తోంది. తెల్లవారాలంటే కనీసం నాలుగయ్యేదాకా ఉండాలి. మేమిలా తర్జనభర్జన పడుతుంటే నైట్‌క్లబ్ మనిషొకడు దేవదార్‌వద్దకొచ్చాడు. "ఒక్క బీర్ ఆర్డరిచ్చి రాత్రంతా ఇక్కడే ఉండిపోవాలని అనుకుంటున్నారు. ఎస్ గేహ్ట్ నిష్ట్ (ఇదేం బాగోలేదు)" అన్నాడు.

ఏంచెయ్యాలో తెలియక, "ఇంకో బీరు ఆర్డరిద్దామా?" అన్నాను నేను.

"మాకిక తాగాలని లేదు. నువ్వు తాగుతానంటే సరే" అన్నారు దేవదార్, కొరియాలు.

"అమ్మగారైతే దిబ్బరొట్టే కాయం" అన్నట్లు, వాళ్లా మాటనగానే డెసిషన్ అయిపోయింది. వెంటనే అంతా అక్కణ్ణించి బయటపడి అమ్‌శాండే మార్కెట్ సెంటర్ చేరుకున్నాం.

ఆ సమయంలో అక్కడ జనసంచారం ఉండదనుకున్నాం కానీ – అక్కడో మూడు జంటలున్నాయి. వాళ్లు మమ్మల్ని చూసి నవ్వుతూ పలకరించారు. కానీ మేము వాళ్లని పలకరించడానికి ఇబ్బంది పడ్డాం.

వాళ్లున్నది మార్కెట్ సెంటర్లో. కానీ బెడ్రూంలో ఏకాంతంగా ఉన్నంత చనువుగా ప్రవర్తిస్తున్నారు. కలిసి భోంచేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నట్లు – చాలా ఫ్రీగా ఉన్నారు.

"వీళ్లకి వంటిమీద బట్టలున్నాయి. కానీ వీళ్లని చూస్తుంటే – నైట్‌క్లబ్బు నడివీధికొచ్చినట్లుంది" అన్నాను.

"మనమెందుకూ సిగ్గుపడడం? వాళ్లలో అమ్మాయిలు కూడా సిగ్గుపడ్డం లేదు. ఇదో సంస్కృతి!" అన్నాడు దేవదార్.

బీరు ఆర్డరివ్వక్కర్లేదు. ఇవ్వకపోతే "ఎస్ గేహ్ట్ నిష్ట్" అనేవాళ్లు లేరు. కాబట్టి నడివీధి నైట్‌క్లబ్బులో నాలుగయ్యేదాకా కాలక్షేపం చేశాం.

నాలుగయ్యేసరికి కాస్త వెలుతురొచ్చింది. మేం ముగ్గురం విడిపోయి ఎవరిళ్లకి వాళ్లు బయల్దేరాం.

నా ఇంటిదారి శ్మశానం పక్కనుంచి ఉంది. పగలెప్పుడూ నేనా శ్మశానానికి భయపడలేదు. కానీ ఇంకా పూర్తిగా తెల్లవారక పోవడంవల్ల నాకా శ్మశానాన్ని దాటుతున్నప్పుడు చాలా భయమేసింది. ఎలాగో ధైర్యం తెచ్చుకుని, గుండె చిక్కబట్టుకుని ముందడుగు వేశాను. ఇల్లు చేరాక చాలా రిలీఫ్‌గా ఫీలయ్యాను. నా భయం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ నా గదిలోకెళ్లి మంచంమీద మేను వాల్చగానే వెంటనే నిద్ర పట్టేసింది.

నేనిలా లేచి కాలకృత్యాలు మొదలెట్టానో లేదో, ఫ్రౌ యాకేల్‌వచ్చి గది తలుపు తట్టింది. తలుపు తీసి, "గ్యుటెన్ మోర్గన్ (గుడ్‌మార్నింగ్)" అని విష్ చేశాను.

ఆమె కూడా విష్ చేసి, "తెల్లవారు ఝామున మెట్ల దగ్గర చప్పుడయింది. ఇది మొదటిసారి కాదు. ఆ వైయాంగ్ ఇలా తరచుగా ఎక్కడికో వెళ్లి వస్తుంటాడు. అతనితో నాకు గొప్ప డిస్టర్బెన్సుగా ఉంది. ఎప్పుడు గది ఖాళీ చేస్తాడో ఏమో" అని చిరాకుగా గొణుక్కుని వెళ్లిపోయింది.

మొదటిసారి కాదని అంది కాబట్టి ఆమె నన్నుద్దేశించి ఆ మాటలు అనుండదని అర్థమైంది. ఐనా ఆ మాటలు నాకే తగిలి మనసు చివుక్కుమంది. ఐతే ఆ రాత్రి నేను నైట్‌క్లబ్బుకి వెళ్లొచ్చానన్న నిజం ఆమెకి చెప్పలేదు. చెప్పాలనీ అనుకోలేదు. సంజాయిషీ అవసరం లేనిచోట కూడా నిజాన్ని దాచాలనుకోవడం – సామాన్యుల బలహీనత ఏమో!

సృష్టిలో తీయనిది

స్నేహానికి నిర్వచనమైన రమణ–బాపులు 1977లో స్నేహం అనే సినిమా తీశారు. ఆ తర్వాతనుంచి ఎవరైనా, 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్' అంటే, 'ఏమో, మేము తీశాం' అని శ్లేషించేవారు రమణ.

మనిషికీ మనిషికీ ఏర్పడే గొప్ప బంధాల్లో స్నేహం ఒకటి. కొందరికి అనుకోకుండా స్నేహితులేర్పడతారు. కొందరికి స్నేహాన్వేషణే జీవితం. ల్యూనబర్గులో ఉండే ఫ్రౌ క్రిస్టా లూథర్ ఈ రెండో కోవలోకి వస్తుంది.

ల్యూనబర్గులో జర్మన్ కోర్సు పూర్తి కావచ్చింది. పది పన్నెండు రోజుల్లో మేమా ఊరొదిలి వెడతామనగా – మా క్లాస్‌మేట్సులో ఫ్రెంచ్ అమ్మాయి ఫ్రౌలైన్ కాసింబర్గ్ తనింటికి నన్నూ, నటరాజన్నీ ఆహ్వానించింది. ఆ రోజు సాయంత్రం ఆరుకి కాస్త ముందే ఇద్దరం ఆమె ఇంటికి వెళ్లాం. క్రిస్టా లూథర్ కాసింబర్గ్ హౌస్‌ఫ్రౌ. ఆమె కాసింబర్గుతో గతంలో జరిగిన హౌస్‌ఫ్రౌ ఔస్‌ఫ్లూగ్‌కి వచ్చిందిట. అక్కడ ఇండియన్స్ ఆమెకి ప్రత్యేకంగా అనిపించేరుట. ఇదివరలో విలువలు పాటించే జర్మన్సుకీ, ఈ ఇండియన్సుకీ చాలా పోలికలు కనిపించి, కాసింబర్గుకి చెప్పిందిట – ఒకసారి కొందరు ఇండియన్సుని తమ ఇంటికి పిలవమని. ఆమె మమ్మల్ని ఎన్నుకుంది.

క్రిస్టా వయసు ముప్పైకీ నలభైకీ మధ్యలో ఉండొచ్చనీ, ఎందుకో ముఖంలో ఇంకా ఎక్కువ వయసున్న బరువున్నదనీ అనిపించింది. కానీ ఆ బరువు మాటల్లోకి బదిలీ కాలేదు. ఇంచుమించు వెంటనే ఆమె మా జట్టులో, మాలో ఒకరిగా కలిసిపోయింది.

పాత అనుభవాన్ని బట్టి మేమామెకి బొకే ఇచ్చాం. థాంక్స్ చెప్పింది కానీ, అది మాత్రం రొటీనే.

అక్కడ మా జట్టులో మేము, కాసింబర్గు కాక – ఆమె కుమారుడు పదేళ్లవాడు, ఆ ఇంట్లోనే ఉంటున్న ఓ టర్కిష్ యువకుడు ఉన్నారు.

ఒకొక్కరి మాట తీరు అసామాన్యం. క్రిస్టా లూథర్‌మాటల్లోంచీ ఆత్మీయత ఎంతలా ఒలికిందంటే, కాసేపటికే నాకు నాస్వంతింట్లో ఉన్న అనుభూతి కలిగింది.

నటరాజన్ టీ తీసుకున్నాడు. నేను చల్లటి పాలు తాగాను.

నా గురించి కాసింబర్గ్ ద్వారా క్రిస్టాకి ముందే సమాచారం అందినట్లుంది. మిగతావారికి మాంసాహారం వండినా, నాకోసం ప్రత్యేకంగా వెజిటేరియన్ ఐటం చేసేనంది. అదేమిటో తెలియలేదు కానీ తినగలిగేలాగానే ఉంది.

టర్కిష్ యువకుడి ప్రవర్తన కాస్త వెకిలిగా ఉంది. ముఖ్యంగా క్రిస్టాతో చాలా చనువు ప్రదర్శించాడు. నాకది తప్పుగా అనిపించలేదు. కొద్ది క్షణాల పరిచయంలో మాకే చాలా ఆత్మీయంగా అనిపించింది క్రిస్టా. అలాంటిది చాలాకాలంగా ఆ ఇంట్లో ఉంటున్న అతని చనువు సహజమే అనిపించింది.

మనమున్న వాతావరణాన్ని బట్టి ఆలోచనలు మారతాయి. సంస్కారంపట్ల అవగాహనా పెరుగుతుంది.

పిలిచి వండింది అతిథులకి పెడితే, అది మామూలు విందు. క్రిస్టా మాకు మామూలు విందుతో సరిపెట్టే ఉద్దేశ్యంలో లేదు. "మీరిప్పుడు ఏదైనా ఇండియన్‌వంటకం చెయ్యాలి" అంది మాతో.

ఉన్నపళంగా ఏదో వంట చెయ్యమంటే – ఏంచేస్తాం అనేందుకు లేదు. అప్పటికే ఆమె బియ్యం, కూరలు, కొన్ని మసాలా దినుసులు కొని ఉంచింది. ఎలా చెయ్యాలో తెలియదు కానీ, ఇండియన్ వంటలు వేటితో చేస్తారో ఆమెకి కొంచెం ఐడియా ఉంది.

ఈ ప్రతిపాదనకి నటరాజన్ హుషారెక్కాడు. జర్మనీ వచ్చేక అతనికి వంట చెయ్యడం బాగానే అలవాటైంది. బాగా చేస్తానని కూడా అనుకుంటున్నాడు. ఇంతవరకూ తన వంటని తిని మెచ్చుకున్న బయటివాణ్ణి నేనే. తన పాకప్రావీణ్యాన్ని ఇతరులు, ముఖ్యంగా విదేశీయులు మెచ్చుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడనుకుంటాను – క్రిస్టా ఇలా అనగానే, తనిలా "నేను వెజిటబుల్ పులావ్‌చేస్తాను" అన్నాడు.

నటరాజన్ చెఫ్ ఐపోయాడు. నేను కూరలు తరగడం వంటి పై పనుల్లో సాయం చేశాను.

అతను తరిగిన కూరగాయలు బియ్యంలో కలిపి ఉడకబెట్టి పులావ్ చేశాడు. బంగాళాదుంపలు, ఉల్లిపాయలతో కూర చేశాడు. తినేవాళ్లలో పాశ్చాత్యులు కూడా ఉన్నారు కాబట్టి, కూరలో పర్చిమిర్చి బాగా తగ్గించి వేశాడు. అయినా కారం కాస్త ఎక్కువే అయినట్లుంది. తినేటప్పుడు క్రిస్టా కొడుకు, కాసింబర్‌గ్‌ల కళ్లల్లో నీళ్లు తిరగడం చూశాం. కానీ మర్యాదకో ఏమో – కూర కారంగా ఉన్నదని వాళ్లు ఒప్పుకోలేదు. రుచి చాలా బాగుందని మరీ మరీ నొక్కి చెప్పారు. క్రిస్టా కూర చాలా బాగుందని మెచ్చుకుంది. అందరిలోకీ మా వంటకం నచ్చింది టర్కిష్ యువకుడికి. అతను ఫోర్కు, చెంచా వాడకుండా చేత్తోనే పులావ్, కూర లొట్టలేసుకుంటూ తిన్నాడు.

భోంచేస్తూ అందరూ మధ్యమధ్య వైన్ తాగారు. నేను, క్రిస్టా కొడుకు నిమ్మరసం తాగాం.

క్రిస్టాకి నన్ను చూస్తే జాలేసినట్లుంది, "ఇంత మంచి వైన్ మిస్సవుతున్నావు. దీన్ని నీకు నిషేధించిన సంప్రదాయం గురించి నీకెలాగుందో కానీ, నాకు చాలా బాధగా ఉంది" అంది.

"అయ్యో! అనవసరంగా బాధపడుతున్నావు. నీకిప్పుడు రెండు విషయాలు చెప్పాలి. ఒకటి – నేను సంప్రదాయానికి లోబడాలనుకునే మనిషిని కాను. రెండు – నేను పుట్టి పెరిగిన సంప్రదాయం నాకు మద్యమాంసాల్ని నిషేధించలేదు. నాకు వైన్‌మీద ఆసక్తి లేదంతే!" అన్నాను.

క్రిస్టా ఒప్పుకోలేదు, "ఏ సంప్రదాయ నిషేధమూ లేకుండా వైన్‌మీద ఆసక్తి ఉండదంటే నమ్మడం కష్టంగానే ఉంది. ఐనా ఒకటి చెప్పు. నీది హిందూ మతమేగా? ఆ మతం ప్రకారం – ఇది చెయ్యొచ్చు, ఇది చెయ్యకూడదన్న నియమం లేదంటావా?" అంది.

అప్పుడామెకి నేను చెప్పాను, "హిందూత్వం జీవనవిధానమే కానీ, మతం కాదు. మాలో ఫక్తు మాంసాహారులు, ఫక్తు శాకాహారులు ఉన్నారు. మద్యం వర్జనీయమని ఎవరూ అనరు. అంతే కాదు, హిందువులు ఏ మతం దేవుణ్ణయినా పూజించుకోవచ్చు. మా సంప్రదాయాలు, ఆచారాలు చాలావరకూ వ్యక్తిగతం".

క్రిస్టా కళ్లలో ఆశ్చర్యం. నేను చెప్పింది – ఇండియా గురించీ, హిందూమతం గురించీ ఆమె విన్నవాటికి భిన్నంగా ఉన్నట్లుంది. నానుంచి సరైన సమాధానాలు లభిస్తాయనిపించిందో ఏమో – కొన్ని కీలకమైన ప్రశ్నలడిగింది. వాటిలో ఒకటి — "ఏ మతం వాళ్లయినా వారానికొకసారైనా ఆలయానికి వెళ్లాలి కదా, ఇక్కడ మీ గుడి లేకపోతే, ఏంచేస్తారు? చర్చికి వెడతారా?" అన్నది.

"ఎవరో రమ్మంటే తప్ప, నాకు నేనుగా గుడికి వెళ్లడం అరుదు. అలా ఏళ్ల తరబడి గుడికి వెళ్లని సందర్భాలున్నాయి. ఇక్కడికొచ్చేక గుడికెళ్లే ఆలోచనే రాలేదు. ఇక చర్చి విషయానికొస్తే – ప్రార్థనలు చెయ్యడానికైతే చర్చికి వెళ్లను. మిత్రులెవరైనా చూడ్డానికి రమ్మంటే తప్పక వెడతాను" అన్నాను.

క్రిస్టా కళ్లలో ఆశ్చర్యంతో కూడిన అపనమ్మకం. "మరి మీ దేశంలో ఆడవాళ్లమీద చాలా ఆంక్షలున్నాయి కదా! భర్త పోయిన మహిళకి మరో పెళ్లి చేసుకునే అర్హత లేదనీ, అసలామె వీధి ముఖమే చూడకూడదనీ విన్నాను. అది సబబేనా?" అంది.

నేనేదో చెప్పేలోగా నటరాజన్ అందుకుని, "నువ్వన్నది కొంత నిజం. మా పల్లెటూళ్లలో ఏ ఆడవాళ్లకైనా మగాళ్ల కంటబడ్డం నిషిద్ధం" అన్నాడు చటుక్కున. ఇండియా గురించి తనూ ఏదైనా చెప్పాలని అతని తాపత్రయం.

షాక్‌తిన్నట్లు చూసింది క్రిస్టా. తేరుకున్నాక నావంక, "దీనికేమంటావ్" అన్నట్లు చూసింది.

నేను తడబడకుండా సద్దుకున్నాను. "ఇండియా చాలా పెద్ద దేశం. మాలో ఎక్కువమంది నిరక్షరాస్యులు. అది ఆధారంగా చేసుకుని కొన్నిచోట్ల కొంతమంది పెద్దలు తమకి తోచిన నియమాలు విధించి పెత్తనం చెలాయిస్తుంటారు. నటరాజన్ చెప్పినలాంటివి అక్కడక్కడ జరుగుతూ ఉండొచ్చు. కానీ నేను పల్లెటూళ్లో చదువుకున్నాను. నా క్లాస్‌మేట్లలో ఆడపిల్లలున్నారు. టీచర్సులో ఆడవాళ్లున్నారు. అదలాగుంచితే

– మా దేశానికి ప్రధాని ఒక మహిళ. ఆమె విధవ. ప్రజలామెను శక్తి స్వరూపిణిగా ఆరాధిస్తారు. నాకు తెలిసి ఇంతవరకూ అమెరికాలోకానీ, జర్మనీలో కానీ మహిళలకు ఇంత హోదా దక్కలేదు" అన్నాను.

క్రిస్టా మౌనం వహించింది. ఆమె ఆలోచనలో పడిందని గ్రహించి నేనూ ఊరుకున్నాను. హిందూత్వం గొప్పతనాన్ని ప్రచారం చేసే ఉద్దేశ్యం నాకు లేదు. కానీ ప్రపంచంలో హిందూత్వమంతగా అపార్థానికి గురైన మతం మరొకటి లేదు. అందుకు కారణం – ఎవరికి వారు తమకు హిందూత్వం గురించి అంతా తెలుసనుకునే హిందువులే. తాము ఆచరించకపోయినా, లేని నియమాల్ని కూడా మతానికంటగట్టే అలవాటు చాలామంది హిందువులకుంది.

హిందూత్వం పేరిట నేను కొన్ని పద్ధతులు అనుసరిస్తున్నాను. అవి నాకు నచ్చాయి. ఆ మేరకు నాకు హిందూత్వంపట్ల స్పష్టమైన అవగాహన ఉంది. ఆ కోణాన్ని ఇతరుల ముందు, అందులోనూ విదేశీయులముందు ఉంచేటప్పుడు యథాలాపధోరణి పాటించను.

నటరాజన్ తన సబ్జక్టులో దిట్ట. హృదయం చాలా మంచిది. మతానికి సంబంధించిన విషయాల్లో ఏమాత్రం సీరియస్‌కాదు. ప్రస్తుతం క్రిస్టా లూథర్‌తో కాలక్షేపం కబుర్లకోసం మతాన్ని ఎన్నుకున్నాడు. ఆ ఊపులో తనకి తోచిన వివాదాస్పద విశేషాలు మరికొన్ని చెప్పాడు. ప్రతిసారీ నేను కలగజేసుకుని వివరణలతో సద్ది చెప్పాను. నా సమస్య ఏమిటంటే – ఇటు నటరాజన్ని నొప్పించకూడదు, అటు క్రిస్టాకి హిందూత్వం పట్ల పొరపాటు అభిప్రాయం కలక్కూడదు.

నా తపన నటరాజన్‌కి అర్థమైంది. తను చెప్పేది చెప్పేక, నేనిచ్చే వివరణలని అతను ఖండించలేదు. క్రిస్టా కూడా అతనేం చెప్పినా నానుంచి వివరణకోసం చూసేది.

అలా సరదాగా గడిచిపోతున్న సమయంలో అక్కడికి ఒక జర్మన్ మహిళ, యువకుడైన ఆమె కుమారుడు వచ్చారు. వాతావరణం కొంచెం గంభీరమైంది.

యువకుడు చలాకీగా ఉన్నాడు. తను సిలోన్‌లో పుట్టాననీ, ఇంగ్లీషు వచ్చుననీ అంటూనే, "ఇక్కడ జర్మనే మాట్లాడుదాం. మీకు ప్రాక్టీసవతుంది" అన్నాడు. అతనికి రాజకీయాలపట్ల ఆసక్తి ఎక్కువే. ఇండియా ఆటంబాంబ్ పేల్చడం గురించి ప్రస్తావిస్తే, క్రిస్టా మాట మార్చాలనుకుందేమో, "టైమ్ చాలానే అయింది. ఇక స్లైడ్స్ చూద్దామా" అంది.

ఐతే స్లైడ్‌షో అప్పటికప్పుడు అనుకున్నది కాదు. ఆమె ముందే ప్రొజెక్టర్ని సిద్ధం చేసి ఉంచింది.

స్లైడ్‌షో ఉన్నదని కాసింబర్గ్ మాకు ముందే చెప్పింది. అందుకని నటరాజన్ దేవదార్‌నడిగి కొన్ని ఇండియన్ స్లైడ్స్ తెచ్చాడు. సందర్భం వస్తే చూపించొచ్చని దేవదార్ ఇండియానుంచి కొన్ని స్లైడ్స్ తెచ్చాడు. అవీ ఇవీ కలిపి అక్కడున్న అందరం కుతూహలంగా స్లైడ్స్ చూశాం. కానీ ఎందుకో కాసింబర్గ్ అన్యమనస్కంగా ఉంది. అది చూసి టర్కిష్‌యువకుడు, "వైన్ బాగా కిక్ ఇచ్చినట్లుంది. ఈమాత్రం వైనుకే ఇలాగైపోతే, రేపు మీ హొటల్లో డాన్సెలా చేస్తావ్?" అన్నాడు.

కాసింబర్గ్ పారిస్‌లో ఓ హొటల్లో డాన్సర్ కమ్ రిసెప్షనిస్ట్. కష్టమర్సుకోసం ఆమె చాలా భాషలు నేర్చుకుంది. జర్మన్ నేర్చుకుందుకు ఇక్కడికొచ్చింది.

టర్కిష్ యువకుడి మాటలు వినగానే ఆమె చివాలున లేచి లోపలకెళ్లిపోయింది.

నాకు తెలుసు – ఆమె సున్నిత మనస్కురాలని. లాంగ్వేజ్ కోర్స్ మధ్య వచ్చిన సెలవుల్లో కోపెన్‌హాగన్ వెళ్లొచ్చి, "పారిస్‌లో పుట్టి పెరిగిన నాకు శృంగారప్రదర్శనల్లో విచ్చలవిడితనం కొత్త కాదు. కానీ కోపెన్‌హాగన్‌లో శృంగారం వేసిన వెర్రితలలకి తట్టుకోలేకపోయాను"

అని మాటల సందర్భంలో నా దగ్గర బాధపడింది. కానీ ఇప్పుడు టర్కిష్ యువకుని మాటల్లో, అంతగా డిస్టర్బ్ అవాల్సినదేమిటో అర్థంకాక ప్రశ్నార్థకంగా క్రిస్టాని చూశాను.

అప్పుడు క్రిస్టా అసలు విషయం చెప్పింది.

కాసింబర్గ్ కార్లో అనే ఓ ఇటాలియన్ యువకుణ్ణి ప్రేమించింది. జూలై చివరి వారందాకా ఇద్దరూ కలిసి తిరిగారు. ఆతర్వాత అతను రోమ్ వెళ్లిపోయాడు. మళ్ళీ వస్తానన్నాడు కానీ అప్పుడప్పుడు ఫోన్లు చేస్తాడే తప్ప తన రాక గురించి మాట్లాడ్డం లేదు. ఆ రోజు ఆమె ఇంట్లో లేని సమయంలో రోమ్‌నుంచి ఫోనొచ్చిందిట. ఆమె లేదని తెలిసి మళ్లీ రాత్రి ఎనిమిదికి చేస్తానన్నాట్ట.

టైము ఎనిమిదయినప్పట్నించీ ఆమె మనసంతా ఫోన్‌మీదనే ఉంది. ఇంకా ఫోన్‌రాలేదు.

క్రిస్టా అంటుందీ – ఆ ఇటాలియన్‌కి కాసింబర్గుపై మోజు తీరిపోయిందని.

మిగతావాళ్లం కబుర్లు కొనసాగిస్తూ రాత్రి పదయ్యేదాకా కాలక్షేపం చేసి, ఇక సెలవని లేచాం.

క్రిస్టాకింకా మాతో మాట్లాడాలని ఉన్నట్లుంది. ఆమె మాతో, "మీరిక్కణ్ణించి వెళ్లేలోగా మనం మరోసారి కలుసుకుందాం" అంది. సరేనన్నాను మామూలుగా.

"ప్రామిస్!?" అందామె వెంటనే. అప్పుడామెని చూస్తే ఆమె కళ్లు కూడా, "ప్రామిస్!?" అంటున్నాయి.

దాంతో అర్థమయింది – ఆమె మళ్లీ కలుసుకుందామన్న మాట యథాలాపంగా అనలేదని.

ఆమె చెప్పిందో, తనే పిలిచిందో కానీ సరిగ్గా మరుచటి వారమే కాసింబర్గ్ మమ్మల్ని వాళ్లింటికి ఆహ్వానించింది. ఆ రోజు నేను, నటరాజన్ కాస్త ఆలస్యంగా వెళ్లాం. పెద్దగా విశేషాలు లేవు కానీ, కాసింబర్గ్ చాలా హుషారుగా ఉంది. ఆమెకి కార్లోనుంచి ఫోనొచ్చిందిట. టర్కిష్ యువకుడు కూడా మంచి మూడ్‌లో ఉన్నాడు. నేను తెచ్చిన రవిశంకర్ సితార్ క్యాసెట్ విని అతను పరవశించిపోయాడు. ఆ అభిరుచి నేనూహించనిది.

క్రిస్టా నన్ను ఇండియన్ ఫిలాసఫీ గురించి అడిగింది. నాకు తెలిసినవి చెబితే శ్రద్ధగా వింది.

వాళ్లకి మా అడ్రసులిచ్చి, వాళ్ల అడ్రసులు తీసుకున్నాం. ఇండియా వస్తే తప్పక మా ఇంటికి రావాలని నేను, నటరాజన్ – వాళ్లకి మరీమరీ చెప్పాం.

"అది సరే, మీరు మాత్రం వెళ్లేలోగా మరోసారి మా ఇంటికి రావాలి" అందామె.

"రావాలని మాకూ ఉంది కానీ, ఇంక మేముండేది నాలుగు రోజులే" అన్నాను.

"అంటే ఇంకా నాలుగు రోజులుంటారనేగా?" అని నవ్వింది క్రిస్టా.

అభిమానం, ఆత్మీయత నిండిన ఆ నవ్వు మళ్లీ చూస్తామా అనుకున్నాను కానీ, క్రిస్టా సంకల్పబలం సామాన్యమైనది కాదని, సరిగ్గా రెండు రోజుల తర్వాత తెలిసింది.

ఆ సాయంత్రం పెద్ద వాన పడుతోంది. ఉన్నట్లుండి తలుపు తట్టిన చప్పుడైతే తీశాను. ఫ్రౌ యాకేల్!

"నీకోసం ఎవరో వచ్చారు" అందామె

ఎవరా అనుకుంటూ వెళ్లిచూస్తే ఇంటి గుమ్మం బయట నిలబడి ఉన్నారు కాసింబర్గ్, క్రిస్టా లూథరూ.

వాన బాగా పడుతోందేమో, గొడుగులున్నా కూడా కారు దిగి గుమ్మందాకా వచ్చేసరికే బాగా తడిసిపోయారు. లోపలికొస్తే తప్ప ఇంటి గుమ్మం దగ్గర తల దాచుకునే చోటు లేదు.

నేను వెళ్లేసరికి బయట హోరు గాలి, చలి, వాన. వాళ్లింకా ఇంటిబయట నిలబడి తడుస్తూనే ఉన్నారు. 'యాకేల్‌వాళ్లను లోపలకు తీసుకురావాల్సింది' – అనుకున్నాను.

ఆ మధ్య కాసింబర్గ్ పెరూ వెళ్లిందిట. అప్పుడు కొన్ని స్లైడ్స్ తీసుకుందిట. అవి ప్రోసెసై ఇప్పుడు వచ్చాయిట. అవి చూద్దామనీ, ఓ గంటలో బయల్దేరి వాళ్లింటికి రమ్మనమనీ, ఈ విషయం ఇంకా నటరాజన్‌కి కూడా చెప్పాలనీ అని చెప్పి కార్లో హడావుడిగా వెళ్లిపోయారు.

తర్వాత తెలిసింది నాకు – ఈ దేశాల్లో అపరిచితుల్ని చటుక్కున ఇంట్లోకి రమ్మని ఆహ్వానించరని. చిత్రంగా అనిపించింది. మన దేశంలో ఐతే తలుపు కొట్టినవాళ్లని అపరిచితులైనా సరే – కనీసం మంచినీళ్లు కావాలా అనైనా అడుగుతాం. అలాగని మన సంస్కృతిని గొప్పగా అనుకునేందుకేం లేదు. సాటి మనిషి అడుక్కు తింటుంటే ఏమాత్రం పట్టించుకోకుండా మన వైభవాన్ని మనం కొనసాగించగలం. అది ఇక్కడ వీరికి చిత్రంగానే కాదు, అమానుషంగా కూడా ఉండొచ్చు.

నటరాజన్‌వచ్చేదాకా ఆగాను. ఇద్దరం బయల్దేరే సమయానికి వాన తగ్గింది.

క్రిస్టా ఇల్లు మా ఇంటికి దగ్గరే. నడిచి అక్కడికి చేరుకున్నాం.

క్రిస్టా మునుపటిలాగే అభిమానంగా ఆదరించింది. నా అలవాట్లు గుర్తుంచుకుని పాలు సెర్వ్ చేసింది.

స్లైడ్స్ చూస్తే – పెరూ ఇండియాకంటే బాగా వెనుకబడిన దేశమని అర్థమైంది. దుకాణాల్లో అమ్మే సరుకులమీద ఈగలు వాలిన దృశ్యం వెగటుగా ఉంది.

అక్కడి పేదరికం చూసి తట్టుకోలేకపోయానని కాసింబర్గ్ చెబుతుంటే, ఆమె కళ్లలో తిరిగిన నీళ్లు అందుకు సాక్ష్యంగా బయటికొచ్చాయి. ఐతే అది స్లైడ్స్ చూసిన కాసేపే. ఆ తర్వాత ఆమె హుషారుగా ఉంది.

మాటల సందర్భంలో తెలిసింది – క్రిస్టాకి భర్త లేడని. పదేళ్ల కొడుకుమీదే ఆమె ప్రాణాలన్నీ.

పలకరింపులో, ఆదరణలో – క్రిస్టా లూథర్ ఆతిథ్యం ఇండియాని గుర్తు చేసింది. అమె పరిచయం కూడా నా అదృష్టం అనుకున్నాను.

అప్పటికి నా బెర్లిన్‌ప్రయాణానికి టికెట్ వచ్చేసింది. ఆ మాట క్రిస్టాకి చెప్పాను. "మన పరిచయం చాలా ఆలస్యంగా మొదలైంది" అందామె బాధగా.

వీడ్కోలు తీసుకుంటుంటే మా పరిచయం మరికాస్త ముందు జరిగితే బాగుణ్ణని నాకూ అనిపించింది.

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి

మా పరీక్షలు సెప్టెంబర్‌న అయ్యాయి. ప్యాసైనా, ఫెయిలైనా మాకొకటే ఐనా – ప్రిపరేషన్లో అశ్రద్ధ చూపినవారు తక్కువే. నేనూ బాగానే వ్రాశాను. మరి మాకు క్లాసులుండవు. ఆ సందర్భంలో ఆ రోజు సాయంత్రం క్లాస్‌మేట్సు అంతా కలిసి పార్టీ చేసుకున్నాం.

మ్బాయా పరీక్షలంత బాగావ్రాయలేదుట. టీచర్ షిమాంగ్ పాఠాలు బాగా చెప్పకపోవడమే కారణమని ఇంచుమించు టీచరు మొహంమీదే చెప్పాడు. షిమాంగ్ నొచ్చుకున్నాడనిపించింది. ఇండియన్సంతా కలిసి ఏకకంఠంతో షిమాంగ్ పాఠం చెప్పే విధానాన్ని మెచ్చుకున్నాం. టీచరు మొహం వెలిగింది.

పార్టీ ఏర్పాట్లు శర్మ, మ్బాయా, బ్రిట్టీ అనే అమ్మాయి చేశారు. పార్టీకి నేపథ్యంగా ఆహ్లాదకరమైన పాశ్చాత్య సంగీతం వినిపించారు. కేక్, వేరుశనగ పప్పు, చిప్సు, బిస్కట్సు, వైన్, కాఫీ, ఫలరసాలు సెర్వ్ చేశారు. ఫలరసాలకు బొత్తిగా డిమాండ్ లేక, కొన్న కాసిని ప్యాకెట్లే మిగిలిపోతే, అవి నాకిచ్చి పట్టుకుపొమ్మన్నారు.

పార్టీ చాలా సరదాగా జరిగింది. ఐతే ఇంకా అది వీడ్కోలు కాదు.

మా పరీక్షా ఫలితాలు సెప్టెంబర్‌న వచ్చాయి. ఆ ఉదయం మాకు ఎప్పటిలాగానే ఇన్‌స్టిట్యూట్‌లోనే ఫలహారం. తర్వాత మాకు సర్టిఫికెట్లు పంచారు. కొంతమందిమి కలిసి మా గురువు షీమాంగ్‌కి 46 డాలర్లు పెట్టి ఒక వాచీ, అదికాక ఒక విస్కీ బాటిల్ కానుకగా ఇచ్చాం. మనిషికి మూడు మార్కులు పడింది. నేను ఆ నెలకి ఎస్సెన్ కార్టేలు (మీల్స్ టికెట్లు) రెండే రెండుంచుకుని మిగిలిన నాలుగూ ఇచ్చేస్తే ఇన్‌స్టిట్యూట్‌వారు 18 మార్కులు వెనక్కిచ్చారు. హెన్నీ బెక్కర్ హొటల్లో భోజనం చేశాను.

ఆ సాయంత్రం చివరిసారిగా ఇన్‌స్టిట్యూట్‌లో స్నానం చేశాను. స్నానశాల తెర లాగి ఎవరైనా చూస్తారన్న బెంగ నాకప్పుడు లేదు. 'వియ్ మిస్ ఆల్ ది ఫన్' అనిపిస్తోంది. ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌చదువులమ్మ చెట్టు నీడలో కలిసిన మాకక్కడ అదే చివరి రోజు.

సాయంత్రం నాలుగుకి అబ్‌షీడ్ (ఫేర్‌వెల్) పార్టీ ఉంది. అక్కడ కోలా తాగుతుంటే, "రావ్, నువ్వేం మారలేదు" అన్నాడు మ్బాయా. ఆ మాటలో హేళన లేదు. వీడలేమంటు, వీడుకోలంటు వెళ్లిపోతున్నామన్న భావన ఉంది.

ప్రయాణ సన్నాహాలు

నా ప్రయాణం సెప్టెంబర్ 29న ఐతే, అందుకు సన్నాహాలు వారం రోజులు ముందరే మొదలయ్యాయి.

జర్మనీలో పౌరులకైనా, విదేశీయులకైనా రాకపోకలకు ఓ రికార్డుంటుంది. ల్యూనబర్గ్‌లో అడుగెట్టగానే గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌వారు మాచేత అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్) ఫారాలు నింపించారు. ల్యూనబర్గ్ వదిలేముందు వారు మాచేత అబ్‌మెల్డుంగ్ (డిరిజిస్ట్రేషన్) ఫారాలు నింపించారు. అవుంటే తప్ప అక్కడ మా ఉనికి చట్టబద్ధం కాదు. ఊరు మారితే అబ్‌మెల్డుంగ్, ఊరు చేరితే అన్‌మెల్డుంగ్ అక్కడ తప్పని సరి.

రాత్రిళ్లు ఓవర్‌టైం చేసి ఆబగా పాటలు రికార్డింగ్‌చేసుకున్నాం. ఇళ్లకు ఉత్తరాలు వ్రాసుకున్నాం. క్యాసెట్లలాంటివి పార్సెల్సులో పంపాం.

యాకేల్ ఇంట్లో పియానో ఉంది. ఆమె అప్పుడప్పుడు పియానో వాయిస్తూండడం తెలుసు. బయల్దేరేముందు ఆమె జ్ఞాపకంగా ఆమె పియానో సంగీతాన్ని రికార్డు చేసుకుంటానన్నాను. ఎంత ఉత్సాహపడిందో చెప్పలేను. ఆ ఉత్సాహంలో నేననుకున్నకంటే చాలా ఎక్కువసేపే వినిపించింది. ఆ విషయం రికార్డింగు అయ్యేదాకా నాకూ తెలియలేదు. ఐతే ఆమె సంగీతంకంటే ఎక్కువగా ఆమె ఉత్సాహం నన్ను అలరించింది.

ప్రయాణానికి రెండు రోజులముందే పెట్టె సద్దుళ్లు మొదలెట్టాను. నా సూట్‌కేస్ పెద్దదేంకాదు. నాకున్న సామానూ అట్టే లేదు. ఎటొచ్చీ కూడా తెచ్చుకున్న ఆవకాయ, టమేటా ఊరగాయ ఉన్నాయి. వాటిలోంచి ఊట లీకవకుండా జాగ్రత్త తీసుకోవాలి. అందుకని రోజుకోసారి వాటి పొజిషన్‌మార్చి చూసుకునేవాణ్ణి.

సెప్టెంబర్ 27న ఫ్రౌ హెన్నీబెక్కర్ హొటల్లో చివరిసారిగా భోజనం. ఆ రోజక్కడ నేనొక్కణ్ణే ఇండియన్ని. మిగతా ఇండియన్స్‌కి వేరే ప్రోగ్రాంలున్నాయి. ఆమెకు సంతకాలతో ఉన్న ఇండియన్స్ ఫొటోలు ఇచ్చాను. వీడ్కోలు చెబుతున్నప్పుడు ఆమె షేక్‌హ్యాండిస్తూ ఓసారి నా చెయ్యి నొక్కి వదిలింది. ఆ స్పర్శలోని ఆత్మీయతానుబంధం అనుభవైక వేద్యం.

స్నానానికి వంటిమీద బట్టలుండకూడదని ఖచ్చితమైన నిబంధన ఉండడంవల్ల అన్నాళ్లూ కూర్‌పార్కులో స్నానం చెయ్యలేదు. అక్కడ కూడా ఒకసారైనా స్నానం చెయ్యాలనుకుని, ప్రయాణానికి ఓ రోజు ముందు వెళ్లాను. అక్కడ డబ్బు కట్టి టోకెన్‌తీసుకోవాలి. టోకెన్ ఉంటేనే లోపలకెళ్లగలం, లోపల్నుంచి బయటకు రాగలం. ఆ రోజు నాకొచ్చిన టోకెన్‌నంబరు 313. విశేషమేమిటంటే జర్మనీ వచ్చేముందు భువనేశ్వర్లో నేను ఖాళీ చేసిన క్వార్టర్ నంబర్ అది. న్యూమరాలజీ నాకేదో శుభసంకేతాన్ని ఇస్తోందనిపించింది.

ఇంతకీ మావాళ్లు హడలగొట్టేశారు కానీ, నేను నా చారల డ్రాయరుతోనే స్నానం చేశానక్కడ.
ఎవరూ అభ్యంతరపెట్టలేదు. ఎటొచ్చీ ఆ స్నానం ఒక గొప్ప అనుభవం. అంతవరకూ స్నానంలో అంత దివ్యానుభూతి కలగలేదు. ఆ తర్వాత అంతా నటరాజన్ ఇంట్లో కలుసుకున్నాం. అక్కడే భోజనాలు.

వంట సదుపాయమున్న ఇండియన్సంతా తలో వంటకం తెచ్చారు. నటరాజన్ ఉప్మా చేశాడు. మధ్యాహ్నం 12 నుంచి, రాత్రి 9 దాకా ఏకదాటిగా పాటల రికార్డింగు కొనసాగింది. మాటలమధ్యలో ఫ్రౌ యాకేల్‌కి వీడ్కోలు కానుకగా ఏదైనా ఇండియన్ ఐటమ్ ఇవ్వలేకపోతున్నందుకు నేను అదేపనిగా బాధ పడుతుంటే – రామచంద్ర నాకు తన దగ్గరున్న ఓ తాజమహల్‌బొమ్మ ఇచ్చాడు. ఆ సందర్భంలో ఆ దేశంలో అంతకు మించిన ఔదార్యమేముంటుంది? నా మనసు అతడి పట్ల కృతజ్ఞతతో నిండిపోయింది.

రాత్రి ఇంటికొచ్చేరికి పదిన్నర. అప్పటికే నాకా ఊరితో, ఆ ఇంటితో, ఆ పరిసరాలతో ఏదో తెలియని అనుబంధం ఏర్పడిందేమో – ల్యూనబర్గులో నాకది తుది రాత్రి అంటే ఏదోలా అనిపించింది.

తెల్లారితే సెప్టెంబర్ 29. నేను బెర్లిన్‌కి ప్రయాణమవాల్సిన రోజు.

టాటా వీడుకోలు

ఆరోజు ఉదయమే లేచాను. ఆ రోజే నా ప్రయాణమని తెలిసి మనసెందుకో బాధగా మూలిగింది. వాచి చూసుకుంటే ఇంకా ఐదే అయింది. కాలం ఆగిపోయినట్లుందే అనుకున్నాను కానీ, ఆగింది కాలం కాదు, వాచి. రేడియో వింటే వాల్లు చెప్పిన టైమునిబట్టి కాలం ఆగిపోయి గంట దాటిందని అర్థమైంది. "ఇలా ఆగిపోతుంటే ప్రయాణంలో నాకు చాలా ఇబ్బంది" అని హెచ్చరించి వాచిని సరిచేశాను.

మరోసారి సామాను సద్దబోయాను. సూట్‌కేసు చిన్నది. సామానూ తక్కువ. సద్దడానికి ఎంతో సేపు పట్టలేదు.

చకచకా తెమిలి మెట్లు దిగి ఫ్రౌ యాకేల్‌ఇంటి తలుపు తట్టాను. ఆమెకు తాజమహల్‌ఇచ్చాను.

ఆమెకి తాజమహల్‌తెలుసు. చాలా సంబరపడింది. "థాంక్యూ రామచంద్రా" అనుకున్నాను మనసులో.

ఆమె నాకో పర్సు ఇచ్చింది. దానిమీద ల్యూనబర్గ్ బొమ్మ ఉంది. ఇంకా ఆమె తన ఫొటోలు కొన్ని ఇచ్చింది. జిమ్మర్ సూహే (ఇల్లు వెదకడానికి) పనికొస్తుందంటూ నాకో కాగితమిచ్చింది. అది ఆమె నాకిచ్చిన కండక్ట్ సర్టిఫికెట్. అందులో ఆమె నన్ను పొగిడిన తీరు ప్రబంధకవులకు మార్గదర్శకం. చదివి పొంగిపోయాను.

థాంక్స్ చెప్పి, 9.45కి టాక్సీని పిలవమన్నాను. కళ్లలో నీళ్లు తిరిగితే ఆమె చూడకూడదని గిరుక్కున వెనక్కి తిరిగాను. నా వెనుక కదలికల్ని బట్టి ఆమె కూడా వెనక్కి తిరిగిందని అర్థమైంది.

9.45కి టాక్సీ వచ్చింది. సూట్‌కేస్ టాక్సీలో పెట్టించి నేనూ టాక్సీలో కూర్చుని యాకేల్‌కి టాటా చెప్పాను.

"ఔఫ్ వీడర్‌జీహెన్!"

రోజూ బై చెప్పడానికి మామూలుగా అనుకునే ఆ తేలిక మాట – ఆ క్షణంలో ఎంతో బరువుగా తోచింది. జీవితంలో మళ్లీ ఆ ఊరినీ, ఆమెనీ చూస్తాననుకోను.

నా కళ్లలో నీళ్లు తిరిగాయి. యాకేల్‌కూడా కళ్లు తుడుచుకోవడం గమనించాను. సెంటిమెంటుకీ, అనుబంధాలకీ దేశవిదేశ విభేదముండదు కదా అనుకున్నాను.

టాక్సీలో నటరాజన్ ఇంటికెళ్లాను. అతనితోపాటు నేనూ అతని హౌస్‌ఫ్రౌకి బై చెప్పాను. ఆమె అభిమానంగా షేక్‌హ్యాండిచ్చింది.

నటరాజన్ నేనూ కలిసి అదే టాక్సీలో రైల్వే స్టేషను చేరుకున్నాం. టాక్సీకి ఎనిమిది మార్కులయింది.

స్టేషన్లోకెడుతూ జాగ్రత్తకోసం ఓసారి పాంటు జేబు తడిమాను.

నాలుగు నెలల్లో నేనక్కడ మిగుల్చుకున్న పదకొండువందల మార్కులున్న బరువైన జేబది. అప్పట్లో నాకది చాలా పెద్ద మొత్తం.

క్రమంగా స్టేషనుకి దేవదార్, కొరియా, రామచంద్ర, లాల్, గెసుండ్ గుప్తా, శర్మలు వచ్చారు. వాళ్లప్పుడు మిత్రుల్లా కాక దగ్గర బంధువుల్లా అనిపించారు.

ట్రయిన్‌సరిగ్గా సమయానికి వచ్చింది. వెంటనే ఎక్కాం. ల్యూనబర్గ్‌కి చెయ్యూపి బై చెప్పాం.

అక్కడి ప్రమాణాల్ని నిలబెడుతూ, సరిగ్గా పదకొండు గంటల పదహారు నిముషాలకు ట్రైన్‌బయల్దేరింది.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

తొలి విడత: ఫన్ నేనొక్కడినే

హానోఫర్ ముచ్చట్లు

ఈ భూమి మనిషిది. మనిషి అంటే మగాడూ కావచ్చు, మగువా కావచ్చు. వారిద్దరూ జంటగా కలిసినప్పుడే మనిషి అన్న పదం సంపూర్ణమౌతుంది. మన అర్ధనారీశ్వరతత్వం సూచించేది అదే!

అంటే జత కట్టని ప్రతి వ్యక్తీ సగం మనిషే. అలా అప్పుడు ట్రయిన్లో నాతో పయనిస్తున్న కొరియా, నటరాజన్, దేవ్‌దార్ – సగం మనుషులే. జత కట్టినా ప్రస్తుతానికి ఒంటరినే కాబట్టి నేనూ సగం మనిషినే.

పరాయి దేశం. సంపన్నదేశం. ఎన్నింట్లోనో ముందున్న దేశం. అక్కడ ఇప్పటికి నాలుగు నెలలు గడిపాం. కనీసం ఇంకో ఏడాది అక్కడ గడుపుతాం. బోలెడంత ఫన్.

నా మిత్రులు ముగ్గురూ ఆ ఫన్ ఎంజాయ్ చేస్తూ, మధ్యమధ్య భావిలో తమ జంట జీవితానికి సంబంధించిన కలలు కంటుంటారు. నేను మాత్రం ఆ ఫన్ నేనొక్కడినే అనుభవించాల్సొచ్చిందని మథన పడుతుంటాను.

అదీ వాళ్లకీ నాకూ తేడా!

ఇండియాలో మేము పని చేసే సంస్థల్లో బదిలీలుండవు. అందుకని చదువైనప్పట్నించీ ఒకే ఊళ్లో ఉద్యోగం. రిటైరయ్యేదాకా ఆ ఊళ్లోనే ఉంటాం. ఉద్యోగరీత్యా ఊరొదలడం కొంచెం కొత్తగా ఉంది.

నాలుగు నెలల్లో ల్యూనబర్గు మా ఊరైపోయింది. మేమంతా ఒకరికొకరయ్యాం. ఇప్పుడు ఎవరికివారుగా విడిపోవడమే కాదు, ల్యూనబర్గును కూడా మర్చిపోవాలి.

నేను దీర్ఘాలోచనలో ఉన్నాను. "అటు చూడు, వాళ్లెంత బాగున్నారో" అన్నాడు నటరాజన్.

చూశాను. ఇద్దరు జర్మన్ యువతులు. వయసు ఇరవైలోపే అనిపిస్తుంది. వాళ్లలో అందం, ఉత్సాహం ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయి.

చూడగానే కళ్లు తిప్పుకోలేకపోయాను.

అందం ఆడవాళ్ల సొత్తు. అందువల్ల మనుషుల్లో అందాన్ని అద్దం అవసరం లేకుండా చూడగల అదృష్టం మగాళ్లకే లభిస్తుంది.

కొంత ఆలోచన. కొంత ఆకర్షణ. కొద్ది క్షణాలు వాళ్లని కళ్లప్పగించి చూశాను.

ఇద్దరమ్మాయిలూ అది గమనించారు. ఏమనుకున్నారో, ఇద్దరూ ఒక్కసారి నన్ను చూసి మందహాసం చేశారు.

నేనది ఊహించలేదు. ఆ నవ్వుకి ఎలా స్పందించాలి?

వాళ్ల నవ్వు నిష్కల్మషంగా, అపరిచిత యువతులనుంచి అంతవరకూ నాకు అపరిచితమైన ఓ వింత స్నేహభావముంది.

"జీ సింద్ జేర్ ష్యోన్" (యు ఆర్ వెరీ బ్యూటిఫుల్) అన్నాను అప్రయత్నంగా ఇద్దర్నీ ఉద్దేశించి.

అక్కడ అపరిచిత యువతి అందాన్ని పొగడ్డం అభినందనే కానీ, గర్హించాల్సిన విషయం కాదు.

వాళ్లు కొంచెం సిగ్గుపడ్డారు. ఆ సిగ్గు వాళ్ల అందాన్ని రెట్టింపు చేసింది.

"డాంకే" (థాంక్స్) అన్నారు యుగళంగా. తర్వాత మా గురించి అడిగారు.

నాలుగు మాసాలు గ్యోతే ఇన్స్టిట్యూట్ జర్మన్ అభ్యసించామని చెప్పాను. వాళ్లు వెంటనే – అంత తక్కువ కాలంలో జర్మన్ ఎంతో చక్కగా మాట్లాడేనని మెచ్చుకున్నారు. వాళ్లకి ఇంగ్లీషు రాదుట.

ఇతర భాషలపై పట్టు విషయంలో నా సత్తా నాకు తెలుసు. మెచ్చుకోవడం వాళ్ల మర్యాద. రెచ్చిపోకుండా వీలైనంత తక్కువ మాట్లాడితేనే నా మర్యాద నేను నిలబెట్టుకున్నవాడినౌతాను.

వాళ్లకి "డాంకే" చెప్పి నా దృష్టిని వాళ్లనుంచి మరల్చాను.

జర్మనీలో చాలాచోట్ల గమనించాను. ఇద్దరు పౌరులు, ముఖ్యంగా ఆడవాళ్లు కలిస్తే, ఊపిరి తీసుకుందుకు కూడా ఆగకుండా కిచకిచమంటుంటారు. మాటలమధ్య వాళ్ల హావభావాలు తెగ మారిపోతుంటాయి.

నేను దృష్టి మరల్చుకోగానే ఆ యువతులిద్దరూ మళ్లీ వాళ్ల కబుర్లలో పడిపోయారు.

"ఛుపా రుస్తం నిక్‌లా యార్" అన్నాడు నటరాజన్.

అంతవరకూ వాళ్లా యువతుల్ని ఓరగానే తప్ప నేరుగా చూడలేదు. అందుకని వాళ్లకి ఆ చిరునవ్వులు దొరకలేదు. అలా నేను వాళ్లకి ఛుపారుస్తం అయ్యాను.

ఆ యువతులకి హిందీ అర్థం కాదు కాబట్టి మేమేమైనా మాట్లాడుకోవచ్చు. ఐతే మేమంతా సైంటిస్టులం. మా భాష మా హోదాకు తగ్గట్లుగానే ఉంది.

కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకున్నాం. నటరాజన్‌కి ఆ యువతుల్ని ఆకర్షించి ఓ చిరునవ్వు పొందాలని మనసుగా ఉంది. పలకరిస్తే భాష ఇబ్బంది.

"నువ్వోసారి పలకరించు. నీకేసి చూసినప్పుడు నేనూ వాళ్లకేసి చూస్తాను" అన్నాడు నటరాజన్ దేవ్‌దార్‌తో.

"ఏమని పలకరించను? పలకరించేక వాళ్లకీ మనకీ కామన్ టాపిక్సు ఏముంటాయి? ఏమైనా టాపిక్సు సృష్టించినా మన ప్రయాణ కాలం గంటా ఏడు నిముషాలు. అందులో ఇప్పటికి ఇరవైరెండు నిముషాలు ఐపోయాయి" అన్నాడు దేవ్‌దార్ – అసలుసిసలు యూనివర్సిటీ ప్రొఫెసర్‌లా.

నటరాజన్ తనని అడిగేలోగా కొరియా తనే అతడి భుజం తట్టి, "పలకరించడానికి నాకే ఇబ్బందీ లేదు కానీ, బయల్దేరే ముందురోజు క్షౌరం చేయించుకోవాలనుకున్నాను. కుదర్లేదు. నా జుట్టు పొడుగ్గా అసహ్యంగా ఉంది" అంటూ తన జుట్టుకీ ఆ పలకరింపుకీ లంకె పెట్టాడు.

మన మగాళ్లు ఆడపిల్లల్ని పలకరించడానికే ఇంతలా తర్జనభర్జన పడే ఆసక్తికరమైన రోజులవి.

నటరాజన్ దగ్గర హెయిర్ కటింగ్‌కి ట్రిమ్మర్ సెట్ ఉంది. దాన్ని కొరియామీద ప్రయోగిస్తే – ఆ యువతుల దృష్టి ఇటు మళ్లడంతోపాటు, ట్రయిన్లోనూ ఓ కొత్త కాలక్షేపం.

"మై నాయీ బనూంగా యార్" అన్నాడు నటరాజన్.

ఆశ్చర్యంగా కొరియా దీనికి అభ్యంతరపెట్టలేదు.

"ఇది జర్మనీ. కింద ఒక్క వెంట్రుక కూడా పడకూడదు. పడిందో బుక్కైపోయామే" అన్నాడు దేవదార్.

అప్పుడు చూశాను అద్భుతం. నటరాజన్ తన ఎయిర్ బ్యాగులోంచి ఓ గుడ్డ తీశాడు. ఉరేస్తున్నాట్లుగా కొరియా మెడచుట్టూ బిగించాడు. దానిని విడమర్చి కొరియాని చేత్తో పట్టుకోమన్నాడు. తర్వాత బ్లేడ్సున్న ఓ దువ్వెన, ఓ కత్తెర తీశాడు. ఐదు నిముషాల్లో కొరియా జుట్టు పొట్టిగా ఐపోయింది.

ఒక్క వెంట్రుక గుడ్డని దాటి పోలేదు. కొరియా క్రాపు కూడా ఎగుడుదిగుడుగా అనిపించలేదు.

వాళ్ల కోరిక ఫలిచి ఆ యువతులు మధ్యమధ్య వాళ్లని చూసి చిరునవ్వులు చిందిస్తూ తమ కబుర్లలో తామున్నారు.

"వెరీ ప్రొఫెషనల్. నీ ఇన్స్టిట్యూట్‌లో సైడ్ బిజినెస్ పెట్టొచ్చు" అంటూ దేవ్‌దార్ నటరాజన్ని అభినందించాడు.

"నువ్విక్కడంటున్నావా, నేను ఏకంగా ఇండియాలోనే...." అని నవ్వేశాడు నటరాజన్.

అతగాడు కొరియా జుట్టుని – ట్రయిన్లో ఉన్న చెత్తబుట్టలోకి పంపేశాడు.

"వాళ్లు మళ్లీ ఇటు చూడరేం?" అన్నాడు నటరాజన్ ఆ యువతుల గురించి.

"నువ్వు మొహమాటపెట్టి వాళ్లమీద కూడా నీ టాలెంటుని ప్రయోగిస్తావని భయపడుతున్నారేమో" అన్నాను.

ఏదేమైనా వాళ్లు మళ్లీ మమ్మల్ని చూడలేదు. సరిగ్గా 12.23కి మా ట్రయిన్ హానోఫర్ (హానోవర్) చేరుకుంది.

మేము ట్రయిన్ దిగుతుంటే, అప్పుడు మాత్రం ఆ యువతులు మాకు స్నేహపూర్వకంగా బై చెప్పారు.

నా చేతిలో ఓ సూట్‌కేసు. భుజానికి వ్రేలాడుతూ ఓ సంచీ. చీటికీ మాటికీ సూట్‌కేస్ తెరవాల్సిన అవసరం లేకుండా – బ్రష్షూ పేస్టూ సబ్బూ దువ్వెనా లాంటివీ, కొంచెం తేలికపాటి ఆహారమూ కాక ఓ స్వెటరు కూడా ఉన్నదా సంచిలో.

మిగతావాళ్లకీ ఒకో సూట్ కేసూ, ఓ హ్యాండు బ్యాగూ ఉన్నాయి – కాస్త సైజుల తేడాలో.

నేను సంచిలో మొయ్యడంకంటే వంటిమీద మొయ్యడం సులువని స్వెటర్ వేసుకున్నాను.

ప్లాట్‌ఫారంమీద కాలు పెట్టగానే, "కొత్తగా ఉంది" అన్నాడు నటరాజన్.

హానోఫర్ ప్లాట్‌ఫాం మాకు కొత్త కాదు. కొన్నాళ్లక్రితం ల్యూనబర్గునుంచి ఈ ఊరు చూడ్డానికొచ్చి ఇక్కడే దిగాం. అప్పుడు మాతో సూట్‌కేసులు లేవు. ఊరు చూడ్డమయ్యేక మళ్లీ – మాకు తెలిసిన ఊళ్లో, మాకు తెలిసిన ఇంట్లో, మేమెరిగిన మనుషులమధ్యకి – వెళ్లిపోతామన్న ధైర్యముంది.

ఇప్పుడు ల్యూనబర్గుకీ మాకూ ఋణం చెల్లిపోయింది. ఒకొక్కరు ఒకో కొత్త ఊరెళ్లి స్థిరపడి కనీసం ఏడాదిపాటు ఉంటాం.

నేను వెడుతున్నది చరిత్ర ప్రసిద్ధి గాంచిన బెర్లిన్ నగరం.

పై చదువులకని రాజమండ్రినుంచి వైజాగూ, ఉద్యోగానికి వైజాగునుంచి భువనేశ్వరూ వెళ్లేటప్పుడు ఎలాంటి అనుభూతులు కలిగాయో – అవే ఇప్పుడూనూ!

ఉన్నట్లుండి ల్యూనబర్గు నా స్వంత ఊరూ, బెర్లిన్ పరాయి ఊరూ ఐపోయాయి.

మేము నాలుగడుగులు వెయ్యగానే షూ పాలిష్ ఆటోమాట్ కనబడింది. దేవదార్ సరదా పడ్డాడు – ఆటోమేటిక్ యంత్రంలో బూట్ పాలిష్ చేయించుకోవాలని. అందుకు రుసుము 20 ఫెన్నిగ్సు. తన దగ్గర చిల్లరలేకపోయేసరికి నిరుత్సాహపడ్డాడు. మిగతా ఇద్దరి దగ్గరా కూడా

చిల్లర ఉన్నట్లు లేదు. కానీ నాదగ్గర ఒకటినుంచి యాభై ఫెన్నిగ్సు దాకా అన్ని రకాల నాణేలూ ఉన్నాయి.

అతడికో ఇరవై ఫెన్నిగ్సు నాణెమిచ్చాను. మా అందరికీ, ఆటోమాట్ పాలిష్ చూడ్డమే ఓ వింత. అతగాడికి అదనంగా షూ పాలిష్. మాకు కళ్లు మాత్రమే మెరిస్తే, అతగాడికి షూస్ కూడా మెరిశాయి.

ఇక మేము ఆ రోజంతా అక్కడే గడపాలి. ఐతే హొటల్లో దిగే ఉద్దేశ్యం మాలో ఎవరికీ లేదు. ఎందుకంటే –

రైల్వేస్టేషన్లో లాకర్ పేరిట చక్కని సదుపాయముంది. లాకర్‌కి ఉన్న చిన్ని కన్నంలో ఒక మార్కు, యాభై ఫెన్నిగ్సు నాణేలు వేస్తే అందులోంచీ తాళం చెవి బయటకొస్తుంది. తాళంచెవితో లాకర్ తెరిచి, అందులో సూట్‌కేస్ ఉంచి, లాకర్ మూసి, తాళం వేసేయొచ్చు. ఇరవైనాలుగు గంటల్లోపల ఆ తాళంతో లాకర్ని మళ్లీ తెరవచ్చు. ఆ టైం దాటితే మాత్రం మళ్లీ లాకర్ కన్నంలో ఒకటిన్నర మార్కులు వేస్తేనే ఆ తాళం పనిచేస్తుంది.

రోజంతా రోడ్లు పట్టి తిరగాలనుకుంటున్న మాకు, సామాను దాచుకుందుకు తప్ప, హొటలు రూమెందుకు?

మేము విన్న ప్రకారం ఈ లాకరు సదుపాయం పనితీరులో యూరప్‌లోని ఏ దేశమైనా కూడా జర్మనీ తర్వాతనేనట.

హానోఫర్లో హెర్రెన్ హౌసెన్ గార్డెన్స్ పేరెన్నికగన్నవి. ఇదివరలో వాటిని హడావుడిగా చూశాం. ఈసారి తీరుబడిగా చూద్దామనుకున్నాం.

మాలో ఇప్పుడు వచ్చిన పెద్ద మార్పు ఏమిటంటే, జర్మనీలో ఎంత కొత్త ప్రదేశంలోనైనా నిర్భయంగా, నిస్సంకోచంగా తిరగగల్గుతున్నాం. ఓ మ్యాప్ పట్టుకుని మాకు కావాల్సిన చోటుని వెదుక్కుంటూ వెళ్లిపోగలం. అక్కడి నగర పటాలు సామాన్యులకు కూడా సులభ గ్రాహ్యమయ్యేలా ఉంటాయి. చిరునామా తెలిస్తే తెలియని ప్రదేశాలే కాదు, ఇళ్లు కూడా అతి సులభంగా పట్టుకోవచ్చు.

ముందు హెర్రెన్ హౌసెన్ గార్డెన్స్‌కి వెళ్లాం నడుచుకుంటూ. గార్డెన్ ఇదివరకటికంటే చాలా బాగా అనిపించింది. కొన్ని ఫొటోలు తీసుకున్నాం. ఎటొచ్చీ ఆ రోజు వనవిహారానికి అంత అనువుగా లేదు. ఆకాశం మబ్బులతో నిండిపోయింది. అడపాతడపా వానజల్లులు.

ఆ వాతావరణంలో – ఇక ఊళ్లో ఏం తిరుగుతాం? గార్డెన్‌తోనే సరిపెట్టుకోవాలా అనుకున్నాం.

ఏదేమైనా ముందు భోజనం చేసి తర్వాత మిగతా ప్రోగ్రాం గురించి ఆలోచిద్దామనుకుని – మమ్మల్ని వానజల్లులనుంచి కాపాడగల నీడ కోసం వెదుకుతున్నాం.

ఆ ప్రయత్నంలో నీడకంటే ముందు మాకు ఫ్రాంకా తగిలాడు. ల్యూనబర్గులో మాతోపాటు తనూ ఓ గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి. దేశం ఫిలిప్పిన్సు.

మమ్మల్ని చూస్తూనే ఇంత మొహం చేసుకుని పలకరించి, "తోడుకోసం చూస్తున్నాను. భలే దొరికారు" అన్నాడు.

మాకైతే అతణ్ణి చూడగానే నీరసమొచ్చింది. తినడానికి ల్యూనబర్గునుంచే తలా ఒక ఐటమూ తెచ్చుకున్నాం. వాటిలో దేవదార్ వండిన అన్నం, కొరియా హస్తపాకంతో బంగాళా–సిమ్లామిర్చి కూర ఉన్నాయి. నటరాజన్ వైను తీసుకొస్తే, నేను ఆపిల్సు తెచ్చాను. మోసుకుని తిరగాల్సి ఉంటుందని తెలిసి, మరీ ఎక్కువ తెచ్చుకోలేదు. మా నలుగురికీ బొటాబొటిగా సరిపోవచ్చు.

ఫ్రాంకా చూస్తే ఉత్త చేతులతో ఉన్నాడు. అంటే అతడు మాకు ఆఫర్ చేసేది ఏమీ లేదు కానీ, మా తిండిలో మాత్రం అతగాడికీ వాటా ఇవ్వాలి. ఇండియాలో ఐతే వేరే సంగతి. మన తిండికి మొహం వాచినవాళ్లం – పంపకాల్లో మా అమృతాన్ని పంచుకుందుకొచ్చినవాడు మాకు రాహువులాగో కేతువులాగో అగుపించడూ?

"మేం చూసేవి నీకు నచ్చవు. నువ్వు చూసేవి మాకు నచ్చవు. అనుకోకుండా కలిశాం. చాలా సంతోషం. ఎవరిదారిన వాళ్లు వెడదాం" అన్నాడు కొరియా.

"నాకు మీతో తిరగాలని మహా సరదా. తీరకుండానే విడిపోతామనుకున్నాను. కానీ కలుసుకునే యోగముంది. ఇలా కలిశాం. ఇక ఈరోజంతా నేను మీతోనే" అన్నాడు ఫ్రాంకా.

నటరాజన్ కావాలని మా అభిరుచుల్ని తక్కువ చేసి అతణ్ణి నిరుత్సాహపరిచే ప్రయత్నం చేశాడు. కానీ ఫ్రాంకా నటరాజన్ మాట ఇలా పూర్తవగానే అలా భలే భలే అని ఉత్సాహపడిపోతున్నాడు.

అతడికి అమృతం పంచక తప్పదని తేలిపోయేక – "మరి ఇది భోజనాల టైము. మావన్నీ ఇండియాలో దక్షిణాది వంటలు. నీకేమో కాంటినెంటల్ ఫుడ్ ఇష్టం. ఏంచేస్తావ్?" అన్నాడు దేవదార్.

"ఓహ్, మీరు కూడా ఫుడ్ తెచ్చుకున్నారా? ప్లానింగ్ విషయంలో ఎవరినైనా మీ ఇండియన్సు తర్వాతే చెప్పుకోవాలి. నేనేమో చేతులూపుకుంటూ వచ్చాను. కొత్త ఊరు. ఏం తినాలీ ఎక్కడ తినాలీ అని ఇందాకట్నించి కొట్టుకుపోతున్నాను. మీకో విషయం తెలుసా? ఫుడ్ ఇండియాదైతే చాలు – ఏ ప్రాంతానిదైనా ఆప్యాయంగా లాగించేస్తాను. మా ఇంట్లో మా అమ్మనేది, నువ్వు ఇండియాలో పుట్టాల్సినవాడివిరా అని" అన్నాడు ఫ్రాంకా.

"పుట్టినా బాగుండేది. ఈ రోజు నువ్వూ ఓ ఐటం తెచ్చి ఉండేవాడివి" అనుకున్నాను.

ఫ్రాంకా ఇండియా గురించీ, ఇండియన్ భోజనం గురించీ తెగ పొగిడేస్తుంటే మాకందరికీ మనసుల్లో చిర్రెత్తుకొస్తోంది. చివరికి ఓ పార్కులో కొంచెం అనువుగా అనిపించిన బెంచిల దగ్గర భోజనాలకు కూర్చున్నాం.

కొరియా చేసిన కూర చాలా చాలా బాగుంది. దాంతో అన్నం, కూర అలా ఊదేశాం. అనుకున్నట్లే తిండి ఐదుగురికి సరిపోలేదు. అందుకని మేము కాస్త మొహమాటపడుతుంటే, "ఇలాంటి భోజనం దగ్గర మొహమాటం కూడదు" అంటూ ఫ్రాంకా మా అందరికంటే ఎక్కువ తినేశాడు. అతడి జోరు చూసి మేమూ కాస్త తొందరపడ్డాం కాబట్టి కానీ లేకపోతే ఆ పూట అతడు భీముడూ, మేము మిగతా నలుగురు పాండవులం అయ్యేవాళ్లం.

పాండవులు తెచ్చిన భిక్షని – వారి తల్లి కుంతీదేవి రెండు వాటాలు చేసి – ఒక వాటా భీముడికీ, ఇక వాటా మిగతా నలుగురికీ పెట్టేదన్న విషయం చదువరులకు విదితమేనని నా నమ్మకం.

పదార్థాలు అయిపోయినట్లు తెలియగానే, "మరీ ఇంత తక్కువా తెచ్చేది?" అని మందలించి పుండుమీద కారం చల్లాడు ఫ్రాంకా.

"మాకు బాగానే సరిపోయింది. నువ్వొస్తావని ముందుగా తెలిస్తే మరికాస్త తెచ్చేవాళ్లం" అన్నాను నేను – మాకు తక్కువయిందన్న భావం అతడికి కలక్కూడదని. ఒకసారి అతిథిగా అంగీకరించేక, అతణ్ణి అసంతృప్తికి గురి చెయ్యకూడదు కదా!

దానికి ఫ్రాంకా మరో విధంగా స్పందించాడు. "ఈరోజుకి భోజనం లేదనుకున్నాను. అందుకు మానసికంగా సిద్ధపడిపోయాను కూడా. ఆ సమయంలో ఇంత చక్కని భోజనం పెట్టి నాలో ఆకలిని రేపారు. మీకు ఆకలి తీరిపోతే అది మీ అదృష్టం. నేను మాత్రం ఇప్పుడిక ఎక్కడికైనా వెళ్లి ఏదో ఒకటి తినెయ్యాల్సిందే! థాంక్స్ ఫర్ యువర్ గ్రేట్ హాస్పిటాలిటీ" అని లేచాడు.

"నా దగ్గర కాసిని ఆపిల్సున్నాయి" అన్నాను వెంటనే. అమృతంలాంటి అన్నం, కూర ఇచ్చినవాళ్లం ఇంక ఆపిల్సుకి వెనకాడ్డమెందుకూ అనిపించి.

ఫ్రాంకా తల అడ్డంగా ఊపాడు. రాజుని చూసిన కళ్లతో మొగుణ్ణి చూస్తే మొత్త బుద్ధి కదా!
అతడిప్పుడు ఆపిల్ తినలేడుట. వుర్స్ట్ (హాట్‌డాగ్స్) లాంటివేమైనా ప్రయత్నిస్తానని అక్కణ్ణించి వెళ్లిపోయాడు. మరికాసేపు మాతో గడపాలన్న కోరిక అతడికున్నట్లు లేదు.

అతడలా వెళ్లిపోతాడని మేమూహించలేదు. మా దగ్గర అన్నం, కూర తినడం కోసమే మాతో కాసేపు కలిసేడా అనిపించింది కానీ జరిగింది కాకతాళీయమని మాకూ తెలియకపోలేదు.

నేను ఆపిల్సు తీశాను. కొన్ని తియ్యగా ఉన్నా, కొన్ని కొంచెం పుల్లగా ఉన్నాయి. ఆపిల్సు తినడమయ్యేసరికి మాకో విషయం అర్థమైంది.

కూర చాలా రుచిగా ఉండడంవల్ల ఆబకొద్దీ చాలలేదనిపించింది కానీ – మాకు కడుపు బాగానే నిండింది. ఆపిల్సు కొన్ని మిగిలిపోయాయి కూడా.

"కొన్ని ఆపిల్సు పుల్లగా అనిపించాయంటే, మనది కడుపు నిండిన బేరం అన్న మాట" అన్నాడు దేవదార్.

అప్పుడు మేము ఫ్రాంకా గురించి చెప్పుకుని సరదాగా నవ్వుకున్నాం. కానీ అతడు ఎందుకు మాతో కాసేపు కలిసి విడిపోయాడన్నది మాత్రం ఎప్పటికీ మిస్టరీయే.

ఉండుండీ ఉడిగుండీ వాన పడుతుండడం వల్ల మాకు ఊళ్లో తిరిగే అవకాశం లేదు. వాతావరణం అనువుగా ఉందని, నటరాజన్ వైన్ బాటిల్, చిన్న గ్లాసులు బైటకి తీశాడు. నా మిత్రులు ముగ్గురూ కాసేపు వైన్ సిప్ చేశారు.

"తిరగడానికి లేదు. కూర్చుని ఎంతసేపు కబుర్లాడుతాం. ట్రయిన్‌కేమో ఇంకా చాలా టైముంది. ఫిల్మ్ చూద్దామా" అన్నాడు దేవదార్.

అక్కడ సినిమా అంటే వేరే చెప్పాలా – నీలి చిత్రమే!

కొంత కాలక్షేపంకోసం. కొంత ఇంకా ఆసక్తి చావక. 'సెక్స్ ప్రాక్సిస్ – 74' సినిమా పేరు. సినిమాకి ఓ పేరుండాలి కాబట్టి కానీ పేరులో ఏముంది?

మన శుకసప్తతి కథల్లాగో, మదనకామరాజు కథల్లాగో – ఎంతో కొంత కథ ఉండి – ఆపైన వాళ్లిష్టం – ఏం చూపిస్తారో చూపించనివ్వండి. తిండిపోతు ఆబగా ఒకే పదార్థాన్ని గంటల తరబడి తిన్నట్లు పచ్చి శృంగార దృశ్యాలు నిరవధికంగా గంటల తరబడి 'చూసి' ఆనందించే వయసు, స్థాయి కాదు మాది!

అప్పుడవి చాలా కొత్త కాబట్టి – స్వానుభవంలో రెండోసారి కాబట్టి – ఆ చిత్రం తనువుకి కలిగించే అనుభూతులూ తీసిపారెయ్యతగ్గవి కాదు. ఇండియన్సుమి కాబట్టి ఎవరి భావాలు వాళ్లం మనసుల్లోనే దాచుకున్నాం.

రాత్రి పదకొండు గంటలకల్లా సినిమా అయిపోయింది. ఆ సినిమా ప్రభావం మమ్మల్ని మామూలు మనుషుల్ని చెయ్యడానికి కనీసం పావుగంట పట్టింది.

అంత రాత్రి పూట రోడ్లమీదేం తిరుగుతాం! నడుచుకుంటూ రైల్వేస్టేషను చేరుకున్నాం.

దేవదార్, కొరియాల ట్రయిన్ ఇంచుమించు వెంటనే వచ్చేసింది. ఇక నేను, నటరాజన్ మిగిలాం.

హానోఫర్‌నించి బెర్లిన్ వెళ్లే ట్రైన్ రాత్రి ఒంటిగంటం పావుకి. అంటే రెండు గంటలపైన వెయిటింగ్. రాత్రి కావడంవల్ల ఆ వెయిటింగ్ బాగా బోరు కొట్టింది. ఏమైతేనేం కాలం ఆగదు కదా....

ట్రయినొచ్చే టైముకి లాకర్లోంచి సూట్‌కేస్ తీసుకున్నాను. ట్రైన్ రాగానే అందులో దూరి నటరాజన్‌కి బై చెప్పాను. అతడు వెళ్లాల్సిన ఊరు వేరు. ఆ ట్రైన్ కోసం మరికాసేపు ఎదురుచూడాలి....

బెర్లిన్ ద్వీపయాత్ర

నా సీట్లో కూర్చున్నాను. ట్రయిన్ లోపల వెచ్చగా బాగుంది.

నా ఎదుటి సీట్లో ఓ జంట కూర్చున్నారు. వయసు, ఉత్సాహం – రెండూ జతపడి, వాళ్లు నన్ను పట్టించుకోకుండా తమ సరదాలో తామున్నారు. అలా వేడెక్కిపోతున్నారో ఏమో, మధ్యమధ్య బోగీ కిటికీ తలుపులు తెరిచి కాసేపుంచి మళ్లీ మూసేస్తున్నారు.

కిటికీ తీసినప్పుడల్లా చలిగాలి రంయిమని లోపలికొస్తోంది. అది నన్ను గజగజ వణికిస్తోంది. ఆ జంటమాత్రం సముద్రంలో బడబాగ్నిలా ఆ చలిగాలికి ఏమాత్రం చలించడం లేదు.

కిటికీ తలుపులు తియ్యొద్దని చెప్పాలనుంది కానీ మొహమాటం వేసింది. చలికి తట్టుకునే అలవాటుంది కాబట్టి ఎలాగో కాసేపటికి నిద్ర పట్టింది. అలసట కూడా తోడై ఆ నిద్రని గాఢం చేసిందనుకుంటే – బెర్లిన్ చేరేలోగా మధ్యలో ఓసారి టికెట్టు చెకింగ్‌కీ, రెండుసార్లు పాస్‌పోర్టు చెకింగుకీ వచ్చినవాళ్లవల్ల నిద్రాభంగమయింది.

ప్రయాణం మధ్యలో పాస్‌పోర్ట్ చెక్ చెయ్యడానికి కారణముంది.

రెండవ ప్రపంచయుద్ధానికి ముందుదాకా డాయిచ్‌లాండ్ అనగా జర్మనీ ఒకే దేశం. యుద్ధం తర్వాత అది తూర్పు పశ్చిమ భాగాలుగా విడిపోయింది.

రెండు భాగాలూ కలిసున్నప్పుడు బెర్లిన్ జర్మనీ ముఖ్యపట్టణం. విడిపోయేక బెర్లిన్ నగరం తూర్పు జర్మనీలో ఉండిపోయింది.

అయితే బెర్లిన్ వంటి మహానగరాన్ని వదులుకుందుకు పశ్చిమ జర్మనీ ఒప్పుకోలేదు.

తమ దేశం మధ్యలో ఉన్న పట్టణాన్ని వదులుకోవడానికి తూర్పు జర్మనీ ఇష్టపడలేదు.

అప్పుడు రెండవ ప్రపంచయుద్ధంలో నెగ్గిన అగ్రరాజ్యాలన్నీ ఒక ఒప్పందానికొచ్చి, బెర్లిన్ నగరాన్ని కూడా రెండు భాగాలుగా విడగొట్టి రెండు దేశాలకీ పంచాయి.

తూర్పు బెర్లిన్ తూర్పు జర్మనీకి రాజధాని. దాన్ని ఆనుకునే ఉన్న పశ్చిమ బెర్లిన్ – కావడానికి పశ్చిమ జర్మనీలో ఒక భాగమైనా, ఉండడం తూర్పు జర్మనీలోనే ఉంది.

ఈ పరిస్థితి కొన్ని విచిత్రమైన ఏర్పాట్లకి దారి తీసింది.

తూర్పు జర్మనీ 'ఇనుప తెర'ల చాటున ఉండే అప్పటి రష్యాని అనుసరించే కమ్యూనిస్టు దేశం. పశ్చిమ జర్మనీ పాశ్చాత్యుల స్థాయి స్వేచ్ఛకి మారుపేరు.

అలాంటప్పుడు తూర్పు బెర్లిన్ పౌరులకి – తమ భాషనే మాట్లాడే సహోదరులతో నిండిన – పశ్చిమ బెర్లిన్ నగరానికి వలస పోవాలనిపించడం సహజం. అలా జరక్కుండా – తూర్పు జర్మనీ – తూర్పు బెర్లిన్ నగరానికి నిర్దుష్టమైన ఎల్లలు నిర్ణయించింది. ఆ ప్రకారం గోడకట్టి రెండు నగరాల్నీ భౌతికంగా వేరు చేసింది.

ఆ వేర్పాటులో అంకెలు, కొలతలే తప్ప మానవత్వం లేదు.

ఆ గోడ కట్టినప్పుడు ఎన్నో ఇళ్లు రెండయ్యాయి. కుటుంబాలు విడిపోయాయి. బంధుత్వాలు విడిపోయాయి. చరిత్ర పుటల్లో ఆ గోడ నిర్మాణమొక కన్నీటిగాథ.

నేనిప్పుడు పశ్చిమ జర్మనీకి చెందిన పశ్చిమ బెర్లిన్‌కి వెడుతున్నాను. కానీ ఆ నగరం తూర్పు జర్మనీలో ఉండడంవల్ల – నా పాస్‌పోర్ట్ ఒకటికి రెండు సార్లు చెక్ చెయ్యబడింది.

చుట్టూ తూర్పు జర్మనీ. మధ్యలో పశ్చిమ జర్మనీకి చెందిన పశ్చిమ బెర్లిన్. డాయిచ్‌లాండే బెర్లిన్ ద్వీపే అనడంలో నా ఆంతర్యమిదే.

ఊరు కొత్త. ట్రయిన్ దిగేక రైల్వేస్టేషన్లో సదుపాయాలెలా ఉంటాయో తెలియదు.

ఎందుకైనా మంచిదని తెల్లారి అయిదున్నరకల్లా లేచి ట్రయిన్లోనే కాలకృత్యాలు కానిచ్చేశాను.

ట్రయిన్ పశ్చిమ బెర్లిన్ స్టేషన్ చేరుకునేసరికి టైం ఆరున్నర కావస్తోంది.

***

తొలి రోజు

నిన్నటి అనుభవముందిగా – స్టేషన్లో దిగీ దిగగానే ముందు సూట్‌కేస్ లాకర్లో పెట్టేశాను. లాకర్ రుసుము హానోఫర్లో ఒకటిన్నర మార్కులు కానీ, ఇక్కడ అర మార్కే. అంటే యాభై ఫెనిగ్స్.

అదయ్యేక ముందోసారి స్టేషనంతా తిరిగాను.

స్టేషన్ చాలా పెద్దది. వాతావరణం కొత్తగా ఉంది. నెమ్మదిగా స్టేషన్నించి బయటపడి చుట్టూ చూస్తే –

కళ్లు చెదిరిపోయాయి.

అంతవరకూ చూసిన హానోఫర్, హ్యాంబుర్గ్, ల్యూబెక్ నగరాలన్నీ ఒకెత్తు, ఈ నగరమొక ఎత్తు – అనిపించింది.

స్టేషన్ బయటకు రాగానే ఎదురుగా ఒక చర్చిలాంటిది కనిపించింది. ఆ చర్చి గోపురం కూలిపోయింది. అదేమిటో, అంత సంపన్నదేశంలో దాన్నలా ఎందుకు వదిలేశారో అప్పుడు నాకు తెలియలేదు. రెండవ ప్రపంచయుద్ధంలో జరిగిన బాంబింగ్‌కి గుర్తుగా దాన్నలా వదిలేశారని తర్వాత తెలిసింది.

ఆ చర్చి వెనుకనే 22 అంతస్తుల భవంతి ఉంది. అది ఐరోపా సెంటర్. పై అంతస్తుమీద – ఊళ్లో ఎక్కణ్ణించి చూసినా కనబడేలా ఒక వలయం తిరుగుతోంది. అందులో ఎన్నో షాపులు, సినిమా థియేటర్లు, ఆటస్థలాలు, క్లబ్బులు, ఆఫీసులు వగైరాలున్నాయి.

కళ్లముందు తళతళ మెరిసిపోతున్న రోడ్లు, తూనీగల్లా దూసుకుపోతున్న కార్లు, కళ్లు చెదిరిపోయేలా షాపులు.

ఒక పల్లెటూరివాడు మొదటిసారిగా బొంబాయిలో అడుగు పెట్టినట్లుంది నా స్థితి.

ధైర్యం తెచ్చుకుందుకు సుమారు పది నిముషాలు పట్టింది.

మనసులో వేరే భయం –

ఆ భయం నగరం పరిమాణాన్ని చూసి కాదు. దేశం కాని దేశంలో, ఇంతటి మహానగరంలో ఉండడానికి నాకో చిన్న గది ఎలా దొరుకుతుంది? దొరికినా అద్దె నాకు అందుబాటులో ఉంటుందా?

బెర్లిన్లో టెక్నికల్ యూనివర్సిటీలో భాగమైన ఇన్‌స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ కెమికల్ టెక్నాలజీ)లో డాక్టర్ రాలెక్‌తో కలిసి నేను పని చేయాల్సి ఉంది. అప్పటికి నేను నా మకాం ఏర్పాట్ల గురించి డాక్టర్ రాలెక్‌కి ఉత్తరం రాసి ఉన్నాను. ఆయన నా గురించి గది చూసి ఉండొచ్చు. చూసి ఉండకపోతే, నేనే గది వెతుక్కోవాలి. గది దొరికేదాకా ఏదైనా హటల్లో రూం తీసుకుని ఉండాలి.

జర్మనీలో లాడ్జింగు ఛార్జిలు నాకు అందుబాటులో ఉండవని తెలుసు.

డబ్బు. అది దండిగా ఉంటే మనిషి ఆలోచనలు మరో విధంగా ఉంటాయి. నా పరిస్థితి వేరు. వేసే ప్రతి అడుగులోనూ డబ్బు ఆలోచన రాక తప్పదు. అలాగని అధైర్యపడిపోకూడదు.

మనసుకి ధైర్యం చెప్పుకుని తక్షణకర్తవ్యమేమిటా అని ఆలోచించాను.

ముందు నా ఇన్స్‌టిట్యూట్‌కి వెళ్లాలి. టాక్సీని పిలిస్తే దారీ, అదీ టాక్సీవాలాయే చూసుకుంటాడు. నేరుగా ఆఫీసుకి వెళ్లిపోవచ్చు. కానీ అదిక్కడికి ఎంత దూరమో తెలియదు. కొత్త చోటు. కొత్తవాడినని తెలిసి టాక్సీవాలా ఎంతడుగుతాడో ఏమో!

దబ్బు. మళ్ళీ దబ్బే– నా ఆలోచనల్ని ముందుకు నడిపిస్తూ శాసించింది.

చేతిలో సామాను లేదు. కాళ్లలో నడిచే ఓపిక ఉంది.

నాకు తెలిసి ఈ దేశంలో ప్రతి రైల్వే స్టేషన్లోనూ నగరానికి మార్గదర్శకంగా ఓ పటం ఉంటుంది. దాన్ని పట్టుకుంటే అది చూసి ముందు నా ఇన్స్‌టిట్యూట్ రైల్వే స్టేషనుకి ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. అందుకోసమని స్టేషనంతా కలయదిరిగాను. కానీ ఎక్కడా పటం కనబడలేదు.

అదేపనిగా మళ్లీ మళ్లీ తిరిగాను. పటం కనబడలేదు.

చివరికి కనబడ్డవాళ్లలో కాస్త అనువుగా అనిపించినవాళ్లని పలకరిస్తూ వాకబు మొదలెట్టాను.

నేను సరిగ్గా చెప్పలేకపోయానో ఏమో – కొంతమంది అర్థం కాక పటం ఏమిటన్నట్లు అదోలా చూశారు. అర్థం చేసుకున్నవాళ్లలో కొందరు టూరిస్ట్ గైడ్ పుస్తకాలు అమ్మే షాపులు చూపించారు.

ఇలా ఊళ్లో దిగగానే అలా టూరిస్ట్ గైడ్ పుస్తకాలకోసం డబ్బు ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. టైం కూడా చాలా ఉంది కాబట్టి పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాను. చివరికి ఓ దారి కనిపించింది.

మన దేశంలో ముంబై వంటి పెద్ద నగరాల్లో ఉన్నట్లే ఇక్కడా లోకల్ రైల్వే సర్వీసుంది. ఎటొచ్చీ ఇక్కడ అది రెండు మార్గాల్లో ఉంటుంది. ఒకటి ఊ బాన్ అంటే అండర్‌గ్రౌండ్ రైల్వే. ఒకటి ఎస్ బాన్ (ష్నెల్ అంటే వేగంగా పోయే, బాన్ అంటే రైలు). ఎస్ బాన్ – భూమ్మీద కట్టిన వంతెనమీద రైల్వే మార్గం.

నాకు కావాల్సిన నగర పటం – ఆ స్టేషన్‌లోనే ఉన్న అండర్‌గ్రౌండ్ రైల్వే స్టేషన్లో దొరికింది. అందులో చూస్తే – నేను వెళ్లాల్సిన ఇన్స్‌టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ (ఇన్స్‌టిట్యూట్ ఫర్ కెమికల్ టెక్నాలజీ) స్టేషనుకి చాలా దగ్గర్లో ఉంది.

ఒక కాగితంమీద వివరాలు, గుర్తులు వ్రాసుకున్నాను. స్టేషను బయటికొచ్చి పటంలో సూచించిన దారిలో నడక ప్రారంభించాను. స్టేషన్లో లభించిన వివరాలు ఎంత స్పష్టంగా ఉన్నాయంటే – సరిగ్గా పదిహేను నిముషాల్లో ఆ సంస్థని చేరుకోగలిగాను.

ఇన్స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ ఆరంతస్తుల భవనం. చూడగానే అందులో ఏడాదిపాటు పనిచెయ్యబోతున్నానన్న భావన నాలో ఉద్వేగాన్ని కలిగించింది.

కింది అంతస్తులో ప్రవేశద్వారం చేరి తలుపు తొయ్యగానే పెద్ద హాలు. అక్కడే ఉంది రిసెప్షన్. అక్కడ నన్ను పరిచయం చేసుకుని డాక్టర్ రాలెక్ గురించి అడిగాను. ఆయన రెండో అంతస్తులో ఉంటాడని తెలిసింది.

అక్కడ లిఫ్టు ఉంది. అది భువనేశ్వర్లో మా ఆఫీసు లిఫ్టుకి కనీసం మూడు రెట్లు పెద్దది. అందులో పైకి వెళ్లాను. అక్కడ కనబడిన వాళ్లని వాకబు చేస్తే – అప్పటికి రాలెక్ ఇంకా డిపార్ట్‌మెంటుకి రాలేదని తెలిసింది. ఆయనింకా రాకపోతేనేం, ఆయనుండే చోటుకే చేరానన్నమాట.

చేరాల్సిన చోటుకి సులభంగా చేరుకున్నానన్న సంతోషంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

రాలెక్ రావడానికి ఇంకా టైముందని తెలిసింది. ఈలోగా ఇంకేమైనా చక్కబెట్టుకోవాల్సిన పనులున్నాయా అని ఆలోచనలో పడ్డాను. రైల్వే స్టేషన్నించి నా అంతట నేను కాలినడకన ఆ సంస్థని చేరుకోగలగడం నా ఆత్మస్థయిర్యాన్ని పెంచింది.

నేనిప్పుడు చేరుకున్న భవనం టెక్నిషే యూనివర్సిటేట్‌కి (యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ) అనుబంధ సంస్థ. ఆ యూనివర్సిటీ కార్యాలయం ఈ భవనానికి ఎదుటనే ఉన్నట్లు తెలిసింది. ఒకసారి చూసొద్దామనుకున్నాను.

అందుకు రోడ్డు క్రాస్ చెయ్యాలంతే!

రోడ్డు చాలా పెద్దది. నాలుగు లేన్లలో – అటూ ఇటూ వన్‌వే ట్రాఫిక్కున్న రెండు భాగాల ఆ రోడ్డు – కారులే నీళ్లనిపించే జీవనదిలా ఉంది. అందులో నియమోల్లంఘనమనే మొసళ్లు లేకపోవడంవల్ల అవతలివైపుకు అనాయాసంగానే చేరుకోగలిగాను.

యూనివర్సిటీ కార్యాలయమున్న ఆ భవనం చాలా పెద్దది. రెండవ ప్రపంచయుద్ధంలో ఆ భవనం బాంబింగుకి గురైందిట. పునర్నిర్మాణంలో – బాగున్నమేరకు అలాగే ఉంచి, మిగతాదంతా కొత్తరకం ప్లానుతో అనుసంధించి పెద్ద భవనంగా కట్టేరుట. అందువల్ల లోపల చాలా గజిబిజిగా ఉంటుంది. ఒకసారి అందులో అడుగు పెట్టేక కొత్తవారికి అందులోంచి బయటపడ్డం కష్టమే. ఆ క్షణంలోనే నేనా భవనానికి మయసభ అని పేరు పెట్టుకున్నాను.

ఆ మయసభలో విదేశీయుల సహాయార్థం ఓ ఆఫీసుందని తెలుసు. వాకబు చేసుకుంటూ ఆ ఆఫీసుకి వెళ్లాను. వాళ్లు నా వివరాలు నోట్ చేసుకుని 'జిమ్మర్ పెర్మిట్లుంగ్' (అకామడేషన్ సర్వీస్) చిరునామా ఇచ్చారు. ఇల్లు వెదకడంలో 'జిమ్మర్ పెర్మిట్లుంగ్' వాళ్లు నాకు సాయపడగలరట.

ఆ తర్వాత ఆ భవనంలోంచి బయట పడదామంటే నావల్ల కాలేదు. వాళ్లనీ వీళ్లనీ అడిగి కష్టంమీద బయటకొచ్చాను. కార్ల జీవనదిలో ఈదుకుంటూ తిరిగి ఎదుటి భవంతికి వెళ్లి లిఫ్టులో రెండో అంతస్తు చేరుకున్నాను.

అప్పటికి డాక్టర్ రాలెక్ వచ్చేడు. ఆయన అక్కడివాళ్లలాగే చాలా తెల్లగానూ, అక్కడివాళ్లు చాలామందికంటే చాలా పొడుగ్గానూ ఉన్నాడు. వెనుకనుంచి ఎవరో తరుముతున్నట్లు హడావుడిగా మాట్లాడ్డం ఆయనకు అలవాటు అనిపించింది. నాతో పూర్తిగా జర్మన్ భాషలోనే మాట్లాడేడు.

నాలుగు నెలల గ్యోతే ఇన్‌స్టిట్యూట్ శిక్షణ ఊరికే పోలేదు. నాకు రాలెక్ మాటలు అర్థం కావడమే కాదు, నేను కూడా ఆయనతో జర్మన్లోనే ధారాళంగా సంభాషించగలిగాను.

ఐతే రాలెక్ ఉభయభాషా ప్రవీణుడు. అందువల్ల జర్మన్ పదాలు స్ఫురించనప్పుడు కురుక్షేత్రంలో కర్ణుడిలా నీరసించిపోకుండా ధైర్యంగా ఇంగ్లీషుకి మారిపోతూ మ్యానేజ్ చేశాను.

అప్పటికి రాలెక్ నా మకాంకోసం తనవంతు కృషి కొంత చేశాడు. అక్కడ స్టూడెంట్ హాస్టల్లో రెండు వారాలకుగానూ నాకోసం ఓ గది బుక్ చేశాడట. అక్కడుంటూ, ఈలోగా నేను నాకోసం ఇల్లు వెతుక్కోవాలిట.

హోటల్ రూం అగత్యం తప్పిందని మహదానందమైంది. కానీ రెండు వారాల్లో అద్దె ఇల్లు దొరుకుతుందా అన్న బెంగ కూడా మనసులో ఉంది.

రాలెక్ శిష్యుల్లో అహమ్మద్ అనే ఇరాక్ దేశస్థుడు ఉన్నాడు. నాకూ రాలెక్‌కీ జరిగిన ఉత్తరప్రత్యుత్తరాల ఫైలు అహమ్మద్ దగ్గరే ఉంది. రాలెక్ నన్ను అహమ్మద్‌కి పరిచయం చేసి, ఇల్లు వెదకడంలో నాకు సాయపడమని చెప్పాడు.

ఆ సంస్థలో నా తొలి మిత్రుడు అహమ్మద్. రాలెక్ నన్నప్పగించగానే అతడు తన గురించి చెప్పుకున్నాడు.

తనూ నాకులాగే డాడ్ ఫెలోషిప్ మీద వచ్చాడు. ఐతే అతనికి స్వదేశంనుంచి కూడా అదనపు భత్యం వస్తుందిట.

అహమ్మద్ నా వివరాలు కూడా అడిగి తెలుసుకున్నాడు. అక్కడివాళ్లకు భిన్నంగా నాతో ఎక్కువ ఇంగ్లీషులోనే మాట్లాడాడు.

అతనికి ఇంగ్లీషంటే మోజుంది. ఇండియన్స్ ఇంగ్లీషు బాగా మాట్లాడగలరన్న అభిప్రాయముంది.

మా అహమ్మద్ మిత్రుడి భాషాపరాక్రమమేమని చెప్పవచ్చునని నేను మెచ్చుకుంటే – చాలా సంబరపడ్డాడు.

ఇద్దరం జిమ్మర్ పెర్మిట్లుంగ్‌కి వెళ్లాం. వాళ్ల దగ్గర కొన్ని ఇళ్ల వివరాలున్నాయి. వాళ్లకి నేను కొంత ధరావతు కడితే – వాళ్లు నాకు గృహాన్వేషణకు సహకరించే కొన్ని వివరాలిస్తారు. వాటి ఆధారంతో నేను నా ప్రయత్నాలు చేసుకోవాలి. నాకు ఇల్లు దొరికేక – ఆ విషయం వాళ్లకు తెలియబరిస్తే, నేను కట్టిన ధరావతు వెనక్కిచ్చేస్తారుట.

ఆసక్తిగా వాళ్లిచ్చిన ఫైలు తీసుకున్నాను. ఆత్రుతగా ఆ ఫైల్లో నా తాహతుకు తగ్గ ఇంటికోసం వెదుకున్నాను.

అంతలో అక్కడి ఉద్యోగికి ఓ ఫోనొచ్చింది. ఆ ఫోను అద్దెకిచ్చే ఇళ్ల గురించే కాబోలు – అతడు అహమ్మద్‌కి జర్మన్లో ఆ వివరాలు చెప్పాడు.

జరిగేది నాకు అర్థమౌతోంది. ఐనా నిర్ధారించుకుందుకు అహమ్మద్ నాకు ఇంగ్లీషులో చెప్పేదాకా ఆగాను.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న గ్యోతే స్ట్రాసేలో (వీధి) ఫ్రౌ ఒలోముచ్‌కీ అనే ఆమె ఇంట్లో గది ఒకటి ఆ రోజే కాళీ అవుతున్నదిట. అద్దె నూటయాభై మార్కులు. ఏ దేశస్థుడికైనా అద్దెకివ్వడానికి ఆమెకి అభ్యంతరం లేదుట.

అది జాత్యహంకారం కావచ్చు. మరేమైనా కావచ్చు. ఇండియన్సుకి ఇల్లివ్వడానికి అక్కడ ఒకొక్కరు ఒకో రకం అభ్యంతరం చెబుతారుట. అభ్యంతరం లేనివారు అక్కడ తక్కువేనట. ఒలోముచ్‌కీ ఏ అభ్యంతరం లేదనడం గొప్ప అదృష్టమనీ, వెంటనే వెళ్లి ఆ ఇంట్లో ప్రవేశించడం ఉత్తమమనీ అహమ్మద్ అభిప్రాయపడ్డాడు.

సరేనని నేను వెంటనే జిమ్మర్ పెర్మిట్లుంగ్ వారికి ఐదు మార్కులు ధరావతు కట్టాను. తన మిత్రుడికి కూడా ధరావతు కట్టాలనీ, తన దగ్గర చిల్లర లేదనీ అహమ్మద్ అంటే – అదీ నేనే కట్టాను. తర్వాత ఇస్తానని మాటిచ్చాడు అహమ్మద్. నేను ప్రతిరోజూ డైరీ వ్రాస్తాననీ, అందులో జమాఖర్చుల వివరాలు ఖచ్చితంగా ఉంటాయనీ, తను మాట నిలబెట్టుకోకపోతే ఆ విషయం నా చిట్టాలో నమోదైపోతుందనీ అహమ్మద్‌కి తెలియదు. లేకుంటే ఆ ఐదు మార్కులు తిరిగివ్వడం విషయం సీరియస్‌గా తీసుకునేవాడేమో!

ఈలోగా అక్కడి ఉద్యోగి ఒలోముచ్‌కీకి ఫోన్ చేసి ఏదో మాట్లాడాడు. తర్వాత మాతో, "ఫ్రౌ ఒలోముచ్‌కీ ఇప్పుడు ఇంట్లోనే ఉంది. మీతో మాట్లాడేక బయటికి వెడుతుందిట. వెంటనే వెళ్లి కలుసుకోండి" అన్నాడు.

ఇద్దరం నడుచుకుంటూ వాళ్లు చెప్పిన చిరునామాకి వెళ్లాం. అది అనేక అంతస్తులున్న పాతకాలపు భవంతి. లిఫ్టు లేదు. ఒలోముచ్‌కీ ఇల్లు రెండో అంతస్తులో ఉంది.

నడిచి మెట్లెక్కి ఆమె ఇంటి గుమ్మం చేరుకున్నాం.

ఆ ఇంటి తలుపుకి మధ్యలో – వలయానికీ, చదరానికీ మధ్యరకం ఆకారంలో ఉన్న ఓ ఇత్తడి హోల్డర్ ఉంది. అహమ్మద్ దాన్ని పైకెత్తగానే లోపల్నుంచి గణగణమన్న శబ్దం వినబడింది. ఆ హోల్డర్ కాలింగ్‌బెల్ అని అప్పుడర్థమైంది నాకు.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా చెయ్యెత్తు మనిషి. కొండంత లావుంది. కాస్తంత భయంకరంగా కూడా ఉంది. అది లంకా నగర ప్రవేశద్వారమా అనుకుని తడబడ్డాను.

ఆ పర్వతాకారం ఫ్రౌ ఒలోముచ్‌కీది. ఆమె వయసు అరవైకి పైన ఎంతైనా ఉండొచ్చు.

అమె ఒంటరి ఆడది. సెక్స్ కీనోలో ఉద్యోగం చేస్తోంది. సెక్స్ కీనో అంటే – ఆగకుండా నీలిచిత్రాలు చూపించే మినీ థియేటర్. అక్కడ ఆమె బుకింగ్ కౌంటర్లో కూర్చుని టికెట్లు అమ్ముతుందిట. ఇప్పుడక్కడికి వెళ్లాల్సిన టైమైంది. మేమొస్తున్నామని ఆగింది.

ఆమె గది చూపించింది. చాలా పెద్దదే కానీ, మామూలుగా జర్మనీలో కనిపించేంత పరిశుభ్రత అక్కడ లేదు.

గదిలో బాగా పాతవైన ఒక పెద్ద బీరువా, మంచం ఉన్నాయి. బాత్రూం, వంటిల్లు గది బయట ఉన్నాయి. అవి ఆమెకీ, నాకూ కామన్.

ఆమె రోజూ ఉదయం పదకొండు ప్రాంతాల ఉద్యోగానికెళ్లి రాత్రి తొమ్మిది దాటేకనే తిరిగొస్తుందిట. తనులేని సమయమంతా నేను వాటిని యథేచ్ఛగా వాడుకోవచ్చునని చెప్పింది.

ఇల్లు సెంట్రల్లీ హీటెడ్. ఐతే కరెంటుతో కాదు. ఆయిల్‌తో కాచిన వెచ్చటి నీరు గొట్టాలద్వారా రోజంతా ప్రవహిస్తూ పరిసరాల్ని ఎప్పుడూ వెచ్చగా ఉంచుతుంది. అందువల్ల ఇంట్లో ఇరవైనాలుగు గంటలూ వేణ్ణీళ్లు లభ్యమౌతాయి. గదిలో మనకి కావలసిన విధంగా ఉష్ణోగ్రతని పెంచుకుందుకూ, తగ్గించుకుందుకూ సదుపాయముంది.

ఆ గదిలో ఓ టర్కిష్ దేశస్థుడు ఉంటున్నాడు. అతడా రాత్రికి గది కాళీ చేస్తున్నాడు. అందుకని మర్నాడుదయం నేను ప్రవేశించవచ్చునందామె. మర్నాడు అక్టోబర్ ఒకటవతేదీ కాబట్టి, లెక్కకి వీలుగానూ ఉంటుందంది.

ఆమె కోరిన విధంగా వెంటనే ఒక నెల అద్దె అడ్వాన్సుగా ఇచ్చాను. వెంటనే ఆమె నాకు రసీదిచ్చింది.

ఇప్పుడిక నేను రాలెక్ కుదిర్చిన స్టూడెంట్ హాస్టలుకు వెళ్లాల్సిన అవసరం లేదని సంతోషమైంది. అంతలో ఆ ఇంటి నంబరు చూశాను. అప్పుడు నా ఆనందం రెట్టింపయింది. ఆ ఇంటి నంబరు ముప్పైఒకటి. తిరగేస్తే పదమూడు. నా లక్కీ నంబర్.

ఇండియాలో నేనెక్కిన ఫ్లైట్ నంబర్లో అంకెలు కలిపితే పదమూడొచ్చింది. ఫ్రాంక్‌ఫుర్ట్‌లో హానోఫర్ వెళ్లడానికి నేనెక్కిన విమానం వచ్చిన ఫ్లాట్‌ఫారం నంబరు పదమూడు. బెర్లిన్ వచ్చేముందు నేనొక ఆదివారంనాడు కూర్ జెంత్రమ్‌లో స్నానం చేశాను. అక్కడ నాకిచ్చిన కూపన్ నంబర్ మూడొందల పదమూడు. భువనేశ్వర్లో నేను కాళీ చేసిన క్వార్టర్ నంబరూ మూడొందల పదమూడే. అంటే టైప్ త్రీలో పదమూడోదన్న మాట!

అంకెలతో జ్యోతిషం చెప్పే సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లు చాలామందే ఉన్నారు. నేనది నమ్ముతానని చెప్పలేను కానీ, నా జీవితంలో జరిగిన ప్రతి మంచినీ ఎలాగో అలా పదమూడుతో ముడిపెట్టి తృప్తి పడుతుంటాను. పదమూడు సంఖ్య అశుభ సంకేతమని వినడంవల్ల పట్టుదలగా దాన్ని నా లక్కీ నంబర్‌గా ఎన్నుకున్నానేమో కూడా తెలియదు. పదమూడొస్తే మాత్రం – 'పద, మూడొచ్చింది' – అని కొత్త ఉత్సాహాన్ని తెచ్చుకుంటూంటాను.

ఇప్పుడిలా పదమూడు గురించి బేరీజు వేసుకుని – నా జర్మనీ ప్రయాణం పలువిధాల పదమూడుతో ముడిపడిందంటే – ఇదంతా ఏదో సీక్వెన్స్ ప్రకారం జరుగుతోందనీ, మరిన్ని మరపురాని అనుభూతులు నాకిక్కడ రాసిపెట్టి ఉన్నాయనీ, ఈ ఇంటి నంబరు నాకు శుభశకునమనీ అనుకుంటూ అహమ్మద్ భుజం తట్టి, "పద, మూడొచ్చింది" అని మనసులో అనుకున్నాను.

అప్పుడు అహమ్మద్ నాకు మరో ఉపకారం చేశాడు. "ఈ రాత్రికి ఇతనెక్కడికి పోతాడు? నీ ఇంట్లోనే ఆశ్రయమివ్వు" అన్నాడు అమెతో. ఆమె వెంటనే దానికీ ఒప్పుకుంది. కానీ ఆ రాత్రికి పది మార్కులు అద్దె కట్టాలని ముందే అడిగి తీసుకుంది.

ఆమె అలా ఒక్క రాత్రికి అదనంగా పది మార్కుల అద్దె వసూలు చెయ్యడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియాలో ఐతే – హోటళ్లలో ఐతే తప్ప అదనపు ఛార్జి వసూలు చెయ్యరు. ఒక రాత్రికే ఏమిటి, రెండు మూడు రోజుల విషయంలోనూ పెద్దగా పట్టించుకోరు.

ఏదేమైనా ఆ పది మార్కుల ఖర్చు గురించి నేను పెద్దగా విచారించలేదు. ఈ రాత్రికి ఆమె నాకు గది ఇవ్వకపోతే – హటల్లో రూం తీసుకోవాలి. అక్కడికెళ్లడానికి టాక్సీ బాడుగ ఔతుంది. ఆపైన రూంకి అద్దె ఇంతకంటే బాగా ఎక్కువే కట్టాలి. మళ్ళీ ఉదయం ఇంకో టాక్సీ బేరమాడుకుని ఇక్కడికి రావాలి. అలా చూస్తే ఈ ఏర్పాటు చాలా బాగుంది.

అహమ్మదుకీ, ఆమెకీ ధన్యవాదాలు చెప్పాను.

"నీ గురించి ఈ రోజు పెందరాళే వస్తాను. ఎనిమిది దాటేక నీ సామాను తీసుకుని వచ్చేయ్" అంది ఒలోముచ్‌కీ.

మరోసారి ఆమెకి ధన్యవాదాలు చెప్పుకున్నాక – నేనూ అహమ్మదూ అక్కణ్ణించి బయటపడ్డాం.

అప్పుడిక నా మనసు ఆనందోత్సాహాలతో గాల్లో తేలిపోతోంది.

బెర్లిన్ మహానగరంలో నాకు నిలువనీడ దొరికింది. అదీ నెలకి నూటయాభై మార్కులకే. స్నానానికీ, వంటకీ, కరెంటుకీ అదనపు ఛార్జిలు లేవు. రోజుకి ఎన్నిమార్లయినా స్నానం చెయ్యొచ్చు. నాకేమిష్టమైతే అవి వండుకుని తినొచ్చు.

వంటనగానే ఆ విషయమై నా ప్రతిభ గుర్తొచ్చి నవ్వొచ్చింది.

అమ్మ, బామ్మ, ఆ తర్వాత ఇల్లాలు – అందరూ ఇంట్లో ఉండే గృహిణులే. అందువల్ల నాకు వంట నేర్చుకోవాల్సిన అవసరం రాలేదు. అడపాతడపా వంటింటి సాయాలు చేసినా – వంట చెయ్యడంపట్ల పెద్దగా అవగాహన ఏర్పడలేదు. ఆపైన నేర్చుకునే ఆసక్తి కూడా తక్కువ. జర్మనీకి వచ్చేక – ఎప్పటికైనా తప్పనిసరని గ్రహించి – ల్యూనబర్గులో ఉండగా – రామచంద్ర, నటరాజన్, దేవదార్, కొరియాలను చూసి కొంత నేర్చుకున్నాను. ఇంట్లో ఇల్లాలికి సాయం చేస్తూ అభ్యసించినదానికంటే – ఈ మిత్రుల శిక్షణ నాకు బాగా ఉపయుక్తమయింది. ఇండియన్ వంటకాలు చెయ్యడానికి జర్మనీలో లభించే ఏయే పదార్థాల్ని ఎలా ఉపయోగించుకోవాలో కూడా వాళ్లు చెప్పారు.

నా వంట నేను చేసుకుంటే, రోజూ బ్రెడ్‌తో సరిపెట్టుకునే బాధ తప్పుతుంది. తిండి చౌక కూడా ఔతుంది.

ఇలా ఆలోచనలతో బేరీజు వేస్తున్న నన్ను అహమ్మద్ అక్కణ్ణించి యూనివర్సిటీ కాంటీనుకి తీసుకెళ్లాడు. నేను ఫక్తు శాకాహారిననీ, మద్యమాంసాలు ముట్టననీ తెలుసుకుని, "మరి బీరు కూడా తాగవా? కోడిని కూడా తినవా?" అనడిగాడు.

"కోడిగుడ్డు కూడా ముట్టను" అన్నాను.

"అయితే ఇక్కడెలా బ్రతుకుతావ్?" అన్నాడు అహమ్మద్.

"ఏమో, ల్యూనబర్గులో నాలుగు నెలలున్నాను. రుచి గురించేతప్ప బ్రతుకు గురించిన బెంగ కలుగలేదు?" అన్నాను.

"బ్రతకలేవని కాదు. నీ పద్ధతి ఇలాగే కొనసాగిస్తే ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోతుంది" అన్నాడు అహమ్మద్.

"అలాగనే అంతా నన్ను భయపెట్టారు. ల్యూనబర్గులో అడుగు పెట్టినప్పుడు నా బరువు నలభైఎనిమిది కేజీలు. ఆ ఊరొదిలేటప్పుడు చూసుకుంటే యాభైఆరు కేజీలు దాటాను. అంటే నెలకో రెండు కేజీల చొప్పున బరువు పెరిగేనన్న మాట!" అన్నాను.

అహమ్మద్ నన్నదోలా చూసి, "నువ్వు చాలా విచిత్రమైన మనిషివిలాగున్నావ్. ఇకముందునుంచి రోజురోజుకీ చలి విపరీతంగా పెరిగిపోతుంది. బ్రాందీ పట్టించకపోతే గడ్డ కట్టిపోతావ్" అని హెచ్చరించాడు.

"అలా గడ్డ కట్టుకుపోతే తప్పకుండా బ్రాందీ పుచ్చుకుంటాను. ఈ విషయంలో నాకేమీ నియమాలు లేవు. అవసరపడనంత కాలం మద్యమాంసాలు ముట్టను. అంతే!" అని హామీ ఇచ్చాను. అలా చెప్పకపోతే, చలి ఇంకా పెరగకపోయినా, నా మాటలకి అప్పుడే ముందు అతను గడ్డకట్టుకుని పోతాడని నాకు భయమేసింది.

అహమ్మద్ కాస్త కుదుటపడి, "మరి నీకు సరదాలేంలేవా?" అన్నాడు.

"సరదాలు లేకేం, బోలెడున్నాయి. మద్యమాంసాలు నాకు సరదా కావంతే!" అన్నాను.

అహమ్మద్ నాకేసి అదోలా చూశాడు. మద్యమాంసాలు కాకుండా ఇంకేం సరదాలుంటాయన్న అనుమానం ఆ చూపులో నాకు కనబడింది.

అక్కణ్ణించి ఇద్దరం డాక్టర్ రాలెక్ వద్దకి వెళ్లాం. ఆయన నాకు ఇల్లు దొరికేసిందని తెలిసి సంతోషించాడు. తర్వాత చకచకా లాబొరేటరీలో నా ప్రోజెక్టుకి సంబంధించిన కొందరు ముఖ్యులకి పరిచయం చేశాడు.

ఆరంతస్తుల ఆ భవనంలో ఎందరో ప్రొఫెసర్లు, రీసెర్చి స్టూడెంట్లు ఉన్నారు. అందరికీ కలిపి ఓ డైరెక్టరున్నాడు. రాలెక్ ముందు నన్ను డైరెక్టరుకి పరిచయం చేశాడు. ఆయన నాకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు చెప్పాడు.

డైరెక్టర్ ఆఫీసులో ఒక సెక్రటరీ, ఆ సెక్రటరీకి ఒక అసిస్టెంటు ఉన్నారు. రాలెక్ నన్నా ఇద్దరికీ పరిచయం చేశాడు. ఆ భవంతికి సంబంధించిన మొత్తం పరిపాలన, ఆర్థిక నిర్ణయాలన్నింటి అమలుకీ ఆ సెక్రటరీ, ఆమె అసిస్టెంటు సరిపోతారని తెలిసేక పెద్ద షాక్ తిన్నాను.

భువనేశ్వర్లో మా రీసెర్చి సంస్థ మూడంతస్తుల పెద్ద భవనంలో ఉంది. అందులో మా వ్యవహారాలు చూడ్డానికి ఒక అడ్మినిస్ట్రేటివ్ సెక్షన్, అకౌంట్ సెక్షన్, పర్చేజ్ సెక్షన్ ఉన్నాయి. ప్రతి సెక్షనుకీ ఓ అధికారి, అతడికింద అనేకమంది ఉద్యోగులూ ఉన్నారు. అక్కడ అందరు, ఇక్కడ ఇద్దరు!

డాక్టర్ రాలెక్ నన్ను ముందు గ్లాస్ బ్లోవర్ వద్దకు తీసుకెళ్లాడు. వేడిమీద గాజుని కరిగించి నోటితో బుడగల్లా ఊది ఎలాంటి గాజు పరికరాన్నయినా తయారు చేసే ఉద్యోగమతడిది. కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్ రీసెర్చికి ఎంతో అవసరమైన ఉద్యోగి అతడు. అతణ్ణి చూడగానే మా లేబరేటరీలో గ్లాస్ బ్లోవర్ హైదరాలీ గుర్తుకొచ్చాడు. గాజుని వెన్నముద్దలా మార్చగల అతడి ప్రావీణ్యానికి అబ్బురపడి గాజు మాంత్రికుడని పిలిచేవాళ్లం మేమతణ్ణి.

తర్వాత రాలెక్ నన్ను వర్క్‌షాప్ ఇంజనీరుకీ, స్టోర్‌కీపర్‌కీ కూడా పరిచయం చేసేక, తన డిపార్టుమెంట్లోని రీసెర్చి వర్కర్సందరికీ పరిచయం చేశాడు.

ఆ భవంతిలోనే ఒక గదిలో ఆటోమేటిక్ జిరాక్స్ మెషీన్ ఉంది. మన అవసరాన్ని బట్టి ఒకే పేజీకి – ఒకటి, రెండు, ఐదు లేక పది కాపీల్ని – మనకి కావాల్సిన సైజులో తీసుకోవచ్చు. ఆ గది తాళం డైరెక్టర్ ఆఫీసు గదిలో ఉంటుంది. ఎవరికి అవసరపడితే వారు అక్కణ్ణించి ఆ తాళం తీసుకుని, జిరాక్సు గదికి వెళ్లి జిరాక్సు కాపీలు తీసుకోవచ్చు.

అప్పటికి నాకు అలాంటి జిరాక్స్ మెషీన్ కొత్త. అందుకని ఆ సదుపాయం చూడగానే నాకు పెన్నిధి దొరికినట్లయింది.

భువనేశ్వర్ లాబొరేటరీలోనూ మాకో ఫొటోకాపీ మిషనుందిట. అది ఇలా ఆటోమేటిక్ కాదు. కాపర్ సల్ఫేట్ రసాయనాన్ని వాడి దాన్ని సిద్ధం చెయ్యాలి. ఒకసారి సిద్ధంచేస్తే నాలుగంటే నాలుగు కాపీలు మాత్రం వస్తాయి. ఇంతకీ ఆ సదుపాయం ఉపయోగించుకోవడానికి ముందు ఓ అప్లికేషన్ ఫారం రాయాలి. దానిమీద ఆ సెక్షన్ హెడ్ సంతకం చెయ్యాలి. ఆ మెషీన్లో కాపీ తీయించుకోవడంకంటే, టైపు

చేయించుకోవడమే సుఖం. అందువల్ల లాబొరేటరీలో చాలామందికి అదున్నట్లే తెలియదు.
అబద్ధమెందుకూ, దాని గురించి నాకూ ఇక్కడికొచ్చేకే తెలిసింది. నేను చూసిన ఆటోమేటిక్ జిరాక్సు మెషీన్ గురించి మా ఆఫీసు మిత్రులకు ఉత్తరం వ్రాసినప్పుడు వారీ వివరాలిచ్చారు.

మన గురించి మనం తెలుసుకుందుకు కూడా విదేశం రావాలన్న మాట!

మర్నాడే డాక్టర్ రాలెక్ ఫ్రాంక్‌ఫుర్ట్ వెడుతున్నాట్ట. వారం రోజులవరకూ తిరిగిరాడుట. ఆయన నాకు నేను కూర్చునే సీటు, పని చెయ్యాల్సిన వర్క్ బెంచ్ చూపించాడు. అప్పటికే నాకోసం ఓ ఆప్రాన్ తెప్పించి ఉంచాడు. పని చేసుకుందుకు అక్కడున్న బర్నర్సూ, ఫర్నేసులూ వగైరాలు చూపించాడు. డిపార్టుమెంటుకి ఎప్పుడుపడితే అప్పుడు వచ్చిపోవడానికి మెయిన్ డోర్ తాళంచెవి ఒకటిచ్చాడు. నాతో చాలా అప్యాయంగా మాట్లాడి నాకున్న బెదురు చాలావరకూ పోగొట్టాడు.

ఇన్‌స్టిట్యూట్ ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఐదు వరకూ పని చేస్తుంది. మధ్యలో ఓ గంట భోజన విరామం. శని, ఆదివారాలు సెలవు.

అక్కడ పనివేళల్లో ఎవరి పనుల్లో వారుంటారు. నేనూ నా పనికి సంబంధించి అన్నీ సెట్ చేసుకుంటూంటే తెలియకుండానే అయిదైపోయింది. అప్పుడు నాకు నేనుగా ఆఫీసునుంచి బయటపడ్డాను.

అక్కడి షాపులు నాకో పెద్ద ఆకర్షణ కదా! బయటికి రాగానే కాసేపు రోడ్లమీద తిరిగి షాపుల్ని గమనించాను.

బెర్లిన్లో షాపులు సాయంత్రం ఆరున్నరదాకానే ఉంటాయి. ఆలోగానే కొన్ని సూపర్ మార్కెట్లలో తిరిగి నాకు అవసరమైన వస్తువుల ధరలు సర్వే చేశాను. ధరలు ఇంచుమించు ల్యూనబర్గ్‌లోలాగే ఉన్నాయి. ఐతే ఎంత వెదికినా నేను చూసిన మేరకు ఆల్‌బ్రెస్ట్ షాపు కనబడలేదు.

రాత్రి దగ్గర పడుతున్నకొద్దీ చలి పెరుగుతోంది. అందుకని షాపులు మూసేసే సమయానికి రైల్వే స్టేషన్ చేరుకున్నాను – అక్కడైతే వెచ్చగా ఉంటుందని. తీరా చూస్తే అక్కడి వాతావరణం నేనూహించనిది.

స్టేషన్లో టాయిలెట్స్ నేలమాళిగ (అండర్‌గ్రౌండ్)లో ఉన్నాయి. దానిలోకి వెళ్లడానికి మెట్లదారి ఉంది. ఆ దారి పొడుగునా మెట్లపక్కన తాగుబోతులు బారులు తీరి కూర్చుని ఉన్నారు. వాళ్లలో ఒకరిద్దరు ఆడవాళ్లు కూడా ఉన్నారు.

ఆ దృశ్యం చూడగానే ఇండియాలో బిచ్చగాళ్లు గుర్తొచ్చారు. నేను వెడుతున్నది దేవాలయానికా, శౌచాలయానికా అన్న అనుమానం కలిగింది.

అక్కడ కూర్చున్నవాళ్లు అడుక్కోవడం లేదు కానీ – వాళ్ల మాట, ప్రవర్తన ఏవగింపు కలిగిస్తున్నాయి. వాళ్లు పెద్దగా కేకలు వేస్తూ, వెకిలిగా నానా అల్లరీ చేస్తున్నారు.

చెప్పాలంటే చాలా నిరుత్సాహపడ్డాను.

ఒక ఆధునిక సంపన్న దేశానికి చెందిన ప్రతిష్ఠాత్మక మహానగరం బెర్లిన్. అలాంటినగరంలో పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే రైల్వేస్టేషన్లో అటువంటి దృశ్యం చూడాల్సి ఉంటుందని నేననుకోలేదు. నగర పాలకులు ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోలేదోనని ఆశ్చర్యం తాగుబోతుల విషయం అలాగుంచితే – రైల్వే స్టేషన్ మాత్రం మహా సందడిగా ఉంది. ఆ సందడి చూస్తూ నేను అటూ ఇటూ తిరుగుతున్నాను.

చాలాసేపట్నుంచి అక్కడే తిరుగుతున్న ఒకామె నన్ను గమనించినట్లుంది – ఉన్నట్లుండి సైగ చేసి నన్ను పిలిచింది.

ఆమె వయసు నలభై సంవత్సరాలుండొచ్చు. ముఖం చూస్తే చందమామ పత్రికలోని బొమ్మల్లో మంత్రగత్తె గుర్తుకొస్తుంది. చూపులు కూడా మంత్రగత్తె చూపుల్లాగే వంకరగా ఉన్నాయి.

నేను దగ్గరకు వెళ్లగానే, "ఇండియన్?" అందామె ఇంగ్లీషులో. ఔనన్నాను.

ఆమె చేయి జాపింది. షేక్‌హాండిచ్చాను. చెయ్యి వదిలిపెడుతూ అమె నా బొటనవ్రేలిని అదోలా గోకింది.

కంగారుగా ఆమె వంక చూశాను. వెంటనే కన్ను కొట్టింది.

నాకు భయమేసింది. ఆమె ఆంతర్యమేమిటో, ఆమె సంకేతానికి అర్థమేమిటో ఆలోచించడానికి కూడా ప్రయత్నించకుండా చటుక్కున చెయ్యి విదిలించుకుని అక్కణ్ణించి వెళ్లి మరోచోట బెంచీమీద కూర్చున్నాను.

ఎదుట కొత్త కొత్త దృశ్యాలు. మనసులో ఏమేమో ఆలోచనలు. అలా ఒంటరిగా ఎంతసేపున్నానో – కాసేపటికి ఓ ముసలాయన వచ్చి నాపక్కన కూర్చున్నాడు. ఆయనతోపాటే ఓ ఆల్సేషియన్ డాగ్ ఉంది.

నాకు కుక్కలంటే భయం. అవి నిజంగా మంచివైనా పొరపాటున కరిచే ప్రమాదం లేకపోలేదు. పాము కరిస్తే విషానికి విరుగుడుండొచ్చు. కానీ కుక్కకాటువల్ల వచ్చే రేబీస్ వ్యాధి అంతకంటే చాలా భయంకరమైనదన్న భావన నాలో చిన్నప్పుడే బలపడిపోయింది. అందుకని వాటికి వీలైనంత దూరంగా ఉంటాను.

ఇప్పుడు నా పక్కన కూర్చున్న ముసలాయన దగ్గర ఆల్సేషియన్ని చూడగానే అక్కణ్ణించి లేచిపోబోయాను.

ముసలాయన నా భుజంమీద చెయ్యేసి ప్రేమగా నిమిరి, "సిట్ డౌన్ మై బాయ్" అన్నాడు ఇంగ్లీషులో.

మొహమాటపడి ఇబ్బందిగా కూర్చున్నాను.

ముసలాయన నా వివరాలడిగాడు. చెప్పాను.

"నాకు ఇండియన్సంటే ఇష్టం. ఇంటికోసం నువ్వు శ్రమ పడకు. నాతో వచ్చి నా ఇంట్లో ఉండు. మా ఇంటినుంచి ఊబాన్లో నీ ఇన్స్‌టిట్యూట్‌కి వెళ్లడానికి పది నిముషాల ప్రయాణం – అంతే!" అన్నాడు.

"చాలా థాంక్స్, కానీ నాకు ఇల్లు దొరికేసిందిగా" అన్నాను.

"దొరికితేనేం, పోయిన అడ్వాన్స్ పోయిందనుకో. నువ్వు నా ఇంట్లో ఊరికే ఉండొచ్చు"

బెర్లిన్లో ఫ్రీ అకామడేషన్. నెలకి నూటయాభై మార్కుల ఆదా. ఒక్క క్షణం మనసు ఊగిసలాడింది. కానీ ప్రతి ఔదార్యం వెనుకా ఏదో స్వార్థముంటుంది. ఎక్కడైనా మినహాయింపులుండొచ్చేమో కానీ ఈ దేశంలో మాత్రం అలాగనుకుందుకు లేదు.

రేపట్నించి నాదే అవనున్న గదిలో ముందుగా ఈ ఒక్క రాత్రి పడుకునేందుకు ఫ్రౌ ఒలోముచ్‌కీ నన్ను పది మార్కులు అడిగింది. అలాంటిది ఈ ముసలాయన ఇక్కడున్నంత కాలమూ తనింట్లో ఊరికే ఉండొచ్చంటున్నాడు. ఏదో కారణం ఉండే ఉండాలి.

ఇలంటి అనుమానాలతో, "నేనెందుకు రావాలి, ఎవరికోసమో" అన్నట్లు మొహం నేను పెట్టాను.

అది అర్థం చేసుకున్నాడేమో, "నీవు లేక నేను లేనె లేనులే, అది నిజములే" అన్న మొహం ఆయన పెట్టాడు.

ఆయన బలవంతపెట్టినకొద్దీ నా అనుమానం పెరిగింది. ఆ అనుమానంతో చూడగానే ఉన్నట్లుండి ఆయన ముఖం ఇంకోలా మారిపోయింది. ఆ ముఖం ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ ఇంటికి నాకోసం వచ్చిన జర్మన్ వృద్ధుడి మొహానికి ప్రతిబింబంలా కనబడింది.

"అదిగో పులి అన్నాయి" నా కళ్లు. అప్పుడు ఇదిగో తోక అనే బాధ్యత తీసుకున్న నా ముక్కు "ఔను, ఆయనే! నాకు ఉడుకులాం వాసన కూడా తెలుస్తోంది" అంది.

ఆ తర్వాత ఆయన బలవంతపెడుతూ ఎన్ని చెప్పినా – "నాకు చెవుడు, శంఖం ఊదొద్దు" అనే లెవెల్ మెయింటైన్ చేశాను. మనసులో మాత్రం, "ఇదెక్కడి కర్మరా బాబూ!" అనుకున్నాను.

ల్యూనబర్గులో ఉండగా ఎవరో అన్నారు నాతో – బెర్లిన్ హోమోసెక్సువల్స్‌కి ప్రసిద్ధి అని. ఈ ముసలాయన ఎలాంటివాడో తెలియదు కానీ, నా భయం నాది.

ఆయనతో జరిగిన మానసిక యుద్ధం ఒకందుకు నాకు ఉపకరించింది. ఎలా గడిచిందో తెలియకుండా టైం ఎనిమిదయింది.

లాకర్లోంచి సూట్‌కేస్ తీసుకున్నాను. టాక్సీని పిల్చుకున్నాను. ఐదు నిముషాల్లో గమ్యస్థానం చేరాను.

ఒలోముచ్‌కీ ఉండే అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ ప్రవేశద్వారం మూసి ఉంది. అక్కడ కాలింగ్‌బెల్ లాంటిదేదీ కనబడలేదు. తలుపు తడితే ఏ రెస్పాన్సూ లేదు.

"ఎవరో రావాలీ" అని మనసులో పాడుకుంటూ సుమారు గంటసేపు అక్కడే ఉన్నాను. అప్పటికి నా మొర విని నన్ను కరుణించడానికన్నట్లు తలుపు తెరుచుకుని ఓ వ్యక్తి బయటకు వచ్చాడు. కానీ ఆ వ్యక్తి నన్ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయాడు. అతణ్ణి ఏదో అడుగుదామనుకున్నాను కానీ అప్పుడు తెరుచుకున్న తలుపు మళ్లీ మూసుకుపోతోంది. అతనికంటే తలుపుని నమ్ముకోవడమే మెరుగని – దాన్ని ఒక చేత్తో ఆపి రెండో చేత్తో సూట్‌కేస్ పట్టుకుని రెండు కాళ్లనీ కూడగట్టుకుని లోపలికి దూరేశాను. మెట్లెక్కి రెండో అంతస్తు చేరుకుని ఒలోముచ్‌కీ ఇంటిగుమ్మం ముందు నిలబడ్డాను. ఇత్తడి హోల్డర్ని పైకెత్తాను.

కొద్ది క్షణాల్లో తలుపు తెరుచుకుంది. ఒలోముచ్‌కీ నాముందు ప్రత్యక్షమైంది.

అప్పుడామె నాకు అసురమాతలా కాక సురకన్యలా కనిపించింది. చేతిలో సూట్‌కేస్ కింద పెట్టలేదు కాబట్టి కానీ అప్రయత్నంగా చేతులు జోడించి, "మాణిక్యవీణాం" అని అందుకునేవాణ్ణేమో!

జరిగింది విని ఒలోముచ్‌కీ నొచ్చుకుంది. ప్రవేశద్వారానికి వేరే తాళం ఉంటుందిట. అది లేకపోతే లోపలకి రావడం అసాధ్యమట. సాధారణంగా తొమ్మిదిన్నర వరకూ ఆ ద్వారము తెరిచియే ఉండునట. ఆ రోజు ఏదో పొరపాటు జరిగి ఉండాలంది.

ఏదేమైతేనేం పది మార్కులు తీసుకున్నప్పటికీ ఆమె నిబద్ధతని అభినందించాలి – ఆమె అప్పటికే నా కోసం గదినీ, గదిలో పక్కనీ సిద్ధం చేసి ఉంచిందిట!

మలిరోజులు

వారం రోజుల్లో నా ఇన్స్టిట్యూట్‌కే కాదు, బెర్లిన్ నగరానికీ కొంత అలవాటు పడ్డాను.

పశ్చిమ జర్మనీ వాసులందరికీ బెర్లిన్ నగరంపై ప్రత్యేకమైన మక్కువ ఉంది. తమ దేశానికి ఆహ్వానంమీదో, యాత్రీకులుగానో వచ్చిన ప్రతివారినీ – తిరిగి వెళ్లేలోగా ఒకసారి బెర్లిన్ నగరం చూసి తీరాలని అక్కడి పౌరులు చెబుతూంటారు. అలా చూసివచ్చినా వారి ద్వారా – ల్యూనబర్గులో ఉండగానే – బెర్లిన్ నగరపు హయలు, సొగసుల గురించి కొంత విన్నాను. విన్నదాంట్లో ఆవగింజంత అసత్యమైనా లేదని ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడూ అనిపించింది.

బెర్లిన్ రైల్వే స్టేషనుకి దగ్గర్లోని ఒక ముఖ్య ప్రాంతం కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్. స్థానికులు దానికి పెట్టుకున్న ముద్దుపేరు కు–డామ్. ఒలోముచ్‌కీ ఇంటినుంచయితే అక్కడికి కాలినడకన చేరుకుందుకు ఇరవై నిముషాలు పడుతుంది. అక్కడున్న దుకాణాలు, హటళ్లు అన్నీ – విదేశీయాత్రికుల్ని దృష్టిలో ఉంచుకుని రూపొందడంవల్ల – ఆ ప్రాంతం యాత్రికులకు ప్రత్యేక ఆకర్షణ.

అందమైన ఆ వీధిలో దీపాలతో రూపొందిన ఓ గడియారముంది. చూడగానే గడియారం అనిపించదు. కొన్ని వరుసల్లో ఆకుపచ్చని, ఎర్రని దీపాలున్నాయి. కొన్ని గంటల్నీ, కొన్ని నిముషాల్నీ, కొన్ని సెకన్లనీ సూచిస్తాయి. వెలుగుతున్న దీపాల్నిబట్టి లెక్కకట్టి టైం తెలుసుకోవచ్చు.

ఆ దీపాల లెక్కతో టైమ్ తెలుసుకోవడానికి అక్కడ ఎప్పుడూ పెద్ద గుంపు ఉంటుంది. విశేషమేమిటంటే ఆ జనంలో లెక్కలు రానివాళ్లు కూడా చాలామంది ఉంటారుట. అదో ఆకర్షణ!

మొదట్లో నేను ఏం కావాలన్నా కు–డామ్‌కి వెళ్లేవాణ్ణి. కానీ నా ఇంటివెనుకపక్కనే ఉన్న విల్మెర్స్‌డాల్ఫర్ స్క్వాసేలో చాలా పెద్ద బజారున్న విషయం తెలుసుకుందుకు ఎన్నో రోజులు పట్టలేదు. ఆ వీధిలో సూపర్ మార్కెట్లే మూడో నాలుగో ఉన్నాయి. కేవలం బట్టలకే సే ఉంట్ ఆ (సి అండ్ ఎ) అనే బహుళ అంతస్తుల దుకాణముంది. అవికాక వాచీలు, జోళ్లు వగైరాలు దొరికే చిల్లర దుకాణాలకు లెక్కే లేదు. కు–డామ్ కంటే మా ఇంటి పక్కవీధి దుకాణాల్లోనే సరుకులు చవగ్గా కూడా ఉన్నాయి.

ఆ విషయం తెలిసిన మరికొద్ది రోజులకే ఆ వీధిలో ఆల్‌బ్రెస్ట్ దుకాణం కూడా కనిపించింది. అదీ మా ఇంటికి బాగా దగ్గరగా!

ఇక నా ఆనందానికి అవధుల్లేవు. నియంత్రణ ఉన్నప్పుడు మన దేశంలో కోఆపరేటివ్ స్టోర్సులో పంచదార ఎంత చౌకగా దొరుకుతుందో – ఇక్కడ పాలు, పప్పులు, బియ్యం వగైరా ఆహార దినుసులన్నీ అంత చవగ్గానూ దొరుకుతాయన్నది ల్యూనబర్గులో రామచంద్రద్వారా తెలుసుకున్నాను కదా మరి!

ల్యూనబర్గులో మార్కెట్ ఏరియాలో ప్రతి బుధ, శనివారాలూ సంత జరిగేది. ఆ సంతకు పల్లెటూళ్లనుంచి కూరగాయలు, పళ్లు, పాలు వగైరా వస్తువులు తెచ్చి అమ్మేవారు రైతులు. ఆ సంతలో సరుకులు తాజాగానూ, చవగ్గానూ ఉంటాయని యాకేల్ నాకు చెప్పింది. ఆమె సంత రోజుల్లో సంతకెళ్లి తనక్కావాల్సినవన్నీ కొనుక్కు తెచ్చుకునేది.

సంతలో పాలు, వెన్న, బియ్యం వగైరాలు ముందుగా ప్యాక్ చేసినవి కాక, అప్పటికప్పుడు తక్కెడలో తూచి కానీ, పాత్రలతో కొలిచికానీ అమ్ముతారు. మన సంతలో లాగే సరుకుల్ని వర్ణిస్తూ, వాటి ధరల్ని గట్టిగా అరిచి చెబుతారు. కస్టమర్సుని రమ్మని కేకలు పెడుతుంటారు.

సంతకి సరుకుల రవాణాకి పల్లెటూరి రైతులు చిన్నసైజు వ్యాన్లని వాడతారు. కారవాన్‌లుగా వ్యవహరించబడే ఆ వాహనాలు మామూలు వ్యాన్లు కాదు. వంటకీ, స్నానానికీ, పడకకీ సదుపాయాలున్న సంచార గృహాలవి.

ఆ సంతలు ప్రతి నగరంలోనూ సాధారణంగా వారానికి రెండు రోజులు జరుగుతాయనీ – ఉదయం ఎనిమిదినుంచి, మధ్యాహ్నం రెండువరకూ నడుస్తాయనీ విన్నాను.

సంత కూడా షాపుల్లాగే టైం విషయంలో ఖచ్చితంగా ఉంటుంది. రైతులు అమ్మకాలయ్యేక, నగరంలో కాసేపు కులాసాగా గడిపి మళ్లీ గ్రామానికి వెళ్లిపోతారు.

ఇలాంటి సంతలు బెర్లిన్ నగరంలోనూ వివిధ ప్రాంతాల ఉన్నాయి. మా ప్రాంతపు సంత – నేనున్న భవనానికి ఎదుట సరిగ్గా యాభై గజాల దూరంలో బుధ, శనివారాల్లో వస్తూంటుందని తెలిసి అది నా అదృష్టంగా భావించాను.

స్వయంగా వండుకునే అవకాశం లేనప్పుడు ఈ సంతల్ని అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు కాస్త శ్రద్ధగా గమనిస్తే – తాజా వంకాయలు, క్యాబేజి, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, టమేటాలు, పచ్చిమిరపకాయలు వగైరాలు ఇక్కడ సూపర్ మార్కెట్లలోకంటే బాగా చౌకగా దొరికేవి.

బుధ, శనివారాల్లో సంతకి వెళ్లి కావాల్సిన పళ్లు, కూరలు కాస్త ఎక్కువే కొనడం అలవాటు చేసుకున్నాను. అసలే చలిదేశం. ఆపైన ఫ్రిజ్ సదుపాయముంది. సరుకు పాడౌతుందన్న భయం లేదు.

ఇండియాలో ఐతే అప్పటికి మాబోంట్లకి ఫ్రిజ్ అంటే లగ్జరీయే కావడంతో, నాకు ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధనలతో పాటు – ఇంట్లో ఆధునిక పరికరాల వాడకం విషయంలోనూ కొంత శిక్షణ లభిస్తోంది.

నా దినచర్య నిర్దుష్టంగానే ఉండేది.

ఉదయం లేవగానే నాలుగు బ్రెడ్ స్లైసులు తీసుకుని వాటికి వెన్న, జాం రాసుకుని తినేవాణ్ణి. అరలీటరు పాలు తాగేవాణ్ణి. ఓ పండు తినేవాణ్ణి. ఆఫీసుకి నాలుగు బ్రెడ్ స్లైసులు తీసుకెళ్లి లంచ్ టైంలో తినేవాణ్ణి. రాత్రికి వంటలోకి అన్నం, కూర, సాంబారు చేసుకునేవాణ్ణి. సాంబారులోకి చింతపండుకి బదులు నిమ్మరసం వాడేవాణ్ణి.

ఒకప్పుడు సాంబారంటే ఎంతో కష్టమైన వంటకం అనుకునేవాణ్ణి. ల్యూనబర్గులో రామచంద్ర దాన్ని అతిసులభం చేసేశాడు.

కొబ్బరికోరు ప్యాకెట్లలో దొరికేది. వంకాయ, క్యాబేజి, ఉల్లి వగైరాలు ముక్కలుగా తరిగి నీళ్లలో వేసి, దానికి కొబ్బరికోరు కలిపి స్టౌమీద ఉంచి ఉడకబెట్టేవాణ్ణి. చివర్లో సాంబారు పొడి వేసేవాణ్ణి. సాంబారు పొడి, ఇంకా ఇతర ఇండియన్ మసాలా పొడులు అక్కడ అన్ని షాపుల్లోనూ దొరికేవి. సాంబారు ఉడికి మంచి వాసన వేసేక, అప్పుడు నిమ్మకాయ పిండి వెంటనే స్టవ్‌మీంచి దింపేసేవాణ్ణి.

సిమ్లా మిర్చిని పాప్రికా అనేవారక్కడ. పాప్రికా, వంకాయ, బంగాళాదుంపలతో – రోలు అవసరం లేకుండానే మసాలా కూరలు చేసుకునే విధానం నాకు తెలియడానికి – నటరాజన్, కొరియా, రామచంద్ర, దేవదార్లు మార్గదర్శకులు. వాళ్లని తలచుకుంటూ ఆ వంటలు చేసుకుని తినేవాణ్ణి.

వచ్చింది రీసెర్చి కోసం. ఐనా భోజనం ఆసక్తికరంగా లేకపోతే రీసెర్చిమీద మాత్రం దృష్టి పెట్టడం కష్టం కదా! ఏదో వారం పదరి రోజులైతే అనుకోవచ్చు. ఏడాదుండాలి. అందుకని మన ఊరగాయల కోసం షాపుల్లో వెదికేవాణ్ణి. అలా కొన్ని షాపుల్లో అమెరికన్ ఫుడ్ ప్రొడక్ట్సు (బొంబాయి) పేరిట మన ఊరగాయలు దొరుకుతున్న విషయం తెలుసుకున్నాను.

ఇండియాలో ఉండగా జ్వరమొస్తే కూడా బ్రెడ్ తినడానికి ఇష్టపడని నాకిప్పుడు రోజూ అదే ఫలహారం, మధ్యాహ్నభోజనం. అది కాస్త బాధాకరంగానే ఉన్నా, ల్యూనబర్గుతో పోలిస్తే ఇక్కడి తిండి సదుపాయం బాగా మెరుగయింది.

పొద్దున్నే ఏ ఉప్మాయో చేసుకోవచ్చు. అందుకు పెందరాళే లేవాలి. కానీ ఆహ్లాదకరమైన చలిలో, వెచ్చని రొజాయిలోంచి ఉదయం ఏడు లోపల లేవబుద్ధేసేది కాదు.

ఎనిమిదింటికల్లా ఆఫీసుకి చేరుకోవాలంటే – కనీసం ఏడున్నరకి ఇంట్లో బయల్దేరాలి. ఏడుకి లేచి తెమలడం మొదలెడితే బ్రెడ్ స్లైసులకి జాం రాసుకోవడం తప్ప – ఇక టిపిను చేసుకునే టైమేదీ?

నేను ఉదయం లేచి ఆఫీసుకి వెళ్లేదాకా ఇంటామె తన గదిలోంచి బయటకొచ్చేది కాదు. ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఐదు దాకా ఆఫీసు. అప్పుడు ఆరున్నరవరకూ కొత్త కొత్త షాపులు చూసి ఎక్కడెక్కడ ఏమేమున్నాయో, ఎంతలో ఉన్నాయో తెలుసుకునేవాణ్ణి. ఇల్లు చేరాక ఇంటామె వచ్చేలోగా వంట చేసుకుని తిని పడుకునేవాణ్ణి.

నేను బెర్లిన్ చేరిన కొద్ది రోజుల్లోనే యూనివర్సిటీలో జర్మన్ పరీక్షకు కూర్చోవాల్సి వచ్చింది. ల్యూనబర్గులో ఉండగా నాలుగు నెలల్లో రెండు పరీక్షలు ప్యాసయ్యాను. ఇది మూడోది. ఇది ప్యాసవ్వాలన్న నియమం లేదు కానీ, పరీక్ష మాత్రం వ్రాసి తీరాలి.

పరీక్ష మయసభలో. ఎలాగో పరీక్ష హాలుకి వెళ్లాను. పేపర్ చూస్తే సులభంగానే ఉందనిపించింది కానీ, కొన్ని పదాల అర్థం తెలుసుకుందుకు నిఘంటువు కావాలి. ఈ పరీక్షకి నిఘంటువు దగ్గరుంచుకోవచ్చని అక్కడ మిగతావారిని చూసేక అర్థమయింది.

నా దగ్గరో పాకెట్ సైజు నిఘంటువుంది. కానీ అది ఆఫీసులో ఉండిపోయింది. వెళ్లి తెచ్చుకుందామంటే బోలెడు టైము వృథా. అందుకని అక్కడ పరీక్ష వ్రాస్తున్న దేశపాండే అనే ఇండియన్ దగ్గరకెళ్లి, "ఒక్కసారి నీ డిక్షనరీ ఇస్తావా? కొన్ని పదాల అర్థం చూసుకుని కొద్ది నిముషాల్లో ఇచ్చేస్తాను" అనడిగాను.

"డిక్షనరీ కొద్ది నిముషాలుంటే కావలసినదంతా ఆకళింపు చేసుకునే శక్తి నీకుండొచ్చు. ఒక్క క్షణం కూడా అది లేకుండా పరీక్ష వ్రాసే సామర్థ్యం నాకు లేదు" అన్నాడతను.

అది వ్యంగ్యం కావచ్చు, నిజం కావచ్చు. అతను డిక్షనరీ ఇవ్వననడంలో న్యాయముంది. కానీ చెప్పిన పద్ధతికి మనసు నొచ్చుకుంది.

అతను కూడా ఇండియానుంచి నాతోపాటు సెలక్టయి నేనొచ్చిన విమానంలోనే ఇక్కడికొచ్చిన డాడ్ స్కాలరే. వేరే ఊళ్లో గ్యోతే ఇన్స్టిట్యూట్లో జర్మన్ భాష నేర్చుకుని బెర్లిన్ నగరం చేరాడు.

నిఘంటువుకోసం నేను ఇన్విజిలేటర్ అనుమతి తీసుకుని హాల్లోంచి బయటకు వచ్చాను. రోడ్డుకి అవతలపక్కనున్న నా ఆఫీసుకి వెళ్లాను. డిక్షనరీ తీసుకున్నాను. కానీ చివరకు అనుకున్నంతా అయింది. పరీక్ష హాలుకి వస్తూ మయసభలో దారి తప్పాను. వాళ్లనీ, వీళ్లనీ అడిగి పరీక్ష హాలు చేరుకునేసరికి అరగంటపైన సమయం వృథా ఐపోయింది. నిఘంటువు కూడా నాకు అంతగా ఉపయోగపడలేదు. చాలా పదాలకు అర్థం ఊహించి రాసేశాను.

జర్మన్ భాషలో పదాల అర్థం తెలుసుకుందుకు ఊహ అంతగా ఉపయోగపడదు. ఉదాహరణకు కున్ఫ్ట్ అనే పదాన్ని తీసుకుంటే– అన్‌కున్ఫ్ట్ అంటే రాకడ, అబ్‌కున్ఫ్ట్ అంటే పోకడ. ఈ పదాలు రైల్వే ప్లాట్‌ఫారాలమీదా, ఎయిర్‌పోర్టుల్లోనూ కనపడతాయి. అయితే ఔస్‌కున్ఫ్ట్ అంటే సమాచారం, ఉంటర్‌కున్ఫ్ట్ అంటే వసతి.

ఇలాంటివన్నీ నాకు ఇదివరకటి పరీక్షల్లో అనుభవం. అందుకని ఈసారి పరీక్ష పోతుందని ఊహించాను. పదాల అర్థాలు గ్రహించడంలో తప్పయిన నా ఊహ – పరీక్షా ఫలితం విషయంలో మాత్రం తప్పు కాలేదు.

మా చిన్నప్పుడు ఎస్సెస్సెల్సీ పరీక్షా ఫలితాలు రాగానే – 'ప్యాసయినా, తప్పినా – చదవండి ఓవర్సీర్ కోర్సు' అంటూ అడ్వర్టయిజ్‌మెంట్లు వచ్చేవి. అలాగే మేమిక్కడ జర్మన్ పరీక్ష వ్రాస్తే చాలు – ఫలితంతో నిమిత్తం లేలుండా, వెంటనే మాకు స్టూడెంట్ ఐడెంటిఫికేషన్ కార్డు ఇస్తారు. ఇచ్చే కార్డ్సులో మాత్రం తేడా ఉంటుంది. ప్యాసైనవారికి 'పెద్ద గుర్తింపు', ఫెయిలైనవారికి 'చిన్న గుర్తింపు' అని ముద్ర కొడతారు. పెద్ద గుర్తింపు వారు ఎంత కాలమైనా యూనివర్సిటీ విద్యార్థిగా కొనసాగవచ్చు. చిన్న గుర్తింపువారు మూడు సెమిస్టర్లు అంటే పద్దెనిమిది నెలలు మాత్రమే స్టూడెంటుగా ఉండగలరు. ఇంకా కొనసాగాలంటే వారు మళ్లీ పరీక్షకి కూర్చోవాల్సి ఉంటుంది.

అలా నాకు చిన్న గుర్తింపు కార్డు వచ్చింది.

ఈ ఐడెంటిటీ కార్డు వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. బెర్లిన్లో – బస్సు, ఊబాన్ వగైరాల్లో ఏదో ఒకదాంట్లో నాకు నెలవారీ పాస్ వస్తుంది. అదుంటే కేవలం పది మార్కులకి నెల్లాళ్లపాటు బెర్లిన్ అంతా ఎన్నిమార్లయినా యథేచ్ఛగా తిరగొచ్చు.

నాకు బస్సు కంటే ఊబాన్ (అండర్‌గ్రౌండ్ రైలు) ఎక్కువ నచ్చింది. అందులో నెలవారీ పాస్ కొనుక్కున్నాను.

మామూలుగా ఐతే ఊబాన్ టికెట్ ట్రిప్పుకి అరవై ఫెన్నిగ్సు. నాలుగు ట్రిప్పులకి ఒక్కసారే కొనుక్కునే మాటయితే రెండు మార్కులకే కన్సెషన్ టికెట్ దొరుకుతుంది. అదే చౌక అనుకునేవాణ్ణి. అలాంటిదిప్పుడు నెల పొడుగునా ఎన్ని ట్రిప్పులు వేసినా నెలకి పది మార్కులే అంటే కారు చౌక కదా!

అసలే పశ్చిమ జర్మనీలో మిగతా నగరాలన్నింటికంటే పశ్చిమ బెర్లిన్లో అన్నీ చౌక.

క్రమంగా నా పరిసరాలమీద నాకు పట్టొస్తోంది. అనుకోకుండా నేనుంటున్న ఇల్లు మంచి సెంటర్లో ఉంది. ఇంట్లోంచి బయటకు రాగానే అటుపక్క సూపర్ మార్కెట్ల వీధి. ఇటుపక్క రెండు నిముషాలు నడిస్తే ఊబాన్‌హాఫ్ (ఊబాన్ స్టేషన్). దాని పేరు డాయిచే ఓపర్

(జర్మన్ థియేటర్). అక్కడ ఊబాన్ ఎక్కితే తరువాతి ఊబాన్‌హాఫ్ ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్. అక్కడ ట్రయిన్ దిగితే ఆఫీసుకి మరో రెండు నిముషాల నడక. ఊబాన్ వద్దనుకుంటే నా ఇంటినుంచి నడిచి వెళ్లినా పది నిముషాల్లో ఆఫీసు చేరుకోవచ్చు.

విచిత్రమేమిటంటే – జర్మన్ పేర్లు పలకడానికి ఇంత కష్టంగా ఉంటాయా – ఏ ఒత్తులూ లేని నా పేరుని రాజగోపాలరావు అని పలకడానికి జర్మన్లు నానా యాతనా పడేవారు. పైగా ఇండియన్ పేర్లు పలకడానికి చాలా కష్టమనేవారు. కష్టమనేది ఇష్టాన్నిబట్టీ, అలవాటునిబట్టీ ఉంటుందనుకోవాలి.

ఆఫీసు ముచ్చట్లు

క్రమంగా మా డిపార్టుమెంట్లో కొందరు రీసెర్చిస్కాలర్సుతో పరిచయమైంది. అంతా స్నేహపూర్వకంగా మాట్లాడేవారు. ఇక్కడ నేను గమనించిందేమిటంటే – పనివేళల్లో ఎవరూ క్షణం కూడా వృథా చెయ్యరు. అవసరానికి పలకరించినా ఉబుసుపోక కబుర్లకి తావుండదు. ఎవరైనా ఎవరికైనా సాయం చేస్తామంటే యథాలాపంగా అనరు. మాట హృదయంలోంచి వస్తుంది. సాయం చేసే ఉద్దేశ్యం లేకపోతే ఆ ప్రస్తావనే తేరు. సాధారణంగా అందరూ చాలా ఉత్సాహంగా, సరదాగా ఉంటారు.

డిపార్టుమెంట్లో ఆడుకుందుకు ఓ టేబుల్ టెన్నిస్ బోర్డుంది. భోజన విరామ సమయంలో కొందరు అక్కడ చేరి ఆడేవారు. వారివారి అభిరుచుల్నిబట్టి కొందరు పని చేస్తూనే సంగీతం వినేవారు. అందుకు వాళ్ల దగ్గర రేడియోలో, టేపు రికార్డర్లో ఉండేవి. గ్లాస్ బ్లోవర్ గదిలో ఐతే కాలక్షేపానికి టెలివిజన్ కూడా ఉంది.

డాడ్ స్కాలర్ షిప్ ఏడాదికి మాత్రమే. అందులో చాలా సమయం – కొత్త దేశాన్ని అర్థం చేసుకుందుకూ, ముచ్చట్లు తెలుసుకుందుకూ, అక్కడి విధానాల్ని పరిశీలించేందుకూ, ప్రముఖ యాత్రాస్థలాల సందర్శనకూ, సామాజిక వైజ్ఞానిక సంస్కృతుల అవగాహనకూ – అయిపోతుంది. ఇక మిగిలిన సమయంలో చెయ్యగల రీసెర్చి ఏముంటుందిలే అని అటు డాడ్ స్కాలర్సూ, ఇటు జర్మన్ రీసెర్చి గైడ్సూ కూడా తేలికగా తీసుకోవడం కద్దు.

డాక్టర్ రాలెక్ కూడా ఆరంభంలో నన్ను అంత సీరియస్‌గా తీసుకోలేదు. నా అనుభవాన్నిబట్టి నాకు తోచిన పని చేసుకోమనీ, అవసరమైనప్పుడు తనని సంప్రదించమనీ చెప్పాడు. ఆ మాటల్నిబట్టి – తమ సంస్థ పనితీరునీ, అక్కడి సదుపాయాల్నీ అవగాహన చేసుకుందుకు నా ఏడాది సమయం చాలనుకున్నాడని నాకు తోచింది.

కానీ నేనక్కడికి సరదాగా కాలక్షేపం చెయ్యడానికి రాలేదు. నాకున్న సమయంలో – కొత్త పద్ధతిలో కొన్ని కెటలిస్టులు తయారు చేసి, అక్కడున్న సదుపాయాలతో వాటి గుణగణాల్ని పరీక్షించాలన్నది నా కోరిక. ఆ విషయం జర్మనీ వచ్చేముందు డాక్టర్ రాలెక్‌కి తెలియబర్చాను కూడా. ఆ విషయం మరోసారి ఆయనకి గుర్తు చేశాను. ఆయన వెంటనే చిన్నగా నవ్వి, పని ప్రారంభించడానికి ఏమేం కావాలో జాబితా తయారు చేసి తీసుకుని రమ్మని యథాలాపంగా చెప్పాడు.

నాకక్కడ పరిశోధనకు కావాల్సిన స్పెషల్ కెమికల్స్ జాబితా ఎప్పుడో సిద్ధం చేసుకున్నాను. వాటిలో ఆఫీసు స్టోర్లో దొరకనివేమిటో కూడా జాబితా తయారు చేసుకున్నాను. నేనా విషయం చెబితే – ఆయన ఏమేమి ఎంతెంత కావాలో కాగితంమీద రాసిమ్మన్నాడు.

ఎంత రాయాలీ అని ముందుచూపుతో ఆలోచించాను. ఆ ముందుచూపు కేవలం భారతీయులకు మాత్రమే అవసరమైనదని అప్పుడు నాకు తెలియదు. ఎందుకంటే –

ఇండియాలో ఐతే కెమికల్స్ కొనడానికి పెద్ద ప్రొసీజరుంది.

ముందు ఇండెంట్ ఫారంమీద కావాల్సిన కెమికల్స్ జాబితా వ్రాసి బాస్‌కివ్వాలి. బాస్ సంతకం పెట్టేక, స్టోర్సుకి వెళ్లి అవి స్టోర్సులో లేవని ఆ కాగితంమీద వ్రాయించాలి. అప్పుడా ఇండెంట్ పర్చేజ్ విభాగానికి వెడుతుంది. పర్చేజ్ ఆఫీసరు కొన్ని కంపెనీలకి ఉత్తరాలు రాస్తాడు. వాళ్లు కొటేషన్సు పంపిస్తారు. కొటేషన్సు రావడానికి కొద్ది నెలల నియమితకాలం ఉంటుంది. అన్ని కంపెనీలనుంచీ వెంటనే కొటేషన్స్ రాకపోతే గడువుతేదీ అయ్యేదాకా ఎదురు చూడాలి. అప్పుడు పర్చేజ్ విభాగంవారు అన్ని కంపెనీల కొటేషన్లనీ సరిపోల్చుతూ ఒక చార్ట్ తయారుచేసి ఆర్డరిచ్చిన సైంటిస్టుకి పంపుతారు. సైంటిస్టు ఆ చార్టు చూసి, అన్నింటిలోకీ చౌకగా ఇస్తున్న కంపెనీకి ఆర్డరిమ్మని రికమెండేషను ఇవ్వాలి. అలా కాని పక్షంలో, ఖరీదెక్కువున్న చోటకి ఆర్డరివ్వడాన్ని సమర్ధించుకుంటూ నోట్ రాయాలి. మళ్లీ దానిమీద బాస్ చేత సంతకం పెట్టించుకున్నాక, పర్చేజ్ విభాగంవారు ఆఫీసు అధినేత అనుమతి తీసుకుని ఆర్డర్ పంపిస్తారు. కంపెనీ తన వీలునిబట్టి నెమ్మదిమీద కెమికల్స్ డెలివరీ చేస్తుంది. అందుకు అథమపక్షం నాలుగు నెలలు పడుతుంది. కానీ సాధారణంగా ఏడాది పడుతుంది. అందుకని మాకేం కావాల్సొచ్చినా, కనీసం రెండేళ్ల అవసరాలకి సరిపడ ఇండెంట్ ఇస్తాం. అందువల్ల చాలాసార్లు అవసరానికి మించి కొనడమూ, కొన్న కెమికల్స్ ఏళ్ల తరబడి వృథాగా మిగిలిపోవడమూ జరుగుతూంటుంది.

నేను బెర్లిన్లో ఉండేది ఏడాదే కదా అని – అందుకు తగ్గట్టుగా కెమికల్సు అవసరాన్ని లెక్కేసి, ఆ ప్రకారం క్వాంటిటీలతో ఓ జాబితా తయారు చేసి వెంటనే రాలెక్‌కి చూపించాను.

నేనంత వెంటనే జాబితా తెచ్చినందుకు ఆయన ముఖంలో అభినందనపూర్వకమైన మందహాసం వెలసింది. కానీ మరుక్షణమే ఆయన ముఖం గంభీరంగా మారిపోయింది. ఆయన జాబితా చదవడం పూర్తిచేసి గుండెలు బాదుకుని, "ఒకొక్క కెమికల్ కేజీల్లో రాశారు. మిగిలిపోతే ఏంచేద్దామని?" అన్నాడు.

ఆంగ్లంలో యు అంటే నీవు, మీరు అని అర్థం. కానీ జర్మన్లో భారతీయ భాషల్లో లాగే మన్ననకి జీ (మీరు), సుపరిచితులకి డు (నీవు) అంటూ వేర్వేరు పదాలున్నాయి. రాలెక్ నన్ను 'మీరు' అనే వ్యవహరించేవాడు.

అంత సంపన్న దేశంలో ఆట్టే ఖరీదులేని ఆ కెమికల్స్ గురించి అలా మాట్లాడ్డం, కక్కుర్తి వ్యవహారంలా అనిపించింది. "మిగిలిపోవడం గురించి మీరాలోచిస్తున్నారు. సరిపోకపోతే ఏం చెయ్యాలని నేనాలోచిస్తున్నాను" అన్నాను సీరియస్‌గా.

"సరిపోకపోవడమేమిటి? ఎంతెక్కువ వాడినా ఇప్పుడు మీరడిగిన క్వాంటిటీలో పదో వంతు కొంటే – ఈ కెమికల్సు కనీసం నెల్లాళ్లు వస్తాయి. అవి చాలని నా ఉద్దేశ్యం. అంతగా చాలకపోతే అప్పుడే మళ్లీ తెప్పించుకోవచ్చు" అన్నాడాయన.

నాకప్పుడు మా మామ్మగారు గుర్తుకొచ్చారు. డబ్బు ఇబ్బందిగా ఉన్నప్పుడు, ఆమె వంట అవసరానికి ఏ పూట సరుకు ఆ పూట తెప్పించేవారు. తెచ్చేది నేనే కదా, అన్నిమార్లు తిరగలేక, "కనీసం వారానికి సరిపడ కొనచ్చుగా" అనేవాణ్ణి.

"సాయంత్రానికి ఇంకేమైనా అవసరమొచ్చిందనుకో. డబ్బు దానికి ఖర్చు పెట్టాలి. తిండిదేముంది? ఉంటే పంచభక్ష్య పరమాన్నాలు. లేకుంటే ఊరగాయతో సరిపెట్టుకుంటాం" అనేదామె.

కష్టకాలంలో ఇల్లు నడవడానికి ఆమే కారణమని మా తాతగారు పదేపదే మెచ్చుకునేవారు.

కానీ ఈ సంపన్నదేశంలో కెమికల్సు కాసిని ఎక్కువ కొనలేనంత కష్టకాలమేం లేదు కదా! ఆ మాట సూటిగా అనలేక, "నెల్లాళ్లాగి మళ్లీ తెప్పించుకోవడమా, ఇలాగైతే ఇక్కడ నా కాలమంతా పర్చేజ్ ఆ తతంగానికే ఐపోతుందన్నమాట!" అని నిట్టూర్చాను.

"తతంగమేమిటీ?" అన్నాడాయన తెల్లబోయి.

ఇంత చిన్న విషయం విడమర్చి చెబితే కానీ అర్థం కాదా అనుకుంటూ – ఒక కొనుగోలుకి జరిగే తతంగమంతా వివరించాను.

నేను చెప్పింది ఆయనకి వెంటనే అర్థం కాలేదు. ఒకటికి రెండుసార్లడిగి చెప్పించుకున్నాక ఆకళింపు అయినట్లుంది. ఆ వెంటనే భళ్లున నవ్వేసి, "ఓహ్, మర్చేపోయాను. మీరొచ్చింది ఇండియానుంచి కదూ!" అన్నాడు.

ఆ నవ్వులో ధ్వనించిన వ్యంగ్యానికి కాస్త నొచ్చుకున్నా, అసలు విషయం వినేసరికి సిగ్గుపడక తప్పలేదు.

నేనో జాబితా తయారు చేశాను కదా! ఆ కాగితంమీద రాలెక్ సంతకం పెట్టి ఇస్తాడు. నేనా కాగితాన్ని ఆఫీసులో సెక్రటరీకిస్తాను. ఆమె కెమికల్స్ సరఫరా చేసే కంపెనీకి ఫోన్ చేస్తుంది. ఆ కంపెనీ పొరుగూరిది కాకపోతే, మరో గంటలో నేనడిగిన కెమికల్స్ నా బల్లమీదుంటాయి. కంపెనీ పొరుగూరిదైతే దూరాన్నిబట్టి రెండు మూడు రోజుల్లో సరుకు నా బల్లమీదికొస్తుంది.

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను.

నియమాలు పెరగడంవల్ల – వాటి అమలుకి ఉద్యోగులు అదనం, సమయం అదనం, కొనుగోలు కూడా అవసరానికి మించి అదనం. అన్నింటికీ మించి కావాల్సిన వస్తువు కావాల్సిన రోజుకి లభించదు. అదీ మన వ్యవస్థ. అందుకు పూర్తి భిన్నంగా ఉండడంవల్లనే ఈ దేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతోందా?

ఆలోచనలు పరిపరివిధాల పోతుంటే – అదుపు చేసి అక్కడి వాస్తవానికొచ్చాను.

వెంటనే నా అవసరాలు మారిపోయాయి. కాగితంమీది అంకెలూ మారిపోయాయి. ఆ రోజు సాయంత్రానికే నేనడిగినవి నా బల్లమీదున్నాయి.

కొద్ది రోజుల్లోనే రాలెక్‌కి తెలిసిపోయింది. నేనక్కడికి కాలక్షేపానికి రాలేదని. ఆయన నాతో సబ్జక్ట్ డిస్కషన్ మొదలెట్టాడు. నాది ప్రిపరేటివ్ కెమిస్ట్రీ. ఆయనది టెక్నాలజీ టెస్టింగ్. ఇద్దరూ ఒకరి పరిధి ఒకరు తెలుసుకుని, ఒక స్కీము తయారు చెయ్యడానికి కొన్ని రోజులు పట్టింది.

నేను తయారు చేసే శాంపిల్స్ టెస్ట్ చెయ్యడానికి అక్కడ లాబొరేటరీలో రెడీగా ఉన్న యూనిట్లు లేవు. కొత్తగా డిజైన్ చెయ్యాలి. అందుకుగానూ నేను లైబ్రరీకి వెళ్లి సైంటిఫిక్ జర్నల్సు శోధించి అనువైన కొన్ని డిజైన్లు తెచ్చాను. తర్వాత నేను, రాలెక్, వర్క్‌షాపులో ఓ ఇంజనీరు కలిసి కూర్చుని చర్చించి ఓ టెస్టింగ్ యూనిట్‌కి డిజైన్ రూపొందించాం.

యూనిట్ తయారు చెయ్యడానికి 3–4 నెలలు పడుతుందన్నాడు ఇంజనీరు. ఎందుకంటే మా టెస్టింగు హై ప్రెషర్లో జరుగుతుంది. ఆ ఒత్తిడికి తట్టుకుని నిలబడే స్పెషల్ స్టీల్ బెర్లిన్లో దొరకదు. అది తెప్పించడానికి రెండు వారాలకి పైగా పడుతుంది. ఆపైన క్రిస్మస్ సెలవులు. వర్క్‌షాప్ ఇంజనీరు నెల్లాళ్లు సెలవులో ఉంటాట్ట.

నాకూ ఆ యూనిట్ వెంటనే అవసరం లేదు.

టెస్టింగుకి శాంపిల్స్ తయారు చెయ్యాలి కదా, అందుకా వ్యవధి ఎలాగూ అవసరం.

డాక్టర్ రాలెక్ తన సబ్జక్టులో అఖండుడు. ఇతరత్రా కూడా ఆయన పరిజ్ఞానం నాకు ఆశ్చర్యం కలిగించేది. ఆయన నాతో భారతీయ సంస్కృతి గురించి అడపాతడపా చర్చిస్తుండేవాడు. అలాంటప్పుడు ఆయనతో నాకు చిన్న ఇబ్బంది ఉండేది.

రాలెక్‌ది తొందరపాటు స్వభావం. ఏదైనా విన్నప్పుడు త్వరగా ఓ నిర్ణయానికొచ్చేస్తాడు. ఇక మన మాట వినకుండా తన అభిప్రాయం చెప్పేస్తాడు. ఆ తర్వాత దాని గురించి శ్రద్ధగా ఆలోచించి ఆకళింపు చేసుకుని అవసరమైతే తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడు కూడా.

ఆయన కమ్యూనిజానికి బద్ధవిరోధి. అందుక్కారణముంది. ఆయనది ఒకప్పుడు చెకొస్లోవేకియా. స్కాలర్‌షిప్ మీద ఈ దేశానికొచ్చి క్రమంగా స్థిరపడిపోయాడు. ఇండియా కమ్యూనిజం వైపు మొగ్గుతున్నదని ఆయన బాధపడేవాడు. ఆయనకు ఆసియా దేశాలపట్ల చిన్నచూపు కూడా ఉంది. అక్కడి పౌరులు అనాగరికంగా జీవిస్తున్నారని ఆయన అనుకునేవాడు.

డాక్టర్ రాలెక్ మిత్రుడొకడు తరచు భారత దేశానికి వెళ్లొస్తుంటాడు. ఆయన రాసే ఉత్తరాలు కూడా రాలెక్ అభిప్రాయాల్ని ప్రభావితం చేస్తుంటాయి. ఆ మిత్రుడొకసారి,

"వానాకాలంలో ఇండియన్ రీసెర్చి లాబొరేటరీలకు ఈదుకుని వెళ్లాలి" అని వ్రాసేట్ట. రాలెక్ ఆ విషయం నాకు చెప్పి, "నిజమేనా?" అనడిగాడు.

నాకు కోపం వచ్చింది కానీ, అలాంటప్పుడు ప్రశాంతంగా ఉండడమే విజ్ఞత అని తెలుసు. "మంచు కురిసే చోట తవ్వుకుంటూ వెళ్లాలి కదా, అలాగే వరదలొచ్చినచోట ఈదుకుంటూ వెళ్లాల్సిరావచ్చు. అది లొకేషన్ బట్టి ఉంటుంది. ఐతే నాకు తెలిసిన ఏ రీసెర్చి లాబొరేటరీకీ వానాకాలం సమస్య లేదు" అని చెప్పాను.

ఆయన నాతో ఎప్పుడు సంభాషణ ప్రారంభించినా – ఇండియాని గేలి చేస్తూ మొదలెట్టేవాడు. నేను శాంతంగా విని అక్కడి సంప్రదాయాన్నీ, ఆచారాల్నీ వివరించి చెప్పేవాణ్ణి. తర్వాత ఆయన ఆ విషయమై గట్టిగా ఆలోచించేవాడు.

ఐతే మన జీవన విధానంలో హిపోక్రిసీ చాలా ఎక్కువ. దానికి ఏమని సంజాయిషీ ఇవ్వగలం? ఐనా నా ప్రయత్నం నేను సిన్సియరుగా చేసేవాణ్ణి. అందువల్ల ఇండియాపై ఆయన అభిప్రాయాలు పెరిగాయో లేదో తెలియదు కానీ, నాపై మాత్రం ఆయనకు గౌరవాభిమానాలు పెరిగాయి. అక్కడ ఆయనవంటి మంచివాడి సాహచర్యం లభించినందుకు నాకూ సంతోషంగా అనిపించేది.

నా అలవాట్లను బట్టి, ఆఫీసులో జర్మన్సుకి నేనో విచిత్రవ్యక్తిలా తోచేవాణ్ణి. అంతవరకూ వాళ్లకి నాలాంటి ఇండియన్ తగల్లేదుట. ఏది ఏమైనా నా అలవాట్లు ఒక విధంగా మన దేశంమీద వారికున్న కొన్ని దురభిప్రాయాల్ని పోగొట్టడానికి సహకరించాయని చెప్పొచ్చు.

చాలామంది జర్మన్సు దృష్టిలో ఇండియా పేద దేశం. అక్కడ సామాన్యులకి కనీసావసరాలు దొరకవు. పౌరులు అనాగరిక స్థితిలో ఉన్నారు. అలాంటి దేశంనుంచి ఇక్కడికొచ్చి, ఇక్కడి సదుపాయాల్నీ, వైభవాన్నీ చూసి మైమర్చిపోయి, ఇక్కడే స్థిరపడిపోవాలనుకుంటారు. అది కుదరనప్పుడు– ఉన్నన్ని రోజులూ ఆబగా అందినన్ని సౌఖ్యాలు అనుభవించాలనుకుంటారు.

వాళ్ల ఈ అభిప్రాయానికి నేను సవాలయ్యాను.

నాకు జర్మనీ నచ్చింది. వారు సాధించిన ప్రగతి నాకు జర్మన్ పౌరులపట్ల గౌరవభావాన్ని కలిగించింది. ఐతే నేను వారి దేశానికొచ్చింది – కొన్నాళ్లు వారి వైభవంలో పాలు పంచుకుందుకు కాదు. అక్కడున్న ఆధునిక వైజ్ఞానిక సదుపాయాల సహకారంతో, శాస్త్ర పరిశోధనలు కొనసాగించి నా విజ్ఞానానికి పదును పెట్టాలనుకున్నాను.

అంతవరకూ బాగానే ఉంది.

మరి జర్మన్లకు నిత్య జీవితంలో ఆల్కహాల్ ఒక ముఖ్యభాగం. నేను ఏ రూపంలోనూ దాని వాసన కూడా చూడను.

నా పక్కనే పని చేసే హెర్ (మిస్టర్) హైనర్ డెకర్ట్, రాలెక్ దగ్గర్ రీసెర్చి స్టూడెంటు. తొలి పరిచయంలోనే మా ఇద్దరికీ మంచి స్నేహం కలిసింది.

"వైన్ పుచ్చుకోకపోతే మీరు పండుగలెలా జరుపుకుంటారు?" అని ఒకసారి నన్నతను ఆశ్చర్యంగా అడిగాడు.

అతనలా అడగడం సబబే. మరక్కడ పండుగలకీ, వైనుకీ అవినాభావ సంబంధముంది. అసలు వైన్ తాగడమే పండగ వారికి.

"నువ్విలా ఆశ్చర్య పడుతున్నావా? పండక్కి వైన్ తాగుతారేంటని మేమక్కడ మీ గురించి ఆశ్చర్యపడతాం. ఎందుకంటే మా దేశంలోనూ వైన్ తాగేవారు చాలామందున్నారు. వాళ్లు కూడా పర్వదినాల్లో వైన్ ముట్టుకోరు. వైనే కాదు, మిగతారోజుల్లో మాంసం లేందే ముద్ద దిగనివాళ్లు కూడా, పర్వదినాల్లో మాంసాహారం జోలికి వెళ్లరు" అన్నాను.

"పండగంటే వైనూ, మాంసం ముట్టుకోకపోవడమా? ఐతే అదేం పండగ?" అన్నాడు డెకర్ట్.

"అలా ఎందుకనుకోవాలి? మీ లెక్క ప్రకారం మా దేశంలో చాలామందికి నిత్యం పండగలే. మీరుమాత్రం అప్పుడప్పుడే పండగ జరుపుకుంటారు" అన్నాను నేను.

ఈ సమాధానం డెకర్ట్‌కి నచ్చలేదు.

డెకర్ట్‌కే కాదు. మా ఆఫీసులో చాలామంది విదేశీయులకూ, జర్మన్సుకీ నా సమాధానాలు నచ్చేవి కాదు. ఒక పేద దేశంనుంచి వచ్చి విలాసాలకోసం ఆత్రపడిపోవడానికి బదులు – తామెంతో అపురూపంగా భావించేవాటిని నిరసించడం అసంతృప్తిగా ఉండేది వారికి. పోనీ అంటే నేనెప్పుడూ వాళ్ల అలవాట్లని తప్పు పట్టేవాణ్ణి కాదు. సమాధానాలకు తర్కాన్ని మాత్రమే వాడేవాణ్ణి.

అందువల్ల కొందరికి పట్టుదలగా ఉండేది – ఇండియాలో దరిద్రం తాండవిస్తున్నదనీ, అక్కడి పౌరులది నికృష్ట జీవితమనీ – నాచేత ఒప్పించాలని!

డాక్టర్ రాలెక్‌కి మరో స్టూడెంటు – మ్యుల్లర్. సన్నగా పొడవుగా నీలి కళ్లతో హీరోలా ఉండేవాడు. అతనొకసారి నాతో మాంసాహారం గురించి చర్చకు దిగాడు.

చాలామంది జర్మన్లలో మెచ్చుకోతగ్గ విషయమేమిటంటే – వారి మనసులో ఏమున్నా, ఎదుటి వ్యక్తిపై ఎటువంటి భావాలున్నా, మాట్లాడే తీరు మాత్రం ఎంతో సౌమ్యంగా ఉంటుంది.

"రావ్! మాంసాహారం ఎందుకు తీసుకోవు?" అనడిగాడతను.

"శాకాహారిని కాబట్టి!"

"శాకాహారమంటే నీ అభిప్రాయంలో జీవం లేనిదనేగా? మరి చెట్లకు ప్రాణం ఉన్నదని నీకు తెలియదా?"

"చెట్లకు ప్రాణమున్నా జీవజాలంలో ఆ జాతి వేరు. ఒక మేకకి కాలు కోస్తే, అక్కడ ఇంకో కాలు మొలవదు. చెట్టు కొమ్మ విరిస్తే అక్కడ ఇంకో కొమ్మ మొలుస్తుంది" అన్నాను.

"అయితే ఒక రకం చేప ఉంది. దానికి కొమ్ములుంటాయి. వాటిని కోస్తే మళ్లీ కొత్త కొమ్ములు మొలుస్తాయి. ఆ చేపల్ని తినడానికి అభ్యంతరం లేదుగా" అన్నాడు మ్యుల్లర్.

"చేపల్ని తినే ప్రసక్తి లేదు. వాటి కొమ్ముల సంగతి ఆలోచిద్దాంలే" అన్నాను నవ్వేసి.

మ్యుల్లర్ కూడా నవ్వేసి, "నువ్వు చాలా మొండి. అది సరే కానీ, మాంసాహారం తినకపోవడం వల్ల నువ్వు అహింసాపరుణ్ణని అనుకుంటున్నావు కదూ!" అన్నాడు.

"అలా అనుకుందుకు ఈ ప్రపంచంలో హింసలేనిదెక్కడ? నేను చెట్లని హింసిస్తున్నాను. నువ్వు జంతువుల్ని హింసిస్తున్నావు. కొన్ని ప్రాంతాల మనుషుల్ని తినేవాళ్లు కూడా ఉన్నారు. వాళ్ల సంగతలా ఉంచితే – తమ అలవాట్లకు భిన్నంగా ఉన్నవారిని మాటలతో హింసించాలనుకునేవాళ్లు కూడా ఉన్నారు" అన్నాను.

మ్యుల్లర్ నవ్వి, "రావ్! నన్ను అపార్థం చేసుకోకు. నేను నీ మిత్రుణ్ణి. ఇక్కడ నీకే సహాయం కావాల్సినా నిస్సంకోచంగా నన్నడుగు" అన్నాడు.

"మనం చిన్నపిల్లలం కాదు. అపార్థాలు పరిణతి చెందని మెదడుకి సంబంధించినవి" అన్నాను.

ఆతర్వాత మ్యుల్లర్ నాకు దగ్గర స్నేహితుల్లో ఒకడయ్యాడు. క్రీడారంగం పట్ల ఉన్న అభిరుచి అతనికీ నాకూ సానిహిత్యాన్ని పెంచింది.

"క్రీడారంగంలో మీ దేశం బాగా వెనుకబడింది" అన్నాడు మ్యుల్లర్ ఒకసారి.

"నిజమే. అభాగ్యులతో నిండిన దేశం మాది. ముందు పొరులందరికీ తిండి కావాలి. ఆ తర్వాతే క్రీడలపై ఆసక్తి" అన్నాను.

"మీ దేశానికి ఇంత పేదరికం ఎలా వచ్చింది? " అడిగేడతను.

ఠక్కున చెప్పాను, "పాశ్చాత్య దేశాల దోపిడి"

అతని మొహం అదోలా ఐపోయింది, "పాశ్చాత్యదేశాలకి మీ దేశాన్ని దోచే శక్తి ఎలా వచ్చింది?" అన్నాడు తమాయించుకుని.

"దొంగలెప్పుడూ సామాన్యులకంటే తెలివిగా ఉంటారు" అన్నాను.

ఏమనుకున్నాడో మ్యుల్లర్ వెంటనే, "నువ్వు కమ్యూనిస్టువా?" అన్నాడు.

"కమ్యూనిజం అంటే నాకు తెలియదు. నేను సర్వమానవ సమానత్వాన్ని కోరతాను. దాంతోపాటే వ్యక్తి స్వాతంత్ర్యాన్నీ, వాక్ స్వాతంత్ర్యాన్నీ కూడా కోరుకుంటాను. ఇప్పుడు కమ్యూనిస్టు దేశాలుగా చెలామణీ అవుతున్న దేశాల్లో ఆ స్వాతంత్ర్యాలున్నాయనుకోను" అన్నాను.

మ్యుల్లర్ కళ్లు మెరిసాయి, "ఆ విధంగా చూస్తే మా దేశం ఆదర్శప్రాయం కదూ!" అన్నాడు.

"అలాగనుకుందుకు లేదు. మీ దేశంలో పేదరికం లేకపోవచ్చు. కానీ సర్వమానవ సమానత్వాన్ని మీరు ఆమోదించారనుకోను. మీ దేశపు ప్రగతికి కారణం మీలో కులమతభేదాలు లేకపోవడమనిపిస్తుంది. ఆ భేదాలు మమ్మల్ని పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఐతే కొంచెం లోతుగా ఆలోచిస్తే అందుకు మీరూ అతీతులు కారనిపిస్తుంది. మీలో మేము జర్మన్సుమన్న అహముంది. మీరంతా జర్మనీ ప్రగతికోసమే పాటు పడుతున్నారు. మీ ప్రగతి అందరికీ తెలియాలి. మీ భాష ప్రపంచంలో పేరెన్నిక గన్న భాష కావాలి. భారతదేశంలో ఒక కులం మరో కులాన్ని మించాలనీ, ఒక భాష మరో భాషని మింగాలనీ ప్రయత్నించడంవల్ల మొత్తం దేశం ఇబ్బంది పడుతోంది. మీరు దేశమంతా ఒకే కులంగా ఉన్నారు. అందువల్ల మీ దేశం ఆర్థికంగా ప్రపంచంలో అత్యున్నత స్థాయికి చేరుకుంది. కానీ అంతటితో మీ బాధ్యత ఐపోయింది. మిగతా ప్రపంచం ఏమైపోయినా మీకు బాధలేదు. ఈ భూప్రపంచమంతా ఒక్క దేశమైతే, మానవులంతా ఒక్కటే జాతి ఐతే– మీది జర్మన్ కులం. మీ కులం ప్రగతికి మీరు పాటు పడుతున్నారు. ఇందులో సర్వమానవ సమానత్వం ప్రసక్తి లేదు. ఐతే మీ సామర్థ్యం మాత్రం అభినందనీయం, ఆదర్శప్రాయం"

"నీతో వాదించడం కష్టం. నువ్వు చాలా తెలివైనవాడివి" అన్నాడు మ్యుల్లర్.

చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టడంలో అదో మంచి పద్ధతి.

ఇండియాపై జర్మన్ పౌరుల దురభిప్రాయానికి ముఖ్యకారణం – ఒక్కటే. అది రాజకీయం.

ఇండియా రష్యావైపు మొగ్గుతోంది. రష్యా కమ్యూనిస్టు దేశం. ఈ కారణంగా జర్మనీలోని ప్రచార సంస్థలన్నీ కూడా ఇండియాని తమ కోణంలో ప్రదర్శించి – పౌరుల్లో దురభిప్రాయాన్ని పెంచుతున్నారు. వాటిల్లో ముఖ్యమైనది టెలివిజన్.

ఒకసారి టెలివిజన్లో ఇండియా గురించి ఓ కార్యక్రమం వచ్చింది.

ఆరంభంలో పెద్ద ప్రేలుడు. అది అత్యంత ఆధునిక వైజ్ఞానిక ప్రగతికి సూచికగా అణు విస్ఫోటం. అందుకు తగిన పరిశోధనలు జరిగే బాబా అటామిక్ రీసెర్చి సెంటర్ భవంతుల్ని తర్వాత చూపించారు. ఆ తర్వాత టివి తెరపై 'ఆ భవంతులకు కొన్ని కిలోమీటర్ల దూరంలో....' అని ఒక వాక్యం.

బొంబాయి మురికివాడలు. వారి నికృష్ట జీవనం....

జర్మన్ పౌరుల ఊహకందని నికృష్టజీవనమది.

ఆ తర్వాత ఇండియాలో అన్నింటా బొంబాయికి దీటు వచ్చే మరో మహానగరం కలకత్తాని చూపించారు. మొక్కుబడికి కొన్ని కట్టడాల్ని చూపించేక – నగరం నడిబొడ్డులో పేవ్‌మెంట్లమీద పేడ వేస్తూ యథేచ్ఛగా సంచరిస్తున్న గోమాతలు....

మొత్తం కార్యక్రమం ఈ తీరులో రూపొందించబడింది.

ఇక నా మిత్రులు ఊరుకుంటారా?

మర్నాడు ఆఫీసులో లంచ్ టైంలో ఆ టివి కార్యక్రమం చర్చకు వచ్చింది.

"రావ్, నిన్న రాత్రి టీవీలో మీ ఇండియాని చూశాం" అన్నాడు అహమ్మద్. అతడి పక్కనే నిలబడి మ్యుల్లర్, డెకర్ట్ నవ్వుతున్నారు.

అహమ్మద్ మాట్లాడిన విధానం, ఆ ఇద్దరి నవ్వులు – దేనికి నాంది కాగలవో ఊహకందింది.

నేను కూడా నవ్వి, "ఏం చూశారు?" అన్నాను.

డెకర్ట్ వెంటనే అందుకుని, "మహానగరం మధ్యలో గోసంచారమా? ఇది నిజమా?" అన్నాడు.

అతడి మాటలో ఎగతాళి కంటే ఆశ్చర్యమే ఎక్కువుంది. అది నేనర్థం చేసుకోగలను. మరి జర్మనీలో ల్యూనబర్గువంటి చిన్న ఊళ్లో కూడా నేనెక్కడా రోడ్లమీద పశువుల్ని చూడలేదు.

"నిజమే!" అన్నాను కాస్త బాధగానే.

"నగరం నడిబొడ్డులో పశువులు. పక్కకెడితే మురికివాడల్లో పశువులకంటే హీనంగా జీవిస్తూ మనుషులు. ఇదంతా సాటిపౌరులు ఎలా సహించగల్గుతున్నారు?" అన్నాడు డెకర్ట్.

ఆ ప్రశ్నలో న్యాయముంది. ఒక దేశపు పరువు ప్రతిష్ఠలు – అక్కడి వైజ్ఞానిక ప్రగతిమీద కాదు. ఆ దేశపు సగటు పౌరుని జీవనప్రమాణంపై ఆధారపడి ఉంటాయి. ఈ విషయాన్ని భారతదేశంలోని రాజకీయవాదులు, స్వచ్ఛంద సేవాసంస్థలు గుర్తించేదెప్పుడు?

నాడు కూలీల కడుపు మాడ్చి తాజమహల్ కట్టించాడు షాజహాన్.

నేడు కోట్లాది ప్రజలు కడుపు కాలి ఏడుస్తుంటే – అణ్వస్త్ర ప్రయోగాలు చేస్తోంది ప్రజాస్వామ్య ప్రభుత్వం.

లక్షల వ్యయంతో వివేకానందుడికి స్మారకచిహ్నం కడితే – లక్షలాది దీనుల గోడుకి చలించిపోయిన ఆ మహనీయుడి ఆత్మకు శాంతి కలుగుతుందా?

అర్థం లేని ప్రతిష్ఠకోసం, ప్రయోజనం లేని స్మారక చిహ్నాలకోసం తాపత్రయం మాని – సగటు పౌరుడి గురించి తీవ్రంగా, సిన్సియర్‌గా ఆలోచించే రోజు మన దేశంలో రాదా?

"రావ్ మాట్లాడ్డం లేదు" అన్నాడు మ్యుల్లర్.

"మాట్లాడ్డానికేముంది? నిన్న టెలివిజన్లో చూసేవరకూ మీకు ఇండియా గురించి తెలియదా?" కాస్త కటువుగానే అడిగాను.

"తెలియదు" అన్నాడు మ్యుల్లర్.

"ఆర్థికంగా వెనుకబడినా మీకంటే మా పరిజ్ఞానమే మెరుగు" అన్నాను. ఒకోసారి ఆత్మరక్షణకు ఎదురుదాడికి మించిన ఉపాయం ఉండదు. "టీవీలు లేకపోయినా, మాకు ప్రపంచంలోని చాలా దేశాల గురించి చాలా విషయాలు తెలుసు"

డెకర్ట్ వెంటనే, "ఈ విషయంలో మ్యుల్లర్ని జర్మన్ల పరిజ్ఞానానికి ప్రతినిధిని చెయ్యకు. చాలా ప్రపంచ దేశాల గురించి చాలా విషయాలు నాకు తెలుసు" అన్నాడు.

"అలాంటప్పుడు నిన్నటి అణువిస్ఫోటానికి మీరంతా ఎందుకంత ఆశ్చర్యపడ్డారు? మా దేశం ఒకప్పుడు జ్ఞాన విజ్ఞానాలకు కేంద్రంగా, భోగభాగ్యాలకు నిలయంగా ఉండేది.

శతాబ్దాలుగా ఎన్నో విదేశీ దండయాత్రలు మా దేశాన్ని పీల్చి పిప్పి చేశాయి. ఆ సందర్భంలో కొన్ని జాతులు, కొన్ని కులాలు వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని బాగుపడి, మిగతావారిని బాగా అణగద్రొక్కేశాయి. శతాబ్దాలుగా అణగద్రొక్క బడ్డ కోట్లాది జనం – చెట్టుమీంచి కిందకు రావడానికి తాము కూర్చున్న కొమ్మనే నరుక్కునేంతటి అమాయకత్వం, అజ్ఞానంలో పడిపోయారు. వారిని ఉన్నపళాన మాటలతో బాగు చెయ్యడం సాధ్యం కాదు. మానసిక పరిణతి కలిగితే తప్ప వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడదు. వారితోనే కలిసి నడవాలంటే దేశ ప్రగతికి శతాబ్దాలు పట్టినా ఆశ్చర్యం లేదు. ఇది మీకు అర్థంకాని పరిస్థితి" అన్నాను.

"ఐతే ఏమంటావ్?" అన్నాడు డెకర్ట్ కుతూహలంగా.

"దానికే వస్తున్నాను. మా దేశపు దౌర్భాగ్యస్థితి గురించి ఎప్పటికప్పుడు మీడియా మీకు చెబుతూనే ఉంది. మీకు తెలియనిదల్లా, మా దేశం పేదలకోసం కృషి చేస్తూనే, ఇతర రంగాల్లో వెనుకబడిపోకుండా ఉండడానికి చేస్తున్న కృషి గురించి. మురికివాడల్ని చూస్తూ అదే ఇండియా అని భ్రమిస్తున్న పాశ్చాత్యదేశ పౌరులకు ఇటీవల మా దేశంలోని పరిశోధనాత్మక అణువిస్ఫోటం దిగ్భ్రాంతి కలిగించింది. దానికి తట్టుకోలేని మీడియా – అభినందించడానికి బదులు – నిన్న మీరు చూసినలాంటి దృశ్య కార్యక్రమాలతో విషయాన్ని పక్క దారి పట్టిస్తోంది" అన్నాను.

లంచ్ టైమయింది. ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. ఆ తర్వాత దాన్ని పునరుద్ధరించే ప్రయత్నం వాళ్లనుంచి జరుగలేదు.

నాకది సంతోషమే. ఎందుకంటే....

ఏదో అనాలి కాబట్టి అనేశాను కానీ, ఇండియా ప్రగతిని మానసికంగా నేనూ సమర్థించలేకపోతున్నాను. మన రాజకీయవాదుల స్వార్థ సంకుచిత మానసం నాకు తెలియదా?

జర్మనీ వచ్చినప్పట్నించీ నేనక్కడి ప్రతి విశేషాన్నీ తరచి తరచి పరిశీలిస్తున్నాను. మన వ్యవస్థతో పోల్చుకుంటున్నాను. మన దేశపు అధోగతికి కారణాలు అన్వేషిస్తున్నాను.

ఏదో చెయ్యాలని కాదు. ముందు మనమేమిటీ, ఏంకాదూ అన్న స్పృహ ఉండాలి కదా!

నిత్యజీవితంలో సంప్రదాయపరంగా అక్కడి విభిన్నత నాకు చాలా ఆశ్చర్యంగా ఉండేది.

ఒకరోజున మ్యుల్లర్ కుర్చీలో కూర్చుని కాళ్లు బారచాపి ఎదుటి టేబుల్ మీద ఆనించి కూర్చున్నాడు. ఆ సమయంలో డాక్టర్ రాలెక్ వచ్చి, "అహమ్మద్ ఉన్నాడా?" అనడిగాడు.

మ్యుల్లర్ కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఉన్నాడు. కాళ్లలోనూ కదలిక లేదు. "లేదు" అన్నాడు.

నేనక్కడ నిలబడే ఉన్నాను. ఐనా రాలెక్ రాకతో నాలో వినయ గౌరవాలతో కూడిన ఓ కదలిక.

వచ్చినవాడు గురువన్న భావన మ్యుల్లర్‌కి స్ఫురించినట్లే లేదు. రాలెక్‌కి కూడా అక్కడ జరుగకూడనిదేదో జరిగిన భావన మనసులోకి వచ్చినట్లు లేదు. మామూలుగా వెళ్లిపోయాడు.

ఒకసారి అహమ్మద్‌కి సిగరెట్ కావాల్సొచ్చింది. వాళ్లనీ వీళ్లనీ అడిగి లేదనిపించుకున్నాక సరాసరి రాలెక్ వద్దకి వెళ్లి అడిగాడు. అప్పుడాయనవద్ద కూడా సిగరెట్ లేదు. "నీ దగ్గర పైపుంటే పుగాకు పొడెం ఇస్తాను. ప్రస్తుతానికి అదే ఉంది నాదగ్గర" అన్నాడు నొచ్చుకుని.

ఇలాంటి సంఘటనలు నాకు కొత్తగా, వింతగా, ఆశ్చర్యంగా ఉండేవి.

మ్యుల్లర్, డెకర్ట్, ఆహమ్మద్‌లకి రాలెక్ అంటే ఏమాత్రం తూష్ణీభావం లేదు. వాళ్లకి ఆయనంటే చాలా గౌరవమని వాళ్ల మాటల్ని బట్టి తెలిసేది. ఎటొచ్చీ ఆ గౌరవంతో వాళ్లాయన్ని దేవుడిగా భావించడం లేదు. తమకంటే ఎక్కువ జ్ఞానమున్న సాటిమనిషిగా అనుకుంటున్నారు. ఆయన్ని వాళ్లు సర్ అనరు. సాధారణంగా రాలెక్ అనీ, అప్పుడప్పుడు డాక్టర్ రాలెక్ అనీ పిలుస్తారు. ఆయన చెప్పిందాంట్లో తప్పుందనిపిస్తే, "డాక్టర్, రాలెక్! యూ ఆర్ రాంగ్" అనడానికి సంకోచించరు.

ఇండియాలో ప్రొఫెసర్లని సర్ ఆని తీరాలి. వాళ్లేం చెప్పినా వెర్రినవ్వు నవ్వుతూ తలూపాలి. ప్రొఫెసర్ల మాటలో తప్పులుంటే ఎంచకూడదు. గురువు తప్పు చెప్పడని నమ్మాలి.

వర్తమాన కాలానికి ఈ సంప్రదాయం సరిపడక, మనని ముందుకెళ్లకుండా ఆపుతోందని నాకనిపించింది.

ఒకప్పుడు బ్రాహ్మణుల్ని గౌరవించడం సంప్రదాయం. బ్రాహ్మణుడంటే బ్రహ్మవిద్యని పొందినవాడు. క్రమంగా ఆ గౌరవం విద్యనుంచి వ్యక్తికి మారింది. పొట్టకోసినా అక్షరంముక్క లేనివాడు, సకల దుర్వ్యసనాలకూ బానిసైన వాడు – బ్రాహ్మణ కులంలో పుట్టిన కారణంగా గౌరవానికి అర్హుడయ్యే దురాచారం మొదలైంది. అనర్హుడికి గౌరవమిస్తే అహంకారి ఔతాడు. అనర్హుల సంఖ్య పెరిగినకొద్దీ అహంకారుల సంఖ్య పెరుగుతుంది. వారు సమాజాన్ని శాసిస్తూ అర్హుల్ని మూలకి నెట్టేస్తారు. అర్హులకి అహంకారముండదు కాబట్టి, వారు మూలలో ఉండిపోవడానికి కించపడరు. కానీ సమాజం మూలబడిపోతుంది.

రాలెక్ ఎప్పుడైనా పొరపాటు పడితే, దాన్ని సవరించడంవల్ల సైన్సుకి న్యాయం జరుగుతుంది తప్పితే, రాలెక్‌కి అన్యాయం జరగడం లేదు. మన విశ్వవిద్యాలయాల్లో, రీసెర్చి సంస్థల్లో గురువులు, అధినేతలు అలా అనుకోరు. తమకంటే తెలివైన శిష్యుణ్ణి మన గురువులు సహించలేరు. అందువల్ల అటు విద్యకూ, ఇటు వ్యక్తిత్వాలకూ

న్యాయం జరగడం లేదు. మన సైంటిస్టులు ఎంత ప్రతిభావంతులైనా, దేశంలో ఉండి రాణించలేక పోవడానికి కారణం – గురువుల్ని దైవంగా చూడ్డమేనని నాకు అనిపించింది.

అంతమాత్రాన మన సంప్రదాయం జర్మన్లకు నచ్చదనుకుందుకు లేదు. ల్యూనబర్గులో గ్యోతే ఇన్స్‌టిట్యూట్‌లో మొదటి రెండు నెలల కోర్సుకీ ఫ్రౌ ష్వయరింగ్ మా టీచరు.

తర్వాతి కోర్సుకి మారేటప్పుడు ఆమెకి వీడ్కోలు చెప్పాం. అప్పుడు పంజాబీ శర్మ చటుక్కున వంగి ఆమెకి పాదాభివందనం చేశాడు. అదేమిటని తడబడిందామె.

"గురువు పాదాలకి నమస్కరించడం మా సంప్రదాయం" అన్నాడు శర్మ.

అప్పుడు నేను మా టీచరు కళ్లలో కొత్త వెలుగు చూశాను. గురువులనిలా గౌరవించేచోట తాత్కాలింకానైనా కొన్నాళ్లు పాఠం చెప్పాలన్న అభిలాష క్షణంపాటు ఆమె కళ్లలో మెరిసింది.

వ్యక్తిపూజ ఎవరికైనా ఆనందాన్ని కలిగిస్తుంది. అది వ్యక్తి పతనానికి దారి తియ్యడమూ అంత సహజమే ననడానికి మన దేశంలో విద్యావ్యవస్థలోనే కాదు, అన్ని వ్యవస్థల్లోనూ ఎన్నో ఉదాహరణలున్నాయి. చివరికి క్రీడారంగం కూడా అందుకు మినహాయింపు కాదు.

ఒకసారి నేను డెకర్ట్‌తో మాట్లాడుతూ – పద్ధతి ప్రకారం అన్నీ సక్రమంగా జరిపోయే వ్యవస్థని రూపొందించిన జర్మనీ పాలనా దక్షతని మెచ్చుకున్నాను. రైళ్ల రాకపోకల్ని ప్రత్యేకంగా మెచ్చుకున్నాను. ఎక్కిన ప్రతివారికీ సీట్లు దొరకడం, అన్న టైముకి ఒక్క క్షణం కూడా అటూ ఇటూ కాకుండా రాకపోకలు జరగడం అసామాన్యమని నాకు నిజంగానే అనిపించింది.

డెకర్ట్ నా పొగడ్తకు సంబరపడి, "అదో పెద్ద విశేషమా? మీ దేశంలో రైళ్లు మాత్రం సకాలంలో నడవ్వా?" అన్నాడు మొహమాటానికి.

నిజం చెప్పకుండా ఉండలేకపోయాను. రిజర్వేషన్‌తో మొదలై, మన దేశంలో రైలు ప్రయాణంలో ఉండే ఇబ్బందులన్నీ అతడికి ఏకారువు పెట్టాను. రిజర్వేషన్ దొరకడం ఎంత కష్టమో, రిజర్వేషన్ లేకుండా రైలు ప్రయాణమెలా ఉంటుందో, కదుల్తున్న రైల్లోంచి జనం ఎలా వ్రేలాడుతుంటారో, రాకపోకల్లో గంటల తరబడి ఆలస్యమెలా గౌతుందో – అన్నీ కళ్లకి కట్టించాను.

నావి ముఖప్రీతి మాటలు కావనీ, నేను జర్మనీని పొగడ్డానికి కారణముందనీ అతను గ్రహించాలని నా తాపత్రయం. ఆతను నా మాటలు శ్రద్ధగా విని, "రైల్వే జర్నీకి మీ దేశంలో చాలా డిమాండ్ ఉన్నట్లుంది. మరి రైళ్ల సంఖ్య పెంచొచ్చుగా" అన్నాడు.

"పెంచొచ్చు. కానీ డబ్బుండాలిగా" అన్నాను.

"రైళ్లు పెంచడానికి డబ్బు లేదంటావ్. మరి బాంబు తయారు చెయ్యడానికి డబ్బు బాగానే ఉన్నట్లుందే" అన్నాడు డెకర్ట్.

ఊహించని ఈ ఎదురుదెబ్బకి మ్రాన్పడిపోయాను. తమాయించుకుందుకు కొన్ని క్షణాలు పట్టింది.

"పదిమందున్న ఇంట్లో ఓ జబ్బు మనిషి ఉన్నాడనుకో. అంతా అన్ని పనులూ మానుకుని దిగాలు పడి కూర్చోరు కదా! రోగికి చెయ్యాల్సిన ఏర్పాట్లు చేసి ఎవరి పనుల్లో వారుంటారు. మిగతా ప్రపంచంతో కలిసి ముందడుగు వెయ్యడం కోసం, మేము అన్ని రంగాలమీదా దృష్టి పెట్టాల్సి ఉందని ఇదివరకే నీకు చెప్పాను. అన్నార్తులున్న దేశంలో అణువిజ్ఞాన పరిశోధనలెందుకో ముందు కాలమే సమాధానం చెబుతుంది. ఇప్పటికే మా దేశంలో అణువిద్యుత్ లభిస్తున్న విషయం నీకు తెలిసే ఉండాలి" అన్నాను కాసేపాగి.

నేను ఇండియన్‌ని కాబట్టి అతని మాటలు నా అభిమానాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. కానీ డెకర్ట్ మాటలు ఆలోచించ తగ్గవి.

ఇండియా సంపన్న దేశాలనుంచి ఋణాలు తీసుకుంటోంది. ఆ డబ్బు దుర్వినియోగం కాకూడదని డెకర్ట్ అనుకుంటాడు. ఆ ఏడు ఇండియా పరీక్ష పేరిట చేసిన న్యూక్లియర్ ఎక్స్‌ప్లోజన్ పాశ్చాత్య దేశాల్ని కలవరపర్చింది.

వివిధ దేశాల స్పందనలు – ఆయా దేశాల మధ్యనున్న సంబంధబాంధవ్యాల్నిబట్టి ఉంటాయి. అక్కడ వాస్తవం, తర్కాలకంటే రాజకీయాలదే ప్రాధాన్యం. నేను జర్మనీకి రావడం ద్వారా – ఆ విస్ఫోటం విషయమై అక్కడి సామాన్య పౌరుల మనోభావాలు ఎలా ఉన్నదీ ప్రత్యక్షంగా తెలుస్తోంది. అది నా అదృష్టం.

హైనర్ డెకర్ట్, మ్యుల్లర్ స్నేహపాత్రులు. నాకు మంచి మిత్రులు. తమ అభిప్రాయాల్ని నిస్సంకోచంగా చెప్పేవారు. ఒకళ్లను కించపర్చాలన్న దురుద్దేశ్యం వారిలో గోచరించేది కాదు. అందుకే నేను వారికి ఇండియా గురించి భేషజాలకు పోకుండా నిజాలే చెప్పాలని తపించేవాణ్ణి. వారు నానుంచి ఎన్నో విశేషాలడిగి తెలుసుకునేవారు.

ఇండియాలో మధ్యతరగతి కుటుంబీకులు ఎదుర్కొనే వివిధ సమస్యల్ని విన్నప్పుడు – వాళ్ల కళ్లలో భయాన్ని చూశాను. ఇండియన్సు నమ్మే మరుజన్మ నిజంగా ఉండి, తాము ఇండియాలో మధ్యతరగతి కుటుంబంలో పుడతామేమోనన్న భయమేమో అది!

ఒకసారి డెకర్ట్ ఏదో సందర్భంలో, "అన్నట్లు – ఇండియాలో చాలా ఇళ్లలో దొడ్లలో పాములు తిరుగుతాయిట కదా'' అనడిగాడు కుతూహలంగా.

"అన్ని చోట్లా కాదు. ఒకప్పుడు అడవిగా ఉండేదాన్ని జనవాసంగా మార్చినప్పుడు అలా జరుగుతుంది. ఇంటి పెరట్లో తిరగడమే కాదు, ఒకోసారి ఇళ్లలోకి కూడా వస్తుంటాయి'' అన్నాను.

ధవళేశ్వరంలో కొండమీద జనార్దనస్వామి గుడిమెట్ల పక్కన ఉండేది మా ఇల్లు. రోజూ ఎవరింట్లోకో పాము దూరడం తెలుసు. నేను మా పెరట్లో ఐదారుసార్లు పాముని చూశాను. ఇంట్లోకి రెండుసార్లు వచ్చింది. గోదావరికి వరదలొచ్చినప్పుడు పాములు మరింత తరచుగా కనబడుతుంటాయి.

ఇంకా చెప్పేవాణ్ణే – నా మాటలు వింటూ డెకర్ట్ మధ్యలో భయంతో కెవ్వుమనకపోతే!

నేను చెప్పేది అతడికి పాములతో సహజీవనంలా అనిపించిందిట.

నేను గమనించిందేమిటంటే – జర్మనీలో ఇళ్లలో దోమ, ఈగ, బల్లి లాంటివి మచ్చుకైనా కానరావు. చాలా ఊళ్లకి చివర్లో చెట్లతో నిండిన అడవులుంటాయి. అక్కడ పాములే కాదు, ఏ పురుగూ, పుట్రా ఉండవు.

మరి నేను చెప్పింది వింటే డెకర్ట్ భయంతో వణికిపోడూ!

మన దేశం కూడా పరిసరాల విషయంలో జర్మనీకి సాటి రావాలంటే అసాధ్యమేం కాదు. కానీ అందుకు పౌరులు బాధ్యత వహించాలి.

ఇక్కడి పౌరులు ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వెయ్యరు. తుక్కు పారేయరు. అన్నింటికీ నిర్ణీత ప్రదేశాలున్నాయి. ఆరుకోట్ల పశ్చిమజర్మనీ పౌరుల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ నియమాల్ని అలక్ష్యం చెయ్యకపోవడంవల్లనే – యావద్దేశం పరిశుభ్రతకు మారుపేరుగా ఉంది.

ఎన్నో పార్టీలకు వెళ్లాను. అక్కడ ఆల్కహాల్ ఏరులై ప్రవహించేది. నేను మాత్రం ఫలరసాలు, శీతల పానీయాలు తీసుకునేవాణ్ణి. ఆ విషయంలో కొందరు ఆడవాళ్లు నాకు కంపెనీగా ఉండేవారు. మగవాళ్లెవరూ వాటివైపు చూడనైనా చూసేవారు కాదు. పార్టీలు తరచుగా జరగడంవల్ల నా ఈ అలవాటుకి ఎంత ప్రచారం కలిగిందంటే, ఆల్కహాలు లేని ఇతర పానీయాల్ని 'రావూస్ డ్రింక్స్' అనడం రివాజయింది.

ఇక్కడివాళ్ల విషయం కాసేపు పక్కన పెట్టి – ఇక్కడ పరిచయమైన మనవాళ్ల విషయానికి వస్తే –

మనవాళ్లు

ప్రతి రోజూ ఓ కొత్త పరిచయం. కొత్త అనుభవం. కానీ నాలో ఏదో అసంతృప్తి. ఈ వింతలు, అనుభవాలు, అనుభూతులు – ఇవన్నీ నా ఒక్కడికేనా?

ధర్మార్థకామమోక్షాల్లో ఎన్నడూ విడిచి ఉండనని నేను చేసిన పెళ్లినాటి ప్రమాణాలు శుష్కమేనా?

ఈ కొత్త లోకంలో నా పక్కన భార్యాబిడ్డలు కూడా ఉంటే, ఇదే అనుభూతులకు నా స్పందన మరోలా ఉంటుందా?

బెర్లిన్లో అడుగుపెట్టేక ఓ వారం ఎలా గడచిపోయిందో గడిచిపోయింది. తర్వాతనుంచి నా మనసు నా భార్యాబిడ్డల చుట్టూ పరిభ్రమిస్తూ, మనసుకి స్థిమితం లేకుండా చెయ్యసాగింది.

వాళ్లిక్కడికి వస్తారంటే, అది వేరు. కానీ ఈ అనుభూతులు నా నోటితో వినడమే తప్ప తమ కళ్లతో చూడలేరన్న అసంతృప్తి నన్ను వెంటాడుతోంది.

నేను ఆశావాదిని. నా పరిస్థితిలో ఊహించని మలుపు వచ్చి, ఏదో అద్భుతం జరుగదా? నావాళ్లిక్కడికొచ్చి నాతో ఉండరా?

బెర్లిన్లో రెండంటే రెండు వారాలు గడిచాయేమో– సాయంత్రాలు నన్ను దిగులు ఆవహించేది.
ఆ దిగుల్లోంచే ఏదో మూల అనిపించేది – నేనూ, నావాళ్లూ ఆ నగరవీధుల్లో కలిసి తిరగబోతున్నామని.

ఏ ప్రదేశం గురించైనా, విషయం గురించైనా మంచిచెడ్డలు నిర్ణయించాలంటే – ఒకో మనిషి ఒకోలా చెబుతాడు. ఒకే మనిషి కూడా అన్నివేళలా ఒకేలా చెప్పడు.

అభిప్రాయాల్ని మనిషి మూడ్ కూడా ప్రభావితం చేస్తుంది. మనిషి మూడ్ మనఃస్థితిపై ఆధారపడి ఉంటుంది.

అసంతృప్తితో బాధపడే మనిషికి సంతోషం దొరక్క, నిత్య దుఃఖితుడౌతాడు. అతని అసంతృప్తికి కారణమేమిటో తెలుసుకుని దాన్ని చల్లార్చేవరకూ, ఇతరాలేమీ ఎంత గొప్పవైనా అతనికి తృప్తి కలిగించవు.

ఇంత దూరమొచ్చి, ఇన్ని విలాసాలు, వైభోగాలమధ్య మసలుతున్నా – మనసు నావాళ్లకోసం అల్లాడుతోంది. మనసు వారి సాహచర్యంకోసం తహతహ లాడుతోంది. అందుకే నా మనసునిండా అసంతృప్తి. అది తొలగేదాకా నేను సరైన మూడ్‌లోకి రాలేను. అప్పుడు నా మనఃస్థితి మారి – ఇక్కడి విశేషాలపై స్పందన మరోవిధంగా ఉంటుందా?

అది భారతీయుల ప్రత్యేకతో, నావాళ్ల ప్రత్యేకతో తెలియదు. కానీ అక్కడి నా పరిచితుల్లో భారతీయుల్ని కూడా ఈ విషయమై శ్రద్ధగా పరిశీలించాలనుకున్నాను.

నావాళ్లకి ఇక్కడికొచ్చే అవకాశం లేనప్పుడు – ఇక్కడున్న మనవాళ్లు మానసికంగా ఎంత ఆసరా కాగలరో తెలుసుకుందుకు నాకా ఆలోచన ఎంతగానీ సహకరించింది.

బెర్లిన్లో నాకు పరిచయమైన మొదటి భారతీయుడు గుప్తా. అతను కూడా ఇండియాలో మాతోపాటే బయల్దేరి మరెక్కడో లాంగ్వేజ్ కోర్సు ముగించుకుని ఇక్కడికొచ్చాడు. అతని ఆఫీసు కూడా నా ఆఫీసుండే ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్‌కి దగ్గర్లోనే ఉంది.

నాకతను మొదటిసారి మా ఆఫీసు ఎదుటి మయసభలో తగిలాడు.

ఇండియాలో ఉండగా కులాలు, భాషలు, యాసలు వగైరా ఎన్నో విభజనరేఖలుండొచ్చు కానీ, ఇక్కడ మాత్రం సాటి భారతీయుణ్ణి చూడగానే స్ఫురించేది మనవాడనే.

ఆపరిచితులైనా సరే అక్కడ భారతీయులు ఒకరికొకరు ఎదురుపడితే పలకరించి పరస్పరం పరిచయం చేసుకోవడం పరిపాటి.

మా పరిచయాలయ్యాక గుప్తా వెంటనే, "బెర్లిన్ చేరుకోగానే ముందు పోలీస్ స్టేషన్లో పేరు నమోదు చేయించుకున్నావా?" అనడిగాడు.

అప్పటికి నేను బెర్లిన్ వచ్చి అయిదారు రోజులయింది. ఏదో నేరం చేసినవాడిలా, పోలీసు స్టేషన్లో పేరు నమోదు చేయించుకోవడమేమిటో నాకు అర్థం కాలేదు.

ఈ గుప్తా లాంగ్వేజి కోర్సులో ఉండగానే ఏదో వెధవ పని చేసుంటాడు. అందుకని ఊరు మారగానే ముందు పోలీసు స్టేషనుకి వెళ్లమనుంటారు. మరి నేనేమో ల్యూనబర్గులో హొటల్ యజమాని ఫ్రౌ హెన్నీ బెక్కర్ చేత సన్మానం కూడా పొందిన ఘనుణ్ణి!

"పోలీస్ స్టేషన్‌తో మనకి పనేమిటి? ఆహ్వానంమీద వచ్చిన అతిథులం. బుద్ధిమంతులం" అన్నాను గొప్పగా, మనసులో మాత్రం అతనిపై జాలి పడుతూ.

"భలేవాడివేలే! ఇక్కడ అతిథులకో రూలూ, పౌరులకో రూలూ లేదు. ఎవరైనా సరే, ఊరు మారితే పోలీసు స్టేషన్లో పేరు నమోదు చేసుకోవాల్సిందే! అలా చేయించుకోకపోతే, అప్పుడు నిజంగా నేరస్థుడివౌతావు" అని అందుకు సంబంధించిన కొన్ని వివరాలు చెప్పాడు.

ఎవరైనా కొత్తగా ఒక ఊళ్లో ఉండడానికొచ్చినప్పుడు, అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్) ఫారం ఒకటి తీసుకుని నింపాలి. ఏ ఇంట్లో అద్దెకుంటే ఆ ఇంటి ఓనర్ చేత ఆ ఫారంలో సంతకం పెట్టించుకుని పోలీసు స్టేషనుకి వెళ్లాలి. గుర్తింపుకి కానూ విదేశీయులైతే పాస్‌పోర్ట్‌నీ, స్వదేశీయులైతే గుర్తింపుకార్డునీ చూపించాలి. అదయ్యేక అక్కడివాళ్లు – ఆ ఫారం తమకి అందినట్లు రసీదు ఇస్తారు. ఆ రసీ:ిదు దగ్గరుంటే, ఆ నగరంలో మన ఉనికి చట్టబద్ధం అన్నమాట! ఈ తతంగాన్ని అన్‌మెల్డుంగ్ (ఎన్‌రోల్‌మెంట్) అంటారు.

గుప్తా చెప్పాక నాకు గుర్తొచ్చింది.

ల్యూనబర్గు చేరినప్పుడు ఈ తతంగమంతా గ్యోతే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగింది. వాళ్లు చెప్పింది గుడ్డిగా చెయ్యడమే తప్ప అప్పట్లో అదేమిటో పట్టించుకోలేదు. అలాగే ఊరొదిలి వెళ్లేటప్పుడు అబ్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్ రద్దు) తతంగం కూడా ఉంటుంది. అది కూడా ల్యూనబర్గునుంచి బయల్దేరేముందు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు చేయించి రసీదిచ్చారు. రసీదు దగ్గరుంచుకున్నాను కానీ దాని ప్రయోజనం ఇదని అప్పుడు నాకు తెలియదు.

ఇప్పుడు నేనా అబ్‌మెల్డుంగ్ రసీదు చూపించి, బెర్లిన్లో అన్‌మెల్డుంగ్ రసీదు తెచ్చుకోవాలి. ఆ పని బెర్లిన్ చేరిన వారం లోపల చెయ్యాలి. చెయ్యకపోతే నేరం.

ఈ విషయం ఇంతవరకూ నాకెవ్వరూ సరిగ్గా చెప్పలేదు. చెప్పినా నేను సరిగ్గా వంటబట్టించుకోలేదు. ఇప్పుడైనా అనుకోకుండా పరిచయమైన ఈ గుప్తా ధర్మమా అని విషయం తెలిసింది.

గుప్తా నాకు అన్‌మెల్డింగ్ చేసుకోవాల్సిన ఆఫీసు చిరునామా ఇచ్చాడు. నా దగ్గరున్న సిటీ మ్యాప్ సాయంతో ఆ చిరునామా పట్టుకుని, వెంటనే ఆ తతంగం పూర్తి చేసుకోగలిగాను.

ఇక్కడ ఏ పనికీ ఆఫీసుల చుట్టూ పదేపదే తిరగనక్కర్లేదు. మనకి ఉపకారం చేస్తున్నామని కాక, తమ బాధ్యత నిర్వహిస్తున్నామని అనుకోవడం ఇక్కడి ఆఫీసుల్లో ఉద్యోగుల ప్రత్యేకత.

పని జరిగేక గుప్తాని కలుసుకుని ధన్యవాదాలు చెప్పి, "నువ్వు చెప్పకపోతే ఈ విషయం నాకు తెలిసేది కాదు. ఐనా తప్పు నాది. నీకు తెలిసిన విషయం నాకు తెలియలేదంటే, ఎక్కడో నావల్ల అలక్ష్యం జరిగుండాలి కదా!" అన్నాను.

గుప్తా నవ్వి, "అలా అనుకోకు. ఈ విషయం పక్కాగా నేను తెలుసుకోగలిగానంటే అందుకు కారణాలున్నాయి. రెండు మూడు నెలల్లో మా ఆవిడ, కొడుకు వస్తున్నారిక్కడికి" అన్నాడు.

ఆ మాటలు నా చెవులకి అమృతోపమానమయ్యాయి. అంటే – డాడ్ స్కాలర్సు కూడా భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకునే అవకాశమున్నదన్నమాట!

నాలో కుతూహలం రేగింది. వాళ్లని తీసుకురావడానికి తనేం చేస్తున్నాడో వివరాలడిగాను.

అడిగినప్పుడు ఎంత ఉత్సాహంగా అడిగానో, అతను చెప్పింది విన్నప్పుడు అంతగానూ హతాశుడినయ్యాను.

ఇండియానుంచి జర్మనీ రావడానికి టికెట్టు మనిషికి ఐదువేల రూపాయలుట. అదీ అట్నించి ఇటు రావడానికి. తిరుగు ప్రయాణం ఖర్చు వేరే.

గుప్తా భార్యకి టికెట్ – గుప్తా తండ్రి కొంటున్నాట్ట. అలా టికెట్ కొని శ్రీమతిని పంపగల ఆర్థిక స్తోమతు మా ఇంట్లో అటూ ఇటూ ఎవరికీ లేదు.

అదలా ఉంచితే గుప్తాకి హాస్టల్లో వన్ బెడ్రూం ఎకామడేషన్ దొరికింది. అద్దె నెలకి మూడొందల మార్కులు. గుప్తాకి ఒక్కడే కొడుకు. వయసు ఏడాది లోపు. ఇక్కడి రివాజు ప్రకారం దంపతులొక గదిలోనూ, పిల్లలు ఒకొక్కరు ఒకో గదిలోనూ పడుకోవాలి. గుప్తా కొడుకు చంటిపిల్లాడని సింగిల్ బెడ్రూం అపార్టుమెంట్లో ఉండడానికి హాస్టలువాళ్లు ఒప్పుకున్నారుట. అది అతని అదృష్టం.

ఇద్దరు పిల్లలుంటే సాధారణంగా త్రీ బెడ్రూం హౌస్ తీసుకోవాలి. కొంచెం కన్సెషనిచ్చినా, ఎట్టి పరిస్థితుల్లోనూ బెడ్రూమ్స్ రెండుకి తగ్గకూడదు. ఇక్కడ అలాంటి ఇంటికి అద్దె ఐదారొందల మార్కులుంటుంది. అప్పుడు నాకొచ్చే ఆదాయానికీ, అప్పటి నా బాధ్యతలకీ అది చాలా ఎక్కువ.

"నావాళ్లని ఇక్కడికి రప్పించడం నా శక్తికి మించిన పని" అనుకున్నాను.

అలాగని దిగాలు పడిపోలేదు. మొదట్నించీ నాది ఉన్నంతలో సద్దుకుపోయి సంతోషాన్ని వెదుక్కునే మనస్తత్వం. ఆ దృక్పథంలో చూస్తే –

జర్మనీలో స్టయిపెండ్ బట్వాడా – కొంత చిత్రంగానూ, కొంత సంతోషంగానూ అనిపించింది నాకు.

ఇండియాలో నాకు స్టయిపెండయినా, జీతమైనా ఆ పైనెలలో మొదటిరోజున ఇచ్చేవారు. ఆ రోజు సెలవైతే ఆ మరుచటి రోజు ఇచ్చేవారు. కానీ ఇక్కడ ఏ నెల స్టయిపెండ్ ఆ నెల మొదటి రోజునే ఇస్తున్నారు. అంటే ముందు డబ్బిచ్చి తర్వాత పని చేయించుకోవడం అన్నమాట! ఆ రోజు సెలవైతే, అందుకు ముందురోజు ఇస్తున్నారు.

ల్యూనబర్గులోనూ అలాగే జరిగింది. బెర్లిన్లోనూ అంతే!

అక్టోబర్ ఒకటిన మయసభకి వెళ్లి మొదటిసారి స్టయిపెండ్ తీసుకుంటున్నప్పుడు, స్కాలర్‌షిప్పుకి గానూ తొమ్మిదొందల మార్కులూ, చలికి దుస్తులు కొనుక్కుందుకు మరో మూడొందల మార్కులూ – వెరసి పన్నెండొందల మార్కులు వచ్చాయి.

ఇండియాలో రూపాయల్లోనే అప్పటికి నాకంత జీతం లేదు. చాలా సంతోషంగా అనిపించింది.

ఆ సంతోష సమయంలో పరిచయమయ్యాడు గోపాలకృష్ణన్.

అతను అలెగ్జాండర్ వాన్‌హుంబోల్డ్ట్ ఫెలోషిప్‌మీద వచ్చాడు. అది చాలా ప్రతిష్ఠాత్మకమైన ఫెలోషిప్. నాకొచ్చేదానికి రెట్టింపు స్టయిపెండ్ వస్తుందతనికి. అతను తమిళుడే కానీ తెలుగు కూడా వచ్చు. తన పూర్వీకులు తెలుగువారేనని చెప్పాడు.

అతని ద్వారానే నాకు ఓంప్రకాష్ మహాపాత్రా పరిచయమౌతాడనీ, ఆ పరిచయం నా బెర్లిన్ జీవితానికి ఊహించని మలుపు తెచ్చిపెడుతుందనీ అప్పుడు నాకు తెలియదు.

గోపాలకృష్ణన్‌కి మయసభ అంటే భయమట. అందులోకి వెడితే తప్పిపోతానని బెంగట.

"ప్రతినెలా స్టయిపెండ్ తీసుకుందుకు మనమిద్దరం కలిసి వెడదాం. ఒకరికొకరు తోడుంటే ధైర్యంగా ఉంటుంది" అన్నాడతను. సరేనన్నాను.

గోపాలకృష్ణన్ వయసులో నాకంటే పెద్ద. కానీ పెళ్లి ఈ మధ్యనే అయింది. ఇంకా పిల్లలు లేరు. మనిషి సరదాగా ఉంటాడు కానీ బాగా బిడియస్థుడు. ఎంత బిడియమంటే భార్యను ఈ దేశం తీసుకురావడానికి మొహమాట పడుతున్నాడు.

అతని సమస్యేమిటో నాకు సరిగ్గా అర్థం కాలేదు, "ఇంకా పిల్లలు లేరు కదా, మీ ఆవిణ్ణిక్కడికి రప్పిస్తే, ఇద్దరికీ సరదాగా హనీమూన్ ఐపోతుంది" అన్నాను సరదాగా అన్నట్లు.

కానీ అతను ముఖం చిట్లించి, "నాకే ఇక్కడ దినదినగండంగా ఉంది. మళ్లీ వేరే తంటసమెందుకూ?" అన్నాడతను.

'భార్య తంటసమా? ఇలా అనుకునేవారు కూడా ఉంటారా? ఉంటే అలాంటివాళ్లు పెళ్లి చేసుకోవడమెందుకు?' అనుకున్నాను కానీ – అది అపార్థమని తెలుసుకుందుకు ఎంతోసేపు పట్టలేదు.

అతను బాగా బిడియస్థుడు. ఎవరో ఒకరు తోడు లేకుండా, ఇల్లు దాటి – అడుగు తీసి అడుగు వెయ్యడానికి కూడా భయంగా అనిపిస్తోందిట. అలాంటి పరిస్థితుల్లో భార్యని ఇరికించడం సబబు కాదని అతడికి తోచింది.

"మరీ అంత భయమైతే – ఎన్నాళ్లని ఇక్కడుండగలరు?" అన్నాను.

"అదీ నిజమే! నేనిక్కడికి రావడం పొరపాటనీ, వెనక్కి వెళ్లిపోదామనీ కూడా నాకు అనిపించింది. కానీ అనుకోకుండా ఓంప్రకాష్ మహాపాత్రా పరిచయమయ్యాడు. దాంతో నా ఆలోచనలు మారాయి" అన్నాడు.

అంత మంచి స్కాలర్‌షిప్పు మీదొచ్చి, అలా వెళ్లిపోవాలనుకున్నాడని నాకు చాలా చిత్రంగా అనిపించింది. కానీ మహాపాత్రా పేరు వినగానే ఆ ఆశ్చర్యం పోయి, ఆ స్థానాన్ని ఉత్సాహం ఆక్రమించింది.

మహాపాత్రా ఒరియావాళ్ల ఇంటిపేరు. అప్పటికి ఒరిస్సాలో ఐదారేళ్లుగా ఉన్నాను. నాకు ఒరియా రాదు కానీ – ఆ ప్రాంతంతోనూ, అక్కడివారితోనూ, ఆ భాషతోనూ చెప్పుకోతగ్గ అనుబంధం ఏర్పడింది. ఎంతలా అంటే ఇప్పుడు మహాపాత్రా పేరు వినగానే ఆత్మీయుల ప్రస్తావన వచ్చినట్లనిపించింది.

"ఓంప్రకాష్ మహాపాత్రా ఎవరు?" అన్నాను కుతూహలంగా.

"మంచివాడు. స్నేహపాత్రుడు. అతన్ని నీకు పరిచయం చేస్తాను" అన్నాడు గోపాలకృష్ణన్.

తక్షణమే పరిచయం చేసుకోవాలనిపించింది కానీ – అందుకు కనీసం ఒక్క రోజు ఆగాలని తెలుసు. కానీ ఒక్కరోజు మాత్రమే ఆగాల్సిరావడం నా అదృష్టం.

నేను భువనేశ్వర్నించి వచ్చేనని తెలియగానే, ఓంప్రకాష్ మర్నాడే ఎంతో ఉత్సాహంగా నన్ను కలుసుకుందుకు వచ్చాడు. ఐతే నాకు ఒరియామీద పట్టు లేదనీ, ఆ భాషలో మాట్లాడ్డం కూడా రాదనీ తెలియగానే – అతని ఉత్సాహంమీద కాసిని నీళ్లు చిలకరించినట్లయింది.

"కనీసం మాట్లాడుకునే స్థాయిలో భాష నేర్చుకోవలసింది" అని నేనూ మనసులో కించపడ్డాను.

ఓంప్రకాష్ ఇండియానుంచి కెనడా వెళ్లి అక్కడ ఎమ్మెస్ చేసి పిహెచ్‌డి చెయ్యడానికి బెర్లిన్ వచ్చాడు. చురుకైనవాడు. విదేశానుభవంలో నాకంటే పెద్దే కానీ, వయసులో నాకంటే కాస్త చిన్న.

అతను నా అలవాట్ల గురించి తెలుసుకుని, "ఇక్కడికొచ్చి ఇంకా బీరు కూడా అలవాటు చేసుకోలేదా? యూ ఆర్ గ్రేట్!" అన్నాడు.

జర్మనీలో నా అలవాట్లని మెచ్చుకున్న తొలి భారతీయుడతను. అందులోనూ నాకు లేని అలవాట్లన్నీ తనకి ఉన్నాయి. ఐనా నన్ను గ్రేట్ అన్నాడని, నేను నిజంగానే గ్రేట్ కాబోలనుకుని చాలా సంతోషించాను. తర్వాత గ్రహించాను – ఎవరినైనా, దేన్నయినా మెచ్చుకుందుకు 'గ్రేట్'ని ఊతపదంగా వాడడం అతని అలవాటని.

ఓంప్రకాష్‌తో పరిచయమయ్యేసరికే నేను నా జర్మన్ మిత్రుడు మ్యుల్లర్ సాయంతో గ్రుండిగ్ కంపెనీది స్పూల్‌టైపు స్టీరియో టేపు రికార్డర్ కొన్నాను. అది ఓంప్రకాష్‌కీ, గోపాలకృష్ణన్‌కీ కూడా నచ్చింది. ఇంత త్వరలో అంత ఖరీదైనది కొన్నందుకు కూడా ఓంక్రాష్ నన్ను గ్రేట్ అన్నాడు.

నేను, ఓంప్రకాష్ తరచుగా కలుసుకునేవాళ్లం. ఓసారి నన్నతను తనింటికి భోజనానికి ఆహ్వానించాడు. "ఈరోజు నీతోపాటు నేనూ ఫక్తు శాకాహారం" అన్నాడు. ముందు ఓ గిన్నెలో అన్నం వండి పక్కన పెట్టాడు. తర్వాత ఓ బూరెల మూకుడులో జీలకఱ్ఱ పోపు వేయించాడు. ఫ్రిజ్‌లోంచి ఓ డబ్బా తీసి సీలు తెరిచాడు. దాంట్లో నూనెలో నిలవుంచిన రకరకాల కూరగాయల ముక్కలున్నాయి. వాటిని పోపులోకి వంపి గరిటతో కలుపుతూ కాసేపు వేయించి దింపేశాడు. ఆ కూర చాలా చాలా బాగుంది. నేనా కూరగాయల డబ్బా తీసుకుని పేరు చూశాను. గ్యువెట్ష్ అని ఉంది. ఆ తర్వాత నుంచి నేను వండుకునే కూరల్లో గ్యువెట్ష్ కూడా చేరింది.

మాటల సందర్భంలో – సమయం దొరికినప్పుడల్లా సిటీ మ్యాప్ సాయంతో నేను బెర్లిన్ నగరాన్ని ఓసారి చుట్టి వస్తున్నానని తెలిసిన ఓంప్రకాష్ – మళ్లీ నన్ను గ్రేట్ అన్నాడు. అప్పుడు గ్రేట్ కేవలం ఊతపదం కాదు. తన సాయంలేనిదే ఒక్కడుగైనా వెయ్యలేని గోపాలకృష్ణన్ మనసులో స్ఫురించగా అప్రయత్నంగా అతని నోట వెలువడిన మాట!

ఓంప్రకాష్‌కి ఆటలు, సంగీతం, రాజకీయాలు వగైరాలపై ఆసక్తి, చెప్పుకోతగ్గ అవగాహన ఉంది. నేను చెప్పేది వింటూ, తనకు తెలిసినవి ఎన్నో చెప్పేవాడు. చాలా విషయాల్లో మా అభిప్రాయాలు కలిసినట్లే అనిపించేది. అందువల్లనేమో మామధ్య మాటలు బాగా నడిచేవి.

ఏం మాట్లాడుకున్నా అనుకోకుండా నా భార్యాబిడ్డల ప్రసక్తి తెచ్చేవాణ్ణి.

నాకూ మావాళ్లకీ ఉన్న అనుబంధం ఓంప్రకాష్‌కి అర్థమైనట్లుంది. అతనొక రోజున, "మీవాళ్ల గురించి ఆలోచిస్తూ నీరసపడే బదులు, వాళ్లని ఇక్కడికి తీసుకొచ్చే ప్రయత్నం చేయొచ్చుగా" అన్నాడు.

జవాబుకి తడుముకోవాలా, "నాకిద్దరు పిల్లలున్నారు. ఇద్దరూ ఇంకా బాగా చిన్నపిల్లలు. తల్లో తండ్రో ఎవరో ఒకరైనా దగ్గరుండాలి. వాళ్ల నొదిలి తనొక్కత్తీ ఇక్కడికి రావడం – తనకీ, నాకూ కూడా మనస్కరించదు. " అన్నాను.

"అలా ఎందుకనుకోవాలి? పిల్లల్ని దేశంలో వదిలి ఇక్కడికొస్తున్న ఇండియన్సు చాలామందే ఉన్నారు" అన్నాడు ఓంప్రకాష్.

"ఆ విషయం నాకూ తెలుసు. కానీ అలా చెయ్యడానికి – నేనూ, నా భార్యా కూడా మానసికంగా సిద్ధపడి లేం" అని స్పష్టం చేశాను.

అతను సాలోచనగా, "ఈ విషయమై బాగా ఆలోచించి ఓ నిర్ణయం తీసుకుని చెప్పు. నాకు చేతనైన సాయం చెయ్యడానికి నేను రెడీ" అన్నాడు.

స్నేహభావంతో ఓ మంచిమాట అన్నాడనుకున్నాను. అతని మాటల్ని సీరియస్‌గా తీసుకోలేదు కానీ అవి నా బుర్రలో ఏ మూలో స్థిరనివాసం ఏర్పరచుకున్నాయని అప్పుడు తెలియలేదు.

అక్టోబర్ 21న నేను కలకత్తాలో ఉంటున్న అన్నయ్యకి యోగక్షేమాల ఉత్తరం రాసి కవరు అంటించబోతుండగా – ఉన్నట్లుండి ఓంప్రకాష్ మాటలు గుర్తొచ్చాయి.

అతను పిల్లల్ని ఇండియాలో వదిలి శ్రీమతిని ఇక్కడికి రప్పించుకోమని సలహా ఇచ్చాడు. అందుకు తన వంతు సాయం చెయ్యగలనన్నాడు.

అంతవరకూ ఈ విషయంలో నాకు ఆ మాత్రం మాట సాయం అందించినవారు లేరు. ఆ మాటని ఆసరా చేసుకుని, శ్రీమతితో పాటు పిల్లలిద్దర్నీ కూడా ఇక్కడికి రప్పించే ప్రయత్నం నేను చెయ్యొచ్చుగా!

'ఆరంభింపరు నీచ మానవులురు విఘ్నాయాస సంత్రస్తులై' అంటుంది సుభాషితం. ఇంతవరకూ నేను నీచావస్థలో ఉన్నాను.

'ఆరంభించి పరిత్యజించుదురురు విఘ్నాయత్తులై మధ్యముల్' అంటుంది సుభాషితం. మధ్యముడిగా మిగిలిపోవడంకంటే నీచావస్థే మెరుగనుకునే మనస్తత్వం నాది.

'ధీరుల్ విఘ్ననిహన్య మాన్యులగుచున్ ధ్రుత్యున్నతోత్సాహులై ప్రారబ్ధార్థము లుజ్జగింపరు'

అంటుంది సుభాషితం. అంతవరకూ ధీరుణ్ణి కావాలన్న ఆలోచన ఒక్కసారైనా కలగలేదు. ధీరుణ్ణి కావాలన్న దృఢసంకల్పముంటే – ఆ లక్ష్యసాధనలో మధ్యముడిగా మిగిలిపోయినా చిన్నతనం కాదు.

అప్పుడు నాకు అర్థమైంది. నా ఆలోచన మారాలని.

నావాళ్లని ఇక్కడికి రప్పించుకోవచ్చని ఆ రోజున మొదటిసారిగా నాకు స్ఫురించింది. కాసేపట్లోనే ఆ స్ఫురణ ఇంతై అంతై బలమైన నిర్ణయంగా మారిపోయింది.

వెంటనే అన్నయ్యకు రాసిన ఉత్తరంలో చివర కొన్ని వాక్యాలు కలిపాను. శ్రీమతినీ, పిల్లల్నీ కలకత్తా రప్పించి – పాస్‌పోర్ట్, వీసా వగైరా తతంగాలు చూడమని.

అదే ఊపులో బాన్ నగరంలో ఉండే డాడ్ ఆఫీసుకి కూడా ఓ ఉత్తరం వ్రాశాను – నా భార్యాబిడ్డల్ని బెర్లిన్ రప్పించుకోవాలనుకుంటున్నానని. వారికి ముందుగా తెలియబర్చడం నా కర్తవ్యం.

ఆ తర్వాత నేను తీసుకున్న నిర్ణయాన్ని ఆఫీసులో డెకర్ట్‌కి చెప్పాను. ఆ విషయమై అప్పటికి నేననుకుంటున్న సమస్య – భార్య, ఇద్దరు పిల్లలతో ఉండడానికి తగిన ఇల్లు దొరకడం ఒక్కటే!

డెకర్ట్ నా నిర్ణయానికి చాలా సంతోషించాడు. ఇంటి విషయమై సలహా కోసం వెంటనే నన్ను ఆఫీసు సెక్రటరీ ఫ్రౌ షింగే వద్దకి తీసుకెళ్లాడు.

షింగే నా కథ విని, "ఇద్దరు పిల్లలా? మీ బడ్జెట్లో ఇల్లు దొరకడం కాస్త కష్టమే" అని నిట్టూర్చింది.

ఆ ఒక్క మాట చాలు – 'ఉరు విఘ్నాయత్తులై ఆరంభించి పరిత్యజించే' మధ్యముల జాబితాలో నన్ను చేర్చడానికి. కానీ 'ప్రారబ్ధార్థము లుజ్జగింపని' ధీరుణ్ణి కావాలన్న మత్తులో ఉన్నాను నేను.

షింగే మాటల్ని పక్కన పెట్టాను. ఆ తర్వాత ఓంప్రకాష్‌ని కలుసుకున్నప్పుడు, "నీ మాట స్ఫూర్తితో ముందుకెడుతున్నాను. నువ్వేం సాయం చెయ్యగలవో చెప్పు" అన్నాను.

ఆతను ముందు సాయం గురించి చెప్పలేదు. "నీ నిర్ణయం మంచిదే కానీ, పిల్లలతో ఇక్కడుండడంలో చాలా ఇబ్బందులుండొచ్చు. బాగా ఆలోచించుకో" అని హెచ్చరించాడు.

ధీరుణ్ణి కదా, "అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను" అన్నాను దృఢంగా.

"మంచిది. ఇల్లు వెదకడంలో నేను చెయ్యగల సాయం చేస్తాను" అన్నాడతను అప్పుడు.

ముందు నేను చెయ్యాల్సినవి ఒకటొక్కటిగా పూర్తి చెయ్యాలిగా. వాటిలో బెర్లిన్లోని ఇండియన్ కన్సలేట్ ఆఫీసుకి వెళ్లడం ఒకటి. నేను జర్మనీలో ఉంటున్నాననీ, అక్కడ నా భార్యాబిడ్డల్ని పోషించుకునే స్తోమత నాకున్నదనీ కన్సలేట్ వారో సర్టిఫికెట్ ఇవ్వాలి. అదుంటే తప్ప ఇక్కడికి రావడానికి నావాళ్లకి అనుమతి లభించదు.

ఇండియన్ ఆఫీసు అనేసరికి అది తాలూకాఫీసైనా, ఇండియన్ కన్సలేట్ ఐనా ఒకటే. ఇండియాలో ఉన్నా జర్మనీలో ఉన్నా ఒకటే!

"పాస్‌పోర్ట్ ఇక్కడ వదిలి వెళ్లండి. సర్టిఫికెట్టుకి ఓ వారం రోజులు పట్టొచ్చు" అందక్కడ పనిచేసే అమ్మాయి – ఫక్తు ఇండియన్ ఉద్యోగిలా.

నేనక్కడ నా పాస్‌పోర్ట్ వదిలి ఇంటికెళ్లాను.

ఈలోగా డాడ్ ఆఫీసునుంచి నాకో కవరొచ్చింది. అది విప్పి చదవడానికి భయపడ్డాను.

ఎందుకంటే –

జర్మన్లకొక జీవనప్రమాణ వ్యయముంది. ఆ ప్రకారం జర్మనీలో ఉండడానికి ఒక మనిషికి కనీసం నెలకి ఎనిమిదొందల మార్కులు అవసరం. ఆ ప్రకారం అప్పుడు నాకొస్తున్న డాడ్ స్కాలర్‌షిప్ ఒక్క మనిషికే సరిపోతుంది. అందుకని డాడ్ సంస్థ – డాడ్ స్కాలర్సు భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకోవడాన్ని ప్రోత్సహించకపోవడం సాధారణం. ఎవరైనా తమవాళ్లని రప్పించుకుంటామని వ్రాసినప్పుడు – ఖర్చు విషయం చెప్పి హెచ్చరించడం డాడ్‌కి రివాజు.

నేను ధీరుణ్ణి కావాలనుకుంటున్నాను కానీ, పదే పదే విఘ్నాలెదురౌతుంటే తట్టుకోలేక మధ్యముడిగా మారిపోతానన్న భయమూ ఉంది. ఆ భయంతోనే కవరు తెరిస్తే –

అందులో రెండుత్తరాలున్నాయి. మొదటిది నాకున్న అలవెన్సుల గురించి.

భార్యాబిడ్డలు ఇక్కడికొస్తే – భార్యకి 200 మార్కులు, పిల్లలకి చెరో యాభై మార్కులూ అదనపు అలవెన్సుగా ఇస్తారుట.

ఆ విషయం నాకు తెలుసు. నా స్కాలర్‌షిప్ ఆర్డర్లో ఆ విషయం ప్రస్తావించారు. కానీ ఇప్పుడా విషయం నేను వ్రాసిన ఉత్తరానికి జవాబుగా రావడం – నాకు కొత్త ఉత్సాహానిచ్చింది. అంటే డాడ్ సంస్థ ఈ విషయంలో నన్ను ప్రోత్సహించినట్లే అనిపించింది.

ఇక రెండో ఉత్తరంలో విశేషం నేనూహించనిది!

ఈ అక్టోబరునుంచి స్టయిపెండ్ వంద మార్కులు పెంచారుట. అంటే తొమ్మిదొందలనుంచి వెయ్యి మార్కులు అయింది. తర్వాతి నెలలో ఆ ప్రకారం అరియర్సు కూడా ఇస్తారుట.

అంతే, నాలోని ధీరుడు ద్రుత్యున్నతోత్సాహుడైపోయాడు.

శ్రీమతిని ఇక్కడికి తీసుకురావాలని నేననుకున్న ఘడియ శుభప్రదమై ఉండాలి. లేకపోతే నా ఉత్తరానికి ఇలాంటి జవాబు రావడమేమిటి?

బలహీన క్షణాల్లో సామాన్యుడికి బలాన్నిచ్చేది నమ్మకం. ఆ నమ్మకానికి ఒకోసారి మూఢత్వమూ జతపడొచ్చు.

ఏదేమైనా నాకప్పుడు బలం కావాలి. వెంటనే న్యూమరాలజీ లోకి వెళ్లాను.

నేను డాడ్ వాళ్లకి 31న ఉత్తరం వ్రాశాను. తేదీని తిరగేస్తే పదమూడు. డాడ్‌నుంచి నాకొచ్చిన ఉత్తరం తేదీలోని అంకెలన్నీ కలిపినా పదమూడొచ్చింది. పదమూడు నా లక్కీ నంబర్.

ఇవన్నీ కలిగించిన ఉత్సాహంతో ఆలోచనలకి పదును పెడితే అందులోకి ఒలోముచ్‌కీ వచ్చింది.

నేనిప్పుడుంటున్నది సింగిల్ బెడ్రూమే కానీ, చూడ్డానికి పెద్ద హాలులా ఉంటుంది. ఒలోముచ్‌కీ ఒప్పుకుంటే నేను, నా భార్యాబిడ్డలు – మొత్తం నలుగురం ఆ హాల్లో సంతోషంగా సద్దుకోగలం. నాకున్న స్వల్ప పరిచయంలో ఒలోముచ్‌కీ మంచిదానిలాగే అనిపించింది.

ఒక రాయేసి చూస్తే సరిపోదా అనిపించింది. ఐతే అక్కడో చిన్న తిరకాసుంది.

అంతకుముందే ఒకరోజున ఒలోముచ్‌కీ నూటయాభై మార్కులు అప్పుగా కావాలని వంటింట్లో ఫ్రిజ్‌మీద కాగితం పెట్టి వెళ్లింది. మా ఇద్దరికీ అదే పోస్టుబాక్స్.

అప్పుడు నా దగ్గర డబ్బు లేదని చీటీ వ్రాసి ఫ్రిజ్‌మీద పెట్టాను. అందుకామెకి ఆగ్రహం వచ్చిందో లేదో తెలియదు కానీ, వస్తే ఆశ్చర్యంలేదు.

మరి నాకిప్పుడామె అనుగ్రహం కావాలి. పాత్రుణ్ణి కాగలనా?

కానీ ధీరుణ్ణి కదా – సంకోచం కూడదు. తనొప్పుకుంటే నా భార్యాబిడ్డల్ని బెర్లిన్ రప్పించాలనుకుంటున్నట్లు చీటీ ఒకటి వ్రాసి ఆ రాత్రి ఫ్రిజ్‌మీద పెట్టాను.

ఒక ఏడాదిపాటు నేను నా కుటుంబంతో కలిసి ఉండే అవకాశం – ఆ నా విన్నపానికి ఒలోముచ్‌కీ ఎలా స్పందిస్తుందీ అన్నదానిపై ఆధారపడి ఉంది.

ఒప్పుకుంటుందా?

అది నాకు బలహీన క్షణం. అలాంటి బలహీనక్షణాలు నాకు చాలా అరుదు.

చిన్నప్పట్నించీ దేవాలయాల మధ్య పెరిగాను. పెద్దలు చేసే దైవపూజలకు నా వంతు సహకారాన్నందిస్తూ వచ్చాను. కానీ నా ఉద్దేశ్యంలో దేవుడంటే కోరికలు తీర్చే పురుషోత్తముడు కాదు. మనిషి ఎంత అల్పుడో తెలుసుకుందుకు సహకరించే ఓ తత్వం. అందుకే పరీక్షల్లో కూడా నేను దేవుడికి చేతులు జోడించానే తప్ప, ఏదో కావాలని కోరాలనుకునేవాణ్ణి కాదు.

అలాంటి నాకు – బీయస్సీ ఫైనలియర్ పరీక్షల సమయంలో ఓ బలహీనక్షణం వచ్చింది. ఆ వివరాలు మా 'పెళ్లయ్యాక చూడు' నవల్లో ఉన్నాయి.

అప్పుడా బలహీనక్షణంలో నేను చేసిన పనేమిటంటే – దీర్ఘకాలిక పథకంలో బోలెడన్ని కోరికలకి ఒకదానితో ఒకటి లంకె పెట్టి, తిరుపతి వెంకన్నకి మొక్కుకున్నాను.

ఆశ్చర్యంగా ఆయన చాలా ఓపికగా అన్నింటినీ కలిపి తీర్చాడు. నేను నడిచి కొండెక్కి ఆ మొక్కు తీర్చుకున్నాను.

ఇప్పుడు మళ్లీ అలాంటి బలహీనక్షణం వచ్చింది. బెర్లిన్ నగరంలో ఏడాదిపాటు నా భార్యాబిడ్డలతో గడపాలన్న కోరిక ఇంతింతై అంతైంది. ఒలోముచ్‌కీ నా భార్యాబిడ్డల రాకకు ఆమోదముద్ర వేసేలా చెయ్యమని – మరోసారి నన్ను తిరుపతి వెంకన్నకి మొక్కుకునేలా చేసింది.

అందుకే మేధావులమని మిడిసిపడే మనలాంటివార్ని చూసి దేవుడు నవ్వుకుంటాడు. నవ్వుకుంటూనే తనున్నానన్న భ్రమని కలుగజేసి మనని మరింత అయోమయంలో పడేస్తాడు.

మర్నాడుదయం కాస్త పెందరాళే లేచి వంటింట్లోకి వెళ్లి చూస్తే ఫ్రిజ్‌మీద ఏ కాగితం లేదు.

అంటే, ఒలోముచ్‌కీ నా చీటీ తీసుకుంది. కానీ ఇంకా బదులివ్వలేదు. ఎందుకో మరి?

ఆలోచిస్తూనే మళ్లీ గదిలో దూరి తలుపేసుకున్నాను. అంతలోనే గది తలుపు కొట్టిన చప్పుడు. ఆ వెంటనే, "హెర్ డాక్టర్" అంటూ ఒలోముచ్‌కీ గొంతు.

డాక్టర్ పదానికి హెర్ (మిస్టర్) జోడించడం అక్కడ మామూలే.

తలుపు తీశాను. ఆమెననుసరించి ఆమె గదిలోకి వెళ్లాను.

"నువ్వు నీ భార్యాబిడ్డల్ని రప్పించుకుని నా ఇంట్లో ఉండడానికి నాకే అభ్యంతరం లేదు. నీ గదిలో అదనంగా మరో మంచం వేయిస్తాను. అందుకుగానూ నెలకి వంద మార్కులు అదనంగా ఇవ్వాలి" అందామె.

'కంటి నఖిలాండ కర్త నధికుని గంటి' అని మురిశాడు అన్నమయ్య. 'కనుగొంటిని' అని పరవశించాడు త్యాగయ్య.

కారణజన్ముల అలౌకికానందానికి అపూర్వ ప్రకటన అది.

కారణజన్ములు కానివారికీ అలాంటి అలౌకికానందం ఉంటుందని అప్పుడు నాకు అర్థమైంది.

ఒప్పుకుంది.

ఒలోముచ్‌కీ ఒప్పుకుంది.

అది కలో, నిజమో – అనుకుంటూ ఆమెని మరోసారి పరీక్షగా ఆమెని చూస్తే, చేతిలో మాణిక్యవీణ కనిపించింది.

కానీ నా మనసు స్తోత్రానికి పూనుకోలేదు. దానినిండా పామరుడి ఆలోచనలు.

ఇంతవరకూ నా ఇంటద్దె నూటయాభై. అదిప్పుడు రెండొందల యాభై ఔతుంది. ఐతే ఏం – నలుగురున్న నా కుటుంబానికి నాలుగొందల మార్కుల లోపులో ఎవరూ ఇల్లివ్వరక్కడ. అదృష్టమంటే నాదే!

ఇలా అనుకుని నా దృష్టిని ఆమె చేతులనించి ముఖంమీదకు మళ్లిస్తే, ఆమె కళ్లలో కూడా నా కున్నంత ఆత్రుతా కనిపించింది.

గదిలో ఒక్క మంచం అదనంగా వేయించినందుకు తనకి నెలకి మరో వంద మార్కులు. అదృష్టం ఆమెది కూడా మరి! అందుకే ఆమె కళ్లలో ఆత్రుత!

దేవుడు ప్రత్యక్షమై వరమివ్వగానే ముందు పరవశం కలుగుతుంది. తర్వాత వచ్చిన అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలన్న ఆశ మొదలౌతుంది.

ఆ ఆశ నాకు ఆమె కళ్లలోని ఆత్రుతని పట్టిచ్చింది.

"నేను ఉద్యోగం చెయ్యడం లేదు. స్కాలర్‌షిప్పుమీద ఉంటున్నాను. ఎలాగో కష్టపడి కొంచెండబ్బు నిలవేశాను. నా భార్యాబిడ్డల్ని రప్పించుకుందుకు కూడా, ఇప్పుడు ఆ నిల్వలోంచే ఇక్కడ టికెట్ కొని ఇండియాకి పంపాలి" అన్నాను దీనంగా.

నటించక్కర్లేదు. అప్పుడు నా పరిస్థితి నిజంగానే దీనంగా ఉంది.

"ఐతే ఏమంటావ్?" అంది ఒలోముచ్‌కీ.

"గదిలో అదనంగా మంచం వేయించినందుకు, నెలకి యాభై మార్కులకి మించి అద్దె ఇచ్చుకోలేను" అన్నాను.

ఒలోముచ్‌కీ ఒప్పుకోలేదు. కానీ ఆమె గొంతు కాస్త మెత్తబడింది. వెంటనే ఒప్పుకోవడం ఇష్టంలేక అలాగంటోంది కానీ, ఒప్పుకుంటుందని నాకు అనిపించింది.

యాభై మార్కులకి మించి ఇవ్వలేనని మరీ మరీ చెప్పాను.

మామూలుగా మొహమాటస్థుణ్ణి. బేరసారాలకు బొత్తిగా పనికిరానని – చిన్నప్పుడు కన్నతల్లి, పెద్దయ్యాక కట్టుకున్న ఇల్లాలు నా గురించి ఒకే తీర్మానం చేశారు.

ఎదిగేక కన్నబిడ్డలూ అదే అభిప్రాయానికొస్తారని నాకే అనుమానముంది.

కానీ ఆ క్షణంలో తిరుపతి వెంకన్న నన్నావహించి ఉన్నాడనుకోవాలి. ఆయన ప్రభావమే ఒలోముచ్‌కీపై పడుతోందనుకోవాలి

"**సరే**, నెలకి రెండొందల మార్కులే ఇద్దువుగాని. కానీ ప్రస్తుతం నేను డబ్బిబ్బందుల్లో ఉన్నాను. నాకో నూట యాభై మార్కులు అప్పుగా ఇవ్వగలవా? అప్పంటే అప్పు కాదు. డిసెంబర్ నెలకి అడ్వాన్సనుకో. పై నెలలో నువ్వు అద్దె ఇవ్వక్కర్లేదు" అందామె.

మారు మాట్లాడకుండా ఆమెకి నూటయాభై మార్కులిచ్చేశాను. దానికామె రసీదు కూడా ఇచ్చి, "ఎప్పుడొస్తారు మీవాళ్లు?" అంది. ఇప్పుడామెకి అదనపు ఆదాయం గురించి ఆత్రంగా ఉన్నట్లుంది.

కానీ నేను డబ్బు ఏర్పాటు చేసుకోవాలిగా! అదే ఆమెకి చెప్పి, "బహుశా ఫిబ్రవరిలోనో, మార్చిలోనో వస్తారు" అన్నాను.

"ఒంటరిగా ఉన్నావ్. వీలైనంత తొందరగా వాళ్లని తెచ్చుకో" అందామె కొంచెం జాలినీ, కొంచెం ఆశనీ మేళవించి.

నేను తలాడించి అక్కణ్ణించి కదలడంలో కాళ్లు తడబడి పడబోయి తమాయించుకున్నాను.

"కాళ్లు జాగ్రత్త! ఇండియాకి తిరిగొచ్చేక నడిచి ఏడు కొండలెక్కాలి" అని ఎవరో నా గొంతులో గొణిగినట్లయింది.

నేను దేవుడి గొంతు విన్నాను. మెదడులో రికార్డయిన ఆ గొంతుని టేపుమీదకి మార్చే సౌకర్యం లేకపోయింది కానీ – దేవుడి గొంతుని ఎందరికో వినిపించి ఉండేవాణ్ణి.

గదిలోకెళ్లి వెంటనే డబ్బు గురించి ఆలోచనలో పడ్డాను.

ప్రస్తుతం నా దగ్గర నిలవేసిన కొంత డబ్బుంది. అది నావాళ్ల టికెట్లకు సరిపోతుంది. కానీ ఆ టికెట్లు ఇండియాలో రూపాయలతో కూడా కొనొచ్చు. అలాంటప్పుడు – మనదికాని దేశంలో ఉంటూ ఇక్కడి కరెన్సీని వాడెయ్యడం సబబా అనిపించింది. చేతిలో ఎన్ని మార్కులుంటే అంత ధైర్యమిక్కడ!

ఇప్పుడు కనుక, ఇండియాలో ఎవరైనా ఈ విషయంలో నా అవసరానికి ఆదుకుంటే బాగుండుననిపించింది.

ఇక్కడికి డెప్యుటేషన్‌మీద వచ్చినవాణ్ణి. ఈ స్టయిపెండు కాక ఇండియాలో నాకొచ్చే జీతం అక్కడ రూపాయల్లో పేరుకుంటుంది. తిరిగి వెళ్లేసరికి సునాయాసంగా బాకీ తీర్చెయ్యగలను.

శ్రీమతివైపు బంధువుల్లో వేల రూపాయల్ని తృణప్రాయంగా చూడగలవారున్నారు. వాళ్లు తలో చెయ్యి (వెయ్యి) వేస్తే శ్రీమతి జర్మనీ ప్రయాణం క్షణాలమీద పని. ఇండియాకి తిరిగెళ్లాక, వాళ్ల డబ్బుని వడ్డీతో కలిపి పువ్వుల్లో పెట్టి ఇచ్చేయొచ్చు.

ఈ వివరాలన్నీ శ్రీమతికి ఉత్తరం వ్రాశాను. తననీ, పిల్లల్నీ ఇక్కడికి పంపడానికి మిగతా ఏర్పాట్లు చెయ్యమని కాకినాడలో మామగారికీ, కలకత్తాలో అన్నయ్యకీ కూడా వేరే ఉత్తరాలు వ్రాశాను.

అదయ్యేక మనసు కొంచెం తేలికపడింది. కానీ అంతలోనే ఏవో శంకలు.

నావాళ్లు ఇక్కడికొస్తే – ఇండియాలోలా సంతోషంగా మసలగలరా?

ఇక్కడి పద్ధతులు వేరు. ఇక్కడివాళ్ల ఆలోచనలు వేరు. ఒక సంప్రదాయ హిందూవనితగా నా భార్య ఇక్కడ ఇమడగలదా?

ఎందుకంటే ఇది మాకు తెలిసిన ప్రపంచం కాదు. మరో ప్రపంచం. ఆ విషయం మర్చిపోదామన్నా అహమ్మద్‌లాంటి మిత్రులు నన్ను మరువనివ్వరు.....

మరో ప్రపంచం

ఇన్స్‌టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ డైరెక్టర్ని – సంస్థలో చేరిన మొదటిరోజున కలవడమే. ఆతర్వాత ఈ రోజున ఆయన ఉపన్యాసముందని అహమ్మద్ చెబితే – ఎలా ఉంటుందో వినాలన్న కుతూహలంతో అతనితో కలిసి వెళ్లాను.

సెమినార్ హాలు ఇంగ్లీషు సినిమాల్లో చూసే వాటిలాగే ఉంది. ఉపన్యాసం జర్మన్ భాషలో. ప్రేక్షకులు, శ్రోతలు – మన దేశపు తీరులోనే కనిపించారు.

డైరెక్టర్ తన హయాంలో సాధించిన విజయాల గురించీ, ఇప్పుడు తనముందున్న లక్ష్యాల గురించీ ఏకరువు పెడుతుంటే – 'కొయ్' అన్న రీతిలో కొందరు నవ్వుకున్నారు.

నా పక్కనున్న కొందరు ఆ చుట్టుపక్కల మాత్రమే వినపడే స్వరాలతో జోక్సు కూడా వేశారు.

స్లయిడ్ షో ఆ ఉపన్యాసంలో భాగం. ప్రొజెక్టరు ఆపరేట్ చేస్తున్న వ్యక్తి నాకు దగ్గర్లోనే ఉన్నాడు. అతనిమీద కూడా చాలా జోకులు పడ్డాయి. అతనూ నవ్వుతున్నాడు.

నా పక్కనున్న ఒకతను బొమ్మలు గీస్తున్నాడు. డైరెక్టర్ని కార్టూన్ రూపంలో చిత్రించాడతను.

నాకు చిన్నప్పటి క్లాస్‌రూం గుర్తొచ్చింది. అప్పటిలాగే ఈ వాతావరణమూ ఆహ్లాదకరంగా ఉంది.

వేగంగా జర్మన్లో కొనసాగుతుండడంవల్లనూ, పూర్తిగా టెక్నికల్ లాంగ్వేజి కావడం వల్లనూ – ఆ భాష నాకు అంతగా అర్థం కాలేదు. సబ్జక్టు కూడా నాకు సంబంధించింది కాదు. ఐనా కాసేపు కూర్చున్నాను.

వాతావరణం తేలికగా ఉందని అనుకున్నాను కానీ ఉపన్యాసాన్ని ఎవరూ తేలికగా తీసుకున్నట్లు లేదు. ఇరవై ఏళ్ల యువకులు కూడా శ్రద్ధగా విని, లేచి నిలబడి విమర్శనాత్మకమైన సందేహాల్ని ధైర్యంగా అడుగుతున్నారు. వాళ్లకి తగిన సమాధానాలు లభిస్తున్నాయి.

ఇండియాలో మా లాబొరెటరీలో డైరెక్టర్ సెమినార్ ఇస్తే – దానికి అంతా వెళి వెళ్లితీరాలి. ఆయనేం చెప్పినా తలూపుతూ వినాలి. ఎవరైనా లేచి నిలబడితే, ఆయన చెప్పిన పాయింటుని అభినందించడానికి మాత్రమే! అలాకాక సందేహమేదైనా వెలిబుచ్చితే, తప్పు చేస్తున్నట్లు మొహంపెట్టి అడగాలి. దేనికైనా డైరెక్టరిచ్చే సమాధానం – సద్గురువు శిష్యులకు చేసే జ్ఞానప్రబోధంలా ఉంటుంది.

ఇక్కడ అడిగేవాళ్లలో అచ్చమైన కుతూహలమే తప్ప వినయం లేదు. బదులిచ్చేవారిలో తన ఉద్దేశ్యం వివరించాలన్న తాపత్రయమే తప్ప అహం లేదు.

ఇది మాత్రం మన పద్ధతి కాదు. నాకిక్కడి తీరు నచ్చింది.

కాసేపయ్యేక హాల్లోంచి బయటకొచ్చాను. నాతోపాటే అహమ్మద్ కూడా బయటకొచ్చాడు. నావైపు అదోలా చూస్తూ, "ఏమిటలా దిగులుగా ఉన్నావ్?" అన్నాడు.

నిజానికి నేనప్పుడు దిగులుగా లేను. కానీ ఉన్నానని అహమ్మద్ అనుమానం.

జర్మనీలోని వైభవ విలాస జీవితపు గొప్పతనాన్ని నేను ఏదో రోజున గుర్తిస్తాననీ, అపురూపమైన కాలాన్ని అన్నాళ్లు వృథా చేసినందుకు తప్పక పశ్చాత్తాపపడతాననీ అతనికి గట్టి నమ్మకం.

"లేదే, నేను చాలా సంతోషంగా ఉన్నాను" అన్నాను.

అహమ్మద్ తల అడ్డంగా ఊపి, "నువ్వు సంతోషంగా ఎలా ఉంటావు? అందుకు ముందు సంతోషమంటే ఏమిటో తెలియాలిగా!" అని నాకో చురక వేశాడు.

అవతలివ్యక్తి మనకంటే అధికుడు కాదన్న నమ్మకమున్నప్పుడు అలాంటి చురకలకు చిన్నతనముండదు. నేను నొచ్చుకోకుండా, "సంతోషమంటే నీకు తెలుసా?" అన్నాను.

"అది చెప్పేముందు నిన్నొకటడగాలి. ఆడదాని తొడలమధ్య ఏముంటుందో తెలుసా?" అన్నాడు అహమ్మద్. మాట ఎంత పచ్చిగా ఉందో, అంత కసీ ఉంది గొంతులో.

ఏం చెబుతాను? తనేమంటాడోనని, "నీకు తెలుసా?" అన్నాను.

"తెలియడమేమిటి? అది నా ఆరాధ్యరూపం. నా రూంకొస్తే చూపిస్తాను – నా ఆరాధ్యరూపం నిలువెత్తు పటాన్ని. నా ప్రియురాల్ని ఒప్పించి క్లోజప్పులో ఫొటో తీసి ఎన్‌లార్జి చేయించి పెట్టుకున్నాను" అన్నాడు.

ఇలా మాట్లాడ్డం అహమ్మద్‌కి అలవాటే. అతడి అభిరుచికి తగిన మాటలవి.

ఇండియాలో ఐతే ఆ మాటల్ని నిరసించడమో, మందలించడమో చేసేవాణ్ణి. అతడి మాటల్ని చేతల్లోకి మార్చి చూపే పచ్చి నీలి చిత్రాల్ని ప్రతిరోజూ పదిమంది మసిలేచోట థియేటర్లలో ఆగకుండా ప్రదర్శించడం అత్యంత సాధారణమైన పరిసరాల్లో ఉన్నాను.

నా వ్యక్తిగత వ్యవహారాల్లోకి చొరబడనంత కాలం ఇక్కడ ఇలాంటివి ఎబ్బెట్టుగా ఉన్నా విని సహించడం తప్పనిసరి.

నేను నవ్వి, "నీలో కసి ఎక్కువ" అన్నాను.

"మగాడికి కసి ఉండాలి. నా కసి నా ప్రియురాలి కెంతిష్టమో మాటల్లో చెప్పలేను. అంతెందుకూ, ఓ జర్మన్ మహిళ ఉంది. ఆమె వివాహిత. కానీ తరచుగా నా దగ్గరకొస్తూంటుంది. భర్త దగ్గర దొరకని సుఖం నా దగ్గర లభిస్తుందని తెగ మెచ్చుకుంటుంది" అన్నాడు అహమ్మద్ గర్వంగా.

అహమ్మద్‌కి మగాడిగా తన సామర్థ్యం గురించి చెప్పుకోవాలని మహా కోరిక. తనకెందరో గర్ల్‌ఫ్రెండ్సున్నారనీ, వాళ్లు తరచుగా తనకి కసి నిండిన ఉత్తరాలు రాస్తుంటారనీ నాకు చెబుతుండేవాడు.

కాళీ గిన్నెలకి సొద ఎక్కువని ఓ ఇంగ్లీషు సామెత. అహమ్మద్ కబుర్లు సీరియస్‌గా తీసుకునేవాణ్ణి కాదు నేను. అతను చెప్పేదాంట్లో నిజం చాలా తక్కువని నాకు అనిపించేది.

"స్నేహంలో కసి కాదు, అభిమానముండాలి. ఏకాంతంలో రెచ్చిపోయినప్పుడెలాగూ కసికే ప్రాధాన్యం ఉండొచ్చు. మరి ఉత్తరాల్లోనైనా చూపకపోతే అభిమానాన్ని ప్రదర్శించే అవకాశం ఇంకెప్పుడొస్తుంది?" అన్నాను.

"ఆడా మగా మధ్య శారీరక సంబంధమే అభిమానం! వేరే అభిమానమేమిటో నాకర్థం కాదు" అన్నాడు అహమ్మద్.

"అర్థమయ్యేలా నీకో ఉదాహరణ చెబుతాను" అంటూ అతనికి ల్యూనబర్గులో పరిచయమైన క్రిస్టాలూథర్ గురించి చెప్పాను. నేను బెర్లిన్ వచ్చేక కూడా ఆమెకీ నాకూ మధ్య ఉత్తరాలు నడుస్తున్న విషయం చెప్పాను. జర్మన్ భాషలో నా భావ ప్రకటన చాలా బాగుందనీ, నేనొక అద్భుతమైన లేఖకుడిననీ పొగిడేదామె. ప్రతీదీ అద్భుతమనడం అక్కడి మర్యాద కాబట్టి, నేనామె పొగడ్తలకి ఆనందించినా, అవి నిజమని భ్రమ పడలేదు.

అహమ్మద్ నేను చెప్పిందంతా కుతూహలంగా, శ్రద్ధగా విన్నాడు. "అర్థం కాలేదా? ఆమె నిన్ను కోరుతోంది" అన్నాడు. అని ఆగలేదు. మా ఇద్దరిగురించీ అసభ్యంగా మాట్లాడ్డం మొదలెట్టాడు.

అతన్ని ఆపాల్సిన సమయమొచ్చిందని గ్రహించాను. "బాబూ, నీకో నమస్కారం. మా ఇండియన్సుకి కొన్ని సెంటిమెంట్సున్నాయి. అభిమానించేవారి గురించి అలా మాట్లాడ్డం – మా ఇంటి ఆడవాళ్లని అవమానించినంత బాధని కలిగిస్తుంది" అని మందలించాను.

ఏమనుకున్నాడో అహమ్మద్ ఆ విషయమక్కడితో ఆపేశాడు. "ఇరాక్‌లో ఇండియన్ సినిమాలు చాలా చూశాను. మీ హీరోయిన్స్ చాలా బాగుంటారు. హీరో, హీరోయిన్స్ చెట్టాపట్టాలేసుకుని పాటలు పాడుతూ డ్యాన్సులు చేస్తారు. నాకవి చూడ్డానికి బాగుంటాయి. కానీ ఎంత దగ్గరగా వచ్చినా కూడా వాళ్లు ముద్దు మాత్రం పెట్టుకోరు. ఎందుకని?" అంటూ టాపిక్ మార్చాడు.

"ముద్దులు మా దేశంలో నాలుగు గోడలకే పరిమితం. నాలుగు గోడల మధ్య చేసే ప్రతి పనీ బహిరంగంగా చెయ్యొచ్చునంటే – మనకిక మరుగుదొడ్ల అవసరముండదు" అన్నాను.

నేను పరోక్షంగా సున్నితంగా చెప్పినా, అహమ్మద్‌కి అర్థమయింది. అతడు వెంటనే, "అది సరే రావ్! ఇక్కడ నువ్వింకా చాలా కాలముండాలి. ఆడవాళ్లని తాకకుండా ఎన్నాళ్ళుండగలవ్?" అంటూ మళ్లీ మాట మార్చాడు.

"ఇంకా నీకు చెప్పలేదు కదూ! తొందరలోనే నా భార్య ఇక్కడికి రానున్నది" అన్నాను.

"వ్హాస్! (వాట్)" అన్నాడు అహమ్మద్ అప్రయత్నంగా. అతని ముఖంలో అపనమ్మకం.

నమ్మకం పుట్టడానికి అతనికి అంతవరకూ నేనా విషయమై చేసిన ప్రయత్నాలన్నీ వివరంగా చెప్పాను.

అంతా విని, "అంటే, నువ్వు నీ భార్యనిక్కడికి రప్పించుకుందుకు మూడువేల మార్కులు ఖర్చు పెట్టదల్చుకున్నావన్నమాట!" అన్నాడు అహమ్మద్.

"ఊఁ"

ఉన్నట్లుండి అహమ్మద్ ముఖంలో గీతోపదేశం చేసే కృష్ణుడు కనిపించాడు.

"డాక్టర్ రావ్! యాభై మార్కులిస్తే నీకిక్కడ అప్సరసల్లాంటి అమ్మాయిలు దొరుకుతారు. నెలకో పదిమందిని లెక్కేసుకున్నా – మూడొందల మార్కులంటే – ఆరు నెలలపాటు నీకు వెరైటీకి వెరైటీ, సౌఖ్యానికి సౌఖ్యం. నా మాట విని నీ నిర్ణయం మార్చుకో. ఈ విషయంలో నీకు నేను సాయపడతాను" అన్నాడు.

తెల్లబోయాను. భార్య విషయంలో ఇలాంటి లెక్క ఒకటి ఉంటుందని పొరపాటున కూడా స్ఫురించని నాకు ఆ మాటలు వినగానే కొంత జుగుప్స కూడా కలిగింది.

భార్యాత్వాన్ని సంగమానికి మాత్రమే ఆపాదించి, ప్రతి సంగమానికీ వెల కడుతున్నాడతను. నిజంగా ఆడవాళ్లు ఈ రీతిలో ఆలోచించడం మొదలెడితే – వరకట్నం మాట ఆటుంచి – మగాళ్లకి పెళ్లి అనేది గొంతెమ్మకోరికగా మారిపోదూ?

దూరాన్నుంచి మా సంభాషణలో కొంత డెకర్ట్ చెవులబడినట్లుంది. అతడు చకచకా నావద్దకొచ్చి, "నీ భార్య ఇక్కడికొచ్చే పక్షంలో, ఆమ్‌స్టర్‌డామ్ రూట్లో రమ్మను. నేను, నా శ్రీమతి, నువ్వు కలిసి వెళ్లి ఆమెను రిసీవ్ చేసుకుని బెర్లిన్‌కి తీసుకొద్దాం" అన్నాడు ఎంతో అభిమానంగా.

ఆమ్‌స్టర్‌డామ్ బెర్లిన్‌కి దూరమే. కార్లో వెళ్లి రావాలంటే కొన్ని వందల మార్కులౌతుంది.

అతడి ఆఫర్‌కి ఆశ్చర్యపడుతూనే, "అబ్బే, నీకెందుకూ శ్రమ?" అన్నాను మొహమాటంగా.

"ఇందులో శ్రమేముంది? టూర్లు మాకిష్టం. ఆమ్‌స్టర్‌డామ్ చాలా బాగుంటుంది. ఎలాగూ వెళ్లాలనుకుంటున్నాం. మాతోపాటు మీరూ ఊరు కూడా చూడొచ్చు" అన్నాడు డెకర్ట్.

జర్మన్సులో ఉన్న విశేషమిదే. ఏ మాటైనా సూటిగా చెబుతారు. అభిమానమూ సూటిగానే ఉంటుంది.

"నీ ఆఫర్ ఉపయోగించుకోగలనో లేదో తెలియదు. నీ అభిమానం మాత్రం కలకాలం గుర్తుండిపోతుంది" అన్నాను.

అతని అభిమానానికి కారణం అతని మంచి మనసు కావచ్చు. నా స్నేహశీలత కూడా కావచ్చు. అదక్కడ సాధారణమూ కావచ్చు. నేనా విషయమై ఎక్కువ ఆలోచించలేదు.

ఆ రోజు సాయంత్రమే అహమ్మద్ నా దగ్గరకొచ్చి, "ఈ రోజు బీర్ దొరుకుతుంది రావ్!" అన్నాడు.

"బీర్ దొరకడమేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

పార్టీ జరుగుతోందనడానికి వాడుక పదం బీరు దొరకడమని అప్పుడు నాకు తెలిసింది.

ఆ రోజే మా ఆఫీసులో మ్యుల్లర్‌కీ, మరో ముగ్గురికీ స్కాలర్‌షిప్పులు లభించాయి. వాళ్లు పార్టీ ఇస్తున్నారు.

అలాంటి పార్టీకి ప్రత్యేకంగా ఆహ్వానముండదు. నోటీసు బోర్డులో పెడతారంతే!

ఆ పార్టీ చిత్రంగా ఉంది. నోటీస్ బోర్డులో చూసి పార్టీ జరిగే స్థలానికి వెళ్లడం – అంతే!

అక్కడ పార్టీ ఇచ్చేదెవరో, పుచ్చుకునేదెవరో తెలియదు. ఎవరికి కావాల్సింది వారు తీసుకుని తినడమూ, తాగడమూ, వెళ్లిపోవడమూ! అతిథులుగా వచ్చినవారికి 'బీరు దాతా! వైను దాతా! సుఖీభవ' అనే అవకాశం కూడా లేదు.

ఈ పద్ధతి ముందు నాకు నచ్చలేదు. కానీ పార్టీలో నాకోసం కొన్ని శాకాహార పదార్థాలుంచడం గమనించి ఆశ్చర్యపడ్డాను. అంటే పార్టీ ఏర్పాటు చేసినప్పుడు నన్ను కూడా దృష్టిలో ఉంచుకున్నారన్నమాట! అంటే పార్టీ ఇవ్వడం వెనుక చాలా ఆలోచన ఉన్నట్లే కదా! దాంతో నా అభిప్రాయం మార్చుకున్నాను.

ఈ పార్టీకి వెళ్లేముందే కిర్ష్‌నర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. అతను పార్టీ కోసం మైదాపిండిని బీరుతో పులవబెట్టి ఓవెన్లో ఉడకబెట్టి స్వయంగా ఓ కొత్త వంటకం చేశాడు. అది ఇటాలియన్ డిష్ అనీ, పిట్జా అంటారనీ చెప్పాడు.

పార్టీకి వచ్చినప్పుడు – నాకోసం పిట్జాలో కొంత భాగాన్ని ప్రత్యేకంగా శాకాహారంగా చేశానని అతను నాకు చెప్పాడు. ఆసక్తి లేకపోయినా మొహమాటానికి కొద్దిగా రుచి చూశాను. నచ్చలేదు. మర్యాదకి బాగుందని చెప్పాను కానీ మరి తినలేదు.

అంతా వైన్ తీసుకుంటుంటే నేను నారింజరసం తీసుకంటున్నందుకు నామీద కొన్ని జోక్సు పడ్డాయి. చివరికి రాలెక్ కూడా, "ఏ కోరికలూ లేకుండా, ఎలా బ్రతుకుదామనుకుంటున్నారండీ మీరు?" అని అవహేళనని జాలిగా ప్రదర్శించాడు.

సాధారణంగా రాలెక్ నామీద జోక్స్ వేసేవాడు కాదు. ఆయన సహజ గంభీరుడు. కానీ తాగిన మత్తులో గాంభీర్యం తొలగిపోవడం సహజమే కదా!

అంతమంది మత్తు మనుషులమధ్య నేనొక్కణ్ణీ తాగకుండా అందరి జోక్సూ మౌనంగా భరిస్తూ చాలాసేపే కూర్చున్నాను.

నాకు నా అలవాట్లమీద చిన్నచూపు లేదు. వాటినే నా స్నేహితులుగా భావిస్తాను. కానీ నేనిప్పుడు నీటబాసిన కమలాన్ని. నా మిత్రులే శత్రులు కావచ్చు.

ఇలాంటి పరిస్థితికి తట్టుకోలేకే చాలామంది ఇండియన్స్ ఇక్కడికొచ్చి తమ అలవాట్లని మార్చుకుని ఉండొచ్చని అప్పుడనిపించింది.

మందు పార్టీలకు ఆరంభమే కానీ అంతముండదు. అందుకని నేనక్కణ్ణించి కాస్త ముందుగానే ఆఫీసొదిలాను. తర్వాత మార్కెట్లో తిరుగుతుంటే, అక్కడ ఉన్నట్లుండి ఓ అపరిచిత జర్మన్ వ్యక్తి నన్ను ప్రత్యేకంగా పలకరించాడు. నా వివరాలడిగి తెలుసుకుని, "అరే, నువ్వు రాలెక్ దగ్గర పని చేస్తున్నావా? ఆయన నాకు బాగా తెలుసు" అన్నాడు.

నాకు సంభాషణ పెంచడం ఇష్టం లేదు. అనాసక్తంగా "అలాగా" అని ఊరుకున్నాను.

"రాలెక్ చాలా గొప్ప ఇంజనీరు. నాకు చిన్నప్పట్నించీ తెలుసు" అన్నాడతను.

"మీరు ఏ రాలెక్ గురించి చెబుతున్నారో నాకు తెలియదు. ఈ రాలెక్ గతంలో చెకోస్లేవేకియా దేశస్థుడు. చిన్నప్పుడు జర్మనీలో లేడు. ఐనా తను ఇంజనీరు కాడు. కెమిస్ట్రీ డిపార్టుమెంట్. త్వరలో ప్రొఫెసరవతాడు" అన్నాను.

"అదే అదే, ఆ రాలెక్కే" అంటూ అతను తడబడి, "నీకు పెళ్లయిందా?" అన్నాడు.

ఈ ప్రశ్నకి నాలో లక్ష అనుమానాలు. "ఎందుకు?" అన్నాను ప్రశ్నకి బదులివ్వకుండా.

"నువ్వు చూడ్డానికి బాగున్నావు. బాగా చదువుకున్నావు. మంచి పొజిషన్లో ఉన్నావు. ఇక్కడే పెళ్లి చేసుకుని స్థిరపడ్డావంటే, నీ పని ఇంకా చాలా బాగుంటుంది. నాకు తెలిసిన మంచి జర్మన్ పిల్లలున్నారు. చాలా అందగత్తెలు. బుద్ధిమంతులు. నువ్వు ఊఁ అంటే ఎవరో ఒకరితో పెళ్లి ఏర్పాట్లు చేస్తాను" అన్నాడా వ్యక్తి.

ఊహించని ఈ ప్రపోజల్‌కి తెల్లబోయాను. వెంటనే త్రుంచెయ్యాలని, "సారీ, నాకు పెళ్లయింది" అన్నాను.

"నేను నమ్మను" అన్నాడతను వెంటనే.

"ఎందుకని?'

"ఇరవై నిండకుండా ఎవరైనా పెళ్లి చేసుకుంటారా?" అన్నాడతను.

"ఇరవై నిండనిదెవరికి, నాకా?" అన్నాను. అతను ఊఁ అనగానే, "మరి మీరు నాకెందుకు ప్రపోజ్ చేస్తున్నారు?" అన్నాను.

"ఇండియాకి తిరిగి వెళ్లిపోతావని భయపడి" అన్నాడతను.

"ఇండియాకి ఎలాగూ తిరిగెళ్లాలి. అక్కడ నా భార్య ఉంది కాబట్టి. నా వయసు కూడా ఇరవై కాదు. ముప్పై దాటాయి" అన్నాను.

"అన్నీ అబద్ధాలే" అని నవ్వేశాడతను.

"నమ్మడం నమ్మకపోవడం మీ ఇష్టం. నాకు పెళ్లవడమే కాదు, ఇద్దరు పిల్లలున్నారు. నా గదికొస్తే నా ఫామిలీ ఫొటో చూపిస్తాను" అన్నాను సీరియస్‌గా.

క్షణంపాటు ఆలోచనలో పడిన అతను ఆ వెంటనే నవ్వేశాడు. "అయినా ఫర్వాలేదులే, ఇండియన్ ఆడవాళ్లు వంటింటి కుందేళ్లు. మగాణ్ణి ఎలా అలరించాలో జర్మన్ వనితలకి తెలిసినట్లుగా మరెవ్వరికీ తెలియదు. సుఖపడాలంటే జర్మన్ వనితను పెళ్లాడాలి. నీకు ఇప్పటికే పెళ్లయితే కనుక నీ భార్యకి విడాకులిచ్చేసేయ్" అన్నాడు.

పెళ్లికి ఇలా కూడా ప్రపోజ్ చేసేవారుంటారని నేనూహించలేదు. అంతమాత్రాన అతను జర్మన్ పెళ్లిళ్ల పేరయ్యలకు ప్రతినిధిగానూ భావించలేదు. తిక్క మనిషో, లేక కాలక్షేపానికి నన్నెన్నుకున్నాడో అనుకున్నాను. '

అలాగని మౌనంగా ఊరుకోలేను కదా, "నా భార్య చాలా అందంగా ఉంటుంది. ఆమె విషయమై నాకు అసంతృప్తి లేదు. మేము ఎంత సంతోషంగా ఉన్నామంటే, జీవితాంతం కలిసే ఉంటాం తప్ప విడాకుల మాట కలలో కూడా అనుకోలేం" అన్నాను.

అతను నాకు నచ్చజెప్పడానికి కాసేపు ఏమేమో చెప్పాడు. చివరి ప్రయత్నంగా, "సరే, నీ భార్యకి విడాకులివ్వద్దు. నువ్విక్కడింకా ఏడాదుంటావుగా! అందాకా ఇక్కడో అమ్మాయిని పెళ్లి చేసుకుని, వెళ్లేముందు విడాకులిచ్చి వెళ్లిపో! ఎలాగుంది నా ఐడియా?" అన్నాడు.

అతనెవరో నాకు తెలియదు. ఉద్దేశ్యం నాకు తెలియదు. అతనితో మాటలు పెంచి లాభం లేదని గ్రహించి, "సారీ!" అని ఒకే ఒక ముక్క అని అక్కణ్ణించి ఇంచుమించుగా పారిపోయాను.

ఇల్లు చేరాక ఆలోచిస్తుంటే – సంప్రదాయంగా ఉండేవారికి ఇది చాలా ప్రమాదకరమైన దేశం కాదు కదా అని భయమేసింది. అందుకు కారణం కొంతవరకూ గోపాలకృష్ణన్. నాకంటే ఎక్కువ స్టయిపెండ్ వస్తున్న అతను – భార్యని ఇక్కడికి రప్పించుకుందుకు వెనుకాడాడంటే – అదే వివేకమేమో!

అప్పుడు నా మనసు నాపై జాలిపడింది. ఆ జాలి రాలెక్ నాపై చూపిందానికంటే ఎక్కువగా ఉంది.

ఇక్కడికొచ్చి ఐదు నెలలవుతోంది. ఇంతవరకూ నాకిక్కడ చిన్న ఇబ్బందైనా కలిగిందా?

జర్మన్ భాష నేర్చుకున్నాను. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాను. ఇల్లు కావాలంటే ఇల్లు దొరికింది. ఏ సాయం కావాలంటే ఆ సాయం చెయ్యడానికి ఇష్టపడి ముందుకొచ్చే ఇండియన్, జర్మన్ మిత్రులు దొరికారు. లాబొరేటరీలో సదుపాయాలే కాదు, వాతావరణం కూడా బాగుంది. ఏడాది తర్వాత ఇక్కణ్ణించి వెనక్కి వెడితే మళ్లీ నా ఉద్యోగం నేను చేసుకోవచ్చు.

ఇక్కడ నా ధనప్రాణాలకు పూర్తి రక్షణ ఉంది. ఇక్కణ్ణించి వెళ్లేక ఇండియాలో నా జీవితం మరింత ఉత్సాహభరితమౌతుంది.

చీటికీ మాటికీ నేనెందుకు భయపడుతున్నట్లు?

మనం ఎన్నుకునే మనుషల్ని బట్టి మనకి లభించే ప్రేరణ ఉంటుంది. నేను గోపాలకృష్ణన్‌కి బదులు దాస్‌ని ప్రేరణగా తీసుకుంటే!

సాహసవీరుడు దాస్

ఓం ప్రకాష్ మహాపాత్రా ద్వారా నాకు పరిచయమయ్యాడు దాస్. స్వరాష్ట్రం కేరళ. అక్కడ ఏదో కంపెనీలో సేల్స్ ఇంజనీరుగా పని చేస్తూ ఆ జీవితం విసుగుపుట్టి ఓ చార్టర్డ్ ఫ్లయిట్లో జర్మనీకి వచ్చి చేరాడు.

మన దేశంలోని చార్టర్డ్ ఫ్లయిట్సు వ్యవస్థ గురించి నాకప్పుడే తెలిసింది. ఆ ఫ్లయిట్సులో ప్రయాణానికి పాస్‌పోర్ట్ ఉంటే చాలు. రానూపోనూ టికెట్ తీసుకుని ఏ దేశానికైనా వెళ్లి ఉండొచ్చు. ఆ టికెట్ గడువుకాలం మూడు నెలలు. గడువైపోగానే స్వదేశానికి తిరిగి వెళ్లిపోవాలి.

దాస్‌కి సీదాసాదా రొటీన్ జీవితం నచ్చదు. లైఫ్‌లో ఏదైనా అడ్వెంచరుండాలంటాడు. అందుకని నాలుగువేల ఐదొందల రూపాయలు పెట్టి బెర్లిన్‌కి రానూపోనూ టికెట్ కొన్నాడు. బెర్లిన్ చేరుకున్నాక తిరుగు ప్రయాణపు టికెట్‌ని వేరెవరికో అమ్మేశాడు. అలా చాలామంది చేస్తుంటారుట.

దాస్ బెర్లిన్లో దిగేక ముందు ఏదైనా యూనివర్సిటీలో చేరి పై చదువులు చదవాలనుకున్నాడు. అందుకు ముందుగా జర్మన్ భాష నేర్చుకోవడం అవసరమని తెలిసి, అక్కడ జర్మన్ లాంగ్వేజి కోర్సులో చేరాడు.

జర్మన్లు మనలా కాదు. వారికి భాషాభిమానం ఎక్కువ. తమ భాష ప్రపంచవ్యాప్తి చెందాలన్న వారి తపన ఆదర్శప్రాయం.

భాష నేర్చుకుందుకుగానూ దాస్‌కి మూడు నెల్లపాటు ఆ దేశంలో ఉండడానికి అనుమతి లభించింది. అనుమతి ఐతే దొరికింది కానీ, అక్కడ రోజులు గడిచేదెలా?

దాస్ బెర్లిన్లో ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించాడు. కానీ భాష నేర్చుకునే విద్యార్థులు ఉద్యోగం చెయ్యకూడదన్న నిబంధన ఉందక్కడ. అదెంత ఖచ్చితమంటే, అలా చేసినవారు జైలుకెళ్లాల్సి రావచ్చు.

నియమాలూ, నిబంధనలూ పట్ల మన దేశంలో ఉన్న అవగాహనే వేరు. అవి పేరుకి మాత్రమే అని విద్యావంతులు కూడా భావించే దేశం మనది. ఇండియానుంచి వచ్చిన దాస్ అదే మనస్తత్వంతో, ఈ విషయమై జర్మనీలోనూ ఏదో అడ్డదారి దొరక్కపోదని గట్టిగా నమ్మాడు.

నమ్మికతో ప్రయత్నిస్తే ఎంతటి పకడ్బందీ వ్యవస్థలోనూ లొసుగులుంటాయి. ఎన్ని పాశ్చాత్యదేశాల్లో అక్రమ వలసదారులు లేరు?

దాస్‌కి జర్మనీలో ప్రయివేట్ సంస్థలు అక్కరకొచ్చాయి. మామూలుగాకంటే తక్కువ జీతానికొప్పుకుని, రహస్యంగా అతను చేసిన ఉద్యోగాల్లో – టాయిలెట్ క్లీనింగు ఒకటి. అతను ఏంచేస్తున్నానని ఆలోచించలేదు. జీతమెంతా అని చూసుకున్నాడు. అది అవసరానికి మించే వస్తోందని ఉత్సాహపడ్డాడు.

ఉద్యోగమూ, సంపాదనా మాత్రమే ప్రధానమైతే దాస్ ఇండియాలోనే ఉండేవాడు. అక్కడ చదవడంలో పస లేదనీ, జర్మనీలాంటి దేశంలో చదవాలనీ అతనికి మనసు. జర్మన్ లాంగ్వేజ్ కోర్సులో ప్యాసైతే, అతనికి చదువుకుంటూనే ఉద్యోగం చెయ్యడానికి అనుమతి లభిస్తుంది. కానీ దురదృష్టం – ఇంతవరకూ రెండుసార్లు పరీక్షకు కూర్చుని,రెండుసార్లూ తప్పాడు. మళ్లీ కూర్చుంటే ప్యాసౌతానా అన్న బెంగ అతనికుంది.

దాస్‌కి జర్మనీ నచ్చింది. అలాంటిచోటనే స్థిరపడాలని మనసౌతోంది. అందుకని తన వంతు ప్రయత్నాలు చేస్తున్నాడు.

లాంగ్వేజ్ కోర్సు ప్యాసయ్యాక అక్కడుండి చదువుకునేందుకు అనుమతి లభిస్తుంది. కానీ చదువుకి డబ్బు బాగా ఖర్చవుతుంది. చిన్న ఉద్యోగంమీద వచ్చే ఆదాయం చదువుకు సరిపోకపోవచ్చు. కాబట్టి ఎప్పటికప్పుడు ఎలాగో అలా వీలైనంత సంపాదించి డబ్బు బాగా కూడబెట్టి దగ్గరుంచుకోవాలనుకున్నాడు. అందుకని ఒకటికి మించి ఉద్యోగాలు చెయ్యాలనుకున్నాడు. ఆ ఉద్యోగాల వేటలో ఇటీవలే పేపర్‌బాయ్ ఉద్యోగం దొరికింది.

దాస్ రోజూ తెల్లవారు ఝామున మూడున్నరకి లేచి ఆ ఉద్యోగానికి వెడతాడు. దినపత్రికల్ని ఓ ట్రాలీలో ఉంచి, దాన్ని తోసుకుంటూ ఇంటింటికీ వెళ్లి, ఇంటిముందుండే లెటర్ బాక్సులో పత్రిక ఉంచాలి. ఆ విధంగా అతను పత్రిక ఇవ్వాల్సిన ఇళ్లు రోజుకి మూడొందలు. మూడున్నరకి మొదలెడితే గంటన్నరలో అంటే ఐదు లోగా ఆ పని ఐపోతుంది. ఒక పత్రికకి పది ఫెన్నిగ్సు కమిషన్‌గా వస్తుంది. అంటే రోజుకి ముప్పై మార్కులు. మన దేశంలో కూలితో పోలిస్తే – అతను పడే శ్రమకి ఆ ప్రతిఫలం బాగా ఎక్కువే.

ఎటొచ్చీ ఈ పనిలో దాస్‌కో ఇబ్బందుంది. అతను పత్రికలు పంచే వేళలో కాపలా పోలీసులు తిరుగుతుంటారు. వారి కంటపడితే, వాళ్లతన్ని ఐడెంటిటీ కార్డు చూపమంటారు. దాస్ విదేశీయుడు కాబట్టి పాస్‌పోర్ట్ చూపాలి. పాస్‌పోర్టులో అతనికి రెసిడెన్స్ పెర్మిట్ లేదు. అది లేకుండా ఉద్యోగం చెయ్యడం నేరం. జైలు శిక్ష పడుతుంది.

పోలీసుల కంటపడకుండా తప్పించుకుంటూ రెండు మూడు నెలలుగా ఈ ఉద్యోగం చేస్తున్నాడు దాస్. కొంత డబ్బు కూడబెట్టగలగడం వల్ల తృప్తి. సాహసము చేయరా డింభకా అన్న మనసుకి సంతృప్తి. దాస్ సంతోషంగానే ఉంటున్నాడు.

అందుకు కారణం అతడి మనస్తత్వం మాత్రమే కాదు – అతడుంటున్న హాస్టలు కూడా!

బెర్లిన్లో హాస్టల్ ముచ్చట్లు

బెర్లిన్‌లో లియోపాల్డ్ ప్లాట్జ్ అనే ప్రాంతంలో ఒక హాస్టలుంది. అందులోనే గుప్తా ఉంటున్నాడు. ఓం ప్రకాష్ కూడా అందులోనే ఉంటున్నాడు. అతనికోసం గోపాలకృష్ణన్ కూడా అందులోకి మారాడు. దాస్ ఉండేదీ అక్కడే కానీ, అక్కడ అతని ఉనికి అజ్ఞాతం.

ఆ హాస్టల్లో ఉన్నవాళ్లలో చాలామంది ఇండియన్స్. అంతా వివిధ ప్రాంతాలకు చెందినవారైనా అందరిమధ్యా ఎంతో సంఘీభావముంది. అక్కడే నేనో విషయం గ్రహించాను – దేశపుటెల్లలు దాటేక ఒకరినొకరు కలుసుకున్నప్పుడు భారతీయుల్లో ప్రాంతీయ వ్యతిరేక భావాలు తొలగిపోయి మనం భారతీయులం అనే జాతీయభావం నెలకొనే అవకాశముంటుందని.

ఆ హాస్టల్లోనూ ఒక రావ్ ఉన్నాడు. అతను కన్నడిగుడు. తెలుగు మాట్లాడ్డం బాగా వచ్చు. తెలుగు బాగా వచ్చిన మరో కన్నడిగుడు నాని కూడా అక్కడే ఉంటున్నాడు. అతని అసలు పేరేమిటో కానీ అంతా నాని అంటారు. దాస్ వీళ్ల రూంలో ఉంటున్నాడు.

హాస్టల్‌కి అతిథులు వస్తూపోతూండొచ్చు. కానీ అక్కడే ఉండిపోకూడదు. అలా ఉండిపోతే హాస్టల్ వార్డెన్ పట్టుకుంటాడు. అతను ప్రతి రోజూ రాత్రిళ్లు ప్రతి గదినీ తనిఖీ చేసి వెడుతుంటాడు. అతని కళ్లు కప్పి అక్కడుండడం అంత సులభం కాదు.

సాహసవీరుడు దాస్ అలాగే అక్కడ కొనసాగుతున్నాడంటే, అందుకు ఇండియన్ మిత్రుల సంఘీభావమే కారణం. వాళ్లు దాస్‌కి ఆసరా ఇవ్వడానికి అడుగెత్తుండే పెద్ద పరుపునొకదాన్ని సంపాదించి గదికి తెచ్చారు. అదెలాగంటే –

పాశ్చాత్యదేశాల్లో పాత సామాన్లు అమ్మడం అరుదు. అలాగని వాటిని కలకాలం దాచుకోరు. త్వరత్వరగా పాతవి మార్చి కొత్తవి కొంటుంటారు. అలాంటప్పుడు పాత వస్తువుల్ని తాముండే వీధిలో రోడ్డుకి పక్కన ఉంచుతారు. కావాలనిపిస్తే ఎవరైనా పట్టుకుపోవచ్చు. లేదా పురపాలకసంఘం వాళ్లు పట్టుకుపోతారు. మనకి ఆశ్చర్యంగా అనిపించే ఈ వింత పాశ్చాత్య ఆచారం జర్మనీలోనూ ఉంది.

అలా ఓంప్రకాష్ ఓ పాత టెలివిజన్ తెచ్చుకుని రూంలో పెట్టుకుని వాడుతున్నాడు. అడుగెత్తుండే ఈ పరుపుని కూడా హాస్టల్ వాసులు అలాగే తెచ్చుకున్నారు. ఆ పరుపు యజమాని దాన్ని ఎందుకు బయట పెట్టేసాడో కానీ – అది కొత్తగా, మెత్తగా, హాయిగా ఉంది.

దాస్ ఆ పరుపుమీద పడుకునేవాడు. పగటిపూటా, రాత్రిళ్లు వార్డెన్ చెకింగుకి వచ్చినప్పుడూ – ఆ పరుపుని గదిలో మంచం కిందకి తోసేసేవారు. అదనపు పక్క లేకపోతే, గదిలో ఎందరు మనుషులున్నా వార్డెన్ పట్టించుకోడు. ఒకే మంచంమీద ఒకరికి మించి పడుకోగలరన్నది ఆయనకి నమ్మశక్యంకాని విశేషం.

ఇలాంటి జీవితంలో దాస్‌కి ఏం సంతోషం కలిగిందో, కలుగుతోందో నాకు తెలియదు. తను ఇండియాలో సేల్స్ ఇంజనీరుగా ఉంటూ నెలకి రెండు వేలు తక్కువ కాకుండా సంపాదించేవాడుట. అప్పట్లో అది చాలా పెద్ద జీతం. ఇండియాలో అప్పుడు నా జీతం అందులో సగం కూడా లేదు.

ఆ జీవితాన్ని వదిలి, ఇప్పుడు ఏదో విధంగా జర్మన్ పరీక్ష ప్యాస్ కావాలని తపిస్తున్న అతనిమీద నాకు జాలి కలిగింది. చిత్రమేమిటంటే అతను నా వివరాలడిగి, భార్యాబిడ్డల్ని రప్పించుకునే ప్రయత్నంలో ఉన్నానని తెలిసి, "నీకేమైనా సాయం కావాలనిపిస్తే నేనున్నానని మర్చిపోకు" అని ధైర్యం చెప్పాడు.

ఇండియాలో ప్రభుత్వోద్యోగిని. ఇక్కడ జర్మనీలో నీడపట్టున ఉంటూ ప్రభుత్వమిచ్చే స్కాలర్‌షిప్‌తో కడుపులో చల్ల కదలకుండా రోజులు గడుపుతున్నాను నేను. అనుక్షణం భయంభయంగా జీవితం గడుపుతున్నాడు దాస్. అతను నాకు సాయపడతాట్ట.

ఆత్మవిశ్వాసానికి ఇంతకంటే గొప్ప ఉదాహరణ ఉంటుందా?

దాస్‌ని చూసేక, అతని మాటలు విన్నాక – చాలా విషయాల్లో నా దృక్పథం మారింది.

నిజం నిజమే. దానికి మంచి, చెడు అనేవి మనసు కల్పించినవే తప్ప వాటికి ఇదమిత్థమనే నిర్వచనం లేదు.

దాస్ రెసిడెన్స్ పెర్మిట్ లేకుండా ఉద్యోగం చేస్తున్నాడన్నది నిజం.

అది చెడ్డ పని. తప్పు. నేరం. సుఖమైన జీవితాన్ని వదిలి ఈ జీవితాన్ని ఎన్నుకోవడం తెలివితక్కువతనం. పై నిజానికి నేను చేర్చిన విశేషణాలివి. వాటిని నా మనసు కల్పించింది.

దాస్‌కి సంబంధించి – అతను ఈ జీవితాన్ని సవాలుగా స్వీకరించాడు. సవాలు లేని జీవితం అతనికి నచ్చదు.

నన్ను తీసుకుంటే – నా భార్యాబిడ్డల్ని ఇక్కడికి రప్పించుకోవడమనే విషయం నాకు సవాలుగా పరిణమించింది. ఆ మాత్రం సవాలుని నేను ఆత్మవిశ్వాసంతో స్వీకరించలేనా?

శ్రీమతిని జర్మనీకి రప్పించాలన్న నా ఆకాంక్ష దాస్ కారణంగా మరింత బలపడింది.

బెర్లిన్లో ఆ హాస్టల్ని నాకు చిరస్మరణీయం చేసింది దాస్ మాత్రమే కాదు. మరెన్నో అనుభవాలున్నాయి.

మరిన్ని హాస్టల్ ముచ్చట్లు

నేను లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టలుకి తరచుగానే వెడుతుండేవాణ్ణి.

అక్కడ ఒక రూంలో ఒక సిరియన్ ఉన్నాడు. అతనికి మూవీ ప్రొజెక్టరుంది. తరచుగా నీలి చిత్రాలు తెచ్చి వాటి ప్రదర్శనకు పదిమందినీ పిలిచేవాడు. నాతో ఆట్టే పరిచయం లేకపోయినా ఒక రోజున నన్నూ బలవంతపెట్టి తన గదికి తీసుకుపోయాడు. అక్కడ తెలిసినవాళ్లు కొందరున్నారు కానీ వాళ్లలో ఓంప్రకాష్ లేడు.

నీలి చిత్రాన్ని ఓ గదిలో అంతమంది మిత్రులమధ్య కూర్చుని చూడ్డం ఓ వింత అనుభవం.

నేను ఫిక్షన్ ప్రియుణ్ణి. ఏ చిత్రం చూసినా ముందు కథకోసం వెదుకుతాను. విశేషమేమిటంటే ఈ నీలి చిత్రంలో కొంచెం కథ ఉంది.

ఒక భర్త భార్యని అనుమానించాడు. తను బయటకు వెడుతున్నట్లు ఆమెను నమ్మించాడు. భార్య ఫోన్ చేసి ప్రియుణ్ణి ఇంటికి రప్పించుకుంది. భర్త వాళ్ల వ్యవహారాన్ని రహస్యంగా గమనిస్తుంటాడు. ప్రియుడామెతో శృంగారం మొదలుపెడతాడు. పచ్చితనం మొదలు. నరాలు తెగిపోయేలా సంగీతం. ఆడది పరవశంతో చేసే హాహాకారాలు. వాటికి మురిసిపోతూ ఉద్రేకపడే పురుషపుంగవుడు. సాధారాణంగా దంపతులమధ్య జరిగే నెలరోజుల భంగిమలు – అక్క డొక గంటలో ప్రదర్శించబడ్డాయి.

భర్త ఇదంతా చూస్తున్నాడు. అతని కళ్లలో కోపం, క్రూరత్వం. అయినా మనలాంటి ప్రేక్షకులకోసం భరించి మొత్తం దృశ్యాలన్నీ ఓపికగా చూస్తాడు. భార్య దుస్తులు తొలగిస్తుంటే అదోలా చూస్తాడు. ఆమె పరవశానికి చలిస్తాడు. ఆ జంట శృంగార చేష్టలకి మథనపడతాడు. ప్రియుడు తన భార్యని అనుభవిస్తుంటే కృంగిపోతాడు. శృంగారం పరాకాష్ఠకు చేరుకుని, ఆ జంట సోలిపోయినప్పుడు ఆ ఇద్దర్నీ కాల్చి చంపి అక్కణ్ణించి వెళ్లిపోతాడు. అదే ముగింపు. అంటే అది విషాదాంత చిత్రం.

ఆ సినిమా చూస్తుంటే – అప్పటికప్పుడు స్త్రీకి ఓ పురుషుడూ, పురుషుడికి ఓ స్త్రీ కావాలనిపిస్తుంది. ఆ సినిమా ప్రభావంనుంచి బయటపడ్డానికి కాసేపు పట్టింది నాకు.

అక్కణ్ణించి ఓంప్రకాష్ గదికి వెళ్లాను. అతను నన్ను చూసి చాలా ఉత్సాహపడ్డాడు. తను రోడ్డుమీంచి తెచ్చుకున్న టివిని బాగు చేసి బొమ్మ వచ్చేలా చేశాడుట. నేను వెళ్లేసరికి టెలివిజన్లో ఓ మంచి కార్యక్రమం వస్తోంది. అందమైన బాతుల జంట కేంద్రంగా ఎన్నో మనోహర ప్రకృతి దృశ్యాల్ని ఇముడ్చుకున్న కార్యక్రమమది. మనసునిండా ఆహ్లాదం పరచుకుంది. మానసిక ప్రశాంతతకి ప్రకృతి దృశ్యాలను మించినదేదీ లేదనిపించింది.

ఒకే దేశం. రెండు విభిన్న కార్యక్రమాలు. రెంటికీ ఎంత భేదం?

ఆ హాస్టల్లో సరదాకబుర్లకి లోటు లేదు.

ఒకసారి నేను హాస్టలుకి వెళ్లగానే కన్నడ రావ్ ఎదురయ్యాడు. అతని క్రాపు కొత్తగా తమాషాగా బాగుంది. ఆ విషయం అతనికి చెప్పి మెచ్చుకున్నాను.

రావ్ సంబరపడలేదు. చిన్నబుచ్చుకుని వెళ్లిపోయాడు.

నావల్ల ఏదో పొరపాటు జరిగిందనిపించింది. ఓంప్రకాష్ రూంకి వెళ్లి జరిగింది చెప్పాను. అంతే, కాసేపతను పడిపడి నవ్వాడు.

రావ్ కథేమిటంటే –

ఒక రోజు ఓంప్రకాష్ గోపాలకృష్ణన్‌కి ట్రిమ్మరు గురించి చెప్పాడు. ట్రిమ్మరు అంటే లోపల బ్లేడులమర్చిన దువ్వెన. దాంతో తల దువ్వుకుంటే, జుట్టు ఎప్పుడూ ఒకే సైజులో ఉంటుంది. చెంపలు మాత్రం పెరుగుతాయి. మంగలి ఖర్చులు ఆదా చేసుకుందుకు అదో ఉపాయం. అలాంటిది బెర్లిన్ వచ్చేముందు నటరాజన్ ట్రయిన్లో కొరియామీద ప్రయోగించాడు. అదే ప్రయోగం ఈ హాస్టల్లో ఓంప్రకాష్

గోపాలకృష్ణన్‌మీద చేశాడు. అంతా ఓంప్రకాష్ ప్రావీణ్యాన్ని మెచ్చుకున్నారు. ఎంతలా అంటే, కన్నడ రావ్ కూడా ఓంప్రకాష్‌కి కస్టమర్ కావాలని ఆత్రపడ్డాడు.

ఓంప్రకాష్ చాలా ఉత్సాహపడ్డాడు. "ఇన్నాళ్లూ ప్రయోగాలు మాత్రమే చేస్తున్నాను. ఈరోజు నాలో ప్రొఫెషనల్‌ని చూస్తావు" అని గర్వంగా ప్రకటించాడు. పక్కరూంనుంచి ఓ రివాల్వింగ్ ఛెయిర్ తెచ్చి రావ్‌ని అందులో కూర్చోబెట్టాడు. అతని చొక్కా కాలరు లోపలకి మడత పెట్టాడు. ఓ తెల్ల గుడ్డని తెచ్చి రావ్ భుజం చుట్టూ కప్పాడు.

"ట్రిమ్మర్ కటింగ్ కదా! కదిలితే అభాసౌతుంది. బుద్ధిగా కూర్చో" అని రావ్‌కి చెప్పి ట్రిమ్మర్ని కుడి చెంపకి ఆనించాడు.

తన్ను తాను ప్రొఫెషనల్‌గా నిరూపించుకోవాలన్న తాపత్రయంలో కాబోలు – అతని ట్రిమ్మరు కొంచెం దారి తప్పింది. రావ్ చెంపల పక్కన ఎక్కడో కొద్దిగా తెగింది. ఉడుకురక్తమేమో – ఎర్రగా పొంగి ఓంప్రకాష్‌నే విభ్రాంతుణ్ణి చేసింది.

కన్నడ రావ్‌కి చురుక్కుమన్న స్పర్శలో మంట తెలిసింది. ఓంప్రకాష్ చూపులా మంటకి ఆజ్యం పోసి అతన్ని భయవిహ్వలుణ్ణి చేశాయి. అప్పుడతనికి మొహమాటం వగైరాలేం తెలియలేదు. అప్రయత్నంగా కెవ్వుమన్నాడు.

కూతలతో, విరుపులతో రాక్ పాటలు పాడుతున్నప్పుడు కూడా ఆశాభోంస్లే కుదురుగా నిలబడి ఉంటుంది. గొంతులో పలికే వణుకులు శరీరంలో ఏమాత్రం స్ఫురించనివ్వదు. అదామెకెలా సాధ్యమో కానీ, అలాంటి పాటలకు కిషోర్ కుమార్ ఐతే గొంతుకంటే ఎక్కువగా మనిషి ఊగిపోతాడు. అదే ఎక్కువ సహజమనిపిస్తుంది.

ట్రిమ్మర్ తాకిడి చురుక్కుమన్నప్పుడు రావ్ అరుపులో రాక్ పాట పలకలేదు కానీ, తనువు మాత్రం కిషోర్‌కిలాగే ఊగిపోయింది. ఆ కదలడంలో ట్రిమ్మర్లో ఇరుక్కున్న అతని జుట్టు అడ్డదిడ్డంగా తెగింది.

ఎలాగో ప్రయత్నించి ట్రిమ్మరునుంచి విడివడి కుర్చీలోంచి చటుక్కున లేచి నిలబడ్డాడు రావ్. అంతే, భుజాన్ని కప్పిన తెల్లగుడ్డ – పైన చిన్న రక్తపు మరకని సింధూరంలా ధరించి కిందకు జారింది.

రావ్ కేక – మకరికి చిక్కిన కరి వేడ్కోలులా – ఆ సౌధంలోని మూల మూల గదుల్ని కూడా చేరింది. ఐనా 'సిరికిం చెప్పకుండా'ఆత్రంగా బయల్దేరే బ్యాచి వాళ్లు ఎందరో ఉండరు కదా! ఓ ఇద్దరు మాత్రం పరుగున ఆ గదిలోకి అడుగెట్టారు. వాళ్లు రావ్‌ని తేరిపార చూసి, విన్న కేక గురించి కూడా మర్చిపోయి, "హెయిర్ స్టయిల్ చాలా బాగుందే, ఏ సెలూన్‌కి వెళ్లావ్?" అన్నారు.

ఓంప్రకాష్ ముఖంలో చిరుగర్వం. అతను కొంచెం ముందుకి వంగి ఆ ఘనకార్యం తనదేనన్నట్లు, "థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్" అన్నాడు.

అంతవరకూ భయం, ఆక్రోశం నిండిన రావ్ మనసులో ఆశకి కొంచెం చోటు దొరికింది. చప్పున వెళ్లి అక్కడున్న అద్దం ముందు నిలబడ్డాడు.

కొత్త క్రాపుతో కనిపించిన ప్రతిబింబం ఏడుపొక్కటే తక్కువన్నట్లు అతన్ని చూసింది.

రావ్ చలాకీ యువకుడు. ఎప్పుడూ నీటుగా ఉంటాడు. ఫ్యాషన్ విషయంలో చాలా శ్రద్ధ వహిస్తాడు. జుట్టు పొడవుగా పెంచాడు. తరచుగా డిస్కొతేక్స్‌కి వెళ్లి అమ్మాయిలతో డ్యాన్సులు చేస్తాడు. అతనికో గర్ల్‌ఫ్రెండ్ ఉంది. "ఎలా ఉంది – ఓంప్రకాష్ సెలూన్" అన్నాడు ఓంప్రకాష్ గర్వం మేళవించిన ఉత్సాహంతో.

రావ్ కళ్లు వెంటనే ఆ గదంతా వెదికి ఓ టోపీని కనుగొన్నాయి. అతని కాళ్లు క్షణాలమీద టోపీ దగ్గరకు నడిపించాయి. ఆవెంటనే చేతులు అతని తలని ఆ టోపీలో దాచేశాయి.

"ఎలా ఉంది ఓంప్రకాష్ సెలూన్!" మళ్లీ అడిగాడు ఓంప్రకాష్.

రావ్ బదులివ్వలేదు. మాట్లాడకుండా గదిలోంచి బయటకు వెళ్లాడు. హాస్టల్లోంచి రోడ్డుమీదకి వెళ్లాడు. కనిపించిన సెలూన్లో దూరాడు.

సెలూన్ కాళీగానే ఉంది. జర్మన్ మంగలి అతన్ని పరీక్షగా చూసి ఫక్కున నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్" అడిగాడు రావ్.

"ఇంతవరకూ నాదగ్గరికి ఎవరొచ్చినా క్షౌరానికే వచ్చారు. మొదటిసారిగా జుట్టు మరమ్మతుకొచ్చిన మనిషిని చూస్తున్నాను" అన్నాడు జర్మన్ మంగలి.

అతనికి తన అవసరం అర్థమైందని గ్రహించినవాడై, "థాంక్స్! పరిస్థితి అర్థం చేసుకున్నావ్" అన్నాడు.

జర్మన్ మంగలి అతనికి సారీ చెప్పి, "నేను మరమ్మతులు చెయ్యను" అన్నాడు.

అతనా మాట చాలా ఖచ్చితంగా అన్నట్లు తెలిసినా, "కానీ రెగ్యులర్ కస్టమర్సుకి చెయ్యగలవు, చెయ్యగలవు, చెయ్యగలవు" అన్నాడు రావ్ హిప్నొటైజ్ చేస్తున్నట్లు.

రావ్ కళ్లలోకే చూస్తున్న జర్మన్ మంగలి, హిప్నొటైజ్ కాలేదు కానీ, అతని కళ్లలోని దైన్యానికి కరిగిపోయాడు.

"చేస్తాను కానీ డబుల్ ఛార్జి ఔతుంది" అన్నాడు. రావ్ సరేనన్నాడు. అతను రావ్ పొడవాటి జుట్టుని బాగా కత్తిరించి, పొట్టిగా స్ట్రూకట్ చేశాడు.

రావ్ అద్దంలో చూసుకుని, "ఇంతకంటే గుండే నయం" అన్నాడు.

మంగలి వెంటనే, "నీకు గుండు ఇష్టమని ముందే చెబితే డబల్ ఛార్జి అడిగేవాణ్ణా? హాఫ్ ఛార్జికే చేసేవాణ్ణి" అన్నాడు.

ఆ క్రాపు విషయమై రావ్ చాలా దుఃఖంలో ఉన్నాడు. ఎవరు అతన్ని చూసినా ఓసారి క్రాపు విషయం ఎత్తి బాగుందని మెచ్చుకుంటున్నారు. రావ్‌కి అది ఎగతాళిగా అనిపిస్తోంది.

ఆ నేపథ్యం తెలియక నేనా క్రాపుని పొగిడాను. అతనది వేళాకోళమే అనుకున్నాడు. కానీ పొడుగుజుట్టుకంటే ఆ క్రాపే అతనికి బాగా నప్పిందని నిజంగానే నాకనిపించింది. అతను నమ్మే స్థితిలో లేడు.

ఓంప్రకాష్ కథ పూర్తయ్యేసరికి రావ్ ఆ గదిలోకొచ్చాడు.

"నీకు నేను చేసిన క్రాపే బాగుందని రావు అంటున్నాడు" అన్నాడు ఓంప్రకాష్ అతన్ని చూసి.

"నువ్వు ఎంతమందిచేతైనా రికమెండేషన్లు చేయించుకో. నేను నీకు సెలూన్ ఫీల్డులో ఛాన్సు రానివ్వను. నా పాత ఫొటో ఉందిగా – దానిపక్కన ఇప్పటి ఫొటో పెట్టానంటే సరి" అన్నాడు రావ్.

ఓంప్రకాష్ నవ్వి, "ఐతే నేను చేసిన క్రాపుతో ఫొటో తీయించుకుని శాశ్వతంగా దాచుకుంటావన్న మాట!" అన్నాడు.

రావ్ మొహంలో ఇరిటేషన్. "అమ్మో! నోరు జారాను. ఈ క్రాపుతో ఫొటో ఉండడానికి వీల్లేదు. నా జుట్టు ఎదిగేదాకా ఎలాగో టోపీలతో మ్యానేజి చేస్తాను" అన్నాడు.

"క్రాపింగు గురించి ఇంత వర్రీ ఔతున్నావా? ఎలాగూ ఎదిగే జుట్టే కదా, దానికింత రభసెందుకు?" అన్నాను.

"పెళ్లయినవాడివి. నా బాధ నీకు తెలియదు" అన్నాడు రావ్.

"పెళ్లి కాకపోయినా గర్ల్‌ఫ్రెండుందిగా నీకు?" అన్నాను.

"పెళ్లానికీ, గర్ల్‌ఫ్రెండుకీ చాలా తేడా ఉంది. గర్ల్‌ఫ్రెండ్ అవసరం రాత్రిళ్లే గుర్తుకొస్తుంది. పెళ్లాన్నయితే పగలనక, రాత్రినక ఎన్నాళ్లయినా భరించాలి. మనం దేశాలు తిరిగితే తననీ దేశాలు తిప్పాలి" అన్నాడు రావ్. అప్పుడతని గొంతులో అహమ్మద్ వినిపించాడు నాకు.

"నువ్వన్నది నిజమే! నేను నా భార్యనిక్కడికి తీసుకు రావాలనుకుంటున్నాను" అన్నాను.

అంతవరకూ వేరే మూడ్‌లో మాట్లాడుతున్న రావ్ చటుక్కున నాకు షేక్‌హ్యాండిచ్చి, "కాస్త ఆలస్యంగానైనా చాలా మంచి నిర్ణయం తీసుకున్నావు. ఇక్కడ నీకేం భయం లేదు. మేమంతా ఉన్నాం" అన్నాడు.

ఆర్థికంగా బక్కప్రాణిని. చొరవ తక్కువ మనిషిని. స్వంత డబ్బుతో భార్యాబిడ్డల్ని ఇక్కడికి తీసుకురావడమన్నది మామూలు నిర్ణయం కాదు. అడుగు ముందుకు పడుతున్నా మనసంతా భయమే! అలాంటప్పుడు నాకు కావాల్సింది మోరల్ సపోర్ట్.

రావ్ మాటలు నాకు ఉత్సాహాన్నివ్వగా థాంక్స్ చెప్పాను.

అప్పుడు ఓంప్రకాష్ నాకోసం అద్దె ఇల్లు వెదకడంలో తను చెయ్యబోయే ప్రయత్నాల గురించి ప్రస్తావించాడు. ఇక ఆ అవసరం లేదనీ, ఒలోముచ్‌కీ ఇల్లివ్వడానికి ఒప్పుకున్నదనీ చెప్పాను.

ఓంప్రకాష్ ఎగిరి గంతేసినంత పని చేసి, "ఈ బెర్లిన్ మహానగరంలో అత్యంత కష్టమైన పని – ఇల్లు సంపాదించడం. అది సాధించావంటే నువ్వు చాలా అదృష్టవంతుడివి. ఇక నువ్వు ఫిబ్రవరిదాకా ఆగడమెందుకు? వెంటనే నీవాళ్లను రప్పించుకోవచ్చుగా" అన్నాడు.

"ఔను, ఈ ఆలోచన నాకెందుకు రాలేదు?" అనుకున్నాను. కానీ నాకు తెలుసు – ఆ ఆలోచన ఎందుకు రాలేదో!

ఇంకా నవంబరు మధ్యలో ఉన్నాను. ఇండియాలో నావాళ్ల ప్రయాణానికి డబ్బు ఏర్పాట్లు చెయ్యాల్సి ఉంది. అందుకు కాస్త సమయం కావాలి.

ఏదేమైతేనేం, దేశం కాని దేశంలో ఉన్నానన్న భావం నాలో పోయింది. నేను ఒంటరిని కాననీ, ఇక్కడకూడా నా వాళ్లు చాలామందే ఉన్నారనీ ధైర్యమొచ్చింది.

అది చాలు – నేను ప్రయాణ సన్నాహాల జోరు పెంచడానికి!

ప్లేనుకి వేళాయెరా

ఇండియానుంచి శ్రీమతి ఉత్తరం వచ్చింది.

మామూలుగా ఐతే తననుంచి ఉత్తరం రాగానే నాలో ఏదో తెలియని ఉత్సాహం కలిగేది. ఉత్తరం విప్పగానే తనే పక్కన కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపించేది. అది మాటలకందని రసానుభూతి.

ఈ ఉత్తరం అలాంటిది కాదు. నేనీ ఉత్తరంకోసం ఆత్రుతగా, భయంగా, బెంగగా ఎదురుచూస్తున్నాను. ఓ జీవన్మరణ సమస్యకు పరిష్కారాన్ని ఇముడ్చుకున్న మహత్తర లేఖ నాకది.

కవరు చింపాలంటే తొట్రుపాటు. అలాగే చింపాను.

చదవాలంటే భయం. అలాగే చదివాను.

ముందుగా మాకు ధనసహాయం అందించగల సత్తా ఉన్న బంధువుల గురించి వ్రాసింది. వాళ్లు చాలామందే ఉన్నారు కానీ అందరికీ ఒక్కుమ్మడిగా ఏవో ఇబ్బందులొచ్చాయిట.

తర్వాత సత్తా లేనివాళ్లు కొందరి గురించి వ్రాసింది. వాళ్లు తెగ బాధ పడిపోయి – 'మాకే సత్తా ఉంటేనా, మా అవసరాలన్నీ పక్కకునెట్టి, మీ అవసరానికి ఆదుకునే అదృష్టం మాకు కలిగిందని మురిసిపోయేవాళ్లం' అని మావాళ్లే ఓదార్చాల్సిన స్థాయిలో ఘొల్లుమన్నారుట. ఎవర్నించైనా మాటలే తప్ప పైసా రాలడం లేదుట.

ఇక మామగారైతే తన పలుకుబడి ఉపయోగించడానికి స్వయంగా రంగంలో దిగేరుట. అప్పు తీసుకుంటాననీ, అదీ బంధువులు కానివారినుంచి మాత్రమేననీ అంటున్నారుట. వడ్డీ ఎంతైనా తనే భరిస్తాననీ, ఎలాగైనా 'మమ సుత' జర్మనీ వెళ్లి తీరాలనీ మరీ మరీ చెబుతున్నారుట.

తన కూతురికి విదేశాలకి వెళ్లే అవకాశమొస్తే, ముఖ్యంగా అప్పట్లో, ఏ తండ్రికైనా కలిగే సంతోషానికి అదుపుండదు. నా మామగారు తన బిడ్డల్ని ప్రాణప్రదంగా ప్రేమించిన వ్యక్తి. పెళ్లి చేసి పంపేసేక కూడా, ఆడపిల్లల ఔన్నత్యానికి తన వంతు బాధ్యత ఉన్నదనుకునే ఆదర్శమాయనది.

శ్రీమతిని నాతోపాటు జర్మనీ పంపడానికి ఆయన ఎప్పుడో చొరవ తీసుకుని ఉండేవారు. దేశం కాని దేశంలో స్కాలర్‌షిప్పుమీద బ్రతికే నేను, అక్కడొచ్చే డబ్బుతో భార్యాబిడ్డల్ని కూడా పోషించగలనా అన్నది ఆయన సందేహం. అది నన్నడిగి తీర్చుకుందామంటే – నామీద మానసికంగా ఒత్తిడి పడుతుందని భయం. నిజానికి ఆదిలో ఐతే నేను నావాళ్లను జర్మనీకి తీసుకెళ్లాలనుకోలేదు.

మామగారి బంధువర్గంలో విదేశాలు వెళ్లినవారు కొందరున్నారు. కానీ వాళ్లు పెళ్లి కాకుండా వెళ్లారు.

నేనిప్పుడు శ్రీమతిని జర్మనీకి తీసుకెళ్లే ఉద్దేశ్యంలో ఉన్నానని తెలియగానే – మామగారి సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఆమె ప్రయాణపు ఖర్చులు ఎలాగో అలా తనైనా భరించాలని అనుకుంటున్నారాయన.

కానీ నాకది ఏకోశానా ఇష్టం లేదు. ఎందుకంటే మన సమాజం తీరుతెన్నులు బాగా తెలుసు నాకు. అక్కడ అల్లుడికిచ్చిన డబ్బు గోడకి వేసిన సున్నంలాంటిది. అడిగి వసూలు చేసుకోలేరు. అల్లుడే తిరిగిస్తానని బలవంతపెట్టినా పుచ్చుకోలేరు.

'నీ మావ బాకీ వసూలు చేశాడా, ఏం కూతురికోసం ఆ మాత్రం చెయ్యలేడా?' అని అల్లుడికి ఎక్కించేవారుంటారు.

'అల్లుడి దగ్గర బాకీ వసూలేమిటోయ్, మరీ అంత డబ్బు కక్కుర్తి పనికిరాదు' అని మామగారిని ఈసడించేవారూ ఉంటారు.

విషయం వాళ్లిద్దరికీ సంబంధించినదే ఐనా – బట్టబయలు కాక తప్పదు. అందుకే మామా అల్లుళ్ల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలుండకూడదన్న విషయాన్ని నా ఆదర్శాల జాబితాలో ఎప్పుడో చేర్చేశాను.

మామగారు లక్నోలో లా చదివారు. స్వతహాగా ఆదర్శవాది. ఆపైన లక్నోలో అతల్ బిహారీ వాజపేయి ఆయనకి సీనియర్. ఆయన వ్యక్తిత్వాన్ని ఊహించడం కష్టమేం కాదు.

ఆయన కాకినాడ వచ్చి కొన్నాళ్లు లా ప్రాక్టీసు చేశారు. ఐతే ఆ వృత్తిలో అబద్ధం చెప్పకుండా ఒక్క రోజు కూడా గడవదని నిర్ధారణ అయ్యేక – లా ప్రాక్టీసు మానేసి వ్యవసాయదారుడిగా స్థిరపడాలనుకున్నారు.

ఆదర్శాలు వల్లించడం విషయంలో కమ్యూనిస్టు కాదు కానీ, శ్రమజీవుల్ని అవగాహన చేసుకొనడంలో సామ్యవాది ఆయన. అందువల్ల పేరుకి పెద్ద భూస్వామి ఐనా, చేసే వ్యవసాయంవల్ల ఆయనకంటే ఆయన కింద పనిచేసే రైతులే ఎక్కువ బాగుపడ్డారు.

వైభవాలకి లోటు లేకపోయినా, గత రెండేళ్లుగా ఆయన తాత్కాలిక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని నాకు తెలుసు.

ఈ విషయాలన్నీ అలా ఉంచితే – ఇప్పుడు శ్రీమతి బరువు బాధ్యతలన్నీ పూర్తిగా నావి. తనని జర్మనీ రప్పించుకునే విషయంలో సూచనప్రాయంగానైనా ఆయన జోక్యాన్ని ఆమోదించానంటే, అది 'అల్లుడిగా అవకాశం' తీసుకోవడమే ఔతుంది.

ఐనా ఇండియాలో మనకేమైనా అప్పు పుడుతుందేమోనని నేను భువనేశ్వర్ సహచరుడు సూర్యనారాయణకీ, నా అన్నయ్యకూ మాత్రమే కాక – మామగారికి కూడా ఉత్తరం వ్రాసానంటే – అది లౌక్యం కాదు.

జర్మనీలో ఉన్నంత కాలమూ నా వద్ద ఎన్ని మార్కులుంటే అంత ధైర్యంగా ఉంటుంది నాకు. అంతే కాదు – ఇండియా వెళ్లేక అప్పిచ్చినవాళ్లకి కావాలంటే రూపాయల్లో కాక మార్కుల్లోనే బాకీ తీర్చే అవకాశముంది. దానివల్ల ఓ ప్రయోజనముంది.

అప్పట్లో స్కూటర్లు మార్కెట్లో అంత సులభంగా దొరికేవి కాదు. అందులోనూ బజాజ్ స్కూటర్ ఐతే – ముందు అడ్వాన్స్ కట్టి – కేటాయింపు కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సిందే! బజాజ్ స్కూటరుకి ఎంత గిరాకీ అంటే – బ్లాకులో దాని ధర, కోటా ధరకి రెట్టింపుకి పైన ఉండేది. చాలామంది బ్లాకులో అమ్మి సొమ్ము చేసుకుందుకే బజాజ్ స్కూటర్ని బుక్ చేసుకునేవారు. రూపాయల్లో బదులు విదేశీమారకద్రవ్యంతో అడ్వాన్సు కడితే – బజాజ్ స్కూటర్ ఒకటి రెండు నెలల్లోనే కేటాయించబడేలా కోటా ఉంది. అందుకని చాలామంది విదేశాల్లో ఉన్న బంధుమిత్రుల్ని విదేశీమారకద్రవ్యం అడుగుతుండేవారు. అందువల్ల ఇప్పుడు నాకు రూపాయల్లో సాయపడ్డంవల్ల తర్వాత సాయపడ్డవాళ్లకీ కొంత ప్రయోజనం ఉంటుందని నేననుకున్నాను.

పిలిచి పిల్లనిస్తానంటే కులం గోత్రం అడిగారని సామెత ఉండనే ఉందిగా. ఫారిన్ ఎక్స్ఛేంజికోసం ముక్కూ మొహం ఎరుగని వాళ్ల వెంటబడ్డానికైనా సిద్ధమేమో కానీ, నా ఫారిన్ ఎక్స్ఛేంజి ఆఫర్ మా బంధుమిత్రుల్లో ఎవర్నీ ఆకర్షించలేదు.

ఇవీ శ్రీమతి ఉత్తరంలో ముఖ్యాంశాలు. అవి చదువుతుంటే – నాలో కొత్త అనుభూతులేం లేవు. తను పొందిన అనుభూతుల్ని అక్షరాలుగా మార్చి ఆ ఉత్తరంలో పొదిగిందామె. ఆమె నా అర్ధాంగి. తన అనుభూతులు నా అనుభూతులకు భిన్నంగా ఉండవు.

ఆతర్వాత ఇంటి దగ్గర్నుంచి వచ్చిన మిగతావాళ్ల ఉత్తరాల్లోనూ ఏదీ కూడా డబ్బు ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం ప్రోత్సాహకరంగా లేదు.

"పిల్లల్ని తీసుకువెళ్లడం తప్పనిసరి ఐతే అందువల్ల అక్కడ చాలా ఇబ్బందులుంటాయని అనుభవజ్ఞులు అంటున్నారు. ఐనా మీరు ప్రోసీడయ్యే మాటైతే, టికెట్లు ఇండియాలో కొనడం కంటే జర్మనీలో కొని పంపడమే మెరుగుట" ఇది సూర్యనారాయణ ఉత్తరం సారాంశం.

"అమ్మాయికి ట్యూబెక్టమీ ఆపరేషన్ జరిగింది. ఆర్నెల్లవరకూ భార్యాభర్తలు విడిగా ఉంటాలిట. ప్రయాణం ఫిబ్రవరి మధ్యలో జరిగేలా ఏర్పాట్లు చెయ్యడం మంచిది" ఇది మామగారి ఉత్తరం సారాంశం.

"ఇండియానుంచి బెర్లిన్ వెళ్లడానికి – ఒక ఫుల్ టికెట్టు, రెండు హాఫ్‌టికెట్లు కలిపి – మొత్తం పద్నాలుగువేల అయిదొందల రూపాయలు ఔతుంది. నీకు డబ్బు ఏర్పాటవుతుందంటే తెలియజెయ్యి. నీ జవాబు చూసుకుని పాస్‌పోర్టులకి ఏర్పాటు చేస్తాను" ఇది అన్నయ్య ఉత్తరం సారాంశం.

ఈ మూడు ఉత్తరాల సారాంశం నాతోపాటు శ్రీమతినీ చేరినట్లుంది.

"ఎయిర్ టికెట్‌కి వాయిదాల పద్ధతిమీద డబ్బు కట్టొచ్చుట. రానూపోనూ ముప్పైవేలైనా సరే – వెనుకాడద్దు. ఈ ప్రయాణం ఆపొద్దు. నేను ఫిబ్రవరిదాకా ఆగలేను. మిమ్మల్ని విడిచి క్షణం కూడా ఉండలేను. వెంటనే నన్నిక్కణ్ణించి తీసుకుపొండి" అని ఉత్తరం వ్రాసింది.

ఆ ఉత్తరంలోని ఆక్రోశం నాకు ఎలాంటి కిక్ ఇచ్చిందంటే – వెంటనే ఓంప్రకాష్ వద్దకి పరుగెత్తాను.

అతను నేను చెప్పినదంతా విని, "టికెట్ సంగతెలా ఉన్నా, పాస్‌పోర్టు తీసుకోవడానికేం? ఒకోసారి పాస్‌పోర్ట్ రావడానికే నెలలు పట్టేస్తుంది. అర్జంటుగా పాస్‌పోర్ట్ తీసుకోమని మీవాళ్లకి రాయి" అన్నాడు.

నా జేబులో ఏరోగ్రామ్ సిద్ధంగా ఉంది. చకచకా అన్నయ్యకి ఉత్తరం వ్రాస్తున్నాను.

ఈ విషయంలో ఓంప్రకాష్ నాకంటే చురుగ్గా ఉన్నాడు. నేనుత్తరం వ్రాస్తుంటే అతను – 'ఇండియా టూరిస్ట్ సెంటర్'కి చెందిన సరళ్‌సేన్ అనే అతనికి ఫోన్ చేశాడు.

నేను ఉత్తరం వ్రాయడం పూర్తయ్యేసరికి తనకి ఫోన్‌లో సరళ్‌సేన్ ద్వారా తెలిసిన వివరాలు చెప్పాడు ఓంప్రకాష్.

ఆ వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రావడానికోసారీ, తిరిగి వెళ్లడానికోసారీ టికెట్లు తీసుకోవడంకంటే, ఒక్కసారే ఏకంగా రానూపోనూ టికెట్లు తీసుకుంటే బాగా చవక ఔతుందిట. పెద్దవాళ్లకి మనిషికి పన్నెండొందల మార్కులు. 2–12 మధ్యవయసు పిల్లలకి ఒకొక్కరికి ఏడొందల యాభై మార్కులు. అంటే మొత్తం రెండువేల ఏడొందల మార్కులు. మావాళ్లు ఇండియాలో ఎక్కి నేరుగా బెర్లిన్‌లోనే దిగొచ్చు. టికెట్ బుక్ చెయ్యడానికి పది రోజులు ముందు చెబితే చాలుట.

"మరి నీ దగ్గర అంత డబ్బుందా?" అన్నాడు ఓంప్రకాష్ అనుమానంగా.

అతని అనుమానానికి కారణముంది. కొద్ది రోజులు ముందే ఓంప్రకాష్ కన్సెషన్ రేటుకి ఇప్పిస్తానంటే – నేరుగా బ్రౌన్ కంపెనీ షోరూంనుంచి మిక్సీ ఒకటి కొన్నాను. మిక్సీ కొనేటప్పుడు అతను, "ఇప్పటికే నువ్వు కాసెట్ టేపురికార్డరు, స్పూల్‌టైపు స్టీరియో టేపురికార్డరు కొన్నావు. ఇప్పుడు మిక్సీ. ఇలాంటివి నీవాళ్లొచ్చేక కొనచ్చు కదా! ప్రస్తుతం డబ్బు ఆదా చేస్తే సమయానికి అక్కరకొస్తుంది" అని హెచ్చరించాడు.

నేను బెర్లిన్ వచ్చి రెండు నెల్లే అయింది కాబట్టి ఈ నేపథ్యంలో అతడి అనుమానం సహజమే.

నిజానికి అప్పటికప్పుడు టికెట్లు కొనాలంటే నా దగ్గరున్నదంతా ఇచ్చేసినా ఇంకా రెండొందల మార్కులు తక్కువౌతాయి. కానీ ఆ మాట చెబితే – మళ్లీ ఏం సలహా ఇచ్చి నేను వెనకడుగు వేసేలా చేస్తాడోనని నా భయం.

"ఉంది" అన్నాను మేకపోతు గాంభీర్యంతో.

ఐతే నేను హోరుగాలిలో దీపం పెట్టి ఆ మాటనలేదు.

క్రిస్మస్ సందర్భంగా జనవరి నెలలో ఇవ్వాల్సిన స్టయిపెండ్ వెయ్యిమార్కులూ, ముందుగా డిసెంబర్ 17కే ఇచ్చేస్తామని చెప్పారు. అందులోంచి రెండొందల మార్కులు ఈ టికెట్లకోసం తీస్తే, జనవరి నెల ఇంటద్దెకి మరో రెండొందల మార్కులు పోగా – నాకు మిగిలేది ఆరొందల మార్కులు. నావాళ్లు జనవరికల్లా వచ్చేస్తే కనుక – మరి జనవరి నెలలో నాకిక స్టయిపెండ్ రాదు కాబట్టి – ఆరొందల మార్కులతో ఆ నెల గడిపెయ్యాలి. అంతవరకూ ఇక్కడ నాకున్న అనుభవాన్ని బట్టి అది సాధ్యమేనని నా నమ్మకం. ఎటొచ్చీ డిసెంబర్ 17లోగా టికెట్లు కొనడం వీలుపడదు.

ఏదేమైనా కొంతకాలంపాటు జీవితం – మార్కులు, ఫెనిగ్సు లెక్కలతోనే సరిపోతుందనిపించింది. ఐనా మేం నలుగురం ఒకచోట కలిసుండే ఆనందంలో ఆ లెక్కలు కూడా ఓ మధురానుభూతి కావచ్చు.

ఐనా అలాంటి లెక్కలు మాకేం కొత్త కాదు. ఇండియాలో వచ్చే జీతంతో – తలిదండ్రులు, తమ్ముళ్లు, చెల్లెళ్ల బాధ్యతలతో నెలకి మూడు నాలుగు సార్లు బడ్జెట్ మారుస్తుండే అనుభవం మాది. అదే ఇక్కడా కొనసాగుతుంది.

నేనిలా ఆలోచిస్తున్నాను. కానీ నా ఉత్తరం చేరేలోపునే అన్నయ్యనుంచి మరో ఉత్తరం వచ్చింది.

టికెట్లు జర్మనీలో కొనుక్కోవడమే మంచిదంటున్నారుట అంతా! అది సాధ్యమయ్యే మాటైతేనే పాస్‌పోర్టు తీసుకుంటాననీ, లేకుంటే పాస్‌పోర్టుకి అనవసరంగా డబ్బు దండగనీ వ్రాశాడు అన్నయ్య.

పాస్‌పోర్టుకయ్యే ఖర్చు మనిషికి వంద రూపాయల లోపు. పిల్లలిద్దరూ ఐదేళ్ల లోపువాళ్లు కాబట్టి వాళ్లకి వేరే పాస్‌పోర్టులుండవు. తల్లి పాస్‌పోర్టులో వాళ్ల ఫొటో, వివరాలు నమోదు చేస్తే చాలు. వేలకు వేలు పణంగా పెట్టనున్న జర్మనీ ప్రయాణంలో ఇంత చిన్న ఖర్చుకి ఎందుకి వెనుకాడుతున్నాడో అర్థం కాలేదు. కానీ ఇలాంటి విశేషాలు చర్చించుకుందుకు ఇప్పట్లాంటి ఫోన్ సదుపాయాలు లేవుకదా అప్పుడు?

ఖర్చుకి వెనుకాడొద్దనీ, అర్జంటుగా శ్రీమతికి పాస్‌పోర్టు ఏర్పాటు చెయ్యమనీ అన్నయ్యకి వెంటనే ఉత్తరం వ్రాసాను.

ఆ ఉత్తరం పోస్టు చేసేక – ఇక నావాళ్లు ఇక్కడికి రావడం ఖాయం అనిపించింది. వాళ్లొచ్చేక ఏంచెయ్యాలీ అన్న ఆలోచనలో పడ్డాను.

ముందుగా గుర్తొచ్చేది చలి. మావాళ్లు ఇక్కడి చలికి తట్టుకోగలరా? ముఖ్యంగా పిల్లలు....

ఐతే ఆ విషయంలో నేను ధైర్యంగానే ఉన్నాను. ఎందుకంటే –

అప్పుడప్పుడే బెర్లిన్లో వాతావరణం మారుతోంది. అక్టోబరు రాగానే ఇక్కడ అంతా చలికాలం వచ్చేసిందంటున్నారు.

ఊళ్లో చాలా ఇళ్లముందూ, షాపులముందూ వ్రేలాడుతుండే థర్మామీటర్ల ద్వారా ఎప్పటికప్పుడు నాకు టెంపరేచర్ తెలుస్తూనే ఉండేది. బయట టెంపరేచర్ పది డిగ్రీల లోపే ఉంటోంది. అప్పటికి రెండుసార్లు మంచు కురవడం చూశాను. ఒక రోజున టెంపరేచర్ బాగా పడిపోయి మైనస్ ఆరుకి చేరుకుంది. ఐతే అందరూ భయపెట్టినట్లు ఈ చలి నన్ను పులిలా వేటాడలేదు. కనీసం కోడిగ్రుడ్లయినా తినకుండా, చేతులకి గ్లోవ్స్ అయినా వేసుకోకుండా చాలా హాయిగా తిరుగుతున్నానీ చలిలో. అదో పెద్ద విశేషంలాగా అనిపించలేదు. ఎందుకంటే ధరించిన ఉన్ని బట్టలు వంటిని వెచ్చగా ఉంచుతున్నాయి.

బయటకెడితే రోడ్లమీద షికారు చెయ్యం కదా! వెడితే ఆఫీసుకి. లేదూ షాపులకో, మిత్రుల ఇళ్లకో.

ఇక్కడ ఆఫీసు వెచ్చన. షాపులు వెచ్చన. ఇళ్లు వెచ్చన. బస్సులు వెచ్చన. రైళ్లు వెచ్చన. రైల్వే స్టేషన్లు వెచ్చన. ఈ వెచ్చదనాలకి మధ్యలో చేసే రోడ్డు ప్రయాణం వ్యవధి ఎన్నడూ రెండు మూడు నిముషాలకు మించదు. ఆ సమయంలో చేతులు ఓవర్‌కోట్ జేబుల్లో ఉంటాయి. ముఖమొక్కటే చల్లబడుతుంది. ఆ కాసేపూ అది భరించడంలో ఇబ్బంది ఉండదని నా అనుభవం చెప్పింది. ఇంకా చెప్పాలంటే –

ఇండియాలో ఐతే అడపాతడపా నాకు రొంప పట్టేది. చలి తిరిగినప్పుడైతే జలుబు తప్పనిసరి. కానీ పరిసరాలు దుమ్మూ, ధూళీ లేకుండా పరిశుభ్రంగా ఉండడంవల్లనేమో, ఇంతవరకూ నేనిక్కడ జ్రిరున చీదనైనా లేదు.

ఈ నేపథ్యం కారణంగా – నావాళ్లకిక్కడ కనీసం ఆరోగ్య విషయంలోనైనా ఏ సమస్యా ఉండదని నా నమ్మకం.

నా ఆలోచనలిలా అన్నివైపులా తిరుగుతుండగా – ఓంప్రకాష్ సరళ్సేన్‌ని వాకబు చేసి టికెట్లు జనవరి ఆరునుంచి పది మధ్యలో దొరకొచ్చునని తెలుసుకున్నాడు.

ఈలోగా శ్రీమతినుంచి ఇంకో ఉత్తరమొచ్చింది. అందులో తన ప్రయాణం టికెట్ గురించి అక్కడ జరుగుతున్న ప్రయత్నాల వివరాలున్నాయి.

అన్నయ్యకి నిత్యానందం అనే మిత్రుడున్నాడు. ఆయన ఇచ్చిన సమాచారం ప్రకారం ధర కాస్త ఎక్కువైనా ఎయిర్ ఇండియాలో టికెట్ కొంటే, వాయిదాల పద్ధతిమీద డబ్బు చెల్లించొచ్చుట. అందుకు బాధ్యత గల ఆఫీసరు హామీ పడాలిట. మరి అన్నయ్య ఐడిబిఐలో పెద్ద ఆఫీసరు కాబట్టి, హామీ సమస్య కాదు.

"నాకు తెలుసు. నేను జర్మనీ రావడానికే పదిహేను వేలవుతుంది. అయినా సరే, రావాలన్న ఆలోచన ఒకసారి నాలో మొదలయ్యేక – అది పెద్ద ఖర్చనిపించడం లేదు నాకు. మీరు మారాలోచించద్దు. ఇందుకు ఒప్పుకుంటూ వెంటనే ఉత్తరం రాయండి. ఇక్కడ అన్ని ఏర్పాట్లూ జరిగిపోతాయి" అని రాసింది తను.

ఆ ఉత్తరం చదువుతుంటే నా కళ్లు చెమ్మగిల్లాయి. ఆడపడుచుల పెళ్లిళ్ల బాధ్యత బరువుని గ్రహించినదై – తనకోసం ఏడాదికి రెండు మూడు చీరలకి మించి కొనుక్కోని మనస్తత్వం శ్రీమతిది. తనిప్పుడు ఒక్కసారిగా పదిహేను వేలు ఖర్చు చెయ్యలంటే, అదేం ఫరవాలేదనే మనఃస్థితికి వచ్చింది. అంటే తనిప్పుడు నన్ను ఎంతగా మిస్సవుతోందో ఊహించగలను. కలిసుంటే గంజన్నమైనా పరవాన్నమేనన్న సామెత ఊరికే రాలేదు.

శ్రీమతి ఉత్తరంలో హృదయాన్ని తాకే విశేషాలు చాలా ఉన్నాయి.

కలకత్తాలో అన్నయ్య ఇంటికొచ్చినవాళ్లు మావాళ్లని చూసి – ఇంత స్వీట్ భార్యనీ, స్వీట్ పిల్లల్నీ వదిలి ఏ మగవాడు దూరంగా ఉండగలడు అంటున్నారుట. అమ్మాయైతే ఈడుకు మించిన పరిణతితో వ్యవహరిస్తోందిట. అన్నయ్య కుటుంబంతో కలిసి బయట నడిచేటప్పుడు – అబ్బాయిని శ్రీమతి ఎత్తుకునేదిట. అమ్మాయి ఈడుదే అయిన అన్నయ్య కూతురు కమలిని అన్నయ్య ఎత్తుకునేవాడుట. అప్పుడు అమ్మాయి, "నాన్నగారిక్కడ లేరుగా, నువ్వు నన్నెత్తుకోలేవు. నేను నడుస్తాన్లే" అంటుందిట.

అబ్బాయి అల్లరి కాస్త ఎక్కువగానే ఉన్నా – అందులో దురుసుతనం కంటే తెలివి ఎక్కువట.

"ఒరేయ్, బాబీ! నువ్విలా అల్లరి చేస్తే నిన్ను విమానం ఎక్కించుకోరు మరి" అని శ్రీమతి ఓసారి మందలించిందిట. దానికి వాడు, "నేను ముద్దుగా ఉంటానుగా, నన్నెందుకు ఎక్కించుకోరు? నేనే ఎక్కనని మారాం చేస్తాను. అప్పుడు వాళ్లు నాకో అరటిపండిచ్చి, బాబీ – ఎక్కమ్మా – అని బ్రతిమాలి ఎక్కించుకుంటారు" అన్నాడుట తన ముద్దు మాటలతో.

అంతా తనని ముద్దు చేస్తారని వాడికి ఎవరన్నా భయం లేకుండా పోయింది. కానీ కోపమొస్తే మిగతావాళ్లు వెనకాడతారు కానీ, శిక్షించడానికి తల్లి వెనకాడదు కదా!

అందుకని వాడికి శ్రీమతి అంటేనే కాస్త భయం.

విమానం ఎక్కడానికి మన పద్ధతి మనకుండొచ్చు కానీ వాడి ఆలోచన వేరే ఉంది. విమానం గాలిలో ఉంటుంది కదా – అదెక్కాలంటే అంతెత్తు ఎగిరి ఎక్కాలనుకుంటున్నాడు. అందుకోసం వాడిప్పుడు రోజూ గాల్లోకి ఎగరడం అభ్యసిస్తున్నాడు. శ్రీమతికి వాణ్ణి కాసుకోవడం ఇబ్బందిగా ఉంటోంది.

"వాణ్ణి పట్టించుకోకు. ఒకసారి పడి దెబ్బలు తగిలితే వాడికే తెలిసొస్తుంది" అన్నాట్ట అన్నయ్య. కానీ పడితే వాడిదేంపోయింది. ఏడుపు లంకించుకుంటాడు. ఊరుకోబెట్టడం ఓ అదనపు పని. ఆపైన తల్లి కదా, వాడి బాధ వాడికంటే తనే ఎక్కువగా అనుభవిస్తుంది.

ఈ వివరాలన్నీ చదువుతుంటే నా మనసక్కడికి వెళ్లిపోయింది. అన్నీ నా కళ్లముందే జరుగుతున్నట్లున్నాయి. కానీ ఎవరితోనూ మాట్లాడలేనుగా, నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

ఈ వివరాల సంగతటుంచితే, ఉత్తరం చివర శ్రీమతి, "మీ ఉత్తరం చూసుకుని, పాస్‌పోర్ట్ ఏర్పాట్లు చూసుకుంటాం" అని వ్రాసింది.

ఆ వాక్యం నా గుండె గుభీల్మనిపించింది.

నా ఉత్తరం అందేక, అప్పుడు పాస్‌పోర్టు తీసుకునేమాటైతే, అసలే ఇండియా – ఈ వ్యవహారం ఎప్పటికి తేలేను?

నేను తనకి టికెట్లు ఇక్కణ్ణించే ఏర్పాటు చేస్తున్న విషయం అర్జంటుగా తెలియాలి. ఇక ఉత్తరం లాభం లేదు. టెలిగ్రాం ఇవ్వాల్సిందే!

కాసేపాలోచించి పోస్టాఫీసుకి వెళ్లాను. ఖర్చు ఆదా చెయ్యడం కోసం – వాక్యాల్ని వీలైనంత పొదుపుగా వాడి, 'టికెట్లు ఇక్కణ్ణించి పంపుతున్నాను' – అని టెలిగ్రాం ఇచ్చాను. ఆ మాత్రం దానికే పన్నెండు మార్కుల చిల్లరయింది.

నేనప్పుడు డబ్బు గురించి ఆలోచించడంలేదు. టెలిగ్రాం అందగానే శ్రీమతిలో కలిగే ఆనందోత్సాహాలు తల్చుకుని తెగ మురిసిపోయాను.

కానీ ఆ ఆనందం ఎంతోసేపు నిలబడలేదు.

మనసొక అనుమానాల పుట్ట. అందులోంచి అనుమానాలు పాములై వచ్చి కాటేస్తూంటాయి. నాకొచ్చిన అనుమానం అన్నయ్య ఇంటి నంబరు విషయంలో. తరచుగా ఉత్తరాలు రాస్తున్నాను కాబట్టి అది 378 అని నాకు కంఠతాయే. కానీ జర్మన్లు ఒకటి అంకెకు పైన కాస్త వంకర గీత కలిపి ఏడు అనిపించేలా వేస్తారు. ఒకటికీ ఏడుకీ తేడా తెలియడానికి ఏడుకి మధ్యన చిన్న అడ్డ గీత వేస్తారు. ఇప్పుడు నేను టెలిగ్రాంకిచ్చిన అడ్రసులో ఏడంకెని నాకు అలవాటైన ఇండియన్ పద్ధతిలో వేశాను.

పోస్టుమాస్టరు దాన్ని ఒకటి అనుకుని, కలకత్తాలో 318 ఇంటికి పంపి, ఎవరూ లేక....

అమ్మో – కొంపలు మునిగిపోవూ!

దీనికి పరిష్కారం ఏమిటని మనసులో కలవరం మొదలైంది. అప్పుడు నాలో వివేకం మేల్కొని, "సమస్యకు పరిష్కారం చెప్పలేను కానీ, కలవరాన్ని పరిష్కరించగలను. నువ్వు వేసిన నంబరు పోస్టుమాస్టరుకి 378గానే తోచిందని నమ్ము" అంది.

నమ్మకమాత్రం చేసేదేముంది? వివేకం మాట విన్నాను. ఐతే టెలిగ్రాంతో సరిపెట్టుకోక, మర్నాడు అన్నయ్యకీ, శ్రీమతికీ – టెలిగ్రాంలోని వాక్యాన్ని కాస్త పెంచి ఉత్తరాలు వ్రాశాను. శ్రీమతికి వ్రాసినప్పుడల్లా, అన్నయ్యకీ ఓ ఉత్తరం వ్రాయడం ఇటీవల నాకేర్పడ్డ కొత్త అలవాటు.

వివేకం దారి వివేకానిదే – 1, 7 ల మీమాంస ఇంకా నన్ను వదల్లేదు. అనుమాన నివృత్తికోసం నేనో కాగితంమీద 378 నంబరు వేసి నా జర్మన్ మిత్రులకి చూపించాను.

చూసిన ప్రతి ఒక్కరూ 318 అనే చదివారు. అంటే 12 మార్కుల టెలిగ్రాం గోవిందా!

మనసు వివేకాన్ని పక్కకు నెట్టేసి తెగ బాధ పడిపోతుంటే – ఉపశాంతి కోసం ఓంప్రకాష్‌కి ఫోన్ చేశాను. అతను దొరకలేదు.

ఒకటికీ ఏడుకీ మధ్య నలిగిపోతూ ఆ రోజంతా గడిపేసేక మర్నాడు నాకు ఓంప్రకాష్ తనే స్వయంగా ఫోన్ చేశాడు. వెంటనే అతడికి నా మీమాంస చెప్పుకున్నాను.

"నంబరు వేసేముందు ఆలోచించొద్దూ?" అని అతడు నన్ను మందలించాడు. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో, కాసేపట్లో వస్తున్నానని చెప్పాడు.

ఓంప్రకాష్ వచ్చేసరికి, ఇంటి దగ్గర్నుంచి రెండుత్తరాలొచ్చాయి. శ్రీమతి వ్రాసినప్పుడల్లా తనూ నాకుత్తరం వ్రాయడం అన్నయ్యకీ అలవాటయింది.

ఏముందీ, మామూలే! ఇద్దరిదీ ఒకే మాట! నా ఉత్తరం చూసుకుని పాస్‌పోర్టు ఏర్పాట్లకు వెడతారుట.

అంటే పాస్‌పోర్టు గురించి అక్కడింకా ప్రయత్నాలు మొదలవలేదు.

అన్నయ్య సంగతి నాకు తెలుసు. గోటితో పోయేదాన్ని గొడ్డళ్లవరకూ తీసుకొచ్చి అప్పుడు సాధిస్తాడు.

ఏ పనైనా సరే వాయిదాకి అవకాశముంటే, ఎంతవరకూ వీలైతే అంతకాలం వాయిదా వేస్తాడు. అది నా పద్ధతికి పూర్తిగా విరుద్ధం. ఎన్నోసార్లు అన్నయ్యని నేనీ విషయమై బాగా హెచ్చరించాను. అన్నయ్య ఈ చెవితో విని ఆ చెవితో వదిలేసేవాడు.

అందుకు కారణం లేకపోలేదు. ఇంతవరకూ అన్నయ్యకు జీవితంలో వైఫల్యాలు లేవు. నాకున్నాయి.

మనిషి స్వానుభవంనుంచి నేర్చుకున్నంతగా ఇతరులనుంచి నేర్చుకోవాలనుకోడు. నా హెచ్చరికను పెడచెవిని పెట్టి నష్టపోయిన సందర్భాలు ఇంతవరకూ లేవు తనకి. కానీ నాకిప్పుడు అన్నయ్య అవసరమొచ్చింది. నా అవసరం తీర్చడానికి తను తన పద్ధతి కొనసాగిస్తున్నాడు.

ఓంప్రకాష్ వస్తూనే, "గుడ్ న్యూస్ డాక్టర్ రావ్! జనవరి ఏడుకి టికెట్సు బుక్కయ్యాయి. రేపు డబ్బు తీసుకెళ్లివ్వాలి. సాక్ష్యానికి మన కూడా గోపాలకృష్ణన్‌ని తీసుకెడదాం" అన్నాడు.

"సాక్ష్యమేమిటి?" అన్నాను అనుమానంగా.

ఓంప్రకాష్‌కి నా ముఖం చూడగానే నవ్వొచ్చింది. "భయపడకు. ఈ టికెట్ల వ్యవహారంలో మోసమేమీ ఉండదు. ఎటొచ్చీ మన జాగ్రత్తలో మనముండాలి" అన్నాడు.

సరేనని – ఇంటిదగ్గర ఇంకా పాస్‌పోర్టులు సిద్ధం కాలేదన్న విషయం చెప్పానతడికి.

ఓంప్రకాష్ ఓ క్షణం ఆలోచించి, "వెంటనే ఇంకో టెలిగ్రాం ఇయ్యి" అన్నాడు.

"ఇంకో టెలిగ్రామా? చాలా ఔతుంది" అన్నాను గాభరాగా.

"ఇది డబ్బుకి చూసుకునే సమయం కాదు. అక్కడ మీవాళ్లకి వేడి పుట్టాలంటే, టెలిగ్రామెలా ఇవ్వాలో నేను చెబుతాను" అన్నాడు ఓంప్రకాష్.

విపత్కర సమయాల్లో ఎవర్నో ఒకర్ని పూర్తిగా నమ్మి అనుసరిస్తే, మనకి భారముండదు. కురుక్షేత్ర సంగ్రామంలో పార్థుడు అదే చేశాడు.

నేను ఓంప్రకాష్‌తో కలిసి పోస్టాఫీసుకి వెళ్లాను.

"టికెట్స్ పోస్టెడ్. ఎరేంజ్ పాస్‌పోర్ట్స్ అండ్ బర్త్ సర్టిఫికెట్స్. ఫ్లైట్ బై ఏరోఫ్లోట్ ఫ్రం ఢిల్లీ. సెవెన్త్ జనవరి" అని ఇంచుమించు ఉత్తరంలా వ్రాశాం.

అక్కడ రెండు రకాల టెలిగ్రాములున్నాయి. ఒకటి టెలిగ్రాం పద్ధతి. ఆ పద్ధతిలో ఐదు పదాలకు ఇరవైఒక్క మార్కుల ఇరవైఒక్క ఫెనిగ్స్. ఇంకోటి ఉత్తరం పద్ధతి. ఇలా చెయ్యడం వల్ల ఇంత ఉత్తరమూ ఇరవైమార్కులకి ఇరవై ఫెనిగ్సు తక్కువ.

ఈ టెలిగ్రాంలో చిన్న అబద్ధముంది. టికెట్సింకా పోస్టవలేదు.

డబ్బయితే అయింది కానీ, టెలిగ్రాం ఇచ్చేక మనసు తేలిక పడింది.

మర్నాడు బ్యాంకునుంచి రెండువేల ఏడొందల యాభై మార్కులు డ్రా చేశాను. శ్రీమతి, పిల్లలు ఇక్కడికొచ్చి నాతో గడిపి వెళ్లడానికి చెల్లిస్తున్న మూల్యమది. అది నాకు చాలా పెద్ద మొత్తమే. కానీ జర్మనీలో ఉన్న ఏడు నెలలలోపులోనే కూడబెట్టగలిగానది.

నావాళ్లని నా డబ్బుతోనే ఇక్కడికి రప్పించుకుంటున్నానన్న భావన ఆ క్షణంలో కించిత్ గర్వాన్ని కలిగించింది.

మర్నాడు మధ్యాహ్నం మూడున్నరకి డాక్టర్ రాలెక్‌కి విషయం చెప్పి, ఆఫీసునుంచి బయల్దేరి, తిన్నగా గోపాలకృష్ణన్ లాబొరేటరీకి వెళ్లాను. అక్కణ్ణించి ఇద్దరం ఓంప్రకాష్ దగ్గరకి బయల్దేరాం. దారిలో ఆకలిగా ఉందని కర్రీ వుర్స్ట్ తిన్నాడు గోపాలకృష్ణన్.

ఈ కర్రీ వుర్స్ట్ చిన్న సైజు కొవ్వొత్తి ఆకారంలో ఉండే మాంసపుకడ్డీ. రకరకాల మాంసాల్ని బాగా కలిపి ముద్ద చేసి ఈ ఆకారంలో ముక్కలుముక్కలుగా కోసి, నూనెలో వేయించి అమ్ముతారు. నంచుకుందుకు పచ్చి ఆవపిండి ఇస్తారు, మనవైపు పకోడీల దుకాణాల్లాగా, ఇక్కడ వుర్స్ట్ దుకాణాలు ఎక్కడపడితే అక్కడుంటాయి.

గోపాలకృష్ణన్ ఇండియాలో ఫక్తు శాకాహారి. మొదట్లో వుర్స్ట్ తినడానికి అతడికి మనస్కరించలేదుట. మిత్రుల బలవంతంమీద ఒకసారి తింటే, నోటికి హితవుగా అనిపించిందిట. ఒక వుర్స్ట్ కడ్డీ ఒక మార్కు. రోజుకి సరిపడ పోషక విలువలు ఒక్క మార్కుతో లభిస్తున్నాయని, క్రమంగా అతడు దానికి అలవాటు పడ్డాడు. ఇలాంటి చలి దేశంలో ఇలాంటివి తినడం అలవాటు చేసుకోవడం అవసరమని అతడు నాకు చెప్పాడు.

అంతవరకూ నాకు అలాంటి అవసరమేదీ కలగలేదు. రుచి మాటటుంచి వుర్స్ట్ ఆకారం నాకు వెగటుగా అనిపించేది. ఆ మాట అతడికి చెప్పలేదు. ఎందుకంటే గోపాలకృష్ణన్ చెయ్యెత్తు భారీ మనిషి. నేను పిట్టలా ఉంటాను. పోషకపదార్థాల అవసరం శరీరానుగతం కదా!

ఇద్దరం ఓంప్రకాష్‌ని కలుసుకుని – అక్కణ్ణించి ముగ్గురం కలిసి ఇండియన్ కన్సులేట్‌కి వెళ్లాం. సరళ్‌సేన్ వచ్చాడు కానీ చెప్పిన టైముకి కాస్త ఆలస్యంగా వచ్చాడు.

అతను టికెట్లు తెచ్చాడు. మొత్తం మూడు టికెట్లు. పిల్లలిద్దరికీ కలిపి పదిహేనొందలు. శ్రీమతి టికెట్టు పన్నెండొందల యాభై మార్కులు. నేను డబ్బివ్వాను.

టెలిగ్రాంలో నేను వ్రాసినప్పటి అబద్ధం, ఆ టెలిగ్రాం అన్నయ్యను చేరుకునేసరికి నిజమైంది.

వివరాలు, విశేషాలు, టికెట్లు నింపుకున్న బరువైన కవరొకటి – ఆరోజు అక్కడి పోస్టాఫీసునుంచి ఇండియాకి పయనమైంది. ఆ రోజు డిసెంబర్ 20.

నావాళ్ల ప్రయాణం విషయమై ఉన్న సమస్యలన్నీ అంతటితో పరిష్కారమైపోయాయనుకున్నాను. జనవరి ఏడవ తేదీన నావాళ్లు నన్ను చేరుకునేవరకూ వాళ్ల గురించి ఎదురుచూడ్డం మినహా ఇంకేం చెయ్యక్కర్లేదనుకున్నాను. అనుకున్నాను కానీ – అసలు సమస్యలన్నీ అప్పుడే మొదలయ్యాయని అప్పుడు నాకు తెలియదు.

పీత కష్టాలు

సరళ్‌సేన్ నాకిచ్చిన టికెట్లపై విమానం చేరే స్థలం ఈస్ట్ బెర్లిన్ అని ఉంది.

నేనుంటున్నది వెస్ట్ బెర్లిన్. అది పశ్చిమ జర్మనీలో ఉంది. ఈస్ట్ బెర్లిన్ తూర్పు జర్మనీలో ఉంది. అంటే రెండూ వేర్వేరు దేశాల్లో ఉన్నాయి.

టికెట్లిచ్చినప్పుడే, "బెర్లిన్ అంటే మన బెర్లిన్ అనుకున్నాను" అన్నాను నేను సరళ్‌సేన్‌తో.

"ఇది ఏరోఫ్లోట్ విమానం. వెస్ట్ బెర్లిన్‌కెందుకొస్తుంది?" అన్నాడు సరళ్‌సేన్ అదేదో మామూలు విషయమైనట్లు.

ఏరోఫ్లోట్ రష్యాకు చెందిన విమానం కంపెనీ. రష్యా కమ్యూనిస్టు దేశమైనా, ఆ కంపెనీ విమానాల సేవల్ని కమ్యూనిస్టేతర దేశాలకూ విస్తరించింది. కానీ నేను కొన్న టికెట్టు ఆ పరిధిలోకి రాదు. ఇది తక్కువ ధరలకు ఏర్పాటు చెయ్యబడ్డ ఛార్టర్డ్ ఫ్లైట్. ఈ చౌక ప్రయాణం కమ్యూనిస్టు దేశాలకు మాత్రమే పరిమితం.

ఈ విషయం నేను ముందే తెలుసుకోవాల్సింది. సరళ్‌సేన్ నాకు మరింత స్పష్టమైన అవగాహన కలిగించి ఉంటే బాగుండేదనుకున్నాను మనసులో. పైకి మాత్రం ఏమీ అనలేదు.

ఐతే ఇంత జరిగినా కూడా నేనా విషయాన్ని తీసుకోవాల్సినంత సీరియస్‌గా తీసుకోలేదు. "దాందేముందీ, నావాళ్లని వెస్ట్ బెర్లిన్లో బదులు ఈస్ట్ బెర్లిన్లో రిసీవ్ చేసుకుంటాను. అంతే కదా" అనుకున్నాను.

ఇలాంటి పొరపాట్లు నేను చాలా సార్లే చేశాను. ఐనా ఎప్పటికప్పుడు పరగడుపే.

అనుమానాలు తీర్చేవాడు ఎదురుగా ఉన్నప్పుడు సమస్య లోతుల్లోకి వెళ్లాలనిపించదు. సరళ్‌సేన్ చెయ్యి చాపి, "ఆర్ యూ హాపీ!" అని కరచాలనం చేస్తే – "వెరీ హాపీ, థాంక్యూ" అని పంపేశాను.

అతను వెళ్లిపోయేక – అప్పుడు మొదలయ్యాయి నాలో అనుమానాలు – వరుసగా ఒకటి తర్వాత ఒకటిగా –

ఈస్ట్ బెర్లిన్ బెర్లిన్లో ఒక భాగం కావచ్చు. అక్కడి పౌరులూ జర్మన్సే కావచ్చు. ఆ నగరంలో చెలామణీ అయ్యే భాష కూడా జర్మనే కావచ్చు. కానీ అది కమ్యూనిస్టు దేశం.

మొదట్నించీ కమ్యూనిస్టు దేశాల్లో నాకు నచ్చనిదిదే!

అక్కడ మనిషికీ మనిషికీ భేదం లేదు. పేదా గొప్పా వ్యత్యాసం లేదు. సమిష్టిగా కృషి చేసి సమిష్టిగా అనుభవిస్తారు. కానీ.....

అక్కడ ప్రభుత్వాలకి తమ పౌరులపై నమ్మకముండదు. కమ్యూనిస్టేతర దేశాల్లోని వైభవ స్వేచ్ఛా జీవితం తమ ప్రజలను సమ్మోహపర్చగలదని వాటికి తెలుసు. అందువల్ల తమ పౌరుల ఆలోచనలు ప్రభావితమై ధనస్వామ్యానికి అనుగుణంగా మారిపోగలవని వాటి భయం.

అందుకే కమ్యూనిస్టు ప్రభుత్వాలు తమ పౌరుల్ని అదుపు చెయ్యడానికి వారిపై ఎన్నో ఆంక్షలు విధించాయి. అలాగే ఆ దేశాల్లో ఇతరులు అడుగు పెట్టడానికీ ఎన్నో ఆంక్షలుంటాయి.

ఈస్ట్ బెర్లిన్ వెస్ట్ బెర్లిన్‌ని ఆనుకునే ఉంది. కానీ వెస్ట్ బెర్లిన్ నుంచి ఈస్ట్ బెర్లిన్ వెళ్లాలంటే మాత్రం గగనానికీ ఇలకూ బహుదూరం అని పాడుకోక తప్పదు.

కొన్ని వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇండియాకు వెళ్లడానికి డబ్బొక్కటే అడ్డు. ఈస్ట్ బెర్లిన్‌లోకి వెళ్లడానికి డబ్బు ఏమాత్రం సహకరించదు.

దేవుణ్ణి నమ్మినవారు ఆస్తికులు. నమ్మనివారు ఆస్తికులు. నేనెరిగిన ఆస్తికులు నన్ను నాస్తికుడనుకుంటారు. నేనెరిగిన నాస్తికులు నన్ను ఆస్తికుడనుకుంటారు. నేను ఆస్తికుణ్ణా, నాస్తికుణ్ణా అన్న విషయమై నేనెప్పుడూ ఎక్కువ ఆలోచించలేదు. ఎందుకంటే నా దైనందిన జీవితానికి అదంత ముఖ్యం కాదు.

అలాగే నాకు కమ్యూనిస్టు సిద్ధాంతాల గురించి తెలిసింది తక్కువ. ఆనోటా ఈనోటా విన్నదే ఎక్కువ. అంతకుమించి తెలుసుకోవాలన్న కుతూహలం కూడా నాకు లేదు. ప్రస్తుతానికి నేనిరుక్కున్న పరిస్థితుల్లో – కమ్యూనిస్టు వ్యవస్థ నాకు ఇబ్బందిగా ఉందని అర్థమైందంతే!

బెర్లిన్ వచ్చేక ఈ నాలుగు నెలలలోపూ ఒకే ఒక్కసారి ఈస్ట్ బెర్లిన్ వెళ్లాను. అదీ గ్యోతే ఇన్‌స్టిట్యూట్ సహవిద్యార్థి శర్మ నన్ను చూడ్డానికి వెస్ట్ బెర్లిన్ వచ్చి – ఓసారి ఈస్ట్ బెర్లిన్ చూడాలనుందని బలవంతపెట్టినప్పుడు.

పోనీలే ఈ ప్రయాణం విషయంలో కొంత అనుభవమొస్తుందనుకుని సరేనన్నాను.

అప్పటికి నాకు తెలిసిందేమిటంటే – రెండు బెర్లిన్లకూ మధ్య ఒక ఒప్పందముంది. ఆ ప్రకారం వెస్ట్ బెర్లిన్‌నుంచి ఈస్ట్ బెర్లిన్ వెళ్లడానికి జేబులో పాస్‌పోర్టూ, పర్సులో ఓ ఐదు మార్కులూ ఉంటే చాలు. వెళ్లేక ఇరవై నాలుగు గంటల్లో తిరిగి వెనక్కి వచ్చేయాలన్న షరతు మాత్రం ఖచ్చితంగా పాటించాలి.

ఇద్దరం ట్రయిన్లో వెళ్లాం. ఈస్ట్ బెర్లిన్ ప్లాట్‌ఫారంమీద దిగాం. అక్కడ బ్లాక్ అండ్ వైట్ విస్కీ వెస్ట్‌లో కంటే చౌకట. తనో బాటిల్ కొనుక్కుంటానన్నాడు శర్మ. చిల్లర లేదంటే నేనే కొన్నాను ఆ బాటిల్. అదయ్యేక, "ఇక్కడ ఊళ్లో చూడ్డానికేముంటుందిలే, వెనక్కి వెళ్లిపోదాం" అన్నాడు శర్మ.

అతను ఏం మారలేదనుకున్నాను. అతనికి మందుమీద తప్ప మరే ఆసక్తీ లేదు. నాచేత తనకోసం మందు కొనిపించి అది తీసుకుని వెళ్లిపోయాడు.

ఆ ప్రయాణంవల్ల శర్మకి మందు దొరికిందంతే! నాకు ఈస్ట్ బెర్లిన్ గురించి అవగాహన చేసుకునే అవకాశం రాలేదు.

పోనీ ఇప్పుడూ అప్పటిలాగే ట్రయిన్లో ఈస్ట్ బెర్లిన్ వెడదామా అనుకుంటే – నా సమస్యకు పరిష్కారం అంత సులభం కాదు.

ఈస్ట్ బెర్లిన్ విమానాశ్రయం – నగరం సరిహద్దులకి కాస్త అవతల ఉన్నదట. అంటే విమానాశ్రయం ఈస్ట్ బెర్లిన్లో కాక, తూర్పు జర్మనీలో ఉంది. రెండు నగరాల మధ్యా ఉన్న ఒప్పందం – తూర్పు జర్మనీకి వర్తించదు.

ఇవన్నీ నాకు తెలియవు. తెలియగానే ఏం చెయ్యాలో తోచక వాళ్లనీ వీళ్లనీ వాకబు చెయ్యడం మొదలెట్టాను. వాళ్లలో – ఓం ప్రకాష్, లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టల్లోని ఇతర భారతీయులు, సరళ్‌సేన్‌లు కూడా ఉన్నారు.

దేనికైనా దిగేదాకా లోతు తెలియదని సామెత. వాకబు చేస్తున్నకొద్దీ నా సమస్యల లోతు ఇంకా ఇంకా పెరిగిపోతోంది.

నేనడిగిందానికి పరిష్కారం చెప్పడానికి బదులు – సరళ్‌సేన్ మరో బాంబు పేల్చాడు.

ఏరోఫ్లోట్ విమానం ఢిల్లీనుంచి నేరుగా బెర్లిన్ రాదుట. మాస్కోలో దిగి మరో విమానం మారాలిట. ఆ విమానం కోసం నావాళ్లు మాస్కో ఎయిర్‌పోర్టులో ఏడు గంటలు గడపాలి.

శ్రీమతి చదువు హైస్కూలు దాటలేదు. చదివిన మీడియం కూడా ఇంగ్లీషు కాదు. పెద్ద నగరాల్లో ఎక్కువ మసల్లేదు. తెలుగులో తప్ప ఇతర భాషల్లో ప్రావీణ్యం లేదు. విమానం ఎక్కడం ఇదే ప్రథమం. పిల్లలిద్దరూ ఐదేళ్ల లోపు వయసువాళ్లు. వాళ్లను తీసుకుని బయల్దేరి, ఢిల్లీలో విమానమెక్కి, మాస్కోలో దిగి అక్కడ ఏడు గంటలు ఎదురు చూసి మరో విమానం ఎక్కాలి. అప్పుడు తను తూర్పు జర్మనీ చేరుకుని అక్కణ్ణించి వెస్ట్ బెర్లిన్ రావాలి. ఇదంతా తనవల్లనౌతుందా?

అవదనే అనిపిస్తోంది. కానీ దేనికైనా ముందు పాజిటివ్‌గా ఆలోచించాలి కదా!

శ్రీమతి వ్యక్తిత్వాన్ని సానుకూల దృక్పథంలో విశ్లేషించసాగాను..

అప్పట్లో మన వ్యవస్థలో విద్యాధికులైన భారతీయ మహిళల్లో కూడా అధిక సంఖ్యాకులు సాధికారతలో బాగా వెనకబడి ఉన్నారనే చెప్పొచ్చు.

వాళ్లు వాహనాలు నడపరు. ఉద్యోగాలు చెయ్యరు. భువనేశ్వర్లో మా కాలనీ మహిళల్లో చాలామంది విద్యాధికులే. కానీ వాళ్లు ఇంటిపనుల్ని – మగపనీ, ఆడపనీ అని విభజించారు. మగపనులంటే అమ్మో అంటారు.

పోస్టాఫీసుకి వెళ్లడం, మనియార్డర్లు కట్టడం, బ్యాంకునుంచి డ్రాఫ్టులు తీసుకొనడం – ఇవన్నీ వాళ్లకి అమ్మో అనిపించే మగపనులే!

అంతే కాదు – ఒంటరిగా ఊళ్లోకెళ్లాలన్నా వాళ్లకు భయమే. భువనేశ్వర్లో రిజర్వేషన్ కంపార్టుమెంట్లో రైలెక్కి రాజమండ్రిలో దిగే ప్రయాణానికి కూడా – మగవాళ్లు (వాళ్లు చిన్నపిల్లలయినా ఫరవాలేదు) తోడుగా రావాలంటారు. ఆఫీసు పనిమీద ఒక్క రోజు భర్త వేరే ఊరికెడితే, సాయంగా వచ్చి పడుకోమని ఇరుగు పొరుగుల పిల్లల్ని రిక్వెస్ట్ చేస్తారు.

చెప్పాలంటే అదో సాగుబడి వాతావరణం.

శ్రీమతి అలాంటి వాతావరణంలో ఉంటూ కూడా ధైర్యసాహసాల్లో తన ప్రత్యేకతని నిరూపించుకుంది. బ్యాంకు పనులు, పోస్టాఫీసు పనులు ఆమెకి కరతలామలకం. ప్రయాణాల విషయానికొస్తే – నేను వాల్తేర్లో ఉన్నప్పుడే ఆమె ఒక రోజు కాకినాడ నుంచి ఒంటరిగా రైలు ప్రయాణం చేసింది. రైలు ఆలస్యమై చేరుకునేసరికి బాగా రాత్రి ఐనా సంకోచించకుండా స్టేషన్లో రిక్షా ఎక్కి, జనసంచారం లేని మార్గంలో సిరిపురం వచ్చింది. నేనే కాదు, మా కాలనీ మహిళలు కూడా ఆమె మానసిక స్థైర్యాన్ని అభినందిస్తుంటారు.

ఇవన్నీ గుర్తు చేసుకుని నా మనసుకి ధైర్యం చెప్పబోయాను కానీ మనసు లొంగడం లేదు.

ఇది శ్రీమతికి ఇంతవరకూ తానెరుగని విమాన ప్రయాణం. దేశం కాని దేశం. భాష కాని భాష.

తన ప్రయాణం గురించి నేనే ఇంత కలవరపడుతుంటే ఇక తనకెలా ఉంటుంది?

ఈ ప్రయాణం శ్రీమతి పాలిట కురుక్షేత్ర సంగ్రామంలా తోచింది నాకు. ఒకటొక్కటిగా బయటపడ్డ వివరాలన్నీ తెలిసి – ఆమె పార్థుడిలా నీళ్లుగారిపోయే ప్రమాదముంది.

నేను గీతా బోధ చేస్తే తప్ప – తను ముందడుగు వెయ్యలేదు.

ఎలాగైనా ఆమెని ఇక్కడికి రప్పించాలి. అందుకని బాగా ఆలోచించి ఆమెకి ఓ ఉత్తరం వ్రాయాలనుకున్నాను.

విమాన ప్రయాణ విషయంలో నాకున్న పరిజ్ఞానం స్వల్పమన్న విషయం ఆమెకి తెలియకూడదు. కానీ ఆ జ్ఞానాన్ని ప్రదర్శిస్తూ ఆమెకి ధైర్యం చెప్పాలి.

ప్రయాణంలో ఆమె ఎదుర్కోనున్న ఇబ్బందుల్ని నిజాయితీగానూ, భయపెట్టకుండా లౌక్యంగానూ ఆమె ముందుంచాలి. ఐతే వాటిలో తూర్పు జర్మనీ సమస్యని ప్రస్తావించకూడదు. షాకులకి కూడా ఓ డోసుంటుంది మరి.

నా ఉత్తరం ఇలా కొనసాగింది.

గీతోపదేశం

"ప్రియమైన వసూ!

అతి త్వరలో నన్ను చేరబోతున్న నీకు నేను వ్రాస్తున్న చివరి ఉత్తరమిది. ప్రయాణానికి ముఖ్యమైన అతి ముఖ్య సూచనలు ఇందులో ఇస్తున్నాను. ఇది చదవగానే, విమాన ప్రయాణం ఇంత సులభమా అనుకుంటావని నా నమ్మకం. ఇందులో వివరాలు అవసరపడొచ్చు కాబట్టి ప్రయాణంలో ఈ ఉత్తరాన్ని దగ్గరుంచుకో. 1. అవసరమైన (తిండి, బ్రష్షూ పేస్టూ, స్వెటరు వగైరాలు) కొద్ది సామాను నీ దగ్గర చిన్న బ్యాగులో ఉంచుకుని మిగతాదంతా లగేజి కింద ఢిల్లీలో ఈస్ట్ బెర్లిన్‌కి బుక్ చేసెయ్యాలి. ఈ బుకింగు ప్రయాణానికి ఒకటి రెండు గంటల ముందుగా జరుగుతుంది. అది చేస్తే బెర్లిన్ చేరుకునేదాకా నీకు లగేజి గురించిన బెంగ ఉండదు.

2. దారిలో తినడానికి బిస్కట్ల ప్యాకెట్, స్లైస్‌డ్ బ్రెడ్ ప్యాకెట్, అరడజను అరటిపళ్లు ఉంటే చాలు. ప్రయాణానికి ముందు పిల్లలచేత పాలు తాగించు.

3. పాస్‌పోర్టు, హెల్త్ సర్టిఫికెట్లు, ఎయిర్ టికెట్లు – వీటిని లగేజిలో బుక్ చెయ్యకుండా దగ్గరే ఉంచుకోవాలి. ప్రయాణంలో ఎప్పుడు ఎవరడిగినా చూపించేందుకు వీలవుతుంది.

4. ఈ ప్రయాణంలో మాట్లాడాల్సిన అవసరం చాలా తక్కువ. విమానమెక్కి బయల్దేరిన కాసేపటికి ఎయిర్ హోస్టెస్‌కి ఇంగ్లీషులో చెబుతావూ, "క్షమించాలి. నాకు సాయం కావాలి. నేను మొదటిసారిగా విమానంలో ప్రయాణం చేస్తున్నాను. ఇంగ్లీషు అంత బాగా రాదు. నేను ఈస్ట్ బెర్లిన్ వెడుతున్నాను. మాస్కోలో విమానం మారడానికి మీరు సాయపడగలరా?" అని. ఆడవారికి – అందులోనూ పిల్లల తల్లులకి విమానంలో మంచి సాయం లభిస్తుంది. విమాన ప్రయాణంలో అన్‌రిజర్వ్‌డ్ ప్రయాణీకులుండరు కాబట్టి నీకే భయమూ ఉండదు. ఎయిర్ హోస్టెస్ స్వయంగా తనే సాయం చెయ్యొచ్చు. లేదా ఈస్ట్ బెర్లిన్ వెడుతున్న ప్రయాణీకులకి నిన్ను అప్పగిస్తుంది.

5. నీ విమానం ఢిల్లీలో 4.05కి బయల్దేరి – మాస్కోకి రష్యన్ స్టాండర్డ్ టైం ప్రకారం 8.00కి చేరుతుంది. అక్కడ నువ్వు సుమారు ఏడు గంటలు గడపాలి. అందుకుగానూ నీకు చక్కటి వసతి సదుపాయం ఏర్పాటు చేస్తారు. ఎప్పుడైనా ఏమైనా సాయం అవసరమైతే – విమానాశ్రయంలో ఏరోఫ్లోట్, ఎయిరిండియా వాళ్ల కౌంటర్స్ ఉంటాయి. అడిగి సాయం పొందవచ్చు.

6. విదేశాల్లో లెట్రిన్లని టాయ్‌లెట్లని వ్యవహరిస్తారు. పిల్లల్ని లెట్రిన్‌కి తీసుకెళ్లాలంటే, "టాయ్‌లెట్‌కి వెళ్లాలి" అని చెబితే ఎవరైనా దారి చూపిస్తారు. మాస్కో ఎయిర్‌పోర్టులో ఏడు గంటలుంటావు కాబట్టి, కాసేపటికే మీరంతా అక్కడి వాతావరణానికి అలవాటు పడిపోతారు. విమానాశ్రయం వెచ్చగా ఉంటుంది కాబట్టి చలి బాధ ఉండదు. విమానం తప్పిపోతుందన్న బెంగలేదు కాబట్టి నిశ్చింతగా ఉండొచ్చక్కడ. కాలం ఇట్టే గడిచిపోతుంది.

7. మాస్కోలో నీ ఫ్లైట్ నంబరు ఐఏ 113 (ఐఏ అంటే సోవియట్ యూనియన్ కావచ్చు). బయల్దేరే సమయం 15.50. ఆక్కణ్ణించి బెర్లిన్ చేరుకునేసరికి జర్మన్ స్టాండర్డ్ టైం ప్రకారం 16.15 ఔతుంది. అక్కడ నిన్ను నేను కలుసుకుంటాను. ఈలోగా మరొక్కసారి ఇంగ్లీషులో మాట్లాడాల్సి ఉంటుంది నువ్వు. మాస్కోలో విమానం ఎక్కేక, "క్షమించాలి. బెర్లిన్లో నా లగేజి ఎలా తీసుకోవాలో నాకు తెలియదు. మీరు సాయం చేస్తారా?" అనడిగితే చాలు. విమానం దిగగానే ఎయిర్ హోస్టెస్ నీకు లగేజి వచ్చే చోటు చూపిస్తుంది. అక్కడే చిన్న ట్రాలీలుంటాయి (కూలీలుండరు). నీ లగేజి ట్రాలీలో పెట్టుకుని తోసుకుంటూ బయటకు వస్తే, నిన్నూ, పిల్లల్నీ, మీ లగేజినీ పువ్వుల్లో పెట్టి ఇంటికి తీసుకెడతాను.

8. ఈ ప్రయాణం మొత్తంమీద రెండే రెండు సార్లు నువ్వు కాస్త పెద్ద ఇంగ్లీషు వాక్యాలు చెప్పాల్సి ఉంటుందంతే! ఎంత సులభమో చూసేవా! నీ ప్రయాణం జయప్రదంగా జరుగుతుంది. ఇంకా నీకేమైనా అనుమానాలుంటే – మా అన్నయ్య అంటే నీ బావగార్ని అడిగి తెలుసుకో.

9. స్వతహాగా ధైర్యవంతులైనవారికి – ధైర్యం చెబితే నీళ్లు కారిపోయే ప్రమాదముందని నాకు తెలుసు. నేనీ ఉత్తరం ఇలా వ్రాయడానికి కారణం నీ శక్తిని తక్కువ అంచనా వేసి కాదు. కానీ నా పిచ్చి నాది కదా! అసలే సందేహప్రాణిని. టికెట్సు పంపేదాకా పంపగలనా అని అధైర్యపడుతూ వచ్చాను. ఇప్పుడు నీ సంకల్పబలం తెలిసి కూడా – నువ్వు రానంటావేమోనని భయపడుతున్నాను.

10. విమానం ఎక్కేముందే స్వెటరు, సాక్సు, బూట్సు ధరించడం మంచిది. మఫ్లర్లు కూడా దగ్గరుంచుకోండి. ప్రస్తుత వాతావరణం కాస్త మెరుగ్గానే ఉంది. ఇక్కడ టెంపరేచర్ 6–10 డిగ్రీలుంటోంది. కానీ జనవరి 7కి ఎలా ఉంటుందో తెలియదు కదా!

11. ఏడు అంకె వేసినప్పుడు మధ్యలో అడ్డ గీత పెట్టడం మంచిది. ఇక్కడ వీళ్లు వ్రాసే 1, 7 ఇంచుమించు ఒక్కలాగే ఉంటాయి. తేడా తెలియడానికి ఆ అడ్డగీత అవసరం. పిల్లలిద్దర్నీ చూడాలని తపించిపోతున్నాను. ఈ ఉత్తరం అందిన వెంటనే ఒక ఉత్తరం రాస్తావని ఆశ. ప్రస్తుతం నాకు క్షణాలు యుగాలకంటే పెద్దవిగా తోస్తున్నాయి. నువ్విక్కడికి రాగానే – నైలెక్స్ చీరల విషయమై ఆకర్షణీయమైన సమాచారం చెబుతాను....."

ఉత్తరం చివర సంతకం పెట్టి వెంటనే పోస్ట్ చేశాను.

ఈ ఉత్తరం శ్రీమతికి మంచి సమయంలో అందాలి. ప్రయాణానికి ఆమెను సుముఖం చెయ్యాలి. నావాళ్లతో ఇక్కడ కలిసి గడిపే అదృష్టానికి నేను నోచుకోవాలి.

శ్రీమతిని ప్రయాణానికి సుముఖం చెయ్యడానికి వ్రాసిన ఈ ఉత్తరంకోసం నా తెలివినంతా వెచ్చించాను. ఇక నా ఆశలన్నీ ఆ ఉత్తరంమీదే!

ఐతే....

ఒకప్పుడు రుక్మిణి ఇలాగే అగ్నిజోతనుడు అనే బ్రాహ్మణుడిచేత తన ప్రియుడైన శ్రీకృష్ణునికి లేఖ పంపింది. పంపేక ఆమె మనసు తేలిక పడిందా – లేదు. గజేంద్రమోక్షంలో 'సిరికిం జెప్పడు' అన్నట్లే – అప్పటి రుక్మిణి మనోభావాల్ని సర్వకాలీనంగా విశ్లేషించిన పోతన ఘనతకి అప్పటి నా మనోభావాలే గొప్ప నిదర్శనం.

ఘనుడా భూసురుడేగెనో

ఇండియాలో కలకత్తాలో జరుగుతున్న ఏర్పాట్ల విషయంలో నా పాత్ర పూర్తయింది. అక్కడ వాళ్లు చెయ్యగలిగింది చేస్తే – ఇక్కడ నేను నావాళ్లని రిసీవ్ చేసుకుందుకు జనవరి ఏడున సిద్ధంగా ఉండాలి.

ఐతే దిగితే కానీ లోతు తెలియదన్న సామెతని మర్చిపోలేదు. అందుకని నా సమస్య లోతుల్ని అవగాహన చేసుకునే ప్రయత్నంలో ఉన్నాను.

మనిషి సంఘజీవి అంటారు కానీ – నాది మాత్రం ఏకాంతాన్నీ, ఒంటరితనాన్నీ ఎక్కువగా ప్రేమించే తత్వం. అలాంటి నేను ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఒంటరితనానికి భయపడుతున్నాను. ఒకే దారిలో వెడుతూ కలవరపెట్టే నా ఆలోచనల దారి మళ్లించడానికి స్నేహితులకు మించిన సాధనం ఉండదనిపించింది.

మనిషి సంఘజీవి. ఏకోన్ముఖుడు కూడా మనిషే కదా! ఏకాంతాన్ని ఎక్కువ ఇష్టపడ్డా సమాజాన్ని వదిలి వెళ్లడుగా! అంటే సమాజమంటే ఇష్టమే కదా! అంటే ఏకోన్ముఖుడితో సహా ఏ మనిషైనా సంఘజీవే మరి!

అప్పటికే నాకు మంచి మిత్రులు చాలామందే ఏర్పడ్డారక్కడ. అవసరానికి ఆదుకునేవాడే నిజమైన మిత్రుడంటుంది ఆంగ్ల సామెత. ఆ సామెతని ఆసరా చేసుకుని, నిజమైన మిత్రుల్ని గుర్తించాల్సిన సమయం వచ్చిందనిపించింది నాకప్పుడు.

నేను ఇండియాకి టికెట్లు పోస్టు చేసింది డిసెంబర్ 20న. ఆ రోజు శుక్రవారం. తర్వాత శని ఆదివారాలు ఎలాగూ సెలవులే. సోమవారం అనగా డిసెంబర్ 23 ఒక్క రోజుకి ఆఫీసుంది. ఆ మర్నాడు అంటే డిసెంబర్ 24 నుంచి క్రిస్మస్ సెలవులు మొదలు. తర్వాత మళ్లీ ఆఫీసు తెరిచేది జనవరి 2నే.

జర్మనీలో క్రిస్మస్ రోజుల్ని వైనాక్టెన్ అంటారు. మనకు సంక్రాంతిలా అది వారికి పెద్ద పండుగ.

అసలే సంపన్న దేశం. ఆపైన వైభవాన్ని ప్రదర్శించే తత్వమున్న ధనస్వామ్య దేశం. ఆ వేడుకలు చూడ కళ్లు చాలవు కదా!

ఎక్కడ చూసినా కళ్లు చెదిరేలా అలంకరణలు. ఉత్తప్పుడే పండుగ రోజుల్ని మరిపించే దుకాణాలు, పండుగ ఆలంకరణలతో మరింత శోభాయమానమయ్యాయి.

పాశ్చాత్యుల పండుగ వేడుకలు వారి దేశంలోనే చూడ్డం ఒక అపూర్వావకాశం. కానీ ఆ వేడుకలు నాలో అంతగా ఉత్సాహాన్ని నింపలేదు.

కొద్ది రోజుల్లో నావాళ్లు వస్తున్నారని తెలిసేక – ఎక్కడ ఏ వింత చూసినా – కొద్ది రోజులు ముందొచ్చి ఉంటే మావాళ్లూ చూసి ఉండేవారు కదా అనిపించేది. వాళ్లతో పంచుకోలేకపోతున్నానన్న బాధ కలిగి, అదో రకం దిగులు నన్నావహించేది.

క్రిస్మస్ వేడుకలకి వీధులన్నీ అలంకరించబడ్డాయి. ఎన్నోచోట్ల కొత్త కొత్త తీర్థాలొచ్చాయి. అవి ల్యూనబర్గులో చూసిన తీర్థాలకంటే గొప్పగా ఉన్నాయి.

మన దేశంలోనే తీర్థాలు ఎంతో బాగుంటాయి. ఆ తీర్థాలకు ఆధునిక సదుపాయాలు తోడయ్యాయిక్కడ. రంగులరాట్నాలే కాక, రకరకాల ఆటలున్నాయి.

అక్కడ చిన్నపిల్లలు హుషారెక్కి ఆటలాడేవారు. వాళ్ల ఆటల్ని మెరిసే కళ్లతో గమనించేవారు తలిదండ్రులు. వాళ్లని చూస్తుంటే నాకు నావాళ్లు గుర్తుకొచ్చి మనసు పాడయ్యేది.

ఇన్ని వైభవాలమధ్య, ఆకర్షణల మధ్య – నా మనసు కేవలం నావాళ్ల చుట్టూ పరిభ్రమించడానికి కారణం – భారతీయ వైవాహికవ్యవస్థ ప్రత్యేకత అనిపిస్తుంది నాకు.

యూరోపియన్సుకి క్రిస్మస్ చాలా ముఖ్యమైన పండుగ. కుటుంబ సభ్యులందరూ ఏదో ఒకచోట కలుసుకునే సందర్భం కూడా వారికిదే!

అదలాగుంచితే – ఇక్కడ అభిమానాన్ని కానులతో కొలుస్తారు. బంధుమిత్రులు పరస్పరానురాగాన్ని వ్యక్తపర్చుకుందుకు – కానుకలు ఇచ్చిపుచ్చుకుంటారు. ఇచ్చిన బహుమతి నాణ్యతను బట్టీ, ఖరీదునుబట్టీ – అనురాగాల అంచనా ఉంటుంది.

లాబొరెటరీలో నా కొలీగ్ కిర్షనర్‌కి ఫొటోగ్రఫీ హాబీ. అతడివద్ద ఖరీదైన కెమేరా ఉంది. ఈ క్రిస్మస్‌కి అతని తండ్రి సుమారు రెండువేల మార్కులు పెట్టి కెమేరాకి కొత్త అటాచ్‌మెంట్స్ కొనిచ్చాడు. వాటినతను లాబ్‌లో మాకు చూపించి తెగ మురిసిపోయాడు.

తండ్రీ బిడ్డలే కాదు – భార్యాభర్తలు కూడా ఒకరికొకరు కానుకలిచ్చుకుంటారు క్రిస్మస్ సమయంలో. వారి దాంపత్య జీవితంపైన ఆ కానుకల ప్రభావం – మళ్లీ క్రిస్మస్ దాకా ఉంటుంది. పండుగ పేరు చెప్పి భార్యాభర్తలు కూడా ఒకరికొకరు విధిగా కానుకలిచ్చుకోవడమనేది నాకు చిత్రమనిపించింది.

మా ఇంట్లో ఎకానమీ వేరు. ఆదాయాన్ని బేరీజు వేసుకుని, అవసరాల్ని బట్టి ఎవరికి ఏమవసరమో పరస్పరం చర్చించుకుని – కొనుగోళ్లు చెయ్యడం మా పద్ధతి. మా వద్దనున్న డబ్బు మా ఇద్దరిదీ. దాని వినియోగ బాధ్యత కూడా మా ఇద్దరిదీ. రివాజుగా కానుకలు కాక – అవసరాన్నో, సందర్భాన్నో పురస్కరించుకుని – కొనుగోలు చేయడం మా అలవాటు. అవసరాలకి మించిపోయిన ఆదాయం ఉంటే – బహుశా మా ఆలోచనలూ ఇక్కడి ధోరణిలోనే ఉండేవేమో!

ఏదేమైనా దంపతులు ఒకరినొకరు కానుకలతో మెప్పించాలనే భావన నాకంతగా మింగుడు పడలేదు.

డిసెంబర్ 21 శనివారం ఉదయం పెందరాళే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, బ్రెడ్ తినేసి ఓంప్రకాష్ ఉండే హాస్టలుకి వెళ్లిపోయాను.

రోగానికి రొష్టంటారు కదా! ప్రస్తుతం నా సమస్యే నా రోగం. దాన్ని హాస్టలు మిత్రుల మధ్య చర్చకి పెట్టాను.

ఏరోఫ్లోట్‌లో బెర్లిన్ రావడం చాలామందికి మామూలేననీ, బెంగపడాల్సిందేం లేదనీ కొందరు నాకు ధైర్యం చెప్పారు.

ఒకతనికి ఈస్ట్ జర్మనీలో ఓ గర్ల్‌ఫ్రెండుందట. అవసరమైతే ఆమె సాయం తీసుకోవచ్చన్నాడు.

ఓసారి నేను, ఓంప్రకాష్ – అక్కణ్ణించి వెళ్లి – ఈస్ట్ జర్మనీకి వీసా ఇచ్చే ఆఫీసు, ఏరోఫ్లోట్ ఆఫీసు చూసుకొచ్చాం. అన్నింటికీ సెలవులే. తలుపులు మూసి ఉన్నాయి. వెనక్కి వచ్చేక, "ఈ రోజంతా నువ్విక్కడే గడపాలి" అని హాస్టల్ మిత్రులు బలవంతపెట్టారు.

రోగి కోరిందే వైద్యుడు మందుగా ఇస్తే కాదనడానికేముంది – సరేనన్నాను.

శనివారం సెలవు కదా – మామూలుగా ఆ రోజు వాళ్లంతా కలిసి భారీగా వంటలు చేస్తారు.

ఆ రోజు ఘుమఘుమలాడే మసాలా పెట్టి లేడిమాంసంతో కూర చేశారు కొందరు. ఓంప్రకాష్ నాకోసం వంకాయ పెరుగుపచ్చడి చేశాడు. అతడది చేసిన విధానం కొత్తగా ఉంది నాకు.

ముందుగా పెరుగు తీసుకుని దానిలో ఉప్పు, పచ్చిమిర్చి, పసుపు, కొత్తిమీర వగైరాలు వేశాడు. తర్వాత పోపు పెట్టాడు. అప్పుడు వంకాయలు తీసుకుని మందంగా చక్రాల్లా తరిగి ఒకొక్క చక్రాన్నే విడివిడిగా నూనెలో వేసి అటు తిప్పి ఇటు తిప్పి వేయించాడు. వేగిన ముక్కల్ని పెరుగులో వేసి ఆవడల్లా నానబెట్టాడు.

అంతా కలిసి రకరకాల వంటకాలు చేశారు కానీ, అన్నింట్లోకీ వంకాయ పెరుగుపచ్చడే ఎక్కువ బాగుందని అంతా ఊదేశారు. లేడి మాంసం కూరయితే పాకాన పడలేదని కొందరు బాధపడ్డారు.

నేను ఓంప్రకాష్‌ని మెచ్చుకుని, "వంకాయ పెరుగుపచ్చడి ఇలా కూడా చెయ్యొచ్చని నాకు స్ఫురించలేదు. చాలా బాగుంది" అన్నాను.

ఓంప్రకాష్ వెంటనే, "ఇది నువ్వు చేసిన పాటోళీముందు దిగదుడుపు" అన్నాడు. అతనితో మరి నాలుగు గొంతులు కలిశాయి.

ఆ పాటోళీ వెను చిన్న కథ ఉంది.

శ్రీమతి వచ్చేలోగా మిక్సీ ఒకటి ఇంట్లో ఉండాలని నా కోరిక. ఇండియాలో ఉండగా మిక్సీ మా కల. కానీ నెల జీతం ఆరొందలైతే మిక్సీ ఖరీదు ఎనిమిదొందలు. అందుకని వాయిదా వేస్తూ వచ్చాం. అక్కడి అసాధ్యమిక్కడ సుసాధ్యం కాబట్టి వెంటనే మిక్సీ కొనాలనుకున్నాను. నేరుగా బ్రౌన్ కంపెనీ సేల్స్ కౌంటర్‌నుంచి కొంటే చవగ్గా వస్తుందని ఓంప్రకాష్ చెప్పాడు. అలా మిక్సీ కొన్నాక – ఒక రోజు నేను మిక్సీలో పెసరపప్పు రుబ్బి పాటోళీ చేశాను. భోంచెయ్యబోతుండగా ఓంప్రకాష్ మరో నలుగురితో కలిసి నా రూంకొచ్చాడు. వాళ్లకి పాటోళీ రుచి చూపిస్తే – బాగుంది బాగుందంటూ మొత్తం ఊదేశారు. వాళ్లు వెళ్లేక – నేను మరో కూర వండుకోవాల్సి వచ్చింది.

అదే ఇప్పుడు ఓంప్రకాష్ గుర్తు చేశాడు.

హాస్టల్లో ఉండడంవల్ల శనివారం ఇట్టే గడిచిపోయింది. కానీ మర్నాడు ఇంట్లో గడపడంవల్ల ఆదివారం క్షణమొక యుగమైంది. మనసునిండా అనుమానాలు, బెంగతో ప్రతి యుగమూ మహాభారం.

సోమవారం ఆఫీసుకి వెళ్లాను. అంతా సెలవుల మూడ్‌లో ఉన్నారు. నా గోడు విన్నారో లేదో తెలియదు కానీ పనికొచ్చే సమాచారం కానీ. సూచనలు కానీ, సలహాలు కానీ నాకు లభించలేదు.

మధ్యాహ్నం ఓంప్రకాష్‌ని తీసుకుని ఏరోఫ్లోట్ ఆఫీసుకి వెళ్లాను. ఆశ్చర్యమేమిటంటే వాళ్లు కూడా నాకు శ్రీమతిని రిసీవ్ చేసుకునే విషయమై సరైన సమాచారమేదీ ఇవ్వలేకపోయారు.

అక్కణ్ణించి ఈస్ట్ జర్మనీ వీసా ఆఫీసుకి వెళ్లాం. వాళ్లు చెప్పిన ప్రకారం నేను వెస్ట్ బెర్లిన్లో బస్సెక్కి ఈస్ట్ జర్మనీలో ఎయిర్‌పోర్టుకి వెళ్లి నావాళ్లని రిసీవ్ చేసుకోవచ్చు.

వినడానికి బాగానే అనిపించినా – వాళ్లు చెప్పిన పద్ధతి నాకు ఏమాత్రం ప్రోత్సాహకరంగా అనిపించలేదు. పైగా భయం కూడా వేసింది.

ఇక వీసా తీసుకోవడం ఒక్కటే మంచి మార్గమని అర్థమైపోయింది. కానీ దానికి చాలా తతంగమున్నదిట. ఇప్పుడు మొదలెడితే ఇంకో నెల్లాళ్ల తర్వాత మాటట!

చేసేదేముంది? హతాశుణ్ణై అక్కణ్ణించి తొందరగా బయటపడి ఆఫీసుకి వెళ్లాను.

అప్పటికి రాలెక్ వచ్చాడు. ఆయనకి కటక్‌నుంచి తెచ్చిన ఫిలిగ్రీ (వెండి) ఐటం ఒకటి కానుకగా ఇచ్చాను. ఆయన ముఖంలో సంతోషంకంటే ఆశ్చర్యం ఎక్కువ కనబడింది.

"మీరింకా ఇక్కడే ఉన్నారా?" అన్నాడాయన. ఈ పాటికి నేను యూరప్ టూర్లో ఉంటాననుకున్నాడుట ఆయన.

నేనాయనకు మావాళ్ల ప్రయాణం గురించీ, ఇతర సమస్యల గురించీ చెప్పలేదు.

ఈలోగా నాకు ఓంప్రకాష్‌నుంచి ఫోను. ఆ మధ్య రెడ్డి అనే అతని భార్య ఏరోఫ్లోట్‌లోనే బెర్లిన్ వచ్చిందట. ఆమెని రిసీవ్ చేసుకుందుకు నారాయణస్వామి అనే అతను సాయపడ్డాడట. నారాయణస్వామి కూడా లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టల్లోనే ఉంటున్నాడు. నేనతణ్ణి స్వయంగా కలుసుకుని మాట్లాడితే ప్రయోజనముండొచ్చు.

లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టలు మెయిన్ గేటు – ఉదయం ఎనిమిదినుంచి రాత్రి ఎనిమిదివరకూ తెరిచే ఉంటుంది. మిగతా సమయాల్లో గేటు మూసి తాళం వేస్తారు. ఐతే హాస్టల్లో ఉండేవాళ్లందరికీ ఆ తాళానికి డూప్లికేట్ కీ ఉంటుంది. నేను ఎప్పుడు పడితే అప్పుడు హాస్టలుకొచ్చి వెడుతూండడానికని – హాస్టల్ మిత్రులు తమలో తాము అడ్జస్టు చేసుకుని నాకో డూప్లికేట్ కీ ఇచ్చారు.

నేను వెంటనే హాస్టలుకి వెళ్లి ఓంప్రకాష్‌తో కలిసి నారాయణస్వామిని చూడ్డానికి వెళ్లాను.

"అదంత సులభం కాదు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ తెలివిగా మసలాలి. ఇలాంటి విషయాల్లో నాకు నేనే సాటి. నేనుంటే నీ పని సులభంగా ఐపోయేది. కానీ రెండ్రోజుల్లో హాంబుర్గ్ వెళ్లిపోతున్నాను. సారీ!" అన్నాడతను.

ఆ పని నావల్ల కాదుట. తనవల్ల ఔతుంది కానీ, తనుండడట.

అతనిచ్చిన సమాచారం అతని గొప్పతనాన్ని తెలుసుకుందుకే తప్ప నాకే విధంగానూ ఉపయోగపడేలా లేదు.

అప్పుడు నా ఆలోచనలు చాలా దూరం వెళ్లాయి. శ్రీమతి, పిల్లలు ఈస్ట్ బెర్లిన్లో విమానం దిగి, తమని పలకరించే నాథుడు లేక అక్కడే ఉండిపోయి.....

"బాగా డల్లయిపోయావ్" అన్నాడు ఓంప్రకాష్ నా మొహం చూసి జాలిగా.

"నామీద జాలిగా ఉంది కదూ! కానీ నాకిప్పుడు కావాల్సింది జాలి కాదు" అన్నాను దిగులుగా.

ఓంప్రకాష్‌కి నా ఉక్రోషం అర్థమైనట్లుంది. చటుక్కున పక్కనున్న బల్లమీది అద్దం తెచ్చి నా ముందుంచి చేత్తో పట్టుకున్నాడు.

అద్దంలో నా ప్రతిబింబం చూసి ఎవరో అనుకుని, విపరీతంగా జాలిపడిపోయి, "ఈ మొహం చూస్తుంటే అనిపిస్తోంది, నాకంటే దీనదశలో ఉన్నవారు ఇంకా ఉన్నారన్నమాట!" అన్నాను అప్రయత్నంగా.

"ఆ మొహం నీదే! ఇప్పటి పరిస్థితుల్లో నువ్వు కూడా నిన్ను చూసి జాలిపడేలా ఉంది నీ మొహం. మరి నేను జాలిపడనా?" అన్నాడు ఓంప్రకాష్.

"నీ జాలికి సంజాయిషీ ఉంది. నా సమస్యకి పరిష్కారం లేదు" అన్నాను దీనంగా.

"అలా దిగులు పడకు. ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం ఉంటుంది. అదేంటో నేను కనుక్కుంటాను. ఇకమీదట ఆ బాధ్యత నామీద పెట్టి నిశ్చింతగా ఉండు" అన్నాడు ఓంప్రకాష్.

అతనలా అనడానికి కారణముంది. ఆఫీసులో నా జర్మన్ కొలీగ్ హైనర్ డెకర్ట్ శ్రీమతి ప్రయాణ విషయమై నాకో ఆఫరిచ్చాడు. నావాళ్లని ఎయిరిండియాలో తీసుకొస్తే కనుక, టికెట్ ఆమ్‌స్టర్‌డామ్‌కి తీసుకోమన్నాడు. తను, భార్య ఆమ్‌స్టర్‌డామ్ ట్రిప్పు వేసుకుంటారుట. ఆ కార్లో నేనూ వెళ్లి – నావాళ్లను రిసీవ్ చేసుకుని, అంతా కలిసి ఆమ్‌స్టర్‌డామ్ నగరాన్ని సందర్శించుకుని సరదాగా గడిపి వెనక్కి వచ్చేద్దామన్నాడు.

ఆఫర్ బాగుంది. కానీ నాకు తెలిసి ఇండియాలో ఇలాంటి ఆఫర్స్ మాటవరసకి ఇస్తారు. నిజంగా మనం అడిగితే ఏదో వంక పెట్టి తప్పించుకుంటారు. అదీకాక నాకు ఆర్థికపరంగా ఎదుటివారికి భారం కావడం ఇష్టముండదు. ఆ విషయం ఒకసారి ఓంప్రకాష్‌కి చెప్పాను.

"ఇక్కడివాళ్లు మనవాళ్లలా కాదు. సాయం చెయ్యాలనుంటే అడిగి కూడా చేస్తారు. ఇష్టం లేకపోతే అడిగినా నిర్మొహమాటంగా సారీ చెబుతారు. కాబట్టి నువ్వు నీ మిత్రుడి మాటలు నమ్మొచ్చు. కానీ ఎయిరిండియా టికెట్సు ఖరీదెక్కువ. ఏరోఫ్లోట్ ఐతే మనకి చౌకలో ఐపోతుంది" అన్నాడు ఓం ప్రకాష్.

ఓంప్రకాష్ ఇప్పుడది గుర్తు చేసుకుని, "ఏరోఫ్లోట్ ప్రయాణంలో ఇన్ని ఇబ్బందులుంటాయని నేనూహించలేదు. కాస్త డబ్బెక్కువైనా ఎయిరిండియాలోనే బుక్ చెయ్యాల్సింది. జరిగిందిప్పుడు వెనక్కి తీసుకోలేం. జరిగిందానికి బాధ్యత నాది కాబట్టి, నీకిప్పుడు నేనే ఏదో ఓ దారి చూపించాలి, చూపిస్తాను" అన్నాడు.

మర్యాదకి అతనలా అన్నాడు కానీ – అన్ని విషయాలూ కూలంకషంగా విచారించకపోవడంలో తప్పు నాది. విమానం బెర్లిన్ అంటే నేరుగా బెర్లిన్‌కే వస్తుందనుకున్నాను తప్ప ఆ వచ్చేది ఈస్ట్ బెర్లిన్‌కి అయుండొచ్చని తట్టలేదు. ఆపైన తూర్పు బెర్లిన్ విమానాశ్రయం – నగర సరిహద్దుల్లో కాకుండా తూర్పు జర్మనీలో భాగంగా ఉంటుందనీ ఊహకందలేదు.

ఆ విషయం అతనికి చెప్పాను.

"ఈ డిస్కషనంతా వేస్ట్. మనమిప్పుడు పని చూడాలి. మాది మామూలు హాస్టలు కాదు. ఇండియాలో బెస్ట్ బ్రెయిన్సన్నీ చేరి ఇక్కడ ఉపాయాల పుట్టలు పెట్టాయి. ఏ పుట్టలో ఏముంటుందో! ఇంతవరకూ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నాం. నౌ ఆయాం సీరియస్. పద" అన్నాడు.

ప్రతి మనిషికీ మనసుంటుంది. మనసుంటే మార్గముంటుంది. ఆ రెండు విషయాలూ తరచుగా విస్మరించి దిగులు పడ్డం మనిషికి మామూలు.

మేమింకా అడక్కుండానే, నా సమస్యకి పరిష్కారం హాస్టల్లో ఓ వ్యక్తి రూపం దాల్చి మాకోసం ఎదురుచూస్తోంది. ఆ రూపం పేరు నాని.

నాని అసలు పేరు అది కాదు. కానీ అక్కడంతా అతన్నలాగే పిలుస్తారు. బ్రహ్మచారి. నాకులాగే శాకాహారి. మైసూర్‌లో స్థిరపడ్డ ఆంధ్రుడు. తెలుగు బాగా మాట్లాడగలడు.

"మీ సమస్య గురించి విన్నాను. ఇది ముందే నాకెందుకు చెప్పలేదు?" అన్నాడతను.

"ఏం చెప్పను? చెప్పినచోటల్లా మొండి చెయ్యే ఎదురైంది" అందామనుకుని ఊరుకున్నాను.

"నేను చేస్తున్న కోర్సులో తూర్పు జర్మనీకి టూర్లు పడుతుంటాయి. అక్కడికి ఎప్పుడు కావాలంటే అప్పుడు తక్షణం వీసా పొందే సదుపాయముంది నాకు. నేను వీసా తీసుకుని మీవాళ్లని రిసీవ్ చేసుకోగలను" అన్నాడతను.

కొండంత భారం దిగినట్లయింది. నానిని చూస్తే శ్రీకృష్ణపరమాత్మలా కనిపించాడు.

ఓంప్రకాష్ నానిని కౌగలించుకుని, "థాంక్యూ వెరీమచ్! నా పరువు కాపాడేవు" అన్నాడు.

నాని అతన్ని విడిపించుకున్నాడు. నాకో కాగితం చూపించాడు. అది తూర్పు జర్మనీ అతనికిచ్చిన అనుమతి పత్రం.

"హుర్రే" అని అరవాలనిపించింది. నిభాయించుకున్నాను.

ఐనా మనసులో ఏదో మూల పీకుడుంటుంది కదా! మర్నాడు నానితో కలిసి వీసా ఆఫీసుకెళ్లి నానికి వీసా తీసుకునేదాకా అదలా పీకుతూనే ఉంది.

తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాను. హాస్టల్‌కి బై చెప్పాను. నా రూంకెళ్లాను.

లియోపాల్డ్‌ప్లాట్జ్ హాస్టలు ఓ ఉపాయాల పుట్ట అన్నాడు ఓం ప్రకాష్. మరి నాకేమో గ్యోతే స్ట్రాసేలోని నా ఇల్లొక అనుమానాల పుట్ట.

నేను పంపిన టికెట్లు సకాలంలో ఇండియా చేరుకుంటాయా? అన్నయ్య పాస్‌పోర్టు వగైరాలు సకాలంలో ఏర్పాటు చెయ్యగలడా? మాస్కోలో ఏడు గంటలుండి విమానం మారే ప్రయాణానికి శ్రీమతి మానసికంగా సంసిద్ధమౌతుందా?

ఈ ప్రశ్నలకు జవాబులు తెలియాలంటే నావాళ్లనుంచి ఉత్తరాలు రావాలి. శ్రీమతి తన ఉత్తరాలన్నీ ఆఫీసు అడ్రసుకే వ్రాస్తుంది. ఇప్పుడు ఆఫీసుకి వరుస సెలవులు.

ఇకమీదట ఉత్తరాలన్నీ ఇంటి అడ్రసుకే వ్రాయమని చెప్పకపోవడం నేను చేసిన పొరపాటు.

ఎందుకిలా జరిగిందని నన్ను నేనే తిట్టుకుంటుంటే చటుక్కున ఓ విషయం గుర్తొచ్చింది.

ప్రస్తుతం సెలవులే ఐనా డిసెంబర్ 27, 31 తేదీలలో – ఉదయం పదినుంచి సాయంత్రం మూడున్నరవరకూ ఆఫీసు తెరచి ఉంచుతారు. జనవరి 2నుంచి ఆఫీసు మళ్లీ మామూలు వేళల్లో పని చేస్తుంది. ఆ విషయం నోటీసు బోర్డులో చదివాను.

అందుకని డిసెంబర్ 27న ఒంటిగంటకి బయల్దేరి ఆఫీసుకి వెళ్లాను.

జర్మనీలో ప్రతి హాస్టలుకీ, భవనానికీ, సంస్థకూ ఒక సూపర్వయిజర్ ఉంటాడు. వాటికి సంబంధించిన తాళాలన్నీ అతనివద్దనే ఉంటాయి. అతన్ని హౌస్ మయిస్టర్ అంటారు. మయిస్టర్ అంటే ఇంగ్లీషులో మాస్టరు.

నేను వెళ్లేసరికి హౌస్ మెయిస్టర్ సంస్థ ముఖద్వారానికి తాళం పెడుతున్నాడు. నన్ను చూడగానే ఇబ్బందిగా ముఖం పెట్టాడు.

"లోపల నాకు పని ఉంది" అన్నాను.

"సంస్థకి సెలవు. లోపలకి వెళ్లకూడదు" అన్నాడతను.

"ఆ విషయం నాకు తెలుసు కానీ...." అని ఆగాను. ఆ రోజు మూడున్నర దాకా ఆఫీసు తెరిచే ఉంటుందన్న నోటీసు గురించి చెప్పడానికి సంకోచించాను. నిజమే ఐనా, చెబితే చిన్నబుచ్చినట్లవుతుందని మొహమాటపడ్డాను.

"తిరిగి రెండో తేదీనే ఆఫీసు ప్రారంభమయ్యేది" అన్నాడు హౌస్ మయిస్టర్ నా మాట పట్టించుకోకుండా.

"లోపల చిన్న పని ఉంది" అన్నాను అభ్యర్థనగా.

అతను మెత్తబడ్డాడు, "వెళ్లిరా, వెయిట్ చేస్తాను" అన్నాడు.

లోపలకెడితే ఆఫీసు సెక్రటరీ గది తాళం వేసి ఉంది. నాకొచ్చే ఉత్తరాలు ఆ గదిలోనే ఉంటాయి.

వెనక్కొచ్చి హౌస్ మయిస్టర్‌కి ధన్యవాదాలు చెప్పాను.

"బిట్టే షోన్" (నోమెన్షన్‌కి వాడే పదం) అని అతను వెళ్లిపోయాడు.

అర్థమైంది. ఎక్కడైనా మనుషులంతా ఒక్కటే. పండుగ సమయాల్లో ఇక్కడివాళ్లూ నియమాలు అంత ఖచ్చితంగా పాటించరన్న మాట!

నోటీసు ప్రకారం ఆఫీసు మూడున్నర దాకా తెరిచుంచాలి. హౌస్ మయిస్టర్ వాటం చూస్తుంటే – డిసెంబర్ 31న అసలు ఆఫీసు తలుపులే తెరిచేలా లేడు.

"పాపం – అతనికీ పండుగే కదా" అనుకున్నాను. అదీకాక అతను తలుపులు తెరవకపోయినా ఎవరికీ ఇబ్బంది ఔతుందనుకోను. ఏడాది మాత్రం ఉండి వెళ్లేవాణ్ణి కాబట్టి నాకివ్వలేదు కానీ, చాలామంది రీసెర్చర్స్ వద్ద మాస్టర్ కీ ఉంటుంది. అదుంటే ఎవరికి వారు ఎప్పుడు పడితే అప్పుడు ఆఫీసుకి వస్తూపోతూండొచ్చు.

ఏమైతేమేం – జనవరి 2దాకా, అంటే మరో ఆరు రోజులవరకూ నాకు ఉత్తరాలు దొరకవు.

వండుకోవడం, తినడం, తిరగడం, పడుకోవడం. మధ్యమధ్య హాస్టలుకెళ్లి ఓంప్రకాష్ బృదంతో గడపడం. ఇదీ నా దినచర్య. వాటిలో డిసెంబర్ 28 రాత్రి అనుభవం మరువలేనిది.

పరీక్షా సమయం

ఆ రాత్రి అక్కడే ఉండిపోయాను. ఆటపాటలతో రాత్రి రెండయ్యేదాకా మెలకువగానే ఉన్నాం.

అన్నాళ్ల పరిచయంలో ఆల్కహాల్ విషయంలో లేని ఒత్తిడి ఆ రాత్రి నామీద పడింది.

అంతా వైన్ తీసుకుంటూ నన్నూ బలవంతపెట్టారు. మృదువుగా నిరాకరించాను.

"ఈ ఒక్కసారికి. ప్లీజ్, నాకోసం" అన్నాడు ఓంప్రకాష్.

"నో ఫోర్స్ ప్లీజ్" అన్నాను ఇంకా మృదువుగానే.

"వైన్ అంటే ద్రాక్షరసం. ఇది విస్కీ, బ్రాందీల లాంటిది కాదు" అన్నాడు ఓంప్రకాష్.

"నేను ద్రాక్షరసం తాగాలన్నది నీ కోరిక ఐతే, తప్పక తాగుతాను" అంటూ అక్కడ ప్లేట్లో ఉన్న ద్రాక్షపళ్లలో రెండు నోట్లో వేసుకుని – "ఆహా, వీటి రసం ఎంత మధురంగా ఉంది!" అన్నాను.

ఓంప్రకాష్‌కి కాస్త కోపమొచ్చింది. "అయితే వైన్ తాగుతున్న మేమంతా పాపాత్ములమనా, నీ అభిప్రాయం?" అన్నాడు.

"తాగడం పాపం కాదు. తాగినవాళ్లు పాపాత్ములు కారు. కానీ ఇష్టం లేనివాళ్లని తాగమని బలవంతపెట్టడం పాపం" అన్నాను నవ్వుతూనే.

కానీ అక్కడి వాతావరణం చూస్తుంటే నాకు మనసులో భయం మొదలైంది.

అంతమందిలో నేనొక్కణ్ణి. నిషా తలకెక్కితే వాళ్లు నన్ను బలవంతం చేసినా చెయ్యొచ్చు.

తాగితే ఏదో ఐపోతుందని కాదు. ఇష్టం లేనప్పుడు బలవంతాన తాగడమెందుకు?

ఓంప్రకాష్ కోపం తగ్గింది, "యూ ఆర్ గ్రేట్. ఓకే, యూ రిమెయిన్ గ్రేట్" అన్నాడు నవ్వి.

ఈ తాగుడు తతంగం రాత్రి పదికి మొదలై – రెండయ్యేదాకా కొనసాగింది.

"కనీసం కంపెనీకైనా నువ్వేం తీసుకోవడం లేదు" అన్నాడు ఓంప్రకాష్.

"కంపెనీకి గ్లాసే ముఖ్యం. గ్లాసులో ఏముందన్నది కాదు...." అంటూ నేనో గ్లాసందుకుని, అందులోకి ఆపిల్ జ్యూస్ ఒంపుకున్నాను. వాళ్లు వైన్ సిప్ చేస్తున్నట్లే నేనది సిప్ చేశాను.

మా మధ్యలో ఒక గాజు పళ్లెముంది. దాంట్లో వేరుసెనగ పప్పులున్నాయి. మధ్యమధ్య అది నములుతున్నాం.

ఆ గదిలో మొత్తం ఎనమండుగురం. నేను తప్ప అంతా వైన్ పుచ్చుకుంటున్నారు. అందరినుంచీ ఆల్కహాలు వాసన. అందరి కళ్లూ ఎర్రజీరలతో, మత్తుగా, అదోలా ఉన్నాయి.

వాళ్లనలా చూడ్డం నాకదో అనుభూతి. వాళ్లకి వాళ్లమధ్య నేనో వింత.

కానీ నేను నన్ను నిగ్రహించుకోవడం లేదు. నాలో కోర్కెని చంపుకోవడం లేదు. వారికి అమృతప్రాయమైన ఆ పానీయం నాలో ఏ ఆసక్తినీ కలిగించడం లేదు. అది నా అదృష్టమని నేననుకోవచ్చు. దురదృష్టమని కొందరనుకోవచ్చు. కానీ విషయమదే!

"ఐ కాన్ట్ బట్ అడ్మయిర్ యువర్ కంట్రోల్" అన్నాడు నాని అభినందనపూర్వకంగా.

"ఈజిట్ అప్రీసియేషన్ ఆర్ పిటీ" అన్నాను నేను వెంటనే.

"ఇటీజ్ సింపుల్ అప్రీసియేషన్. మరి నీకా డౌటెందుకొచ్చింది?" అన్నాడు నాని. అతను తనని నాన్ ఆల్కహాలిక్ అనే అనుకుంటాడు. ఎందుకంటే అతను తీసుకునేవి వైను, బీరు మాత్రమేనట. అవి ఆల్కహాలు కింద లెక్క రావట. వైన్ వల్లనే తనీ జర్మనీ వాతావరణంలో మనగలుగుతున్నానంటాడతను.

"అది ఆల్కహాలవనీ, వైనవనీ, బీరవనీ – ఆ అలవాటు చెడ్డదని మీరు భావిస్తున్నారని నేననుకోను. అలా భావించి ఉంటే మీరూ ఆ అలవాటుకి దూరంగా ఉండేవారు. ఇందులో మీరేదో ఆనందం పొందుతున్నారు. ఆ ఆనందానికి నేను దూరమౌతునాన్నని జాలి పడుతున్నారు. ఆ జాలితోనే తాగమని నన్ను బలవంత పెడుతున్నారు" అన్నాను.

"ఆమాత్రం గ్రహించావుగా – కాబట్టి నేను చెప్పేది విను డాక్టర్ రావ్! ఈ వైన్‌లో మజా తెలుసుకుందుకైనా ఒక్కసారి నువ్వు తాగాలి. జీవితంలో నీకిది అపూర్వావకాశం. మళ్లీ దొరుకుతుందో లేదో తెలియదు. ఎందుకంటే ఈ క్వాలిటీ మన దేశంలో దొరకదు. దొరికినా ధర మనబోటిగాళ్లకి అందుబాటులో ఉండదు" అన్నాడు ఓంప్రకాష్ అభ్యర్థనగా.

అతనన్నది నిజమే. మన దేశంలో వందల రూపాయల ఖరీదుండే బ్లాక్ అండ్ వైట్ విస్కీ బాటిల్ ఇక్కడ పదకొండు మార్కులు. అపురూపంగా భావించి తక్కువ డోసుల్లో పుచ్చుకునే కోన్యాక్ బ్రాందీ బాటిల్ ఇక్కడ పదమూడు మార్కులు.

"నేను తాగినా తాగకపోయినా, మీ మనసుకి తృప్తి కలిగించే కథ ఒకటి చెబుతాను" అన్నాను.

"తృప్తి అంటే మాకు కిక్‌తోనే వస్తుంది. నువ్వు తాగకుండా మాకు కిక్ ఇవ్వగలవా?" అన్నాడు నాని.

నేను కథ చెప్పాను. "ఒకసారి లక్ష్మీదేవి, అదృష్టదేవత – నేను గొప్పంటే నేను గొప్ప అని తమలో తాము వాదించుకున్నారు. తమ గొప్పతనాన్ని నిరూపించుకుందుకు అప్పుడలా దారిన పోతున్న ఓ బికారిని ఎన్నుకున్నారు. లక్ష్మీదేవి బికారి నడిచే దారిలో బాట మధ్యలో బంగారు కాసుల మూట ఒకటి ఉంచింది. మూట కాస్త దూరంలో ఉందనగా బికారికి కళ్లు మూసుకుని నడవాలని కోరిక పుట్టింది. మూట

దాటి వెళ్లేకనే వాడు కళ్లు తెరిచాడు. తనకి లక్ష్మీకటాక్షం కలిగినా కాసుల మూట పోగొట్టుకున్నానని వాడికి తెలియదు. కళ్లు మూసుకుని చాలా దూరం నడిచేనని తెగ మురిసిపోయాడు''

"కథ బాగుంది. ఇది మాకెందుకు చెప్పినట్లు?" అన్నాడు ఓంప్రకాష్.

"ఇండియాలో ఉండగా నేనెలాగూ వైన్ తాగలేని బికారినే. జర్మనీ వచ్చేక – ఇక్కడ తాగకుండా ఉండగలనా అని నన్ను నేను పరీక్షించుకోవాలన్న కోరిక పుట్టింది. వైను కటాక్షించినా ఏం లాభం?" అన్నాను.

అంతా ఘొల్లుమన్నారు. "ఐ అప్రీషియేట్ యువర్ సెన్సాఫ్ హ్యూమర్'' అని, "యు ఆర్ గ్రేట్ అండ్ ఆల్సో మై గుడ్ ఫ్రెండ్. నీమీద నువ్వు జోక్స్ వేసుకుంటే నాకు నచ్చదు'' అన్నాడు ఓంప్రకాష్ అభిమానంగా.

"ఆ విషయం నాకు తెలుసు. కానీ ఏంచెయ్యను? మీరు కిక్ ఇచ్చే కథ కావాలన్నారు. తాగేవాళ్లకి తాగనివాళ్లమీద వేసే జోక్స్ తాగుడుకంటే ఎక్కువ కిక్కిస్తాయి'' అన్నాను.

అంతా మళ్లీ ఘొల్లుమన్నారు. "కిక్ ఇచ్చినట్లు లేదు. కిక్ చేసినట్లుంది'' అన్నాడు ఒకతను.

"ఎలాగూ సందర్భం వచ్చింది కాబట్టి, మనమోసారి వివిధ దేశాల లైఫ్‌స్టయిల్సు గురించి చర్చిద్దామా?" అన్నాడు నాని.

వెంటనే ఒకతను, "మన దేశంలో ఒక పెద్ద లోపముంది. ఇది మంచి, ఇది చెడు అని చిన్నప్పట్నించీ బ్రెయిన్ వాష్ చేస్తారు పెద్దవాళ్లు. అందువల్ల పిల్లలు మానసికంగా ఎదగడంలేదు'' అన్నాడు.

"ఇక్కడి లోపంతో పోలిస్తే మన లోపం మరీ పెద్దదేం కాదు. ఇక్కడ పిల్లలకు పెద్దల ప్రేమానురాగాలు లభించడం లేదు. పదేళ్ల పసిప్రాయంలోనే ఎవరి బతుకు వాళ్లు బతకాల్సి వస్తోంది. అది ఎదుగుదలకి మంచిదనుకోను'' అన్నాను నేను.

దీనికి ఓంప్రకాష్ అభ్యంతరం చెప్పాడు, "నీకు డబ్బుంది కదా అని నువ్వు నీ కొడుకుని చదివిస్తున్నావు. కూలివాడు డబ్బులేక తన కొడుకుని కూడా కూలిపనిలో పెడుతున్నాడు. వాస్తవంలో కూలివాడి కొడుకు నీ కొడుకుకంటే తెలివైనవాడవచ్చు. కానీ వాడికి తన సామర్థ్యం నిరూపించుకునేందుకు నీ కొడుకుతో సమంగా అవకాశాలు లభించడం లేదు. అందుకే మన దేశంలో ధనికులెప్పుడూ ధనికులుగానూ, పేదలెప్పటికీ పేదలుగానూ ఉండిపోతున్నారు. కాస్త కలిగిన ఇంట యువతీయువకులు పెద్దల చాటు బిడ్డలుగా పెరుగుతున్నారు తప్ప తమకంటూ వ్యక్తిత్వాల్ని సంతరించుకోలేకపోతున్నారు. అందువల్ల సంప్రదాయం బలపడి మానసికమైన ఎదుగుదలని దెబ్బ తీస్తోంది. ఇది ఎంతవరకూ దారి తీసిందంటే, నెహ్రూ ఒకసారి ప్రధానమంత్రి కాగానే – ఆ పదవికి ఆయన కుటుంబాన్ని దాటి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయింది మనవాళ్లకి. ఇందుకు చాలామంది నెహ్రూ కుటుంబాన్ని తప్పు పడతారు. కానీ తప్పు మన వ్యవస్థది. మరి ఇక్కడ చూడు. పదేళ్లు దాటినవాళ్లు తలిదండ్రుల చాటు బిడ్డలుగా కాక, తమ వ్యక్తిత్వాలకి అనుగుణంగా పెరుగుతారు. ఇక్కడి పిల్లలకుండే మానసిక పరిణతి మనవాళ్లకి ఉండదు''

ఓంప్రకాష్ మాటల్లో వాస్తవమున్నదనిపించింది. మన వ్యవస్థ గురించి ఈ మాత్రం లోతుగా ఆలోచించడం నాకతడిపై గౌరవాన్ని పెంచింది. ఆ చర్చ కొనసాగించాలనుకున్నాను.

"నాగరికత ఇప్పటి స్థాయికి చేరుకోవడానికి కారణం సమిష్టి కృషి. ఎప్పటికప్పుడు ఎవరికివారు తమకు తోచిన రీతిలో తమ తమ వ్యక్తిత్వాల్ని పెంపొందించుకోవాలనుకుంటే – నాగరికత ఈనాటి స్థాయికి చేరుకునేది కాదేమో! పదినుంచి ఇరవైఏళ్ల వయసు మనిషికి పరీక్షా సమయం. అప్పుడు కోరికలు గుఱ్ఱాలై పరుగులు తీస్తుంటాయి. అప్పుడే అతడికి అదుపు అవసరం. అదీకాక తనకోసం మాత్రమే తన బ్రతుకనునేవారికి జీవితంలో సంతృప్తి ఉండదు. సంతృప్తి త్యాగంనుంచి పుడుతుంది. జీవితమంటే – భార్యాబిడ్డలకోసం, తలిదండ్రులకోసం,

దేశం కోసం – అన్న రాగానుబంధం లేకపోతే మనిషికి సంతోషముండదు. కన్నబిడ్డల్ని గాలికి వదిలి తమ మానాన తాము బ్రతికే తలిదండ్రులు ఏదో ఒకరోజున అసంతృప్తికి గురౌతారు'' అన్నాను.

"నువ్వు నిన్నూ, నీ కుటుంబాన్నీ, నీ మనస్తత్వాన్నీ దృష్టిలో ఉంచుకుని ఆలోచిస్తున్నావు. కానీ మన పౌరుల్లో కోటానుకోట్లు తిండికి గతిలేక అలమటిస్తున్నారు. వాళ్లని దృష్టిలో ఉంచుకుంటే – ఇలా ఆలోచించలేవు'' అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడు గోపాలకృష్ణన్ నోరు విప్పాడు, "ఒక విషయం మాత్రం నిజం. మా నాన్న చిన్నప్పట్నించీ నన్ను ప్రతిదానికీ అదుపు చేసేవాడు. నేను నోరు విప్పితే చాలు – అదే ఎదిరించడమని చెప్పి, నామీద చెయ్యి చేసుకునేవాడు. అలా పెరిగిన నాకు ఇప్పుడు నలుగురిలో మసలడం ఎంతో ఇబ్బందిగా ఉంటోంది. నేనిలా ఉండడానికి కారణం పెంపకం లోపమేనని నా అభిప్రాయం'' అన్నాడతను.

"ఉత్తపుణ్యాన తండ్రి చెయ్యి చేసుకుంటే తిరగబడే ధైర్యం నీకు లేకపోయింది. అందుకు కారణం నీకాయనపై ఉన్న గౌరవం కాదు. ఆయన సమకూర్చుతున్న సౌకర్యాలు నీకు కావాలి. నీకు నీవుగా వాటిని సమకూర్చుకోలేనని నీకు తెలుసు. అందుకే నువ్వాయన ప్రవర్తన సహించావు. ఫలితంగా కెమిస్ట్రీలో డాక్టరేట్ చేశావు. ప్రతిష్ఠాత్మకమైన వాన్ హుంబోల్డ్ట్ ఫెలోషిప్ సాధించావు. జీవితానికి పూలబాట పర్చుకున్నావు. నీ తండ్రి నీకన్యాయం చేశాడంటే నేనొప్పుకోను. అన్యాయమంటూ జరిగితే అది నీకు నువ్వే చేసుకున్నావు'' అన్నాను.

"ఇప్పటికీ మనం వ్యక్తిగత సమస్యలే చర్చిస్తున్నాం. కోటానుకోట్ల అభాగ్యుల సమస్యలకి పరిష్కారం చెప్పడం లేదు'' అన్నాడు దాస్ సంభాషణ దారి మళ్లిస్తూ.

"నేను స్వేచ్ఛను కాంక్షిస్తాను. కానీ ఒక భారతపౌరుడిగా నాకా అర్హత ఉందనిపించదు. వ్యవస్థల మంచి చెడ్డలను పక్కన పెడదాం. సగటు భారతపౌరుడికి కనీసం కూడూ, గుడ్డా, నీడా దొరికేదాకానైనా – దేశపౌరులంతా ఎటువంటి త్యాగాన్నైనా చెయ్యాలి – చివరికి స్వేచ్ఛను కూడా.....'' అన్నాను కాస్త ఆవేశంగా.

ఓంప్రకాష్ నా భుజం తట్టి, "సెబాస్! నా అభిప్రాయం కూడా అదే! మనం కాపిటలిజాన్ని వదిలి కమ్యూనిజాన్ని ఆశ్రయించాలి. చైనాని ఆదర్శంగా తీసుకోవాలి'' అన్నాడు.

నేను తల అడ్డంగా ఊపి, "నిజాన్ని దాచనంతవరకూ ఏ ఇజమైనా మంచిదే. కానీ చైనాలో ఇజం నిజాన్ని దాచి పెడుతుంది. అక్కడేం జరుగుతోందో బయటి ప్రపంచానికి తెలియదు. మా దేశంలో పేదరికం లేదని వారంటారు. మనం నమ్మాలి. అలాంటి ఇజాల్లో పాలకులు క్రూరంగా మారే అవకాశముంది'' అన్నాను.

"మరేం చెయ్యాలంటావ్?" అన్నాడు దాస్.

"ఏంచెయ్యాలో అందరికీ తెలుసు. కానీ ఎవ్వరూ చెయ్యరు. నిజం చెప్పాలంటే భారత దేశంవంటి పేద దేశానికి దివ్యభవనాలవసరమా? పౌరులకి ఖరీదైన కార్లు అవసరమా? కళ్లు జిగేల్మనే షోకులవసరమా? విలాస జీవనం కోసం విరివిగా రెస్టారెంట్లు, బార్లు అవసరమా? ఇలాంటి వాటికోసం మన దేశం విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని వృథా చేస్తోంది. దేశమంతటా సింప్లిసిటీని పాటించడానికి కమ్యూనిజం తప్ప వేరు మార్గం లేదా? లేదనుకుంటే కమ్యూనిజాన్నే ఆహ్వానించాలి తప్ప ఈ పరిస్థితి కొనసాగనివ్వకూడదు. కానీ సామాన్యులకి కూడా ఎయిర్ కండిషన్డు గదులు కావాలి. టెర్లిన్ దుస్తులు కావాలి. విలాస జీవితం కావాలి. చుట్టూ ఉండే అభాగ్యుల్ని చూసినా వారి కోరికలు వెనక్కి తగ్గవు. ప్రభుత్వం కూడా వారిని ప్రోత్సహిస్తుంది. ఇతరత్రా ఎన్నో శాసనాలు చేస్తూ – ఈ విషయం మాత్రం పట్టించుకోదు'' అన్నాను.

"ఏదో రోజున విప్లవం వస్తుంది. ప్రజలు తిరగబడతారు" అన్నాడు దాస్.

"శతాబ్దాల భారతచరిత్రను గమనిస్తే – దండయాత్రలే తప్ప విప్లవాలు కానరావు" అన్నాను.

నా మాటల్ని నిజం చెయ్యడానికా అన్నట్లు ఆ టాపిక్ అంతటితో ఆగిపోయింది.

కడుపు నిండినవాళ్లు కడుపు మండుతున్నవాళ్ల గురించి ఎంతసేపని ఆలోచిస్తారు? మళ్లీ ఆ హాస్టల్లో అలాంటి చర్చ జరిగిన గుర్తు లేదు నాకు.

సత్రం భోజనం, మఠం నిద్ర. మర్నాడు హాస్టల్లో నాకు ఒకరింట్లో బ్రేక్‌ఫాస్ట్. ఒకరింట్లో లంచ్. ఒకరింట్లో ఈవెనింగ్ స్నాక్స్. ఒకరింట్లో డిన్నర్. అంతా నా కోసం ప్రత్యేకంగా శాకాహారం తయారు చేశారు.

ఆ సందర్భంగా జర్మనీలో తటస్థపడ్డ రకరకాల వ్యక్తుల గురించి మాట్లాడుకుంటుండగా – మా ఇంటామె ఒలోముచ్‌కీ ప్రసక్తి వచ్చింది.

ఆమె సెక్స్ కీనోలో టికెట్స్ అమ్ముతుంది.

కీనో అంటే మూవీ థియేటర్ అనుకోవచ్చు. బెర్లిన్లో వీధివీధికీ సెక్స్ కీనోలున్నాయి. వాటిలో నాన్‌స్టాప్‌గా పోర్న్ సినిమాలు చూపిస్తారు.

ఒలోముచ్‌కీది ఊబకాయం. వయసు అరవైకి తక్కువుండదు. ఆయాసపడుతూ నడుస్తుంది. ఇంటిమెట్లెక్కడానికీ, దిగడానికీ నేలమీద చతికిలబడి – చేతుల సాయంతో ముందుకు వెడుతుంది.

డ్యూటీకి బయల్దేరేముందు ఆమె టాక్సీకి ఫోన్ చేస్తుంది. మెట్లు దిగేసరికి టాక్సీ సిద్ధంగా ఉంటుంది. ఇంటికి కూడా టాక్సీలోనే వస్తుంది. ఉదయానికి ఏవో వండుకుంటుంది. మధ్యాహ్నం, రాత్రి బయటే భోజనం. వంటకు వాడిన సామగ్రిని ఆమె శుభ్రం చెయ్యదు. ఒక ప్లాస్టిక్ టబ్బులో పెడుతుంది. ఆమె వద్ద పాత్ర సామగ్రి చాలా ఉంది. రెండు మూడు వారాలు పాత్ర సామగ్రి పేరుకుపోయేక ఓ పనిమనిషికి ఫోన్ చేస్తుంది. ఆ పనిమనిషి కార్లో వచ్చి మొత్తం పాత్రలన్నీ శుభ్రం చేసి వెళ్లిపోతుంది. అందుకు గంటకి పాతిక మార్కుల చొప్పున తీసుకుంటుంది.

ఒలోముచ్‌కీ రోజూ ఉదయం తొమ్మిదికి బయల్దేరి వెళ్లి రాత్రి పదికి తిరిగొస్తుంది. ఆదివారాలు కూడా సెలవు తీసుకోదు. నేనొచ్చేక అంతవరకూ ఆమె పూర్తిగా ఇంట్లో ఉన్నది ఒక్క డిసెంబర్ 24న. ఆ రోజు క్రైస్తవులకు పవిత్ర దినం. ఊళ్లో ఏ షాపులూ ఉండవు. సెక్స్ కీనోలు కూడా ఉండవు. ఊరెడు జనం ఇంట్లో మాత్రమే గడిపే ఒకే ఒక్క రోజది.

డిసెంబర్ 24న ఒలోముచ్‌కీ నన్ను తన గదికి ఆహ్వానించింది – వైన్ తాగడానికి. నాకు వైన్ అలవాటు లేదనీ, ఐనా ఆహ్వానంమీద వేరే చోటకి వెడుతున్నాననీ చెప్పి ఆ ఆహ్వానాన్ని మృదువుగా నిరాకరించాను.

ఆమెకు వేరే ఎవ్వరూ లేరు. ఆ వయసులో, కదలడం కష్టమైన ఊబకాయంతో, ఆదివారాలు కూడా సెలవు తీసుకోకుండా పనిచేసి డబ్బు సంపాదించాలనుకునే ఆమె తత్వం నాకు అర్థం కాలేదు. ఆపైన సాధారణంగా యూరోపియన్సుకి ఉండే శుభ్రత ఆమెలో లోపించడం ఆశ్చర్యంగా ఉండేది.

నేనుండే ఇల్లు ఆమె స్వంతం కాదు. తను అద్దెకు తీసుకున్న ఇంట్లో ఓ గది నాకు అద్దెకిచ్చింది. నేనుండే భాగం కాక ఇంకా మూడు గదులున్నాయా ఇంట్లో. తను డబ్బెందుకు సంపాదిస్తుందో, సంపాదించి ఏం చెయ్యాలనుకుంటోందో నాకు అర్థం కాదు.

ఆమెకు ముగ్గురు భర్తలు చనిపోయారు. పిల్లలు లేరు. ఒక అన్న మాత్రం బెర్లిన్లోనే దూరంగా వేరేచోట ఉన్నాడు. డిసెంబర్ 24న వాళ్లిద్దరూ కలుసుకుని చర్చికి వెడతారుట.

"ఆ మనిషికి డబ్బు కాపీనం. అందుకే నీకు బెర్లిన్లో ఇల్లు దొరికింది" అన్నాడు ఓంప్రకాష్.

"ఔను. ఇల్లిచ్చినందుకు నాకామె దేవతలా కనబడుతుంది" అన్నాను.

"మరి నేనెలా కనబడుతున్నాను?" అన్నాడు నాని.

"వరాలిచ్చేవారు దేవతలు. కష్టాల్లో ఆదుకునేవాళ్లు అవతార పురుషులు. నువ్వు అవతారపురుషుడివి" అన్నాను.

నానిని నేను అవతారపురుషుడిగా గుర్తించినా, నా కష్టాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

నాని ఏరోఫ్లోట్ ఆఫీసులో వివరాలడిగి తెలుసుకున్నప్పుడు తెలిసింది. అతను విమానాశ్రయానికి వెళ్లడానికి ఇబ్బంది లేదు కానీ....

ఏరోఫ్లోట్ విమాన యాత్రీకులకోసం ఈస్ట్ బెర్లిన్ వెస్ట్ బెర్లిన్ల మధ్య బస్సొకటి నడుస్తోంది. ఆ బస్సు వెస్ట్ బెర్లిన్లో బయల్దేరుతుంది. ఏరోఫ్లోట్ విమానం ఎక్కాల్సిన ప్రయాణీకుల్ని ఈస్ట్ బెర్లిన్ విమానాశ్రయం చేరుస్తుంది. విదేశాలనుంచి ఈస్ట్ బెర్లిన్ వచ్చినవారిని వెస్ట్ బెర్లిన్ చేరుస్తుంది. అది నిర్ణయించబడ్డ కొన్ని స్టాప్స్‌లో మాత్రమే ఆగుతుంది. ఆ స్టాప్స్‌లో నాకు అనువైనది – రైజే బ్యూరో హెలియోస్. అక్కడికి చేరడానికి నేను మూడు ఊబాన్లు (అండర్‌గ్రౌండ్ ట్రయిన్స్) మారాలి. అందుకు ఇరవై నిముషాలు పడుతుంది.

అసలు సమస్య అది కాదు. బస్సులో విమాన ప్రయాణీకులు తప్ప ఇతరులెవ్వరూ ఎక్కకూడదు. శ్రీమతిని రిసీవ్ చేసుకుందుకు వెళ్లిన నాని కూడా ఆమెను బస్సు ఎక్కించగలడు కానీ, తను బస్సెక్కలేడు.

"ఔరా, కమ్యూనిస్టు దేశమా!" అనుకున్నాను.

"ఆ బస్సులో సీటు సంపాదించడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. కానీ మనం అన్నింటికీ సిద్ధపడి ఉండాలి" అన్నాడు నాని.

రోట్లో తల దూర్చాం. రోకటి పోట్లు తప్పవు మరి!

ఆలోచిస్తున్నాను. నాని నావాళ్లని బస్సెక్కిస్తాడు. నేను కళ్లలో వత్తులు వేసుకుని ఓ బస్‌స్టాపులో వాళ్లకోసం ఎదురుచూడాలి. ఆ ఎదురుచూపుల బాధకంటే, బస్సులో ఉన్న శ్రీమతి మానసికస్థితి గురించే నా తపన!

దేశం కాని దేశంలో విమానం దిగి, ముక్కూ మొహం తెలియని మనిషి సాయంతో బస్సెక్కి, గమ్యమెరుగని ప్రయాణం చెయ్యాలి.

మెదడు మొద్దు బారిపోయింది. రోజులు భారమైపోయాయి. నా పరిసరాల్లో మాత్రం ఉత్సాహం నిండిన వాతావరణం. వైభవం నిండిన సంబరాలు.

డిసెంబర్ 31 రాత్రి కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ చేసే వేడుకలు జర్మనీలో విశేషంగానే ఉండొచ్చు. కానీ నేను హాస్టలుకి వెళ్లలేదు. మనకంటూ మూడ్ లేనప్పుడు మంచి మూడ్‌లో ఉన్నవారి మధ్య ఉండడం వారికీ మనకీ ఇబ్బందే మరి!

రోజంతా ఒక్కణ్ణీ ఒంటరిగా గడిపాను. రాత్రి తెల్లవార్లూ ఊరంతా పటాసుల సందడిలో కలత నిద్రపోయాను.

మర్నాడు కొత్త సంవత్సరం 1975. రేడియోలో క్రికెట్ కోసం బిబిసి స్పోర్ట్స్ న్యూస్ వింటే – ఇండియా వెస్టిండీస్‌ని ఓడించిన విషయం తెలిసింది. అప్పటికి మొదటి రెండు టెస్టులూ వెస్టిండీస్ నెగ్గి ఉండడంతో – ఈ వార్తకోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. కొత్త సంవత్సరం శుభారంభం అనుకున్నాను ఓ క్రికెట్ అభిమానిగా.

ఎందుకో మనసులో బెంగ కొంత తగ్గింది.

మర్నాడు ఆఫీసుకెళ్లి ఉత్తరాలు చూడాలి. ఇంటిదగ్గర ప్రోగ్రెస్ తెలుస్తుంది.

అంతలోనే మళ్లీ బెంగ – శ్రీమతి ప్రయాణం మానుకుంటే.....?

అప్పుడు నాలో వివేకం పైకి లేచింది, "ఏయ్, మనసూ! నువ్వు మనవాణ్ణి బతకనిచ్చేలా లేవు. కాస్త పక్కకి తప్పుకో. నేను టేకోవర్ చేస్తాను" అంది.

"నేను వాస్తవం చెబుతున్నాను. బతుకుకంటే మనిషికి వాస్తవం ముఖ్యం" అంది మనసు నన్ను వదలడానికి ఇష్టపడక.

"ఏమిటి వాస్తవం? వాళ్లు రారేమోననా? రాకపోతే మిన్ను విరిగి మీద పడుతుందా? భూకంపాలొస్తాయా? అగ్నిపర్వతాలు బద్దలౌతాయా? ఏమీ జరుగదు. ప్రమాదమంటే గజేంద్రుడిది. అతడికి – లావొక్కింతయు లేదు. ధైర్యము విలోలంబయ్యె. ప్రాణంబులా తావుల్దప్పెను. మూర్ఛ వచ్చె. తనువుం డస్సె. శ్రమంబయ్యె"

"ఐతే?" అంది మనసు.

"అప్పుడు గజేంద్రుడేం చేశాడు? రావే ఈశ్వర, కావవే వరద, సంరక్షింపు భద్రాత్మకా – అని దేవుణ్ణి ప్రార్థించాడు. దేవుడొచ్చాడు. రక్షించాడు" అంది వివేకం.

"ప్రార్థించడానికి ముందు దేవుడిమీద నమ్మకముండాలి కదా!" అంది మనసు.

"గజేంద్రుడికి మాత్రం నమ్మకముందా – 'కలడు కలండనెడివాడు కలడో లేడో' అనుకుంటూనే దేవుణ్ణి ప్రార్థించాడు. అపనమ్మకాన్ని పక్కన పెట్టి దేవుణ్ణి ప్రార్థిస్తే, ప్రార్థనలోంచి నమ్మకం పుడుతుంది. ఆ నమ్మకం బలాన్నిస్తుంది. దేవుణ్ణి నమ్మినవాడికి బెంగ ఉండదు. దిగులుండదు. కృషి తనవంతు, ఫలితం దైవనిర్ణయం అనుకోగల పరిణతి వస్తుంది"

నిజమే. భగవంతుడున్నాడు. ఆయన లాటరీలో ప్రైజ్ కావాలంటే ఇవ్వకపోవచ్చు. కానీ అడిగితే మనశ్శాంతిని ఇస్తాడు.

ఆయన నేను జర్మనీ రావాలనుకున్నాడు. వచ్చాను. నావాళ్లు నాతో కలిసి ఇక్కడ ఉండాలనుకుంటే ఉంటారు. అనుకోకపోతే ఉండరు.

నాకు దేవుడిపై నమ్మకం పుట్టింది. అది అవసరానికి చేసుకున్న ఏర్పాటు కాదు. వివేకం కలిగించిన స్పృహ. అంతే!

మనసు తేలికైపోయింది.

తపము ఫలించిన శుభవేళ

జనవరి రెండు.

కొన్నాళ్లుగా ఆలస్యంగా నిద్ర లేవడం అలవాటయింది. ఆ రోజు ఆఫీసుకెళ్లాలి కాబట్టి ఆరింటికల్లా అలారం పెట్టుకుని లేచిపోయాను. ఏడున్నరకల్లా తెమిలి ఎనిమిదికల్లా లేబరెటరీలో అడుగెట్టాను.

ఓ మూల గుండెల్లో గుబులుంది. కానీ సంతోషం దాన్ని మించే ఉంది.

ఆఫీసు చేరగానే, మనసు దారి మళ్లడానికి వర్కు మొదలెట్టాను.

మధ్యలో రాలెక్ వచ్చి కొత్త సంవత్సరానికి శుభాకాంక్షలు చెప్పి వెళ్లాడు. కొలీగ్సులో కిర్షనర్ తప్ప ఇంకెవ్వరూ రాలేదు.

నా ధ్యాసంతా ఆఫీసుకొచ్చిన ఉత్తరాలమీదే ఉంది. టైమ్ తొమ్మిది దాటేక సెక్రటరీ ఆఫీసుకి వెడితే – రెండుత్తరాలిచ్చారు.

రెండూ శ్రీమతినుంచే. ఒకటి డిసెంబర్ 17న, రెండవది 23న వ్రాసింది. నేను వ్రాసిన ఉత్తరాలూ, ఇచ్చిన రెండు టెలిగ్రామ్సూ అందాయన్నది వాటిలో ముఖ్యాంశం.

అది తెలియగానే మనసు కాస్త తేలిక పడింది.

ఆఫీసులో ఉండగా మధ్యాహ్నం పోస్టులో మరో రెండుత్తరాలొచ్చాయి. అవి డిసెంబర్ 20, 28 తేదీలలో శ్రీమతి వ్రాసినవి.

నేను పంపిన టికెట్లు డిసెంబర్ 26న అందాయట. 26 అంటే రెండు పదమూళ్లు కాబట్టి అది నా లక్కీ నెంబరని సంతోషాన్ని ప్రకటించింది. అన్నయ్య మొదటి టెలిగ్రాంని అంతగా పట్టించుకోలేదనీ, రెండో టెలిగ్రాం చూడగానే హడావుడి పడ్డాడనీ తెలియగానే – మనసులోనే ఓంప్రకాష్‌కి ధన్యవాదాలు అర్పించుకున్నాను.

మొత్తంమీద నేను పంపిన టికెట్లు శ్రీమతికి సకాలంలో అందేశాయి. అందుకు నాలో చెప్పలేనంత ఉత్సాహం కలిగింది. ఆ రాత్రి వంటింట్లో మా పోస్ట్‌బాక్స్ అంటే రిఫ్రిజరేటరుమీద కాగితం వ్రాసి పెట్టాను – నావాళ్లు జనవరి 7కి బెర్లిన్ చేరుకుంటున్నారని.

ఆ రోజెంత ప్రయత్నించినా ఫోన్లో ఓంప్రకాష్ దొరకలేదు. మర్నాడు కూడా అతడు ఫోన్లో దొరక్కపోవడంతో ఉండబట్టలేకపోయాను.

ప్రస్తుతానికి అక్కడ ముఖ్యంగా ఈ వ్యవహారంలో నాకు ఆత్మీయుడతను. ఈ వార్తని అతనితో పంచుకోకుండా ఎలా?

నాకతని ఆఫీసు తెలుసు. నేరుగా అక్కడికెడితే – దొరికాడు. పరీక్ష వ్రాసేక శిష్యుడు గురువుకి విన్నవించుకున్న రీతిలో నేనతనికి వివరాలు చెప్పాను.

"గ్రేట్! అన్ని పనులూ ఐపోయిననట్లే, చాలా అదృష్టవంతుడివి" అన్నాడతను అభినందనగా.

"అలాగే అనిపిస్తోంది" అన్నాను.

"ఇప్పుడు నీకింకే దిగులూ లేదా?" అన్నాడతను.

"నేను దేవుణ్ణి నమ్మడం మొదలెట్టాను. నాకిప్పుడే దిగులూ లేదు" అన్నాను.

"గ్రేట్!" అన్నాడతను మళ్లీ.

ఆ రాత్రికి ఓంప్రకాష్ బలవంత పెట్టగా హాస్టలుకి వెళ్లి అతని గదిలోనే పడుకున్నాను.

మర్నాడు శనివారం. ఆఫీసుకి సెలవు. ఆ రోజు కూడా అక్కడే బద్ధకంగా గడిపేశాను.

హాస్టల్ మిత్రులు నాకోసం అటుకుల ఉప్మా చేశారు. నేను బాగుందని మెచ్చుకుంటే, "మేమిప్పుడు కొంచెంకొంచెంగా ఇచ్చేది ఎందుకనుకుంటున్నావ్! తర్వాత నీనుంచి దండిగా పుచ్చుకుందుకే" అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడే నావాళ్లు వచ్చేసినట్లూ, మిత్రులకి ఆతిథ్యమిస్తున్నట్లూ – ఓ తీయని కల నాలో.

రాత్రి పదిన్నరకి నా గదికి చేరాను. ఇలా తలుపు తియ్యడమేమిటి – అలా వినిపించింది – "డాక్టర్ రావ్" అన్న ఒలోముచ్‌కీ పిలుపు.

అర్థమైంది. ఆమె నాకోసం ఎదురుచూస్తోంది. ఎందుకై ఉంటుంది?

తడబడుతూనే వెళ్లాను.

నా భయాందోళనల్ని తొలగిస్తూ, "నీ భార్యాబిడ్డలు వస్తున్నందుకు సంతోషం" అందామె.

నవ్వాను తేలికగా. ఆమె మళ్లీ, "నీ పిల్లల వయసెంత?" అనడిగింది. చెప్పాను.

"అల్లరి చెయ్యరు కదా!" అంది.

చేస్తే మాత్రం – నా పిల్లల అల్లరి నాకు అల్లరి అనిపిస్తుందా? అనిపించినా నేనామెకి ఆ విషయం చెబుతానా? చాలా తెలివితక్కువ ప్రశ్న – అనుకుని – "చెయ్యరు" అని బదులిచ్చాను.

"అపరిశుభ్రతను సహించలేను. మీవాళ్ల కారణంగా వంటిల్లు అపరిశుభ్రంగా ఉండకూడదు" అందామె.

అంటే వంటిల్లు అపరిశుభ్రంగా ఉండొచ్చు. కానీ అది మా కారణంగా కాకూడదు. ఒలోముచ్‌కీకి పరిశుభ్రత లేదు కాబట్టి వంటిల్లుని శుభ్రంగా ఉంచడం చాలా కష్టం. మా కారణంగా వంటిల్లు అపరిశుభ్రంగా ఉండకూడదని ఆమె అనడం బాగుంది.

"ఊఁ" అన్నాను.

"అద్దె కొంచెం పెంచగలవా?" అంది.

"స్కాలర్‌షిప్‌మీద ఉంటున్నాను. అద్దె పెంచడం నావల్లకాదు" అన్నాను.

"ఊరికే అడిగాను. ఏమీ అనుకోకు" అందామె.

"అయ్యో! అనుకోవడానికేముంది? ఇల్లిచ్చావు. అందుకు నీకు ధన్యవాదాలు" అన్నాను.

ఆమె ఓ క్షణమాగి, "నీవాళ్లొస్తున్నారు కాబట్టి, ఈ నెలకి ఇంకో యాభై మార్కులు ఇవ్వాలి. ఆ అదనపు సొమ్ము ఎప్పుడిస్తావ్?" అంది.

"వచ్చే సోమవారం. అనగా ఎల్లుండి రాత్రి" అన్నాను.

"ఓకే. మరో విషయం. ప్రతి నెలా అద్దె పదిహేను రోజులు ముందుగా ఇవ్వగలవా? అంటే ఫిబ్రవరి నెల అద్దె ఈ నెల పదిహేనుకే ఇవ్వాలి" అందామె.

"ఇస్తాను కానీ – ఉన్న డబ్బంతా టికెట్సుకి ఐపోయింది. ఈ నెలకి ఇంకేమివ్వలేను. వచ్చే నెలనుంచి నువ్వు చెప్పినట్లే చేస్తాను" అన్నాను.

"సరే" అంది కానీ ఆమె మొహం అదోలా ఐపోయింది.

నా మాట నచ్చలేదా అనుకున్నాను కానీ, ఆమె వెంటనే, "నా సోదరుడి ఆరోగ్యం బాగోలేదు. నాకీ ప్రపంచంలో మిగిలిన బంధువు అతనొక్కడే. ఏ క్షణంలో అతని గురించి ఏ వార్త వినాలోనని బెంగ పడుతుంటాను. అలాంటి సమయంలో ఈ టెలిగ్రాం వచ్చింది. ఎంత గాభరా వేసిందో నాకు. కానీ ఈ టెలిగ్రాం నాకు కాదు, నీకు" అంటూ ఓ కాగితం నాకు అందించింది.

అన్నీ సక్రమంగా జరిగితే టెలిగ్రాం ఇవ్వమని అన్నయ్యకి వ్రాశాను. ఇప్పుడు టెలిగ్రాం వచ్చింది.

ఆత్రుతగా అందుకుని చదివాను. "ఆల్ ఓకే. మీట్ బెర్లిన్ సెవెన్".

అప్రయత్నంగా, "డాంకే" అన్నాను. నిజానికా థాంక్స్ అన్నయ్యకి!

అది తనకే చెప్పాననుకుని ఒలోముచ్‌కీ "బిట్టే" అని ఇట్టే లోపలకి వెళ్లిపోయింది. నా థాంక్స్ అన్నయ్యకెలాగూ వినిపించవు కాబట్టి ఎవరిని చేరితేనేం అనుకుని తృప్తి పడ్డాను.

మహోత్సాహంగా నా గదిలోకెళ్లాను. మనసు తేలికైపోతే కళ్లు కూడా తేలికైనట్లున్నాయి, ఓ పట్టాన నిద్ర పట్టలేదు.

నావాళ్లనిక్కడికి రప్పించే ఘట్టం సుఖాంతమైనట్లే ఉంది.

కావడానికి క్షణమొక యుగమైనా – రోజులు పరుగెడుతూనే ఉన్నాయి.

జనవరి ఏడున ఉదయం నానిని కలుసుకున్నాను.

"నేను బస్సెక్కడానికి వీల్లేదుట. నువ్వు మీవాళ్లని రెయిజేబ్యూరో హెలియాస్ దగ్గర రిసీవ్ చేసుకోవాలి. ఆ బస్సుకి అదే ఆఖరి స్టాప్ కాబట్టి – ఏ ఇబ్బందీ ఉండదు" అన్నాడు నాని.

అప్పటికి నాకు నాలుగు ఉత్తరాలు వ్రాసింది శ్రీమతి. అన్నింట్లోనూ కూడా, "ఎయిర్‌పోర్టుకి మీరు రావాలి. అక్కడ మీ రాక కోసం ఎదురు చూస్తుంటాను" అన్న వాక్యం కామన్.

ఆమెది చాలా చిన్న కోరిక. కానీ ఇంచుమించు అసాధ్యం.

ఇప్పుడు ఎయిర్‌పోర్టులో నా బదులు నాని కనబడతాడు. ఏమనుకుంటుందామె?

నాని నాకులాగే పొట్టిగా, బక్కగా ఉంటాడు. కానీ సినిమాలో ప్రొఫెసర్లకుండేలాంటి పిల్లి గెడ్డం ఉంటుంది. అనుమానం పుట్టాలి కానీ అతను కిడ్నాపర్‌లా అనిపిస్తే ఆశ్చర్యం లేదు.

నా బదులు అతను వెళ్లడం విషయం అటుంచితే – ఈస్ట్ బెర్లిన్‌నుంచి వెస్ట్ బెర్లిన్‌కి బస్సులో రావాలి తను. తెలిసినవాళ్లెవరూ తోడు లేకుండా....

ఏమైనా వ్యవహారమిక గంటల్లోకి వచ్చేసింది.

నేను నానికి మా ఫామిలీ ఫొటో ఇచ్చాను. శ్రీమతికి ఓ ఉత్తరం వ్రాసి అతని చేతికిచ్చాను. ఒకరినొకరు గుర్తించడానికీ, అనుమాన నివృత్తికీ – ఆ రెండూ అవసరమని నాకు తోచింది.

సాయంత్రం నాలుగయ్యేసరికల్లా రెయిజోబ్యూరో హెలియాస్ దగ్గర హాజరయ్యాను.

రెయిజోబ్యూరో అంటే ట్రావెల్ ఏజన్సీ కార్యాలయాలు. సాధారణంగా అవి బిజీగా ఉంటాయి. నేను వెళ్లిన ఆఫీసు దగ్గర ఏయే వేళల్లో బస్సులొస్తాయో టైంటేబుల్ ఉంది. ఆ ప్రకారం నా బస్సు 5.45కి రావాలి.

ఇంటి దగ్గర బయల్దేరినపుడు చలి లేదు. అందుకని ఓవర్‌కోటు లేకుండా వచ్చాను. టైం నాలుగయ్యేసరికి హఠాత్తుగా చలిగాలి మొదలైంది. ఆ వెంటనే సన్నగా చినుకులు.

నాకు వణుకు మొదలైంది. చేతులకి గ్లోవ్స్ లేవు. వంటిమీద ఓవర్‌కోటు లేదు.

"జర్మనీలో చలిని తేలికగా తీసుకోకు. ఏ క్షణంలోనైనా చలి ముంచుకు రావచ్చునని సిద్ధపడి ఉండాలి" అని ఓంప్రకాష్ నన్ను చాలామార్లు హెచ్చరించాడు. పట్టించుకోలేదు. ఫలితం ఈరోజు అనుభవిస్తున్నాను.

నావాళ్లకోసం ఎదురుచూపులవల్లనే కాదు, ఆ చలి వల్ల కూడా నాకు క్షణమొక యుగమైంది.

అయిదయ్యేలోగా ఈస్ట్ బెర్లిన్‌నుంచి రెండు బస్సులొచ్చాయి. వాటిలో నావాళ్లు లేరు. ఉండరని తెలుసు కానీ,అనుకున్నకంటే కాస్త ముందు వస్తే బాగుంటుందని ఆశ!

అప్పటికి చలికి తట్టుకోవడం కష్టమనిపించే పరిస్థితి వచ్చింది నాకు. రెయిజే బ్యూరో లోపలకు వెళ్లి కూర్చోవచ్చు కానీ అడగడానికి మొహమాటం వేసింది. అయిదింటికి ఆఫీసు మూసేస్తున్నప్పుడు అందులో పని చేసే అమ్మాయి నన్ను చూసి, "చాలా సేపట్నుంచి ఉన్నట్లున్నావ్? ఏం కావాలి?" అనడిగింది.

చెప్పాను. ఆమె నొచ్చుకుని, "అయ్యో! లోపలకొచ్చి కూర్చోవాల్సింది" అని జాలిపడి తలుపేసుకుని వెళ్లిపోయింది.

ఆమె డ్యూటీ ఆమె చేసింది. చలి డ్యూటీ చలి చేస్తోంది. అయిదున్నరకు మరో బస్సొచ్చింది. అందులోనూ నావాళ్లు లేరు.

"మరీ ఇంత పంక్చ్యుయాలిటీయా?" అని తిట్టుకున్నాను మనసులో. కానీ సరిగ్గా అయిదూ నలభైఐదుకి వచ్చిన బస్సులో మధ్య సీట్లో శ్రీమతి కనిపించింది. పక్కనే నా బంగారు తల్లి చిన్నారి రాజకుమారి కనిపించింది.

"ఆహా, జర్మన్ పంక్చ్యుయాలిటీకీ జై" అనుకున్నాను మనసులో.

నావాళ్లు జర్మనీలో...

కలో నిజమో తెలియలేదు. ఒక్క క్షణం నా మెదడు పని చెయ్యలేదు.

బెర్లిన్ మహానగరంలో నేను – నా ఎదురుగా ఓ బస్సు – ఆ బస్సులో నావాళ్లు –

డ్రైవర్ శ్రీమతికి చెబుతున్నాడు – బహుశా అదే ఆమె దిగాల్సిన స్టాపని కాబోలు.

శ్రీమతి నన్ను చూడలేదు. డ్రైవరుకి ఆమె చేస్తున్న సైగల్ని బట్టి నాకు అర్థమైంది – తను దిగాల్సిన స్టాప్ అది కాదని చెబుతోందని.

అందుకు కారణముంది. రెయిజో బ్యూరో హెలియాస్ ఆఖరి స్టాపని మేమనుకున్నాం కానీ అది నిజం కాదు. తను ఆఖరిస్టాపులో దిగాలని శ్రీమతి అనుకుంటోంది.

ఈ ప్రయాణంలో చివరి అడుగుదాకా ఆమెకి తప్పుడు సమాచారమే అందింది.

నేను డ్రైవర్ దగ్గరకి పరుగున వెళ్లి బస్సులో మావాళ్లున్నారని చెప్పాను. తర్వాత శ్రీమతి దగ్గరకు పరుగెత్తాను.

ఆమె నన్ను చూసింది. అప్పుడే నేను నా బంగారు తండ్రి చిట్టి శ్రీరామకమల్‌ని చూశాను.

పిల్లలిద్దరూ ఫుల్‌సూట్లు వేసుకుని మంకీకాప్పుతో ఉన్నారు. వాళ్లనలా చూడ్డం అదే ప్రథమం నాకు.

పిల్లల్ని, శ్రీమతిని మార్చి మార్చి చూస్తున్నాను.

ఒక పెద్ద సూట్‌కేసు. చిన్న హ్యాండ్‌బ్యాగు. అదీ శ్రీమతి సామాను.

ఆమె స్వెటర్ వేసుకుంది. షాల్ కప్పుకుంది.

నాకు మాట రావడం లేదు. ఆమె మాట్లాడ్డం లేదు.

అతి కష్టంమీద, "వసూ!" అన్నాను.

ఆమె మౌనంగా బస్సు దిగింది. సామాను కిందకి వచ్చింది.

అప్పుడు అమ్మాయి నన్ను గుర్తుపట్టి, "అమ్మా! నాన్నగారు" అంది.

అక్కని అనుకరించడంలో సిద్ధహస్తుడు అబ్బాయి. తనూ అదే మాటన్నాడు.

ఇద్దర్నీ దగ్గరగా లాక్కుని హత్తుకున్నాను. బస్సు వెళ్లిపోయింది.

"ప్రయాణం బాగా జరిగిందా?" అడిగాను శ్రీమతిని.

"ఊఁ" అందామె ముక్తసరిగా.

అమ్మాయి ముఖం నన్ను చూడగానే వెలిగిపోయింది. చిన్నప్పట్నించీ దానికి నా దగ్గర చేరిక ఎక్కువ. అది నా కాళ్లకి చుట్టుకుని ఉండిపోయింది.

ఊబాన్లో అయితే తొందరగా ఇల్లు చేరొచ్చు. చవగ్గానూ ఐపోతుంది. కానీ మానసికంగా, శారీరకంగా నేనందుకు సిద్ధపడి లేను. వెంటనే టాక్సీని పిలిచాను.

టాక్సీ ఇల్లు చేరేసరికి అక్కడ ఓంప్రకాష్ మాకోసం ఎదురు చూస్తున్నాడు. పరిచయాల పలకరింపులయ్యేక, సామాను పైకి చేరవెయ్యడంలో సాయం చేసి, కాసేపుండి వెళ్లిపోయాడతను.

నేను ఎయిర్‌పోర్టుకి రాలేదని శ్రీమతికి కోపమొచ్చింది. అది తాటాకు మంటని తెలిసినా చల్లార్చడం నా బాధ్యత, ఆమెకు పరిస్థితి వివరిస్తూనే షరతులు లేని క్షమార్పణ కోరాను.

ఆమె కొంత శాంతించి, "మీరు పంపిన నాని ఎంతో సాయం చేశాడు. అతను లేకపోతే ఏమైపోయేవాళ్లమో! ఐనా బస్సెక్కి ఒంటరిగా బెర్లిన్ రావడానికి ఎంత భయమేసిందో!" అంది శ్రీమతి.

"నేను మాత్రం భయపడలేదు. పూర్తిగా దేవుణ్ణి నమ్మాను" అన్నాను.

"నాకు తెలుసు. మీరు మాకోసం ఆ చలిలో గంటల తరబడి ఎదురు చూస్తుంటారని. కానీ కోపం. నాకు చాలా కోపం వచ్చింది...." అంది శ్రీమతి.

"థాంక్యూ వసూ! ఇన్నాళ్లుగా నేను మిస్సవుతున్నది ఈ కోపాన్నే! ఇంతకాలం నేనెదురు చూస్తున్నదీ కోపం కోసమే! నీ కోపం ఎంత తీవ్రంగా ఉండనీ – నాకు ఫరవాలేదు. నువ్వెదురుగా ఉంటే చాలు" అన్నాను.

"మీ కోరిక తీరుతుందని నమ్ముతున్నాను. ఎందుకంటే నేనూ దేవుణ్ణి నమ్ముతున్నాను" అంది శ్రీమతి.

"అయితే నువ్వూ శ్రీ వెంకటేశ్వరుడికి ఏమైనా మొక్కుకున్నావా?" అన్నాను.

"వెంకటేశ్వరుడెందుకు? మీరే నా దేవుడు" అంది శ్రీమతి. అలా అని వెంటనే వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఓదార్చాలనుకున్నాను. కానీ ఏడుపు నాకూ వస్తోంది.

మనసులో బాధ బయటకు పోవడానికి ఏడుపొక్కటే మార్గం. కాసేపు ఊరుకున్నాను.

ఆమె మనసులో బాధ పరిమాణమెంతో కానీ ఆమె చాలాసేపు వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉంది.

ఇక ఆగలేక, "ఊరుకో వసూ! మనం కలుసుకున్నాంగా" అన్నాను.

"కలుసుకున్నాం. కానీ ఇకమీదట జీవితంలో మళ్లీ ఎప్పుడూ ఇలా కలుసుకోవాల్సిన అవసరం రాకూడదు. ఒకటి కాదు. రెండు కాదు. రోజులు కాదు. ఎనిమిది నెలలు... ఒకరికొకరు దూరంగా..." అని మళ్లీ ఏడ్చిందామె.

నేను కళ్లనీళ్లు తుడుచుకున్నాను.

ఆ బాధ మా ఇద్దరికే అర్థమౌతుంది. మాలా విడిపోయి కలుసుకున్న భారతీయ దంపతులకే అర్థమౌతుంది,

"బొందితో స్వర్గానికొచ్చాను. స్వర్గం స్వర్గంలా కనబడాలంటే, బొందితో కాదు, సతీసమేతంగా రావాలని ఇప్పుడు నాకర్థమైంది. ఇకమీదట ఇక్కడ నిజంగా స్వర్గాన్ని చూద్దాం" అన్నాను.

"మీరు లేక నేనింతకాలం నరకాన్ని చూశాను. ఇకముందు మనం స్వర్గాన్ని తప్ప ఇంకేమీ చూడొద్దు. ఇక్కడైనా, అక్కడైనా, ఎక్కడైనా కూడా" అందామె నా కౌగిలిలో ఒదిగిపోతూ.

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–18లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' గత మాసంలో ముగిసింది. చివరిగా ఇప్పుడు 'మలి సందడి' అంశాల వివరణ. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

చివరి విడత: మలి సందడి

నిన్న లేని అందమేదో

మనిషి తత్వం చిత్రమైనది. ధర్మరాజు అంతటివాడు స్వర్గప్రాప్తి కలిగినప్పుడు – అక్కడి వైభోగానికి సంతోషించడానికి బదులు – తనవాళ్లున్న నరకాన్ని తల్చుకుని బాధపడ్డాట్ట. మనకున్నది అందరితో సమంగా పంచుకోలేకపోయినా – సాటి పౌరులకు కనీస అవసరాలు తీరాలనుకునే పాటి సామ్యవాదం చాలామందికే ఉంటుంది.

వారిలో నేనూ ఒకణ్ణి అనుకుంటాను.

జర్మనీలో నాకు అభిమానానికీ, ఆప్యాయతకీ, అనురాగానికీ, ఆదరణకీ లోటు అనిపించలేదు. కానీ –

'ఎటు చూసినా చిరు నగవుల మోములు
ఎటు చూసినా తడి యారని పెదవులు
ఇది జర్మనీ ఇక్కడున్నది మనీ
ఎటు చూసినా పెను వెతలతో మోములు
ఎటు చూసినా పొడిబారిన పెదవులు
ఇది కర్మభూమి ఇక్కడున్నది లేమి'

జర్మనీలో అడుగు పెట్టినప్పుడే అప్రయత్నంగా నాలో కలిగిన స్పందన ఇది. ఆతర్వాత కూడా అడపాతడపా ఈ భావన మనసులో రేగి మనసు కలుక్కుమంటూండేది.

ఐతే వచ్చిన కొత్తలో వాతావరణం సానుకూలంగా ఉండేది. పరిసరాలు ఆహ్లాదంగా అనిపించేవి. ప్రకృతి మైమరపించేది. వీటన్నింటికీ తోడు – నేనప్పుడు మళ్లీ విద్యార్థి దశలోకి వెళ్లాను. అదో ప్రపంచం.

బెర్లిన్ వచ్చేసరికి వాతావరణం క్రమంగా మారుతోంది. విద్యార్థిదశనుంచి అడ్వాన్స్‌డ్ రీసెర్చికి వచ్చాను. నేను మళ్లీ వాస్తవంలోకి వచ్చాను. వాస్తవంలో నా ప్రపంచం అతి చిన్నది. నేను, నా భార్యాబిడ్డలు.

భార్యాబిడ్డలు దగ్గరలేక – నా చిన్ని ప్రపంచం బోసిపోయింది. ఆపైన –

వణికించే చలి. ఆకులు రాల్చిన చెట్లు. కాన రాని పూలు. ప్రకృతి అందాల్ని అస్పష్టం చేస్తున్న మంచు తెరలు. సాటి మనుషులే ఐనా – మనది కాని రంగుతో, మనకి నప్పని సంప్రదాయాలతో, మనకి లేని వైభవంతో – మనవాళ్లు అనుకోవడం కష్టమనిపించే జనాల నిత్య మహోత్సాహం.

ఆ పరిసరాల్లో రోజులు రసహీనంగా భారంగా గడిచి పోతున్న సమయమది. అలాంటప్పుడు అనుకోకుండా నావాళ్లు నా దగ్గరకొస్తే...

1964లో చూసిన పూజాఫలము చిత్రం గుర్తుకొచ్చింది. అందులో హీరో నాగేశ్వర్రావు కాలేజి విద్యార్థి. జమీందారు బిడ్డయినా మహా బిడియస్థుడు. తోటి విద్యార్థులతో కూడా కలవలేక, అపహాస్యానికి గురౌతుంటాడు. వాళ్లింట్లో అద్దెకు దిగిందో కుటుంబం. వాళ్లమ్మాయి జమున మహా చలాకీ. ఎప్పుడూ ఆడుతూ పాడుతూ 'పగలే వెన్నెలా జగమే ఊయలా' అనిపించేటంత హుషారుగా ఉంటుంది. తనే చొరవ చేసి ఆమె హీరోతో పరిచయం చేసుకుంటుంది. ఆమె పట్ల అమితంగా ఆకర్షితుడైన హీరోకి 'నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో' అనిపిస్తుంది.

నావాళ్లు బెర్లిన్లో అడుగు పెట్టగానే నా పరిస్థితీ అదే!

అప్పుడు నాలో కొత్త ఉత్సాహం కలిగింది. కొత్త శక్తి నన్నావహించింది.

వణికించే చలి మధురం. బోసిపోయిన చెట్లు మధురం. పుష్పరహిత ప్రకృతి మధురం. ఆ ప్రకృతిని కప్పిన మంచు తెరలు మధురం. మనవాళ్లు ఐనా కాకున్నా – నా చుట్టూ ఉన్న మహాజనసందోహపు నిత్యమహోత్సాహం మధురం.

నేనుంటున్న ఇల్లు మధురం. ఆ ఇంటి యజమాని ఒలోముచ్‌కీ పలకరింపు మధురం.

ఒక్కసారిగా నా పరిసరాలు, ఇల్లు – అన్నీ మనోహరంగా మారిపోయాయి.

నేనలా మరో లోకపు అనుభూతుల జల్లులో మార్పుల్ని తలచుకుని పరవశిస్తుంటే – శ్రీమతి నాలో వేరే మార్పుల్ని గమనిస్తోంది. "మీరు చాలా మారారు. మిసమిసలాడిపోతున్నారు" అందామె.

ఉలిక్కిపడి వాస్తవంలోకి వచ్చాను. ఆమె మాటల్ని ఆకళింపు చేసుకుని తననీ, నన్నూ మార్చి మార్చి చూశాను.

నిజమే!

శ్రీమతిది మేలిమి బంగరు ఛాయ. ఆమె పక్కనున్నప్పుడు నాదెప్పుడూ చిలకలపూడి బంగారం మెరుపు.

అప్పుడు మాత్రం నేనే ఎక్కువ మెరుస్తున్నాను. ఐనా మనసొప్పక, "నీకంటేనా?" అన్నాను.

ఆమె తడుముకోలేదు, "ఊఁ" అంది.

అప్పుడన్నాను – "అవున్లే – అప్పుడే మెరుగు పెట్టిన చిలకలపూడి బంగారం, అసలు బంగారం కంటే ఎక్కువ మెరిసిపోతుంది" అని.

శ్రీమతి కళ్లలో కొంచెం వెలుగు. "అసలో, నకిలీయో – మిసమిస మిసమిసే" అంది కొంచెం ఇబ్బందిగా.

నేను వెంటనే, "వళ్లు చుర్రుమనిపించే ఎండ ఏడాదికి ఒకటి రెండు రోజులకి మించి ఉండదు జర్మనీలో. ఇంట్లో ఉన్నా బయట ఉన్నా – నీడపట్టున ఉన్నట్లే! ఈ మిసమిసకి నాకైతే ఎనిమిది నెలలు పట్టింది. నీకైతే ఎనిమిది రోజులు చాలు" అన్నాను.

శ్రీమతి ఏదో ఆనబోయింది. అంతలో అమ్మాయి వచ్చి, "అమ్మా! తమ్ముడు చూడు" అంది.

చూడ్డానికేముంటుంది – అది పితూరీ.

చాలామంది వయసులో ఉండగా ప్రేమ, ప్రేమ అంటూ వెంపర్లాడతారు కానీ – వాస్తవంలో దంపతుల్ని మించిన ప్రేమికులుండరు.

మేము ఎంతో కాలం తర్వాత కలుసుకున్నాం. మా ఆలోచనల్లో మేమిద్దరమే ప్రపంచంగా అయిపోయాం. అది మాటలకందని ఓ గొప్ప ప్రేమానుభూతి!

పరిసరాలకు అలవాటు పడడంలో ఎవరైనా పిల్లల తర్వాతనే! అందులోనూ తలిదండ్రులు పక్కనున్నప్పుడు – ఆ ధైర్యం పిల్లల్ని తమదైన ప్రపంచంలోకి నడిపిస్తుంది. వాళ్లు మమ్మల్ని మా మానాన వదిలి గదిలో పరుగులెడుతూ ఆటలు మొదలెట్టారు. ఆ ఆటలు అప్పుడే పితూరీల స్థాయికి వచ్చి మమ్మల్ని మా ప్రపంచంలోంచి వాస్తవానికి తీసుకొచ్చాయి.

"అమ్మా! తత్త చూడు" అన్నాడు అబ్బాయి. వాడికింకా అన్ని అక్షరాలూ పలకడం లేదు. అక్క అనడానికి 'తత్త' అంటాడు.

వాడికి తను అల్లరి చేస్తున్నానని తెలియదు. తోచింది చేస్తాడు. తర్వాత అక్కని అనుకరిస్తాడు.

అక్క చూడు అంది కదా అని తనూ చూడమన్నాడు.

"అమ్మ మీ ఇద్దర్నీ చూడాలా? మనమంతా కలిసి వెళ్లి షాపులు చూడాలా?" అన్నాను.

పిల్లల దృష్టి మరల్చడంలో నాకు నేనే సాటి అని – శ్రీమతే చాలాసార్లు సర్టిఫికెట్టిచ్చింది.

అమ్మాయి వెంటనే, "మీరు నన్నెత్తుకోవాలి" అంది.

పాపం, దానికి కొంతకాలంగా తీరని కోరిక అది!

చటుక్కున దాన్నెత్తుకున్నాను. అబ్బాయి వెంటనే నా దగ్గరకొచ్చి తననీ ఎత్తుకోమని చేతులు చాచాడు.

వాణ్ణీ ఎత్తుకున్నాను. ఇద్దరూ నా చేతుల్లో ఉంటే – అదో మధురానుభూతి!

"బాగా రాత్రయింది. షాపులు మూసేస్తారేమో!" అంది శ్రీమతి.

"మూసేస్తారు కానీ, మూసేసినప్పుడే చూడ్డానికి ఎక్కువ బాగుంటాయి. విండో షాపింగు గురించి వ్రాశానుగా, అది చేద్దాం. అట్టే దూరం కూడా కాదు, పక్కనే!" అన్నాను.

వాళ్లకెంత సరదాయో తెలియదు కానీ, నాకు మాత్రం వాళ్లతో విండో షాపింగ్ చెయ్యాలని మహా ఉబలాటంగా ఉంది.

"ముందు వాళ్లని దింపండి. కొంచెం దూరం నడిపిద్దాం. ఎప్పుడు నడవలేనంటే అప్పుడే ఎత్తుకోవచ్చు" అంది శ్రీమతి నన్ను హెచ్చరిస్తూ.

నేను పిల్లల్ని దింపాను. ఇంటికొచ్చేక ఎవరూ డ్రస్సులు మార్చుకోలేదు. అందుకని అలాగే బయల్దేరాం.

ఇంటికి తాళం వేసి వీధిలోకొచ్చేసరికి నాకు మళ్లీ భువనేశ్వర్ రోజులు గుర్తుకొచ్చాయి. సాయంత్రం ఆఫీసునుంచి రాగానే నలుగురం కలిసి ఊళ్లోకి బయల్దేరేవాళ్లం. ఎక్కడికెళ్లినా నలుగురం ఒక యూనిట్‌కింద వెళ్లేవాళ్లం. ఎన్నో నెలల తర్వాత మళ్లీ ఆ అనుభవం...

మా ఇంటికి పక్కనే నాలుగడుగుల దూరంలో ఉంది విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసే. ఆ వీధినిండా దుకాణాలే.

"దగ్గరంటే మరీ ఇంత దగ్గరా!" అని ఆశ్చర్యపోయింది శ్రీమతి.

ఇంత సెంటర్లో ఇల్లు సంపాదించినందుకు గర్వంగా నవ్వాను.

ఆ వీధిలో ఒకో షాపు వద్దకే తీసుకెడుతూ అద్దాల తలుపుల వెనుక కనిపిస్తున్న వస్తువుల గురించి వివరిస్తున్నాను. పిల్లలిద్దరే కాదు, శ్రీమతి కూడా పెద్ద కళ్లు చేసుకుని వింటుంటే నాలో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. ఒక షాపు దాటగానే అబ్బాయి నిద్రకి జోగడం మొదలెడితే వాణ్ణి ఎత్తుకున్నాను. వాడు వెంటనే నిద్రపోయాడు.

రెండో షాపు దాటేసరికి అమ్మాయి తనకీ నిద్దరొస్తోందంది.

"వాణ్ణెత్తుకున్నారుగా, అందుకని..." అంది శ్రీమతి దాని మాటని నటనగా తేల్చిపారేస్తూ.

నామీద ఎంతో నమ్మకం పెట్టుకుని మన దేశంనుంచి ఈ దేశానికి వచ్చిన కూతురు. నేను దాని మాటని తీసి పారేయలేనుగా – దాన్నీ ఎత్తుకున్నాను.

"నేనే ఎత్తుకునేదాన్ని. బాగా అలసటగా ఉంది" అంది శ్రీమతి సంజాయిషీగా.

"కానీ నాకు అలసటగా లేదు. నీకూ నిద్దరొస్తుంటే చెప్పు" అన్నాను నర్మగర్భంగా.

"నడిరోడ్డు. జనాలు బాగా తిరుగుతున్నారు. సిగ్గు లేదూ, ఇలాంటి మాటలనడానికి!" అంది శ్రీమతి మందలిస్తున్నట్లు.

"ఇది తెల్లవాళ్ల దేశం. ఇలాంటి మాటలకీ, చేతలకీ సిగ్గు పడే సమాజం కాదిది" అన్నాను.

నా మాటని ఋజువు చెయ్యడానికా అన్నట్లు – అక్కడున్న ఓ జంట – విండో షాపింగు చేస్తూ మధ్యలో ఒకరినొకరు గట్టిగా కౌగలించుకుని గాఢంగా చుంబించుకున్నారు.

శ్రీమతి చూసింది. తనున్నది థియేటర్ కాదు, నడి రోడ్డు. చూస్తున్నది హాలీవుడ్ సినిమా కాదు, సాటి జనాన్ని.

ముందుగా ఆమెలో చిన్న షాక్. అంతలోనే ఉలికిపాటు. చటుక్కున ముఖం తిప్పుకుని అప్రయత్నంగా అమ్మాయిని గమనించింది. అది కళ్లు మూసుకుని ఉంటే – ఓసారి కదిపి చూసి, "ఇది నిజంగానే నిద్దరోయింది. నాకూ అలసటగా ఉంది. ఇక ఇంటికి వెళ్లిపోదాం" అంది.

సంస్కృతీ సంప్రదాయాల్లో ఇంతటి తీవ్ర విభేదాన్ని ప్రత్యక్షంగా చూసి తట్టుకోలేకపోయిందని నాకు అనిపించలేదు.

నా వాళ్లది ప్రయాణం బడలిక అన్న విషయం అప్పటికి నా అవగాహనలోకి వచ్చింది.

వెంటనే వెనుదిరిగాను. నేను వద్దన్నా వినకుండా శ్రీమతి అబ్బాయిని నా దగ్గర్నుంచి తీసుకుంది.

ఇంటికి వెడుతూంటే అప్రయత్నంగా అందుకున్నాను – 'నిన్న లేని అందమేదో...."

శ్రీమతి చటుక్కున, "ప్లీజ్! ఆ పాట వద్దు. నాకది నిన్నటి దినాన్ని గుర్తు చేస్తోంది" అంది.

"అదేమిటి?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం లేదు. మీ నిన్న వేరు. నా నిన్న వేరు" అందామె.

"అంటే?" అన్నాను అర్థం కాక.

"మీ నిన్న ఏమిటో నేనూహించగలను. నా నిన్న గురించి మీరూహించలేరు" అందామె.

నాకింకా అర్థం కాలేదు. "అంటే?" అన్నాను మళ్లీ.

"మీకర్థం కాదులెండి. మేమిక్కడికి రాగానే మీరు ఒంటరిగా అనుభవించిన 'నిన్న'ను నాకు పరిచయం చెయ్యాలనుకున్నారు. మరి నేను ఒంటరిగా అనుభవించిన ఆ 'నిన్న' గురించి మాటవరసకైనా అడగలేదు...." ఆగిందామె. ఆ గొంతులో తడి.

అప్పుడర్థమైంది నాకు. కొన్ని అనుభవాలు మహాభారమై ఆమెను వేధిస్తున్నాయి. వాటిని దింపుకోవాలి.

అప్పటికి నేనేం మాట్లాడలేదు.

ఇంట్లోకి వెళ్లేక పిల్లలిద్దరికీ దుస్తులు మార్చి, మంచంమీద పడుకోబెట్టి రొజాయి కప్పాం. తర్వాత ఆమెతో, "వసూ! నీ ప్రయాణ విశేషాలు చెప్పు" అన్నాను.

శ్రీమతి మాట్లాడబోయి ఆగింది. గొంతులోని తడి కళ్లలోకి ఎగబాకి అక్కణ్ణించి క్రమంగా జలపాతమౌతుంటే – తనే తుడుచుకుంది.

తను తమాయించుకునేదాకా నేనలా చూస్తూనే ఉన్నాను తప్ప తాకడానికి కూడా ప్రయత్నించలేదు.

కాసేపటికామె తేరుకుని, "అవి నా ప్రయాణ విశేషాలు కావు. 'నిన్న'ని తలచుకుంటేనే అమ్మో అనిపింపజేసే దారుణ అనుభవాలు...." అంది.

ఆమె గొంతు చాలు – ఆ అనుభవాలనామెపై చూపిన ప్రభావం ఎంత దారుణమో ఊహించడానికి.

"చెప్పు" అన్నాను.

"ఇప్పుడు చెబితే మూడ్ మొత్తం పాడైపోతుంది. చెప్పకపోతే – మనసులోని భారం దిగదు"

అర్థమైంది.

ఎన్నో నెలల తర్వాత మళ్లీ దగ్గరయ్యాం. పిల్లలిద్దరూ అలసటతో వళ్లు తెలియకుండా నిద్రపోతున్నారు. అప్పుడు చెప్పుకోవాల్సిన మాటలు వేరే ఉంటాయి. అందుకే ఆమె తన ప్రయాణానుభవాలు చెప్పడానికి తటపటాయిస్తోంది. కానీ అవే చెప్పాలనుంది.

"అర్థాంగివి. నా మనోభారాన్ని దించడానికైనా, నువ్వా అనుభవాలు చెప్పాలిగా" అన్నాను.

ఆమె గొంతు సవరించుకుంది. నేను చెవులు రిక్కించాను.

కొన్నాళ్లు అత్తింట్లో ఉన్నాను.

కొన్నాళ్లు పుట్టింట్లో ఉన్నాను.

కొన్నాళ్లు అక్కా బావల దగ్గర ఉన్నాను.

అంతా నావాళ్లే! కానీ పక్కన మీరు లేకపోతే – అంతా పరాయివాళ్లేననిపించింది.

పరాయింట ఉన్నానన్న భావం మనసులో రాకూడదు కానీ – వస్తే అది నరకమే!

ఆ అనుభూతి కేవలం మానసికమని తెలుసు. కానీ పెళ్లయి కాపురానికి వచ్చిన మరుక్షణంనుంచీ, అదేమిటో మీరు తప్ప నావాళ్లంటూ ఎవరూ లేరనిపించింది.

పిల్లలు పుట్టేక – మనం అంటే – మీరు, నేను, మన పిల్లలు మాత్రమే అనిపించింది.

చిత్రమేమిటంటే – అలా అనిపించిన విషయం మీరు నాకు దూరంగా వెళ్లేదాకా తెలియలేదు.

సామాన్య పౌరులకి సంబంధించినంతవరకూ – బ్రిటిష్ వాళ్ల ఏలుబడికీ, మన ఏలుబడికీ పెద్దగా తేడా ఏముండదు. ఆంక్షలు, నియమాలు ఏదో రూపంలో వాళ్లని అదుపు చేస్తూనే ఉంటాయి. కానీ మనవాళ్లు మనకి ఏలికలైనప్పుడే మనది స్వతంత్రభారత దేశం.

అప్పుడొచ్చిన లోటేమిటీ, ఇప్పుడు కొత్తగా ఒరిగిందేమిటీ అనుకునేవారు ఇప్పటికీ ఉన్నారు.

అదెంతవరకూ సబబో చెప్పలేను కానీ – నాకు మాత్రం భార్యాభర్తలు కలిసి ఒకచోట ఉన్నప్పుడు మాత్రమే వాళ్లది స్వతంత్ర జీవనం అనిపిస్తుంది. ఇద్దరూ చెరో చోటా గడపాల్సి వస్తే – అది ఆర్థికంగా ఎన్ని సౌకర్యాలు కలగజేసినా – స్వతంత్ర జీవనం అనిపించుకోదు.

చిన్న ఉదాహరణ.

మీరు ప్రతి బుధవారం రాత్రి 8కి బినాకా గీత్‌మాలా వింటారు. అందులో వచ్చిన పాటల జాబితా పుస్తకంలో రాసుకుంటారు. ఇది మీకు ఈనాటి అలవాటు కాదు.

1959నుంచి మీ దగ్గర ఏటా 52 వారాల బినాకా గీత్‌మాలా పాటల రికార్డు ఉంది. రీసెర్చిలో చేరినప్పుడు బినాకా పాటలు మిస్ కాకూడదనే – మీరు అన్ని ఖర్చులూ మానుకుని ముందు రేడియో ఒకటి కొనుక్కున్నారని తెలుసు. జర్మనీ వెళ్లేక బినాకా పాటల జాబితా రాసుకునే పని నాకు అప్పగించారు. నా బాధ్యతని సక్రమంగా నిర్వహించాలనే ప్రయత్నిస్తున్నాను.

కానీ – పుట్టింటైనా అత్తింటైనా ఉన్నది ఒకే రేడియో. పిల్లలు వాడుకునేటప్పుడు నేనది కాసేపైనా స్వాధీనం చేసుకోగలను. కానీ పెద్దవాళ్లనుంచి కుదరదు కదా!

పోనీ విషయాన్ని వాళ్లకి వివరిద్దామంటే – మనం తీసుకున్నట్లు వాళ్లు దాన్ని సీరియస్‌గా తీసుకోరు.

అలా ఎన్నో వారాలు బినాకా వినడం మిస్సయ్యాను. ప్రతివారం ఎలాగూ కుదరడం లేదు – కనీసం ఏడాది చివర్లో ప్రత్యేకంగా వచ్చే వార్షిక కార్యక్రమం తప్పక వ్రాద్దామనుకున్నాను. అందులో ఆ ఏడాది మేటి పాటలు వస్తాయి కాబట్టి మీకు కొంత తృప్తి అనుకున్నాను. అక్కాబావల ఇంట్లో ఉన్నాను కాబట్టి ఇక్కడ ఆ మాత్రం స్వతంత్రం తీసుకోగలను అనుకున్నాను. పాపం, ఈ విషయంలో బావ కూడా నన్నర్థం చేసుకుని పాటల జాబితా వ్రాయడంలో తను కూడా నాకు సహకరిస్తానన్నాడు.

కానీ ఆ రోజు సరిగ్గా ఆ కార్యక్రమం మొదలయ్యే సమయానికి ఇంటికి బావ మిత్రులు వచ్చారు. వచ్చింది కూడా మమ్మల్ని పలకరించడానికి.

వాళ్లు మమ్మల్ని చూసి – "మీవాడు వీళ్లని తీసుకెళ్లడానికి అంత ఖర్చుకు సిద్ధపడ్డంలో ఆశ్చర్యం లేదు. ఇంత స్వీటు భార్యనీ, పిల్లల్నీ వదిలి ఇన్నాళ్లుండడమే ఆశ్చర్యం" అని మాకు కాంప్లిమెంట్సు కూడా ఇచ్చారు.

మిస్సవుతున్న బినాకా పాటలే చెవుల్లో రింగుమంటూండడంవల్ల వాళ్ల ప్రశంసలు నన్నంతగా కదిలించలేదు.

అలాగని పాపం వాళ్లూ ఎక్కువసేపు ఉండలేదు. గంట కార్యక్రమంలో ఓ పావుగంట మిస్సయ్యాను. బావ నొచ్చుకోవడమే కాక మిగతా పాటలు వ్రాసుకోవడంలో సాయం చేశాడు.

మీరు వెళ్లేక ఇలాంటివి చాలానే జరిగాయి.

మన దాంపత్యం మన సామ్రాజ్యం. ఇద్దరిలో ఎవరు లేకున్నా ఆ సామ్రాజ్యం వెలవెలబోతుంది.

అందుకే ప్రతి క్షణం ఓ యుగంలా గడుస్తుంటే – రోజులు, వారాలు, నెలలు, ఏళ్లు ఎలా గడపాలా అన్న భావనే నరకంగా మారి నన్ను వేధించేది.

అలాంటి సమయంలో మమ్మల్ని జర్మనీ తీసుకుని వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మీనుంచి ఉత్తరం.

మన పరిస్థితులు తెలుసు కాబట్టి అలాంటి ఏర్పాటుకి అవకాశముండొచ్చన్న ఆశ నాలో ఏమాత్రం లేదు.

మీ ఉత్తరం చదివితే కలా, నిజమా అనిపించింది. తర్వాత విమానప్రయాణం మాటెలాగున్నా ముందు అప్పుడే గాల్లో తేలిపోయి, ఆ ఉత్తరం ఒకటికి రెండుసార్లు చదువుకున్నాను.

అప్పుడు మీమీద కలిగిన ప్రేమాభిమానాల్లో కృతజ్ఞత కూడా చోటు చేసుకోవడం మీకు విచిత్రంగా అనిపించొచ్చు. కానీ అది నిజం.

విదేశానికి వెళ్లడం, అదీ జర్మనీ వంటి ఆధునిక సంపన్న దేశానికి వెళ్లడం – గర్వపడాల్సిన విషయం. కానీ అప్పుడు నాలో అలాంటి అనుభూతులు లేవు. ఎక్కడో ఒకచోట – మనమిద్దరం కలిసుంటాం అన్న భావనే నా సంతోషానికి ఏకైక కారణం.

అప్పుడు నేను కలకత్తాలో అక్కా బావల దగ్గర ఉన్నానుగా. వాళ్లు నన్నెంతో బాగా చూసుకుంటున్నారు. కానీ – వాళ్లూ జీవనభృతికోసం స్వరాష్ట్రాన్ని వదిలినవాళ్లే కదా!

బావది రిజర్వు బ్యాంకులో పెద్ద ఉద్యోగం. ఆఫీసుకి వెళ్లిరావడమే ఓ పెద్ద పని. ఆపైన పెద్ద ఆఫీసరుగా ఉద్యోగ బాధ్యతలు.

అక్కకి సంసార బాధ్యతలు. ఆపైన కలకత్తా ఓ మహానగరం. ఏం కావాలన్నా ఏంచెయ్యాలన్నా మహా ప్రయత్నమే చెయ్యాలి. తమ పనులకే ఇతరుల సాయం కావాలి వాళ్లకి. అలాంటి వాళ్ల మధ్యకి నేనొచ్చాను.

పోనీ, వాళ్లకి చేదోడువాదోడుగా ఉంటే అదో తృప్తి. కానీ అప్పుడు నాకే వాళ్ల సాయం కావాలి. అదీ మామూలు సాయమా – పాస్‌పోర్టు తీసుకోవాలి. విదేశప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యాలి. ట్రయిన్ టికెట్లు బుక్ చెయ్యాలి. విమానం ఎక్కించాలి. ఈ పనులన్నింటికీ సమయం కేటాయించాలి.

మన పని మనం చేసుకుందుకు మన పద్ధతి మనకుంటుంది. ఇతరులకి అప్పగించినప్పుడు వాళ్ల పద్ధతిలో వాళ్లు చేస్తారు కానీ మన పద్ధతిలో చెయ్యరు. పనౌతుంది కానీ పద్ధతులు వేరవడంవల్ల మనలో ఆదుర్దా ఎక్కువుంటుంది.

బావ ఏ పనైనా పీకెలమీదకు వచ్చేదాకా చెయ్యడు. కానీ పనౌతుంది. నాకేమో కంగారు. పనెంతవరకూ వచ్చిందో, అనుకున్నవేళకు ఔతుందో అవదో అని బెంగగా ఉంటుంది. పదేపదే అడిగితే బాగుండదు. తను ఎప్పటికప్పుడు చెప్పడు.

అనుకున్న పని అనుకున్న వేళకు జరక్కపోవడమన్నది అక్క, బావల జీవితంలో లేదు. అందుకని వాళ్లు నిశ్చింతగా తమ పద్ధతుల్ని కొనసాగిస్తున్నారు. వాళ్లని కాస్త హెచ్చరిద్దామంటే – ఇద్దరూ నాకంటే పెద్దవాళ్లు. పెద్దరికం బాధ్యతల్ని ఇవ్వడమే కాదు – ప్రశ్నలకి అతీతమూ ఔతుంది – ముఖ్యంగా మన సంప్రదాయంలో.

అదీకాక ఇది డబ్బుకి తడుముకునే సమయం కాదు. వాళ్లవేమో ఇంకా లేత రెక్కలు. నేనేమో భర్త దగ్గర లేని గృహిణిని.

డబ్బు గురించి నేను వాళ్లకి హామీ లివ్వలేను. వాళ్లేమో తమ డబ్బు ఇబ్బందుల్ని నాకు చెప్పుకోలేరు.

అప్పటికీ మీరు భువనేశ్వర్నించి నాకు డబ్బందే ఏర్పాటు చేశారు. మీ మిత్రుడు అయిదొందలు పంపితే, సరిపోవన్నానని – ఆ తర్వాత మరో రెండొందలు కూడా పంపే ఏర్పాటు చేశారు. అవీ సరిపోవని చెప్పడం ఇబ్బందే కదా!

ఉన్నంతలో మేం ముగ్గురం బూట్లు కొనుక్కున్నాం. మొత్తం అరవై రూపాయలయింది. ప్రయాణానికి ఓ పెద్ద పెట్టి కొన్నాను. 135 రూపాయలు. పిల్లలకి మఫ్లర్లు పాతిక రూపాయలు. మీరు అక్కడి వాళ్ల కివ్వడానికని మంచిగంధం బొమ్మలు – బాల్‌పెన్ను, చిన్న ఏనుగులు లాంటివి కొన్ని తీసుకున్నాను. 22 రూపాయలు. తాజమహల్ ఒకటి కొందామనుకున్నాను కానీ ఢిల్లీలో ఐతే కాస్త చౌకగానూ, మంచివీ దొరుకుతాయన్నాడు బావ. అప్పుడు టైము సరిపోతుందా అందామనుకున్నాను కానీ – ఇప్పుడు డబ్బు సరిపోతుందా అన్న అనుమానం ఉండడంవల్ల – మరి మాట్లాడలేదు.

దూర ప్రయాణం. సామాను మనతో కూడా ఉండదు. మిస్సయ్యే ప్రమాదముందని – పెట్టెమీద పెద్ద అక్షరాలతో నా పేరు ప్రత్యేకంగా వ్రాయించాడు బావ.

ఇంకా ఈ ప్రయాణం చేసేముందు యెల్లో ఫీవర్ రాకుండా టీకాలు వేయించుకోవాలిట. కానీ టీకాలు వేయించుకుంటే జ్వరమొస్తుందనీ, అది తగ్గడానికి ఒకోసారి వారం పైన పట్టొచ్చనీ కొందరన్నారు. మాకున్న వ్యవధి తక్కువ. ఏంచెయ్యాలా అని బెంగపడ్డాను కానీ – మన దేశంలో శతకోటి దరిద్రాలున్నట్లే వాటికి అనంతకోటి ఉపాయాలూ ఉన్నాయి.

టీకాలు వేయించుకోవడం ముఖ్యం కాదుట. వేయించుకున్నట్లు సర్టిఫికెట్ ఉండాలిట, అంతే! ఒక ఏజంటు పది రూపాయలు తీసుకుని – మా ముగ్గురికీ టీకాల సర్టిఫికెట్లు ఇప్పించేశాడు. సర్టిఫికెట్లు ఇలా కూడా వస్తాయని తెలియని దేశానికి వెడుతున్నాం కాబట్టి అలా ఆ పనైపోయింది.

ఇదిలా ఉండగా – టికెట్లు పంపుతున్నట్లు మీనుంచి ఇలా సమాచారం అందగానే అలా బావ నా ప్రయాణం గురించి మా నాన్నగారికి టెలిగ్రాం ఇచ్చాడు.

మా నాన్నగారి సంగతి మీకు తెలుసుగా – ఆవులించబోయే వాళ్లతో, 'అనవసరంగా శ్రమ పడకండి. మీ పేగుల లెక్క నాకు తెలుసు' అనగల అవగాహన ఆయనది.

ఆయనకు మొత్తం పరిస్థితి ఆకళింపుకి వచ్చినట్లుంది. తను బయల్దేరి వస్తున్నానని ఉత్తరం వ్రాసి దాంతోనే ముందుగా మూడు వేల రూపాయలకి డ్రాఫ్టు కూడా పంపారు. దాంతోపాటే ఓ ఉత్తరం కూడా ఉంది. 'ఈ డబ్బు మీ తక్షణ అవసరాలకిగానూ తెలిసినవారి దగ్గర

చేబదులు తీసుకుని పంపుతున్నాను. దేనికీ వెనుకాడకుండా దర్జాగా షాపింగు చెయ్యండి. చేబదులు కాబట్టి – బాకీ తీర్చేటప్పుడు మీరు వడ్డీ కట్టక్కర్లేదు. వీలునిబట్టి నేను కూడా మధ్యమధ్య చెల్లు వేస్తుంటాను కాబట్టి – తీర్చడానికి మీరు ఎంత టైమైనా తీసుకోవచ్చు' అన్నది ఆ ఉత్తరంలోని సారాంశం.

తీసుకుందుకు ఇబ్బంది పడతామని – ఆయన దాన్ని అప్పు అన్నారు. ఎదుటివాళ్ల అవసరాలు తీర్చేటప్పుడు వారా సాయాన్ని ఆమోదించడానికి సహకరించే భాషనే వాడ్డం ఆయన ప్రత్యేకత. ఆయన ఆ డబ్బు అప్పుగా ఇచ్చారనుకోను. మనం వెనక్కిచ్చినా – బాకీ తీర్చినట్లు కాకుండా ఆయన పద్ధతిలోనే మరో విధంగా ఇవ్వాల్సి ఉంటుంది.

ఏది ఏమైనా – ఆ డబ్బు అప్పుడు మనకి చాలా అవసరం. చేతికి అందగానే ఇంటిల్లపాది మనసులూ తేలికైపోయాయి. ఉన్న ఖర్చులకిది గొప్ప వెసులుబాటు. ఇప్పుడు నేను ధైర్యంగా అక్కకి చెప్పగలను – 'మా పనిమీద ఢిల్లీ వస్తున్నారు కాబట్టి మీ రైలు ప్రయాణం ఖర్చులు నావే' అని.

ఆ డబ్బు అందగానే ముందు పిల్లలిద్దరికీ ఉలెన్ గుడ్డలు కొని చెరో సూటూ కుట్టించాను. కుట్టుకూలితో కలిపి 330 రూపాయలయింది.

డ్రాఫ్టు మాకు డిసెంబరు 28న అందింది. అమ్మా, నాన్నా – డిసెంబర్ 30న వచ్చారు. నన్ను వాళ్లే ఢిల్లీ తీసుకెళ్లి విమానం ఎక్కిస్తారు కాబోలని ముందు అనుకున్నాను. కానీ నాన్న ఆ బాధ్యతని అక్కాబావలకే వదిలిపెట్టారు.

అప్పుడర్థమైంది – ఆయనొచ్చింది కేవలం నాకు ధైర్యం చెప్పడం కోసమని.

అమ్మానాన్నలంటే అంతే మరి! కన్నకూతురికి అవసరమైన డబ్బు పంపారు. మాటల్లో ధైర్యంచెప్పడానికి కాకినాడనుంచి కలకత్తా వచ్చారు.

నాన్న ముందొకసారి అంతవరకూ జరిగిన ఏర్పాట్లు సమీక్షించారు. నేను కొనుక్కున్న షాల్ చూసి – "అబ్బే – ఇది చౌకరకం. మన దేశంలోనే చలి ఆపదు. ఇక అక్కడేం అక్కరకొస్తుంది" అంటూ అది అమ్మకి ఇప్పించి, నాకు మరో ఉలెన్ షాల్ కొన్నారు.

ఆ షాల్ నాకోసం ఎంపిక చేసింది బావ. అందుకని వీలు చిక్కగానే, "పెద్ద – ఎంఏ అంటారు. రిజర్వు బ్యాంకులో ఆఫీసరు అంటారు కానీ – జర్మనీ వెళ్లడానికి ఎలాంటి షాల్ కొనాలో కూడా మా నాన్నగారు చెప్పాలి" అని అక్క బావని ఎద్దేవా చేసింది.

ఇలాంటి విషయాల్లో ఎదురు సమాధానానికి బావ ఏమాత్రం తక్కువ తినడు – "అసలు విషయం నీకు అర్థం కాలేదు. నేను కొన్న షాల్ మీ నాన్నగారికి ఎంత నచ్చేసిందంటే – దాన్ని అత్తయ్యగారికోసం ఉంచెయ్యాలనుకున్నారు. వయసులో పెద్దవారు – ఆ మాట పైకి చెప్పలేరు కదా – అందుకని...." అన్నాడు.

ఐతే నాన్న కొత్త షాల్‌కి కూడా అంతగా తృప్తి పడలేదు. షాల్ పైన కప్పుకుందుకు రగ్గు ఒకటి కొని, "ఇది చలి బాగా ఆపుతుంది. కాస్త గుచ్చుకుంటుంది కాబట్టి లోపల షాల్. డబల్ ప్రొటెక్షన్" అన్నారు.

నాన్న దగ్గరుండి నాకోసం ప్రత్యేకంగా షూ ఒకటి కొన్నారు. అది నల్లగా నిగనిగలాడుతూ మెరిసిపోతోంది. అడుగున సోల్ చాలా నున్నగా ఉంది.

"ఇది రాజులు వేసుకునేలాంటిదమ్మా! జర్మనీ వెడుతున్నావుగా – నీదిక రాజయోగమే!" అన్నారాయన.

ఆయన నాకు విదేశయానం గురించి చాలా చెప్పారు. కొన్ని తెలిసినవారి ద్వారా విన్నవి. కొంత చదివిన పరిజ్ఞానం.

పక్కనున్నవాళ్లకి చాదస్తంగా అనిపించొచ్చు కానీ – ఆయన మాటల్లో నాకు మాత్రం పితృప్రేమకి నిర్వచనం కనిపించింది.

నిత్య జీవన వ్యవహారంలో అవసరపడే ఆంగ్ల పదాల జాబితా ఒకటి కాకినాడలోనే తయారు చేసుకుని వచ్చారాయన. నన్నూ మా అక్కనీ పిలిచి ఆ జాబితాని కంఠస్థం చేయించారు. స్కూలు టీచర్లా మాచేత వల్లె వేయించారు. అడ్డదిడ్డపు వరుసలో అర్థాలడిగి మాకవి వంటబట్టినట్లు నిర్ధారించుకున్నాక – "ఒకసారి మీరిద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుకోండి" అన్నారు.

కొంత మొహమాటం. కొంత చిరాకు. కానీ నాన్నగారంటే భయం, భక్తి, గౌరవం మూడూ ఉన్నాయి మాకు.

కన్యాశుల్కం నాటకంలో గిరీశం, వెంకటేశంలా మేమిద్దరం కాసేపు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' చెప్పుకున్నాం.

నాన్నగారు ముసిముసిగా నవ్వారు. మాచేత మాట్లాడించడంలో ఆయన కాసేపు మాలోని బాల్యాన్ని వెలికి తీసి వినోదించారని అప్పుడు నాకనిపించింది.

అమ్మ, నాన్నగారు కలకత్తాలో రెండ్రోజులే ఉన్నారు. జనవరి 1న కాకినాడకి వెళ్లిపోతున్నామని చెప్పగానే – "ఇక్కడ రిజర్వుబ్యాంకులో ఎస్కలేటర్ (కదిలే మెట్లు) పెద్ద టూరిస్ట్ ఎట్రాక్షన్. క్రితంసారి వచ్చినప్పుడు కూడా మీరు చూడలేదు. మీరొస్తారనే – ఇంతవరకూ మీ చిన్నమ్మాయికి కూడా అవి చూపించలేదు" అన్నాడు బావ.

నాన్న నవ్వి, "చిన్నమ్మాయి గురించైతే ఇకమీదట జర్మనీలో రోజూ షాపుల్లో ఎస్కలేటర్లు ఎక్కుతూనే ఉంటుందిలే. నా సంగతంటావా – అవతల చాలా పనులు పక్కనపెట్టి వచ్చాను. ఎస్కలేటరంటే మామూలు విశేషమా – అదో పెద్ద వింత! తీరుబడిగా శ్రద్ధగా చూడాలి. దాని గురించి మనూళ్లోవాళ్లకి కాస్త వివరంగా వెప్పాలి. మళ్లీ వచ్చినప్పుడు కేవలం అది చూడ్డానికే వస్తాను" అన్నారు.

వ్యవసాయం పనులమీద పల్లెటూరికి వెళ్లినప్పుడల్లా నాన్న తన చుట్టూ చేరినవారందరికీ – ఊసులు చెబుతారు. వాటిలో దేశ విదేశాలకి సంబంధించిన వింతలు, విడ్డూరాలు ఉంటాయి. చెప్పడం ఆయనకిష్టం. వినడం వాళ్లకిష్టం.

బావ మరి బలవంత పెట్టలేదు ఆయన్ని.

అమ్మనుంచి నాకందిన సందేశం ఒక్కటే – "దేనికీ అడ్డూ అదుపూ లేని దేశమట అది. అల్లుడు బుద్ధిమంతుడే కానీ – పరిసరాలు అలాంటివి. ఇప్పటికే ఏమలవాట్లు అయ్యాయో, ఏంచేస్తున్నాడో తెలియదు. దేనికీ తెగే దాకా లాగకు. నెమ్మదిగా మంచి మాటలతో నీవైపు తిప్పుకుని దారి మళ్లించుకో"

అమ్మా నాన్నా వెళ్లేసరికే – నా పాస్‌పోర్టు కూడా వచ్చేసింది. ఆతర్వాత రిజర్వుబ్యాంకునుంచి విదేశీ మారకానికి సంబంధించిన కాగితాలు కొన్ని రావాల్సి ఉంటే – పాస్‌పోర్టు రాగానే బావ వాటిని చిటికెలమీద సంపాదించాడు.

ఢిల్లీకి టికెట్లు బుక్కయ్యాయి.

ఈలోగా బావకి నియోగి అనే బెంగాలీ అతను పరిచయమయ్యాడు. అతను కూడా మేం వెడుతున్న ఏరోఫ్లోట్ విమానంలోనే అదేరోజున మాస్కో వెడుతున్నాట్ట. నాకు తోడుగా ఉంటాడని బావ ఎంతో సంబరంగా చెప్పాడు.

నన్నూ పిల్లల్నీ తీసుకుని అక్కా బావా ఢిల్లీ వచ్చారు. విమానాశ్రయంలో కలిసిన నియోగికి నన్ను పరిచయం చేసి, "విదేశయానమే కాదు, ఒంటరిగా వెళ్లడమూ వీళ్లకి మొదటిసారి. మీరు కొంచెం సాయం చేయాలి" అని చెప్పాడు బావ.

ఆయన మాతో వచ్చేది మాస్కో దాకానేనుట. ఆ తర్వాత ఆయన వెళ్లేది జర్మనీ కాదు. మరో దేశం. అంతవరకూ చేతనైన సాయం చేస్తానని మాటిచ్చాడాయన.

సామాను తీసుకుని – నేను, పిల్లలు సెక్యూరిటీ చెక్‌కి వెళ్లేదాకా అక్క, బావ మాతోనే ఉన్నారు. వాళ్లు కనుమరుగవగానే ఆత్మీయులకు దూరమైన అనుభూతి కలిగి, కళ్లలో నీళ్లు తిరిగాయి.

మీరు దగ్గరలేరన్న వ్యథలో అక్కడుండగా పట్టించుకోలేదు కానీ – కలకత్తాలో మా అక్కాచెల్లెళ్ల ఆత్మీయానుబంధం మరింత బలపడింది.

ఉన్నట్లుండి నేను ఒంటరినైపోయాను. ఆ ఒంటరితనంలోనే – లోకం తెలియని ఇద్దరు పసివాళ్ల బాధ్యత – లోకం తెలియని నామీద పూర్తిగా పడింది.

వెడుతున్నది నాకు తెలియని కొత్త లోకానికి!

భయం భయంగానే ముందడుగు వేశాను. నాతో పాటే పిల్లల్నీ, సామాన్నీ కదపాలి కాబట్టి అడుగులు భారంగానే పడుతున్నాయి.

ఆ సమయంలో ఉన్నట్లుండి సెక్యూరిటీ అలారం విపరీతంగా మ్రోగడం మొదలెట్టింది.

అలారం శబ్దం విని పిల్లలు హుషారెక్కి – అదేమిటోనని చాలా కుతూహలంగా అటూ ఇటూ చూస్తున్నారు. వాళ్ల హుషారు చూసి నేను మురిసిపోయాను. కాసేపది అలా మోగుతూ ఉంటే – పిల్లలకూ, నాకూ దృష్టి మళ్లి కాలక్షేపంగా ఉంటుందని ఆశపడ్డాను.

అంతలోనే ఇద్దరు మనుషులు చటుక్కున మా దగ్గరకొచ్చారు. వాళ్లు వేసుకున్న యూనిఫాంని బట్టి విమానం తాలూకు మనుషులయుండచ్చనుకున్నాను. కానీ ఇంకా అలారం మోతకు వినోదిస్తూ వాళ్లని పట్టించుకోలేదు.

అంతలో అలారం ఆగిపోయింది. దాంతో పిల్లల హుషారుకి ఫుల్‌స్టాప్ పడింది.

ఎందుకాగిపోయిందా అనుకుంటూ అప్పుడు వచ్చినవాళ్లను చూస్తే – వాళ్లు గుచ్చి గుచ్చి నన్నే చూస్తున్నారు.

ఆ చూపులు మామూలుగా లేవు. సినిమాల్లో పోలీసులు అపరాధిని చూస్తారూ – అలా ఉన్నాయి వాళ్ల చూపులు.

వాళ్లు వచ్చింది నా కోసమే అని పించింది. ఎందుకన్నట్లు చూశాను.

వాళ్లు తమ గురించి చెప్పుకుందుకు వాడిన పదాల్ని బట్టి – విమానాశ్రయంలో సెక్యూరిటీ స్టాఫ్ అని గ్రహించాను.

ఆడ కూతురు. మగసాయం లేకుండా పిల్లలతో విమానయానం చేస్తోందని సాయానికొచ్చారా? సాయానికొస్తే ఆత్మీయంగా పలకరించాలి గానీ – ఆ చూపులేమిటి?

అప్పుడో విషయం స్ఫురించింది. ఇంగ్లీషు సినిమాల్లో నటీనటుల హావభావాల్ని బట్టి వాళ్ల ఉద్దేశ్యం తెలుసుకోవడం కష్టం. మనకి అర్థంకాని ఉచ్చారణతో ఇంగ్లీషులో ఏదో మాట్లాడేసి – ఉన్నట్లుండి ఒకరినొకరు కొట్టుకుంటారు. భాష అర్థమైతే తప్ప వాళ్లెందుకు కొట్టుకున్నారో తెలియదు.

విమానాశ్రయంలో స్టాఫ్ మనవాళ్లే ఐనా – వాళ్ల భాష, తీరు ఇంగ్లీషు వాళ్లకిలాగే ఉంటాయనుకోవాలి.

వాళ్లెలాగుంటేనేం – మన పద్ధతిలో మనముందామనుకుని వాళ్లవైపు చిరునవ్వుతో చూశాను.

వాళ్లు నాతో ఇంగ్లీషులో ఏదో అన్నారు. ఆ ఉచ్చారణ నా కర్థం కాలేదు.

అది గ్రహించారో ఏమో – వాళ్లు మళ్లీ హిందీలోకి మారారు. తుమ్, హో లాంటి పదాలు తెలిశాయి కానీ – వాళ్ల భావం తెలియలేదు.

ఆ విషయం నా మొహం చూసి గ్రహించారేమో – వాళ్లు సైగల్లోకి దిగారు.

కొన్నేళ్లుగా వేరే రాష్ట్రంలో ఉండడంవల్ల నాకు – ఇంగ్లీషు, హిందీ కూడా కొంతవరకూ అర్థమౌతాయి. కానీ వీళ్ల ఇంగ్లీషు ఉచ్చారణ అటు విదేశీయం, ఇటు దేశీయం కాకుండా మధ్యరకంగా ఉంది. హిందీ ఉచ్చారణా నా అవగాహనకు అందడం లేదు.

అలారం మోగించిందీ, ఆపిందీ కూడా వాళ్లేననీ – ఇప్పుడు వాళ్లు సామానుతో సహా మమ్మల్ని పక్కగా రమ్మంటున్నట్లు అర్థమవడానికి కాసేపు పట్టింది.

వాళ్లెందుకు పక్కకి రమ్మంటున్నారో తెలియలేదు కానీ – అలారాన్ని మరికాసేపు మ్రోగనిస్తే బాగుణ్ణనిపించింది. ఆ మాటే చెప్పేద్దును కానీ భాష సమస్య.

వాళ్లు హిందీ, ఇంగ్లీషు, సైగలు మిక్స్ చేస్తూ – నన్ను సూట్‌కేసు తెరవమన్నారు (అప్పటికి సూట్‌కేసులు తెరిచి చూపడమే కానీ ఇప్పటిలా స్కానింగ్ లేదు).

తెరవడానికి మొహమాటమేసింది. ఆ సూట్‌కేసులో మా బట్టలు – పప్పు దినుసులు, ఆవాలు, జీలకఱ్ఱ లాంటి పోపు సామాన్లు ఉన్నాయి. వాటిని చూసి వాళ్లు నవ్వుతారన్న శంకతో కొంచెం తటపటాయించాను. కానీ వాళ్లు నొక్కించడంతో తప్పలేదు.

సూట్ కేస్ తెరిచాను. అందులో వస్తువుల్ని చూసేక – వాళ్లలో ఒకడి భృకుటి ముడతలు పడింది. తనకి కావలసిందేదో దొరకలేదన్న భావం అతడి కళ్లలో చూశాను. ఇతగాడికేం కావాలి చెప్మా అని ఆలోచిస్తుండగా – హాండ్ లగేజి బ్యాగ్ తెరవమన్నాడు రెండోవాడు.

అందులో మాత్రం ఇందులో లేని అద్భుత వస్తువులేముంటాయి? కొన్ని ఆపిల్సు, పళ్లు కోసుకునే చాకు ఉన్నాయి.

సూట్‌కేసులో వాటిని చూసి నవ్వలేదు కాబట్టి, ఈసారి కాస్త ధైర్యంగానే బ్యాగ్ తెరిచాను

చాకు చూడగానే మొదటివాడికి ఇందాకటి భృకుటి ముడతలు విడిపోయాయి. నాకేసి అదోలా చూసి – ఆ చాకు దేనికోసమన్నట్లు సైగ చేశాడు.

నేను ఆపిల్సు చూపించి – వాటిని కొయ్యడానికని సైగలతో చెప్పాను.

వాళ్ల సైగలు నాకు, నా సైగలు వాళ్లకి బాగానే అర్థమయ్యాయి. ఎంత బాగా అంటే – అప్పుడు నన్నెవరైనా టైం మెషీన్లో ఆది మానవుడి కాలానికి పంపితే – అక్కడ వాళ్లతో సైగలతో ఎంతసేపైనా మేనేజ్ చేసెయ్యగలనన్న ధైర్యం వచ్చింది. కానీ ఇక్కడ ఈ అత్యాధునికులతో మాత్రం ఎంతోసేపు మేనేజ్ చెయ్యగలనని అనిపించడం లేదు.

ఇంత చక్కని సైగలుండగా – మనిషి ఎందుకు భాష నేర్చుకున్నాడో – ఇన్ని భాషలు సృష్టించి వైషమ్యాలని ఎందుకు పెంచుకుంటున్నాడో – అనిపించింది నాకా క్షణంలో.

ఆపిల్సు కొయ్యడానికి చాకు తెచ్చుకున్నాననగానే – సెక్యూరిటీ స్టాఫ్ మొహాల్లో అప్రయత్నంగా చిరునవ్వులు వెలిసాయి.

అందుకు వాళ్లకు బదులేమివ్వాలో, నేనేమంటే వాళ్లేమంటారో, ఏమర్థం చేసుకోవాలోనని కొంచెం బెంగ పడ్డాను కానీ – ఆ చిరునవ్వులే వీడ్కోలని తెలిసింది – వెంటనే వాళ్లు వెళ్లిపోవడంతో.

విమానం ఎక్కేలోగా నియోగి కనబడతాడేమోనని, అతడితో మాట్లాడ్డం కోసం ఇందాకా అలవాటైన సైగల భాషని మనసులోనే అభ్యాసం చేశాను. కానీ అంతా వృథా. ఆయన పత్తా లేదు.

అబద్ధమెందుకూ ఆయన కనబడకపోవడం నాకు కొంచెం రిలీఫ్‌గానే అనిపించింది.

ఎటొచ్చీ విమానం ఎక్కడం కొత్త కదా! ఆ సమయంలో మాత్రం అతడు కనిపించి మమ్మల్ని విమానం ఎక్కించి ఆ తర్వాత మళ్లీ మాయమైపోతే బాగుణ్ణనిపించింది.

కానీ తీరా విమానం ఎక్కే సమయానికి – ఆ హడావుడిలో నియోగి విషయం మర్చిపోయాను. ఎయిర్ హోస్టెస్ చిరునవ్వుతో అందించిన స్వాగతపూర్వక నమస్కారాన్ని స్వీకరించి, లోపల ఇతరులని గమనించగా తెలిసిందానితో మా సీట్లని వెదికి పట్టుకుని, ముగ్గురం అక్కడ కూర్చున్నాకనే మళ్లీ నాకు నియోగి గుర్తుకొచ్చాడు.

కానీ అతడికి మేము గుర్తున్నట్లు లేదు. మరి మాకు కనబడలేదు.

నేను కూడా నియోగిని చూసింది కొన్ని క్షణాలు. బుర్రలో అతడి రూపం సరిగా రిజిస్టర్ అయిందనిపించదు. కనబడితే గుర్తు పడతానన్న నమ్మకం లేదు.

ఆప్పుడో అనుమానమొచ్చింది.

పాపం నియోగి నాకు కనబడ్డాడేమో... పలకరింపుగా నావంక చూశాడేమో... అతణ్ణి గుర్తు పట్టలేక నేనతణ్ణి బ్లాంక్‌గా చూశానేమో... అందుకు నొచ్చుకుని మరి పలకరించడం మానేశాడేమో...

ఈ అనుమానం రాగానే – విమానంలో మాటవరసకి నన్ను చూసి మందహాసం చేసిన ప్రతి వ్యక్తినీ నియోగి కాదుకదా అన్న భావంతో చూశాను.

'ఆవులు పెయ్యలు మందలు జేరెను, పిట్టలు చెట్లను గుమిగూడెను, మింటను చుక్కలు మెరయుచు పొడసెను, ఇంటికి పూర్ణమ రాదాయె' అని గురజాడ వారన్నట్లు నాకు నియోగి మరి కనబడలేదు.

తర్వాతనుంచి అన్నీ కొత్త. ఇంటికొచ్చిన అతిథుల్ని మర్యాద చేసినట్లు విమానంలో మాకు చాక్లెట్లు, ఫలహారాలు, భోజనం బగైరాలు రంచనుగా టైముకి అందుతుంటే – ఆహా విమాన ప్రయాణమా – అనుకున్నాను.

ఏమైతేనేం – మొదటిసారి కాబట్టి కాస్త కొత్తగా అనిపించినా – విమానప్రయాణంలో ఇబ్బందులేం కలగలేదు. పిల్లల విషయానికొస్తే – వాళ్లు కొత్త వాతావరణపు మైకంలో ఉన్నారు. అన్నింటినీ ఆసక్తిగా పరికిస్తూ, నాకే ముద్దొచ్చేటంత ముచ్చటగా సద్దుకున్నారు. మొదటిసారి పిల్లల్ని బాత్రూంకి తీసుకెళ్లినప్పుడు అక్కడి వాక్యూమ్ సిస్టం అయోమయంగా అనిపించినా – పిల్లల సహకారం వల్ల ఇబ్బంది అనిపించలేదు.

అందువల్ల నియోగి అదృశ్యంవల్ల నాకొచ్చిన నష్టమేం లేదు. కనబడితే అతగాడితో ఎలా మాట్లాడాలా ఏం మాట్లాడాలా అని బెంగగా కూడా అనిపించింది. ఎందుకంటే అతను బెంగాలీ. ఇంగ్లీషు, హిందీ కూడా బెంగాలీలాగే మాట్లాడతాడు.

నా విషయంలో అతనూ అన్ని భాషలూ తెలుగులాగే మాట్లాడుతానని ఆనుకున్నాడేమో – అందుకే నాకు మళ్లీ కనబడలేదేమో అని కూడా అనుకున్నాను.

తనవుకి అలసట. మనసులో అలజడి. వీటిమధ్య తెలియకుండానే చిన్న కునుకు.

అబద్ధమెందుకూ – మాస్కో వచ్చేసిందంటే 'అప్పుడేనా?' అనుకున్నాను.

విమానం దిగుతుంటే అప్పుడు మళ్లీ స్ఫురించింది – మేము కొత్త ప్రపంచంలో అడుగెడుతున్నామని.

ఢిల్లీలోలా ఎదురుగా రంగురంగుల నేల కనిపించడం లేదు. మొత్తం ప్రకృతి తెల్లని దుప్పటి కప్పుకుని పడుకున్నట్లుంది. అది దుప్పటి కాదని తెలియడానికేమో – కొన్ని క్రేన్సు దానిమీద బలంగా దాడి చేస్తున్నాయి.

నేలంతా తెల్లని మంచు. క్రేన్సు తవ్వి పోస్తుంటే గుట్టలు గుట్టలుగా పేరుకుంటున్న మంచు. ఎంత తవ్వినా ఇంకా ఇంకా ఉన్నానంటున్న మంచు.

కొంచెం శ్రద్ధగా చూస్తే – కనుచూపు మేరలో విమానాశ్రయం కనిపిస్తోంది. నడిస్తే పది నిముషాలు పట్టొచ్చుననిపించేటంత దూరమది.

అంటే మేమిప్పుడు ఆ మంచుమీంచి నడిచి వెళ్లాలి.

నేనింకా ఆలోచిస్తుండగానే జనం ముందుకు కదిలారు. నేనూ వాళ్లని అనుసరించాను.

అప్పుడు తెలిసింది నాకు.

భుజానికి హాండ్‌బ్యాగ్ వ్రేలాడుతోంది. భుజం చుట్టూ షాల్ ఉంది. దాన్ని కప్పుతూ ఓ రగ్గుంది.

ఓ చేయి చంకలో అబ్బాయిని పట్టుకుంది. మరో చేయి – నడిపించడానికి అమ్మాయిని పట్టుకుంది.

నడవాల్సింది పది నిముషాలే కావచ్చు. కానీ ఈ అవతారంతో అడుగు ముందుకు పడేదెల్లా?

ఆలోచన దారి ఆలోచనదే. నేను ముందడుగు వేశాను. అంతే!

అప్పుడు తెలిసింది. కాలికింద నేలని నున్నటి మంచు దట్టంగా కప్పేసిందనీ, నా కాళ్లకి తొడిగినది మంచుపై స్కేటింగుకి అనువైన నున్నటి షూ అనీ.

స్కేటింగ్‌ని సినిమాల్లో చూడ్డమే తప్ప, స్వయంగా చూసే అవకాశం రాలేదు. అప్పుడు మాత్రం స్వయంగా చేసే అవకాశం వచ్చింది.

అప్పుడు నాకర్థమైంది – స్కేటింగ్ అంటే జర్రున జారుతున్నప్పుడు పడిపోకుండా నిలబడి ముందుకు పోగలగడమని.

కానీ నా ముందున్నవాళ్లు స్కేటింగ్ చేస్తున్నట్లు లేదు. మామూలుగా నడుస్తున్నట్లే ఉంది.

నా వెనకున్నవాళ్లూ స్కేటింగ్ చేస్తున్నట్లు లేదు. వాళ్లు నడిరోడ్డుమీద వెనుకనుంచి మనకంటే వేగంగా వస్తూ మనని దాటించుకుని వెడుతున్నట్లుంది.

నేను మాత్రం జర్రున జారాను. అది జారడమే తప్ప నిలబడే అవకాశం లేదనిపించేటంతలా జారాను. పడిపోతున్నానని అర్థమైంది.

అప్పుడు నా గురించికంటే పిల్లలేమైపోతారోనని మాతృహృదయం తపించిపోయింది. గట్టిగా అరవబోయాను. భయమో, ఉద్వేగమో – గొంతు పెగల్లేదు.

ఐతే నేను కింద పడలేదు.

చెట్టంత తెల్లవాడొకడు నన్నే గమనిస్తున్నట్లున్నాడు. నేను జారి పడకుండా ఆపాడు. నన్ను నేను నేలమీద నిలదొక్కుకుందుకు కొద్ది క్షణాలు ఆగాడు. తర్వాత అమ్మాయిని భుజాలమీద ఎక్కించుకున్నాడు. నా బ్యాగుని తీసి ఓ భుజానికి తగిలించుకున్నాడు. అబ్బాయిని తీసుకుని చంకనెత్తుకున్నాడు. నా చెయ్యి గట్టిగా పట్టుకుని నడవమన్నట్లు కనుసైగ చేసి ముందడుగు వేశాడు.

అంతవరకూ ఎరిగున్న తెలుగు మగాళ్లకి కూడా ఒక్కసారైనా షేక్‌హాండివ్వలేదు. ఇప్పుడతడు నా చేయి పట్టుకుంటే – మగాడి చెయ్యి పట్టుకున్నట్లు లేదు. ఆసరా దొరికినట్లనిపించింది.

ఆసరాలో స్పర్శానుభూతి ఉండదు, మమతానుభూతి తప్ప – అని గ్రహించాను.

అతడి పట్టు ఎంత బలంగా ఉన్నదంటే – నా నున్నటి షూ స్కేటింగుకి మాత్రమే సహకరిస్తుంటే – ఎక్కడా జారిపడకుండానూ, నడకను మర్చిపోయీ, స్కేటింగ్ చేస్తూనే విమానాశ్రయం చేరాను.

అతను మమ్మల్ని నీడ పట్టుకు చేర్చి నా చేయి వదిలాడు. స్కేటింగు ఎంతలా అలవాటయిందంటే – అతను చేయి వదిలిన వెంటనే కొంచెం ముందుకు జారాను. అది నున్నటి మంచు నేల కాకపోవడంతో కింద పడకుండా తమాయించుకుని నిలబడి వెనక్కి తిరిగాను.

అప్పటికా చెట్టంత మనిషి – అబ్బాయినీ, అమ్మాయినీ, బ్యాగునీ క్రిందకు దించి మాకేసి చూసి చిన్న నవ్వు నవ్వాడు. ఆపద్బాంధువుల నవ్వు అలాగే ఉంటుందేమో!

చేతులు జోడించి నమస్కరించాలనుకున్నాను. కానీ నా అవయవాలేవీ ఇంకా నా స్వాధీనంలోకి రాలేదు. కనీసం థాంక్సయినా చెప్పాలనుకున్నాను. కానీ అతడు హడావుడిగా ఎటో వెళ్లిపోయాడు. తన డ్యూటీ అయిపోయిందనుకున్నాడో – లేక అతగాడి విమానం బయల్దేరడానికి సిద్ధంగా ఉందేమో!

సాయపడతానన్న నియోగి జాడ ఎక్కడా లేదు. ఇతనెవరో సమయానికి ఆపద్బాంధవుడిలా వచ్చాడు. అలాగే మాయమయ్యాడు.

ఆ మహానుభావుడికి థాంక్స్ చెప్పే అవకాశం రాలేదని మనసు బాధ పడింది. అతడి గురించే ఆలోచిస్తూ – చెట్టంత మనిషి కాబట్టి అవలీలగా మాకు సాయం చెయ్యగలిగాడు. నియోగి ఐతే నాతోపాటు తనూ పడిపోయేవాడేమో – అనుకున్నాను.

"ఆ అంకుల్ ఎంతున్నాడో" అంది అమ్మాయి కళ్లు పెద్దవి చేసుకుని.

"అవునమ్మా, చెట్టంత మనిషి" అన్నాను.

"జర్మనీ వెళ్లగానే నాన్నగారికి చెప్పాలి. నేను విమానమే కాదు, చెట్టంకుల్ భుజాలమీద కూడా ఎక్కానని" ఉత్సాహంగా అంది అమ్మాయి. మొహం చూస్తే దానికి విమానం కంటే అతడి భుజాలెక్కడమే గొప్ప విశేషంలా అనిపించింది.

చెట్టంకుల్ – భలే పేరు!

చంటిపిల్లగా ఉన్నప్పుడు ఏమో కానీ, కాస్త పెద్దయ్యేక మీరెప్పుడూ దాన్ని భుజాలమీద ఎక్కించుకోలేదు. బహుశా అది ఈ చెట్టంకుల్ని జీవితాంతం మర్చిపోదు.

అతనికి థాంక్స్ చెప్పలేకపోయానని ఇంకా మనసు నొచ్చుకుంటూనే ఉంది. మామూలుగా ఐతే అలా నొచ్చుకుంటూనే ఉండిపోయేదాన్నేమో – కానీ – నా ముందున్న గురుతర బాధ్యతలు ఆ అవకాశమివ్వలేదు!

కాస్త అటూ ఇటూ చూసి కాళీగా కనబడ్డ కుర్చీల దగ్గరికి వెళ్లాం. బ్యాగ్ దగ్గరగా పెట్టుకుని అంతా కుర్చీల్లో కూర్చున్నాం.

మాకు ఎదురుగా కుర్చీల్లో ఓ ముసలి జంట కూర్చుని ఉన్నారు. ఎందుకో మరి – వాళ్లు మమ్మల్నే తదేకంగా చూస్తున్నారు.

కాస్త ఇబ్బందిగా అనిపించి – నేనూ కొద్ది క్షణాలు వాళ్లని తదేకంగా చూశాను. వాళ్లు చలించలేదు. నన్నూ పిల్లల్నీ మార్చి మార్చి చూస్తున్నారు.

వెళ్లి పలకరిద్దామంటే వాళ్లు తెల్లవాళ్లు. మళ్లీ సైగల భాష మొదలెట్టాలి. ఉన్న కాసేపట్లో కొత్త పరిచయాలెందుకులే అనుకుని – నేను నా దృష్టి మరల్చుకున్నాను.

కానీ నేనుండేది కాసేపేనా? ఈ విమానాశ్రయంలో నేను కనీసం ఏడు గంటలు గడపాలి. ఆ తర్వాత విమానం ఎక్కడానికి మళ్లీ మంచులో స్కేటింగు చేసి వెళ్లి మరో విమానమెక్కాలి. అది బెర్లిన్లో దింపితే – అక్కడ మళ్లీ మంచులో స్కేటింగ్ చేసి....

స్కేటింగ్ అనగానే ఇందాకటి చెట్టంకుల్ గుర్తొచ్చాడు. ఆపద్బాంధవులు అన్నివేళలా దొరకరు కదా అనుకోగానే – వళ్లు గగుర్పొడిచింది....

అప్పుడు బాబు నా చేయి గోకాడు. ఏమిట్రా అన్నట్లు చూస్తే కుడి చేతి రెండు వేళ్లు చూపించాడు.

వాడు మామూలుగా తన అవసరాల్ని మాటల్లోనే చెప్పుకుంటాడు నాకు. ఇందాకా సెక్యూరిటీ స్టాఫ్‌తో నా సైగల భాష చూసి వాడికీ మనసు పుట్టిందేమో మరి!

అర్థమైంది – వాణ్ణి బాత్రూంకి తీసుకెళ్లాలి.

వాడితో సమస్య ఏమిటంటే – వాడు పీకెలమీదకి వచ్చేదాకా బాత్రూం విషయం చెప్పడు. ఒకసారి చెప్పాడంటే – మనకి ఎంతో టైమివ్వడు. యాక్సిడెంటు జరక్కుండా నేను తొందర పడాలి. ఐనా యాక్సిడెంటు జరిగిపోతే – ఆ అవస్థ నాదే కానీ వాడు తనకేదో అవమానం జరిగినట్లు ఫీలైపోతాడు. సముదాయించడానికి ఒకోసారి గంటలు చాలవు.

కంగారు పడ్డాను కానీ అదృష్టం బాగుంది. బాత్రూం వెతుక్కుందుకు టైం పట్టలేదు. అది మాకు ఇంచుమించు పక్కనే ఉంది. బొమ్మల్ని చూసి గుర్తు పట్టాను.

మామూలుగా ఐతే వాణ్ణి ఒక్కణ్ణీ తీసుకుని బాత్రూంకి వెళ్లేదాన్ని. కానీ ఇక్కడ అప్పజెప్పడానికి పరిచయస్థులెవ్వరూ లేరు. అందుకని పాపనీ, బ్యాగునీ కూడా తీసుకుని బాత్రూంలోకి వెళ్లాను.

అక్కడ ఇండియన్ మోడల్ టాయిలెట్ లేదు. కానీ విమానంలో కొంత అలవాటు పడ్డాడు కాబట్టి – కమోడ్‌లో వాడి కార్యక్రమం పూర్తయింది. కానీ అక్కడ నీళ్లు లేవు. ఎక్కడా వాష్‌బేసిన్లు కూడా కనబడలేదు. కమోడ్ పక్కన టాయిలెట్ పేపరు ఉంది.

నీటితో ముడిపడ్డ సంస్కృతి మనది. నీటితో పోయేదానికి గొడ్డలితో చెట్టు కొట్టి కాగితాన్ని తయారు చేసే సంస్కృతి ఇక్కడిది. ఆ విషయం నాకు తెలుసు. అదిప్పుడు స్వానుభవంలో పనికొచ్చింది.

వాణ్ణి శుభ్రం చెయ్యడానికి టాయిలెట్ పేపరు వాడాను.

అది పాప చూసింది. వయసు నాలుగే కానీ – దానికి శుభ్రం కాస్త ఎక్కువే. "తుడవడం కాదు. కడుగు. అసహ్యంగా వాసనేస్తుంది" అని నన్ను హెచ్చరించింది.

దాన్ని బాత్రూం బయట నిలబెట్టి తలుపులు మూసి – కడిగినట్లు అబద్ధం చెబుదామని ముందు అనుకున్నాను. కానీ మాకింకా బోలెడు ప్రయాణముంది. ఎన్నిసార్లని అబద్ధం చెప్పగలను? ఎప్పుడో దొరికిపోవడంకంటే – ఇప్పుడు నిజం చెప్పడమే మంచిదనుకున్నాను.

దానికి అర్థం కావాలిగా, అందుకని, "చెట్టంకుల్ దగ్గర నీకు వాసనేసిందా?" అన్నాను.

పాప బుర్ర అడ్డంగా తిప్పింది.

"చెట్టంకుల్ కూడా నీళ్లు వాడరు. ఈ పేపరే వాడతారు. ఆయనే కాదు, ఈ దేశాల్లో వాళ్లందరూ ఈ పేపరే వాడతారు. ఇది నీళ్లకంటే గొప్పగా పనిచేసే స్పెషల్ పేపర్" అని చెప్పాను.

అప్పటికి అది తృప్తి పడినట్లే ఉంది.

మేము బాత్రూంలోంచి బయటపడి మళ్లీ ఇందాకటి చోటికి వచ్చాం. ఆ ముసలి జంట ఇంకా అక్కడే ఉన్నారు. మేము వచ్చేదాకా బాత్రూం కేసే చూసినట్లున్నారు. ఇప్పుడు మళ్లీ మమ్మల్నే చూస్తున్నారు.

పిల్లలతో సహా కుర్చీల్లో స్థిరపడ్డాక – బాబు నా చేతిని గోకి తన చేతిని నోటిదాకా తీసుకెళ్లి ఓ సైగ చేశాడు. వాడికి ఆకలేస్తోందని అర్థమైంది.

హ్యాండ్‌బ్యాగులో ఆపిల్సున్నాయి. సెక్యూరిటీవాళ్లు దయతో విడిచిపెట్టిన చాకు ఉంది. నేను ఆపిల్సు కోసి పిల్లలకి పెడుతూ మధ్య మధ్య ఆ జంటనే గమనిస్తున్నాను.

ఈసారి వాళ్లు మధ్య మధ్య మొహమాటానికి అటూఇటూ చూస్తున్నారు కానీ, వాళ్ల దృష్టి మాత్రం ఎక్కువగా మన పిల్లలమీదే ఉంది. అలా చూస్తూ అప్పుడప్పుడు ఏదో మాట్లాడుకుంటూ కళ్లొత్తుకుంటున్నారు.

అప్పుడు నాకు వాళ్లమీద జాలేసింది. వాళ్ల వెనుక ఏదో కథ ఉందనీ, అది తెలుసుకోవాలనీ అనిపించింది. కానీ ఎలా?

పలకరిస్తే వాళ్లు ఏదో మాట్లాడతారు. అది ఏ రష్యనో, జర్మనో అయితే నాకేమర్థమౌతుంది? ఒకవేళ ఇంగ్లీషులో మాట్లాడినా కూడా – నా వెంకటేశం ప్రతిభ అక్కడ సరిపోదు.

వాళ్ల కథలో మన పిల్లల వయసువాళ్లు ఎవరో ఉండి ఉంటారు. వాళ్లకో వాళ్ల తలిదండ్రులకో ఏదో అయింది. ఏమయిందో మరి!

నా ఊహాప్రపంచంలో వాళ్ల చుట్టూ రకరకాల కథలు అల్లుకుంటున్నాయి. ఒకదానికీ ఒకదానికీ పొంతనలేదు. కానీ ఆ సమయంలో అదీ ఓ కాలక్షేపమే!

నా ఉబుసుపోకకి భంగం కలిగంచడానికన్నట్లు – కాసేపటికి వాళ్లు వెళ్లిపోయారు.

పనుల్లో ఉన్నా, ఆలోచనల్లో ఉన్నా సమయం తెలియదు. ఏ పనీ లేకుండా కూర్చుని – కబుర్లాడుకుందుకు సాటివారు లేకుండా ఒంటరితనం అనుభవిస్తున్నప్పుడు – క్షణాలు యుగాలౌతాయి. ఆ రోజు విమానాశ్రయంలో రాబోయే విమానంకోసం గంటలతరబడి ఎదురు చూశానే – అలాంటి శిక్షని మళ్లీ కోరుకోను. ఎందుకంటే – విమానంకోసం వేచి ఉండడంతో పాటు – ఎప్పుడెప్పుడు మిమ్మల్ని కలుసుకుంటానా అన్న తహతహ ఒకటి.

దేశం కాని దేశంలో అపరిచితుల మధ్య ఒంటరిగా ఉన్నప్పుడు గడిపిన ఆ కొన్ని గంటలూ – నాకు సంబంధించి చాలా చాలా పెద్ద శిక్ష!

గంటలు భారంగా గడుస్తున్నాయి. నాకేమో – మాస్కోలో ఎక్కాల్సిన విమానం ఎక్కడానికి ఎక్కడికి వెళ్లాలో తెలియదు. అప్పుడే అడిగితే ఇంకా చాలా టైముందని విసుక్కుంటారని కాసేపు ఊరుకున్నాను.

మా తదుపరి ప్రయాణం ఇక మూడు గంటల్లోకి వచ్చిందనగానే – నాలో వేడి పుట్టింది. అప్పటికి చాలా సేపట్నించే అక్కడున్నానేమో – విమానాశ్రయానికి సంబంధించిన కొన్ని విశేషాలు ఆకళింపుకి వచ్చాయి. యూనిఫాంని బట్టి విమానాశ్రయం ఉద్యోగుల్ని గుర్తించడం మనసులోనే కాసేపు ప్రాక్టీసు చేశాను. ఆ ధైర్యంతో ఆ స్టాఫ్‌లో ఒకామె నా దగ్గరకు వచ్చినప్పుడు చిరునవ్వుతో పలకరించాను.

ఆమె చిరునవ్వుతోనే బదులిచ్చి ఏమైనా సాయం కావాలా అన్నట్లు చూస్తూ ఆగింది.

నేనిక జాప్యం చెయ్యలేదు. ఆమెకు బెర్లిన్ వెళ్లే విమానం నంబరు చెప్పాను. నా వెంకటేశం ఇంగ్లీషులో – ఎక్కడ ఎక్కాలని కూడా అడిగేశాను.

ఆమె నన్ను ఎగాదిగా చూసి, "ఇంగ్లీష్!" అంది.

మన దేశంలోనే కాదు – ఇంగ్లీషు మాట్లాడేవాళ్లంటే ప్రపంచమంతా ఓ ప్రత్యేక గౌరవం కాబోలు. ఆమె చూపుల్లో అది కనిపించింది.

తలూపాను.

ఆమె నన్ను మెప్పుకోలుగా చూస్తూ – ఇప్పుడే వస్తానన్నట్లు సైగ చేసి వెళ్లిపోబోయింది.

ఆమె సైగ అర్థమైంది. కానీ మళ్లీ వస్తుందా లేక నియోగిలా మాయమైపోతుందా అన్న అనుమానంతో – "ప్లీజ్! వన్ మినిట్" అన్నాను.

ఏమనుకుందో ఆమె ఒక్క క్షణం ఆగింది. నేనేదో చెప్పేలోగా, తనని తాను చూపించుకుని, "డోంట్ నో ఇంగ్లీష్. ఐ బ్రింగ్ సంబడీ నోయింగ్ ఇంగ్లీష్" అంది. ఇంగ్లీషు రాని తను నాతో ఇంగ్లీషు మాట్లాడ్డానికి సిగ్గు పడుతోందని నాకు అర్థమైంది.

నా మటుకు నాకైతే – అట్టే ఇంగ్లీషు రానివాళ్లతో మాట్లాడ్డమే ఎక్కువ వీలు. ఆ విషయం చెబుదామన్నా మళ్లీ భాష సమస్య!

ఆమె నన్ను తప్పించుకుని పారిపోయిందా అని అనుమానించాను కానీ – ఓ పావుగంటలో తనలాగే యూనిఫాం వేసుకున్న మరొకామెని తీసుకొచ్చి నాకు అప్పగించి వెళ్లిపోయింది.

ఈమె నా వంక బిడియంగా చూస్తూ – నెమ్మదిగా తడుముకుంటూ కొన్ని ఇంగ్లీషు వాక్యాలు పలికింది.

చిన్నప్పుడు తెలుగు మీడియం హైస్కూల్లో నేనూ, నా క్లాస్‌మేట్సూ ఇంగ్లీషు పాఠాలు ఎలా చదివేవాళ్లమో, అలా ఉన్నాయి ఆమె మాటలు. పాపం ఆ విషయం ఆమె దాచుకుందుకు కూడా ప్రయత్నించలేదు. నిజాయితీగా తన గురించి చెప్పుకుంది.

ఇందాకటి అమ్మాయికి తనకి ఇంగ్లీషు రాదని చెప్పడం వరకూ మాత్రమే వచ్చునట. తనకి కూడా పెద్దగా ఇంగ్లీషు రాదుట. ఏదో తడుముకుంటూ మాట్లాడుతుందిట. మీ ఇండియన్సు అందరికీ ఇంగ్లీషు చాలా బాగా వస్తుందని మెచ్చుకుంది. తన పరిమిత భాషా పరిజ్ఞానానికి సద్దుకుపొమ్మని కోరింది.

తెల్లవాళ్లందరికీ ఇంగ్లీషు బాగా వస్తుందన్న దురభిప్రాయం నాకుండేది. తెల్లవాళ్లలోనూ బహుభాషల వాళ్లున్నారనీ, వాళ్లలో మాతృభాష ఆంగ్లం అయినవాళ్లు కొద్దిమంది మాత్రమేననీ నేనప్పుడు తెలుసుకోగలిగాను.

ఇప్పుడామె నా ఇంగ్లీషు వింటే – ఇండియన్సు అందరికీ ఇంగ్లీషు రాదన్న విషయం అర్థమౌతుందని అనుకున్నాను. కానీ మేమిద్దరం మాట్లాడుకుంటున్నప్పుడు ఆశ్చర్యంగా నేనో వెలుగు వెలిగాను. 'మై ఇంగ్లీషు ఈజ్ ది బెస్ట్' అని నేనే అనుకునేలా జరిగింది మా మధ్య సంభాషణ.

ఇద్దరూ ఇంగ్లీషులో మాట్లాడుతూ ఒకరి భాషనొకరు అర్థం చేసేసుకున్నాక – ఆవిడ నా బ్యాగు తీసుకుని తన భుజానికి తగిలించుకుంది. చెయ్యిమ్మని పాపనీ, బాబునీ అడిగింది.

పాప నాకేసి చూసింది. నేను ఫరవాలేదని అన్నాక మేకపోతు గాంభీర్యంతో ఆమెకి తన చెయ్యిచ్చింది.

బాబు మాత్రం ఆమెనోసారి భయంభయంగా చూసి నా కొంగు చాటుకి వచ్చేశాడు. వాడి చెయ్యి నేను పట్టుకున్నాను. కానీ వాడి కళ్లు చూడగానే నాకు అనిపించింది – అక్క చెయ్యి ఆ అపరిచత పట్టుకోవడం వాడికి నచ్చలేదని.

ఆమె పిల్లలిద్దర్నీ ఓసారి ముచ్చటగా చూసి, నావైపు చూసి నవ్వి, "ఫాలో మి!" అని ముందడుగు వేసింది.

నేను బాబు చెయ్యి పట్టుకుని ఆమెని అనుసరించాను. పాప మధ్యమధ్య వెనక్కి తిరిగి బెంగ బెంగగా నన్ను చూస్తోంది. నాకు దానిమీద జాలేసింది.

అలా కొంత దూరం వెళ్లేక ఒకచోట కుర్చీలు చూపించి మమ్మల్ని కూర్చోమందామె. బెర్లిన్ వెళ్లే విమానం అక్కడికొస్తుందనీ, ఎక్కించడానికి తనొస్తాననీ, కంగారు పడొద్దనీ చెప్పి వెళ్లిపోయింది.

అంతవరకూ మౌనంగా ఉన్న పాప ఆమె వెళ్లిపోగానే, "తమ్ముడూ, భయపడ్డావా" అనడిగింది బాబుని.

ఔనన్నట్లు తలూపాడు బాబు.

"ప్రయాణాల్లో అలా భయపడకూడదు. నేను చూడు, ఆమె చెయ్యి పట్టుకుని ఎలా నడిచానో!" అంది పాప గొప్పగా.

బాబు అక్కకేసి ఆరాధనాపూర్వకంగా చూశాడు.

నేనొకసారి ఇద్దర్నీ దగ్గరగా తీసుకుని, ఓ సారి చుట్టూ చూస్తే – మా ఫ్లయిట్ నంబరు, వచ్చే టైము అన్నీ స్క్రోల్ ఔతూ కనిపించాయి.

నాకు తెలిసిన వివరాలు కనబడేసరికి ఎక్కడలేని ధైర్యమూ వచ్చింది. ఇక ఆ అమ్మాయి రాకపోయినా నేనే విమానం ఎక్కెయ్యగలననుకున్నాను.

నా మనసులోని మాట టెలిపతీ ద్వారా తెలుసుకుందో, లేక మళ్లీ ఇంగ్లీషు మాట్లాడాల్సొస్తుందని భయపడిందో ఏమో కానీ – ఆమె మళ్లీ రాలేదు.

విమానం వచ్చేక పిల్లల్ని తీసుకుని హడావుడి పడకుండా తాపీగా విమానం ఎక్కేశాను. స్వానుభవాన్ని మించిన పాఠం లేదు కదా – ఢిల్లీలో విమానం ఎక్కిన అనుభవం నాకే కాదు – పిల్లలకూ బాగా ఉపయోగపడింది.

ఒకసారి విమానంలో కూర్చున్నాక తేలికగా నిట్టూర్చాను.

నా కష్టాలన్నీ ఐపోయాయి. బెర్లిన్లో విమానం దిగగానే మీరొచ్చి నన్నూ పిల్లల్నీ పువ్వుల్లో పెట్టి ఇంటికి తీసుకెడతారనుకున్నాను. ఆ మాటే పాపతో అంటే –

"మనని తీసుకెళ్లడానికి ఎన్ని పూలు కావాలమ్మా!" అనడిగింది పాప.

"పూలంటే నిజంగా పూలు కాదు. జర్మనీలో రోడ్లు మన రోడ్లలా కాదు. వాటిమీద కార్లో వెడుతుంటే పూలమీద నడుస్తున్నట్లు మెత్తగా ఉంటుంది" అన్నాను.

పిల్లల కళ్లు పెద్దవయ్యాయి. వాళ్లప్పుడు మిమ్మల్నికంటే ఎక్కువగా ఆ రోడ్లను చూడాలని తహతహలాడారు.

తీరా విమానం బెర్లిన్ చేరుకుని మేమక్కడ దిగేసరికి – మీరు కనబడలేదు. మా సామాను మేమే తీసుకుని బయటకు వెళ్లాలని అర్థమైంది.

సామాను ఎలా వచ్చిందో, ఎలా తీసుకుంటానో అని నాకు ఆదుర్దా. అక్కడి ఆ పద్ధతులన్నీ పిల్లలకేమో చాలా ఎక్సయిటింగ్‌గా ఉన్నాయి.

వాళ్లు ఏవేవో ప్రశ్నలేస్తుంటే అన్యమనస్కంగా బదులిస్తూ – మొత్తంమీద సామాను తీసుకున్నాను. అన్నీ బాగానే వచ్చేయని చూసుకున్నాక, ఓ ట్రాలీమీద సామాను పెట్టుకుని విమానాశ్రయంలోంచి బయటికొచ్చాను. మీరు ఎక్కడున్నారా అని చూస్తుంటే – నాకు కాస్త దూరంగా నన్నే గుచ్చి గుచ్చి చూస్తున్న ఓ వ్యక్తి కనిపించాడు.

చూడ్డానికి ఇండియన్ లాగే ఉన్నాడు. ఎత్తు మీ అంతే ఉన్నాడు. కానీ అతడి పిల్లి గెడ్డం చూస్తే భయమేసింది. ఆపైన అతడు తన చేతిలో ఫొటోలాంటిది పెట్టుకుని ఆ ఫొటోనీ, నన్నూ మార్చి మార్చి చూస్తున్నాడు. కిడ్నాపర్ కాదు కదా అని భయమేసింది. ఈ దేశాల్లో అలాంటివి మామూలని నాకో అభిప్రాయముంది. అందుకని అతగాడు మావద్దకొచ్చేలోగా – మీరు వచ్చేస్తే బాగుణ్ణని దేవుడికి దణ్ణాలమీద దణ్ణాలు పెట్టేసుకుంటున్నాను.

మీరు రాలేదు కానీ – చివరికి అతడే నా వద్దకు వచ్చి – "మిసెస్! రాజగోపాలరావ్" అన్నాడు.

నా పై ప్రాణాలు పైనే పోయాయి. నా వివరాలు ముందే తెలుసుకుని వచ్చేడన్న మాట!

నోట మాట రాక తెల్లబోయి చూస్తుంటే – "ఈ ఫొటో నాకు మీవారిచ్చారు" అన్నాడతడు తెలుగులో.

బెర్లిన్ విమానాశ్రయంలో ఒక అపరిచితుడి నోట తెలుగు మాట వినిపించడం ఊహించని విశేషం.

అప్రయత్నంగా చేయి జాపి ఆ ఫొటో అందుకున్నాను. అది జర్మనీ వెళ్లేముందు కూడా మీరు తీసుకెళ్లిన మన ఫామిలీ ఫొటో. కానీ –

వస్తానన్న మనిషి రాకుండా ఇలా ఫొటో పంపడమేమిటి? ఎప్పుడెప్పుడు మమ్మల్ని చూస్తానా అని తహతహలాడాల్సిన మనిషి తాపీగా ఇంట్లో కూర్చుని ఎవర్నో పంపిస్తారా?

నాలో రకరకాల అనుమానాలు. ఆ ఫొటో మీరిచ్చారా లేక అతగాడు సంపాదించాడా?

నాకు అతడిమీద చాలా అనుమానంగా ఉంది. అందులోనూ అతడి తెలుగు – తెలుగువాడి తెలుగులా లేదు. స్పష్టంగానే ఉన్నా – ఏదో యాస.

నేను మాట్లాడకపోగా అతడే మళ్లీ – "మీవారుండేది పశ్చిమ బెర్లిన్. ఇది తూర్పు బెర్లిన్. ప్రస్తుతం మీరు తూర్పు జర్మనీలో ఉన్నారు. ఇక్కడికి రావడానికి మీవారికి అనుమతి దొరకలేదు. నాకు అనుమతి ఉంది కాబట్టి – మిమ్మల్ని తీసుకు రమ్మని నన్ను పంపారు. నమ్మకానికి ఈ ఫొటోతో పాటు ఓ ఉత్తరం కూడా ఇచ్చారు" అంటూ నాకో ఉత్తరం అందించాడు.

ఆ ఉత్తరంలో మీ దస్తూరీ చూడగానే మిమ్మల్నే చూసినట్లనిపించింది. అందులో మీరు వ్రాసినవి చదువుతుంటే మీరు మాట్లాడినట్లే అనిపించింది. అతడు చెప్పిన వివరాలే ఆ ఉత్తరంలో ఉన్నాయి. ఐనా ఆ అపరిచితుణ్ణి చూస్తుంటే మీరు పంపిన మనిషిలా అనిపించలేదు. అతడితో కలిసి ప్రయాణం చెయ్యాలంటే ఎందుకో నాకు భయమేసింది.

అక్కణ్ణించి పశ్చిమ బెర్లిన్ వెళ్లడానికి బస్సొకటుంది. మేమందులో ఎక్కడానికి అపరిచితుడు సాయం చేశాడు. అతడి సౌమ్యతవల్ల నాకు బెరుకు కూడా కాస్తతగ్గింది.

మేము సీట్లలో స్థిరంగా కుర్చున్నాక ఆ అపరిచితుడు నాతో, "మీకు ధైర్యంగా ఉంటుందని మీతోపాటు బస్సులో కడదాకా వచ్చి మిమ్మల్ని మీవారితో కలిపి వెడదామనుకున్నాను. కానీ బస్సులో ప్రయాణీకుల్ని తప్ప ఎక్కనివ్వనన్నారు. మీ పరిస్థితి చెప్పి ఎంతో బ్రతిమాలాను. కానీ వీళ్లు నియమాలు చాలా ఖచ్చితంగా పాటిస్తున్నారు. నేను రావడానికి ససేమిరా అన్నారు. రాలేనందుకు అయాం సారీ! కానీ మీకేం భయం లేదు. ఈ ప్రయాణంలో మీ స్టాప్ చిట్టచివరిది. మీరు ఎక్కడా దిగక్కర్లేదు. మీవారొచ్చి మిమ్మల్ని దింపుకుంటారు" అన్నాడు.

అతడి తెలుగులో యాస ఎక్కువున్నా, మాస్కోలో ఇంగ్లీషులా కాక, నాకు చాలా బాగా అర్థమైంది. అతడికి చేతులు జోడించి నమస్కరించి వీడ్కోలు చెప్పాను.

బస్సు నిజంగానే పూలబాటలో వెడుతున్నట్లు వేగంగానూ, ఏమాత్రం కుదుపులు లేకుండానూ జారిపోతోంది.

నేను చివరి స్టాపుకోసం ఎదురు చూస్తున్నాను కానీ డ్రైవర్ మధ్యలోనే ఓ స్టాపులో ఆపి నాతో ఏదో చెబుతున్నాడు.

అతడక్కడ దిగిపొమ్మంటాడేమోనని ఓ భయం. మీరు నన్ను చివరి స్టాపులో కలుసుకుంటానన్నారని ఎలా చెప్పాలా అని బెంగ!

మళ్లీ నా మనసులో కలవరం. ఆ సమయంలో మీరు కనిపించారు.....

శ్రీమతి కథ చెప్పడం ఐపోయింది. తన మనసులోని భారమంతా దిగిపోయినట్లు ఆమె గొంతు వినగానే తెలిసిపోయింది నాకు.

"ఆకాశాన్ని హెర్క్యులెస్ భుజంమీద పెట్టి బరువు దింపుకున్న అట్లాస్‌లా ఎంత హాయిని అనుభవిస్తున్నావో, నీ ముఖం చూడగానే తెలుస్తోంది" అన్నాను.

"మెయిన్ లైట్ ఆర్పేశారు. బెడ్‌లైట్ లేదు. మీ చేతిలో కనీసం బ్యాట్రీలైటేనా లేదు. ఈ చీకటిలో మీకు నా ముఖమెలా కనిపించిందీ" అంది శ్రీమతి వెంటనే.

ఇలాంటి విషయాల్లో తను తెనాలి రామకృష్ణుడికంటే కూడా షార్ప్.

అలనాడు విజయనగరం కొలువులో ఒక సందర్భంలో పెద్దనామాత్యుడు శ్రీకృష్ణదేవరాయల్ని ప్రశంసిస్తూ 'కొండ గుహలో మూల మూల నక్కి నివసిస్తుంది కాబట్టి కానీ, లేకుంటే నిన్ను సింహమంతటివాడివి అనొచ్చు' అనే అర్థంతో ఓ పద్యం చెప్పి చివర్లో రాయల్ని – కృష్ణా, రాజకంఠీరవా అని సంబోధిస్తాడు. అంటే రాజసింహమా అని అర్థం. అప్పుడు పెద్దనగారి మొదటి మాటకీ చివరి మాటకీ పొంతన లేదన్న విషయాన్ని రక్కున ఎత్తి చూపాడట తెనాలి రామకృష్ణుడు. ఖంగు తిన్న పెద్దన గారు, 'మంచి పట్టే పట్టావు మనవడా' అని సద్దుకుంటాడు.

ఇప్పుడు శ్రీమతి నన్నూ అలాంటి పట్టే పడితే, "రాత్రి పూట చందమామని చూడ్డానికి బ్యాటీలైటు కావాలా?" అని సద్దుకున్నాను.

ఒక్క నిముషం తను సైలెంటయిపోయింది.

ఊరుకుంటే సరిపోయేదిగా, "ఇప్పుడు నీ మొహం ఎర్రబడిన విషయం కూడా గమనించాను తెలుసా?" అన్నాను మరికాస్త రెచ్చిపోయి.

"ఎర్రబడదూ! ఎన్నో నెలల తర్వాత కలుసుకున్న దంపతులం. ఒకరికొకరు ఎలా కనిపించాలి? చందమామ అని కవరప్ చేసుకున్నంత మాత్రాన, అంతకుముందన్న మాట నేను మర్చిపోగలనా? ముఖం ఎర్రబడిందంటే పడదూ!" అంది శ్రీమతి.

సిగ్గుతో ముఖం ఎర్రబడిందని నేనన్నాను. కోపంతో ఎర్రబడిందని ఆమె అంటోంది. ఆమె గొంతులో మాత్రం సిగ్గూ లేదు, కోపమూ లేదు. ఐనా నా పొగడ్తకు సిగ్గుపడితే – అది సహజం కానీ – కోపగించుకోవడమెందుకు?

అదే అడుగుదామనుకున్నాను కానీ సూటిగా అడగలేదు. తనని అంత తేలికగా తీసుకుందుకు లేదు.

నేనన్న మాటల్లో కోపగించుకోవాల్సింది కూడా ఏదైనా ఉందేమో అని పునశ్చరణ చేసుకున్నాను. ఎంత ఆలోచించినా స్ఫురించలేదు. అనవసరంగా సమయం వృథా చేస్తున్నాననిపించి, "చాలాకాలం తర్వాత కలుసుకున్నాం. ప్లీజ్ – నా తప్పేమిటో త్వరగా చెబితే మనమింకా పంచుకోవాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి" అని ఇంకో రూట్లో వెళ్లి బ్రతిమాలాను.

ఏమనుకుందో, తనూ అట్టే జాప్యం చెయ్యకుండా – "నన్ను అట్లాస్‌తో పోల్చారు. అంటే ఓ రాక్షసుడు కనిపించాడా మీకు నా ముఖంలో" అని నిలదీసింది.

నాలిక్కరుచుకున్నా వెంటనే తమాయించుకుని, "నీ ముఖంలో నేను చూసింది రాక్షసుణ్ణి కాదు. ఆకాశమంత బరువైన బాధ్యతల్ని మోసే ఓ మహత్తర వ్యక్తిని. కథలో ఆ వ్యక్తి రాక్షసుడు కావచ్చు. కానీ, నిజానికి నీలాంటి ఇల్లాలికి ప్రతిరూపం అట్లాస్ పాత్ర. పురుషుడు హెర్క్యులెస్ లాంటివాడు. తన అవసరం తీరేదాకా నాలుగు మంచి మాటలు చెప్పి, ఆకాశమంత భారాన్ని కొద్ది క్షణాలు మాత్రం భరించినట్లే భరించి – తర్వాత మాయ చేసి మళ్లీ అట్లాస్‌కే అంటగట్టి తను హీరోగా చెలామణీ ఔతాడు. ఈ కథలో మనకి తెలియకుండానే పురుషాధిక్యం భ్రమలో ఎంతలా పడిపోతామంటే, ఆకాశాన్ని మోస్తున్న అట్లాస్ గొప్ప హీరో అని క్షణమాత్రం కూడా స్ఫురించదు" అన్నాను.

ఫక్కున నవ్వింది శ్రీమతి. "మీరేం చెబుతారో నా ఊహకెప్పుడూ అందదు. కానీ ఏం చెప్పినా వినడానికి బాగుంటుంది. ఈ కబుర్లే ఇన్ని నెలలుగా మిస్సయిపోతున్నాను. చాలా బాగుంది. ఇంకా ఏమైనా చెప్పండి" అంది.

నాకూ తనతో ఇంకా ఇంకా మాట్లాడాలనుంది. కానీ మాటల్లో పడ్డామంటే ఇట్టే తెల్లారిపోతుంది. ఆ తర్వాత నిద్రమత్తు వదలక, మిగతా రోజంతా జోగడమే ఔతుంది. పగలంతా వృథా ఐపోతుంది. అందుకని, "ఆడది చాలా గొప్పది. 'ఏడవకు ఏడవకు వెర్రి నా తండ్రీ' అంటూ ఏడుపులోని విషాదాన్ని ఆమె గానం చేస్తే అది బిడ్డకు మాధుర్యపు మత్తునిచ్చే జోలపాటగా మారిపోతుంది. భర్తకోసం తను పడ్డ ఆరాటాన్ని కథగా వినిపిస్తే అది భర్తకు మాధుర్యపు మత్తునిచ్చే జోలపాటగా మారిపోతుంది. ప్రస్తుతానికి నాకీ మత్తునుంచి బయటపడాలని లేదు. నేను చెప్పాల్సింది చాలా ఉంది. అదంతా రేపు శుభోదయంలో సంధ్య వారుస్తూ చెబుతాను" అన్నాను.

అలసి సొలసిన తనకి నిద్ర అవసరమంటే ఆమె ఒప్పుకోదు. అదే నాకు నిద్ర వస్తోందంటే మాత్రం నన్ను డిస్టర్బ్ చెయ్యడానికి ఇష్టపడదు. ఆ విషయం నాకు తెలుసు.

శుభోదయంలో సంధ్య వార్చడమేమిటని శ్రీమతి నన్నడగలేదు. మరి మాట్లాడలేదు.

ఆ తర్వాత కళ్లు తెరిచేసరికి తెల్లారిపోయింది.

నేనెక్కడున్నానూ, అసలేం జరిగిందీ అన్నది స్ఫురణకు రావడానికి కొన్ని క్షణాలు పట్టింది. అప్పుడు పక్కకి తిరిగి చూస్తే – ఎప్పుడు నిద్ర లేచిందో కానీ, తను నన్నే రెప్పలార్పకుండా చూస్తోంది.

"రాత్రి నిద్ర పట్టలేదా?" అన్నాను అనుమానంగా.

"కొత్త చోటు. నిద్ర పడుతుందా అని భయపడ్డాను. కానీ కళ్లు మూసుకున్నాక వళ్లు తెలియలేదు. కళ్లు తెరిచి ఐదు నిముషాలయింది. చూస్తే అటు పిల్లలు. ఇటు మీరు. అటు నిజమే కానీ ఇటు కూడా నిజమేనా లేక కలా అన్న అనుమానంతో వళ్లు గిల్లుకున్నాను. కల కాదు, నిజమే అనిపించినా – కళ్లు మూస్తే ఇదంతా మళ్లీ కలగా మారిపోతుందేమోనని భయం. మిమ్మల్నే చూస్తున్నాను" అంది శ్రీమతి.

ఉన్నట్లుండి నాకూ అదే భయం కలిగింది. ఒకసారి పిల్లలిద్దర్నీ తడిమి చూసుకున్నాను.

పాప, బాబు మంచి నిద్రలో ఉన్నారు. అప్పుడే నిద్ర లేచేలా లేరు. టైం చూసుకుంటే ఇంకా ఆరు కాలేదు.

"ఈరోజునుంచి మనకో కొత్త జీవితం మొదలౌతుంది" అన్నాను.

"ఇప్పుడు మనమంతా ఒక్కచోట ఉన్నాం. అందుకే కొత్తచోటైనా రాత్రి ఇంత మంచి నిద్ర పట్టింది. కానీ పాపం, మీరు ఇదే ఇంటికొచ్చినప్పుడు మొదటి రాత్రి ఒక్కరే ఉన్నారు. ఎలా అనిపించింది?" అంది శ్రీమతి.

ఒక్క క్షణం ఆలోచించాను. ఆ రోజు గుర్తు చేసుకున్నాను.

"నిజం చెప్పాలంటే, కొత్త చోటైనా నాకూ ఇక్కడ బాగా నిద్ర పట్టింది. కారణమేమిటంటే – మన సంస్కృతీ సంప్రదాయాలకు పూర్తిగా భిన్నమైన ఒక మహానగరంలో – నావంటి సామాన్యుడికి నిలువనీడ దొరికిందన్న సంతృప్తి! కానీ....." ఆగాను.

"ఊఁ, కానీ...." కుతూహలంగా అడిగింది శ్రీమతి.

"మన పెళ్లయ్యేక – ఇల్లు మారినా, ఊరు మారినా – అన్నింటికీ నువ్వు నా పక్కనున్నావు. మంత్రాలకు అర్థం తెలియకపోయినా, అనాలోచితంగా పురోహితుడి మాటల్ని అనుసరిస్తూ – సంప్రదాయ వ్యవహారాల్ని పాటించినట్లుండేది నాకు అలాంటి సందర్భాల్లో. అంటే నీది పౌరోహిత్యం. నాది అనుసరణ. అలా అలవాటైన నేను బెర్లిన్లో కొత్తింట్లో ఒంటరిగా అడుగు పెట్టేసరికి అంతా గజిబిజిగా అనిపించింది. ల్యూనబర్గులో ఉండలేదా అనొచ్చు నువ్వు. అక్కడ నా స్వంత బాధ్యత ఏమీలేదు. అన్ని ఏర్పాట్లూ గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వాళ్లవే. కానీ ఇక్కడ నేనో ఉద్యోగిలాంటివాణ్ణి. పక్కన నువ్వు లేకపోతే ఇంటి వ్యవహారాలు చూసుకోవడం ఎవరెస్టు ఎక్కడమంత కష్టం నాకు. అలా అలవాటు చేశావు" అన్నాను.

శ్రీమతి ముఖం వెలిగింది. "నెపం నామీదకు నెట్టకండి. అలా సాగించుకున్నారు మీరు" అని, "ఇక్కడి విశేషాలు చాలావరకూ నాకు ఉత్తరాల్లో రాశారు కానీ – ఈ ఇంట్లో మొదటి రోజు గురించి రాయలేదు. అది చాలా ప్రత్యేకమని ఇప్పుడనిపిస్తోంది...." అని ఆ వివరాలు చెప్పమన్నట్లు చూసింది.

"తెల్లారి లేవగానే సూర్యుడికి నమస్కరించాలి. మన మనుగడకి అవసరమైన సమస్త శక్తుల్నీ సమకూరుస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికే సంధ్యావందనం హిందూ సంప్రదాయమైంది....." అన్నాను ఉపోద్ఘాతంగా.

"మీరు సంధ్యావందనం చెయ్యడం నేనొక్కసారి కూడా చూడలేదు" అంది శ్రీమతి వెంటనే.

"ఆకాశంలో ఉండే వాడొక్కడేనా సూర్యుడు? దేవుణ్ణి పలు రూపాలలో సందర్శించడం హిందూ సంప్రదాయం. అలా నా సూర్యుడు నువ్వే. చాలా నెలల తర్వాత నాకు శుభోదయం వచ్చింది. ఆ సందర్భంగా నా సూర్యుడిముందు నేనిప్పుడు సంధ్య వార్చబోతున్నాను" అన్నాను.

"అంటే?"

"నీ రాకకు ముందు నేనీ ఇంట్లో గడిపిన మొదటిరోజు విశేషాలు చెప్పడంలోనే – నీకు కృతజ్ఞతలు ఇమిడి ఉన్నాయి"

"అదెలా?"

"నేను ఇబ్బంది పడితే నువ్వు లేని లోటును స్మరించినట్లు! ఇబ్బంది పడకపోతే – నీ సాహచర్య ప్రభావం నాకు తెలియకుండానే నామీద పడినట్లు...." అన్నాను.

శ్రీమతి కుతూహలం రెట్టింపయింది. నేను మొదలెట్టాను....

శుభోదయంలో సంధ్యవార్పు

ఈ ఇంట్లోకి ఆ రాత్రి ఎలా ప్రవేశించానో నీకు తెలుసు.

కొత్త చోటైనా ఆ రాత్రి ఇంట్లో నాకు నిద్ర చాలా బాగా పట్టింది. అలసట మాత్రమే కాక, నిలువనీడ దొరికిందన్న సంతృప్తి కూడా అందుకు కారణం కావచ్చు.

ఈరోజులాగే ఆరోజూ ఆరింటికి నిద్ర లేచి బ్రషింగ్ వగైరా కాలకృత్యాలకు బాత్రూంకి వెళ్లాను. ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ బాత్రూంకంటే ఇది పెద్దది. స్నానానికి బాత్ టబ్ కూడా ఉంది. కానీ అక్కడిది మంచి హోటల్లో బాత్రూంలా ఉంటే – ఇది ఏదో రైల్వే స్టేషన్లో వెయిటింగ్ రూంలో పదిమంది వాడుకుంటున్నదానిలాగానూ, మెయింటెనెన్సు లేనట్లూ ఉంది. మన దేశం స్థాయిలో ఐతే ఏమో కానీ, జర్మన్ల స్థాయిలో బాత్రూం ఇలా ఉంటుందని నేనూహించలేదు. కొంచెం నిరుత్సాహపడినప్పటికీ, స్నానానికి సదుపాయముందని సంతోషించాను. వేణ్ణీళ్ల సదుపాయం కూడా బాగుండడంతో స్నానం హాయిగా అనిపించింది.

స్నానమయ్యేక నాలుగు బ్రెడ్ స్లైసులు, ఓ ఆపిల్ – తిని, అరలీటరు పాలు తాగాను.

అంతలో "హెర్ డాక్టర్" అన్న పిలుపు వినిపించింది. అది ఒలోముచ్‌కీ గొంతు.

నేను వెళ్లగానే ఆమె, "నీకు బయట వేరే పనులుంటే చూసుకో. పదకొండింటికి వస్తే ఇంటి తాళం ఇస్తాను" అంది.

సరేనన్నాను. చకచకా నడిచి టెక్నికల్ యూనివర్సిటీలో ఔస్‌లాండ్స్ ఆమ్ట్‌కి (విదేశీయులకి సహకరించే ఆఫీసు) వెళ్లాను. ముందురోజు అహమ్మద్‌తో తిరగడంవల్ల ఆ పరిసరాలమీద నాకు కొంచెం పట్టు వచ్చింది.

ఆ ఆఫీసులో నాకు పనికొచ్చే విశేషాలు చాలా తెలిశాయి. ముందుగా వాళ్లు చెప్పిన చోటుకెళ్లి స్కాలర్‌షిప్ తీసుకున్నాను. కొత్తగా బెర్లిన్ వచ్చినందుకు ఇచ్చే అలవెన్సులతో కలిపి 1200 మార్కులు చేతికందేసరికి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. నిన్న ఒలోముచ్‌కీకి అద్దె డబ్బులిచ్చేకకూడా ఇంకా నా బ్యాంక్ అకౌంట్లో రెండువేల మార్కులున్నాయేమో – ఒక్కసారిగా టాటా బిర్లాల్లా ఫీలైపోయాను.

స్కాలర్‌షిప్ తీసుకునేచోట చెయ్యెత్తు భారీ మనిషి ఒకతను నన్ను చూసి ఆప్యాయంగా పలకరించాడు. అతని పేరు గోపాలకృష్ణన్. తమిళుడు. ప్రతిష్ఠాత్మకమైన వాన్ హుంబోల్డ్ట్ స్కాలర్‌షిప్‌మీద వచ్చేడు. ఆ స్కాలర్‌షిప్ నా డాడ్ స్కాలర్‌షిప్ కంటే ఎక్కువ, గొప్పది. నెలకి 1600 మార్కులు. అంతే కాదు, వాన్ హుంబోల్డ్ట్ స్కాలర్సుకి ఇంకా ఎన్నో అదనపు సదుపాయాలు కూడా ఉంటాయి. అతన్ని కలుసుకోవడం థ్రిల్లింగ్‌గా అనిపించింది. తర్వాత అతడి గురించిన విశేషాలు నీకు ఉత్తరాల్లో వ్రాశాను కదా!

అక్కణ్ణించి బెర్లినర్ డిస్కోంటో బ్యాంకుకి వెళ్లాను. అది ల్యూనబర్గులోని డాయిచ్ బ్యాంక్‌కి బెర్లిన్‌లో ఉండే అనుబంధ సంస్థ. నా డబ్బులు ఆ అకౌంట్లోనే ఉన్నాయి. ఆ అకౌంట్‌ని ల్యూనబర్గునుంచి ఇక్కడికి మార్చినందుకు 5 మార్కులు తీసుకున్నారు. ఇప్పుడు తీసుకున్న 1200 మార్కులు ఆ అకౌంట్లో జమ చేసి, పదకొండుకల్లా ఒలోముచ్‌కీ ఇల్లు చేరాను.

ఒలోముచ్‌కీ మాటంటే మాటే! నేను రాగానే ఆమె వెంటనే ఇంటి తాళం నా చేతిలో పెట్టింది.

"నాలుగింటికి మాత్రం నువ్వు తప్పకుండా ఇంట్లో ఉండాలి సుమా, ఇంతకు ముందుండే అతను వచ్చి రూం ఖాళీ చేసి వెడతాడు" అని హెచ్చరించి వెళ్లిపోయింది.

నేను కూడా ఇక ఇంట్లో ఉండలేదు. మరికొన్ని లాంఛనాలు ముగించుకుందుకు మళ్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఆఫీసుకెళ్లాను. అప్పుడో విషయం తెలిసింది. నేను ఇన్సూరెన్సు తీసుకుని తీరాలట.

నాకు ఇన్సూరెన్సుమీద ఆసక్తి లేదు. అంతవరకూ నేను ఇండియాలో ఇన్సూరెన్సు తీసుకోలేదు. ఇన్సూరెన్సు అర్థాంతర మరణం చెందేవారికే తప్ప పూర్ణాయుష్కులకు ఇచ్చే సదుపాయాలు ఏమీ లేవని నాకు అనిపించేది.

అందుకే ఇక్కడా కొద్దిగా ప్రతిఘటించాను.

ఇన్సూరెన్సు చేయించే బాధ్యత ఆ ఆఫీసులో ఫ్రౌ బాడెన్ అనే మధ్యవయసు మహిళ తీసుకుంది. ఆమె వేగంగా జర్మన్ మాట్లాడుతోంది. టెక్నికల్ యూనివర్సిటీ వివరాలు ఇంగ్లీషులో లభించే బుక్‌లెట్ గురించి అడిగితే, ఇక్కడ అన్నీ జర్మన్‌లోనే ఉంటాయంది. ఆమె వ్యవహారం కొంచెం మోటుగా, కొంచెం కటువుగా, కొంచెం విసుగ్గా తోచింది నాకు. మొట్టమొదటే ఆమె నాకు తటస్థపడి ఉంటే బహుశా నాకు జర్మన్సుమీద చాలా చెడ్డ అభిప్రాయం ఏర్పడి ఉండేది. ఏ దేశమేగినా అన్ని రకాలవారూ ఉంటారు మరి!

ఇన్సూరెన్సు చేసి తీరాలని కూడా ఆమె మోటుగానే చెప్పింది. జర్మనీలో వైద్యసేవలకు ఖర్చెక్కువనీ, సామాన్యులది భరించలేరనీ, 16 మార్కులకి ఇన్సూరెన్సు తీసుకుంటే – అక్కడ ఏ అనారోగ్యమొచ్చినా ఉచిత వైద్యసేవలు అందుతాయనీ చెప్పింది. ఈ సదుపాయం గొప్పతనం అందరికీ అర్థంకాదనీ, అందుకే డాడ్ సంస్థ తమ స్కాలర్సుకి ఇన్సూరెన్సు తప్పనిసరి చేసిందనీ అంది.

జర్మనీలో ఉండగా జిర్రున చీదనైనా చీదనని నా నమ్మకం. ఉత్తపుణ్యాన నెలనెలా బిళ్లగొడుగుల్లా 16 మార్కులు ఇన్సూరెన్సు కంపెనీకి చెల్లించాలనీ అనిపించినా చివరకు తప్పలేదు. ప్రీమియం రేపు కట్టాలి.

ఫ్రౌ బాడెన్ మోటుగానే చెప్పినా – ఆమె నాకు మేలే చేసిందనీ, ఇక్కడి ఇన్సూరెన్సు ఇండియాలోలాంటిది కాదనీ తర్వాత మనవాళ్లు చాలామంది నాకు చెప్పారు.

అదయ్యేక అక్కణ్ణించి ఓ సూపర్ మార్కెట్‌కి వెళ్లాను. వేడినీళ్లలో వేసి రెండు నిముషాలుంచితే – ఉడికి అన్నంగా మారిపోయే బియ్యం ప్యాకెట్లు రెండు కొన్నాను. ఇంకా వెన్న, బ్రెడ్డు, జామ్, పాలు, పళ్లు వగైరాలు కొని నాలుగు కాకుండానే ఇల్లు చేరాను.

ఇంట్లోకెడదామని తాళం తీస్తే అది పనిచెయ్యలేదు. రెండు సార్లు ప్రయత్నించాను. ఐనా తాళం పని చెయ్యలేదు.

దేశం కొత్తది. ఊరు ఇంకా కొత్తది. నేనలా పలుమార్లు ప్రయత్నిస్తూండగా చూస్తే ఎవరైనా నన్ను దొంగ అనుకోవచ్చునని భయపడుతూ, సాయానికెవరైనా వస్తారేమోనని కాసేపు అటూ ఇటూ చూశాను. పది నిముషాలు గడిచినా ఎవరూ రాకపోయేసరికి మనసులో దేవుణ్ణి తల్చుకుని మూడో ప్రయత్నం చేశాను. అదీ ఫెయిలయింది.

అప్పుడొచ్చాడు నేనుండే గది కాళీ చేయాల్సిన టర్కిష్ వ్యక్తి. ఇద్దరం ఒకరినొకరు పరిచయం చేసుకున్నాం.

అతను నా సమస్య విని – ఆ తాళం ఎలా తియ్యాలో సులువు చెప్పి నాచేతే తీయించాడు.

అతగాడు నిజంగా ఇల్లు కాళీ చెయ్యాల్సిన వ్యక్తేనా, లేక ఏ తాళాన్నయినా ఇట్టే తియ్యగల చోరాగ్రేసరుడా అని నాలో చిన్న అనుమానం.

అలాగే ఇంట్లోకెళ్లాం.

నా అనుమానానికి తగ్గట్లే అతగాడు లోపలికెళ్లాక సామాన్లు ప్యాక్ చేసుకుంటూ గదిలో చాలా సేపున్నాడు. ఆ సామానంతా అతడిదేనా అన్న శంక నన్ను పీడించింది.

సామాను చాలా ఉంది. కానీ, అంత సామానుకీ అతనివద్ద పెట్టె మాత్రం ఒకటే ఉంది. సామాను పైనుంచి మెట్లకింద ఉన్న టాక్సీలోకి రవాణా చెయ్యడానికి అతను నా సూట్‌కేస్ అడిగాడు.

మళ్లీ అనుమానం. కానీ ఇవ్వననలేను. భయం భయంగానే ఇచ్చాను.

నా పెట్టె నాకు వెనక్కొచ్చేదాకా మనసు పీకుతూనే ఉంది. అతను వెనక్కొచ్చి మోసం చెయ్యకుండా నా పెట్టె నాకు తిరిగివ్వగానే అప్రయత్నంగా థాంక్స్ చెప్పాను.

అతగాడు ఆశ్చర్యంగా, "పెట్టె ఇచ్చింది నువ్వు. థాంక్స్ నేను చెప్పాలి" అన్నాడు.

మనసులోని అనుమానం బయటకు చెప్పలేనుగా – కవర్ చేసుకుందుకు – "తాళం తియ్యడం నేర్పావు కదా, అందుకు" అన్నాను తెలివిగా.

అప్పుడు చెప్పకుండా ఇప్పుడు చెబుతున్నాడేమిటా అనేమో అతగాడు మళ్లీ నన్ను ఆశ్చర్యంగా చూశాడు.

వెళ్లిపోయేముందు నా వివరాలడిగి తెలుసుకుని, "నీకు నెలనెలా 900 మార్కులు వచ్చే మాటైతే, ఇంతకంటే మంచి ఇంట్లో ఉండొచ్చు. ఈ ఇంటామె మంచిదే కానీ, మహా ఎడ్డిది. రెండు రోజులుగా టాయ్‌లెట్ సరిగ్గా ఫ్లష్ అవడంలేదు. చెప్పినా ఇంకా పట్టించుకోలేదు. తనూ అలాగే వాడేస్తోంది" అని నా గుండెల్లో ఓ రాయేసి వెళ్లిపోయాడు.

ఉదయం నేను కమోడ్ వాడిన విషయం గుర్తు చేసుకున్నాను. బాగానే పని చేసిందని తోచినా, హడావుడిలో గమనించలేదేమో – అంది గుండెల్లో రాయి.

అతను వెళ్లగానే ముందు అన్నం వండుకున్నాను. ఇండియానుంచి తెచ్చుకున్న టమేటా ఊరగాయని వేడి వేడి అన్నంలో వెన్నతో కలుపుకుని తింటుంటే జిహ్వ లేచొచ్చింది.

భోజనమయ్యేక రేడియో పెట్టుకున్నాను. ఢిల్లీ చాలా స్పష్టంగా పలికింది. చాలా బాగా అనిపించింది కానీ ఎంతో సేపు వినలేదు. నాకు తెలియకుండానే నిద్ర ముంచుకొచ్చి వళ్లెరక్కుండా నిద్రపోయాను.

మర్నాడుదయం లేచి తెమిలాను. టర్కిష్ అతను చెప్పినట్లే టాయ్‌లెట్ బాగోలేదు.

వేణ్ణీళ్ల స్నానం చేసేక – నాలుగు స్లైసులు బ్రెడ్డు జామ్‌తో, 2 గ్లాసుల పాలు, ఒక అరటిపండు – అదీ టిఫిన్. ఇకమీదట రోజూ ఉదయం పూట ఇలాగే తినాలనుకున్నాను.

ఆఫీసుకి వెళ్లేటప్పుడు టాయ్‌లెట్ విషయం ఇంటామెకి చెబితే, "అలాగా, చూస్తాన్లే" అంది. ఆ మాట మన ఫిర్యాదులకు మన దేశంలో మునిసిపాలిటీవాళ్ల స్పందనలా ఉంది.

ఆఫీసు చేరేసరికి అక్కడ అంతా నన్ను ఆప్యాయంగానూ, ముచ్చటగానూ చూశారు. తెలిసినవారు తెలియనివారికి డాక్టర్ అంటూ అబ్బురంగా, గౌరవంగా పరిచయం చేశారు. ఐతే ఓసారి పలకరింపులైపోగానే, ఎవరి పని వారిదే. మరి బాతాఖానీ లేదు.

సంస్కారం దెబ్బ తినకుండా బాధ్యతకు పెద్ద పీట వేసే ఈ సంస్కృతి చాలా గొప్పగా అనిపించింది. ఇలాంటిది మన దేశంలోనూ ఉద్యోగులందరూ పాటిస్తే – అది ఎన్నో సంస్కరణల పెట్టు అని నాకు అనిపించింది.

నేను 12 అయ్యేదాకా ఆఫీసులో ఉన్నాను. అక్కణ్ణించి బ్యాంకుకి వెళ్లి ఇన్సూరెన్సు ప్రీమియం 16 మార్కులు కట్టేసి ఇల్లు చేరుకున్నాను.

ఇంటిముందే పెద్ద కూరగాయల సంత. అది చూసి ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా కలిగింది.

ఆ రోజు బుధవారం. ఇక్కడ ప్రతి బుధవారం, శనివారం సంత ఔతుందిట. అంటే తాజా కూరలు కొనేందుకు నేను ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. మన ఇంటి మెట్లు దిగి వీధిలోకి వస్తే చాలు.

సంతలో హుషారుగా తిరిగి కొన్ని పళ్లు, కూరలు కొన్నాను. ఇంటికొచ్చి ల్యూనబర్గులో కొరియా నేర్పిన బంగాళాదుంపల కూర వండి, నిన్న రాత్రి మిగిలిన అన్నంతో భోంచేశాను. వంటకి అనుభవమెంత ముఖ్యమో అప్పుడు తెలిసింది. కూర పక్వాన పడలేదు.

భోంచేసేక మళ్లీ ఆఫీసుకెళ్లాను. ఇండియానుంచి ఉత్తరాలేమైనా వచ్చాయేమోనని వాకబు చేశాను. ఇంకా రాలేదంటే నిరుత్సాహం. అప్పుడు అక్కడ ఆ ఉత్తరాలే నా ఊపిరి మరి!

ఆఫీసులో అంతా ఎవరి పనుల్లో వారుండి నా రాకపోకలగురించి పట్టించుకోలేదని గ్రహించగానే నాలోని భారతీయుడు వెన్ను తట్టాడు. ఆఫీసు ఐదు దాకా ఉంటుందని తెలిసినా, పని లేనప్పుడు ఇక్కడుండి ఏంచేస్తానులే అనుకుని – నాలుగింటికే అక్కణ్ణించి బయల్దేరాను. రెండుమూడు సూపర్ మార్కెట్లు తిరిగాను. ఒకచోట కేజీ 2.28 మార్కులకే బియ్యం దొరికితే కొన్నాను. ఆల్‌బ్రెస్ట్ ఐతే ఇంతకంటే చౌకగా ఉంటుందికదా అనుంది కానీ, ఆ దుకాణమెక్కడో ఇంకా తెలియదు.

ఓ మార్కెట్లో ఇద్దరు ఇండియన్లు కనిపించారు. వాళ్లను చూడగానే నాకు చెప్పలేనంత ఉత్సాహం కలిగింది. వెంటనే పలకరించి పరిచయం చేసుకోవాలనిపించింది.

నా చూపుల్లో అది పసికట్టారో ఏమో, వాళ్లే నన్ను పలకరించి "ఇండియన్?" అనడిగారు.

ఏ భాషలో బదులివ్వాలో తెలియక ఔనన్నట్లు తలూపాను.

వాళ్లింకా ఏదో అడుగుతారనీ, మాటలు పెంచాలనీ అనుకున్నాను కానీ, వాళ్లు ఓ చిరునవ్వు నవ్వి హడావుడిగా వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిపోయిన తీరు చూస్తే – నేను ఇండియన్ అని తెలియగానే, వాళ్లు నన్ను ఎవాయిడ్ చేస్తున్నారనిపించింది. 'అసలు సిసలు మనవాళ్లు' అని మనసులో అనుకుని నవ్వుకున్నాను.

ఆ రాత్రి వంట, భోజనం మామూలే. భోజనమయ్యేక టేపు రికార్డర్లో పిల్లల మాటలు, పాటలు విన్నాను.

బెర్లిన్ మహానగరంలో మన పిల్లల మాటలు, పాటలు. అపూర్వంగా అనిపించింది. కానీ కాసేపు వినేసరికి వాళ్లని దగ్గరగా తీసుకోవాలనిపించింది. సాంకేతిక విజ్ఞానం వాళ్ల మాటల్ని నా చెవులకి చేర్చగలిగింది. కానీ నా చేతుల్ని వాళ్ల దగ్గరకు చేర్చలేదని తెలుసు. మనసు పాడౌతుందని భయమేసి టేపునుంచి రేడియోకి మారాను. ఢిల్లీలో హిందీ పాటలు వస్తున్నాయి.

ఉన్నట్లుండి లతా మంగేష్కర్ గొంతులో ఆనంద్ బక్షిఅంటున్నాడు – 'జానె క్యూం లోగ్ మొహబ్బత్ కియా కర్తే హైc'. లక్ష్మీకాంత్ ప్యారేలాల్ మెలోడీస్‌లో నాకెంతో ఇష్టమైన పాట అది. ఆ సమయంలో నా మనోభావాలకి అద్దం పడుతున్న ఆ పాట వింటూండగా కళ్లు మూతలు పడ్డాయి.

"రోజూ ఇలాగే నిద్రపడితే చాలు. ఎంతో బాగుంటుంది" అనుకుంటూ రేడియో కట్టేశాను.

ఆ క్షణంలో నేనూహించలేదు. నిద్రతో నిమిత్తం లేకుండా – ప్రతి రోజూ అద్భుతం అనిపించే రోజులు ముందున్నాయని....

ఉందిలే మంచి కాలం ముందుముందున (బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

తెల్లవారింది. జనవరి ఏడు వెళ్లి ఎనిమిది వచ్చింది. మా దాంపత్యంలో విదేశపర్వానికి శుభోదయమది.

మెలకువ వచ్చి కళ్లు తెరిచాను.

ఆశ్చర్యంగా గది పైకప్పుకి కళ్లు, ముక్కు, నోరు ఉన్నట్లు అనిపించింది. ఆ కళ్లు నన్నే మురిపెంగా చూస్తున్నాయి. ఆ నోరు పెదవి విప్పింది. 'నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో' అంటూ పాట వినిపించింది. అది ఘంటసాల పాడుతున్నట్లు లేదు. తెలుగు పాటను జర్మన్ యాసలో విన్నట్లుంది.

'అరే, గది పైకప్పు పాట పాడుతోందే' అనుకుని పక్కకు తిరిగాను.

పిల్లలిద్దరూ నిద్ర పోతున్నారు. వాళ్లు ఎంతో అందంగా, కొత్తగా కనిపించారు. వాళ్ల ఉనికి మా మంచానికే అందాన్నిచ్చింది. ఎంతలా అంటే – మా గది పైకప్పు కూడా వాళ్లని చూసే పాడిందా పాట.

'కాకిపిల్ల కాకికే కాదు, కాకి గది పైకప్పుకీ ముద్దే' అనుకున్నాను.

కానీ పాట – నిదుర లేచినవాళ్ల గురించి కదా – పిల్లలింకా నిదుర లేవలేదు కదా – మరి పైకప్పు ఎవర్ని చూసి పాడిందీ అని ఇటు తిరిగితే – శ్రీమతి కనిపించింది. ఎప్పుడు లేచిందో కానీ ఆమె నన్నే చూస్తోంది. నేనేదో అనబోయేలోగా తనే పెదవి కదిపి – "ఇది కల కాదు కదూ!" అంది.

"కలే అయుండాలి. లేకపోతే గది పైకప్పేమిటి? నన్ను చూసి పాట పాడ్డమేమిటి?" అన్నాను.

శ్రీమతి నావంక అయోమయంగా చూసి, "పైకప్పు పాట పాడ్డమేమిటి? మీరిలా అర్థం లేకుండా మాట్లాడుతున్నారంటే ఇది కలే అయుండాలి" అంది.

నేను చటుక్కున ఆమె నోటికి నా చేతిని అడ్డంగా పెట్టి, "మరి మాట్లాడకు బాలా! బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు. ఈ వాస్తవం కలగా మారిపోయినా మారిపోవచ్చు" అన్నాను.

ఆమె నా చేతిని మృదువుగా తొలగించి, "మనమిప్పుడు సకుటుంబంగా ఒకే గదిలో ఉన్నాం. ఇది నిజం. ఇక ఎప్పటికీ విడిపోం. ఇది కూడా నిజం. ఈ నిజాన్ని అబద్ధం చెయ్యడానికి సాక్షాత్తూ ఆ బ్రహ్మే పూనుకున్నాడని అనుకోండి. అప్పుడీ బాల ఆగ్రహించి శపిస్తుంది. ఒక మహాపతివ్రత శాపానికి గురి కావడం ఆ బ్రహ్మకి కూడా ఇష్టముండదు. తెలిసిందా?" అని, "ఇప్పుడు చెప్పండి. గది పైకప్పు పాట పాడ్డమేమిటి?" అంది.

"ఎందుకింతలా నిలదీస్తున్నావు? ఇప్పుడు నాకెంత సంతోషంగా ఉన్నదంటే – మన చుట్టూ ఉన్న అణువణువు స్పందనలోనూ మధురగానం వినిపిస్తోంది" అని పైకప్పు విషయం చెప్పాను.

శ్రీమతి నిట్టూర్చింది, "విడిగా ఉండడంవల్ల ఇంతకాలం మనకు భావనాప్రపంచమే ఆసరా అయింది. మనమిక ఊహా ప్రపంచంనుంచి బయటపడి వాస్తవాన్ని ఎంజాయ్ చెయ్యాలి" అంది.

నిత్యవిధులే వాస్తవమామెకి. లేచీ లేవగానే స్నానాదులు నిర్వర్తించి – గృహకృత్యాలు నిర్వహించాలి. అందులో భార్య, భర్త, పిల్లలు – వారివారికి నిర్ధారించబడ్డ విధులు, నియమాలు పాటించాలి. వాటిలో కొన్ని మరీ రొటీన్. కొన్ని సరికొత్తవి. 'అన్నిటినీ ఒక్కలా ఎంజాయ్ చెయ్యడమే జీవితం' అంటుందామె.

నిజానికామె చాలా పెద్ద ప్రయాణం చేసి అలసిపోయి ఉంది. రాత్రి కబుర్లలో పడి ఆలస్యంగా పడుకుంది. ఐనా – మేమిక ప్రతి రోజూ కలిసే గడుపుతామన్న ఆలోచనే తనకి సేద తీర్చి విశ్రాంతినిచ్చింది. అందుకేనేమో – నాకంటేనూ పది నిముషాలు ముందే నిద్ర లేచింది.

లేవగానే డ్యూటీలోకి దిగిపోవడం ఆమెకి అలవాటు. కానీ మేమంతా కలిసున్న విషయం – కలో, నిజమో నిర్ధారించుకోలేక కాసేపు అయోమయంలో పడింది. నేను నిద్ర లేచి మాట్లాడగానే – ఆ సందేహం తొలగిపోయింది. ఇక వాస్తవాన్ని ఎంజాయ్ చేసే మూడ్‌లోకి వచ్చింది. అంటే మేమిక పనుల్లోకి దిగాలి. భువనేశ్వర్లో ఐతే – అక్కడ తను ఓ పద్ధతికి అలవాటు పడింది. ఇక్కడ పద్ధతి నేను తనకి అలవాటు చేయాల్సి ఉంది.

"మా ఆఫీసు ఎనిమిదికి. అంటే నేను 7.45కి ఇంట్లో బయల్దేరుతాను. అప్పటికి మన కాలకృత్యాలు, అల్పాహారం ఐపోవాలి. అదీకాక – ఇంటామె ఒలోముచ్‌కీ ఎనిమిదికి నిద్ర లేస్తుంది. తొమ్మిదికీ పదికీ మధ్య బయటకు వెడుతుంది. ఆ మధ్యకాలంలో మనం బాత్రూంనీ, వంటింటినీ ఆమెకి విడిచిపెట్టాలి. తర్వాతనుంచి రాత్రి 9 దాటేదాకా ఇల్లంతా మనదే" అన్నాను.

"మీరు ఆఫీసుకి ఎనిమిదికే వెళ్లిపోవాలంటే, ఆలోగానే టిఫిన్ రెడీ చెయ్యాలంటే...." అంది శ్రీమతి అనుమానంగా.

మామూలుగా ఐతే తను ఉదయం ఎనిమిదికేమిటి – ఆరుకే కావాలన్నా టిఫిన్ సిద్ధం చెయ్యగలదు. కానీ పిల్లలు పుట్టుకొచ్చేక తన ఎపిషియెన్సీని వాళ్లు నిర్ధారిస్తున్నారు. వాళ్లు ఏడు లోగా నిద్ర లేవరు. బలవంతంగా లేపితే ఏడుస్తారు. ఒకసారి బడిలో వేసేక వాళ్లెలాగూ నిద్రనీ, స్వేచ్ఛనీ కోల్పోక తప్పదు కాబట్టి, అందాకా ఆ విషయంలో మేమూ పట్టించుకోకుండా వాళ్ల ఈ అలవాటుని సాగనిస్తున్నాం.

ఒకసారి పిల్లలు లేచేక ఇంట్లో హడావుడే హడావుడి. ఓపట్టాన బ్రషింగుకి ఒప్పుకోరు. ఒప్పుకున్నాక నేను ముందంటే నేను ముందంటూ పోటీ పడతారు. వాళ్లని లొంగదియ్యడానికి కొన్ని చిట్కాలు వేస్తుంటాను. వాళ్ల బ్రష్షులు తీసుకుని దానిమీద వాళ్లడిగిన బొమ్మ రూపంలో పేస్టు వేస్తానంటాను. అదంతా ఒ పెద్ద తతంగం.

"ఉత్తరాల్లో రాసిందంతా మర్చిపోయావా? ఇప్పుడు ఉదయం మనకి – పాలు, పండు, బ్రెడ్–బటర్–జామ్ అంతే! వాటికి వంటింటి అవసరం లేదు. ఫ్రిజ్‌లోంచి తెచ్చుకుని వాడుకోవడమే. నేనైతే ఎనిమిదిలోగానే అవన్నీ మన గదిలోకి తెచ్చిపెట్టుకునేవాణ్ణి. కానీ – ఒలోముచ్‌కీ ఉన్నా కూడా మనం ఫ్రిజ్‌లోంచి మన సరుకు తెచ్చుకోవచ్చు. వంటింట్లో వాష్‌బేసినూ, హాట్‌ప్లేట్లూ మాత్రం ఆ సమయంలో వాడలేమంతే!" అన్నాను.

శ్రీమతి నన్నదోలా చూసింది. నేను ఇబ్బందిపడి, "ఇల్లు చవగ్గా దొరికిందనుకో. కానీ అద్దె ఎక్కువిచ్చినా కూడా, ఇక్కడ కామన్ కిచెనూ కామన్ టాయిలెట్లూ మామూలే! కారణం ఒకటి – వీళ్లు బెడ్రూంకిచ్చిన ప్రాధాన్యం కిచెన్‌కీ, బాత్రూంకీ ఇవ్వరు. రెండు – కిచెన్‌ని మనకిలా గంటల తరబడి వాడరు" అన్నాను. ఇలాంటి విశేషాలు గతంలో ఉత్తరాల్లో వ్రాసి ఉన్నా ఎందుకైనా మంచిదని ఓసారి గుర్తు చేశాను.

శ్రీమతి నన్నదోలా చూసి, "నా చూపుల్లోని ఆశ్చర్యం మీకు పితూరీలా కనబడిందా?" అంది పాత ఆశ్చర్యానికి కొత్త ఆశ్చర్యాన్ని జోడిస్తూ.

"నేనన్న మాటల్లో ఆశ్చర్యపడాల్సినదేముంది?" అన్నాను నేనూ తనకి దీటుగా ఆశ్చర్యపడుతూ.

"అదా, నాకు తెలిసి మీవరకూ బ్రెడ్డంటే జబ్బుపడ్డవాళ్లు మాత్రమే తినే ఓ వ్యర్థపదార్థం. ఆరోగ్యంగా ఉన్నప్పుడు బ్రెడ్డు మాటెత్తితే అంతెత్తు లేచేవారు. అలాంటి మీరే బ్రెడ్డుని ప్రపోజ్ చెయ్యగానే – కాస్త ఎత్తిపొడవాలనిపించింది. కానీ ప్రస్తుతం మనమధ్య కొత్త మోజొకటి మొదలైందిగా – ఆశ్చర్యంతో సరిపెట్టి ఊరుకున్నాను" అంది శ్రీమతి.

అప్పటికి టైం ఆరుంపావయింది. ఇక త్వరపడి తెమలాలి. అందుకని ఆమె మాటలకి బదులివ్వలేదు.

ముందు ఒకరి తర్వాత ఒకరు బాత్రూంకి వెళ్లి బ్రషింగ్ చేసుకొచ్చాం. అప్పుడు పిల్లల్ని నిద్ర లేపాం.

కొత్త వాతావరణం ప్రభావం కాబోలు – వాళ్లు తొందరగానే లేచారు.

"వసూ! వాళ్లకి బ్రష్షులివ్వు. పేస్టుతో బొమ్మలేస్తాను" అన్నాను.

బాబుకింకా మూడు నిండలేదు. చిన్నవాడు కాబట్టి ఇలాంటివి వాడికి పూర్తిగా అర్థం కావు. అన్నింటికీ అక్కని అనుసరిస్తాడు. అనుసరిస్తూనే దానితో పోటీ పడతాడు.

పాప ఎంతో ఉత్సాహపడి, "పేస్టుమీద బొమ్మేయించుకుని ఎన్నాళ్లయిందో! ఇన్నాళ్లూ అమ్మ ఒక్కసారి కూడా బొమ్మవెయ్యలేదు" అని శ్రీమతిపై పితూరీ కూడా చెప్పింది.

నేను శ్రీమతిపై కోపం నటిస్తూ, "వాళ్లకి పేస్టుతో బొమ్మలు ఎందుకు వెయ్యలేదు?" అనడిగాను.

"ఎందుకు వెయ్యలేదూ! వేశాను. కానీ మీకులా నమ్మించే విద్య నాకు తెలియదుగా. దాంతో మానేయాల్సి వచ్చింది" అంది శ్రీమతి వెంటనే.

అర్థమైంది. శ్రీమతికి బొమ్మలెయ్యడం రాదు. నాకూ రాదు. ఎటొచ్చీ తనది నిజాయితీ. నాది లౌక్యం.

పిల్లల్ని కొన్ని విషయాల్లో మాయ చెయ్యాలి. నేను పాపని ఏ బొమ్మ కావాలీ అనడిగి – బ్రష్టుమీద పేస్టు వేసేవాణ్ణి. పేస్టు మామూలుగానే వేసినా, అదడిగిన బొమ్మలోని లక్షణాలన్నీ ఉన్నట్లు భ్రమ పెట్టేవాణ్ణి. నేను కాస్త నొక్కించేసరికి అది హిప్నొటైజ్ అయిపోయేది. అది నమ్మితే బాబుని నమ్మించడం ఏమాత్రం కష్టం కాదు. వాణ్ణి నమ్మించే బాధ్యత అదే తీసుకునేది.

"సరేలే, నీకే బొమ్మ కావాలో చెప్పు" అన్నాను పాపతో.

"ఇంతవరకూ నాకు ఒక్కసారి కూడా ఒంటెబొమ్మ వెయ్యలేదు. ఈ వేళ అది కావాలి" అంది పాప.

దాని బ్రష్షుమీద పేస్టు వేశాను. ఒంటెకు మూపురం ఎక్కడుందో, కాళ్లు ఎంత పొడుగున్నాయో వివరించి చెబుతుంటే పాప చాలా ఉత్సాహంగా విని, "పుస్తకాల్లో ఇన్ని ఒంటె బొమ్మలు చూశాను. నాన్నగారు వేసినంత బాగా ఒక్కటీ లేదు" అంది.

అంత ఓవర్ చేసిందంటే, పాపమీద నాకు అనుమానమే. వయసు నాలుగే నిండినా దానిది ఈడుకి మించిన తెలివి. బ్రష్షుమీద పేస్టుకి తానడిగిన బొమ్మ రూపం ఏమాత్రం లేదని, ఏడునెల్ల క్రితం నేను ఇండియా వదిలినప్పుడే అది కనిపెట్టేసిందని నా అనుమానం. కానీ రోజూ బ్రషింగ్ దగ్గర మా ఇద్దరికీ అదో ఆట. అది అడగడం, నేను పేస్టు వేసి అందులో అది ఆడిగిన బొమ్మ లక్షణాలు చూపించడం – అదంతా దానికో సరదా! నేను దాన్ని మాయలో పడేస్తున్నాననుకుంటే – అదే నన్ను మాయలో పడేస్తుండొచ్చు.

కన్నవారిలో యశోద ఉన్నట్లే – కన్నబిడ్డల్లోనూ కృష్ణులుంటారు. అనురాగబంధంలో అదో మాయ!

అక్క పెద్దది కాబట్టి బ్రషింగుకి అక్కే ముందు వెళ్లాలి – అనే మా లాజిక్కుని బుద్ధిగా అనుసరించి ఊరుకున్నప్పటికీ – అక్కెప్పుడొస్తుందా, తన బ్రష్షుమీద నేను పేస్టెప్పుడు వేస్తానా అని చాలా అసహనంగా ఎదురుచూస్తున్నాడు బాబు.

శ్రీమతి పాపని తీసుకుని రాగానే, "నాన్నగారూ! నాకూ ఒంటె బొమ్మ వెయ్యండి" అన్నాడు బాబు.

పాప వెంటనే వాడివంక ఆరిందాలా చూసి, "నాన్నగారికి బోలెడు బొమ్మలొచ్చు. అస్తమానూ ఒంటె ఒక్కటే అడక్కూడదు. నీకు ఏనుగు బొమ్మ వెయ్యమను" అంది.

బాబు వెంటనే, "నాకు ఒంటే వద్దు. ఏనుగు బొమ్మ కావాలి" అన్నాడు.

"గుడ్ బాయ్" అంది పాప. అక్క పొగిడిందని బాబు తెగ సంబరపడ్డాడు.

నేను వాడి బ్రష్షుమీద పేస్టు వేసి, అందులో ఏనుగు లక్షణాల్ని వివరించి చెబుతున్నాను. బాబే కాదు, పాప కూడా చాలా ఆసక్తికరంగా వింటోంది.

శ్రీమతి నావంకనే చూస్తూ, "అప్పుడప్పుడు నన్ను బాలా అంటుంటారుగా! మీ మాటలతో నన్నెంత మోసగిస్తున్నారోనని అనుమానంగా ఉందిప్పుడు" అని నవ్వింది.

ఆ నవ్వు ఇచ్చిన ధైర్యంతో, "మోసం మధురంగా ఉండాలి కానీ – జీవితంలో మోసపోవడానికి మించిన గొప్ప అనుభూతి ఉండదు – అని కూడా నీకు అనిపించి ఉండాలే" అన్నాను.

అందరికీ బ్రషింగులయ్యేక – "ఈరోజు నేను ఆఫీసుకి వెళ్లడం లేదు. ఐనా ఎనిమిది లోగా కొంత పొట్టపూజ అవసరం. పిల్లలు పదింటిదాకా ఆగలేరు" అనేసి గది బయటికెళ్లి అవసరమైనవన్నీ ఫ్రిజ్‌లోంచి తెచ్చాను. అప్పటికింకా ఒలోముచ్‌కీ నిద్ర లేవలేదు.

నేను బ్రెడ్ ప్యాకెట్ విప్పి స్లైసులు తీశాను. వెన్న ప్యాకెట్ విప్పి చాకుతో వాటికి వెన్న పూశాను. జామ్ బాటిల్ విప్పి జామ్ పుయ్యబోతూ, "ముందు పిల్లలకి ఛీజ్ పెట్టు" అన్నాను.

శీతల దేశంలో వంటికి తగిన వేడిని అందించడంలో ఛీజ్‌ది ముఖ్య పాత్ర అని జర్మన్లు అంటారు. అదేం కర్మో – ఛీజ్ నోట్లో పెడితే చాలు నాలిక వెనక్కి తోసేస్తుంది నాకు. అది విన్న జర్మన్ మిత్రులు – "నువ్వేమిటో, నీ రుచులేమిటో అర్థం కాదు కానీ – నీ పిల్లలొచ్చేక వాళ్లకైనా ఛీజ్ అలవాటు చెయ్యి. అన్ని పోషకపదార్థాలూ అందులో ఉంటాయి" అని చెప్పారు.

పిల్లలకి పోషకపదార్థాలు అందించాలన్న తపన నాకూ ఉంది. అందుకే శ్రీమతికి ఛీజ్ గురించి చెప్పాను.

శ్రీమతి ఛీజ్ ప్యాకెట్ విప్పింది. అందులోంచీ సన్నగా పొడుగ్గా ముచ్చటగా ఉన్న ఛీజ్ ముక్కల్ని తీసి పాపకీ, బాబుకీ చెరొకటీ ఇచ్చింది.

పాప ఛీజ్ నోట్లో పెట్టుకుని వెంటనే, "ఛీ, యాక్" అంటూ వేళ్లతో బయటకు తీసేసింది.

ఒకప్పుడైతే ఉమ్మేసేది. అది తప్పని మందలించి మేమే దానికిలా అలవాటు చేశాం.

పాప ఎప్పుడైతే యాక్ అందో, ఆ వెంటనే బాబు ఛీజ్‌ని నోట్లో పెట్టుకోకుండానే, "యాక్" అన్నాడు. అక్కమీద వాడికంత నమ్మకం.

"వీళ్లకి ఛీజ్ నచ్చినట్లు లేదు" అంది శ్రీమతి.

గుండె గుభేల్మంది. శాకాహారులైన మా పిల్లల వంట్లో పోషకపదార్థాలు ప్రవేశపెట్టడానికి ఛీజ్‌మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను మరి.

"సరేలే, నెమ్మదిగా అలవాటు చేద్దాం. ఒకసారి అలవాటు పడితే – పిల్లలు ఛీజ్ తప్ప మరేం తినడానికీ ఇష్టపడరుట" అన్నాను.

అప్పటికి కొన్ని బ్రెడ్ స్లైసులు రెడీ అయ్యాయి. ఛీజ్ అనుభవాన్ని బట్టి, ముందు నేను తిని రుచికి పరవశాన్ని నటించి అప్పుడు పిల్లలకి పెట్టాలనుకుని, ముందు రెండు స్లైసులు తిని – "ఇప్పుడు మీరు" అన్నాను పిల్లలతో.

"ఈరోజు మీకు కొత్త రకం ఫలహారం" అంటూ శ్రీమతి వాళ్లకి తలో రెండు స్లైసులూ అందించింది.

వాళ్లవి తీసుకుని గదిలో ఓ మూలకి పరుగెత్తారు. ముందు నేను తిని పరవశించానుగా – వాటి రుచిపై వాళ్లకి అనుమానం లేదు.

"అబ్బా, వసూ! దీన్ని ఫలహారమనకు" అభ్యంతరపెట్టాను.

"తినడానికి లేని అడ్డు ఫలహారమనడం దగ్గరొచ్చిందా? ఐనా ఇందాకా మీరూ అన్నారు ఫలహారమని, మర్చిపోయారా?" అంది శ్రీమతి.

"గుర్తు చేసుకో – నేను ఫలహారమనలేదు, అల్పాహారమన్నాను. అంటే మనుషుల్లో అల్పుల్లా, ఇది ఆహారంలో అల్పమైనదన్నమాట!"

"రెండింటికీ తేడా ఏమిటిట?"

"ఫలహారమంటే ఎంజాయ్ చేస్తూ తినేది. అల్పాహారమంటే గతి లేక తినేది"

"అంటే జర్మనీ వచ్చేక తిండి విషయంలో మీరు గతి లేని వాళ్లయ్యారన్నమాట! నేనొచ్చేక కూడా అలాగే ఉంటానంటే కుదరదు. మీకు రోజుకో కొత్త ఫలహారం చేసి పెడతాన్లెండి" అంది శ్రీమతి.

"నో వసూ! ఇక్కడ మనకిదే వీలుగా ఉంటుంది. నాక్కూడా బ్రెడ్డూ జామునీ తినడం దాకా ఓకే. అది ఫలహారమంటేనే ఏదోలా ఉంటుంది" అన్నాను.

మాట్లాడుతూనే ఉన్నాం – ఆమె తను కూడా బ్రెడ్ స్లైసులు సిద్ధం చేస్తోంది. మధ్యలో పిల్లలొచ్చి బ్రెడ్ స్లైసులు అడిగారు. వాళ్లకి జామ్‌కంటే ఎక్కువగా వెన్న నచ్చింది. నాకెంతో సంతోషమైంది.

"నువ్వు కూడా వెన్న ఎక్కువ రాసుకో. చలికి బాగా తట్టుకోగల్గుతావు" అన్నాను ఆమెతో.

"అమ్మో, నాకు వెన్న వద్దు. ఇప్పుడిప్పుడే వళ్లు రావడం మొదలైంది నాకు" అంది శ్రీమతి చటుక్కున.

ఆ విషయమై తర్వాత నచ్చజెప్పొచ్చులే అనుకుని అప్పటికి నొక్కించలేదు.

"ఈరోజు మన ప్రోగ్రాం ఏమిటి?" అంది శ్రీమతి అల్పాహారం, పాలు సేవించేక.

"మిమ్మల్ని తీసుకుని పోలీసు స్టేషనుకి వెళ్లాలి" అన్నాను.

"అన్‌మెల్డుంగ్ (రిజిస్ట్రేషన్)కా?" అంది శ్రీమతి వెంటనే.

తనకి విషయమే కాదు, జర్మన్ పేరు కూడా బాగానే గుర్తుంది.

అన్‌మెల్డుంగ్ నా తక్షణ కర్తవ్యం. ఎందుకంటే – శ్రీమతి, పిల్లలు నాతో ఉన్నందుకు అదనంగా అలవెన్సు వస్తుంది. భార్యకి 200 మార్కులు, పిల్లలిద్దరికీ చెరో యాభై మార్కులు. వాళ్లు ఈ నెలలో పదవ తేదీ లోపునే ఇక్కడికొచ్చారు కాబట్టి ఈ నెలనుంచే నాకీ అలవెన్సు మొదలౌతుంది. అందుకుగానూ బెర్లిన్ నగరంలో పోలీస్ స్టేషన్లో అన్‌మెల్డుంగ్ పూర్తి చేసి ఆ రసీదులు, బాన్ నగరంలో ఉన్న డాడ్ ఆఫీసుకి పంపాలి. ఆ పని వెంటనే చెయ్యాలి. డబ్బుతో పని కదా!

బయటకు వెళ్లాలంటే – ఇండియాలోలా ఆదరాబాదరాగా డ్రస్ చేసుకుని వెళ్లడానికి కుదరదు. పైన స్వెటర్ వేసుకోవాలి. కాళ్లకి సాక్సు, బూట్లు తొడగాలి. మంకీ కాప్ పెట్టుకోవాలి. చేతులకి గ్లోవ్స్ వేసుకోవాలి. ఇక ఓవర్‌కోట్ తప్పనిసరి. మాకు మేమే కాక, పిల్లలకి కూడా ఇవన్నీ చెయ్యాలంటే – బయటికెళ్లడంకంటే ఇంట్లో ఉండడమే బాగుందనిపిస్తుంది.

అప్పటికి నేను బెర్లిన్ వచ్చి మూడు నెలలు దాటింది కాబట్టి – నావరకూ డ్రెస్సింగ్ ఓకే. ఇండియాలో ఏవో కుట్టించింది కాబట్టి పిల్లలకి కూడా ఫరవాలేదు. వచ్చిన సమస్యల్లా శ్రీమతి గురించే.

ఆ రోజు చలి ఎక్కువగా ఉంది. ఆపైన ఈదురుగాలి. శ్రీమతికింకా మాంటెల్ (ఓవర్‌కోట్) లేదు. ఆమె స్వెటర్ ధరించి పైన షాల్ కప్పుకుంది. జర్మనీలో శీతలానికి ఆ ఏర్పాటు అక్కడి చలికి సరిపోదు.

అమ్మా నాన్నా పక్కనుంటే పిల్లలకి ఏ వాతావరణం కొత్తగా అనిపించదు. కాబట్టి వాళ్లు మామూలుగానే ఉన్నారు.

మా ఇంటినుంచి నడచి వెడితే రెండుమూడు నిముషాల్లో వస్తుంది 'డాయిచే ఓపర్' పేరిట ఊ–బాన్‌హాఫ్ (అండర్‌గ్రౌండ్ రైల్వేస్టేషన్). నేలమీంచి కిందకి మెట్లు దిగి – నేలకింద నడిచే – రైలెక్కడం మావాళ్లకి కొత్త. అన్నీ వింతగా చూస్తున్నారు వాళ్లు.

నాకైతే పాస్ ఉంది. ఎన్నిమార్లెక్కినా ఊబాన్ ఫ్రీ. ఆరేళ్లలోపు పిల్లలకి కూడా ఊబాన్ ఫ్రీ. ఇక టికెట్ కొనవలిసింది శ్రీమతికి మాత్రమే.

ఎంత దూరానికైనా రెండు నిముషాల్లో చేర్చగల ఊబాన్‌లో మేము మా ఏరియా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాం. అక్కడ ఏయే కాగితాలు చూపాలో సరిగ్గా తెలియక, మొత్తం మూడుసార్లు వెళ్లి రావాల్సొచ్చింది. మూడోసారి వెళ్లినప్పుడు అన్‌మెల్డుంగ్ క్షణాలమీద ఐపోయింది. రసీదులు తీసుకున్నాను. ముందుగా సిద్ధం చేసుకున్న కవర్లో ఆ రసీదుల్ని పెట్టి వెంటనే డాడ్ ఆఫీసుకి పోస్టు చేశాను.

అక్కడి ప్రయాణ సౌకర్యాలు, ఆఫీసు వ్యవహారం ఎలాంటివంటే – ఇదంతా జరిగి ఇంటిముఖం పట్టేసరికి ఇంకా పదకొండు కాలేదు.

పాపం పసివాడు బాబు – వాడు ఎక్కువగా నిద్రపోతున్నాడు. నేను వాణ్ణి ఎత్తుకుంటే పాప కళ్లలో అసూయ.

"నాన్నగారు దగ్గర లేరుగా. నిన్ను ఎత్తుకోమననులే" అనేదిట ఇండియాలో శ్రీమతితో. అది నామీద పెట్టుకున్న నమ్మకం. అది నిజం చెయ్యాలి.

బాబుని శ్రీమతి ఎత్తుకోవచ్చు కానీ, ఆమె చేతులు షాల్‌ని సవరించుకుందుకే సరిపోతున్నాయి. షాల్ సవరించుకోకపోతే చలి పులిలా తినేస్తుంది. అందుకని నిన్న రాత్రికి లాగే అప్పుడూ పిల్లలిద్దర్నీ ఎత్తుకున్నాను.

శ్రీమతి నొచ్చుకుంది. ఎలాగో అలా బాబుని ఎత్తుకుంటానంది.

"మీరు నా పక్కనున్నారుగా. నా బలం పెరిగిపోయింది. నీకు పరీక్షించాలనుంటే, వీళ్లతోపాటు నిన్ను కూడా ఎత్తుకోగలను" అన్నాను.

శ్రీమతి సిగ్గుపడింది. "పిల్ల పెద్దదౌతోంది. దానిముందు అలా మాట్లాడకండి" అంది.

ఆడవాళ్లు సిగ్గుని ప్రదర్శించే తీరు విచిత్రంగా ఉంటుంది. అమ్మాయికి నాలుగు నిండి ఇంకా నాలుగు నెలలు కాలేదు. తన సిగ్గుని ప్రదర్శించడానికి దానికి పెద్దరికాన్ని అంటగట్టింది శ్రీమతి.

"అది పెద్దదైతే అయింది కానీ, నువ్వు మాత్రం దానిముందు అలాగనకు. నేనేదో తప్పు మాట్లాడేననుకోగలదు" అని కవర్ చేసుకున్నాను.

ఇల్లు చేరేసరికి – బుధవారం కదా – మా భవంతిముందు సంత హడావుడి.

కూరలు తెచ్చుకోవాలి. నాకైతే శ్రీమతితో కలిసి సంత చెయ్యాలనుంది కానీ బాబు గాఢనిద్రలో ఉన్నాడు. అందుకని అంతా భవంతి లోపలికెళ్లాం.

శ్రీమతికి ఇంటి తాళం తియ్యడంలో సులువులు చెప్పేను. తనచేతనే తాళం తీయించాను. లోపలికెళ్లేక ఇంట్లో బాబుకి తోడుగా శ్రీమతిని వదిలి పాపని తీసుకుని బయటికెళ్లాను.

దాన్నీ ఇంట్లో వదిలేద్దును కానీ అది నన్ను వదలడం లేదు.

మేమిద్దరం సంతలో కూరల దుకాణానికి వెళ్లాం. అక్కడి జనంలో చాలామంది పాపని చూసి బాగా ముచ్చట పడ్డారు. కూరలమ్మే ఒకామె దానికి ఓ చాక్‌లెట్, ఆపిల్ ఇచ్చింది. పాప తీసుకోలేదు. నావంక చూసింది.

"తీసుకోదేం?" అనడిగింది కూరలామె ఆశ్చర్యంగా.

"నా అనుమతి లేకుండా ఎవరేమిచ్చినా ఏం తీసుకోదు" అని చెప్పాను. అంతే – ఆమె వెంటనే చేతులు సాచి దాన్ని దగ్గరగా తీసుకుని గట్టిగా హత్తుకుంది. ఆ వెంటనే ఎత్తుకుని ముద్దాడింది.

నేను చెప్పేక ఆమె ఇచ్చినవి తీసుకుంది పాప.

సంతలో కూరలు కొని, ఇల్లు చేరాక పాప చాలా ఉత్సాహంగా, "అమ్మా! జర్మనీవాళ్లు చాలా మంచివాళ్లు. కొట్టుకు వెళ్లిన నాలాంటి చిన్నపిల్లలకి చాక్లెట్సూ, ఆపిల్సూ ఇస్తారు" అని తల్లికి చెప్పుకుంది.

నీ అనుభవమెంతని దాన్ని తీసిపారేయొచ్చు. కానీ ఇండియాలో అంతవరకూ కూరల మార్కెట్లో దానికిలాంటి అనుభవం లేదన్నది నిజం.

"**దీనికి జర్మనీవాళ్లు** బాగానే నచ్చారు. వాళ్ల తిండి కూడా నచ్చితే బాగుణ్ణు" అన్నాను.

శ్రీమతి వెంటనే, "బాగుంది. వీళ్లకి గొడ్డు మాంసం ఇష్టం. మనమూ తినాలంటారా?" అంది.

"వీళ్లకి గొడ్డు మాంసం ఇష్టమే. కానీ వాళ్లు తినేది అదొక్కటే కాదు. బీరు ఇష్టం. కానీ తాగేది అదొక్కటే కాదు. పాలు, పళ్లు, పప్పులు, ధాన్యాలు, కూరగాయలు, వెన్న, ఛీజ్ – అన్నీ దొరుకుతాయిక్కడ. పైగా మన దేశంలోలా ఇక్కడ ఆహారపదార్థాల్లో కల్తీ ఉండదు" అన్నాను.

"ఐతే దొరికినవాటిలో మనకు నచ్చినవి ఎంజాయ్ చేద్దాం" అంది శ్రీమతి.

"అలా కాదు. ఇది శీతల దేశం. ఆ చలిని తట్టుకోవాలంటే వంట్లోకి పోషకపదార్థాలు వెళ్లాలి. పిల్లలకి కనీసం కోడిగుడ్లయినా పెట్టకపోతే – అనారోగ్యం పాలవుతారని నా భయం" అన్నాను.

"మిమ్మల్ని మిగతా ఇండియన్సు ఇలాగే భయపెట్టారు. మీరు లెక్క చెయ్యలేదు. ఇప్పుడు మీరు నన్ను భయపెడుతున్నారు. నేనూ లెక్కచెయ్యను" అందామె దృఢంగా.

"ఆదికాదు వసూ! ఛీజ్‌లో మంచి పోషకవిలువలున్నాయి. ఫక్తు శాకాహారం. ఎలాగో అలా అదైనా వాళ్లకి అలవాటు చెయ్యాలి"

"భువనేశ్వర్లోనూ ఏడాదికి మూణ్ణెల్లు భరించలేని చలి కదా! అప్పుడక్కడ మన అలవాట్లలో మార్పు చేసుకున్నామా? పిల్లలకేమైనా అయిందా? భయాన్ని పక్కన పెట్టండి. వివేకం పని చేస్తుంది" అందామె.

అప్పుడు ఇద్దరం – జర్మనీలో దొరికే శాకాహారపదార్థాల జాబితా వేసుకున్నాం. వాటిలో పిల్లలకి నచ్చేవి ఏమిటా అని చర్చించసాగాం. ఆ చర్చలో గతాన్ని పునశ్చరణ చేసుకోవడం జరిగింది.

కొందరు ఇండియన్సూ, జర్మన్సూ కూడా నాతో, "ఇక్కడ ఛీజ్ తినడం చాలా అవసరం. శాకాహారివి కాబట్టి నీకైతే మరీ అవసరం. నిజానికి ఛీజ్ చాలా రుచిగా ఉంటుంది. ఒక వయసొచ్చేక కొత్త అలవాట్లు చేసుకోవడం కష్టం. అందువల్లనేమో నీకు ఛీజ్ నచ్చి ఉండదు. నీ పిల్లలు ఎగబడి తినకపోతే మమ్మల్నడుగు" అంటూండేవారు. అలా ఛీజ్ నా బుర్రలోకి బాగా ఎక్కేసింది.

"నువ్వు రుచికి అంతగా ప్రాధాన్యమివ్వవు. అవసరమైతే కాకరకాయని కూడా రసగుల్లాలా తినెయ్యగలవు. మనవాళ్లకి నీ పోలికొచ్చి ఉంటే బాగుండేది" అన్నాను.

శ్రీమతి నవ్వి, "ఏంచేస్తాం – వెధవలకి – అన్నీ మీ పోలికలే" అంది. ఆ గొంతులో చిరాకుకి బదులు ముచ్చట ధ్వనిస్తోంది.

నేను గతుక్కుమని, "అంటే ఆ పోలికలు వెధవలకి ఉంటాయనా?" అన్నాను. ఐతే నేనూ ముచ్చటగానే అన్నాను.

శ్రీమతి నాలిక్కరుచుకుని, "మీరేమనుకోండి. మీ పోలిక ఏదైనా నాకు ముచ్చటగానే ఉంటుంది" అంది తన ఉద్దేశ్యాన్ని వివరిస్తూ.

"అది నాకూ తెలుసు. కానీ నువ్వలా ముచ్చటపడి ఊరుకుంటే ఎలా? ఈ చలి తట్టుకునేందుకు వంటికి కావాల్సిన శక్తినిచ్చేవాటిలో ముఖ్యమైనది ఛీజ్. ఇక్కడివాళ్లది ఎంతో ఇష్టంగా తింటారు. మనవాళ్లు కూడా తినే మార్గం చూడాలి" అన్నాను.

"అది సరే, మరి మీరెందుకు తినడం లేదు?" అంది శ్రీమతి.

ఏం చెబుతాను? నాకా రుచి నచ్చలేదు. అదే పోలిక పిల్లలకీ వచ్చింది. ఈ విషయంలో వాళ్లింకా ఓ మెట్టు పైనే ఉన్నారు. వాళ్లకి పాలు కూడా నచ్చలేదు. చల్లగానూ, వేడిగానూ కూడా తాగమంటున్నారు.

వాళ్లు పాలు తాగకపోవడం ఇక్కడ మొదలైన సమస్య కాదు. ఒకసారి ఘనపదార్థాల రుచి మరిగేక చిన్నప్పట్నించీ వాళ్లు పాలకి విముఖులు. ఇండియాలో ఎవరింటికైనా వెళ్లినప్పుడు మావాళ్లు పాలు తాగరంటే నమ్మేవారు కాదు. మొహమాటం కాదని రూఢి అయ్యేక, "ఈ రోజుల్లో పాలు తాగని పిల్లలుంటారా? వాళ్లకి పాలు కొనిచ్చే స్తోమతు లేక – తెనాలి రామకృష్ణుడిలాగా ఏదో చిట్కా వేసి ఉంటారు" అని చనువున్న కొందరు మా మొహంమీదే అనేశారు – హాస్యానికన్నట్లు.

ఒకసారి శ్రీకృష్ణదేవరాయలు తన ఆస్థానంలో కొందరికి పిల్లుల పెంపకం పోటీ నిర్వహించాడు. అందుకుగానూ ఒకొక్కరికి ఓ పిల్లినీ, దాని పోషణకుగానూ ఓ పాడిఆవునీ ఇచ్చి నెల రోజులు గడువిచ్చాడు. తెనాలి రామష్ణుడికిది పనికిమాలిన పోటీగా తోచింది. రాజుకి బుద్ధి చెప్పాలనుకున్నాడు. అతగాడు పిల్లిని ఇంటికి తీసుకెళ్లి ఓ గిన్నెలో అప్పుడే కాచిన వేడి వేడి పాలు పోసి పిల్లి ముందుంచాడు. పిల్లి పాలకోసం గిన్నెలో మూతి పెట్టింది. మూతి కాలింది. ఆ తర్వాతనుంచి ఆ పిల్లి పాలను చూస్తే భయపడేది. నెల రోజుల తర్వాత పోటీదారులందరూ తమతమ పిల్లులతో రాజు దగ్గరకు వెళ్లారు. అందరి పిల్లులూ బాగా బలిసున్నాయి. రామకృష్ణుడి పిల్లి ఒక్కటే – బక్కచిక్కి ఉంది. అదేమని రాజు అడిగితే, తన పిల్లి పాలు తాగదనీ, ఏంచెయ్యాలో పాలుపోలేదనీ అన్నాడతడు. రాజు నమ్మలేదు. గిన్నెలో పాలు పోసి దానిముందు పెడితే – నిజంగానే ఆ పిల్లి ఆ పాలు ముట్టలేదు. రాజు వెంటనే, "పిల్లి పాలు తాగకపోవడమేంటి? నువ్వే ఏదో చేసుంటావ్!" అని నిలదీశాడు. అప్పుడు రామకృష్ణుడు తను చేసింది చెప్పాడు. "ఇందువల్ల నువ్వు సాధించిందేమిటి? పోటీలో ఓడిపోయావు. ఓ మూగజీవికి ఆహారం లేకుండా చేశావు. ఇది నీకు బాగుందా?" అన్నాడు. దానికి రామకృష్ణుడు, "పిల్లికి పాలు సహజ ఆహారం కాదు. పాలు దాని ఆరోగ్యానికి మంచివి కాదు. మనిషి పెంచుకోవడం మొదలెట్టేక పిల్లికి బలవంతంగా అలవాటు చేసిన ఆహారమది. ఈ పిల్లి బక్కచిక్కడానికి కారణం, మా ఇంట్లో మాంసం కానీ ఎలుకలు కానీ లేకపోవడం. మిగతా పిల్లులు బలంగా ఉండడానికి కారణం – వాటికి మాంసమో, ఎలుకలో దొరకడమే తప్ప పాలు తాగడం కాదు. ఇక పోటీలో ఓడడమంటారా – నా కుటుంబానికి సరిపడ పాలునిచ్చే ఆవుని ముందే నాకు కానుకగా ఇచ్చారు. గెలుపు వల్ల అదనంగా నేను సాధించేదేముంది?" అన్నాడు.

నిజంగా జరిగిందో లేదో కానీ తెలుగునాట ఇది ఇంటింటి కథ. నా మిత్రులు కొందరు దీన్ని – పాలపట్ల మా పిల్లల విముఖతకీ అన్వయించినప్పుడు నాకు కోపం రాలేదు. ఉన్నమాటన్నప్పుడు కదా, ఉలుకొచ్చేది!

నిజానికి పాల విషయంలో మా అబ్బాయితో సమస్య లేదు. మంచి మాటలాడి మురిపించి వాడిచేత ఏదైనా తినిపించొచ్చు. కానీ వాడు 1974లో 'ఇండియా ఈజ్ ఇందిరా, ఇందిరా ఈజ్ ఇండియా' అన్న దేవ్‌కాంత్ బారువా ఇందిరాగాంధీకి ఎంత భక్తుడో – తన అక్కకి అంత భక్తుడు.

అక్క మాట వేదవాక్కు వాడికి. మేమేం చెప్పినా అక్క ఓకే చేస్తేనే తనూ ఓకే చేస్తాడు. తనేం చేసినా అక్కని చూసి చేస్తాడు. అక్క తిన్నవన్నీ తనూ తింటాడు. దానికి నచ్చనిది తనకూ నచ్చదంటాడు. దేనికైనా వాణ్ణి ఒప్పించాలంటే అక్క వైపునుంచి నరుక్కు రావాలి. కానీ మా పాప కొరకరాని కొయ్య.

అదృష్టవశాత్తూ పాపకి వెన్న నచ్చింది. కాబట్టి వాడికీ నచ్చింది.

"సరేలెండి, కాలమే అన్నింటికీ పరిష్కారాలు చూపిస్తుంది" అంది శ్రీమతి – ఇక ఆ చర్చని ఆపేద్దామన్నట్లు.

దాంతో నేనూ ఆ విషయాన్ని పక్కకి నెట్టి, "ఇది కొన్నప్పట్నించి ఈ సందర్భంకోసం ఎదురు చూస్తున్నాను. వీళ్ల మాటలు రికార్డు చేసి వీళ్లకి వినిపించి థ్రిల్ చెయ్యాలి" అంటూ టేపు రికార్డరు చూపించాను.

శ్రీమతి వెంటనే పిల్లల్ని పిలవబోతే, "ముందు నువ్వు" అన్నాను.

శ్రీమతి ఒప్పుకోలేదు. ఇలాంటి విషయాల్లో తన మొహమాటం ఇంతా అంతా కాదు. స్టుడియోకి వెళ్లి ఫొటో తీయించుకునేటప్పుడు కూడా – చిరునవ్వు నవ్వడానికి బదులు మనిషి బిగుసుకు పోతుంది. టెపు రికార్డరుకీ అలాగే బిగుసుకు పోయింది. నేను మరీ మరీ నొక్కిస్తే, "ఐతే, ముందు మీరు" అంది.

"అలా ఎందుకు?"

"నాకు మీ గొంతు రికార్డరులో వినాలనుంది"

నేను నవ్వి, "ఐతే ఇప్పుడు కొత్తగా రికార్డు చెయ్యనక్కర్లేదు. కొన్ని ఊహా'గానాలు'న్నాయి" అన్నాను.

ఊహా'గానాలు' అంటే తనకి తెలుసు.

నాకు వి. శాంతారాం తీసిన నవరంగ్ (1959) సినిమా అంటే చెప్పలేనంత ఇష్టం. అందులో దివాకర్ అనే కవికి తన భార్య జమున అంటే ప్రాణం. తన కవిత్వానికి ఆమెను ప్రేరణగా తీసుకుని – ఆమెలో ఓ మోహినిని దర్శించి ఊహాలోకంలో విహరిస్తుంటాడు. ఆమె మామూలుగా వంట చేస్తుంటే – మోహిని నాట్యభంగిమలు కనిపిస్తాయి. మోహిని వేరెవరో అనుకుని అమె భర్తని వదిలి పుట్టింటికి వెళ్లిపోతే – అతడి ఊహాప్రపంచం కూలిపోయి, కవిత్వానికి స్ఫూర్తి లేకుండా పోతుంది. తనే అతడి మోహిని అని జమున గుర్తించడం కథకి ముగింపు. మోహిని నాట్యాలూ, దివాకర్ పాటలతో నిండిన ఈ దృశ్యకావ్యం భారత సినీ చరిత్రలో ఓ అద్భుతం.

దంపతుల్లో ఇలాంటి భావుకతనీ, ఊహాలోకాన్నీ మేమిద్దరం ఇష్టపడతాం. ఎన్నో సందర్భాల్లో ఊహాజనిత ఘటనల్ని పాటలుగా మలచుకుని వినోదించేవాళ్లం. అవే మా ఊహా'గానాలు'. జర్మనీ వచ్చేక అలాంటివి కొన్ని ఉన్నాయి. వాటిలో ఒకటి – శ్రీమతిని జర్మనీకి రప్పించే ఏర్పాట్లు ముగిసేక – నాలో కలిగిన ఊహా'గానం' – ఇక్కడికి వచ్చీరాగానే ఆమె అలుకకి స్పందన. అదామెకి వినిపించాను.

'ప్రేమతో నిను పలుకరిస్తే పలుకకున్నావూ
కారణము ఏమని అడుగుతుంటే చెప్పకున్నావూ
తెలియదా నీకు
నేనేమి చేసినా
ఏది రాసినా
ఎచటికేగినా
ఎలా మసలినా
నీకోసమే ..... నీకోసమేనని'

గాయకుణ్ణి కావాలన్న తపన నాలో లేదు. ఉన్నా గాయకుడిగా రాణించే ప్రావీణ్యం లేదు.

ఒక స్పందనకు రూపకల్పనగా వెలువడిన పాట అది.

ఆ అనుభూతి మా ఇద్దరికే ప్రత్యేకం, పరిమితం.

పాట వింటూ శ్రీమతి ఓసారి కళ్లు తుడుచుకుంది. మునుపటి రోజు తన అలుక గుర్తొచ్చినట్లుంది.

"బాగా ఊహిస్తారండీ మీరు!" అంది నెమ్మదిగా.

కళ్లు నావీ తడిశాయి. "ఈ ప్రపంచంలో మహా మహా కవుల మహా మహా కావ్యాలకే మూలం ప్రేమ. సామాన్యులం. ప్రేమ మనని విడిచి పెడుతుందా?" అని – "ఇక నీ గొంతుని రికార్డు చేసే భాగ్యం నాకు కలిగించు" అన్నాను.

టేపు రికార్డర్లో తమ గొంతు వినాలన్న కోరిక ఎవరికుండదు?

శ్రీమతి మొహమాట పడుతూనే ఓ సారి గొంతు సవరించుకుంది. అప్పుడు తన మొహం చూస్తే – ఈ ప్రపంచమంతా ఒక్కటై తననే గుచ్చి గుచ్చి చూస్తోందా అన్న భావం కనిపిస్తుంది.

"నాకు మీలా స్వంత కవిత్వం రాదు" అంది ఓ క్షణమాగి.

"పాడడానికి స్వంత కవిత్వం రాకపోతే – అది వినేవాళ్ల అదృష్టం. పేరున్నవారి ముచ్చటైన పదాలు వినొచ్చు కదా!" అన్నాను.

ఆ తర్వాత కూడ కాసేపు బెలిపించుకుని మళ్లీ గొంతు సవరించుకుని – "నోము సినిమాలో పాట" అంది.

"ఊఁ" అని రికార్డరు ఆన్ చేశాను.

'నోముపండించిన నా సామీ నను కరుణించ రావేమీ

నిను నమ్మితిరా, నిను కొలిచితిరా, అలుక చాలించి పాలింపవా....'

నేను నా ఊహల్లో తనకి అలుకని అంటగట్టి, నా మాటలతో శాంతింప జేశాను. తను ఊహల్లో నాకూ అలుకను అంటగట్టి – ఉపశమనానికి మహాకవి దాశరథి మాటల్ని వాడింది. సంగీత దర్శకుడు సత్యం వరసని ఉపయోగించింది.

మొహమాటంవల్ల తక్కువ శ్రుతిలో మొదలెట్టింది. చివర్లో పాటలోనూ శ్రుతి బాగా తక్కువయ్యేసరికి ఊపిరందక కొంచెం ఇబ్బంది పడింది.

పాట ఆపి రికార్డింగ్ ఆపెయ్యమని సైగ చేసింది. ఆపేశాను. కాసెట్ వెనక్కి తిప్పి ప్లే ఆన్ చేసి, "ఇప్పుడు విను" అన్నాను.

అంతకుముందు ఇండియాలో ఒకరిద్దరి ఇళ్లలో టేపు రికార్డర్లు చూసి ఉన్నా – తన పాట రికార్డు చేసుకోవడం తొలి అనుభవం. వినాలని ఉన్నా చటుక్కున అక్కణ్ణించి లేచి, "మీరేం చేస్తున్నారర్రా" అంటూ పిల్లల గ్గరకు వెళ్లింది.

పిల్లలు కదా – వాళ్లకి పరిసరాలతో నిమిత్తం లేదు. ఇద్దరూ ఏవో ఆటపాటల్లో ఉన్నారు.

శ్రీమతి వాళ్లని సమీపించేసరికి – 'నోము పండించిన నా సామీ..." అంటోంది రికార్డరు ఆమె గొంతులో....

జర్మనీలో మొదటిసారిగా రికార్డు చేసిన తన పాట – ఆ తర్వాత రికార్డరు లేకపోయినా ఎప్పటికీ నా చెవుల్లో మధురంగా ధ్వనిస్తూనే ఉంటుంది.

పిల్లలు తమని సమీపిస్తున్న తల్లిని చూశారు. తల్లికి సమీపంలో లేని ఆమె గొంతుని విన్నారు. ఒకసారి ఆటూ ఇటూ ఆశ్చర్యంగా చూశారు.

"తత్తా, అమ్మ...?!" అన్నాడు బాబు, వాడు అక్కకి తల్లిని బదులు టేపు రికార్డర్ని చూపిస్తూ.

పాపది ఈడుకి మించిన తెలివి కదా – "టేపు రికార్డర్!" అంది నావంక చూస్తూ. అంటూనే లేచి నిలబడింది.

భువనేశ్వర్లో మా కాలనీలో నా మిత్రుడొకడు చిన్నప్పటి దాని పాటలు రికార్డు చేసి ఓ సారి వినిపించి కాసెట్ నాకిచ్చాడు. అప్పుడు పాప ఎంత మురిసిపోయిందో. వాళ్లింటికెళ్లి కాసెట్ విందామని అడిగేది. వాళ్లు పిలిస్తేనే వెళ్లాలని చెబితే – వాళ్లు పిల్చినప్పుడు కాసెట్ గురించి

తనే గుర్తు చేసేది. మన పిల్ల కాబట్టి మనకి ముద్దు కానీ, అస్తమానూ వినిపించాలంటే వాళ్లేమనుకుంటారోనన్న సంకోచముంటుంది కదా – ఒక్కసారి మాత్రమే నేను దాని కోరిక తీర్చాను. ఇప్పుడు మాకే ఓ స్వంత రికార్డరొచ్చింది.

పాప పరుగున నా దగ్గరకొస్తే – "నీ కాసెట్ నా దగ్గరుంది. వినిపించనా?" అన్నాను.

అది ఒప్పుకోలేదు. కొత్తగా పాడతానంది. సరే నన్నాను.

నేను రెడీ అనగానే – అది వెంటనే – "నోము పండించిన నా సామీ...." అని అందుకుంది.

అమ్మ పాడింది కదా – ఆదే పాట తనూ పాడాలన్న పసి మనస్తత్వం.

దేవుడిచ్చిన వరం. దాని గొంతు శ్రతిబద్ధం.

పాట అవగానే, శ్రీమతి అప్రయత్నంగా చప్పట్లు కొట్టి, "చాలా బాగా పాడావే" అంది.

తను చాలా బాగా పాడతానని పాపకీ నమ్మకమే. తల్లి మెచ్చుకోగానే, ఆ విషయం తనకీ తెలుసునన్నట్లు మొహం పెట్టి, "రికార్డర్లో విను" అంది కొంచెం గొప్పగా.

రికార్డర్లో పాట వింటున్నప్పుడు పాప మొహం చూడాలి. వినడమయ్యేక, "ఈ రికార్డరు అచ్చం మనదే కదూ!" అంది.

"ఊఁ" అన్నాను.

"ఎప్పుడు కావాలంటే అప్పుడు మనింట్లోనే వినొచ్చు కదూ!" అంది పాప మళ్లీ.

"ఔనమ్మా!" అని దాన్ని దగ్గరగా తీసుకున్నాను. తనకి టేపు రికార్డరు కావాలనీ, అందులో తన పాటలూ, మాటలూ రికార్డు చేసుకుని పదే పదే వినాలనీ గాఢమైన కోరిక ఉందన్న మాట! కానీ ఎప్పుడూ నన్నది నోరు విడిచి అడుగలేదు. ఎప్పుడైనా నా మిత్రుడి ఇంటికి వెడదామని మాత్రం అనేది.

ఈరోజు ఇలా అడిగేదాకా – నాకు దాని మనసులో నిక్షిప్తమైన ఈ కోరిక గాఢత తెలియలేదు. అడిగితే నా అసహాయతని ఒప్పుకోక తప్పేది కాదేమో!

భారత దేశంలో కుటుంబవ్యవస్థ అలాంటిది. పెద్దలను అవగాహన చేసుకుని సహకరించాలన్న సంస్కారం – నేర్పనవసరం లేదు, జీన్సులోనే ఉంటుంది.

"ఇంకో పాట పాడనా?" అంది పాప.

"నువ్వో పాట పాడావు కదా – ఇప్పుడు తమ్ముడు మరి!" అంది శ్రీమతి చప్పున. ఆమె బాబు చెయ్యి పట్టుకుని, "బాబీ, అక్క పాడింది కదా, నువ్వూ పాడతావా?" అంది.

"ఊఁ" అన్నాడు బాబు. ఆమె నడిపించుకుమటూ వాణ్ణి నా దగ్గరకు తీసుకొచ్చింది. కానీ వాడికి తన గొంతు రికార్డు చేస్తారన్న స్పృహే ఉన్నట్లు లేదు. ఓ చేతిలో ఓ ప్లాస్టిక్ డబ్బా ఉంది. రెండో చేత్తో దానిమీద మద్దెల కొడుతూ పరవశిస్తున్నాడు. వాణ్ణి ఈలోకంలోకి తీసుకు రావాలని వాడి భుజం తట్టాను. టేపు రికార్డరు చూపించి, "బాబీ, నీకేం కావాలమ్మా" అని రికార్డరు ఆన్ చేశాను.

"లేలియోలో నా పాత తావాలి" అన్నాడు వాడు వెంటనే.

అంటే వాడికి తెలుసు – తనని మేమెందుకు పిలిచామో! ఐతే వాడికి టేపు రికార్డరుకీ రేడియోకీ తేడా తెలియదు.

అప్రయత్నంగా వాణ్ణి దగ్గరగా తీసుకున్నాను. రికార్డింగుకి ఆ మాటలు చాలు.

అలా ఆ రోజు అత్యంత మధురంగా గడిచిపోయింది. రోజులన్నీ కొత్తగా కొత్త కొత్తగా గడిచిపోనున్నాయనడానికి ఆ రోజొక మచ్చుతునక మాత్రమే!

కొత్తగా పెళ్లయిన దంపతులకి తొలిరోజులు వెన్నెల మాసం. గులాబులకై పడే ఆరాటంలో వారికి ముళ్లు గుచ్చుకోవచ్చు. అదీ మధురం కావడమే వెన్నెల మాసం ప్రత్యేకత.

ఎన్నో నెలల తర్వాత కలుసుకోవడంవల్ల బెర్లిన్లో మాకిప్పుడు వెన్నెల మాసం మొదలైంది.

మర్నాడు ఆఫీసుకి వెళ్లడం – నాకు భువనేశ్వర్లో ఉద్యోగంలో చేరిన తొలిరోజుల తీపి జ్ఞాపకాల్ని స్ఫురణకు తెచ్చింది.

పెందరాళే లేచాను. స్నానాదులు ముగించాను. బ్రెడ్ తిని, పాలు తాగి 8 కాకుండా ఇంట్లో బయల్దేరాను.

ఒంటిగంటకి ఇంటికొస్తాను. వచ్చేసరికి భోజనం సిద్ధంగా ఉంటుంది. నేను, శ్రీమతి, పిల్లలు కలిసి భోంచేస్తాం. రెండు లోగా మళ్లీ ఆఫీసుకెళ్లి 5కి తిరిగొస్తాను. అంతా కలిసి బయటకి వెడతాం సరదాగా తిరగడానికి.

చాలా ఉత్సాహంగా ఆఫీసుకి వెళ్లాను.

అక్కడ నా మిత్రులకి ఈ నెలలో శ్రీమతి వస్తుందని తెలుసు కానీ, అప్పుడే వచ్చేసిందని తెలియదు.

ముందు హైనర్ డెకర్ట్ కనపడ్డాడు. అతడికి విషయం చెప్పాను.

అతగాడు తెల్లబోయాడు. తర్వాత ఆశ్చర్యపోయాడు. "నిజంగా?" అన్నాడు.

"ఔను. నిజంగానే వాళ్లు వచ్చేశారు" అన్నాను.

హైనర్ వెంటనే గబగబా ఆ విషయాన్ని మ్యుల్లర్, కిర్షనర్, అహమ్మద్ వగైరాలకు చెప్పేశాడు.

మా వాళ్లందరిలో ఆ వార్త పెద్ద సంచలనాన్ని కలిగించింది.

"నీకు గుట్టు చాలా ఎక్కువ!" అన్నాడు అహమ్మద్ కొంచెం నిష్ఠూరంగా.

"ఔను. నాక్కూడా తెలియనంత గుట్టు" అన్నాను.

"అంటే!" అన్నాడు అహమ్మద్ అర్థం కాక. జరిగిందంతా కథలా చెప్పాను.

"కథలా ఉంది" అన్నాడు కిర్షనర్ అంతా విని.

హైనర్ మాత్రం నిట్టూర్చి, "నువ్వు మీ వాళ్లని ఆమ్‌స్టర్‌డామ్‌కి రప్పించి ఉంటే బాగుండేది. మనం కలిసెళ్లి వాళ్లని పిక్ చేసుకుని వచ్చేవాళ్లం. ఇంత కథ ఉండేది కాదు" అన్నాడు.

ఆ మాట నాకూ చాలాసార్లు అనిపించింది. కానీ ఎదుటివారు మంచి ఆఫరిస్తే కొంత మొహమాటం, కొంత అపనమ్మకం. అదీ నా మెంటాలిటీ!

"అందుకే నీకు థాంక్స్ చెప్పాల్సినవాణ్ణి – సారీ చెబుతున్నాను" అన్నాను.

"ఇది సారీలకి సమయం కాదు. లెటజ్ సెలబ్రేట్!" అన్నాడు హైనర్.

సెలబ్రేషన్ అంటే నాకు భయం. అది ఖర్చుతో కూడిన పని కదా!

కానీ హైనర్ ఉద్దేశ్యం పది నిముషాల తర్వాత తెలిసింది – అతడికి ఓ కేక్ డెలివరీ ఐనప్పుడు.

మావాళ్లు వచ్చేరని తెలియగానే – అతడు ఫోన్ చేసి కేక్ ఆర్డర్ చేశాడు.

నా గురించి నేను గొప్ప చెప్పుకోవడం కాదు కానీ – చిన్నప్పట్నించీ నాకో అలవాటుంది. నేను మనస్ఫూర్తిగా ఇష్టపడేవారికి శుభం జరిగినప్పుడు – నేను వాళ్లని పార్టీ అడిగేవాణ్ణి కాదు. అడగకపోయినా నేనే వాళ్లకి కానుక ఇవ్వడమో, పార్టీ ఇవ్వడమో చేసి అలా నా సంతోషాన్ని వ్యక్తపరిచేవాణ్ణి. తమ సంతోషం కొద్దీ వాళ్లు నాకు పార్టీ ఇస్తే అది వేరే సంగతి. నేను మాత్రం నాకే శుభం జరిగినా పార్టీ ఇచ్చేవాణ్ణి కాదు. ఎవర్నీ అడిగేవాణ్ణి కాదు. అది నా పద్ధతి. ఇది తెలిసీ చాలామంది నన్ను పార్టీ ఇవ్వనందుకు పిసినారి అని నిరసించిన సందర్భాలున్నాయి. చిత్రమేమిటంటే అలా నిరసించినవారిలో నానుంచి పార్టీ తీసుకున్నవాళ్లూ ఉండేవారు.

హైనర్ నా పద్ధతిలో నన్ను మనస్ఫూర్తిగా అభిమానించే స్నేహితుడని నాకు అర్థమైంది. అంత తక్కువ వ్యవధిలో నాకతడు తన మనసులో అంత గొప్ప స్థానాన్నివ్వడం సంతోషమనిపించింది.

ఇంతకీ నాకు కేక్ సహించదు. నోటబెట్టడమే కష్టం. కానీ ఆ సమయంలో ఆ మాట చెప్పడం అసహ్యంగా ఉంటుంది. అందుకని ముందు అందరితోనూ సమంగా నేనూ కేక్ ఎంజాయ్ చేశాను.

ఐతే అప్పుడు ఎంజాయ్ చేశాను కదా అని ముందు ముందు నామీద కేకుల వర్షం కురిసే ప్రమాదముందని – ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ ఉదంతం గుర్తు చేసింది. అందుకని ముందు జాగ్రత్తకని, "నిజానికి మామూలుగా నేను కేక్ ఎంజాయ్ చెయ్యలేను. కానీ ఈ కేక్‌లో హైనర్ స్నేహమాధుర్యం కలిసింది. ఈ రుచిని వర్ణించడానికి మాటలు లేవు" అన్నాను.

సందు దొరికిందని, "రేపు నేను నా స్నేహమాధుర్యాన్ని బీఫ్‌తో కలిపి తెస్తాను" అన్నాడు కిర్షనర్ వెంటనే.

అంతా నవ్వారు. హైనర్ మాత్రం గంభీరంగా ముఖం పెట్టి, "రావు కోసం ఎగ్‌లెస్ కేక్ ఆర్డరిచ్చాను. నువ్వు మీట్‌లెస్ బీఫ్ తేగలవా?" అన్నాడు.

అంతా నవ్వారు కానీ హైనర్ నవ్వలేదు. ఎదుటివారి అలవాట్లని కించపర్చడం అతడికి నచ్చదు. మాట మార్చడానికి, "నా భార్య ఇండియానుంచి రసగుల్లాలు తెచ్చింది. రేపు మీకు రుచి చూపిస్తాను" అన్నాను.

"రసగుల్లా పేరు విన్నట్లే ఉంది. దేంతో చేస్తారు?" అన్నాడు మ్యుల్లర్.

"అది ఇండియాలో ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో జనం పడిచచ్చే స్వీట్. మీకు తెలుసో తెలియదో – ఆరెండు రాష్ట్రాల్లో ప్రజలకీ శాకాహారులుంటారని తెలియదు" అన్నాను.

కిర్షనర్ కళ్లు మెరిశాయి, "ఆ స్వీట్ దేంతో చేస్తారు?" అనడిగాడు ఉత్సాహంగా.

"పాల విరుగుతో!" అన్నాను. అంతే – అక్కడున్న అందరి ముఖాలూ అదోలాగైపోయాయి.

"పాల విరుగుతో స్వీట్సా? అదేం టేస్టు బాబూ!" అన్నాడు అహమ్మద్ ముఖాన్ని పరమ వికారంగా పెట్టి.

ఆ ముఖం, మిగతావారి హావభావాలు చూసేక – అనవసరంగా పాలవిరుగుని ప్రస్తావించేనా అనిపించింది.

"అదేం టేస్టో – రేపు రుచి చూసి మీరే చెప్పాలి" అనేసి ఊరుకున్నాను.

అంతలో ప్రొఫెసర్ రాలెక్ అలా వచ్చి మా అందర్నీ అక్కడ గుంపుగా చూసి విషయమేమిటని అడిగి తెలుసుకుని, "కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు.

నేను థాంక్సు చెప్పాను కానీ మనసుకి ఏదోలా అనిపించింది.

రాలెక్‌ది చెకోస్లేవోకియా. ఇక్కడికొచ్చి స్థిరపడిపోయాడు. ఆయన భార్య అక్కడే ఉంటోంది.

వాళ్లు విడాకులు తీసుకోలేదు. కానీ ఆమె ఇక్కడికి రాదు. ఆయన అక్కడికి వెళ్లడు.
ఇండియాతో పోలిస్తే జర్మనీకి చెకోస్లేవోకియా చాలా దగ్గర్లో ఉన్నట్లు లెక్క. కానీ వాళ్లు కలుసుకోవడం లేదు.

నేను నావాళ్లని ఇక్కడికి రప్పించడానికి ఇంత శ్రమ పడ్డమూ, వాళ్లొస్తే నాకాయన కంగ్రాట్స్ చెప్పడమూ – ఏదోలా అనిపించింది మరి.

కిర్షనర్ వెంటనే, "రావు మనకోసం ఇండియానుంచి రసగుల్లాలు అనే పాల విరుగు స్వీట్సు తెప్పించేట్ట. రేపు మనమంతా రుచి చూడాలి" అన్నాడు.

అతడి గొంతులో సన్నగా హేళన ధ్వని ఉంది. రాలేక్ అది పసికట్టి సన్నగా నవ్వాడు.

కిర్షనర్ గొంతు ఆ నవ్వులో ప్రతిఫలించినట్లు తోచింది నాకు.

'వీళ్లందరికీ ఇండియన్ వెజిటేరియన్ ఫుడ్ అంటే మహా వేళాకోళంగా ఉంటుంది. రేపు రసగుల్లాలతో రసవత్తరమైన సీనుండొచ్చు' – అనుకున్నాను.

మధ్యాహ్నం భోజనానికి ఇంటికెళ్లినప్పుడు శ్రీమతి నాకు భోజనంలో రెండు రసగుల్లాలు కూడా వడ్డించింది.

అబద్ధమెందుకూ వాటిని చూస్తూనే నేను ఆఫీసులో మావాళ్లకిలాగే అదోలా మొహం పెట్టాను.

"అదేంటీ మొహమలా పెట్టారు! మన స్వీట్లు తినరు కానీ, రసగుల్లాలిష్టమేగా!" అంది శ్రీమతి ఆశ్చర్యంగా.

"ఇష్టమే కానీ, ప్రస్తుతానికి నా మోజంతా హాట్ పికిల్సుమీదే ఉంది. ఐతే మొహమలా పెట్టడానికి కారణం వేరు" అంటూ ఆమెకి ఆఫీసులో జరిగింది చెప్పి, "ఇప్పుడు నువ్వు చూసింది వాళ్ల ముఖభావాలు" అన్నాను.

"వీళ్లు మరీనండీ – తినకుండానే ఫీలింగ్సా?" అంది శ్రీమతి.

"అందుకే నాకు వాళ్లకి రసగుల్లాలు రుచి చూపించాలని లేదు! ఇండియన్స్ ఎవరికైనా ఇస్తే మహదానందపడి కళ్లకద్దుకుని తీసుకుంటారు. వీళ్లకివ్వడమెందుకూ – నవ్వులపాలు కావడమెందుకూ?" అన్నాను శ్రీమతితో.

శ్రీమతి నవ్వింది, "వాళ్లకి నచ్చిందనుకోండి. మంచి స్వీట్ తెచ్చారని మెచ్చుకుంటారు. నచ్చలేదనుకోండి – భువనేశ్వర్లో మన కాలనీలో బెంగాలీబాబులున్నారు కదా – వాళ్లకి చెప్పొచ్చు. బాబూ – మీరు గొప్పగా చెప్పుకునే రసగుల్లాని జర్మన్లు హేళన చేశారని" అంది.

"నిజమే సుమా!" అన్నాను.

ఆమె నవ్వి, "ఆ మాటకొస్తే ఎవరికో ఇవ్వడమెందుకు? మనమే ఎంజాయ్ చెయ్యొచ్చు. వాళ్లకోసమని తెచ్చాం. వాళ్లకే ఇద్దాం. ఎంజాయ్ చెయ్యకపోతే వాళ్ల కర్మ" అంది.

"కర్మనకు. బీఫ్ ఎంజాయ్ చెయ్యలేకపోవడం మన కర్మని వాళ్లంటారు, ఎవరి రుచి వారిది!" అన్నాను.

శ్రీమతి అప్పటికే ఆఫీసు వాళ్లకోసం ఓ జామ్ సీసాలో 10 రసగుల్లాలు వేసి ఉంచింది. ఓ చీటీమీద 'ఇండిష్ స్యూస్' (ఇండియన్ స్వీట్) అని వ్రాసి అంటించాను.

శ్రీమతి రెండు రసగుల్లాలు ఒలోముచ్‌కీ కోసం వేరే తీసి చిన్న ప్లాస్టిక్ డబ్బాలో వేసి మూత పెట్టింది. ఓ చీటీమీద 'ఇండిష్ స్యూస్ ఫ్యూర్ ఫ్రౌ ఒలోముచ్‌కీ' అని వ్రాసి దాన్ని వంటగదిలో ఫ్రిజ్‌మీద పెట్టి – స్వీట్సుంచిన ప్లాస్టిక్ డబ్బాని ఆ కాగితంమీద పెట్టాం.

"ఇవి తిని మనని ఇల్లు ఖాళీ చెయ్యమనదు కదా!" అన్నాను నేను.

"ఇంకా కావాలని అడిగితే ఎక్కణ్ణించి తేవాలో ఆలోచించండి. ఏకంగా పది రసగుల్లాలు మీ ఆఫీసులో వాళ్లకి ఉంచేశాం" అంది శ్రీమతి.

తననుంచి నేనిది నేర్చుకోవాలి. మనం చేస్తున్నది మంచిపని అనుకున్నప్పుడు – మనసులో శంకలు పెట్టుకోకూడదు. ఉల్లాసంగా, ఉత్సాహంగా చేయాలి. మనని మనం కించపర్చుకునే ఆలోచనలు రానివ్వకూడదు.

పాపం, ఒలోముచ్‌కీ స్వీటు గురించి ఒక్క పొల్లు ముక్కనలేదు. మర్నాడుదయం ఆ డబ్బా తీసుకుంది. ఆ రాత్రి తనూ ఫ్రిజ్‌మీద ఓ చీటీ పెట్టింది – ఫీలెన్ డాంక్ (మెనీ థాంక్స్) అని.

ఎటొచ్చీ ఆఫీసులోనే –

మర్నాడదయం ఆఫీసుకి వెళ్లేక రసగుల్లాల సీసా నా వర్క్ టేబుల్ మీద పెట్టి చాలా సీరియస్‌గా ప్రయోగాల్లోకి దిగిపోయాను. ఎంతలా అంటే హైనర్ వచ్చి సీసా చూసి నన్ను పలకరించబోయి డిస్టర్బ్ చేస్తున్నానని భయపడి వెళ్లిపోయాడు. తర్వాత ఒకరొక్కరుగా వచ్చి ఆ సీసా చూసి వెళ్లారు.

నేను కాసేపు ప్రయోగాల్లో లీనమైపోవడానికి కారణముంది. సీసాని చూస్తూనే వాళ్లు జోక్సు మొదలెడితే కొంచెం ఇబ్బందిగా ఉంటుంది. నాకు నేనుగా కాక వాళ్ల చేతనే ఆ సీసా ప్రసక్తి తెప్పిస్తే అప్పుడు కథ వేరేలా ఉంటుందని నా ఉద్దేశ్యం.

నా కొలీగ్సు దృష్టంతా ఆ సీసామీదనే ఉందని నాకు తెలుసు. నన్ను పలకరించి దాని గురించి అడగాలని తహతహలాడుతున్నారనీ తెలుసు. వర్క్ చేసుకుంటున్నవాణ్ణి డిస్టర్బ్ చెయ్యకూడదన్న మంచి సంప్రదాయం వాళ్లకి ఉండడంవల్ల, పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలా అని ఆలోచిస్తున్నారనీ తెలుసు. నేను కావాలనే వాళ్లందర్నీ ఉపేక్షించి పనిలో పడిపోయినట్లు నటిస్తున్నానన్న అనుమానం వచ్చే పాటి లౌకికజ్ఞానమూ వారికి ఉండకపోదని నాకు తెలుసు.

ఐనా బయటపడకుండా పని చేసుకుని పోతున్నాను.

చివరికి హైనర్ చొరవ చేసి, "రావ్ – ఈ సీసా ఏమిటి?" అనడిగాడు.

ఉలికిపాటు నటించాను. వెంటనే మ్యుల్లర్ నవ్వి, "ఈ టైములో ఇంత బిజీగా నిన్నెప్పుడూ చూడలేదు" అన్నాను.

నేను తేరుకున్నట్లు నటించి, చిన్నగా నవ్వి, "నీకేదో నాతో అవసరపడి అలా అనిపిస్తోంది. లేకపోతే మనమంతా కూడా, ఆఫీసుకొస్తూనే బిజీ ఐపోవడం మామూలే కదా!" అన్నాను.

"అది సరేలే! ఈ సీసా ఏమిటి?" అన్నాడు హైనర్ తన ప్రశ్నని రెట్టిస్తూ.

"ఏ సీసా?" అని ఓ క్షణం ఆలోచనలో పడ్డట్లు నటించి, "ఇదా? దీనిమీద పేరుంది కదా, నా దస్తూరీ అర్థం కావడం లేదా?" అన్నాను.

"మా రావ్ దస్తూరీ ముత్యాలకోవ" అన్నాడు అహమ్మద్ వెంటనే.

"నా డిజర్టేషన్ టైపు చేయించను. రావ్ చేతే వ్రాయిస్తాను" అన్నాడు కిర్షనర్ వెంటనే.

"అందుకు టైపుకంటే చాలా ఎక్కువౌతుంది. నా భార్యాబిడ్డల్ని రప్పించడానికైన ఖర్చంతా నీనుంచి రాబడతాను" అన్నాను నేను వెంటనే.

కిర్షనర్ వెంటనే – "నువ్వేమో డాక్టరేట్ పూర్తి చేసి జీవితంలో స్థిరపడ్డావ్. డాడ్ స్కాలర్‌షిప్ వస్తుంది. నేనింకా ఎమ్మెస్ స్టూడెంటుని. నన్నంత అడక్కూడదు" అన్నాడు.

ఇక ఆ సంభాషణని ఆపాలనుకున్నాను. ఎందుకంటే కిర్షనర్‌కి తెల్లవాడినన్న జాత్యహంకారం కొంతుంది. జర్మన్ భాషాభిమానం చాలా ఉంది. అవి చాలామందికే ఉండొచ్చు కానీ – అతగాడు దాచుకోవడానికి అంతగా ప్రయత్నించడు.

ఇప్పటికే ఆర్థికంగా నన్ను తనకంటే కాస్త పైమెట్టుకి తోసేశాడు. ఆ విషయం అతడికి స్ఫురించినట్లు లేదు. స్ఫురించిందంటే తట్టుకోలేడు. సవరించుకుందుకు ఇంకేమేమో అంటాడు. అనవసరంగా గొడవ పడాలి.

అందుకని హైనర్ వంక తిరిగి, "సీసాలో ఉన్నవి రసగుల్లాలు. ప్రముఖ ఇండియన్ స్వీట్. మీకోసం తెచ్చాను" అన్నాను.

"మాకోసం స్వీట్ తెచ్చి, ఇంతవరకూ చెప్పలేదు. ఏం ఇవ్వడానికి మనసొప్పడం లేదా?" అన్నాడు అహమ్మద్.

"అదేం కాదు. నిన్న నేను రసగుల్లాలు పాల విరుగుతో చేస్తారనగానే మీ ముఖభావాలు చూశానుగా! తేవడమైతే తెచ్చాను కానీ, ఆఫర్ చెయ్యడానికి తటపటాయిస్తున్నాను" అన్నాను.

ఎగతాళినుంచి తప్పించుకుందుకు – ఇలా ముందరి కాళ్లకి బంధం వెయ్యడం – ఓ టెక్నిక్!

"ఎంతో అభిమానంగా తెచ్చావ్. నువ్విలా అనడం బాగో లేదు" అంటూ హైనర్ చటుక్కున సీసా అందుకుని మూత తీశాడు.

మూత తియ్యకుండానే సీసాలోంచీ రసగుల్లాలు తెల్లటి చిన్న బంతుల్లా కనబడుతున్నాయి.

అహమ్మద్ వెంటనే, "చూస్తుంటేనే నాకు నోరూరిపోతోంది" అన్నాడు.

"తినకుండానే రుచి తెలిసిపోయిందా?" అన్నాడు కిర్షనర్.

"అదేం కాదు. రావు మనదగ్గర కోస్తున్నాడు కానీ, కనీసం గుడ్లైనా తింటాడని నా అనుమానం. ఇందులో కనబడుతున్నవి గుడ్లే. ఆ రసంలా కనబడుతున్నది సొన. అందుకే నాకు నోరూరిపోతోంది" అన్నాడు అహమ్మద్.

"అవి గుడ్లే ఐతే – ఏ పక్షివో కానీ మరీ చిన్నగా ఉన్నాయి" అన్నాడు మ్యుల్లర్.

"ఏ పక్షివేమిటి – అవి కోడిగుడ్లు. ఇండియాలో మనుషులకే సరిగ్గా తిండి దొరకదు. ఇక పక్షులకేం పెడతారు? అక్కడ కోళ్లు ఇలా చిన్న చిన్న గుడ్లు పెడతాయన్న మాట!" అన్నాడు కిర్షనర్.

"ఇది డార్విన్‌కంటే గొప్ప థియరీ ఆఫ్ ఎవల్యూషన్. అందుకే నేనిక్కడ కోడి గుడ్లు గుమ్మడికాయంత ఉంటాయనుకున్నాను. అలా లేవంటే – బహుశా ఇక్కడ మనుషులు తాము తిన్నట్లుగా పక్షులకి పెట్టరేమో!" అన్నాను నవ్వుతూనే.

అది కిర్షనర్‌కి ఎక్కడ తగలాలో అక్కడ తగిలినట్లుంది. వెంటనే నా భుజం తట్టి, "ఎంతో అభిమానంగా ఇండియానుంచి స్వీట్సు తెచ్చావు. తినడానికి భయపడి మిగతావాళ్లు సంభాషణ దారి మళ్లించారు. నేనైతే మా రావ్ ఏం తెచ్చినా ఆప్యాయంగా తింటాను" అంటూ హైనర్‌నుంచి సీసా అందుకున్నాడు.

అంతలో ప్రొఫెసర్ రాలెక్ అలా వచ్చి, "ఏంటీ ఇక్కడేదో సమావేశం జరుగుతున్నట్లుంది" అన్నాడు.

"రావ్ మనకోసం ఇండియానుంచి స్పెషల్ స్వీట్ తెచ్చాడు" అన్నాడు కిర్షనర్ తన చేతిలో సీసా చూపిస్తూ.

రాలెక్ రసగుల్లాల్ని చూసి, "ఇవి గుడ్లలా ఉన్నాయే – ఇండియాలో నాన్ వెజిటేరియన్ స్వీట్సు ఉంటాయా?" అన్నాడు ముసిముసిగా నవ్వుతూ.

ఎందుకో మరి సాధారణంగా గంభీరంగా ఉండే రాలెక్‌కి కూడా రసగుల్లాల్ని చూడగానే జోక్ చెయ్యాలనిపిస్తోంది.

అహమ్మద్ వెంటనే రసగుల్లాలకి 'రావూస్ ఐయర్' అని పేరు పెట్టాడు. గుడ్లుకి జర్మన్ పదం ఐయర్.

అబద్ధమెందుకూ – ఆ తర్వాతనుంచి ఎక్కడ రసగుల్లాలు చూసినా నాకు 'రావూస్ ఐయర్' అనే స్ఫురిస్తుంది.

ఇంత హడావుడి చేసి మొత్తంమీద అక్కడ అంతా రసగుల్లాలు తిన్నారు.

తింటుండగా వాళ్ల ముఖకవళికలు, స్పందన చూసినప్పుడు నాకో విషయం అర్థమైంది.

నేను తినే వంటకాల్ని చిన్నబుచ్చాలన్న కోరిక అక్కడి వాళ్లందరిలో బలంగా ఉంది. అందుకు కారణం ఊహించగలను.

మనిషిని సంఘజీవి అంటారు కానీ దానర్థం ప్రతి మనిషీ తన చుట్టూ ఉన్న మనుషుల్ని ప్రేమిస్తాడని కాదు.

ప్రతి మనిషికీ సాటి మనిషికంటే తను గొప్పగా ఉండాలని ఉంటుంది. ఇతరులు తన గొప్పతనం గ్రహించడం కోసమే మనిషి సంఘ జీవితాన్ని కోరుకుంటాడు.

ఆ కోరికనుంచే కులాలు, మతాలు, జాతులు, వర్గాలు వగైరాలు పుట్టుకొచ్చాయి.

ఓ కులంకంటే మరో కులం గొప్పది. ఓ మతంకంటే మరో మతం గొప్పది. ఓ జాతికంటే మరో జాతి గొప్పది. ఓ వర్గంకంటే మరో వర్గం గొప్పది.

ఇది ఎంతవరకూ వెళ్లిందంటే – అంటరాని కులాల పేరిట అణచివేతకి గురౌతున్న వారిలో కూడా కులాల పేరిట అంటరానితనం కొనసాగింది.

హిట్లర్ జాత్యహంకారమే కదా – రెండవ ప్రపంచయుద్ధానికి దారి తీసింది! ఐతే అందుకు హిట్లర్‌ని పూర్తిగా తప్పు పట్టలేము. ఆయన దాచుకోలేదు, అంతే!

ఆ యుద్ధం జరిగిన మరో యాభై ఏళ్లదాకా – దక్షిణాఫ్రికాలో జాత్యహంకారం వికృతరూపంతో విశృంఖల విహారం చేసిందంటే – అందుకు కారణం అక్కడ ఆధిపత్యంలో ఉన్నవారికి అదే జాతికి ప్రాతినిధ్యం వహించే సంపన్న దేశాల మద్దతు పరోక్షంగానైనా లభించడమే కదా!

జాతుల్లో తెల్లవారికి – ఇతర వర్ణాలవారంటే తాము చాలా గొప్పవారమన్న భావముంది. చదువు, సంస్కారం, పరిణతి ఆ భావాన్ని చాలావరకూ అదుపు చేసినా – ఈ ఇరవయ్యొకటో శతాబ్దంలో కూడా జాత్యహంకార లీలలు సుస్పష్టమే కదా!

ప్రస్తుతానికి వస్తే నేను ఫక్తు శాకాహారిని. మాంసాహారం ముట్టను కాక ముట్టను. అది నేను పెరిగిన వాతావరణ ప్రభావమే తప్ప మాంసాహారంపై నాకేమాత్రం నిరసనభావం లేదు. కానీ నేను మాంసాహారుల్ని చిన్నబుచ్చుతున్నట్లు కొందరనుకోవచ్చు. లేదా పేద భారత దేశంనుంచి వచ్చిన ఒక సామాన్య భారతీయుడు – అప్పట్లో ఆర్థికంగా అత్యున్నత స్థాయికి చేరుకున్న జర్మనీ దేశస్థుల అభిమాన వంటకాల్ని ఆవురావురుమంటూ ఆరగించక – చౌకబారు శాకాహారంకోసం పడి చస్తాడేమన్న అహంకారమూ అంతరాంతరాల్లో ఉండొచ్చు. ల్యూనబర్గులో ఫ్రౌ యాకేల్ బంధువు నాకు పెరటి తోటలో గడ్డిని చూపి – 'ఎస్సెన్ జీ దాస్' (అది మీరు తింటారా?) అనడిగాడంటే – అది ఆ కాంప్లెక్సే కదా! అందుకు ఫ్రౌ యాకేల్ అతణ్ణి మందలించిందంటే – అతడి ప్రవర్తన నొచ్చుకోతగ్గదని గ్రహించే సంస్కారం ఆమెకున్నదనేగా!

ఇతరుల అభిరుచులపట్ల ఈ రకమైన కాంప్లెక్సు ఇక్కడివారికే కాదు, ఎక్కడెక్కడివారికీ ఉన్నదనడానికి ఎన్నో నిదర్శనాలున్నాయి. అందుకు మన దేశం కూడా మినహాయింపు కాదు.

1964లో ఆంధ్రా యూనివర్సిటీలో ఇంటర్–యూనివర్సిటీ ఆటల పోటీలు జరిగినప్పుడు – తమిళ ఆటగాల్ని 'సాంబార్' అని ఏడిపించడం తెలుసు. చెన్నైలో ఆటల పోటీలు జరిగినప్పుడు – మనవాళ్లని 'గోంగూర' అని మోసేశారనీ – అందుకిది ప్రతీకారమనీ సమర్థించుకోవడం తెలుసు. ఇంకా సర్దార్జీల్ని 'బారా బజే' అని గోల చెయ్యడమూ తెలుసు.

మనిషి సంఘ జీవనంలో ఇదొక వర్ణపటం. ఈ కాంప్లెక్సుకి పటంలో చాలా చోట్లనే స్థానముంది.

అబద్ధమెందుకూ – ఈ తరహా అవగాహన నాకెప్పటినుంచో ఉండడంవల్ల – వాళ్ల ఈ స్పందనకి నేనే మాత్రం నొచ్చుకోలేదు. మనసులో మాత్రం, "నేను కనుక నాకు తెలియకుండానే నా అలవాట్లతో వీళ్లని నొప్పించి ఉంటే – వీళ్ల అపోహల్ని తొలగించడం నా బాధ్యత" అనుకున్నాను.

ఏదేమైతేనేం మొత్తంమీద వాళ్లంతా కలిసి పది రసగుల్లాల్నీ తినేశారు. అంతా కూడా "చూసినప్పుడు ఏదో అనిపించింది కానీ, తింటే ఊహకందని గొప్ప రుచిలో ఉన్నాయి. అద్భుతం" అని బృందగానం చేశారు.

వారి పొగడ్తలు నాకు సంతోషాన్నివ్వలేదు. చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలంటారు. యూరప్‌లో మెచ్చుకుందుకు – 'అద్భుతం' కంటే చిన్న పదం ఉండదు.

"మా వంటకం గొప్పతనం నిరూపించడమో, ప్రదర్శించడమో నా ధ్యేయం కాదు. మావాళ్లు ఇక్కడికొచ్చిన సందర్భంలో ఆ సంతోషాన్ని పంచుకునేందుకు అభిమానంతో తెచ్చిన స్వీట్ ఇది" అన్నాను.

పాపం, నామీద వాళ్లకు సదభిప్రాయమే ఉంది. కానీ అక్కడున్నవాళ్లకి ఇంతవరకూ తటస్థపడ్డ భారతీయుల్లో ఇలాంటి అలవాట్లున్నవాణ్ణి నేను మాత్రమే. అదీ వారి కాంప్లెక్సుకి కారణం.

విచిత్రమేమిటంటే చాలామంది నేను కరడు కట్టిన హిందూత్వవాదిననీ, నా అలవాట్లకి కారణం మతం వల్ల కలిగిన మూఢనమ్మకాలనీ భ్రమ పడేవారు. ఇండియాలో మా ఇంట్లో నన్ను నాస్తికుడని భ్రమ పడతారని వాళ్లకి తెలియదు.

ఇది రాకెట్లు నడిచే యుగం. ఈ యుగానిదీ అదే వేగం. ప్రతి మనిషీ ఎదుటి మనిషిని కూడా అదే వేగంతో అంచనా వెయ్యాలనుకుంటాడు. మనిషి మనిషిని అర్థం చేసుకుందుకు కొద్ది క్షణాల పరిచయం చాలదు. సరిపోతుందనుకునేవాడు – మనిషిలో మంచిచెడ్డలు కూడా క్షణాలమీద నిర్ణయించే పొరపాటు చేస్తాడు. సహనంతో మనుషుల గురించి ఆలోచించి అంచనా వేస్తే – ఈ లోకంలో చెడ్డవాళ్లే ఉండరు. అంతా మంచివాళ్లే!

జర్మనీలో నేను తెలుసుకున్న అనేక నిజాల్లో ఇదొకటి!

(వెన్నెల మాసంలో పూలూ, ముళ్లూ బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

నేను, నా కుటుంబం జర్మనీలో పూర్తిగా 12 నెలలు గడిపాం. మొన్నటి కన్నా నిన్న వింతగా, నిన్నటికన్నా నేడు వింతగా అన్నట్లే గడిచింది ప్రతి రోజూ. నవరసాలూ నిండిన ఆ అనుభవాలు కొత్తగా, వింతగా, గుండెలకు హత్తుకునే సంఘటనలతో చిరస్మరణీయమై ఇన్ని దశాబ్దాల తర్వాత కూడా మమ్మల్ని అలరిస్తున్నాయి. వాటిని దినవారీ క్రమంలో కాక అంశాలవారీగా పాఠకులతో పంచుకోవడం సబబని మాకు అనిపించింది.

ఆ అంశాలలోకి వెళ్లేముందు – తొలిమాసానికి సంబంధించిన మరికొన్ని విశేషాల్ని ఇక్కడ ప్రస్తావించడం ఆవశ్యకం.

మావాళ్లు జర్మనీ వచ్చిన పది రోజులకి – ఆఫీసులో నేను ఆర్డరిచ్చిన పీహెచ్ మీటరు ఎలక్ట్రోడ్ వచ్చింది. అది రాగానే నాకు కలిగిన ఆనందాన్ని శ్రీమతితో పంచుకునేందుకు – తనకి నా రీసెర్చి గురించిన నేపథ్యం కొంతైనా చెప్పాలి. అందుకని ఒక పూటంతా ప్రాక్టీసు చేసి – నా ప్రయోగాల గురించిన కొన్ని సాంకేతిక అంశాల్ని వీలైనంత సరళంగా వివరించేలా నోట్సు తయారు చేసుకున్నాను. అది దగ్గర పెట్టుకుని – శ్రీమతికి నెమ్మదిగా చెప్పాను.

జర్మనీలో నా రీసెర్చి – ఉత్ప్రేరకాలకు (కెటలిస్టు) సంబంధించినది. ఇండియాలో నేను ఓ కొత్త పద్ధతిని అనుసరించి తయారు చేసిన ఐరన్–క్రోమియం ఆక్సయిడ్ కెటలిస్టుల పనితీరుని ఇక్కడ కెమికల్ రియాక్టర్‌లో పరీక్షించే ఆశయంతో నేనిక్కడికి వచ్చాను. అందుకు ముందుగా తగినన్ని కెటలిస్టుల్ని తాజాగా తయారు చేయాలి.

ఒక ద్రావకానికి ఉండే అనేక లక్షణాల్లో ముఖ్యమైనవాటిలో – ద్రావకపు ఆమ్ల, క్షార గుణాల్ని అంచనా వేసే పీహెచ్ కొలత ఒకటి. ద్రావకపు పీహెచ్ 7కంటే తక్కువ ఉంటే దానికి ఆమ్ల లక్షణాలున్నట్లు. అక్కణ్ణించి పీహెచ్ విలువ ఇంకా ఇంకా తగ్గిన కొద్దీ ఆమ్ల లక్షణాలు ఇంకా ఇంకా పెరుగుతుంటాయి. పీహెచ్ విలువ 7 దాటితే కనుక దానికి క్షార లక్షణాలున్నట్లు. 7 దాటి విలువ ఇంకా ఇంకా పెరిగినకొద్దీ క్షార లక్షణాలు ఇంకా ఇంకా పెరిగినట్లు. పీహెచ్ కనుక సరిగ్గా 7 ఉంటే అది అటు ఆమ్లమూ, ఇటు క్షారమూ కాని తటస్థ ద్రావకమన్న మాట! ఉదాహరణకి మనం త్రాగే నీరు పీహెచ్ 7.

నేను పరీక్షించాల్సిన కెటలిస్టులు ఐరన్–క్రోమియమ్ ఆక్సయిడ్సు అని చెప్పానుగా. వాటి తయారీకి – ముందు ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్సుని తయారు చేసి వాటిని 400 డిగ్రీల దగ్గర వేడి చేస్తే ఆక్సయిడ్స్‌గా మారతాయి.

సాధారణంగా ఈ హైడ్రాక్సయిడ్స్‌ని తయారు చెయ్యడానికి, ఐరన్–క్రోమియమ్ నైట్రేట్/క్లోరైడ్ ద్రావకాల్ని వాడతారు. వీటి పీహెచ్ 2–4 ఉంటుంది. అమ్మోనియం హైడ్రాక్సయిడ్ ద్రావకాన్ని కొంచెం కొంచెంగా కలపడం ద్వారా ఆ పీహెచ్ పెరిగి, ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్ ఘనపదార్థంగా వేరు పడుతుంది. ఈ పద్ధతిలో ఐరన్–క్రోమియమ్ ద్రావకపు బిందువులు, అమ్మోనియం హైడ్రాక్సైడ్ ద్రావకపు బిందువుల్ని కలిసిన చోట ఐరన్–క్రోమియం హైడ్రాక్సైడ్ ఏర్పడి ఘనపదార్థంగా వేరు పడుతుంటుంది. ఈ పద్ధతిని హెటరోజీనియస్ ప్రెసిపిటేషన్ అంటారు.

ఇందుకు భిన్నంగా నేను ఐరన్–క్రోమియం హైడ్రాక్సైడ్ తయారీకి, హొమోజీనియస్ ప్రెసిపిటేషన్ అనే పద్ధతిని ఎన్నుకున్నాను. అందులో ఐరన్–క్రోమియమ్ ద్రావకంలో యూరియా ద్రావకాన్ని కలుపుతాం. ఇక బయట్నించి అమ్మోనియం హైడ్రాక్సయిడ్ పొయ్యడం ఉండదు. ఈ ద్రావకాన్ని వేడి చేస్తే – యూరియానుంచి అమ్మోనియం హైడ్రాక్సయిడ్ మొత్తం ద్రావకమంతటా క్రమంగా విడుదలవుతుంది. అలా రెండు బిందువులు కలిసిన చోట కాక మొత్తం ద్రావకమంతటా ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్ పుడుతూంటుంది. ఇలా తయారైన ఈ ఘనపదార్థం మునుపటి ఘనపదార్థానికి భిన్నంగానూ – ఎన్నో విధాల మెరుగైన లక్షణాలతోనూ ఉంటుంది.

ఉదాహరణకి మునుపటి ఘనపదార్థాన్ని ద్రావకంనుంచి వేరు చెయ్యడానికి వడపోత – ఎన్నో గంటలు పడుతుంది. ఈ ఘనపదార్థం వడపోత కొన్ని నిముషాల్లో ఐపోతుంది.

వడపోత తొందరగా ఐపోతుండడం వల్ల ఈ పదార్థాన్ని పలుమార్లు నీటితో కడిగి శుభ్రం చెయ్యడం సులభం.

అలాగే మునుపటి పదార్థం నుంచి ఉద్భవించిన ఆక్సయిడ్సు ఉపరితల వైశాల్యం గ్రాముకి 10–30 స్క్వేర్‌మీటర్లు ఉంటే, ఈ ఆక్సయిడ్సు ఉపరితల వైశాల్యం గ్రాముకి 200–400 స్క్వేర్‌మీటర్లు ఉంటుంది.

ఇవన్నీ కెటలిస్టులకి అనువైన ఉత్తమ లక్షణాలు. హొమోజీనియస్ ప్రెసిపిటేషన్ పద్ధతిని ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్సు తయారీకి ఉపయోగించిన ప్రథముణ్ణి నేను.

ఇక ఈ కొత్త కెటలిస్టుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి – ఎన్నుకున్న రసాయనిక చర్య కార్బన్ మోనాక్సయిడ్ అనే విషవాయువుని – పీల్చడానికి హానికరం కాని కార్బన్ డయాక్సయిడ్‌గా మార్చడం. ఈ మార్పు ఎరువుల తయారీలోనూ, ఎగ్జాస్ట్ గొట్టాలనుంచి వచ్చే విషవాయువుల్ని శుభ్ర పర్చడంలోనూ – ఎంతో అవసరం.

నేను బెర్లిన్ రాగానే – ముందు కెటలిస్టుల తయారీకి అనువైన సామగ్రి సమకూర్చుకున్నాను.
వాటిలో ముఖ్యమైనది పీహెచ్ మీటరు ఒకటి.

ఇండియాలో ఏ సైంటిస్టుకి కావాల్సిన పరికరం – అది చిన్నదైనా, పెద్దదైనా సరే – ఆ సైంటిస్టు ఆర్డరిచ్చి కొనుక్కోవాలి. అది ఆ సైంటిస్టు పేరుమీదనే అతడి హయాంలో ఉంటుంది. వేరెవరికైనా ఆ పరికరం కావాలంటే – ఆ సైంటిస్టుని అడగాలి. ఇస్తే ఇచ్చినట్లు. లేదా వాళ్లు మరొకటి కొనుక్కోవాలి. ఈ సంప్రదాయం – వేలు ఖరీదు చేసే పీహెచ్ మీటరుకే కాదు, అప్పట్లో లక్షలు విలువ చేసే అటమిక్ అబ్‌సార్ప్‌షన్ స్పెక్ట్రోస్కోప్ లాంటివాటికి కూడా వర్తించేది.

ఇక్కడ ఇన్‌స్టిట్యూట్‌లో నాకు నచ్చినదేమిటంటే – సామాన్యంగా అవసరపడే పరికరాలన్నీ సంస్థ కొని స్టోర్సులో ఉంచుతుంది. ఇంకా మార్కెట్లోకి మరింత మెరుగైనవీ, కొత్తవీ పరికరాలు వచ్చినప్పుడు – సైంటిస్టుల సూచనపై సంస్థ వాటిని కొని స్టోర్సులో ఉంచుతుంది. అవన్నీ సంస్థ పేరునే ఉంటాయి. అవసరపడినవాళ్లు వాటిని స్టోర్సునుంచి తెచ్చుకుని వాడుకున్నంత కాలం వాడుకుని మళ్లీ స్టోర్సుకి వెనక్కివ్వచ్చు. ఎటొచ్చీ పరికరాన్ని తీసుకున్నప్పుడు సంతకంపెట్టిన రసీదివ్వాలి. దాని బాగోగులకి బాధ్యత వహించాలి. అలా నాకు స్టోర్సునుంచి పీహెచ్ మీటరు దొరికింది. కొన్నాళ్లు వాడి – కెటలిస్టుల తయారీకి ఏర్పాటు చేసుకుని – రెండు నెలల లోపులో రెండు కెటలిస్టులు తయారు చేశాను. ఏర్పాట్లు పూర్తయ్యాయి కాబట్టి ఆ తర్వాత నుంచి నాకు ఒకో కెటలిస్టు తయారీకి ఒక రోజుకంటే పట్టదు.

పరిస్థితి అంతవరకూ వచ్చేక – కెటలిస్టుల పరీక్షకు కూడా ఏర్పాటు చెయ్యాలనుకున్నాను. అందుకని ముందుగా అనుకున్న రసాయనిక చర్యకి అనువైన రియాక్టర్ గురించి వాకబు చేశాను. స్టోర్సులో అటువంటి రియాక్టర్లు సిద్ధంగా లేవు. అందులోనూ నేను వాడే రియాక్టర్ లోపల వాయుపీడనం – వాతావరణ పీడనానికి కనీసం 20 రెట్లుండాలి. రియాక్టర్ తయారీకి వాడే లోహం – ఆ ఒత్తిడికి తట్టుకునేలా ఉండాలి. ఎక్కడా లీక్సు ఉండకూడదు.

ఈ నా అవసరాన్ని అక్కడ లాబొరేటరీ ఇంజనీరు బెర్గర్‌తో చర్చించాను. అతడు కొత్త రియాక్టరు తయారు చేద్దామన్నాడు. ఇద్దరమూ కలిసి ఓ డిజైన్ ఎంపిక చేశాం. అందుకు అవసరమైన వాటన్నింటికీ ఆర్డరిచ్చాం. తయారీకి 2–3 నెలలపైన పట్టొచ్చని అన్నాడతడు. ఇండియాలో ఐతే ఏడాదిపైన పటుతుంది కాబట్టి – ఆ వ్యవధి నాకు సబబుగానే ఉందనిపించింది. నేనీ హడావుడిలో ఉన్నప్పుడు వేరెవరికో అవసరపడితే నా దగ్గరున్న పీహెచ్ మీటరు ఇచ్చేసాను. రియాక్టరుకి సంబంధించిన చర్చలు పూర్తయ్యేసరికి – క్రిస్మస్ హడావుడి. తర్వాత నేను నా భార్యాబిడ్డల్ని జర్మనీకి రప్పించే హడావుడి.

వాళ్లు వచ్చి నేను కొంచెం స్థిరపడగానే – మళ్లీ పీహెచ్ మీటరుకోసం చూస్తే – అది వాడినవాళ్ల దగ్గర దాని ఎలక్ట్రోడ్ విరిగిందిట. అప్పటికి వాళ్లకి దాని అవసరం తీరిపోయిందో ఏమో – ఆ విషయం చెప్పి అలాగే స్టోర్సుకిచ్చేసారు.

పీహెచ్ మీటరుకి ఆవసరమైన కీలక సాధనం ఎలక్ట్రోడ్. ఏంచెయ్యాలా అని ఇండియన్ మెంటాలిటీతో బెంగ పడ్డానుకానీ – కొత్త ఎలక్ట్రోడ్‌కి ఆర్డరిస్తే – రెండు రోజుల్లో అది వచ్చింది.

ఇండియాలో ఐతే ఒక ఎలక్ట్రోడ్ కొనడానికి ఉండే తతంగం, పట్టే కాలం తల్చుకున్న నాకు – అప్పుడు కలిగిన సంతోషమింతా అంతా కాదు. ఇంటికెళ్లి శ్రీమతితో నా ఆనందాన్ని పంచుకుందుకు ఇదంతా చెప్పాను. శ్రీమతి నేను చెప్పింది శ్రద్ధగా వింది. తర్వాత నెమ్మదిగా, “ఇక్కడ వ్యవస్థనుంచి మనం చాలా నేర్చుకోవాలి. అంతవరకూ మన ప్రగతి ప్రగతిలా ఉండదు. కానీ అర్జంటుగా మనం నేర్చుకోవాల్సిన విషయం మరొకటుంది” అంది.

“ఏమిటది?” అన్నాను కుతూహలంగా.

"ఇంట్లో వంట డ్యూటీ నాది. ఐనా ఇద్దరం కలిసి చేస్తుంటాం కాబట్టి వంటలో కొత్తగా తెలుసుకున్న మెలకువలు పంచుకుంటాం. అలాగే సాహితీవ్యాసంగంలోనూ – మనిద్దరం కలిసి ఎన్నో భావాలు పంచుకుంటున్నాం. ఇంకా షాపింగు, పిల్లల భవిష్యత్తు, కుటుంబానికి సంబంధించిన ఇతర బాధ్యతలు – కూలంకషంగా అవగాహన చేసుకుని పరస్పరంగా ఉంటున్నాం" అందామె.

"ఇదంతా దేనికి?" అన్నాను ఆశ్చర్యంగా.

"రేపు ఆఫీసుకి వెళ్లినప్పుడు మీ కొలీగ్ హైనర్ డెకర్ట్‌ని అడగండి. అతడిక్కడ రీసెర్చి చేస్తున్నాడు. అతడి భార్య చిన్నపిల్లలకు పాఠాలు చెప్పే స్కూల్లో టీచరుగా పని చేస్తోంది. అతగాడు తన రీసెర్చి వర్కులోని సాంకేతిక విశేషాల్ని ఇలా భార్యతో పంచుకుంటాడేమో తెలుసుకోవాలనుంది" అంది శ్రీమతి.

నాకు అర్థమైంది. నా రీసెర్చి వర్కు గురించి నేనిచ్చిన డిటెయిల్సు బహుశా ఆమెకి విసుగనిపించాయి.

"నీకు విసుగనిపిస్తే – అప్పుడే చెప్పొచ్చుగా. అన్నీ విని ఇప్పుడు చెప్పడమెందుకు" అన్నాను కాస్త చిన్నబుచ్చుకుని.

"ఏమో – ఆర్థాంగిని కదా – ఆ వివరాలు కూడా జీర్ణించుకోవాల్సి ఉంటుందేమో అనుకున్నాను. ఇక్కడి వ్యవస్థ గురించి హైనర్‌ని అడిగి తెలుసుకుంటే – మీరో నేనో ఆ ప్రకారం మసలడం నేర్చుకోవాలి కదా!" అంది శ్రీమతి.

అప్పుడు నాకు మా బామ్మగారు గుర్తుకొచ్చారు.

మా తాతగారు కవి, మహాపండితులు. 1930లలో కుడి ఎడమల అష్టావధానాన్ని జయప్రదంగా నిర్వహించిన ప్రతిభ ఆయనది. మా బామ్మగారు పురాణ కథలెన్నో తెలిసినా – భక్తిభావమే తప్ప సాహిత్యపరమైన ఆసక్తి లేని మామూలు మనిషి. గృహిణిగా అసాధారణ ప్రజ్ఞ చూపినా అందుకు అంకితభావమే తప్ప గుర్తింపు కోరే తాపత్రయం లేని నిస్వార్థపరురాలు.

తాతగారికి ఆమెతో పాండిత్యానికి సంబంధించిన శ్లేషలు, అలంకారాలు, చమత్కారాలు వగైరాలు పంచుకోవాలనుండేది. ఆయన సాటి పండితుడితో పంచుకున్నట్లు ఎన్నో ముచ్చట్లు ఆమెకి చెప్పేవారు. వాటిని మేము విని ఆనందించేవాళ్లం. ఆమె మాత్రం ఆయన చెప్పే మాటల్లోని భక్తి విశేషాల్ని మాత్రం గ్రహించి, మిగతా విశేషాలపై ఆసక్తి నటించేవారు. సగం దృష్టి వంటమీదా ఇంటి పనులమీదా ఉండడంవల్ల – తను శ్రద్ధగా వినడంలేదనుకుంటారని – 'అలాగా, నాకు తెలియదే', 'భలే చెప్పారండీ', 'సరిగ్గా అర్థం కాలేదు, ఇంకోసారి చెప్పండి' అని మధ్య మధ్య అంటూండేవారు.

ఇలాంటి పరిస్థితినే మిస్సమ్మ సినిమాలో పింగళి వారు – 'తరచి తరచి ఊసడిగిన సరసమింక చాలనిలే – ఆడువారి మాటలకు అర్థాలే వేరులే' అని చమత్కరించారు.

మహాపండితులు తాతగారికి ఆ మాత్రం అర్థం కాదా, ఆయన అలాంటప్పుడు, "నీకు వంట, ఇంటిపని తప్ప మరో ధ్యాస లేదు' అని విసుక్కునేవారు.

ఇంటిపనుల్లో పక్క వెయ్యడం నుంచి, వంటలో చారు పెట్టడం వరకూ – మా తాతగారికి ఖచ్చితమైన అభిరుచులున్నాయి. వాటికి ఏనాడూ ఆసంతృప్తి కలుగని విధంగా ఉండడంవల్ల – ఆమెకి నిజంగా వాటి ధ్యాసే లేకపోతే తనకి కలిగే ఇబ్బంది ఆయనకి స్వానుభవం కాదు.

మా తాతగారే కాదు – బియ్యే చదివే నా అన్నయ్య కూడా తన సబ్జక్ట్సులో హిస్టరీ, ఎకనామిక్సు, పాలిటిక్సుకి సంబంధించిన ఎన్నో లోతైన విషయాల్ని తన క్లాస్‌మేట్సుకి చెప్పే పద్ధతిలో బామ్మగారికి చెప్పేవాడు.

నా సబ్జక్టు సైన్సు కదా – బీయస్సీ చదివే నాకే వాడు చెప్పే విషయాలు కొన్ని కషాయంలా అనిపించేవి. కానీ మనుమడిపై ముద్దుకొద్దీ – ఆమె ఆ కబుర్లూ శ్రద్ధగా వినేవారు.

"మీకేమైనా అర్థమౌతోందా?" అని నేనే అడిగేశాను ఓసారి.

"అర్థమవడానికిందులో ఏముందిరా – ఇంటిపన్లు చేసుకునేటప్పుడు పక్కనెవరైనా ఉండి కబుర్లు చెబుతుంటే బాగుంటుంది. నువ్వూ నీ సైన్సు కబుర్లు చెప్పు, వింటాను" అన్నారామె.

నాకప్పుడు అనిపించింది – మన సంప్రదాయంలో అడవాళ్లు అనుభవించే ఒంటరితనం ఎలాంటిదంటే – ఎవరో ఒకరు డిఫరెన్షియల్ కాల్క్యులస్ చెప్పినా ఫరవాలేదు, పక్కనుండి మాట్లాడుతుంటే చాలు కాబోలు అనిపించింది.

విషయం అర్థమయ్యేక నేనేమంటాను? అవతలివాళ్లకి అర్థమవుతుందా, ఆసక్తిగా అనిపిస్తుందా అన్నది పక్కన పెడితే – కొన్ని విశేషాలు ఆత్మీయులతో పంచుకోవడం అదో ఆనుభూతి.

ఎవరితోనైనా ఏమైనా పంచుకోవాలనుకున్నప్పుడు ఇవన్నీ గుర్తుకొస్తుంటాయి. నా విషయంలో చరిత్ర పునరావృతమైంది, అంతే!

"తరచి తరచి ఊసడక్కుండా – సూటిగా మనసులో మాట చెప్పినందుకు థాంక్స్!" అన్నాను శ్రీమతితో.

ఆమె నవ్వింది. అంత్యనిష్ఠూరంకంటే ఆదినిష్ఠూరం మేలు కదా అన్నట్లుందా నవ్వు. కానీ భార్యాభర్తలన్నాక – ఇలాంటివి అంతం కాదు – ఆరంభమేనని తనకీ తెలుసు, నాకూ తెలుసు.

మర్నాడు కొత్త ఎలక్ట్రోడ్‌తో పిహెచ్ మీటరు వాడుతుండగా – అహమ్మద్ నా దగ్గరకొచ్చాడు.

పీహెచ్ మీటరు చాలా బాగా పనిచేస్తోందని ఉత్సాహంగా అతడికి చెప్పాను.

అహమ్మద్ నవ్వి, "ఇండయానుంచి వచ్చావుగా, నీకిక్కడి గుండుసూదులు కూడా గొప్పగా అనిపిస్తాయి" అన్నాడు.

మధ్య మధ్య నన్నలా వేళాకోళం చెయ్యడం అతడికి అలవాటు. నేను బెర్లిన్ వచ్చినప్పుడు ప్రప్రథమంగా పరిచయమైన వ్యక్తిగా – నాకు అత్యంత సన్నిహితుడయ్యాడతడు. అందువల్ల హేళనలా అనిపించే అతడి మాటల్లో నిరసన కాక ఆత్మీయత ధ్వనించడం నేను కనిపెట్టాను. 1974లో ఇండియా నిర్వహించిన ఆణుపరీక్ష గురించి తరచుగా ఎత్తిపొడుస్తూంటాడు. పార్టీలు జరిగినపుడల్లా – నేను హాట్ డ్రింక్సుకి బదులు సాఫ్ట్ డ్రింక్సు తీసుకోవడాన్ని తప్పు పడతాడు. మా అనుబంధంలో అదో సరదా, ముచ్చట!

అందుకే నేను నవ్వేసి, "నిజంగానే ఇక్కడి గుండుసూదుల నాణ్యత నాకు ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ పీహెచ్ మీటర్ల వంటి సైంటిఫిక్ పరికరాల విషయంలో అది నిజం కాదు. ఇండియాలో చక్కటి పీహెచ్ మీటర్లు తయారు చేస్తున్నారు. అవి విదేశాలకు కూడా ఎగుమతి ఔతున్నాయి" అన్నాను.

ఆహమ్మద్ ఈసారి బిగ్గరగా నవ్వి, "ఇరాక్‌లో మా లాబొరేటరీకి ఇండియన్ పీహెచ్ మీటరొకటి కొన్నాం. దానికి మీట నొక్కగానే – అది ఊడి స్ప్రింగ్ యాక్షన్‌తో గాల్లోకి ఎగురుతుంది. క్యాచ్ పట్టి మళ్లీ మీటరుకి తగిలిస్తాం" అన్నాడు.

"ఓహో, మీది ఇరాక్ కదూ! అక్కడికి ఆ మాత్రం చాల్లే అని అలాంటివి పంపిస్తారు మావాళ్లు. మీ దగ్గర ఆయిల్ డబ్బు బాగా ఉందిగా, మీకు వాడ్డంకంటే కొనిపారెయ్యడమే ముఖ్యం. మీవాళ్లెప్పుడూ ఒకటి కాదు, ఒకేసారి పది మీటర్లు కొంటారుట. మా లాబొరేటరీ కొచ్చినప్పుడు సేల్స్‌మన్ ఈ విషయం చెప్పి నీకంటే బిగ్గరగా నవ్వాడు తెలుసా" అన్నాను.

"రావ్, నువ్వు దేనికీ తడుముకోవు" అని మెప్పుకోలుగా భుజం తట్టాడు అహమ్మద్ ఆ సంభాషణని అక్కడితో త్రుంచేస్తూ.

లాబ్‌లో కొలీగ్సులో కిర్షనర్ ఒక్కడే కాస్త విచిత్రంగా అనిపించేవాడు. అతడికి తాను జర్మన్ అని గర్వంగా ఉండేది. ఆసియా దేశాలంటే చిన్నచూపుండేది. ఇండియా అంటే పేద దేశమనడమే తప్ప అక్కడి సంస్కృతి, విలువల పట్ల ఆసక్తి లేదు. బ్రిటిష్‌వాళ్లంటే పడదు. ఇంగ్లీషంటే చిరాకు. ఆంగ్లేయులు – ఊరందరిదీ ఓ దారైతే ఉలిపికట్టెది ఓ దారన్నట్లు మసలుతారనేవాడు.

మా ఆఫీసులో చాలామంది జర్మన్ కొలీగ్సుదీ ఇదే అభిప్రాయం.

ప్రపంచమంతా కీప్ రైట్ అంటుంటే – బ్రిటిష్ వాళ్లూ, వారి పాలనలో మగ్గిన ఇండియావంటి దేశాలూ కీప్ లెఫ్ట్ అంటాయిట. అంతా దశాంశమానాన్ని అనుసరిస్తుంటే – వాళ్లింకా దూరాన్ని మైళ్లలో చెబుతారుట.

ఓసారి నేను మాటల సందర్భంలో – ఫెరస్ పెర్రీ సయనైడ్ అనే రసాయనం రంగు ప్రష్యన్ బ్లూ అన్నాను. దానికి హైనర్ ఇబ్బందిపడి, "బ్రిటిష్‌వాళ్లు మీకు బాగా బ్రెయిన్‌వాష్ చేసి – రంగుల పేర్లు కూడా మార్చేసారు. మేము దాన్ని బెర్లినర్ బ్లూ అంటాం' అని సవరించాడు. అతడి మొహం చూస్తే – ప్రష్యన్ బ్లూ అన్న పదం అతణ్ణి చాలా బాధించిందనిపించింది. తర్వాత నాకు తెలిసిందేమిటంటే – ఒకప్పుడు ప్రష్యా పేరిట ఉండే దేశానికి బెర్లిన్ రాజధాని అనీ, రెండవ ప్రపంచయుద్ధం తర్వాతనుంచి ప్రష్యా కూడా జర్మనీగా మారిపోయిందనీ, మరి ప్రష్యా అనే పేరు ఇక లేదనీ. ప్రష్యా పేరులో జర్మన్లకు ఏదో యాంటీ సెంటిమెంటు ఉండి ఉండాలి.

మరో విశేషమేమిటంటే – జర్మన్లకు ఇంగ్లండు అంటే ఉన్న అయిష్టం అమెరికా అంటే లేకపోవడం. అక్కడ చాలామంది అమెరికా వెళ్లాలని కలలు కంటారు. మరి అమెరికాలో జాతీయభాష ఇంగ్లీషు కావడం, అక్కడ కొలతల్లో దశాంశమానం ఉపయోగించకపోవడం వారికి అభ్యంతరం కాకపోవడం ఆశ్చర్యం.

కిర్షనర్ విషయానికొస్తే – అతగాడు జాత్యహంకారం దాచుకోలేడు కానీ, నాతో చాలా మంచిగా ఉండడానికి ప్రయత్నించేవాడు. మా పిల్లల కోసమని బిల్డింగ్ బ్లాక్సు తెచ్చి ఆఫీసులో నాకిచ్చాడు. ఇంటికెళ్లి వాటిని పిల్లలకిస్తే వాళ్లు ఎగబడి తీసుకున్నారు. వాళ్లు గొడవ పడుతుంటే – వాళ్లకి నచ్చిన విధంగా పంచిచ్చాను. ఆ పంపకం ఎలాగుందంటే – ఇల్లు కడితే తలుపొకరి దగ్గరా, కిటికీ మరొకరి దగ్గరా ఉంది. ఐనా వాళ్లకా విషయం తెలిస్తేగా – ప్రతి బ్లాకుకీ ఓ పేరెట్టి ఏవో ఆటలు ఆడుకుని వినోదించారు.

ఆఫీసులో కొలీగ్సు ఎవర్నీ నేనెప్పుడూ ఇంటికి పిలవలేదు. అవతలివాళ్లు చొరవ తీసుకుంటే తప్ప – వీలైనంత దూరం పెట్టే అలవాటు అప్పట్లో నాకుండేది. కానీ కిర్షనర్ మాత్రం అడిగి మరీ మా ఇంటికొచ్చాడు. బహుశా అతడికి మేమెలా ఉంటున్నామో, ఏం తింటున్నామో తెలుసుకోవాలనిపించి ఉంటుంది.

"మా ఇంట్లో పిల్లలాడుకునే కౌఫ్ హౌస్ (సరుకులమ్మే దుకాణం) ఉంది. అది మీ పిల్లలకిస్తాను. ఇక్కడున్నన్నాళ్లూ ఆడుకుని వెళ్లేటప్పుడు నాకు మళ్లీ తిరిగి ఇచ్చేద్దురు కాని. అది ఇంటికి మోసుకుని వెళ్లాడానికి అనువు కాదు. నేను కార్లో తెచ్చి మీ ఇంట్లో ఇస్తాను" అన్నాడు కిర్షనర్.

అలా ఇతరుల వస్తువులు తీసుకోవడం నాకిష్టముండదు. వద్దంటే – అతణ్ణి ఇంటికి రావద్దన్నట్లు ఔతుందని సరేనన్నాను.

అతడు జనవరి 30న కౌఫ్‌హౌస్ తీసుకుని మా ఇంటికొచ్చాడు. శ్రీమతితో కొంచెం మొహమాటంగా మాట్లాడాడు. పిల్లల్ని చనువుగా పలకరించబోతే, వాళ్లు దగ్గరకు వెళ్లడానికి మొహమాటపడ్డారు. అతడు కౌఫ్ హౌసుని వాళ్లకిస్తే వాళ్లు నావైపు చూశారు. నేను తలూపితే అప్పుడు తీసుకున్నారు.

కిర్షనర్ మా పిల్లల క్రమశిక్షణని చూపులతోనే మెచ్చుకున్నాడు.

శ్రీమతికి కిర్షనర్‌ని చూడ్డం అదే మొదటిసారి. కానీ అతడి గురించి నా ద్వారా బాగా విని ఉంది. అతణ్ణి బాగా ఇంప్రెస్ చెయ్యాలని – ఉప్మా ప్రత్యేకంగా చేసింది. కారం తినలేడని – పేరుకి వేశామన్నట్లు అల్లం, పచ్చిమిర్చి వేసింది. అంత చప్పటి ఉప్మా చంటప్పుడు కూడా మేము తిని ఉండం.

జర్మన్లు తినే వుర్‌స్ట్‌లో ఆవపిండి నంచుకుని తింటారు. పసుపు రంగులో ఉండే ఆ ఆవపిండి ఘాటు కనీసం యాభై మీటర్లదాకా కొడుతుంది. దాన్నిబట్టి జర్మన్లు కొంత ఘాటు సహించగలరనే మేమనుకున్నాం.

కానీ కిర్షనర్‌కి ఆ కాస్త అల్లం ఘాటు దుస్సహమయింది. కాసిని పచ్చిమిర్చి భరించలేని కారం అయ్యాయి. ఆ మాట నోటితో చెప్పనవసరం లేదు. ఉప్మా తింటూనే కిర్షనర్ మొహం ఎర్రగా ఐపోయింది. ముక్కమ్మట, కళ్లమ్మట ఆగకుండా నీళ్లు కారాయి.

అలవాటు లేకపోయినా మంచినీళ్లు తాగాడు. ఐనా తగ్గలేదు. శ్రీమతి నొచ్చుకుని కారం తగ్గడానికన్నట్లు – వేడి వేడి సేమ్యా పాయసం ఇచ్చింది. చల్లగా ఉంటే ఏమో – కానీ మండుతున్న అతడి నోరు ఆ వేడికి మరింత ఇబ్బంది పడిందని నాకు అర్థమైంది.

ఏ మాటకా మాటే చెప్పుకోవాలి – కిర్షనర్ ముఖంలో కోపం, తిరస్కారభావం కనిపించలేదు. వంటకాలు బాగున్నాయనే అన్నాడు తప్ప నిరసించలేదు. కారానికి తట్టుకోలేనందుకు సిగ్గు పడ్డట్లు కనిపించాడు.

అతడు ఎలాగో కాసేపుండి వెళ్లిపోయాడు.

మా జీవితంలో ఎప్పుడూ ఏ అతిథికీ అలాంటి మర్యాద జరుగలేదు. ముఖ్యంగా కిర్షనర్‌కి అలా జరిగినందుకు మేమిద్దరం చాలా బాధ పడ్డాం.

అసలే కిర్షనర్. ఆపైన మా ఈ ఆతిథ్యం.

మాకు చాలా అసంతృప్తిగా ఆనిపించినా – ఒకందుకు సంతోషించాలి. ఇతరులవద్ద మా ఆహారపు టలవాట్లని అదేపనిగా చిన్నబుచ్చే అవకాశం కిర్షనర్‌కి వచ్చింది. దాన్నతడు సద్వినియోగం చేసుకున్నాడని తర్వాత చాలామంది కొలీగ్సు ద్వారా తెలిసింది. పాపం మాటెందుకూ – కిర్షనర్ మాత్రం ఆ తర్వాతనుంచి నాతో రెట్టించిన సుహృద్భావంతో మసిలాడు. తనకి తెలుగు వంటకాల్ని చిన్నబుచ్చేందుకు మంచి అవకాశమిచ్చేనన్న కృతజ్ఞతేమో మరి!

అప్పుడు నేను, శ్రీమతి అనుకున్నాం – ఆతిథ్యమిచ్చేటప్పుడు ఎదుటివారికి సంతృప్తి కలిగించడానికి మన ఊహకు మించి ఆలోచించాలి. లేకుంటే ఆపూర్వమైన మన వంటకాలకి చెడ్డపేరు తెచ్చినవాళ్లమౌతాం.

కిర్షనర్ విషయంలో జరిగిన పొరపాటు మళ్లీ ఎవరి విషయంలోనూ జరుగకుండా చూసుకోవాలనుకుంటూ – తెలుగు వంటకాలకు క్షమార్పణ చెప్పుకున్నాం.

మా ఆఫీసులో ఇంజనీరు బెర్గర్, అతడి అసిస్టెంట్ ఆటో – ఇద్దరూ రియాక్టర్ తయారీ పనులు చురుగ్గా కొనసాగిస్తున్నారు.

ఈలోగా ఆశ్చర్యమేమిటంటే – జనవరి 16 రాత్రి లాబొరేటరీలో కరెంటు పోవడం. అందువల్ల నేను లేకున్నా కొనసాగేలా చేసిన ప్రయోగం ఏర్పాటు దెబ్బతింది. పోయిన కరెంటు మర్నాడు మధ్యాహ్నం దాకా రాకపోవడం ఇంకా ఆశ్చర్యం.

క్రికెట్లో గవాస్కర్ సున్నాకి ఔటైనప్పుడు – అతడూ మనిషే కదా అనిపించినట్లు – ఈ దేశాన్ని నడిపిస్తున్నదీ మనుషులేగా అనిపించింది. ఐతే నేనక్కడున్న రెండేళ్ల కాలంలో కరెంటు పోయిన సందర్భం అదొక్కటే కావడం – ఈ దేశాన్ని నడిపించేది మనుషులేనా అని మళ్లీ అనిపింపజేసేది.

శ్రీమతి వచ్చిన వారానికి ఆఫర్లో పాతిక మార్కులకి చవగ్గా వచ్చిందని – ఓ మాంటెల్ కొన్నాను. అది వేసుకుంటే ఇక షాల్ కప్పుకోవాల్సిన ఇబ్బంది తప్పింది. మావాళ్లొచ్చిన వారానికి డబ్బు లెక్క చూసుకుంటే – నా దగ్గర 354 మార్కులున్నాయి. వాటితోనే మిగతా నెలంతా గడపాల్సి ఉంది. ఐతే అది మరీ తక్కువ మొత్తమేం కాదని నెల గడిచేసరికి గ్రహించాను.

ముందు మేము చుట్టుపక్కల పరిసరాలకు బాగా అలవాటు పడ్డాం. మేడ దిగగానే బుధ, శనివారాలు సంత. అక్కడే పక్క సందులోనే బోలెడన్ని సూపర్‌మార్కెట్లు. మా ఇంటిముందు ఒక పార్కు. ఇంటి వెనుక ఒక పార్కు. పిల్లలు వీటన్నింటికీ బాగానే అలవాటు పడ్డారు.

ఇంటిముందు పార్కు ఓ చర్చికి ముందు ఆవరణలో ఉంది. అక్కడ ఆటలాడే జర్మన్ పిల్లల్ని చూస్తుంటే ముచ్చటేసేది. వాళ్లు మిసమిస లాడిపోతూ, పుష్టిగా, హుషారుగా ఉండేవారు. వాళ్ల చేష్టల్లో మోటుతనం ఎక్కువ. జారుడుబల్లమీద పైకెక్కి జారడానికి బదులు, ఇట్నించి ఎదురెక్కి అక్కణ్ణించి స్విమ్మింగ్‌పూల్లోకిలా ఇసుకలోకి దూకేవారు. ఉయ్యాల్ని ఆతివేగంగా ఊపి – అది అంత వేగంగానూ వెనక్కి వస్తుంటే – వెనుకడుగు వెయ్యకుండా చేత్తో పట్టుకుని ఆపేవారు. కాస్త పెద్ద పిల్లలు చిన్నపిల్లల్ని గాల్లోకి ఎగరేసి పట్టుకునేవారు.

మా పిల్లలు సున్నితం. ఐతే వాళ్లు ఆ పిల్లల చేష్టల్ని చూసి వినోదించేవారు. మా అమ్మాయైతే వాళ్లని అనుకరిస్తూ జారుడుబల్ల ఎదురెక్కడానికి ప్రయత్నాలు కూడా చేసేది.

మా ఇంటి వెనుక పార్కుకి సెలవు రోజుల్లో ఓ వ్యాన్ వచ్చేది. అందులో పిల్లలాడుకునేందుకు రకరకాల ఆట సామగ్రులుండేవి. పిల్లల్ని దగ్గరుండి ఆడించడానికి ఇద్దరు మనుషులుండేవారు. మా పిల్లలకి ఆ ఏర్పాటు చాలా నచ్చింది. కానీ మేమా పార్కులో ఓసారి ఫొటోలు తీసుకున్నాక మళ్లీ అక్కడికి వెళ్లలేదు....

www

(షాపులు పిలుస్తున్నాయి బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

షాపింగంటే చాలామందికి ముఖ్యంగా ఆడవాళ్లకి చాలా ఇష్టంగా ఉంటుంది. శ్రీమతి అందుకు భిన్నం కావడం నాకు ఆశ్చర్యమైతే – అది నా అదృష్టమనేవారు నా మిత్రులు. అలాంటి శ్రీమతి కూడా – 'రాయల కాలంలో రాచబాట పక్కన రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారు' అని ఎవరో అనగా విన్నప్పుడు, 'షాపింగ్ చేస్తే – అలాంటిచోట చెయ్యాలి' అని నన్ను ఆశ్చర్యపరిచింది.

ఆప్పుడు నాకర్థమైంది. షాపింగంటే ఆసక్తి ఉన్నవాళ్లు వెతుక్కుంటూ షాపులకి వెడతారు. షాపులు ఆకర్షించే షేపులకి ప్రాధాన్యమిస్తే – ఆసక్తి లేనివారికి కూడా వాటి పిలుపు వినిపిస్తుంది. కర్టెసీకైనా ఆ పిలుపుని మన్నించాలనిపిస్తుంది. ఒకసారి షాపుల్లో అడుగెట్టామా – ఆ తర్వాత మన అసలు వ్యక్తిత్వానికి పరీక్ష మొదలౌతుంది.

అప్పటికి మన దేశంలో షాపుల్లో ఇప్పటి ప్రభలు లేవు. అందులోనూ భువనేశ్వర్లో మరీనూ. పోలికలో అక్కడి షాపులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిన్న పట్నాల వాటికి కూడా దరిదాపుల్లో ఉండేవి కాదు.

జర్మనీలో అడుగెడుతూనే నేను ప్రత్యేకంగా ఫీలైనది – షాపుల విషయంలో. పట్నాలలోనే కాదు – పల్లెల్లో కూడా – 'షాపింగుకోసమే జీవితం' అని జనం అనుకునేంత ఆకర్షణీయంగా ఉండేవి షాపులు. నాకు రాయల కాలం గుర్తుకొచ్చింది.

అప్పుడే నాకు ఆనిపించింది, 'భార్యాబిడ్డలతో ఇక్కడ షాపుల్లో తిరగని జీవితమూ ఓ జీవితమేనా?' అని.

ఇప్పుడు నావాళ్లిక్కడే ఉన్నారు. జీవితాన్ని జీవితం అనిపించుకోగల అవకాశం నాకొచ్చింది.

ప్రతి రోజూ ఏదో ఓ సమయంలో బయటికెళ్లి కనీసం రెండు మూడు షాపుల దర్శనం చేసుకొచ్చేవాళ్లం.

శ్రీమతి పూర్వకాలపు మనిషేం కాదు. ఆలోచనల్లో ఐతే తన కాలానికి ఓ దశాబ్దం ముందే ఉంటుంది. కానీ దుస్తుల విషయంలో మాత్రం తను అలవాటుపడ్డ సంప్రదాయాన్ని విడవను కాక విడవలేకపోయేది.

తను జర్మనీలో అడుగెట్టగానే చెప్పాను – ఇక్కడి వాతావరణానికి చీరలు సరిపడవనీ, పాంట్లలోకి మారక తప్పదనీ.

దానికి బదులుగా, "భువనేశ్వర్లో నా వయసువాళ్లు చుడీదార్ వేసుకుంటే, నడకకి చీరకంటే అదే ఎక్కువ వీలని తెలిసినా – మారలేకపోయాను. ఎందుకో నాకు చీర కాక మరే దుస్తులు వేసుకున్నా – మతం మార్చుకున్నంత ఇబ్బంది కలుగుతుంది'' అంది శ్రీమతి.

''కానీ ఇది చలి దేశం. ఇక్కడ మారక తప్పదు'' అన్నాను.

''ఇక్కడికి రాగానే మీకూ మీ సహచరులు చెప్పారు – ఇది చలిదేశం, ఇక్కడ విస్కీ, బ్రాందీలు అలవాటు చేసుకోవాలని. విన్నారా?'' అంది శ్రీమతి.

''వినలేదంటే – అందులో నిజానిజాలు స్వయంగా తేల్చుకోవాలనుకున్నాను తప్ప – వాళ్ల మాట కొట్టిపారెయ్యాలనుకోలేదు''

''కదా – నేనూ అంతే అనుకొండి'' అంది శ్రీమతి.

అప్పుడు నాకు చిన్నప్పుడు చందమామలో చదివిన తండ్రీకొడుకుల కథ గుర్తుకొచ్చింది.

కొడుకు ఇంటి బయట ఎండలో చెమటలు కక్కుతూ పని చేస్తుంటే – తండ్రి వచ్చి, "ఎండగా ఉందిరా నాయనా! కాసేపు లోపలికొచ్చి నీడపట్టున విశ్రాంతి తీసుకో'' అన్నాడు. కొడుకు ఆయన మాటలు లెక్క చెయ్యకుండా పని చేస్తూనే ఉన్నాడు.

చివరకు విసుగొచ్చిన తండ్రి – నెలల వయసున్న మనవణ్ణి తీసుకొచ్చి ఎండలో పడుకోబెట్టాడు. అది చూసిన కొడుకు, "పెద్దవాడివి, మతి కానీ పోయిందాయేం? చంటిపిల్లాణ్ణి ఎండలో పడుకోబెడతావా?'' అని తన పని మానుకుని చంటిపిల్లాణ్ణి ఎత్తుకుని ఇంట్లోకి తీసుకువెళ్లాడు.

తండ్రి నవ్వి, "నీ కొడుకు ఎండలో ఉంటే నీ ప్రాణం గిలగిల్లాడిపోయిందా – మరి నా కొడుకు ఎండలో ఉంటే, నాకూ అంతే కదా! మతి నీకు పోయిందా, నాకు పోయిందా, చెప్పు'' అన్నాడు.

పాపం – నా మిత్రులు – నామీద అభిమానంతో కనీసం వైనయినా పుచ్చుకోమని నాకో సలహా ఇస్తే, అది నేను లెక్క చెయ్యలేదు. ఆ సలహా నాకు అవసరం లేదని ఋజువు చెయ్యాలనుకున్నాను, చేశాను.

ఇప్పుడు శ్రీమతి నా సలహా విషయంలో అదే చేసింది.

కానీ తను ఇండియాలోలా చీర కట్టుకుని బయటికొస్తే చలికి గడ్డ కట్టుకుపోతుందని నా భయం.

ఐతే శ్రీమతి లాజిక్ వేరు.

జర్మనీలో చాలామంది ఆడవాళ్లు – చాలా భాగం వళ్లు కనిపించేలాగే వస్త్రధారణ చేస్తారు. చలికాలంలో కూడా వారి వస్త్రధారణలో పెద్ద మార్పేం ఉండదు. వాళ్లే చలికి తట్టుకున్నప్పుడు వళ్లంతా కప్పే చీర చలిని ఆపదా?

ఆమె అన్న ఈ మాటలోనే చలికి సమాధానం కూడా ఉంది. జర్మన్ మహిళలు ఎంత పొట్టి దుస్తులు వేసుకున్నా – ముందు స్టుంప్‌హోజెన్ (లెగిన్స్) ధరిస్తారు. అవి అతిపల్చగా ఉంటాయి. వేసుకుంటే వంటికి పట్టి చర్మం రంగులో కలిసిపోతాయి. చెబితే తప్ప అవి ధరించిన విషయం తెలియదు. అవి ఎంత చలినైనా ఆపుతాయి. వాటి ధర్మమా అని శ్రీమతి చీరకట్టుకి చలి అడ్డంకి కాలేదు.

మా పిల్లలు తెల్లగా మిసమిసలాడుతున్నా – చూడగానే అక్కడివారు కారని తెలిసిపోతుంది.

శ్రీమతి చీరకట్టు. మేము నలుగురం ఏ షాపుకెళ్లినా కొంచెం ప్రత్యేకంగానే కనిపించేవాళ్లం. ఐతే అక్కడివారి సత్సంప్రదాయం – అపరిచితుల్ని కూడా స్నేహపూర్వకమైన చిరునవ్వుతో పలకరించడం. చిన్నపిల్లల్ని చూసి ముచ్చట పడడం.

మేమే షాపుకెళ్లినా ఆ పలకరింపు మాలో బెరుకు పోగొట్టి కొత్త ఉత్సాహాన్నిచ్చేది.

అక్కడ డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో – బిల్కా, హర్టీ, వెర్ట్‌హైమ్, వూల్‌వర్త్, కార్‌స్టాడ్ట్, నెక్కర్‌మన్, క్వెల్లే – ఇవి కొన్ని పేర్లు. ఇంచుమించు అన్ని నగరాల్లోనూ వీటికి బ్రాంచిలుంటాయి.

పిల్లలు రాగానే నేనో రోజు బిల్కా షాపుకి వెళ్లే ప్రోగ్రాం వేశాను. ఆ షాపు రైల్వేస్టేషనుకి దగ్గర్లో ఉంది. వీళ్లు రాకముందు నేనందులోకి చాలాసార్లు వెళ్లాను. అందులో నన్ను బాగా ఆకర్షించింది ఓ కుక్కపిల్ల బొమ్మ. చూడ్డానికి అచ్చం నిజం కుక్కపిల్లలాగే ఉంది. దాని మెడకి చిన్న బెల్టు. ఆ బెల్టుకి తాడులాంటి ఓ గొలుసు. తాడు చివర బ్యాటరీ హోల్డరుంది. దానికి రెండు మీటలు. ఒకటి నొక్కితే కుక్కపిల్ల నోరు తెరచి భౌ భౌ మని మొరుగుతుంది. రెండో మీట నొక్కితే కుక్కపిల్ల తోక ఊపుకుంటూ నెమ్మదిగా ముందుకు నడుస్తుంది. బొమ్మ ఖరీదు 15 మార్కులు.

వచ్చినప్పట్నించి ఆ బొమ్మని ఇప్పటికి ఐదారుసార్లు చూసుంటాను. మా పిల్లలకి చూపించి, వాళ్ల ముఖాల్లో వెలుగులు చూసి ఆనందించాలని కలలు కనేవాణ్ణి.

ఆ కల తీర్చుకుందుకే ఈరోజు వాళ్లనక్కడికి తీసుకెళ్లాను.

మా ఇంటినుంచి నాలుగు నిముషాలు నడిస్తే డాయిచే ఓపర్ అనే ఊ బాన్‌హాఫ్ (మెట్రో స్టేషన్) ఉంది. అదెక్కితే మొదటి స్టాపు నా ఆఫీసుకి దగ్గర్లోని ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్. రెండోది జూ (జంతు ప్రదర్శనశాల). అక్కడే బెర్లిన్ రైల్వే స్టేషనుంది. అక్కడే బిల్కా షాపు కూడా ఉంది.

నేననుకున్నట్లే పిల్లలిద్దరికీ కుక్కపిల్ల బొమ్మ చాలా నచ్చింది. ఐతే వెంటనే కొనలేదు నేను. నెల్లాళ్లపాటు అల్లరి చెయ్యకుండా బుద్ధిగా ఉంటే కొంటానన్నాను.

ఇలాంటి విషయాల్లో మా వాళ్లు చాలా బుద్ధిమంతులు. వెంటనే బుద్ధిగా తలలూపారు.

అక్కణ్ణించి దగ్గర్లోనే ఉన్న హర్టీ షాపుకి వెళ్లాం. అది బిల్కాకంటే కూడా చాలా పెద్దది.

బయట చేతులకి, చెవులకి చలి. లోపలికెళ్లగానే వెచ్చదనం. పిల్లలకి ఈ అనుభవం కొత్తగానూ, సరదాగానూ ఉంది.

అమాయకమైన కళ్లతో పరిసరాల్ని ఆసక్తిగా చూస్తూ వాళ్లు మాతోపాటే నడుస్తున్నారు.

అప్పటికి మాకింకా కుక్కపిల్ల హాంగోవర్ పోలేదు. ఆ బొమ్మ అచ్చం నిజం కుక్కపిల్లలాగే ఉండడం, దాన్ని చూసి పిల్లలు తెగ మురిసిపోవడం, వెంటనే కొనేసి ఉండాల్సిందేమోనన్న ఫీలింగ్సు – ఇలా మాట్లాడుకుంటూ నేను బాబుతో, "ఇందాకా, కుక్కపిల్ల ఏం చేసిందిరా?" అన్నాను ముచ్చటగా.

అంతే!

నిండా మూడేళ్లు లేని బాబు నా చెయ్యి విడిపించుకున్నాడు. నేలపై రెండు చేతులూ, కాళ్లూ ఆన్చాడు. తనూ కుక్కపిల్లలాగే రెండు సార్లు తలూపాడు. తర్వాత ముందుకు నెమ్మదిగా నడిచి ఓ క్షణమాగి భౌ భౌ అన్నాడు.

ఆ క్షణంలో వాణ్ణి చూస్తే – మేము చూసిన బొమ్మే కొంచెం పెద్ద సైజులో ఉందనిపించింది.

వాడలా చేస్తాడని నేనూహించలేదు. చుట్టుపక్కల ఎవరైనా చూస్తారేమోనని కంగారుపడి అటూ ఇటూ చూస్తే అప్పటికే జనం మమ్మల్ని చుట్టుముట్టారు.

నాకూ, శ్రీమతికీ చచ్చేటంత సిగ్గయింది. కానీ అది ఒక్క క్షణమే!

చుట్టూ ఉన్నవాళ్లు మావాళ్లని తెగ ముచ్చటగా చూస్తున్నారు.

ఒక జర్మన్ వనిత వాణ్ణి ఎత్తుకుని, ''వెరీ స్వీట్'' అంది. ఆమె వాణ్ణి దింపీ దింపగానే ఇద్దరి పిల్లల జేబులూ చాక్లెట్లతో నిండిపోయాయి.

షాపులు రాజభవనాల్లో హాల్సులా చాలా పెద్దవి, అమ్మే సరుకులు ప్రతీదీ కళ్లకి కనబడేలా అమర్చి ఉంటాయి. ధరలు వాటిమీదే వ్రాసుంటాయి. అయినప్పటికీ మహాతీర్థంలా కనిపించే ఆ షాపుల్లో ఏ సరుకు ఎక్కడుందో తెలుసుకోవడం అంత సులభం కాదు. కస్టమర్సుకి ఆ విషయమై సాయపడ్డం కోసం ప్రత్యేకంగా కొందరు సేల్స్ బాయ్స్, సేల్స్ గర్ల్స్ ఉంటారు. ఎవరైనా దేనికోసమైనా వెతుకుతున్నట్లు కనబడితే వాళ్లు క్షణాలమీద వచ్చి, ''బిట్టే షోన్'' (యెస్ ప్లీజ్ లాంటిది) అంటారు.

బిట్టే షోన్ అన్నది అక్కడ పలకరింపు.

థాంక్స్ చెప్పినవారికి బిట్టే షోన్ అని బదులివ్వడం నోమెన్షన్ లాంటిది. షాపుల్లో అది మే ఐ హెల్ప్‌యూ అన్న అర్థాన్ని ధ్వనిస్తుంది.

సాధారణంగా మేము షాపులకి వెళ్లేది ఆసక్తికరమైనవి ఏమున్నాయో చూడ్డానికే. ఆ చూడ్డం ఒకోసారి కేవలం కాలక్షేపానికి. ఒకోసారి సర్వేకి.

సర్వే అక్కడ చాలా అవసరం. ధరలు షాపు షాపుకీ మారిపోతుంటాయి. ఒక షాపులో 190 మార్కులున్న టేపు రికార్డరు మరో షాపులో 368 మార్కులు. మిగతా షాపుల్లో ధరలు వీటి మధ్యలో ఉంటాయి.

ఒక షాపులో ఒక ఐటం చవగ్గా ఉంది కదా అని అక్కడ మిగతావన్నీ కూడా చవగ్గా ఉంటాయనుకుందుకు లేదు. ఒకో షాపులో ఒకో ఐటం చవగ్గా ఉంటుంది. అందువల్ల అన్ని వస్తువులూ ఒకే షాపులో కొనేవారికి పెద్దగా నష్టముండదు.

యూరోపియన్ కస్టమర్సుకి మార్కెట్ సర్వేపై ఆసక్తి కానీ, అందుకు సమయం కానీ ఉన్నట్లు అనిపించదు. మేము మాత్రం అన్ని షాపులూ తిరిగి ఎక్కడ ఏది చవగ్గా ఉంటుందో అదే కొనేవాళ్లం. అందువల్ల డబ్బు ఆదా ఒక ప్రయోజనమైతే – క్రమంగా షాపుల తీరు గురించి పూర్తి అవగాహన వస్తుంది.

అలాంటి మేము షాపింగుకి వెడితే – ఇలా అడుగెట్టామో లేదో, అలా ఎవరో ఒకరు 'బిట్టే షోన్' అంటూ వచ్చేసేవారు.

ధరలు సర్వే చేస్తున్నామని చెప్పలేం. ఏమున్నాయో చూస్తున్నామని చెప్పలేం. కానీ వాళ్లని వదుల్చుకోవాలి. అందుకు కొంచెం మొహమాటం. కొంచెం ఇబ్బంది.

అలాగని ఏదో ఒకటి కొనెయ్యలేం కదా – వాళ్లతో డీల్ చెయ్యడానికి క్రమంగా అలవాటు పడ్డాం.

సేల్స్ బాయ్స్‌కీ, సేల్స్ గరల్స్‌కీ మేము బిట్టేషోన్లు అని పేరెట్టుకున్నాం.

ఏ షాపులోనైనా అడుగెట్టినప్పుడు చుట్టూ చూసి బిట్టేషోన్లు దగ్గర్లో లేని చోటకు వెళ్లి సర్వే మొదలెట్టేవాళ్లం.

ఒకసారి అలా సర్వేలో ఉండగా ఎక్కణ్ణించో ఓ బిట్టేషోన్ మా దగ్గరికొచ్చేసింది.

ఏం చెప్పాలా అని ఆలోచిస్తుండగా ఆమె మాతో మాట్లాడకుండా పిల్లలిద్దర్నీ ఒకరి తర్వాత ఒకర్ని ఎత్తుకుని ముద్దులాడింది. ఇద్దరికీ చెరో గుప్పెడు చాక్లెట్లు ఇచ్చింది.

పిల్లలకి నేను 'డాంకే షోన్' (థాంక్యూ వెరీమచ్) అనడం నేర్పాను. ఇద్దరూ నా అనుమతితో చాక్లెట్లు తీసుకుని ఆమెకి డాంకేషోన్ చెప్పారు.

ఆమె మరింత ముచ్చటపడి – ఈసారి వాళ్లిద్దరి జేబులూ చాక్లెట్లతో నింపి వాళ్లతో కబుర్లు మొదలెట్టింది.

''వాళ్లకు జర్మన్ అర్థం కాదు'' అని నేనామెకి చెప్పాను.

''పోనీ ఇంగ్లీషొచ్చా?'' అనడిగిందామె.

మాట్లాడ్డానికి ఇష్టపడరు కానీ చాలామంది జర్మన్సుకి ఇంగ్లీషు బాగా వచ్చు. మా పిల్లలకి ఇంగ్లీషు కూడా రాదని నేను చెప్పగానే, ''ఇంత ముద్దొచ్చే పిల్లలతో సంభాషించలేకపోవడం ఎంత దురదృష్టం?'' అని భారంగా నిట్టూర్చిందామె.

పిల్లలంటే – కుల మత జాతి భాషా భేదం లేకుండా అలరించే ఓ అద్భుతం. మన పెంపకంతో వాళ్లకి కుల మత జాతి భాషా భేదాల్ని పులుముతున్నామని నాకు అనిపించింది.

ఆ తర్వాత ఆమె మాకు ఆ షాపులో చాలాసార్లు కనబడింది. చూడగానే వీళ్లిద్దర్నీ దగ్గరకు తీసుకుని కాసేపు ముద్దులాడేకనే మిగతా పనులు చూసేది. అందువల్ల మాకులాగే చూడ్డానికి మాత్రమే షాపుకొచ్చినవాళ్లకి బిట్టేషోన్ అంతరాయం కాసేపు తప్పేది.

చిన్నా పెద్దా తేడా లేకుండా అక్కడ ఇంచుమించు ప్రతి షాపులోనూ కదిలే మెట్లు (ఎస్కలేటర్లు) ఉన్నాయి.

మా పిల్లలకి ఆ మెట్లు చాలా నచ్చాయి. షాపులో పై అంతస్తుకి వెళ్లాలంటే వాటిమీదే వెళ్లాలనేవారు. పరుగునవెళ్లి వాటిమీద నిలబడేవారు.

నిజం చెప్పాలంటే ఆగకుండా కదిలే ఆ మెట్లమీద ఎక్కి స్థిరంగా నిలబడ్డం పెద్దవాళ్లమైన మాకే అంత సులభం కాదు. ఆ తర్వాత పై అంతస్తుకి చేరేక జాగ్రత్తగా అడుగు తీసి నేలమీద పెట్టేటప్పుడు కూడా తడబడి పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి.

మొదటిసారి ఎక్కేముందు నేను ముందు పాపనీ, తర్వాత బాబునీ పైకి తీసుకెళ్లి అక్కడ నిలబెట్టాను. శ్రీమతికి పక్కనుండి జాగ్రత్తలు చెబుతూ పైకి ఎక్కించాను.

పిల్లలూరుకుంటారా – తనకి తనే మెట్లెక్కుతానని రెండోసారికే పాప పట్టుబట్టింది. ఏమైతే అయిందని సరేనంటే అవలీలగా పైకి చేరిపోయిందది.

అప్పుడు దాని మొహం చూడాలి. తొలిసారి ఎవరెస్టుమీద అడుగెట్టిన టెన్జింగ్ నార్వే ముఖంలో కూడా అప్పుడంత గర్వం కనబడి ఉండదు.

బాబుకి ప్రతి విషయంలోనూ అక్కతో పోటీ. ''నేను, నేను'' అంటూ గొణుగుడు మొదలెట్టాడు.

కొంచెం సంకోచించాను కానీ — ఆ మెట్లమీద ప్రమాదాలేం జరుగవని నమ్మకముంది కాబట్టి – సరేనన్నాను.

ఆశ్చర్యంగా వాడు కూడా అవలీలగా పైకి వెళ్లిపోయాడు. వాడి మొహం కూడా అక్క మొహంలాగే ఉంది.

శ్రీమతి మాత్రం తను మెట్లెక్కుతున్నప్పుడు నన్ను తన పక్కనుండమంది.

''పిల్లల్ని చూసి ధైర్యం తెచ్చుకో'' అన్నాను.

కానీ ఆమె భయం వేరు. కదులుతున్న ఆ మెట్ల మధ్యలో తన చీర ఇరుక్కుంటుందని ఆమె భయం.

తల్లి భయపడుతుంటే పిల్లలకి చాలా గొప్పగా ఉండేది. భయం లేదని ఆమెకి ధైర్యం చెప్పి ఎలా ఎక్కాలో డిమాన్స్ట్రేట్ చేసి చూపిస్తుండేవారు. తను ఇంకా భయపడితే వేళాకోళం చేసేవారు. శ్రీమతి ముచ్చట పడి మరికాస్త భయం నటించేది.

పిల్లల్ని చూసి నేనూ కాస్త ధైర్యం తెచ్చుకుని – శ్రీమతి భయాన్ని వేళాకోళం చేశాను. అంతే – వెంటనే అలిగేసింది.

ఆ అలక నటన కాదు. నిజమని గ్రహించేక – నా పాట్లు మొదలయ్యాయి.

ఇల్లు కట్టడానికి ఏడాది పడుతుంది. కూల్చడానికి ఒక్కరోజు చాలు. అదే అలకైతే రప్పించడానికి క్షణం చాలు. పోగొట్టడానికి ఒకోసారి రోజులు కూడా చాలవు.

ఇలాంటి సందర్భాల్లో ఎవరైనా సరే అక్బర్–బీర్బల్ కథ ఒకటి స్ఫురణకి తెచ్చుకోవాలి.

ఒకసారి అక్బర్ – తను ఎవరి కోరికనైనా తీర్చగలనని అన్నాడు. ''ఎవరి కోరికలైనా తీర్చగలరు, చిన్నపిల్లలవి తప్ప'' అన్నాడు బీర్బల్. తన మాట ఋజువు చేసుకుందుకు తనే చిన్నపిల్లాడిలా నటిస్తానన్నాడు. అక్బర్ సరేననగానే బీర్బల్, ''నాకు ఇప్పుడే పితికిన పాలు గ్లాసుడు కావాలి'' అన్నాడు. అక్బర్ ఓ పాడిఆవుని రప్పించి ఓ గ్లాసునిండా పాలు పితికించి బీర్బల్‌కి ఇచ్చాడు. బీర్బల్ అందులో సగం తాగి, మిగతా సగం పాలనీ మళ్లీ పొదుగులోకి పంపించెయ్యమని ఏడ్చాడు. అక్బర్ తెల్లమొహం వేశాడు.

తల్లిని వేళాకోళం చేసి కూడా సంతోషపెట్టగలగడం చిన్నపిల్లలకి మాత్రమే సాధ్యమైన ఓ కళ.

ఇకమీదట ఆ విషయంలో వాళ్లని అనుకరించకూడదని గట్టిగా అనుకున్నాను.

ఒకసారి నేను కదిలే మెట్లమీద పై అంతస్తు చేరుకున్నాను. చుట్టూ ఉన్న బొమ్మల్ని చూస్తున్న పాప కొంచెం ఆలస్యంగా మెట్లెక్కి మధ్యలో పడిపోయింది. భయమేసిందో ఏమో బ్యారుమని ఏడ్చింది. కంగారు పడ్డం మినహా ఏంచెయ్యాలో నాకు తెలియలేదు.

అంతలో పాప లేచి నిలబడింది. దాని వేళ్లు కానీ మెట్ల సందులో ఇరుక్కోలేదు కదా అని నాకు భయమేసింది.

అది పై అంతస్తు చేరుకోగానే, పైకెత్తి నేలమీద నిలబెట్టాను.

పరీక్షించి చూస్తే కాలి వేళ్లేం నలగలేదు. హమ్మయ్య అనుకున్నాను.

ఇక పాప మళ్లీ అది కదిలే మెట్లు ఎక్కనంటుందని అనుమానించాను. కానీ, తిరిగి క్రింద అంతస్తుకి వెళ్లడానికి ఆ మెట్లే వాడితే మళ్లీ హమ్మయ్య అనుకున్నాను.

మనిషికి మరపు వరం అంటారు. ఆ వరాన్ని పిల్లలు ఉపయోగించుకున్నట్లు మనం ఉపయోగించుకోలేం మరి!

పిల్లలతో వచ్చేవారికోసం షాపుల్లో చాలా సదుపాయాలుండేవి.

షాపుల బయట గుర్రం, ఏనుగు, ఖడ్గమృగం, స్కూటర్, కారు వగైరా బొమ్మలుంటాయి. వాటిమీద ఎక్కి కూర్చుని, దానికి ఉన్న కీహోల్‌లో పది ఫెన్నిగ్సు వేస్తే ఆ బొమ్మ కాసేపు ఊగుతుంది.

చాలామంది పిల్లల్నక్కడ వదిలేసి షాపింగు చేసుకుని వస్తుంటారు.

మాకు మాత్రం పిల్లల్నక్కడ వదిలి వెళ్లే ధైర్యముండేది కాదు. ఐతే పిల్లల్ని అలా చాలాచోట్ల బొమ్మలపై కూర్చోబెట్టి ఫొటోలు తీశాం.

కొన్ని షాపుల్లో పిల్లలకోసం కార్టూన్ సినిమాలు వేసేవారు. పిల్లల్నక్కడ వదిలి షాపింగ్ చేసుకోవచ్చు కానీ, కార్టూన్ పిక్చర్స్ మాకూ కొత్తే. మేమూ కాసేపు వాళ్లతో చూసి వినోదించేవాళ్లం.

మేము పిల్లల్ని సంకోచం లేకుండా ఎక్కువగా వదిలి వెళ్లేది టివి విభాగంలో.

అది 1975. అప్పటికి మన దేశంలో టెలివిజన్లు కొన్ని మహానగరాలకి మాత్రమే పరిమితం. భువనేశ్వర్లో ఐతే టెలివిజన్ లేనే లేదు. ఆ సదుపాయమున్న మహానగరాల్లో కూడా ఒకటే ఛానెల్ వచ్చేది. అదీ రంగుల్లో కాదు – కేవలం తెలుపు నలుపు.

అలాంటిది జర్మనీలో ఒకే షాపులో ఒక పెద్ద హాల్లో వందలాది టివిలు పక్కపక్కనే ఆన్లో ఉండి – రంగురంగుల కార్యక్రమాలు చూపిస్తుంటే వింతగానూ, కొత్తగానూ, కనుల పండువగానూ అనిపించేది. ఒకో టివిలో ఒకో చానెల్. అవి పగలనక, రాత్రనక ప్రసారాలు చేస్తూనే ఉంటాయి.

పిల్లలు వాటిని విడ్డూరంగా చూస్తుంటే మేము షాపింగు చేసేవాళ్లం.

ప్రతి షాపుకీ కెల్లర్ (అండర్‌గ్రౌండ్) విభాగముంటుంది. పప్పులు, మాంసం, బ్రెడ్, కూరలు, అపరాలు వగైరాలన్నీ అమ్మే విభాగాన్ని లెబెన్స్‌మిట్టెల్ అంటారు. చాలా దుకాణాల్లో లెబెన్స్‌మిట్టెల్ కెల్లర్‌లో ఉండేది. మేము వెళ్లే వెర్ట్‌హైమ్ షాపులో కెల్లర్‌లో పెద్ద ఆక్వారియముంది. దాంట్లో రకరకాల చేపలు, జలచరాలు కదులుతుండేవి. పిల్లలు వాటిని చూసి ఎంతో ముచ్చట పడేవారు.

ఆ ప్రాంతాలకు వెళ్లినప్పుడు పనున్నా లేకపోయినా వెర్ట్‌హైమ్‌లో కెల్లర్‌కి వెళ్లడం రివాజయింది. కానీ అది కొన్నాళ్లే.

ఎందుకంటే ఆ నిలువెత్తు నీటితొట్టె నిజానికి ఆక్వారియం కాదు.

అందులో ఉత్సాహంగా కదలాడే ఓ చేపని ఉన్నట్లుండి బయటకు తీసి త్రాసులో వేసి బరువు చూస్తారు. అది కస్టమర్‌కి ప్యాక్ చెయ్యబడుతుంది.

ఒకసారి నేనా దృశ్యం చూశాను. వళ్లంతా వణుకుపుట్టి శ్రీమతికి చెప్పి బాధపడ్డాను. పాప వింటోందని గమనించలేదు. దానికి విషయం తెలిసిపోయి ఆ చేపల్ని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చింది.

ఆ తర్వాతనుంచి పాప ఆక్వారియం చూడ్డానికి పెద్దగా ఇష్టపడలేదు. నాక్కూడా ఆ నీళ్ల తొట్టిలోని చేపలు – ఉరిశిక్ష విధించబడ్డ ఖైదీల్లా కనబడేవి.

***

మన సంప్రదాయం గొప్పది. సంస్కారమూ గొప్పది. నడిరోడ్డుమీద మర్చిపోయిన కాసుల మూట – పోగొట్టుకున్నవాడు మళ్లీ వెనక్కి వచ్చి చూసుకునేదాకా అక్కడే ఉండేదట అశోకుడి కాలంలో.

సుపరిపాలనకోసం రాజు నియమాల్ని విధిస్తే – వాటిని పాటించడంలో ఖచ్చితంగా ఉండడం పౌరుల బాధ్యత అన్న సందేశాన్ని అందించే కథలు అశోకుడికి చాలాకాలం ముందే మనకి ప్రచారంలో ఉన్నాయి. అలాంటిదే శంఖుడు, లిఖితుడు అనే సోదరుల కథ.

శంఖుడు అనే ముని తన ఆశ్రమంలో తపస్సు చేసుకునేవాడు. ఒకసారి ఆయన తమ్ముడు లిఖితుడు ఆయన్ని చూడ్డానికొచ్చేడు. అప్పటికి శంఖుడు ఆశ్రమంలో లేడు. లిఖితుడికి ఆకలేసి ఆ పరిసరాల్లో ఉన్న చెట్టునుంచి పండు కోసుకుని తిన్నాడు.

కాసేపటికి శంఖుడు వచ్చేడు. జరిగింది తెలిసేక, ''అడక్కుండా పండు కోసుకుని తిన్నావు. అది దొంగతనం కిందే వస్తుంది. నువ్వు సమీపంలో ఉన్న రాజు సుద్యుమ్నుడి వద్దకి వెళ్లి నీ తప్పు ఒప్పుకుని తగిన శిక్ష అనుభవించి వెనక్కి రా'' అని శంఖుడు తమ్ముణ్ణి ఆదేశించాడు.

అలా వెళ్లిన లిఖితుడు సుద్యుమ్నుణ్ణి కలుసుకుని విషయం చెప్పాడు.

ఆమాత్రం దానికి శిక్షేమిటని రాజు ముందు ఒప్పుకోలేదు. కానీ లిఖితుడు పట్టుబట్టేసరికి తప్పనిసరై – అప్పటి శిక్షాస్మృతి ప్రకారం అతడి రెండు చేతులూ నరికించాడు.

మొండి చేతులతో ఆశ్రమానికి తిరిగొచ్చిన లిఖితుణ్ణి చూసిన శంఖుడు, ''ఇప్పుడు నీకు దొంగతనం చేసిన పాపం పోయింది'' అంటూ అభినందించి సమీపంలో ఉన్న నదికి తీసుకెళ్లి స్నానం చెయ్యమన్నాడు. స్నానం ఆయ్యేసరికి లిఖితుడికి తన చేతులు మళ్లీ వచ్చేశాయి. బాహువుల్ని ఇచ్చింది కాబట్టి ఆ నదికి బాహుద అని పేరొచ్చింది. ఆ నది ఇప్పటికీ అదే పేరుతో ఆంధ్ర–ఒడిషా సరిహద్దు ప్రాంతంలో ఉంది.

"మనది కాని వస్తువుని అడక్కుండా తీసుకోవడమే దొంగతనమని మన పూర్వీకులు స్పష్టంగా చెప్పారు. కాలాన్ని బట్టీ, ప్రాంతాల్ని బట్టీ శిక్షల స్థాయి మారొచ్చు కానీ – దొంగతనం మాత్రం శిక్ష అనుభవించాల్సిన నేరమే!" అన్నది ఈ కథ చెప్పే నీతి.

'ఒక పండు కోసుకుంటే చేతులు నరికేస్తారా? మరీ అంత పెద్ద శిక్షా?'అని కొంతమందికి అనిపించొచ్చు.

ఐతే – అప్పట్లో లిఖితుడికి చేతులు నరికేస్తే నది చేతులు వెనక్కిచ్చింది.

హరిశ్చంద్రుడు భార్యమీద కత్తిని ఎత్తితే, ఆ కత్తి పూలమాలగా మారింది.

సీతాదేవి అగ్నిప్రవేశం చేస్తే అగ్నిదేవుడే చల్లబడిపోయాడు.

శిక్షని వెనక్కి తీసుకునే అవకాశముంది కాబట్టి ఆ రోజుల్లో శిక్షలు కఠినంగా ఉండేవి. తర్వాత వెనక్కి తీసుకున్నా అనుభవానికి కఠినం కాబట్టి జనం కూడా నేరాలు చెయ్యడానికి బాగా వెనుకాడేవారు.

ఇప్పుడున్న పరిస్థితుల్ని బట్టి శిక్షలకు కూడా మోతాదు తగ్గింది. ఇది జనస్వామ్యం కాబట్టి – నేరం చేసినవారు నేరుగా బాధితులవద్దకి వెళ్లి క్షమాభిక్ష అడగాలి. వాళ్లు క్షమించనప్పుడు – న్యాయస్థానాల్లో లొంగిపోవాలి.

కానీ ఎందుకో ఇంత గొప్ప సంప్రదాయాన్ని జనం అనుసరించడం లేదు. 'కుడి ఎడమల దగా దగా దగా' అని మహాకవులు ఆక్రోశించే మేరకు పడిపోయాయి వ్యక్తిత్వపు విలువలు.

నియమపాలనలో, నిజాయితీలో జర్మను పౌరుల నిబద్ధతని చూసినప్పుడు – నన్నీ చేదు నిజం – ఒకటి కాదు, రెండు కాదు –పలు సందర్భాల్లోనే బాధించింది.

అప్పట్లో మన వంటలకు అవసరమైన దినుసులన్నీ జర్మనీలో దొరికేవి కాదు. ల్యూనబర్గులో ఉండగా నేను సంపాదించిన హ్యాంబుర్గ్‌లోని ఓ దుకాణం చిరునామా నాకప్పుడెంతో సహకరించింది. ఇడ్లీ రవ్వ లేకపోయినా, చింతపండుతో సహా ఎన్నో దినుసులు ఆ షాపులో దొరికేవి. నేను, శ్రీమతి కలిసి జాబితా వేసుకుని వాళ్లకి ఉత్తరం వ్రాసేవాళ్లం. వాళ్లు పార్సెల్ లాబొరేటరీ చిరునామాకి పంపేవారు.

అలా మొదటి పార్సెల్ వచ్చినప్పుడు పోస్ట్‌మన్ ఆఫీసులో నన్ను కలుసుకుని, "నీకు పార్సెలొచ్చింది. ముప్పై మార్కులిస్తే రేపు పార్సెలు తెచ్చిస్తాను" అన్నాడు.

సరేనని నేను డబ్బిస్తే మారు మాట్లాడకుండా డబ్బు తీసుకుని వెళ్లిపోయాడు. రసీదివ్వలేదు.

తను పోస్టుమన్ ఔనో కాదో తెలియదు. నేను తనకి డబ్బిచ్చినట్లు సాక్ష్యం లేదు. ఎవరికైనా చెబుదామంటే మొహమాటం.

పార్సెలిచ్చి డబ్బు తీసుకోవచ్చుగా ఇలా చేశాడేంటీ అనుకున్నాను. నేను కనుక మోసపోతే – నా జర్మన్ మిత్రులకి చెప్పుకుని, నిజాయితీ విషయంలో బలహీనతల్ని జయించలేకపోవడం ఇక్కడా మామూలేనా అందామనుకున్నాను.

ఇంటికెళ్లేక శ్రీమతికీ విషయం చెబితే, "అయ్యో! ముప్పై మార్కులు పోయాయి. ఎవరు తిన్నట్లూ!" అని బాధ పడింది.

"అప్పుడే పోయిందనెయ్యకు" అని శ్రీమతిని మందలించాను కానీ – ఆ రాత్రంతా నేను నా తెలివి తక్కువతనం గురించి మనసులో మథనపడి, ఇకముందు ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలనుకున్నాను.

ఐతే మర్నాడు పోస్టుమన్ పార్సెల్ తెచ్చి నాకిచ్చి వెళ్లిపోవడంతో – నా అనుమానానికి నేనే కించపడ్డాను.

ఇది అవతలి వ్యక్తిపై మనం ఉంచుకోవాల్సిన నమ్మకానికి సంబంధించిన ఒక అనుభవం.

అంతకంటే విశేషం – వ్యాపారులు మనపై ఉంచే నమ్మకం...

అక్కడ కొందరు రోడ్లపక్కన గుడ్డలు పరిచి సరుకులు అమ్ముతుంటారు. ఉదాహరణకి ఒకచోట ఓ గుడ్డమీద వందల బాల్‌పెన్సు ఉన్నాయి. అమ్మే వ్యక్తి లేడు. పెన్ను ఒకొక్కటి ఒక మార్కు అని వ్రాసిపెట్టిన చిన్న బోర్డు ఉంది. డబ్బులు వెయ్యడానికి ఒక డబ్బా ఉంది. కావలసినవాళ్లు వచ్చి పెన్నులు తీసుకుని డబ్బులు డబ్బాలో వేసి వెళ్లిపోతున్నారు.

ఈ విషయం నేను హైనర్ డెకర్ట్ దగ్గర ప్రస్తావించి, ''ఎవరైనా పెన్ను తీసుకుని డబ్బు వెయ్యకపోతే – వ్యాపారికి నష్టం కదా!'' అన్నాను.

''డబ్బు వెయ్యకుండా పెన్ను తీసుకున్నవాడు దొంగ ఔతాడు. దొంగ అనిపించుకోవడం ఏ మనిషికి ఇష్టముంటుంది? అందుకే అక్కడ ఎన్ని పెన్నులు తరిగాయో అన్ని మార్కులూ డబ్బాలో ఉంటాయని ఘంటాపథంగా చెప్పగలను'' అన్నాడు హైనర్.

చుర్రుమంది నాకు. ''అంటే మీ దేశంలో దొంగలు లేరా? దొంగతనాలు జరుగవా?'' అన్నాను.

''నేరప్రవృత్తి లేని మనుషులు ప్రపంచంలో ఎక్కడా ఉంటారనుకోను. ఐతే నేరం చెయ్యడానికి బలమైన కారణమో, గొప్ప ప్రయోజనమో ఉండాలి. దొంగతనమే చెయ్యాలనుకో – ఏ బ్యాంకు దోపిడీనో ప్లాన్ చేసి సాధిస్తే జీవితమే మారిపోతుంది. ఒక్క మార్కుకి కక్కుర్తి పడి దొంగ అనిపించుకోవాలని ఎవరికీ ఉండదు'' అన్నాడు హైనర్.

అతడు చెప్పింది సబబుగానే ఉంది కానీ, మన దేశంలో విద్యాధికుల్లో కూడా ఇలా ఆలోచించేవారు బాగా తక్కువని నాకు తెలుసు.

ఆఫీసులో ఉద్యోగులకని కేటాయించిన స్టేషనరీని సేకరించి షాపుల్లో విక్రయించుకునే ఉద్యోగులు తెలుసు నాకు. ఆఫీసు సదుపాయాల్ని స్వంతానికి ఉపయోగించే సైంటిస్టులూ తెలుసు.

అలా ఎవరైనా మన దేశంలో పెన్నులు గుడ్డమీద పరచి వెళ్లిపోతే – తిరిగొచ్చి చూసుకునే సమయానికి డబ్బుల మాట దేవుడెరుగు – మొత్తం పెన్నులన్నీ గుడ్డతో సహా మాయం కావడం తథ్యం.

ఐనా ఈ పద్ధతిలో లోపాన్ని ఎత్తి చూపాలనిపించింది. ''వ్యాపారం చేసుకునేవాడికి అంత బద్ధకం కూడదు. అమ్ముకునేటప్పుడు దగ్గరుండి కస్టమరుతో మాట్లాడ్డం అవసరం కదా!'' అన్నాను.

హైనర్ నవ్వి, ''నువ్వన్నది నిజమే కానీ – ఈ విషయంలో అది సరి కాదు. పెన్నుల గురించి కస్టమరుకి వివరించాల్సిందేం లేదు. ధర విషయంలో బేరం లేదు. వ్యాపారి అక్కడే కూర్చుంటే ఆ సమయం వృథా. అతడు పెన్నులక్కడ పరిచి వెళ్లి వేరే పని చేసి డబ్బు సంపాదించుకుంటాడు. తన అవసరాలు తీరడానికి పెన్నుల వ్యాపారం ఒక్కదానిమీదనే ఆధారపడలేదు కాబట్టి, వాటిని కాస్త తక్కువ లాభానికే అమ్ముతాడు. నువ్వు గమనించే ఉంటావు. అలాంటి చోట దొరికే వస్తువులు, దుకాణాల్లో కంటే బాగా చౌకగా ఉంటాయి'' అన్నాడు.

నిజమే – జనంలో నిజాయితీ ఉంటే – అటు వ్యాపారులకూ, ఇటు జనానికీ కూడా లాభమే!

వేల సంవత్సరాల క్రితమే మనవాళ్లు ఆధునిక విజ్ఞానాన్ని ఔపోసన పట్టేరని గొప్పగా చెప్పుకుని మురిసిపోతుంటాం. కానీ ఏమైంది ఆ విజ్ఞానం? ప్రస్తుతం అది పాశ్చాత్యదేశాల అధీనంలో ఉండి మన దేశంలో అతి సామాన్యులకి కూడా ఉపకరిస్తోంది.

శంఖుడు–లిఖితుడు వేల ఏళ్ల క్రితం నెలకొల్పిన గొప్ప సంప్రదాయం కూడా ఇప్పుడు మనని వదిలి పాశ్చాత్య దేశాలకు వెళ్లిపోయిందా?

ఏదేమైనా – మనం కూడా నిత్యజీవితంలో కనీసం చిన్న చిన్న వాటికి కక్కుర్తి పడకుండా ఉంటే ఎంత బాగుణ్ణు – అనిపించింది.

అలా అనుకున్నాను కానీ – ఆచరణలో అదెంత దుస్సాధ్యమో గ్రహించడానికి నేనే సాక్ష్యం.

ఒకసారి ఓ షాపులో రీఛార్జబుల్ బ్యాటరీలైట్ చూసాను. అది ప్లగిన్ చేసి ఆరేడు గంటలు చార్జి చేస్తే కొన్ని గంటల సేపు మామూలు బ్యాటరీ లైటులా పని చేస్తుంది. ధర ఏడు మార్కులే. అప్పట్లో అలాంటివి కొత్త. బాగుందని ఒకటి కొన్నాం. పగలంతా ఛార్జి చేసి రాత్రిళ్లు వాడుకునేవాళ్లం దాన్ని. అది బల్లమీద ఉండగా మా పిల్లలు ఏవో ఆటలాడుతూ దాన్ని క్రింద పడేశారు.

అంతే – అది పని చెయ్యడం మానేసింది.

ఆ బ్యాటరీలైటుకి ఆర్నెల్ల గ్యారంటీ ఉంది. షాపుకి తీసుకెళ్లి చూపించాం. షాపతను దాన్ని పరీక్షించి, ''దీన్ని కిందగానీ పడెయ్యలేదు కదా!'' అన్నాడు.

నేను క్షణం కూడా ఆలోచించలేదు. అప్రయత్నంగా, ''లేదు'' అన్నాను.

షాపతను వెంటనే, దాన్ని ఓ పక్కన పెట్టి, కొత్త బ్యాటరీలైటిచ్చి, ''ఈరోజునుంచి దీనికి ఆర్నెల్లు గ్యారంటీ'' అంటూ ఓ కాగితం కూడా రాసిచ్చాడు.

తెల్లబోయాను. కొంచెం సిగ్గేసింది కూడా.

నేను కింద పడలేదంటే, అతడు ఒప్పుకోడనీ – పడేసే ఉంటారు, పడెయ్యకుండా ఇలా ఎందుకౌతుందనీ వాదిస్తాడనుకున్నాను. దాన్ని మరమ్మతు చేసి కొంత ఛార్జి కూడా చేస్తాడనుకున్నాను. కింద పడిపోయినందుకే పాడైపోతే ఎలా అని తప్పు పట్టాలనుకున్నాను. గ్యారంటీ పీరియడ్లో కూడా మరమ్మతుకి ఛార్జి చెయ్యాలా అనాలనుకున్నాను.

అలా జరిగుంటే నాకు తృప్తిగా ఉండేది. కానీ అనాలోచితంగా, అలవాటులో పొరపాటుగా నేను చెప్పిన అబద్ధాన్ని – ఒక్క ప్రశ్న కూడా వెయ్యకుండా నమ్మేసి, కొత్త బ్యాటరీలైటిచ్చేసరికి దెబ్బతిన్నాను.

'ఏ బ్యాంకు దోపిడీనో ప్లాన్ చేసి సాధిస్తే జీవితమే మారిపోతుంది. చిన్న మొత్తాలకి కక్కుర్తి పడి దొంగ అనిపించుకోవాలని ఎవరికీ ఉండదు' అన్న హైనర్ మాటలు చెవుల్లో గింగురుమని నా వ్యక్తిత్వాన్ని నిలదీశాయి.

అప్పటికప్పుడు నిజం చెప్పేద్దామా అనిపించినా – అది సమయం కాదనిపించి ఊరుకున్నాను.

ఐతే అది నాకు జీవిత కాలానికి సరిపడ్డ గుణపాఠం.

సంస్కారం రాణించడంలో సత్సాంగత్యం పాత్ర నాకు మరోసారి అవగాహనకు వచ్చింది.

జర్మనీలో నిజాయితీకి సంబంధించి వ్యాపారపరంగా చెప్పుకోతగ్గ మరో విశేషం – డిస్కౌంట్ సేల్సు!

ఆషాఢమాసమనీ, సంక్రాంతి–దసరా–దీపావళి వగైరా పండుగలనీ – మనవైపు ముఖ్యంగా బట్టల దుకాణాల్లో డిస్కౌంట్‌మీద అమ్మకాలు ప్రకటించేవారు. అప్పట్లో వంద రూపాయల చీరని సగానికి సగం తగ్గించి యాభై రూపాయలకిస్తున్నారంటే – ఆడవాళ్లు వాటికోసం ఎగబడేవారు. సాధారణంగా అందులో మోసముండేది. నలభై రూపాయల చీర ధర వందకి పెంచి – 50% శాతం డిస్కౌంటని చెప్పి యాభైకి అమ్మితే – అవి చకచకా అమ్ముడుపోవడమే కాక, వ్యాపారికి మునుపటికంటే పది రూపాయలు అదనపు లాభం కూడాను.

ఇది నేను మాత్రమే గ్రహించిన పరమసత్యమేం కాదు. కొనేవాళ్లకి కూడా ఆ అనుమానముండేది. కానీ చాలామందికి డిస్కౌంటు కూడా విస్కీ బ్రాందీల్లాంటి నిషానిస్తుంది. ఆరోగ్యానికి హాని అని తెలిసీ – ఆల్కహాలు పుచ్చుకున్నట్లే – మోసపోతున్నామని తెలిసీ డిస్కౌంటుకి లోబడిపోవడం అదో బలహీనత.

ఇది వ్యాపారులకు బాగా తెలుసు. అందుకే మద్యం దుకాణాలూ, డిస్కౌంటు ఆఫర్లూ అలా అలా పెరిగిపోతున్నాయి.

కానీ జర్మనీలో మాత్రం నాకు ఈ డిస్కౌంట్ సేల్సులో గొప్ప నిజాయితీ ఉందనిపించింది.

ఇక్కడ ప్రతి దుకాణంలోనూ తప్పనిసరిగా ఏదో ఒక వస్తువుకి ఏదో ఒక సమయంలో సోండర్ అన్‌గెబోట్ (స్పెషల్ ఆఫర్) ఉండేది. అందుకు – జనాలకి కొత్త ఐటమ్సుని పరిచయం చెయ్యడమో, అమ్ముడుపోని పాతవాటిని చెల్లగొట్టడమో, ఏది కొనాలా అన్న కన్ఫ్యూజన్ సందిగ్ధాన్ని తమ సరుకువైపు మళ్లించడమో – ఇలా అనేక వ్యాపార కారణాలుండొచ్చు. ఎటొచ్చీ ఏ సరుకుకి ఎప్పుడు స్పెషల్ ఆఫర్ వస్తుందో ఎన్నాళ్లుంటుందో – జనాల ఊహకందదు.

ఉదాహరణకి మేము జర్మనీలో ఉన్నది కాసెట్ టేపుల యుగం. వాటికి బాగా గిరాకీ ఉండేది.

మేము ఎక్కువగా ఎక్స్‌క్లూజివ్ అనే కంపెనీ కాసెట్లు వాడేవాళ్లం. అరవై నిముషాలు నడిచేది ఒక మార్కూ తొంబైఐదు ఫెన్నిగ్సుంటే, తొంబై నిముషాలది మరో మార్కు ఎక్కువకి లభించేది. అవే కాసెట్లు – బిఎఎస్ఎఫ్, ఆగ్ఫా వగైరా పెద్ద కంపెనీలవైతే 9–12 మార్కులవరకూ ఉండేవి.

ఒకసారి మేము ఓ దుకాణంలో తిరుగుతుండగా – బిఎఎస్ఎఫ్ కాసెట్లకు 2–3 మార్కుల పరిధిలో స్పెషల్ ఆఫరొచ్చింది. వాటిమీద పాత ధర అలాగే ఉంచి పక్కనే కొత్త ధర స్టిక్కర్లు అతికించారు.

మాకైతే స్వంతానికే కాక ఇండియాలో తెలిసినవారికి కూడా ఈ కాసెట్లు కొని తీసుకువెళ్లాల్సి ఉంది. ఎందుకంటే అప్పట్లో ఇండియాలో కాసెట్లు 40–50 రూపాయలుండేవి. విదేశీ మారకంలో జర్మన్ మార్కు విలువ మూడు రూపాయలకి కాస్త అటూ ఇటూ ఉండేది.

అందుకని ముందు జేబులోని డబ్బు లెక్క చూసుకుని ఓ డజను కాసెట్లు కొన్నాను. ఇంటికెళ్లి చూస్తే వాటి నాణ్యత చాలా గొప్పగా ఉంది. దాంతో మర్నాడే బ్యాంకునుంచి డబ్బు తీసుకుని మొత్తం 60 కాసెట్లు కొనేశాం.

వెంటనే ఈ విషయం ఇండియన్ మిత్రుడు గుప్తాకి చెప్పాను. అతగాడు వెంటనే తన చుట్టుపక్కల దుకాణాలకు వెళ్లి వాకబు చేశాడు. ఎక్కడా ఇలాంటి ఆఫర్ లేదుట.

"పోనీ, ఇక్కడ నీకోసం పదో ఇరవయ్యో కాసెట్లు తీసుకోనా?" అనడిగాను.

స్నేహితులకోసమే ఐనా మా ప్రాణాలకి నలభై మార్కుల తాత్కాలిక పెట్టుబడి ఎక్కువేనని తటపటాయించాడో ఏమో – అతగాడు, "వద్దులే, నాలుగు రోజుల్లో నాకే అటొచ్చే పనుంది. అప్పుడు నువ్వూ నాతో వచ్చి అక్కడికి తీసుకెళ్లు" అన్నాడు.

కానీ నాలుగు రోజులయ్యేసరికి ఆ ఆఫరైపోయింది. దుకాణంలో అవి యథాస్థానంలోనే ఉన్నప్పటికీ వాటిమీంచి తగ్గింపు ధర స్టిక్కర్లను చింపి వెయ్యడం జరిగింది.

అప్పుడు గుప్తా, "ఇలాంటి విషయాల్లో నీకున్న చొరవ నాకు లేదు. అన్నేసి కాసెట్లు ఒక్కసారి కొనడం ఎంతవరకూ సమంజసం అన్న మీమాంసలో ఉన్నాను. అదయ్యేసరికి ఆఫరైపోయింది" అని వాపోయాడు.

మాకు మాత్రం – నాలుగు రోజులముందు రెండు మార్కులకి కొన్నవి ఇప్పుడు కళ్లెదుటే మళ్లీ పది మార్కుల స్టిక్కరంటించుకుని మెరుస్తుంటే – కలా, నిజమా అన్నట్లుంది. ఆఫర్‌లోని నిజాయితీ కూడా సుస్పష్టమయింది.

ఆ తర్వాత మూడు వారాలకి కాబోలు ఓ మధ్యాహ్నం గుప్తా నాకు ఫోన్ చేశాడు.

మామూలుగా 199 మార్కులుండే రోలై కంపెనీ స్లైడ్ ప్రొజెక్టరు 69 మార్కులకే స్పెషల్ ఆఫర్లో ఉందిట. ఒక్కసారి వంద స్లైడ్సు లోడ్ చేసే సదుపాయమున్న ఆ ప్రొజెక్టరు కొనాలని మేమిద్దరం చాలా కాలంగా అనుకుంటున్నాం కాబట్టి ఇది మంచి అవకాశమనీ వెంటనే ఆ షాపుకొచ్చి తనని కలుసుకోమనీ అన్నాడు.

కాసెట్ల విషయంలో అనుభవమైంది కాబట్టి ఆలస్యం చెయ్యకూడదనుకున్నాను. బాంకుకి వెళ్లి డబ్బు తీసుకుని వస్తానంటే – ''అవసరం లేదు. బెర్లినర్ డిస్కోంటో బ్యాంకు బ్రాంచి ఆ షాపుకి దగ్గర్లోనే ఉంది. నువ్వు పాస్‌బుక్ తెచ్చుకొస్తే చాలు – డబ్బు అక్కణ్ణించే విత్‌డ్రా చేసుకోవచ్చు'' అన్నాడు గుప్తా.

ఒక బ్రాంచిలో అకౌంటుంటే – మరో బ్రాంచినుండి డబ్బు తీసుకునే సదుపాయం ఉంటుందంటే నమ్మశక్యం కాలేదు. గుప్తా చెప్పింది నిజమేనని తేలేక – ఆ రోజులకి అదో అద్భుతంగా అనిపించింది. ఆ ప్రొజెక్టర్లో మా కెమేరాలో తీసిన స్లైడ్సు పెట్టి మా ఇంట్లో మమ్మల్ని గోడమీద బొమ్మలుగా చూసుకోవడం – అదింకా గొప్ప అనుభూతి. తర్వాత కొద్ది రోజులకే ఆ ప్రొజెక్టరు మళ్లీ 199 మార్కులు ఐపోతే – మా ఇంటికొచ్చిన చాలామంది ఆ ప్రొజెక్టరుని మేము ఎంతకు కొన్నామో తెలుసుకుని గుండెలు బాదుకున్నప్పుడు కలిగినది అదింకో రకం అనుభూతి. ఆఫర్ల నిజాయితీకి మరో మెచ్చుతునక.

ఇవన్నీ నిజమైన స్పెషల్ ఆఫర్స్. అలా కాకుండా – అక్కడి షాపుల్లో ప్రతి ఏటా జనవరి, జూలై లలో ఆఖరువారం 'ఫ్లుస్ పెర్‌కౌఫ్ (క్లియరెన్స్ సేల్స్) ఉంటాయి. అవి రెండువారాల పాటు నడుస్తాయి. జనవరిలో వింటర్ క్లియరెన్స్ సేల్. జూలైలో సమ్మర్ క్లియరెన్స్ సేల్.

అప్పుడు చాలా ఐటమ్స్ బాగా చవగ్గా దొరుకుతాయి. వంద మార్కులుండే ఐటమ్ పదిహేను మార్కులకి కూడా దొరకొచ్చు. ఆ సమయంలో మేము చాలా ఉత్సాహంగా షాపింగు చేసేవాళ్లం.

ఎప్పుడూ సూట్ వేసుకోని నాచేత ఒకటికి మించి సూట్లు కొనిపించినవి ఈ క్లియరెన్సు సేల్సే. ఎందుకంటే అప్పట్లో ఇండియాలోనే సూట్ కుట్టు కూలి 150–200 రూపాయలుండేది. అంటే మార్కుల్లో 50–70. అలాంటిది రెడీమేడ్ సూట్ కుట్టుకూలితో సహా పది–ఇరవై మార్కులంటే ఆశ పుడుతుంది కదా. కోటు వేసుకోకుండా ఉత్త పాంటు వాడుకున్నా చవకే అది. పైగా ఆ పాంటుకి అదనంగా ఓ బెల్టు కూడాను. అందుకే ఇరవై మార్కులవి నాలుగు సూట్లు, పది మార్కులది ఓ సూటు కొన్నాను. అన్నీ పది మార్కులవే కొనేవాణ్ణి కానీ – నా సైజువి ఎక్కువ లేవు. పోనీ ఎవరికైనా ఇవ్వచ్చునని ఇంకా కొనేవాణ్ణేమో కానీ – పెట్టెల్లో అవి చాలా స్థలాన్ని ఆక్రమిస్తాయని ఆగాను. అంత చవగ్గా ఎలా ఇస్తారో తెలియదు కానీ – ఈ క్లియరెన్స్ సేల్సు ఎక్కువగా బట్టలకే వర్తించేది.

బట్టలు అంత చవగ్గా ఎలా ఇస్తారని మా ఇండియా మిత్రులం చాలా చర్చించాం. ఆ రహస్యం అంతుపట్టలేదు. చివరికి నేను హైనర్ని అడిగాను. అతడు నవ్వి, ''నేనూ సరిగ్గా చెప్పలేను కానీ – ఈ క్లియరెన్సు సేల్సు బట్టలు బ్రాండెడ్‌వి కాదు. వీటికి ఈ క్లియరెన్స్ సేల్సే ఓ బ్రాండు. వీటిని ప్రత్యేకంగా ఈ సేల్సుకోసమే కుట్టిస్తారు. మహా భారీగా తయారు చేయించడంవల్ల – బహుశా ఇవి అంత చవగ్గా వస్తూండవచ్చు'' అన్నాడు.

అంటే నిజానికివి క్లియరెన్స్ సేల్స్ కావు. జనతా దుస్తుల్లాంటివి అనుకోవాలి.

ఏదేమైనా ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని – పిల్లలకు డ్రెస్సులూ, శ్రీమతికి చీరలూ కూడా ఆ సమయంలో కొన్నాం. చీరలంటే – జర్మన్ మహిళలు స్కర్టు కోసమని వాడే పోలీఎస్టర్ గుడ్డలు చీర పన్నాలో ఉండేవి. శ్రీమతి తనకి నచ్చిన స్కర్టు గుడ్డల్ని ఐదేసి మీటర్లు కొనుక్కుని చీరలుగా వాడుకునేది.

వీటి విషయం అలా ఉంచితే....

జర్మనీ సంపన్న దేశమే కావచ్చు. కానీ అక్కడ పెద్ద చదువులకు విశ్వవిద్యాలయాలదాకా వెళ్లేవారు తక్కువ.

నేను పిహెచ్‌డి చేశానని నన్నక్కడ సామాన్య పౌరులు చాలా గౌరవించేవారు. షాపుల్లో కూడా నా చిరునామా వ్రాయాల్సొచ్చినప్పుడు నాకు ప్రత్యేక గౌరవం లభించేది.

మొదట్లో నాకది గౌరవంగానే ఉన్నా – తర్వాత ఓ గొప్ప నిజం గ్రహించాను. మనం ఎంత పెద్ద చదువు చదివినా అది జ్ఞాన సముపార్జనకోసం కాదు. ఉద్యోగం కోసం. ప్రొఫెషనల్ కోర్సులు చదివినవారు కూడా గవర్నమెంటు ఉద్యోగాలకోసం ప్రాకులాడే దేశం మనది. హిస్టరీ చదివి బ్యాంకు ఉద్యోగం చేస్తున్నవాళ్లూ, ఎలక్ట్రానిక్సు చదివి ఐయేయస్ ఐనవాళ్లూ నాకు తెలుసు.

నాకున్న స్వల్ప పరిచయంలో నేను గ్రహించినదేమిటంటే – ఇక్కడ విద్యాధికులు తమ చదువు రాణించే పనులే చేస్తుంటారు. కానీ అధిక సంఖ్యాకులు మెట్రిక్‌తోనే చదువుకి స్వస్తి చెప్పి తమ అభిరుచుల మేరకు ప్రొఫెషనల్ ట్రయినింగ్ తీసుకుంటారు. ఆ శిక్షణతో బ్రతుకు తెరువు వెతుక్కుంటారు. ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడే తత్వమే తప్ప ఉద్యోగాలకోసం ప్రాకులాడేవారు తక్కువ.

ఒకప్పుడు వృత్తులు కులాలతో ముడిపడి ఉన్నప్పుడు మన దేశంలో నిరుద్యోగ సమస్య లేనే లేదుట. ఇప్పుడు వృత్తులు పోయి కులాలొక్కటే మిగిలేక – ఎవరైనా నిలబెడితే తప్ప మనిషి తన కాళ్లమీద తాను నిలబడలేని పరిస్థితి ఎర్పడింది మన దేశంలో.

ఇదంతా ఎందుకు స్ఫురించిందంటే – చాలా షాపులకి వెళ్లినప్పుడు షాపులముందు కొందరు వ్యక్తులు కనబడేవారు. వారు గృహోపకరణాలే కాక, నేడు నిత్య జీవితంలో ఉపయోగపడే చిన్న చిన్న వస్తువులు స్వయంగా తయారు చేసి అమ్మేవారు. అలా మేము ఒకతని వద్ద ఆగ్గిపెట్టె సైజు కుట్టుమిషను ఐదు మార్కులకి కొన్నాం. దాంతో దుస్తులకు అంచులు వెయ్యడం, చిరుగులకు మాసికలు వెయ్యడం ఎంతో సులభంగా ఉండేది. ఒక రోజు నేను చూస్తుండగా అతగాడు కనీసం వంద కుట్టుమిషన్లు అమ్మాడు.

ఇండియాలో షాపుకి వెడితే చీరల ఎంపికలో శ్రీమతి నా సాయం తీసుకునేది. నా సెలక్షన్ గొప్పగా ఉంటుందని నేనే అనుకోను కానీ – పాపం తను నా అభిరుచికే ప్రాధాన్యం ఇచ్చేది. ఎవరైనా తను కట్టిన చీరలో వంకలెన్నితే – ''మావారి సెలక్షన్. నాకు నచ్చింది'' అని మరి వ్యాఖ్యలకు తావిచ్చేది కాదు.

పాపం – తనకీ – నా దుస్తుల ఎంపిక చెయ్యాలనుంది. అందుకని రెడీమేడ్ దుకాణానికి వెడదామనేది.

కానీ మనదంతా లెక్కల వ్యవహారం కదా –

''గుడ్డ కొని కుట్టించుకుంటే చౌక పడుతుంది. రెడీమేడ్‌లో దానికి కనీసం రెట్టింపు ఎక్కువౌతుంది. ఫిటింగు విషయంలో సద్దుకుపోవాలి'' అని తన ముచ్చటపై నీళ్లు చల్లేశాను.

తను ముఖం మాడ్చుకుంటే, ''పోనీ, కుట్టడానికే గుడ్డ నువ్వు సెలక్ట్ చేయ్'' అని తనని ప్రోత్సహించాను.

''మేమైతే కొన్న చీరని ఇంకే మార్పులూ లేకుండా వంటికి చుట్టబెట్టుకుంటాం. మీ బట్టలు అలా కాదు. గుడ్డ చూస్తే ఒకలా, కుట్టేక ఇంకొకలా! ఐనా – 'మగాళ్ల గుడ్డలకి సెలక్షనేమిటీ – ఆన్నీ ఒకలాగే ఉంటాయ్' అనేది అమ్మ'' అని శ్రీమతి విత్‌డ్రా ఐపోయేది.

మరి జర్మనీలో గుడ్డ కొని కుట్టించుకునే స్తోమత అక్కడి సామాన్యులకే లేదు. నేనెంత!

ఏ షాపుకెళ్లినా పాంట్లూ చొక్కాలూ కళ్లముందే వ్రేలాడుతూ ఊరించేవి. ఎలాగున్నాయో అనే కాక – కొలతలు అతికినట్లు ఉన్నాయా అన్నది తెలుసుకుందుకు ట్రయల్ రూం సదుపాయముంది.

తన కోరిక తీరే సమయం వచ్చిందని శ్రీమతి ఉత్సాహంగా నాకు చెప్పింది.

నేను వెంటనే ఒప్పుకోలేదు. ''రకరకాల డిజైన్లలో మంచిమంచివి దొరుకుతాయి కాబట్టి పిల్లల దుస్తులు ఇక్కడే కొందాం. చీరలకు నాణ్యమైన గుడ్డలు దొరుకుతాయి కాబట్టి నువ్వూ ఇక్కడ కొనుక్కోవచ్చు. నాకు ఇండియానుంచి తెచ్చుకున్నవి ఉన్నాయి. అస్తమానూ అవే వేసుకోవాలా, కొత్తవి ఉండొద్దా అనుకుందుకు వాటినెలాగూ స్వెటర్లూ, ఓవర్‌కోట్లూ కమ్మేస్తాయి కాబట్టి లోపలేమున్నా ఒక్కటే. ఆడవాళ్ల

విషయం వేరనుకో. ఇక డబ్బెట్టి కొంటున్నప్పుడు ఫిటింగ్ చూసుకోవాలి కదా! ట్రయల్ రూం ఉన్నా సరే – కొలతలు తీసుకుని టైలర్ కుట్టిన పిటింగ్ ఉండదు'' అని అభ్యంతరపెట్టాను.

''ఎవరైనా అడిగితే – ఇది నా భార్య ఎంపిక – అని గర్వంగా చెప్పుకుందుకు కనీసం రెండు మూడు డ్రెస్సులు మీరు కొనుక్కు తీరాల్సిందే'' అని నొక్కించింది శ్రీమతి.

''ఆ సరదా కూడా ఇండియా వెళ్లేక తీర్చుకుందువు కాని. ఇక్కడ సెలక్షన్ నువ్వనుకున్నంత సులభం కాదని తెలుసుకుందుకు – నాకూ, గోపాలకృష్ణన్‌కీ జరిగిన అనుభవమొకటి చెబుతాను. విను'' అన్నాను.

ఒకసారి గోపాలకృష్ణన్ పాంటు కొనుక్కుందుకు వెడుతూ నన్ను తోడు రమ్మన్నాడు. ఇద్దరం 'సే & ఆ' దుస్తుల దుకాణానికి వెళ్లాం.

అది నాలుగంతస్తుల భవనం. ఒకో అంతస్తులో ఒకో విభాగముంటుందని తెలియక మేము ఒకో అంతస్తునే చూసుకుంటూ వెడుతున్నాం.

అంతవరకూ వాడుతున్నవి కాక – కొత్త మోడల్ తీసుకోవాలనుంది అతడికి. చాలాసేపు తిరిగేక ఒకచోట ఓ బెల్‌బాటమ్ పాంట్ చూసి ఆగాడు.

''జీన్స్ వేశాను. నారో కట్ వేశాను. బెల్‌బాటం వాడలేదు. ఇదెలాగుంటుంది నాకు?'' అనడిగేడతడు.

అది ఎన్టీఆర్ కొసం యాక్స్ టైలరు కుట్టిన బెల్‌బాటంలా ఉంది. చెయ్యెత్తు మనిషి గోపాలకృష్ణన్‌కి చాలా బాగుండొచ్చని అనిపించింది. అదే చెప్పాను.

''సైజు నాదే కానీ నడుం దగ్గర కాస్త సన్నగా ఉన్నట్లుంది. ట్రయల్ చూద్దాం'' అన్నాడతడు.

పాంట్ తీసుకుని ట్రయల్ రూం కోసం వెదుకుతున్నాం. మా అవస్థ గమనించిందేమో – ఒకామె మా దగ్గరకొచ్చి – ''బిట్టే షోన్'' అంది.

ట్రయల్ రూం చూపించమని అడిగాను.

ఆమె మా ఇద్దర్నీ ఎగాదిగా చూసి, ''మీ గర్ల్ ఫ్రెండ్ ఎక్కడ?'' అనడిగింది.

మమ్మల్ని చూసి ఇంకా పెళ్లికాని వాళ్లనుకుందనుకుందుకు లేదు. అక్కడ షాపింగుకి భార్యలతోకంటే గర్ల్‌ఫ్రెండ్సుతో వచ్చేవాళ్లే ఎక్కువ. పైగా రెడీమేడ్ షాపుల్లో బాయ్‌ఫ్రెండ్స్‌కి దుస్తులు ఎంపిక చెయ్యడం రివాజు కూడా కాబోలు. ఎందుకంటే వాళ్ల డ్రస్సు అమ్మాయిలని ఇంప్రెస్ చెయ్యడానికే మరి!

''మాకు గర్ల్‌ఫ్రెండ్స్ లేరు'' అన్నాను వెంటనే.

''మా డ్రెస్సులు మేమే ఎంపిక చేసుకోగలం'' అన్నాడు గోపాలకృష్ణన్ గొప్పగా.

ఆమె మమ్మల్ని ఆదోలా చూసి, ''అలాంటప్పుడు మీకు లేడీస్ సెక్షన్లో ఏం పని?'' అంది.

అది ఆడవాళ్ల పాంటని అప్పటికి మాకు అర్థమయింది.

మారు మాటాడకుండా ఆ పాంటుని అక్కడే విడిచి పురుషుల విభాగమున్న మరో అంతస్తుకి మారిపోయాం.

మొక్కపాటి వారి బారిస్టర్ పార్వతీశం నవల్లో – పార్వతీశం మద్రాసు వెళ్లి తనకి నచ్చిన టోపీ ఒకటి కొనుక్కుని – అది ఆడపిల్లలు పెట్టుకునే టోపీ కావడంతో చాలాచోట్ల అపహాస్యం పాలవుతాడు. ఆ సన్నివేశాన్ని తర్వాత నేను గోపాలకృష్ణన్‌కి చెప్పి, ''అప్పట్లో నవ్వుకున్నా కానీ, ఇప్పుడు నాకు పార్వతీశం ఇబ్బంది అర్థమౌతోంది. ఆడవాళ్లూ, మగవాళ్లూ ఒకే రకంగా ముస్తాబైతే వచ్చే సమస్య ఇది'' అన్నాను.

నేనిది చెప్పగానే శ్రీమతి నవ్వి, ''ఇలాంటి విషయాల్లో మా ఆడాళ్లు మీ మగాళ్లకిలా కాదు'' అని కొట్టిపారేసి – ఒక షాపులో పురుషుల విభాగంలోనే నాకోసం రెండు చొక్కాలు ఎంపిక చేసింది.

ట్రయల్ రూంలోకి వెళ్లబోతుంటే ఓ బిట్టేషోన్ పలకరించి, ''నీకివి భుజాలు దిగిపోతాయి. కొంచెం చిన్న సైజు తీసుకో'' అని శ్రీమతికి సలహా ఇచ్చింది.

శ్రీమతి తెల్లబోయింది. అది ఆడవాళ్ల చొక్కా అని వేరే చెప్పక్కర్లేదుగా!

శ్రీమతి ఆ చొక్కాల్ని పదేపదే చూసి, ''మీకు బాగా నప్పుతాయని మనసు పడి తీసుకున్నాను. ఇప్పటికీ నాకు వీటిలో తేడా ఏముందో తెలియడం లేదు. ఇవి మీరు వేసుకుంటే తప్పేముంది?'' అంది.

''తప్పందని నేనూ అనను కానీ, ప్రస్తుతానికి నన్నొదిలేయ్. మనం తిరిగి ఇండియా వెళ్లేముందు ఈ మోడల్ షర్టులో నాలుగు కొని పట్టుకెడదాం. ఇండియాలో ఎవరూ తప్పు పట్టరు. ఇక్కడ మాత్రం వీళ్ల సిస్టమ్‌నే అనుసరిద్దాం'' అన్నాను.

శ్రీమతికి మనసొప్పలేదు. అయిష్టంగానే ఆ చొక్కాల్ని యథాస్థానంలో ఉంచి, ''ఇవి ఆడవాళ్ల చొక్కాలైతే, పురుషుల విభాగంలో ఎందుకుంచినట్లూ? అంతా గందరగోళంగా ఉంది'' అని గొణుక్కుంది.

''ఎవరో ఆడవాళ్లకోసమని వీటిని ఎంపిక చేసి, ఇక్కడికొచ్చేక మనసు మార్చుకుని వదిలేసి వెళ్లిపోయుంటారు. సేల్స్ పిల్లలు ఇంకా యథాస్థానానికి మార్చలేదు కాబోలు'' అన్నాను.

''ఆసలే ఇక్కడ మగాళ్ల చొక్కాలకీ, ఆడాళ్ల చొక్కాలకీ తేడా తెలియకుండా ఉంది. ఇలా చేస్తే ఎలా?'' అని శ్రీమతి విసుక్కుంది.

అబద్ధమెందుకూ నాకు కొంచెం తేడా తెలిసింది. ఆ చొక్కాలు ఛాతీ దగ్గర కాస్త వెడల్పుగానూ, నడుం దగ్గర కొంచెం పట్టేసినట్లూ ఉన్నాయి. ఐతే అలాంటివి ఇండియాలో కొందరు సినీ హీరోలు వేసుకోగా చూశాను కాబట్టి కామోసనుకున్నాను.

శ్రీమతికి నేనో హీరోని కాబట్టి – అలాంటి చొక్కా వేసుకోగా చూడాలని మనసులో ఉండిపోయి ఇప్పుడు బయటపడిందేమో మరి!

''తేడా ఇక్కడివాళ్లకీ తెలియదు. అందుకే ఆడవాళ్లకనీ, మగవాళ్లకనీ సెక్షన్లు వేరు చేసి బోర్డులు పెట్టారు. ఆడాళ్ల సెక్షన్లో పాంటులూ, షర్టులూ ఆడాళ్లవి అనుకోవాలి. ఐనా ఒకోసారి ఇలాంటి పొరపాట్లు జరుగుతుంటాయి'' అన్నాను.

ఐతే ఆడా, మగా సెక్షన్ల గురించి మేమంతగా పట్టించుకునేవాళ్లం కాదు. కారణం – మేము దుస్తులు కొనేది ఎక్కువగా పిల్లలకి. చిన్నపిల్లలకి సెక్షన్లు లేవు. పాపకీ, బాబుకీ కూడా ఒకే మోడల్ పాంటులూ, చొక్కాలూ కొనేవాళ్లం. వయసులో తేడా ఉన్నా ఇద్దరూ ఒకే ఎత్తులో ఉండేవాళ్లు. చాలామంది వాళ్లు కవల పిల్లలని భ్రమ పడేవారు.

ఆ అలవాటునే పెద్దలకూ పాటిస్తే కాస్త ఇబ్బందొచ్చింది.

ఇండియా వెళ్లేదాకా చొక్కాల విషయంలో సినీహీరో లుక్స్‌ని వాయిదా వెయ్యాలని నిర్ణయించుకున్నాను.

షాపింగుకి వెళ్లడం సరదాగానే ఉండేది కానీ, అందుకు తయారవడమే ఇబ్బందిగా అనిపించేది.

ఇండియాలో ఐతే – బయటకి వెళ్లాలంటే – ఐదు నిముషాల్లో రెడీ అయ్యేవాళ్లం. ఒకోసారి ఉన్నవాళ్లం ఉన్నట్లే బయల్దేరిపోయేవాళ్లం కూడా.

నాకు తెలిసి – ఎక్కువమంది ఆడవాళ్లూ, కొద్దిమంది మగవాళ్లూ – బయటికి వెడుతున్నామంటే ఓ ఫ్యాషన్ షోకి వెడుతున్నట్లు భావించి తయారయ్యేవాళ్లు.

ఈ విషయంలో భార్యాబాధితులదే మెజారిటీ అని చెప్పాలి.

ఇండియాలో నా మిత్రుడు కేశవ్ అలాంటి భార్యాబాధితుడు. అతడి భార్య – ఇంటికెవరైనా వచ్చి తలుపు తడితే – ముందు డ్రెస్సింగ్‌రూంకి వెళ్లి దుస్తులూ, మేకప్పూ సరి చేసుకుని కానీ తలుపు తీసేది కాదు.

ఇంట్లో వేరెవరైనా ఉంటే ఫరవాలేదు. తనొక్కత్తే ఉంటే మాత్రం, 'వస్తున్నా' అని ఓ కేక వేసి తన ఉనికిని తెలియజేసేది.

వచ్చిన వాళ్లకి అర్థమై ముందు లోగిల్లో గట్టుమీద కూర్చునేవారు. కాలక్షేపంకోసం పుస్తకప్రియులు పత్రికలో, పుస్తకాలో తీసుకెళ్లేవారు.

ఆమె ఇంటికి వెళ్లడంవల్లనే పుస్తకప్రియులుగా మారినవాళ్లు కూడా కొందరున్నారు.

ఒకసారి కేశవ్ దంపతులు మాతో సినిమా ప్రోగ్రాం పెట్టారు. మేము గంటముందే రెడీ అయి వాళ్లింటికి వెళ్లాం.

కేశవ్ తలుపు తీసి ఆప్యాయంగా పలకరించి డ్రాయింగ్‌రూంలోకి ఆహ్వానించాడు. అతడి భార్య లోపల మేకప్ అవుతూంటుందని తెలుసు కాబట్టి శ్రీమతి కూడా డ్రాయింగ్ రూంలోనే చతికిలబడింది.

అంతా కబుర్లలో పడ్డాం.

కేశవ్ అక్కణ్ణించే మధ్యమధ్య భార్యని త్వరగా తెమిలి రమ్మని హెచ్చరిస్తున్నాడు. ఆమె ''ఇదిగో, ఐదు నిముషాలు'' అంటోంది.

నేను మధ్యమధ్య టైం చూసుకుంటున్నాను. చూస్తూండగా బయల్దేరే టైమయింది.

కేశవ్ నా ఆదుర్దా కనిపెట్టాడో ఏమో – ''గంటనుంచి ఐదు నిముషాలు, ఐదు నిముషాలు అంటున్నావు. ఇక ఫస్ట్ షో మొదలెట్టే టైమౌతోంది. తొందరగా రా'' అని కొంచెం గొంతు పెంచి పిలిచాడు.

ఆమె వెంటనే లోపల్నించి, ''ఫస్టు షో మొదలైపోతే, సెకండ్ షో చూద్దాం. ఊరికే అరిచి నన్ను తొందరపెట్టకండి'' అని కసిరింది.

అతడి అసహాయత అర్థమై, ''మీరు నెమ్మదిగా రండి'' అని మేము సెలవు తీసుకున్నాం.

కానీ మా ఇంట్లో అలాకాదు.

బయటికెళ్లడానికి తయారవడానికి చీర మార్చుకుని, అవసరమైతే జుట్టు కాస్త సరిచేసుకుని, ఆకుజోళ్లు వేసుకుని సిద్ధమవడానికి – శ్రీమతి తీసుకునే టైము సాధారణంగా ఐదు నిముషాలకు మించదు. అలాంటిది జర్మనీలో బయటికెళ్లాలంటే – తను స్టుంప్ హోజెన్ వేసుకోవాలి. కాళ్లకి సాక్సు, షూస్. చేతులకి గ్లోవ్సు. దుస్తులపైన స్వెటరు. ఆపైన ఓవర్‌కోటు.

మాతోపాటు పిల్లల్నీ అలాగే సిద్ధం చెయ్యాలి.

''ఏంటో – యుద్ధానికి వెళ్లే వీరసైనికుల్లా తయారౌతున్నాం'' అనేది శ్రీమతి.

''యుద్ధమే మరి – యూరప్ చలితో'' అనేవాణ్ణి.

''ఇండియాలో ఉండగా బ్రతుకు పోరాటంతోనే టైం సరిపోయేది. షాపింగుకి వెళ్లడం ఎప్పుడోకానీ కుదిరేది కాదు. ఇక్కడ రోజూ షాపింగ్ చెయ్యొచ్చు. కానీ ఆ ప్రయాణమే ఒక పోరాటం'' అని గొణిగేదామె.

మాకు కారు లేదు కాబట్టి – ఎక్కడికెళ్లినా ఊబాన్లు. ఎంతో కొంత నడక తప్పదు. ఆ నడకలోనూ పిల్లలతో కొంత ఇబ్బంది.

ఇబ్బంది అంటే – వాళ్లు కలిగించింది కాదు. వాళ్లవల్ల కలిగింది అనొచ్చు.

పిల్లలకి కొన్ని సరదాలుంటాయి.

మావాళ్లకి అక్కడి గొడుగులు చాలా నచ్చాయి.

చిన్న సైజు. మీట నొక్కితే చాలు. తెరుచుకుంటాయి.

వాటిని వాడాలనుండేది వాళ్లకి. షాపింగుకి బయల్దేరేముందు ''ఈరోజు వాన పడితే బాగుణ్ణు'' అనేవాళ్లు.

బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు. తథాస్తు దేవతలు ఉన్నారంటారు. కానీ జర్మనీలో వాన పడ్డానికి ఇవేమవసరం లేదు.

మామూలుగానే అక్కడ రోజూ ఏదో సమయంలో వాన పడేది. ఐతే చాలాసార్లు ఇలా పడి – అసలు పడిందా అన్న అనుమానమొచ్చేంతలా – అలా ఆగిపోయేది.

ఇలా చినుకు పడితే చాలు, మావాళ్లు గొడుగులు తెరిచేవాళ్లు. అవి వేసుకునే నడిచేవాళ్లు.

చిన్నపిల్లలు. వాళ్లు నడుస్తుంటే గొడుగులే కనిపించేవి.

నడిచిపోతున్న ఆ గొడుగుల్ని చూడ్డంకోసం కొందరు ఆగి గొడుగెత్తి వీళ్లని చూసి ఓసారి ముద్దులాడి వెళ్లిపోయేవారు. కొందరు వాళ్ల ఓవర్‌కోట్ల జేబుల్లో చాక్లెట్లు నింపేవారు.

మాకా దృశ్యం గొప్ప తీపి జ్ఞాపకం.

అక్కడుండగా పాప వయసు ఐదుకి అటూ ఇటూ. బాబు దానికంటే ఏణ్ణర్థం చిన్న.

ఇద్దరూ నడవడానికి చిన్న. ఎత్తుకుందుకు పెద్ద. ఐనా బయటకెళ్లినప్పుడు నడవాల్సొస్తే ఎత్తుకోమని వాళ్లు అడిగిన సందర్భాలు తక్కువ.

మాకైతే ఎంత దూరం నడిచినా నడిచినట్లే అనిపించేది కాదు. కానీ పసి ప్రాణాలకి నాలుగడుగులే ఎక్కువ. అలాంటిది ఒకోసారి ఆగకుండా అర కిలోమీటరుదాకా నడిచేసేవారు. కాళ్లు లాగకుండా ఉంటాయా – ఐనా చెప్పేవారు కాదు.

కాళ్లు లాగుతున్నప్పుడు పాప నడకలో తేడా వచ్చేది. అది ఈడ్చుకుంటూ నడవగానే మాకు అర్థమయ్యేది.

పాపకి హుషారివ్వడానికి, ''ఎత్తుకోమనుకుండా పెద్దవాళ్లలా ఎంత బాగా నడిచేస్తోందో'' అని పొగిడేసి ముందరికాళ్లకు బంధం వేసేవాణ్ణి.

ఆ బంధం ఆటోమేటిక్‌గా బాబుకీ పడేది. లేని ఓపిక తెచ్చుకుని మారుమాట్లాడకుండా నడిచేవాడు కానీ – వాడికి దుఃఖమొచ్చేది. అది వాడి కళ్లలో నీళ్ల రూపంలో బయటపడేది.

కన్న ప్రాణాలు కదా – చలించేవి. ఇద్దరం చెరొకళ్లనీ కాసేపు ఎత్తుకునేవాళ్లం. కాసేపంటే కాసేపే మరి.

షాపింగులయ్యేక తిరుగు ప్రయాణంలో మాత్రం పిల్లలకి ఓపిక పూర్తిగా ఐపోయేది. అలాంటప్పుడు వాళ్లని మరిపించడానికి దారిలో ఒకో ఇంటినే చూపించి, ''ఇదా మనిల్లు'' అనేవాణ్ణి. బాబు గొప్పముఖంపెట్టి, ''కాదు'' అనేవాడు.

ఆ ఆట కొంత దూరం కొనసాగేది.

ఈ లోగా మా ఇల్లొచ్చేసి, ''ఇదా మనిల్లు'' అనగానే శ్రీమతి, ''కాదు'' అనేది.

బాబు వెంటనే, ''కాదంటావేంటి? ఇదే మనిల్లు'' అనేవాడు.

ఈ ఆట పాపకి కూడా నచ్చింది. తనూ బాబుతోపాటు హుషారుగా పాల్గొనేది. ఇద్దరూ నడక శ్రమని మర్చిపోయేవారు.

ఈ ఆటని మా పాప, బాబు కూడా ఎంత ఇష్టపడేవారంటే – ఇల్లు చేరుకోగానే నడక తప్పిందన్న సంతోషంకంటే – ఆట ఐపోయిందన్న బాధే వాళ్లలో ఎక్కువుండేది.

శ్రీమతికిది సంతోషంగా ఉండేది కాదు. ''పాపం, పిల్లలు అమాయకులు'' అని నొచ్చుకునేది.

ఐనా అడపా తడపా ఆ ఆట ఆడక తప్పేది కాదు. ఐతే పిల్లలు ఆ ఆటకోసమే బయటకెళ్లినప్పుడు ఒకోసారి అవసరం లేనప్పుడు కూడా నడుస్తామనేవారు.

"సరదాగా తీసుకుంటే, కష్టమైన పని ఇష్టమై కొత్త శక్తిని ఇస్తుంది" అనేవాణ్ణి నేను.

పిల్లల్ని మోసం చేసి కష్టపెడుతున్నామన్న అపరాధభావం శ్రీమతిలో కలిగేది.

ఐతే నేను చిన్నప్పుడు – నాలుగైదేళ్ల వయసులో ఏకబిగిని 2–3 కిలోమీటర్లు నడిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆ విషయం శ్రీమతికి చెప్పి, "కన్న ప్రాణం కాబట్టి మనసు విలవిల్లాడిపోతుంది కానీ – పిల్లల్లో ఇంతకంటే ఎక్కువ శక్తే ఉంటుంది. దాన్ని వెలికి తియ్యాలంటే ఇదో మార్గం. ఎప్పుడు నడకవల్ల పిల్లలు మర్నాటికి నీరసపడిపోతారో, అప్పుడు ఇంకో దారి చూద్దాం" అన్నాను.

కానీ అక్కడున్నన్నాళ్లూ మా పద్ధతి మార్చుకోవాల్సిన అవసరం లేకపోయింది.

ఏ రోజు ఎంత దూరం నడిచినా మర్నాటికల్లా మా పిల్లలు రబ్బరు బంతుల్లా గెంతుతూ ఎక్కడికెడదామా అని ఉరకలేసేవారు. నడకవల్ల ఆకలి, నిద్ర కూడా సక్రమంగా ఉండేవి.

బయటికెళ్లినప్పుడు నడకలో అలసట ఒక్కటే సమస్య కాదు – ముఖ్యంగా బాబు విషయంలో!

బయటికెళ్లేక అరగంట గడిచేసరికి బాబుకి పాస్‌కి వెళ్లాల్సొచ్చేది.

ఏ షాపులోనో ఉంటే ఇబ్బంది లేదు. అక్కడ టాయిలెట్లుంటాయి.

బయట కూడా టాయిలెట్లుంటాయి. కానీ అన్ని చోట్లా ఉండవు.

ప్రత్యేకంగా వాడికోసమని మేము బయటికెడితే బెర్లిన్ సిటీ ప్లాన్ తీసుకుని వెళ్లేవాళ్లం.

అందులో ఏ ప్రాంతంలో ఎక్కడెక్కడ రోడ్లపక్కన టాయిలెట్ సదుపాయముంటుందో W/C అనే చిహ్నంతో తెలియబర్చి ఉండేది. అలా సిటీలో రహదారి శౌచాలయాలు సాధారణంగా ప్రతి అరకిలోమీటరుకీ తగిలేవి. కానీ, అన్నివేళలా పసివాళ్లు అంతసేపు ఆగలేరు కదా!

అప్పటికీ పాస్ వచ్చినప్పుడు కాస్త ముందుగా చెప్పమని బాబుకి చిలక్కి చెప్పినట్లు చెప్పేవాళ్లం.

చెప్పాలనే అనుకునేవాడేమో – కానీ కబుర్లలోనో పరిసరాల్ని చూడ్డంలోనో పడి ముందుగా చెప్పేవాడు కాదు బాబు.

పీకెలమీదకి వచ్చేసరికి తను ముందుగా చెప్పలేదన్న విషయం గుర్తుకొచ్చేది కాబోలు – ఆపుకుందుకు తన ప్రయత్నం తను చేసేవాడు. కాళ్లు రెండూ దగ్గరగా పెట్టి రెండు మోకాళ్లనూ రాపిడి చేస్తూ అదో రకంగా నడిచేవాడు. వాడి ఇబ్బంది శ్రీమతికి తెలిసిపోయేది.

ఇక టాయిలెట్‌కోసం మా వేట మొదలయ్యేది.

టాయిలెట్ ప్రాంతాన్ని గుర్తించే ప్రయత్నంలో ఉన్న మాకు – ఉక్రోషం తెప్పించే దృశ్యాలు కొన్ని కనిపించేవి.

పేవ్‌మెంట్లమీద పెంపుడు కుక్కల్ని వాకింగుకి తీసుకెడుతూ స్త్రీబాలవృద్ధులు కొందరు మాకు ఎదురయ్యేవారు.

రకరకాల కుక్కలుండేవి కానీ వాటిలో బొచ్చుకుక్కలెక్కువ.

అవి చూడ్డానికి చిన్నగా, బొద్దుగా, ముద్దుగా ఉండేవి.

బాబు వాటిని చాలా ఇష్టంగా చూసేవాడు.

ఆ కుక్కపిల్లలకి కూడా పాస్ సమస్య ఉండేది. ఐతే యజమానులు టాయిలెట్లకోసం వెదికేవారు కాదు. రోడ్డుపక్కన అడుగడుగునా ఉండే చెట్ల మొదళ్లని వాటికోసం టాయిలెట్లుగా వాడేవారు.

ఆ దృశ్యం చూసినప్పుడు మాత్రం బాబు చూపుల్లోని ఇష్టం ఉన్నట్లుండి అసూయగా మారిపోయేది.

ఆ విషయంలో కుక్కపిల్లలకున్న స్వేచ్ఛ పసిపిల్లలకి లేదని మేము గొణుక్కునేవాళ్లం.

ఐతే పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యమిచ్చే ఆ వ్యవస్థలో పెంపుడు జంతువులకి లభించిన ఆ స్వేచ్ఛకి కారణం ఏదో ఉండే ఉంటుందనిపించేది.

పరిశుభ్రత అంటే అది మామూలు పరిశుభ్రత కాదు.

వాహనాలు లేనప్పుడు నడిరోడ్డు కూడా భోజనాల గది అంత శుభ్రంగా ఉండేది. ఆ రోడ్డు మధ్యలో బాసింపట్టేసుకుని కూర్చుని ముందో అరిటాకు వేసుకుని భోంచేయొచ్చు అనిపించేలా ఉండేది.

బుధ, శనివారాల్లో మా ఇంటిముందు ఏర్పడే సంతలు కూడా ఆ పరిశుభ్రతకి ఆటంకం కలిగించేవి కాదు.

ఆ సంతకు కూరలు, పళ్లు, పప్పుదినుసులు వగైరా వంటకి అవసరమైన పదార్థాలు పలెటూళ్లనుండి వచ్చేవి.

గ్రామస్థులు వాటిని కేరవాన్లలో తీసుకొచ్చేవారు.

ఆ కేరవాన్లు కదిలే ఇళ్లలాంటివి. స్నానం, వంట, పడకతో సహా అన్నింటికీ సదుపాయాలుంటాయి వాటిలో.

సరుకులు అమ్ముడుపోయేక గ్రామస్థులు కాసేపు సిటీలో సరదాగా గడిపి తిరిగి స్వగ్రామం చేరుకుంటారు.

ఈ సంతల్లో లభించే సరుకులు షాపుల్లో పొట్లాల్లో కట్టిన సరుకుల్లా కాక తాజాగా ఉంటాయి. ఎస్టాబ్లిష్‌మెంటు ఖర్చులు తక్కువ కాబట్టి – చౌకగా కూడా ఉంటాయి. ఇంకా షాపుల్లో దొరకని మసాలా దినుసులు కూడా ఇక్కడ దొరికేవి.

అందుకని ఈ సంతలు జనంతో బాగా రద్దీగా ఉండేవి.

జర్మనీలో మిర్చి వాడేవారు బాగా తక్కువ. అక్కడుండే భారతీయుల్లో కూడా ఉత్తరాదివారికి మిర్చి ఆట్టే అవసరపడదు. దక్షిణాది వారిలోనూ తెలుగువారు – వారిలోనూ కొన్ని జిల్లాలవారు మాత్రమే మిర్చికోసం తాపత్రయపడతారు. మరేమో షాపుల్లో ఎక్కువగా సిమ్లా మిర్చి దొరికేది. దాన్ని జర్మన్లో పాప్రికా అంటారు. అందులో కారముండదు సరికదా, రుచికి మామూలు కూరగాయలా ఉంటుంది. ఐనా దాన్నే మిర్చికి ప్రత్యామ్నాయంగా వాడాల్సొచ్చేది. సంతల్లో అయితే మన మిర్చికి కాస్త దగ్గర్లో ఉండే 'పెప్పరోని' దొరికేది. మేము ఒకోసారి కేవలం పెప్పరోని కోసమే సంతకు వెళ్లేవాళ్లం.

మన కూరలు చాలావరకూ దొరికేవి. వంకాయల్ని ఔబర్‌గిన్నెన్ అనేవారు, బంగాళాదుంపల్ని కార్టోఫెల్న్ అనేవారు.

షాపుల్లో ఐతే కిలోకి ఒక మార్కుకి కాస్త అటూ ఇటూలో ఉండే బంగాళా దుంపలు – ఈ సంతలో 69 ఫెన్నిగ్సుకే దొరికేవి.

మేము బంగాళాదుంపలు ఎప్పుడూ ఒకతనివద్దే కొనేవాళ్లం. కారణం అతడికి ఓ చేయి లేదు.

తన మొండిచేతికి పొడవాటి పార ఒకటి కట్టి దానితో దుంపలు తూకమేసేవాడు. ఒంటిచేత్తో బస్తా విప్పి దుంపలు గుడారంలో పోసేవాడు.

అతడెంత చురుగ్గా ఉండేవాడంటే – ఒక చెయ్యి మొండిదన్న భావనే కలిగేది కాదు.

బాబు అతడి చేతినే కన్నార్పకుండా ఆశ్చర్యంగా చూసేవాడు.

అంగవైకల్యానికి కృంగిపోకుండా అదొక అత్యంత సాధారణ విషయమైనట్లు ప్రవర్తిస్తూ హుషారైన మామూలు మనుషుల్లాగే తనూ హుషారుగా ఉండే అతడి వ్యక్తిత్వం ఆదర్శమని మేము పిల్లలకి చెప్పేవాళ్లం.

అతణ్ణి ప్రత్యేకంగానూ, జాలిగానూ చూడకూడదని వాళ్లకి మరీ మరీ చెప్పేవాళ్లం.

ఐతే – మొండిచేతికి పార కట్టి మామూలు చెయ్యిలాగే అవలీలగా ఉపయోగించే అతగాడు కనబడగానే బాబు మాత్రం కన్నార్పడం మర్చిపోయేవాడు.

అంతమంది జనమున్నా, అమ్మేవన్నీ కూరగాయలూ ఆ తరహావీ ఐనా – సంత శుభ్రతకు మారుపేరులా ఉండేది.

జరుగుతున్నప్పుడు ఎంత శుభ్రంగా ఉండేదో, అంతా కాళీ చేసి వెళ్లిపోయేక కూడా ఆ ప్రదేశం అంత శుభ్రంగానూ ఉండేది.

ఇది మనం భారతీయులం గమనించి, అనుసరించాల్సిన – గొప్ప విశేషమని మేము అనుకునేవాళ్లం.

బయట తిరిగేటప్పుడు బాబుకి మరో ఇబ్బంది ఉండేది.

ఇండియాలో బయట బళ్ల దగ్గర బజ్జీలో, పానీపూరీలో తినడం అలవాటు. లేదా హొటలుకెళ్లి ఇడ్లీలో, దోశలో తినేవాళ్లం. ఇక్కడా అలాంటివి తినాలనుండేది వాడికి.

బయట ఎక్కువగా వుర్స్ట్ బళ్లుండేవి. అది మాంసమని చెప్పేక దానివైపు చూడ్డం మానేసేడు వాడు. ఐతే పలుచోట్ల పోమెస్ ఫ్రైట్స్ అమ్మే బళ్లు ఉండేవి. వాటిని ఫ్రెంచి ఫ్రైస్ అంటారని అప్పట్లో తెలియక – బంగాళా దుంపల వేపుడు అనేవాళ్లం మేము. అప్పటికప్పుడు మెషీన్లో బంగాళా దుంపల్ని సన్నని పొడవాటి ముక్కల్లా తరిగి, మరుగుతున్న నూనెలో వేయించి, ఓ పొట్లంలో పెట్టి ఇచ్చేవారు. నంజుకుందుకు సెన్ఫ్ సాసె (పసుపుపచ్చని ఆవపిండి) ఇచ్చేవారు. శ్రీమతికీ, పిల్లలకీ కూడా ఆ వేపుడు చాలా నచ్చేది. కానీ గుప్పెడు వేపుడు ముక్కల ఖరీదు ఒక మార్కు. 70 ఫెన్నిగ్సుకి కిలో బంగాళాదుంపలు వస్తున్నప్పుడు – కాసిని వేపుడు ముక్కలకి ఒక మార్కు ఏమిటని శ్రీమతి – అవి కొనడానికి ఒప్పుకునేది కాదు.

ప్రతి పైసకీ విలువున్న రోజులవి. జర్మనీలో ఉండగా మేము రెండు మూడుసార్లకు మించి వాటిని కొనలేదు.

కొన్ని హొటళ్లముందు బయట షామియానాలు వేసి ఫలహారాలు, పానీయాలు అందించేవారు. అవి మేము తినేవీ, తాగేవీ కాదు. పాపకి ఆ విషయం తెలిసేది కానీ, బాబుకి అర్థమయ్యేది కాదు. అక్కడికెళ్లి దోశ తిందామని ఏడ్చేవాడు. దొరకవంటే దు;ఖమొచ్చేసేది వాడికి. వాడి దృష్టి మళ్లించడానికి నేను ఇండియాకి వెళ్లేక హొటల్లో పెసరట్, దోశ తినడం గురించి ఊరించే మాటలు చెప్పేవాణ్ణి. అది వాడి మనసుకి హత్తుకుపోవడంకోసం వరసకట్టి పాటలా పాడేవాణ్ణి. ఆ పాట వాడికి ఎంత నచ్చేదంటే – కాసేపటికే వాడూ నాతో గళం కలిపేవాడు. తర్వాత పాప కూడా మాతో కలిసేది. హాయిగా పాడుకుంటూ ఇల్లు చేరేవాళ్లం.

నాకు టేపు రికార్డరు మీద మహా మోజు. శ్రీమతి వచ్చేలోగానే ఒక కాసెట్ టేపు రికార్డరు, స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు – రెండూ గ్రుండిగ్ కంపెనీవే కొని ఉంచాను. వాళ్లు వచ్చీరాగానే వాళ్ల గొంతులు వాళ్లకి వినిపించడం ఆదో థ్రిల్.

మావాళ్లు వచ్చినప్పుడు కొన్నాళ్లు వాడుకోమని ఓంప్రకాష్ నాకో కెమేరా ఇచ్చాడు. అది కోనికా కంపెనీది. ఫొటోలు తియ్యడానికి మన నైపుణ్యంతో నిమిత్తం లేని ఆటోమేటిక్ లైటింగ్, ఫోకస్ ఏర్పాట్లు ఉన్నాయి. అందులో ఫొటోలు తీస్తే చాలా బాగా వచ్చాయి.

''ఇన్ని కొన్నారు. ఇలాంటి కెమేరా ఒకటి మనకీ ఎందుకు కొనలేదు?'' అంది శ్రీమతి.

ఐతే నేను కొనకపోవడానికో కారణముంది.

నాతో జర్మనీ వచ్చిన ఇండియన్సులో నటరాజన్‌కి ఫొటోగ్రఫీ మీద మహా ఆసక్తి. ఆతగాడు ఇండియానుంచి ఖరీదైన కెమేరా ఒకటి తెచ్చుకున్నాడు. దానికి స్పేర్సు కొనాలని అనేవాడు. ఆటోమేటిక్ కెమేరాల గురించి ఎవరైనా అన్నప్పుడు – ''కొంటే మాన్యువల్ టైపే కొనాలి. ఆటోమేటిక్ కెమేరాల ఫొటోల క్వాలిటీ అంతంతమాత్రం'' అనేవాడు. ఫొటోలకి సంబంధించి నాకేం తెలియదు కాబట్టి ఆ మాటలు బాగా వంటబట్టించుకున్నాను.

బెర్లిన్ వచ్చేక కిర్షనర్ ఐతే, "ఫొటో తియ్యడం ఓ కళ. ఆ కళమీద ఆసక్తి ఉన్నవాళ్లకే స్వంత కెమేరా ఉండాలి. ఎలాగో అలా ఏదో ఒక ఫొటో తీసుకుని దాచుకోవాలనుకునేవాళ్లు ఎవరిచేతనైనా తీయించుకోవడమో, కెమేరా ఎరువు తెచ్చుకోవడమో చెయ్యాలి" అనేవాడు.

ఇండియాలో మాకో డబ్బా కెమేరా ఉండేది. దాంతో తీసిన ఫొటోల్లో మనుషులు గుర్తు తెలిస్తే చాలు – మహా సంబరపడిపోయేవాళ్లం. స్వంతంగా కెమేరా కొనుక్కోవడం ఆ రోజుల్లో ఇండియాలో ఎంత పెద్ద లగ్జరీ అంటే – ఆర్థికంగా నాకంటే రెండు మెట్లు పైనే ఉన్న నా కొలీగ్సులో కొందరు – వాళ్ల అవసరానికి నా డబ్బా కెమేరాని ఎరువు తీసుకునేవారు.

ఆ పరిస్థితుల్లోంచి వచ్చి ఇక్కడ పడ్డాను. ఇక్కడ ప్రతివారి చేతిలోనూ కెమేరాయే.

మంచి ఫొటోగ్రాఫర్‌గా కిర్షనర్‌కి మంచి పేరుంది. అందువల్ల అతడి మాటలకి కొంచెం విలువిచ్చి – ఫొటోగ్రఫీని కళగా అభ్యసించాలనే అనుకున్నాను. కానీ నాకందుకు తీరుబడి దొరకడం లేదు.

ఫొటోగ్రఫీ గురించి కొంత అవగాహన వచ్చేక నా అభిరుచుల మేరకు కెమేరాను ఎంపిక చేసుకుని కొనుక్కోవాలనుకోవడం వల్ల – ఆ కొనుగోలుని వాయిదా వేస్తూ వచ్చాను.

"ఇక్కడ ఇంచుమించు ప్రతి రోజూ ఏదో కొత్త విశేషం ఎదురౌతోంది. అవన్నీ ఫొటోలు తీసుకుంటే మనకి రికార్డుంటుంది. ఎవరిదో కెమేరా ఎన్నాళ్లుంచుకుంటాం. మనకంటూ ఏదో ఒక కెమేరా ఉండాలి. డబ్బా కెమేరా ఫొటోలకే తృప్తి చెందినవాళ్లం. జర్మనీలో కొన్న ఫారిన్ కెమేరా ఏదైనా మన ప్రాణాలకి గొప్పే కదా!" అంది శ్రీమతి.

ఆమె సౌమ్యంగా అంది కానీ – "మన మొహాలకి ఫొటోలు ముఖ్యం కానీ, ఫొటోగ్రఫీ కళ కాదు" అన్న ధ్వని ఉంది.

దాంతో కెమెరా కొనుగోలు మరి వాయిదా వెయ్యకూడదనిపించి ఓంప్రకాష్‌ని సలహా అడుగుతానన్నాను.

"అన్నింటికీ అతన్నే అడగాలా! మీరూ ఇక్కడ చాలా నెలలుగా ఉంటున్నారు. షాపులకి వెడితే ఎవర్నీ అడగక్కర్లేకుండా షో కేసుల్లో పరిచేసి ఉంటాయి కెమేరాలు. వాటి వివరాలు అక్కడే వ్రాసి ఉంటాయి. మనక్కావలసింది మనం కొనుక్కోలేమా?" అంది శ్రీమతి.

అలాగందని కొన్ని షాపులు తిరిగి కెమేరాలు చూశాం కానీ – డిస్‌ప్లేలో ఇచ్చిన వివరాలు అర్థం చేసుకుందుకు మా పరిజ్ఞానం సరిపోలేదు. అక్కడే తచ్చాడుతూ ఒకటికి రెండుసార్లు మాలో మేము చర్చించుకుంటుంటే బిట్టేషోన్లు వచ్చేసేవారు. వాళ్లకి మా ఆంచనాలు చెప్పడానికి సరిపడ భాషాజ్ఞానం మాకు లేదు.

"ఇలాంటి విషయాల్లో ఓంప్రకాష్ సర్వజ్ఞుడు. మెహర్బానీకి పోవద్దు. అతడి సలహా తీసుకుందాం" అన్నాను శ్రీమతితో.

"ఇందులో మెహర్బానీ ఏముంది? చిన్న కెమేరా మనంతట మనం కొనుక్కోలేమా అని అలా అన్నాను కానీ, అతడి సలహా మనకి నిషిద్ధమేం కాదు. ఇప్పటికే చాలా విషయాల్లో అతడి సలహాలు మనకి పనికొచ్చాయి. వాటికి ఇది ఇంకొకటి అనుకుందాం" అంది శ్రీమతి.

గొప్పవాళ్లకి అలంకారం కావచ్చు. పేదవాళ్ల పెదవికి చేటు కావచ్చు. కానీ పేదా గొప్పా తేడా లేకుండా ప్రతి మనిషిలోనూ అహం ఉంటుంది. మనిషి జీవితం సుకరం కాకుండా పోవడానికి దాని ప్రయత్నం అది చేస్తూనే ఉంటుంది. దాన్నించి బయటపడ్డాన్నే వివేకం అంటారు.

నేను వివేకం పాటించి ఓంప్రకాష్‌ని కెమేరా కొనుగోలు గురించి సలహా అడిగాను.

అతగాడు వెంటనే, ''జర్మనీలో కెమేరాల ధర చాలా ఎక్కువ. హాంగ్‌కాంగ్‌నుంచి తెప్పించుకుంటే బాగా చౌక పడుతుంది. నా దగ్గర టిఎం చాన్ కేటలాగ్ ఒకటుంది. అదిస్తాను. అందులో ప్రతి వస్తువు వివరాలూ మనలాంటి మామూలు వాళ్లకి అర్థమయ్యేలా ఉంటాయి. నీకు నచ్చింది ఎంచుకో. ఆర్డరిచ్చేద్దాం'' అన్నాడు.

అతగాడిచ్చిన కేటలాగ్ చూసి నేనూ, శ్రీమతీ కూడా వెర్రెత్తిపోయాం. అందులో మాకు తెలియని వస్తువులు చాలా ఉన్నాయి. ఒక పేజీ చూస్తే రెండో పేజికి వెళ్లడం కష్టమయ్యేది.

అలా ఒకటి రెండు రోజులు గడిచేక, ''ఈ కేటలాగ్ మీద మనమేదో పరీక్ష వ్రాయబోతున్నట్లుంది మన ధోరణి. ముందు మన దృష్టిని కెమేరాలమీద సారిద్దాం'' అన్నాను.

ఇద్దరం కెమేరాల వివరాలు చూసి – మాకు అర్థమైన మేరకి మినోల్టా కెమేరా ఒకటి ఎంపిక చేసి తెగ మురిసిపోయాం. అది జర్మనీలో ఆరొందల మార్కులుంటే, హాంగ్‌కాంగ్‌లో మూడొందల మార్కుల లోపే పడుతోంది.

''మనకి డబ్బులు కలిసొచ్చాయి కాబట్టి – ఆటోమేటిక్ వాచీలు కూడా కొనుక్కుందామండీ'' అంది శ్రీమతి.

రోజుకి ఇరవైనాలుగు గంటలుంటే – నిద్రకో 7–8 గంటలు మినహాయించి – మిగతా సమయాన్ని నిముషాలతో సహా పనులకు కేటాయించే తత్వం చిన్నప్పట్నించీ నాకు అలవడింది. చేతికి గడియారం లేకపోయినా, మనసులో టైము అంచనా వేసుకుని మధ్యమధ్య ఏ గోడ గడియారాన్నో చూసుకుంటూ మసలడంతో – నాకు టైమ్ సెన్స్ బాగా అలవడింది. అప్పట్లో రేడియో సిలోన్‌లో వచ్చే వివిధ కార్యక్రమాలు ఒక్కటి కూడా మిస్సవకుండా వినడం అలాగే సాధ్యపడేది. ప్రతి బుధవారం ఎనిమిది గంటలకి వచ్చే బినాకా (తర్వాత సిబాకా అయింది) గీత్‌మాలా కార్యక్రమం విని పాటల రాంక్స్ పుస్తకంలో వ్రాసుకునేవాణ్ణి. దశాబ్దాల తరబడి ఆ వివరాలు ఒక్కసారి కూడా మిస్ కాలేదంటే అందుకు టైమ్ సెన్సే కారణం.

నాదంటూ సంపాదన వచ్చేక కేవలం నాకోసమని నేను చేసిన మొదటి పెద్ద పర్చేజ్ రిస్ట్‌వాచ్.

ఆ వాచికి 24 గంటలకోసారి కీ ఇస్తుండాలి. లేకపోతే ఆగిపోతుంది. కీ అవసరం లేకుండా ఎప్పటికీ ఆగిపోకుండా పనిచేసే ఆటోమేటిక్ వాచీలుండేవి కానీ, వాటి ఖరీదు మామూలు వాచీల ఖరీదుకి రెట్టింపుండేవి. అదీకాక ఆటోమేటిక్ వాచీలని ఫేవర్లుబా, సీకో వంటి పెద్ద కంపెనీలు మాత్రమే తయారు చేసేవి. ఆ బ్రాండువి మామూలు వాచీలే చాలా ఖరీదు.

ఆటోమేటిక్ వాచీ కొనుక్కోవాలన్నది అప్పట్లో నా కల. సమయపాలనలో, ఇతర వ్యాపకాల్లో శ్రీమతి నాకు సరిజోడు కావడంవల్ల తనకీ ఆటోమేటిక్ వాచీమీద మనసుండేది. జర్మనీ అవకాశం రాగానే – అక్కడ కొనుక్కోవాల్సిన వాటిలో ఈ ఆటోమేటిక్ వాచీలనీ అనుకున్నాం. కానీ ఎందుకో ఆ ఆలోచన తాత్కాలికంగా మరుగున పడింది.

షాపులు తిరుగుతున్నప్పుడు చాలాచోట్ల వాచీలు చూశాం. అక్కడ కీ అవసరం లేకుండా తిరిగే క్వార్ట్జ్ వాచీలు కొత్తగా వస్తున్నాయి. ఐతే అవి బ్యాటరీతో పని చేస్తాయి. నేననుకున్న ఆటోమేటిక్ వాచీలకు బ్యాటరీ అవసరం లేదు. బ్యాటరీ అదో అదనపు ఖర్చు, దండుగ అనుకుని క్వార్ట్జ్ వాచీల జోలికి వెళ్లలేదు. అది అప్పట్లో చాలామంది ఆలోచనావిధానం.

చాన్ కేటలాగులో ఇద్దరం చెరో వాచీ ఎంపిక చేసుకున్నాం. జర్మనీ ధరలతో పోల్చితే అవి కారుచౌక.

మా ఎంపిక అయ్యేక ఓంప్రకాష్‌కి చెప్పాను. అతగాడు వాచీల ఎంపికని తెగ మెచ్చుకుని, ''కెమేరా మినోల్టా ఎందుకు ఎంపిక చేశావ్? నా కెమేరా కోనికా వాడుతున్నావ్ కదా! అది నీకు నచ్చలేదా?'' అన్నాడు.

''నువ్వు నాకది రికమెండ్ చెయ్యకపోతే, నీకూ అది అంతగా నచ్చలేదేమో అనుకున్నాను'' అన్నాను.

''నేను చెప్పడమెందుకూ, కేటలాగ్ చూసి నువ్వే గ్రహిస్తావనుకున్నాను'' అంటూ తను కేటలాగ్ చూసి ఏయే కారణాలవల్ల కోనికాని ఎంపిక చేశాడో వివరించాడు. అప్పుడతడు నా మిత్రుడిలా కాక కోనికాకు సేల్స్ రిప్రజెంటేటివ్‌లా ధ్వనించాడు.

ఐదు నిముషాల్లో నా మొగ్గు పూర్తిగా కోనికావైపు మళ్లింది. ఆ సమయంలో మా పక్కనే ఉన్న గోపాలకృష్ణన్ కూడా తనూ వెంటనే ఓ కోనికా కెమేరాకు ఆర్డరస్తానన్నాడు.

వెంటనే కొటేషన్‌కోసం వ్రాశాం. రెండు కోనికా కెమెరాలకి కలిపి ఆర్డరిద్దామనుకున్నాం కానీ ఆర్డరు కొటేషన్ ప్రకారమే ఇవ్వాలిట. గోపాలకృష్ణన్‌కి వేరే, మాకు వేరే కొటేషన్లు వచ్చాయి. అందుకని మా ఆర్డర్లు వేరయ్యాయి.

చాన్ కంపెనీ మార్కులు తీసుకోదు. డాలర్లలో ఇవ్వాలి. కాబట్టి ఎక్స్‌చేంజిలో 384 మార్కుల్ని డాలర్లలోకి మార్చి డ్రాఫ్ట్ తీసి చాన్‌కి ఆర్డరు పంపాను.

డబ్బు మన చెయ్యి దాటిపోయింది. డబ్బు తీసుకున్నాక ఆ కంపెనీ కిమ్మనకుండా ఊరుకుంటే ఏంచెయ్యాలో తెలియదు. డబ్బు పంపిన రోజు మార్చి 17. ఆ రోజు మనసులో మొదలైన అనుమానం ఏప్రిల్ మాసం వచ్చేసరికి క్రమంగా పెనుభూతమైంది. కానీ ఏప్రిల్ 3న ట్సోల్ ఆమ్ట్ (కస్టమ్స్ ఆఫీస్) నుంచి – హాంగ్‌కాంగ్‌నుంచి పార్సెల్ ఒకటి వచ్చిందనీ, తీసుకెళ్లమనీ ఉత్తరమొకటి వచ్చింది. ఇక మాకు చెప్పలేనంత ఆనందం, థ్రిల్. వెంటనే వెళ్లాలనుకున్నాం కానీ, వాళ్లు మాతోపాటు కంపెనీ ఇచ్చిన బిల్లు కూడా తీసుకు రావాలన్నారు. కానీ బిల్లు మాకింకా పోస్టులో రాలేదు.

ఇవన్నీ కొత్త, వింత అనుభవాలు. వెంటనే వెళ్లి పార్సెల్ తెచ్చుకోవాలని తహతహగా ఉంది. అందుకని – నేను కస్టమ్స్ ఆఫీసుకి ఫోన్ చేసి పరిస్థితి చెప్పాను. వాళ్లు బిల్లు అక్కర్లేదనీ, కొటేషన్ ఉన్నా చాలనీ అనడంతో ఉత్సాహం పట్టలేకపోయాం.

సకుటుంబంగా కస్టమ్స్ ఆఫీసుకి వెళ్లాం కానీ – అక్కడ వాళ్లు మాచేత ఇంపోర్ట్ డ్యూటీగా 73 మార్కులు కట్టించుకోవడం ఉసూరుమనిపించింది. అప్పటికప్పుడు లెక్కలు వేసి, ఆ కొనుగోలులో ఇంకా లాభమే తప్ప నష్టం లేదని గ్రహించి సరిపెట్టుకున్నాం.

ఇంటికెళ్లేదాకా ఉండబట్టలేక చాలా అవస్థపడ్డాం.

ఇంట్లో పార్సెల్ విప్పి – ముందు కెమేరాను తీసాం. అప్పటికే అలవాటైన కెమేరా కాబట్టి – క్షణాలమీద చెక్ చెయ్యగలిగాం.

అప్పుడు వాచీలు తీశాం. నా వాచీలో ప్రత్యేకత లేదు కానీ, శ్రీమతి వాచీ మాత్రం బంగారు పూత ఉన్న గొలుసుతో చక్కని ఆభరణంలా ఎంతో బాగుంది.

వెంటనే వాచి బిళ్లకి పక్కనున్న కీ బటన్ సాయంతో – తేదీ, టైం అడ్జస్టు చేసి చేతికి పెట్టుకున్నాను.

''నాకు టైం ముఖ్యంకాదు. వాళ్లు ప్యాకింగ్‌లో ఏ టైముంచారో అదే ఉండనివ్వండి'' అంటూ తనూ చేతికి వాచీ పెట్టుకుంది శ్రీమతి.

కాసేపయ్యేక చూస్తే – నా వాచీ మామూలుగానే తిరుగుతోంది కానీ, శ్రీమతి వాచీ ఇలా తిరిగి అలా ఆగిపోతోంది. కాసేపు తంటాలు పడ్డాక శ్రీమతి వాచీ ముళ్లు ఆగకుండా తిరగడానికి ఓ ఉపాయం కనిపెట్టింది. వాచి బిళ్లని మణికట్టుమీద – సరిగ్గా నాడి కొట్టుకునే చోట ఉంచితే ముళ్లు తిరుగుతున్నాయి.

ఆమె ఎంతో అబ్బురపడి, ''వీళ్ల టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ చూడండి. నాడి స్పందనలకు మాత్రమే వాచీ ఆటోమేటిక్‌గా పని చేస్తోంది. కొంచెం పక్కకు కదిలినా సరే, ఆగిపోతోంది'' అంది.

అది విని నేను కంగారు పడ్డాను, ''చేతికి పెట్టుకునే వాచిని అంత కరెక్టుగా నాడిమీద ఎలా పెట్టగలం? పెట్టినా పక్కకి కదలకుండా ఎలా ఆపగలం? చీటికీ మాటికీ వాచి ఆగిపోతుంటే అదుండీ ప్రయోజనమేమిటి?'' అన్నాను.

''చెప్పానుగా, నాకు టైం ముఖ్యంకాదని! ఐనా టైముదేముందీ, పక్కనుంటే మీరు చెబుతారు.మీరు లేనప్పుడు వాచీ ఉన్నవాళ్లని ఎవర్నడిగినా చెబుతారు? ఈ వాచీ చూడండి, బ్రేస్‌లెట్‌కంటే బాగుంది. నాడి తగిలినప్పుడల్లా బాగానే తిరుగుతోంది కదా! కొన్నాళ్లు ప్రాక్టీస్ చేస్తే – అది ఎప్పుడూ నాడిమీదనే ఉండేలా చూడ్డం కష్టమేం కాదు'' అంది శ్రీమతి.

వాచి ఆగకుండా దానంతటదే తిరగాలంటే – మణికట్టుమీద నాడికి తగిలేలా పెట్టుకుని, అటూ ఇటూ కదలిపోకుండా జాగ్రత్తగా ఉండేలా ప్రాక్టీస్ చెయ్యాలంటే – అది టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ కాదనీ, ఇందులో ఏదో తిరకాసుందనీ నాకు అనిపించింది. అలా అనుకుందుకు నా కారణం నాకుంది. మరి నా వాచీ మణికట్టు నాడికి తగలకపోయినా ఆగకుండా నడుస్తోంది. శ్రీమతి ఊహ నిజమైతే – నా వాచీకి టెక్నాలజీ అడ్వాన్సుమెంట్ లేదనే కదా! అది నేనొప్పుకోను.

ఆ మాటే అంటే, ''మగాళ్ల నాడి కాస్త లావయుంటుంది. వాచీ ఎక్కడ పెట్టినా పని చేస్తుంది. అదీకాక మీకు తెలియకుండానే సులువు పట్టేశారని కూడా నా అనుమానం. నాకూ ఇప్పుడిప్పుడే సులువు తెలుస్తోంది. మొదటిసారి రెండు నిముషాలు తిరిగింది. రెండోసారి నాలుగు నిముషాలు తిరిగింది. మూడోసారి పది నిముషాలు తిరిగింది. ఓసారి కరెక్ట్ టైం పెట్టివ్వండి. ఈసారి కనీసం అరగంటదాకా ఆగదని నా నమ్మకం'' అంది శ్రీమతి.

ఈ లాజిక్ నాకు అందలేదు. కానీ ఏం జరుగుతుందోనన్న కుతూహలంతో – ఆమె వాచీ తీసుకున్నాను. కీ బటన్‌తో తేదీ, టైము అడ్జస్టు చేసి అలవాటు ప్రకారం పక్కనున్న బటన్ వెనక్కి నొక్కి – శ్రీమతికి ఇచ్చాను.

తర్వాత మా పనుల్లో మేం పడిపోయాం. సుమారు గంట గడిచేక శ్రీమతి నన్ను టైమెంతయిందని అడిగింది. చెప్పగానే తన వాచీ చూసుకుని, ''అరే, నా టైమూ అంతే అయింది. అంటే గంటయినా వాచీ ఆగలేదు. అంటే నాకు సులువు తెలిసిపోయింది'' అంది ఉత్సాహంగా.

సాంద్రతను కనిపెట్టిన ఆర్కిమెడీస్, 'యురేకా'లా ధ్వనించాయా మాటలు.

ఒక గంటేమిటి – మరో గంట గడిచినా ఆ వాచీ అలా ఆగకుండా తిరుగుతూనే ఉంది. చేతినుంచి తీసినా కూడా తిరుగుతూనే ఉంది.

''మీ చేతిలో ఎదో మంత్రముందండీ – మీరు మీ వాచీకి టైం పెట్టుకున్నారు. అది ఆగకుండా తిరిగింది. నా వాచీకి టైం పెట్టారు. అదీ ఆగకుండా తిరుగుతోంది'' అని శ్రీమతి నామీద పొగడ్తల వర్షం కురిపించింది.

అప్పుడామె టెక్నాలజీ అడ్వాన్సుమెంటుకంటే, నా మంత్రశక్తికే ఎక్కువ సంతోషించినట్లు అర్థమై – నా చేతిలోని ఆ మంత్రశక్తి ఏమిటా అని కాస్త తీవ్రంగానే ఆలోచించాను.

బుర్రలో గడిచిన దృశ్యాలు నెమరుకి వచ్చేసరికి ఉన్నట్లుండి అసలు విషయం స్ఫురించింది.

ప్యాక్ చేసినప్పుడు వాచీ పని చెయ్యకుండా – కీ బటన్‌ని వెనక్కి లాగి ఉంచారు కంపెనీవాళ్లు. టైం అడ్డస్టు చేసేక, కొంచెం నొక్కి – తేదీ మార్చి, మరి కొంచెం నొక్కగానే వాచీ పని చెయ్యడం మొదలెట్టింది. శ్రీమతి ప్యాకెట్లో వాచీని యథాతథంగా చేతికి పెట్టుకున్నప్పుడు – మణికట్టు నాడి కదలికలకు స్పందించినప్పుడు మాత్రమే ముళ్లు తిరుగుతున్నాయి. లేకపోతే ఆగిపోతున్నాయి. దాన్నే మేము టెక్నాలజీ అడ్వాన్స్‌మెంటు అనుకున్నాం. అలవాటుగా నేను కీ బటన్ కిందకి నొక్కితే – అది నా చేతి మంత్రమయింది.

ఈ రహస్యం బయటపడ్డాక – అంత మామూలు విషయం ఎందుకు స్ఫురించలేదని శ్రీమతి కొంచెం సిగ్గు పడింది.

''సైంటిస్టుని కదా, నేను ఇంకా ఎక్కువ సిగ్గుపడాలి'' అన్నాను.

తనని తాను తక్కువ చేసుకుందుకు సంకోచించదు కానీ, నన్ను నేను తక్కువ చేసుకుంటే – ఆమె బుద్ధి భలే వ్యాకోచిస్తుంది.

''న్యూటన్ అంత గొప్ప సైంటిస్టు – తన గది కిటికీలో రాకపోకలకని పెద్ద పిల్లికి పెద్ద కన్నం, చిన్న పిల్లికి చిన్న కన్నం చేసి ఉంచాడు'' అని విషయాన్ని తేల్చేసింది.

కానీ న్యూటన్ చూపిన రెండు కన్నాల ప్రతిభ వాచీలతో ఆగలేదు. కెమేరాకూ విస్తరించింది.

చాన్ ద్వారా వచ్చిన కోనికా కెమేరా ఏ ఇబ్బందులూ లేకుండా బాగా పని చేసేది. పాకెట్ సైజులో ఉండే ఆ కెమేరా వాడకానికి చాలా వీలుగా ఉండేది. బయట ఫొటోలు తీసుకుందుకు అది ఆటోమేటిక్ కెమేరా. ఇంట్లో తీసుకునే ఫొటోలకోసం 99 మార్కులకి రోలై కంపెనీది ఓ ఆటోమేటిక్ ఫ్లాష్ కొన్నాం. అది మార్కెట్లోకి కొత్తగా వచ్చింది. అది ఇంచుమించు కెమేరా అంత సైజూ, బరువూ ఉండేది. వారం పది రోజులు అది బాగానే పని చేసినా – ఒక రోజున అది తగిలించగానే కెమేరా పాడయింది. ఏమయిందా అని కోనికా ఇన్‌సస్ట్రక్షన్ మాన్యూల్ తిరగేస్తే – ఆ కెమేరాకు వాడకూడని ఫ్లాష్‌లు కొన్ని ఉన్నాయని స్పష్టంగా వ్రాసి ఉంది. వాటిలో మేము వాడుతున్న ఆటోమేటిక్ ఫ్లాష్ కూడా ఉంది. ఫ్లాష్ వాడేముందు ఆ మాన్యూల్ చూడాలన్న ఆలోచన రాకపోవడం – ఒక సైంటిస్టుగా నన్ను నేను క్షమించుకోలేను.

స్థానికంగా కెమేరా కొంటే సరిపోయేది. హాంగ్‌కాంగ్‌నుంచి తెప్పించిన కెమేరా ఇది. మరమ్మతుకి ఏంచెయ్యాలో తెలియక – చాన్‌కి ఉత్తరం వ్రాశాను. గతంలో బ్యాటరీలైటు ఉదంతం గుర్తుంచుకుని – ఈసారి నిజాయితీగా జరిగింది జరిగినట్లు ఆ ఉత్తరంలో తెలియబర్చాను.

చాన్ నుంచి వెంటనే బదులొచ్చింది. అలాంటి పొరపాటు మళ్లీ మళ్లీ జరక్కుండా చూసుకోమని హెచ్చరిస్తూ – కెమేరాని వెనక్కి పంపిస్తే ఉచితంగా మరమ్మతు చేసి పంపిస్తానన్నాడు. పోస్టల్ ఛార్జిలు మాత్రం మావి. ఏబ్రాసికి పనెక్కువ, పిసినారికి ఖర్చెక్కువ – అన్న సామెతని గుర్తు చేసుకుని – మరోసారి లెక్కలు వేసి – కెమేరా ఇంకా మాకు చౌకగానే వచ్చిందని సరిపెట్టుకున్నాం.

కోనికా కెమేరా ఆటోమేటిక్ కదా – అంటే కాంతి, ఫోకస్ వగైరాలు వాటికవే అడ్జస్టవుతాయి. అందుకు చొక్కా బొత్తామ పరిమాణపు బ్యాటరీ ఒకటి వాడాలి. అది ఐపోయినప్పుడల్లా మారుస్తుండాలి. ఇండియాలో అలాంటి బ్యాటరీలు దొరుకుతాయో దొరకవోనని నాలుగు కొని స్టాకుంచుకున్నాం.

ఆ తర్వాత బెర్లిన్లోనే స్పెషల్ ఆఫర్లో కారుచౌకగా వచ్చిందని రివ్యూ (రష్యన్ మేక్) ఆటోమేటిక్ కెమేరా ఒకటి కొన్నాం. ఇది కాస్త బరువెక్కువే కానీ – కొనడానికి ఒక్కటే కారణం. దీనికి బ్యాటరీలు మార్చాల్సిన అవసరం లేదు. ఉన్న బ్యాటరీ సోలార్‌ది.

చాన్ నుంచి మేము ఆర్డరిచ్చి తెప్పించిన మరో ఐటమ్ – పానసోనిక్ కంపెనీవారి రేడియో–గ్రామఫోన్–కాసెట్ రికార్డర్. బ్రీఫ్‌కేస్ కంటే చిన్నదిగా ఉండే ఈ పరికరం ఆప్పటి టెక్నాలజీ అడ్వాన్స్‌మెంటుకి ఓ మెచ్చుతునక.

షాపింగులో ఇలాంటి అనుభవాలు మరెన్నో ఉన్నప్పటికీ – వాటిని సందర్భానుసారంగా ప్రస్తావించవచ్చునన్న భావనతో – ఇప్పుడు అక్కడ మా రెసిడెన్స్ పెర్మిట్ గోడు వినిపిస్తాను.

పరిశుభ్రత అంటే అది మామూలు పరిశుభ్రత కాదు.

వాహనాలు లేనప్పుడు నడిరోడ్డు కూడా భోజనాల గది అంత శుభ్రంగా ఉండేది. ఆ రోడ్డు మధ్యలో బాసింపట్టేసుకుని కూర్చుని ముందో అరిటాకు వేసుకుని భోంచేయొచ్చు అనిపించేలా ఉండేది.

బుధ, శనివారాల్లో మా ఇంటిముందు ఏర్పడే సంతలు కూడా ఆ పరిశుభ్రతకి ఆటంకం కలిగించేవి కాదు.

ఆ సంతకు కూరలు, పళ్లు, పప్పుదినుసులు వగైరా వంటకి అవసరమైన పదార్థాలు పలెటూళ్లనుండి వచ్చేవి.

గ్రామస్థులు వాటిని కేరవాన్లలో తీసుకొచ్చేవారు.

ఆ కేరవాన్లు కదిలే ఇళ్లలాంటివి. స్నానం, వంట, పడకతో సహా అన్నింటికీ సదుపాయాలుంటాయి వాటిలో.

సరుకులు అమ్ముడుపోయేక గ్రామస్థులు కాసేపు సిటీలో సరదాగా గడిపి తిరిగి స్వగ్రామం చేరుకుంటారు.

ఈ సంతల్లో లభించే సరుకులు షాపుల్లో పొట్లాల్లో కట్టిన సరుకుల్లా కాక తాజాగా ఉంటాయి. ఎస్టాబ్లిష్‌మెంటు ఖర్చులు తక్కువ కాబట్టి – చౌకగా కూడా ఉంటాయి. ఇంకా షాపుల్లో దొరకని మసాలా దినుసులు కూడా ఇక్కడ దొరికేవి.

అందుకని ఈ సంతలు జనంతో బాగా రద్దీగా ఉండేవి.

జర్మనీలో మిర్చి వాడేవారు బాగా తక్కువ. అక్కడుండే భారతీయుల్లో కూడా ఉత్తరాదివారికి మిర్చి ఆట్టే అవసరపడదు. దక్షిణాది వారిలోనూ తెలుగువారు – వారిలోనూ కొన్ని జిల్లాలవారు మాత్రమే మిర్చికోసం తాపత్రయపడతారు. మరేమో షాపుల్లో ఎక్కువగా సిమ్లా మిర్చి దొరికేది. దాన్ని జర్మన్లో పాప్రికా అంటారు. అందులో కారముండదు సరికదా, రుచికి మామూలు కూరగాయలా ఉంటుంది. ఐనా దాన్నే మిర్చికి ప్రత్యామ్నాయంగా వాడాల్సొచ్చేది. సంతల్లో అయితే మన మిర్చికి కాస్త దగ్గర్లో ఉండే 'పెప్పరోని' దొరికేది. మేము ఒకోసారి కేవలం పెప్పరోని కోసమే సంతకు వెళ్లేవాళ్లం.

మన కూరలు చాలావరకూ దొరికేవి. వంకాయల్ని ఔబర్‌గిన్నెన్ అనేవారు, బంగాళాదుంపల్ని కార్టోఫెల్న్ అనేవారు.

షాపుల్లో ఐతే కిలోకి ఒక మార్కుకి కాస్త అటూ ఇటూలో ఉండే బంగాళా దుంపలు – ఈ సంతలో 69 ఫెన్నిగ్సుకే దొరికేవి.

మేము బంగాళాదుంపలు ఎప్పుడూ ఒకతనివద్దే కొనేవాళ్లం. కారణం అతడికి ఓ చేయి లేదు.

తన మొండిచేతికి పొడవాటి పార ఒకటి కట్టి దానితో దుంపలు తూకమేసేవాడు. ఒంటిచేత్తో బస్తా విప్పి దుంపలు గుడారంలో పోసేవాడు.

అతడెంత చురుగ్గా ఉండేవాడంటే – ఒక చెయ్యి మొండిదన్న భావనే కలిగేది కాదు.

బాబు అతడి చేతినే కన్నార్పకుండా ఆశ్చర్యంగా చూసేవాడు.

అంగవైకల్యానికి కృంగిపోకుండా అదొక అత్యంత సాధారణ విషయమైనట్లు ప్రవర్తిస్తూ హుషారైన మామూలు మనుషుల్లాగే తనూ హుషారుగా ఉండే అతడి వ్యక్తిత్వం ఆదర్శమని మేము పిల్లలకి చెప్పేవాళ్లం.

అతణ్ణి ప్రత్యేకంగానూ, జాలిగానూ చూడకూడదని వాళ్లకి మరీ మరీ చెప్పేవాళ్లం.

ఐతే – మొండిచేతికి పార కట్టి మామూలు చెయ్యిలాగే అవలీలగా ఉపయోగించే అతగాడు కనబడగానే బాబు మాత్రం కన్నార్పడం మర్చిపోయేవాడు.

అంతమంది జనమున్నా, అమ్మేవన్నీ కూరగాయలూ ఆ తరహావీ ఐనా – సంత శుభ్రతకు మారుపేరులా ఉండేది.

జరుగుతున్నప్పుడు ఎంత శుభ్రంగా ఉండేదో, అంతా కాళీ చేసి వెళ్లిపోయేక కూడా ఆ ప్రదేశం అంత శుభ్రంగానూ ఉండేది.

ఇది మనం భారతీయులం గమనించి, అనుసరించాల్సిన – గొప్ప విశేషమని మేము అనుకునేవాళ్లం.

బయట తిరిగేటప్పుడు బాబుకి మరో ఇబ్బంది ఉండేది.

ఇండియాలో బయట బళ్ల దగ్గర బజ్జీలో, పానీపూరీలో తినడం అలవాటు. లేదా హొటలుకెళ్లి ఇడ్లీలో, దోశలో తినేవాళ్లం. ఇక్కడా అలాంటివి తినాలనుండేది వాడికి.

బయట ఎక్కువగా వుర్స్ట్ బళ్లుండేవి. అది మాంసమని చెప్పేక దానివైపు చూడ్డం మానేసేడు వాడు. ఐతే పలుచోట్ల పోమెస్ ఫ్రైట్స్ అమ్మే బళ్లు ఉండేవి. వాటిని ఫ్రెంచి ఫ్రైస్ అంటారని అప్పట్లో తెలియక – బంగాళా దుంపల వేపుడు అనేవాళ్లం మేము. అప్పటికప్పుడు మెషీన్లో బంగాళా దుంపల్ని సన్నని పొడవాటి ముక్కల్లా తరిగి, మరుగుతున్న నూనెలో వేయించి, ఓ పొట్లంలో పెట్టి ఇచ్చేవారు. నంజుకుందుకు సెన్ఫ్ సాసె (పసుపుపచ్చని ఆవపిండి) ఇచ్చేవారు. శ్రీమతికీ, పిల్లలకీ కూడా ఆ వేపుడు చాలా నచ్చేది. కానీ గుప్పెడు వేపుడు ముక్కల ఖరీదు ఒక మార్కు. 70 ఫెన్నిగ్సుకి కిలో బంగాళాదుంపలు వస్తున్నప్పుడు – కాసిని వేపుడు ముక్కలకి ఒక మార్కు ఏమిటని శ్రీమతి – అవి కొనడానికి ఒప్పుకునేది కాదు.

ప్రతి పైసకీ విలువున్న రోజులవి. జర్మనీలో ఉండగా మేము రెండు మూడుసార్లకు మించి వాటిని కొనలేదు.

కొన్ని హొటళ్లముందు బయట షామియానాలు వేసి ఫలహారాలు, పానీయాలు అందించేవారు. అవి మేము తినేవీ, తాగేవీ కాదు. పాపకి ఆ విషయం తెలిసేది కానీ, బాబుకి అర్థమయ్యేది కాదు. అక్కడికెళ్లి దోశ తిందామని ఏడ్చేవాడు. దొరకవంటే దు;ఖమొచ్చేసేది వాడికి. వాడి దృష్టి మళ్లించడానికి నేను ఇండియాకి వెళ్లేక హొటల్లో పెసరట్, దోశ తినడం గురించి ఊరించే మాటలు చెప్పేవాణ్ణి. అది వాడి మనసుకి హత్తుకుపోవడంకోసం వరసకట్టి పాటలా పాడేవాణ్ణి. ఆ పాట వాడికి ఎంత నచ్చేదంటే – కాసేపటికే వాడూ నాతో గళం కలిపేవాడు. తర్వాత పాప కూడా మాతో కలిసేది. హాయిగా పాడుకుంటూ ఇల్లు చేరేవాళ్లం.

నాకు టేపు రికార్డరు మీద మహా మోజు. శ్రీమతి వచ్చేలోగానే ఒక కాసెట్ టేపు రికార్డరు, స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు – రెండూ గ్రుండిగ్ కంపెనీవే కొని ఉంచాను. వాళ్లు వచ్చీరాగానే వాళ్ల గొంతులు వాళ్లకి వినిపించడం ఆదో థ్రిల్.

మావాళ్లు వచ్చినప్పుడు కొన్నాళ్లు వాడుకోమని ఓంప్రకాష్ నాకో కెమేరా ఇచ్చాడు. అది కోనికా కంపెనీది. ఫొటోలు తియ్యడానికి మన నైపుణ్యంతో నిమిత్తం లేని ఆటోమేటిక్ లైటింగ్, ఫోకస్ ఏర్పాట్లు ఉన్నాయి. అందులో ఫొటోలు తీస్తే చాలా బాగా వచ్చాయి.

''ఇన్ని కొన్నారు. ఇలాంటి కెమేరా ఒకటి మనకీ ఎందుకు కొనలేదు?'' అంది శ్రీమతి.

ఐతే నేను కొనకపోవడానికో కారణముంది.

నాతో జర్మనీ వచ్చిన ఇండియన్సులో నటరాజన్‌కి ఫొటోగ్రఫీ మీద మహా ఆసక్తి. ఆతగాడు ఇండియానుంచి ఖరీదైన కెమేరా ఒకటి తెచ్చుకున్నాడు. దానికి స్పేర్సు కొనాలని అనేవాడు. ఆటోమేటిక్ కెమేరాల గురించి ఎవరైనా అన్నప్పుడు – ''కొంటే మాన్యువల్ టైపే కొనాలి. ఆటోమేటిక్ కెమేరాల ఫొటోల క్వాలిటీ అంతంతమాత్రం'' అనేవాడు. ఫొటోలకి సంబంధించి నాకేం తెలియదు కాబట్టి ఆ మాటలు బాగా వంటబట్టించుకున్నాను.

బెర్లిన్ వచ్చేక కిర్షనర్ ఐతే, ''ఫొటో తియ్యడం ఓ కళ. ఆ కళమీద ఆసక్తి ఉన్నవాళ్లకే స్వంత కెమేరా ఉండాలి. ఎలాగో అలా ఏదో ఒక ఫొటో తీసుకుని దాచుకోవాలనుకునేవాళ్లు ఎవరిచేతనైనా తీయించుకోవడమో, కెమేరా ఎరువు తెచ్చుకోవడమో చెయ్యాలి'' అనేవాడు.

ఇండియాలో మాకో డబ్బా కెమేరా ఉండేది. దాంతో తీసిన ఫొటోల్లో మనుషులు గుర్తు తెలిస్తే చాలు – మహా సంబరపడిపోయేవాళ్లం. స్వంతంగా కెమేరా కొనుక్కోవడం ఆ రోజుల్లో ఇండియాలో ఎంత పెద్ద లగ్జరీ అంటే – ఆర్థికంగా నాకంటే రెండు మెట్లు పైనే ఉన్న నా కొలీగ్సులో కొందరు – వాళ్ల అవసరానికి నా డబ్బా కెమేరాని ఎరువు తీసుకునేవారు.

ఆ పరిస్థితుల్లోంచి వచ్చి ఇక్కడ పడ్డాను. ఇక్కడ ప్రతివారి చేతిలోనూ కెమేరాయే.

మంచి ఫొటోగ్రాఫర్‌గా కిర్షనర్‌కి మంచి పేరుంది. అందువల్ల అతడి మాటలకి కొంచెం విలువిచ్చి – ఫొటోగ్రఫీని కళగా అభ్యసించాలనే అనుకున్నాను. కానీ నాకందుకు తీరుబడి దొరకడం లేదు.

ఫొటోగ్రఫీ గురించి కొంత అవగాహన వచ్చేక నా అభిరుచుల మేరకు కెమేరాను ఎంపిక చేసుకుని కొనుక్కోవాలనుకోవడం వల్ల – ఆ కొనుగోలుని వాయిదా వేస్తూ వచ్చాను.

''ఇక్కడ ఇంచుమించు ప్రతి రోజూ ఏదో కొత్త విశేషం ఎదురౌతోంది. అవన్నీ ఫొటోలు తీసుకుంటే మనకి రికార్డుంటుంది. ఎవరిదో కెమేరా ఎన్నాళ్లుంచుకుంటాం. మనకంటూ ఏదో ఒక కెమేరా ఉండాలి. డబ్బా కెమేరా ఫొటోలకే తృప్తి చెందినవాళ్లం. జర్మనీలో కొన్న ఫారిన్ కెమేరా ఏదైనా మన ప్రాణాలకి గొప్పే కదా!'' అంది శ్రీమతి.

ఆమె సౌమ్యంగా అంది కానీ – ''మన మొహాలకి ఫొటోలు ముఖ్యం కానీ, ఫొటోగ్రఫీ కళ కాదు'' అన్న ధ్వని ఉంది.

దాంతో కెమెరా కొనుగోలు మరి వాయిదా వెయ్యకూడదనిపించి ఓంప్రకాష్‌ని సలహా అడుగుతానన్నాను.

''అన్నింటికీ అతన్నే అడగాలా! మీరూ ఇక్కడ చాలా నెలలుగా ఉంటున్నారు. షాపులకి వెడితే ఎవర్నీ అడగక్కర్లేకుండా షో కేసుల్లో పరిచేసి ఉంటాయి కెమేరాలు. వాటి వివరాలు అక్కడే వ్రాసి ఉంటాయి. మనక్కావలసింది మనం కొనుక్కోలేమా?'' అంది శ్రీమతి.

అలాగందని కొన్ని షాపులు తిరిగి కెమేరాలు చూశాం కానీ – డిస్‌ప్లేలో ఇచ్చిన వివరాలు అర్థం చేసుకుందుకు మా పరిజ్ఞానం సరిపోలేదు. అక్కడే తచ్చాడుతూ ఒకటికి రెండుసార్లు మాలో మేము చర్చించుకుంటుంటే బిట్టేషోన్లు వచ్చేసేవారు. వాళ్లకి మా ఆంచనాలు చెప్పడానికి సరిపడ భాషాజ్ఞానం మాకు లేదు.

''ఇలాంటి విషయాల్లో ఓంప్రకాష్ సర్వజ్ఞుడు. మెహర్బానీకి పోవద్దు. అతడి సలహా తీసుకుందాం'' అన్నాను శ్రీమతితో.

''ఇందులో మెహర్బానీ ఏముంది? చిన్న కెమేరా మనంతట మనం కొనుక్కోలేమా అని అలా అన్నాను కానీ, అతడి సలహా మనకి నిషిద్ధమేం కాదు. ఇప్పటికే చాలా విషయాల్లో అతడి సలహాలు మనకి పనికొచ్చాయి. వాటికి ఇది ఇంకొకటి అనుకుందాం'' అంది శ్రీమతి.

గొప్పవాళ్లకి అలంకారం కావచ్చు. పేదవాళ్ల పెదవికి చేటు కావచ్చు. కానీ పేదా గొప్పా తేడా లేకుండా ప్రతి మనిషిలోనూ అహం ఉంటుంది. మనిషి జీవితం సుకరం కాకుండా పోవడానికి దాని ప్రయత్నం అది చేస్తూనే ఉంటుంది. దాన్నించి బయటపడ్డాన్నే వివేకం అంటారు.

నేను వివేకం పాటించి ఓంప్రకాష్‌ని కెమేరా కొనుగోలు గురించి సలహా అడిగాను.

అతగాడు వెంటనే, ''జర్మనీలో కెమేరాల ధర చాలా ఎక్కువ. హాంగ్‌కాంగ్‌నుంచి తెప్పించుకుంటే బాగా చౌక పడుతుంది. నా దగ్గర టిఎం చాన్ కేటలాగ్ ఒకటుంది. అదిస్తాను. అందులో ప్రతి వస్తువు వివరాలూ మనలాంటి మామూలు వాళ్లకి అర్థమయ్యేలా ఉంటాయి. నీకు నచ్చింది ఎంచుకో. ఆర్డరిచ్చేద్దాం'' అన్నాడు.

అతగాడిచ్చిన కేటలాగ్ చూసి నేనూ, శ్రీమతీ కూడా వెర్రెత్తిపోయాం. అందులో మాకు తెలియని వస్తువులు చాలా ఉన్నాయి. ఒక పేజీ చూస్తే రెండో పేజికి వెళ్లడం కష్టమయ్యేది.

అలా ఒకటి రెండు రోజులు గడిచేక, ''ఈ కేటలాగ్ మీద మనమేదో పరీక్ష వ్రాయబోతున్నట్లుంది మన ధోరణి. ముందు మన దృష్టిని కెమేరాలమీద సారిద్దాం'' అన్నాను.

ఇద్దరం కెమేరాల వివరాలు చూసి – మాకు అర్థమైన మేరకి మినోల్టా కెమేరా ఒకటి ఎంపిక చేసి తెగ మురిసిపోయాం. అది జర్మనీలో ఆరొందల మార్కులుంటే, హాంగ్‌కాంగ్‌లో మూడొందల మార్కుల లోపే పడుతోంది.

''మనకి డబ్బులు కలిసొచ్చాయి కాబట్టి – ఆటోమేటిక్ వాచీలు కూడా కొనుక్కుందామండీ'' అంది శ్రీమతి.

రోజుకి ఇరవైనాలుగు గంటలుంటే – నిద్రకో 7–8 గంటలు మినహాయించి – మిగతా సమయాన్ని నిముషాలతో సహా పనులకు కేటాయించే తత్వం చిన్నప్పట్నించీ నాకు అలవడింది. చేతికి గడియారం లేకపోయినా, మనసులో టైము అంచనా వేసుకుని మధ్యమధ్య ఏ గోడ గడియారాన్నో చూసుకుంటూ మసలడంతో – నాకు టైమ్ సెన్స్ బాగా అలవడింది. అప్పట్లో రేడియో సిలోన్‌లో వచ్చే వివిధ కార్యక్రమాలు ఒక్కటి కూడా మిస్సవకుండా వినడం అలాగే సాధ్యపడేది. ప్రతి బుధవారం ఎనిమిది గంటలకి వచ్చే బినాకా (తర్వాత సిబాకా అయింది) గీత్‌మాలా కార్యక్రమం విని పాటల రాంక్స్ పుస్తకంలో వ్రాసుకునేవాణ్ణి. దశాబ్దాల తరబడి ఆ వివరాలు ఒక్కసారి కూడా మిస్ కాలేదంటే అందుకు టైమ్ సెన్సే కారణం.

నాదంటూ సంపాదన వచ్చేక కేవలం నాకోసమని నేను చేసిన మొదటి పెద్ద పర్చేజ్ రిస్ట్‌వాచ్.

ఆ వాచికి 24 గంటలకోసారి కీ ఇస్తుండాలి. లేకపోతే ఆగిపోతుంది. కీ అవసరం లేకుండా ఎప్పటికీ ఆగిపోకుండా పనిచేసే ఆటోమేటిక్ వాచీలుండేవి కానీ, వాటి ఖరీదు మామూలు వాచీల ఖరీదుకి రెట్టింపుండేవి. అదీకాక ఆటోమేటిక్ వాచీలని ఫేవర్లుబా, సీకో వంటి పెద్ద కంపెనీలు మాత్రమే తయారు చేసేవి. ఆ బ్రాండువి మామూలు వాచీలే చాలా ఖరీదు.

ఆటోమేటిక్ వాచీ కొనుక్కోవాలన్నది అప్పట్లో నా కల. సమయపాలనలో, ఇతర వ్యాపకాల్లో శ్రీమతి నాకు సరిజోడు కావడంవల్ల తనకీ ఆటోమేటిక్ వాచీమీద మనసుండేది. జర్మనీ అవకాశం రాగానే – అక్కడ కొనుక్కోవాల్సిన వాటిలో ఈ ఆటోమేటిక్ వాచీలనీ అనుకున్నాం. కానీ ఎందుకో ఆ ఆలోచన తాత్కాలికంగా మరుగున పడింది.

షాపులు తిరుగుతున్నప్పుడు చాలాచోట్ల వాచీలు చూశాం. అక్కడ కీ అవసరం లేకుండా తిరిగే క్వార్ట్జ్ వాచీలు కొత్తగా వస్తున్నాయి. ఐతే అవి బ్యాటరీతో పని చేస్తాయి. నేననుకున్న ఆటోమేటిక్ వాచీలకు బ్యాటరీ అవసరం లేదు. బ్యాటరీ అదో అదనపు ఖర్చు, దండుగ అనుకుని క్వార్ట్జ్ వాచీల జోలికి వెళ్లలేదు. అది అప్పట్లో చాలామంది ఆలోచనావిధానం.

చాన్ కేటలాగులో ఇద్దరం చెరో వాచీ ఎంపిక చేసుకున్నాం. జర్మనీ ధరలతో పోల్చితే అవి కారుచౌక.

మా ఎంపిక అయ్యేక ఓంప్రకాష్‌కి చెప్పాను. అతగాడు వాచీల ఎంపికని తెగ మెచ్చుకుని, "కెమేరా మినోల్టా ఎందుకు ఎంపిక చేశావ్? నా కెమేరా కోనికా వాడుతున్నావ్ కదా! అది నీకు నచ్చలేదా?" అన్నాడు.

''నువ్వు నాకది రికమెండ్ చెయ్యకపోతే, నీకూ అది అంతగా నచ్చలేదేమో అనుకున్నాను'' అన్నాను.

''నేను చెప్పడమెందుకూ, కేటలాగ్ చూసి నువ్వే గ్రహిస్తావనుకున్నాను'' అంటూ తను కేటలాగ్ చూసి ఏయే కారణాలవల్ల కోనికాని ఎంపిక చేశాడో వివరించాడు. అప్పుడతడు నా మిత్రుడిలా కాక కోనికాకు సేల్స్ రిప్రజెంటేటివ్‌లా ధ్వనించాడు.

ఐదు నిముషాల్లో నా మొగ్గు పూర్తిగా కోనికావైపు మళ్లింది. ఆ సమయంలో మా పక్కనే ఉన్న గోపాలకృష్ణన్ కూడా తనూ వెంటనే ఓ కోనికా కెమేరాకు ఆర్డరస్తానన్నాడు.

వెంటనే కొటేషన్‌కోసం వ్రాశాం. రెండు కోనికా కెమెరాలకి కలిపి ఆర్డరిద్దామనుకున్నాం కానీ ఆర్డరు కొటేషన్ ప్రకారమే ఇవ్వాలిట. గోపాలకృష్ణన్‌కి వేరే, మాకు వేరే కొటేషన్లు వచ్చాయి. అందుకని మా ఆర్డర్లు వేరయ్యాయి.

చాన్ కంపెనీ మార్కులు తీసుకోదు. డాలర్లలో ఇవ్వాలి. కాబట్టి ఎక్స్‌చేంజిలో 384 మార్కుల్ని డాలర్లలోకి మార్చి డ్రాఫ్ట్ తీసి చాన్‌కి ఆర్డరు పంపాను.

డబ్బు మన చెయ్యి దాటిపోయింది. డబ్బు తీసుకున్నాక ఆ కంపెనీ కిమ్మనకుండా ఊరుకుంటే ఏంచెయ్యాలో తెలియదు. డబ్బు పంపిన రోజు మార్చి 17. ఆ రోజు మనసులో మొదలైన అనుమానం ఏప్రిల్ మాసం వచ్చేసరికి క్రమంగా పెనుభూతమైంది. కానీ ఏప్రిల్ 3న ట్సోల్

ఆమ్ట్ (కస్టమ్స్ ఆఫీస్) నుంచి – హాంగ్‌కాంగ్‌నుంచి పార్సెల్ ఒకటి వచ్చిందనీ, తీసుకెళ్లమనీ ఉత్తరమొకటి వచ్చింది. ఇక మాకు చెప్పలేనంత ఆనందం, థ్రిల్. వెంటనే వెళ్లాలనుకున్నాం కానీ, వాళ్లు మాతోపాటు కంపెనీ ఇచ్చిన బిల్లు కూడా తీసుకు రావాలన్నారు. కానీ బిల్లు మాకింకా పోస్టులో రాలేదు.

ఇవన్నీ కొత్త, వింత అనుభవాలు. వెంటనే వెళ్లి పార్సెల్ తెచ్చుకోవాలని తహతహగా ఉంది. అందుకని – నేను కస్టమ్స్ ఆఫీసుకి ఫోన్ చేసి పరిస్థితి చెప్పాను. వాళ్లు బిల్లు అక్కర్లేదనీ, కొటేషన్ ఉన్నా చాలనీ అనడంతో ఉత్సాహం పట్టలేకపోయాం.

సకుటుంబంగా కస్టమ్స్ ఆఫీసుకి వెళ్లాం కానీ – అక్కడ వాళ్లు మాచేత ఇంపోర్ట్ డ్యూటీగా 73 మార్కులు కట్టించుకోవడం ఉసూరుమనిపించింది. అప్పటికప్పుడు లెక్కలు వేసి, ఆ కొనుగోలులో ఇంకా లాభమే తప్ప నష్టం లేదని గ్రహించి సరిపెట్టుకున్నాం.

ఇంటికెళ్లేదాకా ఉండబట్టలేక చాలా అవస్థపడ్డాం.

ఇంట్లో పార్సెల్ విప్పి – ముందు కెమేరాను తీసాం. అప్పటికే అలవాటైన కెమేరా కాబట్టి – క్షణాలమీద చెక్ చెయ్యగలిగాం.

అప్పుడు వాచీలు తీశాం. నా వాచీలో ప్రత్యేకత లేదు కానీ, శ్రీమతి వాచీ మాత్రం బంగారు పూత ఉన్న గొలుసుతో చక్కని ఆభరణంలా ఎంతో బాగుంది.

వెంటనే వాచి బిళ్లకి పక్కనున్న కీ బటన్ సాయంతో – తేదీ, టైం అడ్జస్టు చేసి చేతికి పెట్టుకున్నాను.

''నాకు టైం ముఖ్యంకాదు. వాళ్లు ప్యాకింగ్‌లో ఏ టైముంచారో అదే ఉండనివ్వండి'' అంటూ తనూ చేతికి వాచీ పెట్టుకుంది శ్రీమతి.

కాసేపయ్యేక చూస్తే – నా వాచీ మామూలుగానే తిరుగుతోంది కానీ, శ్రీమతి వాచీ ఇలా తిరిగి అలా ఆగిపోతోంది. కాసేపు తంటాలు పడ్డాక శ్రీమతి వాచీ ముళ్లు ఆగకుండా తిరగడానికి ఓ ఉపాయం కనిపెట్టింది. వాచి బిళ్లని మణికట్టుమీద – సరిగ్గా నాడి కొట్టుకునే చోట ఉంచితే ముళ్లు తిరుగుతున్నాయి.

ఆమె ఎంతో అబ్బురపడి, ''వీళ్ల టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ చూడండి. నాడి స్పందనలకు మాత్రమే వాచీ ఆటోమేటిక్‌గా పని చేస్తోంది. కొంచెం పక్కకు కదిలినా సరే, ఆగిపోతోంది'' అంది.

అది విని నేను కంగారు పడ్డాను, ''చేతికి పెట్టుకునే వాచిని అంత కరెక్టుగా నాడిమీద ఎలా పెట్టగలం? పెట్టినా పక్కకి కదలకుండా ఎలా ఆపగలం? చీటికీ మాటికీ వాచి ఆగిపోతుంటే అదుండీ ప్రయోజనమేమిటి?'' అన్నాను.

''చెప్పానుగా, నాకు టైం ముఖ్యంకాదని! ఐనా టైముదేముందీ, పక్కనుంటే మీరు చెబుతారు.మీరు లేనప్పుడు వాచీ ఉన్నవాళ్లని ఎవర్నడిగినా చెబుతారు? ఈ వాచీ చూడండి, బ్రేస్‌లెట్‌కంటే బాగుంది. నాడి తగిలినప్పుడల్లా బాగానే తిరుగుతోంది కదా! కొన్నాళ్లు ప్రాక్టీస్ చేస్తే – అది ఎప్పుడూ నాడిమీదనే ఉండేలా చూడ్డం కష్టమేం కాదు'' అంది శ్రీమతి.

వాచి ఆగకుండా దానంతటదే తిరగాలంటే – మణికట్టుమీద నాడికి తగిలేలా పెట్టుకుని, అటూ ఇటూ కదలిపోకుండా జాగ్రత్తగా ఉండేలా ప్రాక్టీస్ చెయ్యాలంటే – అది టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్ కాదనీ, ఇందులో ఏదో తిరకాసుందనీ నాకు అనిపించింది. అలా అనుకుందుకు నా కారణం నాకుంది. మరి నా వాచీ మణికట్టు నాడికి తగలకపోయినా ఆగకుండా నడుస్తోంది. శ్రీమతి ఊహ నిజమైతే – నా వాచీకి టెక్నాలజీ అడ్వాన్సుమెంట్ లేదనే కదా! అది నేనొప్పుకోను.

ఆ మాటే అంటే, ''మగాళ్ల నాడి కాస్త లావయుంటుంది. వాచీ ఎక్కడ పెట్టినా పని చేస్తుంది. అదీకాక మీకు తెలియకుండానే సులువు పట్టేశారని కూడా నా అనుమానం. నాకూ ఇప్పుడిప్పుడే సులువు తెలుస్తోంది. మొదటిసారి రెండు నిముషాలు తిరిగింది. రెండోసారి నాలుగు

నిముషాలు తిరిగింది. మూడోసారి పది నిముషాలు తిరిగింది. ఓసారి కరెక్ట్ టైం పెట్టివ్వండి. ఈసారి కనీసం అరగంటదాకా ఆగదని నా నమ్మకం'' అంది శ్రీమతి.

ఈ లాజిక్ నాకు అందలేదు. కానీ ఏం జరుగుతుందోనన్న కుతూహలంతో – ఆమె వాచీ తీసుకున్నాను. కీ బటన్‌తో తేదీ, టైము అడ్జస్టు చేసి అలవాటు ప్రకారం పక్కనున్న బటన్ వెనక్కి నొక్కి – శ్రీమతికి ఇచ్చాను.

తర్వాత మా పనుల్లో మేం పడిపోయాం. సుమారు గంట గడిచేక శ్రీమతి నన్ను టైమెంతయిందని అడిగింది. చెప్పగానే తన వాచీ చూసుకుని, ''అరే, నా టైమూ అంతే అయింది. అంటే గంటయినా వాచీ ఆగలేదు. అంటే నాకు సులువు తెలిసిపోయింది'' అంది ఉత్సాహంగా.

సాంద్రతను కనిపెట్టిన ఆర్కిమెడీస్, 'యురేకా'లా ధ్వనించాయా మాటలు.

ఒక గంటేమిటి – మరో గంట గడిచినా ఆ వాచీ అలా ఆగకుండా తిరుగుతూనే ఉంది. చేతినుంచి తీసినా కూడా తిరుగుతూనే ఉంది.

''మీ చేతిలో ఎదో మంత్రముందండీ – మీరు మీ వాచీకి టైం పెట్టుకున్నారు. అది ఆగకుండా తిరిగింది. నా వాచీకి టైం పెట్టారు. అదీ ఆగకుండా తిరుగుతోంది'' అని శ్రీమతి నామీద పొగడ్తల వర్షం కురిపించింది.

అప్పుడామె టెక్నాలజీ అడ్వాన్సుమెంటుకంటే, నా మంత్రశక్తికే ఎక్కువ సంతోషించినట్లు అర్థమై – నా చేతిలోని ఆ మంత్రశక్తి ఏమిటా అని కాస్త తీవ్రంగానే ఆలోచించాను.

బుర్రలో గడిచిన దృశ్యాలు నెమరుకి వచ్చేసరికి ఉన్నట్లుండి అసలు విషయం స్ఫురించింది.

ప్యాక్ చేసినప్పుడు వాచీ పని చెయ్యకుండా – కీ బటన్‌ని వెనక్కి లాగి ఉంచారు కంపెనీవాళ్లు. టైం అడ్జస్టు చేసేక, కొంచెం నొక్కి – తేదీ మార్చి, మరి కొంచెం నొక్కగానే వాచీ పని చెయ్యడం మొదలెట్టింది. శ్రీమతి ప్యాకెట్లో వాచీని యథాతథంగా చేతికి పెట్టుకున్నప్పుడు – మణికట్టు నాడి కదలికలకు స్పందించినప్పుడు మాత్రమే ముళ్లు తిరుగుతున్నాయి. లేకపోతే ఆగిపోతున్నాయి. దాన్నే మేము టెక్నాలజీ అడ్వాన్స్‌మెంటు అనుకున్నాం. అలవాటుగా నేను కీ బటన్ కిందకి నొక్కితే – అది నా చేతి మంత్రమయింది.

ఈ రహస్యం బయటపడ్డాక – అంత మామూలు విషయం ఎందుకు స్ఫురించలేదని శ్రీమతి కొంచెం సిగ్గు పడింది.

''సైంటిస్టుని కదా, నేను ఇంకా ఎక్కువ సిగ్గుపడాలి'' అన్నాను.

తనని తాను తక్కువ చేసుకుందుకు సంకోచించదు కానీ, నన్ను నేను తక్కువ చేసుకుంటే – ఆమె బుద్ధి భలే వ్యాకోచిస్తుంది.

''న్యూటన్ అంత గొప్ప సైంటిస్టు – తన గది కిటికీలో రాకపోకలకని పెద్ద పిల్లికి పెద్ద కన్నం, చిన్న పిల్లికి చిన్న కన్నం చేసి ఉంచాడు'' అని విషయాన్ని తేల్చేసింది.

కానీ న్యూటన్ చూపిన రెండు కన్నాల ప్రతిభ వాచీలతో ఆగలేదు. కెమేరాకూ విస్తరించింది.

చాన్ ద్వారా వచ్చిన కోనికా కెమేరా ఏ ఇబ్బందులూ లేకుండా బాగా పని చేసేది. పాకెట్ సైజులో ఉండే ఆ కెమేరా వాడకానికి చాలా వీలుగా ఉండేది. బయట ఫొటోలు తీసుకుందుకు అది ఆటోమేటిక్ కెమేరా. ఇంట్లో తీసుకునే ఫొటోలకోసం 99 మార్కులకి రోలై కంపెనీది ఓ ఆటోమేటిక్ ఫ్లాష్ కొన్నాం. అది మార్కెట్లోకి కొత్తగా వచ్చింది. అది ఇంచుమించు కెమేరా అంత సైజూ, బరువూ ఉండేది. వారం పది రోజులు అది బాగానే పని చేసినా – ఒక రోజున అది తగిలించగానే కెమేరా పాడయింది. ఏమయిందా అని కోనికా ఇన్‌స్ట్రక్షన్ మాన్యూల్ తిరగేస్తే – ఆ కెమేరాకు వాడకూడని ఫ్లాష్‌లు కొన్ని ఉన్నాయని స్పష్టంగా వ్రాసి ఉంది. వాటిలో మేము వాడుతున్న ఆటోమేటిక్ ఫ్లాష్ కూడా ఉంది. ఫ్లాష్ వాడేముందు ఆ మాన్యూల్ చూడాలన్న ఆలోచన రాకపోవడం – ఒక సైంటిస్టుగా నన్ను నేను క్షమించుకోలేను.

స్థానికంగా కెమేరా కొంటే సరిపోయేది. హాంగ్‌కాంగ్‌నుంచి తెప్పించిన కెమేరా ఇది.
మరమ్మతుకి ఏంచెయ్యాలో తెలియక – చాన్‌కి ఉత్తరం వ్రాశాను. గతంలో బ్యాటరీలైటు ఉదంతం గుర్తుంచుకుని – ఈసారి నిజాయితీగా జరిగింది జరిగినట్లు ఆ ఉత్తరంలో తెలియబర్చాను.

చాన్ నుంచి వెంటనే బదులొచ్చింది. అలాంటి పొరపాటు మళ్లీ మళ్లీ జరక్కుండా చూసుకోమని హెచ్చరిస్తూ – కెమేరాని వెనక్కి పంపిస్తే ఉచితంగా మరమ్మతు చేసి పంపిస్తానన్నాడు. పోస్టల్ ఛార్జిలు మాత్రం మావి. ఏబ్రాసికి పనెక్కువ, పిసినారికి ఖర్చెక్కువ – అన్న సామెతని గుర్తు చేసుకుని – మరోసారి లెక్కలు వేసి – కెమేరా ఇంకా మాకు చౌకగానే వచ్చిందని సరిపెట్టుకున్నాం.

కోనికా కెమేరా ఆటోమేటిక్ కదా – అంటే కాంతి, ఫోకస్ వగైరాలు వాటికవే అడ్జస్టవుతాయి. అందుకు చొక్కా బొత్తామ పరిమాణపు బ్యాటరీ ఒకటి వాడాలి. అది ఐపోయినప్పుడల్లా మారుస్తుండాలి. ఇండియాలో అలాంటి బ్యాటరీలు దొరుకుతాయో దొరకవోనని నాలుగు కొని స్టాకుంచుకున్నాం.

ఆ తర్వాత బెర్లిన్లోనే స్పెషల్ ఆఫర్లో కారుచౌకగా వచ్చిందని రివ్యూ (రష్యన్ మేక్) ఆటోమేటిక్ కెమేరా ఒకటి కొన్నాం. ఇది కాస్త బరువెక్కువే కానీ – కొనడానికి ఒక్కటే కారణం. దీనికి బ్యాటరీలు మార్చాల్సిన అవసరం లేదు. ఉన్న బ్యాటరీ సోలార్‌ది.

చాన్ నుంచి మేము ఆర్డరిచ్చి తెప్పించిన మరో ఐటమ్ – పానసోనిక్ కంపెనీవారి రేడియో–గ్రామఫోన్–కాసెట్ రికార్డర్. బ్రీఫ్‌కేస్ కంటే చిన్నదిగా ఉండే ఈ పరికరం అప్పటి టెక్నాలజీ అడ్వాన్స్‌మెంటుకి ఓ మెచ్చుతునక.

షాపింగులో ఇలాంటి అనుభవాలు మరెన్నో ఉన్నప్పటికీ – వాటిని సందర్భానుసారంగా ప్రస్తావించవచ్చునన్న భావనతో – ఇప్పుడు అక్కడ మా రెసిడెన్స్ పెర్మిట్ గోడు వినిపిస్తాను.

***

(అనుమతి పాట్లు బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

రోజూ ఊపిరి తీసుకున్నట్లే – చాలా ముఖ్య విశేషాలు కొన్ని మనకు తెలియకుండానే జరిగిపోతుంటాయి.
తెలిసినవారికి ఈ మాత్రం తెలియదా అనిపిస్తుంది కానీ తెలియనివారికి చిన్న విషయం కూడా విశేషమే.
బాగా చిన్నప్పుడు నాకు బస్సు ప్రయాణమంటే తెలియదు. ఎక్కి కూర్చోవడమే అనుకునేవాణ్ణి.
టికెట్లు పెద్దలు తీసుకునేవారు. అది నా దృష్టికొచ్చేది కాదు.
నాకంటే చిన్నపిల్లలు కొందరికి ఆ విషయం తెలుసని గ్రహించేక, నా పరిమిత జ్ఞానానికి సిగ్గు పడ్డాను.
నాకు నాలుగేళ్లప్పుడు కాబోలు, మా బాబాయిగారు ఓ దుకాణంలో మనీపర్సు కొన్నారు.
ఇంటికొచ్చేక మా పిన్ని ఆయన్ని దేనికో డబ్బులడిగింది.
''అంత డబ్బు లేదు. వచ్చే నెల చూద్దాంలే'' అన్నారు బాబాయి.
''డబ్బు లేదంటారేమిటీ – ఇప్పుడేగా మనీపర్సు కొన్నారు!'' అన్నాను.
బాబాయి ఆశ్చర్యపడి, ''మనీపర్సుకెంతయిందీ – అర్థరూపాయేగా!'' అన్నారు.
''అది నాకు తెలియదు. పర్సులో బోలెడు డబ్బుంటుందిగా, దాని గురించి'' అన్నాను.
పర్సులో డబ్బు మనం పెట్టాలని నాకు తెలియదు. పర్సు కొనుక్కుంటే అందులో డబ్బుంటుందని అప్పటిదాకా నా అభిప్రాయం.
నాకూ ఓ అర్థ రూపాయుంటే నేనూ ఓ మనీపర్సు కొనుక్కుని బోలెడు డబ్బు ఖర్చు పెట్టొచ్చు ననుకునేవాణ్ణి.

అది తెలిసేక పిన్ని, బాబాయి ఒకటే నవ్వు.

నాకూ నా పొరపాటు అర్థమయింది.

అర్థరూపాయికి ఎవరైనా వందల రూపాయలుంచిన పర్సుని అమ్ముతారా?

అలా ఆలోచించగానే అంతవరకూ ఆ మాత్రం స్ఫురించని నా తెలివితక్కువతనానికి చాలా సిగ్గుపడ్డాను.

అలాంటిదే ఇప్పుడు జర్మనీలోనూ జరిగింది.

ఇండియాలో ఉండగా నేనెప్పుడూ విదేశాల్లో అవకాశాలకి ప్రయత్నించలేదు. కానీ మిత్రుల ద్వారా కొన్ని విశేషాలు తెలిసేవి.

ఆంగ్లభాషా నైపుణ్యాన్ని నిర్ధారించడానికి టోఫెల్ ఇవ్వాలని తెలుసు.

అమెరికాకి ఐతే పది పన్నెండువేలు పెట్టి టికెట్ కొనుక్కోవాలని తెలుసు.

ప్రయాణంలో డాలర్లవంటి విదేశీమారకం కొంత ఉండాలని తెలుసు.

వీసా గురించి తెలియదు.

నేను జర్మనీకి ఎంపికైనప్పుడు టికెట్టుతో సహా అన్ని ఏర్పాట్లూ డాడ్ సంస్థ చేసింది.

అందులో జర్మనీలో ఉండడానికి అనుమతిపత్రం కూడా ఉందని నాకు తెలియదు.

నావరకూ కొద్దిగా విదేశీమారకం నేను ఏర్పాటు చేసుకున్నాను. అది సరిపోయింది.

ఆతర్వాతనుంచి అన్నీ వాళ్లే చూసుకున్నారు.

శ్రీమతినీ, పిల్లల్నీ జర్మనీ రప్పించినప్పుడు డాడ్ వాళ్లకి తెలియబర్చాలి కాబట్టి తెలియబర్చాను.

టికెట్లు కొనడానికి డబ్బు పోగేశాను.

ప్రయాణపు ఏర్పాట్లకు నా తంటాలు నేను పడ్డాను.

వాళ్లిక్కడికి చేరగానే యజ్ఞం పూర్తయిందనుకున్నాను.

మావాళ్లొచ్చిన వారం పదిరోజులకి నాకక్కడున్న మంచిమిత్రుల్లో ఒకడైన గుప్తా కనిపించాడు.

అతడి భార్య, రెండేళ్లలోపు కొడుకు మావాళ్లకంటే కాస్త ముందే వచ్చారు.

వాళ్లకి రెసిడెన్స్ పెర్మిట్ కోసం దరఖాస్తు పెడుతున్న విషయం యథాలాపంగా చెప్పాడు.

"వాళ్లొస్తున్నట్లు డాడ్ సంస్థకి చెప్పాం. మన డబ్బు ఖర్చు పెట్టి టికెట్లు కొన్నాం. మనకొచ్చే స్కాలరుషిప్పు డబ్బుతో మనవాళ్లని పోషించుకుంటాం. మళ్లీ కొత్తగా ఈ అనుమతి పత్రమేమిటి?" అన్నాను కాస్త ఆశ్చర్యంగానూ, భయంగానూ.

"ఒక దేశంనుంచి ఇంకో దేశం వెళ్లడానికి టికెట్ కొంటే సరిపోదు కదా! ముందు మనకి పాస్‌పోర్టు ఉండాలి. అలాగే మనం వేరే దేశంలో ఉండాలంటే – ఆ దేశం మనని అనుమతించాలి కదా!" అన్నాడు గుప్తా.

నిజమే – అది కామన్ సెన్సుకి సంబంధించిన విషయం.

ఇంతవరకూ నాకిది స్ఫురించలేదేమిటి?

అప్పుడనిపించింది – ఇలాంటి విషయాల్లో నాకు కనీస లోకజ్ఞానం లేదని.

స్కూల్లో ఫీజులు కట్టాలని తెలియదు. పెద్దలు కట్టేవారు.

కాలేజికి అప్లికేషన్సు పెట్టడం తెలియదు.

నాన్నాగారో, తాతగారో, లేకా చదువయ్యేదాకా నాకు క్లాసుమేటైన నా అన్నయ్యో –

ఇంతా చేసి అన్నయ్య నాకంటే ఒకే ఒక్క ఏడాది పెద్ద.

తెరిచినప్పుడు స్కూలుకి, కాలేజికి వెళ్లేవాణ్ణి.

పరీక్షలొస్తే వ్రాసేవాణ్ణి.

వాటి వెనుక ఉండే అప్లికేషన్లు, ఫీజులు తతంగం తెలియకుండానే నేను ఎమ్మెస్సీ అనిపించుకున్నాను.

కష్టపడి వాళ్ల ఏర్పాట్లు వాళ్లే చేసుకునేవాళ్లకి మాత్రం – నాలాంటివాళ్లకి ఈ మాత్రం తెలియదంటే ఆశ్చర్యంగా అనిపించొచ్చు.

క్లాసులో సబ్జక్టులో అధ్యాపకులు వివరించడమయ్యేక – సందేహాలకోసం నాదగ్గరకొచ్చేవాళ్లని చూసి – ఈ మాత్రం అర్థం కాలేదా – అని నేనాశ్చర్యపడేవాణ్ణిగా – అలాగే ఈ విషయంలో నాగురించి కొందరనుకోవచ్చు.

అలాగని మేమేం డబ్బులో మునిగి తేలడం లేదు. నాకు అలా సాగిందంతే!

కంటితో చూస్తే భూమి బల్లపరుపుగా ఉంటుంది.

ఆలొచిస్తేనో, ఆలోచించినవాళ్లు చెబితేనో అది గుండ్రమౌతుంది.

డాడ్ వాళ్లు కడుపులో చల్ల కదలకుండా నాకోసం అన్ని ఏర్పాట్లూ చేశారు.

దాంతో విదేశ యానానికి సంబంధించి నేనుకనీస లోకజ్ఞానానికి దూరమయ్యాను.

కాస్త ఆలోచిస్తే చాలా తెలిసేవేమో –

ఒక్కణ్ణీ ఉన్నప్పుడు లియోపాల్డ్‌విల్లేలో హాస్టల్లో ఉంటున్న ఎలక్ట్రికల్ ఇంజనీర్ దాస్ కథ విని అబ్బురపడ్డాను.

అతడి దృఢత్వం, సాహసం, ఉన్నతలక్ష్యం నన్ను ఆకర్షించాయి.

కానీ, ఆ కథలో అంతర్లీనంగా ఉన్న రెసిడెన్స్ పెర్మిట్ ప్రసక్తిని గ్రహించి, మావాళ్లకి అన్వయించుకునే ఇంగితం నాకు లేకపోయింది.

గుప్తాతో మాట్లాడేక నాకు స్పష్టమయింది –

టికెట్ కొనుక్కుని ఇండియానుంచి జర్మనీ వచ్చిన నా కుటుంబం – మూడునెల్లపాటు ఇక్కడ నిరభ్యంతరంగా గడపొచ్చు.

రెసిడెన్స్ పెర్మిట్ లేకపోతే మూడునెల్ల తర్వాత ఒక్క రోజు కూడా ఇక్కడుండడానికి వీల్లేదు.

గుప్తా తన భార్యకి రెసిడెన్స్ పెర్మిట్ కోసం అప్లికేషన్ ఇచ్చేట్ట.

"నువ్వూ ఇచ్చావా?" అని యథాలాపంగా అడిగాడు.

ఇంకా ఇవ్వలేదని తెలియగానే, వెంటనే అప్లై చెయ్యమని తొందరపెట్టాడు.

"నువ్వు చాలా స్మార్ట్. ఇలాంటివన్నీ ముందే భలే తెలుసుకుంటావ్" అన్నాను.

పాపం గుప్తాకి అలాంటి పొగడ్తలు విన్నప్పుడు తనకి గొప్పతనాన్ని ఆపాదించుకునే అలవాటు లేదు.

"అలాంటిదేం లేదు. హాస్టల్లో ఉంటున్నాగా, ఎవరో ఒకరు ఇలాంటివి చెబుతుంటారు. అంతే!" అన్నాడు.

మావాళ్లు వచ్చీరాగానే ఈ రెసిడెన్స్ పెర్మిట్ గురించి పట్టించుకోనందుకు ముందు కంగారు పడ్డాను.

ఐతే గుప్తా నాకు ధైర్యం చెప్పాడు.

డాడ్ స్కాలర్సు విషయంలో – ఈ పెర్మిషన్ ఒక ఫార్మాలిటీయేనట.

ఎటొచ్చీ ముందు అప్లై చెయ్యాలిట.

ఒకసారి అప్లై చేసేక, ఇక బంతి వాళ్ల కోర్టులో ఉంటుంది.

వాళ్లు నిర్ణయం తీసుకొనడంలో ఆలస్యం చేస్తే కూడా మాకే ఇబ్బందీ లేదు.

నిర్ణయమయ్యేదాకా మా వాళ్లిక్కడే ఉండొచ్చు.

''ఐనా ఇక్కడ మన దేశంలోలా కాదు. మనం అప్లికేషనిచ్చేక వాళ్ల ప్రొసీజర్సు వాళ్లు అనుసరించి, మనకి పెర్మిషన్ ఇవ్వడానికి ఎంతో కాలం పట్టదులే'' అన్నాడు గుప్తా.

గుప్తా అప్లికేషనిచ్చి మూడు రోజులయిందిట.

అప్లికేషనిచ్చినప్పుడు భార్యనీ, కొడుకునీ తీసుకెళ్లేట్ట.

ఇంటర్వ్యూ బాగానే అయిందిట.

ఆఫీసరు ప్రసన్నంగా ఉన్నాడట.

ఎటొచ్చీ భార్యాబిడ్డలకి ఇన్సూరెన్సు తీసుకుని మళ్లీ రమ్మన్నాడుట.

''అంటే నేనిప్పుడు మావాళ్లకి ఇన్సూరెన్సు తీసుకోవాలన్న మాట!'' అన్నాను.

గుప్తా నవ్వి, ''రెసిడెన్స్ పెర్మిట్ ఆఫీసు చిత్రమైనది. ఇక్కడ ఒకొక్కరికి ఒకోలా ఉంటాయిట నియమాలు. నువ్వు నీ భార్యాబిడ్డల్ని తీసుకుని తొందరగా ఆ ఆఫీసుకెళ్లు. వాళ్లు మీవాళ్లకి ఇన్సూరెన్సు కావాలనొచ్చు, వద్దనొచ్చు కూడా. అడిగినవి నోట్ చేసుకో. అడగని వాటి విషయం పొరపాటున కూడా ప్రస్తావించకు'' అని సలహా ఇచ్చాడు గుప్తా.

సరేనని గుప్తా దగ్గర ఆ ఆఫీసు వివరాలు తెలుసుకున్నాను.

అది పుట్‌కామర్ స్ట్రాసే (వీధి)లో ఉంది.

అక్కడికి వెళ్లడానికి మా ఇంటినుంచి రెండు ఊబాన్లు మారాలి.

జనవరి 21 ఉదయాన నేను, నాకుటుంబం పెందరాళే తెమిలి – 9.30కల్లా ఆ ఆఫీసు చేరుకున్నాం.

అక్కడ వివిధ దేశాల రంగురంగుల జనాలతో మహా సందడిగా ఉంది.

ఉన్నవాళ్లలో ఎక్కువమంది టర్కీ వాళ్లు.

ఒకొక్కర్నే పిల్చి ఇంటర్వ్యూ చేస్తున్నారు.

అదయ్యేక పని సానుకూలమైనవాళ్లు అత్యుత్సాహంగానూ, కానివాళ్లు నీరసంగానూ బయటికొస్తున్నారు.

మా వంతు రావడం కాస్త ఆలస్యమయింది.

కారణ మేమిటంటే – మా ముందు ఇంటర్వ్యూకెళ్లిన ఓ టర్కిష్ అతనికి నలుగురు భార్యలు.

ఒక భార్య ఇక్కడే ఉంటోంది.

మిగతా ముగ్గురి భార్యలకీ రెసిడెన్స్ పెర్మిట్ కోసం వచ్చాడు.

ఒక మగాడికి ఒకే భార్య, ఒక మహిళకి ఒకే భర్త – అంటుంది జర్మనీ రాజ్యాంగం.

నలుగుర్నీ నేను చట్టబద్ధంగానే పెళ్లాడానంటాడు టర్కిష్ వ్యక్తి.

అదిక్కడ చెల్లదంటాడు అక్కడి ఆఫీసరు.

ఆ విషయం అప్లికేషన్లో ఎక్కడా ప్రస్తావించలేదని అంటాడు టర్కిష్ వ్యక్తి.

వ్రాయకపోయినా అర్థం చేసుకోవాలంటాడు ఆఫీసరు.

అలాగైతే తను చట్టబద్ధంగా నలుగుర్ని పెళ్లి చేసుకోవడాన్నీ అర్థం చేసుకోవాలంటాడు టర్కిష్ వ్యక్తి.

వాళ్లమధ్య వాదులాట కొనసాగుతూ మిగతావాళ్లకి బాగా ఆలస్యమైపోతోంది.

వచ్చిన సమస్యేమిటంటే – జర్మనీలో ఉద్యోగస్థులకి వారి భార్యలకని వేరే కొంత డబ్బు అలవెన్సుగా ఇస్తారు. అలాంటి అలవెన్సుకోసం నలుగురు భార్యల్ని తీసుకొచ్చిన సందర్భం ఆ ఆఫీసరు అనుభవంలో ఇదే మొదటిది.

మాకిది కొంచెం వినోదంగానే ఉన్నా – టైము పదిన్నర కావస్తుంటే కొంత విసుగొచ్చింది.

అక్కడ ఏ దేశస్థురాలో తెలియదు కానీ, ఓ తెల్లామె మమ్మల్ని గమనిస్తోంది.

మా పిల్లల్ని ముచ్చటగా చుస్తోంది.

నా శ్రీమతి కట్టూ బొట్టూ ఆమెకి ఆశ్చర్యాన్నీ, కుతూహలాన్నీ కలిగిస్తోంది.

ఆమె శ్రీమతిని ఇంగ్లీషులో పలకరించి – ''ఇండియా?!'' అంది.

శ్రీమతికి ఇండియా అన్న పదమొక్కటే అర్థమై చిరునవ్వుతో తలాడించింది.

''కాలక్షేపంగా ఉంటుంది. ఇవి తినండి'' అంటూ అభిమానంగా నవ్వి ఓ చిన్న ప్యాకెట్ శ్రీమతికిచ్చింది.

శ్రీమతి మొహమాటంగానే తీసుకుని, ఆమెకి థాంక్స్ చెప్పింది.

అది చిన్న పోలిథీన్ సంచి. లోపలున్నవి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అవి నిమ్మతొనలని అర్థమై – పాపకిచ్చి – ''నువ్వూ, తమ్ముడూ తినండి'' అంది.

మా పిల్లలు ఓ పట్టాన ఏది పడితే అది తినరు.

జర్మనీలో పిల్లలంతా ఇష్టపడి తినే చాక్లెట్లే వీళ్లకి నచ్చేవి కాదు.

వాళ్లూ వీళ్లూ ఇచ్చిన చాక్లెట్లు ఇంట్లో పేరుకుపోతుంటే – కొన్ని ఇంటికొచ్చినవాళ్లకి ఇచ్చేవాళ్లం.

కొన్ని శ్రీమతి అయిష్టంగానే తినేది.

కొన్ని ఇండియా తీసుకెడదామని దాచేవాళ్లం.

''తినరా తమ్ముడూ'' అని పాప బాబుకి ఆ ప్యాకెట్టిచ్చింది.

బాబు దాన్ని ఓసారి ఎగాదిగా చూసి వాళ్ల అమ్మకిచ్చేశాడు.

ప్యాకెట్ ఆమెకి వెనక్కిచ్చెయ్యమని శ్రీమతి నాకిచ్చింది.

''పిల్లలు తినడానికి ఇష్టపడ్డంలేదు'' అని నేనామెకి ప్యాకెట్ వెనక్కివ్వబోయాను.

ఆమె తీసుకోలేదు.

''నా పిల్లలూ ఇంతే – నేనిచ్చింది తినరు. ఐతే, నేనే తివేస్తా – అని ఒకటి నోట్లో వేసుకుంటా. అంతే వాళ్లు ఎగబడి లాక్కుంటారు'' అందామె.

నేను తటపటాయిస్తుంటే – ''నేను చెప్పినట్లు చేయి'' అంది కొంచెం గద్దిస్తున్నట్లు.

''మావాళ్లు అలా తినరు'' అన్నాను.

ఆమె నవ్వి, ''నేనెందుకు చెబుతున్నానంటే – వీటి రుచి వెరీ స్పెషల్. ఇవి అన్నిచోట్లా దొరకవు. నీ భార్య ఒకసారి నోట్లో వేసుకుందంటే – అడిగినా పిల్లలకి పెట్టదు. ఇద్దరూ రుచి చూడండి, అదీ నీ భార్య నీదాకా రానిస్తే'' అని చిలిపిగా కన్ను కొట్టింది.

నేనామె ఏమంటున్నదీ చెప్పబోతే – ''ఆమాత్రం ఇంగ్లీషు నాకూ అర్థమయింది లెండి కానీ – ఆ చెప్పేదేదో చెప్పి ఊరుకోవచ్చుగా, కన్ను కొట్టడమెందుకూ?'' ఆని చిరాకు పడింది.

కొంత కుతూహలం. కొంత మొహమాటం.

శ్రీమతి నిమ్మతొన ఒకటి రుచి చూసింది.

ఆమె కళ్లు పెద్దవవడం చూసి వాటి రుచి నాకు అర్థమైంది.

తనకి నచ్చినవి వెంటనే నాతో షేర్ చేసుకోవాలిగా – వెంటనే నాకో నిమ్మతొన ఇచ్చింది.

నిజంగానే ఆ నిమ్మతొనల రుచి అద్భుతం.

శ్రీమతి నాతో అంది, ''నా చిన్నప్పుడు నిమ్మతొనలు కొనుక్కుని తినేవాళ్లం. చాలా రుచిగా ఉండేవి. మనకి పిల్లలు పుట్టేసరికి అలాంటివి దొరకడం లేదు. ఇప్పుడు దొరికేవి తింటే వికార పెడుతోంది. అందుకే మనవాళ్లు తినమన్నారు. ఈవిడ ఎక్కడ కొందో కానీ, ఇవి చాలా చాలా బాగున్నాయి. ఏ స్టోర్లో దొరుకుతాయో చూడాలి'' అని.

పిల్లలా మాట విని వాటికోసం ఎగబడ్డారు.

శ్రీమతి మాటల ప్రభావమేమో, పిల్లలకి కూడా అవి చాలా నచ్చాయి.

''మా పిల్లలు ఓ పట్టాన బయట కొన్నవి ఏవీ తినరు. ఇవి వీళ్లకి చాలా నచ్చాయి. నిమ్మతొనలకీ, నీ సలహాకీ చాలా థాంక్స్'' అన్నాను నేను తెల్లామెతో.

"ఎక్కడివాళ్లయినా పిల్లలంతా ఒక్కటే" అని ఆమె సంబరపడింది.

ఈ ప్రహసనం జరుగుతుండగా కాసేపు మాకు టైం తెలియలేదు.

అంతలో మాకు పిలుపొచ్చింది. నలుగురం వెళ్లాం.

ఆఫీసరు నా వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

నాతో జర్మన్, ఇంగ్లీషులు కలిపి మాట్లాడేడు. నన్ను మాత్రం జర్మన్ భాషలో మాట్లాడమని నిర్దేశించాడు.

తప్పులొస్తే తను సరి చేస్తానన్నాడు.

అప్పటికి నాకు జర్మన్ భాష అంత ఫరవాలేదు.

నేను శ్రీమతికి కూడా అవసరమైన జర్మన్ నేర్పాను. చెప్పాలంటే తనకి ఇంగ్లీషుకంటే జర్మనే బాగా వచ్చు.

తను స్కూల్లో ఇంగ్లీషు చదువుకున్నా ఆ భాష వాడాల్సిన అవసరం ఇండియాలో ఆట్టే రాలేదు.

తను ఒరిస్సా రావడంతో – ఒరియా, హిందీ నాకంటే మెరుగ్గా అలవడ్డాయి.

ఇప్పుడు జర్మనీలో ఇక్కడి భాష అవసరం కాబట్టి అదీ వంటబడుతోంది.

నా శ్రీమతి కూడా జర్మన్ మాట్లాడగలదని అతడికి చెప్పాను.

అందుకు ఆమె నావంక గుర్రుగా చూసింది కానీ – అతడి ముఖం వెలిగింది.

ఎంతలా వెలిగిందంటే – ఆ వెలుగులో నాకు మావాళ్ల రెసిడెన్స్ పెర్మిట్ కనబడింది.

మావాళ్లకి రెసిడెన్స్ పెర్మిట్ ఇవ్వడానికి సమస్యేముండదని స్పష్టం చేశాడతడు.

కానీ, అందుకు మావాళ్లకి ఇన్సూరెన్సు తీసుకోవాలన్నాడు.

''తీసుకుంటాను. ఇన్సూరెన్సుకి మావాళ్లకి ఫార్మాలిటీస్ ఏమైనా ఉంటాయా?'' అనడిగాను.

నవ్వేసి, పాస్‌పోర్టుంటే చాలన్నాడు. బాగుందనుకున్నాను.

''ఇన్సూరెన్స్ తీసుకున్నాక ఆ డాక్యుమెంట్సుతో మళ్లీ వస్తాను'' అన్నాను అతడితో ఉత్సాహంగా.

''ఆ డాక్యుమెంట్సుతోపాటు నీ మారేజ్ సర్టిఫికెట్ కూడా తీసుకురావడం మర్చిపోకు'' అన్నాడతడు యథాలాపంగా.

''ఊఁ'' అని ఉలిక్కిపడి, ''మ్యారేజ్ సర్టిఫికేట్టేమిటి?'' అన్నాను.

పెళ్లి చేసుకుంటే చేసుకున్నట్లు ఓ సర్టిఫికెట్టుండాలని నాకెప్పుడూ స్ఫురించలేదు.

ఆఫీసరు ఆశ్చర్యంగా, ''ఈమె నీ భార్యంటున్నావు. మ్యారేజి సర్టిఫికెట్ గురించి తెలియదా? అంటే మీరిద్దరూ పెళ్లి చేసుకోకుండా కలిసుంటూ పిల్లల్ని కన్నారా?'' అన్నాడు.

అతడి గొంతులో సందేహమే తప్ప వెటకారం లేదు.

అతడేమన్నాడో శ్రీమతికి తెలిసినట్లు లేదు. తెలిస్తే సిగ్గుతో కుంచించుకుపోయేదని తెలుసు.

ఆమె చాలా కుతూహలంగా మమ్మల్నిద్దర్నీ చూస్తోంది.

అతడి ఈ సందేహం ఆమెకి అర్థం కాకపోవడం అదృష్టం అనుకున్నాను.

''మాకు పెళ్లయింది. మేమిద్దరం భార్యాభర్తలం. ఆ విషయం పాస్‌పోర్టులో ఉంది'' అన్నాను ఉక్రోషాన్ని దిగమింగుకుంటూ.

అతడు చలించలేదు, ''పాస్‌పోర్టు ఆఫీసరు మీపెళ్లి చూశాడా?'' అన్నాడు.

తడబడినా తల అడ్డంగా ఊపాను.

''మరి మీకు పెళ్లయినట్లు ఆ ఆఫీసరుకెలా తెలుసు? మ్యారేజి సర్టిఫికెట్ చూపించి ఉంటావు. నేనడుగుతున్నది ఆ సర్టిఫికెట్ గురించి'' అన్నాడతడు.

అటు తిప్పి ఇటు తిప్పి మళ్లీ సర్టిఫికెట్ టాపిక్‌కే వచ్చాడు.

''నిజం చెబుతున్నాను. మా పెళ్లికి సర్టిఫికెట్ లేదు. నాకు తెలిసి ఇండియాలో పెద్దలు చేసిన పెళ్లిళ్లకి సర్టిఫికెట్లుండవు'' అన్నాను.

''సర్టిఫికెట్ లేకుండా పెళ్లేమిటి? అది చెల్లదు'' అన్నాడు ఆఫీసరు.

అప్పటికి మా పెళ్లయి ఎనిమిదేళ్లు దాటింది. ఇద్దరు పిల్లలు.

ఇప్పుడు మా పెళ్లి చెల్లదని – ఇక్కడి ఆఫీసరు అంటున్నాడు.

మా పెళ్లి విషయంలో ఇలాంటి సమస్యొకటి రావచ్చని నేనూహించలేదు.

ఏంచెయ్యాలో తోచలేదు.

సర్టిఫికెట్ లేని కారణంగా నా కుటుంబం అర్థాంతరంగా ఇండియాకి వెళ్లిపోవాల్సి వస్తుందా అన్న బెంగ కలిగింది.

మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని, ''పెళ్లికి సర్టిఫికెట్ ముఖ్యమని మొదటిసారి వింటున్నాను. అసలు పెళ్లిళ్లకి సర్టిఫికెట్లు ఎందుకు?'' అన్నాను.

''మ్యారేజి సర్టిఫికెట్ లేకుండా రేపు అవసరమైతే విడాకులు ఎలా తీసుకుంటావ్?'' అన్నాడు.

తెల్లబోయాను.

సర్టిఫికెట్ అవసరం విడాకులకా?

వెంటనే పుంజుకుని, ''కావాలంటే రాసిస్తాను. నేను, నా భార్య జీవితాంతం కలిసే ఉంటాం. మా మధ్య విడాకుల ప్రసక్తే ఉండదు. మా సంప్రదాయంలో విడాకులుండవు. అందుకేనేమో సర్టిఫికెట్లూ లేవు'' అన్నాను.

ఆఫీసరు తెల్లబోయాడు.

టైం చూసుకుని, ''నీ కేసు నాకు చాలా చిత్రంగా ఉంది. ఇంకా చాలా మాట్లాడాలనుంది. కానీ బయట చాలామంది వెయిటింగులో ఉన్నారు. కాబట్టి నువ్విక వెళ్లొచ్చు. మళ్లీ వచ్చేటప్పుడు మ్యారేజి సర్టిఫికెట్ తీసుకురాక తప్పదు'' అన్నాడు.

''లేని సర్టిఫికెట్ ఎక్కణ్ణించి తెచ్చేది? మావాళ్లని అర్థాంతరంగా ఇండియాకి పంపెయ్యడం ఒక్కటే ఇక మిగిలిన మార్గం. ఇంకో మాట చెప్పు'' అని దీనంగా అడిగాను.

జాలేసిందో ఏమో, ''ఓ ఉపాయముంది. పాస్‌పోర్టులో నీకు పెళ్లయినట్లుగా ఉంది కదా! ఇక్కడ బెర్లిన్లో ఇండియన్ కన్సులేట్ ఆఫీసుంది. నీ పాస్‌పోర్టు చూసి ఆ ఆఫీసువాళ్లు మ్యారేజ్ సర్టిఫికెట్టిస్తే అది మాకు సరిపోతుంది'' అన్నాడు.

''హమ్మయ్య! ప్రస్తుతానికో దారి కనిపించింది'' అనుకున్నాను.

జరిగిన సంభాషణ సారాంశం తెలుసుకున్నాక, ''పెళ్లికి సర్టిఫికెట్టా– అదీ విడాకులకోసం?'' అని షాక్ తింది శ్రీమతి.

''వాళ్లడిగారు. మనం ఇవ్వాలి. ఇందులో చర్చలకూ, వాదనలకూ తావు లేదు'' అన్నాను.

***

మారేజ్ సర్టిఫికెట్ గురించి తనేం చేశాడో తెలుసుకుందామని గుప్తాకి ఫోన్ చేశాను.

ఆశ్చర్యమేమిటంటే గుప్తాని మారేజ్ సర్టిఫికెట్ గురించి అడుగలేదుట.

అతడి అదృష్టం, నా దురదృష్టం!

రెసిడెన్స్ పెర్మిట్ లాంటి విషయాల్లో ప్రత్యేకమైన నియమాలుండవుట.

మనతో డీల్ చేసే అధికారి తనేం చెబితే అదే నియమం.

ఆదేమనడానికి లేదు. ఇలాంటి పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోందని అమెరికా వెళ్లడానికి వీసాలకై ప్రయత్నించేవాళ్లందరికీ స్వానుభవమే!

ఈ విషయమై నాకొచ్చిన ఇబ్బందుల గురించి ఆఫీసులో చెప్పాను.

ఇక నా జర్మన్ కొలీగ్సు ఆశ్చర్యానికి అంతు లేదు.

''విచిత్రం నీలో ఉందో, ఇండియాలో ఉందో తెలియడం లేదు. నీ ద్వారా చాలా కొత్త వింతలు వింటున్నాం. సర్టిఫికేట్ లేకుండా పెళ్లా? మై గాడ్! కల్లో కూడా ఊహించలేం'' అన్నారు వాళ్లంతా ఏకకంఠంతో.

పెళ్లికి సర్టిఫికెట్ అవసరమన్నప్పుడు నేను అంతకంటే షాక్ తిన్నాను. కానీ అదంతా గడిచిపోయిన కథ.

అందుకని వాళ్లతో వాదనకి దిగలేదు.

''సర్టిఫికెట్ మీ కన్సులేట్ ఇస్తుందిలే కానీ, నీ కుటుంబానికి ఇన్సూరెన్సు చాలా అవసరం. ఇప్పటికే తీసుకుని ఉంటావనుకున్నాను. లేకపోతే ఎప్పుడో ఈ విషయమై నిన్ను హెచ్చరించేవాణ్ణి'' అని డెకర్ట్ చెప్పాడు నాకు.

నా కుటుంబానికి ఇన్సూరెన్సు గురించి వాకబు చేశాను.

అప్పటికే నేను ఇన్సూరెన్సుకి నెలకి 18 మార్కులు కడుతున్నాను.

దాన్ని కుటుంబానికి విస్తరించొచ్చుట.

అంటే మా నలుగురికీ కలిపి ఒకటే ఇన్సూరెన్సు.

ఎటొచ్చీ అప్పుడు 18 కాదు, పాతిక మార్కులు కట్టాలి.

డెకర్ట్ నాతో, "నువ్వు విడిగా తీసుకున్న 18 మార్కుల ఇన్సూరెన్సుకంటే, ఇది చాలా లాభసాటి. ఆ విషయం ముందుముందు నీకే తెలుస్తుంది" అన్నాడు.

నాకప్పుడు భువనేశ్వర్లో నా కొలీగ్ ఒకతను అన్న మాట గుర్తొచ్చింది.

"ఆస్పత్రినుంచి డిస్చార్జి ఐనప్పుడు వెళ్లొస్తానని చెప్పడం ఎలాంటిదో, ఇన్సూరెన్సు వల్ల కలిగే లాభం అలాంటిది" అనేవాడతడు.

"కుఛ్ పానే కేలియే కుఛ్ ఖోనా పడ్‌తాహై (కొన్ని పొందాలంటే, కొన్ని పోగొట్టుకోవాల్సి ఉంటుంది)" అని హిందీ సామెత.

ఇన్సూరెన్సులో పొందేది కొంచెమే కానీ పొగొట్టుకునేది కుంచెడు. కన్నో, కాలో పోతే – ఎన్ని లక్షలు వాటికి సాటొస్తాయి?

ఇక ప్రాణాల విషయానికొస్తే – లాభం ఇన్సూరెన్సు చేసినవాడిక్కాదు, అతడి దగ్గర బంధువులకి!

"నాకే లాభమొద్దు. ముందీ రెసిడెన్స్ పెర్మిట్ వస్తే చాలు" అన్నాను డెకర్ట్‌తో.

ఇన్సూరెన్సు గురించిన నా భావాల్ని అతడితో పంచుకోవాలనుకోలేదు.

అవి కూడా అతడికి వింతగా అనిపించొచ్చని నా భయం!

ఐతే డెకర్ట్ చెప్పిన లాభసాటితనం, తర్వాతెప్పుడో స్వానుభవమయ్యేక – నా భావాల్లో కొంత మార్పొచ్చింది. డెకర్ట్ సలహా గొప్పతనాన్ని అప్పుడు గుర్తించాను. ఆ విశేషాలు ఇంకో సందర్భంలో ప్రస్తావించుకుందాం.

ఇన్సూరెన్సు ఐపోయేక, శ్రీమతికీ, పిల్లలకీ టీకాలు ఉన్నట్లు సర్టిఫికెట్లు తీసుకున్నాను. అదో రోజు పట్టింది.

రెసిడెన్స్ పెర్మిట్ రావాలంటే – నాకు బెర్లిన్లో నిలువనీడ ఉండాలి.

అంటే ఒలోముచ్‌కీ దగ్గర్నించి మీట్‌ఫెర్‌ట్రాగ్ (రెంటల్ అగ్రిమెంట్) తీసుకోవాలి.

ఇందులో నాకో ఇబ్బంది ఉంది.

ఒలోముచ్‌కీ ఉంటున్నది స్వంతిల్లు కాదు. ఎవరింట్లోనే అద్దెకుంటున్నదామె.

ఆ ఇల్లు తనకి పెద్దదిగా అనిపించి – కొంత పోర్షన్ నాలాంటివాళ్లకి అద్దెకిస్తోంది.

సబ్‌లెటింగ్‌కి ఆమెకి అనుమతి లేదని నా అనుమానం.

ఎందుకంటే అంతకుముందు – అంటే ఇంకా నా భార్యాబిడ్డలు ఇక్కడికి రాకమునుపు – ఒక రోజు ఆమె నాకు చెప్పింది:

"అద్దె ఇళ్లకు సంబందించిన ప్రభుత్వ సంస్థకు సంబంధించిన అధికారులు తనిఖీకి వస్తున్నారు. రేపొక్కరోజుకీ 11–4కి మధ్యలో నువ్వు ఇంట్లో ఉండకూడదు"

ఆమె ఆజ్ఞాపించలేదు. అనునయంగా అడిగింది.

ఎలాగూ నేనది ఆఫీసులో ఉండే సమయం కాబట్టి – నాకు ఇబ్బంది అనిపించలేదు.

విషయం మా ఆఫీసులో చెబితే, ''ఆమె ఏదో తప్పు చేస్తోంది. ఆ తప్పులో నువ్వూ భాగస్వామివౌతావు. వేరే ఇల్లు చూసుకో'' అని కిర్షనర్ సలహా ఇచ్చాడు.

మాదీ మాత్రం ఒప్పుకోలేదు, ''ఆమె తప్పు చేసే మాటైతే, యూనివర్సిటీకి సంబంధించిన సంస్థలో తన ఇల్లు అద్దెకిస్తానని రిజిస్టర్ చేయించుకోదుగా! నువ్వామె చెప్పింది పొరపాటుగా అర్థం చేసుకున్నావని నా ఉద్దేశ్యం'' అన్నాడు.

కిర్షనర్ నియమాలననుసరించే జర్మన్ పౌరుడు.

మాదీ ఇరాక్ దేశస్థుడు. నాకోసం ఒలోముచ్‌కీ ఇల్లు చూసిపెట్టింది అతడే!

ఎవరిని నమ్మాలి?

అప్పుడు నాకు చిన్నప్పుడు చదివిన జోకొకటి గుర్తుకొచ్చింది.

ఒక ముసలాయన రోడ్డుమీద కళ్లు తిరిగి పడిపోయాడు. చుట్టూ చేరిన జనం తలో సలహా ఇస్తున్నారు. ఒకరు మొహంమీద నీళ్లు చల్లమన్నారు. ఒకరు మంచినీళ్లు తాగించమన్నారు, ఒకరు సోడా ఇమ్మన్నారు. ఓ యువకుడు మాత్రం విస్కీ పట్టించమన్నాడు. చుట్టూ చేరిన జనాలు ఏంచెయ్యాలా అన్న మీమాంసలో ఉంటే – ఆ ముసలాయన ఓ సారి లేచి కూర్చుని, విస్కీ పట్టించమన్న కుర్రాడివైపు వేలు చూపించి, ''ఆ కుర్రాడేదో చెబుతున్నాడు. వినిపించుకోవచ్చుగా' అని మళ్లీ పడిపోయాడు.

ఇప్పుడు నా పరిస్థితి అలాంటిదే!

ఒలోముచ్‌కీ ఇల్లు చౌకగా దొరికింది. ఒకే గదిలో నా కుటుంబమంతా ఉండడానికి కూడా ఒప్పుకుంది.

ఆ ఇల్లు కాదని వేరెక్కడికి వెళ్లినా – ఇంత చక్కని ఏరియాలో, ఇంత తక్కువ ధరకు, సకుటుంబంగా ఉండడానికి ఇల్లు దొరుకుతుందా?

అందుకని ఇప్పుడు నాకు మాదీ మాటలు నమ్మాలనిపించింది.

ఐతే ఒలోముచ్‌కీ మీట్‌ఫెర్‌ట్రాగ్ ఇవ్వడమంటే – తను అద్దెకుంటున్న ఇంట్లో నేను, నా భార్యాబిడ్డలు కూడా ఉంటున్నట్లు కాగితంమీద కమిట్ అవ్వాలి.

ఒప్పుకుంటుందా?

ఒప్పుకోకపోతే ఏంచెయ్యాలి?

తనొప్పుకోకపోతే – రెండు భయాలు.

ఒకటి – ఒలోముచ్‌కీ ఇంట్లో ఉండడం నాకు దినదినగండం కావచ్చన్న భయం. రెండు రెసిడెన్స్ పెర్మిట్‌కి సంబంధించిన ఫార్మాలిటీ ఒకటి లోపిస్తుందన్న భయం. అప్పుడిది మారేజ్ సర్టిఫికెట్‌ని మించిన పెనుసమస్యగా మారదూ!

భయపడుతూనే ఓ రాత్రి నా అవసరం గురించిన లేఖ ఒకటి పోస్ట్‌బాక్సులో వేశాను. అంటే వంటింట్లో ఫ్రిజ్ టాప్‌మీద పెట్టాను.

మర్నాడుదయం ఒలోముచ్‌కీ నన్ను పిలిచింది.

జీవన్మరణ సమస్య.

ఏమంటుందోనని బెరుకుగానే వెళ్లాను.

''అగ్రిమెంటు ఇస్తాను. అద్దె కొంచెం పెంచగలవా?'' అందామె.

అప్పుడు నాకు కలిగిన రిలీఫ్ ఇంతా అంతా కాదు.

హనుమంతుడు, 'చూచితిని సీతను' అన్నట్లు ముందు – అగ్రిమెంటు ఇస్తానని – చెప్పింది అది చాలు!

అద్దె పెంచమనడంలో ఆమె గొంతులో బలం లేదు. ఏదో ఓ బాణమేసి చూద్దాంలే అన్నట్లు అడిగింది. ఎందుకంటే ఆమెకి నా ఆర్థిక పరిస్థితి తెలుసు.

గొంతులో తగినంత వినయాన్ని జోడించి, ''పెంచాలనే ఉంది కానీ నాకు డబ్బు చాలదు. మీట్‌ఫెర్‌ట్రాగ్ ఇస్తానన్నందుకు చాలా చాలా థాంక్స్'' అన్నాను.

ఆమె మరేమనలేదు. మర్నాటికల్లా ఆమె ఆ ఫారాలు సంతకం చేసిచ్చింది.

వాటిలో మేమక్కడ ఎన్నాళ్లుండొచ్చో అన్నది తను వ్రాయలేదు. నేనే నా అవసరాన్నిబట్టి తేదీలేసి నింపుకున్నాను. నా సమస్యలన్నీ ఒక్కసారిగా పటాపంచలైపోయినట్లు తోచి ఎంతో ఉత్సాహంగా అనిపించింది.

అదే ఉత్సాహంలో – ఇంచుమించు వెంటనే ఇండియన్ కన్సులేట్ ఆఫీసుకి సకుటుంబంగా వెళ్లాను. ఆఫీసు చిన్నది. స్టాఫ్ ఐదారుగురికంటే ఉంటుందనిపించదు. వెళ్లగానే మర్యాదగా పలకరించి కూర్చోమన్నారు.

కాసేపటికి ఓ అమ్మాయి మా దగ్గరకొచ్చి నన్ను పలకరించింది. నేను నా పరిస్థితి కాస్త విపులంగానే ఆమెకి చెప్పాను.

ఆమె ఓపిగ్గా నేను చెప్పిందంతా వింది. తర్వాత నెమ్మదిగా, ''ఇప్పుడు మేము మీకు చేయగలిగిన సాయమేమిటి?'' అంది.

రామాయణమంతా విని రాముడికి సీతేమౌతుందని అడిగిన సామెత ఊరికే పుట్టలేదనిపించింది.

ఐతే ఇలాంటి సందర్భాల్లో సహనం అవసరమని నాకు తెలియకపోలేదు.

నా భార్యని చూపించి, ''ఈమెకూ నాకూ పెళ్లి ఐనట్లు సర్టిఫికెట్ ఒకటి ఇవ్వాలి'' అన్నాను.

ఆమె నవ్వి, ''ఇండియన్ కన్సులేట్లో మారేజ్ సర్టిఫికెట్లు ఇస్తారని మీకెవరు చెప్పారు?'' అంది.

ఆమె అడిగిన తీరునిబట్టి, ఎగతాళి చేస్తోందా అనిపించింది కానీ సమాధానం నా దగ్గర సిద్ధంగానే ఉంది.

''రెసిడెన్స్ పెర్మిట్ ఇచ్చే కార్యాలయంలో అధికారి చెప్పారు. ఆయన పేరు నాకు తెలియదు. కానీ ఆ ఆఫీసు పుట్‌కామర్ స్ట్రాసేలో ఉంది'' అన్నాను.

ఆమె ఏ తీరులో మాట్లాడిందో అదే తీరులో బదులిచ్చాను నేను.

ఆమె నన్ను ఎగతాళి చేస్తే, ఆ ఎగతాళిని జర్మన్ అధికారికి మళ్లించాను.

మనవాళ్లు మనవాళ్లని చిన్నబుచ్చినట్లు, తెల్లవాళ్లని చిన్నబుచ్చలేరని నాకు తెలుసు.

ఆమె ఓ క్షణం తడబడింది. తర్వాత నెమ్మదిగా, ''మీరు ఇక్కడికొచ్చేముందే ఇండియాలో ఆ సర్టిఫికెట్ తీసుకుని ఉండాల్సింది'' అంది. గొంతులో కొంచెం వినయం జోడించింది.

''ఇలాంటి సర్టిఫికెట్ ఒకటి అవసరపడుతుందని ముందుగా ఎవరూ మాకు సూచించలేదు. ఏ సమస్య వచ్చినా భారత పౌరులకు ఇండియన్ ఎంబసీ కానీ, కన్సులేట్‌గానీ సాయపడతారని మాత్రం చెప్పారు'' అన్నాను.

ఆమె కొంచెం ప్రసన్నంగా నవ్వి, ''ఇలాంటి సర్టిఫికెట్లు ఇవ్వడానికి మాకు ప్రత్యేకమైన అనుమతి లేదు. అందువల్ల సర్టిఫికెట్ మేమిచ్చినా అది చెల్లదు'' అంది.

''మిమ్మల్ని సర్టిఫికెట్ అడగమన్నవాళ్లు, మీరిస్తే అది చెల్లదని అంటారనుకోను. ఐనా సర్టిఫికెట్ ఇస్తామన్నందుకు చాలా సంతోషం. దాని చెల్లుబడి విషయం నేను చూసుకుంటాను'' అన్నాను.

నిజానికామె సర్టిఫికెట్ ఇస్తానని అనలేదు. కొంచెం లౌక్యం ప్రదర్శించాను.

''సరే, ఏ బేసిస్ మీద మీకు సర్టిపికెట్ ఇవ్వాలి?'' అందామె.

''నేను, ఈమె భార్యాభర్తలమని పాస్‌పోర్టులు చెబుతున్నాయి. అది బేసిస్ నంబర్ వన్. నేను ఇండియాలో ప్రభుత్వోద్యోగిని. మా పెళ్లి తేదీ నేనిస్తాను. తప్పుడు సమాచారమిస్తే నా ఉద్యోగం పోవడమే కాదు, జైలు శిక్ష కూడా పడొచ్చు నాకు. కాబట్టి ఆ విషయమై నేను మీకు వ్రాసిచ్చే కాగితం బేసిస్ నంబర్ టూ'' అన్నాను.

ఆమె శ్రీమతి పాస్‌పోర్టు తీసుకుంది. నాచేత కాగితం వ్రాయించుకుంది.

''సర్టిఫికెట్ ఇప్పటికిప్పుడు ఇవ్వడం అవదా?'' అనడిగాను.

''మీ రెసిడెన్స్ పెర్మిట్‌కి ఇంకా టైముందిగా? అంత తొందరేమిటి?'' అందామె.

''ఇక్కడ ప్రతి మనిషికీ ఓ ఐడెంటిటీ కార్డుంటుంది. మాకు పాస్‌పోర్టులే ఐడెంటిటీ. అవి లేకుండా బయట తిరగలేం కదా!'' అన్నాను.

శ్రీమతి పాస్‌పోర్టు కన్సులేట్ ఆఫీసులో ఉన్నట్లు రసీదొకటి ఇచ్చి, ఇక వెళ్లమందామె.

'రసీదుకి పది నిముషాలు పడితే, సర్టిఫికెట్‌కి మరో పది నిముషాలు అదనం. ఈమాత్రం దానికి వారం రోజులు గడువెందుకో' అని మనసులో విసుక్కుంటూ బయటికొచ్చాను.

ఇంటికెళ్లేక గుప్తాకి ఫోన్ చేసి విషయం చెబితే, ''ఇక్కడికొచ్చి పట్టుమని ఏడాది కాలేదు. మన కన్సులేట్ వాళ్లు సర్టిఫికెట్‌కి వారం రోజులే అంటే – సంతోషపడాల్సింది పోయి, తిట్టుకుంటున్నావా?'' అన్నాడు.

నిజమే – ఇండియాలో క్యాజవల్ లీవుకే నెల్లాళ్లముందు ప్లానింగు కావాలనే బాసులున్నారు. ఏ అప్లికేషనుకైనా కిందనుంచి పై దాకా వెళ్లడానికి కనీసం వారం పడుతుంది.

ఆ సంప్రదాయం బెర్లిన్ వస్తే పోతుందా?

ఎటొచ్చీ ఆ వారంలోగానే కన్సులేట్ మీద చికాకు పెరిగేలా చేసింది కిండర్ గెల్డ్ (సంతాన భృతి) విశేషం.

మన దేశంలో ధరణికి గిరి, గిరికి తరువు, తరువుకి కాయ భారం కాకపోవచ్చు కానీ తల్లికి పిల్ల భారమే! ఆ భావిపౌరులు దేశానికి భారమే!

అప్పట్లో పిల్లలొద్దు బాబోయ్ అని సమాజవాదులూ, ప్రభుత్వం కూడా గోల పెట్టేవారు.

జర్మనీలో భావిపౌరులకి ప్రత్యేకంగా భృతి ఉంది.

డాడ్ సంస్థ కూడా ప్రతి నెలా మా పిల్లలకి చెరో యాభై మార్కులూ భృతిగా ఇస్తోంది.

నేను ఎంబసీకి వెళ్లొచ్చిన మర్నాడే – గుప్తా నాకు ఫోన్ చేశాడు.

డాడ్ వాళ్లు పిల్లలకిచ్చే భృతి (కిండర్ గెల్డ్) ఆపేశారుట.

అందులో కొంచెం బాడ్ న్యూస్. కొంచెం గుడ్ న్యూస్

బాడ్ న్యూస్ ఏమిటంటే – ఇకమీదట – జర్మనీలోని ఏ సంస్థా కూడా సంతానభృతి ఇవ్వదు.

గుడ్ న్యూస్ ఏమిటంటే – ఆ భృతి పంపిణీ బాధ్యతని ఇకమీదట ఆర్బయిట్స్ ఆమ్ట్ (లేబర్ బ్యూరో) అనే ప్రభుత్వసంస్థ స్వీకరిస్తుంది.

ఆర్బయిట్స్ ఆమ్ట్ మా ఇంటికి దగ్గర్లోనే ఉంది. సులభంగానే దొరికింది.

అక్కడ ఫారాలు తీసుకుని కావలసిన వివరాలు నింపి పోలీసు స్టేషన్లో స్టాంప్ వేయించుకుని ఇవ్వాలి.

వాళ్లు ఫారాలు వెంటనే ఇచ్చారు. పోలీసు స్టేషన్లో స్టాంపు వెంటనే వేశారు.

ఆ ఫారాలు తీసుకెళ్లి ఆర్బయిట్స్ ఆమ్ట్‌లో చూపించి, "ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అనడిగాను.

"ప్రస్తుతానికి ఇంటికెళ్లు. ఒకటో తారీఖున నీ బ్యాంకు ఆకౌంట్ చెక్ చేసుకో. మొదటి బిడ్డకి 50 మార్కులు, రెండో బిడ్డకి 70 మార్కులు – మొత్తం 120 మార్కులు నీ అకౌంట్లో పడి ఉంటాయి" అన్నాడు.

రెండు శుభవార్తలు.

ఒకటి – సంతానభృతికిక ఢోకా లేదు.

రెండు – ఆ భృతి ఇంకో 20 మార్కులు పెరిగింది.

అప్పట్లో జర్మనీలో మొదటి బిడ్డకి 50, రెండో బిడ్డకి 70, మూడో బిడ్డకి 120 మార్కులు, అక్కణ్ణించి ఎంతమంది బిడ్డలుంటే అందరికీ 120 మార్కులు – సంతానభృతిగా చెల్లించేదిట ప్రభుత్వం.

ఇది కుల, మత, జాతి, పౌరసత్వాలతో నిమిత్తం లేకుండా – ఆ దేశంలో పని చేసేచారందరికీ వర్తిస్తుంది.

అంతకాలం డాడ్ మాకు బిడ్డకి 50 మార్కుల చొప్పున సంతానభృతి చెల్లించేది.

ఆ బాధ్యత ప్రభుత్వం స్వీకరించడంతో భృతి మారింది.

కాలానుగుణంగానూ పాలనావిధానంలో మార్పులు అవసరపడుతుంటాయి. ఆ మార్పుల్ని అమలు జరిపే ప్రక్రియ సరళంగానూ, పౌరులకి లాభదాయకంగానూ ఉంటే – ఆ వ్యవస్థని అసలైన వెల్‌ఫేర్ స్టేట్ అనొచ్చు.

సంతానభృతి విషయంలో స్వానుభవం తర్వాత – నాకు ఇండియన్ కన్సులేట్ తీరు చికాకు తెప్పించదూ!

నా శ్రీమతి ఇండియన్ పాస్‌పోర్టులో ఉన్న ప్రకారం – మా ఇద్దరికీ వివాహమైందని ఓ సర్టిఫికెట్ ఇవ్వడానికి వారం రోజులు గడువు కావాలా?

ఇది విన్నప్పుడు ఓంప్రకాష్ కూడా గుప్తాలాగే నవ్వి, ఓ ఒరియా కథ చెప్పాడు.

ఆ కథలో – రోడ్డుమీద చెట్టు కూలి ఓ మనిషిమీద పడింది. ఆ మనిషి బ్రతికే ఉన్నాడు కానీ, ముందా చెట్టుని తొలగిస్తే తప్ప అతడి పరిస్థితి తెలియదు. అతణ్ణి వైద్యానికి పంపడం అవదు.

అతడి అవస్థ చూసిన ఓ మనిషి పోలీసులకి కబురందించాడు. పోలీసులొచ్చేక – ఆ చెట్టుని తొలగించడం సివిల్ సర్వీసెస్ వారి పని అన్నారు. ఆ ఆఫీసుకి వెడితే, ఫిర్యాదు తీసుకునే గుమస్తా సెలవులో ఉన్నాడు. అతడు మర్నాడు వచ్చి ఫిర్యాదు తీసుకుని ఫైలుని పై అధికారికి పంపాడు. అది అలా పైపైకి వెడుతూ నాలుగు చేతులు మారి, శాంక్షన్లు అయ్యేక మళ్లీ గుమస్తా దగ్గరికి వచ్చింది.

అక్కడ ఆ తంతు అలా నడుస్తూనే ఉంది. ఈలోగా ఇక్కడ కొందరు మానవతా వాదులు కష్టపడి ఎలాగో ఆ మనిషిని చెట్టుకిందనుంచి తీసి ఆస్పత్రిలో చేర్చారు.

"ఈ కథని నేనైతే మరోలా ముగించేవాణ్ణి" అన్నాడు ఓంప్రకాష్.

"ఏముందీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నందుకు ఆ మానవతావాదుల్ని క్షణాలమీద అరెస్టు చేసి ఉంటారు. ఇలాంటి అరెస్టులకి ప్రొసీజర్సుతో పెద్దగా పనుండదుగా" అన్నాను.

''గ్రేట్ – ఏ విషయాన్నయినా నువ్వూ నేనూ ఒకే కోణంలో ఆలోచిస్తాం'' అంటూ ఓం నా భుజం తట్టి మెచ్చుకున్నాడు.

''మన దేశంలో కాస్త వదువుకున్నవాళ్లంతా ఇంచుమించు ఇలాగే ఆలోచిస్తారు. కానీ అవి ఆలోచనలకీ, వ్యాఖ్యలకీ మాత్రమే పరిమితం. వాటిలో ఏ ఒక్కటీ చేతల్లోకి మారదు'' అని నవ్వాను.

''కదా, అలాంటప్పుడు – నువ్వేమిటీ – మన కన్సులేట్‌వాళ్లు ఫైలు తయారు చేసి పైకీ కిందకీ నడపకుండా – నీ పని వెంటనే ఐపోవాలనుకున్నావ్! అక్కడి అలవాటే ఇక్కడా కొనసాగదా మరి!'' అన్నాడు ఓం.

''అర్థమయింది, నన్ను నా స్టయిల్లోనే కొట్టావ్! బుద్ధొచ్చిందిలే! మన కన్సులేట్‌వాళ్లు అన్నప్రకారం వారం రోజుల్లో సర్టిఫికెట్ ఇచ్చేస్తే – వాళ్లదీ వెల్‌ఫేర్ స్టేట్ వ్యవస్థే అని ఒప్పేసుకుంటాను. సరా!'' అన్నాను.

అన్న రోజుకి ఇండియన్ కన్సులేట్ ఆఫీసుకి వెళ్లాను. ఎటొచ్చీ ఒక్కణ్ణే వెళ్లాను.

***

''మీ సర్టిఫికెట్ రెడీ'' అంది కన్సులేట్ అమ్మాయి.

'ఆహా, ఈ ఆఫీసు అసలైన వెల్‌ఫేర్ స్టేట్‌కి చెందిందని ఋజువైపోయింది' అనుకున్నాను మనసులో.

అలాగని వాళ్లకి మనసులోనే సర్టిఫికెట్ ఇచ్చేశాను.

రాజుల కాలమైతే – మెడలోంచి ఏ ముత్యాలహారమో తీసి ఇచ్చేయాల్సిన గొప్ప విషయమది మరి.

పైకి ''థాంక్స్'' అంటూ ఆ కాగితం అందుకుని చూశాను.

నాకూ, శ్రీమతికీ ఫలానా తేదీన పెళ్లయినట్లు ధ్రువీకరిస్తున్న పత్రమది.

ఆ పత్రం కళ్లతో చూస్తుంటే – చెవిలో వేదమంత్రాలు వినిపించాయి.

ఆ పత్రంలోనే ఓ విడియో కూడా కనిపించింది.

అందులో శ్రీమతి, నేను ఒకరి తలపై ఒకరు జీలకఱ్ఱ, బెల్లం పెడుతూ కనిపించాం.

మా పక్కన మా ఇద్దరు పిల్లలూ కూడా అదీ ఇప్పటి వయసులో ఉండడం – ఆ దృశ్యంలోని ప్రత్యేకత.

ఆ పత్రం చదువుతూ కొత్త పెళ్లికొడుకునన్న అనుభూతి చెందుతున్న నన్ను చూసి, ''ఈజిట్ ఓకే'' అనడిగింది కన్సులేట్ అమ్మాయి.

ఊఁ అనబోయి ఆగిపోయాను.

ఆ పత్రం ఇంగ్లీషులో ఉందని అప్పుడు వెలిగింది నాకు. ''అరే, ఇది ఇంగ్లీషులో ఉంది. నాకు జర్మన్‌లో కావాలి'' అన్నాను.

''ఇది ఇండియన్ కన్సులేట్. ఇక్కడ మేమిచ్చే సర్టిఫికెట్లు ఇంగ్లీషులోనే ఉంటాయి'' అందా అమ్మాయి.

''కన్సులేట్ ఇండియన్‌దే ఐనా ఉన్నది జర్మనీలోనే కదా! మీరిచ్చే సర్టిఫికెట్లు జర్మన్సుకోసం కదా, ఇంగ్లీషులో ఇస్తే ఎలా?'' అన్నాను.

''అది మా సమస్య కాదు. మీది'' అందా అమ్మాయి వెంటనే.

''నాది సమస్య కాదు. అవసరం. ఈ సర్టిపికెట్ జర్మన్ భాషలో కావాలి. అందుకు దయుంచి మీరే ఏదో ఏర్పాటు చెయ్యాలి?'' అన్నాను వేడుకోలుగా.

ఆమె నేను చెప్పడం అయ్యేదాకా ఆగింది. కానీ, సమాధానం మాత్రం నేను చెప్పడానికి ముందే సిద్ధం చేసుకున్నట్లుంది.

వాళ్లు సర్టిఫికెట్టుని ఇంగ్లీషులోనే ఇస్తారు. అంతేనని తేల్చేసింది.

కొంతసేపు నా ప్రయత్నం నేను చేశాను.

కొంత వేడుకోలు, కొంత వాదన.

ఏం చేసినా, ఎంత చేసినా నాది అరణ్యరోదనమే ఔతుందని గ్రహించడానికి నాకు పావుగంట పట్టింది.

''పొరపడ్డాను. ఎక్కడున్నా ఇండియన్సు ఇండియన్సే. జర్మనీలోనే ఉన్నా ఇండియన్ కన్సులేట్ – వెల్‌ఫేర్ స్టేట్ లక్షణాలు తెచ్చుకోలేదు'' అనుకున్నాను కసిగా.

నా మనసు కూడా – అంతకుముందు వాళ్లకిచ్చిన సర్టిఫికెట్‌ని వెనక్కి తీసేసుకుంది.

అంతే కదా! అవతలివాళ్ల గొప్పతనాన్ని అంచనా వెయ్యడంలో, స్వార్థం కూడా తన వంతు పాత్ర నిర్వహిస్తుంది.

అంచనా ఎలా ఉన్నా అవసరం కలిగించే అసహాయత ఒకటి ఉంటుంది కదా!

మనసుతో నిమిత్తం లేకుండా నా చేతులు మాత్రం వాళ్లిచ్చిన మారేజి సర్టిఫికెట్ తీసుకున్నాయి.

వెళ్లేటప్పుడు శ్రీమతి పాస్‌పోర్టు కోసం అడిగాను.

''పాస్‌పోర్టు ఆమెది కదా, ఆమెకే ఇస్తాం'' అందామె.

అడగ్గానే ఇచ్చేస్తారని యథాలాపంగా అడిగిన నేను ఉలిక్కిపడ్డాను.

ఇందాకట్నించి గట్టిగా వాదిస్తున్నాను కదా, దాని ప్రభావమా ఇది అనుకుని, ''ఈ రోజు తనకి వీలుకాక రాలేదు'' అని సంజాయిషీ ఇచ్చాను.

''శని, ఆదివారాలు మాకు సెలవు. మిగతా రోజుల్లో ఆఫీసు టైములో ఆమెకి ఎప్పుడు వీలైతే అప్పుడే వచ్చి తీసుకుని వెళ్లమనండి'' అందామె.

నాకు చిరాకేసింది. ''నేనామె భర్తని. అలాగని మీరే ఇప్పుడు సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. మరి ఆమె పాస్‌పోర్టు నాకివ్వరా?'' అన్నాను.

''ఎవరి పాస్‌పోర్టు వాళ్లకే ఇవ్వాలని నియమం'' నొక్కించిందా యువతి.

నాకు ఉక్రోషమొచ్చింది, ''ఈ దేశంలో ఉన్నప్పుడు – ఈ దేశంలో ఆఫీసుకోసమని ఇచ్చే సర్టిఫికెట్ – ఈ దేశస్థులకి అర్థమయ్యే భాషలో ఇవ్వాలన్న నియమం లేదు. భార్య పాస్‌పోర్టు భర్తకి ఇవ్వకూడదని నియమమా? అదీ మేమిద్దరం భార్యభర్తలమని ధ్రువీకరిస్తూ మీరిచ్చిన సర్టిఫికెట్ నా చేతిలో ఉండగా....'' అన్నాను.

ఆమె నవ్వింది, ''ఎందుకో మీరు ఆవేశపడుతున్నారు. మీరడిగింది నియమాలకి విరుద్ధమని మీకు తెలియదా?'' అంది.

ముందరి కాళ్లకు బంధం అనుకుందుకు లేదు. ఆమె చెప్పింది నిజమే!

పాస్‌పోర్టు పూర్తిగా వ్యక్తిగతం. దానికి అనుబంధాలుండవు. రక్తసంబంధాలుండవు.

నా భార్య పాస్‌పోర్టుని ఆమెకి కాక వేరే వ్యక్తికి, ఆ వ్యక్తి ఆమెకు స్వయానా భర్తయినా సరే, ఇవ్వకూడదన్న నియమం మా మంచి కోసమే!

కానీ – ఇప్పుడది తీసుకుందుకు మరోసారి ఇక్కడికి రావాలంటే ఎందుకో నాకు ఇబ్బందిగా అనిపించింది.

పరిస్థితిని తేలిక చెయ్యాలని, ''కొన్ని నియమాలు అతిక్రమించడానికే – అని ఓ ఇంగ్లీషు సామెత'' అని స్నేహపూర్వకంగా నవ్వాను.

చట్టాలు, నియమాలు జీవితాన్ని సుకరం చెయ్యడానికి. వాటిని సీరియస్‌గా తీసుకుంటే మనిషి కోర్టుల చుట్టూ తిరగాలి.

స్నేహానికి సంకేతమైన ఓ చిరునవ్వు – న్యాయవాదాల్ని మించి సాయపడగలదన్న వివేకం నాకప్పుడు కలిగింది.

''కానీ ఇది ఇంగ్లండు కాదు. జర్మనీ'' అని నవ్విందా అమ్మాయి.

ఆ నవ్వు స్నేహపూర్వకంగా ఉండడంతో – నాలో కొంచెం ఆశ, కొంచెం ధైర్యం...

ఆమెకి కూడా పాస్‌పోర్టు ఇవ్వకూడదన్న పట్టింపు ఉన్నట్లు లేదు. తన పవరేమిటో చూపించాలనుకుంది, చూపించింది.

నేను హక్కుగా సాధించాలనుకున్నది – తను చేసే ఫేవర్‌గా మార్చాలనుకుంటోంది.

అది గ్రహించగానే ఇంచుమించు కాళ్లబేరానికి వచ్చేశాను.

ఇలాంటి కాళ్లబేరాల విషయంలో – ఇండియాలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఎదురైన అనుభవాలు ఎంత బాగా పనికొచ్చేయంటే – కొద్ది నిముషాల్లోనే ఆమెకి నామీద జాలి పుట్టింది.

''ఆమెని తీసుకుని మళ్లీ రావడం మీకు ఇబ్బందిగా ఉన్నట్లుంది. ఈసారికి నియమావళి సడలించి కొంచెం రిస్కు తీసుకుని పాస్‌పోర్టు ఇచ్చేస్తున్నాము. మరోసారి ఇలా జరక్కుండా చూసుకోండి'' అంటూ శ్రీమతి పాస్‌పోర్టు నాకిచ్చేసింది.

అప్పుడు నేను నాకు కావాల్సిన సర్టిఫికెట్ జర్మన్‌లో కాక ఇంగ్లీషులో ఉందన్న విషయాన్ని పూర్తిగా మర్చిపోయి మహదానందపడిపోయాను.

ఆమెకి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకుని అక్కణ్ణించి కదిలాను.

బయటకొచ్చి ఊబాన్ ఎక్కేదాకా – నేనింకా పరమానంద స్థితిలోనే ఉన్నాను.

నెమ్మదిగా అందులోంచి బయటపడ్డాక – వాస్తవంలోకి వచ్చి నా ముందున్న కొత్త సమస్యని గుర్తించాను.

ఈ దేశంలో పెళ్లయిందని చెబితే సరిపోదు. పెళ్లయిందన్న ధ్రువపత్రాన్ని చూపించాలన్నారు.

అది చాలా కష్టమైన పని అనుకున్నాను కానీ సాధించగలిగాను.

అదిప్పుడు నా చేతిలో ఉంది. కానీ అందులోని భాష ఇంగ్లీషు. దాన్ని జర్మన్‌కి మార్చాలి – అదీ రెసిడెన్స్ పెర్మిట్ అధికారి ఆమోదించేలా!

'కత్తి పోయి కర్రా వచ్చే ధాం ధాం ధాం' అన్నట్లు అదీ నాముందున్న కొత్త సమస్య!

అన్నింటికీ పాపాలభైరవుడిలా డాడ్ సంస్థ ఉండనే ఉంది.

నా మ్యారేజి సర్టిఫికెట్‌కి జిరాక్సు కాపీ తీసి పోస్టులో వాళ్లకి పంపి జర్మన్‌లోకి అనువదించి పంపమని కోరాను.

పోస్టులో జవాబు ఇంచుమించు వెంటనే వచ్చింది.

డాడ్‌కి అనువాద విభాగం లేదుట. ఐతే ఎవరైనా తమకి తాముగా అనువదించి – ఒరిజినల్‌తో కలిపి పంపితే పరిశీలించగలరట.

అనువాదం సక్రమంగా ఉంటే – ఆ విషయాన్ని ధ్రువీకరించగలమని కూడా చెప్పారు.

ఇది నామీద సానుభూతితో నాకోసం వారు చెయ్యగల ఏర్పాటు.

అనువాదం నేనే చెయ్యొచ్చు. కానీ నాది పద్మవ్యూహం విషయంలో అభిమన్యుడి పరిస్థితి.

ఏ పత్రాన్నయినా, వ్యాసాన్నయినా – జర్మన్‌నుంచి ఇంగ్లీషులోకి అనువదించే ప్రయత్నం చెయ్యగలను.

కానీ ఇంగ్లీషునుంచి జర్మన్ అంటే – ఆ భాషలో వ్యాకరణంమీద నాకున్న పట్టు చాలదు.

ఇలాంటి విషయాల్లో నాకు సాయపడగల మరో పాపాల భైరవుడు ఓంప్రకాష్!

అతడికి విషయం చెప్పాను. అతడు వెంటనే బెర్లిన్లో రాట్‌హౌస్ (టౌన్ హాల్)ని సూచించాడు.

వెళ్లాను. వాళ్లని ఇంప్రెస్ చెయ్యడానికి నా సమస్యని జర్మన్ భాషలో చెప్పుకున్నాను.

వాళ్లు నా ప్రయత్నానికి సంతోషించారు. నేను చెప్పేది శ్రద్ధగా విన్నారు.

అంతా విని, ''నీ దగ్గరున్న సర్టిఫికెట్‌ని ఇంగ్లీషునుంచి జర్మన్‌లోకి అనువదించాలి. అదేగా నువ్వు చెప్పేది'' అన్నారు.

నా సమస్య వారి కర్థమైందని మహదానందపడి, ''ఔను'' అన్నాను.

నా సంతోషంమీద నీళ్లు చల్లుతూ, ''అది మా పని కాదు'' అన్నారు వాళ్లు.

అదేదో ఇండియాలో గవర్నమెంటు ఆఫీసులోలా చెప్పేరనుకుందుకు లేదు.

మన గవర్నమెంట్ ఆఫీసుల్లో – ఆఫీసు తొమ్మిదంటే – పదింటికి కూడా వెళ్లొచ్చు. వెళ్లేక రెండు సార్లు టీ టైముంటుంది. ఓసారి లంచి బ్రేకుంటుంది.

మధ్యలో కూడా ఉద్యోగులు ఒకరితో ఒకరు మాట్లాడుకుందుకు బోలెడంత టైముంటుంది.

అలాంటి టైములో వారు ఇంకా అనేక పనులు చెయ్యొచ్చు.

కథల్రాసుకోవచ్చు. పాటలు ప్రాక్టీసు చేసుకోవచ్చు. నాలాంటివారికి అనువాదాల్లాంటివీ చెయ్యొచ్చు.

ఇక్కడ ఆఫీసుల్లో ఉద్యోగులకి ఫ్రీ టైం లేదు. అనువాదమంటే పెర్సనల్ టైంలో చెయ్యాలి.

మన దేశంలో పెర్సనల్ టైంని ఇతరులకోసం వినియోగించేవారు ఎక్కువే.

కానీ ఇక్కడ పెర్సనల్ టైం – ప్యూర్లీ పెర్సనల్!

పోనీ తెలిసినవాళ్లయితే వేరు. నాకు రాట్‌హౌసులో ఎవరూ తెలియదు. అందుకే ''అది మా పని కాదు'' అని బదులొచ్చింది.

రాట్‌హౌసులో పని కాకపోతే కనుక, టుస్మాకి వెళ్లమని మరో సూచన చేశాడు ఓంప్రకాష్.

అది బెర్లిన్‌లోని టెక్నికల్ యూనివర్సిటీ – విదేశీయుల అవసరాలకు సహకరించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

నేను వెళ్లి టుస్మా వాళ్లని కలుసుకున్నాను.

వాళ్లు నా సమస్యని ఓపికగా విన్నారు. నేను జర్మన్‌లో చెప్పబోతుంటే, 'ఫరవాలేదు, ఇంగ్లీషులోనే మాట్లాడొచ్చు' అని ప్రోత్సహించారు.

వాళ్ల తీరు చూసి, పని జరిగినట్లే భావించాను.

ఐతే వాళ్లు అనువాదాలు చేస్తారుట కానీ, సర్టిఫికెట్లులాంటివి కావు.

ఐనా నాకోసం చేసిపెడతామన్నారు కానీ పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంవల్ల ఆ పని చేపట్టడానికి రెండు నెలలైనా పట్టొచ్చుట.

''సర్టిఫికెట్లలాంటివి మేము అనువదిస్తాం కానీ, దాన్ని ఒరిజినల్‌తో పోల్చి ధ్రువీకరించడానికి మాకు అథారిటీ లేదు. అది మీరు వేరేవాళ్లచేత చేయించుకోచాలి'' అన్నారు వాళ్లు.

జర్మనీవంటి ఒక ఆధునిక దేశంలో, చిన్న సర్టిఫికెట్ అనువాదానికి ఇంత తతంగమా అని నేను వాళ్ల ముందే వాపోయాను.

''సమస్య చిన్నదే కానీ మాకు కొత్తది'' అని ఊరుకున్నాడు టుస్మా అధికారి.

అల్పాక్షరాల్లో అనల్పార్థాలు అంటే ఏమిటో తెలుసుకుందుకు – చక్కని ఉదాహరణ!

జరిగిందంతా విశ్లేషించుకుంటే – తప్పంతా నావైపే ఉన్నట్లు అనిపిస్తుంది. అందుకు కారణం – ఈ వ్యవస్థపై నాకేర్పడిన ఆరాధనాభావం కూడా కావచ్చు.

ఏదిఏమైనా ఎక్కువ ఆలోచించలేదు. ఓంప్రకాష్‌ని కలుసుకుని జరిగింది చెప్పాను.

ఓంప్రకాష్ వెంటనే, ''ఈ విషయమై మనమే ప్రయత్నించొచ్చుగా! ఇంతకాలం మనకిది ఎందుకు తట్టలేదు?'' అన్నాడు.

సమస్య నాది కాబట్టి అది తట్టాల్సింది నాకు. నాకు తట్టింది కూడా. కానీ ఈ అనువాదపు పద్మవ్యూహంలో నేనైతే అభిమన్యుణ్ణన్న స్పృహ నాకుంది. ఆ మాట పైకనకుండా, ''ఇది సరదాకు చేసే పని కాదు. బాధ్యతాయుతంగా పని చేసే ఓ సంస్థకి, బాధ్యతగా సమర్పించాల్సిన పత్రం. అందుకు తగ్గ అనువాదం మనవల్ల ఔతుందా?'' అన్నాను.

''నేను, నువ్వు అనుకుంటే కాకపోవచ్చు. 'మనం' అనుకుంటే ఔతుందనే నా నమ్మకం. ఇక్కడ మనం అంటే – నువ్వు, నేను కాక ఓ టర్కీ మిత్రుడు కూడా ఉన్నాడు'' అన్నాడు ఓంప్రకాష్. బహుశా ప్రైమరీ స్కూల్లో పాఠం గుర్తొచ్చి ఉంటుంది.

అతడలా అనగానే నాకు ధైర్యం వచ్చింది.

ఆ సాయంత్రం మేము ముగ్గురం మా ఆఫీసులో కూర్చుని పద్మవ్యూహంలోకి అడుగెట్టాం.

టర్కీ మిత్రుడికి జర్మన్ భాషమీద మా ఇద్దరికంటే ఎక్కువ పట్టుంది.

అతడి పుణ్యమా అని మా అనువాద ప్రక్రియ అనుకున్నకంటే సులభమైంది.

నేనా సర్టిఫికెట్ చదివి మురిసిపోతుంటే – ఓంప్రకాష్ నవ్వి, 'కాకి పిల్ల కాకికి ముద్దు' సామెతని గుర్తు చేశాడు. స్థానిక జర్మన్ పౌరుడు ఎవరైనా ఆ అనువాదాన్ని పరిశీలిస్తే బాగుంటుందన్నాడు.

ఇలాంటి సమయాల్లో నాకు గుర్తొచ్చే ఒకే ఒక్కడు – హైనర్ డెకర్ట్.

అతడికి చూపిస్తే, 'గుడ్ జాబ్' అని మెచ్చుకుంటూనే – పంక్తికి రెండేసి చొప్పున మార్పులు చేశాడు.

ఇక ఆ సర్టిఫికెట్‌ని టైపు చెయ్యాలి.

నేను టైపింగులో శిక్షణ పొందలేదు. కానీ టైపుమిషన్లోకి కాగితం జొనపడం తెలుసు.

కీబోర్డు చూస్తూ ఒంటివేలితో నెమ్మదిగా టైపు చెయ్యడం వచ్చు.

ఎటొచ్చీ ఒక ఇబ్బంది ఉంది.

టైపుమిషన్లో ప్రతి అక్షరానికీ ఓ మీట ఉంటుంది. వేలుతో ఆ మీటని నొక్కగానే, ఒక లీవర్ లేచి క్బాన్ టేపుమీద పడుతుంది. ఆ రిబ్బను కింద ఉన్న కాగితంమీద కార్బన్ ప్రింటు పడుతుంది. మనం వేలితో మీటను తేలికగా నొక్కితే, అక్షరం లైటుగా పడుతుంది. గట్టిగా నొక్కితే అక్షరం ఒత్తుగా పడుతుంది.

అన్ని అక్షరాలూ ఒకేలా కనబడాలంటే – అన్ని మీటల్నీ ఒకేలా నొక్కాలి.

ప్రొఫెషనల్సు టైపు చేస్తే అక్షరాల రంగు ఒకే చిక్కదనంతో ఎంతో అందంగా ఉంటుంది.

నాలాంటివాడు టైపు చేస్తే – అక్షరాలన్నీ నలుపు తెలుపుల మిశ్రమంలా కనిపిస్తాయి.

డెకర్ట్‌కి ఆ విషయం చెప్పాను.

అతగాడు నవ్వి, ''కంగారు పడకు. మన ఆఫీసులో ఎలక్ట్రిక్ టైపుమిషన్ ఉంది. అందులో మీటని గట్టిగా నొక్కినా, నెమ్మదిగా నొక్కినా అక్షరం ఒకేలా పడుతుంది'' అన్నాడు.

ఎలక్ట్రిక్ టైపుమెషిన్లో మరో సౌకర్యం కూడా ఉంది.

టైపు చేసిన మేటర్ మెషీన్లోనే స్టోర్ ఔతుంది.

మనమోసారి చదువుకుని తప్పులుంటే సరిచేసుకోవచ్చు.

మామూలుగా ఐతే టైపు చేసిన కాగితం తీసుకుని తప్పులున్న అక్షరాల్ని తెల్లటి సిరాతో కప్పేయాలి.

అప్పుడా కాగితాన్ని మళ్లీ టైపుమెషీన్లో జొనిపి మీట నొక్కితే మనకి కావాల్సిన అక్షరంమీద పడేలా కాగితం పొజిషన్ని అడ్జస్టు చెయ్యాలి. దానికి ప్రత్యేక నైపుణ్యం ఉండాలి.

ఇంత చేసినా తప్పులు దిద్దిన చోట, అక్షరాలు అతుకుల బొంతలా అగుపిస్తాయి.

ఎలక్ట్రిక్ టైపుమెషీన్లో ప్రింటింగుకి ముందే డ్రాఫ్టుని సరిచేసుకునే అవకాశం – చాలా గొప్ప సదుపాయం.

డెకర్ట్ ఏర్పాటు చేసిన టైపుమెషీన్లో నేనే నా మారేజ్ సర్టిఫికెట్ టైపు చేశాను.

నాణ్యమైన అచ్చు యంత్రంలో ముద్రించబడిన పత్రంలా ఉన్న ఆ సర్టిఫికెట్ చూసి తెగ మురిసిపోయాను.

నేనా సర్టిఫికెట్ డాడ్ ఆఫీసుకి పంపితే రెండు రోజుల్లో వాళ్లు దాన్ని ధృవీకరిస్తూ స్టాంపు వేసి పంపారు.

హమ్మయ్య అనుకున్నాను. ఇక శ్రీమతికి రెసిడెన్సు పెర్మిట్ వచ్చేసినట్లే అనిపించి హుషారెక్కాను.

అలా ఏప్రిల్ 14న రెసిడెన్స్ పెర్మిట్‌కోసం ఆ ఆఫీసుకి సకుటుంబంగా వెళ్లాను.

అక్కడి అధికారి నేను తెచ్చిన కాగితాలు చూడనే లేదు. శ్రీమతి పేరొక్కటీ అడిగి, ''ఆలస్యంగా వచ్చారు. ఈ రోజుకి మీ పని అవదు. రేపు రండి'' అన్నాడు.

ఆయనలా ఎందుకన్నాడో నాకర్థం కాలేదు.

మేము ఆఫీసు తెరిచే సమయానికల్లా అక్కడ లేం కానీ, మూసే వేళకి కాస్త ముందుగానే వెళ్లాం.

అదలాగుంచితే వచ్చినవాళ్లలో కొందరింకా పిలుపుకోసం ఎదురు చూస్తున్నారు.

వాళ్లని వెళ్లిపొమ్మని ఆ అధికారి చెప్పలేదు.

వ్యవహారం తిరకాసుగా అనిపించింది.

ఇండియాలో ఐతే, ఏ చప్రాసీనో పిలిచి, ఏం కావాలో అడిగి తెలుసుకుని తైలం సమర్పించుకోవచ్చు.

ఇదీ అలాంటి సందర్భమేనా అనిపించింది కానీ – నమ్మడానికి మనసొప్పలేదు.

ఎవరినడగాలా అనుకుని, చివరికి ఆ అధికారినే మరోసారి పలకరించి మాకు లభించిన ప్రత్యేక హోదాకి కారణమడిగాను.

ఆయన నవ్వి, ఆఫీసు తెరిచే టైముకి వచ్చి మీ కాగితాలివ్వాలి. వచ్చినవాళ్లని ఆల్ఫాబెటికల్ ఆర్డర్లో పిలుస్తాం. మీరొచ్చేసరికి 'ఆర్' దాటిపోయి 'టి' నడుస్తోంది.రేపు పెందరాళే వచ్చెయ్యండి'' అన్నాడు.

''ఇప్పటికే ఒకటికి రెండు సార్లు తిరిగాను. మరోసారి మా వాళ్లందర్నీ వెంటబెట్టుకుని ఇంత దూరం రావాలా?'' అన్నాను నీరసంగా.

అతగాడు శ్రీమతినీ, పిల్లల్నీ చూసి స్నేహపూర్వకంగా నవ్వాడు.

ఆ నవ్వుకి నా ప్రాణం లేచొచ్చింది. కన్షెషనిచ్చి ఈ రోజే మా పని పూర్తి చేస్తాడన్న ఆశ నాలో పుట్టింది.

''వీళ్లంతా ఎందుకు? రేపు నువ్వొక్కడివీ వస్తే చాలు'' అన్నాడతడు నాతో.

అదే స్నేహపూర్వకమైన నవ్వు. ఎక్కడైనా బావ కానీ వంగతోట కాడ కాదంటోంది ఆ నవ్వు.

'చివరి బంతి ఆడేదాకా ఆట ముగిసినట్లు కాదు' అన్న క్రికెట్ సామెత గుర్తొచ్చింది.

ఇస్సురంటూ వెనక్కి మళ్లాం.

మర్నాడు నేనొక్కణ్ణే వెళ్లాను. అదీ ఆ ఆఫీసు తెరుచుకునే సమయానికి.

అధికారికి కాగితాలిస్తున్నప్పుడు నన్ను చూసి గుర్తు పట్టి స్నేహపూర్వకంగా నవ్వుతాడనుకున్నాను.

కానీ అతడు నవ్వలేదు. అందుకు కారణముంది.

ఈరోజా సీట్లో ఉన్నది నిన్నటి వ్యక్తి కాదు.

''కాగితాలు తీసుకుంటాడా? తీసుకుని శ్రీమతి రాలేదేమని అడిగి, ఆమెని తీసుకుని రేపు మళ్లీ రమ్మంటాడా?'' మనసులో బెంగ.

అతగాడు కాగితాలు తీసుకున్నాడు. ఓసారి పరీక్షగా చూశాడు. అబ్జక్షన్సేవీ ఉన్నట్లు లేదు. ''పేరు పిలుస్తాం. అందాకా వెళ్లి కూర్చోండి'' అన్నాడు.

మనసు తేలిక పడినట్లే అనిపించి బరువెక్కేసింది.

నన్నక్కడ కూర్చోమని, ఓ గంట తర్వాత పిల్చి, మీ ఆవిడేదీ అనడిగి, రాలేదని తెలియగానే, ఆమెని తీసుకుని రేపు మళ్లీ రమ్మంటే...

పోనీ తను రాలేదని ఇప్పుడే చెప్పేద్దామా అనుకున్నాను.

''ఏడిసినట్లుంది. వాళ్లు నిన్నడగలేదు. అనవసరంగా ఈ మాట చెప్పి 'దొంగాడా కరవకురా' అన్న పరిస్థితి తెచ్చుకోకు'' అంది వివేకం.

వివేకం మాట విన్నాను. అక్కడ కూర్చుని పిలుపు కోసం ఎదురు చూస్తున్నాను. చివరికి ఓ గంట తర్వాత నాకు పిలుపొచ్చింది.

విఘ్నేశ్వరుడి పెళ్లికి వెయ్యి విఘ్నాలూ ఐపోయినట్లున్నాయి. స్టాంపు వేసిన రెసిడెన్సు పెర్మిట్ కాగితం నాకు అందింది.

ఆ కాగితాన్ని ఒకటికి రెండు సార్లు చూసుకున్నాను. తర్వాత ఒకటికి రెండు సార్లు చదివాను.

ఇక నేనున్నన్నాళ్లూ నా కుటుంబం నాతోనే ఉంటుంది.

మేమున్నన్నాళ్లూ ఒలోముచ్‌కీ తనింట్లో మమ్మల్ని ఉండనిస్తుంది.

అది తలచుకుని నా ఆనందానికి పట్టపగ్గాలు లేవు. ఆనందపడే ముందు – అది కల కాదు, నిజమేనని ధ్రువపర్చుకున్నాను.

ఇంటికెళ్లి శ్రీమతికి సర్టిఫికెట్ చూపగానే – ''ఇప్పుడిక మనకే బెంగా లేదు. కొన్నాళ్లు అన్నీ మర్చిపోయి, హాయిగా విహారయాత్రలు చెయ్యొచ్చు'' అంది ఎంతో ఉత్సాహంగా.

ఆమె విహార యాత్రలు అనగానే ఉలిక్కిపడ్డాను.

నగరవిహారం

శ్రీమతి నోట వెలువడిన విహార యాత్రలు అన్న మాట బాణమై గుచ్చింది.

ఈ బాణం చిత్రమైనది. అది నన్ను బాధించలేదు. బాణం వదిలిన శ్రీమతిపై జాలి పుట్టించింది.

ఎందుకంటే శ్రీమతి వాడేవి వేటగాడి బాణాలు కావు. నన్ను వేటాడే ఉద్దేశ్యమూ ఆమెకుండదు.

ఈ బాణాలకు సంబంధించి నేను సీతన్న, ఆమె పుల్లయ్య. ఆ కథేంటంటే....

మా ఊళ్లో ఇంటింటికీ మంచినీటి కుళాయిలు పెట్టిస్తానని ఎన్నికల్లో నెగ్గాడు ఓ సీతన్న. మా ఊరివాడు దేశనాయకుడయ్యాడని ఊళ్లో ఆయనకి సన్మానం జరిగింది.

కొందరాయనకి దండలేశారు. కొందరు మాటలతో పొగిడారు.

ప్రతి ఒక్కరూ తాము చెప్పేది పూర్తి కాగానే, ''సీతన్న గారికీ జై'' అంటున్నారు. సభికులంతా జయజయధ్వానాలు చేస్తున్నారు.

ఇది చూసిన మా ఊరి పుల్లయ్యకి ఉత్సాహం తన్నుకొచ్చినట్లుంది. చటుక్కున తనూ వేదిక ఎక్కాడు.

పుల్లయ్య ఓ రైతు కూలీ. ఎప్పుడూ ఏ విషయంలోనూ ఇలా ముందుకు రాలేదు. అందుకని కొందరు వాణ్ణి అటకాయించబోయారు.

''పుల్లయ్యని ఆపకండి. తన ఉత్సాహం తనది. ఏం చెబుతాడో చెప్పనివ్వండి'' అని ప్రోత్సహించాడు సీతన్న.

''మా గుడిసెకీ కాలవకీ మైలున్నర దూరం. మా ఆడదానికి నీళ్ల ఖర్చెక్కువ. నేను తెచ్చే రెండు కావిళ్లూ, అది తెచ్చుకునే నాలుగు కుండల నీళ్లూ సరిపోవు. అంతకుమించి తెచ్చుకునే ఓపిక మా ఇద్దరికీ లేదు. ఇకమీదట ఆ బాధుండదు. కావాలసినప్పుడల్లా ఇంట్లో కుళాయి తిప్పుకుంటే చాలు. ఎన్ని కుండలు కావాలంటే అన్ని కుండల నీళ్లు. సీతన్న బాబుకీ జై'' అని గట్టిగా అరిచాడు.

ఆశ్చర్యంగా సభలో ఎవరూ జయజయధ్వానాలు పలకలేదు.

మన జనంలో పరిణతి రాలేదని అంతా అనుకుంటాం కానీ, అదెప్పుడో వచ్చేసింది.

ఎన్నికలముందు నాయకుడు చేసిన వాగ్దానాల గురించి, ఎన్నికల తర్వాత గుర్తు చెయ్యడం – బాణమేసినట్లేనని సభికులందరికీ తెలుసు.

జై కొడితే సీతన్న నొచ్చుకుంటాడని అందరికీ అనిపించినట్లుంది.

ఆ సభలో నేనూ ఉన్నాను. ఏమంటాడోనని సీతన్నని కుతూహలంగా చూస్తే, ఆయన మొహంలో బాణం తగిలిన బాధ ఏకోశానా లేదు. పుల్లయ్య అమాయకత్వం పట్ల కాబోలు జాలి కనిపించింది.

ఇప్పుడు శ్రీమతి మాటకి నా స్పందనా అదే!

శ్రీమతికి కొత్త, వింత ప్రదేశాలు ఇష్టం. చారిత్రక కట్టడాలు ఇష్టం. మ్యూజియాలు ఇష్టం. భౌతికంగా వాటిమధ్యన ఉంటూ, అక్కడి గాలి పీలుస్తూ అలాంటివన్నీ చూడ్డం ఇష్టం.

తనకిష్టమైనవన్నీ నాకూ ఇష్టమే. కానీ ఉన్నచోటనే ఉండి నా పనులు నేను చేసుకుంటూ, వాటిని ఊహించుకుని తృప్తిపడే తత్వం నాది.

తనకేం కావాలో, ఎదుటివాళ్లు తెలుసుకోవాలి తప్ప ఫలానాది కావాలని అడిగే అలవాటు ఆమెకీ లేదు, నాకూ లేదు.

అలా మేమిద్దరం కొన్ని అభిరుచుల విషయంలో ఒకరికొకరు అపరిచితులం.

పెళ్లయ్యేక నావాళ్లకు సంబంధించిన ఆర్థికపరమైన బాధ్యతల్లో నా అంతగానూ తనూ మమైకమవడంవల్ల – మా అభిరుచులకి ప్రాధాన్యమన్నది లేకుండా పోయింది.

నాకు జర్మనీ అవకాశం రాగానే, అదో కొత్త దేశమనీ, సుమారు రెండేళ్లు అక్కడ గడపడం కొత్త అనుభూతి అనీ మా ఇద్దరికీ కూడా స్ఫురించలేదు. ఆర్థికంగా నిలదొక్కుకుందుకు ఈ అవకాశం ఎంతవరకూ సహకరిస్తుందనే మా ఆలోచన!

నిజానికి తనకీ నాతో రావాలనుంది. నాతో ఆ మాటనలేదు.

తనూ నాతో రావాలని నాకూ ఉంది. మాటవరసకి కూడా తనతో నేనా మాట అనలేదు.

ఒక్కణ్ణీ జర్మనీ వచ్చేక సకుటుంబంగా అక్కడుండానికి ఆర్థికంగా నాకు వెసులుబాటేనా అని బేరీజు వెయ్యని రోజు లేదు.

మనసు సద్ది చెప్పిందో, నా సంకల్పబలం పని చేసిందో కానీ – ఆమెనిక్కడికి తీసుకురావడం వీలేననిపించింది.

అలాగని ఉత్తరం వ్రాయగానే, శ్రీమతి మొదటి స్పందన ''ఎంచక్కా కొత్త కొత్త దేశాలు చూడొచ్చు'' అని.

ఆమె ఆ మాట యథాలాపంగానో, సూచన ప్రాయంగానో అందని నేననుకున్నాను.

ఓ బాపు కార్టూన్లో, ఓ ముసలాయన 'పళ్లు నొప్పి పెడుతున్నాయే' అని భార్యతో అంటాడు. దానికామె, 'పోదురూ బడాయి. పళ్లు అని బహువచనం కూడాను' అంటుంది.

'కొత్త కొత్త దేశాలు' ఆని బహువచనం కూడాను – అనుకున్నాను శ్రీమతి జవాబు చూసి.

జర్మనీకి ఏరోఫ్లోట్ విమానంలో రావడం వల్ల – తను కనీసం మాస్కో విమానాశ్రయమైనా చూసింది.

నేను లుఫ్తాన్సాలో నేరుగా జర్మనీలోనే దిగాను. అంటే ఈ ప్రయాణంలో నేను చూసింది ఒక్కటే దేశం.

తనిక్కడికి వచ్చేక నేనా మాట తనతో ఆని అసూయ నటించాను కూడా.

అప్పుడు తను, ''మీరు జర్మనీలో ఫ్రాంక్‌ఫుర్ట్ విమానాశ్రయం చూశారు. ఊళ్లయితే హానోఫర్, ల్యూనబర్గ్, హాంబుర్గ్ చూశారు. ఇప్పుడు బెర్లిన్‌లో ఉన్నారు. నాకిక్కడ బెర్లిన్ తప్ప మరో ఊరు తెలియదు'' అంది.

అది నేనన్నదానికి కేవలం సమాధానం. కానీ ఆమెని ఊళ్లు తిప్పలేకపోతున్నానన్న అపరాధభావమొకటి నాలో ఉందిగా – అందుకని తన మాట జవాబులా కాక రిటార్టులా తోచింది.

ఆతర్వాత మామధ్య మళ్లీ ఊళ్లు తిరిగే ప్రస్తావన రాలేదు.

ఇదిగో, ఈ రెసిడెన్స్ పెర్మిట్ వచ్చేకనే మళ్లీ....

రెసిడెన్స్ పెర్మిట్ మమ్మల్ని విడిపోకుండా ఆపగలదు కానీ ఆర్థికంగా కొత్త ప్రయోజనాలేమివ్వదు.

ఇక్కడున్నంతకాలం ఇద్దరూ కలిసుంటాం. తర్వాత కలిసి ఇండియా వెళ్లిపోతాం.

ఈ మధ్యలో విహారయాత్రలవంటివి పెట్టుకుంటే మా బడ్జెట్ దెబ్బ తింటుంది.

నిజంగా దెబ్బ తింటుందో లేదో కానీ, మధ్యతరగతి బాధ్యతల బరువుని మనస్ఫూర్తిగా స్వీకరించిన మా మనస్తత్వంవల్ల కూడా అలా అనిపిస్తూండి ఉండొచ్చు.

శ్రీమతి విహారయాత్రల ప్రస్తావన తేగానే, తనలో ఆ ఆలోచన తప్పించాలనుకున్నాను.

తన మనసు నొచ్చుకోకూడదు. అందుకని ఓ క్షణం ఆలోచించి, ''మనవంటి గొప్ప ప్రేమికులకు విహారయాత్ర ఎలా ఉండాలో – గుండమ్మకథ సినిమాలో పింగళివారు ఓ పాటలో మహా చక్కగా వినిపించారు. అదే మనకి ఆదర్శం. నీ ఉద్దేశ్యమూ అదే కదూ!'' అన్నాను.

నేనేం చెబుతున్నానో శ్రీమతికి అర్థం కాలేదు, ''ఏ పాట?'' అంది వెంటనే.

చాలామందికిలాగే ఇష్టమైన పాటలు పాడుకోవడం నాకిష్టం.

మన ఇష్టం ఇతరులకి కష్టం కలిగించకూడదని, నా ఇష్టాన్ని ఎక్కువగా బాత్రూంకే పరిమితం చేస్తుంటాను.

ఐతే అప్పుడప్పుడు పాట వినిపించడానికి వచ్చే ఇలాంటి అవకాశాలు వదులుకోను.

''ప్రేమ యాత్రలకు బృందావనమూ నందనవనమూ ఏలనో, కులుకు లొలుకు చెలి చెంతనుండగా వేరే స్వర్గము ఏలనో'' అని రాగయుక్తంగా పాడాను.

స్పందన శ్రీమతినుంచి వస్తుందనుకున్నాను.

కానీ నేను పల్లవి పూర్తి చేశానో లేదో, ''అమ్మా, నాన్నగారు ట్యూను తప్పు పాడుతున్నారు'' అంది పాప.

తండ్రివల్ల తప్పు జరిగితే నేరుగా చెప్పలేక తల్లికి చెప్పడం చాలామంది పిల్లలకు మామూలే.

ఇది పురుషాధిక్య సమాజమనడానికి స్త్రీవాదులే అక్కర్లేదు. మన పిల్లలే చాలు.

ఇక పాప విషయానికొస్తే సంగీతపరంగా అది మామూలుది కాదు.

మూడేళ్ల వయసుకే క్లిష్టమైన సినీగీతాల్ని స్క్రిప్టులో అక్షరం పొల్లు పోనీదు.

ఆపైన ట్యూనులో శ్రుతిలయలు తప్పకుండా పాడగలిగిన సంగీతావగాహన జన్మతః అబ్బిన అదృష్టం దానిది. ఏ ప్రొఫెషనల్ సింగర్ ఇంట్లోనే పుట్టి ఉంటే ఈ వయసుకే సినిమాల్లో పాటలు పాడి ఉండేది.

రేడియోలోనూ, గ్రామఫోను రికార్డుల్లోనూ పాటలు వినడం పాపకి అలవాటు చేసింది నేనే!

పాపకి పాడ్డం వచ్చినప్పట్నించీ ఇంట్లో పాటలు హమ్ చెయ్యాలన్నా భయపడాల్సిన పరిస్థితొచ్చింది నాకు.

చంటిది, దానికేం తెలుసని కొట్టిపారెయ్యడానికి లేదు. టేపు రికార్డర్ కొన్నాక, సరదా కొద్దీ కొన్ని పాటలు పాడి రికార్డు చేసుకున్నాను. దాంతో నా గానచాతుర్యంమీద నాకూ స్పష్టమైన అవగాహన వచ్చింది.

అంతమాత్రాన పాడాలన్న కాంక్ష పోదు కదా! ఆపద్ధర్మంగా నేనే పాటలు వ్రాసుకుని స్వంత ట్యూన్సు కట్టుకుని పాడుకోవడం మొదలెట్టాను.

నా పాటలు పాపకి నచ్చి తనూ పాడేది. ఐతే నా పాటనే నేను రెండోసారి పాడితే షరా మామూలుగా ట్యూను మారిపోయేది. పాప వెంటనే, తప్పు పాడుతున్నానని అభ్యంతరపెట్టేది.

మనసులో చిన్నబుచ్చుకున్నా పైకి మాత్రం తడబడకుండా, ''అప్పటికా ట్యూను నచ్చింది. దానికంటే ఇది బాగుందనిపించింది. అందుకని మార్చాను'' అని పాపకి సద్ది చెప్పాను.

అలా నాలుగుసార్లు ట్యూనుని మెరుగుపర్చేక – ''ఎన్నిసార్లు మారుస్తారూ?'' అని పాప విసుక్కుంది.

దాంతో పాప ఎదురుగుండా నా స్వంత ట్యూన్సుని రెండోసారి పాడకుండా జాగ్రత్త పడుతున్నాను.

ఇప్పుడు ఈ ప్రేమయాత్రల పాటతో పాపకి మళ్లీ దొరికిపోయి ఏంచెప్పాలా అని ఆలోచిస్తుంటే – శ్రీమతి నవ్వి, ''నాన్నగారు పాడలేదు. వినిపించారంతే!'' అని పాప దగ్గర తాత్కాలికంగా నా పరువు నిలబెట్టింది.

''ఏమిటో, నాన్నగారెప్పుడూ పాట వినిపించడమే కానీ పాడరు'' అని ఓసారి గొణుక్కుంది పాప.

పాప అమాయకంగానే గొణుక్కున్నా నాకది పంచ్ డైలాగులా తగిలింది.

శ్రీమతి దాన్ని దగ్గరగా తీసుకుని బుగ్గలు పుణికింది. చూడ్డం మాత్రం నన్నే.

చూసి ఊరుకోలేదు, ''తర్వాత చరణం కూడా వినిపించరూ'' అంది – 'వినిపించరూ' అన్న పదాన్ని కాస్త నొక్కి పలకడంలో చిలిపితనాన్ని ప్రదర్శిస్తూ.

పాప వెంటనే, ''ఈసారి వినిపించడానికి వీల్లేదు. పాడాల్సిందే'' అంది.

ఇందాకా కూడా నేను పాడానని దానికెలా చెప్పేది?

''రెండో చరణం గుర్తు రావడం లేదు'' అన్నాను తప్పించుకుందుకు.

''నాకు గుర్తుంది, చెబుతున్నా వినండి'' అంది శ్రీమతి – తాను పాడడం లేదనీ, వినిపిస్తున్నాననీ ముందే జాగ్రత్త పడుతూ.

పాప సంగీతజ్ఞానం కాదు కానీ – దానిముందు పాడ్డానికి శ్రీమతికీ భయమే!

శ్రీమతి చెప్పేంతలో పాప తనే అందుకుని, ''తీర్థయాత్రలకు రామేశ్వరము కాశీ ప్రయాగలేలనో, ప్రేమించిన పతి ఎదుటనుండగా వేరే దైవము యేలనో'' అని రాగయుక్తంగా పాడి గొప్పమొహం పెట్టి చూసి, ''ఇప్పుడు పాడండి'' అంది.

ముచ్చటేసింది. చటుక్కున దగ్గరగా తీసుకుని, ''ఇంత బాగా పాడేవు. నీ పాట ఇంకా వినాలనుంది. మొత్తం పాడవూ!'' అన్నాను.

మరిపించాలని కాదు, నిజంగానే ఆ మాట అప్రయత్నంగా అన్నాను.

శ్రీమతి ఊరుకుంటుందా, ''తప్పించుకుందుకు వీల్లేదు. మీరిప్పుడు పాడాల్సిందే'' అని నొక్కించింది.

రాగింగుని ప్రొఫెషనల్ కాలేజీల్లో నిషేధించగలరేమో – భర్తలముందు భార్యల విషయంలో కుదరదు.

తప్పుతుందా? అసహాయంగా ఓసారి స్క్రిప్టు మననం చేసుకున్నాను.

మహానుభావుడు పింగళి వారు. తప్పించుకుందుకు దారి స్క్రిప్టులోనే చూపించాడు.

అది ఆసరా చేసుకుని, ''ఆ చరణం ఆడవాళ్లని తీర్థయాత్రలకి పరిమితం చేస్తుంది. పతిని సతికి దేవుణ్ణి చేస్తుంది. అది నాకు నచ్చదని నీకూ తెలుసు'' అన్నాను.

మాట మార్చడం కాదు.

పతిసేవలే సతికి జీవనలక్ష్యమనే పాత సినిమా పాటలు చాలా ఉన్నాయి.

వాటి భావాన్ని నేను నిరసించడం శ్రీమతికి అనుభవమే.

''పాట పాడకుండా బాగా తప్పించుకున్నారు'' అని నవ్వింది శ్రీమతి.

తప్పించుకున్న మాట నిజమే కానీ, పాటనుంచి కాదు, విహారయాత్రలనుంచి!

అలాగని బయటపడకుండా, ''ఇందులో తప్పించుకున్నదేముంది? నువ్వు విహారయాత్రలన్నావు. అందుకు నేనీ పాటని స్ఫూర్తి చేసుకున్నాను. విహారయాత్రకి ఊళ్లూ దేశాలూ తిరగాలా? మనిద్దరం ఒకరిపక్కన ఒకరుంటే అదే విహారయాత్ర!'' అన్నాను.

శ్రీమతికి అర్థమైంది, ''ఔను నిజమే! ఇంట్లో వంట చేసుకు తింటున్నాం. అదో విహారయాత్ర! షాపుకెళ్లి ఉప్పూ, నూనే, బియ్యం కొనుక్కొస్తున్నాం. అదో విహారయాత్ర!'' అని క్షణమాగి, ''పిల్లల్నేసుకుని మీతో ఆఫీసు కొద్దామనుకుంటున్నాను. మీ ప్రొఫెసరుగారి అనుమతి తీసుకోండి'' అంది.

''ఎందుకు?'' అన్నాను ట్యూబులైటు వెలక్క.

''రోజూ ఆఫీసుకెళ్లడం విహారయాత్ర ఔతుందని'' అనేసి, నేను నొచ్చుకుంటానని జాలేసిందేమో ఆ వెంటనే నవ్వేసింది.

మా మాటల్లో తమకి ఉత్సాహం కలిగించేవేం లేదనిపించిందేమో – పిల్లలు బొమ్మలతో ఆడుకుందుకు పక్కకి వెళ్లారు.

''సారీ వసూ! నా ఉద్దేశ్యం అది కాదు. నేను చెప్పేది కాస్త విను'' అన్నాను.

దెప్పడం ఐపోయింది కాబట్టి – తనకీ మనసు కాస్త తేలికపడి నే చెప్పేది వినే మూడ్‌కి వచ్చింది.

''మనం భువనేశ్వర్లో ఉంటూ ఏం చేసేవాళ్లం? సినిమాలు, షాపింగు – అంతేగా! కానీ చుట్టాలు, స్నేహితులు – కేవలం నందనకానన్, లింగరాజు మందిరం, రాజారాణి ఆలయం, ఖండగిరి–ఉదయగిరి గుహలు, అశోకుడి శిలాశాసనం వగైరా ప్రదేశాలు చూడ్డంకోసమే మనింటికొచ్చేవారు. చూసేక ఏమనేవారు?'' అన్నాను.

'మీరు చాలా గొప్ప యాత్రాస్థలంలో ఉంటున్నారు. శ్రద్ధగా చూడాలంటే – ఈ ఊళ్లో కనీసం ఆర్నెల్లుండాలి. ఏంచూసినా ఇలా హడావుడిగా కాక శ్రద్ధగా చూసే అదృష్టం మీకుంది' అని ఒకరా, ఇద్దరా చాలామందే అన్నారు. వాళ్లు చెప్పేదాకా మాకా ఊరు యాత్రాస్థలమన్న స్పృహ కలుగలేదు. కలిగేక కూడా ముఖ్యమైన ప్రదేశాలు కొన్నింటిని మొదటిసారి చూడ్డానికే ఏళ్లు పట్టింది.

శ్రీమతికి ఆ విషయం గుర్తు చేశాక, ''భువనేశ్వర్ జనాభా లక్ష దాటిందేమో! మరి బెర్లిన్ జనాభా – తూర్పు పశ్చిమాలు కలిపి ముప్పై లక్షలు పైన. స్థలం చూస్తే భువనేశ్వర్‌కి ఐదు రెట్లు పైన. అసలే ఇక్కడ చూడాల్సిన వింతలు ఎన్నో ఉంటే, రెండవ ప్రపంచయుద్ధానికి గురైన నగరం కావడంవల్ల మరిన్ని అయ్యాయి. అవి చూడ్డానికి ప్రపంచంలో ఎక్కడెక్కణ్ణించో యాత్రీకులు విరగబడి వస్తూంటారు. మనకిక్కడ ఏడాదికి పైగా ఉండే అదృష్టం కలిగింది. విహారయాత్రకి ఈ నగరమొక్కటి చాలదూ మనకి!'' అన్నాను.

శ్రీమతి నవ్వి, ''ఈ మాట చెప్పడానికి పాటలు పాడాలా? ఏవేవో గుర్తు చెయ్యాలా? ఇంత డొంకతిరుగుడు లేకుండా సూటిగా మన వ్రతాల గురించి చెబితే సరిపోదా? వినాయకుడి వ్రతం చేసేటప్పుడు – పూజకి ముందు బంగారు విగ్రహం పెట్టమంటారు. అందుకు శక్తి చాలకపోతే వెండి ఐనా ఫరవాలేదంటారు. చివరికి మట్టి విగ్రహం దాకా కన్సెషనిస్తారు. ఇక్కడ ఉద్దేశ్యం బంగారాన్ని ఎక్కువ చేసి, మట్టిని తక్కువ చెయ్యడం కాదు. దేవుడి పూజ విషయానికొస్తే మట్టీ, బంగారం ఒకటేననీ, మట్టికంటే ఎక్కువ చేస్తే అది మెహర్బానీ అని సూచించడం. నేనేదో సరదాకి విహారయాత్రలన్నాను కానీ, బెర్లిన్ నగర విహారమంటే – మన తాహతుని బట్టి – అది పూజకి బంగారు విగ్రహంతో సమానం. ఈ అదృష్టాన్ని సద్వినియోగం చేసుకుందాం'' అంది.

ఆమె సహకారాన్నీ, సాహచర్యాన్నీ ఏమని పొగడను?

నాకు చిన్నప్పుడు చందమామలో చదివిన కథ ఒకటి గుర్తొచ్చింది.

ఓ గుడిసెలో అమాయకుడైన భర్త, అనుకూలవతి ఐన భార్య ఉన్నారు. వాళ్లకో ఆవుంటే భర్త దాన్ని అమ్ముకొస్తానని పట్నం బయల్దేరాడు. దారిలో ఒక మోసగాడెదురై, మాయమాటలతో నమ్మించి తన దగ్గరున్న మేకను భర్తకిచ్చి ఆవును తోలుకుపోయాడు. మరికొంత దూరం వెళ్లే మరో మోసగాడు వాడికో కోడిపుంజునిచ్చి మేకను తోలుకెళ్లిపోయాడు. మరికాస్త దూరం వెళ్లేక మరో మోసగాడు వాడి చేతిలో ఓ రూపాయుంచి కోడిపుంజుని తీసుకెళ్లిపోయాడు. అలా చివరికి ఉత్త చేతులతో ఇంటికి తిరుగుముఖం పట్టిన అతణ్ణి దారిలో ఓ బాటసారి పకలరించి విషయమడిగి తెలుసుకున్నాడు. 'నీ తెలివితక్కువతనానికి నీ భార్య మండిపడి పెద్ద రభస చేస్తుంది. ఎక్కడైనా పని చేసి నాలుగు డబ్బులు సంపాదించి అప్పుడు ఇంటికెళ్లడం మంచిది' అని సలహా ఇచ్చాడు. దానికా అమాయకుడు, 'నా భార్య నన్ను దేనికీ తప్పు పట్టదు' అన్నాడు. బాటసారికి నమ్మకం కుదరక, ఆ విషయమై నూరు వరహాలు పందెం కాసాడు. ఇద్దరూ అమాయకుడి ఇంటికెళ్లారు. అమాయకుడు అంతవరకూ తనకూ జరిగిన అనుభవాల్ని ఒకొక్కటిగా చెబుతుంటే, ఆమె అతడు చాలా తెలివిగా చేశాడని మెచ్చుకుంది. పల్లెత్తు మాట అనలేదు సరికదా, తిరిగి తిరిగి అలసి వచ్చాడని అతడికీ, అతడితోపాటు బాటసారికీ రుచికరమైన భోజనం పెట్టింది. పందెం ఓడిన బాటసారి అమాయకుడికి నూరు వరహాలూ ఇచ్చుకుని, 'అనుకూలవతి ఐన భార్య – భర్తకు ఎన్ని నష్టాలు కలిగినా అవలీలగా పూడ్చగలదు' అని వెళ్లిపోయాడు.

ఆ బాటసారి మాటల్లోని నిజం శ్రీమతి ద్వారా నాకు ప్రత్యక్షానుభవం.

కొన్ని బాధ్యతలు, కొంత అమాయకత్వం ఆర్థికంగా నా పరిస్థితిని క్లిష్టం చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అన్నింటినీ అధిగమించానంటే అందుకు కారణం శ్రీమతి మాత్రమే!

నగరవిహారాన్నే విహారయాత్రగా భావించడం వరకూ సరే! ఆ పరిణామం ఆహ్లాదకరంగా జరగడం గమనార్హం.

ఇద్దరం ఓ 'రెయిజే బ్యూరో' (టూరిస్ట్ ఆఫీసు)నుంచి తెచ్చుకున్న కరపత్రాలను స్టడీ చేసి నగరంలో చూడాల్సిన ప్రదేశాల్ని ఓ కాగితంమీద నోట్ చేసుకున్నాం.

అప్పుడు గమనించిందేమిటంటే, ముఖ్యమైన యాత్రా ప్రదేశాలు చాలావరకూ మా చుట్టుపక్కలే ఉన్నాయి.

డాయిచే ఓపర్ మన రవీంద్రభారతిలాంటిది. మా ఇంటినుంచి ఐదారు నిముషాల కాలినడక అంతే! రోజూ చూస్తూనే ఉంటాం.

డాయిచే ఓపర్ ఉండే వీధిలోనే రోడ్డుకి అటుపక్కగా చార్లొటెన్ బర్గ్ పాలేస్ ఉంది. భవనంలో మ్యూజియం, ఆక్వారియం ఉన్నాయి. భవనం చుట్టూ అందమైన పెద్ద పార్కు. మాకు రోజూ కనబడుతూనే ఉంటుంది.

బ్రాండెన్‌బర్గ్ గేటు – రెండు జర్మనీలకు సరిహద్దు ద్వారం. అది మా ఆఫీసుకి చాలా దగ్గర. రోజూ కనబడుతూనే ఉంటుంది. సాయంత్రాలు మావాళ్లతో నడుచుకుంటూ అక్కడికి చాలాసార్లే వెళ్లాం.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న రెయిష్‌టాగ్ భవనాన్ని కూడా మేము చాలాసార్లు చూశాం. దాన్ని హిట్లర్ భవనం అని కొందరు మాకు చెప్పారు కానీ – అది రాజులు కొలువు తీరే సభాభవనమని కరపత్రంలో రాసుంది.

ఆ దగ్గర్లోనే కాంగ్రెస్ హాలే (కాంగ్రెస్ హాల్) ఉంది. టోపీ ఆకారంలో చిత్రంగా ఉండడంవల్ల మేము దాన్ని ప్రత్యేకంగా గమనించడం జరిగింది.

కైజర్ విల్‌హెల్మ్ మెమోరియల్ చర్చి మా ఇంటికి 3–4 కిలోమీటర్ల దూరంలో కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ ఏరియాలో ఉంది. ఊబాన్లో వెడితే చేరుకుందుకు ఐదు నిముషాలు కూడా పట్టదు. రెండో ప్రపంచయుద్ధంలో బాంబుల దాడికి గురి కావడంవల్ల పైభాగం కొంత శిథిలమైంది. ఆ దారుణానికి గుర్తుగా శిథిలభాగాన్నలాగే ఉంచి మిగతా చర్చిని మరమ్మతు చేసి ఆధునికంగా తయారు చేశారు. చిత్రంగా కనబడే ఆ భవంతిని కూడా అక్కడ షాపింగుకి వెళ్లినప్పుడల్లా చూస్తూనే ఉంటాం.

ఐరోపా సెంటర్ ఓ పెద్ద షాపింగ్ సెంటర్. అదీ ఆ ప్రాంతంలోనే ఉంది. ఇరవైఒక్క అంతస్తుల పెద్ద భవనమని గొప్పగా చెప్పేవారు. పై అంతస్తుమీద ఓ చక్రం తిరుగుతూ చాలా దూరం కనిపించేది. మా పాప ఆ చక్రాన్ని చుసినప్పుడల్లా 'ఐరోపా సెంటర్' అని అప్రయత్నంగా అనేసి తన పరిజ్ఞానాన్ని ప్రదర్శించడం మాకొక తీపి జ్ఞాపకం.

జీగే జౌలే (విజయస్తూపం) నగరంలో ఎక్కణ్ణించి చూసినా కనిపించే ఓ అపురూపం. దానిమీద ప్రతిష్ఠాపితమైన 27 అడుగుల దేవతామూర్తి బెర్లిన్ నగరవాసుల్ని దీవిస్తున్నట్లు అనిపిస్తుంది. అదీ రోజూ కననడుతూనే ఉంటుంది.

''ఎంత అదృష్టవంతులం? గొప్ప యాత్రా ప్రదేశాల పక్కనున్నాం. ఇక్కడ చుట్టాలుండి ఉంటే – తిరుపతిలో ఉండే వారి ఇళ్లకంటే రద్దీగా ఉండేది మనిల్లు'' అంది శ్రీమతి.

''ఔను. ఇక్కడ మనకి చుట్టాల్లేకపోవడం అదృష్టమే'' అన్నాను.

''ప్రతి మాటకీ బొరుసును చూపించడం అలవాటైపోయింది మీకు'' అని ముచ్చటగా విసుక్కుని, ''అదృష్టముంటే సరిపోదు. అనుభవించే యోగం కూడా ఉండాలి'' అంది శ్రీమతి.

''అంటే?'' అన్నాను.

''భాగవతం పుస్తకం చాలాసార్లే చూసాను. అందులో పద్యాలు కొన్ని విన్నాను. దాంతో భాగవతం చదివినట్లేనా?'' అందామె.

ఆమె ఉద్దేశ్యం అర్థమైంది.

యాత్రాప్రదేశాల్ని దూరాన్నుంచి ఎవరింటినో చూసినట్లు చూడ్డం కాదు. దగ్గర్నుంచి వాటి ప్రాముఖ్యం అవగాహనకొచ్చేలా గమనించాలి.

ఒక ప్రముఖ స్థలాన్ని చూసినప్పుడు అక్కడో ఫొటో దిగితే సరిపోతుందనుకునే యాత్రాసంస్కృతి నాది.

దానికి, ''అది మీరక్కడికెళ్లినట్లు సాక్ష్యంగా పనికొస్తుందంతే!'' అంటుంది శ్రీమతి.

పురాణశ్రవణంలో పురాణసారంకంటే పుణ్యంమీద దృష్టి ఉన్నవాళ్లు ఎక్కువనీ, అందుకే మన దేశం ఇలాగుందనీ చాలా కథల్లో మేము వాపోయాం.

అది యాత్రలకూ వర్తిస్తుందని మెత్తగా చెప్పింది శ్రీమతి.

''సరే, మనమిప్పుడు దగ్గర్లో ఉన్న ప్రముఖ ప్రదేశాల్ని శ్రద్ధగా గమనించాలంటావ్'' అన్నాను.

''ఔను. అక్కడ చెట్లు పలకరిస్తాయి. గాలి ముద్దు పెడుతుంది. రాళ్లు కథలు వినిపిస్తాయి....''

శ్రీమతిలో పరవశం. అది చూడగానే, అర్జంటుగా మా యాత్ర ప్రారంభించాలనిపించింది.

''ఐతే ముందు మనం జూవలాజికల్ గార్డెన్‌తో మొదలెడదాం. అది మనకు దగ్గర్లో ఉంది. పిల్లలకు సరదాగా ఉంటుంది'' అన్నాను.

ఈ కథాకాలం 1975–76.

కథారచనది – తిన తిండి, కట్టుబట్ట, నిలువనీడ లేకపోయిన మనిషికి కూడా చేతిలో మొబైలుండే అవకాశమున్న 2019.

ఆ మొబైల్ అలాంటిలాంటిదా – అలనాడు యశోదకు సమస్తవిశ్వాన్నీ చూపించిన కృష్ణుడి నోరులాంటిది.

అందుకే – నగర విహారంలో మాకెదురైన అనుభవాలు, అనుభూతులు పాఠకులతో పంచుకుంటున్నామే తప్ప – బెర్లిన్లో యాత్రాస్థలాల ప్రత్యేకతకీ, వివరాలకీ ఇక్కడ ప్రాధాన్యమివ్వడం లేదు. వాటిపై ప్రత్యేకమైన ఆసక్తి ఉన్నవారు తమ అరచేతిలో కృష్ణుడి నోటిని తెరిపిస్తే సరిపోతుంది.

నగరంలో తొలుత మేము చూద్దామనుకున్నది జూవలాజికల్ గార్డెన్. ఒక్క అక్షరంలో చెప్పాలంటే – జూ.

పిల్లలతో వెడుతున్నాం కాబట్టి, బయట మన పిల్లలు ఇష్టపడి తినేవన్నీ దొరకవు కాబట్టి – పిక్నిక్కుకి వెడుతున్నట్లు తయారయ్యాం.

పులిహోర చేసి – కాళీ డిక్ మిల్క్ (పెరుగు) డబ్బాలు రెండింటిలో సద్దాం. రెండు 2–మినిట్ బియ్యం పొట్లాల్ని రెండు నిముషాలు మరుగునీళ్లలో వేసి – అన్నం పొట్లాలుగా మార్చాం. ఓ పెరుగు డబ్బా, చిన్న భరిణలో ఊరగాయ, ఇంకా బిస్కట్ల పాకెట్లు – ఇవీ మా తిండి సరంజామా. ప్లాస్టిక్ పళ్లాలు, గ్లాసులు, చెంచాలు వగైరాలెలాగూ తప్పవు.

జూలో పిల్లలు చాలా ఎంజాయ్ చేశారు. అక్కడ ఓ చిన్న బాలుడి శిల్పంలో మూత్రవిసర్జనే – జలయంత్రంగా రూపొందడం మా బాబుని బాగా ఆకర్షించింది. వాడది మాకు చూపించి తెగ సిగ్గు పడ్డాడు. ఐతే వాడికి సిగ్గుకంటే ఎక్కువగా నవ్వొస్తోందనీ, ఆ నవ్వాపుకుకోవడంలో భాగమే సిగ్గనీ కూడా మా కర్థమైంది.

జూలు మాకు మరీ కొత్తేం కాదు.

జర్మనీ రావడానికి ముందు కలకత్తాలో ఆలిపూర్ జూ చూశాం. అది చాలా పెద్దది. మొదటిసారిగా ఓ ఆడ సింహాన్ని, మగ పులితో జత కట్టించి టైగాన్ అనే సంకర జంతువుకి జన్మనిచ్చిన ఘనత ఆ జూది. మేమక్కడ టైగాన్‌ని చూసి థ్రిల్లయ్యాం.

ఇక మేముండే భువనేశ్వర్లో జగత్ప్రసిద్ధి కాంచిన నందనకానన్ జూ ఉంది. క్రూర జంతువులతో సహా అనేక పక్షులు, జంతువులు సహజవాతావరణమైన అడవితో కలిపిన బోనుల్లో దర్శనమివ్వడం – అక్కడ ప్రత్యేక ఆకర్షణ.

జూ ఎంజాయ్ చెయ్యడానికి అప్పటికంటే ఇప్పుడు పిల్లలు మరికాస్త పెద్దవాళ్లయ్యారు.

బెర్లిన్ జూలో జంతువులకు అంత చక్కటి సహజవనం లేదు కానీ – కృత్రిమ వాతారవరణంలో ఉన్నా అవి అంతవరకూ మేం చూసిన మన జూలలో వాటికంటే ఎంతో పుష్టిగానూ, ఉత్సాహంగానూ కనిపించాయి. ధనమే వాటికి వనశోభనూ ఇచ్చి ఉంటుందనుకున్నాం..

మన జూలలో అరుదైన పోలార్ బేర్‌ని అక్కడ చూశాం. రకరకాల పక్షులతో పాటు, ఆక్వారియం కూడా ఉందక్కడ. ముక్కు మరీ ఎర్రగా ఉన్న ఫ్లెమింగోలని మా పిల్లలు చాలా ఎక్కువ కాలం గుర్తుంచుకున్నారు.

మా జూ ప్రయాణం విహారంలా కాదు. ఆఫీసుకెళ్లినట్లుంది.

పెద్ద జూ. ఒక్క రోజులో చూసెయ్యాలి. అందుకని ప్రతి చోటా ఎక్కువసేపు ఆగలేం. తొమ్మిది నుంచి ఒంటిగంట దాకా తిరిగేక లంచి. మళ్లీ సాయంత్రం ఐదు దాకా తిరుగుతూ మధ్యమధ్య పిల్లలకి స్నాక్సు.

ఇంటినుంచి తిండి తెచ్చుకుని తినడానికి అభ్యంతరాలేం లేవు సరికదా, సదుపాయాలు కూడా బాగా ఉన్నాయక్కడ.

ఆ ట్రిప్పులో ఓ విషయం గమనించాం.

అన్ని జన్మలలోకీ ఉత్తమమైనది మానవజన్మ అంటారు కానీ – అది మనిషి మనిషిలా ఉన్నప్పుడేనేమో!

ఎందుకంటే – షాపుల్లో తిరిగినప్పుడు పిల్లలకి సంబంధించినంతవరకూ అక్కడుండేది మనుషులూ, బొమ్మలూ! ఓ గంట గడిచేసరికి వాళ్లలో అలసట కనబడేది. మాటలతో మరిపించి మురిపించి ఎలాగో ఇల్లు చేరేదాకా వాళ్ల ఉత్సాహం నిలబడేలా చేసేవాళ్లం.

కానీ జూలో వాళ్లు 9–5 మా ప్రమేయం లేకుండానే హుషారుగా ఉన్నారు. తిండి కూడా మేమడిగి పెట్టడమే తప్ప వాళ్లకి వాళ్లుగా అడగలేదు. మనుషులమధ్య కంటే జంతువుల మధ్యే మనిషికి ఎక్కువ రెలాక్సేషన్ ఉంటుందని – ఇంకా మానవ సహజ ప్రవృత్తికి దూరం కాని పసివాళ్లు ఋజువు చేశారా అనిపించింది.

''ఏమో అనుకున్నాను – పిల్లలతో నగరవిహారానికి ప్రతిసారీ ఇలాగే రోజుమొత్తం కేటాయించొచ్చునని మా ఫ్రెండ్సుకి చెప్పాలి'' అన్నాను.

''చటుక్కున అలా చెప్పెయ్యకండి. అందరు పిల్లలూ మనవాళ్లలా ఉండరు'' అంది శ్రీమతి.

తన పిల్లల ఘనతని ప్రకటించే అవకాశాన్ని పొరపాటున కూడా వదులుకోని మాతృమూర్తి ఆమె.

జూ కాక మేము సందర్శించిన ఇతర ప్రదేశాల్లో – చాలావరకూ మా నిత్యకృత్య విహారాల్లో భాగమే. వాటిని అలాగే చూశాం.

ప్రత్యేకంగా ప్రోగ్రాం వేసుకుని చూసినవాటిలో 'గ్రూయ్‌నే వాల్డ్' (హరిత వనం) కొంత నిరుత్సాహపర్చింది.

అది అడవే కానీ, అందులో జంతువులుండవు. చిత్రమేమిటంటే పాములు, విషపు పురుగులు వంటివి కూడా తటస్థపడవు.

ఎంతసేపైనా ఎంతదూరమైనా నడవడానికి అనువైన చక్కని కాలిబాటలున్నాయక్కడ.

అక్కడకు వచ్చే యాత్రీకుల్లో చాలామంది అక్కడ రిసార్ట్సులో ఉండి ప్రకృతిని ఆస్వాదించడానికే. పిల్లలకి ఉత్సాహం పుట్టించే విశేషాలు బొత్తిగా లేవు. అదీ మా నిరుత్సాహానికి కారణం. ఏమైతేనేం మా జాబితాలో మేము చూసిన ప్రదేశాల్లో ఓ నంబరు పెరగడానికి సహకరించింది మా హరితవనం యాత్ర.

బెర్లిన్ వాల్ విషయంలో అలా అనుకుందుకు లేదు.

బెర్లిన్ గోడ ఒక యాత్రాస్థలం. దాన్ని చూడ్డానికి ప్రపంచం నలుమూలలనుంచీ వస్తారు యాత్రీకులు.

మేము బెర్లిన్ నగరంలోనే ఉంటున్నాం కాబట్టి ఒకరోజు సకుటుంబంగా అక్కడికెళ్లాం.

అక్కడ కూడా పిల్లలు ఉత్సాహపడేందుకేం లేదు. ఐతే ఏదో యాత్రాస్థలంలా కాక, ఊరి మధ్యలోనే ఉండడంవల్ల – పిల్లలకి మామూలుగా బయటికెళ్లినట్లే ఉంది.

ఆ గోడ మామూలుదా!

ఒకే భాష మాట్లాడే పౌరుల్ని – బలవంతాన తూర్పు పశ్చిమాలుగా రెండుగా విడగొట్టింది రెండవ ప్రపంచయుద్ధం. వారి మధ్య అడ్డుగోడ కట్టింది తూర్పు విభాగం.

ఒకే భాష మాట్లాడేవారు – కులం, వర్గం, పక్షం పేరిట తమమధ్య తమకుతామే అడ్డుగోడలు కట్టుకోవడం ఘనతగా భావిస్తున్న నేటి స్వదేశ పౌరులకు – అర్థం కాకపోవచ్చు కానీ – బెర్లిన్ గోడ నిర్మాణం చరిత్రలో ఒక అత్యంత విషాదఘట్టం.

ఆ గోడ చరిత్ర ఏ వికీ నడిగినా చెబుతుంది. దాని గురించే ఇదే రచనలో హానోఫర్‌నుంచి బెర్లిన్ ప్రయాణంలో కొంత ప్రస్తావించి ఉన్నాను.

మామూలు గోడ.

నిచ్చెనేసుకుని ఎక్కి అవతలివైపుకు దూకడానికి వీలైన గోడ.

కొన్ని చోట్ల గోడకవతలి ప్రాంతం సుస్పష్టంగా కనబడే గోడ.

గోడకవతల తూర్పు జర్మనీ. ఇవతల పశ్చిమ జర్మనీ.

అటు సామ్యవాదం పేరిట నియంతృత్వం. ఇటు స్వేచ్ఛ పేరిట విశృంఖలం.

చిన్నప్పుడు నాకు – దేశాల మధ్య, రాష్ట్రాల మధ్య, జిల్లాల మధ్య సరిహద్దుల గురించి విన్నప్పుడు అవెలాగుంటాయోనని కుతుహలంగా ఉండేది.

పుట్టేక చాలాకాలం పాటు నేను తిరిగినవి మా చుట్టుపక్కలే నాలుగైదు ఊళ్లేమో, అంతే!

చిన్న చిన్న గ్రామాలమధ్య కూడా పొలిమేరలుంటాయి కానీ – నేను వాటిని సరిహద్దులుగా గుర్తించలేదు. ఒక గ్రామంనుంచి మరో గ్రామానికి కాలినడకన వెళ్లేవారికి సరిహద్దులేం తెలుస్తాయి? ఆస్తులైతే ఏమో కానీ, ఏ ఊరైనా మనూరే అనిపించడంతో స్వంతూరుకీ పొరుగూరికీ తేడా తెలిసేది కాదు.

1962లో ఎమ్మెస్సీ చదవడానికి ట్రయిన్లో మొదటిసారి విశాఖపట్నం వెళ్లినప్పుడు నేనెక్కిన పాసెంజర్ తుని పట్నం దాటుతుండగా ఓ బ్రిడ్డి వచ్చింది. మేము తాండవ నదిమీంచి వెడుతున్నామనీ, నదికివతల తూర్పు గోదావరి జిల్లా అనీ, అవతల విశాఖపట్నం జిల్లా అనీ మా నాన్నగారు నాతో చెప్పినప్పుడు ఒకరకమైన థ్రిల్ కలిగింది. బ్రిడ్జి దాటగానే పాయకరావు పేట వస్తే – ఓహో, ఇది విశాఖపట్నం జిల్లా కాబోలు అని కొంచెం కొత్తగా ఫీలయ్యాను.

విశాఖపట్నం చేరుకున్నాక కొన్నాళ్లు ఏదో కొత్త ప్రాంతానికి వచ్చిన అనుభూతి. కానీ కొన్నాళ్లే!

అప్పట్లో తెలుగునాట ఉన్నవి మూడంటే మూడే విశ్వవిద్యాలయాలు. అందువల్ల ఆంధ్రా యూనివర్సిటీకి రాష్ట్రవాసులే కాదు, దేశవాసులు కూడా నలుమూలలనించీ వచ్చేవారు. అక్కడ చదివేవారిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు.

క్రమంగా నాకు అర్థమైంది – స్థానికుల యాసలో కొంచెం తేడా ఉన్నప్పటికీ విశాఖపట్నం కూడా అసలు సిసలు తెలుగు ప్రాంతమే అని. జిల్లాలంటే కేవలం పరిపాలనాసౌలభ్యానికే తప్ప తెలుగువారంతా ఒక్కటేనని గ్రహించాను.

ఆతర్వాత గోదావరి, కృష్ణా, నెల్లూరు, వరంగల్, హైదరాబాదు వగైరా జిల్లాల ద్వారా పయనిస్తున్నప్పుడు అవి నేను పుట్టిపెరిగిన ప్రాంతంనుంచి భిన్నమన్న భావం కలుగలేదు. దాంతో మునుపటి థ్రిల్ కలగలేదు.

ఒరిస్సాలో ఉద్యోగమొచ్చేక – భాషతో నిమిత్తం లేకుండా భారతీయులంతా ఒక్కటేననీ, రాష్ట్రాల విభజన కూడా పరిపాలనా సౌలభ్యానికేననీ అనిపించింది.

జర్మనీకి వచ్చినప్పుడు మాత్రం వేరే దేశానికి వచ్చిన భావన కలిగిందంటే – అందుకు కారణం సంప్రదాయంలో సంస్కృతిలో రెండు దేశాలూ విభిన్నమవడం కావచ్చు. ఇప్పటి ఎక్స్‌పోజర్ నాకప్పుడు లేకపోవడమూ కావచ్చు.

కానీ బెర్లిన్లు రెండూ ఒకటేననీ, వాటిని బలవంతాన విడగొట్టారనీ – మనిషి కట్టిన ఈ గోడ చెబుతోంది.

గోడకివతలా, అవతలా ఉండే మనుషుల భావోద్వేగాలతో కరడు కట్టినట్లున్న ఆ గోడని చూసి కాసేపు అప్రతిభుణ్ణయ్యాను.

కేవలం భౌగోళికప్రమాణాలతో విడిపోవాల్సి వచ్చిన అన్నదమ్ములు, తల్లీ బిడ్డలు వగైరాల గురించి చరిత్రలో చదివినదంతా స్ఫురించి ఆ దృశ్యాలన్నీ ఒక్కసారి కళ్లకు కట్టాయి.

నా దగ్గర బంధువులంతా అట్నించి అసహాయంగా జాలిచూపులు చూస్తూ – 'ఈ జన్మకి మనం కలుసుకోగలమా?' అని వాపోతున్నట్లు అనిపించి కళ్లలో నీళ్లు తిరిగాయి.

పిల్లలకివేం తెలియవు. వాళ్లు వాళ్ల ధోరణిలో మామూలుగా ఉన్నారు.

శ్రీమతి నన్నెప్పుడూ ఓ కంట కనిపెడుతూనే ఉంటుంది. నా మూడ్ తెలిసిందేమో, ''గోడ దాకా వచ్చాం. వచ్చినట్లు సాక్ష్యం లేదు. ఫొటోలు తియ్యండి'' అంది నా ఆలోచనల దారి మళ్లడానికి.

కోనికా చిన్న కెమేరా. అది నా ఓవర్‌కోట్ జేబులో ఉంటుంది. చటుక్కున బయటకు తీసి, తననీ పిల్లల్నీ గోడకు కాస్త దగ్గరగా వెళ్లి నుంచోమన్నాను.

వాళ్లు అలా వెళ్లి నిలబడ్డారో లేదో – కాస్త దూరంలో నాకో పోలీసు కనిపించాడు.

అతణ్ణి చూడగానే కొంత భయం, కొంత అనుమానం!

ఫొటోలు తియ్య కూడదని అక్కడ బోర్డేం పెట్టలేదు కానీ – రెండు దేశాల సరిహద్దు ప్రాంతమది మరి!

మనది కాని దేశం. ఇలంటిచోట తప్పు చేస్తే సంజాయిషీ ఇచ్చుకునే అవకాశం కూడా ఇస్తారో ఇవ్వరో తెలియదు. ముందు అరెస్టు చేసి తీసుకుపోతారేమో!

''అక్కడ పోలీసున్నాడు. ఇందాకా లేడు. ఇప్పుడే వచ్చాడు. కాసేపట్లో వెళ్లిపోతాడనిపిస్తోంది. కొంచెం ఆగుదామా'' అన్నాను.

శ్రీమతికి అలాంటి భయాలేమున్నట్లు లేదు. ''మనని చూసాడు. ఫొటో తీసుకుంటామని గ్రహించే ఉంటాడు. ఇక్కడ ఫొటోలు తియ్యకూడదని రూలుంటే, దగ్గర్లో బోర్డు పెట్టాలి. బోర్డు లేకున్నా తనే వచ్చి ఓసారి హెచ్చరించాలి. అలాంటిదేం జరుగలేదుగా! ఏం ఫర్వాలేదు, తియ్యండి'' అంది.

ఆమె ధైర్యానికి ఆశ్చర్యపడ్డాను. కానీ నాకింకా భయం పోలేదు. తనముందు చిన్నబోకూడదని, ''నాకైతే ధైర్యం లేదు. నీకు ధైర్యముంది కాబట్టి, నేనక్కడ నించుంటాను. నువ్విలాగొచ్చి ఫొటో తియ్యి'' అన్నాను.

''అంటే, పోలీసొచ్చి ఏదో చేస్తాడనా మీ భయం?'' అంది శ్రీమతి.

''ఏదో చేస్తాడని కాదు, ఆ చేసేది అరెస్టు కావొచ్చని భయం'' అన్నాను.

శ్రీమతి ఉలిక్కిపడింది. అంతలోనే దెబ్బ తిన్నట్లు, ''అంత భయంగా ఉన్నప్పుడు మరి నన్నెందుకు ఫొటో తియ్యమన్నారు? పోలీసొచ్చి నన్నరెస్టు చేస్తే మీకేం ఫర్వాలేదా?'' అంది.

''ఫర్వా ఉందో లేదో నీకు తెలుసు. కానీ ఫొటో తియ్యాలని సరదా పడుతున్నావు కదా అని సరేనన్నాను''

''తెలియక సరదా పడినందుకు అరెస్టయినా ఫర్వాలేదనుకున్నారా?'' శ్రీమతి గొంతులో నిష్ఠూరం.

''మరి నీ సరదా తీరడం నాకు చాలా ముఖ్యం''

''అలాంటప్పుడు ఫొటో మీరు తియ్యొచ్చుగా'' ఉక్రోషంగా అంది శ్రీమతి.

''తీసేవాణ్ణే కానీ – ఫొటో తీసినందుకు పోలీసొచ్చి నన్నరెస్టు చేస్తే – ఈ పరాయి దేశంలో నువ్వూ పిల్లలూ ఏమైపోతారు? అదే నిన్నరెస్టు చేస్తే – నీకు నేనున్నాను. నా ప్రయత్నాలు చేసి నిన్ను విడిపించుకోగలను. అర్థమయిందా?'' అన్నాను.

''అబ్బా, ఎంత దూరం వెళ్లారండి!'' అని చటుక్కున నవ్వేసింది శ్రీమతి.

''ముందుచూపు – ఇలాంటిచోట్ల అదుండాలి!'' అన్నాను గొప్పగా.

''సరే, మీమీదా, మీ ముందుచూపుమీదా నాకు నమ్మకముంది. పిల్లలూ, మీరూ అటెళ్లి నించోండి. ఫొటో తీసి అరెస్టయిపోవడానికి నేను రెడీ'' అంది. ఆ గొంతులో ఎక్కడా భయం లేదు.

నేను, పిల్లలు గోడకు దగ్గరగా నించున్నాం.

శ్రీమతి కెమేరాలోంచీ మమ్మల్ని చూస్తూ, ''ఏమండీ, పిల్లలు జాగ్రత్త! బాబు నన్నొదిలి ఎక్కువ సేపుండలేడు. మీరు నన్ను విడిపించేసరికి ఎంత కాలం పడుతుందో ఏమో! వాడు నాకోసం బెంగెట్టుకోకుండా చూసుకునే బాధ్యత మీది!'' అని అప్పగింతల మాటలు చెప్పింది.

దుష్యంతుడి వద్దకు వెడుతున్న శకుంతల అడవిలో మొక్కల్నీ, పెంపుడు జంతువుల్నీ చెలికత్తెలకు అప్పగించే దృశ్యం స్ఫురించింది నాకు.

ఐతే శ్రీమతి గొంతులో కొంటెతనమే తప్ప ఆవేదన లేదు.

కొన్ని విషయాల్లో ఆడవాళ్లకు సిక్స్‌త్ సెన్స్ ఉంటుందంటారు. ఆదే ఆమెకు ధైర్యాన్నిచ్చిందేమో!

ఆ పోలీసు అక్కడే ఉన్నాడు. శ్రీమతి ఫొటో తీసినా తను మా జోలికి రాలేదు.

అలాగే జరుగుతుందనుకున్నాను. కానీ నమ్మకానికి ముందుగా తనని ప్రయోగించాను.

తర్వాత నేను ఇటొచ్చి శ్రీమతిని అటెళ్లమన్నాను.

కెమేరాలో వాళ్లని చూస్తుంటే పిల్లలు మామూలుగానే ఉన్నారు కానీ, శ్రీమతికి మాత్రం నవ్వాగడం లేదు. చటుక్కున క్లిక్ మనిపించాను.

''అయ్యో! రెడీ చెప్పలేదు'' అంది శ్రీమతి.

''రెడీ చెబితే మళ్లీ ఆ నవ్వెక్కడ దొరుకుతుంది? ఫొటో వచ్చేక – భలే తీశారండీ అని నువ్వు తెగ మెచ్చుకోకపోతే చూడు'' అని, ''ఇలా రోజుకొక్కసారైనా నవ్వుతూండొచ్చుగా, ఎంత బాగున్నావో'' అన్నాను.

మామూలుగా ఇలాంటి మెప్పుకి కొంచెం సిగ్గు పడుతుందామె. కానీ అప్పుడు, ''పోలీసుని చూసి భయపడిపోయిన మీ ముఖంలోకి – నేను ఫొటో తీసేక ఎంత ధైర్యమొచ్చిందో! ఫొటో తీస్తున్నప్పుడు మీ మొహంలో ధైర్యం చూస్తుంటే నవ్వాగలేదు మరి!'' అని మళ్లీ నవ్వింది.

నా పిరికితనాన్ని గేలి చెసిందని తెలుస్తోంది.

కానీ ఆ నవ్వు!

పారిజాతాపహరణ కావ్యంలో సత్యభామ తన్నినప్పుడు 'అది నాకు మన్ననయ' అని శ్రీకృష్ణుడెందుకన్నాడో అర్థమయింది.

అప్పట్నించి ఇప్పటిదాకా శ్రీమతి ఆ ఫొటో సంఘటన విషయమై ఏదో సందర్భంలో నన్ను దెప్పుతూనే ఉంటుంది.

బెర్లిన్ గోడని సందర్శించేక ఓసారి గోడకి అటు వైపు వెళ్లి తూర్పు బెర్లిన్ చూడాలని శ్రీమతికి అనిపించింది.

ఈ యాత్రకి అనుకోకుండా మాకు ప్రసాద్ దంపతుల తోడు దొరికింది.

ప్రసాద్ దంపతుల పరిచయం విచిత్రంగా జరిగింది మాకు.

ఒకసారి విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసేలో మేము, పిల్లలు విండో షాపింగు చేస్తుంటే – మాముందు వెడుతున్నారు ప్రసాద్ దంపతులు.

మామూలు మధ్యతరగతి జంటలా ఉన్నారు. చలి ఎక్కువగా ఉండడంవల్ల చెవులు మూసుకుందుకు కాబోలు, ఓవర్‌కోట్ పైన టోపీ కూడా పెట్టుకున్నారు. ఇద్దరూ ఇంచుమించు ఒకే పొడుగు కావడంవల్ల ఆమె అతడికంటే పొడుగ్గా అనిపించింది.

మన జంటలు బయట నడిచేటప్పుడు – మధ్య రవంత దూరముంచి స్నేహితుల్లా మసలడం కద్దు. వీళ్లు మాత్రం ఇక్కడి జంటల్లా ఒకరినొకరు రాసుకుంటూ ఒకరిమీద ఒకరు పడిపోతూ ముందుకెడుతున్నారు.

అందువల్ల వాళ్లు మమ్మల్ని ఆకర్షించారు.

''ఎంత జర్మనీలో ఉంటే మాత్రం – మన పద్ధతిలో మనముండాలి కానీ, వాళ్లు చూడు, ఒకరిమీద ఒకరు ఎలా పడిపోతున్నారో'' అంటూ శ్రీమతికి చెప్పాను.

''నేనూ గమనించాను కానీ, స్వరం కాస్త తగ్గించండి. వాళ్లు తెలుగువాళ్లయినా కావచ్చు'' మందలించింది శ్రీమతి.

అంతలో ముందుకు దూసుకుపోతున్న వాళ్లు ఆగారు. ఎందుకో అనుకున్నాం కానీ వాళ్లు మాకోసమే ఆగారు.

''మీరు తెలుగువాళ్లా?'' అడిగాడతడు నన్ను పలకరిస్తూ.

శ్రీమతి అనుమానం నిజమే ఐనందుకు బిక్కచచ్చిపోయాను. ఎందుకంటే – తెలుగువాళ్లా అనడిగాడు కానీ కాదని అనుమానమున్నట్లు లేదు. ఉంటే జర్మన్లో అడక్కుండా నేరుగా తెలుగులో ఎందుకడుగుతాడు?

''ఎలా తెలిసింది? మా మాటలు విన్నాడా?'' అని ఆలోచిస్తూ ఎలాగో తమాయించుకుని అతడిని చూస్తే – ఆ కళ్లు నేను ఔననాలని ఆశగా చూస్తున్నాయి.

''అంటే – అతడిలో ఏమూలో అనుమానముంది. బహుశా ఇందాకటి మా మాటలు వినుండడు'' అనుకున్నాను.

''ఉంటున్నది బెర్లిన్లో కదా అని, ఎక్కడపడితే అక్కడ నోటికొచ్చినట్లు తెలుగులో కామెంట్సు పాస్ చేయకూడదు'' అని కూడా అనుకున్నాను.

''మేము తెలుగువాళ్లమే'' అని మావాళ్లని పరిచయం చేశాను.

పరస్పరం నమస్కారాలయ్యేక ప్రసాద్ అన్నాడు, ''మీరు విండో షాపింగ్ చేస్తున్నారు. మిమ్మల్ని దాటుకుంటూ వెళ్లాం. నా భార్య మీ పిల్లల్ని చూసి – ఎంతో ముచ్చటపడి – మీరు తెలుగువాళ్లయితే బాగుణ్ణనుకుంది. అడిగేస్తే సరిపోతుందిగా అని ఆగాం''.

వాళ్లు మేము పిల్లలతో తెలుగులో మాట్లాడ్డం వినుంటారు.

మమ్మల్ని దాటేక బహుశా తమలో తాము మా గురించి మాట్లాడుకుంటూండి ఉంటారు.

చలికి చెవులు కప్పుకుని ఉన్నారుగా, మాటలు వినిపించడానికి క్లోజుగా మూవ్ ఔతున్నారన్నమాట!

''దేశం కాని దేశంలో మన మాట వినబడితే ప్రాణం లేచొచ్చినట్లుంటుంది. పలకరించి మరీ పరిచయం చేసుకున్నందుకు ధన్యవాదాలు'' అన్నాను.

''మీరు చక్కగా పిల్లలతో వచ్చారు. మా బాబుకిప్పుడే ఏడాది నిండింది. వాణ్ణి ఇండియాలో మా అమ్మానాన్నల దగ్గర వదిలేసొచ్చాం. ఇక్కడికొచ్చేక మనసంతా వాడి మీదే! చాలా తప్పు చేశామనిపించింది'' అంది ప్రసాద్ భార్య.

కన్నబిడ్డల్ని వదిలుండడం ఎంత కష్టమో, తండ్రిగా నేననుభవించాను. ఇక తల్లి సంగతి చెప్పాలా?

''తను బాబుకోసం బెంగెట్టుకుంది. ఎక్కడ పిల్లలు కనిపించినా కళ్లనీళ్లెట్టుకుంటుంది'' అన్నాడు ప్రసాద్.

ఈలోగా ఆమె, ''ఒక్కసారి మీ బాబు నెత్తుకోవచ్చా?'' అనడిగి అనుమతించేలోగానే వాణ్ణొసారి ఎత్తుకుని గట్టిగా హత్తుకుని కిందకి దింపేసింది.

బాబు క్షణం పాటు ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఆశ్చర్యంగా ఆమెని చూసి చటుక్కున శ్రీమతి వెనక్కి వెళ్లి తన కాళ్లు పట్టుకుని ఆమెనే తొంగి తొంగి చూస్తున్నాడు.

నెక్స్ట్ తనేనని అనుమానమొచ్చిందో ఏమో పాప కూడా చటుక్కున వెనకడుగు వేసి నేల చూపులు చూస్తోంది.

ప్రసాద్ భార్యను చూస్తే – సృష్టికే అద్భుతమనిపించే తల్లి రూపం కనిపించింది.

''మనం తరచు కలుసుకుందాం'' అన్నాడతడు.

మాకోసం కాదు, మా పిల్లలకోసమని గ్రహించాను.

ఆ తర్వాత మేము ఆడపా తడపా కలుసుకున్నాం. వాళ్లు చాలా స్నేహపాత్రులు.

వాళ్లకి తూర్పు బెర్లిన్ చూడాలనుంది. పిల్లలతో కలిసి చూస్తే ఆ మజాయే వేరని కలిసి వెడదామన్నారు.

24 గంటలపాటు తూర్పు బెర్లిన్లో గడపడానికి ప్రత్యేక అనుమతి అక్కర్లేదు.

ఒకరోజు ఉదయం ఎవరింట్లో వాళ్లు భోజనాలు చేసి, ఎవరికి అనువైన ఫలహారాలు వాళ్లు తయారు చేసి – పిక్నిక్ సరంజామాతో మేమూ, ప్రసాద్ దంపతులూ తూర్పు బెర్లిన్ యాత్రకి బయల్దేరాం.

అక్కడికి చేరుకుందుకు ఊబాన్లు (అండర్‌గ్రౌండ్ మెట్రోలు) ఉన్నాయి.

మేము దిగాల్సిన స్టేషన్ ఫ్రీడ్రిచ్ స్ట్రాసే. ఊబాన్లో వెడుతూ చాలా సార్లు ఆ స్టేషన్ క్రాస్ చేశాం. ఈసారి అక్కడ దిగాం.

తూర్పు బెర్లిన్‌కి వీసా అక్కర్లేకపోయినా, అది వేరే దేశంలో ఉంది కాబట్టి, ప్లాట్‌ఫాం దాటి బయటకు వెళ్లాలంటే పాస్‌పోర్టులు చూపాల్సి ఉంది.

అక్కడో చిక్కొచ్చింది.

మమ్మల్నీ, ప్రసాద్ భార్యనీ వెళ్లొచ్చన్నారు కానీ – ప్రసాద్‌ని అనుమతించలేదు. ఎందుకంటే ఫొటోలో అతడికి చక్కటి క్రాపుంది. ప్రస్తుతం అతడికి నున్నటి గుండుమీద సన్నగా మొలలు వస్తున్నాయి.

పాస్‌పోర్టులో ఫొటో అతడిది కాదని వాళ్లంటారు.

జరిగిందేమిటంటే – పాస్‌పోర్టు తీసుకున్నాక, జర్మనీ వచ్చేముందు ప్రసాద్ తిరుపతి వెళ్లి గుండు చేయించుకున్నాడు. జుట్టింకా పూర్తిగా రాలేదు.

ఆ విషయం చెబితే, ''క్రాపు చేయించుకుంటే ఓకే. కానీ గుండెందుకు చేయించుకున్నావ్?'' అన్నాడు అక్కడి అధికారి అనుమానంగా.

అప్పుడు నేను కలగజేసుకుని. ''అదొక ఇండియన్ కస్టమ్!'' అన్నాను.

ఇండియన్సు అన్న పేరు వింటూనే, ఆ అధికారి ఉలిక్కిపడి, ''ఔనూ, మీరు ఇండియన్సు కదూ! ఇండియన్స్ కెన్ బి ట్రస్టెడ్!'' అని అతణ్ణి కూడా వదిలేశాడు.

స్వదేశంలోనే మన పౌరులకింత గౌరవం లేదు. మన నియమాలన్నీ పౌరులమీద అనుమానంతో పుట్టి, అడుగడుగునా సామాన్యుణ్ణి వేధించేవే!

ఆ అధికారి మాటలతో నాకు ఉన్నట్లుండి తూర్పు జర్మనీపై ప్రేమ పుట్టుకొచ్చింది.

''ఇలాగని తెలిస్తే, మనం ఇండియన్సుమని ముందే చెప్పేవాళ్లం. అప్పుడు పాస్‌పోర్టు కూడా చెక్ చేసేవారు కాదేమో!'' అన్నాడు ప్రసాద్.

''ఆఁ, అప్పుడు మనం నిజంగా ఇండియన్సుమో కాదో తెలుసుకుందుకు పాస్‌పోర్టు ఎలాగూ చెక్ చేసేవారు'' అంది ప్రసాద్‌భార్య.

గుండు కారణంగా తనని అనుమానించడం కొంచెం అవమానంగా భావించాడతడు.

ఇలాంటి ఊహించని సమస్యలు కొన్నుంటాయి. వాటిని పదిమందితో పంచుకోవడం అవసరం.

మా ప్రసాద్ గురించి ఈ కథ తెలిసుంటే, ఆ తర్వాత నాలుగేళ్లకి మన తెలుగు క్రికెటర్ ఎంవీ నరసింహారావు ఇలాంటి సమస్య ఎదురవకుండా జాగ్రత్త పడి ఉండేవాడేమో!

అప్పట్లో నరసింహారావు ఫస్టు క్లాసు మ్యాచిల్లో ఓ వెలుగు వెలుగుతూ, బోలింగులో చంద్రశేఖర్ని మించిపోతాడా అనిపించుకున్నాడు. తెలుగు ప్రాంతం వారికి, ముఖ్యంగా పేరులో పూర్తి తెలుగుతనమున్నవారికి టెస్టు మ్యాచిల్లో అవకాశాలు అరుదు అనుకునే ఆ రోజుల్లో అతగాడు గవాస్కర్ కెప్టెన్సీలో దిగ్గజంలాంటి వెస్టిండీస్ టీం మీద ఆడే టీములోకి ఎంపికయ్యాడు.

తనకలాంటి అవకాశం కేవలం ప్రతిభ కారణంగా వచ్చిందని నరసింహారావుకే అనిపించనట్లుంది. ఆ అవకాశం శ్రీనివాసుడి కటాక్షమేనని నమ్మి వెంటనే తిరుపతి వెళ్లి గుండు చేయించుకుని వచ్చాడు.

గుండు రూపాన్ని పూర్తిగా మార్చేస్తుంది కదా!

అప్పటికే నరసింహారావుతో వ్యక్తిగతంగా కొంత పరిచయమున్న వెస్టిండీస్ టీం వాళ్లు – గుండుతో ఉన్న ఈ నరసింహారావు ఆ నరసింహారావేనని ఓపట్టాన ఒప్పుకోలేదని కొందరు క్రికెట్ వ్యాఖ్యాతలు అన్నారు.

ఆ తర్వాత అతణ్ణి బోలర్‌గా అతి తక్కువగానూ, బ్యాట్స్‌మన్‌గా ఎక్కువగానూ ఉపయోగించుకునే ప్రయత్నం చేసి, బ్యాట్స్‌మన్‌గా ఫెయిలయ్యాడని నిర్ధారించి, నాలుగే నాలుగు టెస్టు మ్యాచిలతో ఉద్వాసన చెప్పడం జరిగింది. చివరి టెస్టులో ఐతే, ఓటమి తప్పదనుకున్న

పరిస్థితుల్లో – గవాస్కర్, విశ్వనాథ్, వెంగసర్కార్ వంటి ఉద్దండులు ఔటైపోయిన సందర్భంలో – ఆట చివరి బంతిదాకా ఓ పక్కనుండి మ్యాచిని డ్రాగా ముగించడానికి సహకరించాడు నరసింహారావు. ఐనా అతడికి ఉద్వాసన చెప్పడంలో రాజకీయముందని కొందరు కొన్నాళ్లు చెవులు కొరుక్కున్నారు. నరసింహారావు ఇప్పుడెందరికి గుర్తున్నాడో తెలియదు కానీ, అతడి తిరుపతి మొక్కు సంగతి మాత్రం నేను ఎప్పటికీ మరువలేను.

అదలాగుంచి మళ్లీ నాలుగేళ్లు వెనక్కొస్తే – ఊబాన్ స్టేషన్లోంచి అంతా బయటపడ్డాం.

దగ్గర్లోనే నడక దూరంలో అలెగ్జాండర్ ప్లాట్జ్ ఏరియా ఉంది.

ఆ ప్రాంతం వైభవంలో కళ్లు చెదిరేలా, పశ్చిమజర్మనీని తలదన్నేలా ఉంది.

ఎత్తైన భవంతులు, ఖరీదైన అలంకరణ.

అక్కడే సుమారు 370 మీటర్ల ఎత్తున్న ఫెర్న్‌జేహె తుర్మ్ (టివి టవర్) ఉంది. అది మాకు పశ్చిమబెర్లిన్లో మేముండే చోటుకి కూడా చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

పైన సన్నగా పొడుగ్గా ఉండే యాంటెన్నా, మధ్యలో భూమికి సుమారు 200మీటర్ల ఎత్తులో రివాల్వింగ్ రెస్టారెంటు కూడా మేము రోజూ చుస్తూనే ఉంటాం.

ఆ రోజు ఆ టవర్‌ని దగ్గర్నుంచి చూడ్డం థ్రిల్లింగుగా అనిపించింది. ఫొటోలు తీసుకన్నాం.

అందులోని రివాల్వింగ్ రెస్టారెంటులాంటిది ప్రపంచంలో మరెక్కడా లేదని విన్నాం. వెళ్లి చూద్దామా అనిపించింది కానీ, పిల్లలతో కలిసి అంతెత్తు వెళ్లడానికి జంకు కలిగింది.

ప్రసాద్ కూడా, ''టవర్ని చూశాం. అది చాలు'' అన్నాడు.

కాసేపు ఆ చుట్టుపక్కల వైభవాన్ని చూసేక, ఓ పెద్ద భవంతి పక్కన చిన్న సందులోకి వెళ్లాం.

ఆ సందులో షాపులు, అంతవరకూ మేము చూసినవాటికి భిన్నంగా చిన్నగా ఉన్నాయి. బయట్నించి చూస్తే లోపలి వస్తువులు అనాకర్షణీయంగా పేదగా అనిపించాయి.

కుతూహలం కొద్దీ ఓ షాపులోకి వెడితే అక్కడి బొమ్మలు పూర్వం తిరునాళ్లలో అమ్మే చౌకరకం బొమ్మల్లా ఉన్నాయి. పిల్లలు కాసేపంటే కాసేపే ఆడుకుని పారేస్తారనిపించింది. పశ్చిమంలో అలాంటివి ఉంటే ఒక మార్కుకి రెండైనా ఇస్తారనిపించింది.

కేవలం గుర్తుగా ఉంటుందని ఓ బొమ్మ కొనాలనుకుని ధర అడిగాను.

సేల్సుగర్ల్ ముఖంలో ఉత్సాహం లేదు, కళ లేదు. ఏదో తప్పదన్నట్లు అనాసక్తంగా ధర చెప్పింది.

విని షాక్ తిన్నాను. అక్కడున్న ఏ బొమ్మా ఐదు మార్కులకి తక్కువ కాదు.

బహుశా ఆ ధర ఈస్ట్ జర్మన్ మార్కుల్లో అయుంటుందనుకుని, ''వెస్ట్ జర్మన్ మార్కుల్లో ఐతే ఎంత?'' అనడిగాను.

తక్కున బదులిచ్చిందా అమ్మాయి, ''మార్కంటే మార్కే. ఈస్టూ వెస్టని లేదు మాకు. ఎటొచ్చీ వెస్టైనా తీసుకుంటాం'' అంది అదేదో ఫేవర్ అన్నట్లు.

నాకు తెలుసు – వీళ్ల మార్కు కంటే నా మార్కుకి విలువెక్కువని. కానీ ఆ మాటనలేను కదా!

అక్కడికొచ్చినందుకు ధర గురించి పట్టించుకోకుండా ఇలాంటిదొకటి కొనాలని, చాయిస్ పిల్లలకిచ్చాం.

భువనేశ్వర్లో ఉన్నప్పుడు బయటికెప్పుడెళ్లినా పిల్లలకోసం ఏదో ఓ కొత్త బొమ్మో, ఆటవస్తువో కొనేవాళ్లం. అదెంత చవకదైనా సరే, పిల్లలు ఉత్సాహంగా తీసుకుని కాసేపు ఆడుకునేవారు.

ఇక్కడ మాత్రం ఏ బొమ్మా వాళ్లకి నచ్చలేదు.

''వాళ్లకిష్టం లేనప్పుడు – అంత ధర పెట్టి బొమ్మ కొనడమెందుకూ! టెంపరేచర్ ఇండికేటర్ కొనండి. ఉపయోగపడుతుంది, సోవనీరుగానూ ఉంటుంది'' అన్నాడు ప్రసాద్.

అలాగని అక్కడ కొనడానికి అంతకంటే మంచి వస్తువులు లేవని కాదు. బెర్లిన్లో అంతవరకూ మాకెదురైన అనుభవాలకి భిన్నంగా ఉన్న ఈ అనుభవానికి అదే సరైన గుర్తు అనిపించింది.

అలెగ్జాండర్‌ప్లాట్జ్‌లో దొరికేవన్నీ మాకు వెస్ట్ బెర్లిన్లోనూ దొరుకుతాయి మరి.

అప్పుడు శ్రీమతి, ''చిన్న సందులోకెడితేనే ఇంత తేడా ఉంది. కొంచెం ముందుకెళ్లి చూద్దామా?'' అంది.

నలుగురు పెద్దలు, ఇద్దరు పిల్లలు – అక్కణ్ణించి కాస్త బయటికెళ్లి చూస్తే –

ఒక్కసారి – జర్మనీనుంచి కుగ్రామానికి వచ్చినట్లుంది.

పాడుపడ్డట్లున్న రోడ్డు.

రోడ్డుపక్కన మొలిచిన పచ్చగడ్డి, పిచ్చిమొక్కలు. అక్కడక్కడ చెత్త కాగితాలు, గుడ్డపేలికలు....

దూరంగా భవనాలు కనిపిస్తున్నాయి. వాటిని చూస్తుంటే ఇండియాలో ట్రయిన్లో వెడుతున్నప్పుడు కనిపించే బొంబాయి నగర శివార్లలా అనిపించింది.

''పూర్వం పేద పంతుళ్లు – చిరుగుల చొక్కాని దాచుకుందుకు, పైన కోటు వేసుకుని బడికి వెళ్లేవారుట. అలెగ్జాండర్ ప్లాట్జ్ ఆ కోటులా ఉంది'' అన్నాను అప్రయత్నంగా.

''తూర్పు జర్మనీ పేద దేశమేం కాదు. స్వయంకృషిలో, ప్రతిభలో ఇక్కడి పౌరులు పశ్చిమంవారికేం తీసిపోరు. ఐతే వైభవ ప్రదర్శన నచ్చని వ్యవస్థలో భాగమవడం వల్ల ఇలా ఉన్నారనుకుంటాను'' అన్నాడు ప్రసాద్ సాలోచనగా.

''అది నిజమే కానీ నాకో విషయం అర్థం కావడం లేదు. వైభవ ప్రదర్శన నచ్చనప్పుడు అలెగ్జాండర్‌ప్లాట్జ్‌ని అలా కళ్లు చెదిరిపోయేలా ఎందుకు రూపొందించినట్లు?'' అన్నాను.

''అది యాత్రీకులు వచ్చి చూసిపోయే ప్రదేశం'' అన్నాడు ప్రసాద్ చటుక్కున.

అతడి సమాధానం చాలా లోతైనదనిపించింది.

తూర్పు జర్మనీ ఒక వ్యవస్థని అనుసరిస్తూ, తన పౌరులమీద ఆ వ్యవస్థను రుద్దింది. ఆ వ్యవస్థని యాత్రీకుల ముందు గర్వంగా ప్రదర్శించాలని అనుకోలేదు.

ఇతరులముందు గొప్పగా చెప్పుకోలేని వ్యవస్థని తన పౌరులపై రుద్దడమెందుకు?

''ఒక్కమాటలో చాలా గొప్పగా చెప్పారు'' అన్నాను ప్రసాద్‌ని మెచ్చుకుంటూ.

అతడు నవ్వి, ''ఇందాకా మీరు అలెగ్జాండర్‌ప్లాట్జ్‌ని – చిరుగుల చొక్కాని దాచుకుందుకు పేదవాడు వేసుకున్న కోటుతో పోల్చారే, అదే నేను ఇంకోలా చెప్పాను'' అన్నాడు.

ఐతే – ఏ దృశ్యాన్నయినా కళ్లొకలా చూస్తే మెదడు మరొకలా చూస్తుందని – ఆ తర్వాత భువనేశ్వర్ కోలీగ్ భూషణ్ మా ఇంటికొచ్చినప్పుడు గ్రహించాను.

స్నేహానంద లహరి

జర్మనీ రెండు భాగాలై రెండు వేర్వేరు దేశాలుగా ఉంటున్న రోజులవి.

జర్మన్లకి బెర్లిన్ ప్రతిష్ఠాత్మక నగరం. దేశం విడిపోక తప్పని పరిస్థితుల్లో కూడా, ఇరు దేశాలూ ఆ నగరాన్ని వదులుకుందుకు సిద్ధంగా లేవు. అందుకే దేశంతో పాటు ఆ నగరమూ రెండు ముక్కలైంది.

జర్మనీకి సంబంధించి ఆ నగరానికి ఇంత ప్రాముఖ్యమున్నదని నాకు తెలియదు. రీసెర్చిలో నేనెంచుకున్న అంశాన్ని ఆమోదించిన ప్రొఫెసరు పనిచేసే సంస్థ వెస్ట్‌బెర్లిన్లో ఉన్నది కాబట్టి నేనక్కడికి వచ్చాను.

జర్మన్ భాష నేర్చుకుందుకు ల్యూనబర్గు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో ఉండగా మమ్మల్ని అక్కడకు ఆహ్వానించిన డాడ్ సంస్థ బెర్లిన్ ప్రాముఖ్యం గురించి తెలియబరుస్తూ ఓ ఉత్తరం వ్రాసింది.

అప్పుడక్కడ ఉన్న భారతీయుల్లో బెర్లిన్ వెడుతున్నది నేనొక్కణ్ణే కావడంతో – మిగతావాళ్లు నా అదృష్టాన్ని అభినందించారు.

ఐతే ఆ ఉత్తరంలోనే మరో విషయముంది.

బెర్లిన్లో కాకుండా, జర్మనీలో ఇతర నగరాల్లో రీసెర్చి కొనసాగించే వారందరికీ స్వదేశానికి తిరిగి వెళ్లేలోగా, డాడ్ సంస్థ స్వంత ఖర్చులమీద బెర్లిన్ నగరవిహార భాగ్యం కల్పిస్తుంది.

ఆమేరకు మిగతావాళ్లకి అదనపు సౌకర్యం కలిగినట్లే కదా!

బెర్లిన్లోనే ఉన్నవాళ్లకి మిగతా దేశమంతా చూపించే కార్యక్రమం కూడా ఉంటే బాగుండేదనిపించింది.

అక్కడి ఇండియన్ మిత్రులు మాత్రం, ''మాకు సంబంధించి, బెర్లిన్ నగర విహారంలో అన్నింటినీ మించి నిన్ను చూడ్డమే ముఖ్యం. మేమంతా నిన్నక్కడ కలుసుకుంటాం'' అన్నారు అభిమానంగా.

నేనేదో అనేలోగా, ''ఆతిథ్యం గురించి బెంగెట్టుకోకు. జస్ట్ చూడ్డమే ముఖ్యం'' అని హామీ ఇచ్చాడు నా మిత్రుల్లో ముఖ్యుడు నటరాజన్.

''ఇక్కడి మిత్రులందరికీ ఆతిథ్యమివ్వగల అదృష్టం నాకు మాత్రమే కలుగుతుంటే, బెంగెందుకు? మీకోసం నా ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి'' అన్నాను.

''అది తెలియక కాదు. ఇక్కడికొచ్చి మేమంతా కుకింగ్ స్కిల్స్ నేర్చుకున్నాం. నీ ఇంట్లో వంట సదుపాయం లేకపోవడంవల్ల, నీకలాంటి అవకాశం రాలేదుగా. అందుకని అలాగన్నాను. నీ ఇంటి తలుపులు తెరిచుంటాయని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు'' అన్నాడు నటరాజన్.

''చెప్పాలి. ఎందుకంటే ఇక్కడ మన దేశంలోలా కాదు. ఇళ్ల తలుపులు ఎల్లప్పుడూ మూసే ఉంటాయి. తలుపులు మూసినా తెరచి ఉన్నట్లు గ్రహించడానికే నా ఈ ఆహ్వానం'' అన్నాను.

నేను బెర్లిన్లో ఉండగా ల్యూనబర్గు మిత్రులు మాత్రమే కాదు, ఇండియన్ మిత్రులు మరికొందరు కూడా నన్ను చూడ వచ్చారు. ఆ సందర్భంలో పంచుకోవాలనిపించే కొన్ని విశేషాల్ని మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తాను.

ముందుగా భువనేశ్వర్ మిత్రుడు భూషణ్ రాకని ప్రస్తావిస్తాను.

నా జర్మనీ ప్రయాణంలో ఇండియాలో స్కాలర్‌షిప్ ఇంటర్వ్యూ దగ్గర్నుంచీ నాతో ముడిపడ్డవాడు భూషణ్. జర్మనీ చేరేక భాష నేర్చుకుందుకు నేను ల్యూనబర్గుకి వెడితే అతడు మరో ఊరికి వెళ్లాడు.

భూషణ్ బెంగాలీ హిందూ. పుట్టింది ఢాకా నగరంలో. నాలుగేళ్లపాటు బాల్యం అక్కడే గడిచిందనుకుంటాను. 1947లో భారత దేశం రెండు ముక్కలై పాకిస్తాన్ కొత్త దేశంగా ఆవిర్భవించినప్పుడు – ఢాకా నగరం తూర్పు పాకిస్తాన్లో భాగమవడంతో అతడి కుటుంబీకులు కలకత్తాకు తరలి వెళ్లారు.

బెంగాలీలకి కలకత్తా అంటే పిచ్చి. భూషణ్‌కీ కలకత్తా అంటే అంతిష్టమూ ఉన్నా, పుట్టినూరైన ఢాకానీ బాగా ఇష్టపడేవాడు. ఇండియాలోని ఇతర నగరాలతో పోల్చి ఢాకాని తెగ మెచ్చుకునేవాడు. 1971లో తూర్పు పాకిస్తాన్ తన ఉనికి కోల్పోయి బంగ్లాదేశ్‌గా అవతరించేక అతడు ఢాకాలో వస్తున్న మార్పుల్ని శ్రద్ధగా గమనించేవాడు. అక్కడ అతడికి బంధుమిత్రులున్నారు. విశేషమేమంటే, అతడికి హిందువులంటే ప్రత్యేకాభిమానం లేదు. ముస్లిములంటే వైరభావమూ లేదు. నాకతడు ఆదర్శ భారతీయుడనిపించేది.

భూషణ్‌ది విభిన్న వ్యక్తిత్వం.

తనకి నచ్చినవి అందరికీ నచ్చాలంటాడు. తనకి నచ్చనివి ఇతరులకి ఎలా నచ్చాయా అని ఆశ్చర్యపోతాడు. అన్నింటికీ తనవైపునుంచే ఆలోచిస్తూ. ఎదుటివారి అవసరాల్ని గ్రహించడు.

''నాకులా మారకపోతే, జర్మనీలో పట్టుమని పది రోజులుండలేవు'' అని నన్ను పలుమార్లు మందలించాడు.

నన్నతడు తరచుగా సతాయించడం, ఆ సతాయింపు వెనుకనున్న ఆత్మీయతనీ, నిబద్ధతనీ ఆలస్యంగానైతేనేం నేను గ్రహించడం – కౌముదిలోనే ఈ సీరియల్ ఆరంభంలో 'ఫారిన్ వెళ్లాలండి' విభాగంలో వివరించాను.

జర్మనీ చేరుకున్నాక మా మధ్య కొన్ని ఉత్తరాలు నడిచాయి.

తను వ్రాసేవాడు కాదు. నేనుత్తరం వ్రాస్తే తను బదులిచ్చేవాడు.

ఆ ఉత్తరాల్ని బట్టి – భూషణ్‌కి అక్కడి తిండి, అలవాట్లు, మితిమీరిన స్వేచ్ఛ, వైభోగం వగైరాలేం నచ్చలేదని అర్థమై ఆశ్చర్యపడ్డాను. ఎందుకంటే, ల్యూనబర్గులో పరిచయమైన బెంగాలీ మిత్రుడు బిశ్వాస్‌కి, ఇక్కడ ప్రతీదీ తెగ నచ్చేసింది. ''మా బెంగాలీల అలవాట్లకి ఇదో ఆదర్శదేశం'' అని తానిక్కడ పుట్టనందుకు వాపోయేవాడు.

భూషణ్ అందుకు పూర్తిగా భిన్నం.

అతడికి తనుండే సంస్థలో కొలీగ్సుతో అంతగా పడలేదుట. అతడి ప్రాజెక్టు నచ్చిన ప్రొఫెసరు – స్కాలర్‌షిప్ గడువు కాలాన్ని మరో ఏడాదికి పొడిగించుకోమన్నాట్ట. కానీ, గడువు తేదీకి మించి ఒక్క సెకనైన ఇక్కడుండడట.

నిజానికతడికి మధ్యలో వదిలేసి ఇండియా వెళ్లిపోవాలనుందిట. కానీ, అది తన కెరీర్‌కి మచ్చ ఔతుందని భయపడుతున్నాడుట. ఎలాగో ముక్కు మూసుకుని రోజులు గడిపేస్తాట్ట.

జర్మనీ పట్ల భూషణ్ స్పందన నాకు ఆశ్చర్యం కలిగించింది.

మాంసాహారి. పరిమితంగా ఆల్కహాలు తీసుకుంటాడు. సంప్రదాయాన్ని వ్యతిరేకించడు కానీ, అనుసరించడం పట్ల ఆసక్తి లేదు. రీసెర్చి అంటే ప్రాణం పెడతాడు.

ఇలా అన్ని విధాలా అతడికి జర్మనీ చాలా ఎక్కువగా నచ్చాలి. కనీసం నాకంటే ఎక్కువ నచ్చాలి.

నాకేమో జర్మనీ తెగ నచ్చేసింది. భూషణ్‌కి బొత్తిగా నచ్చలేదు.

నేనతణ్ణి కారణాలడగలేదు. అతడ వ్యక్తిత్వపు విభిన్నతలో ఇదీ ఓ భాగమనుకున్నాను.

స్నేహానంద లహరి

డాడ్ సంస్థ భూషణ్‌కి బెర్లిన్ సందర్శన యాత్ర ఏర్పాటు చేసింది. వెంటనే అతడు నాకుత్తరం వ్రాస్తూ, 'ప్రోగ్రాం చాలా టైటుగా ఉంది. ఐనా ఎలాగో అలా వీలు చేసుకుని ఓ పూట నిన్ను కలుస్తాను. నాకు నిన్ను చూడాలనుంది' అని తెలియబర్చాడు.

భూషణ్ నాకు బాగా తెలుసు.

ఎవరికైనా అవసరమైనప్పుడు సాయం చెయ్యడానికి అడక్కుండానే నడుం కడతాడు.

ఉత్తప్పుడు తన లోకం తనదన్నట్లు ఎవరితోనూ కలవడు.

అతడు బెర్లిన్ వస్తాడని తెలుసు కానీ, వచ్చి ఊరు చూసి వెళ్లిపోతాడనుకున్నాను.

దేశం దాటి వచ్చేక అనుబంధాలు ఏర్పడతాయేమో మరి.

ఊరు దాటి వచ్చేక నాకు మా ఊరివాళ్లు కనబడితే మహదానందమయ్యేది. ఉద్యోగంలో చేరేక భువనేశ్వరే మా ఊరయింది. మా ఆఫీసు కొలీగ్సు ఉమ్మడి కుటుంబంలో సభ్యుల్లా అనిపిస్తున్నారు.

అందుకేనేమో ఆ ఉత్తరం నాకు కలిగించిన సంతోషం అంతా ఇంతా కాదు.

మళ్లీ మళ్లీ చదువుకున్నాను.

ఉత్తరం చిన్నదే.

అందులోని ప్రతి వాక్యంలోనూ నిండిన ఆత్మీయత నా అంచనాకి అందడం లేదు

జీవితమొక అనుబంధాల వలయం!.

అన్న ప్రకారం ఓ రోజు సాయంత్రం వచ్చాడు భూషణ్.

అనుబంధం నాకే కాదు. భువనేశ్వర్లో ఒకే కాలనీవాళ్లం. పిల్లలు కూడా అతణ్ణి తొందరగానే గుర్తు పట్టారు.

ఆత్మీయులకోసం మొహం వాచి ఉన్నాడేమో, అతడు శ్రీమతిని హిందీలో పలకరించి కుశలప్రశ్నలు వేశాడు.

పిల్లల్ని చెంతకు పిలిచి దగ్గరగా తీసుకున్నాడు.

భూషణ్‌కి దక్షిణాది వంటకాలు అంతగా నచ్చవు.

మాకు ఉత్తరాది వంటలు అంతగా అలవాటు లేవు.

ఉభయతారకమని శ్రీమతి అతడికోసం పూరీ–కూర చేసింది.

అతడికి స్వీటెక్కువ ఇష్టమని మైదా హల్వా చేసింది.

ముందుగా టీ పెట్టిచ్చింది. చివర్లో మజ్జిగలో పంచదార కలిపిచ్చింది.

''మీరు మజ్జిగలో ఉప్పేసుకుంటారు కదూ, నాకోసం పంచదార వేశారా?'' అన్నాడతడు.

''ఏదో – గుర్తున్నంతలో, మాకు వీలైనంతలో – చిన్ని ప్రయత్నం'' అన్నాను.

అతడు మహదానందపడ్డాడు. ''ఇది చిన్ని ప్రయత్నమా! జర్మనీకొచ్చేక ఇంత మంచి ఫుడ్ తినలేదు'' అని శ్రీమతిని మెచ్చుకున్నాడు.

మిగతావన్నీ రొటీన్ విశేషాలు.

రొటీన్ కానిది కాసేపు జర్మనీ గురించి మామధ్య జరిగిన సంభాషణ!

''వచ్చేముందు ఈ దేశం గురించి ఎంతో గొప్పగా ఊహించాను. కానీ అంతా హంబగ్'' అన్నాడతడు.

''ఎందుకని?'' అన్నాను కుతూహలంగా.

''ఈ కాపిటలిస్టులు ఏంచేసినా ప్రచారంకోసం చేస్తారు. వీళ్లు దేశదేశాలకూ మిషనరీల్ని పంపి మానవసేవ చేస్తామంటారా, ఆ సేవనిండా ప్రచారం. అమాయకులైన పేదల్ని మతమార్పిడికి ప్రోత్సహించేలా ఉంటుందా ప్రచారం. మత ప్రచారం ఎందుకంటే సామాన్యులపై పట్టు బిగించడానికి మతమొక గొప్ప ఆయుధం'' అన్నాడతడు.

''మతం గురించి నువ్వనది నిజమే కానీ, మనకి గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో మతప్రచారం జరిగినట్లు లేదే!'' అన్నాను ఉండబట్టలేక.

''అదే వీళ్ల తెలివి. పేదవాళ్లనీ, చదువురానివాళ్లనీ ఒకలా డీల్ చేస్తారు. మనలాంటివాళ్లని మరోలా డీల్ చేస్తారు. ఏదేమైనా అంతా డీలింగే'' అన్నాడతడు.

పశ్చిమ దేశాలన్నీ ధనస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబమట.

ధనస్వామ్యం దోపిడీకి మారుపేరుట.

ధనస్వామ్యంలో డబ్బు, అధికారం కొందరి చేతుల్లోకే వెళ్లిపోతుందట.

ఆ కొందరూ మిగతా ప్రపంచాన్ని శాసిస్తారంటూ, ''ఎంతలా అంటే, మేధావులు కూడా దానికి దాసోహమంటారు. వారికిక మతమార్పిడి అవసరమే ఉండదు'' అన్నాడతడు.

''ఎవరు ఎవరికి దాసోహమంటారో తెలియదు. కానీ దాసోహమన్నవారికి కూడా ఇక్కడున్నంత స్వేచ్ఛ మరే వ్యవస్థలోనూ లభించదు కదూ!'' అనడిగాను.

''నువ్వు స్వేచ్ఛ అనుకుంటున్నది స్వేచ్ఛ కాదు. ధనమదం, అధికారమదం చేసే ప్రచారం – దాన్ని స్వేచ్ఛ అనుకునేలా చేస్తుంది. నాలుగు డబ్బులున్న సామాన్యులు ఉన్న కొంచెం డబ్బునీ విలాసాలకు తగలేసి, అదే స్వేచ్ఛ అనుకుంటారు. వాళ్లకి అధికారమదాన్ని ఎదిరించే స్వభావమే అలవడదు. దాంతో అధికారబలం ఉన్నవాళ్లకి ఎదురుండదు'' అన్నాడతడు.

''కానీ మనిషి అన్నవాడెవరైనా కోరుకునేది ఇలాంటి స్వేచ్ఛనే కదా!'' అన్నాను.

''విచ్చలవిడితనం స్వేచ్ఛ కాదు. పతనం. మన దేశంలో చూడు. అన్నింటా విలువలకి ప్రాధాన్యమిస్తారు. అందుకే అక్కడ ఒక పూట తింటే ఒక పూట పస్తులుండేవాళ్లు కూడా ఎంతో సంతోషంగా ఉంటారు'' అన్నాడతడు.

పేదవాళ్ల సంతోషం గురించి కవులు, కళాకారులు, వేదాంతులు – చెప్పడమే కానీ – పేదరికం సంతోషాన్ని ఇస్తుందని మనస్ఫూర్తిగా అనగల పేదవాళ్లు నాకు తగల్లేదు.

ఆ మాటనకుండా, ''ఐతే ఇక్కడివాళ్లెవరూ సంతోషంగా లేరంటావా?'' అడిగాను.

''సంతోషంగా ఉన్న మనిషి సిగరెట్లు, తాగుడు, వ్యభిచారం వగైరాల గురించి ఆలోచించడు. ఆనందాన్ని సామాన్య జీవితంలోనే వెదుక్కుంటాడు. మనం దురలవాట్లనేవి ఇక్కడ గౌరవనీయమైన అలవాట్లుగా చెలామణీ ఐపోతున్నాయి. అంటే ఇక్కడి జనం దురలవాట్లలో సంతోషాన్ని వెదుక్కుంటున్నారు'' అన్నాడతడు.

చిత్రమేమిటంటే భూషణ్‌కి సిగరెట్ల అలవాటుంది. మద్యం పుచ్చుకుందుకు అభ్యంతరం లేదు.

వాటిని దురలవాట్లుగా అతడు భావిస్తున్నాడనుకోను.

ఏకపక్షంగా మాట్లాడేవారు వాదించేటప్పుడు ఎక్కువ ఆలోచించరు.

అందుకే సందర్భానుసారంగా వాళ్ల అభిప్రాయాలు మారుతుంటాయి.

చాలామంది దురలవాట్లు అనే అలవాట్లు నాకు లేవు.

కానీ నేనెప్పుడూ ఫలానావి దురలవాట్లని వర్గీకరించలేదు.

స్వేచ్ఛ కారణంగా ఇక్కడివారు దురలవాట్లకు లోనయ్యారని అనుకుందామంటే, ఆ దురలవాట్లతోనే వారు – ఆర్థికంగా, వైజ్ఞానికంగా అద్భుతమైన ప్రగతిని సాధించారు.

ఆ దురలవాట్లని నిరసించే ఇతర దేశాలు అలాంటి ప్రగతిని ఎందుకు సాధించలేకపోయాయి?

ఈ సందేహానికి భూషణ్ ఇచ్చిన సమాధానం చిత్రంగా ఉంది.

ఇక్కడి పౌరుల్లో అంతటి సమర్థులు లేరుట.

ఇతర దేశాల మేధావుల్ని ఎత్తుకునొచ్చి వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకుంటారుట.

''ఇదో దోపిడి వ్యవస్థ. అదంతే!'' అని తేల్చేశాడతడు.

''మరైతే దోపిడి లేని వ్యవస్థ ఎక్కడుంది?'' అడిగాను.

''ఆ విషయానికే వస్తున్నాను'' అన్నాడతడు, ''మనుషులందర్నీ సరిసమానులుగా చూడగల ఒకే ఒక్క వ్యవస్థ కమ్యూనిజం. అదంటే ఇక్కడివాళ్లకి మహా భయం. అందుకని కమ్యూనిజాన్ని వ్యతిరేకిస్తూ ప్రచారం చెయ్యడమే ఆశయంగా పెట్టుకున్నారు. ఇక్కడి కొచ్చినప్పట్నించి చూస్తున్నాను. గ్యోతే ఇన్‌స్టిట్యూట్ క్లాసుల్లో కానీ, నా రీసెర్చి కొలీగ్సుతో సంభాషణల్లో కానీ, కమ్యూనిజమంటే చెప్పలేనంత వ్యతిరేకత. వాళ్లు డబ్బు ఖర్చు పెట్టి మమ్మల్నందర్నీ బెర్లిన్ ఎందుకు తీసుకొస్తున్నారో తెలుసా – మేమంతా బెర్లిన్లో తూర్పు పశ్చిమ విభాగాలకి ఉన్న భేదం కళ్లారా చూడాలని. చూసి మేమూ కమ్యూనిజానికి వ్యతిరేకంగా ప్రచారకులం కావాలని!''

నేను వెంటనే, ''కళ్లారా చూశావుగా, నీకేమనిపించింది?'' అన్నాను.

''వాళ్ల ప్రచారం ఎంత అబద్ధపుదో గ్రహించాను. తూర్పు బెర్లిన్లో అలెగ్జాండర్ ప్లాట్జ్ చూసే ఉంటావ్. పశ్చిమ బెర్లిన్లో ఏ ఏరియా దానికి సాటి వస్తుందో చెప్పు'' అన్నాడతడు.

తూర్పు బెర్లిన్లో అలెగ్జాండర్ ప్లాట్జ్ గొప్పగా ఉన్న మాట నిజమే.

కానీ నాకైతే మొత్తం పశ్చిమ బెర్లినంతా అంత గొప్పగానూ అనిపించింది.

అలా చెబితే నొచ్చుకుంటాడని, ''మరక్కడ ఆ ప్రాంతం దాటి నాలుగంటే నాలుగడుగులు వేశామనుకో. అక్కడా ఆలెగ్జాండర్ ప్లాట్జ్‌లాగే ఉందా?'' అన్నాను.

భూషణ్ నవ్వాడు, ''అదే కమ్యూనిజం గొప్పతనం. కావాలంటే కాపిటలిస్టులకంటే వైభవంగా ఉండగలమని నిరూపించడానికి అలగ్జాండర్ ప్లాట్జ్. తమ పౌరులకి ఎలాగుండడం ఇష్టమో తెలియబర్చడానికి మిగతా ప్రాంతం. తూర్పు జర్మనీ ఆర్థిక పరిస్థితి, పశ్చిమ జర్మనీకంటే మెరుగ్గా ఉంది. వాళ్ల పౌరులు వైభవంకంటే కృషికే ప్రాధాన్యమివ్వడం అందుక్కారణం. ఆ పౌరులు ఇక్కడి పౌరులకంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఆనందంగా ఉన్నారు. బెర్లిన్ గోడ కట్టేక పశ్చిమంనుంచి తూర్పుకే కానీ, అట్నించిటు పౌరులు పారిపోయిన సంఘటనలు లేవు. మనబోటివాళ్లని తప్పుదారి పట్టించడానికే, వీళ్లు స్వంత డబ్బుతో బెర్లిన్ యాత్రలు ఏర్పాటు చేస్తున్నారు. నేను ధనస్వామ్య ప్రచారానికి లోబడేవాణ్ణి కాదు. నాకంతా స్పష్టంగా అర్థమైంది'' అన్నాడు.

పౌరులు అట్నించిటు పారిపోవడంలో – నాకు తెలిసింది, అతడు చెప్పిందానికి పూర్తిగా భిన్నం.

నాకు తెలిసినవి కళ్లకి కనబడే వాస్తవాలు.

అతడు చెబుతున్నవి తన ఆలోచనలకు ప్రతిరూపాలు.

కొందరు కళ్లతో చూస్తారు. కొందరు మెదడుతో చూస్తారు.

సామ్యవాదం గొప్పదే కావచ్చు. కానీ దాన్ని నమ్మేవారు – జ్ఞానేంద్రియాల్ని మెదడునుంచి వేరు చెయ్యడం నాకు ఎప్పట్నించో స్వానుభవం.

సామ్యవాదం నాకిష్టమే. కానీ ధనస్వామ్యం పట్ల నాకు ద్వేషం లేదు.

అప్పట్లో రష్యాలో, ఇప్పటికీ చైనాలో అనుసరించబడే సామ్యవాద వ్యవస్థలో పౌరుడిగా ఉండాలని వ్యక్తిగా నేను కోరుకోను.

ధనస్వామ్య, సామ్యవాదాల సంయమనంగా ఉంటున్న భారత దేశ వ్యవస్థ నాకిష్టం.

ఇవన్నీ నేను భూషణ్‌కి చెప్పలేదు.

తనంతటివాడు తను. తన నమ్మకాలు తనవి. తన విశ్లేషణ తనది.

తనని మార్చాలన్న ఉద్దేశ్యమూ, అవసరమూ నాకు లేవు.

ఆపైన అతడిప్పుడు నా అతిథి.

"ఇక్కడ చాలా నెలలుగా ఉంటున్నా, ఒకే ఒక్కసారి తూర్పు బెర్లినుకి వెళ్లాను. నువ్వు చెప్పింది విన్నాక, మరోసారి వెళ్లి నీ దృష్టికోణంలో చూడాలనిపిస్తోంది'' అన్నాను.

భూషణ్ హాపీ. తర్వాత ఇద్దరం రీసెర్చి గురించి కాసేపు మాట్లాడుకున్నాం.

"డబ్బుంది కాబట్టి ఖరీదైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అవి మనకుంటే మన దేశంలో ఇంతకంటే బాగా పని చెయ్యొచ్చు'' అన్నాడు.

పరికరాలుంటే సరిపోతుందా? వాటిని సరిగ్గా ఉపయోగించుకోనిచ్చే వ్యవస్థ కూడా మనకి లేదన్నది నాకు స్వానుభవం.

ఆ మాటనకుండా, "ఖరీదైనవాటి సంగతటుంచు. జిరాక్సులాంటి కనీస సదుపాయాలే లేవు మనకి'' అన్నాను.

"జిరాక్సు లేకపోవడమేమిటి? అక్కడ మన లైబ్రరీలో ఉందిగా. నేను తరచుగా జిరాక్సులు తీసుకునేవాణ్ణి'' అన్నాడతడు.

మా లేబరేటరీలో జిరాక్సా? ఇక్కడికొచ్చేదాకా నేనసలా పేరే వినలేదు.

భూషణ్ మాటలు నాకు ఇంచుమించు షాక్.

"అయ్యో! జర్నల్సులో రీసెర్చి సమాచారాన్ని చూసి వ్రాసుకుందుకు ఎంతో కష్టపడేవాణ్ణి. నీకు తెలుసుగా – కనీసం రోజుకో గంటైనా నేను లైబ్రరీలో గడిపేవాణ్ణి. ఈ విషయం తెలిస్తే ఎంతో బాగుండేది. గంటలో నాలుగ్గంటల పనయ్యేది'' అన్నాను.

"ఎవరికి వారు తీసుకుందుకు వీలయ్యే యంత్రం కాదులే అది. దానికి కాపర్ సల్ఫేట్ మిశ్రమం తయారు చేసి వాడాలి. వాడ్డానికీ అదంత సింపుల్ కాదులే. కాపీలు తియ్యడానికి శిక్షణ పొందిన మనిషి ఉండాలి. కాపీలు కావాల్సినవాళ్లు ముందుగా చెప్పాలి. ఆపరేటరు కూడా పార్ట్ టైం కాబట్టి తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఆ పని చెయ్యడు. నాకా ఆపరేటరు తెలుసు కాబట్టి అప్పుడప్పుడు వాడుకున్నాను కానీ, అంతకంటే చేతివ్రాతో, టైపింగో బెటరనిపించింది'' అన్నాడు భూషణ్.

జిరాక్సు మనకీ ఉందంటే, ఇక్కడున్నట్లు సెకనుకో కాపీ వచ్చే యంత్రమనుకున్నాను. ఎవరికి వారు ఆపరేట్ చేసుకోగలది అనుకున్నాను.

మా అవసరాల విషయానికొస్తే ఇతడు చెప్పిన యంత్రం ఉన్నా లేనట్లే మరి!

ఆ విషయం తనకీ తెలుసన్నట్లు మాటల్లో సూచించాడు కూడా.

చిన్నప్పుడు చదివిన ఎద్దు–కప్ప కథ గుర్తుకొచ్చింది.

కప్ప తన పొట్టని ఎంత ఉబ్బించినా – ఎద్దు పరిమాణానికి చేరుకోగలదా?

అప్పుడు చాలా విషయాల్లో మనమా స్థితిలోనే ఉన్నామన్నది వాస్తవం.

వాస్తవాన్ని గ్రహిస్తేనే ప్రగతికి అవకాశముంటుంది.

లేకుంటే 'ఎక్కడ వేసిన గొంగళీ అక్కడే ఉంటుంది.

ఏదేమైనా – భూషణ్ రాకతో నాకు రెండు విషయాలు స్పష్టమయ్యాయి.

ఒకటి – రోజూ చూసేవే ఐనా, మన పరిసరాల గురించి మనకి తెలియనివి చాలా ఉంటాయి.

రెండు – కళ్లకి స్పష్టంగా కనిపించే విశేషాలు కూడా ఒకొక్కరికి ఒకోలా అనిపించే అవకాశముంది.

భూషణ్ విద్యాధికుడు. అంకితభావమున్న సైంటిస్టు. మానవతావాది.

అతడి అభిప్రాయాలకి విలువ లేదనుకుంటే, నాఅభిప్రాయాల్లోనూ ఏదో లోపముండొచ్చు.

అతడి అభిప్రాయాల్లో నిజంగానే తప్పుంటే – మేధావులైనంత మాత్రాన మానవతావాదులు కూడా ఒప్పుగా ఆలోచించగలరనుకుందుకు లేదు.

ఇది భూషణ్ రాకతో నాలో కలిగిన మానసిక వికాసం.

ఇంద్రధనుస్సులో ఏడు రంగులు. అన్నీ కలిస్తే తెలుపు.

తెలుపు శాంతికీ, మంచితనానికీ చిహ్నం.

అంటే రంగు ఏదైనా కావచ్చు. ఆ రంగు మనకు నచ్చనిది కూడా కావచ్చు.

కానీ ప్రతి రంగూ మంచితనంలో ఒక భాగం.

బెర్లిన్లో మా ఇంటికి వచ్చిన మిత్రులందరూ తలో రంగూ.

అందరూ తెలుపులో భాగమే!

భూషణ్ భాష వేరైనా అతడు భువనేశ్వర్లో నా కొలీగ్ కాబట్టి మా పిల్లలకి కూడా సుపరిచితుడు.

బెర్లిన్లో మా ఇంటికొచ్చి మమ్మల్ని కలుసుకోవాలని మనసు పడ్డ దేవ్‌దార్ విషయం అలా కాదు.

అతడు నాకు మాత్రమే పరిచితుడు.

ఆ పరిచయం కూడా ఇక్కడికొచ్చేక గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో జరిగింది.

అప్పుడది జర్మన్ భాష నేర్చుకుంటున్న సమయం.

మాలో మేం మాట్లాడుకుందుకు – మధ్యమధ్య హిందీని కలగలుపుతూ, ఇంగ్లీషు వాడుతున్న సమయం.

అప్పుడు ఇతర భారతీయ భాషల గురించి పట్టించుకోలేదు కానీ, ఇప్పుడు దేవ్‌దార్ మా ఇంటికొస్తున్నట్లు ఉత్తరం ద్వారా తెలియ బర్చగానే ముందుగా గుర్తుకొచ్చిన విషయం అతడు మహారాష్ట్రియన్ అని.

మనకి తెలియకుండానే భాష కూడా మన అనుబంధాల్ని శాసిస్తుందని అప్పుడు నాకు అర్థమైంది.

నాలుగు నెలలు గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో కలిసిమెలిసి ఉండడంతో దేవ్‌దార్‌తో ఆత్మీయానుబంధం ఏర్పడింది. అదెంత బలమైనదంటే – బెర్లిన్ వస్తున్నప్పుడు మా కుటుంబంతో ఓ పూట గడపాలని అతడికి అనిపించింది.

అతడొస్తాననగానే, దగ్గరి బంధువు మా ఇంటికొస్తున్నాడన్న భావన నాకూ కలిగింది.

శ్రీమతి కూడా, "అతగాడు మనల్ని చూడాలని అనుకోవడమే ఒక విశేషం. చూడ్డానికి రావడం ఇంకా విశేషం. మనిషి సంఘజీవి అయ్యాడంటే తప్పనిసరై కాదు. అది మనిషి తన ఆనందంకోసం ఎంచుకున్న జీవనవిధానం. మీ మిత్రుడి రాక నాకూ చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే మీ ఇద్దరి సంభాషణలూ వింటూ – మీ గత అనుభవాల్లో నేనూ ప్రత్యక్షభాగస్వామిని కావచ్చు" అని ఉత్సాహపడింది.

కానీ సాంఘిక జీవనంలో భాష కూడా ప్రధానమే.

అసలు భాష పుట్టిందే మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడానికని – బైబిల్లో కాబోలు ఓ కథ ఉంది.

దేవ్‌దార్ చక్కని హిందీ మాట్లాడతాడు.

శ్రీమతికి హిందీ అర్థమౌతుంది కానీ, భాషమీద పట్టు అంతంత మాత్రం. పనివాళ్లతోనో, కూరగాయల బేరానికో కథ నడిపించేస్తుంది కానీ – భాష బాగా తెలిసిన ఉత్తరాదివారి దగ్గర తటపటాయిస్తుంది.

భువనేశ్వర్లో ఐతే అదంత పెద్ద సమస్య కాదు.

కొంత సైగలు, కొంత చిరునవ్వు. కొంత ఊఁ, ఆఁలు.

వీటితోపాటు పక్కన హిందీ బాగా మాట్లాడగల తెలుగువారి ఇంటర్‌ప్రెటేషన్ సహకారం.

ఈ భాషా పరిమితి శ్రీమతి వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో కొంత పాత్ర వహించింది కూడా.

ఒకోసారి గుంపులో చిన్న విషయానికే వాదనలొచ్చేవి.

తన పాయింటు చెప్పడానికి భాషాజ్ఞానం చాలక, ఎదుటివారు చెప్పిందే సరైనదన్నట్లు తలాడించేది శ్రీమతి. తమతో విభేదించలేదని వాళ్లు సంతోషించేవారు.

పరభాషీయులతో విభేదించకుండా, తమతో విభేదిస్తే స్వభాషీయులు తప్పు పడతారు కదా!

అందుకని, అదే తన తత్వమైనట్లు శ్రీమతి ఎవరితోనూ వాదనకు పూనుకునేది కాదు. దాంతో ఆమెకు కాలనీలో ఆ విషయమై మంచిపేరొచ్చింది.

ప్రతివారికీ ఎవరో ఒకరిమీద అసంతృప్తి ఉంటుంది.

దాన్ని వేరెవరి దగ్గరైనా ప్రకటించేవరకూ – తృప్తి ఉండదు.

అలాంటి సందర్భాల్లో విని ఊరుకోవడం ఉత్తమం. కానీ చాలామంది, ఇరుపక్షాల్నీ విశ్లేషించి సలహాలిస్తారు. అలా ఇచ్చినప్పుడే వారికి తృప్తి.

తమ అసంతృప్తి గురించి విని, తానేమీ సలహా ఇవ్వకుండా, సానుభూతితో స్పందిస్తుందని – శ్రీమతిని కాలనీలో చాలామంది మహిళలు ఇష్టపడేవారు.

ఆ విషయం నాకు చెప్పినప్పుడు, ''నాతోనూ అలా ఉంటే బాగుంటుంది కదా!'' అన్నాను నేనోసారి.

అలాంటప్పుడు చాలామంది మహిళలు, 'ఏం, నేను మీతో అలా ఉండడం లేదా?' అనడం కద్దు.

కానీ శ్రీమతి రూటే వేరు. ''వాళ్ల జీవితం వాళ్లది. ఇంట్లో ఈ జీవితం మనది. బాధ్యత ఉన్నచోట వాదనలు తప్పవు'' అనేది.

పోతనామాత్యుడి పద్యాల్లో పదాల సొబగుల్లా, గృహిణుల వ్యాఖ్యల్లో జీవిత సారాన్ని వివరించే లోతైన వేదాంతపు సొబగులుంటాయి.

''అది సరే కానీ, అవతలివాళ్లు ఏమన్నారో జాగ్రత్తగా విని అప్పుడు తలాడిస్తాండు. లేకపోతే నీ సానుకూలత వికటించగలదు'' అని హెచ్చరించాను.

ఎందుకంటే – ఏ గృహిణైనా మాటల సందర్భంలో 'నేను గయ్యాళిని. చటుక్కున ఎంత మాటపడితే అంతా అనేస్తాను' అనొచ్చు.

అలా అనడం ఎంత ప్రమాదకరమో, నా రీసెర్చి రోజుల్లో తెలుసుకున్నాను.

అప్పుడు నలుగురు రీసెర్చి స్కాలర్సు – నేను, మూర్తి, నారాయణ, శంకర్ – నలుగురం కలిసి ఓ గది అద్దెకు తీసుకుని ఉండేవాళ్లం.

అంతా హాస్యప్రియులే. చమత్కారులే. ముళ్లపూడివారి హాస్యస్ఫూర్తికి అభిమానులే. సమయస్ఫూర్తిలో ఎవరి సాటి వారే!

ఎదుటివారిని వ్యక్తిగతమైన విమర్శలతో నొప్పించాలనే దురుద్దేశ్యం లేనంతకాలం – కేవలం హాస్యానికైతే – నొప్పించే మాటల్ని కూడా ఆస్వాదించగల సరసతా, పరస్పర విశ్వాసం అందరికీ ఉన్నాయి.

అందువల్ల ఒకటి రెండేళ్లు, అంటే విడిపోయే దాకా, మా నలుగురి స్నేహం మనోహరంగా, రసరమ్యంగా కొనసాగింది.

మాటల సందర్భంలో ఒకసారి శంకర్ పొరపాటున, 'నేనో చెత్త వెధవని కాకపోతే, వాణ్ణెలా నమ్మాను?' అన్నాడు.

వెంటనే నారాయణ టైం చూసి, 'ఫలానా సంవత్సరంలో, ఫలానా తేదీన, ఫలానా సమయానికి – శంకర్ ఉత్తి వెధవ అని తన మాటమీదనే నిర్ధారించడమైనది' అన్నాడు.

ఆ తర్వాత ఒకరోజు మూర్తి పరమమూర్ఖుడిగానూ, ఒకరోజు నేను చచ్చుఘటంగానూ, ఒకరోజు నారాయణ అడివిమాలోకంగానూ నిర్ధారించబడ్డాం.

ఈ నిర్ధారణ కార్యక్రమం కూడా క్రమంగా క్లుప్తమైపోయింది.

ఎవరైనా తన గురించి ఓ తక్కువ మాట అనగానే – ఒకరు కాలెండరు వంక, ఒకరు వాచీవంక చూస్తే – మూడోమనిషి 'కన్ఫర్మ్‌డ్' అనడం జరిగేది.

ఓ రోజున రూంలో పొరపాటున నోరు జారి, 'ఈ రోజెవరి మొహం చూశానో, లైబ్రరీలో మరీ ఆ జగన్నాథంగాడిముందు గాడిదనయ్యాను' అని శంకర్ అంటే, నేను కాలెండర్ చూశాను. తను దొరికిపోయానని శంకర్‌కి అర్థమైపోయింది.

పెద్దగా నవ్వేసి, 'తప్పయిపోయింది. ఈ సారికి వదిలెయ్యండి' అన్నాడు అభ్యర్థనగా.

కానీ మిగతావాళ్లం అతణ్ణి వదల్లేదు. నిర్దాక్షిణ్యంగా, 'గాడిద' అని కన్‌ఫర్మ్ చేసేశాం.

మా ఈ కన్ఫర్మేషన్ – ఓ విధంగా చాలా మేలు చేసింది. బయటవాళ్లతోనే కాదు, ఇంట్లోవాళ్లతో మాట్లాడేటప్పుడు కూడా, మమ్మల్ని మేము చిన్నబుచ్చుకునే పదాలు వాడేవాళ్లం కాదు. అలాంటి పదమేమైనా నాలుక చివరిదాకా వచ్చిందా, చెవిలో ఎవరో 'కన్ఫర్మ్‌డ్' అన్నట్లు వినిపించి, అదే హెచ్చరికయ్యేది.

మాలో మేమే కాక, ఇతరులెవరైనా మాతో కబుర్లాడుతూ, 'తన చుట్టూ కుక్కలా తిరిగాను' లాంటి వ్యాఖ్యలు చేస్తే – మాకు నవ్వాగేది కాదు.

అందులో నవ్వడానికేముందన్నట్లు వాళ్లు ఆశ్చర్యంగా చూస్తే, 'నువ్వు కనుక మాలో ఒకడివైతే – ఈపాటికి నిన్ను కన్ఫర్మ్ చేసి ఉండేవాళ్లం' అని మా సంప్రదాయం గురించి చెప్పేవాళ్లం.

దాంతో మాతో మాట్లాడేటప్పుడు ఇతరులు కూడా పదాల ఎంపికలో జాగ్రత్తగా ఉండేవాళ్లు.

ఐతే ఈ సంప్రదాయం ఇంటి ఇల్లాలి విషయంలో చెల్లదు.

మాటల సందర్భంలో 'నేను గయ్యాళిని. చటుక్కున ఎంత మాటపడితే అంతా అనేస్తాను' అని నా భార్య అనొచ్చు.

అప్పుడు నేను తను గయ్యాళి అని కన్ఫర్మ్ చేస్తే కనుక – తర్వాత అసలు సిసలు గయ్యాళితనాన్ని నిజంగా రుచి చూడాల్సి వస్తుంది.

అందుకని అప్పుడు వారితో విభేదించాలి.

'నువ్వా, గయ్యాళివా?' అని ఆశ్చర్యపోవాలి.

'అలా అన్నవారిని ఒక్కరంటే ఒక్కర్ని ఒక్కర్ని చూపించు' అని సవాలు చెయ్యాలి.

'నిన్ను కూడా గయ్యాళి అనాలంటే, ఈ లోకంలో అమాయకులకోసం ఎక్కడని వెదకాలి?' అని వాపోవాలి.

అప్పుడు సంసారం చల్లగా, చక్కగా ఉంటుంది.

ఐతే – ఇంటి ఇల్లాలితో ఎప్పుడు విభేదించాలో, ఎప్పుడు ఏకీభవించాలో తెలుసుకోవడం ఒక కళ. అందుకు ఇల్లాలి భాష తెలియాలి.

'ఔనంటే కాదనిలే, కాదంటె ఔననులే' అని ఆడవాళ్ల భాష గురించి మిస్సమ్మ సినిమాలో పింగళి వారు వ్యాఖ్యానించారు.

అది ఆ సందర్భాన్ని బట్టి ఆయనకు తోచింది చెప్పారు.

సందర్భానుసారంగా ఇల్లాలి భాష ఎలా మారిపోతూంటుందో – అది స్వానుభవాన్ని బట్టే తెలుస్తుంది.

స్వానుభవం ఎంతున్నా – ఎప్పటికప్పుడు కొత్త విద్యార్థిలా ఉంటేనే – ఆ భాష ఆకళింపుకి వస్తుంది.

'ఇన్నేళ్లుగా కాపురం చేస్తున్నాను. తన భాష నాకు తెలియదా?' అనుకుంటే అది అహంకారమే ఔతుంది.

ఆ అహంకారం గురించి హెచ్చరించడానికి మా నాన్నగారు తన స్వానుభవంనుంచి నేర్చుకున్న పాఠమొకటి మా చిన్నప్పుడు చెప్పారు.

ఆయన ఓసారి భిలాయిలో ఉండే నా మేనత్త, అంటే తన చెల్లెలి, ఇంటికెళ్లారు.

దానికి రాజమండ్రినుంచి కొంత రైలు ప్రయాణం. కొంత బస్సు ప్రయాణం.

బస్సులో ఉండగా ఆయన పక్కన కూర్చున్న ఒకతను మా నాన్నగారితో ఆగకుండా తన కష్టాలు హిందీలో చెప్పుకోవడం మొదలెట్టాడు.

తనకి హిందీ రాదని చెప్పడానికి నాన్నగారికి కొంత మొహమాటం. కొంత అహంకారం కూడా ఉందిట.

ఆయన హిందీ సినిమాలు ఎక్కువగా చూస్తారు. ఇంకా చెప్పాలంటే తెలుగుకంటే ఎక్కువగా చూస్తారు.

అప్పట్లో హిందీ సినిమాలకు హాల్లో కథ తెలుగున చెప్పేవారు. అందువల్ల సినిమా బాగానే అర్థమయ్యేది.

నటీనటుల హావభావాలు, తానెరిగిన కొన్ని హిందీ పడికట్టు పదాలు, మా ఊళ్లో రొట్టెల సాయబుతో మాటల్లో దొరల్లే ఉర్దూ పదాలు – అన్నీ కలగలిపి, తనకి హిందీ బాగా అర్థమౌతుందనే ఆయన నమ్మేవారుట.

అప్పుడు భిలాయి బస్తతను చెబుతున్నది ఆయనకి ఒక్క ముక్క కూడా అర్థం కావడం లేదుట.

కానీ అతడి హావభావాల్ని బట్టి ఓ కథ ఊహించుకున్నారుట. అతడి మాటల్ని ఆ కథకి అన్వయించుకున్నారుట. అతణ్ణి ఇంప్రెస్ చెయ్యడానికి ఎక్కడ లేని శ్రద్ధా నటించారుట. మధ్య మధ్య తలాడిస్తూ, ఊఁ ఆఁ అని అంటున్నారుట.

కొంతసేపు గడిచేక అతగాడు, ''నువ్వు వినడమే తప్ప ఏమనడం లేదు'' అని, ''క్యా బాత్ హై'' అన్నాడుట.

దానికి ఏమనాలో తెలియక, తనూ హిందీలోనే ఏదైనా అనాలనుకున్నారుట నాన్నగారు.

ఒకటి – అతడి మాటలు తనకు విసుగనిపించడం లేదని తెలియజేయాలి.

రెండు – అతణ్ణి మెచ్చుకోవాలి. అందుకని, ''శాబాష్ హై'' అన్నారుట.

అంతే!

''నేను నా కష్టాలు చెప్పుకుంటుంటే – నీకది శాబాషుగా ఉందా?'' అంటూ అతగాడు విరుచుకుపడ్డాట్ట. చుట్టుపక్కలవాళ్లు పరిస్థితి అర్థం చేసుకుని అతడికి సద్దిచెప్పి శాంతపర్చారుట.

నాన్నగారు హాస్యప్రియులు. ఈ కథ చెప్పేక, 'సినిమాల్లో మహానటులు సందర్భానుసారంగా హావభావాలు ప్రదర్శించడంలో దిట్టలు. వాళ్లే భాషలో మాట్లాడినా కథ అర్థమైపోయేది. ఈ భిలాయ్‌వాడికి చెప్పేది వేరు, ముఖభావాలు వేరు. అందుకని నటుడు కాని పరాయి భాషవాడితో కొంచెం జాగ్రత్తగా ఉండాలి' అని మాకు నీతి చెప్పారు.

మా నాన్నగారు చెప్పిన ఈ కథతో, 'క్యాబాత్ హై అంటే శాబాష్‌హై' అన్నది మా ఇంట్లో సామెతగా మారిందిట.

ఇప్పుడు దేవ్‌దార్ రాక ఆ కథని గుర్తు చేసింది నాకు.

భువనేశ్వర్లో ఐతే పరభాషీయులెవరైనా మా ఇంటికొచ్చినప్పుడు – పిల్లల్ని ఓసారి పరిచయం చేసి, పక్కింటికి పంపేసేవాళ్లం.

పక్కింటివాళ్లు తెలుగువాళ్లు. వాళ్ల పిల్లలూ, మా పిల్లలూ సమవయస్కులు.

ఇక్కడ అటూ, ఇటూ, పైనా, కిందా – అంతా పరదేశీయులు. ఎక్కువగా యూరోపియన్సు.

దేవ్‌దార్ ఉన్నంతసేపూ పిల్లలు కూడా మాతోనే ఉంటారు.

మా పనుల్లో మేముంటే, వాళ్లలో వాళ్లు ఆడుకుంటున్నప్పుడే, నిముషానికోసారి మావద్దకొస్తుంటారు వాళ్లు.

ఒకోసారి తమకి గొప్పదనిపించిన అనుభూతిని వెంటనే పంచుకోవాలనీ, ఒకోసారి అక్కమీద తమ్ముడికో, తమ్ముడిమీద అక్కకో పితూరీలు చెప్పడానికీ, ఒకోసారి మేము వాళ్లనొదిలి మా పనిలో మేముండడం నచ్చక!

అలాంటి వాళ్లని కాసేపైతే ఫరవాలేదు, గంటల తరబడి – మా జోలికి రాకుండా ఎలా ఆపాలన్నది మా సమస్య. వాళ్లవల్ల మా సంభాషణకి బ్రేకులు పడి, దేవ్‌దార్‌ని విసిగిస్తుందని బెరగ.

పోనీ పిల్లల్ని శ్రీమతికి అప్పజెప్పేసి – నేను, దేవ్‌దార్ కబుర్లు చెప్పుకుందామా అంటే – అతడొచ్చింది నన్ను చూడ్డానికేం కాదు, మా కుటుంబంతో పరిచయం చేసుకోవాలని.

అదీకాక – ఇంటికొచ్చిన అతిథితో నేను మాత్రమే కబుర్లు చెప్పడం – నా పద్ధతికి విరుద్ధం.

ఎందుకంటే –

తెలుగునాట దంపతుల్లో ఆడవాళ్లవీ, మగాళ్లవీ వేర్వేరు ప్రపంచాలుగా ఉండడం చిన్నప్పట్నించీ గమనించేవాణ్ణి.

సినిమాలకి కూడా వాళ్లు వాళ్ల బృందంతో, వీళ్లు వీళ్ల బృందంతో – వెడుతూండడం నాకు నచ్చేది కాదు.

నేనా పద్ధతికి భిన్నంగా ఉండాలని కాస్త గట్టిగానే అనుకునేవాణ్ణి.

రీసెర్చిస్కాలరుగా ఉన్నప్పుడు – నలుగురం కలిసి ఓ రూంలో అద్దెకుండేవాళ్లం కదా! మేమంటే చాలామందికి ప్రత్యేక ఆకర్షణ ఉండేది. కబుర్లకీ కాలక్షేపానికీ మా గదికి చాలామందే వచ్చేవారు.

వాళ్లలో స్టూడెంట్సు, రీసెర్చిస్కాలర్సు, కుర్ర లెక్చరర్లు కూడా ఉండేవారు.

కాసేపు కబుర్లయ్యేక వారిలో ఎవడో ఒకడు పేక దస్తా తీసేవాడు. అంతే!

జోరుగా, హుషారుగా పేకాట మొదలయ్యేది.

పెద్ద మొత్తాలు కాదు కానీ, అంతా డబ్బు పెట్టే ఆడేవారు.

పేకాడ్డానికి విముఖుణ్ణి కాను కానీ, డబ్బెట్టి ఆడకూడదన్న నియమాన్ని చిన్నప్పుడే నాకు నేనే విధించుకుని చాలా పద్ధతిగా అనుసరిస్తున్నాను.

ఆ విషయంలో నేనెంత ఖచ్చితమో తెలిసినా, అప్పుడప్పుడు మిత్రులు బలవంతపెట్టేవారు. లొంగలేదని కొందరు నొచ్చుకునేవారు.

అప్పుడు వాళ్ల ముఖాలు చూస్తే చాటున నా గురించి గొణుక్కోవచ్చనిపించేది.

రూంమేట్స్ నన్ను సమర్థించడానికి, ''అతణ్ణి మరీ బలవంతపెట్టకండి. రూంలో పేకాడ్డానికి వీల్లేదని శాసింగలడు'' అని, అక్కడ పేకాడ్డానికి నా అనుమతీ అవసరమనీ, మాటవరసకి కూడా నేను వాళ్లని అభ్యంతర పెట్టలేదనీ పరోక్షంగా సూచించేవారు.

ఏదేమైనా ఎవరితోనూ నా స్నేహానికి భంగం వాటిల్లలేదు.

అలా నేనెప్పుడూ మా రూంలో పేకాట కార్యక్రమానికి ప్రేక్షకుణ్ణి మాత్రమే.

ఆ పేకాటలో పాల్గొనే వారిలో ఇద్దరుముగ్గురు వివాహితులు కూడా ఉన్నారు.

పేకాట పేరిట వాళ్లుకోసారి రాత్రి ఒంటిగంట దాకా ఇక్కడే ఉండిపోయేవారు.

ఒకసారి నేనో లెక్చరర్ మిత్రుడివద్ద ఆ విషయం ప్రస్తావించి, ''ఇంట్లో భార్యని ఒంటరిగా వదిలేసి, నువ్విక్కడ పేకాటలో ఉండిపోవడం బాగుందా'' అని మందలించాను.

అతగాడు వెంటనే, ''తననీ రమ్మన్నానయ్యా! రాను కాక రానంటుంది. వాళ్లకీ ఓ ఆడాళ్ల బ్యాచుందిలే, వాళ్ల ప్రోగ్రామ్సు వాళ్లవి. మన ప్రోగ్రాంసు మనవి. అదంతే! పెళ్లయి కాపురం పెట్టేక నీకూ తెలుస్తుందిలే'' అన్నాడు.

అది నిజమే!

అతగాడింట్లో ఒకటి రెండుసార్లు భోజనం కూడా చేశాను.

ఆ దంపతుల అన్యోన్యతలో నాకేం లోటు కన్పించలేదు.

ఐనా నేను మాత్రం, పెళ్లయి కాపురం పెట్టేక, ఇంటా బయటా మేమెప్పుడూ జంటగానే ఉండాలనుకున్నాను. శ్రీమతి ఆ విషయంలో నాకు పూర్తిగా సహకరించడంతో, పాటించడానికి మాకే ఇబ్బందీ కలుగలేదు.

పెళ్లయిన రెండేళ్లకి వైజాగునుంచి భువనేశ్వర్ వచ్చేక కూడా – మా పద్ధతి అలాగే కొనసాగింది.

అక్కడ అంతా మమ్మల్ని అనుసరించారో, లేక మేమే అక్కడి ప్రవాహంలో కలిసిపోయామో తెలియదు కానీ – మా జంటతనం నిరాటంకంగా కొనసాగింది.

పేరంటాలు, ఆఫీసు వ్యవహారాలు లాంటివైతే తప్ప – ఇంటికి ఎవరొచ్చినా కబుర్లలో భార్యాభర్తలిద్దరూ పాల్గొనడం అక్కడ ఆచారమైపోయింది. అలా జరక్కపోతే, వచ్చినవాళ్లు నొచ్చుకోకుండా సహేతుకమైన సంజాయిషీ ఇవ్వడం బాధ్యతగా ఫీలయ్యేవాళ్లం.

అందుకే దేవదార్ గురించి నేను ఆలోచనలో పడితే, ''అంత అభిమానంగా చూడ్డానికొస్తున్నాడు. వీలైనంత వరకూ మానేజ్ చేద్దాం. కుదరలేదూ! నాకు తెలిసి మీ మిత్రులంతా మంచివాళ్లే. అతనా మాత్రం అర్థం చేసుకుంటాడు లెండి'' అంది శ్రీమతి.

ఆలోచిస్తే ఎంత చిన్న విషయమైనా పెద్ద సమస్యగా అనిపిస్తుంది.

ఆలోచించకపోతే ఎంత పెద్ద సమస్యయినా తేలికగా తోస్తుంది.

మనిషికి ఆలోచనతో పాటు – అదెప్పుడు అవసరమో, ఎప్పుడు కాదో తెలుసుకునే విచక్షణ కూడా ఉండాలి.

శ్రీమతి అన్న ఆ మాట – నాకు కొంత విచక్షణను ప్రసాదించింది.

అప్పుడు దేవ్‌దార్‌కోసం ఏంచెయ్యాలీ, అతణ్ణి ఎలా ఆదరించాలీ అన్నవాటిమీద దృష్టి పెట్టాం.

దేవ్‌దార్ ఉదయం పదికి వస్తానన్నాడు.

అది మాకు వీలైన సమయమే! ఎందుకంటే – ఒకోసారి ఉదయం ఎనిమిది తర్వాత కానీ ఇంటామె ఒలోముచ్‌కీ కిచెన్‌లోకి రాదు. ఆలోగా మా టిఫిన్లైపోవాలి.

తను మళ్లీ పది దాటేక బయటికెడుతుంది. అప్పుడే మళ్లీ కిచెన్ వాడుకోగలం.

ఆతర్వాత మళ్లీ రాత్రి ఎనిమిది దాకా తను ఇంటికి రాదు.

మా అదృష్టం – ఆ రోజు ఎనిమిదికే బయటికెడతానంది ఒలోముచ్‌కీ.

ఆమె వెళ్లగానే టిఫిన్ తయారీకి వెడదామనుకున్నాం.

దేవ్‌దార్ మరాటీ కదా అని శ్రీమతి పూరీ కూర ప్లాన్ చేసింది.

ముందు రోజు రాత్రే బంగాళా దుంపలు ఉడకబెట్టి ఫ్రిజ్‌లో ఉంచింది.

ఉదయం బ్రషింగ్ అవగానే నేను ఉల్లిపాయలు వగైరాలు తరుగుతుంటే, తను పూరీ పిండి కలిపింది.

ఇద్దరున్నాం. ఒలోముచ్‌కీ ఇలా వెళ్లగానే అలా పూరీలు, కూర చేసెయ్యచ్చనుకున్నాం.

కానీ ఆ రోజు ఒలోముచ్‌కీ డ్యూటీకి వెళ్లేసరికి 8.55 అయింది.

నేను కొంచెం కంగారు పడ్డాను కానీ శ్రీమతి హుషారుగానే ఉంది.

''మనం చాలా స్పీడు. అరగంటలో టిఫిన్ రెడీ. ఆ తర్వాత అరగంటసేపు మనకి కాళీ. ఎవరికోసమైనా ఎదురుచూడ్డం మహా బోరు కదా, ఆ అరగంటకోసం ఏమైనా ప్లాన్ చెయ్యండి'' అంది తను.

నేను టెన్షన్లో ఉన్నాననిపించినప్పుడు, పరిస్థితిని ఇలా తేలిక చెయ్యడం తనకి అలవాటు.

తనలా అనగానే చాలా రిలాక్సయ్యాను. ''నేను ప్లాన్ చెయ్యడమెందుకూ – బోరు చూపినవాడే, దారీ చూపిస్తాడు. అన్నింటికీ అ దేవుడిమీదే భారం వేద్దాం'' అన్నాను.

అలా ఎందుకన్నానో! భారం దేవుడిమీద వేస్తే – అది దేవ్‌దార్ తీసుకున్నాడు.

సరిగ్గా తొమ్మిదికి కాలింగ్‌బెల్ మ్రోగితే, ఎవరు చెప్మా అనుకుంటూ వెళ్లి తలుపు తీశాను.

గుమ్మంలో దేవ్‌దార్!

నా కళ్లని నేనే నమ్మలేకపోయాను. పదికి వస్తానన్నవాడు తొమ్మిదికే వచ్చేశాడు.

దేవ్‌దార్‌ని చూడగానే ముందు నోటమాట రాలేదు.

అతడు మాత్రం వెంటనే, ''గ్యుటెన్ మోర్గెన్'' అంటూ పలకరించి, ల్యూనబర్గ్ రోజుల్ని గుర్తుకి తెచ్చాడు.

జర్మన్ క్లాసులకి వెడుతున్న ఆ రోజుల్లో, అలా పలకరించుకోవడం భాషాశిక్షణలో భాగం.

''మోర్గెన్'' అన్నాను.

దేవ్‌దార్ వెంటనే, ''తొందరగా తెమిలిపోయాను. ఆగలేక ముందే వచ్చేసాను'' అన్నాడు హిందీలో.

ఆ మాటల్లో సంజాయిషీని పులుముకున్న ఆత్మీయత నన్ను కదిలించింది.

''చాలా మంచి పని చేశావ్ – మేమూ అనుకుంటున్నాం – నువ్వు ముందుగా వస్తే బాగుణ్ణని'' అన్నాను.

మామూలుగా ఐతే, అలాగనడం మర్యాద.

ఆంగ్లంలో గెస్ట్ అనే పదానికి తెలుగు సేతగా వాడే పదం అతిథి.

అతిథి అంటే చెప్పా చెయ్యకుండా వచ్చేవాడని అర్థం. గెస్ట్ అన్న పదానికి వచ్చేవాడని మాత్రమే అర్థం. అతిథికి సరైన ఆంగ్లపదం సర్‌ప్రయిజ్ గెస్ట్ అనుకుంటాను.

అంటే మనం చెప్పాచెయ్యకుండా వచ్చేవారిని 'అతిథి' అన్న పదంతో మర్యాదపూర్వకంగా గౌరవిస్తాం.

ఎవరైనా చెప్పకుండా మనింటికొస్తే, ఒకోసారి, 'ఈ సమయంలో వచ్చాదేంట్రా బాబూ!' అనిపించేటంత ఇబ్బందికరంగా ఉంటుంది.

ఐనా సరే, ''అరే, ఇప్పుడే నీ గురించి అనుకుంటున్నాం. భలే వచ్చావే'' అని ఆప్యాయతని నటించడం మనకి రివాజు.

'మనమెవరింటికైనా అలా అతిథిగా వెళ్లినప్పుడు, అవతలివారు ఆప్యాయతని ఒలకబోస్తే, అది వాళ్ల మర్యాద అని గ్రహించాలి తప్ప – అలా చెప్పా పెట్టకుండా వెళ్లడాన్ని అలవాటుగా పాటించకూడదు' అని మా తాతగారు చాలాసార్లు చెప్పారు. ఐతే చెప్పా పెట్టకుండా ఎవరైనా మనింటికొచ్చారంటే, వాళ్లు కావాలని అలా చేసి ఉండరనీ, ఏదో అవసరం అనుకోకుండా వచ్చి ఉంటుందనీ – అర్థం చేసుకుని – వాళ్లకి మర్యాద ఇవ్వడం మన సంప్రదాయమని కూడా ఆయన చెప్పారు.

అందుకే మన సంప్రదాయంలో అతిథి, ఆతిథ్యం అనే పదాలకి చాలా విలువుంది.

''చాలా మంచి పని చేశావ్ – మేమూ అనుకుంటున్నాం – నువ్వు ముందుగా వస్తే బాగుణ్ణని'' అనడంలో నేను ఆప్యాయతని నటించానా అన్న అనుమానం రేగి, మనసు చివుక్కుమంది.

ఇంతకీ దేవ్‌దార్ అతిథి కాదు. ముందుగానే చెప్పి వచ్చిన గెస్ట్.

ఇందాకా శ్రీమతితో, ''బోరు చూపినవాడే దారి చూపిస్తాడు'' అన్నాను కదా – దారి కాస్త తొందరగా చూపించేశాడని అనుకోవాలంతే!

దేవ్‌దార్‌తో కరచాలనం చేసి లోపలకు తీసుకెళ్లాను కానీ మనసు నిండా గాబరా.

అతడికోసం ఇప్పుడు పూరీలు వెయ్యాలి.

ఒక్కణ్ణీ ఇక్కడ కూర్చోబెట్టి అక్కడ మేమిద్దరం పూరీలు వెయ్యాలా? లేక మొత్తం పని భారమంతా శ్రీమతికి వదిలెయ్యాలా?

ఇండియాలో ఐతే ఏమో, ఇక్కడ పూరీలాంటి టిఫిను చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

స్టవ్‌మీదున్న బూరెలమూకుడులోంచి చుక్క నూనె కూడా బయటకు చిందకూడదు.

ఎందుకంటే చెక్క నేల. దానిమీద డిజైన్లున్న ఓ తివాచీ.

ఆ రెండింటికీ మామూలు నూనే పడదు. ఇక వేడి వేడి నూనైతే, అంతే సంగతులు!

పూరీలు వెయ్యడం అయ్యేక, వంటింట్లో ఏంజరిగిందో తెలుసుకుందుకు నేలమీద చిన్న క్లూ కూడా వదలకూడదు.

ఇక గదిని నింపిన వేడి నూనె ఘుమఘుమలు పోవడానికి ఎగ్‌జాస్ట్ ఫాన్‌ని సమర్థవంతంగా వాడాలి.

అలా పూరీలు వెయ్యడం ఓ కత్తిమీద సాము.

అంతకు ఐదారేళ్ల క్రితం నా సీనియర్ కొలీగ్ కాంతారావు కూడా భార్యాసమేతంగా బెర్లిన్లోనే ఉన్నాడు. వంటింట్లో చేపలు వేయించినప్పుడూ, ఇంగువ నూనె కాచినప్పుడూ – తనూ, తన భార్యా పడిన ఇబ్బందుల్ని తరచుగా చెబుతుండేవాడాయన. వాటినప్పుడు కథలా విని వినోదించానే తప్ప, అలాంటి పరిస్థితి మాకూ వస్తుందని ఊహించలేదు.

ఎటొచ్చీ కాంతారావు దంపతులుండే ఇల్లు జర్మన్దది. ఇప్పుడు నేనుంటున్నది పోలండ్‌కు చెందిన మహిళది.

ఒలోముచ్‌కీ పోలండ్ సంప్రదాయాలకి ప్రతినిధి అనుకోను. అన్ని దేశాల్లోనూ అన్ని రకాలవారూ ఉంటారు. అలా ఈమె స్వతహాగా కొంచెం ఎడ్డి. తన పనికి అడ్డు రాకపోతే – కిచెను, బాత్రూముల గురించి అంతగా పట్టించుకోదు. అందువల్ల ఒలోముచ్‌కీతో కొంత ఫరవాలేదు కానీ, మరీ పూరీలు చేసినట్లు క్లూలు వదిలినా ఫరవాలేదనుకునేటంత కాదు.

పలు రకాల ఆలోచనలతో దేవ్‌దార్‌ని లోపలికి తీసుకెళ్లాను.

అప్పటికి శ్రీమతి పూరీ సరంజామా అంతా వంటగదికి తరలించి వచ్చింది.

''గుడ్ మార్నింగ్ సిస్టర్'' అన్నాడు దేవ్‌దార్ శ్రీమతికి చేతులు జోడిస్తూ.

భారతీయుల్లో ప్రత్యేకత అది. సిస్టర్ అన్న పదాన్ని ఉచ్చరించినప్పుడు – తోడబుట్టినవారేనన్న అనుభూతి అప్రయత్నంగా కలుగుతుంది.

శ్రీమతి మందహాసం చేసి ప్రతి నమస్కారం చేసింది.

శ్రీమతికి అటూ ఇటూ వెనుక నిలబడి తనని కుతూహలంగా చూస్తున్న పిల్లలిద్దర్నీ ముద్దుగా చూస్తూ, ''హాయ్ క్యూటీ, స్వీటీ'' అన్నాడు దేవ్‌దార్.

వాళ్లకి మేమిచ్చిన ట్రైనింగ్ ఉందిగా – వాళ్లు ముందుకొచ్చి, ''నమస్తే అంకుల్'' అన్నారు ఏకకంఠంతో.

దేవ్‌దార్ ఇద్దరికీ చెరో చాక్లెట్టూ చేతిలో పెట్టాడు.

వాళ్లు నాకేసి చూశారు. ''తీసుకోండి'' అన్నాను.

వాళ్లు తీసుకున్నారు. వెంటనే శ్రీమతికి ఇచ్చేశారు.

దేవ్‌దార్ ఆశ్చర్యపోయాడు, ''చాక్లెట్లిస్తే పిల్లలు వెంటనే పక్కకెళ్లిపోయి తినేస్తారు. కొందరైతే మన మొహంమీదే తినేస్తారు. ఇంకా – తినడానికి పెద్దల అనుమతి తీసుకునే పిల్లల్ని చూశాను. అందాకా జేబులో దాచుకునే పిల్లల్ని చూశాను. ఇలా తల్లికి ఇచ్చేసే వాళ్లని చూడ్డం ఇదే ప్రథమం. మీ ఇంట్లో పెద్దలే కాదు, పిల్లలు కూడా చాలా ఎక్కువగా క్రమశిక్షణ పాటిస్తారన్నమాట!'' అన్నాడు మెప్పుకోలుగా.

నొచ్చుకుంటారని ఇచ్చినవాళ్లకి చెప్పం కానీ, మా వాళ్లకి అప్పట్లో క్యాడ్‌బరీస్ టైపు మిల్క్ చాక్లెట్లు నచ్చక, తినేవారు కాదు. దేవ్‌దార్ మెచ్చుకుంటే – మనసులో నవ్వుకుని పైకి సంతోషం నటిస్తూ, ''థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్'' అన్నాను.

''కూర్చోండి'' అంది శ్రీమతి మేమిద్దరం ఇంకా నిలబడే ఉండడం చూసి.

ఒకటే గది. ఓ మూలగా అటువైపు మంచం.

మేము నిలబడ్డచోట తలుపుకి దగ్గర్లో మామూలు కంటే కాస్త ఎక్కువ ఎత్తున్న టీపాయ్. అదే మాకు డైనింగ్ టేబుల్ కూడా. దాని చుట్టూ నాలుగు కుర్చీలు.

దేవ్‌దార్ ఆ కుర్చీల్ని చూస్తూనే, ''జర్మనీలో ఇంతవరకూ ఎవరింట్లోనూ ఇలాంటి కుర్చీలు చూడలేదు. రాజుల కాలాన్ని గుర్తు చేస్తున్నాయి. మీ ఇంటామె ఇచ్చిందనుకుంటాను. గుడ్ టేస్ట్'' అని మెచ్చుకున్నాడు.

రాజుల కాలం అనగానే ఇక్ష్వాకుల కాలమనే ధ్వనించింది నాకు. ఎందుకంటే ఆ గదిలో ఉన్న బల్ల, కుర్చీలు, మంచం – అన్నీ కూడా పాత కాలానివి మాత్రమే కాదు, బాగా పాతబడినవి కూడా!

అవి ఇంటామె అభిరుచికి కాదు, లోభితనానికి ప్రతీకలు.

దేవ్‌దార్‌కి సూటిగా మాట్లాడ్డం అలవాటే కానీ, వ్యంగ్యోక్తులతో ఎదుటివారిని నొప్పించడం నచ్చదు. అందుకని అతడి మాటని మెప్పుకోలుగానే గ్రహించి, ''గుడ్ టేస్టే కాదు, మా ఇంటామె ఒలోముచ్‌కీది కైండ్ హార్ట్ కూడా! జర్మనీలో, అదీ బెర్లిన్లో , అదీ ఫామిలీకి – ఇంత చౌకగా ఇల్లు ఇచ్చేవారుంటారంటావా?'' అని గొంతు తగ్గించి కాస్త నెమ్మదిగానే ఒలోముచ్‌కీని పొగిడాను.

''అదేమిటీ – ఉన్నట్లుండి అంత నెమ్మదిగా మాట్లాడేవ్!'' అన్నాడు దేవ్‌దార్ ఆశ్చర్యంగా.

''తన మాట ఆ కైండ్ హార్ట్‌కి వినిపిస్తే – రాని భాషని కూడా అర్థం చేసుకుని, క్షణాలమీద అద్దె పెంచేస్తుందని భయం'' అంది శ్రీమతి. .

దేవ్‌దార్‌కి ఆ మాట అర్థమై, జీర్ణం కావడానికి కొంచెం సేపు పట్టింది. అప్పుడతడు నవ్వి, కుర్చీలో కూర్చున్నాడు. నేనూ కూర్చుని శ్రీమతినీ కూర్చోమన్నాను.

''భాయిసాబ్‌కి కాఫీ తెస్తాను'' అని శ్రీమతి తలుపు తెరుచుకుని కిచెన్లోకి వెళ్లింది.

పిల్లలిద్దరూ ఆమెననుసరించారు.

దేవ్‌దార్ ఉత్తరాదివాడైనా, టీ కంటే కాఫీనే ఎక్కువిష్టపడతాడని శ్రీమతికి చెప్పాను. అదామెకి గుర్తుంది.

వాళ్లు వెళ్లేక మేమిద్దరం మొహమొహాలు చూసుకున్నాం.

అతడికి బిడియం. నాకు స్టార్టింగ్ ట్రబుల్.

మా ఇద్దరిమధ్యా మాటలు ఊపందుకోవడానికి కాసేపు పట్టేలా ఉందని శ్రీమతి కనిపెట్టేసింది. అందుకే ఇద్దర్నీ వదిలేసింది.

ఆమె కాఫీ తెచ్చేలోగా, నేనేదో ఓ టాపిక్కుని ఊతంగా తీసుకుని – ముందుకెళ్లాలి.

నాకు బుర్ర బ్లాంక్ ఐపోయింది. అందుకని, వేరే టాపిక్ తోచక, ఒలోముచ్‌కీనే ఊతంగా తీసుకున్నాను.

ఒలోముచ్‌కీ దినచర్య చెప్పాను. అతడు విన్నాడు.

అతడామె వయసు, ఉద్యోగం అడిగాడు. చెప్పాను.

ఇద్దరికీ ఏమాత్రం ఆసక్తి లేకపోయినా – ఆమెపై అత్యంత ఆసక్తి చూపిస్తూ మాట్లాడుకుంటుంటే – నాకో అనుమానమొచ్చింది.

ఒలోముచ్‌కీ గురించి మాట్లాడుకుందుకే అతగాడిక్కడికొచ్చినట్లు నేను భావిస్తున్నానా అని.

దేవ్‌దార్ ఆమె తలిదండ్రుల గురించీ, బాల్యం గురించీ, చదివిన స్కూలు గురించీ అడిగాడు.

ఆమె పోలిష్ వనిత అని తెలుసు కానీ, ఇవన్నీ నాకు తెలియవు. దేవ్‌దార్ మా ఇంటికొచ్చి ఇవన్నీ అడిగే ఇలాంటి పరిస్థితి వస్తుందని ముందుగా తెలిస్తే, ఆమె గురించి మరింత సమాచారం సేకరించేవాణ్ణేమో!

దేవ్‌దార్‌కి కూడా ఆ సమాచారంపై అంత ఆసక్తి ఉందనుకోను. నేనో టాపిక్ తీసుకొస్తే, అందులోంచి బయటపడ్డానికి మొహమాటపడి అదే కంటిన్యూ చేస్తున్నాడు కాబోలు.

పోనీ మరో టాపిక్‌లోకి వెళ్లొచ్చు. కానీ నాకది తట్టే పరిస్థితి లేదు.

కొత్త టాపిక్ దానంతటదే రావాలి. అంతవరకూ ఒలోముచ్‌కీ చరిత్ర ప్రవాహంలో కొట్టుకుపోక తప్పదు.

ఆ సమయంలో కాఫీతో వచ్చింది శ్రీమతి.

ఆమె ఒకే కప్పు తీసుకురావడం గమనించి, ''మరి రావుకో'' అని నాలిక్కరుచుకుని, ''రావు కాఫీ, టీలు తాగడు కదూ! గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌లో వింతగా అనుకునేవాళ్లం'' అని కప్పు అందుకున్నాడు.

శ్రీమతి మందహాసం చేసి వెళ్లిపోయింది. పిల్లలిద్దర్నీ కిచెన్లో వదిలి వచ్చిందిగా – ఆదీ తన కంగారు.

శ్రీమతి పుణ్యమా అని మా టాపిక్ గ్యోతే ఇన్‌స్టిట్యూట్‌కి మారింది.

అతడు కాఫీ తాగుతుంటే, గ్యోతే ఇన్‌స్టిట్యూటులో జర్మన్ నేర్పిన టీచర్ల గురించి మాట్లాడుకున్నాం. అతడు కాఫీ కప్పు కింద పెడుతూ, ''మా అమ్మ వంటెంతో బాగా చేస్తుంది. పొరపాటున కూడా రుచి చూడదు. తనంటుందీ – రుచి చూడకుండా చేస్తేనే వంటకు అసలైన రుచి వస్తుందని. భాభీజీ కాఫీ అద్భుతంగా ఉండడానికి అదే కారణమేమో!'' అన్నాడు.

దేవ్‌దార్ సాహితీప్రియుడు. స్వతహాగా కవి. మరాఠీలో కవితలు వ్రాస్తాడు.

''మీరు తాగకపోయినా, మీ ఇంట్లో కాఫీ చాలా బాగుంది'' అన్న మాటని ఎంత బాగా చెప్పాడు!

''ఈ మాట నేరుగా మీ భాభీజీకే చెప్పు. ఎక్కువ సంతోషిస్తుంది'' అన్నాను.

అతడు వెంటనే, ''ల్యూనబర్గులో గ్యోతే ఇన్‌స్టిట్యూటు వివరాలు కూడా భాభీజీ వచ్చేక మాట్లాడుకుందాం. నీ నోట విన్న విశేషాలు, నా నోట వింటే అదో నావెల్టీ'' అన్నాడు దేవ్‌దార్.

అతడితో కలిసి ల్యూనబర్గులో నైట్‌క్లబ్బుకి వెళ్లడం గుర్తొచ్చి కొంచెం తడబడ్డాను. ఆ విశేషాలు మాట్లాడతాడా?

ఐతే దేవ్‌దార్ ఆ టైపు కాదని నాకు తెలుసు.

నేనింకా ఏదో అనేలోగానే, ''మీ పిల్లలు చాలా క్యూట్‌గా ఉన్నారు. నాకు పిల్లలంటే చాలా ఇష్టం. కానీ ఎవరైనా చూస్తుండగా మాట్లాడ్డానికి కాస్త మొహమాటం. నాకు మీవాళ్లతో మాట్లాడాలనుంది. కాసేపు వాళ్లని నా దగ్గర వదిలేస్తావా?'' అన్నాడు.

అతడి సమస్య నాకర్థమైంది.

నాక్కూడా పిల్లలంటే చాలా ఇష్టం. ఎవరూ లేకపోతే వాళ్లతో కలిసిపోయి వాళ్లలో ఒకడిగా మసలగలను. పెద్దవాళ్లెవరైనా పక్కనుంటే మాత్రం పిల్లలకంటే ఎక్కువగా నేనే బిగుసుకుపోతాను.

అవతల వంటగదిలో శ్రీమతి పూరీలు వేసే పనిలో ఉంది. మనిషి సాయముంటే తనకి సుఖం. అందులోనూ పిల్లలిద్దరూ పక్కనున్నప్పుడు నేనుండడం మరింత అవసరం.

నేను ఆఫీసుకెళ్లినప్పుడు పూరీలు వేస్తే – పిల్లల్ని బెడ్రూంలో వదిలేస్తుంది. వాళ్లు బొమ్మలతో ఆడుకుంటుండగా కిచెన్లో వంట పని చూసుకుంటుంది.

దేవ్‌దార్ ఉండడంవల్ల ఇప్పుడలా చెయ్యడానికి లేకపోయింది.

పిల్లల్ని తీసుకొచ్చి దేవ్‌దార్ దగ్గర వదిలేస్తే, నేను కిచెన్లో శ్రీమతికి వంట సాయం కూడా చెయ్యొచ్చు. తనకు తెలియకుండానే దేవ్‌దార్ నాకా వీలు కల్పించాడు.

ఐతే నాకో అనుమానం కూడా రాకపోలేదు.

శ్రీమతి ఒక్కత్తీ కిచెన్లో ఉందన్న భావంతో, కావాలనే అతడు నాకా వీలు కల్పిస్తున్నాడా?

''వద్దులే దేవ్‌దార్! మా పిల్లలకి కొత్త ఎక్కువ. వాళ్లు నీతో మాట్లాడరు. నువ్వు మాట్లాడుతుంటే, ఏడ్పు మొహం పెడతారు. నీకు కొంత బోరుగా, కొంత ఎంబరాసింగ్‌గా ఉంటుంది'' అన్నాను. దేవ్‌దార్ నవ్వి, ''చాలామంది తలిదండ్రులకి వాళ్ల పిల్లల వ్యక్తిత్వాల్ని అంచనా వెయ్యడం తెలియదు. అందుకాకారణం – వాళ్లు పిల్లల్ని పిల్లలన్న దృష్టితో చూడ్డం. నువ్వు వాళ్లని నా దగ్గర వదిలి చూడు. నా మాటలో నిజం నీక్కూడా తెలుస్తుంది. ఎటొచ్చీ కాసేపు మీవాళ్లని నాదగ్గర వదిలే ధైర్యముండాలి'' అన్నాడు.

నేను కూడా నవ్వి, ''నువ్వంత మనసు పడుతున్నప్పుడు నేనెందుకు కాదనాలి? పైగా భాభీజీ నీకోసం పూరీలు ప్లాన్ చేసింది. నువ్వు వీళ్లని ఎంగేజ్ చేస్తే, నేను తనకి సాయం చేస్తాను'' అన్నాను.

దేవ్‌దార్ మొహం అదోలా పెట్టి, ''నువ్వు చెప్పిందాంట్లో నాకు రెండు విషయాలు నచ్చలేదు. ఒకటి – మీ పిల్లల్ని ఎంగేజ్ చెయ్యడమేమిటి? వాళ్లతో కాసేపు సరదాగా గడపాలనుకుంటున్నాను. ఇటీజ్ నాట్ ప్రెషర్, ప్లెజర్! రెండు – పూరీ టిఫిన్. మనమిక్కడ సరదాగా కుర్చుని కబుర్లు చెప్పుకోవాలి కానీ, వంటల్లో టైం గడిపెయ్యకూడదు. ఏ ఉప్మాయో ఐతే ఇట్టే ఐపోతుంది కానీ, పూరీలెందుకు పెట్టుకున్నారు?'' అన్నాడు నిష్టూరంగా.

''నేను శ్రీమతికి చెప్పాను – నువ్వు పూరీలు చెయ్యడంలో ఎక్స్‌పర్ట్‌వని. ఐనా తను కూడా పూరీలే ప్లాన్ చేసింది. నీతో పోటీ పడాలని కాదు. నీకవి ఎక్కువిష్టమని!'' అన్నాను.

దేవ్‌దార్ వెంటనే, ''పూరీలకి మా కూరకంటే, మీ తెలుగువాళ్ల కూరే నాకెక్కువిష్టం. నేనన్నది పడుతున్న కష్టం గురించి....''

''నువ్వు పిల్లల్ని చూస్తూండు. మేము పూరీలు చేస్తూంటాం. నీది కష్టమైతే మాదీ కష్టం. ఇష్టమైతే మాదీ ఇష్టం'' అన్నాను.

దేవ్‌దార్ నవ్వి, ''విదేశాల్లో కూడా ఇలా ఆలోచించడం, మన భారతీయులకే చెల్లిందేమో!'' అన్నాడు.

ఆ మాట నిజం.

ల్యూనబర్గులో నటరాజన్, రామచంద్ర, దేవ్‌దార్ వగైరాల ఇళ్లలో నేను పొందిన ఆతిథ్యం గుర్తుకొచ్చి మనసు ఆర్ద్రమైంది.

వంటింట్లోకి వెళ్లేసరికి శ్రీమతి – కలిపిన పూరీ పిండిని ఉండలుగా చేస్తోంది. పిల్లలిద్దరూ మేమూ ఉండలు చేస్తామని మారాం చేస్తున్నారు.

నేను వాళ్లతో, ''అంకుల్ మీకు కథలు చెబుతారుట. రమ్మంటున్నారు'' అన్నాను.

ఇద్దరూ బిక్కమొహం వేశారు. ''నాకిప్పుడు కథలు వినాలని లేదు'' అంది పాప.

''తాత్తూయాను (నాక్కూడాను)'' అన్నాడు బాబు వెంటనే.

''అతడికి తెలుగు రాదు. వీళ్లకి ఇంగ్లీషు, హిందీ రాదు. ఏ భాషలో మాట్లాడుకుంటారు? వీళ్లనిక్కడే ఉండనివ్వండి'' అంది శ్రీమతి.

''మేము ఉండలు చెయ్యం. అమ్మని చుస్తూ నిలబడతాం. ఇక్కడే ఉంటాం'' అంది పాప.

''నేను తూదా (కూడా)'' అన్నాడు బాబు వెంటనే.

''అలాగనకూడదు. అంకుల్ మిమ్మల్ని చూసి ముచ్చట పడుతున్నారు. మీకు బోలెడు పాటలొచ్చని ఆయనకి తెలియదు. అందుకే కథలు చెబుతానన్నారు. ఒక్కసారి వెళ్లండి. మీరాయన కథలు కాదు. ఆయన మీ పాటలు వింటారు. ఒక్క నిముషం చూడండి. అలా జరక్కపోతే ఇక్కడికొచ్చెయ్యండి'' అన్నాను.

పాపకి నిజంగానే చాలా పాటలొచ్చు. తెలుగువాళ్ల వద్ద తెలుగువి, హిందీవాళ్ల వద్ద హిందీవి పాడుతుంది.

పూర్తి లిరిక్సుతో పాడ్డం తన వయసుకి పెద్ద విశేషం. అప్పటికి అలా చాలామంది మెప్పు పొందింది.

ఆ మెప్పు ఇచ్చే కిక్కుకోసం అడిగిందే తడవుగా పాట పాడి వినిపిస్తుంది.

నా ట్రిక్కు పని చేసింది. అది ''సరే'' అంటే, బాబు కూడా ''సయే'' అని దాన్ని అనుసరించాడు.

వాళ్లిద్దర్నీ దేవ్‌దార్ వద్ద వదిలి, శ్రీమతికి సాయం వెళ్లాను.

పూరీలు వేస్తుంటే ఎందుకో నూనె పొంగి కార్పెట్‌మీద పడింది.

శ్రీమతి వెంటనే స్టవ్ వేడి తగ్గించి, నన్ను బూరెలమూకుడు దగ్గర నిలబడమంది.

తనేమో వంగి వేడి వేడి ఆ నూనె ప్రభావం కార్పెట్‌ని దాటి చెక్క నేలమీద కూడా పడిందేమోనని కార్పెట్ కొంచెం తొలగించి చూస్తూ, ''చెక్కకేమీ ఐనట్లు లేదు'' అంది.

ఈలోగా స్టవ్ ఇంకా వేడిమీదుందేమో, నూనె మళ్లీ పొంగేలా కనబడింది. నేను కంగారు పడి పట్టకారుతో బూరెల మూకుణ్ణి పట్టుకుని పైకి లేపాను. నూనె సెగ అరచేతికి తగిలి కొంచెం మండింది. వంటగట్టుమీద పెడదామంటే – అక్కడ సరంజామా అంతా పరిచి ఉంది. ఎక్కడా చోటు లేదు.

ఇండియాలో అలవాట్లు ఎక్కిడికి పోతాయి?

చటుక్కున బూరెల మూకుణ్ణి కార్పెట్ ఎత్తిన చెక్కనేలమీద పెట్టేశాను.

''ఏంటి మీరు చేసింది?'' అంటూ శ్రీమతి తన చీర కొంగుని మడతలు పెట్టి కాస్త దట్టం చేసి, దాంతో మూకుణ్ణి ఎత్తి పట్టుకుని స్టవ్‌మీద పెట్టి స్టవ్ కట్టేసింది.

జరిగింది గ్రహించగానే, ఒక్కసారిగా గుండె గుభేల్మంది.

ఇలాంటి విషయాల్లో జర్మనీలో ఇంటిని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో, నా సీనియర్ కొలీగ్ కాంతారావు చెప్పిన జాగ్రత్తల్ని మర్చిపోయినందుకు నన్ను నేనే తిట్టుకోసాగాను.

నేను అప్పెట్టయ్యానని గ్రహించిందేమో, ''కంగారు పడకండి. కార్పెట్‌మీద నూనె వలికిందంతే! అది కొంచెం డిటర్జెంటు వేసి క్లీన్ చేద్దాం. ఇక నేలమీద మీరు పెట్టిన బూరెల మూకుడుకి నేల కాలేదే కానీ, నేను వెంటనే తీసేసేగా! దాంతో నల్లటి మచ్చ పడిందంతే! గుడ్డతో తుడిచేస్తే పోతుంది. ఇకమీదట ఇలా జరక్కుండా ఎక్కువ జాగ్రత్తగా ఉందాం'' అని శ్రీమతి నాకు కొంత ఉపశమనం కలిగించింది.

నాకింకా కాళ్లూ చేతులూ ఆడ్డం లేదు. ఈలోగా శ్రీమతి కార్పెట్‌ని ఆ కాస్తమేరా డిటర్జెంటుతో కడిగి నూనె జిడ్డుని వదిల్చింది. చెక్కనేలమీద గుడ్డతో తుడిచి నల్ల మచ్చ పోగొట్టింది.

తర్వాత నేను పూరీలొత్తి ఇస్తుంటే, తను చకచకా పూరీలు వేసింది.

ఒకటా రెండా ఏకంగా నలభైరెండు పూరీలు.

మామూలుగా మేము మనిషికి నాలుగుకంటే తినలేం. బయటి మనిషి అదనంగా ఒక్కరొచ్చినా సరే, శ్రీమతి గణాంకాలు మారిపోతాయి.

''వాళ్లు తింటానంటే వద్దనకూడదు. వద్దనేదాకా పెట్టాలి'' అన్నది ఆమె సిద్ధాంతం. అంటే ఇప్పుడు మేము ఒక్క దేవ్‌దార్ కోసం కనీసం ఇరవైఆరు పూరీలు అదనంగా వేశాం.

పనులయ్యేక, ఎందుకైనా మంచిదని, ఇంకోసారి కార్పెట్ ఎత్తి చూశాను. అక్కడ చాలా పెద్ద నల్ల మచ్చ కనిపించింది.

హడిలిపోయాను, ''నన్ను ఓదార్చడానికి మాయ మాటలు చెప్పావ్ కానీ, మచ్చ అలాగే ఉంది. నా జీవితానికే మాయని ఈ మచ్చ, ఇంత పెద్దదిగా ఉండడం చాలా బాధగా ఉంది. ఏమైతే అయింది – జరిగింది ఒలోముచ్‌కీకి చెప్పేస్తాను. తనే శిక్ష విధించినా భరిస్తాను'' అన్నాను.

''మహానుభావా! మీరు చేసిన మచ్చ నిజంగానే పోయింది. ఇప్పుడు మీరు చూసిన ఆ మచ్చ పాతది. కార్పెట్ మొత్తం ఎత్తి చూడండి. నేలమీద నల్లని మచ్చలు ఆరేడు దాకా ఉన్నాయి. వాటిని – మనకి ముందున్నవారు చేశారో లేక ఒలోముచ్‌కీయే చేసిందో, ఆ దేవుడికే ఎరుక! ఆ మచ్చలు చూసేక నాలో అపరాధభావం పోవడమే కాదు, ధైర్యం కూడా వచ్చింది. అలాగని ఈ రోజు నేర్చుకున్న పాఠం మాత్రం మర్చిపోన్లెండి. ఈ నూనె ఎందుకు పొంగిందో, మళ్లీ పొంగకుండా ఏంచెయ్యాలో అధ్యయనం చేస్తాను. ఆఫీసులో మీరు, ఇంట్లో నేను – రీసెర్చి అన్న మాట!'' అంది శ్రీమతి వాతావరణాన్ని తేలిక చేస్తూ.

తర్వాత శ్రీమతి రీసెర్చిలో బయటపడిందేమిటంటే – కాస్త చవగ్గా ఉందని మేము కొన్న కొత్త నూనెకి ఇలా పొంగే గుణముంది. దాన్ని పూరీలు, గారెలు వగైరా వేయించే వంటకాలకి వాడకూడదు. కూరలకి, పోపులకి, ఊరగాయలకి వాడుకోవచ్చు.

ఏదేమైతేనేం, అనుకున్నకంటే పూరీలకి కాస్త ఎక్కువ టైం పట్టింది. అవతల పిల్లలు దేవ్‌దార్‌కి ఎంత బోరు కొట్టిస్తున్నారోనని కలవరపడుతూ – మా బెడ్రూం కమ్ డ్రాయింగ్ రూంకి వెళ్లాం.

అక్కడ మేము చూసిన సన్నివేశం మా ఊహకందనిది....

దేవ్‌దార్ తలని పైకీ కిందకీ తమాషాగా కదుపుతూ – 'కుక్కుక్ కుక్కుక్' అన్నాడు.

పిల్లలిద్దరూ అతణ్ణే చూస్తూ కిల కిల నవ్వుతూ, 'మళ్లీ' అన్నారు.

దేవ్‌దార్ మళ్లీ అలాగే తలని పైకీ కిందకీ తమాషాగా కదుపుతూ – 'కుక్కుక్ కుక్కుక్' అన్నాడు.

పిల్లలు, 'మళ్లీ' అన్నారు.

అలా రెండు మూడుసార్లు జరిగేక దేవ్‌దార్ గుమ్మంలో ఉన్న మమ్మల్ని చూసి, 'కుక్కుక్ కు...' అని సగంలో ఆపేశాడు.

అప్పుడు పిల్లలు కూడా మమ్మల్ని చూశారు.

పాప వెంటనే, ''ప్లీజ్ అంకుల్, మా అమ్మకీ నాన్నగారికీ కూడా చెప్పండి'' అంది.

దేవ్‌దార్ మొహమాటపడ్డాడు. అది గ్రహించిన నేను, "అంకుల్ని అలా సతాయించకూడదు. తప్పు'' అన్నాను.

పాప మొహం ముడుచుకుంది.

దేవ్‌దార్ పాప భుజం తట్టి, "ఓకే, డోన్ట్ వర్రీ! ఐ విల్ టెల్ యువర్ మమ్మీ అండ్ డాడీ ఆల్సో'' అన్నాడు.

పాప మొహం వికసించింది.

విషయం అర్థం కాక, "వాళ్లు చెప్పమనడం, నువ్వు చెబుతాననడం, ఏం జరుగుతోంది మీమధ్య?'' అన్నాను.

"ఏంలేదు రావ్! మీవాళ్లకి కుక్కూ ఊర్ గురించి చెప్పాను. వాళ్లకి చాలా నచ్చింది'' అన్నాడు దేవ్‌దార్.

కుక్కూ అంటే కోయిల. ఊర్ అంటే గడియారం.

జర్మనీలో తయారయ్యే గడియారాల్లో కుక్కూ ఊర్ ఒక ప్రత్యేక ఆకర్షణ.

సాధారణంగా ఈ గడియారాలు యూరప్‌లోని ఇళ్ల ఆకారంలో ఉంటాయి. క్రింద లోలకం ఊగుతూంటుంది. పైన గడియారం తిరుగుతుంటుంది. ఆపైన చిన్న గూడు. దానికో తలుపు. అది గంటకోసారి తెరుచుకుంటుంది. అందులోంచి ఓ పక్షిబొమ్మ బైటకొచ్చి, తల పైకీ కిందకీ ఆడిస్తూ, 'కుక్కుక్ కుక్కుక్' అని మధురస్వనం వినిపించి లోపలకు వెడుతుంది. వెంటనే తలుపు మూసుకుంటుంది.

ఇండియాలో హైదరాబాదులో సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణగా ఇలాంటి గడియారమే కాస్త పెద్ద సైజుది ఉంది. అందులో గంటకోసారి తలుపు తెరుచుకుని ఓ మనిషిబొమ్మ బయటికొచ్చి – అప్పుడు టైమెంతయితే అన్ని గంటలు కొట్టి మళ్లీ లోపలకు వెళ్లిపోతుంది.

సాలార్‌జంగ్ మ్యూజియానికి వెళ్లినవాళ్లు – ఈ గడియారాన్ని చూడకుండా వెళ్లరు.

కొందరైతే కేవలం ఈ గడియారాన్ని చూడ్డానికే అక్కడికి వెడతారు.

ఈ గడియారాన్ని ప్రదర్శించే హాల్లో మధ్యాహ్నం పన్నెండు అయ్యే సమయానికి జనం క్రిక్కిరిసి ఉంటారు. బొమ్మ ఎక్కువ గంటలు కొడుతుంది కదా – అందుకని!

కుక్కూ ఊర్ గురించి ల్యూనబర్గులో జర్మన్ భాష నేర్చుకుంటున్న సమయంలో విన్నాం.

మన దేశంలో ఓ గొప్ప మ్యూజియానికి మాత్రమే పరిమితం అనుకున్న అలాంటి గడియారం, ఇక్కడ ఇంటింటా అలంకరించుకునేందుకు వీలుగా లభ్యమౌతోందని ఆశ్చర్యంగా అనుకున్నాం.

నాకు ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్సుమీదా, పిల్లల బొమ్మలమీదా ఉన్నంత ఆసక్తి – ఇలాంటి గృహాలంకార ఉపకరణాలపై లేకపోవడం వల్లనేమో – ఇంట్లో ఇంతవరకూ కుక్కూ ఊర్ ప్రస్తావన తేలేదు.

దేవ్‌దార్ కుక్కూ ఊర్ కొన్నాట్ట.

పిల్లలకు దాని గురించి చెబుతూ, అదెలా పని చేస్తుందో చెబుతున్న సమయంలో మేమక్కడికి వెళ్లాం.

అతడు చెప్పే విధానం పిల్లలకి నచ్చింది. మాక్కూడా చెప్పమంటున్నారు.

"అంకుల్ – మీరింకా చెప్పడం లేదు'' అంది పాప.

"కుక్కుక్... కుక్కుక్...'' అన్నాడు దేవ్‌దార్ – అచ్చం కోయిల కూసినట్లే.

ఒక ప్రొఫెసర్ అలా కూస్తుంటే నవ్వొచ్చింది. ఆపుకున్నాను.

"మళ్లీ'' అంది పాప.

"కుక్కుక్... కుక్కుక్...'' అన్నాడు దేవ్‌దార్ మళ్లీ.

శ్రీమతి చటుక్కున వెనక్కి తిరిగి, వంటింటివైపు వెళ్లింది. నవ్వాపుకోలేకే తనా పని చేసిందనిపించింది.

"మయ్యా'' అన్నాడు బాబు.

"కుక్కుక్... కుక్కుక్...'' అన్నాడు దేవ్‌దార్ మళ్లీ.

"మళ్లీ'' అంది పాప.

"ఇక చాల్లే – అంకుల్నలా ఇబ్బంది పెట్టకూడదు'' అని పాపని మందలించాను.

"ఇబ్బందా, నాకా? కుక్కూ ఊర్ కొని ఇంట్లో మొదటిసారి ఆ కూత విన్నప్పుడు కూడా నాకింత ఆనందం కలుగలేదు. వాళ్లు అడుగుతున్నారని నువ్వనుకుంటున్నావ్ కానీ, అడక్కుండానే వాళ్లకు మళ్లీ మళ్లీ చెప్పాలని నాకనిపిస్తోంది'' అన్నాడు దేవ్‌దార్.

అప్పుడతడి మొహం చూస్తే – మా పిల్లలిద్దరి పక్కనా తనూ ఓ పిల్లాడిలా ఉన్నాడు.

"ఇంతకీ నువ్వు మావాళ్లతో ఎలా కమ్యూనికేట్ చేశావు?'' అన్నాడు.

దేవ్‌దార్ నవ్వి, "భాష పెద్దలకోసం. పిల్లలకి భాషతో నిమిత్తం లేదు. అందుకే పుట్టుకతోనే – కళ్లు, ముక్కు, చెవులు వగైరాలన్నీ ఇచ్చిన దేవుడు మనిషికి భాషని మాత్రం ఇవ్వలేదు. ఒకసారి తన అవయవాలన్నీ సక్రమంగా పని చెయ్యడం మొదలెట్టేక మనిషి భాషని నేర్చుకుంటాడు. మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడమనేది భాషతోనే మొదలౌతుంది'' అన్నాడు దేవ్‌దార్.

అతడు భావుకుడు. ఆలోచనాపరుడు.

అతడప్పుడన్న మాటలు చాలా లోతైనవి.

పిల్లలకు జాతి, మత, కుల, భాషా భేదాలు తెలియవు. మనిషిని మనిషిగానే చూస్తారు. పిల్లలందరూ ఎప్పటికీ పిల్లలుగానే ఉండిపోయే ప్రపంచమొకటి ఎక్కడైనా ఉంటే ఎంతా బాగుణ్ణు?

ఈలోగా శ్రీమతి ప్లేట్లు తీసుకునొచ్చింది.

ఆమె ముందు మాకు వడ్డిస్తానంటే దేవ్‌దార్ ఒప్పుకోలేదు.

అంతా కలిసే తిందామంటూ అక్కణ్ణించి తన వంతు సాయం చేశాడు.

టిఫిన్ తింటున్నప్పుడు చెప్పాడు దేవ్‌దార్.

అతడికి పిల్లలంటే చాలా ఇష్టమట. జర్మనీలో తనున్నచోట ఎవరింటికైనా వెడితే, ఎక్కువ సమయం పిల్లలతోనే గడుపుతాట్ట.

వాళ్లలో ఎక్కువమంది హిందీవాళ్లు.

అక్కడ తెలుగువాళ్లు ఒకరిద్దరున్నారు కానీ, వాళ్లు పిల్లల్ని ఇండియాలో వదిలి వచ్చారు.

మా ఇంటికొస్తున్నప్పుడు మా పిల్లలతో మాట్లాడ్డంకోసమని, ఆ తెలుగువాళ్ల దగ్గర కొన్ని పడికట్టు పదాలు నేర్చుకునొచ్చేట్ట. దాంతో మావాళ్లతో వ్యవహరించడం అతడికి సులభమైపోయింది.

దేవ్‌దార్ ఫలహారాన్ని మెచ్చుకున్నాడు. మా పిల్లల్ని మెచ్చుకున్నాడు.

మా జంటని కూడా మెచ్చుకుని, "పెళ్లి విషయంలో బాగా ఆలస్యం చేశానని మిమ్మల్ని చూసేక అనిపిస్తోంది నాకు. ఇండియాకు తిరిగి వెళ్లగానే, పెళ్లి చేసుకుంటానని మా వాళ్లకి రేపే ఉత్తరం వ్రాసేస్తాను'' అన్నాడు.

కాంప్లిమెంటు ఇవ్వడంలో ఒకొక్కరిది ఒకో పద్ధతి – అనుకున్నాను.

ఓ గంట కూర్చుని వెళ్లిపోదామనుకున్నవాడు – సుమారు నాలుగు గంటలున్నాడు. బై చెప్పేటప్పుడు టైం చూసుకునేదాకా ఆ విషయం మాకూ తెలియలేదు.

పిల్లలైతే అతడికి బాగా చేరికయ్యారు. అతడు వెళ్లిపోతుంటే – "అంకుల్ మళ్లీ రండి'' అంది పాప.

"మయ్యా లంది'' అన్నాడు బాబు.

దేవ్‌దార్ ఇద్దర్నీ దగ్గరగా తీసుకుని గట్టిగా హత్తుకుని వదిలాడు. అతడి కళ్లలో కొద్దిగా నీళ్లు.

ఆ నీళ్లెందుకో నాకు తెలుసు.

ప్రస్తుతం జర్మనీలో మేముంటున్నది వేర్వేరు ప్రాంతాల్లో.

ఇండియా వెడితే – అతడు స్థిరపడ్డది మహారాష్ట్రలో. నేను ఒరిస్సాలో.

మేము పని చేసే సంస్థలు వేరు.

మేమిద్దరం రైల్లో కలిసిన ప్రయాణీకుల వంటివాళ్లం. విడిపోయేక మళ్లీ కలిసే అవకాశాలు తక్కువ.

పిల్లలు మళ్లీ రమ్మన్నప్పుడు – నాకులాగే అతడికీ ఆ విషయం స్ఫురించినట్లుంది.

గుమ్మం దాటి మెట్లు దిగి రోడ్డుదాకా వెళ్లి అతణ్ణి సాగనంపి వచ్చేక శ్రీమతి నాతో, "వెళ్లేముందు ఒక్కసారి అతణ్ణి కుక్కుక్ కుక్కుక్ అనమనాలనిపించింది. బాగుండదని ఊరుకున్నాను'' అంది. కానీ ఇంట్లోకి వెళ్లేక మా ఇద్దరికీ కూడా కాసేపు "కుక్కుక్... కుక్కుక్...'' అన్న మధురస్వనం చెవులను తడుతూనే ఉంది.

పిల్లల్ని అలరించడానికి అతడు ప్రత్యేకంగా అభ్యసించిన మధురస్వనమది.

అంత తేలికగా ఆ స్మృతులు మమ్మల్ని వీడునా?

ఆ తర్వాత దేవ్‌దార్‌ని మళ్లీ కలుసుకోలేదు.

కానీ అతణ్ణి తల్చుకున్నప్పుడల్లా ఆ మధురస్వనం, అతడు పక్కనే ఉన్నాడా అనిపించేటంత స్పష్టంగా వినిపిస్తూంటుంది....

ఆ తర్వాత ల్యూనబర్గులో భాషాధ్యయన మిత్రుల్లో బెర్లిన్ వచ్చినవారిలో నటరాజన్, రామచంద్ర ఉన్నారు.

నటరాజన్ అవివాహితుడు.

ల్యూనబర్గులో క్రిస్టాలూథర్ ప్రత్యేకంగా ఆహ్వానించే విదేశీబృందంలో నాతోపాటు అతడూ ఒకడు.

నటరాజన్‌కి టైపింగ్ బాగా వచ్చు. జర్మనీలో అతణ్ణి ఆకర్షించినవాటిలో ఎలక్ట్రిక్ టైపురైటరు ఒకటి.

అతడు చెప్పేదాకా నాకు దాని విశిష్టత తెలియదు. తర్వాత అక్కడి లాబ్‌లో అది వాడినా దాని విశిష్టతని అంతగా పట్టించుకోలేదు.

అందులో మనం టైపు చేసిన వాక్యాల్ని రికార్డు చేసుకుని సరి చేసుకోవచ్చు. కీబోర్డుని మెత్తగా తాకినా, గట్టిగా నొక్కినా అక్షరం ఒక్కలాగే పడుతుంది.

తను బెర్లిన్ వచ్చేముందు – నాకుత్తరం వ్రాశాడు.

తనో ఎలక్ట్రిక్ టైపు రైటరు కొనిస్తే దాన్ని ఇండియాకి తీసుకెళ్లే నా సామాన్లలో కలుపుకోగలనా అని.

విమానంలో ఒక టికెట్‌కి పెట్టెల బరువు ఇన్ని కేజీలనీ, కూడా ఉంచుకునే చేతి సామాను బరువు ఇన్ని కేజీలనీ పరిమితి ఉంటుంది. అదనపు బరువుకి కేజీకింత అని వసూలు చేసే రుసుము చాలా ఎక్కువ. అందుకని అదనపు బరువు లేకుండా చూసుకోవడం విమాన ప్రయాణీకులు తీసుకునే జాగ్రత్తల్లో ముఖ్యమైనది.

నటరాజన్ ఒక్కడు. నేను, శ్రీమతి, ఇద్దరు పిల్లలు కలిపి మావి నాలుగు టికెట్లు కాబట్టి – మేము నాలుగు రెట్లు ఎక్కువ బరువును కూడా తీసుకెళ్లొచ్చు. అందుకని నటరాజన్ ఈ విషయంలో మా సాయం కోరాడు. ఐతే ఎంత చెట్టుకి అంత గాలి అన్నట్లు, మావద్ద మా టికెట్లకి తగ్గ సామానుండొచ్చు కాబట్టి, నాకు వీలేనా అని మర్యాదగా అడుగుతూ ఉత్తరం వ్రాశాడతడు.

మాది అటూ ఇటూ కూడా పెద్ద కుటుంబం. అది కాక – భువనేశ్వర్లో మిత్రులున్నారు. అందుకని వెళ్లేటప్పుడు చాలామందికి రకరకాల కానుకలు తీసుకెళ్లే ఉద్దేశ్యంలో ఉన్నాం. ఇక కొత్తగా విదేశానికి వచ్చాం కాబట్టి మాకోసమూ ఎన్నో కొన్నాం. ఇంకా కొనబోతున్నాం. ప్రయాణానికి ఉన్న బరువు పరిమితులవల్ల వాటిలో కొన్ని ఇక్కడ వదిలేయాలని ఉసూరుమంటోంది. ఇక ఇతరుల బరువుల బాధ్యత తీసుకునే ప్రసక్తి ఏముంది?

ఐతే అడిగినవాడు నటరాజన్. ల్యూనబర్గులో ఉండగా అతడికి ఎంతో ఋణపడ్డానన్న భావన నాకుంది. మళ్లీ అతడూ, మేమూ కలుసుకునే అవకాశముందో లేదో!

ఋణం తీర్చుకుందుకు ఇదో చిన్న అవకాశంగా భావించాను.

మరో మాటనకుండా – మాకు వీలేనని బదులిచ్చాను.

నటరాజన్ మా ఇంటికొచ్చినప్పుడు టైపురైటరు తెచ్చిచ్చాడు.

"ఇలాంటి విషయాల్లో చాలామంది నిర్మొహమాటంగా ఉంటారు. నీకు మొహమాటమెక్కువని తెలిసి కూడా నేను నిర్మొహమాటంగా ఈ బరువు నీకు అంటగడుతున్నాను. నువ్వు కాదంటే ఏమాత్రం అపార్థం చేసుకునేవాణ్ణి కాదు కానీ, ఔనన్నందుకు చాలా సంతోషించాను. ఎందుకంటే – నాకు బాగా తెలిసినవాళ్లూ – మా ఊరివాళ్లూ (అంటే నాగపూర్) – కూడా వేరే బరువులు లేనివాళ్లూ – ఇద్దరు ముగ్గుర్ని ఈ విషయమై కదిపి చూశాను. కస్టమ్సు డ్యూటీ ఎంత పడితే అంతా నేనిచ్చుకుంటానని హామీ కూడా ఇచ్చాను. ఐనా వాళ్లొప్పుకోలేదు. నువ్వొప్పుకున్నావు'' అని నన్ను చాలా మెచ్చుకున్నాడు.

నిజానికి నేనతడికి ఋణగ్రస్థుణ్ణి. అతడేమో నేను తనకి ఫేవర్ చేస్తున్నానంటున్నాడు.

అది అతడి సంస్కారం, మర్యాద!

నటరాజన్ అసలు సిసలు భారతీయుడు. కావడానికి తమిళుడైనా హిందీ, మరాఠీల్లో నిష్ణాతుడు. అతడికి నాగపూర్ మాతృభూమిలా అనిపిస్తుంది.

అతడు మా ఇంటికొచ్చినప్పుడు బాగా దగ్గర చుట్టం మా వచ్చినట్లు అనిపించింది.

అతడు మా ఇంట్లో గడిపిన రెండు గంటలూ రెండు క్షణాల్లా గడిచిపోయాయి. గ్యోతే ఇన్‌స్టిట్యూట్లో కొన్ని సంఘటనల్ని గుర్తు చేసుకోవడం మధురంగా అనిపించింది.

వద్దంటున్నా వినకుండా అతగాడు నాకు కస్టమ్సు డ్యూటీకని మార్కుల్లో కొంత కరెన్సీ ఇచ్చి వెళ్లాడు.

బెర్లిన్ వచ్చిన మరో ల్యూనబర్గు మిత్రుడు రామచంద్ర. అక్కడుండగా నాకు ఇంటివంటని రుచి చూపించిన మహానుభావుడు. ప్రతి విషయంలోనూ తనే ముందున్నట్లు గుర్తింపు పొందాలనే తాపత్రయంతోనే ఐనా – ఎందరికో ఎన్నో చేసిన మంచివాడు. అతడివల్ల ప్రయోజనం పొందుతూనే, అతడి తాపత్రయాన్ని నిరసించినవారు కొందరున్నారు. నాకు మాత్రం, అతడక్కడ మంచి తమ్ముడు.

రామచంద్రకి కొత్తగా పెళ్లయింది.

లాంగ్వేజి కోర్సు అవగానే అతగాడు తనుండే గ్యోటింగన్‌కి భార్యని రప్పించుకున్నాడు.

ఈడూజోడూ కుదిరింది. చిలకా గోరింకల్లా చూడముచ్చటగా ఉన్న జంట.

కన్నడం వారైనా ఇద్దరూ తెలుగు బాగానే మాట్లాడతారు. దాంతో శ్రీమతికీ, పిల్లలకీ వాళ్లతో కాలక్షేపానికి ఇబ్బంది లేకపోయింది. అందువల్ల నేనూ, రామచంద్ర – గతించిన ఎన్నో అనుభవాల్ని పునశ్చరణ చేసుకున్నాం.

రామచంద్ర తనున్నచోట ఎందరికి ఎలా ఉపయోగపడ్డాడో చెప్పాడు.

ఆ విషయంలో నేను మంచి శ్రోతను కావడం అతడి ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.

ఆ టాపిక్‌నుంచి మళ్లించడానికి – "కొత్త జంట. కొత్త దేశం. రమ్యమైన వాతావరణం. కొత్త కాపురం ఎలాగుంది?'' అనడిగాను.

అప్పుడు రామచంద్రలో కొత్త ఉత్సాహం చూసాను. "రావుగారూ! మీకు నిజం చెప్పాలి. మా ఇంట్లో పాతకాలపు ఆచారాలదే ప్రాధాన్యం. పెళ్లయ్యేక మాకు ఏకాంతం కావాలంటే రాత్రి భోజనాలయ్యేదాకా ఆగాల్సిందే. అందుకు బాధపడ్డ సందర్భాలూ లేవు. నలుగురితోపాటు నారాయణా అన్నట్లు – అదంతా మామూలుగానే అనిపించేది. ఇండియాలో ఉండగా హనీమూన్ గురించిన ఆలోచనే రాలేదు. ఇక్కడికొచ్చేక నాకు హనీమూన్ కొచ్చినట్లే ఉంది. ఇలాంటి అదృష్టం మీకెవరికీ కలిగుండదు'' అన్నాడతడు.

అన్ని విషయాల్లోనూ తనూ, తన అనుభవాలూ మిగతావాళ్లకి భిన్నంగా ప్రత్యేకమని అనుకుంటాడు రామచంద్ర. అదే అతడిలో ప్రత్యేకత!

ఐతే నా అదృష్టం విషయంలో అతడన్న మాటతో నేను పూర్తిగా ఏకీభవించలేను.

మాకు పెళ్లయి కాపురం పెట్టేక, ఇంచుమించు వెంటనే ఉద్యోగంలో చేరాను. ఆఫీసిచ్చిన మూడు గదుల క్వార్టర్సులో నాలుగు పంఖాలున్నాయి. షవరున్న బాత్రూం. మిగతా ఇల్లు కూడా బాగా విశాలం.

అంతింటికీ మేమిద్దరమే. అక్కడ మాకు దొరికిన స్వేచ్ఛ మధురాతి మధురం.

ఆ విషయం రామచంద్రకు చెప్పడంవల్ల – అతడి ఉత్సాహం మీద నీళ్లు చల్లడం మినహా మరో ప్రయోజనం ఉండదనిపించింది. "మా అదృష్టాన్ని అంచనా వేసుకుందుకు ముందు నీ అనుభవాలు చెప్పు'' అన్నాను.

నేనది మామూలుగా మాటవరసకన్నట్లు అన్నాను కానీ రామచంద్ర – చాలా సీరియస్‌గా బదులిచ్చాడు.

"అందమైన ఇల్లు. ఆ ఇంట్లో మేమిద్దరమే. సినిమా సెటింగ్‌లా బెడ్రూం. బాత్రూంలో షవరు, టబ్బు. ఏంచెప్పను? రొమాంటిక్ ఫిల్మ్ షూటింగులా ఉంది మా దాంపత్య జీవితం'' అన్నాడు రామచంద్ర.

అతడు తమ అనుభవాలు కాస్త వివరంగానే చెప్పినా – ఆ రొమాంటిక్ దృశ్యాలు విశ్వనాథ్ దర్శకత్వంలో షూటింగు పరిధికి లోబడే ఉన్నాయి.

చెబుతుంటే రామచంద్ర కళ్లలో మెరుపులు.

అప్పుడు నాకనిపించింది.

మనం ఉమ్మడి కుటుంబాల గొప్పతనం గురించి చాలా ఎక్కువగా చెప్పుకుంటాం.

కొత్తగా పెళ్లయినవారికి ఉమ్మడి కుటుంబాల్లో ఏకాంతం దొరకొచ్చు కానీ – ఆ వయసుకి అవసరమైన స్వేచ్ఛ దొరకదు. అది ఎంత పెద్ద లోటో, ఇప్పుడు రామచంద్ర కళ్లలో మెరుపు చూస్తే ఊహించొచ్చు.

నా చిన్నతనంలో చాలా పెళ్లిళ్లు చూశాను. ఉమ్మడి కుటుంబాల్లో ఉంటున్నప్పుడు – కొత్తగా పెళ్లయినవారు, వేరు కాపురం పెడతామంటే, అదేదో పెద్ద తప్పు అన్నట్లు జరిగే చర్చలు విన్నాను.

అలాంటి జంటలమీద నాకూ దురభిప్రాయముండేది.

రామచంద్ర కళ్లలో మెరుపు చూసేక – వాళ్లకెలాంటి అన్యాయం జరిగిందో స్ఫురించింది. కాస్త ఆలస్యంగానే ఐనా ఆ రోజు వాళ్లమీద జాలి పడ్డాను.

రామచంద్ర దంపతులు ఉదయమే వచ్చారు. వాళ్లకి ఉప్మా టిఫిను. అందులోకి ఆట్టే కారం లేకుండా చట్నీ. అతడు కాఫీ ప్రియుడు కాబట్టి వాళ్లిద్దరికీ కాఫీ.

ఆ కాఫీ తాగుతూ రామచంద్ర ల్యూనబర్గులో ఎడుషో కాఫీని గుర్తు చేసుకున్నాడు.

క్లాసులున్నప్పుడు సాయంత్రాలు కాఫీ కోసం తరచుగా ఎడుషో పేరిట ఉన్న షాపుకి వెళ్లేవాడు. అతడితోపాటు మరో కొలీగ్ సుబ్రహ్మణ్యం వచ్చేవాడు. కాఫీ తాగకపోయినా నేనూ వెళ్లి కంపెనీ ఇచ్చేవాణ్ణి.

మామూలుగా హొటళ్లలో ఐదు మార్కులుండే కాఫీ అక్కడ యాభై ఫెన్నిగ్సుకే దొరికేది.

ఆ షాపుని కనుగొన్న ఘనత తనదేనని రామచంద్ర గొప్పగా చెప్పుకునేవాడు. సుబ్రహ్మణ్యం ఒప్పుకునేవాడు కాదు. పైగా, "నువ్వొచ్చేదాకా ఇక్కడీ షాపు ఉన్నట్లు ఈ ఊరివాళ్లకే తెలియదుట. అమెరికాకి కొలంబసు – ఎడుషోకి రామచంద్ర!" అనేవాడు వ్యంగ్యంగా.

ఇచ్చింది కాంప్లిమెంటయితే – అది వ్యంగ్యమైనా ఫరవాలేదనేవాడు రామచంద్ర.

ఎడుషో గురించి సుబ్రహ్మణ్యం తనకిచ్చిన కాంప్లిమెంటుని కూడా ఇప్పుడు నా శ్రీమతికి గొప్పగా చెప్పాడు.

మేము రామచంద్రకు ఉప్మా టిఫిను మాత్రమే చెయ్యడానికి కారణముంది.

అతడు మా ఇంట్లో గడపడానికి పూర్తిగా ఓ రోజు కేయించాడు.

అతగాడి పాకప్రావీణ్యం, ముఖ్యంగా వంకాయ–పాప్రికా (సిమ్లామిర్చి) కూర విషయం శ్రీమతికి తెలుసు.

బెర్లిన్ వస్తున్నట్లు అతడు నాకు తెలియబర్చినప్పుడు – ఆ కూరని ప్రస్తావించి, "నీ పుణ్యమా అని ఇక్కడ ఓ కొత్త వంటకాన్ని ఎంజాయ్ చేస్తున్నాం. నువ్వు చెప్పిన విధానాన్నే తూచా తప్పకుండా అనుసరిస్తున్నాం కానీ – ఆనాటి రుచి మాత్రం రావడం లేదు" అని ఉత్తరంలో వ్రాశాను.

దానికతడు వెంటనే, "కాగితంమీద ఎంత పెట్టినా, ఏదో వివరం మిస్సవుతూనే ఉంటుంది. మీ ఇంట్లో భోంచేస్తానుగా – అప్పుడా కూర, సాంబారు నేనే చేస్తాను. పక్కనుండి చూస్తుంటే సులువులు తెలుస్తాయి" అని బదులిచ్చాడు.

''రామచంద్రకు వంట చెయ్యడం సరదా కావచ్చు. కానీ మనింటికొచ్చి, తనే వంట చేసి, ఆ వంటతోనే ఆతిథ్యం స్వీకరించాలనుకునే ఔదార్యం అరుదైనది, అభినందనీయం. కానీ మనకది మర్యాద కాదు. అతడలా వ్రాసినా మన వంటలు మనం చేసి ఆతిథ్యమిద్దాం'' అని శ్రీమతికి చెప్పాను.

ఇంటికొచ్చినవాళ్లు తమ వంట తినాలి కానీ, వాళ్లచేత వండించడమేమిటీ అని ఇంటి దీపాలు అనుకోవడం సాధారణం. అందుకని శ్రీమతి నేనిచ్చిన సూచనని మెచ్చుకుంటుందనుకున్నాను.

కానీ ఆశ్చర్యంగా తను ఒప్పుకోలేదు, ''వంటొచ్చిన మగాణ్ణి మన వంటలతో మెప్పించలేమని మా నాన్నగారనేవారు. అతణ్ణే చెయ్యనిద్దాం. మనం నేర్చుకున్నట్లూ ఉంటుంది. అతడికేమో మనకేదో నేర్పానన్న తృప్తీ ఉంటుంది'' అంది.

ఇలాంటి విషయాలు చాలా లోతుగా ఆలోచిస్తుంది తను.

నేను రామచంద్ర గురించి తనకి పలుమార్లు పలు విశేషాలు చెప్పాను. వాటన్నింటినీ ఆకళింపు చేసుకుని రామచంద్ర మనస్తత్వాన్ని పట్టేసినట్లుంది. తను వంట చేసి మెప్పించడం కంటే, అతణ్ణి వంట చెయ్యనివ్వడమే – అతడికి ఎక్కువ సంతోషాన్నిస్తుందని ఆమె గ్రహించింది.

టిఫినవగానే – రామచంద్ర దంపతులు, శ్రీమతి వంటింట్లోకి వెళ్లిపోయారు.

''మా ఆయన అసలు సిసలు సైంటిస్టు. ఆఫీసుకి వెడితే లాబరేటరీ. ఇంట్లో వంటిల్లు. ప్రయోగాలే ప్రయోగాలు'' అందిట శ్రీమతి రామచంద్ర – వంటింట్లో అతడి ఉత్సాహానికి భాష్యం చెబుతూ.

ఆ రోజు వంకాయ–పాప్రికా కూర, సాంబారు అదిరిపోయాయి.

భోంచేస్తూ అతడికి చెప్పాను, ''ఇప్పుడో నిజం చెబుతున్నాను. మా ఇంట్లో ఈ పాప్రికా కూర పేరు రామచంద్ర కూర. రామచంద్ర కూరని రామచంద్రే వండగా తినడం ఈ రోజు మాకు ప్రత్యేకానుభూతి'' అన్నాను.

ఆ మాట నిజం.

ఎన్నో దశాబ్దాల తర్వాత ఇప్పటికీ మా ఇంట్లో ఆ కూరని రామచంద్ర కూర అనే అంటున్నాం.

రామచంద్ర వెంటనే, ''ఒక విధంగా ఆ పేరుకి నేను అర్హుణ్ణే. జర్మనీలో దొరికే కూరగాయలు, మసాలాలతో – ఈ కూరని నేనే కనిపెట్టాను. గోటింగన్లో కూడా చాలామందికి నేర్పాను. మెచ్చుకుని ఊరుకున్నవారే కానీ, ఇలా నా పేరు పెట్టినవారు లేరు. రావుగారి మర్యాదే వేరు'' అన్నాడు.

అతడి గొంతుని బట్టి నా మాటకి అతడెంత సంతోషించాడో అర్థమైంది.

అబద్ధంతో మనిషిని సంతోషపెట్టొచ్చు.

కానీ నిజంతో సంతోషపెడితే – ఆ కిక్కే వేరని – అప్పటి నా అనుభూతి చెప్పింది.

చాలాసేపు కబుర్లతో సరదాగా గడిచింది.

మాట్లాడే తెలుగులో యాస ఉన్నా ఆ దంపతులు తెలుగువారు కాదన్న భావం మాలో కలగలేదు.

వారి రాకకి గుర్తుగా టేపు రికార్డరులో వారి గొంతులు రికార్డు చేస్తున్నప్పుడు – ఆమె 'పదునాల్గు వర్ష.... సీతె పునీతే...' అని పాడేవరకూ వాళ్లు కన్నడిగులని స్ఫురించలేదు.

ఆ దంపతులు వెళ్లిపోతుంటే – ఆత్మీయులు దూరమౌతున్న అనుభూతి కలిగింది.

అలా బెర్లిన్ యాత్రకి వచ్చి మమ్మల్ని సందర్శించిన మరికొందరిలో మరపురాని, మరువలేనివాడు సుందరం.

ఫక్తు శాకాహారి ఐన సుందరం మిగతా విషయాల్లోనూ చాలావరకూ నాలాంటివాడే.

ఢిల్లీలో విమానమెక్కే ముందు పరిచయమయ్యాడు. క్షణాల్లో ఆత్మీయుడైపోయాడు.

ఫ్రాంక్‌ఫుర్ట్‌లో విడిపోయేక లాంగ్వేజ్ కోర్సు రోజులనుంచీ కూడా ఒకరినొకరు ఉత్తరాల్లో పలకరించుకునేవాళ్లం.

నాకులాగే అతడికీ జర్మనీ చాలా నచ్చింది.

తన అలవాట్లకి సరిపడని వాతావరణం.

తన అలవాట్లని సవాలు చేసే సదుపాయాలు.

వీటికతడు బెదిరిపోలేదు, మథన పడలేదు.

పైగా తన అలవాట్లని కాపాడుకుందుకు వాటినే సానుకూలం చేసుకున్నాడు.

తనుండే ఇంటి బాల్కనీలో కుండీల్లో పూలమొక్కలకి బదులు కొత్తిమీర, మెంతికూర పెంచుతున్నట్లు చెప్పాడు.

''వజ్రాన్ని నగల్లో పొదిగి అలంకరించొచ్చు. కుంకుడుకాయలు కొట్టడానికీ వాడొచ్చు. ఇక్కడికొచ్చి నువ్వు చేస్తున్నదిదా!'' అని కొందరతణ్ణి ఎగతాళి చేశారుట.

దానికతడు ఏమాత్రం చలించకుండా, ''ఏది వజ్రం, ఏది నగ, ఏది కుంకుడుకాయ – అన్న విషయంపై నాకు స్పష్టమైన అవగాహనుంది. మీకుందా?'' అనడిగి తనని గేలి చేసేవాళ్ల నోళ్లు మూయించేట్ట.

ఈ విషయం నాకతడు వ్రాసిన ఉత్తరంలో చదివిన వెంటనే ఎన్నో విషయాలు స్ఫురణకొచ్చాయి నాకు.

చరిత్రలో ప్రముఖుడైన ఫ్రెంచి చక్రవర్తి నెపోలియన్ కాలానికి, అంటే 1870కి ముందు, ఆల్యూమినియం అరుదైన లోహం.

ఉత్పత్తి బాగా తక్కువగా ఉండడంవల్ల దాని విలువ వెండి బంగారాలకంటే ఎక్కువుండేది.

అప్పుడు కోట్లకి పడగెత్తినవారు తప్ప వాడకానికి అల్యూమినియం పాత్రలు కొనలేకపోయేవారు.

నెపోలియన్ ఒకసారి పెద్ద విందు చేస్తూ, తన వైభవాన్ని ప్రదర్శించడానికిగానూ ముఖ్యమైన అతిథులకి అల్యూమినియం పళ్లాలు, కట్లరీ వాడి వారిని దిగ్భ్రమకు గురి చేసేట్ట. అందరికీ సరిపడేంత ఆల్యూమినియం సామగ్రి దొరక్క కొందరి విషయంలో వెండి, బంగారు సామగ్రితో సరిపెట్టుకోవాల్సొచ్చిందని నొచ్చుకున్నాట్ట.

ఆ తర్వాత కొన్ని దశాబ్దాలకి ఆల్యూమినియం పేదలకి మాత్రమే పరిమితమైతే అది వేరే సంగతి!

పళ్లాలు, నగలు, దుస్తులు వగైరాల విలువ కాలానుగుణంగా మారుతుంది.

కానీ జిహ్వ అందుకు విరుద్ధం.

ఏ కాలంలోనైనా రుచి, అభిరుచి పూర్తిగా వ్యక్తిగతం.

ఐనా పీజాలు తినేవారు తాము ఆధునికులమంటూ, మిర్చిబజ్జీల్ని ఇష్టపడేవారి అభిరుచిని గేలి చెయ్యడం ఇప్పటికీ చూస్తుంటాం.

అలాంటప్పుడే నాకు చిన్నప్పుడు మా తాతగారు తరచుగా చెబుతుండే 'బక మరాళ సంవాదం' స్ఫురణకొస్తుంది.

ఒక చెరువులో ఉన్న కొంగల మధ్యకు అనుకోకుండా ఓ హంస వచ్చినప్పుడు వాటిమధ్య జరిగిన సంభాషణను ప్రశ్న–జవాబుల రూపంలో చెప్పిన చాటుపద్యరూపమే బక మరాళ సంవాదం.

ప్రశ్న: ఎవ్వడవీవు కాళ్లు మొగమెర్రన?

జవాబు: హంసను

ప్రశ్న; ఎందునుందువో?

జవాబు: దవ్వుల మానసంబునను

ప్రశ్న: దాన విశేషములేమి చెప్పుమా?

జవాబు: మవ్వపు కాంచనాబ్జములు (బంగారు రంగు తామరపూలు), మౌక్తికముల్ (మంచి ముత్యాలు) కలవందు

ప్రశ్న: నత్తలో?

జవాబు: అవ్వి యెరుంగను (వాటి గురించి నాకు తెలియదు)

'అన్న నహహా యని నవ్వె బకంబులన్నియున్' అంటూ పద్యం ముగుస్తుంది.

సామాన్యులకి తమకి తెలిసిన కాసిని విశేషాలూ చాలా గొప్పవి.

గొప్పవార్ని కలిసినప్పుడు వారికి తెలిసిన గొప్ప విశేషాల్ని గ్రహించాలనుకోరు.

పైగా తమకు తెలిసిన అల్ప విశేషాలు తెలియనందుకు వారిని గేలి చేస్తారు.

సామాన్యుల గుంపులో ఒంటరి పండితుడి అవస్థని సరసంగా చెప్పిన ఈ పద్యం విన్నప్పుడు – చిన్నప్పుడే నాకు ఏది సామాన్యం, ఏది గొప్పతనం అన్నది ఎవరు ఎందుకు ఎలా అంచనా వేస్తారన్న సందేహం మొలకెత్తింది.

ఆ తర్వాత కాకియై కలకాలం జీవించేకంటే, హంసలా ఆర్నెల్లు బ్రతికితే చాలు – అన్న సామెత విన్నప్పుడు నా సందేహపు మొలకకు కొత్తచిగుళ్లు వచ్చాయి.

కవుల ఊహ ప్రకారం హంస రాజసమొలికే అందమైన పక్షి

ఎక్కడో హిమాలయాల్లో మానస సరోవరంలో ఉంటూ – లేత తామర తూండ్లు భుజిస్తూ తన మానాన తను బ్రతుకుతుంది.

ఆ హంసవల్ల మానవాళికుండే ప్రయోజనమేమిటో తెలియదు.

కాకి నల్లగా, వికారంగా ఉంటుంది.

వికృతస్వరంతో కావుకావుమంటూ మనమధ్యనే తిరుగుతుంది.

మన చుట్టూ ఉండే చెత్తాచెదారాన్ని ఆహారంగా తీసుకుని వాతావరణ కాలుష్యంనుంచి విముక్తి కలిగించడంలో మనకి తన వంతు సాయం చేస్తోంది.

కావుకావు మంటుంది కానీ నిజానికి తనే మనని కాస్తోంది.

హంసతో పోల్చి కాకిని చిన్నబుచ్చేవారిలో ఎంతమందికి ఈ అవగాహన ఉంది?

తెలుపు – ఆ తెలుపు చుట్టూ ఏర్పడిన సంస్కృతి, సంప్రదాయాలు – మనని మనమే చిన్నబుచ్చుకునేలా శాసిస్తూ, మనలో బానిస మనస్తత్వాన్ని పెంపొందిస్తున్నాయి.

సుందరం ఉత్తరంలో వ్రాసిన విశేషాలు చదివేక – ఇలాటివెన్నో నాకు స్ఫురించాయి.

భావసామీప్యమో, సారూప్యమో – సుందరం నన్ను బెర్లిన్లో కలుసుకుందుకు తహతహలాడుతున్నాడు.

అతడు నన్నెంతలా ఇష్టపడ్డాడంటే, తనకి బాగా పరిచితుడైన ఓ రావుకి నా గురించి ప్రత్యేకంగా చెప్పాడు.

రావు కూడా ఓసైంటిస్టు. డాడ్ స్కాలరు.

రాజస్థాన్‌లో పిళానీలో అతడి ఉద్యోగం. అతడికీ బెర్లిన్ ట్రిప్పుంది.

సుందరం మాటమీద ఆ ట్రిప్పులో అతడు భార్యాసమేతంగా మా ఇంటికొచ్చి ఓ పూట సరదాగా గడిపి వెళ్లాడు.

భాష, దేశం – ఈ రెండూ మనిషికి కుల మత జాతి వర్గ భేదాలకి అతీతమైన అనుబంధాన్ని కలిగించే అద్భుతాలు.

ఆ విషయం భాషకూ, దేశానికీ దూరమైనప్పుడే తెలుస్తుంది.

అంతకు పూర్వం పరిచయం లేకపోయినా, ఆ కాసేపటిలోనూ రావు దంపతులు మాకు ఆత్మీయులైపోవడానికి ఆ అనుబంధమే కారణమనుకోవాలి.

పిళానీ గురించి కొన్ని కొత్త విశేషాలు తెలిశాయి మాకు.

అది థార్ ఎడారికి దగ్గర్లో ఉందేమో – వేసవిలో ఏసీలకు లొంగని దారుణమైన వేడి.

శీతాకాలంలో హీటర్లకు లొంగని భయంకరమైన చలి.

వాటి సంగతలా ఉంచితే – ముఖ్యంగా వేసవిలో ఇసుక తుఫానులు వస్తాయిట. తలుపులన్నీ వేసినా ఇళ్లలోకి ఏదో ఓ చిన్న సందులోంచి సన్నని ఇసుక రేణువులు దూరి మంచాలు, అలమరలు వగైరాలమీద పేరుకు పోతాయిట.

ఇంటిలోపల సంగతే అలా ఉంటే – ఇక బయట విషయం వేరే చెప్పాలా?

సెలవులకి ఇల్లు తాళం వేసి కొన్నాళ్లు ఊరెళ్లి వస్తే ఇంట్లోకి వెళ్లాలంటేనే – ఇసుక మేటల్ని తొలిగించాలట.

వాళ్లు వర్ణించి చెబుతుంటే – ఆ పెద్దగీత ముందు మిగతా ప్రాంతాల్లో వచ్చే నీటి తుఫాన్లు బాగా చిన్నగీతలై తోచాయి.

మన దేశంలోనే వివిధ ప్రాంతాల్లో మనకు తెలియని ఎన్నో విశేషాలు.

అవిచ్చే అనుభూతుల్లో ఆహా అనిపించేవీ ఉన్నాయి, అమ్మో అనిపించేవీ ఉన్నాయి.

రావు భార్య ఉత్తరాదిన పెరిగిందిట.

ఆమెకి తెలుగు మాట్లాడ్డం వచ్చు కానీ, భాషమీద పట్టు లేదు.

ఐనా మేము రికార్డు చేసుకుంటామంటే – అలనాటి మల్లీశ్వరిలోని 'పిలచిన బిగువటరా' పాట పాడి మమ్మల్ని ఆశ్చర్యపర్చింది.

ఐతే ఆ పాటలో 'భళిరా రాజా' అన్న చోట ఆమె 'భళిరా జా' ఆనడంలో హిందీలా ధ్వనించింది.

'అందెల రవళుల సందడి మరి మరి' బదులు 'అందాల రమణుల సందడి మరి మరి' అన్నప్పుడు కృష్ణశాస్త్రికి మెరుగులు దిద్దినట్లు అనిపించింది.

అది సినీగీతాల అభిమానులకు ప్రాణప్రదమై నోట తిరిగే పాట కాకపోతే, ఈ మార్పులు గమనించడానికి వీలు కానంత చక్కగా ఆమె వరసను పట్టి ప్రదర్శించింది.

వాళ్లు వెళ్లిపోయేక మళ్లీ ఇంతవరకూ కలుసుకోకపోయినా – ఆ పాట వారి రాకకు సంబంధించిన తీయని అనుభూతిని స్ఫురణకు తెస్తూనే ఉంటుంది.

రావు దంపతుల్ని మా ఇంటికి పంపినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, సుందరానికి ఉత్తరం వ్రాశాను.

సుందరంనుంచి వెంటనే బదులొచ్చింది.

రావు కూడా మమ్మల్ని పొగుడుతూ ఆతడికో ఉత్తరం వ్రాసేట్ట.

అది చదివేక మమ్మల్ని కలుసుకోవడం ఎప్పుడెప్పుడా అన్న తహతహ తనలో మొదలైందిట.

''నాక్కూడా సతీసమేతంగా వచ్చి మీ ఇంట్లో గడపాలనుంది. నా భార్య మీ ఇంట్లో ఉండడానికి వీలౌతుందా? ఏ విషయం మొహమాటపడకుండా చెప్పండి'' అని వ్రాసాడు చివర్లో.

విషయమేమిటంటే డాడ్ సంస్థ ఏర్పాటు చేసే బెర్లిన్ విహారయాత్రలు బృందాలవారీగా ఉంటాయి. అవి డాడ్ స్కాలర్సుకి మాత్రమే పరిమితం. వచ్చిన బృందమంతా కలిసి ఒకచోటే ఉండాలన్నది నియమం.

సుందరం తన భార్యని తీసుకు రావాలంటే, ఆమె బెర్లిన్లో విడిగా వేరే హొటల్లో ఉండాలి.

''ఇండియాలోనే ఎప్పుడూ ఒక్కద్దాన్నీ హొటల్లో దిగలేదు. పరాయి దేశంలో ఎలా ఉంటాను? మీరొక్కరూ వెళ్ళొచ్చేయండి'' అందిట ఆమె.

మావంటి స్నేహితుల ఇంట్లో ఉండడానికి ఆమెకి అభ్యంతరం లేదు.

కానీ ఎవర్ని పడితే వాళ్లని ఎప్పుడు పడితే అప్పుడు ఇంట్లో ఉండనివ్వడానికి ఇది ఇండియా కాదు కదా!

తోడబుట్టినవాళ్లొస్తేనే ఉండడానికి అనుమతి లభించని నియమాలున్న దేశమిది.

ఆ విషయం సుందరానికీ తెలుసు.

కానీ అంతకుముందు నేను మా ఇంటామె ఒలోముచ్‌కీ గురించి ఉత్తరాల్లో గొప్పగా వ్రాసి ఉన్నాను. అందుకే ఆ మాత్రం వ్రాసే ధైర్యం చేశాడు.

ఐతే నేను మాత్రం ఈ విషయమై ఒలోముచ్‌కీని అడిగే ధైర్యం చెయ్యలేకపోయాను. ఎందుకంటే – మేముండే అపార్టుమెంట్సులో ఎవరింటికీ అతిథులు రావడం చూడలేదు మేము. ఎవరి పనుల్లో వారుంటూ ఎవరి జీవితాన్ని వారు గడుపుతుంటారు వాళ్లు.

ఇరుగుపొరుగులతో కూడా ఎదుట పడినప్పుడు ఓ చిరునవ్వు.

గ్యూటెన్ మోర్గెన్ అన్న చిరు పలకరింపు.

అంతకుమించి పరిచయాలు లేవు.

అలాంటంది మా ఇంటికి తరచుగా ఎవరో ఒకరు వచ్చిపోవడం, చిల్లోబొల్లోమంటూ కబుర్లు.

''ఇక్కడి కుటుంబాలకి ఇలాంటి సమావేశాలు నచ్చవు. ఒలోముచ్‌కీ పసి కట్టిందంటే చిక్కుల్లో పడతావు'' అని ఓంప్రకాష్ ఒకసారి నన్ను హెచ్చరించాడు కూడా.

మా ఇంటికి అతిథుల రాక ఎక్కువేనని గ్రహించి, పాపం తను రావడం ఇంచుమించు మానుకున్నాడతడు. తనది హాస్టల్ కాబట్టి – మమ్మల్నే అక్కడకు రమ్మనేవాడు.

ఇప్పుడు సుందరం భార్య రాక గురించి చెప్పి అనుమతి కోరితే, కందిరీగల తుట్టని కదిపినట్లే!

ఇంతకాలం ఏ గొడవలూ లేకుండా రోజులు గడిచిపోతున్నాయి.

ఇంకా ఆమె దృష్టి నా ఇంటికొచ్చి పోతుండే అతిథులమీద పడలేదు.

ఐనా అందువల్ల తనకి కలిగిన ఇబ్బందేం లేకపోవడంవల్ల చూసీచూడనట్లు ఊరుకుంటోందని నా అనుమానం.

కానీ ఇప్పుడు నేనిలా ఆడగ్గానే, 'దొంగాడా కరవకురా' అన్నట్లయి – ఆమె నా ఇంటికొస్తూ పోతూండే అతిథుల విషయమై కొత్త నియమాలు సృష్టిస్తుందని నా భయం.

ఆ భయానికి కారణం లేకపోలేదు.

ఒక రోజు ఉదయం వంటింట్లో ఫ్రిజ్‌మీద ఓ చీటీ పెట్టి ఉంది.

'బహుశా మీరు ఇల్లు కాళీ చెయ్యాల్సి ఉంటుంది. ఈ రాత్రి పెందరాళే వస్తాను. కలుసుకో'

అది ఒలోముచ్‌కీ నాకిచ్చిన తాకీదు.

చదవగానే గుండె ఆగినట్లనిపించింది.

ఒలోముచ్‌కీతో ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహలో కూడా అనుకోలేదు.

నాకు తెలిసి మాకూ ఆమెకీ మధ్య చిన్న రభస కూడా జరుగలేదు. ఉన్నట్లుండి ఆమెకి ఏమయింది?

ఏమయినా ఇల్లు కాళీ చెయ్యమని చీటీ పెట్టేటంత విశేషమేదీ జరుగలేదని నాకు అనిపిస్తోంది. కానీ ఆమె అలా చీటీ పెట్టిందంటే, ఏదో కారణం ఉండిఉండాలి. అదేమిటి?

ఆగినట్లనిపించిన గుండె నెమ్మదిగా కొట్టుకోవడం మొదలెట్టినట్లు అనిపించింది కానీ, అప్పుడు తన వంతొచ్చిందంటూ మెదడు స్తంభించినట్లుంది. ఒలోముచ్‌కీ అలా చీటీ పెట్టడానికి కారణం స్ఫురించడం లేదు.

ఇక వేరే దారి తోచక శ్రీమతికి చెప్పాలనుకున్నాను. కానీ కాళ్లూ చేతులూ ఆడక కాసేపు అక్కడే ఉండిపోయాను.

అంతలో శ్రీమతి తనే అక్కడకొచ్చి, "అదేమిటీ అలాగైపోయారు? ఏం జరిగింది?" అంది కొంచెం కంగారుగా.

చెబితే కంగారు పడుతుందని తెలుసు. కానీ చెప్పకపోతే దాగే విషయమా ఇది!

"కంగారేం లేదు. ఒలోముచ్‌కీ మనకోసం ఓ చీటీ పెట్టిందిలే, చూడు" అంటూ ఆమెకి ఆ చీటీ అందించాను.

ఒలోముచ్‌కీ జర్మన్లో రాస్తుంది. శ్రీమతికి అర్థం కాదని తెలుసు.

ఐనా చావు కబురు చల్లగా చెప్పాలి కదా అని, జాప్యంకోసం అలా చేశాను.

శ్రీమతి ఓసారి కాగితాన్ని పరీక్షగా చూసి, "చూడమన్నారుగా, చూశాను. ఇక అందులో ఏముందో చెప్పండి" అంది నవ్వుతూ.

తన భర్త ఏదోలాగైపోయాడన్న భావననుంచి బయటపడినట్లు సూచించిందా నవ్వు. ఎంత సేపుంటుందో చూడాలి...

యథాలాపంగా అన్నట్లు, "ఏమంటుందీ, మనం తక్షణం ఇల్లు కాళీ చెయ్యాలిట" అన్నాను.

శ్రీమతి నా మాట నమ్మలేదు కానీ తన నవ్వు ఆగిపోయింది. చటుక్కున నా నోరు మూసి, "ఇలాంటి జోక్సు వెయ్యకండి. పైన తథాస్తు దేవతలుంటారు" అంది.

"పోనీ – మీరు నాకు చాలా చాలా నచ్చేశారు. ఇంకొన్నేళ్లు ఉండాల్సొచ్చినా, మీరంతా మాఇంట్లోనే ఉండాలని వ్రాసింది, సరా?"

"తనలా వ్రాసిందంటే నమ్మను కానీ, మీ మాటలకు దేవతలు తథాస్తు అంటారుగా – ఆ ప్రభావంతో మెరు చెప్పినట్లే వ్రాసినా వ్రాసి రేపుదయానికి ఫ్రిజ్జిమీద పెడుతుందేమో" అంది శ్రీమతి.

నిజంగానే అలా జరిగితే ఎంత బాగుణ్ణు?

'ఆశకు అంతుండాలి' అని మనసులో అనుకుంటూ, "ఔను మరి – మనమీ ఇంట్లో ఉండడం ఇక తథాస్తు దేవతలమీదనే ఆధారపడి ఉంది" అంటూ ఒలోముచ్‌కీ చీటీలో ఏం వ్రాసిందీ స్పష్టం చేశాను.

నేను చెప్పేది నిజమేనని రూఢి చేసుకుందుకు శ్రీమతికి కొన్ని క్షణాలు పట్టింది.

అంతే – తనప్పుడు ఏదోలాగైపోయింది. అంతకు ముందు నాకొచ్చిన అనుభూతుల ప్రతిబింబాలు ఆమె ముఖంలో తారాడాయి.

తనకీ గుండె కాసేపాగి కొట్టుకుంటున్నట్లుంది. ఇక మెదడు స్తంభించడమే తరవాయి'

అనుకుంటూ ఆమెనే చూస్తున్నాను.

తేరుకుందుకు నాకంటే తక్కువ టైమే పట్టిందామెకి, "మనవల్ల ఏ పొరపాటూ జరగలేదే!" అంది తనలో తనే గొణుక్కుంటున్నట్లు.

అంటూనే ఏం జరిగిందా అని ఆలోచిస్తోంది.

"పొరపాటు లేదనుకుంటే ఈ సమస్యకు పరిష్కారం లేదు. పొరపాటుందనుకుని అదేమిటో కనిపెట్టే ప్రయత్నం చెయ్యాలి!" అన్నాను.

శ్రీమతికి అర్థమయింది. "పొరపాటు తెలిస్తే – సవరించుకుందుకు ఏం చెయ్యాలా అని ఇద్దరం కలిసి ఆలోచించొచ్చు. అప్పుడేదైనా ఉపాయం తడుతుందనేగా, మీ ఆశ!" అంది.

ఉత్తప్పుడైతే తన అవగాహనని అభినందించేవాణ్ణి. అప్పుడు మాత్రం నీరసంగా తలూపాను.

ఇద్దరం వంటింట్లోనే ఉండి కాసేపు తలలు బద్దలు కొట్టుకున్నాం. జ్ఞాపకాల పొరల్ని తవ్వుతున్నాం. ఎంత తవ్వినా ఒక్క పొరపాటు కూడా బయటపడలేదు.

"వసూ! మనమింత పెర్‌ఫెక్ట్ మనుషులమని ఇప్పుడే గుర్తించాను" అన్నాను దిగులుగా.

"ఆ గుర్తింపు సంతోషాన్నివ్వడంలేదు సరికదా, ఉన్న సంతోషాన్ని కూడా హరించుకు పోతోంది" అంది శ్రీమతి నాకంటే దిగులుగా.

ఒకరికోసం ఒకరు పుట్టినట్లుగా సహజీవన సౌభాగ్యాన్ని ఆస్వాదిస్తున్న మాకు – ఒలోముచ్‌కీ పెట్టిన చీటీ అశనిపాతంలా ఉంది.

"ఓంప్రకాష్ అననే అన్నాడు — ఇక్కడివాళ్లకు ఇళ్లలో బంధుమిత్రుల రాకపోకలు బొత్తిగా నచ్చవని. అప్పుడే పట్టించుకోవాల్సింది. ఇప్పుడు అనుభవిస్తున్నాం" అన్నాను.

"మీ ఓంప్రకాష్ ఇక్కడివాళ్ల తీరు చెప్పడానికి మాటవరసకి అన్న మాటలవి! వాటిని పట్టించుకోకపోవడం పొరపాటెలా ఔతుంది? పోనీ, ఒకవేళ అది పొరపాటే అనుకోండి. అలాంటప్పుడు ఒలోముచ్‌కీ ఏంచెయ్యాలి? మనింటికి మొదటిసారి గెస్టులొచ్చినప్పుడే అభ్యంతరం చెప్పి, ఓ వార్నింగివ్వాలి. మనమా వార్నింగుని లెక్క చెయ్యకపోతే — అప్పుడు ఇలా ఓ చీటీ వ్రాసి పెట్టాలి. ఇలా ఉన్నపళంగా పొమ్మనడం ఏం బాగా లేదు" అంది శ్రీమతి.

"ఆ మాటకొస్తే. ఇంట్లో చేరేముందు, ఇంటికెవరూ వస్తూపోతూండరాదని కూడా షరతేం పెట్టలేదామె. అందుకే నేను ఓంప్రకాష్ హెచ్చరికని లెక్క చెయ్యలేదు. నువ్వన్నట్లు ఇలా మనని ఉన్నపళంగా ఇల్లు కాళీ చేసి పొమ్మనడం నూటికి నూరు పాళ్లూ అన్యాయమే" అన్నాను.

మావల్ల పొరపాటేం జరుగలేదనీ, ఒలోముచ్‌కీయే అన్యాయంగా ప్రవర్తిస్తోందనీ ఇద్దరూ ఏకాభిప్రాయానికొచ్చాం.

దేశం మనది కాదు. పద్ధతులు మనవి కాదు.

అనువు కానిచోట అధికులమనరాదు — అని మన పెద్దలే చెప్పారు.

ఇప్పుడు అన్యాయం ఒలోముచ్‌కీదని మేము నిర్ధారించడంవల్ల సమస్య పరిష్కారమౌతుందా?

అమెరికా, రష్యాలు ఏంచెయ్యాలో, ఏంచెయ్యకూడదో — భారతదేశం నిర్ణయించినట్లుంది మా అభిప్రాయం.

ఆ దేశాలు ఐక్యరాజ్యసమితి మాటలే వినవు. ఎంత న్యాయమున్నా ఇక మా మాటలకు విలువేముంటుంది?'

ఇలా అనుకుంటూనే ఆశగా శ్రీమతి వంక చూస్తున్నాను.

"మనమేమనుకున్నా – ఇది తోడేలు, మేకపిల్ల కథ. తనేమంటే అదే సాగుతుంది. ఐతే ఇంతవరకూ వచ్చింది కాబట్టి, మీరూ ఊరుకోకండి. ఇదే పాయింటుమీద కాస్త గట్టిగానే దెబ్బలాడండి. ఐనా తా పట్టిన కుందేటికి మూడే కాళ్లందనుకోండి, అడ్వాన్సు నోటీసు కావాలని మొండికెయ్యండి" అంది శ్రీమతి.

నాకు ధైర్యం చెబుతున్నట్లుంది కానీ, తనకి తానే ధైర్యం చెప్పుకుంటున్నట్లుంది.

అప్పుడు నాకు అలనాటి 'తెనాలి రామకృష్ణ' సినిమాలో అల్లసాని పెద్దన చెప్పిన పద్యాన్ని రామకృష్ణుడు హేళన చెయ్యడం గుర్తొచ్చింది. 'తోక ముడిచి బిలప్రవేశం చేసే సింహంతో ప్రభువుల్ని పోల్చడం తగదంటూనే, వారిని రాజకంఠీరవా (రాజుల్లో సింహమా!) అనడ మేమిటి?' అన్నది రామకృష్ణుడి ఎత్తిపొడుపు.

స్వదేశంలోనే వివాదాలకు దిగకుండా తోడేళ్లకు తలవంచుకుని సాగిపోయే సామాన్యులం మేము.

ఇది విదేశీ సంపన్నదేశం. మర్యాదకు పైకి అనకపోయినా మన దేశమంటే చిన్నచూపున్న అగ్రరాజ్యం.

మాది తోడేలు–మేకపిల్ల కథ అంటూనే నన్ను మొండికెయ్యమని సలహా ఇస్తోంది శ్రీమతి.

ఐతే అది అజ్ఞానం కాదు, అసహాయత అని నాకు తెలుసు.

"మనమిక్కడుండేది మరికొన్ని నెలలు మాత్రం. కడుపులో చల్ల కదలకుండా గడిపేయొచ్చు అనుకుంటుంటే ఈ సమస్య వచ్చి పడింది. ఇప్పటికిప్పుడు మనకి వేరే ఇల్లు దొరకదు. ఇక మీకు తిరుగు ప్రయాణం ఏర్పాట్లు చెయ్యక తప్పదు" అన్నాను.

"అలా డీలా పడిపోకండి. రాత్రి దాకా టైముందిగా, ఈలోగా ఒలోముచ్‌కీకి ఎలా నచ్చజెప్పాలో ఆలోచించండి. ఎదుటివాళ్లని ఇంప్రెస్ చెయ్యడంలో మీ సామర్థ్యం గురించి నాకే కాదు, మీకూ తెలుసు. మీమీద నాకు నమ్మకముంది. మనమిక్కడ తప్పకుండా వార్షికోత్సవం చేసుకుంటాం" అంది శ్రీమతి వెంటనే.

తనకు తాను ధైర్యం చెప్పుకోవడానికి నన్ను ఉత్సాహపరుస్తోందని నాకు తెలుసు. ఎలా ఉత్సాహపడతాను?

"నామీద నీకున్న నమ్మకం నన్ను మరింత డీలా చేస్తుంది" అన్నాను నీరసంగా.

"ముందు మీరు ఒలోముచ్‌కీతో మాట్లాడండి. పని జరిగిపోతుందనే నా నమ్మకం. పని జరుగలేదూ – నేనొచ్చి తనతో మాట్లాడతాను. తను నా మాట వింటుంది" అంది శ్రీమతి నమ్మకంగా.

ఆమె గొంతులో ధ్వనించిన నమ్మకానికి ఆశ్చర్యమేసినా – ఆ నమ్మకానికి కారణం ఊహించగలను.

అప్పటికి మావాళ్లొచ్చి కొన్ని నెలలు గడిచాయేమో, తెలియకుండానే శ్రీమతికీ ఇంటామెకీ కొంత అనుబంధమేర్పడింది. అదెలాగంటే...

శ్రీమతి సంప్రదాయ భారత గృహిణి. గృహమే కదా స్వర్గసీమ అనుకోవడమే కాదు, అది తన సామ్రాజ్యం అని కూడా అనుకుంటుంది. సామ్రాజ్ఞిలా కాక పరిపాలన అంటే బాధ్యతతో కూడిన సేవ అనుకుంటుంది.

వంటిల్లు ఆమె సామ్రాజ్యంలో ప్రముఖమైనది. కనీసం పిల్లలు కాలేజి స్థాయికి ఎదిగేవరకైనా రోజులో ఎక్కువ సమయం వంటింటికి అంకితం చెయ్యక తప్పదు.

ఒలోముచ్‌కీ వయసు మీరినా ఇంకా ఉద్యోగం చేస్తున్న ఓ యూరోపియన్ వనిత. ఆమె వంటిల్లు వాడేది చిన్ని చిన్ని అవసరాలకే కానీ, అసలు సిసలు వంటకు కాదు.

రోజులో సుమారు 10 గంటలు ఉద్యోగం. దానికి రానూపోనూ ప్రయాణం మరో గంట.

ఆపైన నిద్రకు ఎనిమిది గంటలు. కాలకృత్యాలకు ఓ గంట. కాసేపు టివి. అమె వంటకు కేటాయించిన సమయం రోజుకో అరగంట అనుకోవచ్చు.

మిగతా సమయంలో ఏం చేస్తుందో తెలియదు కానీ ఇంటికి సంబంధించి మాత్రం ఏ పనీ చెయ్యదు.

రోజూ ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం అయ్యేక – తను వాడిన కంచాలూ, గిన్నెలూ ఓ పెద్ద బుట్టలో వేసేదామె.

అలా నెల్లాళ్లు చేసినా కూడా ఇబ్బంది కలుగనంత కట్లరీ ఉందామెకి. ఆ బుట్టని తన గదిలోనే ఉంచుకునేదామె.

చలిదేశం కాబట్టి ఆ అంటగిన్నెలు కంపు కొట్టవేమో అనుకోవాలి. లేకపోతే వాటిని పక్కనెట్టుకుని నిద్ర పోవడం కష్టమే!

అంటగిన్నెల్నీ, వంటింటినీ శుభ్రం చెయ్యడానికి నెలకోసారి ఓ పనిమనిషి పిల్చుకునేది. ఆమె కార్లో వచ్చి పనులన్నీ చేసి గంటకో పాతిక మార్కులు వసూలు చేసి వెళ్లిపోయేది.

శ్రీమతి రాగానే అస్తవ్యస్తంగా ఉన్న వంటిల్లు చూసి చిరాకు పడింది.

హాట్‌ప్లేటు, వాష్ బేసిను, ఫ్రిజ్ వగైరాలను శుభ్రం చేసింది.

ఓ మూలగా ఉన్న మాపరు సాయంతో వంటింట్లో పరిచిన కంబళిని శుభ్రం చేసింది.

ఒలోముచ్‌కీ వంటింట్లో పది నిముషాలు గడిపి వెడితే చాలు – అక్కడ సగం వాడిన కెటిలు, టీ మరకలతో హాట్‌ప్లేటు.

ఇక వాష్ బేసిన్ చూస్తే – చౌక హొటళ్లలో అప్పుడే ఎవరో చెయ్యి కడుక్కుని వెళ్లినప్పటి సీను గుర్తుకొచ్చేది.

"మీ ఇంటామె చాలా ఎడ్డి. యూరోపులో అంతా ఇలా ఉండరు" అనేవాడు ఓంప్రకాష్ నాతో

"నాకు ఆశ్రయమిచ్చిన ఆమె గురించి నీ అభిప్రాయం నీది. అది నాకు వినబడలేదు" అని అప్పుడతడికి చెప్పాను.

శ్రీమతికి కూడా ఆమె పట్ల కృతజ్ఞతాభావముంది. అందుకే తనూ ఆమె గురించి ఏమనేది కాదు. తనుమాత్రం – మేమేం వండుకున్నా, గిన్నెలేం అక్కడ వదిలేదు కాదు. అసలా వంటిల్లు మేము వాడుతున్నామా అన్నట్లుండేది.

వంటింటిని నీటుగా ఉంచే ప్రయత్నంలో ఒకసారి ఇంటామె వదిలి వెళ్లిన రెండు గిన్నెల్ని తనే శుభ్రం చేసి ఆ విషయం నాకు చెప్పింది.

"ఇలాంటి పనులు చేస్తే మనం తనకి చులకన అయ్యే ప్రమాదముంది" అని నేనామెను మందలించాను.

"ఇందులో చులకనకేముంది? తనా వయసులో పెద్దది. ఆపైన తన బరువు తానే మోసుకోలేని ఊబకాయం. నాలుగడుగులు వెయ్యడానికే అపసోపాలు పడే తను, రోజూ రెండో అంతస్తునించి మెట్లన్నీ దిగి కిందకెళ్లి, టాక్సీని పిల్చుకుని ఉద్యోగానికెళ్లొస్తుంది. ఒక్క రోజు కూడా సెలవెట్టదు. అలాంటి తను, ఇంక ఇంటి పనేంచేస్తుంది? తనకి సంబంధించిన ఈ కాస్త పని, అదీ ఎప్పుడైనా ఓసారి చేస్తే, నా చేతులేం అరిగిపోవు" అని నవ్వేసింది.

ఆత్మన్యూనతాభావం మహా చెడ్డది. అదున్నవాళ్లు తమ పనులు తాము చేసుకోవడానికే కించపడతారు. లేనివాళ్లు ఏ పని చేసినా తలెత్తుకునే ఉంటారు కాబట్టి వారిలో సేవాదృక్పథం అమితంగా ఉంటుంది.

శ్రీమతి సేవానిరతి నాకు తెలియందేం కాదు.

కానీ నా భయం నాది.

సేవల్ని కూడా అపాత్రదానంగా ఇవ్వకూడదు. ఒలోముచ్‌కీ తత్వం నాకు పూర్తిగా తెలియకపోయినా, శ్రీమతి సేవాదృక్పథాన్ని ఆమె అసహాయతగా అర్థం చేసుకోకునే అవకాశం లేకపోలేదు. క్రమంగా శ్రీమతికి తనే ఇలాంటి పనులు అప్పగించొచ్చు.

కొన్నాళ్లయ్యేక పనికి వంకలెట్టి చీవాట్లు కూడా పెట్టొచ్చు.

సహజీవన సౌభాగ్యంకోసం వచ్చిన నా భార్య ఇక్కడ పనిమనిషిగా మారిపోతే నేను భరించగలనా?

అందుకే ఇలాంటివి మొగ్గలోనే త్రుంచేయాలని శ్రీమతికి చెప్పాను.

"రచయితలా ఆలోచిస్తూ, మీరు చాలా దూరం వెళ్లిపోయారు. చాలామందిలో ఇలాంటి దృక్పథం ఉండడం వల్లనే, అహం రేగి సాటి మనిషికి చిన్న చిన్న సాయాలు కూడా చెయ్యలేకపోతున్నారు. ఆత్మవిశ్వాసం ఉన్న మనిషికి ఏ పని చేసినా చిన్నతనంగా అనిపించదు" అని బదులిచ్చింది శ్రీమతి.

తన మాటలు నాకంత నచ్చలేదు కానీ అప్పుడు సంభాషణని పొడిగించలేదు.

మర్నాడుదయం ఒలోముచ్‌కీ శ్రీమతికి థాంక్సు చెబుతూ ఓ చీటీ పెట్టింది.

నాకు సంతోసంగా అనిపించలేదు. పైగా కోపం కూడా వచ్చింది.

తను చెయ్యాల్సిన పని శ్రీమతి చేసింది. అలాంటప్పుడు, 'అయ్యో, నువ్వు నా పని చెయ్యడమేమిటి?' అని నొచ్చుకోవాలి.

ఇలా థాంక్సు చెప్పడంలో అర్థమేమిటి?

శ్రీమతి తనకి అచ్చిఉందని అనుకుంటోందా?

ఆ చీటీ శ్రీమతికి చూపించి, "అమ్మబాబోయ్ – ఇకమీదట నీకిక రోజూ థాంక్సు మీద థాంక్సు" అన్నాను తేనె మనసులు చిత్రంలో హీరో కృష్ణని అనుకరిస్తూ..

నా వ్యంగ్యం అర్థమైనా శ్రీమతికి కోపం రాలేదు, "రోజూ థాంక్సు చెప్పించుకుందుకు నాకు నా పన్లు లేవనుకున్నారా?" అంది శ్రీమతి.

"నేనేమనుకుంటే లెక్కేమిటి? అంతా ఇంటామె అనుకోవాలి. నువ్వు ఎంత బిజీ ఐనా సరే, తన పన్ల విషయంలో నీ సేవానిరతిని ప్రదర్శించడం మానకు. పొరపాటున మానేసావో, సారీ చెప్పమని చీటీ పెడుతుంది" అన్నాను కొంచెం ఉక్రోషంతో.

శ్రీమతి నవ్వి, "అబ్బ, మీ మగాళ్లకి ఎంత అహంకారమండీ! అందుకే ఎదుటి మనుషుల్ని అంచనా వెయ్యడంలో దేవుడు మా ఆడవాళ్ల కిచ్చిన శక్తులు పురుషాతీతమయ్యాయి" అని నవ్వేసింది.

అలాగనడంలో ఆమె ఆలోచన ఏమిటో అప్పుడు నాకు అర్థం కాలేదు.

ఆ తర్వాత నాలుగో రోజున కాబోలు శ్రీమతి నాతో, "నాకీవేళ కాస్త బద్ధకంగా ఉంది. అర్ధాంగిని కదా, వంటిల్లు శుభ్రం చెయ్యడంలో నాకు మీ సాయం కావాలి. ఇంటామె వెళ్లేదాకా ఉండండి" అని రిక్వెస్టు చేసింది.

వంటిల్లు శుభ్రం చెయ్యడమంటే, ఇంటామె వదిలిన టీ కెటిలు వగైరాలని స్ఫురించి మనసు చివుక్కుమంది.

"అంటేఇదివరకు అప్పుడప్పుడు వదిలేది, ఇప్పుడు రోజూ వదిలేస్తోందన్నమాట! నేను నీకు ముందే చెప్పాను. ఇలాంటి విషయాల్లో ఒకసారి అలుసిస్తే అంతే సంగతులని! ఇప్పుడు చూడు, నీతో పాటు నన్నూ పనిమనిషిని చేశావు" అన్నాను కోపంగా.

"తప్పడం లేదండీ! రెండ్రోజుల్నించి డిన్నరు ప్లేట్లు కూడా వదిలేస్తోంది. తొందరగా రండి. మీకు ఆఫీసుకి ఇంకొంచెం లేటౌతుంది" అనేసి సమాధానంకోసం ఎదురు చూడకుండా వంటింట్లోకి వెళ్లిపోయింది.

భారతంలో ధర్మరాజు జూదమాడితే, ఆయన తమ్ముళ్లు, భార్య కూడా దాసులయ్యారు. ఇప్పుడు నా భార్య సేవానిరతివల్ల, నా గతీ అంతే అయిందనుకుంటూ, శ్రీమతిని అనుసరించి వెళ్లాను.

ఐతే – వంటింట్లో దృశ్యం చూస్తే పెద్ద షాకు...

వంటింటి గట్టుమీద టీ కటిలు కానీ, ఎంగిలి గ్లాసులు కానీ లేవు. స్టవ్ మీద టీ మరకలు లేవు. వాషుబేసిన్ తళతళ మెరుస్తోంది.

'ఏవి తల్లీ, నురుడు కురిసిన హిమసమూహములు' అన్న శ్రీశ్రీ కవితకు స్ఫురణ ఇలాంటి దృశ్యమేనేమో!

"ఆ మర్నాట్నించే ఇంటామె వంటింట్లో గిన్నెలు వదిలెయ్యడం మానేసింది. తను వెళ్లేలోగా ఇదిగో, కిచెన్, ఇలా ఉంటోంది" అంది శ్రీమతి గర్వంగా నవ్వుతూ.

ఆమె మాటలకు ప్రత్యక్షసాక్ష్యమున్నా, ఇంటామెలో ఇంత మార్పుని నేనింకా నమ్మలేకపోతున్నాను.

"ఏ పనైనా ఉద్దేశ్యం మంచిదై ఉండాలి. మనస్ఫూర్తిగా చెయ్యాలి. ప్రాధాన్యం స్వార్థానికి కాక, సేవాదృక్పథానికుండాలి. చిన్నతనం ఫీలవకూడదు. అప్పుడు మనని దోపిడి చెయ్యాలనుకున్నవారు కూడా అనుకోకుండా మనని అనుసరిస్తారు" అంది శ్రీమతి.

శ్రీమతి సేవకు ఒలోముచ్‌కీ తనని లోకువ కడుతుందనుకున్నాను. కానీ ఆమె ఆరోజునుంచీ శ్రీమతిని అభిమానించడం మొదలెట్టింది. ఎప్పుడైనా ఒకరికొకరు ఎదురైతే, ఆ చిరునవ్వులో ఆత్మీయతాభావం స్పష్టమౌతోంది.

అతర్వాత మళ్లీ శ్రీమతికి ఇంటామెకి సంబంధించిన పనులు చేయాల్సిన అవసరం రాలేదు.

అందువల్లనేమో – ఇల్లు కాళీ చెయ్యమన్న ఒలోముచ్‌కీ మనసు మార్చడానికి నా ప్రయత్నం ఫలించకపోతే, ఆ పని తను చెయ్యగలనని శ్రీమతికి నమ్మకం!

అనుకుందుకు బాగానే ఉంది కానీ – శ్రీమతిని నిజంగానే అభిమానించే మాటయితే, అసలామె ఇల్లు కాళీ చెయ్యమంటూ చీటీ ఎందుకు పెడుతుంది?

ఆ చీటీలో భాష కూడా సున్నితంగా లేదు. క్లుప్తతవల్ల భాష కాస్త మొరటుగా ఉందని శ్రీమతి అంటుంది కానీ, నేనలా సరిపెట్టుకోలేక పోతున్నాను.

ఆ రోజు నాకు మనసు మనసులో లేదు. ఆఫీసులో అన్యమనస్కంగానే పని చేశాను. ఐతే పరిస్థితి అక్కడ నా కొలీగ్సు ఎవరికీ చెప్పలేదు.

భయం భయం బ్రతుకు భయం అంటూ జీవించడాన్ని నిరసిస్తాను నేను. ఇలా నీరసపడిపోయినట్లు బయటపడకూడదు. మేకపోతు గాంభీర్యాన్ని వహించాలి. కానీ మేకపోతు అనగానే తోడేలు గుర్తుకొచ్చి వళ్లు ఝల్లుమంటోంది.

ఆ రోజు సాయంత్రం ఇంటికెళ్లేక బయటికెళ్లే ప్రోగ్రాం వేసుకోలేదు.

పిల్లలకు ఏంచెప్పిందో శ్రీమతి, వాళ్లు కూడా నిశ్శబ్దంగా ఉన్నారు.

పెందరాళే భోంచేసి మా గదిలో ఉండి ఒలోముచ్‌కీ రాకకోసం చెవులు రిక్కించి ఎదురు చూస్తున్నాం.

పరీక్షాపత్రాలు అందుకునేముందుకానీ, ఇంటర్వ్యూ హాల్లో అడుగెట్టినప్పుడు కానీ ఎప్పుడూ ఇలాంటి ఉత్కంఠకు గురి కాలేదు.

ఇంటామె రాత్రి ఎనిమిదినుంచి పదకొండులోగా ఏదో సమయంలో ఇంటికొస్తుంది.

ఎంతసేపు ఎదురు చూడాలో అనుకున్నాం కానీ, ఎనిమిదయ్యేసరికి మా గది బయట ఆమె ఆడుగుల చప్పుడు వినబడింది. కాసేపటికే కిర్రుమంటూ తలుపు మూసుకున్న చప్పుడవడంతో తన గదిలోకెళ్లిందని గ్రహించాం.

ఏదో జరుగబోతోందని పిల్లలకు అర్థమైనట్లుంది. వాళ్లు నిశ్శబ్దంగా, కుతూహలంగా మమ్మల్ని చూస్తున్నారు. నేను సెకన్లు లెక్క పెట్టుకుంటున్నాను. ఎప్పుడు పిలుస్తుందా, ఏంచెబుతుందా అని ఒకటే ఆత్రుత.

ఓ అరగంటలో వినపడింది, 'హెర్ డాక్టర్ రావ్' అన్న పిలుపు.

కూర్చున్నవాణ్ణి లేచి నిలబడ్డాను. శ్రీమతి వంక చూస్తే వీరతిలకం దిద్దడానికి సిద్ధపడుతున్న భారతనారిలా కనబడింది.

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–2020లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే

చివరి విడత: మలి సందడి (25)

స్నేహానంద లహరి

నేను శ్రీమతికి అభయహస్తాన్ని చూపించి, ఇంట్లోంచి బయటకెళ్లాను.

తలుపు తీస్తే సన్నటి హాలు. ఎడం పక్క బాత్రూం. బాత్రూంకి ఎదురుగా కుడిపక్కన ఒలోముచ్‌కీ గది.

ఓరగా తెరిచి ఉన్న తలుపుకు అవతల నిలబడి కనబడింది ఒలోముచ్‌కీ.

నన్ను చూస్తూనే లోపలకు రమ్మని సైగ చేసి తను లోపలికెళ్లి సోఫాలో కూర్చుంది. తన ఎదుట సోఫాని చూపించి కూర్చోమంది మర్యాదగా.

కూర్చున్నాను కానీ, నాలో ఆత్రుత తన్నుకొస్తోంది. ఐనా తమాయించుకుని ఆమెనే చూస్తున్నాను.

ఏం చెబుతుందో ముందు తననే చెప్పనిద్దామని నా ఆలోచన. కానీ ఆమె ఏం చెబుతుందో నాకు తెలియకనా?

"చీటీ చదివావా?" అందామె.

"ఊఁ" అన్నాను బింకంగా.

"నువ్వేమైనా చెప్పాలా?" అడిగిందామె.

అంటే నాకు ఓ అవకాశమిస్తుందా---. ఆశ మళ్లీ నాలో!

"ఇల్లు కాళీ చెయ్యమని చీటీ పెట్టావ్. ఇప్పటికిప్పుడు మాకిల్లెక్కడ దొరుకుతుంది. పోనీ ఉండేది రెండుమూడేళ్లంటే ఉండేదేమో, మేముండేదేమో – మరికాసిని నెలలు ఈలోగా దేశం కాని దేశంలో ఎన్నిళ్లు మారతాం? అదీ నీలాంటి మంచి లాండ్‌లేడీని వదులుకుని?" ఒక్క గుక్కలో అన్నాను.

ఆమె ప్రసన్నంగానే వింది. జాలిగా నన్ను చూసి, "నాకు నువ్వూ మంచి టెనంటువి. నిన్నొదులుకోవడం నాకిష్టం లేదు. కానీ ఏంచేస్తాం – తప్పదు" అని నిట్టూర్చింది.

"ఎందుకని?" అనడిగాను.

"నేను హార్ట్ పేషెంటుని. గొడవ భరించలేను. నిన్న మీ ఇంట్లోంచి అదో రకం శబ్దం వినిపించింది. నవ్వేమో అనిపించింది కానీ చాలా భయంకరంగా ఉంది. వళ్లు జలదరించిపోయింది. ఏదోలా ఐపోయాను. తేరుకుందుకు కాసేపు పట్టింది. ఇంకోసారి కనుక ఆ నవ్వు వినిపిస్తే నాకు హార్టెటాకొచ్చినా రావచ్చు" అంది ఒలోముచ్‌కీ.

ఆమెనుంచి ఇలాంటి పితూరీ వస్తుందని ఏమాత్రం ఊహించలేదు.

ఆమెకు హార్టెటాక్ తెప్పించగల శబ్దం---. అదీ ఓ నవ్వు--- అదీ మా ఇంట్లోంచి---

నిజంగా ఇది తోడేలు–మేకపిల్ల కథే అని రూఢి అయింది. ఆ మాటే అందామనుకుని మరీ మోటుగా ఉంటుందనిపించి ఓ క్షణం తటపటాయించాను.

ఎందుకైనా మంచిదని ఒక్కసారి మనసులో కాలాన్ని వెనక్కి తిప్పి నిన్న రాత్రికి వెడితే, చప్పున స్ఫురించింది నాకు.

నిజమే – హార్టెటాక్ తెప్పిస్తుందనుకోను కానీ, విచిత్రమైన నవ్వొకటి నిన్న రాత్రేకాదు, అప్పుడప్పుడు మా ఇంట్లో వినిపించడం కద్దు.

ఆ నవ్వు మా బాబుది!

ఆ విషయం స్ఫురించగానే నాకు ఏడవాలో, నవ్వాలో తెలియలేదు.

భాగవతంలో శ్రీకృష్ణుడు బాల్యంలో ప్రదర్శించిన దుడుకుతనానికి ముచ్చటపడి ఆ పరమాత్ముడి లీలలుగా చెప్పుకుంటుంటాం. కానీ మన పొరుగింట ఓ బాలకృష్ణుడుంటే భరించగలవారు మనలో ఎందరు?

ప్రతి తల్లీ ఒక యశోద. తన శిశువుని ఆమె బాలకృష్ణుడిగా భావిస్తుంది. ఆ బిడ్డమీద ఎటువంటి పితూరీనీ స్వీకరించదు.

బాల్యంలో ప్రతి బిడ్డకీ కొన్ని ప్రత్యేకతలుంటాయి.

వాటిలో కొన్ని అందరికీ బాగుంటాయి. కొన్ని కొందరికే బాగుంటాయి. కొన్ని తల్లికే బాగుంటాయి.

మచ్చుకి భువనేశ్వర్లో మా కాలనీలో రెండేళ్లలోపు చిన్ని కృష్ణుడొకడుండేవాడు. కృష్ణుడిలాగే వాడు ఎక్కువ మాట్లాడేవాడు కాదు. ఐతే కృష్ణుడిలా చిరునవ్వులు కూడా చిందించేవాడు కాదు. ముఖం చాలా అమాయకంగా మాత్రం ఉండేది.

భర్త ఆఫీసుకి వెళ్లేక ఆమె తన ఇంటి పనులు ముగించుకుని, వాణ్ణి చంకనేసుకుని ఎవరింటికైనా వెళ్లేది.

ఎవరింటికి తీసుకెళ్లినా, వాడు నిశ్శబ్దంగా ఆడుకుంటాడు.

ఎంత నిశ్శబ్దమంటే మొదట్లో పెద్దలు మాటల్లో పడి వాణ్ణి పట్టించుకునేవారు కాదు.

తర్వాత చూస్తే వాడు విహరించిన ప్రతి చోటూ – అప్పుడే భూకంపానికి గురైందా అనిపిస్తుంది.

బెడ్రూంలో మంచంమీద దుప్పట్లతో సహా బట్టలన్నీ చిందరవందర. వంటింట్లో చేతికంకిన డబ్బాల్లో పప్పులు, పోపు సామాన్లు – బాత్రూంలో వాషింగు పౌడర్లు వగైరాలు నేలమీద!

తల్లి అదంతా చూసి యశోదలా ముచ్చటగా నవ్వి, "మా ఇంట్లో ఏ వస్తువునీ మావాడికి అంకనివ్వం. ఇక్కడ అన్నీ అందడంతో రెచ్చిపోయినట్లున్నాడు" అని ఊరుకునేది.

అప్పట్నించీ ఆ బాలకృష్ణుడి లీలలు ముచ్చటగా కాక హెచ్చరికగా కాలనీవాసుల్ని చేరాయి.

ఆ యశోదమ్మ ఎప్పుడు ఎవరింటికొస్తుందో తెలియక ప్రతిఒక్కరూ ముందు జాగ్రత్తగా వస్తువుల్ని పిల్లలకందనంత ఎత్తులో ఉంచడం అలవాటు చేసుకున్నారు. ఐనా ఎక్కడో ఏదో పొరపాటు జరుగుతూనే ఉండేది. బాలకృష్ణుడది అవలీలగా పట్టేసేవాడు.

అలా చాలామంది అనుభవాలు మాకు చేరాయి. శ్రీమతి చాలా పద్ధతి మనిషి కాబట్టి, అందరి అనుభవాల్నీ గుర్తుంచుకుని తగిన చర్యలు తీసుకుంది. అందుకు అవసరమైన సాయం నేనూ చేశాను.

ఆలస్యంగానే ఐతేనేం ఒకరోజు మా ఇంటి వంతూ వచ్చింది.

బాలకృష్ణుడు ఇల్లంతా కలయ తిరుగుతుంటే, వాడికేమీ అందవు కదా అన్న ధైర్యంతో, శ్రీమతి ఆ యశోదమ్మతో కబుర్లలో పడిపోయింది. కబుర్ల మత్తులో ఉన్న వాళ్లని – ఉన్నట్లుండి ఫెళ ఫెళమన్న పెద్ద శబ్దమొకటి ఈ లోకంలోకి తీసుకొచ్చింది.

వెళ్లి చూస్తే మంచం మధ్యలో పెద్ద గొయ్యి.

బాలకృష్ణుడు మంచంమీద ఓ పక్కన నిలబడి ఉన్నాడు. వాడి మొహం అమాయకత్వపు ముద్దలా ఉంది.

అది నాలుగేళ్ల క్రితం చేయించిన టేకు మంచం. ఫ్రేములో అడ్డంగా అమర్చిన మందపు చెక్కల్ని కప్పుతూ ఓ కార్డుబోర్డు షీటు. దానిమీద గట్టిపడ్డ దూదితో ఒత్తయిన పరుపు. దానిమీద కాస్త మందంగా ఉండే దుప్పటి.

మంచం మధ్యలో ఏర్పడిన ఆ గోతిలోకీ దిగి ఉన్నాయి – దుప్పటి, పరుపు. కార్డుబోర్డు షీటు కూడా వంగింది తప్ప ఏమీ పాడవలేదు.

మరి గొయ్యి ఎలా ఏర్పడిందా అని మంచం కిందకి చూస్తే – విరిగిన చెక్కలు రెండు కనబడ్డాయి.

అరితేరిన కరాటే నిపుణుడు కూడా ప్రదర్శనలో విరవడానికి తటపటాయించేటంత మందమైన చెక్కలవి.

శ్రీమతి నమ్మలేనట్లు ఆ విరిగిన చెక్కల్నీ, బాలకృష్ణుణ్ణీ మార్చి మార్చి చూసింది.

వాడప్పుడు శకటాసుర సంహారం చేసిన బాలకృషుడంత అమాయకంగానూ ఉన్నాడు.

చెప్పొద్దూ ఆ క్షణంలో ఆ మొహం అలా కనబడితే శ్రీమతికి ముద్దొచ్చింది.

ఈలోగా యశోదమ్మ కలగజేసుకుని, "మంచం పాతదా?" అనడిగింది.

"చేయించి నాలుగేళ్లయింది" అంది శ్రీమతి పాత కొత్తల నిర్ధారణని ఆమెకే వదులుతూ.

"ఐతే పాతదే!" అని నిర్ధారించిన ఆమె తన బిడ్డ వంక ముచ్చటగా చూసి చంకనేసుకుని వెళ్లిపోయింది.

ఆ సాయంత్రం శ్రీమతి ఆ వివరాలు చెబితే నాకు నమ్మకం కుదరలేదు.

నేను కష్టపడి విరిగిన చెక్కల్ని తాత్కాలికంగా మేకులు కొట్టి అతికించి మళ్లీ మంచాన్ని యథాప్రకారం చేశాను.

ఓసారి మంచంమీదకెక్కి నెమ్మదిగా నడిచి చూశాను. గొయ్యి ఏర్పడలేదు.

తర్వాత శ్రీమతి వారిస్తున్నా వినకుండా మంచంమీద అటూ ఇటూ పరుగుకు కాస్త తక్కువన్నట్లు నడిచాను. ప్రమాదమేం జరుగలేదు.

అంటే అవుకుగా ఉన్నప్పుడు కూడా 48 కేజీల మనిషిని బలంగా ఎక్కి తొక్కినా విరగని చెక్కలవి. కానీ బలంగా ఉన్నప్పుడు 10–12 కేజీల బరువున్న బాలుడి ప్రతాపానికి ఇట్టే విరిగిపోయాయి. ఎవరైనా నమ్ముతారా?

స్వానుభవం కాకపోతే – మేమే నమ్మం!

ఆ తర్వాత ఆ చెక్కల స్థానంలో కొత్తవి వేయించడానికి నెల్లాళ్లు పట్టింది. అందాకా మేం నలుగురం రాత్రిళ్లు అదే మంచంమీద పడుకునేవాళ్లం. అప్పుడప్పుడు ఇటు దొర్లినా, అటు దొర్లినా భయమేసేది కానీ, ఆ చెక్కలు విరగలేదు. విరిగిన చెక్కలు మార్పించడం అవసరమా అన్న అనుమానమొచ్చింది కూడా!

ప్రతి శిశువులోనూ అసామాన్యం అనిపించే ప్రత్యేకతలతో ఓ బాలకృష్ణుడుంటాడనడానికి ఇదో ఉదాహరణ.

చిన్నప్పట్నించీ మా బాబుకి కొన్ని సరదాలున్నాయి. వాటిలో కృత్రిమంగా నవ్వడమొకటి.

వాడికి ఉత్సాహం వస్తే, దాన్ని ప్రదర్శించడానికి కావాలని అదోలా నవ్వేవాడు.

ఆ నవ్వు కొంచెం కీచుగా అదోలా ఉన్నప్పటికీ మాలోని యశోదా నందులకు అది భయంకరంగా ఎప్పుడూ తోచలేదు.

మా వాడికి మొహమాటం కాబట్టి ఆ నవ్వుని మా దగ్గరే తప్ప బయటివాళ్ల వద్ద ప్రదర్శించనూలేదు.

ఇన్నాళ్లకు ఆ నవ్వు మా ఇంటి తలుపుల్ని దాటి ఒలోముచ్‌కీ ఇంటి తలుపుల్ని కూడా దాటుకుని వెళ్లి ఆమెకు కర్ణకఠోరమైంది.

ఇది మేము కలలో కూడా ఊహించని విశేషం.

మేము యశోదా నందులం అనుకోవాలా, లేక ఆమెను పూతన అనుకోవాలా?

కావడానికి ఆమెది పూతన పెర్సనాలిటీయే కూడా! కానీ దేశం కాని దేశంలో ఆశ్రయమిచ్చి మేమంతా కలిసి ఒకచోట ఉండడానికి కారణమైన ఆమెను పూతన అని ఎలా అనుకోగలం?

కానీ ఇప్పుడామె మమ్మల్ని ఇల్లు ఖాళీ చెయ్యమందంటే – ఆ ఉక్రోషంలో తనని పూతన ఆవహించిందా అనుకోకుండా ఉండగలమా?

నాకొక విషయం స్పష్టం కావాలి. ఆమె నిజంగా మా బాబు నవ్వుకి భయపడిందా, లేక శ్రీమతి అన్నట్లు ఇది తోడేలు–మేకపిల్ల కథా?

మొదటిది నిజమైతే అసలు విషయం చెప్పి ఆమె భయం పోగొట్టాలనుకుని, "నువ్వు అనవసరంగా భయపడ్డావు. ఆ నవ్వు మా బాబుది. వాడికి మూడంటే మూడేళ్లు. వాడి నవ్వుకి భయపడ్డావంటే నమ్మడం నాకే కాదు, ఎవరికైనా కష్టం. మమ్మల్ని ఇల్లు ఖాళీ చెయ్యమనడానికి ఇంకేదో కారణముంది. సంకోచించకుండా చెప్పు. పరిష్కారం గురించి ఆలోచిద్దాం" అన్నాను అక్కడికది ఆమె సమస్య కూడా అన్నట్లు.

ఒలోముచ్‌కీ వెంటనే, "అది మీ బాబు నవ్వా? అంత చిన్నపిల్లాడు అంత భయంకరంగా నవ్వగలడంటే నమ్మడం నాకూ కష్టమే. నిజం చెప్పు. ఆ శబ్దానికి కారణం ఇంకేదో ఉంది" అంది తనూ ఇంచుమించు నా తరహాలోనే.

"నేను నిజమే చెబుతున్నా. ఇప్పుడు తెలిసింది – నీ సమస్య ఆ నవ్వే కదా! మాటిస్తున్నాను – మా వాడు మళ్లీ అలా నవ్వకుండా నేను, నా భార్య తగిన జాగ్రత్తలు తీసుకుంటాము" అన్నాను వేడుకోలుగా.

ఒలోముచ్‌కీ తల అడ్డంగా ఊపి, "చిన్నపిల్లల్ని నవ్వకుండా ఆపడం ఎవరివల్లా కాదు" అంది.

"మావల్లనౌతుంది" అన్నాను కాస్త మొండిగానే.

ఆమె నావంక అదోలా చూసి, "సరే, నీ మాట నమ్ముతాను. కానీ రేపే మీ బాబు నవ్వితే?" అంది.

కొంచెం మెత్తబడుతున్న సూచన కనబడ్డంతో తెగించి, "ఆమర్నాడే ఇల్లు కాళీ చేసేస్తాను" అన్నాను చప్పున.

"ఎల్లుండి చేసేది రేపే చెయ్యమన్నాను. అంతేగా!" అంటూ మొదటికొచ్చింది ఒలోముచ్‌కీ.

"సరేలే, రేపట్నుంచి ఇల్లు వెదుక్కోవడం మొదలెడతాను. లేదూ, వారంలోగా నా భార్యాబిడ్డల్ని ఇండియాకు పంపే ఏర్పాటు చేస్తాను. వాళ్లను పంపేస్తే నేనిక్కడుండొచ్చు కదా! అప్పుడు అద్దె కూడా మావాళ్లు రాకముందు ఎంతిచ్చేవాణ్ణో అంతే ఇస్తాను" అన్నాను.

'అలా కనబడతావు కానీ, వ్యవహారజ్ఞతలో నువ్వు చాణక్యుడివి' అని కాలేజీ రోజుల్నించీ నా మిత్రులు అనేవాళ్లు. వారి వారి కారణాల్ని బట్టి ఆ మాటలో కొంత స్తుతీ, కొంత నిందా ఉన్నాయి. అదంతా ఇప్పటికి అప్రస్తుతమైన వేరే పెద్ద కథ!

అప్పుడు మాత్రం – నిండా మునిగేక చలేమిటిలే అనే దశలో ఆ మాటనేశాను.

కానీ, ఆ మాటల వెనుక కూడా చాణక్యనీతి ఉన్నదని ఇంటామె స్పందనలో కానీ తెలియలేదు.

ఇల్లు అవసరం కాబట్టి, అప్పట్లో ఆమె అడిగిందానికి మారాడకుండా ఒప్పుకున్నాను కానీ, నాకు ముందున్న టర్కీ అతను అద్దె నాకంటే తక్కువే ఇచ్చేవాడు. ఆతర్వాత నా భార్యాబిడ్డలు వస్తారనగానే మరికొంచెం పెంచిందామె. దానికీ ఒప్పుకున్నాను.

ఇప్పుడు మావాళ్లు వెళ్లిపోతే తనకి రాబడి తగ్గిపోతుంది. నేను కూడా వెళ్లిపోతే మరికాస్త తగ్గిపోతుంది.

ఆ విషయం స్ఫురించినట్లుంది, "ఏంచేస్తాం? ఆరోగ్యంకంటే డబ్బేం ముఖ్యం కాదు కదా" అని కాస్త బింకంగా అని, "ఐతే నీమీద నాకు జాలిగా ఉంది. అద్దె మరో యాభై మార్కులు పెంచు. ఎలాగో సద్దుకుంటాను" అంది.

అంతే, ఆమె బేరానికి దిగుతున్నట్లు నాకు అర్థమైంది.

దాంతో ఒక్కసారిగా నాకు మనసు తేలికపడింది. చెప్పలేనంత ధైర్యమొచ్చింది.

అర్థమౌతూనే ఉంది — ముందు ఆరోగ్యాన్ని ప్రస్తావించి, తర్వాత అద్దె పెంచమనడం 'కృష్ణో రాజకంఠీరవా' అన్నట్లే ఉంది.

కానీ నేనా మాట పైకి అనలేదు. అనడం చాణక్యం అనిపించుకోదు.

ముందామె అవగాహనకు థాంక్సు చెప్పాను. తర్వాత యాభై మార్కులు మాత్రమే పెంచమని చెప్పిన ఆమె ఔదార్యాన్ని మెచ్చుకున్నాను.

అప్పుడు అసలు విషయానికొచ్చి, "నేనిక్కడ పరిశోధనకు రీసెర్చి స్కాలరుగా వచ్చాను తప్ప నాది ఉద్యోగం కాదు. నాకొచ్చేదాన్ని జీతమనరు. స్కాలరుషిప్పు అంటారు. ఆ విషయం నీకు తెలుసు" అని గుర్తు చేశాను.

ఆమె తెలుసన్నట్లు తలూపింది తప్ప, ఐతే నాకేమిటన్నట్లు చూడలేదు.

"నేను ఉద్యోగస్థుణ్ణే అయుంటే, నువ్వడిగిందానికి మరో పాతిక మార్కులైనా కలిపి ఇచ్చి ఉండేవాణ్ణి. నాకు ఎక్కువై కాదు. నువ్వు చాలా న్యాయంగా అడుగుతావని తెలుసు కాబట్టి" అన్నాను.

ఆమె మొహం వెలిగిందే తప్ప, ఆమె చూపుల్లో – వీడు తెలివిగా తప్పించుకుందుకు చూస్తున్నాడన్న భావం వ్యక్తం కాలేదు.

"నాకెంతో కష్టమైనప్పటికీ, నోరు విడిచి అడిగావు కాబట్టి, ఇప్పుడిచ్చేదానికి ఇంకో పాతిక పార్కులు మాత్రం అద్దె పెంచగలను" అన్నాను.

అది కూరగాయల బేరంలా ఉందని తెలిసినప్పటికీ — చిన్నతనంగా అనిపించలేదు.

ఎందుకంటే ఇండియాలో మా లాబొరేటరీ నుంచి రీసెర్చి ప్రాజెక్టుకోసం సెంట్రల్ గవర్నమెంటు డిపార్టుమెంట్లకి ప్రపోజల్ పంపేటప్పుడు అవసరమైనదానికంటే ఎక్కువ అడగడం రివాజు.

అప్పుడు వాళ్లు కూరగాయల బేరం మొదలెడతారు. చివరికి మేమనుకున్నకంటే కొంచెం ఎక్కువే కానీ తక్కువ రాదు.

కూరగాయల బేరం నాకు కొత్త కాదు కానీ, జర్మనీలో కొత్తే అనీ, వాళ్లకి అది నచ్చదనీ ఒక సందర్భంలో నా ప్రొఫెసర్ రాలెక్ స్పందనని బట్టి స్వానుభవమైంది. అది మున్ముందు ప్రస్తావిస్తాను.

అప్పుడు మాత్రం ఒలోముచ్‌కీ వెంటనే సరేననేసరికి నేను ఇంచుమించు షాక్ తిన్నాననే చెప్పాలి.

అదామె ఎక్కడ కనిపెట్టేస్తుందోనని హడావుడిగా ఆమెకు థాంక్సు చెప్పి సెలవు తీసుకుని మా గదికి వెళ్లిపోయాను.

ఆ తర్వాత జరిగింది వినగానే శ్రీమతికి షాక్.

మా ఇద్దరికీ తగిలింది షాకే ఐనా, మేము పట్టరాని ఆనందంలో ఉన్నామని గ్రహించి పిల్లలు హుషారెక్కిపోయారు.

బాబు అయితే నవ్వబోయాడు కానీ నేను చటుక్కున వాడి నోరు నొక్కి, "ఈ నవ్వుకే నెలకి పాతిక రూపాయలు ఫైను పడింది. ఇంకెప్పుడూ ఇలా నవ్వకు. నిన్ను ఇండియా పంపించెయ్యాల్సొస్తుంది" అన్నాను.

బాబు పెద్దగా చలించలేదు. నేను తన నోటిమీంచి చెయ్యి తియ్యగానే, "మరి నాతో అమ్మ కూడా వస్తుందిగా" అన్నాడు.

అప్రయత్నంగా వాణ్ణి దగ్గరకు తీసుకుని బుగ్గలమీద ముద్దాడాను.

అభం శుభం తెలియని పసివాడు.

తల్లి తన పక్కనుంటే చాలు, ఈ ప్రపంచంలో దేనికీ భయపడనక్కర్లేదనుకునే అమాయకుడు.

వాడి నవ్వుని అడ్డంగా పెట్టుకుని, మా ఇంటామె నానుంచి నెలకు పాతిక మార్కులు గుంజుతోంది.

మనసెలా ఒప్పిందో అనుకున్నాను కానీ బాలకృష్ణుడు నందయశోదలకు మాత్రమే బాలుడు – అన్న స్ఫురణ కూడా లేకపోలేదు.

ఆ రోజే నేను, శ్రీమతి అనుకున్నాం – పొరపాటున కూడా ఒలోముచ్‌కీకి ఇలాంటి అవకాశం మరొకటి ఇవ్వకూడదని.

ఇప్పుడు సుందరం బెర్లిన్ నగరానికి తనతోపాటు భార్యను కూడా తీసుకొస్తే ఓ నాలుగు రోజులు మా ఇంట్లో ఉండడానికి వీలవుతుందా అని అడుగుతున్నాడు.

ఒలోముచ్‌కీని అడిగితే సరేననొచ్చు. అందుకు అదనంగా చార్జి చెయ్యొచ్చు. ఆ తర్వాత ఏదో వంకన ఆ చార్జిని శాశ్వతం చెయ్యొచ్చు.

లేదా, అలా అడగడం నచ్చక – నన్ను మళ్లీ ఇల్లు ఖాళీ చెయ్యమనొచ్చు.

క్షణక్షణముల్ హౌస్‌ఫ్రౌ (లాండ్‌లేడీ) ల చిత్తముల్ – ఎలా ఉంటాయో తెలియదు.

సుందరం మా ఇంటికి రావడం ఓ తీపి జ్ఞాపకం కావాలి. అందుకని మేమిద్దరం చర్చించుకుని, ఈ విషయమై ఎలాంటి రిస్కూ తీసుకోకూడదని నిర్ణయించుకున్నాం.

"ఇండియాలో ఐతే, మారాలోచన లేకుండా హృదయపూర్వకంగా ఆ దంపతులకు స్వాగతం పలికేవాళ్లం" అని నొచ్చుకుంది శ్రీమతి.

ఐతే మనసులో కొంచెం గిల్టీ ఫీలింగ్ కూడా కలిగింది. దాన్ని అణచి పెట్టేసి – ఒలోముచ్‌కీని అడక్కుండానే – అతడు తన భార్య స్టే విషయంలో వేరే ఏర్పాటు చేసుకోవాలనీ, అందుకు అన్యథా భావించొద్దనీ బదులిచ్చాను.

దానికి సుందరం వెంటనే బదులిచ్చాడు.

"ఇందులో అన్యథా భావించడానికేముంది. మననిక్కడికి తీసుకొచ్చిన డాడ్ వాళ్లే – బెర్లిన్ నాకు మాత్రమే చూపిస్తామనీ, బస నాకు మాత్రమే ఏర్పాటు చేస్తామనీ, నేను ఆ బసలోనే ఉండాలనీ, నా భార్య నాతో వచ్చినా వేరే చోట ఉండాలనీ అన్నారు. ఇక్కడి పద్ధతులు ఇక్కడివి. ఇక్కడి ఆలోచనలు ఇక్కడివి. అలాగని మనం సరిపెట్టుకోవాలి. నేను నా భార్యని బెర్లిన్ తీసుకొచ్చే ఆలోచన మానుకున్నాను. మనం కలిసినప్పుడు చాలా విషయాలు సరదాగా పంచుకుందాం" – ఇదీ ఆ లేఖలో సారాంశం.

"సుందరం చాలా మంచివాడు. అర్థం చేసుకున్నాడు" అని తేలికగా నిట్టూర్చాను.

"మీరు తన గురించి ఇదివరకు చాలా చెప్పారు. అర్థం చేసుకోకపోయినా కూడా అతను చాలా మంచివాడే" అంది శ్రీమతి.

నిజమే.

నాకూ సుందరానికీ సుమారు ఏడాది క్రితం ఢిల్లీ విమానాశ్రయంలో జర్మనీ ప్రయాణంలో పరిచయమైంది.

విదేశయానమే కాదు, విమానయానమూ మాకు కొత్తే!

మేమెక్కిన తొలి విమానం లుఫ్తాన్సా కంపెనీదని ఇద్దరం గర్వపడ్డాం.

ఇద్దరి అభిరుచులూ, తత్వం ఒకటేనని గ్రహించి ఫ్రాంక్‌ఫుర్ట్ చేరేలోగా ఆత్మీయులమైపోయాం.

అక్కడ విడిపోయేక – ఉత్తరాల్లో స్వానుభవాలు పంచుకుంటూ ఆత్మీయతను కొనసాగిస్తున్నాం.

ఇన్నాళ్లకు మళ్లీ అతణ్ణి కలుసుకుంటున్నానని నాకు చాలా ఉత్సాహం వచ్చింది.

అదే ఉత్సాహం పిల్లల్లోనూ కలిగించాలనుకున్నాను.

అందుకు నాదో స్టైలుంది.

ఉదాహరణకి పిల్లలకు కొత్త కథ చెప్పేటప్పుడు – నేను వాళ్లకి రెండు మూడు రోజుల ముందునుంచీ – అందులోని విశేషాలు కొన్ని ప్రస్తావించి ఊరిస్తుంటాను. వాళ్లు పాత కథ వింటూనే కొత్తదానికోసం ఆత్రుతగా ఎదురు చూసేవారు.

ఇప్పుడు సుందరం గురించి కూడా వాళ్లకి ఎన్నో విశేషాలు చెప్పాను. కొంత కల్పన, కొంత వాస్తవం.

మా ఇంట్లో చాలా వ్యవహారాలకి సినిమా పాటల వాడకం ఎక్కువ.

అప్పట్లో మా టేపు రికార్డర్లో ఉన్న పాటల్లో, ఉండమ్మా బొట్టు పెడతా చిత్రంలో 'పాతాళ గంగమ్మ రారా, ఉబికుబికీ ఉరికురికీ రారా, పడగెత్తే పామల్లే పైకీ పాకీ, పరుగెత్తే జింకల్లే దూకీ దూకీ' – అనే పాటకి సన్నివేశంతో అన్వయించి అర్థం చెప్పేవాణ్ణి మా పిల్లలకి.

ఇప్పుడు సుందరం రాక గురించి వాళ్లకి చెప్పి – ఆ పాటలో 'పాతాళ గంగమ్మ రారా' అన్న చరణాన్ని 'మిత్రమా సుందరం రావయ్యా' అని మార్చి, మిగతా చరణాల్లో 'రారా' అని ఉన్న చోటల్లా 'రావయ్యా' అని మార్చి పాడేవాణ్ణి.

పిల్లలకి చాలా నవ్వొచ్చేది. రెండు మూడు రోజుల్లోనే వాళ్లు అసలు పాటని మర్చిపోయి ఈ పాటనే పాడుకోసాగారు.

ఆ పాట కారణంగా వాళ్లు సుందరం రాకకోసం నాకంటే ఎక్కువ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

శ్రీమతి కూడా సుందరానికిచ్చే ఆతిథ్యం గురించి ముందుగానే ప్లాన్ వేసుకుంది.

అతగాడు నాలుగు రోజులుంటే – ఆ నాలుగు రోజులూ నాలుగు రకాల వంటకాలు, పిండివంటలు చెయ్యాలని టైంటేబుల్ కూడా వేసుకుంది. ఐతే ఆత్మీయతాభావమే తప్ప ఒకళ్లని ఇంప్రెస్ చెయ్యాలనుకునే తత్వం కాదామెది.

అతగాడు శుద్ధ శాకాహార తెలుగు వంటకాల్నే ఇష్టపడతాడనీ, ఇక్కడికొచ్చినా వాటినతడు మిస్ కాకూడదనీ ఆమె తాపత్రయం.

ఆమె టైంటేబుల్ ప్రకారం అవసరమైన దినుసుల్ని కొని ఉంచుకున్నాం.

అతగాడు రావడానికి ఇంక ఒక్క రోజే ఉందనగా, మాకు అనుకోకుండా ఓ దుకాణంలో లెబెన్స్ మిట్టెల్ (ఫుడ్ అండ్ గ్రోసరీస్) విభాగంలో దోసకాయ దొరికింది. మా కళ్లని మేమే నమ్మలేకపోయాం. ఎందుకంటే అక్కడ దోసకాయలు దొరకవు కాక దొరకవని ఎన్నో ఏళ్లుగా ఉంటున్న మిత్రులు కొందరు చెప్పారు.

శ్రీమతి ఆ రాత్రే దోసావకాయ పెట్టి, "ఈ ఐటం మీ మిత్రుడికి పెద్ద సర్‌ప్రయిజ్ ఔతుంది" అంది.

ఆమె ఉత్సుకతకి ఆశ్చర్యపడుతూనే, "ఇంతమంది వచ్చివెళ్లారు కానీ సుందరం రాక అందరి రాకకూ భిన్నంగా, అపూర్వమైన తీయని అనుభూతుల్ని కలిగిస్తుందని నాకు అనిపిస్తోంది" అన్నాను.

భిన్నమూ, అపూర్వమూ, తీపితో పాటు – కొంచెం చేదు కూడా కలిసే అవకాశముందని అప్పుడు నాకు తెలియదు.

సుందరం ఆ రోజు మధ్యాహ్నానికి బెర్లిన్ వస్తాడు. సాయంత్రం అతణ్ణి డాడ్ వాళ్ల గెస్ట్ హౌసు దగ్గర సకుటుంబంగా కలుసుకుందామని మేమనుకున్నాం. ఉదయం లేచింది మొదలు పిల్లలు– 'మిత్రమా సుందరం రావయ్యా, ఉరికురికీ ఉబికుబికీ రావయ్యా, పడగెత్తే పామల్లే పైకీ పాకీ, పరుగెత్తే జింకల్లే దూకీ దూకీ' అంటూ పాట లంకించుకున్నారు.

శ్రీమతి వాళ్ల పాటకు ముచ్చట పడుతూనే, "ఇలాంటివన్నీ నేర్పి మీరు వీళ్లని పాడు చేస్తున్నారు. అతడొచ్చినప్పుడు, మొహంమీదే ఇలా పాడితే మీరు తన రాకని వేళాకోళం చేస్తున్నారని అనుకోడూ" అని నన్ను కసిరింది.

నేను నవ్వి, "నువ్వు పిల్లల గురించి అంటున్నావు. నేనే అతణ్ణి ఈ పాటతో ఇంటికి ఆహ్వానిద్దామనుకుంటున్నాను" అన్నాను.

"నిజంగా అలా చేశారు కనుక" అని మందలించి, "పిల్లలకి గట్టిగా చెప్పండి– అతడి ముందు ఈ పాట పాడొద్దని" అని ఆర్డరేసింది.

"నేర్పడం వరకే నా వంతు. సరిదిద్దడం నీ వంతు" అని చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయాను.

నా ఆఫీసు జీవితంలో భువనేశ్వరుకీ, ఇక్కడికీ తేడా లేదు. అక్కడ 9–12.30 మార్నింగ్ సెషను. ఓ గంట లంచి బ్రేకు. భోజనం ఇంటి దగ్గరే. మళ్లీ ఈవెనింగ్ సెషను 1.30–4.30. వారానికి 6 రోజులు ఆఫీసు. రెండో శనివారం అదనపు సెలవు. ఇక్కడ మార్నింగ్ సెషను 8–12, ఈవెనింగ్ సెషను 1–5. లంచి బ్రేకు 12–1. ఆఫీసు దగ్గరే కాబట్టి భోజనం ఇక్కడా ఇంట్లోనే. వారానికి 5 రోజులే ఆఫీసు.

మధ్యాహ్నం లంచికి ఇంటికొచ్చినప్పుడు శ్రీమతి సుందరం ఫోను గురించి అడిగింది. ఇంకా ఫోను రాలేదనీ, అతడు బెర్లిన్ చేరేసరికి సాయంత్రం 4 కావచ్చు కాబట్టి ఆ తర్వాత ఫోన్ చేస్తాడనీ చెప్పాను.

"ఒకవేళ రావడం లేటై, అతడు బెర్లిన్ చేరేసరికి 5 దాటిపోతే, ఫోను కుదరదుగా, ఇక రేపే అతణ్ణి కలుసుకోవడం" అంది శ్రీమతి.

"మనమున్నది జర్మనీలో. సుందరం నాలుక్కి వస్తానంటే నాలుక్కే వస్తాడు. నేను ఐదింటిదాకా ఆఫీసులో ఉంటాను కాబట్టి ఆలోగా అక్కడికి ఫోను చేస్తాడు" అన్నాను.

"చేసినా ఆ విషయం మాకు తెలియదుగా. కాబట్టి నేటికి మనమతణ్ణి కలుసుకోవడం కుదరదు" అంది శ్రీమతి.

ఆఫీసులో నా లాబ్‌కి ఎక్స్‌టెన్షన్ ఫోనుంది. ఆ నంబరు సుందరానికి ఇచ్చాను. కానీ ఇక్కడ ఇంట్లో మా గదికి ఫోను లేదు. నేను శ్రీమతికి విషయం తెలియజేసే అవకాశం లేదు.

"సుందరం రావడం గ్యారంటీ కాబట్టి మనమతణ్ణి కలుసుకోవడం కూడా గ్యారంటీయే. నా మాట విని అతగాడు బెర్లిన్ చేరినట్లు ఫోనొచ్చేసిందనే అనుకో. నేను ఇంటికొచ్చేసరికి నువ్వు, పిల్లలు సిద్ధంగా ఉండండి. మనం వెళ్లి సుందరాన్ని కలుద్దాం" అన్నాను.

అయిష్టంగానే తలూపింది తను. నేను ఆఫీసుకి వెళ్లిపోయాను.

ఇలాంటి సమయంలో టైం గడవడం కష్టం. మాటిమాటికీ టైం చూసుకోవడంతో ఏకాగ్రత దెబ్బ తింటుంది. అప్పటికి నేను చేస్తున్న కెమికల్ రియాక్టర్ తయారీ వ్యవహారానికి ఏకాగ్రత బాగా అవసరం. అందుకని ఆఫీసుకి వెడుతూనే కొన్నాళ్లుగా వాయిదా వేస్తున్న కెటలిస్ట్ తయారీ ప్రయోగం మొదలెట్టాను.

హాట్ ప్లేటుమీద బీకర్లో ఐరన్, క్రోమియం నైట్రేట్ల సొల్యూషన్. దానికి జతపడిన యూరియా, మరికొన్ని రసాయనాలు. ఆ ద్రావకం సన్నని సెగలో వేడెక్కుతుంటే, ద్రావకమంతటా కొంచెం కొంచెంగా విడుదలయ్యే అమ్మోనియమ్ హైడ్రాక్సయిడుతో రసాయనిక చర్య వల్ల క్రమంగా బయటపడుతున్న ఐరన్–క్రోమియమ్ హైడ్రాక్సయిడ్ ప్రెసిపిటేట్. అది అడుక్కు స్థిరపడితే, వేడెక్కుతున్న ద్రావకం ఎగసి ఎగసి పడి బయటకు చిమ్మే ప్రమాదముంది. అలా జరక్కుండా ఆపడానికి, అందులో గిరగిర తిరిగే కవ్వంలాంటి ఎలక్ట్రిక్ స్టర్రర్. పది నిముషాలకోసారి ఆ కవ్వాన్ని ఆపి, తేరుకున్న పైనీటిని కొంచెం తీసి చల్లార్చి పీహెచ్ మీటర్లో పీహెచ్ ఎలా పెరుగుతున్నదీ చూసి, ఎప్పటికప్పుడు రీడింగ్సు నోట్ చేసుకోవడం. పీహెచ్ అనుకున్న విలువకు చేరుకుని మరి పెరక్కుండా ఆగిపోయేక, తేరుకున్న నీటిలో ఇంకా క్రోమియం, ఐరన్ ఉన్నవా అని రసాయనికపరీక్షతో నిర్ధారణ. కవ్వాన్ని ఆపినప్పుడు అడుక్కు స్థిరపడ్డ ఘనపదార్థంవల్ల ద్రావకం ఎగసి పడేలోగానే మళ్లీ కవ్వాన్ని తిప్పడం. ద్రావకంలోని మొత్తం ఐరన్, క్రోమియం హైడ్రాక్సయిడ్సుగా మారేక, వేరుపడ్డ ఘనపదార్థాన్ని వడపోతతో వేరు చేసి, కడిగి శుభ్రపర్చడం. ఇదీ ప్రయోగం.

ఈ ప్రయోగాన్ని నిర్ధారించడానికి నాకు ఇండియాలో సుమారు రెండు నెలలు పట్టింది. ఇక్కడికొచ్చేక, కాస్త హెచ్చు మొత్తంలో తయారు చెయ్యడానికి అవసరమైన మార్పులు చెయ్యడానికి నెల రోజులు పట్టింది. ఒకసారి తయారీ విధానం నిర్ధారించేక, దీన్ని అనుసరించడం చాలా సులభం. రసాయనశాస్త్రానికి సంబంధించినంతవరకూ విద్యార్థులు ప్రాథమిక దశలో అవలీలగా చేసే ప్రయోగాలలాంటిది. చేస్తున్నప్పుడు బుర్రకి పెద్దగా పనుండదు కానీ, మరో పని చెయ్యడానికి వీలుండదు. దృష్టంతా దానిమీదే ఉండాలి. ఆపైన ఈ ప్రయోగం కెటలిస్టు తయారీలో అత్యంత కీలకం. కెటలిస్టుల్ని పరీక్షించే రియాక్టర్ తయారీ విషయమై బిజీగా ఉంటున్న నేను కొద్ది రోజులుగా ఈ ప్రయోగాన్ని వాయిదా వేసి, క్లిష్టమైన ఇతర ప్రయోగాలతో బుర్రకి పని చెబుతున్నాను.

రియాక్టర్ రెడీ కావడానికి ఇంకా టైముంది కాబట్టి, కెటలిస్టు అవసరం ఇంకా రాలేదు.

ఈరోజు నాకు సమయం గడవాలి. బుర్రకి ఆట్టే పనుండకూడదు. అందుకే ఈ ప్రయోగాన్ని ఎన్నుకున్నాను.

ప్రయోగంలో వడపోత పూర్తయ్యేక, నాకు ఫోనొచ్చినట్లు చెప్పాడు హైనర్ డెకర్ట్. అది సుందరంనుంచే అని ఊహించి టైం చూసుకుంటే నాలుగుం పావు. అంటే తెలియకుండానే టైం గడిచిపోయింది.

సుందరం ప్రోగ్రాం అనుకున్నట్లే జరిగింది. క్షేమంగా బెర్లిన్ చేరుకున్నాడు. కుర్ఫ్యూర్‌స్టెన్ డామ్ దగ్గర డాడ్ సంస్థకు చెందిన గెస్టుహౌసులో ఉన్నాడు. చిరునామా చెప్పాడు.

అచ్చ తెలుగు మనిషి. అచ్చతెలుగు మాట. రాగానే ఇలా సమాచారం అందించిన అచ్చతెలుగు పద్ధతి. ఆత్మీయంగా అనిపించింది.

"ఏడయ్యేలోగా మేమొచ్చి నిన్ను కలుసుకుంటాం. మా ఇంటికి తీసుకెడతాం. ఈరాత్రికి మా ఇంట్లోనే భోజనం" అన్నాను.

"వస్తానన్నావుగా, అన్నీ కలుసుకున్నాక మాట్లాడుకుందాం" అని ఫోను పెట్టేశాడు సుందరం.

సుందరం నా పిలుపుకి ఎంత సంతోషించాడో అతడి గొంతు వినగానే తెలిసిపోయింది. తృప్తిగా అనిపించింది.

ఫోను పెట్టేసేసరికి టైం నాలుగున్నర. అప్పట్నించి ఐదయ్యేదాకా గడియారం నత్త నడక నడిచింది. ఐదవగానే నేను ఆఫీసునుంచి బయటికి చిరుతలా లంఘించాను. రెండే రెండు నిముషాల్లో ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్ ఊబాన్‌హాఫ్ చేరాను. వెళ్లీ వెళ్లగానే ఊబాన్ వచ్చింది. ఒక్క నిముషంలో మా స్టేషన్ డాయిచే ఓపర్ కి చేర్చింది. అక్కణ్ణించి మళ్లీ చిరుతనై రెండే రెండు నిముషాల్లో ఇల్లు చేరాను.

అప్పటికే శ్రీమతి, పిల్లలు తయారై సిద్ధంగా ఉన్నారు. రామాయణంలో హనుమంతుడు రాముడికి, 'చూసితిని సీతను' అని చెప్పినట్లు, "మనం వెడుతున్నాం" అన్నాను ఆమెతో. వెంటనే పిల్లలు అందుకున్నారు, "మిత్రమా సుందరం రావయ్యా-----"

"ఆపండి" వాళ్లని కసిరింది శ్రీమతి.

నలుగురం బయల్దేరి డాయిచే ఓపర్ చేరాం. ఎక్కువసేపు ఎదురుచూడకుండానే ఊబాన్ వచ్చేసింది. బాబు శ్రీమతి చెయ్యి పట్టుకుంటే, నేను పాప చెయ్యి పట్టుకున్నాను. పాపకి నేనలా తన చెయ్యి పట్టుకోవడం ఇష్టముండదు. తనకు తానుగా ఊబాన్ ఎక్కగలనని అనుకుంటుంది. అది నిజం కూడా! ఎందుకంటే ఇలాంటివి బ్రహ్మవిద్యలు కావు. అలవాటుని బట్టి ఉంటాయి.

మూడేళ్ల మా బాబుకీ తనకి తానుగా ఊబాన్ ఎక్కగలనని నమ్మకమే! కానీ ఊబాన్ రాగానే అప్రయత్నంగా అమ్మ చేయి పట్టుకుంటాడు.

పాపకి తను వాడికంటే పెద్ద అన్న ఫీలింగుంది. ఇలాంటి సందర్భాల్లో అదెప్పుడూ మా చేతులు పట్టుకోదు. కానీ నేను చెయ్యి పట్టుకుంటే అయిష్టం నటిస్తుందే తప్ప విడిపించుకోదు.

ఊబాన్ మమ్మల్ని కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ చేర్చడానికి నాలుగైదు నిముషాలు తీసుకుందేమో. మేమేమో స్టేషన్లోంచి బయటపడి రోడ్డెక్కగానే పిల్లలిద్దర్నీ చూస్తూ, "మనమిప్పుడు ఎక్కడికెడుతున్నామో తెలుసా?" అనడిగాను.

అంతే, ఇద్దరూ ఏకకంఠంతో, "మిత్రమా, సుందరం రావయ్యా" అని పాట లంకించుకున్నారు.

"మీరొకరు? మరిపించాలని నేను చూస్తుంటే, తీరికూర్చుని వాళ్లకి మళ్లీ గుర్తు చేస్తారు" అని శ్రీమతి విసుక్కుంది.

చేతిలో బెర్లిన్ సిటీ మ్యాప్. ఇంటి నంబరు తెలిస్తే చాలు, క్షణాలమీద చిరునామా పసికట్టేసేలా రూపొందించబడిన ఆ మహా పటాన్ని చూడగానే నాకు యశోదకు మొత్తం భూగోళాన్ని చూపించిన కృష్ణుడి నోరు గుర్తొస్తుంది.

సుందరం చెప్పిన నంబరు నా బుర్రలో ఉంది. మాప్ సాయంతో మేం నలుగురం సుందరం ఉండే చోటు చేరడానికి ఎంతోసేపు పట్టలేదు. ఆ చోటు అదేనని నిర్ధారించుకుందుకూ ఎంతోసేపు పట్టలేదు. సుందరం అటూ ఇటూ పచార్లు చేస్తూ బయటనే కనిపించాడు. అటూ ఇటూ చూస్తూ మమ్మల్నీ గమనించాడు.

మేం కలుసుకుని ఎన్నో నెలలైనా ఒకరినొకరు ఇట్టే గుర్తు పట్టాం. అతడికీ, మా కుటుంబానికీ పరస్పరం పరిచయాలయ్యేక, శ్రీమతికి కూడా దగ్గర బంధువుని కలుసుకున్నట్లే అనిపించింది. ఆమె చప్పున అతణ్ణి మా ఇంటికి ఆహ్వానించింది.

"నాకైతే ఊరు చూడాలని లేదు. అన్ని రోజులూ మీ ఇంట్లోనే గడపాలనుంది. కానీ ఇక్కడ మన పెత్తనమేం లేదు. డబ్బు ఖర్చు పెట్టి ఇక్కడికి తీసుకొచ్చారుగా, అంతా వాళ్లు చెప్పినట్లే చెయ్యడం మర్యాద" అని నిట్టూర్చాడు సుందరం.

ఓ గంటలో డాడ్ సభ్యులతో సమావేశముంది. బెర్లిన్ చూడ్డానికి వచ్చినవారందరూ అందులో విధిగా పాల్గొనాలి. బెర్లిన్ గురించీ, ఆ నగరపు చారిత్రక ప్రాధాన్యం గురించీ తెలుసుకోవాలి. కాబట్టి ఈ రోజుకి అతడు మా ఇంటికి రాలేదు. ఆ విషయాన్నే అతడు మాకు మర్యాదగా చెప్పాడు.

అతడు తన నాలుగు రోజుల కార్యక్రమాన్నీ క్లుప్తంగా వివరించాడు.

రోజూ ఉదయం అల్పాహారవిందు. సుమారు 11 తర్వాత నగర సందర్శనానికి బయల్దేరాలి. కాబట్టి అతడు అక్కడి అల్పాహారాన్ని వదులుకుని ఆ సమయాన్ని మా ఇంట్లో గడుపుతాడు. రాత్రి ఏడు తర్వాత మా ఇంటికి డిన్నరుకి వచ్చి 10 దాకా గడిపి వెళ్లిపోతాడు. "మీ ధర్మమా అని – టిఫినుకీ, రాత్రి భోజనానికీ వీళ్ల తిండి తప్పింది" అన్నాడతడు.

పాశ్చాత్యులకి వాళ్ల తిండి గొప్ప. మన తిండి అంటే చిన్నచూపు. మనకీ అంతేనని వాళ్లే కాదు, మనవాళ్లలో కూడా చాలామంది అనుకోరు. ఎందుకంటే – వాళ్ల వంటకాలకి అలవాటు పడ్డం ఆధునికతకి నిర్వచనమనుకునేవారు మనలో ఎక్కువ. ఐతే మనలో కూడా కొందరు వాళ్ల ఎదుట కాకపోయినా, చాటుగా ఐనా వాళ్ల తిండిని చిన్నబుచ్చడానికి సంకోచించరు. వాళ్లలో సుందరం ఒకడు.

నేను మాత్రం వెంటనే, "మర్యాదకి నువ్వలాగన్నా, మాకోసం నువ్వు ఏం వదులుకుంటున్నావో నాకు తెలుసు. ఆతిథ్యం విషయంలో వీళ్లు డబ్బుకి ఏమాత్రం వెనుకాడరు. ఎంతోమంది మనవాళ్లకి కూడా వీళ్ల విందులు ఓ కల" అన్నాను.

"అది ఆల్కహాలికులకి. మనలాంటి హాలికులకి కాదు" అని నవ్వాడు సుందరం.

అక్కడ మేమో పావుగంట ఉన్నాం. సుందరంనుంచి వీడ్కోలు తీసుకున్నాక, "అక్కడున్నంతసేపూ నాకు ఒకటే టెన్షన్. మరి కాసేపుంటే మనవాళ్లు పాట అందుకుంటారేమోనని" అంది దారిలో.

"సుందరం హాస్యప్రియుడు. అర్థం చేసుకోవడమే తప్ప అపార్థం చేసుకోవడం తెలియని మంచివాడు. మనవాళ్ల పాట వింటే సంతోషిస్తాడే తప్ప నొచ్చుకోడు. ఐనా నీకు నచ్చలేదు కాబట్టి ఆ పాటని ఇంతటితో మర్చిపొమ్మని పిల్లలకి నచ్చజెబుతాన్లే" అన్నాను.

మావాళ్లు బంగారు కొండలుగా, ఇల్లు చేరేలోగా తామా పాటని ఇంక పాడమని హామీ ఇచ్చేశారు.

ఇల్లు చేరేసరికి పిల్లలు బాగా అలసిపోయారు. ఎలాగో భోంచేసి పడుకున్నారు.

పెళ్లయినప్పట్నించీ కూడా ప్రతి విషయంలోనూ ముందుగా ప్రోగ్రాం వేసుకోవడం మా ఇద్దరికీ అలవాటు. ప్రతి ఏటా జనవరి ఒకటవ తేదీన – ఇద్దరం కూర్చుని – ఆ ఏడాది వేడుక జరుపుకునే పండుగలు, జన్మదినాలు వగైరా విశేషాల్ని ఓ కాగితంమీద వ్రాసుకుని బడ్జెట్ వేసేవాళ్లం. ఆ తర్వాత ప్రతినెలా ఆ బడ్జెటుని పునఃసమీక్షించేవాళ్లం. బంధుమిత్రుల రాక గురించి తెలిసినప్పుడు, వాళ్లనెలా ఆదరించాలో కనీసం వారానికి ముందే నిర్ణయించేవాళ్లం. అనుకోని ఖర్చులు వచ్చినప్పుడు, అప్పనేది చెయ్యకుండా ఉండడానికి, అనుకున్న ఖర్చుల్లో వేటిని మినహాయించాలో తేల్చుకునేవాళ్లం. మాకున్న బాధ్యతల్ని, మాకొచ్చే ఆదాయంతో అనుక్షణమూ బేరీజు వేసుకునే ఈ అలవాటు మాకు మా ఆదాయాన్ని అక్షయపాత్ర చేసింది. మా ముందుచూపు బంధుమిత్రుల్లో మాకు మంచి పేరు తెచ్చింది.

సుందరం గురించి మేమిద్దరం ముందే ప్లాను సిద్ధం చేసుకున్నప్పటికీ, ఇప్పుడతడి ప్రోగ్రాం గురించి మాకు నిరుష్టంగా తెలియడంవల్ల –నేను, శ్రీమతి రానున్న నాలుగు రోజుల ప్రోగ్రాం గురించి మరోసారి చర్చించాం.

"మీరన్నది నిజమే! డాడ్ వాళ్ల విందుని అతడు మనకోసం మిస్సవుతున్న విషయం ఇంతవరకూ నా బుర్రకెక్కలేదు. అతడికా లోటుని స్ఫురణకి రాకుండా చెయ్యాలి మన ఆతిథ్యం. తెలుగువాళ్ల స్పెషల్ పెసరట్–ఉప్మాని రేపటికి ప్లాన్ చేసి మంచి పని చేశాం" అందామె.

నేను అడ్డంగా తలూపి, "కానీ పెసరట్–ఉప్మా ఐతే హెవీ ఔతుంది. ఈ రాత్రి డిన్నర్లో అక్కడేం తింటాడో, రేపటికి అతడి జీర్ణశక్తి ఎలా మారుతుందో తెలియదు. కాబట్టి ఆ టిఫిను ఆఖరి రోజుకి ప్లాన్ చేద్దాం. స్టమక్ అప్సెట్టయినా అప్పటికి ఇల్లు చేరిపోతాడు" అన్నాను.

శ్రీమతి భృకుటి ఒక్క క్షణం ముడత పడింది. ఆ వెంటనే, "భలే చెప్పారండీ. మీ సూచనతో మొత్తం షెడ్యూల్ మార్చేస్తాను" అంది.

నా జోక్యంతో తన ప్లాను మార్చినందుకు కోపం వచ్చిందేమోనని ముందు నొచ్చుకున్నాను. కానీ ఆమె వివరించేక, ఆతిథ్యం విషయంలో ఆడవాళ్ల ఆలోచనల లోతు అప్పుడే నా అవగాహనకు వచ్చింది.

సుందరాన్ని కలుసుకున్నప్పుడు శ్రీమతికి కొత్తగా అనిపించలేదు. అందుకు కారణం అపరిచితుల్ని కూడా క్షణాలమీద ఆత్మీయుల్ని చేసుకోగల అతడి వ్యక్తిత్వం. అంతమాత్రాన అతడికి మొహమాటం ఉండదని కాదు. దాన్నతడు చొరవ చాటున మభ్యపర్చాడు. నిజానికి

ఈరోజే అతడికి మా కుటుంబంతో పరిచయం అయింది. అలాంటప్పుడు వరుసగా నాలుగు రోజులు
మా ఆతిథ్యం తీసుకోవడానికి మనసు వెనుకాడకుండా ఉండదు. ఒక రోజు గడిచేక ఏదో వంక పెట్టి మర్నాడు రాకపోవచ్చు కూడా. అత్తారింట ఉన్న భారవికి జరిగినట్లు, మా ఆదరణ రోజు రోజుకీ పల్చబడకూడదు.

ఒక విధంగా చెప్పాలంటే అతడు మా ఇంట నాలుగు రోజులూ ఆతిథ్యం స్వీకరిస్తే, అది మా ఆదరణకు లభించే యోగ్యతాపత్రం.

"కాబట్టి మన ఆతిథ్యం సింపులుగా మొదలవ్వాలి. మొన్నటికన్నా నిన్న వింతగా, నిన్నటి కన్నా నేడు వింతగా – అనిపించాలతడికి. వెళ్లిపోయే రోజున, అప్పుడే వెళ్లిపోతున్నానా అనిపించేటంత ఘనంగా ఉండాలి" అంది శ్రీమతి.

ఇది నా ఊహకి తట్టలేదు. ఆమె చెప్పింది వినగానే, మహిళే అన్నపూర్ణ కావడానికి కారణం తెలిసింది.

"కురుక్షేత్ర యుద్ధానంతరం భీష్ముడు ధర్మరాజుకి రాజధర్మాలని ఉపదేశిస్తాడు. ఆ వివరాలు మహాభారతంలో అనుశాసనిక పర్వంలో ఉన్నాయి. మన దేశంలో ప్రతి మహిళా ఆతిథ్య ధర్మాల్ని ఉపదేశించగల ఓ భీష్ముడని ఇప్పుడు నాకు అర్థమైంది" అని అప్రయత్నంగా ఆమెని మెచ్చుకున్నాను.

ఆ తర్వాతనుంచి ఆమె చెప్పడం, నేను వినడం. రానున్న నాలుగు రోజులకూ మా దైనందిన కార్యక్రమంలో మార్పుల్ని నిర్ణయించాం. వాటిలో నా ఆఫీసు వేళలు కూడా ఉన్నాయి.

నేను డాడ్ స్కాలర్ని. ఓ ఏడాది ఉండి వెళ్లిపోయేవాణ్ణి. జర్మనీలో సాంస్కృతిక, సాంఘిక, వైజ్ఞానిక వాతావరణాన్ని పరిచయం చేయడం ఈ స్కాలరుషిప్పు ముఖ్యోద్దేశ్యం. రీసెర్చిలో అనుకోనిది ఏదైనా సాధిస్తే అది బోనస్. అంతకుమించి మానుంచి వారు ఆశించేది తక్కువ. అందువల్ల నేను రోజూ ఆఫీసుకొస్తున్నానా, ఆఫీసు వేళలు పాటిస్తున్నానా, అన్న విషయాన్ని అంతగా ఎవరూ పట్టించుకోరు. కానీ నా తీరు తేడాగా ఉంటే అది గమనించడం జరుగుతుంది. నా గురించి తేడాగా అనుకుంటారు కానీ అనుకుని ఊరుకుంటారంతే!

ఐతే ఇక్కడ నేను నేను కాదు. భారతీయుణ్ణి. నన్ను నన్నుగా కాక ఒక భారతీయుడిగా గుర్తుంచుకుంటారు వీళ్లు. నా తీరు నా దేశానికి అంటగట్టబడుతుంది. నేనేం చేసినా ఆ విషయం మర్చిపోకూడదు. నేను నాకు నచ్చిన తీరులో ఉంటూనే, నా దేశాన్ని చిన్నబుచ్చే తీరుకి దూరంగా ఉండాలి. ఇది మొదట్నించీ నాలో ఉన్న అభిప్రాయం.

రీసెర్చి పరంగా కూడా నాకిది అపూర్వావకాశం. నేను ఇండియాలో ఉండగా చెయ్యలేని పరిశోధనలకు ఇక్కడి లాబొరేటరీని, ఇక్కడి సదుపాయాల్ని, నైపుణ్యాల్ని ఉపయోగించుకోవాలి. నా ప్రొఫెసర్ రాలెక్ ఈ నా తపనను గుర్తించి – నామీద ప్రత్యేకశ్రద్ధ చూపిస్తున్నాడు.

అందుకే మర్నాటినుంచి సుందరానికి వీలుగా ఉండేలా నా ఆఫీసు వేళలు మార్చుకున్నప్పటికీ, పని వేళలు రోజుకి ఎనిమిది గంటలు ఉండాలనుకున్నాను. అడిగేవాళ్లు లేనప్పుడు పాటిస్తేనే, అది అసలైన క్రమశిక్షణ అనిపించుకుంటుంది కదా!

"రేపట్నించి ఉదయం ఆఫీసుకి రెండు గంటలు లేటుగా వెడతాను. లంచికి ఇంటికి రాను. సాయంత్రం ఐదుకి బదులు ఆరుకి వస్తాను. ఇంటి పనులన్నీ నువ్వే పూర్తిగా మానేజ్ చేసుకోవాలి" అన్నాను శ్రీమతితో.

"మన పిల్లలు బంగారు కొండలు. అదనంగా ఒక్క మనిషికిచ్చే ఆతిథ్యంకోసం, నాకు మీ సాయం అవసరమనిపించదు" అంది తను.

మర్నాడుదయం ఎనిమిది దాటేసరికి సుందరం మా ఇంటికొచ్చాడు. మాటిచ్చిన ప్రకారం ఆ సాయంత్రం ఏడుకి కూడా వచ్చాడు. ఆ మర్నాడూ, ఆ మర్నాడూ కూడా అలాగే వచ్చాడు. నాల్గవరోజున వాళ్లని షాపింగుకోసం వదిలేశారుట.

"ప్రతిరోజూ షాపింగుకి ఎంతో కొంత సమయం దొరుకుతోంది. అది చాలు నాకు. నాలుగో రోజు మొత్తం మీ ఇంట్లోనే గడుపుతాను" అన్నాడు సుందరం.

అతడు అలాగనడం మా ఆదరణకు యోగ్యతాపత్రంలా మాత్రమే కాదు, మాకో వరంలా కూడా అనిపించింది. ఎందుకంటే అతడు మాతో గడిపిన ప్రతి క్షణమూ ప్రత్యేకమే!

సుందరం రీసెర్చిలో ఎంత ఘటికుడో, నిజజీవితంలో అంత సంసారపక్షం మనిషి.

అతడికి ఉమ్మడి కుటుంబపు అనుబంధాలు తెలుసు. వంటింటి చిట్కాలు తెలుసు. మన విలువలు తెలుసు. ఆమేరకు పాశ్చాత్యుల విలువలపై సదభిప్రాయం లేనప్పటికీ, వారినుంచి నేర్చుకోతగిన, నేర్వవలసిన సత్సంప్రదాయాలూ తెలుసు.

అతడు స్వంతమనిషిలా కలిసిపోవడంవల్ల, మాకు ఇంట్లో ఓ అతిథి ఉన్నాడన్న భావమే కలుగలేదు.

శ్రీమతి వంటల్ని అతడు చాలా మెచ్చుకున్నాడు. అప్పుడు నేనతడితో, "తను ఇంకా హైస్కూల్లో ఉండగానే పెళ్లయిపోయింది. ఇంట్లో వంట నేర్చుకునే అవకాశం రాలేదు. చిన్నప్పట్నించీ మా అమ్మ వంటకి పైపనుల్లో కూరలు తరగడం, రోట్లో దంపడం వగైరా సాయాలు చెయ్యడమే తప్ప నాకూ వంటపట్ల అవగాహన లేదు. నేను నా కెమిస్ట్రీ అనుభవానికి ఊహని కొంత జోడించి తనకి వంట నేర్పాను. తను మహిళలకు ప్రత్యేకమైన ప్రేమానురాగాలతో తన వంటకు మెరుగులు దిద్దింది. వంట తెలిసినవారెవర్ని కలుసుకున్నా వంటింటి చిట్కాల్ని అడిగి తెలుసుకుంటూంటుంది. నీకేమైనా చిట్కాలు తెలిస్తే చెప్పొచ్చు" అన్నాను.

"నాకు వంట బాగానే వచ్చు. మా ఇంట్లో అమ్మ దగ్గర్నుంచి వదినలదాకా, నేను రుచి చూసి బాగుందంటే తప్ప తమ వంటల విషయంలో తృప్తి పడరు. అలా నా సర్టిఫికెట్టుకీ విలువుంది. కాబట్టి చెబుతున్నాను. ఈ నా చెల్లెలి వంటలు అద్భుతం. జర్మనీలాంటి దేశంలో దోసావకాయ పెట్టిందంటే, తన గురించి ఏంచెప్పాలి?" అన్నాడు సుందరం మెప్పుకోలుగా.

శ్రీమతి వెంటనే, "అభిమానం కొద్దీ మీరలాగన్నా, దోసావకాయలో ఉప్పు పాళ్లు కుదరలేదని నాకు తెలుసు" అంది.

సుందరం నవ్వి, "దోసావకాయలో ఉప్పు పాళ్లు ఎవరికీ కుదరవు. ఎందుకంటే ఎంత ఉప్పేసినా దోసకాయ ముక్కలు ఉప్పుని పీల్చేసుకోవడంతో, ఆవపిండిలో ఉప్పు తక్కువైందనిపిస్తుంది. అందుకే దోసావకాయలో ఉప్పు కాస్త తక్కువ వెయ్యడం మంచిది. అన్నంలో దోసావకాయ కలుపుకున్నప్పుడు, ముద్దని ముక్కతో తినాలి. ఉప్పు సరిపోతే ఓకే, తక్కువైతే మాత్రం అప్పటికప్పుడు అన్నంలో వేసుకోవాలి తప్ప ఊరగాయలో మాత్రం పదే పదే ఉప్పు వెయ్యకూడదు" అని, "చాలా బాగా చెప్పాను కదూ, ఇలాంటి సందేహాలు ఇంకా ఏమైనా ఉంటే అడగొచ్చు" అన్నాడు,

శ్రీమతి తటపటాయించలేదు. "మీకోసం ఇడ్లీ కూడా చేద్దామనుకున్నాను. ఎందుకంటే కారప్పొడి, నెయ్యి దొరుకుతున్నాయి. కొబ్బరి పచ్చడి చెయ్యొచ్చు. ప్లేట్లో వడ్డిస్తే వాటన్నింటితో – చూడగానే మనవాళ్లకి ప్రాణం లేచొస్తుందని తెలుసు. కానీ ఇక్కడ వాతావరణంలో తగిన వేడి లేక పిండి సరిగ్గా పులవడం లేదు. ఇడ్లీలు గట్టిగా వస్తున్నాయి" అంది శ్రీమతి.

దానికతడు వెంటనే, "ఇక్కడే కాదు, ఇండియాలోనూ మెత్తటి ఇడ్లీలు వెయ్యడం ఓ కళ. నాకు తెలిసి ఓ చిట్కా ఉంది. మినప్పప్పు నానబోసినప్పుడు, అదే సమయంలో వేరే గిన్నెలో నూక కూడా నానబోయాలి. పప్పు నానేక రుబ్బిన పిండిని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. నూకని నీళ్లు పోయేలా చేత్తో పిండి, రుబ్బిన మినప్పిండిలో బాగా కలపాలి" అన్నాడు.

వంటల విషయం పక్కన పెడితే అతడు తన సమయంలో కొంత మా పిల్లలకీ కేటాయించాడు. వాళ్లకి నచ్చే కబుర్లు చెప్పాడు. "మా పిల్లలు కూడా ఇంత చిన్నవాళ్లయితే, బడి గొడవ ఉండేది కాదు. వాళ్లనీ తీసుకొచ్చి ఉండేవాణ్ణి" అని బాధ పడ్డాడు.

తన భార్య వచ్చి ఉంటే మా పరిచయానికి ఎలా స్పందించి ఉండేదో పదే పదే స్మరించుకుని, ఆమె పాడిన 'చలమేలరా, సాకేత రామా' అన్న త్యాగరాజ కీర్తనని తను తెచ్చిన టేపులో వినిపించాడు.

అబద్ధమెందుకూ, అప్పటికి నాకు సినిమా పాటలు తప్ప మరో సంగీతం తెలియదు. శ్రీమతికి నాకు తెలిసింది తప్ప మరొక పాట తెలియదు. ఆ పాట విని, అలాంటి కీర్తనలు కొన్ని నేర్చుకోవలసిందే అనిపించింది.

సుందరం తన తోబుట్టువుల్ని ప్రస్తావించాడు. వాళ్లంటే అతడికి చెప్పలేనంత ఇష్టం. తన తండ్రిని తల్చుకున్నాడు. ఆయనంటే అతడికి చెప్పలేనంత గౌరవం. ఆయన వ్రాసిన 'కడు విచిత్రము జగతి, కనరారు ముందు గతి' అనే పాట ఒకటి తనకి ఎంతో ఇష్టమంటే – అతడిచేత పాడించి రికార్డు చేశాము.

అతగాడి గొంతు అంత మధురమనీ, అతడు అంత బాగా పాడగలడనీ మేమూహించలేదు. పిల్లలతో సహా అంతా నిశ్శబ్దంగా విన్నాం. పాట అవగానే అంతా చప్పట్లు కొట్టి అభినందించాం.

"చప్పట్లు కూడా కొట్టేస్తున్నారు. నిజంగా అంత బాగా పాడేనా?" అన్నాడు సుందరం ఆశ్చర్యానందాలతో.

అప్పుడతడికి రికార్డయిన పాట వినిపించాను. గ్రుండిగ్ స్పూల్ టైపు స్టీరియో టేపులో – ఆ పాట మరింత అద్భుతంగా రాణించింది.

"పాట బాగున్న మాట నిజమే! కానీ అది రికార్డింగు గొప్పతనం అనిపిస్తోంది" అన్నాడు సుందరం కొంచెం మొహమాటంగా.

తర్వాత మా సంభాషణ కాసేపు సంగీత సాహిత్యాలమీద నడిచి, వ్యక్తిగత పరిచయాల్లోకి మళ్లింది.

మాటల సందర్భంలో అతడు, "జొన్నలగడ్డ వారు నియోగుల్లోనూ, వైదీకుల్లోనూ ఉన్నారు. రెండు రకాలవారూ నాకు తెలుసు" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. ఆధునిక యుగంలో కూడా మన దేశం కులం ప్రాతిపదికపై నడుస్తోంది. ఆ కులాల్లో మళ్లీ ఎన్నో శాఖలు, ఉపశాఖలు. మేము ఒరిసాలో ఉండడంవల్ల – తెలుగువారి కులాలు, శాఖలకు అంత ప్రాముఖ్యం లేదు. ఉన్నా, స్వతహాగా నాకు వీటి స్పృహ పట్ల విముఖత ఉండడంవల్ల కూడా అంతగా ఆలోచించను. ఇప్పుడు జర్మనీలో బెర్లిన్లో ఉన్నట్లుండి నా కులమే కాక శాఖ ప్రస్తావన ఇలా వస్తుందని ఊహించలేదు.

"ఔను, జొన్నలగడ్డవారు కమ్మ, కాపు, మాల, మాదిగల్లో కూడా ఉన్నారు. నాకూ తెలుసు" అని, "మీ నాన్నగారి పాట సాహిత్యం చాలా బాగుంది. మీది సాహితీ కుటుంబమా?" అన్నాను మాట మార్చడానికి.

"మా ఇంట్లో రాసేవాళ్లు తక్కువే కానీ, సాహితీపరుల గురించి చర్చలు ఎక్కువే. మహాభారతాన్ని తెలుగులో నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ వ్రాసారా? వారిలో నన్నయ వైదీకి. మిగతా ఇద్దరూ నియోగులు. శైలిలో వైదీకులకూ, నియోగులకూ ఉండే భేదం గురించి మా బంధువుల్లో చాలామంది చర్చిస్తుంటారు. తిక్కన పదిహేను పర్వాలు వ్రాసినా, నన్నయ రెండున్నర పర్వాలముందూ అవి తేలిపోతాయని వాళ్లు ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. నువ్వేమంటావ్?" అన్నాడు.

టాపిక్ మళ్లీ మొదటికే వచ్చేసరికి ఏంచెయ్యాలో తోచలేదు. "నాకు పద్యకావ్యాల్ని విశ్లేషించేటంత పాండిత్యం లేదు" అన్నాను.

"పోనీ కథల్ని తీసుకుందాం. మల్లాది రామకృష్ణశాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, అడవి బాపిరాజు, గుడిపాటి వెంకటచలం – వీళ్లలో ఇంటిపేర్లని బట్టి నియోగులెవరో వైదీకులెవరో నీకు తెలిసే ఉండాలి. వాళ్ల కథల గురించి మాట్లాడుకుందాం" అన్నాడు సుందరం.

"ఏమో, ఇంటిపేర్లనిబట్టి ఎవరు వైదీకులో, ఎవరు నియోగులో చెప్పడం కష్టమని ఇందాకనే అనుకున్నాంగా. నా స్నేహితుల్లోనే వైదీకి జొన్నలగడ్డవారూ ఉన్నారు. నియోగి జొన్నలగడ్డవారూ ఉన్నారు మరి" అన్నాను కాస్త అయిష్టంగా.

సుందరం వదల్లేదు, "ఎవరి విషయమో ఎందుకు? నువ్వెవరో చెప్పు" అన్నాడు సూటిగా విషయానికొస్తూ.

అప్రయత్నంగా సుందరాన్ని చూశాను. అతడి కళ్లలో ఏదో నమ్మకం. ఆ నమ్మకాన్ని ధ్రువపర్చుకోవాలన్న పట్టుదల. నేనేం చెబుతానో అన్న ఆత్రుత.

ఒక్క క్షణం తటపటాయించాను. ఇక ముసుగులో గుద్దులాటెందుకని, "మేము ఆరువేల నియోగులం" అని చెప్పాను. చెప్పాల్సి వచ్చిన సందర్భంవల్లనేమో, ఆ మాట చెప్పడానికి గొంతు ఓ పట్టాన పెగల్లేదు.

సుందరం ముఖం మాడిపోయింది. "చంపేశావ్ కదా!" అన్నాడు వెంటనే.

నేను ఉలిక్కిపడి, "ఏమన్నావ్?" అన్నాను.

"మొదటిసారి కాదు. నెలరోజుల తేడాలో ఇలా దెబ్బ తినడం రెండోసారి నాకు" అన్నాడు సుందరం డీలా పడ్డ గొంతుతో.

మా ఇంటికి అతిథిగా వచ్చిన మనిషి నావల్ల దెబ్బ తిన్నాడనగానే – మనసంతా ఏదోలాగైపోయింది.

కాసేపు నాకు నోట మాట రాలేదు. అతడూ మాట్లాడలేదు.

తమాయించుకుందుకు కొద్ది క్షణాలు పట్టింది.

"నేను చంపేయడమేమిటి? నువ్వు దెబ్బ తినడమేమిటి? నీ మాటలు నాకర్థం కావడంలేదు" అన్నాను.

దెబ్బ తిన్న లక్షణాలు సుందరం మొహంలో ఇంకా కనబడుతూనే ఉన్నాయి. "సైంటిస్టు సుబ్బు విషయంలోనూ ఇలాగే జరిగింది. ఇంటిపేరునిబట్టి మావాళ్లే అనుకున్నాను. కానీ ఆరువేల నియోగిగా తేలాడు" నెమ్మదిగా అని భారంగా నిట్టూర్చాడతడు.

తెల్లబోయాను. ఐతే ఇంత కాలం అతడు నాతో సన్నిహితంగా మసలుతున్న కారణం – కేవలం ఇదా?

సుందరం గురించి అలా అనుకుందుకు మనసొప్పలేదు. కానీ అతగాడే స్వయంగా అన్నప్పుడు కాదని మాత్రం ఎలా అనుకోగలను?

సుందరానికి ఇవ్వాల్సిన ఆతిథ్యం గురించి నేను, శ్రీమతి ఎన్ని రోజులు ఎంతగా ఆలోచించాం. అతడు మా వాడనుకునే కదా!

కానీ ఉన్నట్లుండి అతగాడు 'మావాళ్లు' అనే పదానికి మరో అర్థం చెప్పాడు. నన్నిప్పుడు తనవాడిగా అనుకుందుకు సిద్ధంగా లేనట్లు సూచిస్తున్నాడు.

ఏం మాట్లాడాలో తెలియలేదు కానీ, ఏదో ఒకటి మాట్లాడక తప్పని పరిస్థితి.

ఏం మాట్లాడినా అతిథిగా అతడికి నొప్పి తగులకూడని విధంగా ఉండాలి.

"నా కులం, శాఖ మా నాన్నగారి ద్వారా సంక్రమించింది. ఇప్పుడు నీ ముఖంలో నిరుత్సాహం చూస్తుంటే, మా నాన్నగారు కూడా మీవాళ్లే అయుంటే ఎంత బాగుండేది – అనిపిస్తోంది" అన్నాను.

అది వ్యంగ్యం కాదు. కానీ అప్పుడు ఇంకేమనాలో నాకు తోచలేదు.

సుందరం వెంటనే, "నేను ఫలానా అని నీకూ ముందే తెలియదు కదూ!" అన్నాడు కొంచెం ఆశగా.

ఆ గొంతులో ఆశ అప్పటి అతడి మానసిక స్థితిని ప్రతిఫలించింది. ఆ ఆశకు కారణమూ ఉంది.

అప్పటికే సుందరం ఆలోచనలు వాస్తవానికి వస్తున్నట్లున్నాయి. అతగాడిపట్ల నేను, మా కుటుంబం చూపిన శ్రద్ధాసక్తులు చెప్పుకోతగ్గవి. అందుకు కారణం, నేనతణ్ణి 'మావాళ్లు' అనుకోవడంవల్ల అని తేలితే, అంతకుముందు తనన్న మాటలు మానవసహజం అనుకునేందుకు అవకాశం పెరుగుతుంది.

అలాగైనా మనసుకి కొంత సద్ది చెప్పుకోవాలని అతడి ఆశ!

ఆ ఆశని నేను పసి కట్టకపోలేదు. కానీ అతడి ఆశలమీద నీళ్లు జల్లినట్లు ఔతుందని తెలిసినా, నిజాన్ని దాచదల్చుకోలేదు.

"బాబూ – నా పీహెచ్‌డీ గైడు ఇంటి పేరూ, నీ ఇంటి పేరూ కూడా ఒకటే! అందుకని నువ్వు ఫలానా అని నాకు మొదట్నించీ తెలుసు. కానీ నా గైడు నన్ను కానీ, నేనాయన్ని కానీ 'మావాళ్లు' కాదని అనుకున్న సందర్భం లేదు. ఇప్పటికీ నా బాగోగుల గురించి విచారించే ఆత్మీయుడాయన. అందుకని ఆ ఇంటి పేరు నాకు ఆత్మీయతాభావాన్నే స్ఫురింపజేస్తుంది. ఆ భావమే నీకూ విస్తరించింది" అన్నాను.

తన ఆశ ఫలించకపోయినా కూడా, అప్పటికి సుందరం తన నిరాశనుంచి తేరుకుని, పూర్తిగా వాస్తవంలోకి వచ్చాడు. "ఛా, మావాళ్లని నేనన్నానంటే, నా ఉద్దేశ్యం అది కాదు. మనవాళ్లు మనవాళ్లని ఊరికే తాపత్రయపడ్డం, ఏదో – సంప్రదాయంనుంచి అలవాటుగా సంక్రమించిందంతే! ఒకే కులమైన మనలో ఈ శాఖల విషయం పక్కన పెట్టు. అసలు మొత్తం వ్యవస్థలో ప్రాముఖ్యం వహిస్తున్న కులాలే అర్థం లేనివని తేల్చిన ఆధునిక యుగమిది అని నాకూ తెలుసు. మనం వర్గ విభేదానికి అతీతులమైన భారతీయులమవాలి" అన్నాడతడు.

ఆ మాట మనసులోంచే వచ్చిందని తెలుస్తోంది కానీ, ఆ మాటల అంచున ఇంకా అపరాధభావముంది.

రచనావ్యాసంగంలో ఉన్న నాకు మనుషుల అంతరాంతరాల్లో ఉండే కులవివక్ష పట్ల కొంత అవగాహన ఉంది.

చాలామంది హిపోక్రసీతో బయటపడరు కానీ భోళా మనిషి సుందరం మనసుకు అనిపించిన మాట పైకి అనేశాడు. దాన్నిబట్టి అతడి వ్యక్తిత్వాన్ని అంచనా వేసే తొందరపాటు నాకు లేదు. ఎందుకంటే, అతడికి తనవాళ్లంటే ప్రత్యేకాభిమానం ఉండొచ్చు కానీ, అది తనవాళ్లు కానివాళ్లని అభిమానించడానికి అడ్డొచ్చేది కాదు. ద్వేషం, అసహనాల వంటివాటికి అతీతుడు కాకపోయినా – వాటికి కారణం కులాలు కాదు.

స్వతంత్ర భారతంలో ఓటు హక్కుని ఉపయోగించుకుంటున్న ఎందరో సామాన్యుల సామాన్యతకు అతడు ప్రతినిధి.

వాళ్లకు లేని అపరధభావం ఇతడికి ఎందుకుండాలి?

'కులం జన్మతో రాదు. అది జీవనోపాధికి సంబంధించిన వృత్తితో ముడి పడింది' – ఇది చిన్నప్పుడు బడిలో గురువులు చెప్పారు.

'వృత్తులు అంతరించగానే కులవ్యవస్థ అర్థవిహీనమైంది' – ఇది మన దేశంలో నిరక్షరాస్యుల దగ్గర్నుంచి, అత్యధిక విద్యాసంపన్నుల వరకూ, అందరికీ తెలుసు.

బడిలో పాఠాలనుంచి, గుడిలో ప్రవచనాలనుంచి, సామాజిక సభల్లో ఉపన్యాసాల వరకూ — మనమంతా భారతీయులమన్న ఘోష అదే పనిగా వినబడుతుంది.

కానీ – వ్యాపారం జోలికి వెళ్లని గాంధీజీని కోమటిగా, మంత్రాలు చదవని నెహ్రూని కాశ్మీరీ బ్రాహ్మణుడిగా — అనడం, అనుకోవడం మానం, మానలేం.

చివరకు పొట్ట చేతబట్టుకుని ఆధునిక సంపన్న దేశాలకు వెళ్లిన విద్యాధికులకి కూడా – ముందు కులం, ఆ తర్వాతనే దేశం. ఐతే వారిలో ఎవరికైనా – ఆ కులం ఆవిర్భావానికి మూలమైన వృత్తుల సంప్రదాయాలేమిటో నామమాత్రంగా తెలుసునా, తెలిసినా పాటిస్తున్నారా అంటే అనుమానమే!

సుందరం విద్యాధికుడు. శాస్త్రజ్ఞుడు. సంస్కారం ఉన్నవాడు.

అలాంటివాడు క్షణికమైన నిరాశలో, 'చంపేశావ్ కదా!' అని ఒకసారీ, 'నెల రోజుల్లో, రెండోసారి దెబ్బ తిన్నాను' అన్నాడంటే — అలనాడెప్పుడో సృష్టించిన ఈ కులవ్యవస్థ ఎంత ప్రభావశీలి!

సుందరం కులవ్యవస్థను కాపాడ్డానికే పుట్టాననుకోడు. కానీ హిపోక్రసీ తెలియని భోళా మనిషి.

మావాళ్లు, మనవాళ్లనే భావం అతడిలో ఏమూలో ఉండిపోయిన చిన్న బలహీనత.

తనకెంతగానో నచ్చిన నేను ఆ 'మనవాళ్లలో' ఒకణ్ణి కాదన్న నిరాశాభావం తాత్కాలికంగానే ఐతేనేం అతణ్ణి కుదిపేసింది.

ఇలా మనలో చాలామందికే జరుగుతుంది. బయటపడరు.

సుందరం అనుకోకుండా నోరు జారాడు. ఐతే అందుకు గర్వపడలేదు. ఇప్పుడు నేను నొచ్చుకున్నానేమోనని కలవరపడుతున్నాడు కూడా!

ఇప్పుడు నేను అతడి మాటలకు ప్రతికూలంగా స్పందిస్తే నొచ్చుకోడు సరికదా, సారీ కూడా చెబుతాడని నా నమ్మకం. కానీ ఆ అవసరం అతడికి రానివ్వకూడదని అప్పుడు నేననుకున్నాను.

ఎందుకంటే, గతంలో ఇలాంటి సందర్భాలు, అనుభవాలు చాలానే ఉన్నాయి నాకు. వాటిలో సుందరం స్థానంలో మహామహులున్నారు. నేను కూడా ఉన్నాను.

అతణ్ణి సముదాయించడం నా బాధ్యత. అందుకు గానూ, ఆ సందర్భాల్నీ, అనుభవాల్నీ ప్రస్తావించడం అవసరమని నాకనిపించింది.

కెఆర్ –

హైస్కూల్లో నా క్లాస్‌మేట్లలో బాగా సన్నిహితుడు. అతడిది కమ్మ కులం. గుడ్డు కూడా ముట్టని ఫక్తు శాకాహారి. మంచి బాలుడు అనతగ్గ అలవాట్లన్నీ ఉన్నాయి. ఏం తినాలన్నా ఇంటినుంచే తెచ్చుకునేవాడు తప్ప, బయట ఏం కొనుక్కుని తినేవాడు కాదు. చిరుతిళ్లకి ఎగబడే నన్ను, 'నువ్వేం బ్రాహ్మడివిరా' అని ఎగతాళి చేసేవాడు. నాకు కోపం వచ్చేది కాదు. తను నాకంటే ఓ ఏడాది పెద్ద కావడాన్ని అవకాశంగా తీసుకుని, 'సద్బ్రాహ్మణుడివంటే నువ్వురా, నీకులా ఉండడం నావల్లకాదు' అని చేతులు జోడించేవాణ్ణి. మా ఇంట్లో కూడా ఏ వేడుక జరిగినా విందు భోజనంలో మొదటి పంక్తిలో తనే ఉండేవాడు. అందుకు మావాళ్లు కొందరు చెవులు కొరుక్కునేవారు కానీ, మా నాన్నగారికి భయపడి పైకి ఏమనేవారు కాదు. తను కూడా, 'బ్రాహ్మలతో సావాసం, ములిగిపోతావ్' అని హెచ్చరించే తనవాళ్లని లెక్క చేసేవాడు కాదు. అతడి కులస్థుడే అధికారంలో ఉన్న ఓ సంస్థలో, అతడికి ఉద్యోగమివ్వడానికి మా నాన్నగారి సిఫారసు అవసరపడ్డం – మన వ్యవస్థలో అప్పుడప్పుడైనా జరిగే తమాషా!

మా మామగారు –

ఆయనవి విశాల భావాలు. కాకినాడలో బ్రాహ్మణ లాయర్లలో – నియోగి, వైదీకి ఫీలింగ్సు చాలా ఎక్కువగా ఉండేవని వాపోతూ ఉండేవారు. ఆయన మిత్రబృందంలో అన్ని కులాలు, శాఖలవారు ఉండేవారు. 'వాడు చెప్పిన పాయింటు గొప్పదే కానీ, చెప్పింది నియోగి (లేదా వైదీకి) కాబట్టి అది మనం వాడొద్దు' అన్న మాట వినాల్సి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయని బాధగా చెప్పేవారు.

వివి గారు –

నేను ఎమ్మెస్సీ ప్రీవియసులో ఉన్నప్పుడు కెమిస్ట్రీ డిపార్టుమెంట్లో రీడరు. మాకు ఆర్గానిక్ కెమిస్ట్రీ చెప్పేవారు. చాలా మంచి టీచరు. ఒకసారి నా రికార్డు పుస్తకం చూసిన ఆయన, 'వైదీకివా, నియోగివా?' అనడిగారు. నియోగినని చెప్పగానే, 'ఇలా వైదీకి పెంట చేశావేం?' అన్నారు. నా రికార్డు నీటుగా లేదని ఆయన ఉద్దేశ్యం. ఆయనలాగనడం నచ్చక, 'నియోగులకంటే వైదీకులకే శుభ్రమెక్కువంటారు కదా, మీరు నన్ను పొగిడినట్లా, తిట్టినట్లా?' అన్నాను. దానికాయన, 'వైదీకుల గురించి వైదీకినైన నాకంటే ఎక్కువ తెలుసా నీకు?' అని నవ్వేశారు. అంటే అదాయన మాట తరహాయే తప్ప, కుల/శాఖ వివక్ష కాదని నాకు అర్థమైంది.

కుల ప్రసక్తిలో ఆయన భోళాతనానికి అద్దం పట్టే సంఘటన ఆ తర్వాత రెండేళ్లకు జరిగింది.

ఎమ్మెస్సీ ఐపోయేక సుబ్రహ్మణ్యం అనే నా క్లాస్‌మేటుకి రీసెర్చి చెయ్యడానికి నూటయాభై రూపాయల స్కాలరుషిప్పొచ్చింది. అందుకు గైడ్ సంతకం కావాలని అతగాడు వివి గార్ని కలిశాడు. ఆయన అతడితో, 'ఒరేయ్, కోమటాడివి. వ్యాపారం చేసుకుని బ్రతికెయ్యగలవు. నీకు రీసెర్చి ఎందుకురా? ఈ స్కాలరుషిప్పుని వేరెవరికైనా వదిలేయొచ్చుగా' అన్నారట. అప్పట్లో అన్ని కులాల స్నేహితులం ఒకరి కులం మీద

ఒకరు జోకులేసుకునేవాళ్లం. హాస్యమే తప్ప ఎగతాళికి అవకాశం లేకుండా, ఎంజాయ్ చేసేవాళ్లం. నేటి రోజుల్లో అయితే వివి గారి మాటలు కులదూషణగా, అహంకారంగా గుర్తించబడి పెద్ద దుమారం లేపేవి. అప్పటి అవగాహనలో మా సుబ్రహ్మణ్యం ఆయన సలహా పాటించి ఆ స్కాలరుషిప్పు వదులుకున్నాడు. వ్యాపారమైతే చెయ్యలేదు కానీ, తన ఊరికి దగ్గర్లో లెక్చరరుగా చేరిపోయి సంతోషంగా ఉన్నాడు. ఇప్పటికీ వివి గారి మాటల్ని తన మిత్రులతో పంచుకుని ఎంజాయ్ చేస్తుంటాడు.

దేవానంద్ –

ఇది అతడి అసలు పేరు కాదు. ఎమ్మెస్సీ చదువుతున్నప్పుడు నేను, మా అన్నయ్య చినవాల్తేర్లో గది తీసుకుని ఉండేవాళ్లం. మాకు పక్కనే ఆనర్స్ చదివే ఓ కుర్రాడు ఉండేవాడు. అంతెత్తు మనిషి. పచ్చని ఛాయలో మిసమిసలాడిపోతూ సినిమా హీరోలా ఉండేవాడు. నేనతణ్ణి దేవానంద్ అనేవాణ్ణి. ఆ పేరే నాకు గుర్తుండిపోయింది. అతడు నాతో, 'ఎంత పెర్సనాలిటీ ఉన్నా, మేం చెంబుగాళ్లమండీ! రాజసంలో మేం మీ నియోగుల తర్వాతే!' అనేవాడు.

అతడి పెర్సనాలిటీ ముందు చాలామంది సినీహీరోలే చిన్నబోతారు. అతడిముందు పిట్టలా ఉండే నాలో రాజసాన్ని చూడ్డంవల్ల, నాకు ఒరిగిందేం లేదుకానీ, అతడిలోని రాజసం రెట్టింపయింది.

ఆశ్చర్యమేమంటే అప్పట్లోనూ ఇప్పటిలాగే విద్యార్థులకి కూడా శాఖలతో సహా కులాలు తెలిసినా – అహాలు, చిన్నతనాలు ఉండేవి కాదు.

శామ్యూల్ –

ఎమ్మెస్సీలో క్లాస్‌మేట్. భావా సాన్నిహిత్యం వల్ల నాకు బాగా దగ్గర స్నేహితుడు.

ఫైనలియర్లో ప్రాక్టికల్ పరీక్షలు రాసేముందు ఆర్గానిక్ కెమిస్ట్రీ హెడ్ ఫ్ ది డిపార్టుమెంట్ గా ఉండేవారు ఎల్లారావు గారు. ఆయన మొత్తం కెమిస్ట్రీ డిపార్టుమెంటుకి హెడ్ కావచ్చునని నా మరో క్లాస్‌మేట్ మూర్తికి తెలిసింది. అతడికి చెప్పలేనంత ఉత్సాహం వచ్చి, 'ఇది నీతో తప్ప ఇంకెవరితో పంచుకోను? ఎల్లారావుగారు మనవాళ్లే! మనకి డిపార్టుమెంట్లో మంచి భవిష్యత్తుండొచ్చు' అన్నాడు నాతో.

నిజం చెప్పొద్దూ, నాకూ సంతోషంగా అనిపించింది. ఆ మాట శామ్యూల్ కి చెప్పి నా ఆనందాన్ని పంచుకోబోయాను. శామ్యూల్ వెంటనే, 'కుర్రాడా, ఆ మూర్తి సంగతి సరే, తనకి తగ్గట్లే మాట్లాడేడు. కానీ నువ్వు కూడా....." అని మందలించాడు.

అప్పటికే రచనావ్యాసంగంలో ప్రవేశించి, కులవ్యవస్థను కనీసం మానసికంగానైనా నిరసించాలనుకుంటున్న నాకు – బలహీన క్షణాల ప్రభావం తెలిసింది. శామ్యూల్ దగ్గర తల దించుకున్నాను

మిత్రుల దగ్గర – కులం, శాఖల ప్రసక్తి ఆ విధంగా తీసుకురావడం జీవితంలో అదే చివరిసారి!

బీఎల్ –

ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేస్తుండగా – యూనివర్సిటీ కాంపస్ వెనుక, విద్యానగర్లో ఓ గది తీసుకుని కొందరు స్కాలర్లం కలిసి ఉండేవాళ్లం. కలిపి ఓ క్యారియరు తెప్పించుకుని కలిసి భోంచేసేవాళ్లం. నా రూంమేట్లలో ఎన్నటికీ మరువలేని ఇద్దరిలో ఒకడు బీఎల్.

బీఎల్ ఎమ్మే సోషల్ వర్క్ చదివి పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఘంటసాలలా ఖంగుమనే స్వరంలో చాలా గొప్పగా పాడతాడు. బాగా డబ్బుంది. కులానికి కాపు. చెయిన్ స్మోకరు. రోజూ పేకాడేవాడు. మిత్రులతో కలిసి తాగడానికి అభ్యంతరం లేదు. తన అలవాట్లలో వేటినీ అతడు నామీద రుద్దే ప్రయత్నం చెయ్యలేదు. అతడిలోని గొప్ప లక్షణాలేంటంటే, అవసరంలో ఉన్నవారిని అడక్కపోయినా కూడా ఆదుకుంటాడు. ఆ విషయమై ఏమాత్రం ప్రచారం చేసుకోడు, చెయ్యడాన్ని ఇష్టపడడు. ఎవరివల్లనైనా తనకి అపకారం జరిగితే ఆ విషయం ఎవరివద్దా ప్రస్తావించడు. ఎవరైనా ప్రస్తావిస్తే మాట తప్పిస్తాడు. తనని మోసగించేవారూ ఎక్కువే. పదే పదే మోసగించి సాయమడిగినా,

అవగాహనతో సాయం చెయ్యాలనుకుంటాడు తప్ప నిరసించడు. తన కులం గురించి, 'రిజర్వేషను కావాలంటే కొండకాపులం. వద్దనుకుంటే కాపులం. డబ్బుంది కాబట్టి నాయుళ్లం. ఐతే నాయుళ్లు చాలా రకాలు. నాయుళ్లంటే నానా జాతి సమితి అని ఎద్దేవా చేసేవారూ ఉన్నారు' అని నవ్వుతూ చెప్పేవాడు.

అలవాట్ల విషయం పక్కన పెడితే, వ్యక్తిగా ఉత్తమ లక్షణాలకీ, ఉన్నత సంస్కారానికీ అతడే నాకు ఆదర్శం. నేడు ఎవరైనా నాలో మెచ్చుకోతగ్గ సంస్కారాన్ని చూస్తే, ఆ ఘనతలో సింహభాగం ఆ సజ్జనుడి సాంగత్యానిదే!

అర్జున్న –

రీసెర్చి కాలంలో బీఎల్ తో పాటు మరో రూంమేట్ ఇతడు. ఎమ్మే యాంత్రోపాలజీ చదివి రీసెర్చి చేస్తున్నాడు. అంటరానిదిగా వివక్షకు గురైన కులానికి చెందిన దళితుడు. సంగీతప్రియుడు. జ్ఞాని, లోకజ్ఞాని. ఆవేశం, భావోద్వేగాలకు కాకుండా – ఆలోచనకూ, తర్కానికీ పెద్ద పీట వేసే అతడి అవగాహన నాకతణ్ణి సన్నిహితుణ్ణి చేసింది. దళితులకి ఆర్థికంగా సాయపడాలి తప్ప, మెరిట్ విషయంలో రిజర్వేషను తగదనుకునే నాకు – అతడి వివరణ విన్నాక, అభిప్రాయం మారింది. అతడికి బ్రాహ్మణుల పట్ల ఉన్న గౌరవం, సానుభూతి – నాకు ఆశ్చర్యంగా అనిపించేది. బ్రాహ్మణులు సమాజానికి జ్ఞానాన్ని పంచారనీ – ధనానికీ, పదవికీ దూరంగా ఉండేవారనీ అనేవాడు. బ్రాహ్మణులవల్ల ఆధునిక వ్యవస్థలో ఇతర కులాలకి ఎక్కువ మేలు జరిగిందనీ, బ్రాహ్మణులు దళితులకంటే కూడా ఎక్కువ నష్టపోయారనీ అనేవాడు. శతాబ్దాలుగా చేసిన జ్ఞానసాధనే బ్రాహ్మణుల్ని ఇప్పటికీ పూర్తిగా వెనుకబడిపోకుండా కాపాడుతోందనేవాడు. మిగతా కులాలవారు ఈ విషయం గ్రహించి – ధనము, హోదాకంటే జ్ఞాన సముపార్జనకే ప్రాధాన్య మివ్వకపోతే – వారికి పతనం తప్పదనేవాడు. ప్రతి విషయాన్నీ అన్ని కోణాలనుంచీ తార్కికంగా ఆలోచించే అతడి సాహచర్యంలో, లౌకికంగా ఎన్నో కొత్త విశేషాలు తెలుసుకున్నాను. ఆ సాహచర్యం నా మానసిక వికాసానికీ, పరిణతికీ ఎంతో సహకరించింది.

ఎంవీ, ఎస్వీ

వీరిద్దరూ వ్యక్తిగతంగా నాకు తెలియరు. కానీ రీసెర్చి రోజుల్లో వీరి కథ మా సర్కిల్లో బాగా ప్రచారంలో ఉండేది.

ఎంవీ దళితుడే కానీ కలిగినవాడు. ఎస్వీది అగ్రకులమే కానీ పేదవాడు. ఇద్దరూ కాకినాడలో ఒకే స్కూల్లోనూ, తర్వాత ఒకే కాలేజిలోనూ చదివారు. మంచి మిత్రులే కానీ వారి మధ్య కులాల విషయమై తరచుగా పోట్లాటలు జరిగేవి. వారి స్నేహానికి అసూయ పడ్డ సహాధ్యాయులు ఆ గొడవల్ని పురస్కరించుకుని – అగ్నికి ఆజ్యం పోసి వాళ్ల మధ్య శత్రుత్వాన్ని పెంచాలని ప్రయత్నించేవారు. అప్పుడు ఎస్వీ, 'శతాబ్దాలుగా అణగద్రొక్కబడ్డ కులం వాడిది. కడుపు మండి ఓ మాటంటే తప్పు లేదు' అనేవాడు. ఎంవీ, 'వాడి పూర్వీకులు ఏదో చేశారని, వాణ్ణి ఏదో అనడం నా తప్పు. అందుకు వాడు రియాక్టయితే అది సహజమే కదా!' అనేవాడు. 'ఇన్ని కబుర్లు చెబుతారు, మరెందుకు పోట్లాడుకుంటారు?' అనడిగితే – 'ఏం, అన్నదమ్ములు పోట్లాడుకోరా?' అని తేల్చేసేవారు.

ఎంవీ తెలివైనవాడే కాదు. పౌరుషం ఎక్కువ. రిజర్వేషన్లో కాక మెరిట్ తోనే పైకి రావాలనుకున్నాడు. ఐనా అతడు మెరిట్ స్కాలరుషిప్పు కోసం రిజర్వేషన్ బాట పట్టాడు. ఎందుకంటే పేదవాడైన ఎస్వీ తన చదువు కొనసాగించడానికి ఆదుకోవాలని!

ఎమ్మెన్నెస్

ఈయన నా పీహెచ్‌డీ గురువు. ఆయన వ్యక్తిత్వం అసాధారణం. యూనివర్సిటీలో ప్రొఫెసర్లు నియంతలుగా వ్యవహరించే రోజుల్లో – ఆయన శిష్యులతో బాల్యస్నేహితుడిలా వ్యవహరించేవాడు. సున్నితమైనవి అనిపించే ఎన్నో సందర్భాల్ని, సమయస్ఫూర్తితో ఎలా తేలిక చెయ్యవచ్చో ఆయన్ని చూసి నేర్చుకోవాలి. అందుకాయన్ని అభినందిస్తే, 'ముందు మనసులోంచి కుళ్లు తీసేయాలి. అప్పుడే ఏ విషయంలోనైనా మన ప్రయత్నాలు ఫలిస్తాయి' అనేవారు. ఒకసారి ఆయన తన గదిలో కొలీగ్సుతో మాట్లాడుతుండగా కులాల ప్రసక్తి వచ్చింది. ఆ సమయంలో

నేనాయన్ను కలుసుకోవాల్సి వచ్చింది. వాళ్ల మాటలు బయటకు వినబడుతుండడంవల్ల కొంచెం తటపటాయిస్తూనే లోపలకు వెళ్లాను. గురువు గారు నా తడబాటు గుర్తించారో ఏమో, చటుక్కున నాతో, 'ఏమయ్యా! నా శిష్యుల్లో నియోగులెక్కువైపోయారని 'మావాళ్లు' గోలెడుతున్నారు. ఎవరైనా ఒకరిద్దరు మానేసి వెళ్లిపోతే ఈ అపవాదు పోతుందేమో' అన్నారు. ఏమనాలో తెలియకపోయినా ఆయన దగ్గర ఏర్పడిన చనువుతో, 'ఈ మాట నాకేమైనా సూచనా?' అన్నాను. ఆయన వెంటనే, 'అరే, నువ్వు నియోగివి కదూ! మర్చేపోయాను. ఐనా నువ్వేం నియోగివయ్యా! నియోగంటే బుర్రలు తీసి బుర్రలు మార్చాలి. మావాళ్లెవరి దగ్గరా నియోగినని అనకు. వాళ్లు నిన్ను మావాడివే అనుకుంటున్నారు' అన్నారు. అంతా హాయిగా నవ్వుకున్నాం.

కులాలతో సహజీవనం చేస్తున్నప్పుడు వాటి గురించి ఇలా సరదాగా మాట్లాడుకోగలిగితే — మనుషులమధ్య వైషమ్యాలుండవు.

నేడా స్ఫూరి లేదు.

చిలకమర్తి వారు పేరుపేరునా కులాల్ని ప్రస్తావించి ఎన్నో ప్రహసనాలు అందించారు. ఇప్పుడైతే జనం ఆ పుస్తకాల్ని తగలెడతారేమో మరి!

సుందరంతో ఇలాంటి విశేషాలు ఎన్నో పంచుకునేసరికి, అతడు పూర్తి నార్మల్ అయ్యాడు.

"మిగతా కులాల సంగతి ఎందుకు గానీ, నన్నయ కాలం దాకా బ్రాహ్మణుల్లో ఇన్ని తెగలు లేవు. అందరూ వైదీకులే! ఆ తర్వాత కాలక్రమేణా, శాఖోపశాఖలు వచ్చాయి. అధికారం లేక బ్రాహ్మణులకి బొత్తిగా విలువ లేకుండా పోయిందని – వైదీకుల్లో కొంతమందిని రాజులవద్ద మంత్రులుగా ఉండమని నియోగించారు. వారు నియోగులయ్యారు. వారిలో ఒక్కసారి ఆరువేలమందిని గ్రామాధికారులుగా నియమిస్తే వారు ఆరువేల నియోగులయ్యారు" అంటూ అతడు బ్రాహ్మణుల మూలాలు కొన్ని వివరించాడు కూడా.

వాతావరణం తేలికయింది. క్రమంగా టాపిక్సులో కులాలు పక్కకెళ్లి – జాతీయ, అంతర్జాతీయ సమస్యలు కూడా చొరబడ్డాయి.

డాడ్ సంస్థ పేరు చెప్పి – మేము ఒకరికొకరు పరిచయమైన అదృష్టం మా సంభాషణలో చివరి అంశం.

సుందరం వెళ్లిపోయాడు.

ఆతర్వాత కూడా మా ఇద్దరిమధ్యా పూర్వపు అనుబంధం ఎప్పటిలాగే కొనసాగింది.

పండుగ రోజుల్లో ఏ పులిహోరో భారీ ఎత్తున చేసినప్పుడు, పొరపాటున ఏ కిరసనాయిలో నాలుగు చుక్కలు చింది దానిమీద పడితే, అది గమనించినవారు చటుక్కున ఆ చుక్కలు పడిన మేరకు పదార్థాన్ని జాగ్రత్తగా పక్కకు తొలగించి, మిగతాది వాడుకోవడం చాలా మధ్యతరగతి ఇళ్లలో మామూలే. అలాంటి సందర్భాల్లో ఆ విషయం తెలియనివారికే కాదు, తెలిసినవారికీ, మిగతా వంటకంలో కొంత భాగానికి కిరసనాయిలు తగిలిందన్న విషయమే స్ఫురించదు.

జీవితంలో అనుకోకుండా జరిగిన అవాంఛిత సంఘటనల్ని అలా పక్కన పెట్టడం అలవాటు చేసుకుంటే, మనుషులమధ్య వైషమ్యాలే ఉండవనడానికి సుందరానికీ నాకూ కొనసాగిన అనుబంధం ఒక నిదర్శనం.

జర్మనీలో ఇతర ప్రాంతాల్లో ఉంటూ, ఇలా బెర్లిన్లో నన్ను చూడవచ్చినవారు మరికొందరున్నారు. అవసరాన్నిబట్టి వారిని సందర్భాను సారంగా ప్రస్తావిస్తాను. ఇక బెర్లిన్లో మాకు సన్నిహితులైన కొందరితో పంచుకోతగ్గ అనుభవాలు, అనుభూతులు ప్రస్తావిస్తాను.

బెర్లిన్ మిత్రులు

వీరిలో మొదట చెప్పుకోవాల్సిన వ్యక్తి ఎస్ ఎస్ రావు.

రావుగారు సీమెన్సులో ఇంజనీరు. చాలా ఏళ్లుగా బెర్లిన్లో ఉంటున్నాడు. వయసులో నాకంటే పదేళ్లకి పైనే పెద్దవాడు.

అతడికి ఇద్దరు పిల్లలు. పెళ్లి ఆలస్యంగా అయిందేమో, ఇద్దరూ మాబాబు కంటే కూడా చిన్నవాళ్లు.

ముందు ఒక బాబు, రెండేళ్లుంటాయి. తర్వాత పాప. ఉయ్యాల్లో బిడ్డ.

చిత్రమేమిటంటే – అతడితో మా పరిచయానికి కారణం ఓ పోస్టు కార్డు.

ఆ కార్డులో సమాచారం అంత ముఖ్యమైంది కాదు. ఎటొచ్చీ, ఆ కార్డుమీద అడ్రసులో మా ఇంటి నంబరు తప్పుగా వేశారు. అప్పటికే నా పేరిట తరచుగా ఉత్తరాలు వస్తున్నా, అక్కడ పేరుకంటే ఇంటి నంబరుకే ప్రాధాన్యం ఉండడంవల్లనేమో, ఇల్లు దొరక్క తికమక పడ్డాడు పోస్టుమన్. చివరికి తప్పనిసరై ఉత్తరం ఎవరికా అని పేరు చూస్తే, నా పేరు కనబడింది.

రావు పేరు చూడగానే పోస్టుమన్ కి, ఎస్ ఎస్ రావు గారు గుర్తుకొచ్చాడు. అతడి ఇల్లు మా ఇంటికి కిలోమీటరు దూరంలో ఉండే క్నెసెబెకే స్ట్రాసేలో ఉంది. రావుగారు చాలా ఏళ్లుగా అక్కడుంటున్నందువల్ల, పోస్టుమన్ కి ఆ పేరు సుపరిచితమై ఉండొచ్చు. రావుకి రావు బంధువు కాకపోడులే అనుకుని, ఉత్తరం ఎలాగైనా అసలు మనిషికి చేరాలన్న తపనతో కాబోలు, ఆ ఉత్తరాన్ని అతడికిచ్చాడు.

తనది కాని ఉత్తరాన్ని లెటరుబాక్సులో చూసుకున్న రావుగారు, మామూలుగా ఐతే ఏం చేసేవాడో! కానీ, అడ్రసుమీద తెలుగు పేరు చూడగానే అతడికి మనసు పీకింది. ఎలాగైనా ఆ ఉత్తరం నాకు చేరేయాలనిపించి, అడ్రసుమీద నంబరు పట్టుకుని వెడితే, అక్కడ పూర్తిగా కూలగొట్టబడిన ఇల్లొకటి కనిపించింది. చుట్టుపక్కల వాకబు చెయ్యగా, చాలాకాలంగా ఆ ఇంట్లో ఎవరూ ఉండడం లేదనీ, ఇటీవలే ఎవరో కొనుక్కున్నారనీ, కూలగొట్టి కొత్త ఇల్లు కట్టబోతున్నారనీ తెలిసింది.

దాంతో అతడు, 'ఎవరీ తెలుగు రావు? కూలగొట్టబడిన ఆ ఇంటి స్థలంతో ఈ రావుకి అనుబంధం ఎలా ఏర్పడింది?' అని కాసేపు మథన పడ్డాడు. తర్వాత, 'కొంపదీసి ఇక్కడ ఇల్లు కూలగొట్టి కొత్తిల్లు కట్టబోతున్నది తనే కాదు కదా!' అని అనుమానించాడు...

బెర్లిన్ మిత్రులు ఎస్ ఎస్ రావు

ఏమనుకున్నా అన్నీ ఊహలే కదా! ఊహల్లోంచీ మా అసలు అడ్రసు దొరకదు.

రావుగారికేమో మా అడ్రసు పట్టుకుని పరిచయం చేసుకోవాలనుంది. కానీ ఎలా?

బాగా ఆలోచించి రావుగారు తనకు పరిచితులైన తెలుగువారికి నా పేరు చెప్పి వాకబు చెయ్యడం మొదలెట్టాడు.

నేనేమైనా పురప్రముఖుణ్ణా, ప్రముఖ భారతీయుణ్ణా – మామూలు డాడ్ స్కాలర్ని. ఐతే నేను డాడ్ స్కాలర్ని అన్న విషయం రావుగారికి తెలియదు. నా పేరు మాత్రం తెలుసు. ఆ ఆధారంతో గోదావరి ఈదడం మొదలెట్టాడు.

కలవారి కోడలు కలికి కామాక్షికి చెప్పినట్లు చాలామంది 'నేనెరుగ నేనెరుగ, ఫలానా వారినడుగు' అంటూ మరో పేరు సూచించడం – అతడు పట్టు వదలని విక్రమార్కుడిలా ఒకొక్కరినే అడుగుతూ అడుగుతూ వెళ్లడం.

చివరికాయనకి ఓ ఉత్తరాది మిత్రుడి ద్వారా నా ఆచూకీ తెలిసింది.

ఆ ఉత్తరాది మిత్రుడికి నా తోటి డాడ్ స్కాలరు గుప్తాతో పరిచయముంది. గుప్తా తరచుగా తన దగ్గర నా పేరు ప్రస్తావించేవాట్ట.

రావుగారికి నా చిరునామా తెలిసింది. నేను బెర్లిన్ వచ్చి ఎన్నాళ్లయిందో, ఏ సంస్థలో పని చేస్తున్నానో తెలిసింది.

రావుగారు స్వతహాగా మొహమాటస్థుడు. నేరుగా వచ్చి మమ్మల్ని మా ఇంట్లో కలుసుకుందుకు తటపటాయించాడు.

అదే తమిళులో బెంగాలీలో ఐతే అలా తటపటాయించరు. తమ భాష వాడు అని తెలియగానే ఎగురుకుంటూ వెడతారు.

తెలుగువాళ్లు ఇతర భాషలవారితో కలవడానికి చూపినంత ఉత్సాహం తమవాళ్లపట్ల చూపరు. కొత్తగా పరిచయమైనప్పుడు తెలుగువాడితో కూడా ఆంగ్లంలోనో, హిందీలోనో మాట్లాడతారు. ఇతర రాష్ట్రాల్లోనో, దేశాల్లో ఉన్నప్పుడు తమ పిల్లలకు తెలుగు నేర్పడానికి

ప్రయత్నించరు సరికదా వాళ్లకు తెలుగు రాదని గొప్పగా చెప్పుకుంటారు. తాము కూడా తెలుగు మర్చిపోతున్నామని చెప్పడానికి తాపత్రయపడతారు. అంతా ఇలా కాకపోయినా ఎక్కువమందిది ఇదే తత్వం.

నేనా ఎక్కువమందిలో ఒకణ్ణని అనుకోను. కానీ తెలుగువాళ్లయినా సరే, కొత్తవాళ్లయితే చటుక్కున కలవడానికి తటపటాయించే స్వభావం నాకూ ఉంది.

కొబ్బరిచెట్టు ఎందుకెక్కావంటే దూడ గడ్డికోసమన్నాడని ఓ తెలుగు సామెత. నాకు పోస్టు కార్డు ఇవ్వడానికి ఇంత తతంగం అవసరమా అని నేననుకోవచ్చునని అతడి అనుమానం. తీరా కార్డు తీసుకున్నాక, 'ఇచ్చారుగా, థాంక్స్. ఇక వెళ్లండి' అన్నట్లు నేను ప్రవర్తించవచ్చునని ఇంకో అనుమానం. నన్ను అంచనా వెయ్యడానికి అతడు ముందుగా నాకు ఫోను చేశాడు.

ఆఫీసులో ఉండగా నాకు ఫోన్లు రావడం అరుదు. ఎప్పుడైనా ఓంప్రకాష్, గుప్తా వంటివారు చేస్తూంటారు కానీ మా ల్యాబులో బల్లమీద ఫోను మ్రోగినప్పుడు నేను ఫోను తియ్యను. ఎవరైనా తీసి, అది నాకైతే పిల్చి చెబుతారు. దగ్గర్లో ఎవరూ లేనప్పుడు మాత్రం, ఫోను తీస్తాను. ఎవరికొస్తే వాళ్లకి చెబుతాను.

రావుగారి ఫోను మ్యుల్లర్ తీశాడు. నన్ను పిలిచాడు.

అందుకుని, "హలో" అన్నాను.

"ఈజిట్ డాక్టర్ రాజగోపాలరావ్" అంది అవతలి గొంతు.

ఔనని, అవతల మాట్లాడుతున్నదెవరో తెలుసుకోగోరాను.

"అయాం ఎస్ ఎస్ రావు. కెమికల్ ఇంజనీర్, సీమెన్స్ కంపెనీ" అంది అవతలి గొంతు.

అపరిచితుడు. ఎందుకు ఫోన్ చేసేడా అనుకుంటూ, నా వివరాలు చెప్పి, ఆ ఫోను నాకోసమేనా అనడిగాను నిర్ధారణకోసం.

అతడు తన దగ్గరున్న నా కార్డు గురించి చెప్పి, అది నాకు అందజెయ్యడమెలాగా అనడిగాడు.

ఒక అపరిచితుడు నా ఉత్తరంమీద అంత శ్రద్ధ చూపడం విశేషంగా భావించి, "మా ఆఫీసుకొచ్చి ఇవ్వచ్చు. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికొచ్చి కూడా ఇవ్వచ్చు" అన్నాను.

"మిమ్మల్నే మా ఇంటికి ఆహ్వానించొచ్చు కానీ, కార్డు నేను తెచ్చి మీకివ్వడం మర్యాద. ఇంటికొస్తే పరస్పరం పరిచయాలు కూడా ఔతాయి కదా! ఇట్ సే ప్లెజర్" అన్నాడతడు.

"థాంక్యూ – మాకైతే ఏ సాయంత్రమైనా ఫ్రీయే. మీ వీలు చెప్పండి" అన్నాను.

అతడు తన వివరాలు చెప్పాడు. అతడి భార్య కొన్నాళ్లు ఉద్యోగం చేసి మానేసింది. ఇద్దరు పిల్లలు. కొడుక్కి రెండు నిండడానికి నెల్లాళ్లు టైముంది. కూతురికింకా ఏడాది నిండలేదు. "ఐనా సాయంత్రాలు మాకు వీలే. మీరు మొహమాటపడకుండా మీ వీలు చెప్పండి" అన్నాడతడు.

నేను మా కుటుంబ వివరాలు చెప్పాను.

అతడు వెంటనే, "డాడ్ స్కాలర్సు అంటే 30కి కాస్త అటూ ఇటూ ఉంటారని తెలుసు. అలా నేను మీకు వయసులో కనీసం పదేళ్లు సీనియర్ని. బెర్లిన్ నివాసిగా కూడా నేను మీకు బాగా సీనియర్ని. ఐతే పిల్లల విషయంలో మాత్రం మీరే నాకు సీనియర్. మన పరిచయంలో ఒకరి సీనియారిటీ ఒకరికి బాగా పనికొస్తుందని నా ఆశ" అన్నాడు.

అంతవరకూ మా సంభాషణ ఆంగ్లంలోనే కొనసాగింది.

రావుగారు తెలుగువాడు. నేను తెలుగువాణ్ణని తెలుసు. ఐనా తెలుగులో కాక ఆంగ్లంలో పలకరించి, సంభాషణని ఆంగ్లంలోనే కొనసాగిస్తున్న అతడు ఎలాంటి తెలుగువాడో, ఆ పరిచయం ఉభయులకీ ఎలా ఉపయోగపడుతుందో ననిపించింది.

"మరి నీ సంగతేమిటి? అతడూ నీ గురించి ఇలాగే అనుకుంటున్నాడేమో" అంది మనసు.

"కానీ ముందు మాట్లాడింది తను. తనే తెలుగులోకి దిగిపోవచ్చుగా" అనుకున్నాను.

తెలుగువారిలో ఉండే ఈ తటపటాయింపుకి కారణం – అప్పుడర్థమయింది నాకు. మనం మనకంటే ఎక్కువగా అవతలవారి గురించి ఆలోచిస్తాం. మనని మనం విశ్లేషించుకుంటే – పిల్లి మెడలో గంట ఎవరు కట్టాలన్న సమస్య ఉండదు. అప్పుడు మనం ఊహించని కొత్త వ్యక్తిత్వాలు బయటపడతాయి.

ఇలా అనుకుని తటపటాయిస్తూనే, "మనం మాట్లాడుకుందుకు తెలుగులో మీకు ఫ్రీగానే ఉంటుందా?" అన్నాను.

అంతే, అతడి స్వరం ఒక్కసారిగా మారిపోయింది, "తెలుగు ఫ్రీగా ఉంటుందా అని నన్నా అడుగుతున్నారు? నేనెవరనుకుంటున్నారు? మాది తూర్పు గోదావరి. నేను అమలాపురంవాణ్ణి" అన్నాడు అక్కడి అసలైన యాసలో.

ఆ భాష, యాస వినగానే ప్రాణం లేచొచ్చింది. అతడు మాట్లాడిన తీరులో ఆత్మీయత ధ్వనించింది. తెలుగుతనానికి గర్వపడే ధ్వని ఆ గొంతుకి మరింత శోభనిచ్చింది.

సుమారు పావు గంట సేపు ఏవేవో మాట్లాడుకున్నాం.

కలుసుకుందుకు సమయం నిర్ధారించుకున్నాం. భోజనానికి రావాలంటే, సంకోచించకుండా ఒప్పుకున్నాడాయన.

రావుగారి పరిచయం బెర్లిన్లో మాకు ఎన్నో మరపురాని అనుభూతులనిచ్చింది. అవి మేము మా ఇంట్లో కలుసుకున్న మొదటిరోజునించే మొదలయ్యాయి.

ఆరోజు శ్రీమతి తెలుగువారికి అపురూపమైన వంకాయకూర, బంగాళాదుంపల వేపుడు, కొబ్బరిపచ్చడి, మెంతిమజ్జిగ చేసింది. సుందరం కోసం పెట్టిన దోసావకాయ ఉండనే ఉంది.

రావుగారు ఏడున్నరకి వస్తానన్నారు. నేను 7.20కల్లా మెట్లు దిగి కిందకి వెళ్లాను. మరో ఐదు నిముషాల్లో మా భవనం ముందున్న ఓ చెట్టుకింద, ఫుట్‌పాత్‌మీద కారు ఆగింది. రావుగారు, ఆయన శ్రీమతి సత్యవతి, కుమారుడు కారు దిగారు. ఆమె చేతిలో పిల్లల సంరక్షణకు సంబంధించిన సరంజామా కోసం ఓ బ్యాగుంది. రావుగారి చేతిలో కాస్త పెద్ద సైజు ఫిడేలు పట్టే ఓ పెట్టె ఉంది.

పరస్పర పరిచయాలయ్యేక నేను వాళ్లకి దారి చూపించాను. మెట్లెక్కి రెండో అంతస్తు చేరుకున్నాక – రావు గారు చటుక్కున ఓ అడుగు ముందుకేసి తలుపు దగ్గరకెళ్లి అటూ ఇటూ చూసి, "పాతకాలపు ఇల్లు కదా, కాలింగ్ బెల్ ఉన్నట్లు లేదు" అన్నాడు.

నేను నవ్వి తలుపు దగ్గరకెళ్లి, తలుపుకున్న అండాకారపు ఇత్తడి పిడిని పట్టుకుని పైకెత్తాను.

రావుగారికి అర్థమైంది, "ఇన్నేళ్లుగా ఇక్కడుంటున్నాను కానీ ఇలాంటి కాలింగ్ బెల్ చూడలేదు. మీ పరిచయంలో అప్పుడే ఓ కొత్త విశేషం" అని నవ్వారు.

తలుపు తెరుచుకుంది. గుమ్మం దగ్గరే పరిచయాలు కావలసింది కానీ, రావుగారు అందుకు సుముఖంగా కనబడలేదు.

ఇండియాలోలా అలా గుమ్మాల దగ్గర నిలబడి ఎక్కువసేపు మాట్లాడితే ఇక్కడ ఇరుగుపొరుగులు ఇష్టపడరు. మాకా విషయం తెలుసు కానీ, ఇంతవరకూ అనుభవంలోకి రాక, గుర్తుండదు. జర్మనీలో నాకు బాగా సీనియర్ కదా – రావుగారికి ఈ అలవాటు వంట బట్టేసి ఉంటుందని అర్థం చేసుకున్న శ్రీమతి చిరునవ్వునే పలకరింపు చేసి, పక్కకు తప్పుకుని దారిచ్చింది.

అంతా మా ఇంట్లోకి వెళ్లేక, పరస్పర పరిచయాలయ్యాయి. ఆ దంపతులు స్నేహపాత్రులు కావడంతో, కొద్ది నిముషాల్లోనే బాగా పరిచయమున్నవాళ్లలా మాట్లాడుకోసాగాం.

రావుగారబ్బాయి, మా పిల్లలతో కలిసిపోయాడు.

మా పాపకి పెద్దరికం చూపడం ఇష్టం. ఏణ్ణర్థమే చిన్న అయిన తమ్ముడిమీద అది అథార్టీ చేస్తూనే ఉంటుంది. ఈరోజు దానికి అదనంగా ఇంకో బాబు దొరికాడు.

అక్కలాగే పెత్తనం చెలాయించాలని మా బాబుకీ సరదా ఉంది. కానీ తను పెద్దదాన్నని డబాయించి సాగనివ్వదు మా పాప. అమాయకుడు – ఏదో రోజున తను దానికంటే పెద్ద ఔతానని ఆశగా ఎదురుచూస్తూ, అందాకా సరిపెట్టుకుంటున్నాడు వాడు. ఈరోజు వాడికి తనకంటే చిన్నవాడొకడు దొరికాడు.

సాధారణంగా చిన్నపిల్లలు తమకంటే కొంచెం పెద్ద వయసు పిల్లలతో ఆడుకోవాలని సరదా పడతారు. రావుగారబ్బాయికి ఈరోజు ఆ సరదా తీరింది.

వాళ్లు ముగ్గురూ కూడా మమ్మల్ని మరిచి వేరే ప్రపంచంలోకి వెళ్లిపోయారు.

పది నిముషాలు కబుర్లయ్యేక, శ్రీమతి భోజనాలకు ఏర్పాటు చేస్తానంది.

"ఐతే ముందు పాపకు అన్నం పెట్టేద్దాం" అంది రావుగారి భార్య సత్యవతి.

"పాప ఎక్కడ?" అని శ్రీమతి ఆశ్చర్యంగా అడిగింది. అంతలోనే రావుగారు తన ఫిడేలు పెట్టెలోంచి పాపని బయటకు తీశారు.

పాప చూడ్డానికి బక్కగా, 3–4 నెలల పిల్లలా ఉంది. రావుగారు పెట్టెలోంచి బయటకి తియ్యగానే ఒక్కసారి పసిపిల్లలకే సాధ్యం అనిపించేటంత ముద్దుగా వళ్లు విరుచుకుంది. అప్పుడే నిద్ర లేచిందేమో ఓసారి కళ్లు చిట్లించి చుట్టూ చూసింది.

కొత్త చోటు కదా, ఏడుస్తుందనుకున్నాను కానీ – ఆసక్తిగా పరిసరాల్ని పరిశీలిస్తోంది.

"పాప ఈ పెట్టెలో ఉందా? తనని ఎందుకు తీసుకురాలేదా అని ఇందాకట్నుంచి అడగలేక మనసులో సతమతమౌతున్నాను" అన్నాను.

అది పిల్లలకోసం అక్కడ వాడే కారీబాగ్ అని తెలిసి, ఇదేదో తమాషాగా బాగుందే, అనుకున్నాను.

"పిల్లల్ని అలా వదిలేసేది ఇక్కడివాళ్లు. మనమలా ఉండలేం కదా" అంది సత్యవతి.

"ఔను" అనె వెంటనే తలాడించి, "పాపకోసమని కొద్దిగా పప్పు పడేశాను. నెయ్యి కూడా ఉంది" అంది శ్రీమతి.

కానీ సత్యవతి పిల్లకోసం భోజనం తయారు చేసి కూడా తెచ్చుకుంది.

"ఏమనుకోకండి. ఇది చూడ్డానికే కాదు, అరాయించుకుందుకూ అర్భకురాలు. ఆ మధ్యనే విరేచనాలు పట్టుకుని పిల్ల మనకి దక్కుతుందా అనుకునేదాకా వచ్చింది" అంది సత్యవతి.

రావుగారు నవ్వి, "అంతేం లేదు కానీ, మా ఆవిడే కంగారు పడి, తనే నాకు దక్కుతుందా అనుకునే దాకా వచ్చింది" అన్నారు.

"అనడానికేం? పిల్లలకోసం అమ్మ ప్రాణాలు అలాగే తపించిపోతాయి మరి. ఇండియాలో ఉన్నప్పుడు మీకు రొంపడితే చాలు, మీ అమ్మగారు చేసే హడావుడి మర్చిపోయారా?" అంది సత్యవతి.

అది కోపం కాదు, ఉక్రోషం కాదు.

దంపతుల్లో ఒకొక్కరిది ఒకోరకం. భార్యాభర్తలు ఒకరిమీద ఒకరు విసుర్లేసుకుని వినోదించడం అదో ముచ్చట. ఇంకా చెప్పాలంటే అన్యోన్యతకి అదో పరాకాష్ఠ.

భవనేశ్వర్లో మా కాలనీలో అలాంటి జంటలు కనీసం మూడుండేవి. వాళ్ల మాటలు వినముచ్చటగా ఉండేవి.

సత్యవతి పాపకి అన్నం పెడుతుంటే రావుగారు చెప్పాడు.

పాపకి విరేచనాలు వెళ్లినప్పుడు హాస్పిటలుకి తీసుకెడితే వాళ్లు పాపని అక్కడ వదిలేసి, తల్లిని కూడా ఇంటికి వెళ్లిపొమ్మన్నారుట. తను లేకుండా పాప క్షణం కూడా ఉండలేనని ఆమె కళ్లనీళ్ల పర్యంతమైనా ససేమిరా అన్నారుట.

ఇంటికొచ్చి ఆమె పాపను తల్చుకుని అదేపనిగా ఏడుపుట.

"అనారోగ్యంతో ఉన్నా పాపకి హాస్పిటల్లో అవసరమైన అటెన్షన్ దొరికి సుఖంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్న బాబుని ఇంట్లో ఉండీ తల్లి కూడా పట్టించుకోలేదు" అన్నాడు రావుగారు.

"మీరే చెప్పండి. తల్లి పక్కన లేకుండా ఏ చంటిపిల్లయినా సంతోషంగా ఉంటుందా? ఐనా ఇదేం చోద్యం? వీళ్లకి అనుబంధాలు తెలియవు. యాంత్రికంగా నియమాలు అనుసరించడమే. వచ్చి వచ్చి ఇలాంటి దేశంలో పడ్డాం" అంది సత్యవతి.

"వాళ్లకి పిల్ల ఆరోగ్యం ప్రధానం. పిల్లకు చికిత్స ప్రధానం. రెండు వారాలు మన దగ్గర లేకపోతేనేం – వాళ్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుని మన పిల్లని మామూలు మనిషిని చేసి కదా మనకి అప్పగించారు" అన్నాడు రావుగారు.

"ఇప్పుడిలా గంటున్నారా, అప్పుడేమో – 'చంటి పిల్లలకి విరేచనాలు వెడితే అదో పెద్ద జబ్బా? దానికే పిల్లని తలిదండ్రులనుంచి వేరు చెయ్యాలా?' అని తనే రోజూ గోల పెట్టేవారు. ఐనా ఒకటి మాత్రం నిజం. ఇలాంటప్పుడు పిల్లల్ని ఆస్పత్రిలో ఉంచడమే మంచిది. మనం తింటున్నదేమైనా పిల్లలకి పెట్టాలనిపిస్తుంది. ఎంత చెప్పినా ఏదో బలహీనత జాగ్రత్తల్ని అధిగమించేలా చేస్తుంది" అంది సత్యవతి.

"చిన్న కరెక్షన్. ఇది మన దేశంలో ఆస్పత్రులకి వర్తించదు. ఇక్కడ రోగిని కాపాడ్డంకోసం, అయినవాళ్లకంటే డాక్టర్లే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. అక్కడ ఆస్పత్రికి వెళ్లడమంటే అంతిమయాత్రే! అందుకే మా అమ్మెప్పుడూ నాకు గృహవైద్యమే చేసేది" అన్నారు రావుగారు.

గత సంవత్సరం జర్మన్ భాష నేర్చుకుంటున్నప్పుడు, ల్యూనబర్గులో నేను చూసిన క్రంకెన్ హౌస్ (హాస్పిటల్) గుర్తొచ్చింది. అందులో మిసమిసలాడే అందాల పసిపాపలు ఇప్పటికీ తలచుకున్నపుడల్లా కళ్లముందు కదలాడతారు. ఆటబొమ్మలు, ఆహారం వగైరా సదుపాయాలున్నా అయినవాళ్లు పక్కనలేక – అదోలా కనిపించే వాళ్ల ముఖాల్ని నేనెప్పుడూ మర్చిపోలేను. ఇప్పుడు వాళ్లమధ్య రావుగారి పాపని ఊహించుకుంటే ఒక్కసారి వళ్లు జలదరించింది.

ఐతే రావు దంపతుల సంభాషణ ఎక్కడ మొదలైంది? ఎక్కడ తేలింది?

అనుబంధాల విషయంలో మన ఔన్నత్యంతో మొదలెట్టి, చివరికి ఇక్కడి ఆస్పత్రుల ఔన్నత్యం దగ్గర తేలారు!

చెప్పాలంటే వాళ్లన్నవాటిలో ఏదీ అబద్ధం కాదు. వాళ్ల మాటల్లో రెండు విభిన్న వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. రెండు వ్యవస్థల్నీ బాగా దగ్గర్నుంచి చూసిన వాళ్లు – ఏ వ్యవస్థ ఎక్కువ మంచిదో తేల్చలేకపోయారు.

అందుకేనేమో, ఈ దంపతులు అపూర్వమైనవారనీ, వీరినుంచి చాలా నేర్చుకునే అవకాశం ఉన్నదనీ అప్పుడే అనిపించింది నాకు.

పాప భోంచేసేక బుద్ధిగా పడుకుంది. "ఇంట్లో ఐతే గదంతా చీకటి చేస్తేనే కానీ పడుకోదు. మీ ఇంట్లో దానికి ప్రశాంతంగా ఉన్నట్లుంది. హాయిగా పడుకుంది" అంది సత్యవతి.

అదో మర్యాద. నిజమనుకోకూడదని తెలుసు. చిన్నగా నవ్వి, "గదంతా చీకటి చేసి మరి అంతా ఒక్కసారే పడుకుంటారా? మరి బాబు మెలకువగా ఉంటే గొడవ చెయ్యడా?" అన్నాను.

"ఆ సమస్యే లేదు. బాబు గది వేరు. పాప గది వేరు. మా గది వేరు. ఎవరి గదుల్లో వాళ్లుంటాం" అంది సత్యవతి.

"చంటిపిల్లకి తల్లి పక్క కావాలి కదా, వేరే గదిలో పడుకోబెడితే, ఇక ఆస్పత్రికీ, ఇంటికీ తేడా ఏమిటి?" అంది శ్రీమతి అప్రయత్నంగా.

"తేడా లేకేం? అక్కడ పాప కుంయ్‌మంటే నర్సులు పరుగెడతారు. ఇక్కడ అమ్మ పరుగెడుతుంది" నవ్వారు రావుగారు.

"తేడా ఉందంటూనే మీరన్నది తేడా లేనట్లే ఉంది. ఆవిడకి అర్థమయ్యేలా నేను చెబుతాను, ఉండండి" అంది సత్యవతి.

ఇక్కడ దంపతులు మాత్రమే ఒకే గదిలో ఉండొచ్చు. పిల్లలు ఎంతమందుంటే అంతమందికీ తలో గదీ ఉండాలని సాంఘిక నియమం. ఇక్కడున్నప్పుడు వీళ్ల నియమాల్ని గౌరవించాలి, పాటించాలి. అది అనుకున్నంత కష్టమేం కాదు. విడిగా పడుకోబెట్టడంవల్ల పిల్లలకు ఆహారం, నిద్ర వగైరాల్లో క్రమశిక్షణ ఏర్పడుతుంది. పద్ధతులు అలవాటౌతాయి. ఆపైన బడిలో వేసినప్పుడు, అమ్మను విడిచి ఉండడం కష్టం అనిపించదు.

ఆమె చెబుతుంటే కళ్లలో మెరుపు. ఇక్కడి ఈ పద్ధతి ఆమెకు నచ్చినట్లే ఉంది.

శ్రీమతి వైపు చూస్తే – రాత్రిపూట చంటిదైన కన్నబిడ్డను గుండెలకు హత్తుకుని పడుకోవడంలో ఉన్న ఆనందం మిస్ కాతగ్గదేనా అన్న భావం — ఆమె కళ్లలో కనిపించింది. కానీ పైకి అనలేదు.

మా పిల్లలు చిన్నప్పట్నించి ఇప్పటిదాకా రాత్రిళ్లు మా పక్కనే పడుకుంటున్నారు. వాళ్లు లేకపోతే ఏదో మిస్సయినట్లే ఉంది. భోజనం, నిద్ర వగైరాల్లో వాళ్ల క్రమశిక్షణను చాలామంది మెచ్చుకునేవారు. ఎటొచ్చీ మన దేశంలో అందరు పిల్లలూ అలా ఉండరు. ఇక్కడి పిల్లలు అంతా అలాగే ఉంటారేమో!

పాప పడుకున్నాక మిగతా భోజనానికి మిగతా పిల్లలు ముగ్గురి వంతూ వచ్చింది. మా బాబు తను బుద్ధిగా భోంచేస్తుంటే, రావుగారు, "మీవాడు చాలా బుద్ధిమంతుడు" అని మెచ్చుకున్నాడు.

ఆ మాటకి మా పాప మొహంలో కలవరం చూశాను. అది బాబులా స్పీడుగా తినలేదు. ఇప్పుడు తనకీ వాడికీ పోలికొస్తుందేమోనని దాని భయం. అందుకని ఓ క్షణం ఆలోచించి, "ఆంటీ, మీ బాబుకి నేను తినిపించొచ్చా?" అనడిగింది.

అప్పటికి సత్యవతి బాబుచేత అన్నం తినిపించడానికి కొంచెం అవస్థ పడుతోంది.

"చిన్నపిల్లవి, నావల్లే కానిది నీవల్లనౌతుందా?" అందామె.

పాప ఏదో అనేలోగానే వాళ్ల బాబు, "అక్కే నాకు తినిపించాలి" అని మారాం మొదలెట్టాడు.

"సరే కానీ, అక్కని ఏడిపించకూడదు. ఏడిపించావో, మళ్లీ నేనే నీకు తినిపిస్తాను" అంది సత్యవతి.

ఇదంతా చూస్తుంటే, నాకు బెర్లిన్లో ఉన్న భావన పోయి, భువనేశ్వర్లో మా కాలనీలో ఉన్న అనుభూతి కలిగింది. ఆ అనుభూతి ఎంతో ఆహ్లాదంగా ఉంది. ఇలాంటి మిత్రులుంటే, ఎక్కడున్నా మనవాళ్లమధ్యనే ఉన్నట్లు ఉంటుందనిపించింది.

మా పాపకి ఇదో కొత్త అవకాశం. వాళ్ల బాబుకేమో ఓ కొత్త అనుభవం. ఆ రెండూ కలిసి మిషన్ జయప్రదమైంది. క్షణాల్లో బాబు భోజనం ఐపోయింది.

"రోజూ తినడానికి ఎంత ఏడిపిస్తాడు? వీడికి నీ వంటకంటే ఆంటీ వంటలు ఎక్కువ నచ్చినట్లున్నాయి. ఇకమీదట రోజూ కార్లో వీళ్లింటికొచ్చి వీడికోసం లంచ్ బాక్స్ కలెక్ట్ చేసుకుంటాను" అన్నాడు రావుగారు.

"లంచ్ బాక్సొక్కటీ చాలదు. పాపని కూడా తీసుకురావాలి. బాబు తను పెడితేనే తింటాడు కాబట్టి పాపని మనింట్లోనే ఉంచేసుకుందాం" అని, "ఏం పాపా, మా ఇంటికొచ్చి ఉంటావా? నిన్ను మీ అమ్మానాన్నలంత బాగానూ చూసుకుంటాం" అంది సత్యవతి .

పాప కలవరపడుతుందనుకున్నను. కానీ ఆ క్షణంలో తనకు లభించిన ప్రాధాన్యానికీ, మెప్పుకీ గొప్పగా మొహం పెట్టి, "మరి నాకోసం మీ ఇంట్లో ఇంకో గది ఉందా?" అనడిగింది.

నేను, శ్రీమతి తెల్లబోయాం. రావుగారు అప్రయత్నంగా మా పాపని దగ్గరగా తీసుకుని, "భలే అడిగావమ్మా, ఇంతవరకూ మమ్మల్ని ఇలా అడిగినవారు లేరు" అన్నారు.

"ఈ తరం పిల్లల తెలివే తెలివి. మన మాటలన్నీ పాపకి బాగా అర్థమౌతున్నాయి. మనం కాస్త చూసుకుని మాట్లాడాలి" అంది సత్యవతి స్వరం కాస్త తగ్గించి.

పాప మొహంలో గర్వం కనబడింది. "భువనేశ్వర్లోనూ నా గురించి ఇలాగే అనేవారు అంకుల్సు" అంది.

అంతా నవ్వుకున్నాం. అంతలో రావుగారి బాబు మత్తుతో జోగసాగాడు. అతణ్ణి మంచంమీద పడుకోబెట్టేం.

"పాప కూడా తినేసేక మనం భోజనాలకి కూర్చుందాం" అంది సత్యవతి.

పాప తల అడ్డంగా ఊపి, "నేనూ పెద్దదాన్నే, మీతోనే తింటాను" అంది.

శ్రీమతి మందలించబోయింది కానీ, సత్యవతి దాని మాటలకి ముచ్చటపడి సరేనంది.

అక్క భోజనానికి కూర్చుంటే తమ్ముడు ఓ మూలకి వెళ్లి జిగ్‌సా పజిల్ తీసుకున్నాడు. అక్క పక్కన లేకుండా తనకి తానుగా బొమ్మను కూర్చాలని వాడి కోరిక. ఇద్దరికీ వేర్వేరు పజిల్సున్నా మా పాప తన బొమ్మ తాను తయారు చేసేసేక, వద్దంటున్నా వినకుండా వాడికి సాయం చేస్తుంది. అందుకని వాడు ఇప్పుడా కోరిక తీర్చుకుంటున్నాడు.

మా భోజనాలు మొదలయ్యాయి. ఐటమ్సుని వాళ్లు మెచ్చుకోవడం వగిరాలు మామూలే కానీ, దోసావకాయకి సుందరంలాగే వాళ్లూ ఆశ్చర్యపడ్డారు.

"కుకుంబర్ వాడి మేమూ దోసావకాయ పెడుతుంటాం. కానీ ఇది నిజంగా దోసకాయతో పెట్టినది. ఇన్నేళ్లుగా ఒక్కసారి కూడా మా కంటబడని దోసకాయ మీకు ఎక్కడ దొరికింది? ఎలా దొరికింది?" అనడిగాడు రావుగారు.

"ఇక్కడ ఇది ఇంత స్పెషల్ అని నాకు తెలియదు. ఓసారి సంతలో కనబడింది. కొన్నాను. అంతే!" అన్నాను ఆశ్చర్యంగా. ఏదేమైనా అతిథులకు సంభ్రమానందాశ్చర్యాల్ని కలిగించిన ఆ దోసకాయ ఒక్కసారైనా నాకు దొరకడం అదృష్టమనుకున్నాను.

భోంచేస్తూ కబుర్లలో రావుగారు నా అడ్రసు పట్టుకుందుకు తను చేసిన కృషిని తనదైన శైలిలో వివరించాడు.

"వింటుంటే అనిపిస్తోంది – నేను మా ఆవిణ్ణిక్కడికి తీసుకురావడానికి పడ్డ శ్రమకీ, మానసిక ఒత్తిడికీ – మీ శ్రమ ఏమాత్రం తీసిపోదని" అంటూ వాళ్లకి ఆ వివరాలు చెప్పాను.

ఆ దంపతులు శ్రద్ధగా నేను చెప్పింది విన్నారు. తర్వాత రావుగారు మాతో, "మీరిద్దరూ కూడా మా ఇద్దరికంటే బాగా చిన్నవాళ్లు. కాబట్టి చొరవ చేసి ఓ మాట చెప్పనా?" అన్నాడు.

ఉన్నట్లుండి అతడలా అనేసరికి ఆశ్చర్యమేసి, "మిమ్మల్ని పెద్దవాళ్లని మేమనుకోవడంలేదు. మనమంతా ఓ తోటివాళ్లం. ఐనా మీరేం చెప్పదల్చుకున్నా నిస్సంకోచంగా చెప్పొచ్చు" అన్నాను.

"నేను మీకంటే పదేళ్లకు పైగా పెద్దవాణ్ణి. మా ఆవిడక్కోపమొచ్చినా సరే, తనూ మీ అవిడకంటే పదేళ్లకు పైనే పెద్దది. ఉన్నమాటనడానికి సంకోచమెందుకూ, మా ఇద్దరికీ కూడా లేట్ మారేజ్" అన్నాడు రావుగారు.

ఆ మాటలు కొంచెం ఇబ్బందిగా అనిపించి, "మీది లేట్ మారేజని నాకనిపించదు. లవ్ మారేజి అనిపిస్తుంది" అన్నాను వెంటనే.

"మాది లవ్ మారేజ్ కాదు కానీ మారేజ్ లవ్. అంటే పెళ్లి చేసుకున్నాక ప్రేమ అన్న మాట. పెళ్లికిముందు ప్రేమ పెళ్లితో పోతుంది. పెళ్లి తర్వాత ప్రేమకి ఎక్కడికైనా పోవాలన్నా వేరే దారుండదు" అన్నాడు రావుగారు.

సత్యవతికి మొహమాటమేసిందేమో, "వాళ్లకి ఏదో మాట చెబుతానన్నారు..." అంటూ సంభాషణ దారి మళ్లించింది.

"చెప్పేముందు పెద్దరికాన్ని ఎస్టాబ్లిష్ చేసుకోవాలిగా, అదయింది కాబట్టి ఇక చెబుతాను" అంటూ మావైపు తిరిగి, "పెద్దవాణ్ణి చెబుతున్నాను. నా మాటని తేలిగ్గా తీసుకోకండి. ఇకమీదట మీకు ఎలాంటి విషమస్థితి ఎదురైనా ఏమాత్రం కలవరపడొద్దు. టెన్షన్ ఫీలవద్దు. భగవాన్ సత్యసాయిబాబాని మనసులో తల్చుకోండి. అన్నీ ఆయనే చూసుకుంటాడు" అన్నాడు రావుగారు.

ఉలిక్కిపడ్డాను. నేను నాస్తికుణ్ణి కాదు కానీ, నలుగురూ నమ్మే పద్ధతిలో దేవుణ్ణి నమ్మను. మా దగ్గరి బంధువుల్లో కొందరు నన్ను నాస్తికుడని కూడా అనుకుంటారు. ఇక సత్యసాయిబాబా విషయానికొస్తే ఆయన దేవుడని నేనెప్పుడూ అనుకోలేదు. ఇంకా చెప్పాలంటే, నాకు తెలిసిన కొన్ని ఇతర విశేషాల్ని బట్టి ఆయనపై సదభిప్రాయం కూడా లేదు.

రావుగార్ని చూస్తే ఏదో సరదాకి అన్నట్లు లేదు. బాబాగారి వీరభక్తుడిలా అనిపించారు. ఇంకా చెప్పాలంటే బాబాగారే వెదుక్కుంటూ బెర్లిన్ వచ్చి రావుగారి రూపంలో నన్ను కలిశారా అనిపించింది.

ఇప్పుడు నేను రావుగారికి ఏం చెప్పాలి?

బెర్లిన్లో మేమూ - ఆస్తికత్వమూ

రావుగారి మాటలకు తటపటాయిస్తూనే, "ఏదో నా పని నేను చేసుకుపోవడమే తప్ప, ఇంతవరకూ ఏ విషయంలోనూ, దేవుడి గురించి ఎక్కువగా ఆలోచించలేదు. సంప్రదాయం పాటిస్తాం కాబట్టి – వినాయక చవితి, వరలక్ష్మీ పూజ వగైరాలు శ్రద్ధగానే జరుపుతాం. అప్పుడు కూడా దైవభక్తికంటే నియమానికీ, నిష్ఠకీ ప్రాధాన్యం ఇస్తాం. తిరుపతి వెళ్లినా అదో రొటీనే తప్ప ప్రత్యేకమైన భక్తిభావం ఉన్నట్లు తోచదు. అవసరాలు తీర్చమని కానీ, కోరికలు సాధించాలని కానీ, సాయం చెయ్యమని కానీ – దేవుణ్ణి ప్రార్థించిన సందర్భాలు నా విషయంలోనూ, శ్రీమతి విషయంలోనూ కూడా ఇప్పటివరకూ అరుదనే చెప్పాలి" అన్నాను.

రావుగారు నవ్వాడు, "ఈ విషయంలో మీరే కాదు, బాగా చదువుకున్న చాలామంది పద్ధతి కూడా ఇదే! నేనూ మీ కోవకు చెందినవాణ్ణే. ఐతే మనకి తెలియందేమిటంటే, ఎవరిమీదో ఆధారపడకుండా మనకు జీవితంలో ఒక్కడుగు కూడా ముందుకు పడదని! చిన్నప్పుడు కొన్నింటికి తల్లిమీదా, కొన్నింటికి తండ్రిమీదా ఆధారపడాలి. కాస్త పెద్దయ్యేక స్నేహితులేర్పడతారు. కొన్నింటికి వాళ్లు మనమీదా, కొన్నింటికి మనం వాళ్లమీదా ఆధారపడక తప్పదు. ఎందుకంటే మనిషి సంఘజీవి. మీరే ఆలోచించండి! ఈనాడు మీరీ దశకు చేరుకుందుకు మీ స్వయంకృషి మాత్రమే కారణమని నమ్ముతారా?"

రావుగారు అరటిపండొలిచినట్లు చెప్పాడు. కాదని ఎలాగనడం?

నా విషయానికొస్తే – చదువు విషయంలో యూనివర్సిటీ దాటేదాకా నేను అన్నింటికీ మా తాతగారిమీదా, కొంతవరకూ నాకంటే ఓ ఏడాది మాత్రమే పెద్దవాడైన మా అన్నయ్యమీదా ఆధారపడ్డాను. ఎంత శ్రద్ధగా చదివినా, చదివింది ఆకళింపు చేసుకునేందుకు సరిపడ తెలివితేటలు ఉన్నా – మా తాతగారు సరైన సమయంలో సరైన దిశానిర్దేశం చెయ్యడమే – నేటి నా హోదాకి కారణం. ఆయన లేకుంటే, నేను గ్రాడ్యుయేషనుతో చదువు ఆపి, ఎక్కడో చిన్న గుమస్తా ఉద్యోగంలో చేరి భారంగా బ్రతుకుబండిని ఈడుస్తూండేవాణ్ణి. కొన్ని సమస్యల్ని నాకు నేనుగా పరిష్కరించుకున్నా – అన్నింటికీ ఆయనున్నారన్న ధైర్యమే ఎన్నోమార్లు విపత్కర పరిస్థితుల్లో నన్నాదుకుంది. నా చదువైపోయేక కూడా, ఆయన మరికొన్నేళ్లు బ్రతికుంటే ఇంకా ఎంతో బాగుండేదని నాకు తరచుగా అనిపిస్తూంటుంది.

ఈ విషయం రావుగారికి చెప్పాను.

రావుగారు నవ్వి, "నిజాయితీగా చెప్పారు. మీరన్నదాన్ని బట్టి అప్పట్లో మీ తాతగారు మీకు దేవుడు. ఆయన పక్కన లేనప్పుడు కూడా, ఆయనున్నారన్న భావనే మీకు ధైర్యం. భక్తులు విష్ణువునో, శివుణ్ణో తల్చుకున్నట్లు మీరాయన్ను తల్చుకుని ధైర్యంగా ఉండేవారు. కానీ మీ తాతగారు మనిషి కాబట్టి, ఆయన ఉనికి శాశ్వతం కాదు. దేవుడి ఉనికి శాశ్వతం. ఆయన్ని నమ్మితే, మనమున్నంతకాలం ధైర్యం మనని వెన్నంటే ఉంటుంది. సాటి మనిషి సాయం తీసుకుంటూ, స్వయంకృషిని నమ్ముకుంటూ – అన్నింటికీ దేవుడిపై భారం వేస్తే – అది మనసుకిచ్చే తృప్తి – దేవుణ్ణి నమ్మినవారికే తెలుస్తుంది. దేవుణ్ణి నమ్మడం అంటే మూఢత్వం కాదు, జీవన సౌలభ్యంకోసం చిన్న సద్దుబాటు – అంతే!" అన్నాడు.

ఇది ఆస్తికత్వంలో ఓ హేతువాదం. వినడానికి బాగుండడమే కాదు, ఆచరణకూ వీలుగా ఉంటుంది.

"చాలా బాగా చెప్పారు. ఎటొచ్చీ దేవుడికే వదిలిపెట్టాల్సినంత పెద్ద సమస్యలు మనకెప్పుడో కానీ రావు. వచ్చినప్పుడు తప్పక దేవుణ్ణి తల్చుకుంటాను" అన్నాను.

"భలేవారే! సమస్య పెద్దదో, చిన్నదో తెలుసుకోగల వివేకం ఏ మనిషికీ ఉండదు. ఎందుకంటే మనసొక లెన్సు లాంటిది. ఓ పక్క కాన్వెక్సు. ఓ పక్క కాంక్లేవు. ఎట్నించి చూస్తున్నాం అన్నదాన్ని బట్టి సమస్య పెద్దదో, చిన్నదో ఔతుంది. నన్నే తీసుకోండి. నాకు ఇండియా అంటే ప్రాణం. మా ఊరంటే ప్రాణం. తెలుగంటే ప్రాణం. మావాళ్లంటే ప్రాణం. అందర్నీ వదులుకుని పొట్ట చేతబట్టుకుని ఇక్కడికొచ్చాను. ఒకోసారి గ్లూమీగా అనిపిస్తుంది. అదీకాక ఇక్కడా, అక్కడా కూడా తరచుగా ఏవో సమస్యలు వస్తూనే ఉంటాయి. పరిష్కారం నావల్ల కాదనిపించినప్పుడల్లా – ఓ కార్డుమీద నా సమస్య వ్రాసి – బాబాగారి చిరునామాకు పోస్టు చేస్తాను. ఆ తర్వాత ఆ సమస్య గురించి పట్టించుకోను. అన్నీ ఆయనే చూసుకుంటాడు" అన్నాడు రావుగారు.

కష్టాలొచ్చినప్పుడు ఏ తిరుపతి వెంకన్నకో మొక్కుకునేవాళ్లు నాకు తెలుసు. కానీ ఇలా దేవుడికి ఉత్తరం వ్రాయడం నేనెరుగను. ఆ దేవుడు కూడా నిజంగా దేవుడు కాదు. మనకిలాగే ఉండి మనమధ్యనే తిరుగుతూ, దేవుణ్ణని చెప్పుకునే ఓ మనిషి!

పోనీ రావుగారు మామూలు మనిషా అనుకుంటే, ప్రతిభావంతుడైన ఇంజనీరు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన సీమెన్సు కంపెనీలో పని చేస్తున్నాడు. అదీ ఇండియాలో కాదు – ఆర్థికంగా, వైజ్ఞానికంగా అగ్రస్థానంలో ఉన్న పశ్చిమ జర్మనీలో.

"నేనిలా అంటున్నానని ఏమనుకోవద్దు. ఎందుకో చెప్పలేను కానీ – మన మధ్య తిరుగుతూ, మనలో నమ్మకం కలిగించడానికి ఇంద్రజాలాన్ని ప్రదర్శించే మనలాంటి మనిషిని దేవుడనుకుందుకు నాకు మనస్కరించదు. అదే ఏ రాముడో, కృష్ణుడో అయితే – వేల సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం కాబట్టి – అది వేరే సంగతి!" అన్నాను.

రావుగారు నవ్వి, "బాబాగారిది ఇంద్రజాలం కాదు. ఆయనలోని దైవత్వం చూపే మహిమ. ఆయనే కాదు, పూర్వకాలంలో రాముడూ మహిమలు చూపాడు. కృష్ణుడూ మహిమలు చూపాడు. నమ్మినవాళ్లు దేవుడన్నారు. నమ్మనివాళ్లు అంతరించిపోయారు. అప్పటికీ, ఇప్పటికీ వాళ్ల దైవత్వాన్ని శంకించినవాళ్లు కొందరుండొచ్చు. కానీ ఎన్నో వేల సంవత్సరాల తర్వాత కూడా మెజారిటీ జనం వాళ్ల దైవత్వాన్ని నమ్మి ఆరాధిస్తున్నారు. ఆ కాలంలో పుట్టకపోవడం నా దురదృష్టమని నేను బాధపడేవాణ్ణి. సత్యసాయిబాబా ఆ బాధను తొలగించాడు. ఈయన మన కాలంలో పుట్టడం మనందరి అదృష్టం. అందుకు సంతోషించక, ఆ కాలపు శిశుపాలుడిలా ఆలోచిస్తే అంతకంటే దురదృష్టముండదు" అన్నాడు.

బాబాగారిని దేవుడిగా నమ్మకపోతే, ముందు తరాలవాళ్లు నన్నో శిశుపాలుడిగా చిత్రీకరిస్తారని రావుగారు బెదిరిస్తున్నాడా అనిపించింది. శిశుపాలుడికీ నాకూ ఉన్న తేడాని సహేతుకంగా ఆయనకు వివరించాలనిపించినా, అలా చెయ్యలేదు. ఎందుకంటే రావుగారు తన నమ్మకాన్ని నామీద రుద్దడం లేదు. ఆ నమ్మకంతో తాను పొందిన ప్రయోజనాలు నాకూ కలగాలని తాపత్రయ పడుతున్నాడు. చూస్తే అతడు బాబాగారికి వీరభక్తుడిలా ఉన్నాడు. అతడి భక్తివల్ల అతడికి ప్రమాదం ఉందనుకోను. అతడు మారాల్సిన అవసరం ఉందనుకోను. ఒకవేళ అతణ్ణి మార్చాలని నేననుకుంటే, అందువల్ల ఎవరికి ప్రయోజనం?

పదిమందికి సాయపడే మంచి మనసున్న రావుగారి లక్షణాలకు ప్రతిబంధకం కానప్పుడు అతడి భక్తి అతడిష్టం – అంతే కదా!

చర్చను పెంచడం ఇష్టం లేక, "బాగా చెప్పారు" అన్నాను.

"చెప్పింది నేను కాదు. బాబాగారు. మిమ్మల్ని కలుసుకోవడం, మీకివన్నీ చెప్పడం అంతా బాబా సంకల్పం. ఐతే, మామూలు మనిషినైన నాకు ఆ మహానుభావుడి గురించి చెప్పగల సత్తా లేదు. అందుకే ఇవి తెచ్చాను" అంటూ ఒక సంచిలోంచి రెండు పుస్తకాలు తీశాడతడు.

అతడిచ్చిన వాటిలో ఒకటి – పుట్టపర్తిలో సత్యసాయిబాబా ఆశ్రమం నుంచి బాబాగారి సారధ్యంలో వెలువడుతున్న సనాతన సారధి అనే పత్రిక తాలూకు తాజా సంచిక. "ఇది చదివితే బాబాగారి ఆశ్రమ వివరాలు, అక్కడి వివిధ కార్యక్రమాలు తెలుస్తాయి. పురాణ విశేషాలని విశ్లేషిస్తూ, బాబాగారు రాసిన వ్యాసాలు చదివితే – మన అవగాహన బాగా పెరుగుతుంది. అదీకాక దైవలీలల్ని దైవమే వివరించి చెబుతుంటే వినడం ఒక అపూర్వానుభవం. భారతంలో గీతను విన్న అర్జునుడికి పట్టిన అదృష్టం మనకు పట్టినట్లే కదా!" అన్నాడతడు.

నాకైతే అతడు జోక్ చేస్తున్నాడా అని అనుమానమొచ్చి పరీక్షగా చూశాను. కానీ అతడి కళ్లలో ఆ పుస్తకం చదివిన స్మృతులు కలిగించిన పరవశం స్పష్టంగా కనిపించింది.

రావుగారిచ్చిన రెండో పుస్తకం – హోవార్డ్ మర్ఫెట్ అనే ఆస్ట్రేలియన్ భక్తుడు సత్య సాయిబాబాతో స్వానుభవాల్ని ప్రస్తావిస్తూ – ఆయన్ను ప్రపంచానికి పరిచయం చేసిన 'మాన్ ఆఫ్ మిరకిల్స్'. "ఇది చదివితే – బాబా గారి విశ్వరూపం సాక్షాత్కరిస్తుంది" అన్నాడతడు.

ఎందుకో నాకా పుస్తకాలమీద ఆసక్తి పుట్టలేదు. కానీ ఆ మాటలు అతడి గుండె లోతుల్నించీ వస్తున్నట్లపించి – అతడి ఆంతర్యాన్ని గౌరవించి, అభిమానానికి తలవంచి – వాటినిచ్చినందుకు థాంక్సు చెప్పాను.

"అప్పుడే థాంక్సు చెప్పేస్తే ఎలా? ఇచ్చింది చాలు అన్నట్లు అనిపించదూ!" అన్నాడతడు.

తడబడి, "అర్థం కాలేదు" అన్నాను.

"మీకోసం తెచ్చింది ఇంకొకటుంది. ఇవ్వనా, వద్దా?" అన్నాడు రావుగారు.

ఈసారి అతడి మాటల్లో హాస్యస్ఫూర్తి ధ్వనించడంతో మనసు కొంచెం తేలికపడి, "అయ్యో, ఇవ్వండి" అన్నాను కాస్త నొచ్చుకుంటూ.

"ఇవ్వడానికి నేనూ కొంచెం తటపటాయిస్తున్నాను. ఎందుకంటే ఇచ్చేముందు, ఉపోద్ఘాతం చెప్పాలి, తప్పదు" అన్నాడు రావుగారు.

1960లలో ఆంధ్రా యూనివర్సిటీ వేదికపైన తొలిసారిగా మిమిక్రీ విద్యను పరిచయం చేసిన మాన్యులు శ్రీ నేరెళ్ల వేణు మాధవ్, "ఇది తెలుగువారికి కొత్తగా పరిచయమౌతున్న కళ కాబట్టి, ఉపోద్ఘాతం తప్పనిసరి. ఐతే అది బంగాళాఖాతమంత అవకుండా జాగ్రత్త పడతాన్లెండి" అని చమత్కరించారు. ఉపోద్ఘాతం అన్న పదం విన్నప్పుడల్లా – నాకా మాటలు గుర్తొస్తుంటాయి.

"బంగాళాఖాతమంత ఉన్నా, చెప్పేది మీరైతే ఉపోద్ఘాతాన్ని వినడానికి నేను రెడీ" అని అతణ్ణి ప్రోత్సహించాను.

రావుగారు గొంతు సవరించుకున్నాడు.

రెండ్రోజులక్రితం ఎందుకో అతడికి బాబాగారితో మాట్లాడాలనిపించింది. భార్యకి చెబితే, "అయ్యో! బాబాగారి గొంతు అనుకరించి మాట్లాడదామంటే, నాకు మిమిక్రీ రాదే!" అని నొచ్చుకుంది.

"మిమిక్రీ రాకపోతేనేం, ఆయన పాడే పాటలు పాడు. బాబా మహిమతో నీ గొంతులో నాకాయన గొంతు వినిపిస్తుందిలే" అన్నాడతడు.

"ఐతేమాత్రం– ఆయన గొంతు మీరు వినడమే తప్ప మీకు ఆయనతో మాట్లాడ్డం అవదుగా" అందామె.

"వెర్రిదానా – బాబాగారితో మాట్లాడ్డమంటే – ఆయన గొంతు నేను వినడమే! నా గొంతు ఆయనకు వినిపించడం కాదు. నా మనసులో ఏమున్నదీ, ఆయనకు చెప్పకుండానే తెలుస్తుంది మరి!" అన్నాడతడు.

ఆమె మంచి గాయని. వినసొంపుగా 'గోవింద హరే గోపాల హరే' అంటూ బాబా తరచుగా పాడే భక్తి గీతాన్ని ఆలపించింది.

పాట సగంలో ఉండగా అతడు ఆపమని సైగ చేసి, "నా భక్తిభావంలో లోపముంది. నీ గొంతు నీ గొంతులాగే వినిపిస్తోంది" అన్నాడు.

తన భక్తిభావంలో లోపముందని అతడనుకున్నందుకు బాబాగారు నొచ్చుకున్నారు కాబోలు – ఆ సాయంత్రం కుర్ఫ్యూర్‌స్టెన్ డామ్ దగ్గరున్న 'కా డే వే' షాపుకి పనిమీద వెడితే, అనుకోకుండా అక్కడ బాబా స్వయంగా పాడిన భక్తిగీతమాల రికార్డు కళ్లబడింది.

సాధారణంగా అక్కడ అలాంటి రికార్డులు దొరకవు. అంటే – బాబా తన గొంతుని వినే అవకాశం ఇలా కల్పించేడన్న మాట!

ఇదీ ఉపోద్ఘాతం.

"అప్పుడలా అనుకున్నానా! అసలు విషయం తర్వాత అర్థమయింది. మీతో మా పరిచయమూ బాబా సంకల్పమే! మన తొలి పరిచయం అపూర్వం కావడానికి ఆ రికార్డు రూపంలో ఆయన నన్ను కరుణించాడు. నాతోపాటు మీకూ తన గొంతు రోజూ వినే అర్హత ఉందని అర్థమై, ఆ రికార్డుని కాసెట్లోకి దింపి మీకోసం తీసుకొచ్చాను" అంటూ అతడు తన జేబులోంచి ఓ కాసెట్ తీసిచ్చాడు.

అతడి గొంతులో భక్తిభావం. మొహంలో భక్తిభావం. రెండూ అపూర్వంగా ఉండి నన్ను విచలితుణ్ణి చేశాయి.

కాసెట్టుని తిరుపతి ప్రసాదంలా అందుకుని, అప్రయత్నంగా కళ్లకి అద్దుకుని శ్రీమతికి అందించాను.

ఆమె కూడా దాన్ని అంతటి భక్తిభావంతోనూ కళ్లకి అద్దుకుని పక్కన పెట్టింది.

రావుగారికి మహదానందమైంది. "మా నాన్నగారనేవారు – ఏమిచ్చామన్నది కాదు, ఎవరికిచ్చామన్నది ముఖ్యమని! బాబా మహిమ మీరే చూస్తారు. ఇక జర్మనీలో మీకు అంతా శుభమే జరుగుతుంది" అన్నాడు ఆప్యాయంగా.

"మీ నోటిమాట నాకు దీవెనలా ఉంది" అన్నాను నేనూ సంతోషంగా.

"మీరు ఆ కాసెట్టుని కాపీ చేసుకున్నాక నాకు మళ్లీ ఇచ్చెయ్యాలి. ఎందుకంటే, పాటలు వినడానికి రికార్డుకంటే, కాసెట్ వాడడం ఎక్కువ వీలు. మీకు అనుకూలంగా ఉంటుందని అందాకా ఆ కాసెట్టుని త్యాగం చేస్తున్నాననుకోండి" అన్నాడు రావుగారు.

ఆ కాసెట్ నాకు దేవుడు పక్కనున్న అనుభూతిని ఎలా కలిగించిందీ అన్న ఆసక్తికరమైన విశేషాన్ని చెప్పబోయే ముందు – గతంలో నన్ను సత్యసాయి గురించిన ఆలోచనలకు పురిగొల్పిన సన్నిహితుల గురించి చెప్పాలి.

నేనూ నా భక్తమిత్రులూ

సత్యసాయిబాబాని దేవుడిగా నమ్మినవారు ఎందరున్నారో, నమ్మనివారు అంతకంటే ఎక్కువే ఉన్నారు. వారిలో కొందరు తమకు తెలిసిన పురాణకాలపు దేవుళ్ల జాబితాలో ఆయన్ను చేర్చడాన్ని ఏమాత్రం ఇష్టపడరు. కొందరు ఆయన దేవుడైతే మనకేంటి, కాకపోతే మనకేంటి అనుకుంటారు. కొందరు మాత్రం, ఆయన తన్ను తాను దేవుడిగా ప్రకటించుకోవడాన్ని తీవ్రంగా నిరసిస్తారు. వారిలో కొందరు హేతువాదులు, మేధావులు, జ్ఞానసంపన్నులు అయితే – అలాంటివారిని నిరసించడంలో జాతిహితం ఉందంటారు.

ఒక రచయితగా సత్యాన్వేషిని అనుకునే నేను, ఏ కోవకు చెందుతానో నాకే స్పష్టత లేదు. కానీ మా అమ్మ సత్యసాయిని నమ్మడమే కాక – మా ఆఖరి చెల్లికి ఆయన పేరు పెట్టింది. బాబా గురించి చిన్న పొల్లు మాట అన్నా తను భరించలేదు. ఆయన్ను నిరసించడం అమ్మని బాధ పెట్టడమేనని నాకు తోచేది. అదీకాక తన నమ్మకంవల్ల అమ్మకి తగిన ఓదార్పు లభించి, ధైర్యం కలిగి సంతోషంగా ఉండేది. ఆపైన ఆమె నమ్మకంవల్ల మిగతావారికి ఏ ప్రమాదం, నష్టం లేదు.

రీసెర్చి రోజుల్లో నా మిత్రుడొకడు – బాబాగారివి క్షుద్రశక్తులనీ, శంకరాచార్యులు దైవస్వరూపుడనీ నమ్మేవాడు. అందుకు ఉదాహరణగా కొన్ని కథలు చెప్పేవాడు. అవన్నీ ఇక్కడ అప్రస్తుతం.

ఒక సాయి భక్తుడు నామీద కోపమొచ్చినప్పుడు, "నా జోలికొచ్చావో, మా బాబా నిన్ను సర్వనాశనం చేస్తాడు" అన్నాడు. నాకు చిరాకేసి, "అంటే నీ ఉద్దేశ్యంలో బాబా ఎవరు? దేవుడా? లేక నువ్వు ఏర్పాటు చేసుకున్న గూండానా?" అన్నాను. అప్పటికి తన మాటల్ని ఇలా కూడా అనుకోవచ్చని అర్థమయినట్లుంది – ఆ తర్వాత అతగాడు నన్ను భయపెట్టడానికి బాబా పేరు వాడలేదు.

రీసెర్చి సమయంలో చాలామంది బాబా భక్తుల్ని గమనించాను. వారిలో స్వార్థం, అహం, అసహనం ఎక్కువగా ఉండడం గమనించి, "అవేనా వారి భక్తికి కారణం? అవి కాదనుకున్నా – తన భక్తుల్లో ఈ లక్షణాల్ని హరించలేనివాడు దేవుడౌతాడా?" అనిపించేది.

నా రూంమేట్ బీఎల్ నా ఆలోచనల్ని విశ్లేషిస్తూ, "నిజం చెప్పాలంటే నాలోనూ ఇదే భావం ఉంది. కానీ స్వార్థం, అహం, అసహనం – ఒక్క బాబా భక్తులకే పరిమితం కాదు. అవి మనుషులందరికీ సహజం. మరి ప్రతి మనిషీ ఏదో ఒక దేవుణ్ణి నమ్ముతాడు. మనకిలా ఆలోచిస్తే – ఈ ప్రపంచంలో ఏ దేవుణ్ణీ నమ్మకూడదు. అపనమ్మకాన్ని ఒక్క బాబాకే అంటగట్టడమెందుకు?" అన్నాడు.

ఆ మాటలతో నా ఆలోచనల్లో ఏదో లోపం ఉందనిపించింది. సైంటిస్టుగా అప్పటికే ఉన్నత శిఖరాలని అధిరోహించిన సూరి భగవంతం, బాబాగారికి అనుచరుడయ్యేడంటే – ఆయనకి ఈ మాత్రం ఆలోచన స్ఫురించకనా?

నా జీవితం నాది, బాబా దేవుడైతే నాకేంటి, కాకపోతే నాకేంటి అని తప్పించుకున్నా – సత్యసాయి భక్తులు ఎవరో ఒకరు నాకు దగ్గరై – నన్ను ఆయన గురించిన ఆలోచనలకు దూరం కానివ్వడం లేదు.

భువనేశ్వర్లో రీజినల్ రీసెర్చి లాబొరేటరీలో సైంటిస్టుగా చేరేక – నాకు ఆఫీసులో చాలామంది భక్తులు తటస్థపడ్డారు. వారు బాబా వల్ల తమకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరాయో చెప్పేవారు.

"కర్మఫలాన్ని తప్పించడం ఆ విధాతకు కూడా సాధ్యం కాదు" అని మన పురాణాలు చెబుతాయి. మరి రాముడైనా, కృష్ణుడైనా, బాబా ఐనా – మనకి ప్రయోజనాలు చేకూర్చడమేమిటనిపించేది. ఐనా మనకి ప్రయోజనం కలిగించేవాడు మిత్రుడో, బంధువో కావాలి తప్ప – దేవుడెలాగౌతాడనుకునేవాణ్ణి.

"మా ఇంటికి భజనకు రా. ఆ సమూహంలో పాల్గొంటే, నీకు భక్తి దానంతటదే పుట్టుకొస్తుంది" అని కొందరు మిత్రులు తమ ఇళ్లకు అహ్వానించారు. వీలు కాదని తప్పించుకునేవాణ్ణి.

ఐతే ఒక్క విషయం నాకు ఆశ్చర్యంగా ఉండేది. సామాన్య కుటుంబంలో పుట్టిన ఒక వ్యక్తి – మన రాష్ట్రంలోనే కాక, దేశంలోనే కాక, విదేశాల్లో కూడా అసంఖ్యాక భక్తుల్ని ప్రభావితం చెయ్యడం ఎలా సాధ్య పడింది?

జనం మూర్ఖత్వమా లేక ఆయన మానవాతీతుడు కావడమా?

ఇలాంటి మీమాంసలో ఉండగానే – నాకు శ్రీనివాసరావుగారు పరిచయమయ్యారు. అతడు భువనేశ్వర్లో ఉత్కళ యూనివర్సిటీలో స్టాటిస్టిక్సు విభాగంలో ఆచార్యుడు. అతడు యూనివర్సిటీ కాంపసులో ఉంటున్నాడు. ఆ కాంపసుకి వాణీవిహార్ అన్న చక్కని పేరు. అది మా లాబొరేటరీ కాంపసుకి పక్కనే ఉంది. ఆదిలో మా కాంపసునుంచి ఊళ్లోకి వెళ్లాలంటే, టౌనుబస్సులు ఎక్కడానికి వాణీవిహార్ వెళ్లాల్సి ఉండేది.

శ్రీనివాసరావుకి తెలుగుతనం ఇష్టం. తెలుగు సినిమాలు ఇష్టం. తెలుగువాళ్లతో పరిచయం ఇష్టం. అతడితో మా పరిచయం వాణీవిహార్ బస్సుస్టాపు దగ్గర మొదలై, ఊళ్లోని సినిమా హాలు దగ్గర బలపడి, క్రమంగా ఒకరిళ్లకు ఒకరు వెళ్లేటంత సాన్నిహిత్యానికి దారి తీసింది.

ఇప్పుడీ శ్రీనివాసరావు ప్రస్తావన ఎందుకంటే, ఆయన సత్యసాయికి వీరభక్తుడు. ఆయన ఇంట్లో బాబాకి ఓ గదిని ప్రత్యేకించారు. ఆ గదిలో మధ్యన సింహాసనంలాంటి ఓ పెద్ద కుర్చీలో, నిలువెత్తు పటం. అందులో పొడవాటి కాషాయపు అంగీలో, అభయహస్తమిస్తూ, మందహాసం చేస్తున్న సత్యసాయిబాబా చిత్రం. చూడగానే అప్రయత్నంగా చేతులు జోడించాలనిపిస్తుంది.

వారం వారం తప్పనిసరిగానూ, అప్పుడప్పుడు పర్వదినాల్లోనూ శ్రీనివాసరావింట్లో భజనలు జరిగేవి.

పరిచయమైన వారానికే అతడు నన్ను భజనకు ఆహ్వానించాడు.

అదేమిటో, ఎవరు పిలిచినా భజనకు వెళ్లనివాణ్ణి – అతడి విషయంలో వెంటనే సరేనన్నాను.

ఆశయాలూ, ఆదర్శాలూ అనుకుంటాం కానీ – ఒకరు పిలిచే తీరు మన స్పందనల్ని పూర్తిగా మార్చెయ్యగలదు.

శ్రీనివాసరావు ఇంటికొచ్చిన భక్తులు సామాన్యులు కారు. వారిలో అయ్యేయస్ ఆఫీసర్లు, రాజకీయ ప్రముఖులు, వాణిజ్య ప్రముఖులు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు – అందరూ విద్యలోనో, హోదాలోనో, జ్ఞానంలోనో – ఉన్నత హోదాలో ఉన్నవాళ్లే.

అక్కడున్న అందరిలోకీ వయసులోనూ, హోదాలోనూ కూడా నేనే చిన్నవాణ్ణి.

వచ్చినవాళ్లు అంతా మనస్ఫూర్తిగా శ్రీనివాసరావు పట్ల భక్తి, గౌరవ, వినయాలను ప్రకటించారు. ఒకరొక్కరుగా భజన పాటలు పాడారు. తర్వాత ఓ ప్రొఫెసరుగారు దేవుడి గురించి ఉపన్యాసం ఇచ్చారు.

'దేవుడు కంటికి కనిపించడు. అయినా ఆయన్ని నమ్మాలి. అందుకంటే పానకంలోని తీపి కనిపించదు. తీగలో కరెంటు కనిపించదు. ఐనా ఆరెంటినీ నమ్మి, తగిన ప్రయోజనాలు పొందుతున్నాం' – అన్నది ఆయన మాటల సారాంశం.

తగినంత వయసు, అనుభవం, జ్ఞానం ఉన్న ప్రొఫెసరునుంచి నేనాశించినది చాలా ఎక్కువ కావడంవల్లనో ఏమో, నాకా వివరణ చాలా ప్రాథమిక దశలో ఉన్నట్లు అనిపించింది. ఆయన చెప్పిన కారణాలను కొట్టిపారెయ్యడానికి – నా స్థాయి హేతువాదమూ, తర్కమూ చాలనిపించింది.

అదలాగుంచి – సత్యసాయిని దేవుడనడానికి అక్కడివారు ఒకొక్కరుగా కొన్ని నిదర్శనాలు చెప్పారు. అన్నీ వ్యక్తిగత ప్రయోజనాలకు సంబంధించిన స్వానుభవాలే! అంటే – భక్తి అన్నది స్వప్రయోజనాలకు సాధనం. బాబా వల్ల స్వప్రయోజనాలు నెరవేరడమే – వారి భక్తికి కారణమనిపించింది.

అక్కడ చేరినవారి మాటలు విన్నాక – అక్కడ నా హోదా, వయసు చిన్నవన్న భావన తొలగిపోయింది.

ఐతే శ్రీనివాసరావు మిగతా భక్తులకు భిన్నం. బాబా కారణంగా అతడికి పెద్దవారితో పరిచయాలు ఏర్పడ్డ మాట నిజం. కానీ, అవి కేవలం భజనలకూ, భక్తి సమావేశాలకూ మాత్రమే పరిమితం. జీతమొక్కటే ఆధారమైన ఆయన జీవితగమనం, ఆ జీతపు పరిమితులకు లోబడి ఉండేది. చాలాకాలం అతడికి స్కూటరు కూడా లేదు. ప్రతిఫలాపేక్ష లేకుండా బాబాని సేవించేవాడు. బాబాగారి విశ్లేషణాత్మక వ్యాసాలు చదివి మురిసిపోయేవాడు. బాబాని తల్చుకుంటే ఆయనలో కలిగే పరవశం, కృష్ణుడి కాలంలో రాధని స్ఫురింపజేసేది.

ఉపాధ్యాయవృత్తికి న్యాయం చేస్తూ, విద్యార్థుల్లో మంచి టీచరన్న పేరు తెచ్చుకున్నాడు. బాబా పేరిట జరిగే నారాయణని భక్తిశ్రద్ధలతో నిర్వహించేవాడు. కానీ ఉద్యోగంలో ప్రమోషన్ కోసం యూనివర్సిటీలో ఎవర్నీ సేవించడు. పదోన్నతి మాత్రమే కాదు, తనకే మంచి జరిగినా – అది బాబా దీవెన అంటాడు.

సమస్యలెదురైనప్పుడు పరిష్కారానికి బాబాని ప్రార్థించడు. "ఈ సమస్య బాబా సంకల్పం. దాన్ని నేను గౌరవించాలి. పరిష్కారం చూపాలా, వద్దా అన్నది ఆయన నిర్ణయం" అనేవాడు.

తర్వాతెప్పుడో యూనివర్సిటీ ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన రిజిస్ట్రారు పదవి ఇవ్వాలనుకుంది. ఆ పదవికి బాధ్యతలెక్కువనీ, బాబాని సేవించుకుందుకు ప్రతిబంధకమౌతుందనీ భావించి మృదువుగా తిరస్కరించాడాయన.

ఐతే బాబాకి సంబంధించిన వివాదాస్పదమైన మహిమలు అతడింట్లో జరిగాయి. వాళ్లింట్లో అప్పుడప్పుడు బాబా పటం ఫ్రేంనుంచి విభూతి రాలేది. తరచుగా – ఆ పటంలో బాబా పాదాలవద్ద కుంకుమ ఉద్భవించేది. ఇంకా రకరకాల మహిమలు జరిగేవి. అవి చూడ్డానికి చాలామంది వాళ్లింటికి వెళ్లేవారు.

ఇలాంటి విశేషాలు అతడు నాకు చెప్పి, తన ఇంట్లో అలా జరుగుతున్నందుకు మురిసిపోయేవాడు.

పటానికి విభూతి రాలడానికి ఆగ్జాలిక్ యాసిడ్ వాడతారనీ, ఇతర మహిమలు కూడా ఇంద్రజాల విద్యలే తప్ప మహిమలు కాదనీ పత్రికల్లో చదివాను. ఐతే నేను శ్రీనివాసరావుని ఏమాత్రం శంకించలేకపోయాను. నేనే కాదు, ఎరిగినవారెవరూ అతణ్ణి ఈ విషయంలో శంకించలేరు. నిజంగానే ఆ మహిమల్లో ఆయన హస్తమున్నా, అది బాబాకి ప్రచారమే తప్ప – వ్యక్తిగత ప్రయోజనాలకి కాదు.

'నీ మిత్రులెవరో చెప్పు. నువ్వేమిటో నేను చెబుతాను' అంటారు అనుభవజ్ఞులు.

'నీ భక్తులెవరో చెప్పు. నువ్వేమిటో నేను చెబుతాను' అన్నది దేవుడికి వర్తిస్తుందని నేనంటాను.

బాబాపై గౌరవభావం కలగడానికి శ్రీనివాసరావు వంటి భక్తుడు ఒక్కడు చాలు. బహుశా అలాంటి వారు చాలామందే ఉండి ఉంటారు. అదే బాబా ప్రాభవానికి కారణమయుండొచ్చని నాకు అనిపించేది.

నావరకూ వస్తే, బాబా గురించి చాలా అనుమానాలుండేవి. వాటిలో కొన్ని శ్రీనివాసరావు చెప్పే విశేషాల్లోంచే పుట్టుకొచ్చేవి. కానీ పొరపాటున కూడా నేను బాబా విషయంలో ఆయనవద్ద నోరు జారలేదు.

పురాణాల్లో కూడా భక్తి విషయంలో అర్జునుడంతటివాణ్ణి అనుమానించొచ్చు. కానీ రంతిదేవుడు, అంబరీషుడు వంటివారి ముందు నోరు పెగలదు.

శ్రీనివాసరావు ఎంతటి భక్తిపరుడైనా, నాకు మంచిమిత్రుడైనా – భక్తి పరంగా నా ఉపేక్షాభావాన్ని గ్రహించలేని అమాయకుడూ కాదు. బాబా గురించి ఎంతవరకూ పంచుకోవాలో, అంతవరకే విశేషాల్ని చెప్పేవాడు. తన ఇంట్లో భజనలకు రమ్మని నన్ను నొక్కించలేదు. విశిష్టమైన భజనలు ఉన్నప్పుడు మాత్రం, నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించేవాడు. కానీ నేను వెళ్లకపోతే ఆ ప్రస్తావన తెచ్చి నిష్ఠూరం వేసేవాడు కాదు. నేనూ అతడూ ఎక్కువగా తెలుగు సినిమాల గురించీ, పత్రికల గురించీ మాట్లాడుకునేవాళ్లం. మేమెప్పుడు కలుసుకున్నా – ఆహ్లాదకరంగా ఉండేదే తప్ప – వివాదాస్పద చర్చలు మామధ్య జరుగలేదు.

ఆ తర్వాత మళ్లీ ఇదిగో ఇప్పుడు నాకు రావుగారి రూపంలో మరో సాయి వీరభక్తుడు తటస్థపడ్డాడు.

అతడికీ, ఇతడికీ పోలికలు అనతగ్గవి కొన్ని ఉన్నాయి.

శ్రీనివాసరావు సత్యసాయి భక్త సమాజానికి సంబంధించి ఒరిస్సాలో రాష్ట్రస్థాయి ఉన్నత పదవిలో ఉన్నాడు. ఈ రావుగారి అన్న కూడా రాజస్థాన్ యూనివర్సిటీలో పని చేస్తూ – సత్యసాయి భక్త సమాజానికి రాష్ట్రస్థాయి ఉన్నత పదవిలో ఉన్నాడు.

ఈ రావు, ఆ రావు కూడా – బాబానుంచి ధన కనక వస్తు వాహనాలనూ, సాంఘిక ఆర్థిక ప్రయోజనాల్నీ ఆశించడం లేదు. వారు కోరేది మనశ్శాంతి, సార్థకమైన జీవితం.

నా విషయంలో మాత్రం ఈ రావు ఆ రావు కంటే రెండడుగులు ముందుకేసి, ఇంట్లో నన్ను బాబా గొంతులో భజనలు వినమన్నారు.

"పాపం, ఆయనకు ఆ కాసెట్ ప్రాణంలా ఉంది. మనం వెంటనే రికార్డు చేసుకుని, ఆయనకు వెనక్కిచ్చేద్దాం" అంది శ్రీమతి నాతో.

"అలాగే కానీ – ముందు మనం ఒక లాటరీ టికెట్ కొనాలి. తర్వాతనే రికార్డింగు" అన్నాను.

జర్మనీలో ఫెర్న్‌జెహ్ (టివి) లాటరీ గురించి గతంలో చెప్పాను. 50 ఫెన్నిగ్సుకి ఓ టికెట్. వాటిని కియోస్కుల్లో అమ్ముతారు. అందులో 1 నుంచి 36 అంకెలుండేవని గుర్తు. వాటిలో ఆరింటిని ఎంచుకుని కియోస్కులో ఇవ్వాలి. వారం వారం డ్రా తీసి టివిలో చూపిస్తారు. అన్ని అంకెలూ సరిపోతే మిలియన్ మార్కుల బహుమానం. ఎంతమందికొస్తే అంతమందీ పంచుకోవాలి. అక్కణ్ణించి ఐదు అంకెలకు ఇంత, నాలుగింటికి ఇంత అని అదే పద్ధతిలో బహుమతి పంపకం ఉంటుంది. తక్కువ మొత్తాల్ని కియోస్కుల్లోంచి తీసుకోవచ్చు.

ఆర్నెల్ల సావాసంలో వారు వీరౌతారంటారు. లాటరీ టికెట్ కొంటాననడంలో నా ఉద్దేశ్యం శ్రీమతికి అర్థమయింది. "అంటే బాబా భజనకీ లాటరీ బహుమతికీ లంకె పెడుతున్నారా? నమ్మకమే కాదు, పవిత్రతకూ సంబంధించిన విషయాల్లో వేళాకోళం పనికి రాదు" అంది.

"నీ ఊహ కొంతవరకూ కరెక్టే. కానీ – భగవంతుడు భక్తులకు పరీక్షలు పెడితే, అదాయన లీల అంటున్నాం కదా! భక్తుడు భగవంతుడికి పరీక్ష పెడితే, అది వేళాకోళం ఎందుకౌతుంది?" అన్నాను.

శ్రీమతి అప్రయత్నంగా లెంపలేసుకుని, "మీకు తోచినట్లు చెయ్యండి కానీ, ఇంక దీని గురించి వాదన పెంచొద్దు" అని అక్కడితో త్రుంచేసింది. సరేనని నేనూ ఊరుకున్నాను.

దేవుడు నా పక్కనున్న అనుభూతికి దారితీసే విచిత్ర సంఘటన ఒకటి నాకోసం ఎదురు చూస్తోందని అప్పుడు నాకు తెలియదు.

బెర్లిన్లో భక్తలీల

పాశ్చాత్యులైన తెల్లవారు హేతువాదులని నేననుకుంటాను. వారు ఏదైనా మతాన్ని స్వీకరించినా, జీవనసౌలభ్యానికో లేక మనశ్శాంతికో. కొన్ని సంప్రదాయాలు పాటించినా, మూఢవిశ్వాసాలకి లోనవరు. సత్యాన్వేషణకే ప్రాధాన్యమివ్వడంవల్ల, దైవభక్తి వారి దైనందిన జీవితంలో భాగం కాదు. వారి దృక్పథం కూడా ఆధ్యాత్మికం కాదు, భౌతికం.

ఇక బాబా వంటి సమకాలీన ప్రత్యక్షదైవాల విషయానికొస్తే – వారి మానవాతీతశక్తుల్ని దైవత్వంగా భావించరు. ఐతే కుతూహలం వారిని ఉపేక్షించనివ్వదు. అవగాహనకోసం ప్రయత్నిస్తారు. అందుకు శాస్త్రీయ దృక్పథాన్ని అనుసరిస్తారు.

ఈ విధంగా వారిది ఉత్తమస్థాయి ఆలోచన అనీ, మన దేశంలో చాలామంది ఈ విషయంలో వారిని అనుసరించాలనీ అనుకుంటూ – నా వంతు ప్రయత్నం నేను చేస్తుంటాను.

ఐతే సత్యసాయిబాబా అనుచరుల్లో పాశ్చాత్యులైన శ్వేత జాతీయులు ఎక్కువగానే ఉన్నారని తెలిసేక సందిగ్ధంలో పడ్డాను.

బాబాలో దైవత్వముందా, లేక ఆ తెల్లవారు కూడా సామాన్యతలో మనకు తీసిపోరా?

ఈ ప్రశ్నని రావుగారు నాలో రేకెత్తించారు. ఆయన ఇచ్చిన మాన్ ఆఫ్ మిరకిల్స్ పుస్తకంలో – ఆ ప్రశ్నకు జవాబు దొరకొచ్చునేమో!

హోవార్డ్ మర్ఫెట్ పాశ్చాతుడు. తెల్లవాడు. ఆపైన రచయిత కూడా.

అతడేం రాసి ఉంటాడోనన్న కుతూహలంతో ఆ పుస్తకాన్ని చదివాను. చదివితే చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది.

అది మన పురాణకథల్లో భక్తుల చరిత్ర పంథానే అనుసరించింది.

మర్ఫెట్ బాబా గురించి విన్నాడు. ఆయన్ని దేవుడని నమ్మలేదు. పరిశోధనాత్మక దృష్టితో ఇండియా వెళ్లేడు. బాబా గార్ని కలిశాడు. తన భావనలు వినిపించాడు. ఆయన ఆశ్రమంలో చోటు సంపాదించాడు. ఆ సాహచర్యంలో ఎన్నో మహిమలు చూశాడు. అవి అద్భుతాలేనని నిర్ధారించాడు. ఆయనకు భక్తుడయ్యాడు. ప్రచారకుడయ్యాడు.

అందులో బాబా ఏయే తేదీల్లో ఏయే మహిమలు ఎప్పుడెప్పుడు చూపాడో వివరాలిచ్చాడు. అవి అద్భుతాలేనని పాఠకుల్ని ఒప్పించేంత గొప్ప రచనాశైలిని ప్రదర్శించాడు.

ఇంకా నాకు తెలియని మరికొన్ని విశేషాలున్నాయి. అప్పటికే తన దైవత్వాన్ని కోట్లాదికి నిరూపించుకున్న షిర్డీ సాయిబాబాయే సత్య సాయిబాబాగా పునర్జన్మ ఎత్తేడట. అందుకు తగినన్ని సాక్ష్యాధారాలూ ఆ పుస్తకంలో ఉన్నాయి.

ఆ వివరాలు ఎప్పటికప్పుడు శ్రీమతితో పంచుకునేవాణ్ణి. చదవడం పూర్తయ్యేక, "సత్యసాయిబాబా భగవంతుని అవతారమా కాదా అన్నది పక్కన పెడితే – ఈ రచయితలో నిజాయితీ ఉంది" అన్నానామెతో

"నాకిక సందేహం లేదు. ఆయన దేవుడేనండీ" అంది శ్రీమతి.

"దేవుడైతే మనకేమిటి? కాకపోతే మనకేమిటి? మనవరకూ మాత్రం కోరికలు తీర్చుకుందుకు ఇప్పటికున్న రాముడూ, కృష్ణుడూ, శివుడూ వగైరాలు చాలరా?" అన్నాను.

"ఇంతమంది దేవుళ్లని పూజిస్తున్నాం. వాళ్లలో ఈయన్నీ కలుపుకుంటే నష్టమేముంది?" అంది శ్రీమతి.

"నష్టం కాదు. లాభం చూసుకోవాలి. రాజకీయనాయకులు కూడా కొత్త పార్టీలో కలిసేముందు లాభం చూసుకుంటారు" అన్నాను.

"ఐతే ఏంచేస్తారు?"

"ఒక లాటరీ టికెట్ కొంటాను. ప్రైజొచ్చిందీ, ఇకమీదట ఆయనే మన దేవుడు" అన్నాను.

శ్రీమతి నవ్వేసింది కానీ, నేను నిజంగానే లాటరీ టికెట్ కొన్నప్పుడు ఆశ్చర్యపోయింది.

కొని ఊరుకున్నానా, లేదు. ఆ టికెట్ భద్రపర్చడానికి ఇంట్లో ఓ పవిత్రమైన స్థలాన్ని సూచించమని శ్రీమతికి చెప్పాను.

ఆమె కొంచెం ఆలోచించి, "మనింట్లో పవిత్రస్థలమా? అది చర్చించి తేల్చాల్సిన విషయం" అంది.

ఆమె ఆ మాట ఊరికే అనలేదు.

మా ఇంట్లో కిచెన్ కామన్. మాతో పాటు ఇంటామె ఒలోముచ్‌కీ కూడా వాడుతుంది కాబట్టి, అక్కడ పవిత్రతకి ఆస్కారం లేదు. అందుక్కారణం ఆమె మ్లేచ్ఛజాతికి చెందినదని కాదు. పుట్టుకను బట్టి, అలవాట్లను బట్టి మనుషుల పవిత్రతను అంచనా వెయ్యడం కుసంస్కారమని నమ్మేవారిలో ప్రథముణ్ణి కావాలనుకునేవాణ్ణి, అలాంటి భావనకు తావిస్తానా!

నేను కోరే పవిత్రత శుచి శుభ్రాలకు సంబంధించినది.

ఒలోముచ్‌కీ స్నానమే నెలకొకటి రెండు సార్లో చేస్తుంది. వంటింట్లో తను వచ్చి వెళ్లిన గుర్తులన్నీ వదిలి వెడుతుంది. అందుకని వంటింట్లో ఆ టికెట్ ఉంచలేం.

బాత్రూం విషయానికొస్తే అది మనుషుల్ని పవిత్రులుగా చెయ్యడానికే తప్ప, పవిత్రమైన వాటిని ఉంచడానికి అనువైన స్థలం కాదు. ఆపైన అసలే కోతి అన్నట్లు, అక్కడ టబ్బుతో పాటు కమోడ్ కూడా ఉంది.

ఇక మేముండే గది. అక్కడ టీపాయ్ ఒకటుంది కానీ, అదే భోజనాల బల్ల కూడా! ఎంత జాగ్రత్తగా తిన్నా, కనీసం పిల్లలు తిన్నప్పుడైనా ఎంతోకొంత ఎంగిలి అంటుతుంది. భోంచేస్తున్నప్పుడల్లా ఆ బల్ల ఖాళీ చెయ్యక తప్పదు.

మరో ఫర్నిచర్ మంచం. దానికీ అరలూ అవీ లేవు. పవిత్రంగా భావించేవాటిని పరుపుకింద పెట్టుకోవచ్చు కానీ, ఆ తర్వాత పరుపుమీద పడుకుంటే ఆ పవిత్ర వస్తువుల్ని అవమానించినట్లే కదా! అదీకాక తరచుగా కాకపోయినా, అప్పుడప్పుడు బాబుకి పక్క తడిపే అలవాటింకా ఉంది.

ఉన్నట్లుండి అన్నాను, "మనం పనికొచ్చేవాటిని వెతుకుతున్నట్లు లేదు. పనికిరానివాటిని గుర్తిస్తున్నాం".

"మీకలా అనిపించిందా, నాకైతే, మనమింతవరకూ ఈ గదిలో దేవుడి బొమ్మయినా పెట్టుకునే ప్రయత్నమే చెయ్యలేదని" అంది శ్రీమతి.

అదీ నిజమే.

వచ్చినప్పట్నించీ ఇంతవరకూ ఇంట్లో ఎక్కడైనా దేవుడి బొమ్మ పెట్టుకుని రోజూ దణ్ణం పెట్టుకోవాలన్న ఆలోచనే మాకు రాలేదు. మా దినచర్య హడావుడిలో ఆ విషయం స్ఫురించనూ లేదు.

భువనేశ్వర్లో శ్రీనివాసరావు గారు తనకి యూనివర్సిటీ క్వార్టర్సు రాగానే – ముందుగా తను నమ్మిన దేవుడికి ఏ గది కేటాయించాలా అని ఆలోచించారు. ఉన్నంతలో పెద్ద గదిని దేవుడికిచ్చి, మిగతాభాగంలో తనూ తన కుటుంబం సద్దుకున్నారు. అదీ భక్తి!

మరి మాకసలు దేవుడి ఆలోచనే రాలేదు. బెర్లిన్ రావుగారి పరిచయభాగ్యంతో ఇప్పుడా ఆలోచనొచ్చింది.

రావుగారు స్ఫురించగానే, "ఔనూ, రావుగారిచ్చిన కాసెట్టూ, పుస్తకం ఎక్కడ ఉంచుతున్నాం?" అనడిగాను.

వెంటనే శ్రీమతి అక్కడున్న టేపు రికార్డరు బల్లవైపు చూసింది.

మాటవరుసకు అడిగాను కానీ నాకుమాత్రం జవాబు తెలియకనా?

మా గదిలో ఎత్తైన పాతకాలం నాటి బల్ల ఉంది. ఉపరితలం ఎగుడు దిగుడుగా ఉన్నా వైశాల్యం కాస్త పెద్దదే!

దానిమీదనే మా రేడియో–రికార్డరు, స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు ఉన్నాయి. ఆ బల్ల సొరుగులో టేపులు, కాసెట్లు, రికార్డరుకి తగిన అనుబంధ పరికరాలు ఉన్నాయి, ఆ టేపుల్లో ఇండియన్సు నుంచి తెచ్చుకుని రికార్డు చేసుకున్న బాబీ, ప్యాసా, తీస్రీ మంజిల్, తలాష్, మేరానామ్ జోకర్ వగైరా హిందీ సినిమా పాటలు, కొంత పాశ్చాత్య సంగీతం ఉన్నాయి. ఇంకా ఘంటసాల ప్రైవేటు రికార్డులు ఉన్నాయి. కాళీ టేపులూ, పర్సనల్ రికార్డింగ్సూ కూడా చాలా ఉన్నాయి.

రావు గారిచ్చిన టేపుని ఆ సొరుగుల్లో వాటి మధ్య పెట్టడం సబబు కాదంది శ్రీమతి. పుస్తకాన్ని టేపు రికార్డరు పక్కన పెట్టి, దానిమీద బాబా పాటల కాసెట్ ఉంచింది. తను చెప్పదు, నేనడగను కానీ – రోజూ లేవగానే ఓసారి వాటికి చేతులు జోడిస్తోందని నా అనుమానం.

చదవడానికి పుస్తకాన్ని అక్కణ్ణించే తీసి, చదవడం ఆపగానే మళ్లీ అక్కడే ఉంచుతున్నాను. ఐతే అదో పవిత్రస్థలమని ఇప్పుడీ చర్చలయ్యేదాకా స్ఫురించలేదు. ఏదేమైనా మా గదిలో పవిత్రతకి కేటాయించిన స్థలమొకటి ఉంది.

లాటరీ టికెట్టుని శ్రీమతికి అందించి, "దీని విలువ మిలియన్ మార్కులు. మన జీవితాల్ని మార్చే శక్తి ఉన్న ఈ టికెట్టులో ఇప్పుడు లక్ష్మి అంశ ఉంది. మనస్ఫూర్తిగా దేవుణ్ణి నమ్మే నీకు మాత్రమే ఈ టికెట్టుని పవిత్రస్థలంలో ఉంచే అర్హత ఉంది" అన్నాను.

శ్రీమతి టికెట్ అందుకుని కళ్లకద్దుకుంది. రావుగారిచ్చిన పుస్తకంపైన దాన్నుంచి కాసెట్టుని ఒత్తుగా పెట్టి ఓసారి చేతులు జోడించి, నన్నూ దణ్ణం పెట్టుకోమంది.

"అబ్బా, మిలియన్ మార్కులనగానే ఎంత ఆశో! నువ్వు పెట్టిన దణ్ణం చాలదనా, నన్ను కూడా పెట్టుకోమంటున్నావ్!" అన్నాను నవ్వుతూ.

"ఏదో వంకన ఈ గదిలో – మనం దైవప్రార్థన చేసుకునేందుకో చోటు దొరికిందన్న ఆనందం నాది. నేను దేవుడికి భక్తితో దణ్ణం పెట్టాను. మిలియన్ మార్కుల ఆశ మీది. అది తీరాలంటే, మీ దణ్ణం మీరే పెట్టుకోవాలి" అంది శ్రీమతి.

చురక పడింది నాకు. ఐనా చలించక, "మిలియన్ మార్కులమీద నీకు లేదా ఆశ!" అన్నాను.

"ఆశ అని మీరే అన్నారుగా. ఆశపడ్డానికి మనకిప్పుడేం తక్కువైందని! అన్నీ ఉన్నాయి. అంతా బాగుంది. మనం కలిసున్నాం" అందామె.

ఆడవాళ్లు అల్పసంతోషులు. అది తెలిసి కూడా వాళ్లని సంతోష పెట్టే ప్రయత్నం చెయ్యరు మగాళ్లు!

"ఐతే నాదణ్ణం నేనే పెట్టుకోవాలంటావ్?" అంటూ గొంతు సవరించుకున్నాను. చేతులు జోడించి, "లాటరీలో నాకు, ఒక మిలియను మార్కు, లివ్వాలి తప్పదు శ్రీ సత్యసాయీ" అని అప్పటికప్పుడు ఓ పాట కల్పించి రాగయుక్తంగా పాడేసరికి పక్కన బొమ్మల పజిల్సు పూర్తి చేస్తున్న పిల్లలు చటుక్కున నా పక్కకొచ్చారు.

పిల్లలకు మనోరంజకంగా ఉండాలని, తెలిసిన కొన్ని పాటలకి పేరడీలు రాసి నాకొచ్చిన వరసలో పాడుతూండడం నాకు అలవాటే! అలాంటప్పుడు పిల్లలు ఉత్సాహపడి నా పక్కకొచ్చి నాతో గొంతు కలుపుతుంటారు.

ఇప్పుడూ అదే జరిగింది.

"పాడుతున్నట్లు లేదు. భజన చేస్తున్నట్లుంది" అంది శ్రీమతి.

"భజన భక్తిపథం" అన్నాను.

"భక్తి అంటే ఇదా? ఓ టికెట్ కొని దానికి ప్రైజు రావాలని దేవుణ్ణి కోరడం ఆశ, లేక స్వార్థమూనూ. పైగా ఇవ్వాలి తప్పదు – అని నొక్కించడం కూడానూ....." అని నవ్వింది శ్రీమతి.

"భక్తులెప్పుడూ దేవుణ్ణి ఇలాగే అడుగుతారు. పరమభక్తుడైన రామదాసు కూడా, 'ఏ తీరుగ నను దయ చూసెదవో' అని భగవంతుణ్ణి వేడుకున్నాడు. నేనిప్పుడా దశలో ఉన్నాను. ఎప్పటికీ దయ చూపకపోతే, 'ఎవడబ్బ సొమ్మని కులుకుచు తిరిగేవు' అని నిలదీశాడు. ఇంకా నేనా దశకు చేరుకోలేదు" అన్నాను.

"భక్తరామదాసుకీ మీకూ పోలికా? ఆయన దేవుడికోసం బోలెడు డబ్బు ఖర్చు చేసి అప్పులపాలై అవి తీర్చలేక జైలు పాలై కఠినశిక్షలకు ఓర్వలేక ఆ మాటలన్నాడు" అంది శ్రీమతి.

"అదే చేతులు కాలేక ఆకులు పట్టుకోవడమంటే! దేవుడేమైనా ఆయన్ని నగలు కావాలని అడిగేడా? చేయించేక వాటికైన ఖర్చు, 'నీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా, లేక నీ మామ జనక మహారాజు పంపెనా' అని నిష్ఠూరమాడ్డమెందుకూ! నేనైతే ముందుగానే దేవుణ్ణడిగి తీసుకుని అప్పుడు అందులో కొంత ఆయనకోసం ఖర్చు చేస్తాను. ఇప్పుడైనా దేవుణ్ణి తన జేబులోంచి తీసి ఇమ్మన్నానా? లాటరీవాళ్లు ఎవరికో ఒకరికిచ్చే డబ్బు నాకొచ్చేలా చెయ్యమన్నాను. అదీ ఇండియా డబ్బు కాదు. జర్మనీది. ఇంత మంచి డీల్ ఏ భక్తుడైనా ఇస్తాడా?" అన్నాను.

"భక్తుడికి దేవుడితో డీల్స్ ఉండవు. మీకు దేవుడంటే వేళాకోళంగా ఉన్నట్లుంది. అది తప్పు. మీరు నిజంగా దేవుడికి ఏమైనా చెయ్యాలనుకుంటే, స్వయంకృషిని నమ్ముకోండి. లాటరీ టికెట్లని కాదు" అందామె.

"నేనెందుకు భక్తుణ్ణి కాదో నాకు తెలియడం లేదు. నీకిప్పుడు మన పురాణాల్లో కొందరు గొప్ప భక్తుల గురించి గుర్తు చేస్తాను" అన్నాను.

గజేంద్రుడు. కొలనులో చేరి తన భార్యలతో జలక్రీడలాడుతూ, ఓ మొసలి తన కాలు పట్టుకుంటే తనొక్కడే పోరాడేడు. తక్కిన ఏనుగులు తక్కువవా? అన్నీ కలిసి ఆ మొసలిని హతమార్చలేవా? కానీ గజేంద్రుడు రక్షించే బాధ్యతని దేవుడికి అప్పజెప్పాడు.

అలాగే ప్రహ్లాదుడు. తను విష్ణుభక్తుడు. తండ్రి హిరణ్యకశిపుడు శివభక్తుడు, విష్ణుద్వేషి. శివకేశవులొక్కరే అని పురాణాలన్నీ ఘోషిస్తున్నాయి కదా – తనూ విష్ణువుని కూడా శివుడిలోనే చూసి ఆయన్నే ప్రార్థిస్తే ఏ గొడవా లేదుగా! కానీ తను తండ్రి మాట వినలేదు. పోనీ అని తండ్రి కష్టాలు పెడుతుంటే భరించి ఊరుకున్నాడా? రక్షించాల్సిన బాధ్యతని విష్ణువు కప్పగించాడు. ఇంతకీ హిరణ్యకశిపుడికి అంత బలాన్ని ఎవరిచ్చారు? విష్ణువు కుమారుడైన బ్రహ్మదేవుడే. ఆ వరాల్నయినా గౌరవించి తండ్రి మాట వినొచ్చుగా, లేదు!

నా విశ్లేషణ విని శ్రీమతి చిరాగ్గా మొహం పెట్టి, "మన పురాణాలకి ఇలా పెడర్థాలు తీసేవాళ్లు, పురాణకాలంనుంచే ఉన్నారు. అవేమీ నిలబడలేదు. పురాణాలే నిలబడ్డాయి. ఆ విషయం గుర్తుంచుకోండి. ఇంతకీ మీరు నాకు ఇవన్నీ ఎందుకు చెబుతున్నట్లు?" అంది.

"అలాగడిగావు, బాగుంది. ఇందాకా అన్నావు కదా, నాకు దేవుడంటే వేళాకోళంగా ఉందని. అది పొరపాటు. భక్తుల్నీ, భక్తి సిద్ధాంతాన్నీ ప్రశ్నించి చిన్నబుచ్చడం నా ఉద్దేశ్యం కాదు. నాది ఆత్మరక్షణ అని తెలుసుకో" అన్నాను.

"ఆత్మరక్షణా? ఇప్పుడు మీకా అవసరమేమొచ్చింది?"

"రామదాసైనా, గజేంద్రుడైనా, ప్రహ్లాదుడైనా – వాళ్లందరికీ ఉన్న కామన్ పాయింటు ఒక్కటే! వాళ్లు భక్తులు. వాళ్లకే కోరికలూ లేవు. వారు పడ్డ కష్టాలన్నీ వారు కొనితెచ్చుకున్నవే. ఏ కష్ట,మొచ్చినా భరించే శక్తి వారికుంది. అందుకే వారు సాహసాలు చేశారు. తమ సమస్యకు సులభ పరిష్కారం తమ దగ్గరే ఉన్నప్పటికీ, ఆ బాధ్యతను భగవంతుడికే వదిలిపెట్టడం వారి లీల. మనం దైవలీల అనుకుంటున్నది నిజానికి భక్తలీల. ఆ లీలవల్ల భక్తులకు కొత్తగా ఒరిగిందేం లేదు. దేవుడి ప్రతిష్ఠ మాత్రం పెరిగింది" అన్నాను.

శ్రీమతి అబ్బురంగా నన్ను చూసి, "ఇదో కొత్త వ్యాఖ్యానం. మీరు చెబుతుంటే ఇదే నిజమనిపిస్తోంది" అంది.

"నేనెప్పుడూ నిజమే చెబుతాను. 'పరిత్రాణాయ దేవానాం, వినాశాయచ దుష్కృతామ్, భక్తి సంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే' అన్న మాట దేవుడిది కాదు. భక్తుడిది! ఉన్నవాళ్లు చాలరని, నేనో కొత్త దేవుణ్ణి నమ్మాలంటే తగిన కారణం చూపాలిగా! అదే ఆత్మరక్షణ. కాబట్టి నేనిప్పుడు లాటరీ టికెట్ కొనడం స్వార్థం కాదు. భక్తలీల. లాటరీ తగిలిందీ, పాత దేవుళ్లకివ్వడానికి సంజాయిషీ ఉంటుంది. కొత్త దేవుడి ప్రతిష్ఠ పెరుగుతుంది. హోవార్డ్ మర్ఫెట్ తన పుస్తకానికి కొత్త ఎడిషన్లో, నా కథ కూడా చేరుస్తాడు. ఒకవేళ మనకి ప్రైజు రాలేదనుకో, జస్ట్ యాబై ఫెన్నిగ్సు నష్టం, అంతే!" అన్నాను.

"అలాగైతే ముందు మీరు పాటలు రాసి పాడ్డం కాదు. రావుగారిచ్చిన కాసెట్లో పాటలు మన టేపులోకి మార్చే పని ముందు మొదలెట్టండి. రావుగారికా కాసెట్ ప్రాణం. అది వీలైనంత తొందరగా ఆయనకిచ్చెయ్యాలి మరి. అదలాగుంచితే, ఆ పాటలు మనింట్లో ప్లే ఔతుంటే మనకు అదనపు పుణ్యం కదా!" అందామె.

నేను తల అడ్డంగా ఆడించాను, "మనం రావుగార్ని కలుకునేటందుకు కనీసం పది రోజుల వ్యవధి ఉంది. లాటరీ ఫలితాలు ఈలోగానే వస్తాయి. అవొచ్చేకనే రికార్డింగు" అన్నాను దృఢంగా.

ఎదుటి వ్యక్తి కాస్త మూర్ఖంగా వ్యవహరిస్తున్నాడనుకున్నప్పుడు, అందువల్ల జరగబోయే ప్రమాదమేదీ లేదని నమ్మకమున్నప్పుడు – వాదన పెంచకపోవడం, తన పాయింటు నొక్కించకపోవడం అరుదైన గొప్ప లక్షణం. అది శ్రీమతికుంది.

ఆ తర్వాత మూణ్ణాలుగు రోజులు మా ఇంట్లో రోజూ ఉదయం లేవగానేనూ, రాత్రి పడుకునేముందూనూ – నేను, పిల్లలు ఏకకంఠంతో 'లాటరీలో నాకు, ఒక మిలియను మార్కు, లివ్వాలి తప్పదు' అంటూ – భజన చేసేవాళ్లం.

ఫలితాలు వచ్చాయి. నా ఆరు నంబర్లలో ఒక్కటి కూడా డ్రాలో రాలేదు.

"ఆయన కొందరికి వజ్రపు టుంగరాలు గాల్లోంచి తీసిచ్చాడని విన్నాను. మన భక్తి ఆయనకు చాలినట్లు లేదు. ఇంతకంటే ఎక్కువ భక్తి చూపడం నావల్ల కాదు. పోనీలే, నాకాయన భక్తకోటిలో చేరాల్సిన మొహమాటం తప్పింది" అన్నాను శ్రీమతితో నవ్వుతూ.

నేనేమీ నిరుత్సాహపడలేదని శ్రీమతికి అర్థమైంది. తనూ తేలికగా నిట్టూర్చి, "ఈ మాట రావుగారితో అనేరు" అంది.

అనని తనకీ తెలుసు. అందుకని నేనూ ఆ విషయమై హామీ ఇవ్వలేదు కానీ ఇంకేదో చెప్పబోతుంటే ఆమె ఆపి, "ముందు రికార్డింగు పని మొదలెట్టండి. ఆయన కాసెట్ ఆయనకి వీలైనంత త్వరగా వెనక్కివ్వడం ముఖ్యం" అంది.

ఆతర్వాతి ఆదివారం ఉదయం రేడియో రికార్డర్ని స్పూలుకి కనెక్ట్ చేసి, రికార్డింగు మొదలెట్టి ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నాం.

ఆ గదిలో 'గోవింద హరే గోపాల హరే జయ గోపి గోపబాలా' అంటూ బాబాగారి కంఠస్వరం పలికింది.

అది మామూలు స్వరం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సంపన్న దేశాల పౌరుల్ని కూడా ప్రభావితుల్ని చేస్తున్న వ్యక్తి కంఠస్వరం.

కాసేపు అబ్బురంగా విన్నాను.

"ఇది వినడం నిజంగా మన అదృష్టం. రావుగారికి థాంక్స్ చెప్పుకోవాలి" అన్న శ్రీమతి మాటలు వినేదాకా నేనీ లోకంలో లేను. ఆమె మాటలు వింటూనే ఉలిక్కిపడ్డాను. అది గమనించినట్లుంది, "చూసేరా, ఆగొంతు వింటూ మీరు కూడా మైమర్చిపోయారు. ఇది భక్తలీల అంటారా, భగవల్లీల అంటారా?" అంది.

తనలా అనగానే నాలో కొద్దిగా అహం రేగింది, "ఇందులో దైవలీల ఏముంది? గజేంద్రుణ్ణి కాపాడ్డానికి విష్ణువు స్వయంగా వచ్చి మొసలిని చంపలేదూ! అలా దేవుడు నాకు లాటరీలో మిలియన్ మార్కులొచ్చేలా చేస్తే అదీ దైవలీల! అందుకని ఓ లాటరీ టికెట్ కొని నేనాయనకో అవకాశమిచ్చాను. ఆయన ఉపయోగించుకోలేదు" అన్నాను.

"చాలా ఆశ మీకు. ఏదో మామూలు ప్రైజూ కాదు, ఏకంగా మిలియను మార్కులు కావాలి మీకు! నాకు తెలుసులెండి, మీరిలాంటివి నమ్మరు. కానీ నేను నమ్ముతానని అపోహుంది మీకు. మీరాడిన లాటరీ టికెట్ డ్రామా, నాకోసం. అది డ్రామా అనెందుకంటున్నానంటే, లాటరీ ఫలితాలు వచ్చేక ఉక్రోషం లేదు, రవంతైనా నిరుత్సాహం లేదు. ఓ మాటంటాను, ఏమనుకోకండి! మనలో మనకిది సరదా కావచ్చు కానీ, ఇలా కొందరి నమ్మకాన్ని ఎగతాళి చెయ్యడం తప్పు" అంది శ్రీమతి.

అప్పుడు శ్రీమతి మొహం చూస్తే – ఏదైనా తప్పు చేసినప్పుడు హెచ్చరించే అమ్మ గుర్తుకొచ్చింది.

సంజాయిషీ ఇవ్వడం బాధ్యత అనిపించి, "మన జోలికి రానప్పుడూ, ఇతరులకి నష్టం కలిగించనప్పుడూ – ఎవరి నమ్మకాన్నీ ఎగతాళి చెయ్యకూడదని నా సిద్ధాంతం కూడా! ఐతే మనలో మనం మాట్లాడుకునేటప్పుడు, తోచిన మాటలు చెప్పడానికి వెనుకాడకూడదు. లేకుంటే మన భావాల్ని ఎవరితో పంచుకుంటాం?" అన్నాను.

"ఐతే రికార్డింగు ఐపోయేక, ఒకసారి మన టేపులో కూడా బాబాగారి గొంతు విందాం" అంది శ్రీమతి.

"అబ్బా, గొంతు అనకు. పాట అను" అన్నాను.

"రెంటికీ తేడా ఏంటి?"

"గొంతు అనగానే రఫీ, ఘంటసాల వగైరాలు గుర్తుకొస్తారు. నా సంగతి నీకు తెలుసుగా, గొంతుకు చాలా ప్రాధాన్యమిస్తానని!" అన్నాను.

నాకు మృదువుగా, సాఫీగా సాగే గొంతులు ఇష్టం. చిన్నప్పుడు రేడియో సిలోన్లో ఉదయం ఏడున్నరనుంచి ఓ అరగంట సేపు మరీ పాత హిందీ సినిమా పాటలు వేసేవారు. అందులో గొంతులు మృదువుగా అనిపించక, ఆ కాసేపూ రేడియో కట్టేయాలనుకునేవాణ్ణి. కానీ మా అన్నయ్య నామీద పంతంకొద్దీ రేడియో కట్టనిచ్చేవాడు కాదు. అప్పుడు మేమిద్దరం కలిసి ఓ అవగాహనకి వచ్చాం. ఆ వరసలో చివరి పాట కెయల్ సైగలుది. అప్పట్లో నాకా గొంతు గేదె దూడ అరిచినట్లు అనిపించేది. అందుకని ఏడూ యాభైఐదుకి రేడియో కట్టేసి మళ్లీ ఎనిమిదికి పెట్టుకునేవాళ్లం. ఆ టైమొచ్చేసరికి రేడియోకి ఎంత దూరంలో ఉన్నా, ఏదో కొంప మునిగిపోయినట్లు ఉరకలు పరుగులమీద వెళ్లి కట్టెయ్యడం రివాజయింది.

మొఘలే ఆజం సినిమాలో అప్పట్లో నాకు భయంకరంగా అనిపించిన పాట పాడినది బడే గులాం ఆలీఖానుది. నేను ఆరాధించే బాపూ రమణలకు – ఆ మహా విద్వాంసుడి పాటలంటే అంతా ఇంతా అనలేని ఇష్టం.

ఇంకా షంషాద్ బేగం, ఎస్డీ బర్మన్ వగైరాల గొంతుల విషయంలో కూడా చిన్నప్పుడు నాకు బాగా అసహనముండేది. అదంతా ఎందుకు, మరీ బాగా నచ్చిన పాటల్ని బాత్రూంలో కూడా పాడుకునేవాణ్ణి కాదు – నా గొంతు నచ్చక!

లోకో భిన్న రుచిః! భిన్నమైనంత మాత్రాన ఆ రుచులూ, అభిరుచులూ గొప్పవీ కావు, చెత్తవీ కావు. గొంతుల విషయంలో నా అభిరుచి ఏమాత్రం ఉత్తమం కాకపోవచ్చుననడానికి కొన్ని నిదర్శనాలు చెప్పానంతే!

బాబాగారి పాటలకు సంబంధించి, ఆ గొంతు నచ్చడానికి భక్తి అత్యవసరమని నాకనిపించింది. ఐతే ఆ పాటల వరుసలు నాకే కాదు, పిల్లలతో సహా అందరికీ నచ్చాయి.

పాప సంగీతప్రియురాలు కాబట్టి – ఒకసారి వినగానే సంగీత సాహిత్యాలు పట్టేసి, రికార్డింగు ఔతూండగానే ఆ పాటల్ని తనూ పదే పదే పాడ్డం మొదలెట్టింది.

'గోవింద కృష్ణజై గోపాల కృష్ణజై గోపాల బాల రాధాకృష్ణజై' అని ప్రతి అక్షరం స్పష్టంగా పలుకుతూ, 'కృష్ణజై కృష్ణజై కృష్ణ కృష్ణ కృష్ణ కృష్ణజై' అని చక్కగా ముక్తాయించింది.

అక్కనే అనుసరించే బాబు మొత్తం పాటంతా పాడలేక, చివర్లో అందుకుని, 'కిత్తజై కిత్తజై కిత్త కిత్త కిత్త కిత్తజై' అని పాడేశాడు.

పాప స్పష్టంగా పాడిందానికంటే, బాబు ముద్దమాటల పాటకి మేము పరవశించిపోయి వాణ్ణి దగ్గరగా తీసుకుని ముద్దులాడేశాం.

అలా పిల్లల్ని కూడా ఆకర్షించి ఆకట్టుకుంటున్న పాటలవి.

"మీరు గొంతు అనొద్దంటే గొంతు అనను. రికార్డింగు పూర్తి కాగానే ఆ పాటల్ని మన టేపులో కూడా విందాం" అంది శ్రీమతి.

అది నా అనుమానమే కావచ్చు. కానీ శ్రీమతి గొంతులో ఆ పాటలపట్ల భక్తిభావం ధ్వనించింది. చురుగ్గా చూసి, "ఎందుకు?" అన్నాను.

"రికార్డింగప్పుడు కబుర్లెక్కువయ్యాయి. పిల్లలు గొంతు కలపడం మరొకటి. ఇప్పుడు కాసేపు శ్రద్ధగా విందాం. అదీకాక రావుగారిచ్చింది మామూలు కాసెట్టు. మనం రికార్డింగు చేసింది, స్పూల్లో స్టీరియో రికార్డర్లో. క్వాలిటీ మెరుగౌతుంది" అంది శ్రీమతి.

నాకది సంజాయిషీలా అనిపించింది. అసలు కారణం – ఆమెలో కొత్తగా ప్రవేశించిన భక్తిభావమేనని నిర్ణయానికొచ్చాను.

చిన్నప్పట్నించీ కూడా భక్తి అంటే నాకు కొంత అసహనం ఉండేది. భక్తి పేరిట – కొందర్ని తక్కువ చేసి దూరంగా ఉంచడం, స్వార్థమే పరమావధిగా మసలడం, అహంకారంతో ప్రవర్తించడం, మూర్ఖత్వాన్ని సమర్థించడం చాలామంది పెద్దల్లో ఉండేది,

ఆ భక్తి కారణంగానే ఆ పెద్దలు ప్రత్యేక గౌరవం పొందేవారు. మళ్లీ వారే రాజారామమోహనరాయ్, మహాత్మాగాంధీ, వివేకానందుడు, కందుకూరి వీరేశలింగం వగైరా సంఘసంస్కర్తల్ని ప్రస్తావించి – ఆదర్శపురుషులుగా అభివర్ణించేవారు.

అన్నీ తెలిసినా – సంప్రదాయం అలవర్చిన భక్తి వారి విపరీత ప్రవర్తనకు కారణమౌతోందని మా తాతగారనేవారు.

అలాంటి భక్తికి లోను కాకుండా శ్రీమతిని ఆపాలి అనుకుంటూ, అందుకు మార్గం ఆలోచిస్తున్నాను,

రికార్డింగు పూర్తయింది. మా రికార్డరు ప్లే చెయ్యగానే, మెరుగైన క్వాలిటీతో పాటలు మొదలయ్యాయి.

శ్రీమతి, పాప ప్లేయర్ ఎదుటనే కూర్చుని శ్రద్ధగా వింటున్నారు. బాబు అటూ ఇటూ తిరుగుతూ తన ధోరణిలో తానుండి మధ్యమధ్య పాటలు వింటున్నాడు.

కాసేపటికి నాకు విసుగొచ్చి, "ఎంతసేపని వింటారు? పాటలు ప్లే ఔతుంటాయి. ఇలా రండి, కబుర్లు చెప్పుకుందాం" అన్నాను.

"ఇప్పుడీ పాటలు ఇంకా బాగున్నాయి. ఎక్కడైనా రికార్డింగు సరిగ్గా లేకపోతే కూడా తెలుస్తుంది. మీరూ వినండి" అంది శ్రీమతి.

ఆమె గొంతులో భక్తిభావం ధ్వనించి నాలో అసహనం రేగింది. వెంటనే, "నాకొక్కటే ఆశ్చర్యంగా ఉంది. భక్తులు బాబాని మన పురాణాల్లో దేవుడితో పోలుస్తారు. ఆయనకు చెప్పలేనన్ని మహిమలున్నాయని అంటారు. అందుకు ఎన్నో నిదర్శనాలు చెబుతారు. నావరకూ, ఆయన పట్ల ఏమాత్రం ఆసక్తి లేదు. ఆయన దైవత్వాన్ని ఏమాత్రం నమ్మను. ఆయన నిజంగా దేవుడైతే, ఆయన గొంతు మనింట్లో పలక్కూడదు" అన్నాను.

నా మాటలు నాకే అసందర్భంగా తోచాయి. కానీ ఎందుకో ఆ క్షణంలో నా గొంతులో అదో రకమైన కసి!

అంతే!

ఆశ్చర్యంగా టేపులో పాట ఆగిపోయింది. ఏమయిందా అని అటు చూస్తే – టేపు తిరుగుతోంది. పాట రావడం లేదు....

దేవుడు పక్కనున్న రోజు

నిజంగానే పాట ఆగిపోయిందంటే నమ్మబుద్ధి కాలేదు. కదలకుండా టేపునే పరీక్షగా చూస్తున్నాను.

టేపు తిరుగుతోంది. పాట రావడం లేదు.

"మీరు పెద్ద తప్పు చేశారు. బాబాకి మీపై కోపమొచ్చింది" అంది శ్రీమతి కంగారుగా.

నాకా మాటలు నచ్చలేదు. "కోపమొస్తే, ఎక్కడో ఉండి మన మాటలు విని ఇక్కడి టేపులో పాట ఆపెయ్యడానికి – ఇదేమన్నా పురాణ యుగమా? ఆధునిక యుగం. అందులోనూ కలికాలం. ఈ కాలంలో నాస్తికులు ఆస్తికుల్ని పక్కకు నెట్టేస్తారని బహుశా కాలజ్ఞానంలో బ్రహ్మంగారు కూడా చెప్పినట్లున్నారు" అన్నాను.

"మీరు బ్రహ్మంగారి కాలజ్ఞానం ఎప్పుడు చదివారూ – నాకెప్పుడూ చెప్పలేదు...." అంది శ్రీమతి అనుమానంగా.

"ఇంతోటి దానికి కాలజ్ఞానం చదవాలా? అనుకోని వింతో, విపరీతమో జరిగిందనుకో – అది కాలజ్ఞానంలో ఉండే ఉంటుంది. ఉన్నా లేకున్నా – ఉందని ఎవరైనా అంటే చాలు, నమ్మేవాళ్లు కోకొల్లలు. ఆయన భక్తులు కూడా సంతోషిస్తారు" అన్నాను.

"మీ వితండవాదానికో నమస్కారం కానీ – ముందు టేపులో పాట ఎందుకాగిపోయిందో చెప్పండి" అంది శ్రీమతి.

అటు చూస్తే టేపు ఇంకా తిరుగుతూనే ఉంది. పాట మాత్రం రావడంలేదు.

"ఏముందీ – అక్కణ్ణించి పాట రికార్డయుండదు" అన్నాను. కానీ బుర్రలో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

"అక్కణ్ణించి అంటే – మీరు బాబాగారి గొంతు మనింట్లో పలక్కూడదన్నారూ – అక్కణ్ణించేనా?"

ప్రశ్నలా అడిగింది కానీ, అది ముళ్లపూడివారిని మించిన వ్యంగ్యం.

నేను బదులివ్వలేదు. రికార్డరు వద్దకెళ్లాను.

ముందు వాల్యూమ్ చూశాను. అది మేమెప్పుడూ వినే పొజిషన్లోనే ఉంది. ఐనా ఓసారి ఆ పొజిషన్ని పైకీ కిందకీ మార్చి చూశాను.

టేపు తిరుగుతోంది. రికార్డర్లో పూర్తి నిశ్శబ్దం.

ఇలా ఎలా జరిగింది?

నిజంగానే దేవుడు మహిమ చూపేడా?

నమ్మడానికి అహం ఒప్పుకోలేదు.

టేపు ఆపాను. అది తీసి మరో టేపు పెట్టాను. అందులో అప్పట్లో ఓపీ రల్హన్ తీసిన తలాష్ చిత్రంలో పాటలున్నాయి.

ఆ పాటలు నాకు చాలా ఇష్టం. కానీ ఇండియాలో ఐతే రేడియోలో వచ్చినప్పుడు మాత్రమే వినాలి. సిబాకా గీత్‌మాలాలో వాటి ప్రాభవం ఐపోయేక మళ్లీ వినే అవకాశం రాలేదు. ఇప్పుడిక్కడ కనీసం వారానికొకసారైనా వింటున్నాను.

టేపు ఆన్ చేస్తే పాట రాలేదు. టేపు ఆరంభంలో మొదటి నిముషం బ్లాంకుగా ఉంటుంది కదా అనుకున్నాను. రెండు, మూడు, నాలుగు.... పది నిముషాలు గడిచిపోయాయి. పాట రాలేదు.

టేపుని ఫాస్ట్ పార్వర్డ్ చేసి పెట్టాను. పాట రాలేదు.

నాకు కంగారు మొదలైంది.

రికార్డరు పాడయిందా? అదీ – సరిగ్గా నేనా మాట అన్నాక....

ఆ టేపు తీసి ఘంటసాల టేపు పెట్టాను. ఏం ప్రయోజనం లేదు.

నేను కలవరపడుతున్నానని గ్రహించినట్లుంది, "వెంకటేశ్వర సుప్రభాతం టేపు పెట్టండి" అంది అనునయంగా.

మామూలుగా ఐతే చిరాకు పడేవాణ్ణి. కానీ అది నాకు బలహీనక్షణం.

అందులోనూ నాకు ప్రతి చిన్న విషయానికీ పురాణ కథలు గుర్తొస్తాయి. అప్పుడు అంబరీషుడి కథ గుర్తొచ్చింది. ఆయన మహారాజు. జనం క్షేమంకోసం ఏడాది పాటు ద్వాదశి వ్రతం చేశాడు. దీక్ష విరమించడానికి ముందు దూర్వాస మహర్షి వస్తే ఎంతో సంతోషించి ఆయన్ని అతిథిగా ఆహ్వానించాడు. దూర్వాసుడు స్నానం చేసి వస్తానని వెళ్లి ఎప్పటికీ రాకపోతే దీక్షాసమయం ముగుస్తోందని వ్రతభంగం కాకుండా కొంచెం తులసితీర్థం పుచ్చుకున్నాడు. దూర్వాసుడు తిరిగొచ్చి, తనకోసం ఆగకుండా నీళ్లు తాగినందుకు అలిగి ఆయనపై పెద్ద శక్తిని ప్రయోగించాడు.

దూర్వాసుడు అతిథి. దేవుడిలాంటివాడు. ఆయన కోపాన్ని తట్టుకోవాలంటే, ఆయనకంటే పెద్ద దేవుడి ఆసరా కావాలి.

చేసేది లేక అంబరీషుడు విష్ణువుని ప్రార్థించాడు.

ఇప్పుడు నా పరిస్థితీ అదే కాబట్టి – పెద్ద దేవుడైన ఏడుకొండలవాణ్ణి మెప్పించమంటోంది శ్రీమతి.

బలహీనక్షణం కదా – ఏ పుట్టలో ఏ పాముందో అనుకుంటూ, సుప్రభాతం టేపు పెట్టాను.

అదీ పలకలేదు.

శ్రీమతికి ఏడుకొండలవాడంటే గురి. ఆయన కూడా బాబా కోపాన్ని శాంతించలేకపోయాడంటే ఆమెకూ తృప్తిగా లేదు కాబోలు, "కంగారు పడకండి. రికార్డరు పాడైనట్లుంది. గ్యారంటీ పీరియడ్లోనే ఉందిగా" అంటూ వాస్తవానికి వచ్చే ప్రయత్నం చేసింది.

డెక్ పాడయుండొచ్చని నాకూ అనుమానమొచ్చింది. కానీ పాడవడానికి అది ఎన్నుకున్న టైమింగ్ నన్ను కలవరపెడుతోంది.

టేప్ డెక్‌కి గ్యారంటీ పీరియడ్ ఐపోలేదు. పాడైతే కనుక మరమ్మతు చెయ్యడం కంపెనీదే బాధ్యత. కానీ ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరున్న గ్రుండిగ్ కంపెనీ సరుకది. ఇక్కడున్నన్నాళ్లూ ఫరవాలేదు కానీ ఉన్నట్లుండి ఇలా పాడైపోయే రోగముంటే, ఇండియాకి తీసుకెళ్లేక నేను దీంతో ఎలా వేగాలి?

అప్పుడు గుర్తొచ్చింది – వాడకంలో ఇబ్బందులొచ్చినప్పుడు (ట్రబుల్ షూటింగుకి) ఏంచెయ్యాలో కొన్ని చిట్కాలు పొందుపర్చిన ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్. కొన్నాక వాటిని చూడాల్సిన అవసరమే రాలేదు. ఇప్పుడొచ్చింది.

ఆ పుస్తకం తీసి శ్రద్ధగా ఆ వివరాలు చదివితే నాకొచ్చిన సమస్యకు కారణమూ, పరిష్కారమూ కూడా అందులో ఉన్నాయి.

టేపు రికార్డరులో ముఖ్యమైన భాగాలు రికార్డింగ్/ప్లేయింగ్ హెడ్స్. వాటిమీద సెన్సార్లుంటాయి. టేపు వాటిని తాకినప్పుడు, టేపుమీద రికార్డయిన శబ్దతరంగాల్ని ఆ సిగ్నల్సు గ్రహిస్తాయి. టేపు ఆ హెడ్సుని అంటి తిరుగుతుంది కాబట్టి, టేపుమీదుండే మెటాలిక్ అక్సయిడ్ కోటింగు కొంచెం కొంచెంగా హెడ్డుకి మలికిగా అంటుతూంటుంది. కొన్నాళ్లయ్యేసరికి ఆ మలికి హెడ్ మీద సెన్సారుని మొత్తం కప్పేస్తుంది. అప్పుడు టేపుమీద రికార్డింగు అవదు. రికార్డయిన మాట బైటకి పలుకదు. ఆ మలికిని పోగొట్టడానికి ఆల్కహాలు వాడొచ్చు. లేదా కంపెనీ వాళ్లు అమ్మే క్లీనింగ్ లిక్విడ్ ఉపయోగించొచ్చు.

ఇది చదివి, 'అరే ఈ మాత్రం నాకు తట్టలేదేమిటీ!' అని సిగ్గు పడ్డాను. ఎందుకంటే, ల్యూనబర్గులో ఉండగా రేడియో–కాసెట్ రికార్డరు కొని వాడాను కదా! అప్పుడు కొత్త కాబట్టి ఇలాంటివన్నీ ముందే చదివి జాగ్రత్తలు తీసుకునేవాణ్ణి. దానికోసం హెడ్ క్లీనింగ్ లిక్విడ్ కొని ఉంచుకున్నాను. చాలాసార్లు వాడాను కూడా. ఐతే ఆ రికార్డరు వాడినప్పుడు టేపులో ఎప్పుడూ ఇలా ఒక్కసారిగా మాట పోలేదు. కొంచె కొంచెంగా శబ్దం తగ్గుతుంటే అర్థం చేసుకుని వెంటనే హెడ్ క్లీన్ చేసేవాణ్ణి.

బెర్లిన్ వచ్చేక టేప్ డెక్ కొన్నప్పుడు దానికి అవసరమైన అదనపు హంగులన్నీ కొన్నాను. వాటిలో హెడ్ క్లీనింగ్ లిక్విడ్ కూడా ఉంది. ఎటొచ్చీ మాన్యువల్లో ట్రబుల్ షూటింగు పేజీ చదవాల్సిన అవసరం రాలేదు. ఎన్నో నెలలుగా ఆ స్టీరియో డెక్కులో పాటలు వింటూ, రికార్డింగులు చేసుకుంటూ బాగా ఎంజాయ్ చేస్తున్నాను.

ఇప్పటికి హెడ్డుకి పట్టిన మలికి – సెన్సార్లని మొత్తం మూసేసినట్లుంది.

శ్రీమతికీ విషయం చెప్పి, టేపు హెడ్ క్లీన్ చేసి ఏడుకొండలవాడి టేపు పెట్టాను.

"కౌసల్యా సుప్రజా రామ" అంది టేపు.

ఆ క్షణంలో ఆ స్వరం నాకు కలిగించిన ఆనంద పారవశ్యం – మాటలకందదు.

"సుప్రభాతం మీకనుకుంటున్నారా, అచ్చం ఆ దేవుడి పోజిచ్చారు!" అని నవ్వింది శ్రీమతి.

పరవశంనుంచి బయటపడి నేనేదో అనేలోగా, "సుప్రభాతమంటే పొద్దున్నే వినిపించాలి. ఎప్పుడు పడితే అప్పుడు ఆ టేపు పెట్టకూడదు. టెస్టింగు ఐపోయిందిగా, ఇక టేపు తీసెయ్యండి" అంది శ్రీమతి.

సెంటిమెంటు – అదీ దేవుడి విషయంలో ఐతే అస్సలు ఉపేక్షించకూడదు.

తక్కున ప్లే ఆపి, ఈసారి తలాష్ పాటలు పెట్టాను.

"కర్‌లే ప్యార్...." పాట మొదలైంది.

సంతోషం పట్టలేకపోయాను. "చూసేవా వసూ! దేవుడి మహిమ కాదు. దిసీజ్ సైన్స్" అన్నాను గర్వంగా.

మామూలుగా ఐతే మంచి రిటార్టిచ్చేది. కానీ అంతవరకూ తనూ టెన్షన్లో ఉందేమో, శ్రీమతి కూడా టేపు పలకడంతో రిలీఫ్ ఫీలయింది. అందుకని నెమ్మదిగా, "దేవుడా, సైన్సా అన్నది కాదిక్కడ పాయింటు. మీరు అసలు విషయం మర్చిపోయినట్లున్నారు. మొత్తం వ్యవహారం దేవుడితో మొదలై సైన్సుతో ముగిసింది. ఇందాకా మీరు బాబాని సవాలు చేస్తూ ఆ మాటన్నారో లేదో టేపులో పాట ఆగిపోయింది. కారణం సైన్సే అనుకుంటే, ఆ సైన్సు ఆ క్షణంలోనే ఎందుకు బయటపడాలి? ఇది సైన్సు కాదు, మిరకిల్ అని చెప్పడానికని అనిపించడం లేదా? అలా మీకనిపించకపోయినా నాదో విన్నపం. ఇంకెప్పుడూ మీరిలా దేవుడిపై నమ్మకాలపై తిరకాసుగా మాట్లాడకండి" అంది.

ప్రాధేయపడుతోందా? నచ్చజెబుతోందా? హెచ్చరిస్తోందా? లేక భయపడుతోందా?

భయమని ఎందుకనుకున్నానంటే, అప్పుడు నేనా మాట అన్న ఆ క్షణంలో టేపులో మాట ఆగిపోయినప్పుడు – దేవుడు నా పక్కనే ఉన్న అనుభూతి కలిగి నాకూ కొంచెం భయమేసింది.

ఇప్పుడు టేపులో మాట పలికేదాకా ఆ భయం తొలగలేదు. ఒకసారి భయం తొలగడమేమిటి, నాలోని హేతువాది మళ్లీ విజృంభించాడు.

"భయపడుతున్నావ్ కదూ!" అన్నాను జాలిగా ఆమెను చూస్తూ.

"అలాగే అనుకోండి. కానీ నా మాట వినండి" అంది.

"వింటాను కానీ, వినేముందు నీ భయాన్ని పోగొట్టడం నా బాధ్యత. కాసేపు నేనేం చేసినా అదేమనకుండా చూడాలి" అన్నాను.

"సరే, తర్వాత మాత్రం నా మాట వినాలి" అందామె.

నేనేం చేస్తానో తెలిసుంటే సరే అనుండేది కాదు.

"మేరా ప్యార్ సనమ్" అంటున్న టేపుని ఆపాను. ఆ స్థానంలో కొత్త టేపు పెట్టాను.

"గోవింద కృష్ణజై-...."

అది మేము కాసేపటి క్రితం రికార్డు చేసిన టేపు.

చక్కగా పలుకుతోంది. స్టీరియోలో పలుకుతోంది. మునుపటికంటే స్పష్టంగా ఉందా గొంతు.

శ్రీమతి కళ్లు మెరిశాయి. ఆమె మొహంలో సంతోషం.

అప్పుడు నేను ఉన్నట్లుండి, "ఓ దేవుడు కాని దేవుడా! ఇందాకా ఈ టేపు పలకడం మానేస్తే, నా భార్య నీ మహిమ అనుకుంది. అది మహిమ కాదనీ, కాకతాళీయమనీ నాకు తెలుసు. కానీ కొంచెంసేపు – అది మహిమే అన్న భ్రమలో నేనూ, తనూ మానసిక క్షోభ అనుభవించాం. ఇప్పుడు నేను మళ్లీ సవాలు చేస్తున్నాను. నిజంగా నీవు దేవుడివైతే, నీ గొంతు మా ఇంట్లో పలక్కూడదు. ఈసారి టేపు పలకడం మానేస్తే, నేను నిజంగా నీవు దేవుడివని నమ్ముతాను. లేదా నిన్నో అసమర్థుడిగా భావిస్తాను...." అని ఇంకా ఏదో అనబోతుండగా శ్రీమతి చటుక్కున తన చేత్తో నా నోరు మూసింది.

నేనా చేతిని విడిపించుకుని, "నేనేం చేసినా మధ్యలో ఆపకూడదని షరతు. మర్చిపోయావా?" అన్నాను.

"నేనేం మర్చిపోలేదు కానీ ముందిది చెప్పండి! ఈ రోజు మీకేమయింది? రావుగారు బాబాని నమ్మారు. మీకో కాసెట్టిచ్చి ఆయన పాడిన పాటలు రికార్డ్ చేసుకోమన్నారు. చేసుకుంటున్నాం. మీరాయన్ని నమ్మితే నమ్మండి, లేదూ నమ్మకండి. అర్థం లేని ఈ సవాళ్లేమిటి? అవాకులేమిటి? మనకు తెలియని వ్యక్తి గురించి ఇదంతా అవసరమా?" అంది శ్రీమతి.

ఆమె అన్నది సబబే. కానీ మూఢనమ్మకాలు కాకతాళీయాల్లోంచే పుడతాయి. ఆదిలోనే త్రుంచెయ్యకపోతే, అవి వ్రేళ్లూనుకుని మహావృక్షాలుగా మారతాయి. ఆ విషయం శ్రీమతి గ్రహించాలని నా తాపత్రయం.

"కొత్తగా టీకా కనిపెట్టినప్పుడు, దాన్ని ఎలుకలమీద ప్రయోగిస్తారు. అంటే వాళ్లకి ఎలుకలమీద కోపమా? అందువల్ల మానవాళికి ప్రయోజనముంటుందని వాళ్లా పని చేశారు. నాదీ అలాంటి ప్రయోగం. కాకతాళీయంగా జరిగిన ఓ సంఘటనని, మనకు సంబంధం లేని ఓ వ్యక్తి మహిమగా అన్వయించబోతున్నాం. అది సరికాదని నిరూపించడానికి నేనిప్పుడు ఈ టేపుమీద ప్రయోగం చేశాను. అంతే తప్ప నాకు బాబా గారంటే భక్తీ లేదు, ద్వేషమూ లేదు. నువ్వే చూడు. ఇందాకటికంటే పరుషంగా మాట్లాడినా, టేపు ఆగిపోలేదు..."

శ్రీమతి నవ్వి, "నేను బాబాగార్ని దేవుడని అనుకుంటున్నానని ఎలా నిర్ణయించారు?" అంది.

ఊహించని ప్రశ్నే ఐనా, ఆ ప్రశ్న నా ప్రయోగ ఫలితంగా వచ్చిందని అనిపించింది. మనసులో కించిత్ గర్వం!

నేను బదులిచ్చేలోగా, "ఎన్నో విషయాల్లో మనమిద్దరం ఒకేలా ఆలోచిస్తాం. బాబా దేవుడైతే మనకేమిటి? కాకపోతే మనకేమిటి? ఐతే ఆయన ప్రపంచంలో ఎంతోమందిని ప్రభావితం చేసిన అపూర్వవ్యక్తి. ఆయన్ని నమ్మినవారిలో మనకంటే

గొప్పవాళ్లూ, తెలివైనవాళ్లూ ఉన్నారు. వారిలో మన రావుగారు కూడా ఉన్నారు. అంతే,
అక్కడితో ఆగిపోదాం అనుకుంటాను" అంది శ్రీమతి.

ఆ మాట సబబుగా అనిపించింది. కానీ రావుగారి ప్రసక్తి తేగానే, "రావుగారు మనకంటే అనుభవజ్ఞుడని నాకూ తెలుసు. కానీ ఆయన గుడ్డిగా ఓ వ్యక్తిని దేవుడని నమ్మడం బాగుందా? ఈ రోజిక్కడ జరిగిన అనుభవం ఆయనకి చెబితే ఆయన మారొచ్చేమో?" అన్నాను.

"ఎవరి ఆలోచనలైనా నమ్మకాన్ని బట్టి ఉంటాయి. నమ్మకమంటే రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది" అంది శ్రీమతి.

అని ఊరుకోలేదు. నా మాటలకి రావుగారేమంటారో కూడా ఆమె చెప్పింది.

నేనా మాటన్నప్పుడు టేపు ఆగిపోవడం కాకతాళీయం కాదు. మహిమ.

"చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్నది మనుషులే కాదు, దేవుడూ పాటిస్తాడు.

నేను మంచి మనిషిని. మంచితనానికి దైవభక్తి తోడైతే ఇంకా బాగుంటుందని బాబా అనుకున్నాడు. భువనేశ్వర్లో ఓ రావుగారి ద్వారా తన గురించి కొంత తెలియజెప్పాడు. జర్మనీ వచ్చేక ఈ రావుగారి ద్వారా తన గురించి వినిపించాడు. తన కథని చదివేలా చేశాడు. తన పాటలు వినేలా చేశాడు. ఆ వినడం కూడా ఒక రోజు కాదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు వినేలా రికార్డు చేసుకునేలా చేశాడు. తనమీద నమ్మకం కలుగుతుందని ఓ మహిమ కూడా చూపాడు. అప్పటికీ నమ్మకపోతే – ప్రస్తుతానికి ఊరుకున్నాడు.

'నన్ను నమ్మనివాళ్లలో నీలాంటివాళ్లూ, నీకంటే గొప్పవాళ్లూ చాలామందే ఉన్నారు. నాకు భక్తులుగా మారండిరా మొర్రో అంటూ వాళ్లందరి వెంటబడ్డమేనా నా పని? దుష్టశిక్షణా శిష్టరక్షణా – అదే నా పని. నువ్వు దుష్టుడివైతే తప్పక శిక్షిస్తాను. శిష్టుడివైతే నా భక్తుడివి కాకపోయినా రక్షిస్తాను. నన్ను నమ్మేది రక్షణ కోసం కాదు. నీ మనశ్శాంతి కోసం! కాబట్టి ఇది ఇక్కడితో ఆపేశాను' అన్నది బాబా పోలసీ అని రావుగారు ముగిస్తారుట.

"ఆయన్ని మార్చాలని మీరనుకుంటే, మిమ్మల్ని మార్చాలని ఆయననుకోవచ్చు. ఇక్కడ మనం గ్రహించని విషయమేంటంటే – ఇద్దరిలో ఎవరు మారకున్నా ప్రపంచానికి కలిగే నష్టమేంలేదు" అంది శ్రీమతి.

నిజమే ననిపించింది. తనంతటివాడు తను రావుగారు. ఆయన విచక్షణాజ్ఞానాన్ని సవాలు చెయ్యడానికి నేనెంతటివాణ్ణి?

"నిజం వసూ! మనమిద్దరం ఒకేలా ఆలోచిస్తాం. కానీ, అది తెలుసుకుందుకు ఒకోసారి ఇంతసేపు పడుతుంది. ఇక మనం దేవుడి గురించిన ఆలోచనలు పక్కనపెట్టి జీవుడి గురించి ఆలోచిద్దాం" అన్నాను.

అప్పటికా సంభాషణ అలా ముగిసినా, దేవుడికి మమ్మల్ని వదలాలని ఉన్నట్లు లేదు.

ఆ రోజు పక్కనే ఉన్న అనుభూతినిచ్చిన దేవుడు మరొరోజు సరాసరి మా ఇంటికే వచ్చేశాడు.

అదెలా జరిగిందంటే.....

మరో రూపంలో దేవుడు

బుధ, శనివారాల్లో ఉదయంనుంచి మధ్యాహ్నం రెండింటిదాకా గ్యోతే స్ట్రాసేలో కూరగాయల సంత జరుగుతుందని చెప్పాను కదా...

మా ఇంటికి పదడుగుల దూరమే కాబట్టి, శనివారం వస్తే సాధారణంగా మొత్తం నలుగురం ఆ సంతకు వెళ్లేవాళ్లం.

అక్కడ ఆదిలో శ్రీమతి కట్టూ బొట్టూ ఒక ఆసక్తికరమైన అంశంగా ఉండేది. ఎందుకంటే...

అప్పట్లో తెలుగు నాట ఆడపిల్లలు పరికిణి వోణీలో, చీరలో ధరించేవారు. ఇతర డ్రస్సులు ఇంకా వాడకంలోకి రాలేదు.

భువనేశ్వర్లో ఒరియా అమ్మాయిలు టీనేజిలో చుడీదార్లు, పంజాబీ డ్రెస్సులు కట్టేవారు. వివాహితులైన ఒరియా మహిళలు మాత్రం డ్రెస్సులు కాకుండా, చీరలే కట్టేవారు. అక్కడికొచ్చేసరికి శ్రీమతి ఇంకా టీనేజిలోనే ఉన్నా, వివాహిత కాబట్టి చీరలే కట్టేది.

చీరలు తనకి ఎంతలా అలవాటైపోయాయంటే, జర్మనీ వచ్చేక అక్కడి వాతావరణానికి అనుగుణంగా పాంట్లు వేసుకుందుకు సుతరామూ ఇష్టపడలేదు.

ఇంకా చెప్పాలంటే పాంట్లు వేసుకున్న భారతీయ మహిళల్ని చూసినప్పుడు – వాళ్లేదో తప్పు చేస్తున్న అనుభూతి కలిగేది తనకి!

అక్కడ పరిచయమైన తెలుగు మహిళలు ఒకరినొకరు కలుసుకున్నప్పుడు, అక్కడికొచ్చి చీరల్నే కట్టడాన్ని మెచ్చుకోతగ్గ గొప్ప విశేషంగా భావించేవారు.

ఓవరుకోట్లు వేసుకుంటే చీర వేసుకున్నా, పాంటు వేసుకున్నా తేడా తెలియదు. కానీ తను మోకాళ్లకు కాస్త పైదాకా మాత్రమే వచ్చే ఉలెన్ జాకెట్ వేసుకునేది. అందువల్ల చీర కట్టు తెలిసిపోయేది. జర్మన్ మహిళలు అదో విడ్డూరమన్నట్లు చూసేవారు.

కొంతమంది పని కట్టుకుని పలకరించి – చీరకి గుడ్డ ఎంత పడుతుందని అడిగి అయిదు మీటర్లని తెలిసి గుండెలు బాదుకునేవారు.

శ్రీమతిలో అక్కడివారికి మరో విడ్డూరం నుదుటి బొట్టు. వాళ్లు దాన్ని రోట్ పుంక్ట్ (ఎర్రచుక్క) అనేవారు.

అప్పటికింకా సాధారణ మహిళలు బొట్టుని అలంకరణ అనుకునేవారు కాదు. ఏ రంగు చీర కట్టినా బొట్టు రంగు ఎరుపే ఉండేది.

అది అలంకరణ కాదనీ, సంప్రదాయమనీ చాలామంది జర్మన్ మహిళలకు అర్థమైంది. అదేమిటనీ, ఎందుకనీ అడిగేవారు.

పాశాత్యులు తామేం పాటించినా – దానిపట్ల వారికి స్పష్టమైన అవగాహన ఉంటుంది.

మనకి అలా కాదు. పెద్దలు చెప్పారని చేస్తాం. కానీ వాళ్లెందుకు చెప్పారో తెలియదు.

తెలుసుకుందామన్నా ఆ పెద్దలు కూడా ఒకొక్కరు ఒకోలా చెబుతారు.

శ్రీమతిని బొట్టు గురించి అడిగినవారికి – తెలిసీ తెలియని పరిజ్ఞానంతో, వచ్చీరాని భాషలో ఏదో ఒకటి చెప్పేవాళ్లం.

కొందరు తృప్తి పడేవారు. కొందరు తృప్తి నటించేవారు.

మేము సంతకి వెళ్లినప్పుడు చాలా కళ్లు, ముఖ్యంగా ఆడవాళ్లవి శ్రీమతిని కుతూహలంగా చూసేవి.

మేము తిరిగి చూస్తే వాళ్లు పలకరింపుగా ఓ నవ్వు నవ్వేవారు.

అలాంటిది ఒకరోజున సంతలో, 'నమస్తే!' అన్న మాట విని ఉలిక్కిపడ్డాను.

ఆ ఉచ్చారణ తెల్లవారి తెలుగు మాటలా ఉంది.

అటు చూస్తే – ఓ తెల్లతను చేతులు జోడించి కనిపించాడు.

నాకంటే కొంచెం పెద్దవాడిలా ఉన్నాడు. శ్రీమతినే కుతూహలంగా చూస్తున్నాడు.

నేను రెండు చేతులూ జోడించి, "నమస్తే!" అన్నాను.

"ఇండియన్!?" అన్నాడతడు.

అది ప్రశ్న కాదు. మీరు ఇండియన్సని నాకు తెలిసిందని అన్నట్లుంది.

"స్పెషెన్ జీ ఇంగ్లీష్?" (ఇంగీషు తెలుసా) అన్నాను.

తలూపాడు కానీ ఇంగ్లీషు మాట్లాడలేదు. మళ్లీ 'నమస్తే!' అన్నాడు ఈసారి శ్రీమతివైపు చూస్తూ.

తననుంచి ప్రతి నమస్కారం రాలేదని గుర్తు చేస్తున్నాడని గ్రహించి, తనూ చేతులు జోడించి, "నమస్తే!" అంది శ్రీమతి.

అతగాడు చిరునవ్వు నవ్వి వెళ్లిపోయాడు.

అంతటితో ఆ కథ ముగిసిందనుకున్నాం కానీ, మరుసటి శనివారం కూడా అతడు కనబడి మాకు నమస్తే చెప్పాడు.

ఆ తర్వాతనుంచి సంతలోనే కాదు, బయట షాపుల్లో కనబడినప్పుడు కూడా అతడు మాకు నమస్తే చెప్పి వెళ్లేవాడు.

స్నేహపూర్వకమైన చిరునవ్వు, చిత్రమైన ఉచ్చారణతో నమస్తే అన్న పదం – మాకు బాగా అనిపించేవి.

ఐతే మా స్నేహాన్ని ఇంకాస్త దూరం తీసుకెళ్లడానికి మావైపునుంచి ప్రయత్నించలేదు. కారణం – భాష!

ఒకరోజు అతడి మాటలు నమస్తే దగ్గర ఆగిపోలేదు. "నేను మీతో కాసేపు మాట్లాడొచ్చా?" అన్నాడు మొదటిసారిగా ఇంగ్లీషులో.

"ష్యూర్" అన్నాను వెంటనే.

అతడో క్షణం తటపటాయించాడు.

నాలో కుతూహలం – అతడేం చెబుతాడోనని!

"నా పేరు విలియమ్స్" అన్నాడతడు.

ఇన్నాళ్ల పరిచయం తర్వాత అతగాడి పేరు తెలిసింది. బాగుండదని – నేను నా పేరు, శ్రీమతి పేరు చెప్పాను.

అతడికి పేర్లమీద ఆసక్తి ఉన్నట్లనిపించలేదు. బహుశా ఆ పేర్లు గుర్తుంచుకోడానికి కూడా కష్టమనిపించాయేమో!

అదోలా చూస్తూ, "మీరు హిందువులు కదూ!" అన్నాడతడు.

ఉలిక్కిపడ్డాను.

జర్మనీ వచ్చేక అంతవరకూ నా మతం ప్రసక్తి వచ్చినట్లు గుర్తు లేదు. ఎవరు పరిచయం చేసుకున్నా నన్ను ఇండియన్‌గా మాత్రమే గుర్తించేవారు.

ల్యూనబర్గులో పాకిస్తానీయులతో పరిచయమైనా – దేశం పేరే తప్ప మతం స్ఫురించలేదు.

"ఇదేమిటీ, ఇలా అడిగాడు?" అనుకున్నాను కొంచెం ఇబ్బందిగా.

ఐతే ఆ ఇబ్బంది అంతటితో ఆగేది కాదని అప్పుడు తెలియదు.

మరో దేవుడు పిలిచాడు

విలియమ్సు అడిగిన ఆ ప్రశ్న నాకు ఇబ్బందిగా అనిపించింది.

నన్నెవరైనా కులం గురించి అడిగితే ఎంత ఇబ్బంది పడతానో, మతం గురించి అడిగినా అంతే ఇబ్బంది పడతాను.

ఎందుకంటే నేనెప్పుడూ నన్ను ఓ మతంతో కలిపి గుర్తించలేదు.

"ఈ ప్రశ్న ఎందుకడిగారు?" అనడిగాను.

"ఏం లేదు? హిందువులు దేవుణ్ణి ప్రార్థించడానికి గుడికెడతారుగా. మరి మీకు తరచుగా వెళ్లడానికి గుడి లేదిక్కడ" అన్నాడతడు.

"ఐతే?" అన్నాను ఆశ్చర్యంగా.

"గుడికెళ్లే అవకాశం బొత్తిగా లేనప్పుడు ఏదోలా అనిపిస్తుందిగా...." అన్నాడతడు.

"ఎందుకనిపిస్తుంది? ఇండియాలో ఉన్నప్పుడే, మేం నెలల తరబడి గుడికెళ్లని సందర్భాలున్నాయి" అన్నాను.

అతడు అదోలా చూశాడు, "నేను క్రిస్టియన్ని. ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న నియో కేథలిక్ చర్చికి ప్రతి ఆదివారం వెడతాను. ఏ వారమైనా అనుకోకుండా మిస్సయితే మనసేదోలాగైపోతుంది. మరి మీకేమనిపించదా?" అన్నాడు.

"ప్రతి వారం చర్చికెళ్లాలని మీకు నియమం. అందుకని అలా అనిపించొచ్చు. మాకలాంటి నియమంలేదు. అందుకని మాకేమనిపించదు"

"నియమమెందుకు లేదు? మీకు దేవుడిపై నమ్మకం లేదా?" అన్నాడతడు.

"నమ్మకం లేకపోతే గుడికే వెళ్లనుగా" అన్నాను.

అతడి కళ్లు మెరిసాయి. కానీ నా సమాధానం అతడికి సంతృప్తికరంగా ఉన్నట్లు లేదు, "ఇలా అడుగుతున్నానని ఏమనుకోవద్దు. మీకు దేవుడిపై నమ్మకముందిగా" అన్నాడు.

ఏదో అడిగాడు కానీ ముఖభావాలు చూస్తే జవాబు తెలుసన్నట్లే అనిపించింది.

కారణం ఊహించగలను. చాలామంది పాశ్చాత్యులు శ్రీమతి నుదుటనున్న కుంకుమబొట్టుని– అలంకరణగా భావించరు. అదో మతచిహ్నం అనుకుంటారు.

దేవుడి విషయమై అతడంత సూటిగా అడగ్గానే కొంచెం తడబడ్డాను. ఎందుకంటే ఆ విషయమై నా ఆలోచనల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. ఎదుటివ్యక్తిని బట్టి సమయానుకూలంగా అప్పటికి తోచిన జవాబిచ్చినా, నేను నాస్తికుణ్ణని మాత్రం ఎప్పుడూ అనలేదు, అనుకోలేదు. "దేవుణ్ణి నమ్మకపోతే అది మనిషి అహంకారమని నాకనిపిస్తుంది" అని మనసులో మాటే చెప్పాను.

"చాలా బాగా చెప్పారు. దేవుడు లేందే ఈ సృష్టి లేదు. అవసరమైననవన్నీ సమకూర్చేకనే, దేవుడు మనిషిని సృష్టించాడు. అందుకు మనం దేవుడికి సర్వదా కృతజ్ఞులమై ఉండాలి. కనీసం వారానికొకసారైనా ఆయన్ని ప్రార్థించాలి. అందుకే నేను ప్రతివారం చర్చికి వెడతాను. అభ్యంతరం లేకపోతే మీరూ రావచ్చు. నేను తీసుకెడతాను" అన్నాడతడు.

ఇండియాలో ఉండగాకానీ, ఇక్కడికొచ్చేక గానీ – నేను చర్చికెళ్లినా, మసీదుకెళ్లినా టూరిస్టుగా మాత్రమే!

నాకున్న మంచిమిత్రుల్లో క్రిస్టియన్లూ, ముస్లిములూ ఉన్నారు. ఐనా నేనెప్పుడూ ప్రార్థనకోసం చర్చి, మసీదులకి వెళ్లలేదు. నా మిత్రులు కూడా నన్నెప్పుడూ ఆహ్వానించలేదు. ఆహ్వానించలేదన్న విషయం నాకూ, వాళ్లకీ కూడా ఎప్పుడూ స్ఫురించలేదు.

ఐతే సినిమాల్లో చూడ్డంవల్ల – అక్కడ లోపల వాతావరణం ఎలా ఉంటుందో తెలుసు.

ఇప్పుడు విలియమ్సు ఆహ్వానించగానే, ప్రత్యక్షంగా ఆ వాతావరణపు టనుభూతిని పొందొచ్చుననిపించి, వెంటనే సరేనన్నాను.

మారాలోచన లేకుండా నేనలా అన్నందుకు అతడు ఆశ్చర్యపడి, "ఐతే ఈ ఆదివారం వెడదామా?" అన్నాడు.

"సరే, టైం ఫిక్స్ చెయ్యండి" అన్నాను వెంటనే.

ఆదివారం సాయంత్రం నాలుగింటికి టైం ఫిక్స్ చేశాడు విలియమ్సు.

అరోజు అతణ్ణి మా ఇంటికి టీకి రమ్మన్నాను. టీ తాగేక అంతా కలిసి బయల్దేరొచ్చన్నాను.

జర్మన్సు అపరిచితులతో అంత సులభంగా చనువు పెంచుకోరు. అందుకే అతడందుకు ఒప్పుకోకపోతే నేను బలవంతపెట్టలేదు.

ప్రోగ్రాం ఫిక్సయింది. ఆదివారం సాయంత్రం పావుతక్కువ నాలుగుకల్లా మేం మా ఇంటిముందున్న పార్కు దగ్గరికెళ్లాలి. అప్పటికతడు అక్కడే మాకోసం ఎదురుచూస్తుంటాడు. అక్కణ్ణించి చర్చికి ఐదారు నిముషాలు నడకట.

సకుటుంబంగా రావాలని మరీ మరీ నొక్కించి సెలవు తీసుకున్నాడతడు.

"అలా ఒప్పేసుకున్నారేంటి?" అంది శ్రీమతి అతడలా వెళ్లగానే.

అడిగిన పద్ధతిని బట్టి తనకు నచ్చలేదని తెలుస్తోంది.

"ఇక్కడికొచ్చి ఎన్నో కొత్త విశేషాలు చూశాం. ఓసారి వాళ్ల గుడిలోపల ప్రార్థన ఎలా ఉంటుందో కూడా చూద్దాం" అన్నాను.

"ఏ స్నేహితులతోనో వెడితే అది వేరు. ఇతడెవరో మనకి తెలియదు"

"తెలియకపోవడమేంటి? అతడి పేరు విలియమ్సు" అన్నాను.

"అంతే తెలుసు మనకి. తనకి మన పేర్లు తెలుసా అన్నది కూడా అనుమానమే!"

"చాలా కాలంగా అతడి మొహం తెలుసు. కనీసం చిరునవ్వుతో పలకరించుకుంటున్నాం. ఆ చనువుతో మనని చర్చికి ఆహ్వానించాడు"

"మీకలా అనిపించిందా, నాకైతే తన చనువు మనని చర్చికి తీసుకెళ్లడం కోసం మాత్రమేనని. లేకుంటే, మీరు టీకి పిలిస్తే వచ్చేవాడుగా"

ఏదో అనబోయి ఆగిపోయాను.

ఈ విషయమై శ్రీమతి నాకంటే కాస్త లోతుగా ఆలోచించినట్లు తోచింది.

కనబడినప్పుడు మమ్మల్ని 'నమస్తే' అని పలకరించే అతగాడు మమ్మల్నెప్పుడూ తనింటికి ఆహ్వానించలేదు. ఈరోజు నేనాహ్వానించినా అది పక్కన పెట్టాడు.

నన్ను చర్చికి తీసుకెళ్లడంకోసమే నాతో పరిచయం పెంచుకున్నాడా?

కానీ నన్ను చర్చికి తీసుకెళ్లడంవల్ల అతడికి కలిగే ప్రయోజనమేమిటి?

అనుమానం సీసాలో భూతంలాంటిది. దాన్ని బయటకు తీస్తే పెనుభూతమై మహాశక్తిని ప్రదర్శిస్తుంది. అందువల్ల జరిగేది మేలా, కీడా అన్నది మన అదృష్టంమీద ఆధారపడి ఉంటుంది.

"మన అనుమానాన్ని సీసాలోనే ఉండనిద్దాం. ఇప్పట్నించీ బిరడా తియ్యొద్దు" అన్నాను శ్రీమతితో.

"నాకే మనుమానం లేదు కానీ, చర్చికి మీరొక్కరే వెళ్లండి. నేనూ, పిల్లలూ ఇంట్లోనే ఉంటాం" అంది శ్రీమతి.

"అంతా కలిసి రావాలని విలియమ్సు నొక్కించాడు. నేను కూడా ఒప్పుకున్నాను" అన్నాను.

"అసలు నన్నడక్కుండా ఎందుకొప్పుకున్నారు? ఏదో కారణం చెప్పుకోండి. మేం రాం" అంది శ్రీమతి ఖచ్చితంగా.

"నిన్నడక్కపోవడం తప్పే. కానీ మీరు రాకుండా నేనూ వెళ్లను. మాట తప్పినప్పుడు సగమైతే ఏంటి, పూర్తిగా ఐతే ఏంటి?"

మా మాటలు పాప వింటున్నట్లుంది, "మనం చర్చికి వెడదాం అమ్మా!" అంది తనూ సంభాషణలో కలగజేసుకుంటూ.

శ్రీమతికి చిరాకేసింది, "నువ్వొకత్తివి. అన్నింటికీ నాన్నకే వత్తాను. అసలు నీకు చర్చంటే ఎంటో తెలుసా?" అంది.

"తెలుసు. ఇక్కడివాళ్ల గుడి" అంది పాప.

తెల్లబోయాను. పాపకీ విషయం ఎప్పుడు తెలిసింది? ఎలా తెలిసింది?

పిల్లలు మనకు తెలియకుండానే మననుంచే చాలా విషయాలు తెలుసుకుంటారు. అందుకే ఇంట్లో ఏం చేసినా, ఏం మాట్లాడినా – వాళ్లని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

శ్రీమతికి కూడా ఏమనాలో తెలియలేదు.

చర్చి అంటే జర్మనీలో ఉండే గుడి అన్నంతవరకే పాపకి తెలిసింది. వాళ్ల గుడి వేరు, మన గుడి వేరు అని దానికింకా తెలియదు. గుడి కాబట్టి వెడదామంటోంది. దానికి భక్తి గురించి కూడా ఎక్కువ తెలియదు. గుడికెళ్లడం అదో అనుభవం. అంతే!

ఇప్పుడేం మాట్లాడినా, మతం ప్రసక్తి వస్తుంది. అది శ్రీమతికీ ఇష్టం లేదు.

అట్టే మాటలు లేకుండా ఇల్లు చేరాం.

ఇంట్లో పాప నడిగింది శ్రీమతి, "నీకు గుడికెళ్లాలనుందా?"

"ఔనమ్మా" అంది పాప.

"గుడికెళ్లి ఏం చేస్తావ్?"

"నాన్నగారు ఎత్తుకుంటే గంట కొడతాను. దేవుడికి దణ్ణం పెడతాను. శఠగోపం పెట్టించుకుంటాను. అప్పుడు....." అని సంకోచంతో ఆగింది.

"ఊఁ అగిపోయావేం, చెప్పు" అంది శ్రీమతి.

"ప్రసాదం తింటాను" అంది పాప.

పాప తెలివైనది. గుడిలో దానికి అత్యంత ఆకర్షణీయమైనది ప్రసాదం. మళ్లీ ఆ మాట చెప్పాలంటే మొహమాటం. అందుకని స్వానుభవం లోని కొన్ని విశేషాలు ముందు చెప్పింది. ప్రసాదం విషయం చెప్పొచ్చా, కూడదా అని సంకోచించింది.

ఆ మాటే శ్రీమతి అంటే, నేను నవ్వి, "పాప చిన్నపిల్ల. మరి చాలామంది పెద్దవాళ్లు గుడికెళ్లడానిక్కారణమడిగితే నిజం చెప్పడానికి సంకోచిస్తారా, లేదా – అది చెప్పు" అన్నాను.

పరీక్షలో ప్యాసవ్వాలని కొందరు. సంతానం కావాలని కొందరు. వ్యాపారంలో లాభంకోసం కొందరు. ఎన్నికల్లో నెగ్గాలని కొందరు. ఇంకా పొరుగువాడు తమకంటే తక్కువగా ఉండాలనుకునేవారూ ఉంటారు.

ఇలా సవాలక్ష కారణాలుంతాయి. కానీ కేవలం భక్తితో గుడికెళ్లేవారెందరు?

శ్రీమతికి అర్థమై సన్నగా నవ్వి ఊరుకుంది.

అంతలో బాబు అందుకుని, "గుయ్యో పెసాదం బాంతుంది. నాకిట్టం" అన్నాడు.

అంటే, వాడూ మా సంభాషణ వింటున్నాడు.

పిల్లలిద్దరూ కూడా సరదా పడ్డంతో – మా చర్చి సందర్శన వివాదానికి తెర పడింది.

అనుకున్న ఆదివారంనాడు అనుకున్న విధంగా బయల్దేరి అనుకున్నట్లే విలియమ్సుతో కలిసి నాలుగయ్యేసరికి చర్చికి వెళ్లాం.

చర్చి మా ఇంటికి దగ్గరే.

చర్చి ప్రాంగణం విశాలంగా ఉంది.

లోపలికి వెళ్లబోతుంటే, "అమ్మా! బూట్లు విప్పలేదు" అంది పాప.

పాపకీ మాకూ అదే తేడా.

అది గుడిలోపల అడుగెడుతున్నామనుకుంటోంది. మేము ఓ కొత్త ప్రదేశానికి సందర్శకులమనుకుంటున్నాం.

అందుకే మాకు బూట్ల విషయం కానీ, చర్చి లోపలకు బూట్లతోనే వెళ్లొచ్చునని కానీ ప్రత్యేకంగా స్ఫురించలేదు.

"ఇది చలి దేశం. బూట్లిప్పితే, కాళ్లకు చలేస్తుంది. అందుకని దేవుడు ఇక్కడి పద్ధతులు కొంచెం మార్చాడు" అన్నాను.

అంతా లోపలకు వెళ్లాం.

లోపల బోలెడు కుర్చీలు. పరిశుభ్ర వాతావరణం. ఎందరో భక్తులు. మేం తప్ప అంతా తెల్లవాళ్లు.

విశాలమైన వేదిక. వేదికపై కుర్చీలు. కొందరు ప్రీస్టులు.

అచ్చం సినిమాల్లో చూపించే చర్చిల్లాగానే ఉంది.

మేం లోపలకు రాగానే చాలామంది మమ్మల్ని కుతూహలంగా చూశారు. కొందరు చిరునవ్వుతో పలకరించారు.

మెడనుంచి, పాదాలదాకా వేలాడే పొడవాటి తెల్లటి గౌను ధరించిన ఓ ప్రీస్టు హడావుడిగా మా దగ్గరకొచ్చాడు. విలియమ్సు మమ్మల్ని ఆయనకి పరిచయం చేశాడు. ఆయన తనని ఫాదరుగా పరిచయం చేసుకుని, "మీరిలా ఇక్కడికి రావడం మాకెంతో సంతోషంగా ఉంది. మా చర్చికి స్వాగతం" అన్నాడు.

ఆయన ఇంగ్లీషులో మాట్లాడేడు. ఆయన భాష శ్రీమతికి కూడా అర్థమయ్యేటంత సరళంగా ఉంది.

ఆయన మా అందరితో కరచాలనం చేసి తనూ వేదికమీదకి వెళ్లాడు.

మేం కుర్చీల్లో పక్కపక్కనే కూర్చున్నాం.

వేదికమీద ఏం జరుగుతోందో నాకూ పూర్తిగా అర్థం కాలేదు. ఎందుకంటే ప్రీస్టులు ఒకొక్కరుగా మాట్లాడుతున్నారు. అది జర్మనో, మరేదైనా భాషో కానీ నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు. మాట స్పష్టంగా వినబడకపోవడం కూడా బహుశా ఓ కారణం కావచ్చు.

మాట్లాడ్డం ముగియగానే 'ఆమెన్' అంటున్నాడు ప్రీస్టు. అప్పుడు మిగతా ప్రీస్టులు 'ఆమెన్' అంటున్నారు.

ప్రతి ప్రీస్టు చేతిలోనూ నేతి జారీలాంటి పాత్ర ఒకటి ఉంది. దాంట్లోంచి కాసిని నీళ్లు అరచేతిలో పోసుకుని తాగి, 'ఆమెన్' అంటున్నారు.

తర్వాత వాళ్లు గౌను జేబుల్లోంచి కాబోలు పిప్పరమెంటులాంటి తెల్లటి బిళ్ల ఒకటి తీసి నోట్లో వేసుకుని, 'ఆమెన్' అంటున్నారు.

బహుశా అది ప్రార్థన కావచ్చు. ఆ తతంగం చాలాసేపే జరిగింది. నాకైతే బోరనిపించింది. మావాళ్లని చూస్తే వాళ్లు కుతూహలంగానే చూస్తున్నారు.

కాసేపటికి వేదికమీదున్న వాళ్లలో ఓ పెద్దాయన అక్కడున్న వారందర్నీ ఉద్దేశించి ప్రసంగం చేశాడు.

బహుశా ప్రబోధం కావచ్చు. సభికులు శ్రద్ధగా వింటూ మధ్య మధ్య చప్పట్లు కొడుతున్నారు.

ఐదు కాకుండానే సభ ముగిసింది.

మేము లేచి కదులుతుండగా చప్పున మావద్దకు ఇద్దరు ప్రీస్టులు వచ్చారు. వారిలో మొదట నన్ను పలకరించిన ప్రీస్టు కూడా ఉన్నాడు.

"ఎలా ఉంది ఈ అనుభవం?" అనడిగాడు మొదటి ప్రీస్టు.

"కొత్తగా ఉంది" అన్నాను.

"నచ్చిందా?"

"ఊఁ బాగుంది" అని కదలబోతుండగా, "మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు రెండో ప్రీస్టు.

"ష్యూర్" అన్నాను.

"ఇక్కడ కాదు. మీ ఇంటికి రావచ్చా?" అన్నాడాయన.

అలా అంటాడని ఊహించలేదేమో తడబడ్డాను.

విలియమ్సుని టీకి పిలిస్తే రానన్నాడు.

ఈయన పిలవకుండానే వస్తానంటున్నాడు.

"నిజంగానే మీరు మా ఇంటికొస్తానంటున్నారా?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఔను. మీకు అభ్యంతరం లేకపోతేనే...."

"అయ్యో! మీ అంతటివారు మా ఇంటికొస్తానంటే అంతకంటేనా? మీకు మా స్వాగతం" అన్నాను చటుక్కున.

ఆయన మొహం వెలిగింది. థాంక్సు చెప్పి మాకెప్పుడు వీలని అడిగాడు.

"నాకు శనాదివారాలు సెలవు" అన్నాను.

ఆయన ఓ క్షణం ఆలోచించి పై శనివారం మధ్యాహ్నానికి టైం ఫిక్సు చేశాడు. ఆయనతో పాటు పక్కనున్న ప్రీస్టు కూడా వస్తాట్ట.

సరేనని అక్కణ్ణించి బయల్దేరాం.

ఇక దారి తెలిసింది కాబట్టి విలియమ్సునుంచి కూడా వీడ్కోలు తీసుకున్నాం.

తన ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు విలియమ్సు మాకు థాంక్సు చెప్పి వెళ్లాడు.

దారిలో పాప అంది, "ఈ గుడిలో మనం కొట్టడానికి గంట లేదు. చూడ్డానికి దేవుడు లేడు" అని.

ఉలిక్కిపడ్డాను. ఎంత మాటంది పాప!

చర్చిలో దేవుడు లేడా?

మతచాందస ఉగ్రవాదులు తన మాటలు విన్నారంటే – మొత్తం మా కుటుంబాన్నే కాదు, అక్కడున్న నా మిత్రబృందం అందర్నీ పరశురాముడిలా వెదికి వెదికి మరీ చంపెయ్యరూ!

కానీ పాప అవగాహనే వేరు. దానికి దేవుడంటే విగ్రహం.

చర్చిలో ఏసుక్రీస్తు శిలువ ఉండొచ్చు. మేరీమాత పటం ఉండొచ్చు.

దణ్ణం పెట్టుకుందుకు ప్రత్యేకంగా విగ్రహం లేదు కాబట్టి పాపకక్కడ దేవుడు లేడు.

క్రైస్తవులు విగ్రహారాధనని నిరసిస్తారు. కానీ వారికీ ప్రార్థనలకి ఓ గుడి కావాలి.

దైవప్రార్థనకి ప్రత్యేకంగా స్థలం కావాలనుకునేవారు, ప్రత్యేకంగా విగ్రహం కావాలనుకోవడాన్ని నిరసించడం ఏమిటో!

దైవభక్తి విషయంలో తర్కానికి అంతో ఇంతో ప్రాధాన్యమిచ్చేది హిందూత్వమేనేమో అనిపించింది.

ఐతే అప్పుడా విషయమై లోతుగా ఆలోచించాలనుకోలేదు.

పాపని సముదాయించడంకోసం, "చర్చిలో గంట లేకపోవడమేమిటి? పొద్దున్నా, మధ్యాహ్నం, సాయంత్రం గంట మోగిస్తారు. అప్పుడప్పుడు మనింటికీ వినబడుతుంటుంది" అన్నాను.

"కానీ మనం కొట్టడానికి లేదుగా" అంది పాప.

"నీకు చర్చి నచ్చలేదా?" అన్నాను ఆ విషయం తప్పిస్తూ.

ఉన్నట్టుండి బాబు అన్నాడు, "పెసాదం మనకి పెత్తకుందా, అంకుల్సే తినేశారు" అన్నాడు.

"అవున్రా బాబీ! మన గుళ్లో ప్రసాదం మనకి పెడతారు. ఇక్కడేమో పూజార్లే తినేస్తారు" అంది పాప తమ్ముడితో.

పిల్లలకి సంబంధించి – చర్చికీ, గుడికీ ఉన్న తేడా ఎలా అర్థమయిందో గ్రహించిన శ్రీమతి కిసుక్కున నవ్వింది.

ఆ నవ్వు ఇల్లు చేరేదాకా మాత్రమే ఉంది. ఇల్లు చేరేక ఆమె మొహం గంభీరంగా మారింది. ఎప్పుడడగాలా అని ఎదురుచూస్తున్న అవకాశం అప్పుడే వచ్చినట్లుగా, "మీరా ప్రీస్టుల్ని ఇంటికి రమ్మన్నారెందుకు?" అంది.

"అదేమిటి? వస్తానన్నవాళ్లని రావద్దని ఎలాగంటాం?" అన్నాను తేలికగా.

"మీరు విలియమ్సుని టీకి రమ్మన్నారు. రాననడానికి అతగాడు సంకోచించలేదు. వీళ్లేమో తామే వస్తామన్నారు. వద్దనడానికి మీరెందుకు సంకోచించాలి?" అంది శ్రీమతి.

"మనం విలియమ్సు ఇంటికి వస్తామన్నామనుకో. అప్పుడతడు మాత్రం వద్దనేవాడా?" అన్నాను.

"అనేవాడనే నాకనిపిస్తుంది"

"ఎందుకని?"

"ఎందుకని అడుగుతున్నారు. మీకింకా అర్థం కాలేదా? విలియమ్సుకి మనతో స్నేహం పెంచుకోవడం ఇష్టం లేదు. మనని చర్చికి తీసుకెళ్లి అక్కడి ప్రీస్టులకి పరిచయం చెయ్యడం అతడి ఆంతర్యం. అది నెరవేరింది" అంది శ్రీమతి.

"పోనీ అదే అతడి ఉద్దేశ్యమనుకో. అందువల్ల అతడికేం ప్రయోజనం?" అన్నాను.

"అతడికేం ప్రయోజనమో నాకు తెలియదు. కానీ అతగాడు ఆ ప్రీస్టుల మనిషి. వాళ్లకోసం ఆ పని చేసిపెట్టాడు"

ఉలిక్కిపడ్డాను. ఈ వ్యవహారానికి ఇదేదో కొత్తకోణం.

"పోనీ, ఆ ప్రీస్టులకి మాత్రం మనవల్ల ఏం ప్రయోజనం?" అన్నాను. అన్నాను కానీ అర్థమౌతోంది.

విలియమ్సు మమ్మల్ని తొలిసారి పలకరించింది మొదలు – ఇంతవరకూ జరిగినవన్నీ బేరీజు వేస్తే – మొత్తం అంతా ఓ పథకం ప్రకారం జరిగిపోతోందనిపించింది.

శ్రీమతి ఏమనుమానిస్తోందో స్ఫురించింది.

అది గ్రహించినట్లుంది, "ఆ విషయం నన్నడగాలా? ఈ పాటికే మీకు స్ఫురించి ఉండాలి" అందామె.

ఇక సూటిగానే మాట్లాడొచ్చని, "అంటే వాళ్లు నన్ను మతం మార్చుకోమంటారనా నీ భయం. అంటే మారిపోతానా, నువ్వు మరీనూ. ఇన్నేళ్ల కాపురంలో నా గురించి నువ్వు తెలుసుకున్నదిదా?" అన్నాను.

"మీ గురించి తెలుసు కాబట్టే – నేను భయపడేది!" అంటూ ఆమె వివరించింది.

దేవుణ్ణి నిరసించనేమో కానీ నాకు మతం పట్టింపు లేదు. ఏ మతమైతే ఏంటి – అనుకుంటానుట.

రెండు – నాకెంత మొహమాటమంటే – 'మరో దేవుడు' గట్టిగా పిలిస్తే – మతం మార్చుకుందుకు కూడా వెనుకాడకపోవచ్చుట.

అలా అరటిపండొల్చినట్లు ఆమె నా గురించి విడమర్చి చెప్పేసరికి – నిజం చెప్పొద్దూ – అప్పుడు నా గురించి నాకే భయమేసింది.

***

మరో దేవుడు పిలిచాడు

"చూడు, నేనిక్కడికొచ్చింది సైంటిఫిక్ రీసెర్చికోసం. మతం మార్చుకుందుక్కాదు" అన్నాను బింకంగా.

ఆ మాట తనకోసం కాదు. నాలో జర్మన్ ప్రీస్టుల రాక విషయమై మానసికసంఘర్షణ మొదలైందనడానికి చిహ్నమది.

నిజం చెప్పాలంటే, ఆ మాట నాకు నేనే నచ్చజెప్పుకునేందుకు చేస్తున్న ప్రయత్నంలా, నాకే అనిపించింది.

లౌకికజ్ఞానంలో శ్రీమతి ఎప్పుడూ నాకంటే అంతెత్తున ఉంటుంది. అది ఆడవాళ్లకి దేవుడిచ్చిన అపూర్వశక్తి.

ఆడవాళ్లు తాగుబోతు భర్తతో దెబ్బలు తింటూనే కాపురం చెయ్యగలరు. తిరుగుబోతు భర్తల తప్పుల్ని క్షమించగలరు. అది కూడా కాపురాలు నిలబెట్టుకుందుక్కాదు. మగాడి బలహీనతలపట్ల వారు చూపే అవగాహన, ఔదార్యం. తద్వారా ప్రయోజనం దక్కేదీ మగాడికే. ఎందుకంటే – మన వ్యవస్థలో కుటుంబవ్యవస్థ నడిచేది మగాడి పేరుమీదే!

అదే మగాడైతే – ఆడదాని విషయంలో అలాంటి అవగాహన, ఔదార్యం చూపగలడా? చూపకపోవడం వల్ల అతడు పొందే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ. ఐనా అహానికే ప్రాధాన్యమిచ్చి దాన్ని భరిస్తాడు. అది స్వయంకృతం.

ఇప్పుడు శ్రీమతి నా మానసిక సంఘర్షణను ఇట్టే పట్టేసి, "మీరు నాకు చెబుతున్నారా? మీ మనసుకి నచ్చజెబుతున్నారా?" అంది.

నాకంటే తొమ్మిదేళ్ల చిన్నది. ఆ మాటతో నన్ను తనకంటే తొమ్మిదేళ్ల చిన్నవాణ్ణి చేసింది.

"మన పెళ్లయ్యేక నాకంటూ మనసెక్కడ మిగిలింది? నా మనసునిండా నువ్వే కాబట్టి ఆ నచ్చజెప్పడం నీకే!" అని మాట మార్చాను.

మామూలుగా అలాంటప్పుడు తను నా మాటలో భావాన్ని ఆస్వాదించి ఆనందిస్తుంది. కానీ తనప్పుడు టెన్షన్లో ఉన్నట్లుంది, ఆమె ముఖంలో రసాస్వాదనకు బదులు చిరాకు కనిపించింది, "మీకైనా, నాకైనా, మనసుకైనా సరే – నచ్చజెప్పే అలవాటు మంచిది కాదు. ఈరోజు ఇలా నచ్చజెబితే, రేపు ఏదైనా అవాంఛిత మార్పుకి సిద్ధపడినా, అందులోని బాగోగుల గురించి అలోచించడానికి బదులు, ఏదో విధంగా మనసుకి నచ్చజెప్పేస్తాం. కానీ కాస్త దూరం వెళ్లి ఆలోచిస్తే...." అని ఆగిందామె.

"దూరమంటే?" అడిగాను.

"ఇక్కణ్ణించి ఇండియా అంత దూరం. మనల్ని మనవాళ్లనుంచి వేరు చేసే మార్పు గురించి, అక్కడ మనవాళ్లకెలా నచ్చజెబుతాం. మనవాళ్లంటే ఒకరా ఇద్దరా – అటూ ఇటూ కూడా మనిద్దరివీ చాలా పెద్ద కుటుంబాలు..."

నిజంగానే తను చాలా దూరం వెళ్లింది. అప్పుడే మేం క్రైస్తవమతం స్వీకరించినట్లూ, తను ముఖానికి బొట్టు తీసేసినట్లూ, మేమంతా మెడలో శిలువలు వ్రేలాడదీసుకుని తిరుగుతుంటే, ఇండియాలో మావాళ్లంతా మమ్మల్ని చూసి అప్సెట్టయినట్లూ, వాళ్లకి మేం నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నట్లూ – ఊహించేసుకుని కలవరపడుతోంది.

ఇంతకీ ఆ ఊహల్లోనూ తను నాకు సహధర్మచారిణే. నేను మారితే తనూ మారిపోతుంది. తను మారిపోకుండా ఉండాలంటే నన్ను మారకుండా ఆపడమొక్కటే ఆమెకున్న మార్గం. ఆపగలనా అని ఆమె బెంగ!

"నువ్వు మరీనూ, ఆలోచనల్లో మరీ దూరం వెళ్లిపోయావ్..." మందలించాను.

"వెళ్లక ఏంచేస్తాను? మీ మొహమాటం నాకు తెలియనిదా? ఇన్సూరెన్సు, రీసెర్చి పేపరు.... ఇలా ఎన్నో! కాస్త గుర్తు చేసుకోండి"

గుర్తు చేసుకుందుకేముంది – శ్రీమతి ఆ విషయాల్లో నన్ను తరచుగానే దెప్పుతూంటుంది. ఆ ఎత్తిపొడుపుకి అప్పట్లో కొంచెమైనా ముచ్చట జత పడేదేమో – ఈరోజు మాత్రం జీవన్మరణ సమస్యని ఎదుర్కుంటున్నదాన్లా మాట్లాడుతోంది.

ఇన్సూరెన్సు విషయానికొస్తే – చిన్నప్పట్నించీ ఇన్సూరెన్సు ఏజంట్ల గురించి ఎన్నో జోక్సు చదివానేమో, అదంటే నాకెప్పుడూ సదభిప్రాయం లేదు. ఆపైన ఇన్సూరెన్సు ప్రమాదాన్ని శంకిస్తుందే తప్ప నివారించదు.

కీడెంచి మేలెంచేవారికి అది ఓకే. కానీ కీడులోనూ మేలెంచే తత్వం నాది.

భువనేశ్వర్లో ఉద్యోగంలో చేరిన కొత్తలో మా ఆఫీసుకి తరచుగా లాల్జీ అనే అతను వచ్చేవాడు. కొత్తగా చేరిన మాతో స్నేహపూర్వకంగా మాట్లాడేవాడు. తొందరగానే మాకు మిత్రుడయ్యాడు. అప్పుడు తనో ఇన్సూరెన్సు ఏజెంటునన్న విషయం బయటపెట్టాడు.

మరి తను మాతో స్నేహం చేసిందే అందుకు కదా!

మేమంతా సైంటిస్టులం. లౌకికమైన ఇన్సూరెన్సులాంటివాటికి మా ఆలోచనల్లో చోటు లేదు.

"నువ్వు మిత్రుడివి కదా – నిజమైన మిత్రుడిగా మా జోలికి రాకూడదు" అనేశాడు జ్యోతిరంజన్ సాహు అనే మిత్రుడు.

లాల్జీ సామాన్యుడా, "నిజమైన మిత్రుడిగా సాయపడాలనే నేను ఇన్సూరెన్సు ఏజంటునయ్యాను" అన్నాడు. అని ఊరుకోలేదు. ఇన్సూరెన్సు వల్ల కలిగే ప్రయోజనాల్ని ఏకరువు పెట్టాడు.

దానికి నేను, "నువ్వు చెప్పిందాన్నిబట్టి, పూర్ణాయువు ఉన్నవాళ్లకి – ఇన్సూరెన్సువల్ల వెనక్కొచ్చేది కట్టిన డబ్బూ, దానిక్కాస్త వడ్డీ. అందుకు బాంకులూ, పోస్టాఫీసుల్నించి ఇంతకంటే మంచి ఆఫర్సున్నాయి. అకాలమరణం పొందినవారికే ఇన్సూరెన్సువల్ల ఏమైనా లాభం? నాకైతే నేను పూర్ణాయుష్కుణ్ణని పూర్తి నమ్మకం" అన్నాను.

అప్పుడు లాల్జీ – నాకులాగే ఆలోచించి, అనుకోని ప్రమాదానికి గురై, ప్రాణాలు పోగొట్టుకున్న నలుగురి గురించి చెప్పాడు. వాళ్లలో ఇద్దరు ఇన్సూరెన్సు చెయ్యడంవల్ల భార్యాబిడ్డలిప్పుడు సుఖజీవనం చేస్తున్నారు. ఇన్సూరెన్సు చెయ్యనివాళ్ల కుటుంబాలు రోడ్డుకెక్కాయి.

దీనికి ఠాకూర్ స్పందించాడు. అతడు పంజాబీ. మంచి హాస్యస్ఫూర్తి ఉన్నవాడే కానీ, చెప్పేది కాస్త పచ్చిగా, మోటుగా ఉంటుంది.

"నాకొచ్చే జీతం నా ఖర్చులకే చాలదు. నా మామగారు మా అవసరాలు చూస్తున్నారు. నేను పోతే నా ఖర్చు తగ్గి ఆయనకు లాభమే తప్ప, నా భార్యాబిడ్డలు రోడ్డెక్కే పరిస్థితి రాదు" అన్నాడు.

ఆ మాటతను జోక్‌గా అన్నాడే తప్ప నిజం కాదని, మాకే కాదు, లాల్జీకీ తెలుసు.
అందుకని అతడు నవ్వి, "అది కాదు ఠాకూర్! అర్థాంతరంగా ప్రాణం పోతే, ఇన్సూరెన్సు లేనివాడి శవాన్ని, అయినవాళ్లే పట్టించుకోరు..." అని తనూ కాస్త మోటుగానే అన్నాడు.

"నేనంటూ లేకపోయేక నా శవాన్ని గంధపుచెక్కలతో కాలిస్తే ఏంటి? కుక్కలీడ్చుకుపోతే ఏంటి? అందులో మానావమానాలు బ్రతికున్న నావాళ్లకే కానీ నాక్కాదు"

"పోనీ నీవల్ల వచ్చిన ఇన్సూరెన్సు డబ్బుతో, నీవాళ్లు సుఖంగా ఉంటే – నీ ఆత్మకి ఎంత సంతోషంగా ఉంటుంది! అది చాలదా?"

"నేను పోతే, వయసులో ఉన్న నా భార్య జీవితకాలం ఏడుస్తూ కూర్చుంటుందా? ఏడాది తిరక్కుండా ఇంకో పెళ్లి చేసుకుంటుంది. ఆ వచ్చిన ఇన్సూరెన్సు డబ్బు – ఆ చేసుకున్నవాడు అనుభవిస్తాడు. అది చూస్తూ నా ఆత్మ కుళ్లికుళ్లి ఏడుస్తుంది? ఇదంతా అవసరమా?"

లాల్జీ కొంచెం నిరుత్సాహపడి, "ఇలా మాట్లాడినవారు నాకింతవరకూ తటస్థపడలేదు. నువ్వు ఇన్సూరెన్సు చెయ్యొద్దు కానీ, ఇలాంటి ప్రచారం మాత్రం చెయ్యకు" అన్నాడు.

ఠాకూర్ నవ్వి, "ప్రచారమంటూ చేస్తే, నా భార్యని చిన్నబుచ్చే మాటలెందుకు చెబుతాను? అసలు విషయమే చెబుతాను. అదేంటంటే, నేనేమో నెలనెలా నీకు ప్రీమియమ్ము కడతాను. చస్తే తప్ప అందువల్ల నాకేం ప్రయోజనముండదు. కానీ నువ్వు మాత్రం బ్రతికుండగానే నేనెళ్లే దారిలో పెద్ద మేడ కడతావు. అది చూసి భరించడం నావల్ల కాదు" అన్నాడు.

అందరితో పాటు లాల్జీ కూడా నవ్వాడు కానీ, "నీలాంటివాడొకడుంటే మాకు బిజినెస్ రాదు సరికదా, ఉన్నది కూడా పోతుంది" అని నావైపు తిరిగి, "మీరంతా ఉద్యోగస్థులు. నెల తిరిగేసరికి ఠంచనుగా జీతంరాళ్లు చేతిలో పడతాయి. నాకలా కాదు. మీరు కట్టే పోలసీలే జీనవాధారం. ప్రతినెలా టార్గెట్ మీటవ్వాలి. నాకోసం నువ్వొక్క పోలసీ తీసుకోలేవా రావ్!" అన్నాడు వేడుకోలుగా.

గేర్లు మార్చడమంటే ఇదే!

లాల్జీ కష్టాల్లో ఉన్నాడని నేననుకోను. మాచేత ఏదో ఒకటి చెప్పి ఎలాగో అలా ఓ పోలసీ తీసుకునేలా చెయ్యాలి. అది వ్యాపారం...

అన్నీ తెలిసినా నాకప్పుడు లాల్జీమీద తెగ జాలి పుట్టుకొచ్చింది. ఓ పోలసీ తీసుకోవాలనే అనిపించింది. కానీ...

నిజానికప్పుడు నా ఆర్థికపరిస్థితి చాలా గడ్డుగా ఉంది. నెలనెలా ఇంటికి డబ్బు పంపాలి. చెల్లెళ్ల పెళ్లిళ్లు, తమ్ముళ్ల చదువుల గురించి కొంచెం డబ్బు వేరే నిలవెయ్యాలి. వచ్చే జీతం బొటాబొటీగా ఉంటోంది.

ఐతే పేద అరుపులు నాకిష్టముండదు, "నీకు బిజినెస్ టార్గెట్లున్నట్టే నాకు సంసారంలో టార్గెట్లున్నాయి. ప్రస్తుతానికి అవి మీటవడమే కష్టంగా ఉంది. ఇప్పుడిక కొత్త ఖర్చులు తగిలించుకోలేను. ఆపైన నాకు ఇన్సూరెన్సు అవసరం లేదని గట్టి నమ్మకముంది" అన్నాను. అని ఊరుకోవచ్చుగా, అతడు నొచ్చుకోకుండా ఉండాలన్న ప్రయత్నంలో, "నాకు ప్రమోషనొస్తే కనుక తప్పక ఓ పోలసీ, అదీ చిన్నది నీనుంచే తీసుకుంటాన్లే. అది మెట్యూరయ్యేక వచ్చే డబ్బూ ఇక్కడే నీముందే తీసుకుంటాను" అన్నాను.

చాలా తెలివిగా మాట్లాడేననుకున్నాను కానీ మాట జారేనని గ్రహించలేదు.

లాల్జీ వెంటనే, "ప్రామిస్ చేశావు. తొందర్లోనే నీకు ప్రమోషన్ గ్యారంటీ. ఈ ప్రామిస్ మర్చిపోకూడదు" అన్నాడు. అతడి మొహంలో అనుకున్నది సాధించేనన్న సంతోషముంది.

అదేమిటో, ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లదాకా రాదనుకున్న ప్రమోషన్, రెండేళ్లకే వచ్చేసింది.

ప్రమోషన్ ఆర్డరు ఇలా వచ్చింది, అలా లాల్జీ వచ్చి నన్ను కలుసుకుని పోలసీ గురించి గుర్తు చేశాడు.

అప్పటికింకా నా ఆర్థికపరిస్థితి మెరుగేం పడలేదు.

మాకు పాప పుట్టడం, స్వంతూళ్లో ఇంటి మరమ్మతులు – వగైరాలు అంత చెట్టుకి కొంతే గాలి అన్నట్లున్నాయి.

కానీ మాటిచ్చాను. అదీకాక, అతడి సంకల్పబలమే నాకు తొందరగా ప్రమోషనొచ్చేలా చేసిందన్న సెంటిమెంటు.

అతడు పులి అనుకుంటే నేను ఆవుని. అతడు నక్షత్రకుడైతే నేను హరిశ్చంద్రుణ్ణి.

నెలకి 40 రూపాయల పోలసీ తీసుకున్నాను. అప్పట్లో ఆ అదనపు ఖర్చు మా ప్రాణానికి చాలా ఎక్కువే.

"ఆర్థికంగా మనకంటే ఎంతో మెరుగ్గా ఉన్నవాళ్లు, పోలసీ వద్దుకాక వద్దన్నారని మీరే చెప్పారు. మాటమీద నిలబడాలన్న సెంటిమెంటుతో మాటిచ్చానని, మనకి మాత్రం అనవసరపు ఖర్చు తగిలించారు" అని వాపోయింది శ్రీమతి.

తను వాపోవడంలో అర్థముంది.

ప్రమోషనొస్తుందని తెలిసేక, ఆర్డరు చేతికొచ్చేలోగానే మేమా అదనపు ఆదాయాన్ని అంచనా వేసి కాస్త వెసులుబాటుండే బడ్జెట్ వేశాం. ఆ బడ్జెట్ రూపకల్పనలో శ్రీమతిదే ప్రముఖ పాత్ర. ఇప్పుడీ నలభై రూపాయల నెల ఖర్చునీ సద్దుబాటు చెయ్యడం కూడా తనదే బాధ్యత. అసలే తనవి చిన్న చిన్న సరదాలు. బడ్జెట్ సద్దుబాటులో వాటినే తగ్గించుకుంటుంది.

తనలో ఉత్సాహం పుట్టించాలనుకున్నాను. ఆ ఇన్సూరెన్సువల్ల ఎంత మనోస్థైర్యం వస్తుందో చెప్పాను. అందువల్ల మనసు ప్రశాంతంగా ఉండి, మా రచనావ్యాసంగం చురుగ్గా నడుస్తుందన్నాను. క్రమంగా ఈ ప్రీమియం ఖర్చుకి అలవాటు పడిపోతామన్నాను. పోలసీ మెట్యూరయ్యేక వచ్చే ఆ పాతిక ముప్పైవేలూ– ఉత్తినే చేతికి అందినట్లుంటుందన్నాను.

ఇంకా ఏదో చెప్పాలనుకున్నాను. కానీ అప్పటికే నేను నాకులా కాక లాల్జీలా మాట్లాడుతున్నాననిపించి చటుక్కున ఆపేశాను.

శ్రీమతి అదోలా చూసి, "ఇలాగైతే, ఆ లాల్జీ ప్రతి ప్రమోషనుకీ మీచేత ఓ కొత్త పోలసీ కట్టిస్తాడు. ఇదేం మొహమాటమండీ" అంది.

ఇలాంటివి చాలానే జరిగాయి. వాటిలోదే రీసెర్చి పేపరు విషయమూను...

ఉద్యోగంలో చేరిన ఏడాదికే, ఫారిన్ జర్నల్లో పబ్లికేషనుకోసం ఓ రీసెర్చి పేపరు తయారు చేశాను. అందుకు చాలావరకూ నా థీసిసు వర్కు ఉపయోగించుకున్నాను. కొన్ని అదనపు ప్రయోగాల్లో ఓ కొలీగ్ సహకారం తీసుకున్నాను. పేపరు వ్రాసేక అందులో అతడి పేరు కూడా కలిపితే, "ఇదేమో నీ థీసిస్ వర్కు. నేను నీకిచ్చింది మోరల్ సపోర్టు. పేపర్లో నా పేరు అవసరమా? అకనాలెడ్జిమెంటు చాలు కదా!" అన్నాడు. సాధారణంగా అంతా అదే చేస్తారు కానీ నేను మాత్రం నొక్కించాను.

తర్వాత ఆ పేపర్ డ్రాఫ్ట్ మా బాసుకి చూపించాను. ఆయన, "అతడికి అకనాలెడ్జిమెంటు చెబితే సరిపోయేది" అన్నాడు

నేనప్పుడు ఆ కొలీగ్ ఆ వర్కులో నాతోపాటు రాత్రింబవళ్లు ఎలా శ్రమపడ్డాడో కాస్త ఎక్కువ చేసి చెప్పాను.

బాస్ నవ్వి, "నువ్వు మాట్లాడుతున్నట్లు లేదు. పేపర్లో తన పేరెందుకుండాలో అతనే వచ్చి వాదిస్తున్నట్లుంది. ఏదేమైతేనేం, పేపరు నీది. కాబట్టి అతడి పేరుంచడం విషయమై నిర్ణయమూ నీదే! కానీ ఈ వర్కు ప్లాను, ఎగ్జిక్యూషను పూర్తిగా నీది కదా, ఫస్ట్ ఆథరుగా నీ పేరుండాలి కానీ అతడి పేరు ముందు వ్రాశావేంటి?" అన్నాడు.

రీసెర్చి పేపర్లలో ఫస్ట్ ఆథరుకుండే ప్రాధాన్యం నాకు తెలుసు. కానీ అతడి పేరు పొరపాటున ముందు వ్రాశాను. బాస్ హెచ్చరించేక అది మార్చొచ్చు కానీ, ఒకసారి వ్రాసేక మారిస్తే అతడేమనుకుంటాడో అనిపించింది. మరి మార్పు చెయ్యలేదు.

అది ఫారిన్ జర్నల్లో పబ్లిషైన నా మొదటి పేపరు.

"పేరెవరిది ముందుంటేనేంటి? అది నా పేపరే కదా! కాదనే వారెవరు?" అని శ్రీమతికి చెప్పాను.

"రీసెర్చి పేపర్ల పబ్లికేషన్లో అదో సంప్రదాయమని మీరే అన్నారు. మీకా సంప్రదాయం తెలిసినప్పుడు, దాన్ని అనుసరించాలి. ఇంత పెద్ద విషయాల్లోనూ మొహమాటానికి పోవడం, ఏదోలా మనసుకి నచ్చజెప్పడం – ఇది మంచి పద్ధతి కాదు. మీ కొలీగుకి కూడా ఇది నచ్చుబాటయిందనుకోను" అంది శ్రీమతి అప్పుడు.

అలాంటి మొహమాటంతోనే నేనిప్పుడు మతం మార్చుకుంటానేమోనని శ్రీమతి భయం.

"నువ్వు నన్ను తప్పు అంచనా వేస్తున్నావు. అన్నింటామొహమాటానికి లొంగేవాణ్ణే అయితే – నేనీపాటికి కాఫీ, టీ, సిగరెట్, విస్కీ, బ్రాందీ వగైరాలన్నింటికీ అలవాటు పడి ఉండేవాణ్ణి. వీటిలో ఏ ఒక్కటైనా కనీసం ఒక్కసారి నా పెదాల్ని తాకగలిగిందా, అది చెప్పు" అన్నాను.

"అంటే మతం కూడా అలాంటిదేనంటారా?" అంది శ్రీమతి.

"మతం అలాంటిదని ఎందుకంటాను? నేనిందాకా చెప్పినవి ప్రమాదకరమైనవి కాదు. మనిషికి ఎంతో కొంత ఉపశాంతినీ, వినోదాన్నీ, ఉత్సాహాన్నీ ఇస్తాయి. మనిషిని మనిషికి దగ్గర చేస్తాయి కూడా. మతం అలా కాదు. దానివల్ల కలిగే ఉపశాంతి, సంతోషం, ఉత్సాహం – అన్నీ మన భ్రమలే తప్ప నిజం కావు. అది మనిషిని మనిషినుంచి వేరు చేసి, ప్రపంచాన్ని ప్రళయానికి కూడా గురి చెయ్యగల ప్రమాదకరమైన వ్యవస్థ. నేనెప్పుడూ ఏ మతాన్నీ పూనుకుని స్వీకరించలేదు. ఇప్పుడూ స్వీకరించను" అన్నాను.

"మీరెన్ని చెప్పండి! నా భయం నాది. ఒకసారి రావుగారికి ఫోన్ చేద్దాం. శనివారం ప్రీస్టులతో మీటింగుకి, ఆ దంపతుల్ని కూడా ఆహ్వానిద్దాం. వాళ్లు పక్కనుంటే నాకు ధైర్యంగా ఉంటుంది" అంది శ్రీమతి.

ఆమె నిజంగా భయపడిపోతోందని నాకు అర్థమైంది.

"నువ్వు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నావు. అక్కడికి మనమేదో గొప్పవాళ్లమయినట్లూ, ఆ ప్రీస్టులు మనని వాళ్లతో కలుపుకుందుకు వస్తున్నట్లూ భావిస్తున్నావు. మనమేమైనా అసాధారణ వ్యక్తులమా? అతి సామాన్యులం. మనమంటే వారికంత ఆకర్షణెందుకు? ఏదో కుతూహలంకొద్దీ మనింటికొస్తున్నారు. తమగురించి నాలుగు మాటలు చెప్పి, మన గురించి కాసిని విశేషాలు తెలుసుకుని వెళ్లిపోతారు. రావుగారొస్తే ఇదంతా చూసి, ఉత్తపుణ్యాన మనం పడ్డ భయానికి వేళాకోళం చేస్తారు. ప్రస్తుతానికి ఎవర్నీ ఇందులో కలపొద్దు" అన్నాను.

"రావుగారు మన మనిషి. ఆయన వేళాకోళం చేసినా, నాకేం ఇబ్బందనిపించదు" అంది శ్రీమతి.

"ఐతే సరే, ఈ శనివారానికి మాత్రం వాళ్లని పిలవొద్దు. ప్రీస్టులు వస్తారు. వాళ్లు మతం మార్పిడి గురించి మాట్లాడారే అనుకుందాం. అందుకు నేను సరేనన్నానని కూడా అనుకుందాం. ఐనా వెంటనే మారిపోం కదా! అందుకు కొంత తతంగం ఉంటుంది. ఆ ఏర్పాట్లు చేసుకుందుకు వాళ్లు వెళ్లిపోతారు. అప్పుడు నువ్వు రావుగారికి ఫోను చేసి విషయం చెప్పి, ఈ వ్యవహారంనుంచి ఎలా బయటపడాలో సలహా తీసుకుందువు గాని" అన్నాను.

"అంటే రేపు శనివారంనాడు రావుగార్ని పిలవనంటారు. అంతే కదా!" అంది శ్రీమతి.

"అంతే!" అన్నాను దృఢంగా.

శ్రీమతి అయిష్టంగా మొహం పెట్టి, అసహాయతను సూచిస్తూ నిట్టూర్చింది.

మగవాడిగా, ఇంటి యజమానిగా ఓ నిర్ణయం తీసుకోవడం నాకు నచ్చదు. నా నిర్ణయంలో సగపాలు తనదీ కావాలి. అప్పుడే నాకు తృప్తి. అందుకే ఆమె నిట్టూర్పు నన్నిబ్బంది పెట్టింది.

"అంతే అన్నది నా నిర్ణయం మాత్రమే. అది నీకు నచ్చకపోతే, నువ్వు రావుగార్ని పిలవొచ్చు. అంతిమ నిర్ణయం నీదే! కానీ ఆ నిర్ణయానికి ముందు నాదో చిన్న మనవి. నా వ్యక్తిత్వంమీద నీకున్న భ్రమలు తొలగించడానికి, నాకొక్క అవకాశమివ్వు. ఇందులో నేను ఫెయిలయ్యానో, మన కుటుంబ విషయంలో మళ్లీ ఎన్నడూ స్వంత నిర్ణయం తీసుకోను. నువ్వు అవకాశమివ్వలేదూ– ఇన్నేళ్ల మన కాపురంలో నామీద ఈ మాత్రం నమ్మకం కలిగించలేకపోయిన నా అసమర్థతకి కుమిలిపోతాను" అన్నాను.

అనునయంగా అన్నాననే అనుకున్నాను. కానీ ఆ మాటలు ఆమెపై నేనాశించిన ప్రభావం చూపాయి.

"మిమ్మల్ని నమ్మకపోతే, నన్ను నేనే నమ్ముకోలేను. శనివారం సమావేశానికి రావుగార్ని పిలవొద్దు లెండి" అందామె.

మనస్ఫూర్తిగానే అన్నట్లు తోచింది నాకు.

ఐతే మేము రిలాక్సవడానికి కాసేపు పట్టింది. తర్వాత నేను, "ఆ జర్మన్ ప్రీస్టులు మన అతిథులు. వాళ్లని మనం అతిథుల్లాగే ట్రీట్ చెయ్యాలి. మనమిక ఆతిథ్యం విషయమై ప్లాన్ చెయ్యాలి" అన్నాను.

"ఇందులో ప్లాన్ చెయ్యడానికేముంది. ఏదైనా టిఫిన్ చేసి, కాఫీయో టీయో ఇద్దాం" అంది శ్రీమతి.

"ఔననుకో. కానీ ఇక్కడివాళ్లకి మన టిఫిన్లు నప్పవు. కిర్‌ష్‌నర్‌తో అనుభవం గుర్తుందిగా" అన్నాను.

ఉప్మాలో అల్లం ఘాటుకి తట్టుకోలేకపోయాడు కిర్‌ష్‌నర్. ఆ పరిస్థితిలో వేడి వేడి పాయసం ఇస్తే నోటబెట్టలేకపోయాడు.

జీవితంలో మర్చిపోలేని ఇబ్బందికరమైన అనుభవమది.

శ్రీమతి నవ్వి, "అదెలా మర్చిపోతాను? అందుకే చల్లపుణుకులు వేద్దామని డిసైడైపోయాను" అంది నవ్వుతూ.

పుల్లమజ్జిగలో మైదా కలిపి తగినంత అల్లం, పచ్చిమిర్చి నూరివేసేక ఆ పిండితో వేసే పుణుకుల్ని కొందరు పుల్ల పుణుకులనీ, కొందరు మజ్జిగ పుణుకులనీ అంటారు. అవి ఎంత కారంగా ఉంటే అంతిష్టం మాకు.

"అంత కారం వాళ్లు తినలేరు" అన్నాను చటుక్కున.

"కిర్‌ష్‌నర్ విషయంలో అనుభవమయ్యేక, ఆ పొరపాటు మళ్లీ చేస్తానా? వాళ్లకి కలిపే పిండిలో అల్లం, పచ్చిమిర్చి ఉండవు. కమ్మగా ఉంటుంది. ఆ పిండి వాసన, రుచి వీళ్ల పీజాకు దగ్గరగా ఉంటుంది. ఆపైన నూనెలో వేయిస్తామేమో రుచి వీళ్లకి తప్పక నచ్చుతుంది. తర్వాత వాళ్ల మూడ్ బట్టి వేడివేడిగా టీ, లేక చల్లగా కోకాకోలాయో, ఫెంటాయో ఇవ్వచ్చు" అంది శ్రీమతి.

అంత తక్కువ సమయంలో అంత దూరం ఆలోచించినందుకు ఆమెను అభినందించాను.

నాకు మాత్రం అప్పట్నించీ మనసులో – ఏదో ప్రమోషన్ ఇంటర్వ్యూకోసం ఎదురుచూస్తున్న అనుభూతి.

ఆ ఇంటర్వ్యూ అయితే తప్పనిసరి. కానీ ఇది కోరి తెచ్చుకున్నది.

విలియమ్సుని మా ఇంటికి రమ్మంటే రానన్నాడు. అలాగే నేనూ ఆ ప్రీస్టులు మా ఇంటికొస్తానంటే వద్దనాల్సింది.

శనివారం వచ్చేదాకా, 'అప్పుడెందుకు వద్దనలేదా' అని నన్ను నేను నిందించుకున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.

ఏమైతేనేం శనివారం రానే వచ్చింది.

ఉదయం టిఫిన్లయ్యాయి. మధ్యాహ్నం భోజనాలయ్యాయి.

చివరికి టైము మూడు అవనే అయింది. సరిగ్గా అప్పుడే మా ఇంటి కాలింగ్‌బెల్ మ్రోగింది.

ఫారిన్ పంక్చ్యువాలిటీ –

తలుపు తియ్యడానికి వెడుతుంటే నా కాళ్లు వణికాయి.

వెళ్లి తలుపు తీశాను.

ఎదురుగా వాళ్లే...

ఇద్దరు ప్రీస్టులు. తెల్లవాళ్లు. జర్మన్లు.

సన్నగా, పొడుగ్గా, తెల్లగా, తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ...

ముఖంలో తేజస్సుతో, కళ్లల్లో మెరుపుతో, పెదాలపై చిరునవ్వుతో–

"నమస్తే" అని చేతులు జోడించి, కరచాలనానికి చేతులు చాపారు.

నేనూ వారికి నమస్తే చెప్పి, వారితో కరచాలనం చేసి లోపలకు ఆహ్వానించాను.

అప్పటికి నాలో బెదురు కాస్త తగ్గింది.

వాళ్లు మా ఇంటి నడవని పరిశీలనగా చూస్తూ నెమ్మదిగా లోపలకొచ్చారు.

మా రూంలో కెళ్లేక, శ్రీమతినీ పిల్లల్నీ పరిచయం చేశాను. తర్వాత మావాళ్లు అక్కణ్ణించి వంటింట్లోకి వెళ్లిపోయారు.

తర్వాత ప్రీస్టులిద్దరూ కుర్చీల్లో కూర్చుని ఇల్లంతా పరికించి చూశారు.

నేను వాళ్లకి ఎదురుగా కూర్చున్నాను.

ఇద్దర్లో ఒకాయన కాస్త పెద్దవాడిలా ఉన్నాడు. ఆయనకంటే చిన్నవాడిలా ఉన్నాయన – పెద్దాయనవంక చూశాడు.

"నువ్విక మాట్లాడొచ్చు" అన్నట్లుంది ఆ చూపు.

అప్పుడు పెద్దాయన నాతో, "మీ దేశంనుంచి ఈ దేశానికొచ్చారు. ఇక్కడ మీకెలా ఉంది?" అనడిగాడు.

"చాలా బాగుంది" అన్నాను.

నా సమాధానం ఆయనకు తృప్తిగా ఉన్నట్లు లేదు, "అంటే, ఇక్కడ మీకేమీ ఇబ్బందిగా అనిపించలేదా?" అన్నాడు.

"మా దేశంకంటే సంపన్నదేశం. మా దేశంలో కంటే సౌకర్యాలెక్కువ. ఇక్కడ ఇబ్బందేముంటుంది?" అన్నాను.

"సౌకర్యాలుండొచ్చు. కానీ అన్నీ అందుబాటులో ఉండాలి కదా!"

"అంటే?"

"మీ కారు ఫోల్క్స్ వేగన్ కావచ్చు. కానీ మెర్సిడెస్ ఐతే మరింత సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడ మాకు మెర్సిడెస్ ఓ కల" అన్నాడాయన.

నేను నవ్వి, "నాకు కారే లేదు. ఆ అవసరమూ కనబడలేదు. ట్రాన్స్‌పోర్ట్ చాలా బాగుందిక్కడ" అన్నాను.

ఆయన మొహంలో ఆశ్చర్యం. "మీకు కారు లేదా? ఆ అవసరం కనబడలేదా? అంటే ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నారన్నమాట!" అన్నాడు చటుక్కున.

అప్పుడు నాకు భువనేశ్వర్లో నా కొలీగ్ రమేష్ చంద్ర గుప్తా గుర్తొచ్చాడు.

అక్కడ చలికి తట్టుకోలేక, చాలామంది స్వెటర్లు వేసుకుని తిరిగేవారు.

నేను భువనేశ్వర్లో ఒక్కసారి కూడా స్వెటర్ వాడలేదు. అదేమని అడిగితే, "నాకంత చలి లేదు" అన్నాను.

అప్పుడు గుప్తా పుసుక్కున, "ఇక్కడ చలి లేకపోవడమేమిటి? స్వెటర్ కొనుక్కోలేని వాళ్లు అనే మాట ఇది" అనేశాడు.

నొచ్చుకున్నాను కానీ, 'అతడి మాట తీరే అంత' అని సరిపెట్టుకున్నాను.

కానీ ఇక్కడ ఓ విదేశీయుడు కారు గురించి అలా అంటాడని నేనూహించలేదు.

ఇప్పుడూ గుప్తా విషయంలోలాగే సరిపెట్టుకుని ఊరుకోవాలా అన్నది తేల్చుకోలేకపోతున్నాను.

కానీ ఇంకా అంతకుమించిన సందిగ్ధాలు నాకోసం ఎదురుచూస్తున్నాయని నాకు తెలియదు.

మరో దేవుడు పిలిచాడు

మతం ఒక మహత్తర సాంఘిక శక్తి. నిజానికది మనుషుల్ని సంఘటితం చెయ్యాలి. కానీ మనిషిని మనిషినుంచి వేరు చెయ్యడానికే ఎక్కువగా సహకరిస్తూ, మానవజాతిని మారణహోమానికి ప్రోత్సహించడం – ఇప్పటికీ ఎన్నోచోట్ల జరుగుతున్న కథ. అందుకే నాకు మతమంటే కొంత చిరాకు ఉంది. దాని గురించి వీలైనంత తక్కువ ఆలోచిస్తాను.

అలాంటి నేను ఒక మతాన్ని గుడ్డిగా నమ్మే ప్రవక్తలతో సమావేశమై, మతం ప్రాముఖ్యం గురించి కొన్ని గంటల సేపు చర్చిస్తానని కలలో కూడా అనుకోలేదు.

మతమార్పిడి కోసం సామ దాన భేద దండోపాయాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందనీ ఊహించలేదు.

శతాబ్దాలుగా మన దేశంలో మతమార్పిడులు సాధారణంగా ఉంటూ వచ్చాయి. బలహీనులు, అణగద్రొక్కబడినవారు, నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడం అందుకు కారణం.

కానీ ఆర్థికంగా వైజ్ఞానికంగా అగ్రస్థానంలో ఉన్న అతి కొద్ది దేశాల్లో ఒకటైన దేశం జర్మనీ. అక్కడివారితో కలిసి సైంటిఫిక్ రీసెర్చి చెయ్యడానికి అర్హత సంపాదించినవాణ్ణి నేను. అక్కడి మతాచార్యులు మతమార్పిడికి నన్ను ప్రలోభపెట్టే ప్రయత్నం చెయ్యడం చాలా అరుదైన అనుభవం. అందుకే అది నా మనసుపై చెరగని ముద్ర వేసింది. ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఇప్పుడే జరిగినంత స్పష్టంగా మా సంభాషణ వివరాలు గుర్తుండిపోయాయి.

వాటినిక్కడ ఇంచుమించు యథాతథంగా పంచుకుంటున్నాను.

వచ్చిన ప్రీస్టుల్లో పెద్దాయన – నా ఆర్థిక పరిస్థితి ప్రస్తావన తెచ్చాడంటే, తను నిజంగానే నన్ను తన మతంవైపు ఆకర్షించడానికే వచ్చి సామం కంటే ముందు దానోపాయంతో మొదలెట్టాడని అనుమానం కలిగింది.

ఒక్క క్షణం తటపటాయించి నెమ్మదిగా అన్నానుః "మనిషికి కనీస అవసరాలు కూడు, గుడ్డ, నీడ. అంతకంటే అదనంగా ఏమున్నా ఆ మనిషి ధనికుడి కిందే లెక్క. నేను ఇక్కడ ధనికుడిలాగే ఫీల్ అవుతున్నాను"

పెద్దాయన నవ్వి, "మీరు చెప్పేది వేదాంతం. వాస్తవంలోకి వస్తే, కారు ఇక్కడ కనీసావసరం. మీకు ఆర్థికంగా ఏమైనా ఇబ్బందులుంటే మాకు చెప్పండి. కనీస అవసరాల గురించి మీ ఆలోచనలు వాస్తవానికి దగ్గరగా ఉండేలా చేయగలం" అని కుతూహలంగా నా కళ్లలోకి చూశాడు.

నాకు అర్థమైపోయింది.

వచ్చినవాళ్లు నన్ను ప్రలోభ పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ఎందుకో ఊహించలేనంత అమాయకుణ్ణి కాను నేను.

అయితే నా అంతట నేను బయటపడదల్చుకోలేదు. "చాలా థ్యాంక్స్. అవసరమనిపించినప్పుడు మీ ఆఫర్ తప్పక గుర్తుంచుకుంటాను" అన్నాను.

పెద్దాయన మొహంలో కొంచెం సంతోషం, కొంచెం అసంతృప్తి. అదోలా నవ్వి, "ఆ అవసరం ఇప్పుడే అనిపించినా చెప్పొచ్చు" అన్నాడు.

జిడ్డులా తగుల్కున్నట్లు తోచింది. మనసులో కొంచెం చిరాకనిపించింది. బయటపడకుండా తమాయించుకుని, "స్వతహాగా నాకు సంతృప్తి ఎక్కువ. ఇక్కడికొచ్చాక అది రెట్టింపయింది. అందుచేత ఇప్పట్లో నాకు అవసరం అనిపిస్తుంది అనుకోను" అన్నాను.

ఆయన మొహంలో దెబ్బతిన్న ఫీలింగ్ కనిపించింది. ఒక్క క్షణం మాట్లాడలేదు.

ఏమంటాడా అని నాలో కుతూహలం. ఆయన్నే చూస్తున్నాను.

"మీరు అల్పసంతోషి అంటే ఒప్పుకుంటాను. కానీ ఇక్కడికొచ్చాక మీ సంతృప్తి పెరిగిందంటే మాత్రం నమ్మలేను. ఎందుకంటే ఇక్కడ ఎక్కువమంది క్రైస్తవులు. వాళ్లంతా మీకంటే ఎక్కువ సంతృప్తితో ఉన్నారు. వాళ్లలో ఒకరుగా కలిసినప్పుడే మీకు సంతృప్తి పెరుగుతుంది. మీ సంతృప్తి పెరిగిందంటే, మీరు వాళ్లలో ఒకడిగా కలిసిపోవడానికి మానసికంగా సిద్ధపడ్డారని అనుకోవాలి. అవునా?" అన్నాడాయన.

ఇది సామం కాదు. చతురోపాయాల్లో ఏదీ కాదు. ఒక తరహా వశీకరణ అనొచ్చేమో! దీన్ని చతురోపాయాలకు కలపొచ్చు.

క్రమంగా ఆయన ఉద్దేశ్యం బట్టబయలౌతోంది. ఐనా ఆయన గోప్యంగా ఉండే ప్రయత్నం కూడా చేస్తున్నాడనిపించదు.

నేను మాత్రం తెలియనట్లే నటించాలి అనుకున్నాను. "ఇక్కడివాళ్లు నాకంటే ఎక్కువ సంతృప్తిగా ఉన్నారని నాకెప్పుడూ అనిపించలేదు. కానీ ఇక్కడివాళ్లలో ఒకడిగా కలిసిపోవడం మాత్రం ఇక్కడికొచ్చే ముందునుంచీ నాకిష్టమే" అన్నాను.

అది గ్రీన్ సిగ్నలుగా పొరబడ్డారో ఏమో, ఉన్నట్లుండి ఇప్పుడు పెద్దాయనతోపాటు చిన్నాయన మొహం కూడా వెలిగింది.

"ఇక్కడివాళ్లతో కలిసిపోవాలంటే – సులభమైన మార్గం క్రైస్తవమతం స్వీకరించడమే. ఆ విషయంలో మేము మీకు సాయపడగలం" అన్నాడు చిన్నాయన.

చల్లకొచ్చారని బయటపడడంతో, ఇక ముంతను దాచడం అనవసరం అనుకున్నారని గ్రహించాను.

"మనిషి మనిషితో కలిసిపోవడానికి మతం ఎందుకు? మంచి మనసుంటే చాలు కదా!" అన్నాను.

వెంటనే పెద్దాయన అందుకుని, "మతం ఎందుకంటే, మనసుని మంచిగా ఉంచడానికి" అన్నాడు.

"అయితే ఇప్పటికే నాకో మతం ఉంది. దాన్నొదిలి ఇంకోదానికి మారడం ఎందుకు?"

"ఎందుకంటే, ప్రపంచంలో సగానికి పైగా జనాలకి క్రైస్తవమతం ఇష్టమైంది. అంతమంది ఇష్టపడ్డారంటే, అన్ని మతాల్లోకీ అదే మంచిదని అర్థం. పైగా ప్రపంచంలో ఇప్పుడు ప్రజాస్వామ్యం నడుస్తోంది. ఎక్కువమంది దేన్నిష్టపడితే, అదే అందరూ అనుసరించాలి"

మా సంభాషణ తర్కంలోకి మళ్లింది. తర్కం నా స్ట్రాంగ్ పాయింటు.

చిన్నప్పుడు మా బామ్మగారు నన్ను అనవసరంగా తప్పు పడితే, నేను తర్కానికి దిగేవాణ్ణి. 'నీతో మాట్లాడాలంటే లాయర్ని పెట్టుకోవాలి" అని కాస్త ముచ్చటపడి తగ్గేవారామె. హైస్కూల్లో, కాలేజిలో, యూనివర్సిటీలో – మిత్రులతో

వాదన వచ్చినప్పుడు – 'నో ఆర్యుమెంట్స్! మేం చెప్పేది చెప్పాం. అంతే!" అని నాకు వాదించే అవకాశం ఇచ్చేవారు కాదు. వాదిస్తే ఓడిపోతామని భయం వాళ్లకి.

ప్రియూనివర్సిటీలో నా గ్రూపు ఎంపీఎల్. అంటే మాథ్స్, ఫిజికల్ సైన్సెస్, లాజిక్. మా క్లాస్ మేట్సు లాజిక్ కష్టమనుకునేవారు. నాకు మాత్రం ఆ సబ్జక్టులోనూ ఫస్టుక్లాసొచ్చింది.

అలాగని నేను తర్కశాస్త్ర నిపుణుణ్ణనుకోను.

ఎవరైనా వాదనకు దిగేటప్పుడు, తమ పాయింటు నెగ్గాలని పట్టుదలగా ఉంటారు. నేను విషయం పట్ల అవగాహన పెంచుకుందుకూ, నిజాన్ని తెలుసుకుందుకూ తర్కానికి పాల్పడతాను. అందువల్ల నా వాదనకు విలువ పెరిగేది. తమ పాయింటు నెగ్గాలన్న పట్టుదల ఉన్నవారి వాదన తాత్కాలికంగా నెగ్గినా, దానిలో పస ఉండదు. దానికి విలువుండదు.

ఇప్పుడు పెద్దాయన క్రైస్తవమతం విశిష్టతను నిరూపించడానికి చెప్పిన పాయింటులో బొత్తిగా పస లేదని గుర్తించాను. నాకు వాళ్లు – జ్ఞానసముపార్జన చేసిన మతాచార్యుల్లా కాక, మా ఇంట్లో బామ్మగారిలా, బయట మిత్రుల్లా సాధారణంగా కనిపించారు.

దాంతో నాలో జంకు, బెరుకు పోయి ధైర్యం వచ్చేసింది.

దొరికారు – అనుకుని, "మతం విషయంలో ప్రజాస్వామ్యం పాటించాలని అనుకుంటే, క్రైస్తవమతాన్ని పక్కన పెట్టక తప్పదు. ఎందుకంటే ప్రపంచ జనాభాలో మూడో వంతు చైనాలో ఉంది. ఐదో వంతు ఇండియాలో ఉంది. ఇండియాలో ఎక్కువమంది హిందువులు. చైనాలో ఎక్కువమంది బౌద్ధులు. బౌద్ధమతం కూడా హిందూమతం నుండే పుట్టింది. కాబట్టి ప్రపంచంలో ఎక్కువమంది ఇష్టపడేది హిందూమతమే ఔతుంది" అన్నాను.

వాళ్ళ వాదనను తిప్పికొట్టడానికి లోకజ్ఞానాన్ని వాడి ఏవో లెక్కలు చెప్పాను కానీ, ప్రపంచ జనాభాలో క్రైస్తవులే ఎక్కువ అని నాకు తెలియకపోలేదు. వాళ్లా విషయమై చిఠా తెరిచి లెక్కలు చెప్పి సవాలు చేస్తే కనుక, దానికీ నావద్ద సమాధానం సిద్ధంగానే ఉంది.

హిందువులు, బౌద్ధులకు ముస్లింలను కూడా కలిపితే – ఈ మూడు మతస్థుల సంఖ్య ప్రపంచ జనాభాలో సగంకంటే ఎక్కువే ఉంటుంది. కాబట్టి ప్రపంచంలో సగానికి పైగా క్రైస్తవులు కారని నేనూ సవాలు చేయవచ్చు.

అయితే వాళ్లకు ఇలాంటి లెక్కలపై పట్టున్నట్లు లేదు. ఏదో ఓ రాయేసి చూద్దామనుకున్నట్లున్నారు. నేను చెప్పిన జనాభా లెక్కలకు కొంచెం కంగు తిన్నట్లే కనిపించారు.

అదీకాక, తమ పాయింటుని నొక్కించడానికి లెక్కలమీద ఆధారపడ్డం వాళ్లకి ఇష్టమున్నట్లు లేదు.

పెద్దాయన గొంతు సవరించుకుని, "మీరు చెప్పిన లెక్కల గురించి వాదన పొడిగించాలని నేను అనుకోవడం లేదు. ఎందుకంటే క్రైస్తవమతాన్ని అనుసరించే సంపన్నదేశాలే ఇప్పుడు ప్రపంచాన్ని శాసిస్తున్నాయి. ఇతర మతాలకు

ప్రాధాన్యమున్న దేశాలు సంపన్నమైనా వాటికి ప్రపంచాన్ని శాసించేటంత తెలివి లేదు.
అందుకు కారణం మనిషికి సంతృప్తితోపాటు సంపదనీ, తెలివినీ కూడా ఇవ్వగలది క్రైస్తవమతం మాత్రమే. ఇది మీరు కూడా కాదనలేని నిజం'' అన్నాడు.

నేను కూడా కాదనలేననడం, ముందరి కాళ్లకు బంధం వేసే ఓ పద్ధతి. నా చిన్నప్పుడు మా బంధువొకామె తనేం చెప్పినా, 'నువ్వు చెప్పినట్లు' అని ముందరికాళ్లకు బంధమేసేది. ఇంకా ఇంటా బయటా ఆఫీసులోనూ ఆ బంధాన్ని వాడడం నాకు స్వానుభవమే. బహుశా దీన్ని కూడా చతురోపాయాలకు కలపాలి.

ఏదేమైనా ఈ ప్రపంచంలో తెలివి, సంపద ఒక్క క్రైస్తవమతం వల్లనే లభిస్తాయనడం మాత్రం సిల్లీగా అనిపించింది. ఆ మతాన్ని అనుసరించే ఒక ప్రీస్టు ఆ మాటనడం – ఆ మతస్థుల తెలివిని అనుమానాస్పదం చేస్తుంది.

అదే చెప్పాలనుకున్నాను కానీ, నాకే కటువుగా అనిపించింది. ఏంచెప్పినా మర్యాద కూడా పాటించాలిగా – అందుకని ఓ క్షణం ఆలోచించి, "నేను విన్న ప్రకారం కొందరు మేధావుల అభిప్రాయంలో – మతం తెలివిని చంపేస్తుంది. అందుకే తెలివైనవాళ్ళు మతానికి దూరంగా ఉండాలనుకుంటారు'' అన్నాను.

మతం నీ తెలివిని చంపేసి, నీచేత అలా మాట్లాడించింది సుమా అన్న విసురు అందులో లేకపోలేదు. కానీ ఆ విసురుని పసి కట్టే అవకాశమివ్వలేనంత మర్యాదని నాగొంతులో పలికించాను, మొహంలో ప్రదర్శించాను.

దీనికి పెద్దాయన వెంటనే స్పందించాడుః "ఆ మేధావుల్ని మేధావులనడానికి నాకు మనస్కరించడం లేదు. వాళ్లని మేధావులని ఒప్పుకోవాలంటే – హిందూమతాన్ని స్వీకరించిన మీరు తెలివైనవాళ్ళు కారని భావించాల్సి వస్తుంది?'' అన్నాడు.

నన్ను భలే దెబ్బ కొట్టాననేమో ఆయన మొహంలో – చిరు గర్వం.

ఐతే నేను సిద్ధంగానే ఉన్నాను. అందుకే తడబడకుండా, "మా నాన్నగారు హిందువు. ఆయన సంతానం కాబట్టి నేను హిందువు అయ్యాను. అంతే తప్ప నేను ఏ మతాన్నీ స్వీకరించలేదు'' అన్నాను.

ఇది వాళ్లకు తెలిసినట్లు లేదు. "అంటే మీకు స్వీకరించకుండానే పుట్టుకతోనే మతం వచ్చేస్తుందా? అలా ఎలా?'' అన్నాడు చిన్నాయన.

ఏంచెప్పను? పుట్టుకతో మతమే ఏమిటి – కులం కూడా వస్తుంది మనకి! కానీ అది చెప్పుకుందుకు గర్వకారణం కాదు.

మన దేశంలో శ్రమవిభజనకోసం ఓ గొప్ప సంప్రదాయంగా ఆవిర్భవించింది కులవ్యవస్థ. అదిప్పుడు శ్రమను పక్కన పెట్టి, పుట్టుకతో ముడి వేసుకుని అర్థవిహీనంగా కొనసాగుతూ ఎన్నో అనర్థాలకు మూలకారణమైంది.

ప్రస్తుతం – కులం హిందూమతానికి పెద్ద మచ్చ అనుకునేవాళ్ళలో నేనూ ఉన్నాను.

అందుకే టాపిక్ కులంవైపు మళ్లకుండా జాగ్రత్త పడాలని అనుకుని, "ఔను. పుట్టగానే మనిషికి తండ్రి, తల్లి, ఇతర బంధువులు ఉన్నట్లే, మతమూనూ. దాన్ని స్వీకరించడానికి తతంగమేం ఉండదు" అన్నాను.

అనగానే అనిపించింది. ఇదేదో కొత్త సిద్ధాంతంలా బాగుందే అని,

చిన్నాయన మొహం అదోలా పెట్టాడు, "తలిదండ్రులు, బంధువులు వేరు. మతం వేరు. మతానికి సంబంధించిన విషయాలు, పద్ధతులు తెలుసుకుందుకు మతగురువులు ఉండాలి. మతం స్వీకరించనివారికి మతగురువులు ఎలా వస్తారు?" అన్నాడు.

"ఇక్కడ మీకో విషయం స్పష్టం చెయ్యాలి. హిందూమతం అని మీరంటారు కానీ, మేము దాన్ని హిందూత్వం అంటాం. అది మతం కాదు. ఒక జీవనశైలి. హిందూత్వం పాటించే మాలాంటి సాధారణ పౌరులకు మతగురువులంటూ వేరే ఉండరు. సంప్రదాయం విషయంలో పెద్దల్ని అనుసరిస్తాం. చాలావరకూ ఆచారాలు పెద్దల్ని చూసి నేర్చుకుంటాం. అయితే నేర్చుకోవాలనీ, అనుసరించాలనీ మాకేం నియమాలు లేవు. ఇష్టమైతే అనుసరిస్తాం, ఆచరిస్తాం. లేకపోతే లేదు. ఇష్టమైతే గుడికి వెడతాం. వెళ్లలేదేమని ఎవరూ అడగరు. ఇష్టమైతే ప్రార్థనలు చేస్తాం. చేయలేదేమని ఎవరూ తప్పు పట్టరు. నిజం చెప్పాలంటే మాదొక మతమనీ, నేను హిందువుననీ – ఎప్పుడైనా దరఖాస్తులు పెట్టాల్సొచ్చినప్పుడు తప్ప, మనసుకి స్ఫురించనే స్ఫురించదు" అన్నాను.

నేను చెప్పింది నా విషయంలో పూర్తిగా నిజమని చెప్పలేను. కానీ హిందూమతానికి సంబంధించి అది నిజమే కదా!

వీళ్లతో నేనన్న మాటలే, ఇండియాలో మా బంధువుల దగ్గర అంటే, వాళ్లు అప్పటికి నన్ను నాస్తికుడంటారు. మళ్లీ గుడికెళ్లడానికీ, వ్రతాల్లో పాల్గొనడానికీ నాకేమీ అభ్యంతరం లేదు కాబట్టి ఆ సమయాల్లో ఆ ఊసెత్తరు.

ఇలాంటి మతం ఒకటి ఉంటుందని ఊహించలేదేమో, నేనన్నది వినగానే ప్రీస్టులు ఇద్దరి మొహాల్లోనూ ఆశ్చర్యం కొంతా, నేను నాస్తికుణ్ణి కాదుకదా అన్న అనుమానం కొంతా కనిపించాయి.

ఇద్దరికీ తేరుకుందుకు కొంత సమయం పట్టింది. తర్వాత పెద్దాయన అన్నాడుః "మీరు పుట్టుకతో హిందువులు అయ్యారు కానీ ఆ మతాన్ని స్వీకరించలేదు. ఐనా హిందువు అనుకుందాం అనుకుంటే – ఆ మతంలో ఆచారాల్ని, నియమాల్ని, సంప్రదాయాల్ని పట్టించుకోలేదు. అసలు హిందువుని అన్న భావమే మీలో లేదు. అదీకాక హిందూత్వాన్ని మీరు మతంగా కూడా భావించడం లేదు. అంటే మీరు క్రైస్తవమతాన్ని స్వీకరిస్తే, అది మతమార్పిడికింద రాదు. ఔనా?" అన్నాడు.

తెల్లబోయాను.

నేను చెప్పిందాన్ని ఆయన తనకి సానుకూలంగా మార్చుకున్నాడు. తెలివైనవాడే!

నేను మాత్రం తక్కువ తిన్నానా, "ఇండియాలోనే ఉంటూ, అక్కడి మతాన్ని పట్టించుకోనివాణ్ణి. ఇక్కడికొచ్చి ఇంకో మతాన్ని స్వీకరించడం ఎందుకు?" అన్నాను.

"మీరు ఆస్తికులా, నాస్తికులా – ముందది చెప్పండి. ఎందుకంటే దేవుణ్ణి నమ్మేవారికి మతం ఉండి తీరాలి" నొక్కించాడు పెద్దాయన.

"నేను దేవుణ్ణి నమ్ముతాను. అందుకు మతం ఉండి తీరాలంటే, పుట్టుకతో వచ్చిన మతం ఉందిగా, అది చాలు నాకు"

పెద్దాయన తల అడ్డంగా ఆడించి, "చాలదు" అన్నాడు దృఢంగా.

అందుకాయన చెప్పిన కారణం చాలా విడ్డూరంగా ఉంది.

మనిషి చనిపోయేక దేవుడి దగ్గరకు వెడతాట్ట. దేవుడు ఆ మనిషిని, నువ్వు క్రైస్తవుడివా, కాదా అనడుగుతాట్ట. ఔనన్నవాణ్ణి స్వర్గానికి, కాదన్నవాణ్ణి నరకానికి పంపుతాట్ట.

"చనిపోయేక స్వర్గానికి వెళ్లాలనే అంతా అనుకుంటారు. అందుకు క్రైస్తవులే అర్హులు. ఈ విషయం తెలియనివారే అన్యమతాల్లో ఉంటున్నారు. అర్థమైంది కదా!" అన్నాడు పెద్దాయన.

ఆశ్చర్యపోయాను.

మతమంటే నమ్మకమని తెలుసు. దేవుడికి సంబంధించిన నమ్మకం గుడ్డిగా ఉండొచ్చుననీ తెలుసు. కానీ అది సామాన్యులకు!

ఒక గొప్ప మతానికి సంబంధించిన ప్రీస్టు – తన మతం ఆవశ్యకతను నొక్కించడానికి మరీ ఇంత చచ్చు పాయింటు ఎన్నుకుంటాడా?

నిజం చెప్పాలంటే అది పాయింటు కూడా కాదు. ఒక విధంగా బెదిరింపు.

ఈయన నాగురించి ఏమనుకుంటున్నాడు? ఇలా బెదిరించే ఆ మతం మాత్రం ఏం మతం?

అలా అనుకోగానే నాకు మన సత్యనారాయణవ్రతం స్ఫురించింది. ఆ వ్రతకథలో – వ్రతం వల్ల కలిగే ప్రయోజనాలకంటే, చెయ్యకపోవడం వల్ల జరిగే కష్టనష్టాల గురించిన బెదిరింపులే ఎక్కువ. అంటే మతాల్లో ఈ బెదిరింపులు మామూలే.

నేను మతాన్ని నిరసించాలని కాక, ఆయన్ని ఒక వ్యక్తిగా గుర్తించి ఆలోచించాలి. అలా ఆలోచిస్తే – ఆయన నా గురించి ఏమనుకున్నా – వ్యక్తిగా ప్రదర్శించే జ్ఞానం, వివేకం – స్థాయిలో నాకంటే తక్కువే అనిపించింది.

నాలో ఆ భావం కలగ్గానే, నాకాయనపై చులకనభావం పోయి, జాలి కలిగింది.

మనం ఎవరిమీద జాలి పడతామో, వాళ్లతో ఎక్కువ స్వేచ్ఛగా వ్యవహరించ గలుగుతాం.

నాలో ఉత్సాహం పెరిగింది. గొంతు సవరించి, "నేను సైంటిస్టుని. అనుభవిస్తున్న జీవితం నాకు నిజం. చనిపోయాక ఏమౌతానో నాకు తెలియదు. ఆ విషయమై ఆలోచించను కూడా. ఉన్నంతకాలం నలుగురికి మంచి చేస్తూ, తెలిసి ఇతరులకు హాని తలపెట్టకూడదన్నది నా ఆశయం. అలా బ్రతికే అవకాశం, మనోబలం నాకివ్వమని దేవుణ్ణి ప్రార్థిస్తాను. దేవుడంటే కోరిన వరాలు ఇస్తాడన్న ఆశ, తప్పు చేస్తే శిక్షిస్తాడన్న భయం నాకు లేవు. నేనేం సాధించినా, అది నా గొప్పతనం అన్న అహంకారం నాలో తలెత్తకుండా ఆపడానికి మాత్రమే దేవుణ్ణి నమ్ముతాను. అదీ నా ఆస్తికత్వం. ఇప్పుడు చెప్పండి. మతం నాకు అవసరమంటారా?" అన్నాను.

ఆయన వెంటనే మాట్లాడలేదు.

అంతలో శ్రీమతి, పిల్లలు లోపలకు వచ్చారు.

మావాళ్లు రావడం ప్రీస్టులకు మంచిదే – ఎందుకంటే, నేనన్నదానికి జవాబు ఆలోచించుకుందుకు కొంత సమయం దొరుకుతుంది.

శ్రీమతి మా ముగ్గురికీ వేడి వేడి చల్ల పుణుకులు ప్లేట్లలో పెట్టి ఇచ్చింది. వాళ్లు అందుకుని, కాస్త ఇబ్బందిగా నా వంక చూశారు.

"భయపడకండి. రుచిలో ఇవి మీ పిజ్జాకు దగ్గరగా ఉంటాయి" అని ధైర్యం చెప్పాను.

అంతలో శ్రీమతి అక్కడ బల్లమీద మూడు గ్లాసులు పెట్టి వాటిలో ఫెంటా పోసింది.

"మీరు మంచినీళ్లు తాగరుగా, వాటికి బదులు ఇది" అన్నాను నవ్వుతూ.

కానీ జర్మన్లు మంచినీళ్లకు బదులు తాగేది బీర్ అని నాకు తెలుసు. మరి మా ఇంట్లో బీరు ఉండదు. బీరుని కూడా ఆల్కహాలుగా పరిగణిస్తాం కాబట్టి, ఇంటికొచ్చిన అతిథులకు బీరు కూడా ఇవ్వకూడదని నియమం పెట్టుకున్నాం.

అయితే కాఫీ, టీలని అలవాటుగా భావిస్తాం కాబట్టి, అతిథులకు మా ఇంట్లో అవి లభిస్తాయి.

ఈలోగా పిల్లలు మంచం మీద చేరి, వళ్లో ప్లేటు పెట్టుకుని టిఫిన్ తింటున్నారు.

శ్రీమతి వాళ్ళ పక్కనే కూర్చుంది. కానీ తన దృష్టంతా మా మీదే ఉంది.

జంకుతూనే ప్రీస్టులిద్దరూ చెరో పుణుకూ నోట్లో వేసుకున్నారు.

కిర్ష్‌నరుతో అనుభవం అయిందిగా, నేను కూడా జంకుతూనే వాళ్ల మొహాల్లోకి చూసాను.

పర్వాలేదు. వాళ్ళు ఇంకొకటి నోట్లో వేసుకున్నారు.

"శాకాహారుల ఫలహారం ఇది. ఎలా ఉంది?" అన్నాను.

"చాలా బాగుంది" అన్నారు ఇద్దరూ ఏకకంఠంతో.

నాకు అర్థమైంది. వాళ్లకి అవి మరీ ఎక్కువ నచ్చినట్లు లేదు. అయితే మర్యాదకు తినగలరు.

కొంచెం కొంచెం ఫెంటా తాగుతూ, వాళ్లు ప్లేట్లు కాళీ చేశారు.

నాకు మహదానందం అయింది. మనం పెట్టింది అతిథులు తింటే అదో తృప్తి కదా!

"వేడివేడిగా టీ తాగుతారా?" అనడిగాను.

వాళ్లు వద్దన్నారు.

మా ఆతిథ్యం బాగుందనడానికి నిదర్శనంగా వాళ్ళ మొహాలు మరింత ప్రసన్నం అయ్యాయి.

ఆతిథ్యం ఇచ్చిన తీరును బట్టి, మేము వాళ్లకు సుముఖంగా ఉన్నామన్న భ్రమ కూడా కలిగిందేమో పెద్దాయన కొంచెం ఉత్సాహంగానే– ఏసుక్రీస్తు గొప్పతనం గురించి చెప్పడం మొదలు పెట్టాడు.

చాలావరకూ తెలిసినవే.

ఏసుక్రీస్తు దేవుని కుమారుడు. ఆయన మనుషులకు సాధ్యం కాని ఎన్నో మహిమలు చేశాడు. ఎందరికో రోగాలు తగ్గించాడు. మనుషుల్ని పాపభారం నుంచి విముక్తుల్ని చేయడానికి తను శిలువను మోసాడు.... వగైరా వగైరా...

"ఇవన్నీ మా చిన్నప్పుడు పాఠాల్లో చదువుకున్నాం" అన్నాను.

ఆయన కళ్లు మెరిశాయి.

"చూశారా, ప్రపంచమంతా స్కూళ్లలో ఏసు గురించిన పాఠాలు ఉంటాయి. ఎందుకంటే ఆయనను స్మరించడమే ఎంతో పుణ్యం. ఆ పుణ్యంతోనే మీరు ఇక్కడికి వచ్చారు. ఇక మా మతంలో చేరితే, మీ భవిష్యత్తు ఎలా మారిపోతుందో మీ ఊహకందదు" అన్నాడు.

"ఏసుక్రీస్తు అవతార పురుషుడని మా దేశంలోనూ చాలామంది నమ్ముతారు. వాళ్లలో హిందువులూ ఉన్నారు. మా దేశ స్వతంత్ర పోరాటంలో ముఖ్య పాత్ర పోషించిన గాంధీమహాత్ముణ్ణి కూడా కొందరు అవతారపురుషుడు అంటారు. ఆయన కూడా ఏసుని దేవుడని నమ్ముతాడు. ఇక అద్భుతాల విషయానికొస్తే, అది అవతారపురుషులకు మామూలే. మా దేశంలో తరతరానికీ ఎక్కడో ఒకచోట అవతార పురుషులు ఆవిర్భవిస్తూ ఉంటారు. ప్రస్తుతం మా దేశంలో సత్య సాయిబాబా అనే అవతారపురుషుడు ప్రజల్ని సమ్మోహ పరుస్తున్నాడు. ఆయన మనుషులకు సాధ్యం కాని అద్భుతాలు ఎన్నో చేసాడు, చేస్తున్నాడు. ఆయనకు ప్రపంచంలో అన్ని దేశాలలోనూ భక్తులు ఉన్నారు. ఆయన కూడా ఏసుక్రీస్తుని దేవుడని నమ్ముతాడు" అని ఆగాను.

నేను చెబుతున్నది కుతూహలంగా వింటున్నారిద్దరూ. నేను ఆగగానే చిన్నాయన ఉత్సాహంగా, "ఇంకేం, మీ దేశంలో పుట్టిన అవతారపురుషులు కూడా ఏసుని దేవుడని నవ్వుతున్నారు. మరి మీ సంగతి ఏమిటి?" అన్నాడు.

అప్పుడు నేను వాళ్లకి సత్య సాయిబాబా చేసిన అద్భుతాల వివరాలు కొన్ని చెప్పాను.

అందుకు నాకు నేను చదివిన 'మ్యాన్ ఆఫ్ మిరకిల్సు' పుస్తకం కూడా ఉపయోగపడింది.

అవి చెప్పేక, " బాబా అన్ని మతాల దేవుళ్లనీ నమ్ముతాడు, గౌరవిస్తాడు. తనవద్దకు వచ్చిన భక్తుడు క్రైస్తవుడు అయితే– అతడికి గాల్లోంచి బైబిల్ కానీ, సిలువ కానీ సృష్టించి ఇస్తాడు. ముస్లింలకి ఖురాన్ ఇస్తాడు. హిందువులకు భగవద్గీతో, శివలింగమో ఇస్తాడు. కానీ ఎవరినీ మతం మార్చుకోమని చెప్పడు. ఆయన గురించి హోవార్డ్ మఫెట్ అనే ఆస్ట్రేలియన్, 'మ్యాన్ ఆఫ్ మిరకిల్స్' అనే పుస్తకాన్ని రాశాడు. మీరు చదువుతానంటే...." అని నేను ఇంకా ఏదో చెప్పబోతున్నాను.

అంతలో శ్రీమతి ఉత్సాహంగా మంచం పక్క బల్లమీదున్న ఆ పుస్తకాన్ని తెచ్చి నాకు అందించింది.

ఆమె చొరవ చూస్తే వాళ్లకు – తమ రాక పట్ల ఆమెకెలాంటి స్పందన కలిగిందో అర్థమైపోతుంది.

నేనా పుస్తకాన్ని వాళ్లకు అందించబోయాను. అంతే!

ఇద్దరూ కూడా ఏదో తాకకూడని భయంకర పదార్థాన్ని చూసినట్లు కొంచెం వెనక్కి వాలారు. పుస్తకాన్ని అందించడానికి నేను కూడా కొంచెం ముందుకి వంగ వలసిన వాణ్ణే కానీ వాటం చూస్తే వాళ్లు కెవ్వుమని అరుస్తారనిపించింది.

"వద్దు వద్దు" అన్నారు ఇద్దరూ ఏకకంఠంతో. నేను కాదు, వాళ్లే మతం మార్చుకునే పరిస్థితొస్తుందన్న భయం ఆ గొంతుల్లో ధ్వనించింది.

పాత సినిమాల్లో మాంత్రికుడి ప్రాణం ఉన్న చిలుకను పట్టుకున్న హీరోలా నన్ను చూస్తున్నారు వాళ్లు.

నేను ఇంకా ఏదో అనబోగా, ఇద్దరూ లేచి నిలబడ్డారు. కూర్చోమన్నా కూర్చో పోయేసరికి నేనూ లేచి నిలబడ్డాను.

ఇద్దరూ నాతో కరచాలనం చేశారు.

అంటే ఇక సెలవు తీసుకుంటారని గ్రహించి, "మీరు నా మేలు కోరి స్నేహభావంతో వచ్చారు. చక్కగా మాట్లాడారు. మన సంభాషణ నేను కలకాలం గుర్తుంచుకుంటాను. ఒకవేళ నేను మిమ్మల్ని నిరుత్సాహపరిచే ఉంటే అన్యథా భావించక, నన్ను మన్నించండి" అన్నాను.

పెద్దాయన మొహంలో రిలీఫ్ కనిపించింది. ఆయన ఆప్యాయంగా, "మేము నిరుత్సాహపడ్డ మాట నిజం. కానీ అందుకు కారణం మీరు కాదు. మీరు మంచివారు. ఉత్తములు. మాకు నచ్చారు. మేము వచ్చిన పని కూడా మంచిదే. మీరన్నట్లు మీకు మేలు చేసేదే! అయితే మిమ్మల్ని ఒప్పించగల సామర్థ్యం మాలో లోపించింది. మరో రోజున, మాకంటే

మెరుగైన ప్రవక్త వచ్చి, మెరుగైన పద్ధతిలో ఇదే సందేశాన్ని మీకందించి, మిమ్మల్ని ప్రభావితం చెయ్యగలడని ఆశిస్తున్నాను. సెలవు'' అన్నాడు.

సుహృద్భావంతోనే వాళ్లకి వీడ్కోలు చెప్పగలిగినందుకు నాకెంతో సంతోషం కలిగింది.

క్రైస్తవ మతాచార్యులు వెళ్లిపోయేక నేను, శ్రీమతి కూడా మామూలు మనుషులం కావడానికి కొంతసేపు పట్టింది. తర్వాత జరిగింది కలా, నిజమా అని కాసేపు అనుకున్నాం. చివరికి శ్రీమతి, "మీ గురించి ఏమో అనుకున్నాను. కరడు కట్టిన హిందూత్వవాదులు మీరు'' అంది. ఆమె ఉద్దేశ్యంలో అది ప్రశంస.

మా ఇంట్లో నన్ను నాస్తికుడని నిరసిస్తారు. మిత్రులు చాలామంది నేను సంప్రదాయాన్ని పాటించనని అనుకుంటారు.

ఐతే నా అలవాట్లు చూసి, అందుకు కారణం– దైవభీతి, పాపభీతి అని నిర్ధారించినవారూ ఉన్నారు.

ఇప్పుడు శ్రీమతి ఏకంగా కరడు కట్టిన హిందూత్వవాదిని అనేసింది.

వేరే మతంలో చేరడానికి విముఖత చూపడం– కరడు కట్టిన హిందూత్వవాదమౌతుందా?

ఆమె ప్రశంస నన్ను కాస్త ఇబ్బంది పెట్టినా, నేను శ్రీమతి మాటని ఖండించలేదు. ఎందుకంటే– మతాన్నీ దేవుణ్ణీ సీరియస్‌గా తీసుకోని నేను మొహమాటానికి లోనై మతం కానీ మార్చేసుకుంటానేమోనన్న అనుమానం, భయం ఆమెని వేధించాయని నాకు తెలుసు. అలా జరక్కపోయేసరికి ఆనందం పట్టలేక నాకా బిరుదునిచ్చింది.

నేనా బిరుదుని సీరియస్‌గా తీసుకోనక్కర్లేదు. ఐనా అది నేనేం లెటర్‌హెడ్మీద వ్రాసుకోను కదా!

నేనేమిటో తనకి తెలుసు. అది సాహచర్యంలో వ్యక్తమౌతూనే ఉంటుంది.

సందర్భాన్ని బట్టి ఆమె నాకిచ్చే బిరుదులూ మారొచ్చు. ప్రస్తుతానికి వచ్చింది మౌనంగా స్వీకరించడం మేలు. మౌనం అర్ధాంగీకారం అని ఆమె అనుకోవచ్చు. కానీ అర్ధాంగీకారమే కదా!

"ఇంటర్వ్యూల్లో గెలుపు లభిస్తే– ఒకోసారి నా ప్రతిభకు మురిసిపోతాను. ఒకోసారి కలిసొచ్చిన అదృష్టానికి పొంగిపోతాను. కానీ ఈరోజు జరిగిన మతాల చర్చలో నాది గెలుపైతే కనుక, అందుకు కారణం– ఎదుటివారి అసమర్ధతే తప్ప నా ప్రతిభా కాదు, అదృష్టమూ కాదు. నిజం చెప్పాలంటే నా గెలుపు నన్ను ఆశ్చర్యపర్చింది. ఎందుకంటే సంఖ్యలో తక్కువైనా, ఈ ప్రపంచాన్ని ఏలుతున్నది తెల్లవారే, ఆ కారణంగా ప్రపంచంలో అధికసంఖ్యాకులు అనుసరిస్తున్నదీ, అనుకరిస్తున్నదీ వారి సంస్కృతే! అందుకు కారణం వారు ప్రశ్నించే గుణాన్ని ప్రోత్సహించే సంప్రదాయాన్ని పాటించడం, శాస్త్రీయంగా నిర్ధారించిన విషయాల్నే నమ్మడం. అలాంటివారు దేవుడిపై నమ్మకంతో ఓ మతాన్ని స్వీకరించారంటే, వారి మతప్రవక్తలు వివేకానందుడి లెవెల్లో ఉంటారనుకున్నాను. మతప్రచారానికి మనవద్దకొచ్చిన మతాచార్యుల ప్రదర్శన–

అంత పేలవంగా ఉండడం ఆశ్చర్యం కదూ! దీన్నిబట్టి ఒక విషయం స్పష్టమౌతోంది. ఇదీ అదీ అని లేదు– ఏ మతమైనా మనిషి తెలివిని కరడు కట్టిస్తుంది. నీరు కరడు కడితే మంచుగడ్డ ఔతుందికదా! మంచుగడ్డ, నీరు– వీటిలో మనిషికి ఏది ఎక్కువ మేలు చేస్తుందో, ఏది ఎక్కువ అవసరమో తేల్చుకుని– అప్పుడు తెలివిని కరడు కట్టించడం గురించి ఆలోచించాలి. ఏది ఏమైనా ఈ రోజు మనకు జీవితంలో మరచిపోలేనిది" అన్నాను.

"నీరు, మంచుగడ్డ విషయమై అంత ఆలోచనెందుకూ– పదార్థాలు పాడవకుండా మంచుగడ్డని వాడతాం. మిగతా అవసరాలకు మంచినీళ్లు వాడతాం" అంది శ్రీమతి.

చాలా మమూలుగా అనేసిందామె. నేను మాత్రం 'మానిషాద ప్రతిష్టాంత్వ' విన్న నారదుడిలా థ్రిల్లైపోయాను.

అప్పుడు నాకు చిన్నప్పుడు చదివిన ఓ కథ గుర్తొచ్చింది.

పాండిత్యంలో తనకు సాటి లేరని విర్రవీగే ఓ అహంకారి పండితుడు, ఎక్కడెక్కడి పండితుల్నీ జయించాలని బయల్దేరి ఓ ఊరెళ్లాడు. పొలిమేరల్లో ఆయనకు ఓ పామరుడెదురై, ఆయన ఆంతర్యం తెలుసుకున్నాడు. వాడు వెంటనే నేలమీంచి గుప్పెడు మట్టిని తీసి, "ఇందులో ఎంత మట్టి ఉందో చెప్పండి. తర్వాత వెళ్లి మా ఊరి పండితుల్ని ఓడిద్దురుగాని" అన్నాడు. పండితుడా మట్టి ఎంత బరువుంటుందో, దాంట్లో ఎన్ని రేణువులున్నాయోనని ఆలోచనలో పడ్డాడు. ఎప్పటికీ ఆలోచనలు తెగడం లేదు. పామరుడు కాసేపాగి, "ఇంత చిన్న ప్రశ్నకి జవాబుకోసం అంత ఆలోచించాలా? ఇక మా ఊరి మహాపండితుల ప్రశ్నలకు ఎలా తట్టుకుంటారు?" అని గేలి చేశాడు. పండితుడు ఆశ్చర్యపడి, "ఇది చిన్న ప్రశ్నా? అయితే జవాబేమిటో నువ్వు చెప్పు చూద్దాం" అన్నాడు. "దాందేముంది? గుప్పెటతో తీశాను. గుప్పెడు మట్టి ఉంది" అన్నాడు పామరుడు.

ఇప్పుడు శ్రీమతి చెప్పిన వివరణ నాకు అంత గొప్పదీ, లోతైనదీ అనిపించింది.

"చాలా బాగా చెప్పావు. తెలివి కరడు కడితే, అది మన వ్యక్తిత్వాల్ని కాపాడాలి. కరడు కట్టని తెలివి జీవన గమనాన్ని సుగమం చెయ్యాలి. అందుకు మనం మనకంటే బలవత్తరమైన శక్తిని నమ్మాలి. అదే కొందరికి దేవుడు. తెలివి కరడు కట్టకపోతే ఆ దేవుడు– కృష్ణుడే కాదు, క్రీస్తూ కావచ్చు. రాముడే కాదు, రహీమూ కావచ్చు. వీళ్లెవరూ కాకుండా ఏ సాయిబాబాయో, ఇంకెవరో కావచ్చు" అన్నాను.

"ఇలా అనుకోవడం మొదలెడితే– వీళ్లెవరూ కాకుండా మనకు తెలిసిన మరో మనిషే దేవుడు కావచ్చు" అని నవ్వింది శ్రీమతి.

"బాలవాక్కు బ్రహ్మవాక్కు అంటారు బాలా! నీ మాటే నిజం కావచ్చేమో!" అన్నాను.

ఆ మాట సరదాకి యథాలాపంగా అన్నాను కానీ అది నిజమౌతుందని అప్పుడనుకోలేదు.

సందర్భానికి అనువుగా ఉంది కాబట్టి, వరుసక్రమంలో ముందున్న కొన్ని విశేషాల్ని వెనక్కి నెట్టి– ఈ విశేషాన్ని ముచ్చటిస్తాను.

ఆ రోజు మధ్యాహ్నం ఆఫీసులో అప్పుడే ఓ శాంపులుకి సర్ఫేస్ ఏరియా మెజర్మెంటుకి లిక్విడ్ నైట్రోజన్ కలెక్ట్ చేస్తున్నాను. మ్యుల్లర్ వచ్చి, "అర్జంటుగా నా శాంపులుకి సర్ఫేస్ ఏరియా మెజర్ చెయ్యాలి. ఈ పూటకి ఇన్‌స్ట్రుమెంటు నాకు స్పేర్ చెయ్యగలవా?" అనడిగాడు.

ప్రయోగానికి మానసికంగా ప్రిపేరై ఉన్నాను కాబట్టి స్పేర్ చెయ్యాలనిపించలేదు. కానీ నాకది అర్జంటు కాదు. అదీకాక అలా అడిగితే కాదనడం నా మనస్తత్వానికి సరిపడదు.

ఐతే భువనేశ్వర్లో నా సీనియర్ కొలీగ్ నాకో సలహా ఇచ్చాడు.

ఎవరినైనా అబ్లైజ్ చేసేటప్పుడు వెంటనే ఒప్పేసుకోకూడదుట. కాసేపు తటపటాయించి ఏదో పెద్ద త్యాగం చేసినట్లు పోజివ్వాలిట. అప్పుడే మన సాయానికి విలువుంటుందిట. లేకుంటే, ఎప్పుడు పని తప్పుతుందా అని ఎదురుచూస్తూ, అడగ్గానే హమ్మయ్య అని ఒప్పేసుకున్నామని అనుకుంటారుట.

అది కొంతలో కొంత నిజం. కొత్తగా మొదలైన పత్రిక్కి అడగ్గానే అప్పటికప్పుడు రాసి కథ పంపితే, ఏ తిరిగొచ్చిన కథో సిద్ధంగా ఉంటే పంపేశారని అనుకుని నిరాశ పడతారు. పది రోజులు టైమడిగితే పది పత్రికలు తిప్పి పంపిన కథ పంపినా సంతోషిస్తారు.

అది లోకం తీరు అని నాకూ తెలుసు. కానీ షో నా మనస్తత్వానికి సరిపడదు.

ఎలాగూ సరేననేటప్పుడు, తటపటాయించడం కంటే వెంటనే ఓకే చెప్పెయ్యాలనుకుంటాను. అందుకే మ్యుల్లర్ తో సరేనన్నాను.

అది ఒకందుకు నాకు మంచిదే అయింది. ఎందుకంటే సరిగ్గా అప్పుడే అహ్మద్ వచ్చి, "రావ్, నీ భార్యనుంచి ఫోను. అర్జంటుగా మాట్లాడాలిట" అన్నాడు.

మా ఇంట్లో మాకు ఫోను లేదు. ఇంటి బయట పబ్లిక్ టెలిఫోన్ బూత్ ఉంది. అత్యవసర పరిస్థితిలో నన్ను సంప్రదించడానికి శ్రీమతికి మా ఆఫీసు నంబరు ఇచ్చాను కానీ, ఇంతవరకూ అలాంటి అవసరం రాలేదు.

ఏమయిందోనని కంగారు పడుతూ వెళ్లేసరికి, "బాబు కుర్చీలోంచి పడిపోయాడు. ఎప్పుడూ లేంది ఆపకుండా తెగ ఏడుస్తున్నాడు. ఎడం చెయ్యి ముట్టుకుంటే చాలు బేరుమంటున్నాడు" శ్రీమతికి దుఃఖమొచ్చి ఆగిపోయింది.

ఇలాంటి కబురు వింటానని ఊహించలేదు. శ్రీమతి చెప్పింది ఆకళింపు చేసుకుందుకు కొంచెంసేపు పట్టింది.

"ఎలా జరిగింది?" అన్నాను.

మాకు ప్రసాద్ దంపతులు పరిచయమైనట్లు చెప్పాను కదా, వాళ్లిల్లు మా ఇంటికి మరీ దూరం కాదు.

ప్రసాద్ ఆఫీసుకి వెళ్లేక, శ్రీమతి ప్రసాద్ సాధారణంగా ఇంటి పనులతోనో, వంటింటి షాపింగుతోనో బిజీగా ఉంటుంది. ఎప్పుడైనా ఒంటరితనం ఫీలయితే కాలక్షేపానికి తెలిసినవాళ్ల ఇంటికెడుతుంది.

కన్నబిడ్డని, పసివాణ్ణి ఇండియాలో వదిలి రావాల్సొచ్చిందేమో– ఆమెకి పిల్లలున్న మా ఇల్లో స్పెషల్ అట్రాక్షన్. అలాగని ఆమె వాళ్లతో ఆటలాడదు.

"పిల్లలకి వాళ్లీడు వాళ్లతోనే బాగుంటుంది. మనం చేరదీస్తే, మొహమాటానికి కబుర్లు చెప్పినా, మనసులో బోర్ ఫీలౌతారు. వాళ్ల మానాన వాళ్లని ఆడుకోనివ్వాలి. వాళ్ల ఆటలు చూస్తూ మనం కబుర్లు చెప్పుకోవడం అదో ఆనందం" అంటుందామె.

ఆమె ప్రాక్టికల్ అప్రోచ్ కారణంగానే మా పిల్లలకి కూడా ఆమె ఫావరేట్ విజిటర్.

చాలామందికి పిల్లల్ని చేరదియ్యడం ఓ షో. పిల్లల ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా, వాళ్లని విసిగిస్తున్నామని గమనించకుండా, తమ షోని కొనసాగిస్తారు. అలాంటి షోకి సంబంధించిన విశేషాలు తర్వాత ప్రస్తావిస్తాను.

ఆ రోజు మధ్యాహ్నం శ్రీమతి ప్రసాద్ మా ఇంటికొచ్చింది. పిల్లలు వాళ్ల ఆటల్లో ఉంటే, పెద్దవాళ్లిద్దరూ కబుర్లలో పడ్డారు.

కాసేపటికి బాబుకి నిద్ర వస్తున్నట్లుంది. అక్కని వదిలి అమ్మ ఒడిలో చేరాడు. వాళ్ల కబుర్లు ఔతుండగానే వాడికి నిద్ర పట్టేసింది.

కాసేపటికి శ్రీమతి ప్రసాద్, వెళ్లడానికి లేచింది. శ్రీమతి తనూ కుర్చీలోంచి లేస్తూంటే, అనుకోకుండా బాబు ఒళ్లోంచి జారి కింద పడ్డాడు.

అంతే! ఏడుపు మొదలెట్టాడు.

ముందు భయపడ్డాడని అనుకుంది. కానీ శ్రీమతి ప్రసాద్ వాణ్ణి చూసి, "ఎడం చెయ్యి కొంచెం వంపు తిరిగినట్లుంది. పడడంలో దెబ్బ కాస్త గట్టిగా తగిలిందేమో!" అంది.

చూస్తే నిజమే! చెయ్యి విల్లులా వంగి ఉంది. అక్కడ ముట్టుకుంటే ఘొల్లుమంటున్నాడు.

శ్రీమతి బాబుని మంచంమీద జాగ్రత్తగా పడుకోబెట్టింది.

పాప కంగారు పడుతుంటే, "తమ్ముడికి నిద్రొస్తోంది. అమ్మ పడుకోబెడుతోంది" అని శ్రీమతి ప్రసాద్ పాపని దగ్గరకు పిలిచి మాటల్లో పెట్టింది.

బాబు కాసేపు ఏడ్చినా తొందరగానే నిద్రపోయాడు. అప్పుడు శ్రీమతి ప్రసాద్, "మీరు కిందకెళ్లి పబ్లిక్ బూత్ నుంచి మీ వారికి ఫోన్ చెయ్యండి. నేను పాపని చూసుకుంటుంటాను" అంది.

శ్రీమతి ఈ వివరాలు చెబుతూ మధ్యమధ్య దుఃఖంతో గొంతు పెగలక తడబడుతోంది.

బాబు తల్లి ఒడిలోంచి కింద పడీ పడగానే ఏడుపు మొదలెట్టాడంటే నాకూ దుఃఖమొచ్చింది.

వాడెప్పుడూ నవ్వుతూ ఉంటాడు. ఆటపాటల్లో ఎప్పుడైనా కింద పడ్డా, దెబ్బ తగిలితే తప్ప పట్టించుకోకుండా, మళ్లీ లేచి తన ఆటపాటల్లో మునిగిపోతాడు. దెబ్బ తగిలినా మా ఓదార్పు లభించగానే దాని గురించి మర్చిపోతాడు. అలాంటిది ఆపకుండా ఏడుస్తున్నాడంటే, నొప్పి ఎక్కువగా ఉండిఉండాలి. చెయ్యి ముట్టుకుంటే ఏడుస్తున్నాడంటే– ఎముక కానీ విరిగిందా– అని కూడా అనుమానమొచ్చింది.

ఆ అనుమానం రాగానే నాకు వళ్లంతా జలదరించింది.

ఎముక విరగడమంటే– అది చాలా పెద్ద సమస్య ఔతుందని నా భయం.

కానీ మేముండే ఇంట్లో నేల చెక్కది. మేమంతా కూర్చునే కుర్చీలు చెక్కవి. అవీ ఎత్తైనవి కూడా కాదు.

చెక్క కుర్చీలోంచి కాస్త ఎత్తుమీంచి చెక్కనేలమీద పడితే, ఎముక విరిగేటంత దెబ్బ తగుల్తుందా?

మనసుకి ధైర్యం చెప్పుకుని, తర్వాత శ్రీమతికి కూడా అదే చెప్పాను.

ఆమె కొంచెం తేరుకుని, "ఏమో, వాడి ఎడం చెయ్యి మాత్రం విల్లులా వంగింది. ఏడ్చి ఏడ్చి ఇప్పుడే పడుకున్నాడు. అందాకా ప్రసాద్ గారి భార్యని పాపకీ, వాడికీ కాపలా పెట్టి బయటికొచ్చి ఈ ఫోన్ చేస్తున్నాను" అంది శ్రీమతి.

మళ్లీ నా ధైర్యం దిగజారింది. చెయ్యి వంపు తిరిగిందంటే, ఎముక విరిగే ఉండాలి.

ఇప్పుడేం చెయ్యాలి?

ఇండియాలో ఉండగా– నాకు ఆస్పత్రి అనుభవం లేదు.

చిన్నప్పుడు జలుబు, దగ్గు, తలనొప్పి, అజీర్ణం వంటి వాటికి గృహవైద్యం చేసేవారు. జ్వరమొస్తే లంకణాలతో తగ్గేది. టెంపరేచరు కాస్త ఎక్కువైతే ఎవరైనా ఆస్పత్రికి వెళ్లి లక్షణాలు చెప్పి అరకు తెచ్చేవారు. రెండు మూడు రోజుల్లో తగ్గిపోయేది.

ఉద్యోగంలో చేరిన కొత్తలో నాకు బాగా రొంప పట్టింది. ఆఫీసులో కొలీగ్ నా అవస్థ చూసి, 'కాలనీలో డిస్పెన్సరీ ఉందిగా, డాక్టర్ని కలు. వెంటనే రిలీఫొస్తుంది" అన్నాడు. అప్పట్లో మా డిస్పెన్సరీకి డాక్టర్ నందా అని పేరుపొందిన ముసలాయన వచ్చేవాడు. ఆయన నన్ను సమస్యేమిటని అడిగి తెలుసుకుని, "నీకు పట్టింది రొంప. మందేసుకుంటే వారం రోజుల్లో తగ్గుతుంది. మందు వాడకపోతే ఏడు రోజుల్లో పోతుంది. మందివ్వనా?" అన్నాడు.

అప్పట్నించి ఇంతవరకూ– ఎంత రొంప పట్టినా సరే, నేనే కాదు నా శ్రీమతి కూడా డాక్టర్ని కలవలేదు. ఆయన చెప్పినట్లే అది వారంకంటే తక్కువ రోజులే కానీ, ఎక్కువ రోజులు బాధించలేదు.

అలాంటి నాకు– ఈ పరాయి దేశంలో ఇలాంటి సమస్య వచ్చేసరికి కాళ్లూ చేతులూ ఆడలేదు.

పోతన – 'సిరికింజెప్పడు' పద్యం ఊరికే వ్రాయలేదు. శ్రీమతికి ఏంచెప్పాలో తోచక, "ఏంచేద్దాం?" అన్నాను.

"రావుగారికి ఫోన్ చెయ్యండి. ఈ సమయంలో సలహాకీ, సాయానికీ ఆయన తప్ప ఇంకొకరు లేరు" అంది శ్రీమతి.

ఇలాంటప్పుడే మగాళ్లు గాబరా పడిపోతే, ఆడవాళ్లు పరిష్కారంవైపు చూస్తారు.

నేనేదో పరిష్కారమార్గం చెబుతానని కాదు, తనకు తోచిన పరిష్కారమార్గాన్ని అమలు చెయ్యడానికి నాకు ఫోన్ చేసింది తను.

రావుగారి పేరు వినగానే నాకు కొండంత ధైర్యం వచ్చింది. అందులో సగం ధైర్యాన్ని శ్రీమతికి బదిలీ చేసి, "నేను రావుగారితో మాట్లాడతాను. నువ్వు ఫోన్ పెట్టేసి ఇంటికెళ్లి, శ్రీమతి ప్రసాద్ గారిని రిలీజ్ చెయ్యి" అని చెప్పి, రావు గారింటికి ఫోన్ చేశాను.

అది రావుగారు ఆఫీసులో ఉండే టైము. పిల్లలు పుట్టేక, ఉద్యోగం మానెయ్యడంవల్ల కానీ, లేకుంటే రావుగారి భార్య సత్యవతిగారు కూడా ఇంట్లో ఉండేది కాదు/

ఫోను సత్యవతిగారు తీసింది. నేను ఫలానా అని చెప్పగానే, ఆయన ఆఫీసులో ఉన్నారని చెప్పి, విశేషాలు అడిగింది. నేను వెంటనే జరిగింది చెప్పాను. ఆ చెప్పడంలో– జపాన్ మీద బాంబు పడిందన్నంత బిల్డప్పుంది.

ప్రమాదం చిన్నదే కావచ్చు. కానీ నాకిది కొత్త. అందుకే అప్పుడలా ఫీలయ్యాను.

ఆమె వెంటనే, "అయ్యో" అని సానుభూతి ప్రకటించింది. "మీరు వెంటనే ఇంటికెళ్లి, మీవాళ్లని వెంటబెట్టుకుని, మా ఇంటికొచ్చెయ్యండి. అప్పటికి రావుగారు కూడా ఆఫీసునుంచి వచ్చి, బాబుని హస్పిటలుకి తీసుకెడతారు. మీరేం కంగారు పడకండి" అని ధైర్యం చెప్పింది.

ఆ మాటలతో మనకిక్కడ మనవాళ్లున్నారు అన్న ధైర్యం వచ్చింది. థాంక్స్ చెప్పి ఫోన్ పెట్టేశాను.

ఇంటికెడుతున్నట్లు అహ్మద్‌కి చెప్పాను.

అతగాడు నా ముఖకవళికలు చూసి, "ఉన్నట్లుండి డల్ ఐపోయావేమిటి? ఏమయింది?" అనడిగాడు.

అబద్ధమెందుకూ– పైకి కనబడకపోయినా, నా మనసులో ఇంకా చాలా దుఃఖంగా ఉంది. సానుభూతి కావాలనిపించిందేమో, అతడికి జరిగింది చెప్పాను.

ఆశ్చర్యంగా అతడు ఓదార్చడానికి బదులు పకపక నవ్వాడు.

"నువ్వెప్పుడూ, ఆటల్లో దెబ్బలు తగిలించుకోలేదా? చెట్లెక్కి పడలేదా?" అన్నాడు అదేదో మామూలు విషయమైనట్లు.

"లేదు" అన్నాను.

"అంటే నువ్వు చిన్నప్పుడు ఆటలాడలేదు. చెట్లెక్కలేదు. ఏం బాల్యం నీది?" అన్నాడు అహ్మద్ నిరసనగా.

నాకు ఉక్రోషమొచ్చింది.

చిన్నప్పుడు నా ఆటలన్నీ నదీజలాలు, పొలాలు, తోటలు– వీటి మధ్యనే నడిచాయి. చెట్లకూ మా ఆటలకూ అవినాభావసంబంధం ఉండేది. నా బాల్యం నాకెంతో మధురం.

"దెబ్బలు తగిలించుకుంటేనే బాల్యమా? చిన్నప్పుడు మా పక్కింట్లో ఓ అల్లరి కుర్రాడు ఉండేవాడు. అతణ్ణి స్కూల్లో టీచర్లూ, ఇంట్లో వాళ్ల నాన్నా చితకబాదేవారు. ఎప్పుడైనా వాడిమీద జాలి పడితే, 'పెద్దాళ్లచేతా, మేస్టర్ల చేతా దెబ్బలు తినడం అదో మజా! అది లేని బ్రతుకు వృథా' అనేవాడు. అలా ఉంది నీ మాట!" అన్నాను.

అహ్మద్ మళ్లీ నవ్వి, "వాడన్నది కరెక్టే కదా! యుద్ధానికి వెళ్లొచ్చినవాడికి ఎన్ని గాయాలుంటే అంత గొప్ప. అలాగే బాల్యంలో దెబ్బలూనూ" అన్నాడు.

"చిన్నప్పుడు దెబ్బలు నాకూ తగిలాయి. కానీ కాలూ చెయ్యీ విరగలేదు" అన్నాను.

"అందుకే ఇప్పుడు మీ అబ్బాయి కుర్చీలోంచి పడ్డాడనేసరికి తెగ హైరానపడిపోతున్నావు. మరి చిన్నప్పుడు నాకు ఆటల్లో ఎన్నోసార్లు దెబ్బలు తగిలాయి. ఒకసారి కాలు, ఒకసారి చెయ్యి విరిగాయి. ఆడుకునే వయసులో పిల్లలకిది మామూలే. ఎముక విరిగినా సులభంగా అతుక్కుపోవడమే కాదు, పూర్వంకంటే బలమౌతుంది" అన్నాడు.

అప్పటికి నాకు అహ్మద్ ఆంతర్యం అర్థమైంది. అతగాడు నన్ను వేళాకోళం చెయ్యడంలేదు. నాకు ధైర్యం కలిగించడానికి జరిగిన ప్రమాదాన్ని, తనదైన పద్ధతిలో తక్కువ చేసి చెప్పాడు.

అతడు చెప్పింది నిజమే!

మా వాడు పడింది కుర్చీలోంచి. అదీ బయట కాదు ఇంట్లో.

ఆ మాత్రానికే మిన్ను విరిగి మీద పడ్డట్లు ఫీలయ్యానంటే– ఇలాంటి విషయాల్లో ఉండాల్సినంత రఫ్ అండ్ టఫ్‌గా లేననేగా అర్థం.

అహ్మద్‌కి థాంక్సు చెప్పాను. అతడు వెంటనే, "అవసరమైతే నేనూ వస్తాను" అన్నాడు ఆత్మీయంగా.

"ఇంత చిన్నదానికి నువ్వెందుకూ! నీ అవసరం కలిగేటంత పెద్దసమస్య నాకు రాకూడదని అల్లాని ప్రార్థించు. ఇప్పటికది చాలు" అన్నాను.

"రావ్! బహుశా నువ్వు హాస్పిటలుకి వెళ్లాలి. ఇన్సూరెన్సుందిగా, ఆ కాగితాలు తీసుకెళ్లడం మర్చిపోకు" అన్నాడు అహ్మద్.

నాకసలు ఇన్సూరెన్సు సంగతే గుర్తు లేదు. బెర్లిన్ వచ్చినప్పుడు నన్ను ఇన్సూరెన్సుకి ప్రోత్సహించిందే– అహ్మద్! ఫారం ఫిల్ చేస్తున్నప్పుడు అతడు నా పక్కనే ఉన్నాడు. సరైన సమయానికి ఇన్సూరెన్సు విషయం గుర్తు చేశాడంటే, అతగాడు నా సమస్య గురించి ఎంత లోతుగా ఆలోచిస్తున్నాడో తెలుస్తుంది. 'ఎ ఫ్రెండ్ ఇన్ నీడ్– అనే సామెత ఊరికే పుట్టలేదు' అనుకుంటూ– అతడికి స్నేహపూర్వకంగా థాంక్సు చెప్పి అక్కణ్ణించి బయల్దేరాను.

అప్పటికి మనసు కొంత తేలిక పడింది. కానీ ఇల్లు చేరగానే శ్రీమతి నన్ను చూసి భోరుమనేసరికి మళ్లీ దుఃఖమొచ్చింది. అంతలో పాప పరుగున దగ్గరకొచ్చి నన్ను గట్టిగా పట్టుకునేసరికి, అది బాగా భయపడిందని అర్థమై, నా దుఃఖాన్ని పళ్ల బిగువున ఆపుకున్నాను.

ఐతే మంచంమీద నిద్ర పోతున్న బాబుని చూడగానే పితృహృదయం ద్రవించిపోయి దుఃఖం ఆగలేదు.

ఏడ్చి ఏడ్చి పడుకున్నట్లు వాడి మొహం చూడగానే తెలుస్తోంది. ఎడంచెయ్యి ధనుస్సులా వంగి ఉంది.

కొంచెం తమాయించుకుని సత్యవతిగారన్నది చెప్పి, వెంటనే సిద్ధం కమ్మన్నాను.

నేను అహ్మద్ చెప్పిన ఇన్సూరెన్సు కాగితాలకోసం వెదికాను.

మాకు సంబంధించిన ముఖ్యమైన కాగితాలన్నీ ఒకచోటే ఉండడంతో ఆ కాగితాలు సులభంగానే దొరికాయి.

కాగితాలంటే నెలనెలా వచ్చే రసీదులు. వాటితోపాటు మా నలుగురికీ నాలుగు చెక్కు పుస్తకాలలాంటివి ఉన్నాయి.

వాటిలో బాబు పేరున ఉన్న పుస్తకం తీశాను.

మేము వచ్చి చాలా నెలలే అయినా అంతవరకూ ఆ పుస్తకాల అవసరం కలుగలేదు. రాకూడదనే అనుకున్నాం కూడా.

వాటినెలా వాడాలో తెలియదు. నాకు తెలిసినంతవరకూ– ముందు వైద్యానికి డబ్బు కట్టి రసీదు తీసుకోవాలి. ఆ రసీదులు జతపరుస్తూ, ఇన్సూరెన్సు వాళ్లకి అప్లై చేసుకోవాలి. వాళ్లు తమ రూల్సు ప్రకారం ఇచ్చిందిస్తారు. వచ్చిందే చాలని సరిపెట్టుకోవాలి.

ఐతే మన దేశంతో పోల్చితే, ఇక్కడ హాస్పిటల్ చార్జిలు చాలా ఎక్కువని విన్నాను. నేను కట్టే ఇన్సూరెన్సు ప్రీమియం– ఏదో నామమాత్రం!

అంతకుమించి ఎక్కువ ఆలోచించడానికి సెంటిమెంటు అడ్డొచ్చింది.

అవతల బాబుకి చికిత్స అవసరం. నేను చికిత్స గురించే తప్ప ఖర్చు గురించి ఆలోచించకూడదు.

శ్రీమతి, పాప డ్రెస్సయ్యారు. బాబుకి బట్టలు మార్చలేదు. వాణ్ణి శ్రీమతి జాగ్రత్తగా ఎత్తుకుంది.

ఎత్తుకుంటుంటే బాబుకి మెలకువొచ్చి ఏడుపు మొదలెట్టాడు.

ఎత్తుకోవడంలో దెబ్బ తగిలిన చోట చెయ్యి తగిలిందేమో అనుకున్నాను కానీ, అదేం కాదు.

ఈ ప్రపంచంలో అమ్మ ఒక అద్భుతం. శిక్షణ పొందిన శస్త్రచికిత్సా నిపుణులను మించిన సున్నితత్వం చూపగలదు– తల్లి తన పిల్లల విషయంలో.

బాబు భయంతో ఏడ్చాడంతే!

"మనం డాక్టరు దగ్గరికి వెడుతున్నాం. ఆయన మందేస్తే నొప్పి తగ్గిపోతుంది. అందాకా ఏడవకూడదు. ఏడిస్తే దాక్టరుగారు నవ్వుతారు" అని శ్రీమతి వాడికి చెప్పింది.

ఆ మాటలే వాడికి ఎనస్తీసియా. ఇక నిజంగా నొప్పి వేస్తే తప్ప ఏడవడు.

ఇంట్లోంచి బయటపడి నడిచి డాయిచే ఓపర్ ఊబాన్‌హాఫ్ చేరుకున్నాం. అక్కణ్ణించి తదుపరి హాల్టులో దిగి నడుచుకుంటూ, క్నెసేబెకే స్ట్రాసే లోని రావుగారిల్లు చేరాం.

ఆ ప్రయాణంలో బాబు ఎక్కడా కిమ్మనలేదు. అందుకు వాణ్ణి మెచ్చుకోవాలి. నేను మాత్రం శ్రీమతికే ఎక్కువ మార్కులు వేశాను.

మేము వెళ్లేసరికి రావుగారింకా అఫీసునుంచి రాలేదు. సత్యవతిగారు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించింది.

బాబుని వాళ్లింట్లో సోఫాలో పడుకోబెట్టేక, "అబ్బే, కంగారు పడాల్సిందేం లేదు. చాలా చిన్న దెబ్బ. ఎటొచ్చీ డాక్టర్ని కలవాలి. అంతే!" అంది సత్యవతిగారు.

ఆ క్షణంలో ఆమెనే డాక్టరుగా ఫీలై, ఆ మాటలకు కొంత ఉపశమనం పొందాం.

ఓ పావుగంటలో రావుగారొస్తే, నేనెళ్లి తలుపు తీశాను.

ఆయన నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. లోపల శ్రీమతి కూడా కనబడ్డంతో మరింత ఆశ్చర్యపోయాడు. అంతలోనే తమాయించుకుని, "ఊరక రారు మహాత్ములు" అన్నాడు.

ఆయన తీరే అంత! చాలా తొందరగా సరదా మూడులోకి వచ్చేస్తారు, తెచ్చేస్తారు.

ఆహ్వానంమీద తప్ప కుటుంబసమేతంగా ఒకరిళ్లకి వెళ్లే అలవాటు మాకు లేదు. అందుకే ఆయనలా అన్నారు.

"మేము ఊరక రాని మాట నిజం. అందువల్ల మహాత్ములమైపోతే, మాకు ఓకే. కానీ మేమొచ్చింది మిమ్మల్ని మహాత్ముణ్ణి చెయ్యడానికి" అన్నాను.

రావుగారు వెంటనే, "ఇది చాలా అన్యాయం. ఇప్పటికే మహాత్ముణ్ణి. ఇంకా నన్ను మహాత్ముణ్ణి చెయ్యడమేమిటి?– ఇది నాకు చిన్నతనం" అని ఓ క్షణమాగి, శ్రీమతివైపు తిరిగి, "రావుగారు నన్ను చిన్నబుచ్చుతారనుకోను. డాక్టర్ల ప్రిస్క్రిప్షను

మందుల షాపువాడే చదవగలడు. భర్త మాటల అర్థం భార్య మాత్రమే చెప్పగలదు. కాస్త మీవారి మాటలకు అర్థం వివరిస్తారా?" అన్నాడు.

శ్రీమతి మాట్లాడబోయింది. దుఃఖం తన్నుకురాగా కన్నీళ్లాగలేదు. చీర చెంగుతో ఒత్తుకుంది.

రావుగారు తెల్లబోయి, "ఏమైందండీ....?" అన్నాడు.

మరో దేవుడు

శ్రీమతి ఏదో చెప్పబోయింది. కానీ ఏడుపు తన్నుకు రాగా వెక్కి వెక్కి ఏడ్చింది.

నా దగ్గరైతే ఎమోషన్సుని దాచుకోదు కానీ, బయటవాళ్ల దగ్గర ఎమోషన్సు విషయంలో చాలా నిగ్రహం పాటిస్తుంది శ్రీమతి.

ఆమె అంతలా బ్రేక్ ఐపోతుందని ఊహించని నాకు ఎంత ఆశ్చర్యం కలిగిందంటే, ఒక్క క్షణం బాబు విషయం కూడా మర్చిపోయాను.

స్వల్పపరిచయంలోనే రావుగారు మాకంత ఆత్మీయులైపోవడం కూడా ఓ కారణం కావచ్చు !

"ఆవిడ చెప్పే స్టేజిలో లేరు" అంటూ సత్యవతిగారు ఆయనకి బాబు విషయం చెప్పింది.

"అయ్యో!" అన్నాడు రావుగారు వెంటనే.

ఆయన శ్రీమతిని ఓదార్చే ప్రయత్నం చెయ్యలేదు. ఆమె తేరుకునేలోగా బాబు దగ్గరికెళ్లారు.

సోఫాలో కదలకుండా పడుకున్న వాణ్ణి పరీక్షగా చూశారు.

బాబు రావుగార్ని చూశాడు. ఆయనలో తనకీ ఆత్మీయుడు కనిపించాడేమో, జాలిగా ముఖం పెట్టాడు.

రావుగారు వాణ్ణి తాకలేదు. చూపులతోనే అన్నీ గ్రహించేసినట్లు తల తాటించాడు. తర్వాత శ్రీమతివైపు తిరిగి, తనే డాక్టరైనట్లు, "అబ్బే, కంగారు పడాల్సిందేం లేదండీ" అన్నాడు నెమ్మదిగా.

అప్పటికి శ్రీమతి కొంచెం తేరుకుంది. ఏడ్పు ఆపుకోలేనందుకు మొహమాటపడుతూ, చీరచెంగుతో మొహం తుడుచుకుని, సత్యవతి గారితో, "ఆయనకి కాఫీ..." అంది.

"దాన్ని కాఫీ అనలేను కానీ, ఆ పేరున్నదే ఆఫీసులో ఆటోమాట్లో తాగే వచ్చాన్లెండి. మనమిప్పుడు వెంటనే హాస్పిటలుకి బయల్దేరుదాం" అని నావైపు తిరిగి, "ఇన్సూరెన్సు పేపర్లు తెచ్చారా?" అన్నారు.

అహమ్మద్ చెప్పడం మంచిదే అయింది– అనుకుంటూ– నేనాయనకు వెంటనే బాబు పేరిట ఉన్నచెక్కు పుస్తకం ఇచ్చాను, ఆయన అది చూస్తూంటే, "ఇక్కడ ప్రొసీజర్సు ఎలా ఉంటాయో తెలియదు. దగ్గర ఎంత క్యాషుంచుకోవాలో తెలియదు. ఇప్పటికి నా దగ్గర ఎక్కువ క్యాష్ లేదు..." అని ఏదో చెప్పబోయాను.

"క్యాష్ దేనికీ, కారులో పెట్రోలు ఫుల్ టాంక్" అని నవ్వి, నేనిచ్చిన పుస్తకాన్ని కోటు జేబులోకి తోసేడాయన.

డబ్బులు పెట్రోలుకోసం మాత్రమేనా?

అది సెన్సాఫ్ హ్యూమరో, డబ్బు విషయంలో నాకు ధైర్యం చెప్పడమో తెలియలేదు.

నేనింకా ఏదో అనబోతే, ఆయన శ్రీమతి వైపు తిరిగి, "బాబుని కారు సీట్లో కాదు, చెయ్యి కదలకుండా జాగ్రత్తగా వళ్లో పడుకోబెట్టుకోవాలి అందుకు తగిన సున్నితం మీవారికుంటే సరే..." అని ఆగారు.

హాస్పిటలుకి తనకీ రావాలనుందేమోనన్న ఉద్దేశ్యంతో ఆయన ఆఫర్లాంటి హింటొకటిచ్చారు.

కానీ కార్లో మేమిద్దరం వెడితే, పాపని కూడా తీసుకెళ్లాలి. బాబు పరిస్థితి మామూలుగా ఉంటే అదేమంత సమస్య కాదు. కానీ ఇప్పుడు వాడి చేతికి నొప్పి కలక్కూడదంటే, వెనక సీట్లో వాడూ, శ్రీమతీ మాత్రమే ఉండాలి. మరో మనిషుంటే ఇరుకై వాడికి ఇబ్బంది ఔతుంది.

పోనీ పాపని సత్యవతిగారి వద్ద వదిలి వెడదామా అంటే, అటు ఆమెకీ, ఇటు పాపకీ కూడా కొంచెం ఇబ్బందే!

నేను సున్నితమైనా, కాకపోయినా– అలాంటి పరిస్థితుల్లో బాబుని నాకు వదలదు శ్రీమతి. కానీ ఇది దేశం కాని దేశం. మాట్లాడేది వంటబట్టని భాష. ఆపైన వెడుతున్నది హాస్పిటలు. రావుగారు ఎంత ఆత్మీయులైనా, ఈ సమయంలో పక్కన భర్త ఉంటేనే తనకి ధైర్యం.

శ్రీమతి కూడా ఇల్లాగే ఆలోచిస్తూ ఏంచెప్పాలో తెలియక సతమతమౌతున్నట్లుంది. నేను మాత్రం ఆమెనే ఆత్రుతగా చూస్తున్నాను.

అంతలో సత్యవతిగారు, "హాస్పిటల్లో ఆవిడ అవసరమేముంది? ఐనా ఇదేమైనా గంటలకు గంటలు పట్టే పనా? ఇలావెళ్లి అలా వచ్చేసేదానికి, మగాళ్లిద్దరూ వెళ్లండి చాలు. ఇక్కడ మాకు మాట్లాడుకోవాల్సిన విశేషాలు చాలా ఉన్నాయి" అంది.

పరిస్థితికి అనుకూలంగా త్వరిత నిర్ణయాలు తీసుకోవడానికి చొరవ ఉండాలి. ఆ చొరవలోనే, భయపడుతున్నవారికి ధైర్యం చెప్పాలి. ఆ మెలకువలు, సత్యవతిగారు ఉగ్గుపాలతోనే నేర్చినట్లు నాకు అనిపించింది.

రావుగారు నవ్వేసి, "నాకు తెలుసు. ఆవిడకేమో, ఆయన సున్నితమని ఒప్పుకోవడం ఇష్టం లేదు. నీకేమో– ఆవిడకి నామీద చెప్పాల్సినవి చాలా ఉన్నాయ్. ఇంతవరకూ ఆవిడ నీకు ఒంటరిగా దొరకలేదుగా, ఈ ఛాన్సెక్కడ పోతుందోనని నీ భయం" అన్నారు.

"మీరు మరీనూ" అంది సత్యవతిగారు.

"నేనెంత మరీనో కానీ, ఇప్పుడు నువ్వావిడకి చెప్పబోయేవే మరీనూ అని నాకు తెలుసు" అని శ్రీమతివైపు తిరిగి, "మీరు తను చెప్పేవన్నీ నమ్మెయ్యకండి. తను మరీ ఎక్కువ చెబితే, 'మీరు పుట్టింటికెళ్లడానికి ఇష్టపడరుట ఎందుకూ?' అని ఒకే ఒక్క ప్రశ్న అడగండి. చాలు. తన వాక్ప్రవాహానికి అడ్డుకట్ట పడిపోతుంది. ఎందుకంటే, రాముడు మంచి బాలుడు– అంటారే అదీ నేను. మా పెద్దవాళ్లు నాకు సత్యనారాయణ పేరెట్టారు కానీ, శ్రీరామచంద్రుడని పేరెట్టాల్సిందని మా అత్తారింట్లో అనుకుంటారు. నా గురించిన పొగడ్తలు వినలేకే, మా ఆవిడ పుట్టింటికెళ్లడానికి ఎక్కువ ఇష్టపడదు" అన్నాడు రావుగారు.

శ్రీమతి కిసుక్కున నవ్వింది. వాతావరణం తేలిక కావడంతో తన మనోభారమూ తగ్గిందని అర్థమై, నా మనసూ తేలికైంది.

అప్పుడు శ్రీమతి వాణ్ణి జాగ్రత్తగా ఎత్తుకుంది. వాడు వెంటనే బేరుమన్నాడు. చెయ్యి కదిలిందేమోనని భయపడ్డాను కానీ, కారణం అది కాదు. తల్లి కదా, వాడికి ఏమాత్రం నొప్పి తెలియకుండానే ఎత్తుకుంది. వాడు భయంకొద్దీ ఏడ్చాడంతే!

నేను, శ్రీమతి, రావుగారు లిఫ్టులో కిందకెళ్లాం. కార్లో కూర్చున్నాక, శ్రీమతి బాబుని జాగ్రత్తగా నా వళ్లో పడుకోబెట్టింది.

"నువ్వు ఏడవకూడదోయ్! ఏడిస్తే మీ అమ్మ బెదిరిపోతుంది. మీ నాన్న పరువు పోతుంది" అన్నాడు రావుగారు.

ఏమర్థమయిందో– ఆ తర్వాత బాబు మరి ఏడవలేదు.

హాస్పిటలు మరీ దూరం కాదు. బెర్లిన్ వంటి మహానగరం మధ్యలో అడుగడుగునా ట్రాఫిక్ అడ్డు తగిలినా కూడా– చేరుకుందుకు అరగంట కూడా పట్టలేదు.

రావుగారు ముందు రిసెప్షన్లోకెళ్లి ఏదో మాట్లాడేరు. తర్వాత నన్ను తీసుకుని ఆర్థోపెడిక్ వార్డుకి తీసుకెళ్లారు. అక్కడో డాక్టరు బాబు చేతిని పరీక్షించాడు.

కొత్త వాతావరణం. చెయ్యి నొప్పి. పసి వయసు. అమ్మ పక్కన లేదు. అందుకని బాబుకి దుఃఖమొస్తోంది. కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

వాడు పళ్ల బిగువున ఏడుపు ఆపుకోవడాన్ని గమనించాను. వాడిమీద జాలి పొంగుకొచ్చింది. ఐతే ఆ వయసుకి అంత హుందాగా ఉండడం ఆశ్చర్యంగానూ అనిపించింది.

డాక్టరు కూడా చాలా సున్నితంగా డీల్ చేశాడు. ఆయన చెయ్యి తాకినప్పుడు కూడా వాడు ఏడవలేదు.

ఎక్సరే తియ్యాలన్నారు.

ఇండియాలో అనుభవాన్నిబట్టి ఎక్సరే రిపోర్టు వచ్చేసరికే రెండు గంటలు కావచ్చనుకున్నాను. కానీ అన్నీ క్షణాలమీద ఐపోయాయి.

హెయిర్ లైన్ ఫ్రాక్చరుట.

చిన్నపిల్లాడు కాబట్టి దానంతటదే అతుక్కుపోతుంది కానీ, ఆడుకునే పిల్లాడు కాబట్టి, జాగ్రత్తకోసమని సిమెంటు కట్టు వెయ్యాలన్నారు. అదయ్యేసరికి దెబ్బ తగిలిన చెయ్యి మడిచి ఉంది. దానికో బ్యాండేజి. కిందకి వాలిపోకుండా ఆ చేతిని మెడనుంచి వ్రేలాడేలా చేశారు.

బాబు ఆ కట్టు ఆరు వారాలు ఉంచుకోవాలి. ప్రతి రెండు వారాలకీ కట్టు మారుస్తారు.

వాడినా పరిస్థితిలో చూడగానే నాకు మనసేదోలాగైపోయి– కళ్లలో నీళ్లు తిరిగాయి. డాక్టరు మాత్రం ఆ వయసులో అంతలా కోఆపరేట్ చేసే పేషంట్లు అరుదని మా వాణ్ణి తెగ మెచ్చుకున్నాడు. దాంతో అవే ఆనందబాష్పాలయ్యాయి.

బాబు కట్టుని పదేపదే వింతగా చూసుకుంటున్నాడు.

నొప్పి తెలియకుండా పోయినట్లుంది, ముఖంలో కొత్త ఉత్సాహం కనబడుతోంది.

"ఇక పద్దు తేల్చుకొద్దాం రండి" అంటూ రావుగారు పక్కనున్న ఆఫీసు గదికి తీసుకెళ్లారు.

బాబుని ఎత్తుకోబోయాను. కానీ వాడు నా చెయ్యి విదుల్చుకుని, తనూ నడిచే వచ్చాడు.

"ఇండియాలో డబ్బు కట్టాకే వైద్యం. ఇక్కడ పద్ధతి బాగుంది" అన్నాను రావుగారితో.

"తేడా అల్లా ముందూ వెనకా, అంతే! చికిత్సకి ఇక్కడా ముక్కు పిండి, గూబ పగిలేలా వసూలు చేస్తారు డబ్బు" అన్నాడు రావుగారు.

నా గుండెల్లో రాయి పడింది. ఇంటి దగ్గరుండగా, పెట్రోలుకి తప్ప క్యాష్ అక్కర్లేదన్నట్లు మాట్లాడిన మనిషి, ఇప్పుడిలా అంటాడేమిటీ అని కంగారు పడ్డాను. రోట్లో తలెట్టి రోకటిపోటుకి వెరచి ఏం లాభం– అనుకుంటూ మేకపోతు గాంభీర్యం వహించాను.

ఆ ఆఫీసులో రావుగారు అక్కడి ఉద్యోగితో మాట్లాడేరు. తన జేబులోంచి నేనిచ్చిన ఇన్సూరెన్సు చెక్కు బుక్ తీశారు. నాచేత రెండు చెక్కులమీద సంతకం పెట్టించుకుని ఆ ఉద్యోగికిచ్చాడు.

అక్కడో ఐదు నిముషాలున్నామేమో, అంతే!

'ఓ చెక్కు ఎక్సరేకీ, ఓ చెక్కు బ్యాండేజికీనూ. నేటికి పద్దు తేలిపోయింది" అన్నాడు రావుగారు.

"అంటే, మనమింకేం ఇవ్వక్కర్లేదా?" అన్నాను నమ్మలేక.

"ఇవ్వాల్సొచ్చేది– ఇన్సూరెన్సు లేకపోతే! ఇలాంటి ఖర్చులన్నీ ఇన్సూరెన్సులో కవర్డ్" అన్నాడు రావుగారు.

అది 1975. ఇండియాలో గవర్నమెంటు హాస్పిటలుకి వెళ్లినా, ఉచిత సదుపాయాలకి కూడా ఎవరెవరివో చేతులు తడపాల్సిన రోజులు. ఇన్సూరెన్సు లాంటివి ఉన్నా– ఖర్చయిన డబ్బులో ఎంత వెనక్కి వస్తుందో తెలియదు. దానికీ ఋజువులకై వేధించే బ్యూరియోక్రసీ.

రావుగారు చెప్పింది విన్నాక, జరిగింది కలో నిజమో తెలియలేదు.

ఇన్సూరెన్సు కంపల్సరీ అన్నారని తప్పనిసరై అన్యమనస్కంగా తీసుకున్నాను కానీ, వినియోగదారులకు ఇంత అనువుగా ఉంటుందని తెలిసేక– ఇన్సూరెన్సుని కంపల్సరీ చెసినవారిని మనసులోనే అభినందించుకున్నాను.

భారతదేశంలోనూ ఇలాంటి వ్యవస్థ ఎప్పటికొస్తుందో అని కూడా అనుకున్నాను.

రావుగారు చెక్కు బుక్ నాకిచ్చేశాడు. నాకప్పుడది వన్ మిలియన్ మార్కుల అకౌంటుకి సింహద్వారంలా అనిపించింది. గట్టిగా పట్టుకుని పాంటు జేబులోకి తోసేశాను.

బాబు మాతో నడిచొచ్చి కారెక్కాడు. మధ్యమధ్య మడిచి కట్టిన తన చేతిని చూసుకుంటున్నా– చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

ఇండియాలో కనీసం ఓ పూట ఉండి రావాల్సిన పరిస్థితి అది. మొత్తంమీద మేము హాస్పిటల్లో గంట కూడా లేము.

"జయహో జర్మనీ!" అనుకున్నాను మనసులో.

అరగంట లోగానే ఇల్లు చేరాం.

తలుపు తియ్యగానే శ్రీమతి ఆత్రుతగా బాబుని చూసింది. కానీ వాడు ఆమెని పట్టించుకోలేదు. "అక్కా!" అంటూ లోపలకు వెళ్లాడు.

అప్పటికి రావుగారబ్బాయి పడుకున్నాడు. వాళ్ల పాప ఎలాగూ చంటిది. ఎక్కువ నిద్ర పోతూనే ఉంటుంది.

పెద్దవాళ్లు కబుర్లు చెప్పుకుంటున్నారేమో, పాప తమ్ముడి రాకకోసం ఎదురుచూస్తోంది.

వాడు తన బ్యాండేజిని గొప్పగా అక్కకి చూపిస్తున్నాడు. 'నీకు లేనిదేదో నా దగ్గరుందిసుమా!' అన్న గర్వం వాడి మొహంలో కనిపిస్తోంది.

మేమూ అందరం సోఫాల్లో సెటిలయ్యాం.

అది చూసి మనసు తేలికైందేమో, "ఇంకా చాలాసేపు పడుతుందనుకున్నాను. సత్యవతిగారన్నట్లు, నిజంగానే ఇలావెళ్లి అలా వచ్చేశారు" అంది శ్రీమతి.

దానికి రావుగారు, "అయ్యో! ఇంకా చాలా తక్కువ టైం పట్టేదండీ. హాస్పిటలుకి వెళ్లేక మీవారి మొహం చూసి ఆ యనే పేషంటనుకుని, ఎంత చెప్పినా వినకుండా డాక్టర్లాయనకు పరీక్షలు మొదలెట్టారు. పేషెంటు ఈయన కాదు, వీళ్లబ్బాయి అని నమ్మించడానికి, ఇంత టైం పట్టింది. ఇక మీవాడా, గుడ్ గాడ్! మీ వాడికి మీ ఇద్దరి పోలికా రాలేదు. రంగుల రాట్నం ఎక్కినంత హాపీగా, ఎక్సరే బల్లమీద కూర్చున్నాడు" అన్నాడు.

జోకు పడింది నామీద కావడంతో, మాట తప్పించాలని, "ఔను వసూ! వాడు చాలా బుద్ధిగా కట్టు కట్టించుకున్నాడు. డాక్టర్లు వాణ్ణి ఒకటే పొగిడారనుకో" అన్నాను.

రావుగారొదుల్తాడా, "మీవాడు బుద్ధిగా ఉన్న మాట నిజం. డాక్టర్లు పొగిడిన మాట అబద్ధం. ఈ ప్రపంచంలో కొడుక్కి తగిలిన ఇంత చిన్న దెబ్బకి ఇంతలా అప్సెట్టయ్యే తండ్రి ఉంటాడా– అని ఆశ్చర్యపడ్డంతోనే వాళ్లకు సరిపోతే మీవాణ్ణెక్కడ పట్టించుకుంటారు? ఇప్పుడు మళ్లీ హాస్పిటలుకెడితే ఇంకా వాళ్లు మీవారి గురించే మాట్లాడుకుంటుంటారని ఢంకా బజాయించి చెప్పగలను" అన్నాడు.

అప్పుడు సత్యవతిగారు కలగజేసుకుని, "కొడుక్కి చెయ్యి విరిగితే ఏ తండ్రికి దుఃఖం రాదు? దానికి వాళ్లంత ఆశ్చర్యపోయుండరు కానీ, ఇక ఆపుతారా?" అంది.

"నిజమే, బాగానే పట్టేశావ్– వాళ్లు అంత ఆశ్చర్యపోలేదు కానీ, నేను వాళ్లతో– 'ఇంకా నయం, మీరు తండ్రిని చూశారు. తల్లిని చూసుంటే, ఈయందీ ఓ దుఃఖమేనా, అనుకుని ఉండేవారు' అన్నాను. అదీ వాళ్ల అసలు ఆశ్చర్యానికి కారణం" అన్నాడు రావుగారు.

ఆ మాట వినగానే శ్రీమతి సిగ్గుపడింది. తడబడింది. "సారీ, మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను" అంది మొహమాటంగా.

"మీవల్ల ఇబ్బందని అనుకున్నారా? ఐతే మీకో విషయం చెప్పాలి. చిన్నప్పుడు నేనోసారి మా ఇంట్లోనే కాలు జారి పడ్డాను. ఎక్కడా కనీసం గీరుకోనైనా లేదు. కానీ సానుభూతికోసం పెద్దగా ఏడ్చాను. కానీ ఆ ఏడుపు ఒక్క క్షణమే! ఎందుకంటే, మరుక్షణంలోనే నాకేదో ఐపోయిందని మా అమ్మ రాగం మొదలెట్టింది. ఎంత పెద్దగా ఏడ్చిందంటే, నేను భయపడి ఏడుపాపేసి అమ్మనే చూస్తూండిపోయాను. అదండీ అమ్మంటే! బిడ్డకు కష్టమొచ్చిందంటే, అదెంత చిన్నదైనా సరే, దాన్ని పదింతలు చేసి తను అనుభవిస్తుంది. మిమ్మల్ని చూడగానే నాకు మా అమ్మ గుర్తుకొచ్చింది" అన్నాడాయన.

"ఎంత ఉదాత్తంగానూ, ఆహ్లాదంగానూ చెప్పారో!" అనుకుంటూ– "మీ అమ్మమీదా ఇలాగే జోకులేసేవారా?" అన్నాను అప్రయత్నంగా.

రావుగారు తల అడ్డంగా ఊపి, "మా అమ్మయితే నాకంటే చాలా పెద్దదానిలా అనిపించేది. అందుకని తనమీద జోకులేసే ధైర్యం ఉండేది కాదు. మీ శ్రీమతిగారిలో అమ్మ కనిపించగానే, అమ్మ మరీ ఇంత చిన్నదైపోయిందా అనిపించింది. జోకేసి వెంటనే సరదా తీర్చేసుకున్నాను" అన్నాడు.

రావుగారు హాస్యప్రియుడు. హాస్యచతురుడు.

నా శ్రీమతిని– 'మీరు' అని మన్నిస్తూనే– చిన్నపిల్లలా ఫీలవుతూ, ఆత్మీయంగా ముచ్చటపడ్డం ఆయనకిది మొదటిసారి కాదు.

"పరిస్థితి ఎంత గంభీరంగా ఉన్నా సరే, ముందు దాన్ని తేలిక చేసి, అప్పుడు డీల్ చెయ్యాలంటారు మావారు. అప్పుడప్పుడు రెచ్చిపోయినట్లు అనిపించినా, అదే కరెక్టనిపించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి" అంది సత్యవతిగారు గొప్పగా.

నిజమే మరి. బాబుకి తగిలింది చిన్న దెబ్బయినా, అదే తొలి అనుభవం కావడంవల్ల– మిన్ను విరిగి మీద పడ్డ అనుభూతిలో ఉన్నాం. ఆయన మాటలతో అక్కడ వాతావరణంలోని గాంభీర్యం తొలగింది. ఆహ్లాదం పుట్టింది. మా మనసులు తేలికపడ్డాయి.

రావుగారింకా రెచ్చిపోయే మూడ్ నుంచి బయటపడలేదు, "నేను లేనప్పుడు ఇందాకా చెప్పిందే, అవేం నమ్మకండి. ఇప్పుడు చెప్పిందే నమ్మండి" అన్నాడు.

అప్పటికి శ్రీమతి పూర్తిగా ఫ్రీ అయింది, "సరేలెండి. ఆవిడ మిమ్మల్ని దేవుడన్నారు. కాదనుకుందుకు మనసొప్పకపోయినా, మీరే నమ్మొద్దంటే ఏంచెయ్యాలి?" అంది.

రావుగారు ఉలిక్కిపడి, "అమ్మో! మీరు మామూలైపోయారు. నేనిక జాగ్రత్తగా మాట్లాడాలి" అన్నారు.

"పెద్దగా ఏంచెయ్యను కానీ, కాస్త చారూ అన్నమే మనమంతా కలిసి భోంచేద్దాం" అంటూ సత్యవతిగారు ఆ ఏర్పాట్లకు లేచింది.

శ్రీమతి వెంటనే, "ఇంట్లో అన్నీ రెడీగా ఉన్నాయి..." అంది.

"రెడీగా ఉన్నవి వేడిగా ఉండవు. ఆ మాట చెప్పండీ" అంది సత్యవతిగారు భర్తవంక చూస్తూ.

రావుగారు మమ్మల్ని మొహమాటపెట్టేలోగా, "హాస్పిటల్నించి తిరిగొచ్చేసరికి ఏ అర్ధరాత్రో కావచ్చని భయపడ్డాను. మా బిల్డింగ్ గేటు పదకొండుకల్లా మూసేస్తారు. ఒలోముచ్‌కీకి ముందుగా చెప్పడం అవలేదు. చెప్పినా ఆవిడకి గుర్తుంటుందన్న గ్యారంటీ లేదు. ఎలాగా అని భయపడ్డాను. అదృష్టంకొద్దీ పెందరాళే పనులైపోయాయి. మేమిక వెళ్లిపోతాం. మీ ఇంట్లో తినేది చారూ అన్నమే ఐనా, కబుర్లతో కాలం తెలియదు. ఏమనుకోవద్దు. ఇక మాకు సెలవు" అన్నాను.

నా నిర్ణయంలోని దృఢత్వం కనిపెట్టారేమో, రావుగారు ఒప్పుకున్నారు.

ఆయన మమ్మల్ని ఇంటి దగ్గర దిగబెడతానంటే, "మీరేమో ఆఫీసునుంచి వస్తూనే హాస్పిటలుకి ప్రయాణమయ్యారు. నా బాధ్యతని మీరే తీసుకుని, మావాడికి వైద్యం జరిపించారు. జీవితంలో మర్చిపోలేని ఉపకారమిది. కాసేపు విశ్రాంతి తీసుకోండి. రిలాక్సవ్వండి. నేను మీరనుకున్నంత సున్నితం కాదు. ఎలా వచ్చామో అలా వెళ్లిపోగలమని ఋజువు చేసుకోవాలిగా" అన్నాను.

"అది మరోసారి ఋజువు చేసుకుందురుగాని. ఇప్పుడు కానీ మిమ్మల్ని ఇంటిదగ్గర దిగబెట్టకపోతే, ముందు మా ఆవిడూరుకోదు" అన్నాడాయన.

ఇలాంటి డైలాగ్సు విశాఖలో, భువనేశ్వర్లో విన్నాను. బెర్లిన్లో కూడా వినిపించి, ఇది మనూరే సుమా అనిపింపజేసిన రావుగారికి మనసులో మరోసారి ధన్యవాదాలర్పించుకుని, "ఆవిడకి నచ్చజెప్పడం మీ బాధ్యత. మా అబ్బాయి తన చేతి కట్టుని బెర్లిన్ అంతా చూడాలని తహతహలాడిపోతున్నాడు. వాడి కోరిక తీర్చడం మా బాధ్యత. మమ్మల్ని మాకులాగే వెళ్లనివ్వండి. మావి తిట్టే నోళ్లు కావు కానీ, తిరిగే కాళ్లని మీకు తెలుసుగా. మా బాబుకి కట్టు కట్టేక ట్రయల్సు ఇప్పట్నించే మొదలనుకోండి" అన్నాను.

ఆ దంపతులనుంచి సెలవు తీసుకుని, ఇంట్లోంచి బయటపడ్డాం.

దగ్గర్లోనే ఉన్న ఊబాన్‌హాఫ్ చేరాం. మామూలుగానే ప్రయాణం చేసి, ఇల్లు చేరాం.

భరించలేని నొప్పినుంచి బయటపడ్డంవల్లనేమో బాబు చాలా హుషారుగా ఉన్నాడు. రోడ్డుమీద ఒకరిద్దరు వాడివంక జాలిగా చూస్తే వాడి మొహంలో కించిత్ గర్వం. పాప మొహంలో రవంత అసూయ.

ఇల్లు చేరి సెటిలయ్యేక, "నిన్నెప్పుడూ అంత ఎమోషనలుగా చూడక, నేనే ఆశ్చర్యపోయాను. రావుగారలా అనడంలో ఆశ్చర్యమేముంది? నువ్వు గానీ ఆయన మాటలకు ఫీలయ్యేవా?" అన్నాను.

చప్పున రెస్పాండయింది శ్రీమతి. "ఆయన మాటలకి ఫీలవడమా? వయసుని బట్టి పెద్దన్న అనిపించినా, ఆయన్ని చూస్తే అప్పుడప్పుడు మా నాన్నగారు కూడా గుర్తొస్తుంటారు నాకు. నాలో అమ్మని చూశానన్నారే, ఆ మాట చాలండీ ఆత్మీయతకి" అంది.

"ఆయన నిన్ను అమ్మ అన్నారు. నువ్వాయన్ని నాన్న అని పగ తీర్చేసుకుంటున్నావా?" అన్నాను నవ్వుతూ.

శ్రీమతి, 'హవ్వ' అన్నట్లు నోరు నొక్కుకుని, "ఆయన మీద పగా? ఎవరికైనా దేవుడిమీద పగుంటుందా?" అంది వెంటనే.

ఔను. ఆ రోజుకి మాకు రాముడూ, రహీమూ, కృష్ణుడూ, క్రీస్తూ, సాయిబాబా– వీళ్లెవరూ కాదు. రావుగారే దేవుడు.

ఐతే మర్నాటినుంచి– యశోదకి కృష్ణుడిలా ఆయన మళ్లీ మనిషే మాకు. ఎందుకంటే కృష్ణుణ్ణి మనిషిలా భావించినవారే ఆయన సాహచర్యంలో ఎక్కువ ఆనందం పొందారు.

రావుగార్ని స్నేహితుడిగా భావించడంవల్లనే, జర్మనీలో గడిపిన మిగతా రోజులన్నీ మరింత రసవత్తరమయ్యాయి, మరపురాని మరువలేని ఆయన బహుముఖప్రజ్ఞాలీలలు ఎంతో ఆహ్లాదాన్నిచ్చాయి. ఇప్పుడు మనం స్మరించబోయేది వాటినే.

రావుగారి విశేషాలు మరిన్ని స్మరించేముందు, వాటితో ఎంతోకొంత జతపడ్డ కవిబాబు వ్యక్తిత్వాన్ని పరిచయం చెయ్యాల్సి ఉంది.

కవిబాబు ముచ్చట్లు

వీలు దొరికితే ఊళ్లో తిరగడం మాకు మామూలేగా–

ఓసారి అలా తిరుగుతుండగా మాకు ఎదుటపడ్డ ఓ వ్యక్తి మమ్మల్ని చూసి ఆగిపోయి క్షణంపాటు మా నలుగుర్నీ తేరిపార చూశాడు. తర్వాత అతడి చూపులు శ్రీమతిమీద నిలిచి ఆగిపోయాయి.

దాంతో క్షణంపాటు అప్రయత్నంగా మేమూ అగిపోయాం.

అతడంత పరీక్షగా చూస్తుంటే కలిగిన ఇబ్బందినుంచి బయటపడ్డానికి నేనూ అతణ్ణి పరీక్షగా చూశాను.

నాకంటేనూ కాస్త పొట్టిగా ఉన్నాడు. నాకులా కాకుండా పుష్టిగా, బొద్దుగా ఉన్నాడు. హిచ్‌కాక్ సినిమాల్లో పాత్రలా పొడవాటి లాంగ్‌కోటు ధరించాడు. రంగు నలుపుకి దగ్గర. చూడ్డానికి భారతీయుడిలాగే ఉన్నాడు. మాకు పరిచయస్థుడు కాదు.

శ్రీమతికి కొంచెం ఇబ్బందిగా అనిపించి, "పదండి, పోదాం" అంది నాతో నెమ్మదిగా.

మేము ముందుకి వెళ్లబోతుంటే, "అనుకున్నాను, మీరు తెలుగువాళ్లేనని" అన్నాడతడు.

మళ్లీ మా కాళ్లకి బ్రేకులు పడ్డాయి– ఈసారి ఆశ్చర్యంతో!

ఆశ్చర్యానికి కారణం అతడు మమ్మల్ని తెలుగువాళ్లుగా గుర్తించినందుకు కాదు.

బయటివాళ్లకి భారతీయులంతా ఒకటికావచ్చు కానీ– మన కట్టూ బొట్టూ ఎంత విభిన్నమో ఒరిస్సాలో ఉన్నాకనే మాకు అర్థమైంది. ఆడవాళ్ల కట్టూ బొట్టూ చూసి– ఒరియా, బెంగాలీ, పంజాబీ, యూపీ వాళ్లని నిర్ధారించడం అక్కడే మాకు అలవడింది. ఉత్తరాదివాళ్లు కూడా దక్షిణ భారత మహిళల్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళీలని ఇట్టే కనిపెట్టేసేవారు.

మగాళ్ల విషయానికొస్తే, అందరి కట్టూ పాంటూ షర్టూనే అయినా– ఆడవాళ్లు పక్కనున్నప్పుడు వాళ్ల మొహాల్లోనే ఏదో తేడా దొరికేది.

కానీ బెర్లిన్ వచ్చేక ఈ తేడాలు పట్టడం కష్టమయ్యేది.

ఒకటి– కనిపించినవాడు ఇండియనైతే చాలు అనే ధ్యాసలో, ప్రాంతాలు స్ఫురించక పోవడం.

రెండు– చలి వాతావరణంలో మసలడానికి కంఫర్టబులుగా ఉంటుందని, ఆడా మగా కూడా పాంటూ షర్టులే వేసుకోవడం.

వచ్చిన కొత్తలో నేను కూడా శ్రీమతిని దుస్తులు మార్చమని బలవంతపెట్టాను.
కానీ, "కంఫర్టు వంటికే కాదు. మనసుకీ ఉండాలి. నేనిక్కడుండేది ఓ ఏడాది పైన. ఆమాత్రానికి మనసునెందుకు ఇబ్బంది పెట్టాలి?" అని నా మాట కొట్టి పారేసిందామె.

ఆమె మనసుకి కలిగే ఇబ్బంది తనతో ఆగేది కాదు. తెలుగు మహిళలు చీర కాకుండా మరే దుస్తులు వేసుకున్నా, ఏదో తప్పు జరిగినట్లు అనిపించేదామెకి. అది సబబా కాదా అన్న విషయాన్ని పక్కన పెడితే– మన సంస్కృతి, సంప్రదాయాల్ని నిలబెడుతున్నది ఎక్కువమంది ఆడవాళ్లలో నెలకొన్న ఇలాంటి మనస్తత్వమేనని ఒప్పుకోక తప్పదు.

మరి వేదికలెక్కి ఉపన్యాసాలు దంచడంవరకే తమ పాత్ర అనుకుంటారు మగాళ్లు!

ఎప్పుడూ చీరలే కడుతూ, నుదుట బొట్టుని మరువకుండా దిద్దుకుంటూ, అత్యవసరమైనప్పుడే తప్ప ఓవర్‌కోటు ధరించకుండా బయట తిరిగే ఆమెను చూడగానే, అపరిచిత భారతీయులు కూడా చటుక్కున, 'తెలుగువాళ్లా?' అనడిగేవారక్కడ.

కాబట్టి ఇప్పుడీ అపరిచితుడు మమ్మల్ని తెలుగువారిగా గుర్తించడంలో ఆశ్చర్యమేంలేదు. ఐనా మేమాశ్చర్యపడ్డామంటే కారణముంది.

మేం చదువుకునే రోజుల్లో హైస్కూల్లో, కాలేజీల్లో తెలుగు టీచర్ల వేషభాషలు ప్రత్యేకంగానూ, మిగతా టీచర్సుకి భిన్నంగానూ ఉండేవి. వ్యక్తిత్వాలు కూడా వేషభాషలకి దీటొచ్చేలా ఉండేవి.

1967లో వైజాగులో కొత్త కాపురంలోనే మేమిద్దరం, మాకిద్దరు. ఆ ఇద్దరూ నా తమ్ముడూ, చెల్లెలూనూ. తమ్ముడు ఎవిఎన్ కాలేజిలో బియ్యేలో చేరితే, చెల్లెలు స్కూలుఫైనల్ చదవడానికి పెదవాల్తేర్లో కెడిపిఎం హైస్కూల్లో చేరింది.

ఒకరోజున నా చెల్లెలు స్కూల్నించి ఇంటికొచ్చి, "అన్నయ్యా! మా తెలుగు మేస్టారు క్లాసుకి పొంటేసుకొచ్చారు. ఎక్కడైనా తెలుగు మేస్టర్లు పొంట్లేసుకుంటారా?" అనడిగింది ఎంతో ఆశ్చర్యంగా.

రాజ్యం పిక్చర్సు వారి శ్రీకృష్ణలీలలు సినిమాలో కృష్ణుడు మన్ను తిన్నాక, గోపబాలుడు (నల్ల రామ్మూర్తి) యశోదకు పితూరీ చెయ్యడానికి వెళ్లి జరిగింది వివరంగా చెప్పడం– అదో మృదుమధుర హాస్యం. కృష్ణుడు భూదేవి తన పెళ్లామని చెప్పినందుకు సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ, 'భూదేవి పెళ్లామేమిటి ఆత్తయ్యా' అని ఆశ్చర్యపోతాడు. ఇప్పటికీ ఆ సన్నివేశం తలపులోకొస్తే గిలిగింతలు పెడుతుంది.

'తెలుగు మేస్టర్లు పొంటేసుకుంటారా?' అన్న నా చెల్లెలి సందేహంలో అదే అమాయకత్వం, హాస్యం జతపడ్డాయి. అప్పటికి నవ్వుకున్నా– నా చెల్లెలి ఆశ్చర్యం– అప్పటి తెలుగు టీచర్ల వ్యక్తిత్వాలకు యోగ్యతాపత్రమని ఇప్పుడు గ్రహిస్తున్నాం.

వ్యక్తిత్వమంటే వేషభాషలు మాత్రమే కాదు.

వృత్తిపట్ల అంకితభావం, శిష్యులపట్ల బాధ్యత నాటి గురువుల్లో అధికసంఖ్యాకులకు సహజ గుణాలు.

మచ్చుకి నేను రాజమండ్రి గవర్నమెంటు ఆర్ట్స్ కాలేజిలో బీయస్సీ మొదటి సంవత్సరంలో (1959-60) ఉండగా జరిగిన ఓ సంఘటన...

సాధారణంగా టీనేజిలో అబ్బాయిలకి అమ్మాయిలంటే ఆకర్షణ మొదలవడం సహజం. టీనేజిలోనే అమ్మాయిల్ని అబ్బాయిలకి దూరంగా ఉండేలా ఆంక్షలు విధించే మన సంప్రదాయంవల్ల ఆ ఆకర్షణకు కుతూహలం కూడా జత పడుతుంది. అప్పట్లో ఆడపిల్లలకి చదువు కంటే పెళ్లి ముఖ్యం. చదివే చదువు కూడా పెళ్లికోసమే అన్నట్లుండేది. అందువల్ల కాలేజిలో చదివే ఆడపిల్లల సంఖ్య తక్కువ. అబ్బాయిలూ అమ్మాయిలూ కలిసి మాట్లాడుకోవడమూ తక్కువే. మాట్లాడుకుంటే అదో పెద్ద విశేషం.

ఒంటరిగా కనబడ్డ అమ్మాయిని వ్యాఖ్యలతో వేధించడాన్ని, ఘనతగా ప్రచారం చేసుకునే అబ్బాయిలు కొందరుండడం విద్యాలయాల్లో మామూలే. వారికి వందిమాగధులుండడమూ మామూలే. కిమ్మనకుండా వాళ్ల అల్లరిని భరించడం అమ్మాయిలకూ మామూలే.

మా కాలేజిలోనూ అమ్మాయిల్ని ఏడ్పించడమే ధ్యేయంగా కొందరున్నారు. వాళ్లకి సమాజంలో దుష్టశక్తుల అండ, మద్దతు కూడా ఉంది. అందుకని టీచర్లు కూడా వాళ్ల జోలికి వెళ్లడానికి వెనుకాడేవారు. దుష్టులకు దూరంగా ఉండాలన్న సూత్రం తప్ప అమ్మాయిలకి వారినుంచి తప్పించుకునేందుకు వేరే మార్గం లేదు.

శ్రుతి మించకపోవడంవల్ల, అలాంటివన్నీ కూడా మామూలుగా చెలామణీ ఐపోతున్నాయి.

కానీ ఒకసారి ఆ అల్లరి శ్రుతి మించి రాగాన పడింది.

ఓసారి సైన్సు బ్లాకు కార్నర్లో మేడమెట్ల దగ్గర పియ్యూసీ చదివే ఓ అందమైన అమ్మాయి- ఇద్దరు అల్లరి కుర్రాళ్లకి ఒంటరిగా కనబడింది. వాళ్లకి బుద్ధి వక్రించింది. వెంటనే ఒకడామెకి వెనుక నిలబడ్డాడు. రెండోవాడు ముందుకెళ్లి ఆమె దారికి అడ్డంగా నిలబడి చేతులు అడ్డంగా చాచాడు. ఆమె వెనక్కి తిరిగితే, అదే పోజులో రెండోవాడున్నాడు.

మేకపోతు గాంభీర్యంతో, 'తప్పుకోండి' అని అరిచిందామె.

అంతే, ఒకడు ఆమె భుజంమీద చెయ్యేశాడు.

ఆమెకు వేరే దారి తోచక కెవ్వుమని కేకెట్టింది.

ఆ కేక కొందరు విన్నారు. అటు వెళ్లబోయి ఆ కుర్రాళ్లని చూసి భయపడి వెనక్కి తిరిగారు. కానీ అక్కడేదో జరుగకూడనిది జరుగ నున్నదని క్షణాలమీద సైన్సుబ్లాకంతా గుప్పుమనిపించారు.

అది పవిత్రమైన కాలేజి. సమయం పట్టపగలు. ఆమె ఓ మధ్యతరగతి అమ్మాయి.

వాళ్లు సంస్కారం తెలియని కుర్రాళ్లు.

నిండుసభలో ద్రౌపదికి అవమానం జరగబోతుంటే, అన్యాయంకంటే నియమాలకే ప్రాధాన్యమిచ్చి అసహాయతను ప్రకటించి వాపోయిన కురు గురువృద్ధులున్న మహాభారతం మనది. అప్పుడామెని రక్షించడానికి అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు పూనుకోవాల్సి వచ్చింది.

ఇప్పుడా కృష్ణుడి పాత్రని మా తెలుగు లెక్చరర్ చెరుకుమిల్లి జమదగ్నిశర్మ పోషించాడు. ఆయన నల్లనివాడే కానీ, పద్మనయనాలు లేవు. వేషభాషల్లో తెలుగుతనం ఉట్టిపడుతూండడంవల్ల, ప్రత్యేకమైన గౌరవానికీ, గుర్తింపుకీ నోచుకోనివాడు.

ఆయన అప్పుడు సైన్సు బ్లాకులోనే ఉన్నాడు. విషయం తెలియగానే కింకర్తవ్యం అని చర్చలకు దిగలేదు. 'ఎవడ్రా వాడు?' అంటూ సింహనాదం చేసి తన వయసుకు తగని వేగంతో పరుగు తీసి ఘటనా స్థలాన్ని చేరాడు.

అప్పుడక్కడ 'కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి'తో ఆ కుర్రాళ్లకు కళ్లు బైర్లు కమ్మాయి. 'కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి, నేడు వీరిని జంపుదు నిన్ను గాతు' అన్నట్లు ఆ అమ్మాయికి ఒక చేత్తో అభయమిస్తూనే రెండో చేత్తో ఆ కుర్రాళ్ల చెంపలపై మెరుపుదాడి చేసి, వాళ్లని భయభ్రాంతుల్ని చేశాడు.

ఎంత తప్పు చేసినా కాలేజి కుర్రాళ్ల జోలికి వెళ్లడమంటే అగ్నికుండంలో దూకడమే. ఆ పని అదీ ఓ టీచరు, అదీ ఓ తెలుగు టీచరు చెయ్యడాన్ని 'సాహసమా, వట్టి సాహసమా?' అనుకోవాల్సిందే.

ఆ తర్వాత చాలామంది ఆ అమ్మాయికి తప్పిన అవమానం గురించి కాక, జమదగ్ని మేస్టారికి ఏమౌతుందోనని కలవరపడ్డారు. కానీ జరిగిందేమిటంటే– ఆతర్వాతనుంచి జమదగ్ని మేస్టారు కనబడితే చాలు– కుర్రాళ్లు దూరంనుంచే చేతులు జోడించి పక్కకు తప్పుకునేవారు. 'తప్పు చేస్తే చెయ్యండి. కానీ దగ్గర్లో తెలుగు మేస్టారున్నారేమో చూసుకోండి' అన్నది నానుడిగా విద్యార్థుల్లో ప్రబలమై అబలలకు వరమైంది.

భాషని ప్రేమించడం వేరు. భాషనే ప్రేమించడం వేరు. అదీ నాటి తెలుగు టీచర్ల వ్యక్తిత్వబలం.

ఇప్పుడు తెలుగు టీచర్లలో అలాంటివాళ్లున్నారో లేరో తెలియదు కానీ– నేటి మన కవులు, పండితులు, ప్రవచనకారులు ఆ కోవకు చెందినవారేననిపిస్తుంది.

ఇప్పుడు మమ్మల్ని చూసి, 'అనుకున్నాను. మీరు తెలుగువాళ్లేనని?' అన్న వ్యక్తి తెలుగు ఉచ్చారణ– నాకు నాటి తెలుగు టీచర్లని స్ఫురణకు తెచ్చి, మనసుని పులకరింపజేసింది.

అక్కడే ఆగి కాస్త పక్కకు వెళ్లి పరస్పరం పరిచయాలు చేసుకున్నాం.

అతడి పేరు శ్రీధరబాబు. వయసు నలభై పైనే కానీ ఇంకా పెళ్లి కాలేదు.

తెలుగులో పిహెచ్‌డి చేశాడు. వెంకటేశ్వరా యూనివర్సిటీలో తెలుగు డిపార్టుమెంట్లో రీడరు.

తను కవి, రచయిత కూడా. తను వ్రాసిన ఉపనిషత్కథలు పుస్తకాన్ని ఎమెస్కో పాకెట్ బుక్స్ వారు ప్రచురించారు.

నేను సైంటిస్టుననీ, శ్రీమతి గృహిణి అనీ చెప్పాను. రచయితలమని చెప్పలేదు.

"తెలిసినవారు నన్ను కవిబాబు అంటారు. మీరూ ఆ తెలిసినవాళ్ల జాబితాలో చేరొచ్చు" అన్నాడతడు.

నా అభిప్రాయంలో రచయితలు వేరు, కవులు వేరు. రచయితల ఆలోచనలు వాస్తవాల చుట్టూ తిరుగుతూ అవగాహనకు ప్రయత్నిస్తాయి. కవుల ఆలోచనల్లో– వాస్తవం కూడా భావుకతను నింపుకుని ఊహాప్రపంచంలో నడయాడుతుంది. అందువల్ల కవులు రచయితల్లా కాక, విభిన్నంగా, విలక్షణంగా ఉంటారు. వారి విశిష్టత అర్థం కానివారికి వివాదాస్పదులో, పరిహాసాస్పదులో ఔతారు.

నాకు రచనావ్యాసంగంలో ఉన్నవారితో వ్యక్తిగత పరిచయాలు అంతగా లేవు. కవులతో ఐతే బొత్తిగా లేవు.

"బెర్లిన్లో ఒక తెలుగు కవి మాట వినే అదృష్టం కల్పించారు. థాంక్స్" అన్నాను.

అతడు వెంటనే, "మీరు థాంక్సు చెప్పారు. బాగుంది. మరి మీకు థాంక్సు చెప్పే అవకాశం నాకివ్వరా?" అన్నాడు.

"మీరు కవి. భాషమీద పట్టున్న పండితులు. మేం మామూలు మనుషులం. మీచేత థాంక్సు చెప్పించుకునేటంత భాషాప్రావీణ్యం మాకు లేదు" అన్నాను.

అతడు నవ్వి, "దూరాన్నుంచి చూసినా, తెలుగుతనం ఉట్టిపడే కుటుంబం మీది. మీలాంటివాళ్ల ఇంటికొచ్చి, ఆతిథ్యం స్వీకరించి థాంక్సు చెప్పడం నాకిష్టం. అవకాశం మీరివ్వాలంతే! మీ ఇంటికెప్పుడొచ్చేది?" అన్నాడు.

తెల్లబోయాను. ఇంటికొస్తానని ఇంత సూటిగా, ఇంకా చెప్పాలంటే పచ్చిగా చెప్పేవారు నాకు బెర్లిన్లో తగుల్తారని అనుకోలేదు.

తటపటాయిస్తే బాగుండదు కదా, "అంతకన్నానా, రేపే రండి!" అన్నాను.

శ్రీమతి చటుక్కున, "రేపు మీకు ఆఫీసుంది కదా!" అంది. దానికి నేనేదో అనేలోగా, "దాందేముందీ, సాయంత్రమొస్తాను. ఐదింటికల్లా మీరు ఆఫీసునించొచ్చేస్తారుగా. నేను ఆరింటికొస్తాను. మీకు వీలేగా!" అన్నాడు కవిబాబు.

తలాడించాను. అప్పటికి విడిపోయాం.

ఇంటికెళ్లేక, "అతణ్ణి మరీ రేపే రమ్మని చెప్పేశారేమిటి?" అని శ్రీమతి నన్ను దెబ్బలాడింది.

"గీతలో కృష్ణుడేమన్నాడు– 'చేసెడి వాడను నేనే, చేయించెడివాడను నేనే' అనేగా. ఇక్కడ మన కవిబాబు కృష్ణుడు, నేను పార్థుడు. పిలిచింది నేను కాదు. అతడు పిలిపించుకున్నాడంతే!" అన్నాను.

శ్రీమతి మాట్లాడలేదు. కవిబాబు తనకి తానుగా మా ఇంటికొస్తానడం ఎబ్బెట్టుగా అనిపించిందేమోనని అనుమానమొచ్చి, "ల్యూనబర్గులో ఉండగా, ఇంట్లో వంట సదుపాయం లేక, మన తిండి కోసం ఎంత మొహం వాచిపోయానో ఉత్తరాల్లో నీకు వ్రాశాను. అడగడానికి నాకు మొహమాటమని తెలిసి, అక్కడున్నవాళ్లలో వంట సదుపాయమున్న భారతీయులందరూ నన్ను బలవంతపెట్టి మరీ వాళ్లిళ్లకి పిలిచి విందు చేసేవారు. వద్దొద్దని పైకి అన్నప్పటికీ మనసులో వాళ్ల పిలుపులకోసం ఎదురుచూసేవాణ్ణి. బహుశా కవిబాబుదీ అదే పరిస్థితేమో! పాపం, నోరు విడిచి మరీ అడిగేడని జాలేసి, రేపే రమ్మన్నాను. ఐనా ఎలాగూ ఎప్పుడో ఓసారి పిలుస్తాంగా, అది రేపైతేనేం..." అని ఏదో అనబోతుండగా....

"అందుకే, మంచి తెలుగు వంట ఏదైనా చేసిపెట్టాలనుకున్నా. ప్రస్తుతానికి ఇంట్లో ఉప్మా నూక తప్ప ఇంకేం లేదు...." అంది శ్రీమతి.

తెలుగు ఆడవాళ్లంతా డొక్కా సీతమ్మ అంశను ఎంతో కొంత తమలో ఇముడ్చుకున్న అన్నపూర్ణలు. తను కవిబాబు రాకకంటే ఎక్కువగా, తన ఆతిథ్యం అతడికిచ్చే సంతృప్తి గురించి అతడివైపునించి ఆలోచిస్తోంది.

"దాందేముంది? టమేటాలు కూడా ఉన్నాయిగా, టమేటా బాత్ చెయ్యి. సెనగపప్పు చట్నీ నీ స్పెషాలిటీ" అన్నాను.

"అదికాదండీ! ఆతిథ్యం విషయంలో అతడికేవో అంచనాలున్నట్లుంది. వాటిని అందుకోగలమా అని నా అనుమానం" అంది శ్రీమతి.

"మనమేమన్నా ఇండియాలో ఉన్నామా? ఇది జర్మనీ. ఇక్కడ తెలుగు వంటకం దొరకడమే ఓ అదృష్టం. మన వల్లనైంది మనం చేద్దాం" అనేసి ఆ సంభాషణకి అంతటితో ఫుల్‌స్టాప్ పెట్టాను.

మర్నాడు సాయంత్రం కరెక్టుగా ఆరింటికి కవిబాబు మా ఇంటి కాలింగ్‌బెల్ మ్రోగించాడు. నేను తలుపు తియ్యగానే, "సారీ అండీ, ఎంత ప్రయత్నించినా పంక్చ్యువాలిటీలో భారతీయత పాటించలేకపోయాను. జర్మనీ నీళ్ల ప్రభావం అనుకోవాలి" అన్నాడు.

బాగా ప్రిపేరైన డైలాగు అప్పగించినట్లుంది. సరదాగా మాట్లాడాలన్న తాపత్రయమేమో అనుకుంటూ, "వీళ్లు బీరే కానీ నీళ్లు తాగరుగా, మరి మీపై ప్రభావం చూపినవేమిటో?" అన్నాను. మనసులో మాత్రం నేనూ అతడిలాగే తాపత్రయపడ్డం లేదు కదా అని శంక!

"వాళ్లిళ్లకెడితే బీరు వదులుకోలేం. మనవాళ్ల ఇళ్లకెళ్లినప్పుడు బీరు అడగలేం. అందుకని రెండలవాట్లూ కొనసాగిస్తున్నా" అన్నాడతడు. ఈ మాట ప్రిపేరవకుండానే అన్నాడు కాబట్టి, మొదటి అభిప్రాయాన్ని కాస్త సవరించుకోవాలని అనుకున్నాను. కానీ, మాటల్లో తరచుగా వంటకాలో, పానీయాలో చోటు చేసుకోవడాన్నీ మనసు పసి కట్టింది.

ఇద్దరం లోపలకెళ్లాం. పది నిముషాలు అవీ ఇవీ మాట్లాడుకున్నాక నాకూ, అతడికీ ప్లేట్లలో టమేటాబాత్ తెచ్చిచ్చింది శ్రీమతి.

"మరి మీరూ, పిల్లలో?" అన్నాడతడు వెంటనే.

"వాళ్లకి సరిగ్గా తినడం రాదు. కిందామీదా పోసుకుంటారని మేమే నోట్లో పెడతాం. వాళ్లూ, తనూ– అదిగో, అక్కడ మంచానికి దగ్గర్లో కూర్చుంటారు. మనమిక్కడ కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం కానిద్దాం" అన్నాను.

పాపకి పౌరుషమొచ్చినట్లుంది, "కిందామీదా పోసుకునేది తమ్ముడు. నేను కాదు" అని అభ్యంతరపెట్టింది. దాంతో తమకేదో అవమానం జరిగినట్లు బాబుకీ అనిపించినట్లుంది, "తిందామీదా నేనూ పోచుకోను" అన్నాడు.

నిజానికి మా పిల్లలిద్దరూ కూడా మాతోపాటు మా పక్కనే కూర్చుని భోంచేస్తారు. కింద మెతుకు కూడా పడదు. ఎప్పుడైనా నేలమీద కార్పెటుపైన చిన్న మెతుకు కనబడితే, అది నాదేనని వాళ్లు తేల్చేస్తారు. శ్రీమతి వాళ్లకు వత్తాసు. అబద్ధమెందుకూ, వాళ్ల మాటల్లో కొంత నిజమూ లేకపోలేదు.

కవిబాబు నన్నదోలా చూసి, "ఎవరింటికెళ్లినా, వాళ్లలో ఒకరిగా కలిసిపోవాలి. లేకుంటే వాళ్లకి బోరు కొట్టి మళ్లీ రమ్మనరు. నేనైతే ఎవరింటికెళ్లినా ముందు పిల్లలతో కలిసిపోతాను. ఎందుకంటే అతిథుల రాకతో బోరు కొట్టేది వాళ్లకే మరి!" అని సైగ చేసి పిల్లల్ని పిలిచాడు. వాళ్లు కాస్త మొహమాటంగా తనని సమీపించగానే, "మనం కలిసి టిఫిన్ చేద్దామా?" అన్నాడు.

అనుకోకుండా లభించిన ప్రాధాన్యత వాళ్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. సరేనన్నారు. ఆ వెంటనే కవిబాబు స్పూన్లు కావాలన్నాడు. శ్రీమతి మా ఇద్దరికీ రెండు చెంచాలు తెచ్చిస్తే, పిల్లలకీ కావాలన్నాడు.

"వాళ్లకి చెంచాలు వాడ్డం రాదు" అనేసి పాప మొహం చూసి నాలిక్కరుచుకున్నాను. అదప్పుడే నన్ను కోపంగా చూస్తోంది.

"తినేటప్పుడు మధ్యలో నీళ్లకి బదులు బీరు తాగకపోయినా ఫరవాలేదు. కానీ తినడానికి చెంచాలు వాడడంలో మనం ఇక్కడివాళ్లని అనుసరించాలి. అది చాలా మంచి పద్ధతి. చేతులు ఎంగిలవవు. చూడ్డానికీ బాగుంటుంది" అని పిల్లలవైపు తిరిగి, "చెంచాతో తినడం ఎంత సులువో, ఎంత బాగుంటుందో మీకు నేనిప్పుడు చూపిస్తాను" అన్నాడు.

అప్పటికే తనకి చెంచాతో తినడం వచ్చని పాపకి నమ్మకం. కానీ అతడేం చూపిస్తాడోనన్న కుతూహలం ఆ అహాన్ని అణిచేయగా, "దారా" అంది తమ్ముడితో.

పాప, బాబు ఉప్మా ప్లేట్లు పట్టుకుని అతడికి చెరో పక్కా చేరారు.

కవిబాబు రెండు చేతుల్లోకీ రెండు చెంచాలు తీసుకున్నాడు. వాళ్ల ప్లేట్లలో పెట్టి కొద్దిగా ఫలహారం చెంచాల్లోకి తీసి, "ఇలా తీసుకోవాలి" అన్నాడు. తర్వాత వాళ్ల నోళ్లలో పెడుతూ, "ఇలా తినాలి" అన్నాడు.

మేము కూడా అతడి చేతుల కదలికనే కుతూహలంగా చూస్తున్నాం. ఐతే చెంచాలు పిల్లల నోళ్లలోకి బదులు ముక్కుల్లోకీ, బుగ్గలమీదకీ, ఇంకా కళ్లమీదకీ కూడా వెళ్లిపోతున్నాయి. పిల్లలు చెంచాల్ని నోళ్లతో అందుకుందుకు మొహాల్ని పైకీ కిందకీ పక్కలకీ కదుపుతూ అవస్థ పడుతున్నారు.

అలా ఎందుకు జరుగుతోందా అని కవిబాబుని చూస్తే అతడు పిల్లల మొహాలకేసి చూడ్డం లేదు. మా మొహాలే చూస్తున్నాడు. అతడి కళ్లు తన నైపుణ్యానికి మానుంచి మెప్పుని కోరుతున్నాయి.

మనస్తత్వాలే కథాంశాలుగా రచనావ్యాసంగానికి దిగినవాణ్ణి. పిల్లలకు నేర్పడంకంటే, మా మెప్పుకే అతడి ప్రాధాన్యమని గ్రహించినవాడనై, "పిల్లలూ, అంకుల్ భలే చెప్పారుగా, ఇక మీకు మీరుగా చెంచాలు వాడి టిఫిన్ తినెయ్యండి" అని వాళ్ల మొహాల్ని రక్షించాను.

కవిబాబు చెంచాల్ని పిల్లల ప్లేట్లలో వదిలాడు. వాళ్లా ప్లేట్లు తీసుకుని అక్కణ్ణించి అతడికందనంత దూరంగా వెళ్లిపోయారు.

నేను, శ్రీమతి, కవిబాబు టేబుల్ దగ్గర కూర్చున్నాం. నాటికి పిల్లలతో కలిసిపోయే విషయంలో తన డిమాన్‌స్ట్రేషన్ ఐపోవడం వల్లనేమో, కవిబాబు పిల్లల్ని టేబుల్ వద్దకు రమ్మని నొక్కించలేదు.

అప్పుడతడు ఫలహారాన్ని పరీక్షగా చూసి, "అందంగా కనబడాలని ఎర్రని టమేటాల్ని అలంకరించుకుంది ఉప్మా. కానీ ఆ అందాన్ని మనం కంటితో కాదు, నోటితో అస్వాదిస్తామని దానికి తెలియదు పాపం!" అన్నాడు.

అతడిలో కవి ఉన్నాడు. కవి ఎక్కడున్నా అనుక్షణం స్పందిస్తూనే ఉంటాడు.

నేను వెంటనే, "మీరు కవిత్వంతో ఫలహారాలకి కూడా ప్రాణం పోస్తే– శాకాహారులం, మనకి తినడానికేముండవు" అన్నాను.

అతడు ఫలహారం ఓ స్పూను రుచి చూసి, "ఒకప్పుడు నేనూ మీకులాగే ఆలోచించేవాణ్ణి తెలుసా?" అన్నాడు.

"నాకులా అంటే?" అన్నాను అర్థం కాక.

"టమేటాబాత్ చాలా బాగుంది. ఇంకో రెండు చెంచాలు రుచి చూసి అప్పుడు చెబుతాను" అన్నాడు. తర్వాత ఫలహారం సేవిస్తూ, అతడు చెప్పినదిది.

కవిబాబు శాఖాహారి. శ్రీవైష్ణవుడినని నిస్సంకోచంగా చెబుతాడు.

అతడి మిత్రుల్లో మాంసాహారులున్నారు. కలిసి భోంచేసేటప్పుడు– మాంసాహారాన్ని చూసినప్పుడల్లా, అతడికి ఆహారానికి బదులు ఆ ప్రాణి గుర్తుకొచ్చేది. దాన్ని వర్ణిస్తూ ఓ కవిత చెప్పేవాడు.

అలా ఒకటి రెండుసార్లు జరిగేక, అతడి మిత్రుడొకడు, "నీ ప్లేట్లో వంకాయ కూర చూస్తుంటే– ఈ పద్యం గుర్తొస్తోంది" అని ఘంటసాల పుష్పవిలాపం తరహాలో కవితలు చదివేట్ట. వాటినిప్పుడు కవిబాబు చదివి వినిపించాడుః

'నేనొక వంగమొక్క కడ నిల్చి, చివాలున కొమ్మవంచి, గోరానెడు నంతలోన
చిరుపిందెలు జాలిగ నోళ్లు విప్పి మా ప్రాణము తీతువా యనుచు బావురుమన్నవి, నా మానసమందెదో తళుకుమన్నది వంగవిలాపకావ్యమై'

'కత్తిపీటని వాడి నరికి నరికి, కారాన్ని తనువంత పూసి పూసి, మరుగు నూనెలోన ముంచి ముంచి, వేపి తిందురు ముచ్చట మీరు మమ్ము...."

కవిబాబు గొంతు గంభీరమైనది. లోతైనది. భావప్రకటనలో ఆరితేరినది. అతడి నోట ఆ కవితలు వింటుంటే– వంకాయలు సజీవంగా మాముందు నిలబడి తమ వేదన చెప్పుకున్నట్లే అనిపించింది. నేను, శ్రీమతి కూడా ఆ కవితలు విని చలించిపోయాం. జీవితంలో మళ్లీ వంకాయ కూర తినగలమా అనిపించింది నాకు.

కవిబాబుకి మా పరిస్థితి అర్థమైనట్లుంది, "అప్పటికి అర్థమైంది నాకు. ఆహారం నిర్జీవమే కానీ, జీవి మనుగడకి అత్యవసరం. మనుగడకి ఎవరి ఆహారపు అలవాట్లు వాళ్లవి. మాంసాహారంలో హింస ఉన్నదన్న భావననుంచి తప్పించుకుందుకు, నేను శాకాహారాన్ని చూసినప్పుడల్లా వంగవిలాప గేయాల్ని గుర్తు చేసుకుంటాను. నా ఎదుటనున్న ఫలహారంలో జీవాన్ని నింపుతాను" అన్నాడు కవిబాబు.

శ్రీమతికీ భావన నచ్చలేదు, "అందువల్ల, తినే ఆహారాన్ని కూడా ఎంజాయ్ చెయ్యలేకపోవడం తప్ప ఏమిటి ప్రయోజనం?" అంది.

"మీవారు సైంటిస్టు. మనం పీల్చే గాలిలో, తాగే నీళ్లలో కోట్లాది సూక్ష్మజీవులుంటాయని తెలుసు కదా! మనం వేసే ప్రతి అడుగుకిందా కంటికి కనిపించని జీవాలెన్నో మరణిస్తాయని తెలుసు కదా! అలాగని మనం అన్నీ మానుకోగలమా? పక్వాహారాన్ని ఆహారంగానే స్వీకరించి ఆనందించడం నేర్చుకోవడానికి, వంగవిలాపం సహకరిస్తుంది" అన్నాడతడు.

ఇప్పటికే కులం, మతం, భాష, రంగు వగైరా భేదాలతో మనిషిని మనిషినుంచి వేరు చేస్తున్నాం. మనుగడకి అత్యావశ్యకమైన ఆహారం కూడా అలాంటి అంశంలో జతపడకుండా– ఈ భావన సహకరిస్తుందని అతడి అభిప్రాయం.

నేనతణ్ణి మెచ్చుకున్నాను. శ్రీమతి మాత్రం, "నాకు మాంసాహారులంటే చిన్నచూపు లేదు, నిరసనభావం లేదు. మేముండే ఒరిస్సాలో బ్రాహ్మణులూ మాంసాహారులే. మేమంతా కలిసి విందులు చేసుకుంటాం. మరి నాకూ ఇలాంటి భావన అవసరమా?" అంది.

ఆ మాట తర్వాత ఫలహారసేవనం క్షణాలమీద ముగిసింది. శ్రీమతి వంటింట్లోకి వెళ్లి అతడికోసం కాఫీ కలిపి తెచ్చింది.

అతడు కప్పందుకుని అది కాఫీ అని గ్రహించి, "ఇదేమిటి– కాఫీ తెచ్చారు?" అన్నాడు.

"మీరూ కాఫీ తాగరా?" అన్నాను ఆశ్చర్యంగా.

"కాఫీ తాగకేం, నిక్షేపంలా తాగుతాను. కానీ అప్పుడేనా?" అన్నాడతడు.

గొంతు కటువుగా ధ్వనించి ఆశ్చర్యపడి, అతడి మొహం చూస్తే కళ్లలో ఎరుపు జీర.

ఎందుకో నాకతడప్పుడు నిగ్రహించుకుందుకు ప్రయత్నిస్తున్న దుర్వాసుడిలా కనిపించాడు.

కవిబాబుకి అంత కోపమెందుకొచ్చిందో అర్థం కాక తికమకపడ్డాను. కానీ శ్రీమతికి అర్థమైనట్లే ఉంది.

ఆమె గొంతు సవరించుకుని, "చాలా ఏళ్లుగా కాఫీ కలుపుతున్నాను. ఐనా ఇంటికొచ్చినవాళ్లకి కాఫీ ఇవ్వాలంటే ఎప్పుడూ బెదురే నాకు. ఎందుకంటే మేమెవరం కాఫీ తాగం కదా! రుచి చూడకుండా అతిథులు మెచ్చేలా కాఫీ పెట్టాలని నాకు మనసు. పెడతానని నమ్మకం కూడా. అలాగని నేననుకుంటే సరిపోదు కదా, ఎదుటివాళ్లనాలి. అందుకే, అసలు మీరు ఇంటికి రాగానే ముందు కాఫీ ఇచ్చెయ్యాలని మనసు తెగ పీకింది. కానీ మొదటి ఐటమే, షేర్ చేసుకోనిదైతే ఎలా అని కూడా అనిపించి, మనసుకి నచ్చజెప్పాను. మీరు కాఫీ తాగండి. మన నెక్స్ట్ టాపిక్ కాఫీ. దాని గురించి బోలెడు కథలు, కబుర్లు చెప్పుకోవచ్చు. ఆపైన నా కాఫీపై మీ అభిప్రాయం చెప్పి, సూచనలుంటే ఇవ్వండి. నాకవి చాలా విలువైనవి" అంది.

ఆశ్చర్యంగా ఆమెని చూశాను. అంతగా పరిచయంలేని ఓ కొత్త మనిషితో, తనంత ధారాళంగా మాట్లాడగా చూడ్డం అదే ప్రథమం నాకు.

స్వతహాగా మితభాషి. కొత్తవాళ్లముందైతే ఎంతో అవసరమైతే తప్ప నోరే విప్పదు. ఇప్పుడు అవసరానికి మించి ఇంతలా మాట్లాడిందంటే అందుకు ఏదో పెద్ద కారణముండి ఉండాలి. అది తర్వాత అడిగి తెలుసుకోవాలనుకుని, ఆమె మాటలకు కవిబాబు స్పందన ఎలాగుందోనని చూస్తే– అతడామె మాటలకు సంతృప్తుడై శాంతుడైనట్లు అనిపించింది.

కాఫీ చప్పరించడం మొదలెట్టాడు.

"పంచదార సరిపోయిందా?" అడిగింది శ్రీమతి.

"కాఫీకి రుచి ఇచ్చేది పంచదార కాదు. అది ఎక్కువైనా, తక్కువైనా, అసలు లేకపోయినా కూడా– కాఫీ రుచి కాఫీ మీదే ఆధారపడి ఉంటుంది. అదీ కాఫీ ప్రత్యేకత. ఈ కాఫీ బాగుంది" అన్నాడు కవిబాబు.

"అంటే పంచదార సరిపోయినట్లు లేదు. వంటింట్లోకెళ్లి పంచదార డబ్బా తెస్తాను" అంటూ లేచింది శ్రీమతి.

కవిబాబు వెంటనే కాఫీ కప్పు బల్లమీద పెట్టాడు– పంచదారకోసం ఆగుతాననిపించేలా.

శ్రీమతి అక్కణ్ణించి వెడుతూ, నాకు మాత్రమే అర్థమయ్యే సైగల ద్వారా నన్నూ రమ్మని చెప్పి వెళ్లిపోయింది.

నేను వెంటనే, "అయ్యో, పంచదార డబ్బా ప్లేస్ మార్చాను. చెప్పాలి" అంటూ లేచి గదిలోంచి బైటకెళ్లాను.

నేననుకున్నట్లే, "పంచదారకోసం అన్నదో వంక. మీకో విషయం చెప్పాలని ఇక్కడికి రమ్మన్నాను" అంది కిచెన్లో శ్రీమతి.

"ఏమిటా విషయం?" అడిగాను ఆశ్చర్యంగా.

"కవిబాబుకి మన ఆతిథ్యం చాల్లేదు. టమేటాబాత్ తర్వాత ఇంకా ఐటమ్సు ఉన్నాయని ఆశించాడు. కాఫీ తేవడంతో అక్కడితో, ఫలహార కార్యక్రమం ముగిసిందని అర్థమై అప్సెట్టయ్యాడు" అంది శ్రీమతి వంటగదిలో.

ఇలాంటివి ఆడవాళ్లు ఇట్టే పసి కట్టేస్తారనుకుంటాను. తను చెప్పేదాకా నాకు తట్టనే లేదు. తను చెబితే నిజమేననిపించింది.

అదే చెప్పి, "మనకతడు చుట్టమా, పక్కమా? ఇంటికొస్తే ఇంతకంటే ఎంచెయ్యగలం? ఇతడు చిత్రమైన మనిషిలా ఉన్నాడు. ఇంతవరకూ ఎవరూ ఇలా అప్సెట్టయినట్లు లేదు" అన్నాను.

"ఒకొక్కరు ఒకోలా ఉంటారు. ఇతడికి తిండిపుష్టి ఉన్నట్లుంది. మన తిండికోసం మొహంవాచి ఉన్నా ఆశ్చర్యం లేదు. అందుకే చప్పున బయటపడిపోయాడు. అందుకే నేనతడికి కాఫీ గురించి కాస్త ఎక్కువ మాట్లాడి సంజాయిషీ ఇస్తున్నట్లు మాట మార్చాను. దాంతో అతడికీ తన పొరపాటూ, తొందరపాటూ అర్థమై, సద్దుకునేందుకు వీలౌతుందనుకున్నాను" అంది శ్రీమతి.

ఆడవాళ్లది అమృతహృదయం. ఆమె అతణ్ణి తప్పు పట్టలేదు. అర్థం చేసుకుంది.

"మరి మనమిప్పుడేం చెయ్యాలి? భోజనానికి ఉండిపోమందామా?" అన్నాను.

శ్రీమతి తల అడ్డంగా ఊపి, "ఏదో ఇంత చారూ అన్నం పెడితే, అతణ్ణి మరింత అసంతృప్తికి గురి చేసినవాళ్లమౌతాం. విధం చెడ్డా ఫలం దక్కదు. పోనీ అని ఘనంగా విందుభోజనం పెడదామా అంటే, ఇప్పటికిప్పుడు వీలయ్యేది కాదది" అంది.

"సరే, ఏంచేస్తాం? ఇలాంటప్పుడు ఊరుకోవడమే ఉత్తమం" అన్నాను.

శ్రీమతి మళ్లీ తల అడ్డంగా ఆడించి, "మనింటికొచ్చిన మనిషి ఇలా అసంతృప్తిగా వెళ్లడం నాకు బాగా లేదు. మీరతణ్ణి మరోసారి మనింటికి రమ్మని పిలవండి. ఆ పిలుపెలా ఉండాలంటే, అతడీరోజు కూడా తృప్తిగా ఇంటికెళ్లాలి. అది మీకు వెన్నతో పెట్టిన విద్యేగా" అంటూ చిన్నకప్పులో కొన్ని పంచదార క్యూబ్సు వేసి, అందులో ఫోర్‌సెప్సు ఉంచింది.

ఆమె బాధ అర్థమైంది. ఆమె సూచన కూడా నాకు నచ్చింది. ఇద్దరం మళ్లీ మా గదిలోకెళ్లాం.

శ్రీమతి కప్పు అతడిముందు పెట్టి, తనూ కుర్చీలో కూర్చుంది. నేను తన పక్కనే కూర్చున్నాను.

అప్పుడు కవిబాబు కప్పు తీసుకుని మళ్లీ కాఫీ నెమ్మదిగా చప్పరిస్తున్నాడు. ఐతే పంచదార వేసుకోలేదు.

అతడు కాఫీ తాగడమయ్యేదాకా కాసేపు మామధ్య మౌనం.

కవిబాబు కప్పు బల్లమీద పెట్టి, "కాఫీ చాలా గొప్పగా, ఆస్వాదించేలా ఉంది. వేరేలోకం లోకి వెళ్లిపోయాను" అన్నాడు.

"మర్యాదకి అలా అంటున్నారు" అంది శ్రీమతి మొహమాటంగా.

"బాగోలేనివాటిని మర్యాదకి కూడా మెచ్చుకోకూడదు. నాకిలాగే ఇష్టమనుకుని మళ్లీ మళ్లీ అలాగే చేస్తారు. తరచుగా మీ ఇంటికి రావాలనుకునే నాకదో ఇబ్బంది" అని నవ్వి, "మీ కాఫీ పెర్‌ఫెక్ట్. పంచదారతో సహా అన్నీ ఎంత పడాలో అంతే పడ్డాయి. అందుకే మీరు పంచదార తెస్తానంటే వద్దనలేదు. ఎందుకంటే, ఎదుట పంచదార వేసుకునే అవకాశమున్నాకూడా వేసుకోకపోతే– పంచదార సరిపోయిందని మీకు నమ్మకం కలుగుతుంది. అతిథిని సంతోషపెట్టాలని గృహస్థులకు ఉన్నట్లే, గృహస్థుల్ని సంతోషపెట్టాలని అతిథికీ ఉంటుంది మరి" అని గొప్పగా శ్రీమతి వంక చూశాడు కవిబాబు.

అతడూ ఇందాకటి తన అకారణ అసహనాన్ని దిద్దుకునే ప్రయత్నం చేస్తున్నాడని గ్రహించి, 'మాటకారే' అనుకున్నాను. ఆ మాటకారితనంతోనే తను మా ఇంటికి మళ్లీ మళ్లీ వస్తుంటానని కూడా సూచించాడు.

శ్రీమతి చెప్పింది చెయ్యడానికి ఆ సూచన నాకు సహకరించింది. నేను గొంతు సవరించుకుని, "పనిమీద ఈ దేశానికొచ్చినవాళ్లం. మనకా పనితోనే సరిపోతుంది. మళ్లీ మళ్లీ కలుసుకోవడం ఎక్కడ కుదురుతుందిలెండి" అని ఆగాను.

ఎదుటివాడికి నెగెటివ్ సంకేతాలు పంపినప్పుడే, తర్వాత వెళ్లే పాజిటివ్ సంకేతాలు మంచి కిక్ ఇస్తాయి. అదో టెక్నిక్కు.

నేను మాట ఆపగానే, కవిబాబు మొహంలో నేనూహించిన ఇబ్బంది కనిపించింది.

నేను తృప్తిపడి, "కానీ– ఈరోజు ఏదో పరిచయానికన్నట్లు కలుసుకున్నాం. మాది పిలుపూ కాదు, మీది విజిట్టూ కాదు. మనమోసారి పూర్తిగా ఓ పూటంతా సరదాగా గడిపేలా కలుసుకోవాలనుంది. మీరు కాదనకుండా వీలు చేసుకోవాలి" అని అభ్యర్థించాను.

కవిబాబు మొహం వికసించింది, "నాకు పని ఒత్తిడి ఎక్కువని చాలా కరెక్టుగా గ్రహించారు. ఐనా మనసుంటే మార్గముంటుంది. తొందర్లోనే మళ్లీ ఎప్పుడొచ్చేదీ మీకు చెబుతాను. కానీ ఉన్నంతసేపూ ఇలా ఇంట్లో కూర్చుని కబుర్లాడ్డానికి కాదు. మధ్యలో ఓసారి మనకి దగ్గర్లోని యాత్రాస్థలానికి వెడదాం. అలాంటివి ఫ్రెండ్సుతో చూస్తే ఎక్కువ బాగుంటాయి" అన్నాడు.

"చాలా బాగుంది. కానీ ఇక్కడికి దగ్గర్లో యాత్రాస్థలాలేమున్నాయ్" అన్నాను.

"అదేంటండీ, మీరున్న లొకేషన్ చుట్టూ యాత్రాస్థలాలే. వాటికి వెతుక్కోవాలా? నాకైతే మీ ఇల్లే ఒక యాత్రాస్థలం" అన్నాడు కవిబాబు.

"మీ కాంప్లిమెంటుకి థాంక్సు. మా ఇల్లు కాక మరొక్కటి చెప్పండి" అన్నాను.

"ఇప్పటికి ఒక్కటే చెబుతాను. చార్లోటెన్‌బర్గ్ పాలేస్" అన్నాడతడు.

మా ఇంటికి నాలుగు నిముషాల నడక దూరంలో డాయిచే ఓపర్ ఊబాన్‌హాఫ్ ఉంది. అక్కడికి కంటికి కనిపిస్తూంటుంది చార్లోటెన్‌బర్గ్ పాలేస్. రోడ్డు పక్కనే ఉండడంవల్ల చాలాసార్లు చూశాం ఆ భవనాన్ని. అదో యాత్రాస్థలమని ఎప్పుడూ అనుకోలేదు.

"ఏమిటి– దాని స్పెషాలిటీ" అన్నాను.

"మీరెప్పుడూ టూరిస్ట్ గైడ్ పుస్తకం చూడలేదా? అందులో మొదటి రెండు పేజీల్లోనే ఉంటాయి దాని వివరాలు" అన్నాడు కవిబాబు.

పాశ్చాత్యుల ప్రత్యేకత అదే!

మనూళ్లో వెయ్యేళ్ల క్రితం గుడి ఉంటే, మామూలుగా దర్శనం చేసుకొచ్చేస్తాం మనం. వాళ్లకి తాతలనాటి ఇల్లు వందేళ్లక్రితందైతే చాలు– అదో టూరిస్ట్ అట్రాక్షన్.

ఆ మాట చెప్పి నవ్వేస్తే, "అలా తేలిగ్గా తీసెయ్యకండి. ఈ భవంతికి గొప్ప చరిత్ర ఉంది" అన్నాడు కవిబాబు.

అప్పుడు కవిబాబు మాకేం చెప్పాడూ, ఆ భవంతిలో మేమేం చూశాం అన్న విశేషాలు ఇప్పటివాళ్లకి గూగుల్ లెక్కల్లో దొరికేస్తాయి. అందుకని వాటి జోలికి ఇప్పుడు వెళ్లడం లేదు.

ఓ ఆదివారం ఉదయం కవిబాబు ఎనిమిదిలోగా మా ఇంటికొచ్చాడు. అప్పటికి మేము వంట పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నాం.

దోశల ఫలహారం, కాఫీ అయ్యేక అంతా కలిసి నడుచుకుంటూ వెళ్లి పది నిముషాల్లో ఆ భవనం చేరుకున్నాం.

బయటికి అందమైన ఓ పెద్ద భవనంలా కనబడినా లోపల చాలా పెద్ద ఆవరణ ఉంది. చుట్టూ ఓ పెద్ద తోట. దాన్నానుకుని అందమైన చిన్న అడవి. లోపల ఓ మ్యూజియం.

ఐతే ఆ రోజు వాతావరణం అంత అనుకూలంగా లేదు. ఈదురుగాలి. ఓవర్‌కోట్లు వేసుకున్నాం కానీ చెంపలకు తగిలితే ప్రాణం జిల్లార్చుకు పోయేటంత చలి. వీలైనంతవరకూ జేబులు చేతుల్లోంచి తియ్యడంలేదు.

ఆ వాతావరణంలోనూ జనం తండోపతండాలుగా ఉన్నారక్కడ. కనీసం నాలుగు టూరిస్టు బస్సులు పార్కు చేసి ఉన్నాయక్కడ.

ఆ మాట నేనంటే, కవిబాబు గొప్ప మొహం పెట్టాడు. మమ్మల్ని అక్కడకు తీసుకొచ్చిన ఘనత తనదే కదా మరి.

పిల్లలకా ప్రదేశం అంత నచ్చలేదు. జంతువులు, ఆటబొమ్మలు వగైరాలు అక్కడ లేవు. మ్యూజియం వాళ్లని ఏమాత్రం ఆకర్షించలేదు.

చలి ఐనా సరేనని బయట తోటలోకి వెడదామన్నారు. కవిబాబు కూడా పిల్లలకే ఓటేశాడు.

తోటలోకొస్తే,, పులిమీద పుట్రలా అప్పుడే వడగళ్ల వాన మొదలైంది. కానీ విచిత్రంగా అదే అక్కడ మాకు అపురూప అనుభవమైంది.

అలాంటి వడగళ్లు మేమెప్పుడూ చూసి ఎరుగం.

మామూలుగా వడగళ్లు గులకరాళ్లలా ఉంటాయి. ఒకోసారి కంకరరాళ్లలా కాస్త పెద్దవి ఉంటాయి.

ఈ వడగళ్లు హోమియోపతీ మాత్రలంత చిన్నవి. వాటిని చూడగానే, హైనమన్ తన హోమొయోపతీ మందుల తయారీకి మాత్రల్ని ఇక్కణ్ణించే తెచ్చుకుంటాడా అనిపించింది.

పిల్లలు కూడా ఆ వడగళ్లని చూసి చలిని కూడా మరిచి మురిసిపోయారు. చేత్తో పట్టి గుప్పెళ్లతో ఓవర్‌కోటు జేబుల్లో వేసుకున్నారు.

"చాలా దేశాలు తిరిగాను. ఇలాంటి వడగళ్లు నేనెక్కడా చూడలేదు" అన్నాడు కవిబాబు.

ఇప్పటికీ మాకు ఆ భవనాన్ని తల్చుకుంటే ఆ వడగళ్లే గుర్తొస్తాయి.

పిల్లలు అలిసిపోయారని గ్రహించి పదకొండు దాటగానే మేము ఇంటిమొహం పట్టాం.

ఆ రోజు భోజనానికి టమేటాపప్పు, బంగాళాదుంపల కూర, కొబ్బరికాయపచ్చడి, సాంబారు ఐటమ్సు.

కవిబాబు మొహంలో సంతోషం. భోంచేస్తూ వంటకాల రుచిని మెచ్చుకుంటూ తెగ పొగిడాడు. ఆ మాటలకు పెదవి చివర్నించి వచ్చిన కృత్రిమత్వం కాక, అతిథి మనసులోంచి వెలువడ్డ సంతృప్తి గుబాళింపులున్నాయి.

భోజనమయ్యేక, "తప్పనిసరై చేతులు కడుక్కుందుకు లేచాను తప్ప, నిలబడ్డమూ కష్టమే" అంటూ కుర్చీలో వాలిపోయాడతడు.

మాకున్నది ఒకటే మంచం. నిద్రొస్తే పడుకున్నా, మెలకువగా ఉంటే అది ప్లేగ్రౌండ్ కూడానని చూడగానే తెలిసిపోతుంది. అందుకని, "మీరూ ఇంట్లో మనిషే కాబట్టి సంకోచించకుండా, మా పిల్లల ప్లేగ్రౌండుని మీరు నడుం వాల్చుకుందుకు ఆఫర్ చేస్తున్నాను" అన్నాను.

అతడు నవ్వి, "మీరు ప్లే గ్రౌండంటున్నారు. నాకైతే మంచం డైనింగ్ టేబుల్ కూడా. దానిమీద కూర్చుని, వళ్లో ప్లేటు పెట్టుకుని, తినేది తింటూ టేపులో పాటలు వింటుంటా" అని ఓ క్షణమాగి, "తప్పేముంది– జర్మన్సు ఆడేది ఫుట్‌బాల్ కాబట్టి ఆరుబయట పెద్ద ప్లేగ్రౌండ్ కావాలి. ఇండియన్సు ఎక్కువగా ఆడేది ఫుడ్‌బాల్ కాబట్టి, మంచం కూడా ప్లేగ్రౌండుగా పనికొస్తుంది మనకి" అన్నాడు.

ఆ చలోక్తి పాపకీ అర్థమైనట్లుంది, "భలే చెప్పారంకుల్! అమ్మ ఒప్పుకోదని కానీ మంచంమీద ఫుడ్‌బాల్ ఆడ్డం నాకూ ఇష్టమే" అంది.

"తాత్తూయాను (నాకూడాను)" అన్నాడు బాబు వెంటనే.

బాబుకి అక్షరాలిప్పుడు బాగానే పలుకుతున్నాయి. ఐనా తనూ ఏదైనా చెప్పాలని తొందరపడితే ముద్దమాటలు వచ్చేస్తాయి.

మంచంమీద కూర్చుని తినడానికి ఒప్పుకోదు శ్రీమతి. ఐనా ఒకోసారి పిల్లలు ప్లేట్లు పట్టుకుని మంచం ఎక్కేస్తారు. అప్పుడు తను వాళ్లని బాగా తిడుతుంది. పాప ఇప్పుడా తిట్లన్నీ ఏకరువు పెడితే, అవి కవిబాబుకీ తగిలి మమ్మల్ని ఇబ్బందిలో పడేస్తాయి.

అందుకని శ్రీమతి చటుక్కున పాప చెయ్యి పట్టుకుని పక్కకి లాక్కెళ్లి, "నువ్వు కాసేపు మాట్లాడకు" అంది.

సాయంత్రం మూడయ్యేక కవిబాబు మరి లేస్తానంటే, "అప్పుడేనా? కాసేపాగి ఫలహారం చేసి వెడుదురుగాని" అన్నాను నేను.

"ఫలహారమా? ఇన్ని తిన్నాక ఇంకానా?" అన్నాడు కవిబాబు.

కవిబాబు దగ్గర సీను రివర్స్ ఔతుందని ఊహించలేదు. చప్పున శ్రీమతిని చూశాను.

ఆమె కళ్లలో వెలుగు. మొదటి విజిట్లో కాఫీ ఇస్తే. అప్పుడేనా అన్న మనిషి, ఈరోజు ఫలహారం ఉందంటే, ఇంకానా, అంటున్నాడు. ఒక ఇల్లాలికి అంతకంటే సంతోషాన్నిచ్చే మాటేముంటుంది?

ఐనా శ్రీమతి ఊరుకోలేదు. ఓ అరగంట తర్వాత అతడికి ఉప్పుపిండి పులిహోరతో పాటు, ఐస్‌క్రీం కూడా పెట్టింది.

అతడు తప్పదన్నట్లు రెండూ కొంచెం కొంచెం రుచి చూసి వెళ్లాడు.

అది ఊదరగొట్టడం కాదు. గతంలో జరిగిందానికి ప్రతీకారం కాదు. అతిథిగా అతడంటే మాకున్న కన్సర్న్.

ఆ తర్వాత అతడోసారి మమ్మల్ని తనింటికి రమ్మని బలవంతపెట్టాడు. రాలేమంటే మరి మా ఇంటికి రానని బెదిరించాడు.

బెర్లిన్లో మేమో చివర ఉంటే, అతడుండేదింకో చివర. అక్కడికెళ్లాలంటే, మధ్యలో ఊబాన్లో తూర్పు బెర్లిన్ దాటాలి.

ఓ ఆదివారం అతడింటికి వెళ్లాం. అతడుండే గది బ్రహ్మచారి కొంపకి మచ్చులా ఉంది.

అతడు మమ్మల్ని ఆత్మీయంగా ఆదరించాడు. "శ్రీవైష్ణవుణ్ణి. ఇది నా స్పెషల్" అంటూ మాకోసం దద్దోజనం చేసి ఉంచాడు. అది మనవైపు గుళ్లలో లభించే ప్రసాదమంత గొప్పగా లేకపోయినా, అతడి ప్రేమాభిమానుల్ని రంగరించుకుని మమ్మల్ని అలరింపజేసింది.

పాయసంలాంటిది పెట్టాడు. పిల్లలకి చాక్లెట్లు ఇచ్చాడు. వెంటనే తినమని బలవంతపెట్టాడు కానీ అప్పట్లో మా పిల్లలకి ఆ చాక్లెట్లు బొత్తిగా నచ్చేవి కాదు. భుక్తాయాసం వంకపెట్టడంతో ఆ ఇబ్బంది ఇరుపక్షాలకూ సంతృప్తికరంగా సద్దుకుంది.

"దగ్గర్లో యాత్రాస్థలాలు లేవు కానీ, ఓ పెద్ద పార్కుంది. ఆదివారాలు మ్యూజిక్ పార్టీలుంటాయి" అంటూ మమ్మల్ని బయటకు తీసుకెళ్లాడు.

అక్కడ ఆట్టే జనాలు లేరు కానీ, గిటార్లు, డ్రమ్ములు వగైరాలతో ఓ మ్యూజిక్ బాండ్ ఉంది. ప్రత్యక్షంగా అలాంటివి చూడ్డం మొదటి సారి కాబట్టి, మావాళ్లు కాసేపు ఆ పాటలు వినోదించారు.

ఆ ట్రిప్పులో మాకు రెండు విషయాలు అర్థమయ్యాయి. మా ఆతిథ్యం కవిబాబుకి ఎంత తృప్తినిచ్చిందంటే, తనూ బదులు తీర్చుకోవాలని తాపత్రయపడుతున్నాడు. రెండు– ఆతిథ్యంలో మాకు దీటు రాలేకపోతున్నానన్న భావనలో ఉన్నాడు. అది పోవడంకోసం మేమతణ్ణి పదేపదే మా ఇంటికి రమ్మని ఆహ్వానించేవాళ్లం.

కానీ ఎవరి పన్లు వాళ్లవిగా– అతడు మా ఇంటికి మరో మూడునాలుగుసార్లు వచ్చాడేమో!

వచ్చినప్పుడు– దుర్వాసుడి ముఖభావాలకి తావివ్వలేదు. అప్పుడేనా, ఇంకానా– లాంటి పదాలు అవసరపడలేదు. అందువల్ల అతడూ, మేమూ కూడా ఆ విజిట్లని ఎంతో ఎంజాయ్ చేశాం.

బెర్లిన్ జ్ఞాపకాలుగా అప్పట్లో మా ఇంటికొచ్చినవారి గొంతులు రికార్డు చేసేవాణ్ణి. అలాంటప్పుడు ఏంచెప్పాలో తెలియక కొందరు ఇబ్బంది పడేవారు. ఒకసారి అలాగే గుప్తా అనే ఉత్తరాది మిత్రుడు తటపటాయిస్తే, "జస్ట్ అప్రీషియేట్ హిమ్" అంది అతడి భార్య.

అప్పుడు నేను ఇబ్బంది పడ్డాను. మెప్పు కోసమే ఆ కార్యక్రమం పెట్టానా అని!

కవిబాబుతో ఆ ఇబ్బంది లేదు. అతడు మంచి కవి.

ఒకసారి అతడు తనతోపాటు– న్యూక్లియర్ ఫిజిక్సులో డాక్టరేట్ చేసిన రెడ్డి అనే ఓ సైంటిస్టుని తన వెంట తీసుకొచ్చి పరిచయం చేశాడు. అది అవకాశంగా తీసుకున్నాను. ఆతిథ్యమయ్యేక అతడికి మైక్రోఫోన్ అందించి, "మీ కవితలు మీ నోట వినాలనుంది" అన్నాను.

అప్పుడతడు రెండు కవితలు చదివాడు.

కవులను అంచనా వేసే సామర్థ్యం నాకు లేదు కానీ, అతడి కవితలు విశిష్టమైనవని నాకు తోచింది. గొంతు గంభీరమైనది కావడం, తనే స్వయంగా చదవడంవల్లనేమో– విరుపులు అర్థవంతమై, భావం అద్భుతమైందని నాకు అనిపించింది.

ఇప్పటికీ అతడి గొంతులో ఆ కవితలు మావద్ద టేపులో ఉన్నాయి. వాటినిక్కడ మీతో పంచుకుంటున్నానుః

మొదటి కవిత

సందర్భముః పారిస్ నుంచి బెల్జియం ద్వారా హాలండ్ వెళ్లే ప్రయాణంలో కార్లో వెడుతూ మధ్యలో ఆగి ముఖ్యంగా బెల్జియంలో ఒకచోట పొలాల్లో మేస్తున్న నల్లటి ఆవుల్ని చూసి ఏదో ప్రేరణ కలిగితే వ్రాసిన ఒక గేయం

పచ్చగడ్డి తిన్న నల్లావు తెల్ల పాలిస్తుంది
అనంతమైన నీలాకాశంలో నల్లనల్లని మబ్బుతునకల మధ్య తెల్లతెల్లని విద్యుల్లతలు విరుస్తాయి
ఎర్రమట్టిలో పుట్టిన ఆ నల్లమామి చెట్టు పైగా పచ్చని ఆకుల్లోంచి తొంగిచూచే ఎర్రని పూలు ప్రసరిస్తుంది
రోజా రంగు చీర కట్టిన ఆమె బంగారు రంగుఛాయలీనే ముఖంపైన తెల్లని పెదాలపై ఎర్రని చిరునవ్వు మెరుస్తుంది
ఉంగరాల జుట్టు నల్లని నీగ్రోవాడిలోనూ
తెలుపూ ఎరుపూ రంగురంగుల మనుషుల్లో మాదిరి
ధవళ ధవళ ధగద్ధగాయమాన జీవన తేజోరేఖ మిలమిలామంటోంది

రెండవ కవిత

వచ్చాను యూరపుకు
తెచ్చాను వెంట మానవతావాదాన్ని
ఇస్తున్నాను సమైక్యతా మాధుర్యాన్ని
జాతులు వేరు నీతులు వేరు భాషలు వేరు వేషాలు వేరు
ఐనా మానవత ఒక్కటే మానవ జీవిత మకరందం ఒక్కటే
అక్కడా ఇక్కడా అంతటా మనిషి ముఖ్యం మనిషి మనస్సు ముఖ్యం
ఐతే
ఎందుకీ యుద్ధాలు పరస్పర విరుద్ధాలు
దానికి కారణం ఉంది సోదరా
మనిషి మంచివాడు
మనిషి చెడ్డవాడు
మంచీ చెడ్డా కలగాపులగపు సంస్కృతి మానవ సంస్కృతి
మనిషి మంచివాడై కోరికల పొలిమేరలలో అడుగిడతాడు సామరస్యపు నిలయాలకు పరుగిడతాడు
మనిషి చెడ్డవాడై ద్వేషిస్తాడు తేడాల నీడల వెంటపడి పోతాడు
తోటి మానవునితో తలపడతాడు

మనిషి మారితే అన్నీ మారతాయి

కవిబాబు ఈ కవితలు చదివేక, అతడితోపాటు వచ్చిన రెడ్డిగారిని ఆ కవితలపై అభిప్రాయం చెప్పమని అడిగాను.

"ఏదో సైంటిస్టుని. కవిత్వం గురించి నేనేం చెప్పగలను?" అన్నాడు రెడ్డిగారు.

నా ఉద్దేశ్యం ఆ సందర్భానికి జ్ఞాపకంగా, రెడ్డిగారి గొంతు రికార్డు చెయ్యడం. అలా అడిగితే, "జస్ట్ అప్రీషియేట్ హిమ్" అన్న గుప్తా భార్య మాటలు చెవుల్లో గింగురుమంటాయి. అందుకని అప్పట్నించీ ఉభయతారకంగా ఉంటుందని నేనే ఎదుటివాళ్లకి టాపిక్ ఇస్తున్నాను.

పాపం, రెడ్డిగారు ఎక్కువ బ్రతిమాలించుకోకుండా, వెంటనే స్పందించాడు. ఐతే నేనూహించని విధంగా ఆశువుగా చెప్పిన అతడిమాటల్లోనూ కవిత్వమే ధ్వనించింది. ఆ మాటలనిక్కడ మీతో పంచుకుంటున్నానుః

రెడ్డిగారి కవిత

మనిషి

మంచివాడెందుకౌతాడు చెడ్డవాడెందుకౌతాడు

ఈ రెంటికీ

ప్రకృతి కారణమా మనిషే కారణమా

ఈ రెంటి సమన్వయం

ప్రకృతీ మంచీ

మంచీ మనిషీ

ఈ మూడూ కలిస్తే వేదాంతమౌతుందా?

నిజం చెప్పొద్దూ– ఆ మాటలు విని దిగ్భ్రాంతుణ్ణయ్యాను.

కవితా అనుకుంటే కవిత. అభిప్రాయమా అనుకుంటే అభిప్రాయం. స్పందనా అనుకుంటే స్పందన.

రెడ్డిగారు సామాన్యుడు కాదు– అనుకున్నాను.

ఐతే ఆయన తను కవినని చెప్పుకోలేదు. ఆతర్వాత కవిగా ఆయననుంచి రచనలు వచ్చినట్లూ తెలియదు.

ఇద్దరి కవితల్నీ టేపులో వినిపించాను. గ్రుండిగ్ స్పూల్ స్టీరియో రికార్డింగు అంటే ఇప్పటి డాల్బీ సౌండుని మించి ఉండేది.

కవిబాబు తన కవితలు విని మురిసిపోయాడు. రెడ్డిగారు హుందాగా నవ్వాడు.

కవిబాబుకి సంబంధించిన ముఖ్యమైన ముచ్చట్లివి.

ఇప్పుడు మనం మళ్లీ రావుగారి ముచ్చట్లలోకి వెడదాం.....

'మడిసన్న తర్వాత కూసింత కలాపోసన ఉండాల' అని రావు గోపాలరావు చేత అనిపించారు ముళ్లపూడి వారు 'ముత్యాలముగ్గు' చిత్రంలో. సినిమాకి అది హాస్యమైనా జీవితానికి అదో గొప్ప సందేశం.

కళాపోషణ అభిరుచికి సంబంధించిన విషయం.

అభిరుచులు ప్రతి మనిషికీ ఉంటాయి. కొందరికా విషయం తెలియదు. కొందరికి తెలిసినా జీవనపోరాటంలో వాటిని పక్కకి నెడతారు.

జీవనపోరాటంలో అభిరుచులకే ప్రాధాన్యమిచ్చేవారు కొందరుంటారు. అందువల్ల లాభపడ్డవారికంటే నష్టపోయినవారే ఎక్కువ కావడం వల్ల– చాలామంది అభిరుచుల్ని పక్కకి పెట్టాలనుకుంటారు.

అలాంటివారికోసమే 'మడిసన్న తర్వాత కూసింత కలాపోసన ఉండాల' అన్న సందేశం

నా అభిరుచి సినిమాలు. అందులో భాగంగా సినిమా పాటలు వింటాను. వాటిలోనూ హుషారైనవీ, లయ ప్రాధాన్యమైనవాటినే ఎక్కువ ఇష్టపడతాను.

సినిమా పాటలపై నాకున్న ప్రీతి కళాపోషణ స్థాయి అభిరుచి కాదని నాకు తెలుసు. ఎందుకంటే బయట జరిగే సంగీత కచేరీలే కాదు, రేడియోలో వచ్చే లలితగీతాలనీ ఇంతవరకూ నేనంతగా పట్టించుకోలేదు.

నా అభిరుచి గురించి నాకే సరిగ్గా తెలియదని, రావుగారి కుటుంబంతో దగ్గరి పరిచయమయ్యాకనే అనిపించింది.

రావుగారి ముచ్చట్లలోకి వెళ్లేముందు– ఆ ముచ్చట్లకు ప్రాధాన్యత సంతరించిన నా నేపథ్యాన్నిక్కడ క్లుప్తంగా ప్రస్తావించాలి.

హైస్కూల్లో థర్డుఫారంనుంచి కాలేజిలో బీయస్సీ పూర్తయ్యేదాకా నేను. మా అన్నయ్య మా తాతగారింట్లో ఉండి చదువుకున్నాం.

తాతగారిది ఉమ్మడి కుటుంబం. ఇద్దరు బాబయ్యల కుటుంబాలూ అక్కడే ఉండేవి. ఇద్దరత్తయ్యలు వస్తూ పోతూండేవారు.

ఇంకా బంధుజనుల రాకతో ఇల్లెప్పుడూ జనంతో కలకల్లాడూతూ సందడిగా ఉండేది.

అందొచ్చిన వయసు కాబట్టి నాకు, మా అన్నయ్యకి చేతినిండా పని ఉండేది. మాకంటే చిన్నవారైనా కజిన్సుతో బాగా కాలక్షేపం అయ్యేది.

బ్రతుకుతెరువుకి బాట పడుతున్న ఆ రోజులు ఎన్నో అనుభవాల్నిచ్చాయి.

బడితోపాటు ఇంటాబయటా పాఠాలు నేర్పాయి. నేడు ఎన్ని చిక్కులున్నా, ఎంత విషాదమున్నా– రేపనేదానిపైన ఆశ, మక్కువ, ఉత్సాహం కలిగించేవి. విసుగన్నది స్ఫురించకుండా– ప్రతి రోజూ ఎంతో ఆసక్తికరంగానూ, సరదాగా గడిచిపోయేది.

మా కాలేజి రాజమండ్రిలో. తాతగారు ధవళేశ్వరంలో ఉండేవారు. నాన్నగారు పేరవరంలో ఉండేవారు.

అమ్మకు పిల్లలెక్కువ. పెద్దవాడు అన్నయ్య. నేను రెండోవాణ్ణి. అన్నయ్యకంటే ఏడాదే చిన్న.

మిగతావాళ్లు నాకంటే బాగా చిన్నవాళ్లు. అమ్మకి అవసరమైన సాయం చెయ్యగల వయసు కాదు వాళ్లది.

అందుకని సెలవులొచ్చినా, అమ్మకి అనారోగ్యమో, మరే అవసరమో కలిగినా నాకు కబురొచ్చేది.

ఆ కబురే నాకు శాసనం. అది బడి ఐనా, కాలేజి ఐనా ఎగేసి పేరవరం వెళ్లాల్సొచ్చేది.

పేరవరంలో పంచాయతీ బోర్డు గుమస్తా మా ఇంట్లోనే అద్దెకుండేవాడు. తరచుగా మా ఊరొచ్చే నన్ను చూసి, "వానాకాలం చదువని వినడమే కానీ, నిన్ను చూసేక అదేమిటో నాకు తెలిసింది" అనేవాడాయన.

అందులో వెటకారం ఏమాత్రం లేదు. ఆత్మీయమైన హెచ్చరిక ఉండేది. ఆపైన అతడికి నామీద ఎంత కన్సర్న్ అంటే, అదే మాట మా నాన్నగారి వద్ద కూడా అన్నాడు.

దానికి మా నాన్నగారు, "మావాడికి టీచర్సు అక్కర్లేదు. పుస్తకాలు చాలు. ఫస్టు క్లాసు తెచ్చుకోగలడు" అని బదులిచ్చారు గర్వంగా.

నామీద నమ్మకం కంటే, తన అవసరమే ఆయనచేత ఆ మాట అనిపించిందని తెలుసు.

కానీ ఆయన మాటలోనే ప్రోత్సాహాన్ని వెదుక్కున్నాను.

ఆ మాటతో బాధ్యతని సృష్టించుకున్నాను.

ఆ మాటనే సవాలుగానూ తీసుకున్నాను.

ఎందుకంటే– నేను సత్ఫలితం సాధిస్తే గర్వపడే పెద్దలు– నా ఫెయిల్యూర్సుకు– బాధ్యత వహించడానికిగానీ, సంజాయిషీ వినడానికి గానీ, నిరసన తెలుపకుండా ఉండడానికి గానీ సిద్ధంగా లేరు.

నేటి తరంలో అలాంటి పెద్దలకు నిరసన ఎదురౌతుందేమో! కానీ అప్పట్లో వాళ్లలో ఆత్మీయతానురాగాల్నే ఎక్కువగా గుర్తించేవాళ్లం. వారంటే గౌరవభావాన్ని మనసునిండా నింపుకునేవాళ్లం. వాళ్లని అవగాహనతో అర్థం చేసుకునేవాళ్లం.

అది మా గొప్పతనం కాదు. వాళ్ల వ్యక్తిత్వాలు అలాంటివి.

జీవితంలో పైకి రావడానికి దోహదం చేసినవి వాళ్ల వ్యక్తిత్వాలేనన్నది మాకు స్పష్టమైన నిజం.

ఇంతకీ ఆ రోజుల్లో క్లాసులు మిస్సవ్వడం ఒక్కటే నా సమస్య కాదు. పేరవరం ప్రయాణం కూడా!

పేరవరం కోనసీమకు ముఖద్వారమైన బొబ్బర్లంకకు రెండు మైళ్ల నడకదూరంలో ఉంది.

బొబ్బర్లంక వెళ్లడానికి ధవళేశ్వరంనుంచి నావలో గోదావరీ నది దాటాలి. నీటిమీద ఆ ప్రయాణం గాలివాటాన్ని బట్టి అరగంట నుంచి గంటంపావుదాకా తీసుకుంటుంది. ఐతే నావలు అన్నివేళలా ఉండవు. అందుకు ఎన్నో కారణాలు.

నావ లేనప్పుడు ప్రయాణం మొత్తం కాలినడకమీదే!

ముందుగా గోదావరి నదికి కాటన్ మహాశయుడు ధవళేశ్వరం నుంచి కట్టిన నాలుగు ఆనకట్టల్లో రెండింటిని బాటగా చేసుకుని వెళ్లాలి.

మా ఇంటినుంచి ఆనకట్టకు ఐదారు ఫర్లాంగులు ఉండొచ్చు. అక్కణ్ణించి మొదటి ఆనకట్ట దాటడానికి సుమారు ఒక మైలు.

అప్పుడు పిచికలలంక అనే చిరుద్వీపం వచ్చేది. ఆ లంకలో 2–3 ఫర్లాంగులు నడిస్తే రెండో ఆనకట్ట.

రెండో ఆనకట్టనుంచి 5–6 ఫర్లాంగులు నడిస్తే బొబ్బర్లంక గ్రామం వస్తుంది. అక్కణ్ణించి పేరవరం సరిగ్గా రెండు మైళ్లు.

పేరవరం కాలవగట్టుమీంచి ఒక ఫర్లాంగు దూరంలో ఊళ్లో మా ఇల్లు.

మళ్లీ ధవళేశ్వరం రావాలంటే ఇంత ప్రయాణమూ చెయ్యాల్సిందే!

ఇదీ ప్రయాణం. అప్పుడప్పుడు చేసే ప్రయాణం కాదది. తరచుగానే వెళ్లాల్సొచ్చేది. ఒకోసారి వారం వారం వెళ్లాల్సి ఉండేది.

10–18 ఏళ్ల మధ్య వయసులో, ముఖ్యంగా చదువుకునే విద్యార్థికి అది శ్రమతో కూడినదే. కానీ ఇష్టంగానే ఉండేది.

ఎందుకంటే ఆ ప్రయాణానికి గమ్యంలో అమ్మ ఉంది!

అన్నయ్యకైతే చంటప్పట్నించీ తాతగారింటనే అలవాటై, అమ్మదగ్గర అంత చనువు లేదు.

నా విషయం వేరు.

తాతగారింట అంతా నన్ను ఎంత అభిమానంగా చూసినా, అమ్మ ప్రేమకు సాటి వస్తుందనుకోవడం భ్రమే కదా! అందుకని అమ్మంటే నాకు భ్రమ ఉండడం సహజం.

ఆపైన అక్కడ అమ్మతోపాటు నాకోసం ఎదురుచూసే తోడబుట్టినవాళ్లున్నారు. వాళ్లమీదా నాకు భ్రమ ఉండేది.

ఆ భ్రమ తీరుతుందన్న ఉత్సాహం– నాకు ప్రయాణం శ్రమను తెలియనిచ్చేది కాదు. అక్కడ రోజులు ఆహ్లాదంగా గడిచిపొయ్యేవి. క్లాసులు మిస్ అవుతున్నానని తెలిసినా, అక్కణ్ణించి తిరిగి వెళ్లాలంటే అయిష్టంగానే ఉండేది.

వర్తమానానికి వస్తే– బెర్లిన్లో గ్యోతే స్ట్రాసేలో మా ఇల్లు మాకు ధవళేశ్వరం. క్నెసెబెకే స్ట్రాసేలో రావుగారిల్లు పేరవరం.

రావుగారి కుటుంబం మా ఇంటికొస్తే అప్పుడు మా ఇల్లూ పేరవరమైపోయేది.

మాదీ రావుగారిదీ అలాంటి ఆత్మీయతానుబంధం.

అందుకు కారణమైన కొన్ని విశేషాలు ముందు చెప్పి ఉన్నా, మా సమావేశాల ముచ్చట్లు ప్రస్తావిస్తేనే ఆ ప్రత్యేకత తెలుస్తుంది.

భువనేశ్వర్లో అలాంటి అనుబంధాలు కొన్ని ఏర్పడినా, పాశ్చాత్య దేశంలో– అదీ ఇంత తక్కువ వ్యవధిలో అవి ఏర్పడ్డం విశేషమే!

రావుగారి ముచ్చట్లు

రావుగారి అభిరుచి గొప్పది. జీవన సాహచర్యానికి ఆయన సత్యవతిగార్ని ఎన్నుకోవడమే అందుకు నిదర్శనం. అదెట్లనిన...

జర్మనీలో ఇంగ్లీషు వాడకం ఇంచుమించు నిషిద్ధం. మన దేశంలో జర్మన్ భాషకి ఇంచుమించు ప్రాచుర్యం లేదు.

చూడ్డానికి సీదాసాదా తెలుగు ఇల్లాలిలా అగుపించే సత్యవతి, పిల్లలు పుట్టడానికి ముందు బెర్లిన్లో ఉద్యోగం కూడా చేసింది.

భర్త ఆఫీసుకి వెడితే, అటు పిల్లల్ని చూసుకుంటూ ఇల్లు చక్కబెడుతుందామె.

ఇలా 'ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి' ఉండే ఇల్లాళ్లు చాలామందే ఉంటారు మనిళ్లలో. కాబట్టి అదో పెద్ద విశేషం కాదు.

ఆ దంపతులు మొదటిసారి మా ఇంటికొచ్చినప్పుడు, సత్యవతిగార్ని ఓ పాట పాడమని అడిగాం.

అప్పటికి మాకామె రావుగారి భార్యగా మాత్రమే పరిచయం.

నాకు పాటలు వినడం ఇష్టం. అవీ సినిమా పాటలు. అవీ రేడియోలోనో, గ్రామఫోనులోనో...

శ్రీమతికీ పాటలంటే ఇష్టమే కానీ సంగీతం నేర్చుకోలేదు.

మా మామగారికి సంప్రదాయ సంగీతం చాలా ఇష్టం. అందుకని ఆయన తన పెద్దకూతురికి, అనగా శ్రీమతి అక్కకి, అనగా నా వదినగారికి సంగీతం నేర్పించాలని అనుకుని ఓ సంగీతం టీచర్ని పెట్టారు.

ఆమెకి సంగీతం అంటే ఆసక్తి లేక, ప్రతి క్లాసుకీ ఏదో వంక పెట్టి తప్పించుకునేది.

అలా కొన్నాళ్లు జరిగేక, మా మామగారు మా వదినకే కాదు, మిగతా పిల్లలకి కూడా సంగీతం నేర్పే ప్రయత్నాలు చెయ్యలేదు.

ఐతే మేమిద్దరం కూడా సంగీతం నేర్వకపోవడాన్ని చిన్నతనంగా భావించలేదు.

"ఈ రోజుల్లో సంగీతం ఎవరికొస్తుందీ! చదువులు, ఉద్యోగాలు, సంసారం– వీటితోనే సరిపోతుంది" అనుకునేవాళ్లం.

మా అభిప్రాయం సరైనదే అని ధ్రువపర్చుకోవాలి కదా– అందుకని ఇంటికొచ్చిన అతిథుల్ని పాట పాడమని అడిగేవాళ్లం.

మొహమాటంతోనో, నిజంగానే రాకనో– సాధారణంగా చాలామంది, 'నేనేమిటి, పాడ్డమేమిటి?' అనేవారు.

ఆ జవాబు మాకు తృప్తినిచ్చేది.

కొందరు కొంచెం గునిసి పాట పాడేవారు. సంగీతజ్ఞానం లేకపోయినా మాకా పాటల్లో అపశ్రుతులు స్ఫురించేవి. వాళ్లు వెళ్లేక, పాడ్డం రాకపోయినా, పాడే ధైర్యముందని అనుకునేవాళ్లం.

"మనకలాంటి ధైర్యం లేకపోవడమే మంచిదయింది. అనవసరంగా అభాసు పాలయ్యేవాళ్లం" అని గొప్పగా ఫీలయ్యేవాళ్లం.

కొందరు అడిగిందే తడవుగానూ, మరికొందరు తామే అడిగీ– భయంకరంగా పాడిన సందర్భాలూ ఉన్నాయి.

వాళ్లు వెళ్లేక వాళ్లని తలచుకుని మనసారా నవ్వుకునేవాళ్లం.

బెర్లిన్ వచ్చేక మా ఆలోచన మారింది.

కొత్తగా టేపు రికార్డింగుకి అలవాటు పడుతున్నామేమో, జ్ఞాపకాలకోసం పరిచయస్థుల గొంతుల్ని రికార్డు చెయ్యడం హాబీ అయింది.

కొందరు మాట్లాడేవారు. కొందరు పాటలు పాడేవారు.

ఆ టేపులు మళ్లీ ప్లే చేస్తున్నప్పుడు– ఆ గొంతులు మధురస్మృతులను పలికేవి.

దాంతో ఎదుటివారి పాటలేమిటి, మాటల్ని కూడా మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తున్నాం.

అది కళాపోషణ అని మేమెప్పుడూ భ్రమపడలేదు. కానీ ఆహ్లాదానికే తప్ప అపహాస్యానికి తావు లేని గొప్ప సంస్కృతిని ఆ టేపులు మాకు అలవర్చాయి.

అదే ఆసక్తితో ఇప్పుడు సత్యవతిగార్ని పాట పాడమని అడిగితే, ఆమె మొహమాటంగా, "ఇప్పుడు పాట ఎందుకూ?" అంది. నేను వెంటనే మా హాబీ గురించి చెప్పాను.

"మనం మళ్లీ మళ్లీ కలుస్తాం కదా! మరోసారి చూదాంలెండి" అందామె.

"మన కుటుంబాల ప్రతి సమావేశమూ ఓ తీపి జ్ఞాపకం కావాలి. మీరు కాదనకూడదు" అంటూ లేచాను.

ఎందుకు లేచానా అని ఆ దంపతులు మావంక కుతూహలంగా చూస్తున్నారు.

నేను గ్రుండిగ్ స్టీరియో స్పూల్ టైపు టేపు రికార్డరు తెచ్చి ఆమె ముందు పెట్టాను.

నాణ్యమైన రికార్డింగుకని ప్రత్యేకంగా కొన్న గ్రుండిగ్ మైక్రోఫోను ఆమెకి అందించాను.

సత్యవతి కళ్లు పెద్దవయ్యాయి. "మంచి సిస్టం ఉందే మీ దగ్గర" అందామె.

"రికార్డింగు విషయంలో మా సిన్సియారిటీ నిరూపించుకోవాలికదండీ" అన్నాను.

రావుగారు నవ్వుతూ, "మంచి సిస్టం. 'నీ పాట నా నోట పలకాలి తల్లీ!' అంటోంది. నువ్వు కాదనకూడదు" అన్నారామెతో.

తర్వాత నావైపు తిరిగి, "మంచి ఏర్పాట్లు చేశారు. ఇక మీరు మా ఆవిణ్ణి ఆపలేరు" అన్నాడు.

"మా వారన్నది నిజమే! మీ ఏర్పాట్లు నాకు మంచి స్ఫూర్తినిచ్చాయి" అంటూ గొంతు సవరించుకుందామె.

మా పిల్లలతో సహా అందరం బుద్ధిమంతులైన శ్రోతల్లా మౌనం వహించాం.

వాహినీవారి రంగులరాట్నం చిత్రంలో 'కనరాని దేవుడే కనిపించినాడే' అన్న పాట ఆరంభించిందామె.

ఖంగుమనే తియ్యని గొంతు.

ఆమె ఇలా ఆరంభించగానే– ఆ స్వరం విని మేమంతా సినిమాల్లో చూపించినట్లు ఒక్కసారిగా మంత్రముగ్ధులమైపోయాం.

రంగులరాట్నం సినిమా నాకు చాలా ఇష్టం. అందులో చంద్రమోహన్ మరీ ఇష్టం.

ఆ సినిమా చూసి పదేళ్లౌతోందేమో– పాటల్లో మాత్రం త్యాగరాజు వాణిశ్రీతో కలిసి పాడిన 'నడిరేయి ఏ ఝాములో మాత్రమే గుర్తుంది.

ఈ పాట కూడా నాకు తెలుసు కానీ, నా అభిరుచికి అందలేదు.

ఇప్పుడీ పాట వినగానే ఆ సినిమాలో, ఆ పాట ఇంత బాగుంటుందా అనిపించింది.

పాట ముగిసేక కాసేపు అప్రతిభులమై చప్పట్లు కొట్టడం కూడా మర్చి అలా ఉండిపోయాం.

విశేషమేమంటే ఆమె పాడింది సినిమా పాటే ఐనా ప్రతిష్ఠాత్మక సంగీత కచేరీలో పాడినట్లుంది. అలాగని సినిమాతనానికి ఏ లోటూ రాలేదు.

"ఏమాత్రం హడావుడి లేని సీదా సాదా వరస కూడా ఆర్కెస్ట్రా లేకుండా ఇంత వినసొంపుగా ఉంటుందా?" అన్నాను ఆశ్చర్యంగా. అదీ నా అభిరుచి స్పందన.

"సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను. మా ఆవిడ ప్రొఫెషనల్ సింగర్. ఆలిండియా రేడియోలో గ్రేడెడ్ ఆర్టిస్టు. ఆమె, ఆమె అక్క జంట గాయనీ మణులుగా ప్రాచుర్యం పొందారు" అన్నాడు రావుగారు కించిత్ గర్వంతో.

ఇంత పెద్ద విషయాన్ని సందర్భం వస్తే తప్ప చెప్పకపోవడం వారి వినయానికి నిదర్శనం.

సూర్యనారాయణుడికి మేలుకొలుపు పాడుతూ– భానుతేజానికి 'ములగపువ్వుమీద ముత్యంపు పొడి ఛాయ' అన్నంత చక్కగానూ– ఆ గర్వం ఆయన వినయానికి అతికింది.

"మీరు పాడమని అడుగుతారనుకోలేదు. ప్రిపరేషన్ లేకుండా ఏదో పాడేశాను. బాగుందనడం మీ మర్యాద. కానీ నా తప్పులు నాకు తెలుస్తూనే ఉన్నాయి" అంది సత్యవతి.

పాటలో తప్పులు దొర్లాయని అనుకోను. రికార్డింగయ్యేక పాటెలా వచ్చిందో తెలుసుకోవాలన్న కుతూహలం ఎవరికైనా ఉంటుందిగా. అందుకని పరోక్షంగా అలా సూచిస్తున్నారేమోనని నాకు అనిపించింది.

శ్రీమతికీ అలాగే అనిపించినట్లుంది, "ఒకసారి ప్లే చెయ్యండి. ఆ తప్పులేమిటో ఆవిడే చెబుతారు. తెలుసుకుంటే మన పాప నేర్చుకుందుకు కూడా పనికొస్తుంది" అంది.

అప్పటికే మా పాప, ఆ పాటని హమ్ చేసుకుంటోంది. దానికి నిజంగానే సంగీతం పట్ల అభిరుచి.

నేను ప్లే చేశాను. వింటుంటే ఇందాకటికంటే గొప్పగా అనిపించింది.

"మీ గొంతుతో మా టేపు రికార్డరు ధన్యమైంది" అన్నాను.

"తప్పులన్నావుగా, అవేమిటో కాస్త వివరంగా చెప్పు" అన్నాడు రావుగారు.

మాట మార్చడానికి కాబోలు, "స్వోత్కర్ష అనుకున్నా సరే– నేనేనా అనిపించేటంత బాగుంది నా పాట. కారణం నాకు తెలుసు. అంతా మీ సిస్టం మహిమ. మా ఇంట్లో ఇలాంటి సిస్టం లేదు. మామూలు కాసెట్ రికార్డరుంది, అంతే!" అంటూ భర్తని నిష్ఠూరంగా చూసిందామె.

"మీ ఇంట్లో నిజంగా స్టీరియో రికార్డింగ్ సిస్టం లేదా? నిజానికిది మీవంటివారికే అవసరం" అని, "ఐనా అసలు గొంతు ప్రతిధ్వనించే మీ ఇంట్లో, రికార్డెడ్ గొంతుల అవసరం ఏముంటుందిలెండి!" అన్నాను.

"అబ్బే, అదేం కాదు. మేమిక్కడ ఎంతకాలం ఉంటామో తెలియదు. టెక్నాలజీ చూస్తే రోజురోజుకీ మారిపోతోంది. ఇండియాకి తిరిగి వెళ్లేముందు అప్పుడే మోడలొస్తే అది కొందామని వాయిదా వేస్తున్నాను. ఇండియన్ మెంటాలిటీ" అన్నాడు రావుగారు.

అది నిజమే. ఆ ఏడాది చివరకు వెళ్లిపోయేవాళ్లం. అందుబాటులో ఉన్నది కొనుక్కుంటాం. వాళ్లకి ఎదురుచూడ్డానికి అవకాశముంది.

ఆ మాట రావుగారికి చెప్పి, "రికార్డర్లో మీ పాట విన్నాక మీకు స్పష్టమయుండాలి– మీకు ప్రిపరేషన్ అవసరం లేదని! మాకోసం మరొక్క పాట" అన్నాను సత్యవతితో అభ్యర్థనగా.

నా మాటలే– శ్రీమతి, పాప చూపుల్లో పలికించారు

సత్యవతి ఎక్కువ సమయం తీసుకోలేదు. వెంటనే గొంతు సవరించుకుని, 'హృదయతంత్రులు మీటి మృదుల జీవితవీణ పలికించి తీయగా పాడవే ఓ సఖీ' అని పల్లవి అందుకున్నారు.

అది సినిమా పాట కాదు. లలిత గీతం.

కంచు కంఠానికి మృదుత్వాన్ని జోడించి, భావాన్ని రసాత్మకంగా సంగీతంతో రంగరించిన బాణీలో– చెవుల్లో అమృతం పోస్తున్నట్లున్న ఆ పాట కలిగిస్తున్న అనుభూతిని మాటల్లో చెప్పడానికి భోజుని నవరత్నాలో, రాయలవారి అష్టదిగ్గజాలో దిగి రావాలి.

ఆమె చరణాలలోకి వెళ్లింది.

'జీవిత వసంతమ్ము చిగురించుచున్నదే
వలపులే పూలౌచు పరిమళించుచునుండె
మనసనే కోయిలా మధురరాగము తీయ
ప్రేమగీతికలౌచు వినిపించునే సఖీ..... హృదయతంత్రులు మీటి...
గాలివానలు ముసిరి పొంగినా
ఆకాశమే విరిగి అవనిపై కూలినా
లోకాలు ఏకమై రూపు చెడినా కాని
ఎడద కలిగిన ప్రేమ విడిపోవదే సఖీ..... హృదయతంత్రులు మీటి...
ఏనాటి బంధమో ఈనాటి మన ప్రేమ
ఎన్ని జన్మలకైన నీవు నేనొకటేలె
రాధికా మాధవుల ప్రణయరాగమువోలె
మన ప్రేమ భువిలోన మధురకావ్యంబౌనె..... హృదయతంత్రులు మీటి...

పాట ముగిసేసరికి ఏదో గంధర్వలోకంనుంచి దిగివచ్చినట్లుంది.

"ఆలిండియా రేడియోలో గ్రేడెడ్ ఆర్టిస్టు అంటే ఏమో అనుకున్నాను. అందుకు ఇంతటి ప్రతిభ ఉండాలా?" అన్నాను అప్రయత్నంగా.

"ఆలిండియా రేడియో ఓ సంగీత సామ్రాజ్యం. అక్కడి కొలువులో కళాకారులముందు నేనేపాటి?" అంది సత్యవతి వినయంగా.

చిన్నప్పట్నించీ అందుబాటులో ఉన్న రేడియోలో లలిత గీతాల్ని వినడంకు ఏం కోల్పోయానో అనిపించింది.

అంతలో రావుగారు టైం చూసుకుని, "చాలా టైమయింది. ఒకసారి ప్లే చెయ్యండి. విని వెళ్లిపోతాం" అన్నాడు.

ఆయనన్నది నిజమే! అప్పటికి టైం పది కావస్తోంది, "రికార్డెడ్ పాట మరోసారి వినిపిస్తాను. అది వినే సమయాన్ని, మరో కొత్త పాటకి కేటాయిద్దాం" అని, సత్యవతివైపు తిరిగి, "సినిమా పాట తెప్ప మరేదైనా సరే– మీకిష్టమైనదైతే చాలు" అన్నాను.

ఆమె సరేనని, "టైమెంతో లేదు కాబట్టి బాలమురళీకృష్ణ థిల్లానాతో నేటి కార్యక్రమం ముగిస్తాను" అంది.

రావుగారు నవ్వి, "అంటే మొత్తంమీద నీ సంగీత ప్రదర్శనని కచేరీగా మార్చేశావ్" అన్నాడు.

పేరు విన్నానేమో కానీ థిల్లానా గురించి నాకేం తెలియదు. రావుగారు చెప్పిందాన్నిబట్టి– సంగీత కచేరీల్లో అది చివరి అంశం అని అర్థమైంది.

శాస్త్రీయ సంగీతమంటే– అన్న మాటనే మళ్లీ మళ్లీ సాగదీసే ఓ ప్రక్రియ అనుకునే నాకు, ఈ కార్యక్రమం శాస్త్రీయంగా ముగియడం నచ్చలేదు. కానీ మొహమాటానికి మౌనం వహించాను.

సత్యవతి గొంతు సవరించుకుని, "ధీంతరనన ధీం" అంటూ మొదలెట్టింది.

ఆ గొంతు, గొంతులో వణుకులు, వరసలో లయ, లయానుగుణమైన పదాలు, పలుకులో వేగం...

రెండు నిముషాలు రెండు క్షణాల్లా అనిపించాయి.

హౌరాబ్రిడ్జిలో 'మేరా నామ్ చింగ్‌చింగ్‌చూ' అన్న లయ ప్రధానమైన పాట నాకెంతో ఇష్టం. ఐతే మాటకు దీటొచ్చే ఆర్కెస్ట్రా కలవకపోతే– ఆ పాట చప్పబడిపోతుంది.

సత్యవతి పాడిన ఈ థిల్లానా– ఏ వాయిద్య సహకారమూ లేకుండానే అంతకంటే గొప్ప అనుభూతినిచ్చింది.

"మహాకవి ఐన మా తాతగారు అనేవారు– 'మెచ్చుకుందుకూ అర్హత ఉండాలని'. మీ పాట మమ్మల్ని ఒక అద్భుత ప్రపంచానికి తీసుకు పోయిందనడం మినహా ఇంకేం చెప్పలేను" అన్నాను.

తర్వాత తెలుగు సంప్రదాయం ప్రకారం వాళ్లకి వీడ్కోలు చెప్పాం. వెళ్లిపోతూ రావుగారు, "మన సమావేశం ఈసారి మాఇంట్లో" అన్నాడు.

ఆ పిలుపు నాకప్పుడు వరంలా అనిపించింది. ఐతే ఊహకందని మరో ఆశ్చర్యకరమైన విశేషం మాకోసం ఎదురుచూస్తోందని అప్పుడు నాకు తెలియదు.

రావుగారి ముచ్చట్లు

విదేశాల్లో ఉంటున్నా, అక్కడివారితో పాలూ నీరులా కలిసిపోయినా– మన భాష, సంస్కృతి, సంప్రదాయాల్ని గౌరవిస్తూ, కాపాడుకుంటూ తెలుగువారు నిత్యజీవితాన్ని ఎలా రసమయం చేసుకుంటున్నారో రసాత్మకంగా చెప్పాలంటే రావుగారింటి ముచ్చట్లు మాకు మా స్థాయిలో శ్రీకృష్ణదేవరాయలవారి భువనవిజయం.

రాయలవారి ఆస్థానంలో సాహిత్యానిదే ప్రథమ తాంబూలం.

శ్రీకృష్ణదేవరాయలవారి కొలువులో అష్టదిగ్గజాలని పేరు పడ్డ ఎనమండుగురు మహాకవులుండేవారు. వారిలో ఒకరు కాకపోయినా, రాయలవారు కూడా స్వయంగా అశ్టదిగ్గజాలంత మహాకవి.

కవి పండితులకు రాయలవారి కొలువొక పుణ్యతీర్థం. తమ కవన, పాండితీప్రతిభను [ప్రదర్శించి రాయలవారి సత్కారాన్ని పొందాలని ఆత్రపడేవారికది పరీక్షాస్థలం. అష్టదిగ్గజాలను మించినవారమని నిరూపించుకోవాలని తహతహలాడేవారికది సవాలుగా అలరించే క్రీడాస్థలం. రసిక హృదయులైన ప్రేక్షకులకది ఒక అపూర్వ రంగస్థలం.

రాయల కొలువులోని సాహితీ విశేషాలు భువనవిజయం పేరిట ఎంత ప్రాచుర్యం పొందాయంటే, నేటికీ దేశవిదేశాల్లో సాహితీ ప్రియులైన తెలుగువారు ఏదో రూపంలో భువనవిజయాలు నిర్వహిస్తున్నారు. వారి వారి అభిరుచి, సామర్థ్యాల్ని బట్టి నేటి కవి పండితులు ఆ సభల్లో అష్టదిగ్గజాల పాత్రల్ని పోషిస్తుండడం కద్దు.

భువనవిజయాలపై అవగాహన కలిగించే కొన్ని రసాత్మక సన్నివేశాల్ని, 1956లో విడుదలైన 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో రసరమ్యంగా, పండితపామరజనరంజకంగా ఇమిడ్చారు ఆ చిత్ర దర్శకులు బిఎస్ రంగా.

రావుగారు కవి కాదు.

మేము రచయితలమని వారికి తెలియదు.

మామధ్య జరిగినవీ కవితాగోష్టులు కావు.

ఐనా మొదటిసారి వాళ్లింట ఆతిథ్యం స్వీకరించినప్పుడు పొందిన రసానుభూతిలో అప్పటి 'తెనాలి రామకృష్ణ'లోని భువనవిజయ సన్నివేశాలు ప్రధానం కావడం వల్లనేమో అప్రయత్నంగా భువనవిజయం అన్న పేరు స్ఫురించింది.

రావుగారింట్లో భువన విజయం

రావుగారి భార్య సత్యవతి సంగీతంలో నిష్ణాతులని వాళ్లు మా ఇంటికొచ్చినప్పుడే తెలిసింది. 'హృదయతంత్రులు మీటిన మృదుల జీవితవీణానాదాన్ని' మరల మరల వినాలన్న తహతహ అప్పుడే మాలో చోటు చేసుకుంది.

అందుకే ఆరోజు వాళ్లింటికెళ్లగానే ముందు పాట గురించే అడగాలనుకున్నాను.

శ్రీమతి వారించింది.

"ప్రతిదానికీ ఓ సమయముంటుంది. ఆ సమయం నాకు తెలుసు. నేనడిగేదాకా మీరా ప్రసక్తి తేవద్దు" అందామె.

సమయోచితం పాటించడం సభా సమావేశాల్లోనే కాదు, బంధుమిత్రులు కలిసినప్పుడూ అవసరమే. ఐనా ఆ విషయం మర్చిపోవడం మనిషి బలహీనత. అలాంటప్పుడు అయినవాళ్లు కలగజేసుకుని సున్నితంగా హెచ్చరిస్తుంటారు.

ఆ హెచ్చరికని అర్థం చేసుకోవడం– వారివారి అహం, హోదా, సంయమనం వగైరాలపై ఆధారపడి ఉంటుంది.

'అనువు కానిచోట అధికుల మనరాదు' అన్న వేమన మాటని బాగా అర్థం చేసుకున్న దంపతులం.

ఎక్కడ ఎవరు తగ్గాలో ఇద్దరికీ తెలుసు. ఐనా మానవమాత్రులం కాబట్టి అప్పుడప్పుడైనా అజ్ఞానంలో పడి గొడవ పడుతుంటాం.

అలా అజ్ఞానులమై మాలో మేము గొడవపడ్డ సందర్భాలు కొన్ని లేకపోలేదు. ఇతరుల ఎదుట కూడా, చనువున్న వాతావరణంలో ఐతే అలాంటి గొడవలకు వెనుకాడని సందర్భాలూ ఉన్నాయి.

అప్పటికే రావు దంపతులతో మాకు తగినంత చనువు ఏర్పడింది. ఐనా కూడా, ఆ రోజు మాత్రం నేను కాస్త జ్ఞానినై ఆమె మాట శిరసా వహించాను.

రావుగారిల్లు చేరేక– ముందు కాసేపు కుశలాలు.

రావుగారి పాప నెలల వయసుది. ఎక్కువ సమయం నిద్రాముద్రలో ఉంటుంది. తనకి నిద్రాభంగం కలిగించడంవల్ల కలిగే పరిణామాలు మహర్షులకు తపోభంగం కలిగించడంవల్ల జరిగేవాటికంటే ప్రమాదకరమైనవన్న జ్ఞానాన్ని ఆ పాప పుడుతూనే తలిదండ్రులకు కలిగించింది. అందుకని ఆ ఇంట్లో ఆమెకోసం ప్రత్యేకంగా ఒక చీకటి గది ఏర్పాటు చేశారు. ఎంత పకడ్బందీగా అంటే, ఒకే ఒక్క కాంతికిరణం ఆ గదిలోకి వెళ్లాలన్నా ఇంటివారి అనుమతి కావాలి.

మేము వెళ్లేసరికి ఆ పాప తన చీకటి గదిలో, ఉయ్యాల్లో నిద్ర పోతోంది.

రెండేళ్ల వాళ్ల బాబు, మా పిల్లల్ని చూడగానే ఎందుకో తెలియని ఆనందంతో ఉత్సాహపడ్డాడు. మావాళ్లతో కలిసి భోంచేసేక ముగ్గురూ ఆటలు మొదలెట్టారు. వాళ్లు ఆడుకుంటుంటే, పెద్దవాళ్లం నలుగురం భోజనాలక్కూర్చున్నాం.

రావుగారింట విందు చిరస్మరణీయంగా ఉంది. ఆ విశేషాలు భువన విజయంలో ఇమడవు కాబట్టి వేరేగా ప్రస్తావిస్తాను.

విందు పూర్తవగానే, "ఇక విందు మొదలౌతుందని ఆశించొచ్చా?" అంది శ్రీమతి.

నేను ఆశ్చర్యపోయాను.

నాకు అనువైనచోట కూడా తనకి ఆధిక్యాన్నిచ్చి పొరపాటు చేశానా అని కూడా అనుకున్నాను.

రావుగారి ముఖంలో విస్మయం.

సత్యవతిగారి మొహంలో చిన్న ఇబ్బంది.

అప్రయత్నంగా కవిబాబు గుర్తొచ్చాడు. కాఫీ తేగానే, 'అప్పుడే కాఫీయా?' అన్నప్పుడు అతడి రౌద్రాకారం చూసినప్పుడు మా మొహాలు బహుశా అలాగే ఉండి ఉంటాయేమో!

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం ఏర్పడింది. దాన్ని చీల్చుకుంటూ, "సత్యవతి గారి పాటకోసం ఎదురుచూస్తున్నాం. మాకు అసలైన విందు అదే కదా మరి!" అంది శ్రీమతి.

అంతే– ఒక్కసారిగా అందరి ముఖభావాలూ మారిపోయాయి.

నేనైతే ఫరే చేంజ్ హృదయపూర్వకంగానే మన సంప్రదాయాన్ని తిట్టుకున్నాను.

ఇక్కడి సంప్రదాయమైతే, అక్కడ అందరి ఎదురుగా ఆమెను దగ్గరగా తీసుకుని చిన్న ముద్దు పెట్టేవాణ్ణి.

రావుగారు తక్కువవాడా, "మీరడిగింది విందు గురించే కావచ్చు. కానీ దానికి నన్నిలా హర్ట్ చెయ్యడం భావ్యమా?" అన్నాడు.

మళ్లీ అక్కడ నిశ్శబ్దం. ఇందాకటి ముఖభావాలే ముఖాల్ని మార్చుకున్నాయి.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, "నా అంతటివాడొకడు ఇక్కడున్నాడని చూసీ– నా ప్రసక్తే లేకుండా మా ఆవిణ్ణి పాటడుగుతారూ! ఏం– తన పాటేనా, నా పాట మీకు విందు కాదా?" అన్నాడు రావుగారు.

అంతే– ఒక్కసారిగా అక్కడ నవ్వులు విరబూశాయి.

రావుగారు హాస్యప్రియుడు కాబట్టి సరదాకి అలాగనుండొచ్చని గ్రహించి, "లేడీస్ ఫస్ట్ కదా అని ఫస్ట్ ఛాన్స్ నా శ్రీమతికిస్తే అడగడంలో స్త్రీ పక్షపాతం చూపించింది. ఇప్పుడు నాదీ ఛాన్సు" అని రావుగారి వంక తిరిగి, "ముందు మీరు పాడాలి. మీ పాట విన్నాకనే మీ శ్రీమతిగారి పాట. అది ధర్మం కూడా. ఎందుకంటే, మీ శ్రీమతి పాట ఒకసారైనా విన్నాం కానీ, మీ పాట ఇంతవరకూ వినలేదు. కాబట్టి ఈ రోజు ముందు మీరు, తర్వాత సత్యవతిగారు. మీకు జరిగిన అన్యాయానికి ఇదో సద్దుబాటు. ఏమంటారు?" అన్నట్లు సత్యవతిగారి వంక చూశాను.

ఆమె నవ్వుతూ శ్రీమతిని చూసి, "నాకైతే ఆయన పాట గురించి తెలుసు. కానీ ఏమో అనుకున్నాను. మీవారు చాలా తెలివైనవారు. మాటల్లో గొంతు వినే, మావారి ప్రతిభను పట్టేశారు. గాయాలకు సిద్ధపడుతూ, మందుని కూడా ఏర్పాటు చేశారు" అంది.

"అమ్మో! ఏం దెబ్బ కొట్టావ్! నా పాట వింటే వీళ్లకి గాయాలౌతాయా? వాటికి ఉపశమనంగా నీ పాటని ముందే ఏర్పాటు చేశారా? స్వోత్కర్షకి ఇంతకంటే గొప్ప ఉదాహరణ ఉంటుందా?" అని రావుగారు గుండెలు బాదుకోవడాన్ని అభినయించాడు.

"మీకలా అనిపించిందా? నాకైతే– 'దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి' అన్న మహాకవి హుందాతనం తోచింది" అన్నాను నేను వెంటనే.

మనసులో మాత్రం ఆ దంపతుల సంభాషణా చాతుర్యంకూడా– ఆమె సంగీతప్రతిభకు దీటొచ్చే ఆహ్లాదమనిపించింది.

"సరే, నేను తూటాలు వదుల్తున్నాను. నువ్వు మందు ఏర్పాట్లు చూసుకో" అని రావుగారు గొంతు సవరించారు.

"అప్పుడే తూటాలు వదలకండి. మేమంతా పొజిషన్సు తీసుకోవాలి కదా!" అంది సత్యవతి అక్కడికి యుద్ధమేదో మొదలౌతున్నట్లు.

రావుగారితో సహా అంతా ఫక్కుమన్నాం.

సత్యవతి, శ్రీమతి అక్కడ నేలమీద కంబళి పర్చారు. రావుగారబ్బాయి అప్పటికే అలసిపోయి నిద్రపోతుంటే, తనని సోఫాలోకి మార్చారు.

నేను శ్రీమతి, పాప, బాబు– కంబళిమీదకు మారాం.

మా పాపకి పాటలంటే చెప్పలేనంత ఆసక్తి.

అప్పటికే సత్యవతిగారి 'హృదయతంత్రులు మీటిన మృదుల జీవితవీణని' ఎన్నో మార్లు మా ఇంట్లో పలికించింది. అప్పటికింకా ఐదేళ్లు నిండకపోయినా, మూడేళ్ల వయసుకే కనీసం ఐదారు తెలుగు పాటల్ని సాహిత్య సంగీత పరంగా కంఠస్థం చేసిన ప్రజ్ఞ దానిది.

అదిప్పుడు రావు దంపతుల గానంకోసం, గాయకుల స్వప్నశ్రోత స్థాయి పోజిచ్చి బుద్ధిగా ఎదురు చూస్తోంది.

మూడేళ్లు నిండిన మా బాబు ఏం పట్టించుకోనట్లే ఉంటాడు కానీ, తర్వాత తను చేసే వ్యాఖ్యలతో, ఇవన్నీ వీడెప్పుడు గమనించాడా అని మమ్మల్ని అశ్చర్యపరుస్తుంటాడు. ఇప్పుడు నిద్ర వస్తోందని అమ్మ ఒడిలో చేరాడు కానీ, వాడి నిద్ర నిజమా అన్నది అనుమానమే!

రావుగారు నోటితో పిస్టలు కాల్చిన శబ్దం చేసి, "అంతా పొజిషన్స్ టేకప్ చేశారా? బీ రెడీ! ఇప్పుడు నేను 'తెనాలి రామకృష్ణ' లో పద్యాలు పాడబోతున్నాను" అన్నాడు.

ఆశ్చర్యపోయాను.

నేను తెనాలి రామకృష్ణ సినిమా చూసి అప్పటికి పంతొమ్మిదేళ్లయింది. మొదటిసారి చూసేక మళ్లీ చూడలేదు.

సినిమా వచ్చిన కొత్తలో అందులోని పద్యాలు బయట జరిగే కార్యక్రమాల్లో పందిళ్లలో వినిపించేవి.

రేడియోలో ఐతే– 'చందనచర్చిత నీలకళేబర' అన్న జయదేవుడి గీతం, 'చేసేది ఏమిటో చేసెయ్యి సూటిగా' అన్న ఘంటసాల పాట మాత్రం చాలా ఏళ్లపాటు వినిపించేవి.

ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత అందులో పద్యాలు– అదీ పశ్చిమజర్మనీలో పశ్చిమబెర్లిన్ నగరంలో మళ్లీ వినడమంటే– ఆశ్చర్యమేగా మరి!

రావుగారు ఓ క్రమంలో ఆ సినిమాలో కొన్ని పద్యాల్ని వినిపించాడు. మధ్యలో వాటిని అనుసంధానించడానికి చిత్రంలోనివే సంభాషణలూ జత కలిపాడు.

అందరికీ సుపరిచితాలే కాబట్టి ఆ సన్నివేశాల్నీ, పద్యాల్నీ, సంభాషణల్నీ– అవసరం అనిపించినమేరకే విశదీకరిస్తాను. ఐతే చిత్రంలోని అన్ని పద్యాల్నీ కాక– కేవలం రావుగారు ఎన్నుకున్నవాటిని మాత్రమే ఇక్కడ ప్రస్తావిస్తాను.

మొదటి పద్యం: తెనాలి రామకృష్ణుడు రాయలవారిని దర్శించినప్పుడు– 'నరసింహ కృష్ణ రాయల, కరమరుదగు కీర్తి వెలయు, కరిభిత్ గిరిభిత్ కరి కరిభిత్ గిరి గిరిభిత్ కరిభిత్ గిరిభిత్తురంగ కమనీయంబై' అని ప్రసంసించాడు.

ఆయన గొంతు ఘంటసాలలా లేదు. కానీ పద్యం వింటుంటే ఘంటసాలే గుర్తుకొచ్చాడు. కారణం ఆయన అచ్చం ఘంటసాలకి లాగే పాడాడు.

శబ్దంలో, స్వరంలో ఇంత గొప్పతనం ఇముడ్చుకున్న పద్యాన్ని– బెర్లిన్ దాకా పదిలపర్చి తెచ్చుకున్నాడు రావుగారు. మరి నేను తెలుగు నాట ఉండీ– దీన్ని పట్టించుకోలేదంటే సిగ్గు పడాల్సిన విషయమనిపించింది.

ఈ పద్యం నేటికీ ఘంటసాల గాత్రంతో సహా నెట్టింట పదిలంగా ఉంది.

పద్యభావాన్నిక్కడ వివరించను. ఆసక్తి కలవారికి– పద్యభావం ఇప్పుడు గూగుల్లో దొరుకుతోంది.

రెండవ పద్యం: రామకృష్ణుడు అష్టదిగ్గజాల్లో ఒకడైన నంది తిమ్మనను పొగుడుతూ, 'మా కొలది జానపదులకు, నీ కవనపు ఠీవి యబ్బునే, కూపనటద్భేకములకు గగనధునీ శీకరముల చెమ్మ నంది సింగయ తిమ్మా' అంటాడు సవినయంగా.

మూడవ, నాల్గవ పద్యాలుః: ఎవరి కవిత్వంలోనైనా తప్పులు పడతాననీ, ఎంత క్లిష్టమైన పద్యానికయినా క్షణాల్లో అక్షరరూపం ఇవ్వగలననీ– దంబాలు పలికిన నరసకవికి గర్వభంగం కలిగించడానికి రామకృష్ణుడు 'త్భృవ్వట బాబా తలపై...' అంటూ మొదటి అక్షరంతోనే వ్రాయసగాణ్ణి తికమక పెడతాడు. తరువాత, 'తెలియనివన్ని తప్పులని' పలికినందుకు నరసకవిని, 'ప్రగడరాణ్ణరసా విరసా తుసా భుసా' అని తీవ్రంగా కోప్పడతాడు.

పద్యం చదివేక రావుగారు, 'శాంతించండి రామకృష్ణ కవీ! జయాపజయములు దైవాధీనములు' అని రాయలు సముదాయించడంలో ఎన్టీఆర్ గొంతుని మిమిక్రీ ఆర్టిస్టుల స్థాయిని ప్రదర్శించాడు.

ఐదవ పద్యం: అష్టదిగ్గజాల్లో ఒకడైన దూర్జటిని మెచ్చుకుంటూ రాయలు ఒకసారి, "స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల కల్గె నీ యతులిత మాధురీ మహిమ?" అన్నాడు. దానికి రామకృష్ణుడు, "హా! తెలిసెన్; భువనైకమోహనోద్ధత సుకుమార వారవనితా జనతా ఘనతాపహారి సంతత మధురాధరోదిత సుధారస ధారలు గ్రోలుటం జుమీ" అని బదులిచ్చాడు. దీని అర్థం, 'ఆఁ తెలిసింది. దీనికి కారణం ధూర్జటిగారు సదా సుందరాంగులైన వేశ్యల సంపర్కంలో ఉండి, వారి అధరామృతాన్ని సేవించడంవల్లనే ఆయన కవిత్వం అంత తీయగా ఉంటున్నది' అని. ఇది చెప్పి,

'అంతేనా తాతయ్యా' అంటాడు రామకృష్ణుడు. 'ఔనేమో మనవడా!' అని ధూర్జటి బదులివ్వగానే సభికులందరూ ఘొల్లుమంటారు.

పద్యం చివర్లో రావుగారు ఏయన్నార్ గొంతుని చక్కగా అనుకరించాడు.

ఆరవ పద్యం: రామకృష్ణుణ్ణి ఆట పట్టించాలని ఓ కవి– కోట కాపలావాడి చేత 'కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్' (ఏనుగుల గుంపు దోమ గొంతులోకి దూరింది) అనే సమస్యని పూరించమని రామకృష్ణుణ్ణి అడిగిస్తాడు. దానికి రామకృష్ణుడు, 'గంజాయి తాగి, తురకల సంజాతము చేత, కల్లు చవిగొన్నావా, లంజల కొడకా, ఎక్కడ కుంజర యుధంబు దోమ కుత్తుక జొచ్చెన్?' అని అడిగించిన వాడికి దిమ్మ తిరిగేలా జవాబిచ్చాడు. ఐతే ఆ కవి అంతటితో వదలక రామకృష్ణుణ్ణి ఇరుకున పెట్టడంకోసం, అదే సమస్యని రాయలవారి చేత అడిగిస్తాడు. దానికి రామకృష్ణుడు, 'పాండవులంతటివారు విరాటరాజు కొలువులో చేరడం, ఏనుగుల గుంపు దోమ గొంతులో దూరినట్లుందని' పూరించాడు. ఆ సమస్య నేపథ్యం తెలిసిన రాయలవారు, 'నీ బుద్ధికి రెండు పక్కలా పదునే రామకృష్ణయ్యా' అని అభినందిస్తాడు.

ఏడవ పద్యం: ఒకసారి నిండుసభలో అష్టదిగ్గజాలలో ఒకడైన అల్లసాని పెద్దన రాయలవారిని ప్రశంసిస్తూ, 'బృహన్నల కాకపోతే విలువిద్యలో అర్జునుణ్ణీ, గుహ నివాసం కాకపోతే బలంలో సింహాన్నీ, చంచలం కాకపోతే ఓర్పులో భూమినీ, బ్రహ్మహత్య చేసి ఉండకపోతే వైభవంలో ఇంద్రుణ్ణీ రాయలవారితో పోల్చవచ్చునని' అర్థం వచ్చేలా 'శరసంధాన...' అంటూ ఓ పద్యం చెబుతాడు. అక్కడే ఉన్న రామకృష్ణుడు అది విని మందహాసం చేస్తే, 'వికటకవు లెందుకో నవ్వుతున్నారు' అంటాడు రాయలు. బదులుగా రామకృష్ణుడు, 'తోక ముడిచి బిలప్రవేశం చేసే సింహం, ప్రభువులకు సాటి కాదంటూనే– రాజకంఠీరవా అని తాతగారు సంబోధిస్తుంటే నాకు నవ్వొచ్చింది' అని కారణం చెబుతాడు. రాజకంఠీరవా అంటే రాజసింహమా అని అర్థం మరి.

దానికి పెద్దన ''మంచి పట్టే పట్టావు మనవడా, ఏదీ నువ్వో పద్యం చదువు, చూదాం' అంటాడు. అప్పుడు రామకృష్ణుడు, 'యుద్ధంలో రాయలవారి కత్తితో నరకబడ్డ శత్రురాజులు, సూర్య మండలాన్ని దాటి వీరస్వర్గానికి వెడుతూ, ఆ మధ్యలో విష్ణుమూర్తిని జూసి, రాయలే అనుకుని భయపడి పారిపోతున్నారని' అర్థమొచ్చేలా 'కలనం దావక ఖడ్గ ఖండితరిపుక్ష్మాభర్త..... నీవ యను శంకన్ కృష్ణరాయాధిపా!' అంటూ ఓ పద్యం చెబుతాడు.

ఎనిమిదవ, తొమ్మిదవ పద్యాలుః ఇవి రెండూ సీసపద్యాలు. సీసపద్యాల్లో నాలుగు పొడుగు పాదాలు, నాలుగు పొట్టి పాదాలు ఉంటాయి. పోతనామాత్యుడు వ్రాసిన 'మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు పోవునే మధుపములకు' అన్న ప్రముఖ పద్యం సీసపద్యాలకు గొప్ప ఉదాహరణ. రాయల సభకు వచ్చిన ఓ కవి విచిత్రమైన సీసపద్యం చదివి దానికి అర్థం చెప్పమని అక్కడి కవి పండితుల్ని సవాలు చేస్తాడు. ఆ పద్యంలో మొదటి పొడుగు పాదం– 'రాజనందన రాజ రాజాత్మజుల సాటి, తలప నల్లయ వేమ ధరణి పతికి'. చిత్రమేమిటంటే. మిగతా మూడు పాదాలకూ

కూడా అదే వాక్యం వాడబడింది. వాక్యం అదే అయినా ఒకో పాదంలో దాని అర్థం ఒకోలాగానూ, భిన్నంగానూ ఉంటుంది. అలాగే పొట్టి పాదాలు నాలుగూ కూడా, 'భావభవ భోగ సత్కళా భావములను' అనే వాక్యాన్నే కలిగి ఉంటాయి, అర్థాలు మాత్రం విభిన్నం.

ఇది విన్న రామకృష్ణుడు తనూ అదే తరహాలో, 'మేకతోకకు మేకతోక మేకకు తోక మేకతోకామేక తోకమేక' అనే నాలుగు పొడుగు పాదాలూ, 'మేకకొక తోక మెకమేక తోకమేక' అనే నాలుగు పొట్టి పాదాలతో సీసపద్యం చెప్పి– దానికి అర్థం చెప్పమని వచ్చిన కవిని తికమక పెడతాడు. ఆ పద్యానికి అర్థం– మేకలు ఒకదాని ఒకటి గుంపుగా వెడుతున్నాయని!

ఇవీ రావుగారు మాకా రోజు వినిపించిన భువనవిజయ పద్యాలు.

ఆయన ఆ పద్యాలు చదువుతుంటే, మధ్యమధ్య మాటలు జోడిస్తుంటే– ఆ దృశ్యాలన్నీ కళ్లకు కట్టాయి.

మనసుకి ఆహ్లాదం. తనువుకి పరవశం.

"ఎప్పుడో చూసిన సినిమా. ఇప్పుడు చూస్తున్నట్లుంది" అన్నాను.

"అది ఆ చిత్రం గొప్పతనం. అందులో ఏ దృశ్యాన్నయినా కొంచెం గుర్తు చేస్తే చాలు. మొత్తం కళ్లకు కట్టేస్తుంది. అంతలా హృదయంలో తిష్ట వేసుకునేలా తీశారు ఆ చిత్రాన్ని. సముద్రాల, విశ్వనాథన్–రామ్మూర్తి, ఎన్టీఆర్, ఏయన్ఆర్, ఘంటసాల, సుశీల, బియస్ రంగా– ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు" అన్నాడు రావుగారు వినయంగా.

విశేషమేమిటంటే ఆయనకు ఆ చిత్రానికి సంబంధించి సాంకేతిక నిపుణులతో సహా అన్ని వివరాలూ గుర్తున్నాయి.

"ఏమో నాకు మాత్రం మీరే మహానుభావులు. సుమారు రెండు దశాబ్దాలక్రితం ఇంత గొప్ప చిత్రాన్ని చూసేనన్న అనుభూతి నాకిప్పుడే కలిగింది" అన్నాను నిజాయితీగా.

"మరీ అంతలా పొగిడెయ్యకండి. ఆయన నిజమనుకునేరు" అంది సత్యవతిగారు.

రావుగారు ఆమెవంక కాక నావైపు చూస్తూ, "అలాగంటుందా, నిజానికి నా పాటల్ని మీకంటే ఎక్కువగా పొగిడేది తనే! కాదనమనండి, చూద్దాం" అన్నాడు.

సత్యవతిగారు ఠక్కున, "ముందరికాళ్లకు బంధం" అంది.

రావుగారూ తడుముకోలేదు, "నిజమే, తన పొగడ్తలు నాకు ముందరికాళ్లకు బంధమే! నేను మొహమాటస్థుణ్ణి కదా, గట్టిగా ఎవరైనా పొగిడితే పాట పాడ్డం మానేస్తాను. నేనెక్కడ తనని మించిపోతానో అని, నేనిలా పాట మొదలెట్టగానే అలా తను పొగిడేస్తుంది. ఇంట్లో పాడి ఎన్నేళ్లయిందో, ఏదో మీ దయవల్ల మళ్లీ ఇన్నాళ్లకి నాకో అవకాశమొచ్చింది" అన్నాడు.

"ఆయన చెప్పిందాంట్లో నిజానిజాలు మీరే అంచనా వేసుకోండి. ఓ చిన్న క్లూ ఇస్తాను. మీచేత అడిగి మరీ పాడించుకుని, తను మొహమాటస్థుణ్ణి అంటున్నారాయన. ఇందాకా రాజకంఠీరవా అన్నట్లు లేదూ?" అంది సత్యవతిగారు.

రావుగారు నవ్వేశారు. అంతా నవ్వేశారు.

సంగీతం విషయంలో రావుగారు నివురు గప్పిన నిప్పన్న విషయం అప్పుడే గ్రహించిన నేను, "జోక్సుకేం కానీ, రావుగారూ– ఒక శ్రోతగా నేనిది చెబుతున్నాను. మీరు స్టేజి పెర్ఫార్మెన్సు ఇవ్వాల్సిన గాయకులు" అన్నాను.

రావుగారి మొహం గంభీరంగా ఐపోయింది, "నాకా విషయం ఎప్పుడో తెలుసు రావుగారూ! జర్మనీ చాన్సు రాగానే ఇండియాలో ఎంతోమందికి చిలక్కి చెప్పినట్లు చెప్పాను– ఇప్పుడున్నవాళ్లే శాశ్వతం అనుకోకూడదు, ఎప్పుడూ అదనంగా కొందరు ప్రతిభావంతుల్ని ఆకట్టుకుని ఉంచుకోవాలని. ఒక్కళ్లు పట్టించుకోలేదు. మరి ఆ మహానుభావుడు ఘంటసాల మనందర్నీ దుఃఖసముద్రంలో ముంచేసి అర్థాంతరంగా వెళ్లిపోయాడా– ఇప్పుడు తెలిసొచ్చి ఏడుస్తున్నారు. కానీ ఏం లాభం? ఇక్కడ ఈ సుఖాలకి అలవాటు పడ్డాక, ఎదురెత్తు ధనమిస్తానన్నా నేనా ఫీల్డులోకి వెడతానా?" అన్నాడు.

అహం లేనివారు తమని తాము పొగుడుకోవడాన్ని కూడా వేళాకోళంగా మార్చేస్తారు.

తెలుగువారికి పద్యం ప్రత్యేకం. తెలుగు నాట నాటకాల్లో ఓ వెలుగు వెలిగిన పద్యాన్ని, సినిమాలకు అన్వయించి అనుకరించిన ఘనత ఘంటసాలది. ఆయనంత గొప్పగానూ పద్యాల్ని ప్రాచుర్యం చేసిన మరో సినీ గాయకుడు మాధవపెద్ది.

పాటకంటే కూడా పద్యం పాడడం సినీ గాయకులకు పెద్ద పరీక్ష. అలాంటి పద్యాల్ని ఇంత అలవోకగా వినిపించిన రావుగారి ప్రజ్ఞని ఆయనే వేళాకోళం చేసినా భరించలేకపోయాను. అందుకే ఆయన మాటలకి నాకు నవ్వు రాలేదు, "కొత్తగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అనే కుర్రాడు పుంజుకుంటున్నాడు. కానీ అతడిది సాఫ్ట్ వాయిస్. వినడానికి మీ గొంతు పిబి శ్రీనివాసుకి దగ్గరలో ఉన్నా– పద్యాలు చదువుతుంటే ఘంటసాలనే గుర్తు చేస్తుంది..." అని ఇంకా ఏదో అనబోతుంటే....

రావుగారు నన్నాపి, "ఇలా అంటున్నానని ఏమనుకోకండి. పిబి శ్రీనివాస్ అంటే నాకూ ఇష్టమే కానీ, నాకు నా గొంతు ఘంటసాల గొంతు లాగే అనిపిస్తుంది" అని, "నేననుకుని ఏం లాభం– మీరనుకోలేదుగా" అన్నాడు.

"ఆయనకి మీ గొంతు ఎవరిదిలా అనిపించినా, పాట ఘంటసాలలాగే పాడేరని అన్నారుగా– అది చాలలేదా మీకు?" అంది సత్యవతి.

"ఎలా సరిపోతుంది? నా ప్రతిభని ఈయన గుర్తించి ఏం లాభం? ఈయనది ఆ ఫీల్డూ కాదు, గుర్తింపుకిది టైమూ కాదు" అని నిట్టూర్చి ఆ వెంటనే నవ్వేశారు.

ఆ నిట్టూర్పూ, దాన్ననుసరించిన నవ్వూ–

అదీ టైమింగంటే...

ఒక్కసారి అందరం ఘొల్లుమన్నాం.

ఏ మర్థమయిందో మా పాప కూడా నవ్వేసింది.

నవ్వుల్లోంచి తేరుకున్నాక, "ఔనూ– ఇందాకా ఏదో గాయాలు, మందు అన్నావు. మందు అక్కర్లేదనిపిస్తోందా?" అన్నాడు రావుగారు.

దానికి సత్యవతి వెంటనే, "చూసేరా, ఆయన పాటకి ఆయనకే గాయమై సలుపుతున్నట్లుంది. మందు గురించి గుర్తు చేస్తున్నారు" అంది.

అప్పుడు నేను కలగజూసుకుని, "నో మోర్ జోక్స్. లెటజ్ స్టార్ట్ ది ప్రోగ్రాం" అన్నాను.

సత్యవతి గొంతు సవరించుకుంది.

పాప స్వప్నశ్రోతలా కళ్లప్పగించి ఆమెనే చూస్తోంది.....

బెర్లిన్లో సంగీతవిభావరులూ, సంధ్యలూ

సత్యవతిగారు గొంతు సవరించుకుని, "ఇది దేవులపల్లి కృష్ణశాస్త్రి రచన. తనకు గొంతు పోయి మూగతనం వచ్చినప్పుడు ఆయన కృష్ణరజని పేరిట కొన్ని గేయాలు వ్రాశారు. కృష్ణరజని అంటే చీకటి రాత్రి అనే కాదు, కృష్ణశాస్త్రి రచనకు రజనీకాంతరావు సంగీతం సమకూర్చారన్న సూచన కూడా ఉంది" అని మరోసారి గొంతు సవరించుకుంది.

"మొదట గొంతు సవరించుకున్నది మాటలకి. ఇప్పటి సవరణ పాటకి. శ్రోతలు గమనించాలి" అన్నాడు రావుగారు వెంటనే.

"సవరించుకోవడం సవరించుకోవడమే. ఇన్ని రకాలుండవు" అంది సత్యవతి.

"ఏమో, ఆడవాళ్లు ఇంట్లో మసిలేటప్పుడు ఒకలాగా, బయటికెళ్లేటప్పుడు మరొకలాగా చీర సవరించుకుంటారనేది మా అమ్మ" అన్నాడు రావుగారు. నేటి పరిభాషలో పంచ్ అనిపించుకునే సరుకు చాలా ఉంది రావుగారి దగ్గర.

"నా నోరు కట్టెయ్యడానికి అత్తయ్య పేరు చెప్పడమెందుకూ..." అని సత్యవతిగారు మరోసారి గొంతు సవరించి, భర్త మళ్లీ ఏదో అనేలోగానే ఆలాపన మొదలెట్టింది.

అంతే– అక్కడ నిశ్శబ్దం ఆవరించుకుంది.

దేవులపల్లి కృష్ణశాస్త్రి తెలుగునాట అత్యుత్తమ భావకవుల్లో ఒకరని సాహిత్యంతో పరిచయం లేనివారికి కూడా తెలుసు. ఆయన ప్రసక్తి రాగానే 'ఊర్వశి', 'కృష్ణపక్షము' పేర్లను ప్రస్తావించడం– 'నవ్విపోదురు కాక నాకేటి సిగ్గు' అన్నది కొటేషనుగా చెప్పడం– సాహితీపరులు అనిపించుకునేందుకు సరిపోతుందని– కాలేజి రోజుల్లో డిబేట్ పోటీల్లో కొందరు మిడిమిడి జ్ఞానపువారి ప్రసంగాలు విని తెలుసుకున్నాను. సాహితీపరుడు అనిపించుకోవాలనే తాపత్రయం లేకపోవడంవల్లనూ– కథలపై ఉన్న మోజు కవిత్వంపై, ముఖ్యంగా భావకవిత్వంపై లేకపోవడం వల్ల– నాకు ఆయన సినీకవిగానే ఎక్కువ పరిచయం. ఆయన సినీగీతాలు నాకు చెప్పలేనంత ఇష్టం కూడా. ఒక దశలో ఆయనకి గొంతు పోయిందని విన్నాను కానీ, నాకీ 'కృష్ణరజని' గురించి తెలియదు.

పాట మొదలైంది.

నీ ఆనయైన స్వామీ
నా ఔదల నిడికోనా– నీ ఆనయైన స్వామీ...
పోనీలే! నీ దయ ఇంతేనని అన్నానా– నీ ఆనయైన స్వామీ...
మాట తీసుకొని నాకు
మౌన మొసగినావు!
మౌన మందికొని నీకు
గాన మియ్య మంటావు– నీ ఆనయైన స్వామీ...
నా కంఠము చీకటైన
ఈ కృష్ణ రజని తుదిని
నా కయి నీ చెయి చాచిన
నా కానుక ఇంతే గద, ఈ కొంచెపు పాటే గద– నీ ఆనయైన స్వామీ....

గుండెల్ని పిండేసే భావం. ఆ భావానికి తగ్గ స్వరకల్పన.

పాటలోని భావమంతా వరసలో నిండిపోతే, దాన్నామె గొంతు ఒడిసి పట్టుకుని వినిపించినట్లుంది.

'పోనీలే నీ దయ ఇంతేనని అనుకున్నా' అనడంలో అసహాయతో కూడిన వేదన, 'నా కంఠము చీకటైన...' అన్నప్పటి బాధ–

వాటిని పలికిన అపురూప స్వరం. ఆ స్వరానికి తోడైన సాధన.

మనది కాని ఓ గంధర్వలోకానికి వెళ్లిపోయాను.

పాటలో అనుభూతులన్నీ మనసుకి పట్టేశాయేమో– పాట ఐపోయేసరికి కళ్లు తుడుచుకోక తప్పలేదు.

ఆరోజు అమె నోట వినడమే! ఆ తర్వాత ఆ పాటని మరొకరు పాడగా వినలేదు.

అందుకేనేమో– ఆ పాట గుర్తొస్తే చాలు– ఇప్పటికీ ఆమె గొంతే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తుంది.

అప్రయత్నంగా అంతా చప్పట్లు కొడితే, నిద్రపోతున్నాడనుకున్న మా బాబు కూడా ఓసారి లేచి కూర్చుని తనూ చప్పట్లు కొట్టి మళ్లీ తల్లి ఒడిలో పడుకున్నాడు.

"ఈ పాట గురించి ఇంతవరకూ తెలియదు. ఇలా నాకు తెలియని గొప్ప పాటలు ఇంకా ఎన్నున్నాయో! సంగీత సాహిత్యాల్లో సినీగీతాలకు పరిమితమైన మా అభిరుచికి కొత్త కోణాన్నిచ్చారు. చాలా చాలా థాంక్సు" అన్నాను నేను నాతో శ్రీమతినీ కలుపుకుని.

రావుగారి మొహంలో వెలుగు. "మా అవిడని చెప్పుకోవడం కాదు కానీ, షి ఈజ్ ఆసమ్. ఇదే కాదు– ఇంకా ఎక్కడా కనీ వినీ ఎరుగని పాటలు చాలా తెలుసుకున్నాను తననుంచి" అన్నాడు గర్వంగా.

సత్యవతికి మొహమాటం వేసినట్లుంది. మాట తప్పించడానికన్నట్లు, "పాటల్నెవరూ కనరు. వింటారు" అంది తెనాలి రామకృష్ణుడి 'రాజ కంఠీరవా' లెవెల్లో,

అల్లసాని పెద్దన అంతటివాడే ఆ దెబ్బకి. "మంచి పట్టే పట్టావు మనవడా!" అని మెచ్చుకుని దాటేశాడు. కానీ రావుగారు అలా వదిలేసే రకంకాదు, "కనకుండానే పుడతాయా పాటలు?" అన్నాడు చటుక్కున.

ఈ రిటార్టు నేనూహించనిది. థ్రిల్లైపోయాను.

సత్యవతి కూడా థ్రిల్లయినట్లుంది. భర్త సమయస్ఫూర్తికి ముచ్చటగా నవ్వేసి ఊరుకుంది తప్ప మరి బదులివ్వలేదు.

ఇలాంటి భువనవిజయాలెన్నో వారింట్లో!

ఆ తర్వాత ఒకసారి అనుకోకుండా మరీ రావుగారింట్లో అంతలా కాకపోయినా మా ఇంట్లోనూ ఓ సంగీత సంధ్య (విభావరి అంటే రాత్రి కదా, మేం కలుసుకున్నది ఓ సాయంకాలం కాబట్టి సంధ్య అన్నాను) జరిగింది.

రావు దంపతుల గురించి మేం చెప్పింది విని ప్రసాద్ దంపతులు– వాళ్ల పరిచయానికి కుతూహలపడితే– మేమో సాయంత్రం వారినీ వీరినీ కూడా టిఫినుకి పిలిచాం.

అప్పుడు రావు దంపతులిద్దరూ గొంతు కలిపి, 'బ్రహ్మ కడిగిన పాదము' అన్న పాట పాడారు.

"బెర్లిన్లో మీవంటివారి నోట అన్నమయ్య కీర్తన వినే అదృష్టం కలుగుతుందని ఊహించలేదు. ముందుగా మిమ్మల్ని పరిచయం చేసిన ఈ రావు దంపతులకి, ఆ తర్వాత మీ దంపతులకి మా ధన్యవాదాలు" అంది శ్రీమతి ప్రసాద్.

ఆమెకు ఇంత సంగీతపరిజ్ఞానముందని తెలిసి ఆశ్చర్యపడ్డాను.

అన్నమయ్య కీర్తనగా నాకు తెలిసింది– అనురాగం సినిమాలో భానుమతి పాడిన 'విన్నపాలు వినవలె' ఒక్కటే. 'బ్రహ్మ కడిగిన పాదము' అన్న పాట అన్నమయ్య కీర్తన అని తెలియదు. వినడమూ అదే మొదటిసారి. వారి దాంపత్యసామరస్యం గొంతులో సమన్వయమై ఆ పాటలో ప్రతిఫలించినప్పుడా అనుభూతి అనుభవైకవేద్యం.

శ్రీమతి ప్రసాద్ సత్యవతిని సోలోగా ఓ పాట పాడమని బలవంతపెట్టింది.

శ్రోతలకు తన గానప్రతిభపై ఆరాధనాభావమున్నదని తెలిసి కూడా– పాడమని అడిగినప్పుడు, పాడక తప్పదని తెలిసి కూడా, వెంటనే పాడడానికి సత్యవతి మొహమాట పడేది. అది కప్పిపుచ్చుకునేందుకు– పాడడానికి వేరే ఏదో కారణాన్ని వెదికి పట్టుకునేది.

ఆ కారణాలు ఆమె మొహమాటాన్ని గ్రహించడానికి మాత్రమే పనికొచ్చేవి.

శ్రీమతి ప్రసాద్ అంతలా పట్టుబడుతుంటే ఆమె శ్రీమతివైపు తిరిగి, "ఈమె మరీ పట్టుబడుతున్నారు. కర్ణుడి అస్త్రవిద్యలా సమయానికి నాకేం స్ఫురించడంలేదు. మీ బాబుని చూస్తుంటే, మా చుట్టాలబ్బాయి గుర్తుకొస్తున్నాడు. వాణ్ణి మేము ముద్దుగా నున్నూ అని పిలుస్తాం" అని మా బాబు బుగ్గలు పుణికి, "నున్నూ, ఈ పాట నీ కోసం" అని గొంతు సవరించుకుంది.

మా వాడికి అన్వయమయ్యే ఆ పాట ఏమిటోనని కుతూహలంగా– నేనూ, శ్రీమతీ చెవులు రిక్కించాం.

"స్వైరిణి అన్నారు నన్ను శ్యామసుందరా!" అని ఆరంభించిందామె.

నున్నూకి ఆ పాటతో ఏ బంధం, సంబంధం లేదు– పాటలో ఆ పదానికి దగ్గర్లో ఉన్న 'నన్ను' అనే పదం తప్ప!

మైమరచి విన్నామేమో– ఆ లాజిక్ అప్పుడు స్ఫురించలేదు.

ఇక శ్రీమతి ప్రసాద్ ఐతే, "బాలాంత్రపు రజనీకాంతరావు స్వయంగా రచించి స్వరపర్చిన ఈ పాట నాకెంతో ఇష్టం. నున్నూ కోసమని మీరు అన్నారు కానీ, ఇది నాకోసమే పాడారనిపించింది" అని ఆమెను మెచ్చుకుంటూనే మురిసిపోయింది.

నా ఆశ్చర్యానికి అవధులు లేవు. అంతవరకూ ఇండియాలోనే నా ఫ్రెండ్సు సర్కిల్లో ఇంతటి సంగీత పరిజ్ఞానమున్నవారు తటస్థపడలేదు. అందుకు కారణం అలాంటివారు లేక కాదు. లోపం నా అభిరుచిలో ఉందేమో!

ఎందుకంటే, ఇక్కడికొచ్చిన సుందరం తన భార్య పాడిన 'చలమేలరా సాకేత రామా' అన్న త్యాగరాజకీర్తన టేపులో వినిపించాడు. అలాగే పిళానీ సైంటిస్టు భార్య చిన్నప్పట్నించీ ఉత్తరాదిన పెరిగినా పాడ్డానికి, 'పిలచిన బిగువటరా' పాటని ఎన్నుకునేటంత అభిరుచితో ఉంది.

నావరకూ వస్తే---.

చిన్నప్పుడు రేడియోలో వచ్చే లలిత సంగీత కార్యక్రమానికి ఆమడ దూరంలో ఉండేవాణ్ణి. పెద్దయినా రేడియో పెట్టుకునేది సినిమా పాటలకోసమే! సంగీత సరస్వతీ కటాక్ష లబ్ధులైన రావు దంపతుల సాహచర్యంతో– నా అభిరుచిని విస్తృతం చేసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. పాటలంటే సినిమా పాటలే కాదు– లలిత సంగీతం కూడా అంత జనాకర్షకంగానూ ఉంటుందని గ్రహించాను. అంతే కాదు– లలిత సంగీతంలో జనరంజనకంటే, ఉదాత్తతకు ప్రాధాన్యమని అర్థమైంది.

శ్రీమతి వెంటనే, "సంగీతానికి శుశ్రూష అంటారు. మరి సంగీత పరిజ్ఞానానికీ మీవంటివారి శుశ్రూష చెయ్యాలని నాకనిపిస్తోంది" అని శ్రీమతి ప్రసాద్‌ని మెచ్చుకుంది.

సత్యవతి వెంటనే, "అది ఉత్త పరిజ్ఞానం కాదు. జ్ఞానంతో వచ్చిన పరిజ్ఞానం" అని పాట పాడమని శ్రీమతి ప్రసాద్‌ని బలవంతపెట్టింది.

ఆమె కూడా సత్యవతిలాగే మొహమాటపడి, "మీ బాబు పేరు శ్రీరామకమల్ కదా! రాముడిమీద పాట పాడతాను" అని గొంతు సవరించుకుంది.

'రాముడుద్భవించినాడు రఘుకులమ్మున....' అని ఆమె ఎత్తుకునేదాకా ఆమె స్వరంలో అంత సంగీతముంటుందని నేనూహించలేదు. ఆతర్వాత సత్యవతి బలవంతపెట్టగా, 'శివుడు తాండవము చేసెనమ్మా, కైలాసగిరిలో శివుడు తాండవము చేసెనమ్మా' అని మరో పాట పాడింది.

తను పాడడమే కాదు, ఎదుటివారిలోని సంగీత ప్రతిభను గుర్తించే శక్తి సత్యవతికి ఉన్నట్లు అప్పుడే నేను గ్రహించాను.

రేడియోలో సినిమా పాతల శ్రోతగా పొందిన ఆనందం భౌతికం. జనరంజకమైన ఈ లలితగీతశ్రవణం ఇచ్చే అనుభూతి అలౌకికం.

సంగీతలోకం నుంచి, వాస్తవలోకంలోకి వస్తే– అక్కడ రావుగారితో ముచ్చట్లు లోకంపోకడపట్ల అవశ్యమైన అవగాహన కలిగించడానికి ఎంతో దోహదం చేశాయి.

రావుగారి ముచ్చట్లు

మొదటిసారి రావుగారింట్లో భోజనానికి వెళ్లినప్పుడు ముందోసారి ఇల్లంతా చూసొచ్చాం. \

ఇల్లు మరీ పెద్దది కాకపోయినా కుదుమట్టంగా ఉంది. అక్కడి నియమాల ప్రకారం పిల్లలిద్దరికీ కూడా వేర్వేరు బెడ్రూంలున్నాయి. కిచెనూ, డ్రాయింగురూమూ. డైనింగ్ హాల్ లేదు.

డ్రాయింగ్ రూంలో కలర్ టివి ఉంది. అప్పటికి ఇండియాలో నాలుగు మెట్రో నగరాల్లో తప్ప మరెక్కడా టివి సదుపాయం లేదు. ఆ ఉన్నది కూడా నలుపు–తెలుపు టివి. ఓ భారతీయుడు, అదీ ఓ తెలుగువాడు డ్రాయింగ్ రూంలో కూర్చుని కలర్లో టివి కార్యక్రమాలు చూడ్డం నాకు గొప్ప అదృష్టంగా అనిపించింది.

కబుర్లు చెప్పుకున్నా నా దృష్టి టివి మీదే ఉంది. అప్పుడు ఏదో కౌబాయ్ పిక్చర్ నడుస్తోంది. అలాంటి సినిమాలకి భాషాభేదం లేదు కదా! కాస్త ఆసక్తిగానే చూస్తున్నాను. దాంతో మిగతా ముగ్గురు పెద్దలూ కబుర్లలో పడితే, నేను సినిమానే చూస్తున్నాను. శ్రీమతికి సినిమాలంటే ఆసక్తి తక్కువ కనుక, తను కబుర్లలో బాగానే ఇన్వాల్వయింది.

ఉన్నట్లుండి, "మీవారు మనలో లేరు. కౌబాయ్ డ్రెస్సేసుకుంటే కానీ నావంక చూడరేమో!" అన్నాడు రావుగారు.

ఉలిక్కిపడ్డాను. ఆ వెంటనే మొహమాటంతో కూడిన సిగ్గు. సద్దుకుందుకు, "అంతెత్తు మనిషి మీరు. మీ పెర్సనాలిటీకి కౌబాయ్ డ్రెస్సూ, టోపీ చాలా బాగుంటాయ్. నిజంగానే చూడాలనుంది" అన్నాను.

"సరే– ఆ రెండూ సమకూర్చుకోవడం పెద్ద కష్టమేం కాదు. గుర్రమెక్కమంటేనే ఇబ్బంది" అని నవ్వేశాడు రావుగారు.

"అలాగంటారు కానీ, ఆయనకి గుర్రమెక్కడం మహా సరదా. ఇప్పటికీ రంగులరాట్నం ఎక్కితే గుర్రంమీదే కూర్చుంటారు. షాపుల బయట పిల్లలకోసం గుర్రం బొమ్మలుంటాయి కదా, వాటిమీద కూర్చోవాలని ఈయనకి మహా మనసు. ఎలాగో వారిస్తున్నాను. ఇక బాబు పుట్టినప్పట్నించీ– వాడికి గుర్రం కొనాలని తెగ ఉబలాటపడిపోతున్నారు. వాడి కోసం కాదు. తనకోసం. ఎవరూ చూడకుండా ఇంట్లో దానిమీద కూర్చుని ఊగాలని! ఇంత మనిషికి పిల్లలాడుకునే గుర్రం ఆగుతుందా! వాడు కాస్త ఎదిగేదాకా ఆగమని చెబుతున్నాను. అప్పుడు వాడే ఆయన్ని తన గుర్రాన్ని ముట్టుకోనివ్వడు" అంది సత్యవతి.

"మా ఆవిడెప్పుడూ ఇంతే! నన్ను వేసినట్లే మా బాబునీ తక్కువ అంచనా వేస్తుంది. గుర్రమేమిటి, వాణ్ణొదిలితే ఎవరెస్టు కూడా ఎక్కేస్తాడు వాడు. అది నాకు తెలుసు..." అన్నాడు రావుగారు.

"ఆఁ, లౌఫ్ గిత్తర్ పట్టుకుని నాలుగడుగులేస్తేనే పది సార్లు పడేవాడు, వాడు ఎవరెస్టు ఎక్కుతాట్ట....." అంది సత్యవతి వెంటనే.

"లౌఫ్ గిత్తరా?" అంది శ్రీమతి అర్థంకాక.

రావుగారు నవ్వి, "అదే తోపుడు బండి. మా అవిడ ఇలాంటి వాటికి పొరపాటున కూడా తెలుగు మాట వాడదు" అన్నాడు.

"ఇక్కడున్నప్పుడు పిల్లలకి ఇక్కడి మాటలు తెలియకపోతే ఎలా? ఈయనేమో–
వాడితో ఇది ఆవురోయ్, ఇది లక్కపిడతరోయ్, ఇది గొట్టాం రోయ్– అంటూ తెలుగు తప్ప మాట్లాడరు. అందుకని నేను పని కట్టుకుని జర్మన్ పదాలు వాడుతున్నాను" అంది సత్యవతి.

"నీ అలవాటు నీకు ముద్దే కావచ్చు కానీ, భోజనాల దగ్గర వంటకాల పేర్లు జర్మన్లో చెప్పకు. వచ్చినవాళ్లు జడుసుకుంటారు" అన్నాడు రావుగారు.

"ఈయనకి ఆకలేస్తున్నట్లుంది. ఇక భోజనాలకు లేద్దాం" అంటూ సత్యవతి లేచి వంటింట్లోకి వెళ్లింది. శ్రీమతి ఆమెను అనుసరించింది.

"ఈలోగా నేను డైనింగ్ టేబుల్ రెడీ చేస్తాను" అంటూ రావుగారు తనూ లేచాడు.

డైనింగ్ టేబుల్ ఎక్కడుందా అని చుట్టూ చూస్తూ నేనూ లేచి నిలబడ్డాను.

రావుగారు కొంచెం వంగి, మాముందున్న టీపాయ్‌కి నాలుగు పక్కలా కిందకు వాలి ఉన్న బల్లల్ని పైకి ఎత్తి నిలబెట్టాడు. అంతే! టీపాయ్ డైనింగ్ టేబులంత పెద్దగా మారిపోయింది.

"ఇదేదో బాగుందే. మా ఆవిడకి చూపించాలి" అన్నాను అప్రయత్నంగా.

రావుగారు ఆశ్చర్యంగా, "ఇలాంటిది మీరెప్పుడూ చూడలేదా?" అని నవ్వి, "ఏదో అడగాలని అడిగేను కానీ, ఇలాంటిది మొదటిసారి నేనూ ఇక్కడే చూశాను. యథాలాపంగా చేసినట్లు నటిస్తా కానీ, మీరు ఎక్సయిటౌతారని నాకు తెలుసు" అని నవ్వేశాడు.

నేను శ్రీమతిని పిలిచాను. ఆయన మరోసారి డైనింగ్ అరేంజ్‌మెంటు డిమాన్‌స్ట్రేట్ చేసి, "మేమిద్దరమే ఉన్నప్పుడు టీపాయ్. గెస్టులు ఇద్దరికి మించినప్పుడు డైనింగ్ టేబుల్. స్పేస్ సేవింగ్ అండ్ కన్వీనియంట్" అన్నాడు.

"ఇండియా వెళ్లగానే ఇలాంటిదొకటి ఆర్డరిచ్చి చేయించాలి" అన్నాను.

"అబ్బే, అక్కడ ఇవెందుకూ? జమీందార్ల ఇళ్లలోలాగా ఒకేసారి పాతికమంది తినేలా పొడవాటి పెద్ద టేబుల్ చేయించుకోవచ్చు. మనకక్కడ స్పేస్ ప్రోబ్లం లేదుగా" అన్నాడు రావుగారు.

"మనం జమీందార్లం కాదుగా, చిన్న టేబుల్ చాల్లెండి" అన్నాను.

రావుగారు నవ్వి, "ఆ మాటకొస్తే, ఇక్కడికొచ్చేదాకా భోజనానికి టేబులే వాడలేదు. బాసింపట్టేసుకుని కింద కూర్చుని తినడమే" అన్నాడు.

అప్పుడు స్ఫురించింది నాకు. రావుగారా మాట సరదాకి అనుండొచ్చు. కానీ నావరకూ చూస్తే, అంతవరకూ ఇండియాలో– హొటళ్లలో ఐతే ఏమో కానీ, ఇప్పటికీ భోజనానికి బాసింపట్టేసుకుని కింద కూర్చోవడమే!

ఎమ్మెస్సీ చదవడానికి వైజాగ్ వెళ్లినప్పుడు హాస్టల్లో కాకుండా వాల్తేర్ అప్‌లాండ్సులో వేరే గది తీసుకుని ఉండేవాళ్లం నేనూ, మా అన్నయ్యా! అక్కడే మొదలయింది బల్లమీద హొటలు భోజనం. ఐతే అక్కడ కూడా మేము ప్రాధాన్యమిచ్చింది– పీటల హొటలుకి. అక్కడ నేలమీద కూర్చోడానికి పీట వేసి, ముందు అరిటాకు వేసి వడ్డించేవారు. అదీ మాకు నచ్చడానికి కారణం.

అలాంటి నేనిప్పుడు డైనింగ్ టేబుల్సు గురించి చర్చిస్తున్నాను– పెద్ద అలవాటైనవాడిలా!

రావుగారి అణకువ నన్ను మళ్లీ వాస్తవానికి తీసుకొచ్చింది.

రావుగారింట మాకు అచ్చమైన తెలుగు విందు లభించింది. ముఖ్యంగా తెలుగువారికి ప్రాణప్రదమైన గోంగూర పచ్చడి.

"చాలాకాలం తర్వాత తినడంవల్ల అనుకోను. నిజంగానే ఈ పచ్చడి అద్భుతంగా ఉంది. ఈ పాళ్లు వేరనుకుంటాను" అంది శ్రీమతి.

"ఇది అమలాపురం టేస్ట్ సార్! దానికి మా అమ్మ చెయ్యి పడింది. షిప్పులో తెప్పించాం" అన్నాడు రావుగారు.

"షిప్పులోనా?" అన్నాను ఆశ్చర్యంగా.

సత్యవతి తలాడించి, "కేజీ పాకెట్టు. ఓ పెద్ద సీసాలోకి తియ్యగా, కొంచెం మిగిలితే వేరే చిన్న సీసాలోకి తీశాను. మీలాంటివాళ్లెవరైనా వస్తే రుచి చూపించడానికే కాదు, రుచికి ఇవ్వాలని కూడా అనుకున్నాను" అంది.

ఆమె ఇంకా ఏదో చెప్పబోతుండగా, రావుగారు అందుకుని, "అదో పెద్ద విషాదగాథ రావుగారూ! మీరు వినాలి. జీవితపాఠంగా పనికొస్తుంది" అన్నాడు.

పది రోజుల క్రితం ఉత్తరాది మిత్రులు వాళ్లింటికి భోజనానికొచ్చేరుట. 'చపాతీలొద్దు, మాకు అచ్చ తెలుగు భోజనం కావాలి' అన్నారుట. సత్యవతి వాళ్లకోసం కారాలు తక్కువేసి వంటలు చేసిందిట. చప్పిడి వంట గొంతు దిగకపోతే. నాలిక్కి రాసుకోవచ్చని అప్పటికి వాడుతున్న గోంగూరపచ్చడి సీసా బల్లమీద పెట్టిందిట. వచ్చినవాళ్లకి సత్యవతి వంటలు తెగ నచ్చి లొట్టలేసుకుంటూ తింటున్నారుట. ఐతే సత్యవతి, రావుగారు మాత్రం ప్రతి ఐటముకీ కొంచెం గోంగూరపచ్చడి తగిలిస్తున్నారుట.

అతిథులది గమనించి, 'అదేమిటీ, మాకు పెట్టకుండా మీరొక్కరే తింటున్నారు?' అనడిగేరుట.

'మీకోసం పదార్థాల్లో కారాలు తక్కువేశాను. తక్కువైన కారాన్ని ఇలా భర్తీ చేసుకుంటున్నాం' అందిట సత్యవతి.

'అలాగా, నేనూ ఓసారి ట్రై చేస్తాను' అంటూ అతిథి దేవి చెంచాతో పచ్చడి తీసుకుని, చెంచాని చప్పరించి, 'అద్భుతం. ఈ మాత్రం కారం మేమూ తింటాం' అంటూ ఆ చెంచాని సీసాలో పెట్టి మరికొంచెం పచ్చడి తీసుకుందిట.

ఎంగిలి చెంచా పెట్టొద్దని ఆమెని వారించడానికి కూడా అవకాశం దొరకలేదు సత్యవతికి.

"చెప్పినా ప్రయోజనం లేదు. ఉత్తరాదివాళ్లకి ఎంగిలి పట్టింపు ఉండదు" అన్నాడు రావుగారు కథ ముగిస్తూ.

"మరి ఆ పచ్చడినేం చేశారు?" అంది శ్రీమతి కాస్త అనుమానంగా.

"ఏం చేస్తాను? వాడుతున్న సీసా కదా అని పెద్దది బల్లమీద పెట్టాను. అప్పటికింకా మూడొంతుల పచ్చడి ఉంది. వాళ్లకు లేకపోవచ్చు కానీ, మనకు ఎంగిలి పట్టింపే కదా! 'మీకు అంతగా నచ్చింది కాబట్టి, మీరు తీసుకెళ్లండి' అని వాళ్లకిచ్చేశాను. ఇప్పుడు మనం వాడుతున్నది చిన్న సీసాలోది. చాలా కొంచెం ఉంది. మీకిచ్చేటంత లేదు" అని నిట్టూర్చింది సత్యవతి.

"ఉత్తరాది, దక్షిణాది అని కాకుండా– వచ్చినవారి తీరు ఎలా ఉంటుందో తెలియదు కాబట్టి– అతిథుల వడ్డనకి పదార్థాలు చిన్న చిన్న గిన్నెల్లో ఉంచి పెట్టాలి. అదీ పాఠం" అన్నారు రావుగారు.

"గోంగూర పచ్చడి సంగతెలాగున్నా, ఇక్కడ కూడా మన సరుకులు బాగానే దొరుకుతున్నాయి. చింతపండుతో సహా చాలా సరుకులు మేం హాంబర్గునుంచి తెప్పించుకుంటున్నాం. అన్నీ బాగానే ఉంటున్నాయి కానీ, ఇడ్లీ రవ్వ అని ఏదో ఇస్తాడు. ఎంత ప్రయత్నించినా ఇడ్లీలు గట్టిగా రాళ్లలా వస్తుంటే, కొనడం మానేశాం. పాపం, ఈయనకి ఇడ్లీ అంటే ప్రాణం" అంది శ్రీమతి.

సత్యవతి వెంటనే, "నిజమే! ఇక్కడి నూకతో ఇడ్లీలు గట్టిగానే వస్తాయి. మేము ఇండియానుంచి షిప్పులో తెప్పిస్తాం. ఇడ్లీలు మెత్తగా దూది పింజల్లా వస్తాయి. నాలుగు రోజుల్లో షిప్‌మెంటు వస్తుంది. వీలు చూసుకుని ఓ శనివారం ఇడ్లీమీట్ పెట్టుకుందాం" అంది.

రావుగారు వెంటనే, "అసలు ఇంట్లో ఇడ్లీ నూక చాలానే ఉండేది....." అని ఏదో అనబోతుండగా–

"ఇప్పుడా కథెందుకూ? మళ్లీ కలుసుకున్నప్పుడు చెప్పుకుందుకో కొత్త కథ ఉండాలిగా" అంది సత్యవతి.

ఆ కొత్త కథ అప్పుడు వినిపించకుండా వారించడానికి కారణం తర్వాత తెలిసింది.

రావుగారింట్లో ఇడ్లీ ముచ్చట్లు

జీవితాన్ని ఆస్వాదించడానికీ, అవగాహన చేసుకుందుకూ మధ్యతరగతికి మించినది లేదు.

నలుగురితో ఎలా మసలాలో, ఎలా మసలకూడదో అక్కడే తెలుస్తుంది.

ఎలా మసలకూడదని మనమనుకుంటామో, అలాగే మసలేవారిని ఎలా స్వీకరించాలో కూడా అక్కడే తెలుస్తుంది.

మనకి నచ్చనివారిలో మంచినీ, నచ్చినవారిలో చెడునీ గ్రహించేందుకు సహకరిస్తుంది.

ఐతే నాలుగు గోడలకే పరిమితమైనవారికి ఇవన్నీ సాధ్యపడవు.

నలుగురితో కలిసిమెలిసుండాలని పెద్దలనేది అందుకే.

బెర్లిన్లో రావుగారి పరిచయంతో– అతి చిన్నవిగా మనం భావించే విషయాలకు జీవితంలో ఎంత ప్రాముఖ్యముంటుందో మరింత బాగా అర్థమయింది.

ఉదాహరణకి ఇడ్లీ...

మామూలుగా తెలుగువాళ్లకి ప్రత్యేకమైన ఫలహారాల్లో ఇడ్లీ ఒకటి.

తెలుగునాట ఎక్కువమంది హొటలు కెడితే ముందు ఇడ్లీ ఆర్డరిచ్చి ఆ తర్వాతనే పెసరట్టో, దోశో, పూరీలో చెబుతారు.

ఒక్కటే ఐటం తినేవాళ్లయితే, ఇడ్లీ చెప్పి కాఫీ చెప్పేస్తారు.

రావుగారికిది తెలుసు. ఆపైన తెలుగు నాట తనది కోనసీమ. అతిథ్యంలో ప్రపంచప్రఖ్యాతి గాంచిన డొక్కా సీతమ్మ ప్రభావితం చేసిన ప్రాంతమది. సత్యవతిగారు ఆయనకు తగిన ఇల్లాలు.

బెర్లిన్లో కొన్నాళ్లుండడానికొచ్చిన తెలుగువాళ్లు ఇడ్లీ ఫలహారాన్ని తప్పక మిస్సవుతారని ఆ దంపతులు అనుకుంటారు.

తెలుగు వాళ్లెవరైనా తమ ఇంటికొస్తున్నట్లు కనీసం ఓరోజు ముందుగా తెలిస్తే చాలు– కనీసం మొదటిసారికి ఇడ్లీతో ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటారు.

అందుకని వాళ్లు ఇక్కడ దొరకనివి ఇండియానుంచి ఓడలో తెప్పించుకున్నప్పుడు, ఇడ్లీనూకని కాస్త ఎక్కువే తెప్పిస్తుంటారు.

మాకు ఇడ్లీ తినిపించాలనే ఆశయంతోనే ఓ శనివారం మమ్మల్ని ఫలహారానికి పిలిచారు.

నాకైతే ఇడ్లీ గురించిన ఎక్సయింట్మెంటు కంటే, ఆ సమావేశంలో ఆయన చెప్పబోయే ఇడ్లీ కథ వినాలన్న ఆత్రుతే ఎక్కువగా ఉంది.

వెడుతూనే నేను రావుగార్ని, "ఇడ్లీల గురించి ఏదో కథ చెబుతానన్నారు" అన్నాను.

"అది ఫలహారానికి ముందు చెప్పకూడదు. తర్వాత కూడా వాతావరణం అనువుగా ఉంటేనే!" అన్నాడు రావుగారు.

అతడలా అనేసరికి–నిజంగా ఏదైనా కథ ఉందా, లేక మాకు ఆతిథ్యమివ్వడానికి ఊరికే అలా అన్నారా అనిపించింది.

నేను కూడా మరీ నొక్కించలేదు.

"కథ అనుమానమని మమ్మల్ని నిరుత్సాహపర్చారు. మమ్మల్ని ఉత్సాహపర్చడానికి సత్యవతిగారు ఓ పాట పాడాలి" అంది శ్రీమతి.

విన్నపం యథాలాపమో, కళాప్రియత్వమో– కళాకారులకు తెలుస్తుంది.

సత్యవతిగారు వెంటనే పాట అందుకున్నారు.

'చందన చర్చిత నీల కళేబర పీతవసన వనమాలీ.....'

తెనాలి రామకృష్ణ సినిమాలో విశ్వనాథన్–రామ్మూర్తి సంగీతంలో సుశీల పాడిన పాట ఆరోజుల్లోనూ నాకెంతో ఇష్టం. అది లలితం.

అదే పాటని కొంచెం శాస్త్రీయ సంగీతపు వణుకులతో కలిపి పాడింది సత్యవతి. వింటుంటే ఇలాగే ఎక్కువ బాగుందనిపించింది,

ఆపైన ఆ సుశీలే ఆహా అనదా అనిపించే గొంతులో ఆలాపన, చరణాలు.

ఆ వీనుల విందు తర్వాత ఏ విందైనా మురిపించడం కష్టమే!

కానీ వారారోజున ఆతిథ్యమివ్వడానికి ఎన్నుకున్నవి ఇడ్లీలు.

దూది పింజలాంటి ఇడ్లీలు. పరిమాణంలో కాస్త పెద్దవి.

అనుపానంగా కొబ్బరి చట్నీ, అల్లం చట్నీ, కారప్పొడి–నెయ్యి.

ముందు పిల్లలకి పెట్టేసేక మేమూ తినడానికి కూర్చున్నాం.

"నేను వడ్డిస్తా" అంటూ శ్రీమతి మా నలుగురి ప్లేట్లలోనూ రెండేసి ఇడ్లీలు వేసింది.

రావుగారు నవ్వి, "అమ్మో! ఈమెకి లౌక్యం ఎక్కువే, మాటవరసకి వడ్డిస్తానన్నా, పిలిచినవారే వడ్డించాలన్న పట్టింపన్న మాట!" అన్నాడు.

అంటే తను తక్కువ వడ్డించిందని అతడి భావం.

మేము స్పందించేలోగానే సత్యవతి అందరి ప్లేట్లలోనూ, మరో రెండేసి ఇడ్లీలు వేసింది.

"చిన్నవైతే మూడు, తప్పితే నాలుగు. ఇవి చాలా పెద్దవి. రెండుకంటే తినడం కష్టం" అని ప్లేట్లో ఇడ్లీ తీసెయ్యమని శ్రీమతికి సైగ చేశాను.

"ఏంచేస్తాం? కష్టాలు చెప్పి రావని సరిపెట్టుకోండి" అంటూ రావుగారు శ్రీమతి ప్రయత్నానికి అడ్డుమాట వేశాడు.

ఐనా శ్రీమతి మా ఇద్దరి ప్లేటల్లోంచీ ఒకో ఇడ్లీ తీసేసింది.

"మేం తియ్యడం లేదు. ఎందుకంటే మీరు తీసేసింది మీ చేత తినిపించడానికి నైతికబలం కావాలిగా" అన్నాడు రావుగారు.

తర్వాత సరదాగా అంతా టిఫిన్ చేశాం.

'కొబ్బరి చట్నీ ఎలా చేసినా బాగానే ఉంటుంది. మీ ఇంట్లో మరింత బాగుంది.

కానీ అల్లం చట్నీ చెయ్యాలంటే పదునెక్కువ. కుదరక మేం చేసుకోవడం మానేశాం. పదును కుదిరిన అల్లం చట్నీ అంటే ఇదీ!" అన్నాను.

శ్రీమతి వెంటనే సత్యవతిగారిని– ఆ చట్నీ ఫార్ములా అడిగింది.

సత్యవతికి తెలుసు. ఆ చట్నీ తనకే ప్రత్యేకమైనదని. కానీ మొహమాటంతో, "అందులో ఏముందీ, మామూలుగానే చేశాను" అంది.

ఆ పూట మేము నాలుగేసి ఇడ్లీ తిన్నాం. నాల్గవది తిన్నాక పొట్ట బరువెక్కింది కూడా.

"బయల్దేరాలన్నా కదిలే పరిస్థితి లేదు. ఇందాకా చెబుతానన్నారు. కాలక్షేపానికైనా ఇప్పుడా ఇడ్లీ కథ చెప్పండి" అన్నాను.

రావుగారు సత్యవతివంక చూశాడు. అతడి ప్రశ్న కళ్లలో ఉంది.

'ఫరవాలేదు. చెప్పొచ్చు' అన్నాయామె కళ్లు.

రావుగారు గొంతు సవరించుకుని, "కవిబాబు మీకు తెలుసు కదా, అతడే ఈ కథలో హీరో!" అన్నాడు...

కవిబాబు వాళ్లకి ఇటీవలే పరిచయమయ్యాడు. ఆ వెంటనే వచ్చిన శనివారం విందుకి ఆహ్వానించాడు రావుగారు.

'విందుకా, ఐతే ఈ శనివారం కుదరదు. మరోసారి వస్తాంలెండి' అన్నాడు కవిబాబు.

'ఏం, ప్రతి శనివారం ఉపవాసముంటారా?' అడిగాడు రావుగారు.

'అన్ని శనివారాలూ కాదు కానీ, ఈ శనివారం నేను అన్నం తినను. ఫలహారమే– అదీ లైటుగా' అన్నాడతడు.

'తొలి పరిచయం కదా, లైటుగా టిఫినే మంచిది, విందు భోజనానికి మరోసారి వద్దురుగాని' అన్నాడు రావుగారు.

కవిబాబు సరేనన్నాడు.

అతడికోసం ఇడ్లీ ప్లాన్ చేసింది సత్యవతి.

శనివారం కవిబాబు వచ్చాడు.

కాసేపు అవీ ఇవీ కబుర్లు చెప్పుకున్నాక వంటింట్లోకి వెళ్లింది సత్యవతి. లోపల్నుంచి కొబ్బరి చట్నీ, అల్లం చట్నీ, కారప్పొడి, నెయ్యి ఉన్న నాలుగు గిన్నెలు తెచ్చి, డైనింగ్ టేబుల్ కం టీపాయ్ మీద పెట్టింది. అప్పటికే బల్లమీద మంచినీళ్లతో గ్లాసులున్నాయి.

తర్వాత ఇడ్లీలు తేవడానికి లోపలికెళ్లింది.

ఇడ్లీల పరిమాణం కాస్త పెద్దదే.

మామూలుగా ఐతే రాత్రికి ఫలహారం చేసినప్పుడు రావు దంపతులు ఒకొక్కరు మూడేసి ఇడ్లీలు తింటారు.

ఆ రోజు అతిథి ఉన్నాడు కదా అని ప్లేట్లో నాలుగు ఇడ్లీలు వడ్డించి తీసుకొచ్చి రావుగారికీ, కవిబాబుకీ అందించి, 'అనుపానాలన్నీ కొంచెమైనా రుచి చూసి నా వంటకు సర్టిఫికెట్ ఇవ్వాలి' అందామె కవిబాబుతో.

ప్లేట్లో టిఫిన్ చూస్తూనే, 'ఇడ్లీలా?' అని పెదవి విరిచాడు కవిబాబు.

రావుగారు నొచ్చుకుని, 'మీకు ఇడ్లీలు నచ్చవా?' అన్నాడు.

'అయ్యో, ఇడ్లీ నచ్చని తెలుగువాడుంటాడా? నేను పదహారణాల ఆంధ్రుణ్ణి. కానీ ఈ జర్మన్ అన్న పదం ఉందే, దాంతో వచ్చింది తంటా. సిల్వర్ ముందు జర్మన్ అన్న పదం తగిలించండి– అర్థమెంత మారిపోతుందో! జర్మన్ సిల్వర్ లాగే జర్మన్ ఇడ్లీలన్నమాట! అవంటే నాకు భయం' అన్నాడు కవిబాబు.

రావుగారికి అర్థమయింది. ఐనా బయటపడకుండా, 'ఎందుకని?' అన్నాడు.

'ఏంలేదు– కొన్నాళ్లుగా నాకో పన్ను నొప్పిగా ఉంటోంది. డెంటిస్టు అపాయింట్మెంట్ తీసుకోవాలనుకుంటున్నాను. ఈలోగానే మీరు పిలిచారు, టిఫిన్ ఇడ్లీ అని ముందుగా చెబితే, పెయిన్ కిల్లర్ ఏదైనా వేసుకుని వచ్చేవాణ్ణి' అన్నాడు.

రావుగారు నొచ్చుకుని, 'అయ్యో! మిమ్మల్ని సర్ప్రయిజ్ చెయ్యాలని ముందు చెప్పలేదు. ఐనా పంటినొప్పి ఉంటే, ఇడ్లీయే ఏంటి– ఏం తినాలన్నా బాధే కదా! పెయిన్ కిల్లరు టాబ్లెట్లు మా ఇంట్లో ఉన్నాయి. కావాలంటే ఇస్తాను' అన్నాడు గంభీరంగా.

కవిబాబు ఫక్కున నవ్వాడు. తర్వాత, 'జోక్ చేశాను. అర్థం కాలేదా?'' అన్నాడు.

'జోకా?' అన్నాడు రావుగారు ఆశ్చర్యంగా.

కవిబాబు వెంటనే, 'నాకు జోక్సు వెయ్యడం అలవాటు. కానీ కవిని కదా, నా జోక్సు లోతుగా ఉండి, అందరికీ ఓ పట్టాన అర్థం కావు. అప్పుడు గణేశ్ దంపతులకీ అర్థం కాలేదు. ఇప్పుడు మీకూ అర్థం కాలేదు' అన్నాడు.

'గణేశ్ దంపతులా, వాళ్లెవరు?' అన్నాడు రావుగారు.

'వాళ్లు గొటింజన్ సిటీలో ఉంటారు లెండి. అక్కడా ఇలాగే ఓ షాపులో పరిచయమయ్యారు వాళ్లు. మీలాగే టిఫినుకు పిలిచారు. మీలాగే ఇడ్లీ టిఫిన్ పెట్టారు. అదే జర్మన్ ఇడ్లీ' అని గొంతు సవరించుకున్నాడు కవిబాబు.

ఆ ఇడ్లీలెంత గట్టిగా ఉన్నాయంటే, తింటుంటే పళ్లు కదిలిపోతున్న ఫీలింగొచ్చింది కవిబాబుకి.

వీడ్కోలు తీసుకుంటూ అతడు వాళ్లతో, 'మీరు నాకంటే చిన్నవాళ్లలాగున్నారు కాబట్టి దీవిస్తున్నాను. రాళ్లు తిని అరాయించుకునే శక్తి మీకు ఎప్పటికీ ఉండాలి' అన్నాడు.

వాళ్లకి కవిబాబు జోక్ అర్థం కాలేదు. వినయంగా ధన్యవాదాలు చెప్పారు.

'ఇడ్లీకంటే ఎక్కువ బాధపెట్టింది, వాళ్లు నా జోక్ అర్థం చేసుకోకపోవడం' అని,

'ఆ తర్వాత, ఇదిగో మళ్లీ ఈరోజు మీకూ నా జోక్ అర్థం కాలేదు' అన్నాడు కవిబాబు రావుగారితో.

రావుగారు నవ్వి, 'మీది జోకయితే, అది నాకెందుకు అర్థం కాలేదో, ఇడ్లీ తిన్నాక తెలుస్తుందిలెండి' అన్నాడు.

కవిబాబు ఒకసారి అతణ్ణి ఆశ్చర్యంగా చూసి, తన ముందున్న ఇడ్లీలపై నెయ్యి చల్లి, 'మనవాళ్లకి దూరదృష్టి ఎక్కువ. పాషాణాన్నయినా మెత్తబరుస్తుందని, ఇడ్లీలకి నెయ్యి కాంబినేషన్ చేశారు' అని ఆ దంపతులవంక చూశాడు.

'ఊఁ'' అన్నాడు రావుగారు.

'ఊఁ ఏమిటి? అది జోకు' అన్నాడు కవిబాబు మొహం చిన్నది చేసుకుని.

సత్యవతి మొహమాటానికి నవ్వింది.

కానీ రావుగారు, 'మీరు ఇడ్లీ రుచి చూసేదాకా నేను నవ్వనుకాక నవ్వను. మీరేమనుకున్నా సరే!' అన్నాడు.

కవిబాబు రావుగారిని అదోలా చూశాడు. ప్లేట్లోకి కొంచెం కొబ్బరి చట్నీ వడ్డించుకుని మొదటి ఇడ్లీ ముక్క విరిచి ఉలిక్కిపడ్డాడు.

వెంటనే చట్నీ అద్దుకుని నోట్లో వేసుకున్నాడు.

ఒక్క క్షణం.

అంతే, ఎవరో తరుముతున్నట్లుగా వాష్ బేసిన్ వద్దకెళ్లి చెయ్యి కడుక్కుని వచ్చాడు.

కవిబాబుకి టిఫిన్ నచ్చలేదని అర్థమై రావుగారి మొహం పాలిపోయింది. మనసులో మాత్రం, 'నచ్చకపోతే మాత్రం, మరీ అంత మొరటుగా తెలియజెయ్యాలా?' అనుకున్నాడు.

అలా జరుగుతుందని ఊహించలేదేమో, సత్యవతి కూడా నిశ్చేష్టురాలయింది.

మాటలు రాక తడబడుతున్న ఆ దంపతులిద్దరికీ చటుక్కున చేతులు జోడించాడు కవిబాబు.

ఇంకా తెల్లబోయి చూస్తున్న వాళ్లతో, 'ఈ బెర్లిన్ మహానగరంలో ఇలాంటి అద్భుతమైన ఇడ్లీ దొరుకుతుందని కలలో కూడా అనుకోలేదు. స్వతహాగా భోజనప్రియుణ్ణి. ఇప్పుడు ఇక్కడ దూదిపింజలాంటి ఇడ్లీ దొరకడంతో వెంటనే మొత్తం లాగించెయ్యాలనిపించింది. ఐనా సరే, ఆ కోరికను కూడా జయించి చేతులు కడుక్కు వచ్చానంటే, ఎందుకో తెలుసా– ఇంత గొప్ప ఫలహారాన్ని బెర్లిన్ మహా నగరంలో నాకోసం తయారు చేసిన మీకు చేతులు జోడించడం తప్పనిసరి అనిపించింది. అదయింది కాబట్టి ఇక ఆగలేను' అంటూ తన సీట్లో కూర్చుని రెండిడ్లీలు చకచకా చట్నీతో తినేశాడు.

సత్యవతి మొహంలో సంతృప్తితో కూడిన చిరునవ్వు. ఆమె అతడితో, 'అల్లం చట్నీ కూడా రుచి చూడండి' అంది ఆప్యాయంగా.

'అదీ చూస్తాను. ముందు ఈ కోటా ఐపోనీండి' అన్నాడు కవిబాబు.

ప్లేట్లో వేసిన నాలుగు ఇడ్లీలూ కొబ్బరి చట్నీతోనే ఐపోయాయి.

'అల్లం చట్నీ రుచి చూడలేదు'' అంది సత్యవతి అసంతృప్తిగా.

'ఇప్పుడు చూస్తానుగా' అన్నాడు కవి బాబు.

సత్యవతి అతడి ప్లేట్లో ఒక ఇడ్లీ వేసింది.

'అయ్యో, ఒకటే వేశారేమిటి? నాలుగూ వేసెయ్యండి. తనను తక్కువ చేశానని అల్లం చట్నీ చిన్నబుచ్చుకుంటుంది' అన్నాడు కవిబాబు.

నిజంగానే అడిగేడా, జోక్ చేశాడా అన్న అనుమానంతో సత్యవతి ఒక్క క్షణం ఆగింది.

''ఏమిటీ సంకోచిస్తున్నారు! శనివారం కదా, ఫలహారం లైటుగా తీసుకోవాలనా?' అని నవ్వి– 'ఐతే మీకిప్పుడు మా అమ్మమ్మ గురించి చెప్పాలి' అన్నాడు కవిబాబు.

అతడి అమ్మమ్మకి సుగరొచ్చిందిట. బరువు తగ్గాలన్నారు. దాంతో ఆవిడ రాత్రిళ్లు అన్నం మానేసి ఫలహారం చేసుకుని తినడం మొదలెట్టింది. కానీ ఆవిడ బరువు తగ్గలేదు సరికదా, పెరగడం మొదలెట్టిందిట.

డాక్టరుకి చెబితే, ఆయన ఆవిణ్ణి కొన్ని ప్రశ్నలడిగేక– 'అమ్మా, నీ డోసుకి ఫలహారం కుదరదు. అన్నమే కంటిన్యూ చెయ్ అన్నాట్ట.

ఈ కథ విని రావుగారు నవ్వాడు.

కవిబాబు కూడా నవ్వి, 'ఇంతకీ నాది మా అమ్మమ్మ పోలిక' అన్నాడు.

రావుగారి నవ్వు ఆగిపోయింది.

అల్లం పచ్చడి కోటా ఐపోయేక– కారప్పొడి కోటా వచ్చింది. కవిబాబు కారప్పొడి కూడా చిన్నబుచ్చుకోకుండా జాగ్రత్త తీసుకున్నాడు.

ఆ తర్వాత ఒకో అనుపానానికి రెండేసి ఇడ్లీల చొప్పున– మరో ఆరు ఇడ్లీలు తిన్నాడు కవిబాబు.

ఆమె వేసినప్పుడు ఇడ్లీలు వాయకి పదహారు వస్తాయి. తినేది వాళ్లే ఐనప్పుడు పూర్తిగా వాయ వెయ్యకుండా పదో పన్నెండో వేస్తుంది. ఈరోజు మొదటి వాయతో పాటు రెండో వాయ కూడా పూర్తిగా వెయ్యాల్సి వచ్చింది.

ఆ భోజన పరాక్రమం సత్యవతి ఊహించనిది.

సాధారణంగా ఆమె ఇడ్లీ పిండి తయారు చేసినప్పుడు మూడు నాలుగు రోజులకని చేస్తుంది. పిండి పులిసేక ఫ్రిజ్జిలో దాచి వీలును బట్టి వాడుతుంది.

అదే ఇప్పుడామె మర్యాద కాపాడింది.

అతిథులు మరీ మరీ అడిగి తింటుంటే– ఇల్లాలికి అంతకంటే సంతృప్తి ఏముంటుంది?

కానీ– మామూలు విందు భోజనమైతే ఆమెకి ఇబ్బంది ఉండేది కాదు.

"వాన కురుస్తున్న సమయంలో, పొడి కట్టెలు కోరిన పేద బ్రాహ్మణుడికి– ఓ భవనాన్ని కూలగొట్టి ఆ కలప ఇచ్చాడు కర్ణుడు. అందుకే ఆయన దానకర్ణుడిగా పేరుపడ్డాడు. బెర్లిన్ వంటి నగరంలో అపురూపమైన ఇడ్లీ నూక మొత్తం– ఒక్క మనిషి ఆతిథ్యం కోసం వెచ్చించడంతో మేమూ ఆ కర్ణుడంతటివాళ్లం ఐపోయాం. అందుకు మేము కవిబాబుకి కృతజ్ఞులం. మిమ్మల్ని ఇడ్లీ ఫలహారానికి పిలవడానికి షిప్పులో మరో లాట్ కోసం ఎదురుచూడాల్సొచ్చింది. అదీ కథ" అని కథ ముగించాడు రావుగారు.

అంటే కవిబాబుతో రావుగారికి కూడా ఇబ్బందికరమైన అనుభవాలు ఎదురయ్యాయన్నమాట!

అప్పుడు మేము కూడా అతడితో కవిబాబుతో మా అనుభవాలు పంచుకున్నాం.

అప్పుడు రావుగారు, "కవులు, రచయితలు– చాలా లోతుగా ఆలోచిస్తారనీ, ఎదుటివాళ్ల ఇబ్బందుల్ని చక్కగా అవగాహన చేసుకుంటారనీ అనుకునేవాణ్ణి. ఇప్పుడు నాకు కవులంటే కాస్త భయమేస్తోంది" అన్నాడు.

మేం కథలు రాస్తామని రావు దంపతులకి తెలియదు. అందుకే రావుగారా మాట నిస్సంకోచంగా అనగలిగారు.

"అయ్యో, అలాగంటారేంటి? మిమ్మల్ని దానకర్ణుడి పక్కన నిలబెట్టింది కవిబాబేనని మీరు ఇప్పుడే కదా అన్నారు" అన్నాను.

"అందుకేనండీ భయం! కర్ణుడు సూర్యపుత్రుడు కదా– అప్పుడప్పుడైనా తండ్రి కొడుకుని చూడ్డానికొస్తాడు కదా– పక్కనే ఉంటే ఆ వేడి మనం తట్టుకోగలమా?" అన్నాడు రావుగారు.

అదీ రావుగారి హాస్యస్ఫూర్తి.

చేదైన అనుభవాల్ని కూడా హాస్యంతో ముడిపెట్టి గుర్తుంచుకోవాలి. అందువల్ల మనకు నచ్చనివారు కూడా మన స్మృతుల్లో చేదు కాలేరు.

రావుగారి హాస్యస్ఫూర్తిలో మరో విశేషం– బాధితులకు కూడా ఆ బాధ తియ్యగా ఉంటుంది. ఉదాహరణకు నేనే...

రావుగారి ముచ్చట్లు

మాయామర్మం లేకుండా మంచినే నమ్ముకున్నవారు కొందరుంటారు. వారి సమక్షం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది.

రావుగారి సమక్షం అలాంటిది. అతి తక్కువ పరిచయంలోనే ఆత్మీయంగా అనిపించడం రావుగారి మరో ప్రత్యేకత.

అందుకేనేమో– ఆయన విసురు మనకే తగిలినా ముచ్చటగా అనిపిస్తుంది. స్వోత్కర్షకు దిగినా విని ఆనందించేలా ఉంటుంది.

ఆయన సంభాషణాచాతుర్యానికి ముగ్ధుడినైపోయి ఓసారి అన్నాను– 'మీరు సాహిత్యంమీద దృష్టి పెడితే ఎంత బాగుండేదో!' అని.

దానికాయన నవ్వి, "ఆ విషయం నేను స్కూల్లో చదువుకునే రోజుల్లోనే గుర్తించాను. మీరు సాహిత్యంతో సరిపెట్టారు కానీ నేను చిత్రకారుణ్ణి కూడా!" అన్నాడు.

అప్పుడు సత్యవతి కలగజేసుకుని, "క్లాసులో మేస్టర్లు పాఠాలు చెబుతుంటే చిత్తు పుస్తకంలో– మేస్టర్లమీదా, తోటి విద్యార్థులమీదా వ్యాఖ్యలు రాసేవారుట ఈయన. మేస్టర్ల బొమ్మలు కూడా గీసేవారుటలెండి. అదీ గొప్పగా చెబుతున్నారు" అంది.

"గొప్పగా చెప్పక! క్లాసయ్యేక క్లాసు క్లాసంతా, నా చిత్తు పుస్తకం చూడ్డానికి విరగబడేది మరి!" అన్నాడు రావుగారు.

"వాళ్లు మీ కొంటెతనాన్ని ఎంజాయ్ చేసేవారు. కొంటెతనం పాండిత్యమైపోదు!" అంది సత్యవతి.

"పువ్వు పుట్టగానే పరిమళించిందననుకోవచ్చుగా" అన్నాడు రావుగారు.

"మీ విషయంలో పదం మార్చి– పువ్వు పుట్టగానే వాసనేస్తుందిగా అనాలి. అది పరిమళమా, కంపా అన్నది పువ్వునిబట్టి ఉంటుంది"

రావుగారి వాక్చాతుర్యానికి పదును పెట్టడానికి దీటైన అర్ధాంగి ఆమె.

రావుగారు వెంటనే, "అరే, ఓసారి నా చిత్తు పుస్తకం చూసిన మా మేస్టారు కూడా అచ్చం ఇదే మాటన్నారు..." అని ఆశ్చర్యం నటించి, "అప్పట్నించీ నేను సాహిత్యం, చిత్రకళ జోలికి వెడితే ఒట్టు" అన్నాడు.

"ఓహో, బాగా దేహశుద్ధి జరిగిందన్నమాట!" నవ్వింది సత్యవతి.

రావుగారు నావైపు తిరిగి, "ఇన్నేళ్లకి మళ్లీ ఆ నాటి నా ప్రతిభ పరిమళమేనన్న అనుమానం పుడుతోంది. మీరు నా గురించి సీరియస్‌గానే ఆ మాటన్నారు కదూ!" అన్నాడు.

నేను నవ్వాపుకుని, "ఆత్మీయులముందు మనసులు పరచినప్పుడు, జ్ఞాపకాల లోతుల్లోంచీ ఎన్నో విశేషాలు గుర్తుకొచ్చి మనసుని ఆహ్లాద పరుస్తాయి. ఈరోజు మన మాటల్లో చదువుకునే రోజుల్లో నా చిత్తు పుస్తకం గుర్తొచ్చింది" అని టాపిక్ మార్చాను.

అప్పట్లో అందరికీ అలా చిత్తు పుస్తకాలుండేవి. క్లాసులో మేస్టర్లు పాఠాలు చెబుతున్నప్పుడు ముఖ్యమైన పాయింట్లు రాసుకోవడానికీ, ఇంటిదగ్గర లెక్కల హోంవర్కు ముందుగా చెయ్యడానికీ అది వాడేవాళ్లం. అవసరమైనవి తర్వాత వేరే నోట్ పుస్తకాల్లోకి ఫెయిర్ చేసేవాళ్లం. ఐతే రావుగారిలాగే చాలామంది చిత్తు పుస్తకాన్ని కొంటెపనులకీ ఉపయోగించేవాళ్లు. నేనైతే వేరేవాటికీ వాడేవాణ్ణి

అందులో ఒకటి– రోజువారీగా నమస్కార బాణేశుల జాబితా. ప్రతిరోజూ ఏదో సమయంలో ఎవరికో ఒకరికి నమస్కరిస్తుంటాం కదా! అలా మొదటి దణ్ణం అందుకున్న వారు నమస్కార బాణేశులు. నెల తర్వాత చూసుకుంటే ఆ జాబితాలో ఎక్కువమంది స్కూల్ టీచర్లే ఉండేవారు. వాళ్లలో నాకిష్టులైన టీచర్లు ఒక్కసారి కూడా నమస్కార బాణేశులు కాకపోతే బాధగా అనిపించేది. పనికట్టుకుని ఎవరినైనా నమస్కార బాణేశుల్ని చెయ్యాలని పూనుకున్నా ఫలితం నా చేతిలో ఉండేది కాదు. ఎందుకంటే, ఎదురైన కొందరు పెద్దలకి ఇష్టమున్నా లేకపోయినా చేతులు జోడించక తప్పదు కదా!

ఇంకా ఆ జాబితాలో ఊహకందని పేర్లుండేవి. ఒకసారైతే నాతో కంబైండ్ స్టడీసుకొచ్చిన వీరభద్రంతో ఏదో వాదనొచ్చి, "బాబూ! నీకో నమస్కారం. ఇక వాదన ఆపు" అన్నాను. ఆరోజుకి అతడే నమస్కారబాణేశుడు.

రెండోది నేటి మేటి పాట. అదేంటంటే– ఒక్కణ్ణే అయినప్పుడు ఇంటాబయటా కూడా సినిమా పాటలు హమ్ చేసుకోవడం నా అలవాటు. బుర్రలో పాట మాత్రమే ఉండేదేమో, ఎదుటపడ్డ పరిచయస్థుల్ని కూడా గుర్తించలేకపోయేవాణ్ణి. అలా ప్రతిరోజూ ఎక్కువసేపు హమ్మింగు చేసుకునే పాటని చిత్తు పుస్తకంలో 'నేటి మేటి పాట' అని రాసుకునేవాణ్ణి. నెల్లాళ్ల తర్వాత ఆ 'నేటి మేటి పాట'ల జాబితా చూసుకుంటే– అందులో బాగా ఇష్టమైనవే కాదు, బొత్తిగా నచ్చనివీ ఉండేవి. ఉదాహరణకి దేవాంతకుడు చిత్రంలో 'గోగ్ గోగ్ గోగ్ గోగ్ గోంగూరా' నాకెంతో ఇష్టం. 'భళిరా నీవెంత జాణవౌదురా' అంటే విసుగు. కానీ ఓ రోజు జాబితాలో అదే నాటి మేటి పాట.

చిత్తు పుస్తకంలోకెక్కిన ఈ జాబితాలు నాకో ప్రయోగఫలితంలా అనిపించేవిః ఒకోసారి మనమేం చేస్తామో మనకే తెలియదనీ, మన చేతిలోనే ఉన్నాయనుకున్నవి కూడా మన చేతిలో లేనివేననీ– ఆ జాబితాలు నాకు స్పష్టం చేశాయి.

ఈ వివరాలు విన్న రావుగారు నవ్వి, "నమస్కారబాణేశుడి మాట పక్కన పెడితే, పాటకు సంబంధించి అదన్నమాట సంగతి!" అన్నాడు.

"సంగతి అంటే– పాట సంగతా? పాటలో సంగతా?" అడిగింది సత్యవతి వెంటనే.

రావుగారు నావైపు తిరిగి, "అది మా ఆవిడకి తర్వాత చెప్తా కానీ, మీ 'నేటి మేటి పాట'ల జాబితా ఓసారి నాకు చూపిస్తారా?" అన్నాడు.

తెల్లబోయాను, "అప్పటి చిత్తు పుస్తకాలు ఇంకా ఎక్కడుంటాయ్– ఎప్పుడో పోయాయ్" అన్నాను.

"నేనడిగింది అప్పటివి కాదు. ఇప్పటివి" అన్నాడు రావుగారు.

సత్యవతిగారు కలగజేసుకుని, "ఇది చాలా బాగుంది. మీరిప్పటికీ చిత్తు పుస్తకాల్లో బొమ్మలు, వ్యాఖ్యలు రాస్తున్నారా?" అంది.

"నా సంగతి వేరు. కానీ ఈయన ఇప్పటికీ రోడ్లమీద పాటలు హమ్ చేస్తున్నారు కదా! నోట్ చెయ్యకుండా ఉంటారా?"

"మీరు విన్నారా?" ఎక్కదీసింది సత్యవతి.

"ఇందాకా– అదీ సంగతి అన్నాను కదా! ఆ సంగతి ఇదే! శనివారం సంత వీళ్లింటిముందే కదా! మొన్న శనివారం సంతలో ఈయన నాకు ఎదురుపడ్డారు. చిన్నగా నవ్వాను. తనూ నవ్వినా, ఆ నవ్వు నన్ను చూడ్డానికి ముందునుంచీ ఉన్నదే! అందుకని ఓసారి హలో అని పలకరించాను. పెదాలు కదులుతున్నాయి కానీ ఆ పెదాల కదలిక కూడా నేను పలకరించడానికి ముందునుంచీ ఉన్నదే! ఏదో తనలో తనే అనుకుంటూ, మహదానందపడిపోతూ నన్ను దాటి వెళ్లిపోయారాయన. తర్వాత చూస్తే, ఓ దుకాణం వద్ద ఆగి మామూలుగా బంగాళాదుంపలు బేరం చేసి కొన్నారు. ఇందాకా నన్ను చూడలేదేమో అనుకుని మళ్లీ దగ్గరకెళ్లి పలకరిస్తే– అదే చిరునవ్వు, అదే పెదాల కదలిక. నాకేసి మాత్రం శూన్యంలోకి చూసినట్లే చూస్తున్నారు. ఆయన మళ్లీ మామూలు మనిషైంది– వంకాయలు కొనడానికే. నేను కూడా ఏ చిక్కుడుకాయలో, పచ్చిమిర్చో ముందేసుకుని కూర్చుంటే తప్ప నాతో మాట్లాడరనిపించి, అప్పటికాయన్ని వదిలేశాను. ఐతే ఆయన ఎందుకలా చేశారో అప్పుడర్థం కాలేదు. ఇప్పుడర్థం కావడంతో– అదీ సంగతి అన్నాను. అది పాటలో సంగతో, పాట సంగతో నువ్వు తేల్చుకో" అన్నాడు రావుగారు.

విషయం నాకు అర్థమైంది.

నాలో నేను పాడుకుంటూ బయట నడవడం నాకు అలవాటే. రావుగారు నన్నలా చూసుంటాడు. అలంకారప్రియుడు కదా, అతిశయోక్తి వాడాడు. అది నాకు కాస్త గుచ్చుకునే అలంకారమయింది.

ఏమనాలో తెలియలేదు. అంతలో శ్రీమతి, "మీరు బయటి మాట చెప్పారు. ఈయన ఇంట్లోనూ ఇంతే! ఒకోసారి నాకు అన్వయించే పాట పాడుతూ కూడా నన్ను చూడరు. ఇప్పుడు మీరు చెప్పేక మారతారేమో చూడాలి" అంది.

"పుండుమీద కారం చల్లడమంటే ఇదే!" అన్నాను.

శ్రీమతి వెంటనే, "మరి మీకు ఇష్టమైనది కారమే కదా!" అంది.

పుండుమీద మరింత కారం!

రావుగారు చప్పట్లు కొట్టి, "బాగా చెప్పారు" అని నావైపు తిరిగి, "మీరిక స్వీట్లు తినడం మొదలెట్టాలి. లేకపోతే ఇలాంటి విసుర్లు ఎదుర్కోక తప్పదు" అన్నాడు.

ఆయన అలాగనడానికి కారణముంది. ఆయనకు మన సంప్రదాయపు పిండివంటల్లో బూరెలు, బొబ్బట్లు– స్వీట్లలో మైసూర్‌పాకు చాలా ఇష్టం. అవేవీ నేను వేలేసి ముట్టుకోనని తెలిసి చాలా నొచ్చుకుంటూ ఉండేవారు.

"స్వీట్లు అలవాటు చేసుకుందామనే, నిమ్మతొనలతో మొదలెడదామనుకున్నాను. బయట ఆటోమేట్లలో (ఆటోమాటిక్ వెండింగ్ మెషీన్లు) డబ్బులేసి ఓ ప్యాకెట్ తీసుకుందామంటే– జేబులో పర్సుండదు. చిల్లరుండదు" నిట్టూర్చాను.

"ఎందుకని?" రావుగారి కుతూహలం.

"ఏంచెప్పను? పర్సు తనవద్దనే ఉంచుకుంటుంది తప్ప, నాకివ్వదు తను. నాకు పాంటు టైటు కాబట్టి జేబులోకి పర్సు వెళ్లదంటుంది. చొక్కాకేమో జేబుల్లేవు. పోనీ ఓవర్‌కోట్లో పెట్టుకుంటానంటే, ఆఫీసుకెళ్లేక బయట తగిలిస్తాను కాబట్టి డబ్బులు పోవచ్చంటుంది. కాస్త చిల్లరైనా ఉంచొచ్చుగా అని గట్టిగా అడిగితే, ప్రయాణానికి 'ఊబాన్ పాసుందిగా, మేమెవ్వరం పక్కన లేకుండా మీకు డబ్బుతో పనేమి టంటుంది" అని వాపోతున్నట్లు నటించాను.

అందులో కొంత నిజముంది. బయట ఆటోమేట్లలో చిన్నసైజు పిప్పరమెంట్లు పాకెట్లు దొరుకుతాయి. చాలా రుచిగా ఉంటాయవి. నాకోసం కాకపోయినా పిల్లలకోసం తీసుకుందామంటే జేబులో డబ్బుండదు.

ఏదో తెలివిగా మాట్లాడేననుకున్నాను కానీ రావుగారికి దొరికిపోయాను. ఆయన వెంటనే, "పాపం, మీవారంత నొచ్చుకుంటున్నారు. రేపట్నించి ఆయన బయటికెళ్లేటప్పుడు ఓవర్‌కోట్ జేబులో కాసిని నిమ్మతొనలు పోస్తుండండి" అన్నాడు.

అంతా ఘొల్లుమన్నారు. అబద్ధమెందుకూ– ఘొల్లుమన్నారు కాదు, ఘొల్లుమన్నాం అనాలి. ఎందుకంటే అందరితో పాటే కాదు, అందరి కంటే కూడా నేనే గట్టిగా నవ్వాను.

అదీ రావుగారు!

మేమూ వాళ్లూ మరీ ఎక్కువగా కలవకపోయినా– బెర్లిన్ అంటే రావుగారు మాత్రమే గుర్తుకొచ్చేంత దగ్గరయింది మాకాయన కుటుంబం.

పిల్లల జన్మదినాలకు మేమూ వాళ్లూ తప్పక కలుసుకునేవాళ్లం.

పుట్టినరోజు కానుకలకోసం మేము మనసు పెట్టి చాలా షాపులు తిరిగేవాళ్లం. ఆ తిరగడం మా పిల్లలకూ ఇష్టంగా ఉండేది. ఎందుకంటే– ఆ గిఫ్టు ఐటమ్సు బాగా నచ్చేసి మా వాళ్లకీ కొనేవాళ్లం.

అలా మేము వాళ్ల బాబుకోసం గ్రే కలర్ ఆటోమాటిక్ కారు బొమ్మ కొన్నాం. అది రిమోట్‌తో నడిచేది, మలుపులు తిరిగేది. దారికి ఏదైనా అడ్డమొస్తే దానంతటదే పక్కకు తప్పుకుని ముందుకెళ్లేది.

వాళ్ల పాపకోసం పసుపు పచ్చని రోడ్ క్లీనింగ్ వ్యాన్ కొన్నాం. బెర్లిన్ రోడ్లమీద తిరిగే వ్యాన్లకి అది మూస. బ్యాటరీ ఆన్ చెయ్యగానే అంబులెన్సులా హారన్ మోగిస్తూ కదిలేది. దాని అడుగున వాక్యూమ్ క్లీనింగుకి తిరిగే చక్రం ఉండేది.

ఇవి మా పిల్లలకి కూడా కొన్నాం. వాటితో పిల్లలకంటే ఎక్కువగా మేమే ఆడేవాళ్లం. మరి చిన్నప్పుడు మాకిలాంటి సరదాలు తీరలేదుగా!

"ఇలాంటివన్నీ మీకెక్కడ దొరుకుతాయి?" అని అబ్బురంగా అడిగేవాడు రావుగారు.

"మీరు ఇక్కడే ఉండేవారు. ఏం కావాలన్నా నిదానించొచ్చు. మేము త్వరలో వెళ్లిపోయేవాళ్లం. మళ్లీ ఎప్పుడైనా వస్తామో లేదో తెలియదు. వీలైనన్ని అపురూప వస్తువులు కూడా తీసుకెళ్లాలనంటే తొందరపడాలి. అందుకని షాపులు తెగ తిరుగుతుంటాం. ఏవేవో కొంటుంటాం. డబ్బు దాచుకోవడం మంచిదని మిత్రులు కొందరంటారు కానీ, డబ్బుదేముంది– ఎప్పుడైనా సంపాదించొచ్చని నేనంటాను" అన్నాను.

రావుగారు నవ్వి, "ఏమనుకోనంటే నాదో చిన్న సలహా. మీరంటున్న ఈ అపురూప వస్తువులు ఎప్పటికీ అపురూపంగా ఉండిపోవు. కొన్నాళ్లకివి ఇండియాలోనూ మామూలైపోతాయి. అదీకాక టెక్నాలజీ త్వరగా వృద్ధి చెందుతోంది. నేటి వింత రేపటికి పాతబడి రోతగా మారిపోతోంది. కాల్క్యులేటర్లే చూసేరుగా– ఒకోటి తొమ్మిదొందల తొంబైఎనిమిది మార్కులుండేది– ఆర్నెల్లలో నూట తొంబైఎనిమిది మార్కులకి పడిపోయింది. అవసరానికి ఏమైనా కొనుక్కోండి. ఐతే ఖర్చు చేసేటప్పుడు, ముఖ్యంగా మధ్యతరగతివాళ్లకి, అన్నింటికన్నా డబ్బే ప్రధానమని గుర్తుంచుకోండి" అన్నాడు.

అది అనుభవంలోంచి పుట్టిన మాట. బాధ్యతలెరిగిన మనిషి వాస్తవిక దృష్టితో స్నేహభావంతో పలికిన మాట!

అప్పటికది ఆచరించాలని అనిపించిందని చెప్పలేను కానీ, మధ్యతరగతి జీవితానికది విలువైన హితవాక్యమని ఇప్పటికీ మర్చిపోలేదు.

రావుగారిలా దగ్గరైనవారు బెర్లిన్లో మరికొందరు లేకపోలేదు. ఆదిలో ఓంప్రకాష్. అతడిద్వారా లియోపాల్డ్ ప్లాట్జ్ హాస్టల్లో మరికొందరు. అక్కడే నా ల్యూనబర్గ్ క్లాస్‌మేట్ గుప్తా. ఇంకా ప్రసాద్ దంపతులు వగైరా. లాబొరేటరీలో అహమ్మద్, హైనర్ డెకర్ట్ వగైరాలు.

వీరంతా చిరకాల పరిచయంవల్ల దగ్గరైనవారు. కానీ స్వల్పకాలంలో ఊహించనంతగా సన్నిహితుడైనవాడు శోభన్ ఘోష్.

శోభన్ ఘోష్ ముచ్చట్లు

తండ్రి, తాత, అమ్మమ్మ, బామ్మ, అన్న, అక్క, తమ్ముడు, చెల్లి– వీరెంత దగ్గరివారైనా– కొన్ని విషయాల్లో స్నేహితులంత దగ్గర కాలేరు.

ఎందుకంటే– బంధుత్వం కారణంగా వారికీ మనకీ మధ్య కొన్ని పరిమితులుంటాయి.

బెర్లిన్లో రావుగారు మాకు ఆత్మబంధువు. శోభన్ సన్నిహితుడైన స్నేహితుడు.

అతడు బెంగాలీ. కెమికల్ ఇంజనీరు. పూనాలోని నేషనల్ కెమికల్ లాబొరేటరీలో సైంటిస్టు. నాతర్వాతి సంవత్సరం బ్యాచిలో డాడ్ స్కాలరుగా జర్మనీ వచ్చాడు. అతడితో పాటు భార్య, మా అబ్బాయికంటే కొంచెం చిన్నవాడైన కొడుకు వచ్చారు.

బెర్లిన్లో అతడి లాబొరేటరీ మా సంస్థకు దగ్గర్లోనే ఉంది. మాది కెమికల్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్ కావడం వల్ల తరచుగా మా లేబరేటరీకి వచ్చేవాడు.

చొరవగా కొత్తవాళ్లని పరిచయం చేసుకునే అలవాటు నాకు లేదు.

ఒకరోజు తనే వచ్చి నన్ను కలుసుకున్నాడతడు.

అందుకు కారణంగా అతడు చెప్పిన విషయాలు నన్నాశ్చర్యపరిచాయి.

అక్కడున్న ఇండియన్సులో నేను ప్రత్యేకమట. చాలా మంచివాణ్ణీ, స్నేహపాత్రుణ్ణీట.

ఈ మాట అతడికి కొందరు జర్మన్సూ, ఇండియన్సూ కూడా చెప్పారుట.

చుట్టుపక్కల నాకు ఇంత మంచిపేరుందని ఊహించలేదు. ముందు చాలా సంబరపడ్డాను.

అంతలోనే నాకు అనిపించింది. కొంతమంది పరిచయం చేసుకునే ముందు అలా చెబుతుంటారు. ఎవరిదాకానో ఎందుకూ– నేనే ఒకసారి ఎవరితోనో అవసరముండి పరిచయం చేసుకునేటప్పుడు, "మీ గురించి గొప్పగా విన్నాను" అంటూ మొదలెట్టాను.

అందుకని నా గురించి నేను మరీ ఎక్కువగా ఊహించుకోక, "నా గురించి నాలుగు మంచి మాటలు చెప్పడం వారి సహృదయత. అది నాకు చేరవెయ్యడం నీ సహృదయత" అనేసి అతడి వివరాలడిగి తెలుసుకున్నాను.

శోభన్ ముక్కు సూటి మనిషి. మనసులో ఏమున్నా కుండ బద్దలు కొడతాడు. ఎవర్నీ లక్ష్యపెట్టడు. అలాగని ఎవరితోనూ అనవసరంగా గొడవ పడడు. ఆ లక్షణాలు నాకిష్టం.

ఆ లక్షణాలవల్లే అతడికి అక్కడ స్నేహితులు తక్కువ. శత్రువులు కాకపోయినా కిట్టనివారు కూడా కొందరున్నారు. మంచి మిత్రుడికోసం ఎదురు చూస్తూ నా గురించి విని ప్రత్యేకంగా నన్ను కలుసుకుందుకు వచ్చానన్నాడు.

"నాలో ఏదైనా లోపం కనిపిస్తే మొహం మీదే చెప్పెయ్. ఏమనుకోను. నన్ను మాత్రం పక్కన పెట్టొద్దు" అన్నాడు శోభన్.

అది హెచ్చరికో, విన్నపమో అర్థం కాలేదు. కానీ అతణ్ణో రోజు మా ఇంటికి పిలిచాను.

అతడి భార్య కలుపుగోలు మనిషి. తనూ వేరే రాష్ట్రంలో కాంపస్ నుంచి వచ్చింది కాబట్టి హిందీ బాగానే వచ్చు. శ్రీమతికీ ఆమెకీ మాటలు బాగానే కలిశాయి. ఇక వాళ్లబ్బాయికీ మా పిల్లలకీ జత బాగానే కుదిరింది.

మొదటి రోజునే అంతా అత్మీయులమైపోయాం.

"మనమెప్పుడు కలుసుకున్నా నీ ఇంట్లోనే! అతిథుల రాక ఇక్కడ మా లాండ్‌లేడీకి ఇష్టముండదు" అని చెప్పాడతడు.

శోభన్ ముక్కు సూటి మనిషి కనుక– అదో వంకని నేననుకోలేదు.

ఆ మర్నాడే శోభన్ నన్ను ఆఫీసులో కలుసుకుని, "నిన్న మీ ఇంటికెందుకొచ్చామో తెలుసా? మన కుటుంబాల ఫ్రీక్వెన్సీ ఎలా కలుస్తుందో తెలుసుకుందుకు అదో ట్రయల్ రన్!" అన్నాడు.

ట్రయల్ రన్సు కెమికల్ ఇంజనీరింగ్ ప్రయోగాల్లో మామూలు. జీవితంలోనూ ఇంజనీరింగేనా అనుకుంటూ, "ట్రయల్ దేనికి?" అన్నాను.

"మీ పిల్లలు కాస్త పెద్దవాళ్లు. వదిలేస్తే ఎవరిదగ్గరైనా కొన్ని గంటలసేపు ఉండగలరు. పైగా వాళ్లకి ఒకరికొకరి తోడు ఉంటుంది. మా అబ్బాయి విషయమలా కాదు. వాణ్ణి ఎక్కడైనా వదిలి వెళ్లాలంటే, కాస్త చనువున్న పిల్లలు కూడా జతగా ఉండాలి. మీ పిల్లలు, మీరు ఉంటే వాడు గంటలేమిటి, రోజు రోజంతా మమ్మల్ని తల్చుకోకుండా గడిపెయ్యగలడని నిన్నటితో ధైర్యం కలిగింది" అన్నాడు శోభన్.

అతడు మమ్మల్ని తన కొడుక్కి బేబీ సిట్టర్సుగా ఉపయోగించుకోవాలని ఆత్రపడుతున్నట్లు అర్థమైంది. కానీ ఆ అవసరమేమిటో తోచక, "ఔననుకో– కానీ వాళ్లని వదిలి వెళ్లాల్సిన అవసరమేమిటి నీకు?" అన్నాను కుతూహలంగా.

"నేనూ మా ఆవిడా కీనోకి వెళ్లాలనుకుంటున్నాం" అన్నాడతడు.

ఉలిక్కిపడ్డాను.

కీనో అంటే సినిమా హాలు.

బెర్లిన్లో హాల్లో ఆడేవన్నీ జర్మన్ సినిమాలు. డబ్బు ఖర్చు పెట్టుకుని అర్థం కాని భాషలో సినిమాలు చూడ్డమెందుకూ అనుకునే ఎకానమీ నాది. అందుకని సినిమాహాలుకి వెళ్లాలని అనుకోను కూడా అనుకోలేదు.

ఐతే కీనో అనే పదాన్ని స్థానికంగా సెక్స్ కీనోకి కుదింపుగా వాడతారు. ఇండియన్సయితే మరీనూ.

"కీనోకి వెడదామనుకుంటున్నా! కంపెనీకి గర్ల్‌ఫ్రెండు కోసం చూస్తున్నా" అని కొలీగ్సు ముసిముసిగా నవ్వుతూ అనడం నాకు తెలుసు.

బెర్లిన్ నగరంలో అడుగడుగునా సెక్స్ కీనోలున్నాయి. ఎన్నో షాపింగ్ మాల్స్‌లో భాగంగానూ ఉన్నాయి.

సెక్స్ కీనోల్లో పోర్నో అంటే పచ్చి బూతు సినిమాలు చూపిస్తారు. వాటికి మార్నింగ్ షోలూ, మేట్నీలూ, మొదటాటలూ ఉండవు. రోజంతా పని చేస్తూనే ఉంటాయి. టికెట్ కొనుక్కుని వెళ్లి హాల్లో కూర్చోవడం. ఇష్టమైనంత సేపు కూర్చోవడం. అంతే!

ఒకో సినిమా నిడివి 5నుంచి 20 నిముషాలవరకూ ఉంటుంది. అలాంటివి పదో పదిహేనో ఉంటాయి. అన్నీ ఐపోయేక ఆట ఆగదు. మళ్లీ సైకిల్ మొదలవుతుంది.

"ఒక టికెట్ మీద హాల్లో ఎంతసేపైనా కూర్చోనిస్తే, హాలువాళ్లకి నష్టం కదా!" అన్నాను నేనోసారి లాబోరేటరీలో అహమ్మద్‌తో.

"నువ్వలా అనుకుంటున్నావా– నిజానికి టికెట్టుకి టైము నిర్ధారిస్తే నష్టపోయేది హాలు వాళ్లే" అన్నాడు అహమ్మదు.

"అదెలా?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఆ చిత్రాలు చూస్తూంటే అక్కడే కూర్చోవాలనిపించదుగా. గర్ల్‌ఫ్రెండుతో వెళ్లినవాడైతే పది నిముషాల్లోనే అమెతో సహా బయటి కొచ్చేస్తాడు. టికెట్టుకి టైమ్ నిర్ధారిస్తే ఆ సీటు అలా కాళీగా ఉండిపోవాల్సిందేగా!" అని నవ్వి, "ఎవ్వరూ గంటకుమించి హాల్లో కూర్చోరు. అలా కూర్చునేవాళ్లు ఆ సినిమాలు చూడ్డం వ్యర్థం" అన్నాడు అహమ్మద్.

అంతవరకూ ఊహకందని ఆ కోణం అప్పటికి తెలిసింది నాకు.

మా ఇంటామె ఒలోముచ్‌కీ కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్ వద్ద ఓ సెక్స్ కీనోలో టికెట్లు అమ్మే ఉద్యోగం చేస్తోంది. ఆమె టైమింగ్సు ఉదయం తొమ్మిదినుంచి రాత్రి 9 వరకూ అనుకుంటాను. ఐతే ఆ పనివేళలు కాస్త అటూ ఇటూగా కూడా ఉంటుంటాయి.

బెర్లిన్లో కీనోలకి వెళ్లలేదు కానీ, నేను అలాంటి మూవీలు అప్పటికే కొన్ని చూశాను. ఆ అనుభవం అర్థాంగికీ కావాలన్న మనసుంది కానీ, ఇక్కడ ఎలా వీలవుతుంది?

పిల్లల్ని కూడా తీసుకెళ్లలేం. వాళ్లని ఒంటిగా వదిలేసి వెళ్లలేం.

రావుగారినడుగుదామంటే, ఆయన బంధువుల కోవలోకి వస్తారు. కాబట్టి మామధ్య అటువంటి ప్రసక్తి రాను కాక రాదు.

ఇక్కడకొచ్చి తను చూడని వింతల్లో అదీ ఒకటిగా మిగిలిపోతుందని అసంతృప్తిగానే సరిపెట్టుకున్నాను.

కానీ శోభన్ అలా సరిపెట్టుకోలేదు. మనసుంటే మార్గముంటుందనుకున్నాడు. నన్ను వెతికి పట్టుకున్నాడు.

తనకి నేను మార్గమయ్యాను. నేనూ రావుగారి దగ్గర అలాంటి మార్గం చూడాల్సిందేమో!

"ఏం మాట్లాడవు?" అన్నాడు శోభన్.

"సాహసివిరా డింభకా!" అనుకుని, "మాట్లాడ్డానికేముంది? నీ ప్రపోజల్ నాకు ఓకే" అన్నాను.

"నీకు ఓకే కావచ్చు. కానీ నేనింకా ఓకే చెయ్యలేదు" అన్నాడు శోభన్.

తెల్లబోయి, "ఓకే చెయ్యకపోతే, అడగడమెందుకు?" అన్నాను.

"బొమ్మా బొరుసూ ఉంటేనే అది నాణెం ఔతుంది. నావైపు ప్రపోజల్ బొమ్మ. దానికి బొరుసు నీవైపు ప్రపోజల్" అన్నాడు శోభన్.

"అంటే?"

"అంటే ఏముంది? మా బాబుని మీ ఇంట్లో వదిలి మేము కీనోకి వెళ్లి వస్తాం. అప్పటికి మీరు సిద్ధంగా ఉండండి. మీరు కీనోకెళ్లి వచ్చేదాకా మేము మీ పిల్లల్ని చూస్తుంటాం. అదీ డీల్. ఇది నీకు ఓకే ఐతేనే, ఈ ప్రపోజల్. లేకుంటే ఇదిక్కడే మర్చిపోదాం" అన్నాడతడు.

నేనిది ఊహించలేదు, "నీకిష్టమై నువ్వెడుతున్నావ్. నన్ను బలవంతపెట్టడం భావ్యం కాదు" అన్నాను.

"హిపోక్రసీ వద్దు రావ్. ఇలాంటి సినిమాలిప్పుడు ఇండియాలోనూ రహస్యంగా వేస్తున్నారు. చూసేవాళ్లు రహస్యంగా చూస్తున్నారు. ఎందుకంటే ఆ సినిమాల ప్రదర్శన అక్కడ చట్టవిరుద్ధం. అదిక్కడ చట్టబద్ధం. ఆ సినిమా చూడ్డానికి భార్యతో సహా వెళ్లినా చెవులు కొరుక్కునేవారుండరు. ఇది మనకి సదవకాశమే కదా! ఐనా నాకు తెలుసు. భాభీజీతో కలిసి ఓసారి కీనోకి వెళ్లాలని నీకూ ఉంది. ఇక భాభీజీ అంటావా, మన సంప్రదాయాన్నిబట్టి మొహమాటపడినా, మనిషికి సహజమైన కుతూహలం ఉంటుందిగా. నువ్వు కాస్త బలవంత పెడితే తప్పక ఒప్పుకుంటుంది. నేనలాగే మా ఆవిణ్ణి ఒప్పించాను" అన్నాడు.

నేనింకా ఆలోచిస్తుంటే మళ్లీ తనే, "నేనీ ప్రపోజల్ పెట్టిందే నీకోసం. అందుకు ప్రతిఫలంగా నాకూ ఓ అవకాశం కోరుతున్నాను. ఎటొచ్చీ బెంగాలీ వాణ్ణిగా– స్వకార్యం అయ్యాకే స్వామికార్యం" అన్నాడు.

ఇప్పటివాళ్లకి ఇదంతా హాస్యాస్పదంగా ఉంటుందని తెలుసు. కానీ– అప్పట్లో ఈ ఏర్పాటుకి కారణం– అతి తక్కువ పరిచయంలో శోభన్ తీసుకున్న చొరవే కావడం ఇప్పటికీ నాకు ఆశ్చర్యంగానే ఉంటుంది.

అలా కీనో విషయంలో– స్వకార్య స్వామికార్య సిద్ధి అనుకున్నట్లుగానే జరిగింది.

శోభన్ కుటుంబం మాకు అత్యంత సన్నిహితమైంది. ఎంతలా అంటే– ఇండియా వచ్చేక ఓ ఇరవై సంవత్సరాల తర్వాత కేవలం మమ్మల్ని చూడ్డానికే అతడోసారి భువనేశ్వర్ వచ్చాడు. వచ్చి ఊరుకున్నాడా– తన ముక్కు సూటితనం కలకాలం గుర్తుండిపోయేలా చేసి వెళ్లాడు.

అది స్మరించుకోవడానికి క్షణంపాటు కాలయంత్రంలో కొంచెం ముందుకెళ్లి, వెంటనే వెనక్కి వచ్చేద్దాం....

ముక్కుసూటి శోభన్

శోభన్ ఘోష్‌లో నాకు నచ్చిన అంశాల్లో మొదటిది ముక్కుసూటితనం, రెండవది తనకు నచ్చినట్లు ఉండడానికి సంకోచించక పోవడం. మొదటిది అనుసరించడం నా వల్లకాదు. రెండవది అనుసరించాలని ఉన్నప్పటికీ, అందుకు జీన్సు కూడా సహకరించాలిగా– నా ఓవర్‌కోట్ ఉదంతం అదే చెబుతుంది.

ల్యూనబర్గులో జరిగిన ఈ ఉదంతాన్ని కాస్త విపులంగా ఇక్కడ ఎందుకు ప్రస్తావించాల్సి వచ్చిందంటే, శోభన్ మా ఇంటికొచ్చినప్పుడా కోటు చూశాడు. వాడకంలో లేదని తెలిసేక, తనకి కావాలని అడిగాడు.

షాక్ తిన్నాను. "నిజంగానా?" అన్నాను తేరుకున్నాక.

"నువ్వు వాడ్డంలేదు కదా అనడిగాను. నీకిబ్బంది లేకపోతేనే...." అన్నాడతడు తేలికగా.

నాకో అతడికో చెప్పలేను కానీ– ఇబ్బంది లేకేం, ఉంది మరి!

ఆ కోటు కథేంటంటే...

మనలో చాలామంది తమ మానాన తాము బ్రతుకుతున్నామనుకుంటారు కానీ అది నిజం కాదు. మనం చేసేవన్నీ మన ఇష్టప్రకారం ఉండవు. పద్ధతికి ఎదురెళ్లలేకనో, ఎదుటివారి మెప్పును ఆశించో– తరచుగా మనకిష్టం లేని పనులు చేయాల్సొస్తుంది.

ఒకోసారి ఎదుటివారిని నొప్పించడమే ధ్యేయమై– మనకు వీలుకానివాటికి కూడా పూనుకుంటాం. ఐతే నా కోటు కథ ఈ కోవలోకి రాదు.

జర్మనీ చలి దేశమే ఐనా, అంత చలి నాకు కొత్తే అయినా, అంతా చలి గురించి భయపెట్టినా– కనీసం ఆరంభంలో చలి నన్నక్కడ ఇబ్బంది పెట్టలేదు. నావద్ద ఇండియానుంచి తెచ్చుకున్న ఉలెన్ స్వెటరుంది. చలిని తట్టుకోవడానికి అప్పటికది నాకు సరిపోయింది. అలా జర్మన్ లాంగ్వేజ్ కోర్సుకి ల్యూనబర్గులో ఉన్న మొదటి నెలంతా ఓవర్‌కోట్ లేకుండా స్వెటర్‌తోనే గడిపేశాను.

మిగతా ఇండియన్సు అలా కాదు. ఉత్తరాదివాళ్లు ఇండియానుంచి ఓవర్‌కోట్లు తెచ్చుకునొచ్చారు. దక్షిణాదివాళ్లు ఇక్కడికి రాగానే కొనుక్కున్నారు. లేనివాణ్ణి నేనొక్కణ్ణే!

ఉన్నాయి కదా అని వేసుకుని బయటకొచ్చేవారు కానీ, చలి అట్టే లేక ఆ కోటు ఎక్కువగా వాళ్ల చేతులమీదే ఉండేది. అందుకే లాంగ్వేజ్ కోర్సు పూర్తయి బెర్లిన్ వెళ్లేక అక్కడ కొనుక్కోవచ్చులే అని నేననుకునేవాణ్ణి.

తమని తాము సమర్థించుకుందుకో, లేక నేను నిర్లక్ష్యం చేసి ప్రాణాలమీదకు తెచ్చుకుంటానన్న భయమో, లేక వాళ్లు వాడుతున్నది నేనూ వాడాలన్న పంతమో చెప్పలేను కానీ, 'ఇది చలి దేశం. ఇక్కడ వాతావరణం ఇట్టిట్టే మారిపోతూంటుంది. క్షణం క్రితం ఉక్కబోస్తే, ఆ మరుక్షణం చలి గజగజ వణికించొచ్చు. బయటికొస్తే ఓవర్‌కోట్ దగ్గరుండాల్సిందే' అని మిత్రులు నొక్కించేవారు.

కొన్నాళ్లు తప్పించుకున్నాను.

ఓ శుక్రవారం సాయంత్రం లాంగ్వేజి క్లాసులయ్యేక, ఐదుగురు ఇండియన్ మిత్రులం కలిసి బజార్లో తిరుగుతుంటే, ఒకచోట షోకేసులో ముచ్చటగా ఉన్న స్పూల్ టైపు టేపు రికార్డర్ ఒకటి కనిపించింది. ధర చూస్తే 150 మార్కులే. కాసెట్ రికార్డరుకంటే తక్కువధర కొస్తోందని ఒక మిత్రుడు ఉత్సాహపడి లోనికి వెడదామన్నాడు. అంతా వెళ్లాం.

తీరాచూస్తే అది సెకండ్ హాండువి అమ్మే దుకాణం. ఎలక్ట్రానిక్వే కాదు– ఫర్నిచర్ నుంచి, బట్టలదాకా రకరకాలవి చౌకగా ఉన్నాయి.

విషయం తెలిసేక నా మిత్రుడికి టేపు రికార్డర్ అంత ముచ్చటగా కనబడలేదు.

తెలిసినవాళ్లు అమ్మితే ఏమో కానీ– షాపుకెళ్లి సెకండుహాండు సరుకులు కొనడం ఇష్టముండదు నాకు.

అందుకని అనాసక్తంగా అటూ ఇటూ చూస్తున్నాను.

ఒకసారి లోపల అడుగెట్టేక, వెంటనే బయటికి వెళ్లిపోవడం బాగుండదని మిగతావాళ్లు అక్కడేమున్నాయో చూస్తున్నారు. అంతలో ఓ మిత్రుడు ఓవర్ కోటొకటి చూసి, "చాలా బాగుంది. సైజు సరిపోతే నేనే తీసుకునేవాణ్ణి. ఇది మన రావుకి కరెక్టుగా సరిపోతుంది. జస్ట్ 20 మార్కులంటే కారుచౌక" అన్నాడు.

అంతే, మిత్రబృందమంతా నన్ను బలవంతపెట్టారు. 'ఇలాంటి షాపుల గురించి ముందే తెలిస్తే బాగుండేది. లేకపోతే, ఏడాదుండి వెళ్లిపోయేదానికి, ఓవర్కోటుమీద ఇంత డబ్బు తగలేసి ఉండేవాణ్ణి కాదు. ఇండియా వెళ్లేక దీనికింక పనేముంది?' అని ఓ దక్షిణాది మిత్రుడు వాపోతూ, 'బెర్లిన్ వెళ్లేక ఎలాగూ కొందామనుకుంటున్నావుగా, ఇది మంచి ఆఫర్. వదులుకోకు' అన్నాడు.

'ల్యూనబర్గులో ఉండగానే రావుని ఓవర్కోట్లో చూసే యోగం ఉండబట్టే– అనుకోకుండా మనమీ షాపులో ఎంటరైనట్లున్నాం' అన్నాడింకో మిత్రుడు– అప్పుడే నేనా కోటు కొనబోతున్నట్లే!

కొనడానికి నాకు మనసొప్పలేదు. సెకండ్ హాండ్ షాపులో ఉన్నాం కాబట్టి– సెకండ్ హాండ్ సరుకుల్ని చిన్నబుచ్చుతూ మాట్లాడ్డం మర్యాద కాదు కాబట్టి ఇంకేవేవో వంకలు చెబుతున్నాను.

అవసరముండీ డబ్బుకి వెనకాడి నేను ఓవర్కోట్ వాడ్డం లేదేమోనన్న అనుమానం బలంగా ఉన్నట్లుంది. ఉన్నట్లుండి వాళ్లంతా ఆ షాపుకి సేల్సుమెన్గా మారిపోయారు. మంచి తరుణము మించిన దొరుకదు– అంటూ బలవంతపెట్టారు.

నా స్థానంలో శోభన్ ఉండి ఉంటే– తనకూ ఇష్టమైతే ఏమో కానీ, కేవలం వాళ్ల మాటలకు లొంగేవాడు కాదు.

అయిష్టంగానే నేనా కోటు కొన్నాను. కొన్న మర్నాడే పెద్ద వాన. బయటకెళ్లడానికి కోటు అవసరమైంది. అటు వాననుంచీ, ఇటు చలినుంచీ కూడా అదిచ్చే రక్షణ స్వానుభవమయ్యేక– కోటు కొని మంచిపనే చేశాననుకున్నాను.

మర్నాడు ఆదివారం. రివాజుగా మిత్రుడు నటరాజన్ ఇంటికి బయల్దేరాను. ఓవర్‌కోట్ వేసుకోవడం మర్చిపోలేదు.

నటరాజన్ ఇంటి దగ్గర అతడి ల్యాండ్‌లేడీ కనబడి విష్ చేసింది. ఆమె ఎక్కడ నా కోటుని తేరిపార చూస్తుందోనని, మర్యాదకు నేనూ విష్ చేసి హడావుడిగా వెళ్లిపోయాను.

గదిలో నటరాజన్ నన్నోసారి తేరిపార చూసి నా కోటుని మెచ్చుకున్నాడు. మెచ్చుకోక ఏంచేస్తాడు– బలవంతపెట్టి కొనిపించినవారిలో తనూ ఉన్నాడుగా– అనుకుంటూ కోటు గోడ మూలకున్న స్టాండుకి తగిలించాను.

పక్క గదిలోనే ఉంటున్న బిశ్వాస్ కాసేపటికి వచ్చి కాసేపు కూర్చుని వెళ్లాడు. ఏదో ఒక పెడసరం మాట అనడం అతడికలవాటు కాబట్టి, అతడుండగా కోటు టాపిక్ రాకూడదనుకున్నాను. అదృష్టంకొద్దీ నటరాజన్ ఆ టాపిక్ తీసుకురాలేదు.

పాతదైనా ఆ కోటు నాకు కొత్తదే కదా! మర్నాడు సోమవారం చలి లేకపోయినా, వాన సూచనలు కానరాకపోయినా– గ్యోతే ఇన్స్‌టిట్యూట్‌కి కోటు వేసుకునే వెళ్లాను. క్లాసుకి వెళ్లేముందు ఓవర్ కోట్లు ఉంచడానికి కేటాయించిన గదిలోకి వెళ్లాను.

నేనా గదిలోకి వెళ్లడం అరుదు కదా– అక్కడున్న ఇద్దరు ముగ్గురు నన్ను ప్రత్యేకంగా పలకరించి కోటు కొన్నావా అనడిగారు. నేను ఊఁ అనగానే విని ఊరుకున్నారు.

వాళ్లు కోటుని మెచ్చుకుంటారని ఆశించానేమో, అలా జరక్కపోవడంతో నాలో అది సెకండ్ హాండుదన్న కాంప్లెక్సు మొదలైంది.

తర్వాతనుంచి ఎవరు కనబడినా– నన్ను కాక నా కోటుని చూస్తున్నట్లు అనిపించింది. ఏదో అనాలనుకుని అనలేక తటపటాయిస్తున్నట్లు తోచింది. కొందరు నవ్వుకుంటున్నారా అని అనుమానం కూడా వచ్చింది.

రెండ్రోజుల తర్వాత నటరాజన్ మాటల సందర్భంలో, "నిన్న నువ్వు మా ఇంటికొచ్చినప్పుడు మా ల్యాండ్‌లేడీ నీ ఓవర్ కోట్ చూసింది. బాగుందని మెచ్చుకుంది కానీ సెకండ్ హాండుదనగానే అంత తృప్తిగా లేదు" అన్నాడు.

"డబ్బున్నవాళ్లు కదా, సెకండ్ హాండ్ అంటే చిన్నచూపేమో!" అన్నాడు పక్కనున్న గుప్తా.

"అదేం కాదు. సెకండ్ హాండ్ దుకాణాలేం మనకోసమని తెరవలేదు. ఇక్కడ వీళ్లూ వాటిలో షాపింగ్ చేస్తారు. కానీ బట్టలైతే, అవి ఎవరో కట్టి విడిచినవి కదా– అందుకని వాటి విషయం వేరుట. ఇక ఓవర్‌కోట్ల గురించైతే వాళ్లకి వేరే సెంటిమెంటుంది. సాధారణంగా ఎవరూ ఓవర్ కోట్లు సెకండ్ హాండ్ దుకాణాలకివ్వరట. ఇచ్చేరంటే అవి అర్థాంతరంగా చనిపోయినవాళ్లవై ఉంటాయి. వాళ్ల ఆత్మలు ఆ కోటుని ఆవహించుకుని ఉంటాయని నమ్మేవాళ్లలో మా ల్యాండ్‌లేడీ కూడా ఉంది" అన్నాడు నటరాజన్.

ఇది నాకు ఊహించని కొత్త సమాచారం.

దయ్యాల విషయంలో చాలామందికిలాగే– నాకూ నమ్మకం లేదు కానీ, భయముంది. అందుకే నటరాజన్ మాటలకి ఒక్కసారి వళ్లు జలదరించింది.

అతడు చెప్పింది వినగానే– ఇక నా ఫ్రెండ్సు నామీద ప్రశ్నల వర్షం కురిపించారు.

'వేసుకున్న మొదటి రోజు ఏమనిపించింది?' అని ఒకడు. 'ఆ రాత్రి పడుకున్నాక కలలో ఎవరైనా ఆపరిచితులు కనిపించారా?' అని మరొకడు. 'ఇప్పుడు నువ్వు చేసే పనులు నువ్వు చేస్తున్నట్లే ఉందా, లేక ఎవరో చెబుతుంటే, చేస్తున్నట్లు అనిపిస్తోందా?' అని ఇంకొకడు–

సినిమాల్లో కొత్త హీరోయిన్ని ఫస్ట్ షాట్‌కి వంద టేక్సు తీసుకున్నాకా, క్రికెట్లో కొత్త బ్యాట్సుమన్ని ఫేస్ చేసిన ఫస్ట్‌బాల్‌కే ఔటైనప్పుడూ– అడిగే విలేకర్లలా!

ఏంచేస్తాను– పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం– అదీ నా పరిస్థితి.

మనసులో ఇబ్బందిగా ఉన్నా– వాళ్లని ఆపకపోతే లాభం లేదనిపించింది.

'మొదటి రాత్రి కలలో, ఓ అపరిచితుడు కనిపించాడు. నడివయస్కుడు. చూడ్డానికి బాగున్నాడు. మాట్లాడ్డానికి మనుషులు దొరకడం లేదుట. నాచేత కోటు కనిపించినవాళ్ల అడ్రసులు కావాలన్నాడు' అన్నాను.

'ఎవరెవరి విచ్చావేమిటి?' అన్నాడు గుప్తా.

'నేను చెప్పడమెందుకు? ఎవరి కలలోకొస్తే వాళ్లే చెబుతారు' అన్నాను.

వాళ్లు కాస్త తగ్గారు. కానీ మనసులో ఇబ్బంది నాకింకా తగ్గలేదు. దాన్నించి బయటపడ్డానికి, తెలిసిన కొన్ని దయ్యాల కథల్ని కలలుగా మార్చి చెప్పాను. దాంతో ఉత్సాహం పుట్టి మరో ఇద్దరు తమకు తెలిసిన దయ్యాల కథలు చెప్పారు.

ఆ తర్వాత మా మధ్య అటు ఓవర్‌కోటూ, ఇటు దయ్యాలూ కూడా సంభాషణల్లోకి చొరబడలేదు. కానీ మనసులో– ఆ కోటు కొనకుండా ఉండాల్సిందన్న భావన ముల్లె తరచుగా గుచ్చుతూనే ఉండేది నన్ను.

ఇంతకీ నన్ను బలవంతపెట్టి కొనిపించింది వాళ్లు. నా మొహమాటం వాళ్ల బలవంతానికి లొంగేలా చేసింది.

బెర్లిన్ వెళ్లేక నాకు కోటు గురించిన కాంప్లెక్సు పూర్తిగా పోయింది. అది సెకండ్ హాండుదని అక్కడెవరికీ తెలియదు కదా!

శ్రీమతి బెర్లిన్ వచ్చేదాకా, అంటే మూడు నెలల పాటు నేనా కోటుని బాగా వాడుకున్నాను.

శ్రీమతి రాగానే తనకి ఓవర్ కోట్ కొన్నాను. అప్పుడామె, "నా కోటు పక్కన మీ కోటు వెలవెలబోతోంది. మీరూ కొత్తది కొనుక్కోండి" అని బలవంతపెట్టింది.

"వెలవెలబోవడమేమిటి? కొన్నప్పుడెలాగుందో, ఇప్పుడూ అలాగే ఉంది" అన్నాను నేను.

"అంటే కొన్నప్పట్నించీ ఇలాగే ఉందన్నమాట! అవున్లెండి, సెకండు హాండుదిగా" అంది శ్రీమతి చటుక్కున.

తనిక్కడికి రానప్పుడు, ఇక్కడి నా అనుభవాలు చాలావరకూ– ఉత్తరాల ద్వారా పూసగుచ్చినట్లు తెలియబర్చేవాడినేమో– ఆమెకు ఆ కోటు నేపథ్యం కొంత తెలుసు.

అప్పుడామె మొహం చూస్తే– నాకు ల్యూనబర్గులో ఇండియన్ మిత్రుల ముఖభావాలే గుర్తుకొచ్చాయి.

"కాళిదాసు మొహం చూస్తే కవిత్వం పుట్టుకొచ్చినట్లు– ఈ కోటు చూస్తే నీలోనూ జోక్సు పుడుతున్నట్లుంది" అన్నాను చిన్నబుచ్చుకుని.

"మీకలా అనిపించిందా? నామీద నమ్మకంతో, నిజంగానే కోటు వెలవెలబోతోందేమోననుకుంటారనుకునాను" అంది శ్రీమతి.

ఆ రోజునుంచీ జాగ్రత్తగా పరిశీలిస్తే నా కోటు వెలవెలబోతున్నట్లే కాదు, వెలిసిపోయినట్లే అనిపించింది. ఆమె పట్టుదలతో– వెంటనే కాకపోయినా– తనకి కోటు కొన్న వారానికే నేనూ ఓ కోటు కొనుక్కున్నాను.

మామూలుగా ఐతే ఎంతో తెలితదు కానీ– ఆఫర్లో 45 మార్కులకి వచ్చింది. ఐతే అది ఓవర్‌కోట్ కాదు. దానికిలాగే చలినుంచి రక్షణ ఇచ్చే జాకెట్. దానికంటే పొడవు తక్కువ.

దీనికి లోపల జిప్పుతో అతికించిన 'పోలీ అక్రైల్' ఊలు లైనింగుంది. చలిగా లేనప్పుడు ఆ లైనింగ్ తీసెయ్యొచ్చు. అంతే కాదు, పాత కోటులా కాకుండా, దీనికి తల, మొహం, చెవులు కప్పుకునే సదుపాయముంది. అది వేసుకుని బయటకెడితే వంటికి చెమటలు పట్టేవి.

అన్నింటికీ మించి ఇది పాత కోటులా– కొన్నప్పుడే వెలవెలబోవడం లేదు. తళతళలాడిపోతోంది.

అబద్ధమెందుకూ– పాత కోటు తీసి కొత్తది వేసుకున్నప్పుడు ఏదో ప్రేతాత్మ నన్ను విడిచి వెళ్లిన అనుభూతి కూడా కలిగింది.

కొత్త కోటుతో ఆఫీసుకి వెళ్లినప్పుడు– ఆ మార్పుని చాలామందే గుర్తించారు.

ఎందుకు గుర్తించరూ– పాత కోటు రంగు నలుపు. ఇంచుమించు పాదాలదాకా వస్తుంది. ఈ జాకెట్ రంగు తళతళలాడే బ్రౌన్. మోకాళ్లకంటే కొంచెం పైకే ఉంటుంది.

అహమ్మద్ చాలా బాగుందని మెచ్చుకున్నాడు. హైనర్ డెకర్ట్ ఐతే, "హమ్మయ్య! కోటు మార్చావు" అన్నాడు.

హమ్మయ్య– అన్న ఆ ఒక్క మాటతో– నా పాత కోటు గురించి ఇక్కడా బోలెడు చర్చలు జరుగలేదు కదా అనిపించింది.

'కాంప్లెక్సు కాకపోతే, నీదాకా రానివాటి గురించి ఊహలెందుకూ' అని మనసు మెదడుని మందలించింది.

ఇక నేను మళ్లీ పాత కోటు ధరించలేదు. ఐతే మాకున్నది ఒక్కటే గది. అక్కడ ఓ మూల కొక్కేనికి కనబడుతూ రోజూ నన్నది వెక్కిరిస్తూనే ఉండేది. దాన్ని చూసినప్పుడల్లా, ఇన్నాళ్లెలా దీన్ని భరించాను– అనుకున్నాను.

ఆ కోటుని ఇప్పుడు శోభన్ అడిగాడు– తనకి కావాలని!

'వెంటనే ఇచ్చెయ్! రోజూ దాన్ని చూడాల్సిన అగత్యం తప్పుతుంది' అని మనసు ప్రోత్సహించింది.

శోభన్‌తో పరిచయమై ఎన్నాళ్లో కాలేదు. కానీ అప్పటికే అతడంటే అభిమానం ఏర్పడింది.

'నువ్వు పడ్డ మనోవ్యధంతా మర్చిపోయేవా? నిజం దాచి మిత్రద్రోహం చేస్తావా?'' అని మనసు నన్ను కసిరింది.

నేను శోభన్‌కి ఆ కోటు కథ చెప్పి, "ఇంకా నీకా కోటు కావాలనిపిస్తే తప్పక ఇస్తాను" అన్నాను.

అప్పుడు శోభన్ తనదైన పద్ధతిలో ఓ నవ్వు నవ్వాడు. ఆ నవ్వు దూరంగా ఉన్నవాళ్లకి వినిపించేటంత బిగ్గరగా ఉండదు కానీ– దగ్గరున్నవాళ్లకి గట్టిగానే అనిపిస్తుంది. నవ్వినప్పుడు అతడి మొహంలో సంతోషమో, వ్యంగ్యమో పసికట్టలేని విచిత్రభావం కనిపిస్తుంది.

"ఎందుకు నవ్వుతున్నావ్!" అన్నాను.

శోభన్ మాట్లాడకుండా కోటు దగ్గరకెళ్లి కొక్కెంనుంచి దానికి విముక్తి కలిగించాడు. ఓసారి ఆప్యాయంగా దాన్ని తడిమాడు. వెంటనే దాన్ని ధరించి, బీరువా అద్దముందు నిలబడి తనని తాను చూసుకున్నాడు. తర్వాత నావైపు తిరిగి, "సో! మొహమాటానికి కాక నువ్వు దీన్ని మనస్ఫూర్తిగానే నాకిస్తున్నావ్!" అన్నాడు.

"అంటే తీసుకుంటున్నావా?" అన్నాను.

"నాక్కావలసింది చలినుంచి రక్షణ. పైసా ఖర్చు లేకుండా అప్పనంగా వస్తున్న దీన్ని నేనెందుకు తీసుకోను?" అన్నాడు శోభన్.

"ఒక్కసారి భాబీజీని కూడా అడిగి....." అని నేనింకా ఏదో అనబోతే–

"మన బట్టలు. మన సౌకర్యం. మనిష్టం. ఆ విషయంలో కూడా మనకి స్వేచ్ఛ లేకపోతే ఎలా?" అన్నాడు శోభన్ వెంటనే.

"నాకైతే బయటే కాదు, ఇంట్లో కూడా ఇది వేసుకుంటే బాగుంటుందనిపించింది. హీ లుక్స్ సో హాండ్సమ్" అంది శ్రీమతి శోభన్ భర్తని ముచ్చటగా చూస్తూ.

'భర్తకు తగిన భార్య' అనుకున్నాను. అతడి పుత్రరత్నాన్ని చూస్తే, ఇవేం పట్టించుకోకుండా మా పిల్లలతో ఆడుతున్నాడు. పరిస్థితి అర్థమై, ధారాళంగా మాట్లాడే వయసొస్తే, 'నాన్నా! దీన్ని పాడుచెయ్యకు. పెద్దయ్యేక నేనూ వేసుకుంటా' అంటాడేమో అనుకున్నాను. కానీ ఆ అవకాశం ఉన్నట్లు లేదు. ఎందుకంటే---

భార్య ముచ్చట తీర్చడానికో ఏమో, శోభన్ ఇక కోటు విప్పలేదు. వెళ్లేటప్పుడు థాంక్స్ చెప్పాడు.

"నేనే నీకు థాంక్స్ చెప్పాలి" అన్నాను. కొంత నిజం. కొంత మర్యాద.

శోభన్ చిన్నగా నవ్వి, "నువ్వు థాంక్స్ చెబితే, నాకిది శాశ్వతంగా ఇచ్చేసినట్లు. నేను థాంక్స్ చెబితే, ఈ కోటు నేను తాత్కాలికంగా తీసుకున్నట్లు. అన్నదమ్ములదైనా సరే పరాయి సొమ్ముని ఉంచుకోను నేను. ఇండియా వెళ్లగానే నీకిది తిరిగిచ్చేస్తాను" అన్నాడు.

అప్పుడు నాకు శోభన్ పుత్రరత్నం అప్పెట్టవుతాడా, తేలికగా నిట్టూరుస్తాడా అన్నది ఊహల్లో తేలలేదు.

తర్వాత శోభన్ నాకు చాలాసార్లు ఆఫీసులోనూ, మార్కెట్లలోనూ కనిపించాడు. అతడినే నన్నుగా ఊహించుకుంటే- అప్పట్లో ఆ కోటువల్ల నేను అపహాస్యానికి గురైతే, అది న్యాయమేననిపించింది.

కానీ శోభన్- దిగంబరుడైన జైనముని నిస్సంకోచంగా జనం మధ్య తిరిగినట్లు- ఓవర్‌కోటాంబరుడై బెర్లిన్లో చిదానందుడై చరించడం-అనుసరించతగ్గ గొప్ప లక్షణం.

మేము ఇండియా వెళ్లిన ఏడాదికి శోభన్ కూడా ఇండియా వచ్చేశాడు. తానొచ్చిన మూడేళ్లకి కాబోలు- పూనాలోని తన సంస్థనుంచి బదిలీమీద వచ్చిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు ద్వారా- నా ఓవర్‌కోటు వెనక్కి పంపాడు.

అతడి నిబద్ధత మెచ్చుకోతగ్గదే అయినా- నాకా కోటు మొక్కపాటివారి బారిస్టరు పార్వతీశం టోపీలా అనిపించింది.

కోటు నాకు చేరిన మరి కొన్నేళ్లకు-

ఆ రోజు లాబొరేటరీలో నా గదిలో- స్పెషల్ కంటెయినర్లోంచి ఓ స్పెషల్ థెర్మాస్ ఫ్లాస్కులోకి లిక్విడ్ నైట్రోజన్ వంపుతున్నాను. సెంటిగ్రేడ్ కొలమానంలో మంచుగడ్డది సున్నా డిగ్రీలైతే నైట్రోజన్ ద్రవరూపంలో ఉండడానికి -196 డిగ్రీలు. అంటే సున్నాకంటే 196 డిగ్రీలు తక్కువ. నీటిని వంద డిగ్రీలకు తీసుకెడితే ఆవిరిగా మారిపోయినట్లు, లిక్విడ్ నైట్రోజన్‌కి రూం టెంపరేచరు సోకగానే, తక్షణం ఆవిరైపోతుంది. ఎంత జాగ్రత్త తీసుకున్నా, కంటెయినర్లోంచి ఫ్లాస్కులో పోసేటప్పుడు కొంత నైట్రోజన్ ద్రవానికి రూం టెంపరేచర్ సోకక తప్పదు కదా! అందుకే నేను ఫ్లాస్కులోకి పోస్తుంటే, నైట్రోజన్ గాస్ పొగలుగా గదంతా వ్యాపించింది. కొద్ది క్షణాలు నేను గుహలో మాంత్రికుడిలా అస్పష్టంగా ఉన్నాను.

ఆ క్షణంలోనే గది తలుపు తెరుచుకుని లోపలకి ఇద్దరు ప్రవేశించారు. వారిలో ఒకరు నా జూనియర్. రెండవ వ్యక్తి శోభన్.

పూరీ–కోణార్క ట్రిప్ మీద ఇటొచ్చేట్ట. కొడుక్కి చదువు పోతుందని అక్కడే వదిలేసి రావాల్సొచ్చింది. అందుకని టైట్ ప్రోగ్రాం. ఈ రాత్రికే తిరుగు ప్రయాణం. నన్నోసారి చూడాలని వీలుచేసుకుని లాబొరేటరీకి వచ్చాడు. ఉత్తరాల ద్వారా అడ్రసు తెలుసు కాబట్టి– భార్యని మా ఇంటివద్ద వదిలేసి, తను లాబొరేటరీకొచ్చాడు. నా గురించి వాకబు చేస్తుంటే, జూనియర్ నా దగ్గరికి తీసుకొచ్చాడు.

నేను ప్రయోగాన్ని జూనియర్‌కి అప్పజెప్పి– సీట్లో కూర్చున్నాను. శోభన్ నాకెదురుగా కూర్చున్నాడు. "లాబ్ చూస్తావా?" అన్నాను.

"లాబ్, సైంటిస్టులు, డైరెక్టరు– ఇదంతా అక్కడా ఇక్కడా ఒకటే. అందులో చూసేదేం లేదు. అంతా రొటీన్. అఫీషియల్‌గా వస్తే ఎలాగూ తప్పదు. నేను నిన్ను చూడాలనొచ్చాను. మనం సైన్సు ప్రపంచాన్ని మర్చిపోయి– కాసేపు సరదాగా కబుర్లు చెప్పుకుందాం. నీకేం ఇబ్బంది లేదుగా" అన్నాడు శోభన్.

మా సైంటిస్టులకున్న సౌకర్యమే అది. ప్రయోగాల అవసరాన్నిబట్టి ఒకోసారి రాత్రింబవళ్లు పనిచెయ్యాలి. ఎవరికి వాళ్లమే బాసులం. మమ్మల్ని శాసించేవారుండరు. ఆఫీసు టైంలో మిత్రులొస్తే, వాళ్లతో మాట్లాడ్డానికి ఒకరి అనుమతి అవసరం ఉండదు. అలాగని విచ్చలవిడిగా తిరగకూడదు. క్రమశిక్షణను పాటించడానికి– 'షరతులు వర్తిస్తాయి' అన్న ముక్తాయింపు ఉండనే ఉందిగా.

"ఇబ్బందేం లేదు. ఇంటికెడదామా?" అన్నాను.

"వద్దు. బయట బాగా ఎండగా ఉంది. ఇక్కడ కాసేపు చల్లబడి వెడదాం. ఎలాగూ భోజనం మీ ఇంట్లోనేనని మిసెస్ రావ్ ఆర్డరేసేసింది" అన్నాడు శోభన్.

ఇంటికి ఏసీ లేదు. ఏసీ అంటే పెద్ద లగ్జరీ అనుకునే రోజులవి.

సుమారు గంటసేపు జర్మనీ ముచ్చట్లు చెప్పుకుంటూ కాలచక్రంలో చాలా ఏళ్లు వెనక్కి వెళ్లిపోయాం. ఎంత ఆహ్లాదంగా అనిపించిందంటే, అయ్యో– మళ్లీ అలాంటి రోజులొస్తాయా అనిపించింది.

తెలియకుండానే టైం ఒంటిగంటవడంతో, జూనియర్ మమ్మల్ని హెచ్చరించాడు. అది మాకు లంచ్ టైం.

ఆఫీసునుంచి మా ఇల్లు రెండు ఫర్లాంగులలోపే ఉంటుంది. నడుచుకుంటూ ఇల్లు చేరేసరికి, పన్నెండు నిముషాలు పట్టింది.

ఇల్లు చేరగానే శోభన్ భార్య తనే తలుపు తీసింది. "నమస్కార్. కంగారు పడొద్దు భాయిసాబ్! ఇది మీ ఇల్లే, నేను మిసెస్ ఘోష్‌ని" అంది.

నన్ను సర్ప్రయిజ్ చెయ్యడంకోసం ఆమె తనే తలుపు తీసిందని గ్రహించాను.
ప్రతినమస్కారం చేసి లోపల అడుగెట్టాను.

శోభన్ నా వెనుకే లోపలికి రాగానే, "నమస్కార్ భాయిసాబ్! భోజనం రెడీయే కానీ ముందుగా చాయ్..." అంటూ శ్రీమతి శోభన్ వెనుకనుంచి ముందుకొచ్చింది శ్రీమతి.

ఒరియా, బెంగాలీలకి తరచుగా చాయ్ కావాలి. మా ఇంట్లో ఎవరికీ కాఫీ, టీ అలవాటు లేకపోయినా– అతిథుల విషయంలో ఆ మర్యాద శ్రీమతికి బాగా పట్టుబడింది.

శోభన్ వెంటనే, "నువ్వు నిండు నూరేళ్లు బ్రతకాలమ్మా! ఇడిగో మీ ఆయన దగ్గర గంటన్నర పైగా కూర్చున్నాను. ఎంతసేపూ కబుర్లు, కబుర్లు, కబుర్లే తప్ప– దుర్మార్గుడు చాయ్ ప్రస్తావనే తేలేదు. నాలిక పీక్కు పోతోంది. కడుపులో కాస్త చాయ్ పడితే తప్ప ఇంకో పని చెయ్యలేను" అన్నాడు.

ఛెళ్లున తగిలింది నాకు. చూడగానే శ్రీమతికి తట్టిన విశేషం అంతసేపు అతడు నాతో కూర్చున్నా ఎందుకు తట్టలేదు?

విశేషమేంటంటే– ఛెళ్లుమనిపించినా శోభన్ మాటలు నాకు నవ్వు తెప్పించాయే తప్ప, కోపాన్నీ, బాధనీ కలిగించలేదు. అతడు కూడా సరదాగా అనేసి వదిలేశాడే తప్ప– కసిగా ఆ మాటనలేదు.

అప్పుడు నాకు వినాయకుడి బొడ్లో తేలు కథ గుర్తుకొచ్చింది. ఆకథలో ఓ గుడి. అందులో వినాయకుడి బొమ్మ. ఆ బొమ్మ బొడ్లో వేలెట్టి చూసుకుంటే, మల్లెపూల వాసనొస్తుందంటారు. ఎవరికైనా అలాంటి సువాసన రాకపోతే, వాళ్లు పాపాత్ములై ఉంటారని కూడా అంటారు. ఎందుకొచ్చిందిలే అని ఎవ్వరూ ఆ బొడ్డు మహిమని పరీక్షించేవారు కాదు.

ఒకసారి నలుగురు మిత్రులు ఆ బొడ్డు మహిమని పరీక్షించాలనుకుని గుడికి వెళ్లారు. మొదటివాడు బొడ్లో వేలెట్టాడు.

ఆ బొడ్లోకి ఒక తేలు చేరి నివాసం ఏర్పరచుకుంది. అది మొదటివాడి వేలుమీద ఠక్కున కుట్టింది. కానీ వాడా బాధని ఓర్చుకుని, వేలుని వాసన చూసి, 'ఆహా, మల్లెపూల వాసన' అన్నాడు. ఆతర్వాతి ఇద్దరూ కూడా అదే పని చేశారు.

నాలుగోవాడు ముక్కుసూటి మనిషి. వాడికి నిజం మాట్లాడ్డమే తప్ప, జనం తన గురించి ఏమనుకుంటారోనన్న భయం లేదు. తనని తేలు కుట్టగానే వాడు, 'అమ్మో! తేలు' అన్నాడు. అప్పుడు అంతా ఔనన్నారు. తేలుని పుల్లపెట్టి బయటకు లాగి చంపేశారు.

ఒక్కడి ముక్కుసూటితనం– ఒక ప్రమాదానికి శాశ్వతంగా స్వస్తి పలికింది.

ఇంటికొచ్చిన అతిథులంతా శోభన్‌లా ఉండలేరు. శోభన్ పుణ్యమా అని నానుంచి నా అతిథులకి ఓ గొప్ప సౌకర్యం కలిగింది.

అప్పట్నించీ నా మర్యాద ఆహ్లాదకరమైతే ఆ ఘనత శోభన్‌ది. కాకపోతే ఆ తప్పు నాది.

ఇప్పుడు మళ్లీ వెనక్కి వచ్చి బెర్లిన్ నగర విశేషాలు ముచ్చటించుకుందాం....

ఇంట్లో ప్రహసనాలు

అపరిశుభ్రాన్ని 'కాక్కు' అనేవాళ్లం పిల్లలదగ్గర. స్నానం చెయ్యడానికి మొరాయిస్తే– కాక్కు పాప, కాక్కు బాబు అనేవాళ్లం పిల్లల్ని. వాళ్లు మాత్రం తక్కువ తిన్నారా– నాకుగానీ, శ్రీమతికిగానీ స్నానం ఆలస్యమైతే కాక్కునాన్న, కాక్కమ్మ అనేవారు. ఎక్కడ వాళ్లలా అనేస్తారోనన్న భయంతో వీలైనంతవరకూ మేమిద్దరం స్నానాలకి ఆలస్యం కాకుండా చూసుకునేవాళ్లం.

పిల్లల ఈ పిలుపు కొంచెం ప్రమాదకరమైనదే.

మాది మంచి షాపింగ్ ఏరియా కదా, ఒకసారి ఇటుగా షాపింగుకొచ్చిన ఓ ఇండియన్ మిత్రుడు ఉదయం పదింటికే మా ఇంటికొచ్చి, ఓ షాపులో కాసెట్ల ఆఫర్ గురించి చెప్పాడు. టిఫిన్ చేసి వెళ్లమంటే, "ఆఫర్ గురించి చెప్పాలనొచ్చాను. నేను వెంటనే వెళ్లాలి. ఇంకా స్నానమవలేదు" అన్నాడు.

బాబు చటుక్కున, "కాక్కంకుల్" అనేశాడు.

ఒకటి– మిత్రుడు హడావుడిలో ఉండి వినలేదు. రెండు– అతడికి తెలుగు రాదు. బ్రతికిపోయాం.

మా ఇంటామె ఒలోముచ్‌కీని పిల్లలకి అమ్మమ్మ అని చెప్పేవాళ్లం. ఆమె నెలల తరబడి స్నానం చెయ్యదని మేమిద్దరం అనుకోవడం విన్న పిల్లలు ఆమెకి కాక్కమ్మమ్మ అని పేరెట్టారు. ఆమెకి భాష రాదు కాబట్టి, ఫరవాలేదులే అని ఊరుకున్నాం.

మావాళ్లొచ్చిన నెల్లాళ్లకి కాబోలు– ఆ ఇంట్లోకి కొత్తగా షేరర్ అనే అరవయ్యేళ్లతను– ఒలోముచ్‌కీ ఉండే పెద్దగదినానుకుని ఉన్న మరో గదిలో చేరాడు. అతడిది కూడా పోలండే. అద్దెకొచ్చాడో, లేక బంధువో మాకు తెలియదు. ఇంటామెకి చేదోడు వాదోడుగా ఉండేవాడు.

ఒలోముచ్‌కీది మహాకాయం. అడుగు తీసి అడుగు వెయ్యడమే పెద్ద అవస్థ ఆమెకి. ఇతగాడేమో సన్నగా, పీలగా ఉన్నాడు. ఆమె పక్కన చూస్తే మరీ పిట్టలా కనిపిస్తాడు. అందుకేనేమో చులాగ్గా, చలాకీగా టీనేజరంత హుషారుగా ఉంటాయి కదలికలు.

ఆమె అతణ్ణి సాయానికి తెచ్చుకుని ఉంటే కనుక ఎప్పుడో ఆ పని చెయ్యాల్సిందనిపించింది. ఎందుకంటే అతడొచ్చినప్పట్నించీ, రోజూ ఉదయం లేచింది మొదలు ఆఫీసుకెళ్లేదాకా 'హెర్ షేరర్' అన్న ఆమె పిలుపు మాకు వినిపిస్తూనే ఉండేది.

ఒలోముచ్‌కీతో మాకంత సాన్నిహిత్యం లేదు కానీ షేరర్ కలుపుగోరు మనిషి. నన్నతడు 'హెర్ డాక్టర్' అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు. నేనింట్లో ఉండేది తక్కువ కాబట్టి అతడికి నాకంటే ఎక్కువ సాన్నిహిత్యం శ్రీమతితో ఉండేది. ఆమెనతడు 'ఫ్రౌ రావ్' అని పిలిచేవాడు. వంటగదిలో ఉన్నప్పుడు వెళ్లి ఆమెతో కబుర్లు చెప్పేవాడు. జర్మన్– ఇంగ్లీషు కలగలిసిన భాషతో ఇద్దరికీ సంభాషణ బాగానే నడిచేది.

శ్రీమతిని కూతురిగానూ, మా పిల్లలకి తాతగానూ ఫీలయ్యేవాడు షేరర్. ఎప్పుడైతే శ్రీమతి తాత అని చెప్పిందో– అతణ్ణి 'కాక్కుతాత' అనడానికి మా పిల్లలు క్షణం కూడా వృథా చెయ్యలేదు.

శ్రీమతి నొచ్చుకుంది. ఎందుకంటే– షేరర్ తను శుభ్రంగా ఉండడమే కాదు. ఒలోముచ్‌కీ అపరిశుభ్రతమీద కామెంట్సు చేసేవాడు. తను రోజూ స్నానం చేస్తాననీ, ఆమె అన్నాళ్లు స్నానం చెయ్యకుండా ఎలా ఉంటుందోననీ ఆశ్చర్యపడేవాడు.

"ఇనుముతో స్నేహం చేస్తే, అగ్నికి సమ్మెట దెబ్బలు తప్పవు. కాక్కమ్మమ్మకి కావలసినవాడుగా, షేరర్ కాక్కుతాత అయ్యాడనుకో" అని శ్రీమతికి నచ్చజెప్పాను.

షేరర్‌కీ శ్రీమతికీ వంటింటి స్నేహం బాగానే కొనసాగుతోంది. అ సమయంలో అతడు ఒలోముచ్‌కీ భారీకాయంమీద జోక్సు వేసేవాడు. కానీ క్రమంగా ఆ జోక్సు ఎంజాయ్ చెయ్యలేని పరిస్థితి ఏర్పడింది శ్రీమతికి!

జర్మన్ నీళ్లు వంటబట్టడమో, లేక ట్యూబెక్టమీ సైడ్ ఎఫెక్టో, లేక థైరాయిడ్ సమస్యో– తెలియదు కానీ– బక్కగా, పీలగా ఉండే శ్రీమతి బెర్లిన్ వచ్చేక క్రమంగా వళ్లుచెయ్యసాగింది. అది గమనించిన షేరర్ ఆమెతో, "వళ్లు జాగ్రత్త! ఒలోముచ్‌కీకిలా ఐపోగలవు" అని హెచ్చరించాడు. రోజూ వెయింగ్ మెషీన్లో బరువు చూసుకుంటూ ఉండడంవల్ల, ఆ విషయం శ్రీమతికీ స్పష్టమౌతోంది. ఆహార నియంత్రణతో తన ప్రయత్నం తాను చేసినా, బరువుమీద ఏ ప్రభావమూ లేకపోయేసరికి– అసహాయతతో, భారాన్ని దైవంమీదే వేసింది. కానీ దైవం ఆ భారాన్ని తను తీసుకోకుండా ఆమెపైనే వదిలేశాడు.

అదలాగుంచితే షేరర్ వచ్చేక శ్రీమతికి కొత్తగా కొండంత బలం వచ్చినట్లనిపించింది. ఎందుకంటే చాలామంది యూరోపియన్సుకిలాగే అతడికి ఇంటి మెయింటెనెన్సుకి తగిన విద్యలు చాలా వచ్చు.

ఇంట్లో నేను లేనప్పుడు ఒకసారి శ్రీమతి, పిల్లలు రికార్డు చేసిన మావాళ్ల పాటలు–మాటలు వింటుండగా టేపు ఆగిపోయింది. ఏమయిందా అని చూస్తే గదిలో దీపం కూడా వెలగడం లేదు. అంటే కరెంటు పోయింది.

అక్కడ కరెంటు పోవడం కొత్త. పోయిన కరెంటు దానంతటదే వస్తుందో రాదో తెలియదు. ఐనా మా గదిలోనే పోయిందా, ఇల్లంతా పోయిందా అని అనుమానం. అందుకని శ్రీమతి షేరర్‌ని పిలిచి విషయం చెప్పింది.

షేరర్ ఇంట్లో కరెంటుంది. అందుకని అతడు మా గదికొచ్చి చూశాడు. స్విచ్‌బోర్డు పక్కనున్న గోళీకాయ సైజు వస్తువుని బయటికి లాగాడు. ఆ గోళీకి అంగుళం సైజు పొడుగున సన్నని గాజుగొట్టాముంది. అతడు దాన్ని పరీక్షగా చూసి, "ఫ్యూజు. పోయింది" అని అక్కడ పెట్టేసి వెళ్లిపోయాడు.

ఇండియాలో ఫ్యూజు పోతే– మార్చడానికి జరిగే తతంగం గుర్తుకొచ్చి శ్రీమతికి గుండె గుభేల్మంది.

ముందు ఇంట్లో ఫ్యూజు వైరుండాలి. ఉన్నా మనమే మార్చాలంటే ఫ్యూజు సాకెట్ అంతెత్తున ఉంటుంది. అందుకుందుకు నిచ్చెన ఉండాలి. లేదా ఎలక్ట్రీషియన్ వచ్చి చూసేదాకా అసహాయంగా ఎదురుచూడాలి.

ఒకవేళ ఫ్యూజు ఇంట్లోకాక బయట స్తంభంమీద పోయుంటే, లైన్‌మాన్ రావాల్సిందే! ఆ లైన్‌మాన్ రావడానికి గంటలే కాదు, ఒకోసారి రోజులు కూడా పట్టొచ్చు.

జర్మనీలాంటి అత్యాధునిక దేశంలో కూడా ఫ్యూజు సమస్య ఉంటుందని ఆమె ఊహించలేదు. ఇప్పుడది తీరాలంటే నేను ఆఫీసునుంచి రావాలి. వచ్చేక అప్పుడు సమస్యకు పరిష్కారం చూడాలి. ఆ పరిష్కారం ఇంట్లో ఉంటుందా, ఇంటి బయటుంటుందా అన్నది తెలియదు!

ఆమె ఇలా ఆలోచనలతో సతమతమౌతుండగా షేరర్ మళ్లీ వచ్చాడు. అతడి చేతిలో ఇందాకటిలాంటి ఫ్యూజ్ ఒకటుంది. పాత ఫ్యూజుని తీసిన చోట దీన్ని గుచ్చాడు. అంతే, కరెంటు వచ్చేసిందనడానికి సూచనగా మధ్యలో ఆగిన టేపు తిరగడం మొదలైంది.

"నా దగ్గర స్పేర్ ఫ్యూజు ఉంటే తెచ్చాను. మీరు కూడా ఇలాంటివి కొన్ని కొని ఇంట్లో ఉంచుకోండి. ఫ్యూజు పోతే మీరే మార్చుకోవచ్చు" అన్నాడు షేరర్.

'ఫ్యూజు మార్చడం ఇంత సులభమా? ఇండియాలోనూ ఇలాంటి సదుపాయముంటే ఎంత బాగుణ్ణు?' అనుకున్న శ్రీమతి మరోసారి జర్మనీ ఆధునికతని గుర్తించింది.

ఆమె షేరర్‌కి థాంక్సు చెబితే, అతడు వేలు పైకి చూపించి, "బల్బు వెలగలేదు. బహుశా మాడిపోయుంటుంది. నా దగ్గర స్పేర్ బల్బు ఉంది. తెచ్చి మారుస్తాను" అని వెళ్లి ఓ బల్బు తెచ్చాడు.

బల్బు గది కప్పుకి ఉండడంవల్ల, అందుకుందుకు కుర్చీ ఒకటి తెచ్చి వేసుకుని, దానిమీదకి ఎక్కాడు. కానీ అతడికి అది అందీ అందనట్లుంది. అతడు కుర్చీ దిగి, "నాకు అందడం లేదు. మీ ఆయన పొడగరి కదా! తనొచ్చేక మార్పించుకో" అని వెళ్లిపోయాడు.

సాయంత్రం నేనింటికొచ్చేక శ్రీమతి జరిగింది చెప్పి, పగలబడి నవ్వింది.

ఒక జర్మన్ వ్యక్తిచేత పొడగరి అనిపించుకున్నందుకు నాలో పుట్టిన గర్వాన్ని– ఆమె నవ్వులోని చిలిపితనం అణగద్రొక్కింది.

నేను మరీ పొట్టివాణ్ణి కాకపోవచ్చు. కానీ పొడగరి అనిపించుకునే అవకాశం ఏమాత్రం లేనివాణ్ణి. అలాంటి నన్ను– షేరర్ పొడగరి అన్నాడు. అలా చిన్నగీత పెద్దగీత అయింది.

అదే ఆమె నవ్వుకి కారణం మరి! నవ్వింది భార్య కాబట్టి, వినోదంగా స్వీకరించి ముచ్చటపడడం నా అసహాయత!

కానీ ఒకోసారి వినోదానికి విషాదం కూడా జతపడుతూంటుంది. అలాంటప్పుడు వినోదానికి ముచ్చట పడలేకపోవడం అసహాయత!

ఉదాహరణకి పెద్దవాళ్లెవరైనా కుర్చీలోంచి కిందపడితే, నవ్వు రావడం పిల్లలకు సహజం. నవ్వలేకపోవడం వాళ్ల అసహాయత.

నేను, శ్రీమతి పిల్లలం కాకపోయినా అలాంటి ప్రహసనం ఒకటి జరిగింది. అదీ స్నానాల గదిలో....

స్నానాల గదిలో

ఒక రోజు మాకు స్నానాల గదిలోంచి 'హెర్ షేరర్, హెర్ షేరర్' అన్న పిలుపులు మా గది తలుపుల్ని ఛేదించుకుని మరీ వినిపించాయి.

అది ఒలోముచ్‌కీ కంఠస్వరం. ఏమయిందోనని కంగారుపడి ఇద్దరం బయటికెడితే, స్నానాల గది తలుపు మూసి ఉంది. ఆమె మరోసారి 'హెర్ షేరర్' అంది. ఈసారది అరిచినట్లే ఉంది.

నేను పరుగున షేరర్ గదికి వెళ్లి తలుపు తట్టాను. అతగాడు తలుపు తీసి, ఏమయిందని అడిగేలోగానే మరోసారి, "హెర్ షేరర్" అన్న ఒలోముచ్‌కీ గొంతు వినిపించింది. ఈసారది ఆర్తనాదంలా ఉంది.

షేరర్‌కి పరిస్థితి అర్థమై ఒక్క ఉదుటున తలుపువద్దకెళ్లి, ముందు తలుపు తియ్యమని గట్టిగా అన్నాడు.

ఆమె తలుపు తీసే పరిస్థితిలో లేదు. స్నానం చేస్తూ బాత్‌టబ్బులో పడిపోయిందిట. పైకి లేచి రాలేకపోతోంది.

అప్పుడు షేరర్ నావైపు తిరిగి, విషయం చెప్పి, "ఆమెను బయటికి లాగడం నావల్లనేమౌతుంది. నీ సాయం కావాలి" అన్నాడు.

నేను తటపటాయిస్తూ, "స్నానాలగదిలో ఆమె ఏ స్థితిలో ఉందో! మగాళ్లం మనం లోపలికెడితే ఏం బాగుంటుంది? పక్కిళ్లలో కాస్త భారీగా ఉండే ఆడవాళ్లుంటే సాయమడుగుదాం" అన్నాను.

షేరర్ నవ్వి, "ఇలాంటప్పుడు ఆడవాళ్లు ఆడవాళ్లవద్దే ఎక్కువ సిగ్గు పడతారు. అందుకే ఫ్రౌ రావు సాయం కూడా తీసుకోదు. ఐనా మనవల్ల కానప్పుడే పక్కవారి సాయమడగాలి. తటపటాయించకు. ఒలోముచ్‌కీది పెద్ద వయసు. తల్లిలాంటిదనుకో" అని నచ్చజెప్పాడు.

ఏమనుకుందో శ్రీమతి వెంటనే గదిలోకెళ్లిపోయింది. నేనిక కార్యోన్ముఖుణ్ణై, "ఇంతకీ గది తలుపులు తీసేదెలా?" అన్నాను.

షేరర్ స్నానాల గదిలోకి వినిపించేలా, "కంగారు పడకు. సాయానికి నేను, రావ్ వస్తున్నాం" అని చెప్పి తన గదిలోకి వెళ్లి– ఓ స్క్రూడ్రైవర్, చిన్న సుత్తి, పట్టకారు తెచ్చుకొచ్చాడు. వాటినుపయోగించి తలుపు తాళం దగ్గర కాసేపు తంటాలుపడి మొత్తంమీద తలుపు తెరుచుకునేలా చేశాడు. కానీ వెంటనే తెరవలేదు.

"నువ్వు చాలా పనిమంతుడివి. ఇలా తలుపు తియ్యడం అందరికీ సాధ్యం కాదు. నిన్ను ఒలోముచ్‌కీ బాగా మెచ్చుకుంటుంది" అన్నాను.

"ఏమో, తాళాలు తీసే నా నేర్పుకి భయపడి, ఇంట్లోంచి పొమ్మన్నా పొమ్మనగలదు" అని నవ్వాడు షేరర్.

ముందు షేరర్, వెనుకనే నేను– ఇద్దరం నెమ్మదిగా స్నానాలగదిలో అడుగెట్టాం.

అక్కడ చూస్తే–

బాత్‌టబ్బులో అసహాయంగా వెల్లకిలా పడుంది ఒలోముచ్‌కీ. మహాకాయంతో– శ్రీకృష్ణలీలలు సినిమాలో, కృష్ణుడికి పాలిచ్చి పడిపోయిన పూతనలా ఉందామె. తేడా అల్లా ఈమె వంటిమీద బట్టల్లేవు.

తలుపు వెనుక భాగానికి తగిలించి పెద్ద బొచ్చుతువ్వాలొకటుంటే తీసి షేరర్‌కి అందించాను. కానీ అదామె వంటికి జేబురుమాలు కంటే తక్కువ. అందుకనేమో షేరర్ వెంటనే దాన్ని మళ్లీ తలుపుకి తగిలించి, 'ముందామెను టబ్బులోంచి లేపాలి. పద' అన్నట్లు చూశాడు.

ఇబ్బందిగానే ముందుకు కదిలి ఆమె భుజం పట్టుకుందుకు వంగి అప్రయత్నంగా ఆమె మొహంలోకి చూశాను. అప్పుడామె నావైపు చూసిన చూపులు జీవితంలో మర్చిపోలేను. దీనంగా ఉన్న ఆ చూపుల్లో అసహాయత ఉంది. ఆ అసహాయతలో అమ్మతనం కనిపించింది. ఆ తర్వాత నాకామె వళ్లు కనిపించలేదు. అమ్మతనమున్న ఆ చూపులే నా మెదడులో ప్రతిష్ఠించుకున్నాయి.

ఆమె మా ఆసరాతో ముందు బాత్‌టబ్బులో ఎలాగో లేచికూర్చుంది. మా ఆసరాతోనే టబ్బు బయటికొచ్చింది. ఒకసారి లేచి నిలబడ్డాక ఆమెకిక మా అవసరం లేదు. అది గ్రహించగానే నేనక్కణ్ణించి కదిలాను.

"డాంకే షోన్ హెర్ డాక్టర్" అని ఆమె అనడం వినిపించింది కానీ, వెనక్కి తిరక్కుండానే, "బిట్టే షోన్" అని వెళ్లిపోయాను.

ఆమెను గదిలో చేర్చాక షేరర్ వచ్చి నన్ను పిలిచి తనూ ఒలోముచ్‌కీ తరఫున థాంక్స్ చెప్పాడు. తన భుజం తడుముకుంటూ, "నీకూ భుజం నొప్పి చేసిందా?" అన్నాడు నవ్వుతూ.

అప్పుడు అతడిలో చిన్నపిల్లాడి మనస్తత్వాన్ని చూశాను. పర్వతంలాంటి శరీరంతో ఆమె టబ్బులో పడిపోయిన దృశ్యం అతడికి నవ్వు తెప్పిస్తోంది. ఎలాగో ఆపుకుంటున్నాడు.

"వయసు వల్లకాదు. ఇంత లావుండడంవల్లనే" అని లావుని రెండు చేతుల్నీ బాగా ఎడం చెయ్యడం ద్వారా అభినయించి, "తనకిలా అయింది. మనమున్నాం కాబట్టి సరిపోయింది కానీ, ఒక్కర్తీ ఉండగా అలా పడిపోతే ఏమయ్యేది?" అన్నాడతడు.

తలచుకుంటే నాకూ భయమేసింది. పాపం, ఏమయ్యేదో మరి– అనుకుంటూ, నేనీ ఉదంతాన్ని శ్రీమతితో పంచుకుని, "అంత లావు మనిషిని మేమిద్దరం టబ్బులోంచి ఎలా లేపామోనని ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంది" అన్నాను.

ఐతే కాక్కమ్మమ్మ టబ్బులో పడిపోయిన విషయం పిల్లలకు చెప్పకూడదని ఇద్దరం అనుకున్నాం. ఎందుకంటే శ్రీమతికి చెబుతున్నప్పుడే ఆమెకీ, నాకూ కూడా నవ్వాపుకోవడం కష్టమైంది. ఇక పిల్లల్ని నవ్వకుండా వాళ్లను ఆపలేం కదా!

విషాదం కలిసిన ఇలాంటి వినోదాల్ని ముచ్చట్లుగా గుర్తించలేని అసహాయత– ఇంట్లోనే కాదు, ఆఫీసులోనూ పలు సందర్భాల్లో కలిగింది నాకు. గతంలో కొన్నింటిని చెప్పుకున్నాం. ఇప్పుడు మరికొన్ని....

ఆఫీసులో ప్రహసనాలు

'మా వంటిరంగు తెలుపు గొప్పది. మేము పాటించే సంప్రదాయం గొప్పది. మా జీవనవిధానం గొప్పది. మిగతావారంతా అన్నింటా మాకంటే తక్కువే"

ఇలాంటి భావం తెల్లవారికి మనసులో ఏమూలో ఉంటుంది. కొందరు బయటపడతారు. కొందరు బయటపడరు.

ఇది వారితో సాన్నిహిత్యమున్న చాలామంది చెప్పేమాట!

ఇప్పుడు నాకూ కొంత స్వానుభవమున్నా, నేనందుకు తెల్లవారిని తప్పు పట్టను. ఎందుకంటే మన దేశంలో ప్రజాస్వామ్యం వచ్చినా కూడా కులాహంకారం రాజ్యమేలుతోంది.

తెల్లవారు వైజ్ఞానికంగా ప్రగతిని సాధించి, ఎదుటివారి బలహీనతలని సొమ్ము చేసుకుని సంపన్నులై– సమర్థులుగా పేరు గడించారు. వారి ఆధిక్యత వెనుక చెప్పుకోతగ్గ కృషి ఉంది. కానీ కులాధిక్యత జన్మసిద్ధం. అది ఏ కృషీ లేకుండా ఆయాచితంగా లభించినది. చట్టవిరుద్ధమైనా కొనసాగుతున్నది. మనం దాన్నించి బయటపడేదాకా– మనం చూపేది ఒక వేలైతే, మనని చూపేవి నాలుగు వేళ్లు.

కాబట్టి కనీసం బయటపడనంతకాలం వారి ఆధిక్యభావాన్ని సహించొచ్చునని స్వాభిప్రాయం.

పాశ్చాత్య దేశాల్లో ఎక్కువమంది కమ్యూనిజానికి బద్ధవ్యతిరేకులు. అప్పట్లో కమ్యూనిస్టు ప్రభుత్వమున్న అగ్రదేశం సోవియట్ రష్యా అంటే వారికి బొత్తిగా కిట్టేది కాదు. రష్యాతో చెలిమి చేస్తున్నదని అప్పటి ఇండియా ప్రధాని ఇందిరాగాంధీ వారికి బొత్తిగా నచ్చేది కాదు. నావద్ద ఆమెను తరచుగా విమర్శించేవారు. వారి విమర్శలో తర్కంకంటే, ద్వేషమే ఎక్కువ ఉండడం వల్ల నేను తర్కంతో వాళ్లని ఎదుర్కునేవాణ్ణి. వారి విమర్శలు వారికే తగిలేలా మళ్లించేవాణ్ణి. ఏమనాలో తెలియక, "నువ్వు ఇందిరా గాంధీ అభిమానివి" అని ముద్ర వేసేశారు.

నేనది తేలికగా తీసుకుని, "అలాగని ఓ రిపోర్ట్ రాసి, ఇండియాకు పంపండి. నా ప్రమోషన్‌కి ఉపయోగపడుతుంది" అన్నాను.

అది వాళ్లకి బాగా గుర్తుండిపోయినట్లుంది. బహుశా వాళ్లలో వాళ్లు చర్చించుకునేవారేమో కూడా!

మా లాబ్‌లో ఇంజనీరింగ్ వర్క్‌షాప్ హెడ్ బెర్గర్ తన పనేదో తనది అన్నట్లుంటాడు. ఎవరితోనూ ఎక్కువ మాట్లాడడు. నా కెటలిటిక్ రియాక్షనుకి రియాక్టరు డిజైన్ చేసి తయారు చేసింది అతడే! ఐనా మేమిద్దరం టెక్నికల్ పాయింట్లే తప్ప మరేం మాట్లాడుకునేవాళ్లం కాదు. మరో విశేషం అతడు షేరర్ లాగే సన్నగా, పీలగా ఉంటాడు. నాకంటే కొంచెం పొట్టి.

ఒకరోజు నేను ఆఫీసులో అడుగెట్టగానే అక్కడే ఉన్న బెర్గర్ చటుక్కున నన్ను పలకరించాడు. అంతకంటే ఆశ్చర్యం, "నువ్వు ఇండియా వెడితే, ఇందిరాగాంధీ ప్రమోషనివ్వదు. నీ చేతులకి సంకెళ్లు వేసి జైల్లో పెడుతుంది" అన్న అతడి మాట.

జరిగిందేమిటంటే ఇండియాలో ఎమర్జన్సీ విధించబడింది. అది ఇక్కడి వార్తల్లో ప్రచారధోరణిలో ప్రసారమై ఉంటుంది.

బెర్గర్ తర్వాత మరికొందరు మిత్రులు పలకరించి, ఇందిరాగాంధీ నియంతృత్వాన్ని నిరసించారు. "నువ్విక్కడే ఉండిపోయే ప్రయత్నం చెయ్యి. అక్కడ నీకు భవిష్యత్తు లేదు" అన్నారు కొందరు.

"బ్రిటిష్ వాళ్లు ఏలుతున్నప్పుడే, సామాన్యులు మామూలుగా జీవించారు. ఈ ఎమర్జన్సీలూ అవీ ఎక్కువగా ఇబ్బందిపెట్టేది రాజకీయ వాదుల్నీ, పారిశ్రామికవేత్తల్నీ, ఎదురు తిరిగే మనస్తత్వం ఉన్నవారినీ వగైరా వగైరా. నేను మామూలు మనిషిని. సగటు భారతీయుణ్ణి. నాకు వర్తమానమే ప్రధానం. భవిష్యత్తు వర్తమానంగా మారుతుంది కదా, అప్పుడు దాని గురించి ఆలోచిస్తాను" అని వాళ్లకి సమాధానం ఇవ్వడం కోసం తోచింది చెప్పేశాను.

"ఇంతకీ నువ్వు ఎమర్జన్సీని సమర్థిస్తావా? వ్యతిరేకిస్తావా?" నిలదీశాడు హైనర్ డెకర్ట్.

"నా మాటకి విలువుంటేనే దాని గురించి ఆలోచిస్తాను, మాట్లాడతాను" అన్నాను తప్పించుకుందుకు.

"భారతీయుల్లో నీలాంటివాళ్లు ఎక్కువ కాబట్టే, అక్కడ ఇందిరాగాంధీలాంటివాళ్ల ఆటలు సాగుతున్నాయి" అన్నాడు కిర్ష్‌నర్.

"మా దేశంలో నాలాంటివాళ్లు ఎక్కువైతే ఎలాగుండేదో చెప్పలేను కానీ, మేము జనాభాలో అత్యల్పశాతం. ప్రజాస్వామ్యమంటే అర్థంకాని నిరక్షరాస్యులు, ముందుచూపులేని అమాయకులు– వీరిదీ అక్కడ అత్యధిక మెజారిటీ. ఒక సీసా మద్యానికీ, ఒక పొట్లాం తిండికీ తమ ఓటుని అమ్ముకుంటారు వాళ్లు. వాళ్ల ఓట్లే దేశం భవిష్యత్తుని నిర్ణయిస్తాయి. మాలాంటివాళ్లు గళం విప్పితే కేవలం కంఠశోషే. ఐనా కొందరు శోషించి అలసిపోతుంటారు. మౌనం వహిస్తే అలసట ఉండదు. అంతే!" అన్నాను.

అది అసహాయతతో నిండిన ఆక్రోశం. ఐతే నా ఆక్రోశాన్ని అక్కడివాళ్లు వినోదిస్తున్నారని తెలుసు.

ఇంతకీ ఎమర్జన్సీ అంటే ఏమిటో అంతవరకూ తెలియదు నాకు. దాని గురించిన వార్తలు ఇండియన్ న్యూస్ సర్వీసునుంచి ఒకలాగా, బీబీసీ నుంచి మరొకలాగా వినిపిస్తున్నాయి. నిజం ఆ రెంటికీ మధ్యన ఉంటుందని తెలుసు. కానీ ఎంత మధ్యనో తెలియదు.

ఆ సమయంలో ఇండియాలో లేకపోవడం ఒకవిధంగా నా అదృష్టం. ఇక్కడ నా రీసెర్చి నిరాటంకంగా కొనసాగుతోంది. ఆఫీసులో కూడా ఎమర్జన్సీ గురించి ఆ తర్వాత చర్చలు జరుగలేదు.

నేను తయారు చేసిన కెటలిస్టులు ఐరన్–క్రోమియం రసాయనాలు. అవి వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షన్‌కి ఎలా పనిచేస్తాయో చూడ్డానికి ఇక్కడికొచ్చాను. ఆ రియాక్షన్లో కార్బన్ మోనాక్సైడ్, నీటి ఆవిరి కలిస్తే– కార్బన్ డయాక్సైడ్, హైడ్రోజన్ గ్యాస్ వస్తాయి. ఎన్నో ముఖ్యమైన పరిశ్రమలకి ఆలంబనగా ఉండే ఫిషర్–ట్రోప్ష్ ప్రోసెస్‌కి– వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షను కూడా ముఖ్యమైనది.

ఆయా రియాక్షన్లకి సంబంధించిన కెటలిస్టుల పరిశోధనలో ప్రొఫెసర్ క్యోల్బెల్ అగ్రగణ్యుడు. ఆయన నేనుండే సంస్థలోనే ప్రొఫెసరు. నా పరిశోధనకోసం మొదట ఉత్తరం వ్రాసినది ఆయనకే. తను రిటైరైపోయాననీ, తన శిష్యుడు రాలెక్ వద్ద చేరమనీ, ఆయన చెప్పేకనే, నేను ప్రొఫెసర్ మిలోస్ రాలెక్‌కి ఉత్తరం వ్రాయడమూ, ఆయన అనుమతించడమూ జరిగింది.

వెళ్లింది డాడ్ స్కాలర్‌షిప్ మీద. ఆ స్కాలర్‌షిప్ మీద వెళ్లినవారు ఉండే 16 నెలల్లోనూ, నాలుగు నెలలు– జర్మన్ భాష నేర్చుకుందుకే పోతుంది.

ఏడాదిలో ఎంత రీసెర్చి చేస్తారులే అని అక్కడి ప్రొఫెసర్లు డాడ్ స్కాలర్సుని సీరియస్‌గా తీసుకోరు. ఆధునిక పరికరాలతో పరిచయం, రీసెర్చికి సంబంధించిన సమాలోచనలు చాలనుకుంటారు. అదికాక సైట్ సీయింగ్. ఏడాదిట్టే గడిచిపోతుందని వారి భావన.

నేను బెర్లిన్ వెళ్లేక సైట్ సీయింగుకి వెళ్లింది లేదు. లాబ్‌కెళ్లడం మానింది లేదు.

ఎందుకంటే ఇక్కడున్న సైంటిఫిక్ అడ్మినిస్ట్రేషనుతో, ఆధునిక సదుపాయాలతో– ఇండియాలో ఏళ్లు పట్టే పని, ఇక్కడ నెలల్లో ఐపోతుందని వెళ్లిన మరుక్షణమే తెలియడంవల్ల– మొదట్నించీ సీరియస్‌గానే ఉన్నాను.

నా శ్రద్ధాసక్తుల్ని రాలెక్ తొందరగానే పట్టేశాడు. ఆయనొకరోజు నన్ను పిలిచి, "నీ ప్రాజెక్ట్ నాకు నచ్చింది. ప్రోగ్రెస్ కూడా బాగుంది. ఏడాదే ఉంటే– చేసింది మధ్యంతరంగా వదిలి వెళ్లాల్సి ఉంటుంది. అదనంగా ఇంకో ఏడాది ఉండగలవా?" అనడిగాడు.

ఆశ్చర్యపోయాను. అంతకుముందు వెళ్లిన డాడ్ స్కాలర్సు కొందరు చెప్పిందాన్ని బట్టి, కారణాలేమైనా చాలామంది మనవాళ్లు అక్కడ మరికొన్నాళ్లు ఉండాలని ప్రయత్నిస్తారు. అందుకు ప్రొఫెసర్ని ఒప్పించడం చాలా కష్టంట. బ్రతిమాలో బామాలో ఒప్పిస్తే చాలామందికి మూడు నెలలూ, కొందరికి ఆరు నెలలూ, అతికొద్దిమందికి ఏడాదీ ఎక్స్‌టెన్షన్ రావచ్చుట.

అలాంటిది– ప్రొఫెసరే నన్ను స్టే ఎక్స్‌టెండ్ చెయ్యమనడం, అదీ ఏకంగా ఏడాదికి– చెప్పొద్దూ నాకు ఆశ్చర్యంతోపాటు గర్వాన్నీ కలిగించింది.

ఐతే నా ఇబ్బందులు నాకున్నాయి. అనుకున్న ప్రకారం అక్టోబర్లో ఇండియాకి వెడితే అప్పటికి పాపకి 5, బాబుకి మూడున్నరేళ్లు ఉంటాయి. 1976 జనవరికి ఇద్దర్నీ స్కూళ్లలో వెయ్యొచ్చు. అప్పుడు భువనేశ్వర్లో ఇంగ్లీషు మీడియం స్కూల్సు– జనవరి–డిసెంబర్ సిస్టం అనుసరించేవి.

నేను మరో ఏడాది ఇక్కడుంటే మా పిల్లలు చదువులో ఆమేరకి వెనుకబడిపోతారు.

తనే అడిగినప్పుడు కాదనడం బాగుండదు కదా, అందుకని ఓ మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ తీసుకుంటే, జనవరికి వెళ్లొచ్చు కదా అనుకుని, ఆ మాట ఆయనకి చెప్పాను.

రాలెక్‌కి నచ్చలేదు. మూణ్ణెల్ల ఎక్స్‌టెన్షనూ ఓ ఎక్స్‌టెన్షనేనా అన్నాడు– ఏదో సినిమాలో సూర్యకాంతం, 'మేనత్త కొడుకూ ఓ మొగుడేనా?' అన్నంత నిరసనగా.

చివరికాయన నన్ను ఆర్నెల్లైనా ఉండమన్నాడు.

పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించడంవల్ల కానీ, జర్మనీలో మరికొన్నాళ్లు కొనసాగడానికి చేదా ఏమన్నానా?

ఏమైతే అయిందిలే అని సరేనన్నాను.

రాలెక్కూ, నేనూ అనుకుంటే సరిపోదు. మా ఇద్దరికీ ఓ క్లారిటీ వచ్చేక ఈ ఎక్స్‌టెన్షనుకో తతంగం ఉంది. ముందు డాడ్ ఆఫీసు అనుమతించాలి. వాళ్లు సాధారణంగా అందరికీ అనుమతి ఇవ్వరు.

ఆ మాటే చెబితే, "నీవైపునుంచి నువ్వు ఉత్తరం రాయి. నేను వాళ్లతో మట్లాడతాను" అన్నాడు రాలెక్.

నిజానికాయన మాట్లాడనవసరంలేదు. ఉత్తరంతో పాటు నేను అంతవరకూ అక్కడ రీసెర్చిలో నా ప్రోగ్రెస్ తెలియబరుస్తూ, ఎక్స్‌టెన్షన్ ఎందుకు అవసరమో సమర్థించుకోవాలి. ఆ రిపోర్టుమీద రాలెక్ సంతకం ఉండాలి.

ఇంగ్లీషులో ఐతే అలాంటి ప్రోగ్రెస్ రిపోర్టులు నాకు కరతలామలకం. కానీ అది జర్మన్ భాషలోనే ఉండాలని రాలెక్ పట్టుబట్టాడు.

నాకు జర్మన్ కొంత వచ్చు. అది జర్మన్ మిత్రులకు ఉత్తరాలు వ్రాయడానికి పనికొస్తుంది కానీ, ఇలాంటి టెక్నికల్ రిపోర్ట్సుకి సరిపోదు.

అదే రాలెక్‌కి చెప్పాను. "ఫ్రెండ్సు సాయం తీసుకో. ఆపైన నేనున్నాను" అన్నాడాయన.

ఇలాంటి విషయాల్లో నాకు సాయపడేది ఫైనర్ డెకర్టే మరి.

వెళ్లి అడిగాను. అతడు వెంటనే, "ఇదివరలో నీకు నేను నీ భార్య రెసిడెన్స్ పర్మిట్ కోసం జర్మంలో ఉత్తరం రాయడానికి సాయం చేశాను. కానీ ఇది టెక్నికల్ రిపోర్టు. అదీ రాలెక్ అప్రూవల్ కోసం. నీకు రాలెక్ సంగతి తెలియదు. ఆయన్ని మెప్పించేలా టెక్నికల్ రిపోర్ట్స్ రాయడం చాలా కష్టం. తీరా రాసేక, అదాయనకి నచ్చకపోతే నామీద ఇంప్రెషన్ పోతుంది. నా గురించైతే ఎలాగూ తప్పదు కానీ, నీ గురించి నామీద ఇంప్రెషన్ ఎందుకు పోగొట్టుకోవాలి?" అన్నాడు.

డెకర్ట్‌కి హిపోక్రసీ లేదు. ఉన్నదున్నట్లు చెప్పాడు. కాదనడానికేం లేదు.

మరిప్పుడు నేనేం చెయ్యాలి?

***

ఎక్స్‌టెన్షన్ ప్రహసనం

ఏమైతే అయిందని మళ్లీ రాలెక్‌ని కలుసుకున్నాను. "టెక్నికల్ రిపోర్ట్స్ వ్రాసేటంత జర్మన్ భాషాపరిజ్ఞానం నాకు లేదని డాడ్ ఆఫీసులో తెలుసు. రిపోర్టు ఇంగ్లీషులోనే వ్రాసి పంపుతాను. ఏమౌతుందో చూద్దాం" అన్నాను.

రాలెక్‌కి నా ప్రతిపాదన నచ్చలేదు. "నేను నియమాల్ని ఖచ్చితంగా అనుసరిస్తాను. నానుంచి వెళ్లే నీ రిపోర్టు జర్మన్ భాషలోనే ఉండాలి. కాబట్టి గట్టిగా ప్రయత్నించు" అని పట్టుబట్టాడు.

ఆయనతో అప్పటికేమనలేదు కానీ ఎక్స్‌టన్‌షన్ వదులుకోవాలనే అనుకున్నాను. ఇంటికెళ్లేక శ్రీమతితో అదే మాట చెప్పాను.

"మీరు తలచుకుంటే, జర్మన్లో ఏమిటి– రష్యన్లో రాయమన్నా ఇప్పటికిప్పుడు నేర్చుకుని రాసెయ్యగలరు" అనేసిందామె తేలికగా.

"నీకలా అనిపిస్తోందేమాకానీ– నాకుమాత్రం ఇది కప్ప–ఎద్దు కథలాగుంది" అన్నాను.

కప్ప పిల్లలు మొదటిసారి ఎద్దుని చూసి, ఎంత పెద్దదో అని ఆశ్చర్యపడి ఆ విషయం తల్లి కప్పకి చెప్పాయి. తను ఎద్దు కంటే గొప్ప అని పిల్లలముందు నిరూపించడానికి కప్ప పొట్టని ఉబ్బించి, ఆ ఎద్దు ఇంతుందా అనడిగింది. వాళ్లు ఇంకా పెద్దదంటే– పొట్ట ఇంకాస్త ఉబ్బించింది. ఎంత ఉబ్బిస్తే కప్ప ఎద్దౌతుంది? చివరకు దాని పొట్ట పగిలి చచ్చింది.

స్వశక్తిని సరిగ్గా అంచనా వెయ్యడం విషయంలో– ఈ పంచతంత్ర కథ చిన్నప్పట్నించీ నాకు ఆదర్శం.

శ్రీమతి తల అడ్డంగా ఊపి, "సామ్యం సరిగ్గా లేదు. పట్టించుకోక కానీ ఈ పాటికే మీరు ఇక్కడి భాషలో నిష్ణాతులయుండేవారు. ఇప్పుడు పట్టించుకోండి. నాకిక్కడ ఇంకా మరికొన్నాళ్లు ఉండాలనుంది" అంది.

ఇది శ్రీమతి స్టైల్లో అర్థాంతరన్యాసాలంకారం. ఏదో ఒకటి చేసి ఎక్స్‌టెన్షన్ సాధించాలని ఆమె ఆదేశం.

"రావుగార్ని సాయమడగొచ్చు. కానీ ఆయనకి అంత టైముంటుందా?" అన్నాను. శ్రీమతి తల్చుకోవాలే కానీ, ఆయన్ని టైం ఉండేలా చెయ్యగల చాకచక్యముందని ఓ బాణం వేశాను.

"అన్నింటికీ రావుగారేనా? ఆయన్నిబ్బందిపెట్టొద్దు. మీ ఫ్రెండ్ ఓంప్రకాష్ జర్మన్లో థీసిస్ రాస్తున్నాడుగా– అతగాడికైతే ఇది చాలా సులభం" అంది శ్రీమతి.

ఓంప్రకాష్ సబ్జక్ట్ మెటలర్జీ. పీహెచ్‌డి థీసిస్ స్టేజికి వచ్చింది. అతడు జర్మన్ చక్కగా మాట్లాడతాడు. థీసిస్ వ్రాయడంకోసం ఆ భాషమీద పట్టు సాధించడానికి కృషి చేస్తున్నాడు.

అంతవరకూ నాకతడి పేరు తట్టనందుకు కొంత ఆశ్చర్యం, కొంత చిరాకు. వాటిని పక్కనెట్టి ముందు శ్రీమతిని అభినందించి మర్నాడు ఆఫీసునుంచి ఓంప్రకాష్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాను.

అతడు వెంటనే, "నువ్వు ముందు ఇంగ్లీషులో రిపోర్టు వ్రాయి. మనమిద్దరం కలిసి కూర్చుని డిక్షనరీ పక్కన పెట్టుకుని దాన్ని తర్జుమా చేద్దాం. తుదిమెరుగులకి నా జర్మన్ కొలీగ్సు సాయం తీసుకుంటాను. అప్పుడు మీ ప్రొఫెసరుకి చూపించి ఆయన బాగుందంటే– ఆ క్రెడిట్ నాది. లేదూ ఆ పాపం నీది" అన్నాడు.

ఇండియన్ సైంటిస్టుని. ఇలాంటివి రాయడానికి కష్టమేముంటుంది? జర్మనీలో ఏం చెయ్యాలనుకుంటున్నానో ప్రతిపాదిస్తూ డిటెయిల్డ్ ప్రోగ్రాం ఇచ్చేకనే నాకీ స్కాలర్‌షిప్ వచ్చింది. ఆ ప్రోగ్రాంలో ప్రిపరేషన్ పార్ట్ పూర్తయింది. ఇప్పుడు టెస్టింగుకి ప్రిపేరవుతున్నాం. అప్పుడు చేస్తానని వ్రాశను, ఇప్పుడు చేశానని రాయాలి. మిగిలింది పూర్తి చెయ్యడం ఎంత అవసరమో, అందుకు ఎక్స్‌టెన్షన్ ఎందుకు తప్పనిసరో వివరించాలి. అదీ ఇంగ్లీషులో.

ఒక్క పూటలో ఇంగ్లీషు స్క్రిప్టు తయారైంది. మధ్యాహ్నానికి ఓంప్రకాష్ వచ్చి నా రిపోర్ట్ చూసి, "నువ్విక్కడ ఇంత పని చేశావా? నా థీసిస్‌కే ఇంత వర్క్ చెయ్యలేదు...." అన్నాడు మెప్పుకోలుగా.

"జర్మన్ నీళ్లు బాగా వంటబట్టాయిగా– అతిశయోక్తులకి లోటుండదుకానీ– ముందు అనువాదం మొదలెడదాం" అన్నాను.

"అతిశయోక్తి వద్దన్నావు కాబట్టి చెబుతున్నాను. నీ రిపోర్టులో ఓపెనింగ్ సెంటెన్స్ మార్చాలి" అన్నాడు.

జోక్ చేస్తున్నాడనుకుని అతడి మొహంలోకి చూశాను.

చాలా గంభీరంగా ఉంది అతడి మొహం. ఒకసారి పనిలోకి దిగితే అతడి మొహం అలాగే ఉంటుంది.

గతుక్కుమని, మొదటి వాక్యం చదువుకున్నాను.

నేను వాడే హొమోజీనియస్ ప్రెసిపిటేషన్ టెక్నిక్– సాధారణంగా వాడేది ఎనాలిసిస్‌కీ, సెపరేషన్సుకీ. ఇది వాడ్డంవల్ల గంటలు పట్టే పని నిముషాల్లో ఐపోతుంది. నేనీ టెక్నిక్ ప్రస్తావన తేగానే– ఎనాలిసిస్సుకో, సెపరేషన్సుకో అనుకునే ప్రమాదముంటుంది. అందుకని ఈ టెక్నిక్ అందుకు కాదని మొదటి వాక్యం వ్రాశాను.

"మనమేదైనా ప్రపోజ్ చేస్తున్నప్పుడు– నెగెటివ్ స్టేట్మెంట్‌తో మొదలెట్టకూడదు. అలాంటి పాయింట్లు మధ్యలో చెప్పాలి. ఆరంభంలో పాజిటివ్ స్టేట్మెంట్సే ఉండాలి" అన్నాడు ఓంప్రకాష్.

ఇది అతగాడు ఎక్కడైనా విన్నాడేమో తెలియదు. కానీ అంతవరకూ నేను అనుసరించని గొప్ప పాఠం.

ఆ రోజుల్లో ద్విగుణీకృతావధానం చేసిన అరుదైన కవుల్లో ఒకరైన మా తాతగారికి ఉచిత విద్యాదానం హాబీ. తెలుగులో విద్వాన్ పరీక్షకు ప్రిపేరయ్యేవారు తరచుగా మా తాతగారి వద్దకు వస్తుండేవారు. ఆయన చెప్పే పాఠాలు నేటి ప్రవచనాలనిమించి ఆసక్తికరంగా ఉండేవి. అలా నేను పురాణేతిహాసాలు, పలు కావ్యాలలోని సాహితీవిన్యాసాలు, నిగూఢార్థాలు ఎన్నో విన్నాను. ఒకసారి ఆయన రామాయణంలో– హనుమంతుడు లంకకు వెళ్లి సీతను చూసొచ్చి రాముణ్ణి కలిసిన సందర్భాన్ని ప్రస్తావించారు.

అప్పుడు హనుమంతుడు, "నేను లెక్కలేనన్ని ప్రదేశాలు తిరిగాను. ఎక్కడా సీత కనబడలేదు. తర్వాత లంకకు వెళ్లి ఊరంతా గాలించాను. కనబడలేదు. రాజాంతఃపురంలో కూడా చూశాను. అక్కడా కనబడలేదు" అని మొదలెట్టొచ్చు. కానీ అలా చెయ్యలేదు. 'చూసితిని, సీతను' అంటూ మొదలెట్టాడు.

ఆ అంతరార్థాన్ని ఆయన అరగంటసేపు వివరించి, "మీ నాన్న నీ పెళ్లి సంబంధం మాట్లాడ్డానికి వెళ్లేడనుకో. కాబోయే వియ్యంకుడికీ, ఆయనకీ ఒకప్పుడు చాలా గొడవలుండేవనుకో. వెడుతూనే– 'నేనిప్పుడు పాత గొడవలు తవ్వడానికి రాలేదు. కొత్త గొడవలు పెట్టుకుందుకూ రాలేదు. నిన్ను క్షమార్పణ అడగడానికో, నీచేత క్షమార్పణ చెప్పించుకుందుకో రాలేదు' అంటూ చేటభారతం మొదలెట్టకూడదు. 'మీ అమ్మాయి నచ్చింది. పెళ్లి సంబంధం కలుపుకుందుకొచ్చాను' అనడంలో ఒక స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంది' అన్నారు.

అది నాకు బాగా గుర్తుంది కానీ, ఆ సూచనని నా ప్రపోజల్లో పాటించలేదన్న విషయాన్ని ఓంప్రకాష్ చెప్పేదాకా గుర్తించలేదు. గుర్తించేక జీవితాంతం మరువలేదు.

ఓంప్రకాష్ తనతో మంచి టెక్నికల్ డిక్షనరీ తెచ్చాడు. పదాల ఎంపికలో సాయం చేస్తూ మొత్తం అనువాదాన్ని నాచేతే చేయించాడు.

మొదటి పేరా అనువదించడానికి గంటకి పైగా పట్టింది. తర్వాతనుంచి వేగం పెరిగింది. ఆఫీసు టైమైపోయినా మా పని కొనసాగింది.

మధ్యాహ్నం ఇంటికి లంచికి వెళ్లినప్పుడు కూడా, ఆలస్యంగా వస్తానని శ్రీమతికి సూచనప్రాయంగానైనా చెప్పలేదు. కారణం తెలియక కంగారు పడుతుందేమోనని మనసులో బెంగ. నాకైతే మిగతాపని రేపు చూడొచ్చులే అని ఉంది. కానీ ఆ పని తనదే అన్నంత పట్టుదలగా ఉన్నాడు ఓంప్రకాష్.

అయ్యేసరికి రాత్రి ఎనిమిదయింది. ఓంప్రకాష్‌కి థాంక్స్ చెప్పాను.

"నీ థాంక్సు నా మోరల్ సపోర్టుకే! అనువాదమంతా నువ్వే చేశావు!" అన్నాడతడు.

మనసులో నిజమేననిపించినా, "ఔనా! మరి ఓపెనింగ్ సెంటెన్సుతో మొదలెట్టి, ఎన్ని మార్పులు చేశావ్ నువ్వు? ఈ రోజు నీనుంచి జర్మన్లోకి అనువాదమే కాదు, ఇంగ్లీషులో రిపోర్టుకీ ఎన్నో చిట్కాలు తెలిశాయి" అన్నాను.

"ఐతే మా పక్కింటి పిన్నిగారి టెక్నిక్ బాగా పనికొచ్చిందన్నమాట!" అన్నాడు ఓంప్రకాష్.

ఓసారి ఓంప్రకాష్ తల్లికి జ్వరమొచ్చింది. పిన్ని ఊరికెళ్లింది. ఇంట్లో నలుగురు చిన్నపిల్లలున్నారు. వంటింటి పని పిల్లల వల్లకాదు. తండ్రికీ, చిన్నాన్నకూ అలవాటు లేదు కానీ తప్పనిసరై వంట చెయ్యడానికి సిద్ధపడ్డారు. అప్పుడు, 'నేనుండగా పెద్దమగాళ్లని చెయ్యి కాల్చుకోనిస్తానా' అంటూ వచ్చింది పక్కింటి పిన్నిగారు. దాంతో తండ్రీ, చిన్నాన్నా హమ్మయ్య అనుకున్నారు.

పిన్నిగారు పిల్లల్ని సాయానికి పిలిచింది. క్షణాలమీద అందర్నీ ఎంగేజ్ చేసేసింది. గిన్నెలు తొలిచేవారొకరు, కూరలు తరిగేవారొకరు, స్టవ్ మీద వేయించేవారొకరు. ఓ పని అవగానే మరో పని. చేతికి మట్టంటకుండా, ఏ గిన్నేనీ వేలేసైనా ముట్టుకోకుండా– కేవలం అజమాయిషీతో పిల్లలచేత వంట పూర్తి చేయించింది పిన్నిగారు.

"అమ్మ, పిన్ని వంట చేస్తే– మాకేం పనుండేది కాదు. పిన్నిగారు చేస్తే– మాకే పని! ఆ పూట పిన్నిగారు చేసిందల్లా– వంట అద్భుతమని నాన్నా, బాబాయ్ మెచ్చుకున్నప్పుడు– సిగ్గుతో మెలికలు తిరగడం" అని, "అప్పట్నించీ– ఎదుటివాళ్లచేత పని చేయించి క్రెడిట్ మనం కొట్టెయ్యడాన్ని, పిన్నిగారి వంట అంటాం మా ఇంట్లో. నేనిప్పుడు నీ అనువాదంలోనూ అదే టెక్నిక్ వాడాను" అన్నాడు ఓంప్రకాష్.

అప్పుడు నేనతడికి 'తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' అన్న శ్రీశ్రీ కవితను అనువదించి చెప్పి, "క్రెడిటెప్పుడూ ఏంచెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలిసినవాళ్లకే చెందుతుంది. చెప్పింది చెప్పినట్లు చెయ్యడం మాత్రమే తెలిసినవాళ్లకి కాదు" అంటూ అతడి కంట్రిబ్యూషన్ విలువ ఏమాత్రం తగ్గకుండా జాగ్రత్తపడ్డాను.

మర్నాడా అనువాదాన్ని డెకర్ట్‌కి చూపిస్తే– బాగుందన్నాడు. రాలెక్‌కి చూపిస్తే– బాగోగులు చెప్పలేదు కానీ, సరిచెయ్యడానికి ఉత్సాహం చూపించాడు. ఇద్దరం కలిసి ఓ గంట కూర్చుని స్క్రిప్టు ఫైనలైజ్ చేశాం. తర్వాత దాన్ని రాలెక్ టైపు చెయ్యమన్నాడు.

రాలెక్‌తో సహా అక్కడివాళ్లందరికీ ఎంతోకొంత టైపింగ్ వచ్చు. అది ప్రొఫెషన్లో ఒక భాగంగా భావిస్తారు వాళ్లు. అంతకుముందోసారి నాకు టైపింగ్ రాదని డెకర్టుతో అంటే– 'అదో బ్రహ్మవిద్యా? టైపింగు రావడం, రాకపోవడం ఉండదు. చెయ్యడమే! అలవాటైతే స్పీడుగా చేస్తారు. లేకపోతే కాస్త స్లో అంతే!' అన్నాడతడు.

జీవితంలో నాకదో గొప్ప పాఠం.

టైపింగ్ నా ప్రొఫెషన్లోనూ ఒక భాగమని ఇండియాలో నాకెప్పుడూ తోచలేదు. ప్రతి డిపార్టుమెంటుకీ టైపింగుకని ప్రత్యేకంగా ఓ టైపిస్టు ఉన్నాడు. రెండు పంక్తుల ఉత్తరమైనా సరే, టైపింగుకి అతడే ఆధారం. చేతినిండా పనితో రోజంతా బిజీగా ఉంటాడతడు. టైపింగుకి వచ్చిన కాగితాల్ని ఫైల్లో ఓ వరసలో పెట్టి, లాగ్‌బుక్‌లో నోట్ చేసుకునేవాడు. మన టర్న్ రావడానికి ఒకోసారి మూడు నాలుగు రోజులు ఎదురు చూడాలి.

అలాగని టైపిస్ట్ పదవి పెద్ద హోదా ఏం కాదు. టైపింగ్ రానివాళ్లం రాదన్న విషయాన్ని గొప్పగా చెప్పుకునేవాళ్లం. వచ్చిన ఒకరో ఇద్దరో, అది తామెందుకు నేర్చుకోవాల్సివచ్చిందో సంజాయిషీ ఇచ్చేవారు. ఇంతకీ వాళ్లు కూడా టైపింగులో ఎక్స్‌పర్ట్సు కాదు. వాళ్లు టైపు చేస్తే కొన్ని అక్షరాలు స్పష్టంగానూ, కొన్ని అస్పష్టంగానూ ఉండేవి. అందుకు కారణం వాళ్లు అన్ని అక్షరాలకీ ఒకే ఫోర్సుతో స్ట్రోక్సు ఇవ్వడం లేదుట. మా టైపిస్ట్ టైప్ చేసిన కాగితాలు చూస్తే అచ్చొత్తిన కాగితం చూసినట్లే ఉంటుంది.

తను టైపిస్టు కావాల్సొచ్చిందని వాపోతుండే మా టైపిస్ట్ కూడా, "టైపింగ్ ఈజే యాన్ ఆర్ట్" అని గర్వంగా అంటాడు.

ఐనా నేను మాత్రం ఆ ఆర్ట్ నాకు రాలేదని గర్వపడేవాణ్ణి.

ఇక్కడ డెకర్ట్ మాటలు విన్నాక, నా దృక్పథానికి కాస్త సిగ్గుపడ్డాను.

డిపార్టుమెంట్లో ఓ ఎలక్ట్రికల్ టైపురైటరుంది. దానిమీద అప్పుడప్పుడు ప్రాక్టీస్ చేస్తే స్పీడ్ రాలేదు కానీ చిన్న చిన్న పన్లు చెయ్యగలనన్న నమ్మకం కుదిరింది. ఇంకో విశేషమేమంటే, ఇక్కడ స్ట్రోక్స్ కంట్రోల్ చేసుకోనక్కర్లేదు. ఎలా కొట్టినాసరే పడిన అక్షరం స్పష్టత ఒక్కలాగే ఉంటుంది. అంటే ఆర్టులో ఓ భాగం తగ్గింది.

రాలెక్ చెప్పగానే ఎలక్ట్రికల్ టైపురైటర్ మీద రిపోర్ట్ టైప్ చేశాను. అక్షరం అక్షరం చూసి కొట్టడం ఒకటి, ఏకాగ్రత ఒకటి– నా రిపోర్టులో ఎక్కడా అచ్చు తప్పు లేదు.

అలా బాన్ లో ఉండే డాడ్ ఆఫీసుకి– నానుంచి ఆర్నెల్ల ఎక్స్‌టెన్షన్ రిక్వెస్ట్ లెటర్ వెళ్లింది.

నా ఉత్తరం ఇలా అందిందో లేదో, అలా వాళ్లు అనుమతినిస్తూ వెంటనే బదులిచ్చారు.

ఇండియాలో నిర్ణయాలు అంత సులభంగా తేలవు. అంతా 'కలవారి కోడలు కలికి కామాక్షి' టైపు.

అన్నలు చెల్లెల్ని పుట్టింటికి తీసుకెళ్లాలంటే ముందు అత్తనడగాలి. ఆమె 'నేనెరుగ నేనెరుగ మీ మామనడుగు' అంటే– అక్కణ్ణించి వరుసగా మామగార్నీ, బావగార్నీ, తోడికోడల్నీ, చివరగా భర్తనీ అడగాలి. ఇంతకీ భర్త నిర్ణయం తెలిసిందే– కానీ అందుకు ముందు– మిగతావాళ్లకి అభ్యంతరం లేదన్న విషయం తేలాలి.

ఇది మన కుటుంబ సంస్కృతి ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది.

ఐతే ఇదే కుటుంబ సంస్కృతి అడ్మినిస్ట్రేషన్‌కి కూడా విస్తరిస్తే– నిర్ణయాల జాప్యానికి దారి తీస్తుంది. వలస నేతలు బానిస పౌరుల్ని శాసించడానికి విధించిన నియమాల్ని– స్వతంత్రులమై దశాబ్దాలు గడుస్తున్నా అనుసరించే విచిత్ర సంస్కృతి భరతావనిది. పాలనకు కుటుంబ సంస్కృతిని అనుసరించడానికి పౌరులు అభ్యంతరం చెప్పడం లేదనేమో, పాలకులనిచ్చే పార్టీలకూ పాకుతోందది.

నాకు ఎక్స్‌టెన్షన్ అవసరమని ప్రొఫెసర్ రాలెక్ నిర్ణయించాడు. ఉత్తరం డాడ్ ఆఫీసుకి వెళ్లింది. వాళ్లు వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని నేరుగా నాకు తెలియబర్చారు.

రాలెక్‌కి అది చాలా మామూలు విషయం కావచ్చు కానీ, నేను బాగా ఆశ్చర్యపడ్డాను. తర్వాత అది ఆనందంగా మారితే, ఇంటికెళ్లి శ్రీమతితో పంచుకున్నాను.

ఆమె నన్ను కాసేపు ఆనందపడనిచ్చి, "ఈ విషయం భువనేశ్వర్లో మీ ఆఫీసుకి– వాళ్లు చెబుతారా? మీరు చెప్పాలా?" అంది.

అది ఉత్త కుతూహలం కాదు. 'అంతం కాదిది ఆరంభమే సుమా' అన్న స్పృహ నాకు కలిగించడానికి చేసిన ప్రయత్నం.

భువనేశ్వర్లో మా లేబరేటరీలో రెండు అహాల మధ్య యుద్ధం జరుగుతోంది.

ఒక అహం లేబరేటరీ డైరెక్టర్ ప్రఫుల్ల. రెండవది ఆయన తర్వాతి స్థానంలో ఉన్న భరత్.

ఈ అహోలకున్న నేపథ్యం రావణకాష్టం లాంటిది. దాని గురించి వీలైనంత క్లుప్తంగా చెబుతాను.

భరత్ సమర్థుడు, అనుభవజ్ఞుడైన సైంటిస్టు. విదేశాల్లో కొన్నాళ్లుండి, స్వదేశంలో ఓ విదేశీ పారిశ్రామికసంస్థలో రాణిస్తున్న సమయంలో అప్పటి మా లేబరేటరీ డైరెక్టర్ సీతారాం దృష్టికొచ్చాడు. కొత్తగా మొదలైన ఆ సంస్థకు భరత్ సేవలు ఆవశ్యకమని భావించి, ఆయన్ని ఆకర్షించడానికి తగిన వాగ్దానాలు చేసి, భువనేశ్వర్ రప్పించి, తన తర్వాత తనంతటివాడుగా నియమించాడు.

లేబరేటరీ ఒరిస్సాలో ఉంది. సీతారాం ఒరిస్సాకు చెందినా– తెలుగువాడు. స్థానికతకంటే ప్రతిభకు పట్టం కట్టే రాజకీయనేత బిజూ పట్నాయక్ కారణంగా ఆయనకా ఉన్నత పదవి దక్కింది. తర్వాత అక్కడ బిజూ ప్రాభవం తగ్గడంతో స్థానికతకు ప్రాబల్యం పెరిగి సీతారాంకి పదవీ గండం ఏర్పడింది. ఆ సమస్యతో సతమతమౌతున్న ఆయనకు భరత్‌కిచ్చిన వాగ్దానాల్ని పట్టించుకునేందుకు సమయం లేకపోయింది. ఫలితంగా భరత్ ఆయనకు ఎదురుతిరిగాడు. మానసికమైన ఒత్తిడి తట్టుకోలేక సీతారాం, రాజీనామా చేసి వెళ్లిపోతే– భరత్ లేబరేటరీకి తాత్కాలికంగా అధిపతి అయ్యాడు. వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుని ఆయన తన సత్తాని నిరూపించుకుందుకు రెండున్నర ఏళ్లపాటు అవిరళ కృషి చేశాడు. డైరెక్టర్ పోస్ట్ ఆయన్నే వరిస్తుందని అంతా అనుకుంటున్న సమయంలో– ఉత్తరాది యూనివర్సిటీలో ప్రొఫెసరుగా ఉంటున్న ప్రఫుల్ల డైరెక్టరుగా నియమితుడయ్యాడు.

ఈ విషయమై భరత్ మనోభావాలు పలు విధాలుగా దెబ్బతిన్నాయి.

లేబరేటరీ పారిశ్రామిక పరిశోధనలకి ఉద్దేశించబడింది. దాన్ని నడిపించడానికి– పారిశ్రామికరంగంలో అనుభవమున్న తనని కాదని, యూనివర్సిటీ ప్రొఫెసర్ని నియమించడమేమిటని భరత్ ఆవేదన.

ప్రఫుల్ల ఒరిస్సాకు చెందినవాడు. ఆయన ఎంపికకు అదే కారణమని భరత్ నమ్మకం.

ప్రఫుల్ల భరత్‌కి సమవయస్కుడు. కాబట్టి తనకా లేబరేటరీలో ఎదుగుదలకు అవకాశం లేదని భరత్‌లో నైరాశ్యం.

అప్పట్లో సీయస్ఐఆర్‌లో డైరెక్టరు పదవి ఇంద్రపదవి లాంటిది. బాధ్యతలకంటే అధికారం పెక్కు. అస్మదీయులకు అలవోకగా వరాలు, తస్మదీయులకు అంతే అలవోకగా శాపాలు– ఆ పదవికి సంక్రమించిన హక్కు. ఆపైన వందిమాగధుల స్తోత్రపాఠాలు ఇచ్చే కిక్కు.

ఇవన్నీ భరత్ రెండున్నరేళ్లు అనుభవించి ఉన్నాడు. ఇప్పుడవి ప్రఫుల్ల అనుభవిస్తున్నాడు. ఇదిలాగుంటే– పుండునీద కారం చల్లినట్లు–భరత్ ముఖ్యానుచరులు అటు వెళ్లిపోయారు. అదో ఉక్రోషం.

నేను సీతారాం రాజీనామాకు ఓ ఏడాది ముందు భరత్ డివిజన్లో చేరాను. తనతో పని చేసేవారిని జూనియర్సులా కాక సమఉజ్జీలుగా గౌరవించే భరత్ పద్ధతి నాకు నచ్చింది. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్ శాస్త్రిగారినుంచి, అదే

తరహా వ్యకితో కలిసి పని చెయ్యడం నా అదృష్టమనిపించింది. ఆపైన భరత్ జ్ఞానపరిజ్ఞానాల ఆసరాతో– భవిష్యత్తులో నా ఎదుగుదల తథ్యమనిపించింది.

యూనివర్సిటీలో ఉన్నప్పుడు అక్కడ ప్రొఫెసర్ల మధ్య ఉండే అహాలూ, రాజకీయాలూ స్వానుభవమే. ఐతే నా పనేదో నాది కాబట్టి, వాటికి దూరంగానే ఉండగలిగాను. యూనివర్సిటీ వదిలినప్పుడు అందరు ప్రొఫెసర్లతోనూ సుహృద్భావాన్ని నిలుపుకోగలిగాను. ఎదుటివారి నుంచి ప్రయోజనం ఆశించనప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండడం కష్టం కాదు.

అదే సిద్ధాంతాన్ని లేబరేటరీలోనూ పాటిస్తున్నాను. సీతారాం– భరత్‌లమధ్య వివాదం జరుగుతున్నప్పుడు నేను ఏ వర్గంలోనూ లేను. ప్రఫుల్ల చేరేక నేను భరత్‌ను వదిలి వెళ్లిపోనూ లేదు. ఎటొచ్చీ వివాదాల్లో లేను. నా పనేదో నాది. ప్రాణం సుఖంగా ఉంది.

ఐతే అదంత తేలిగ్గా పోయే వ్యవహారం కాదు.

భరత్ దగ్గర నేనే కాదు. రాజకీయాలతో నిమిత్తం లేకుండా తమ మానాన తాము పని చేసుకూంటూ పోయేవాళ్లు మరో పదిమంది ఉన్నారు. విశేషమేమంటే మేము మెరికల్లాంటివాళ్లమనీ, భరత్‌కి మేమే బలమనీ లేబరేటరీలో ప్రచారముంది. ప్రఫుల్ల అది నమ్మాడు. ఆయన మమ్మల్ని భరత్ నుంచి వేరు చెయ్యడానికి కొంతమంది అనుచరుల్ని మావద్దకు పంపుతుండేవాడు. మేము వాళ్లు చెప్పింది వినేసి, 'ప్రస్తుతానికే సమస్యలూ లేవు. సమస్య వస్తే మమ్మల్ని ఆదుకుందుకు ప్రఫుల్ల ఉన్నాడని ధైర్యముంది' అని చెప్పి పంపేసేవాళ్లం.

వాళ్లొచ్చి వెళ్లిన విషయం తెలిసి భరత్ మానుంచి వివరాలు ఆరాలు తీసేవాడు. జరిగింది జరిగినట్లుగా చెబితే విని కాస్త ఆవేశపడేవాడు. ఈ విషయమై ప్రఫుల్లని నిలదీస్తాననేవాడు. 'సాక్ష్యాలకోసం మమ్మల్ని ఈ రొంపిలోకి లాగొద్దు' అని మేమంటే మళ్లీ తగ్గేవాడు.

సైంటిఫిక్ రీసెర్చి రంగం వేరు. అక్కడ రాజకీయాలున్నా వాటివల్ల ప్రయోగాలూ, ఫలితాలూ మారిపోవు. సైంటిస్టు మనసెప్పుడూ జ్ఞానాన్వేషణలోనే ఉంటుంది కాబట్టి, ఆ పని ఆగిపోదు. ఈ రాజకీయాలు అర్థరహితమైన చిన్న డిస్టర్బెన్స్– అంతే!

డాక్ స్కాలర్‌షిప్పుకి భరత్ కొలీగ్సు పేర్లు ప్రతిపాదించడం ప్రఫుల్లకి ఇష్టం లేదు. లేకుంటే ఆయన చేరిన సంవత్సరమే నా పేరు పంపాలి. ఆయన మమ్మల్ని అపడానికి కొత్త కొత్త షరతులు పెట్టి రెండేళ్లు పక్కన పెట్టాడు. చివరికి ఆ షరతులు కూడా పూర్తి చెయ్యడంతో ఆ సంవత్సరం ప్రతిపాదించిన నాలుగు పేర్లూ భరత్ డివిజనువే అయ్యాయి. అదాయన జీర్ణించుకోలేకపోయాడనడానికి సూచనగా–

లేబరేటరీ అభ్యర్థులందరికీ డైరెక్టర్ స్పెషల్ రికమెండేషన్ విధిగా ఉండలంటే–
'నా రికమెండేషన్ అందరికీ ఇవ్వలేను. ఎందుకంటే ఒకేసంస్థనుంచి నలుగురికి ఎలాగూ వాళ్లివ్వరు. పోనీ అని ఒకర్నే రికమెండ్ చేస్తే, పక్షపాతం ఔతుంది''– అని అప్పటికి దాటేశాడు.

ఆశ్చర్యమేమంటే– ఆయన రికమండేషన్ లేకపోయినా ఆ నలుగురిలో– నేను, భూషణ్ ఇంటర్వ్యూలో ఎంపికయ్యాం. అది కూడా ఆయన జీర్ణించుకున్నాడని అనుకోను.

భూషణ్‌కి జర్మనీలో ఉండాలని లేదు. గడువు కాలం ముగిసీ ముగియగానే ఇండియా వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడు. నేను మాత్రం నా స్టే ఎక్స్‌టెండ్ చెయ్యాలని అనుకుంటున్నాను. అందుకు డాడ్ అనుమతించింది. ప్రఫుల్ల ఒప్పుకుంటాడా?

శ్రీమతి చెప్పేదాకా ఈ విషయమే నేను ఆలోచించలేదు.

ఏంచెయ్యాలా అని ఆ రాత్రంతా మనసులో తర్జనభర్జన పడ్డాక, ఈ విషయమై రాలెక్‌నే ఆశ్రయించాలనుకున్నాను.

ఐతే ఇది చాలా సున్నితమైన వ్యవహారం.

మా లేబరేటరీ రాజకీయాల గురించి రాలెక్‌కు తెలియడం ఇష్టం లేదు.

అసలే ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ గురించి ఆయనకు సదభిప్రాయం లేదు. సైంటిఫిక్ రీసెర్చిలోనూ అలాగే ఉందని తెలిస్తే– ముందు తన జర్మన్ కొలీగ్సులో ఆ విషయం ప్రచారం చేస్తాడు. మా లేబరీటరీని వాళ్లు పొరపాటుగా అర్థం చేసుకుంటారు.

అందుకని బాగా ఆలోచించాక– మర్నాడు రాలెక్‌ని కలుసుకున్నాను.

"ఇండియన్సే కాదు, ఏ దేశం వాళ్లైనా జర్మనీలాంటి దేశానికొస్తే– వీలైనంత ఎక్కువ కాలం ఉండాలనుకుంటారు. ఆకర్షణలోనే కాదు, సైంటిఫిక్ రీసెర్చికీ ఇదో ప్రత్యేకమైన దేశం. నేను ఇక్కడికొచ్చేముందు– ఏడాదిలో ఏంచేస్తాంలే, ఏదో గడిపేసి వెళ్లిపోదాం అనుకున్నాను. ఇక్కడికొచ్చేక తెలిసింది. ఏడాదిలో ఎంతైనా చెయ్యొచ్చు అనిపించే వ్యవస్థ ఇక్కడున్నదని! వచ్చిన అవకాశాన్ని సదుపయోగం చేసుకుందుకు– నువ్వూ, ఈ సంస్థ యాజమాన్యం ఎంతో సహకరించారు. మరో ఆర్నెల్లుంటే నా స్టే సార్థకమౌతుంది. అందుకు డాడ్ కూడా అనుమతించింది. ఐతే మా సంస్థ డైరెక్టర్ అలా అనుకోకపోవచ్చు. నేనీ దేశపు ఆకర్షణలో పడి ఏదో వంకన స్టే ఎక్స్‌టెండ్ చేస్తున్నానని అనుకోవచ్చు. అది నా కిష్టముండదు. నా ఎక్స్‌టెన్షన్ విషయం నువ్వే మా సంస్థ డైరెక్టరుకి ఉత్తరం రాస్తే బాగుంటుందని చెప్పడానికి వచ్చాను'' అని ఆయనకి చెప్పాను.

నేను చెప్పింది విని రాలెక్ కొంచెం బిగ్గరగానే నవ్వాడు. ఆపుకుందుకు కొంచెంసేపు పట్టింది.

ఎందుకు నవ్వాడు? ఇండియన్ మెంటాలిటీని వేళాకోళం చేస్తాడా?

రాలెక్ తేరుకున్నాక, "నిన్ను స్టే ఎక్స్‌టెండ్ చెయ్యమని అడిగింది నేను. ఏడాది ఉండమంటే ఆర్నెల్లే ఉంటానన్నది నువ్వు. డాడ్‌కి ప్రపోజల్ నువ్వే పంపడం పద్ధతి కాబట్టి కానీ, అదీ నేనే పంపి ఉండేవాణ్ణి. నువ్వు మా అతిథివి. నిన్నిక్కడికి పంపింది మీ సంస్థ. అందుకు మీ డైరెక్టరుకి థాంక్సు చెబుతూ– ఆర్నెల్ల ఎక్స్‌టెంషన్ గురించి తెలియబర్చి, అనుమతించమని కోరడం నా బాధ్యత. నా బాధ్యతను నిర్వహించమని నువ్వు నన్ను రిక్వెస్ట్ చెయ్యడమేమిటి? ఇండియన్ కర్టెసీ గురించి విన్నాను కానీ స్వానుభవం చేశావు నువ్వు" అన్నాడు.

తెల్లబోయి చూస్తే ఆయన కళ్లలో గౌరవంతో కూడిన వాత్సల్యం కనిపించింది. ఇండియాలో ఐతే అప్రయత్నంగా నమస్కరించేవాణ్ణి. ఇక్కడ నమస్కరించకుండా ఉండడానికి ప్రయత్నించాను.

ఏదైనా అందామంటే నోట మాట రాలేదు.

అంతలోనే ఆయన తన బల్లమీద ఫైల్లోంచి ఓ కాగితం తీసి పట్టుకుని, "ఉత్తరం నిన్ననే రెడీ చేశాను. ఈ రోజు పంపుతున్నాను. కావడానికి కాన్ఫిడెన్షియలే కానీ, ఓ కాపీ నీకివ్వడానికి నాకు అభ్యంతరమూ లేదు" అంటూ అది నాకిచ్చాడు.

బయటికొచ్చేక ఆ ఉత్తరం చదివాను. ఇండియన్ లేబరీటరీకి కదా– ఇంగ్లీషులోనే వ్రాశాడు.

రాలెక్ ఇంగ్లీషు ప్రొఫెషనల్ స్టైల్లో ఉంది. ఇంగ్లీషుకంటే విశేషం – ఆయన అందులో నన్ను ఆకాశానికెత్తేయడం.

అది కాన్ఫిడెన్షియల్ లెటర్ కాకపోతే, నేను దాన్ని టెస్టిమోనియల్ గా జీవితాంతం ఉపయోగించుకోవచ్చు.

పాశ్చాత్యులు మనసులోని మాటనే నిర్ద్వంద్వంగా చెబుతారని నమ్ముతాను కాబట్టి– ఇన్నాళ్లూ తనకి నాపై ఉన్న అభిప్రాయమేమిటో అప్పుడు తెలిసి ఎంతో సంతోషంగా అనిపించింది.

ఐతే ఎక్స్‌టెన్షన్ ప్రహసనం అంతటితో ముగియలేదు.

ఆ తర్వాత సుమారు రెండు వారాలకు కాబోలు, ఒక రోజు రాలెక్ నా వర్క్‌ప్లేసుకి వచ్చాడు.

చేతిలో ఏదో కాగితముంది. మొహం కందగడ్డలా ఎర్రగా ఉంది.

''డాక్టర్ రావ్, ఎవరీ ప్రఫుల్ల?'' అన్నాడాయన. మొహంలో కనిపించిన ఎరుపు గొంతులో కూడా ధ్వనిస్తోంది....

రాలెక్ ప్రఫుల్లకి తనే ఉత్తరం వ్రాశాడు. ఇప్పుడు నా దగ్గరికొచ్చి, 'ఎవరీ ప్రఫుల్ల?' అంటాడేమిటి?

ఉత్తరానికి బదులొచ్చిందా?

ఆయన చేతిలో ఓ కాగితముంది. అది ఆయన ఉత్తరానికి ప్రఫుల్లనుంచి వచ్చిన సమాధానమా?

ఆయన జర్మనీలో నా స్టే మరో ఆర్నెల్లు పొడిగించమని ప్రఫుల్లకి వ్రాశాడు. ప్రఫుల్ల ఒప్పుకుంటే, నేనిక్కడ ఇంకో ఆర్నెల్లుంటాను. లేదూ ఈ అక్టోబరు ఒకటికల్లా ఇండియా వెళ్లిపోతాను.

ప్రఫుల్ల ఏం జవాబిచ్చినా అది నాకు సంబంధించినది. లాభమైనా, నష్టమైనా అది నాకు. అంటే సంతోషమైనా, కోపమైనా అది నాకు!

మరి ఆ సమాధానంలో ఏముందో కానీ, కోపం రాలెక్‌కి వచ్చింది. అదీ చాలా ఎక్కువగా–

ఎందుకు?

ఇలాంటి సమయంలో ఆలోచనకు ఎక్కువ పని చెప్పడం వృథా అనిపించి, "ప్రఫుల్ల అంటే మా డైరెక్టర్. నాకు బిగ్ బాస్" అని అంతవరకూ ఆ విషయం రాలెక్‌కి తెలియదన్నట్లుగా చెప్పాను.

రాలెక్ నా మాటలు విన్నట్లు లేదు. ఆయన ముఖం చూస్తే, నా సమాధానం వినాలని అనుకున్నట్లూ లేదు.

ఆయన ఏం మాట్లాడకపోతే, ఓ క్షణమాగి నేనే అన్నాను, "ఇండియానుంచి రిప్లై వచ్చిందా?"

ప్రఫుల్ల పేరెత్తడానికి ధైర్యం చాలక, 'ఇండియా' అన్నాను.

అప్పటికి రాలెక్ కొంచెం తమాయించుకున్నాడు, "ఆఁ వచ్చింది, చూస్తావా?" అన్నాడు.

"కాన్ఫిడెన్షియల్ కాకపోతే....." అన్నాను తటపటాయిస్తూ.

రాలెక్ వెంటనే నాకా ఉత్తరం అందించి, "అరగంటాగి వస్తాను. ఈలోగా ఉత్తరం చదువు" అని వెళ్లిపోయాడు.

ఆ ఉత్తరం చదవాలంటే భయమేసింది.

అది నా ఎక్స్‌టెన్షన్ గురించి రాలెక్ మా డైరెక్టరుకి వ్రాసిన ఉత్తరానికి జవాబు. ఆ జవాబులో ఏముంది?

మా డైరెక్టరు చెడ్డవాడేం కాదు. ఇండియాలో ఆయనకీ నా బాస్‌కీ అంతగా పడకపోవచ్చేమో కానీ, అక్కడ నాతో ఎప్పుడూ పరుషంగా మాట్లాడలేదు.

అదీకాక, అతిథిమర్యాదకు మా లేబరేటరీ పెట్టింది పేరు.

వచ్చింది రాజకీయనేతలైనా, ఇతరత్రా లబ్దప్రతిష్ఠులైనా, శాస్త్రజ్ఞులైనా– సంతుష్టుల్ని చేసి పంపడం మా సంప్రదాయంలో భాగం. అది ప్రఫుల్ల మా లేబరేటరీకి రాక మునుపునుంచీ ఉంది. ఆయన వచ్చేకనూ కొనసాగుతోంది.

ఇక విదేశీయుల విషయానికొస్తే, మన భారతీయలందరికీ ఉండే బలహీనత ఆయనకూ ఉంది. అదే– అతిథి మర్యాద అతిగా చెయ్యడం!

అలాంటిది విదేశీయుడైన రాలెక్ తనకో ఉత్తరం వ్రాస్తే– వ్రాసినవాడు అంత ఆగ్రహావేశాలకు గురయ్యేలా ఏం బదులిచ్చాడు ప్రఫుల్ల?

ఊహకందే సమాధానం కాదది! అందుకని నెమ్మదిగా ధైర్యం కూడగట్టుకుని ఆ ఉత్తరం చదవడం మొదలెట్టాను.

చదువుతుంటే ముందు ఆశ్చర్యం, తర్వాత ఆనందం కలిగింది.

ఎందుకంటే– ఆ ఉత్తరంనిండా నాకు పొగడ్తలే!

అంతవరకూ ప్రఫుల్ల నాతో పరుషంగా మాట్లాడి ఉండకపోవచ్చుగానీ, ఇంతగా ఎప్పుడూ పొగడనూలేదు.

ఆ ఉత్తరంలో ఆయన నన్నూ, నా ప్రతిభనూ, నా అంకితభావాన్నీ, వ్యక్తిత్వాన్నీ తెగ పొగుడుతూ ముందో పేరా వ్రాశాడు.

తర్వాత పేరాలో మా లేబరేటరీలో కొత్తగా రిక్రూట్మెంట్సు ఔతున్నాయనీ, కొత్తగా చేరినవాళ్లకి నావంటివారి సమక్షం స్ఫూర్తిదాయకంగా ఉంటుందనీ వ్రాశాడు.

నేను మా లేబరేటరీకి పెద్ద అసెట్ అట! అక్కడ నన్ను బాగా మిస్సవుతున్నారుట. ఎప్పుడు తిరిగొస్తానా అని నా రాకకోసం తాను ఎదురు చూస్తున్నాట్ట. ఈ కారణాలవల్ల– అనుకున్న గడువుకి మించి ఒక్క రోజు కూడా నేను లేకుండా అక్కడ గడవదని తర్వాత పేరా.

అంటే నాకు ఎక్స్‌టెన్షన్ రాదు. ఎక్స్‌టెన్షన్ ఇవ్వడం ఇష్టం లేకనే– ఆయన నన్నంతలా పొగిడి ఉండొచ్చు కూడా.

కానీ అప్పటికి నేనింకా బాగా జూనియర్ని. ప్రఫుల్ల అప్పటికి నాకంటే కనీసం ఐదు గ్రేడ్లు ఎక్కువలో ఉన్నాడు. అదికాక మొత్తం లేబరేటరీకి తనే అధినేత.

నాకు ఎక్స్‌టెన్షన్ ఇచ్చినా, నేనిక్కడుండేది ఇంకో ఆర్నెల్లు. అంతే!

ఆ తర్వాత నా సర్వీసు అక్కడే కదా! లేబరేటరీలో– కనీసం రానున్న దశాబ్ద కాలంలో– నా భవిష్యత్తుకి బంగారు బాట పడడానికి ఇప్పుడు ప్రఫుల్ల వ్రాసిన ఈ ఉత్తరం చాలు. ఇందులోని వాక్యాల్ని కోట్ చేస్తూ, రాలెక్ నాకో టెస్టిమోనియల్ ఇస్తే– అదే సాక్ష్యమౌతుంది.

పోనీలే ఎక్స్‌టెన్షన్ ఇవ్వకపోతే ఇవ్వకపోయాడు– నా గురించి నాలుగు మంచిమాటలు చెప్పాడు అని సంతోషించాను

కానీ– ఇందులో రాలెక్‌కి కోపమొచ్చే విశేషమేముంది?

అప్పుడే నాకు స్ఫురించింది– నేనింకా ఉత్తరం పూర్తిగా చదవలేదని.

అనాసక్తంగానే మిగతా ఉత్తరం చదివితే–

తర్వాతి పేరాలో ప్రస్తుతం బెర్లిన్లో నేను పనిచేస్తున్న సంస్థని పొగిడాడు ప్రఫుల్ల. తను రాలెక్ పబ్లికేషన్సు చూశాననీ– ఆయన ఆధ్వర్యంలో నేను చేస్తున్న రీసెర్చివల్ల– మా లేబరేటరీకీ, ఇండియాకీ, ప్రపంచానికీ కూడా ఎంతో ప్రయోజనముందనీ వ్రాశాడు.

చివరి పేరాలో, "నువ్వంటే నాకు చాలా చాలా గౌరవం. నీ అంతటివాడి సిఫారసు కాదనడం మర్యాద కాదు. అందుకని ఆరు నెలలు కాకపోయినా, ఎలాగో అలా వీలు చేసుకుని, డాక్టర్ రావుకి మూడు నెలలు ఎక్స్‌టెన్షన్ ఇవ్వగలను" అని వ్రాశాడు.

ఆశ్చర్యపోయాను. అడిగినంత కాకపోయినా మా డైరెక్టరు నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ ఇచ్చాడు. ఇది నాకు గొప్ప విజయం.

ఆ ఉత్తరం నన్ను గొప్పవాణ్ణి చేసింది. నా వర్కుని గొప్ప చేసింది. రాలెక్‌నీ, బెర్లిన్లో ఈ సంస్థనీ గొప్ప చేసింది. నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ కూడా ఇచ్చింది.

ఇందులో కోపం తెచ్చుకోవాల్సిన అంశమేముంది?

నిజానికి మూణ్ణెల్ల ఎక్స్‌టెన్షనే నాకు ఎక్కువ వీలు. అప్పుడు నేను జనవరికల్లా ఇండియా వెడతాను. స్కూళ్లు జనవరి–జనవరి కాబట్టి పిల్లలకది అడ్మిషన్సు టైము. నేను, శ్రీమతి ఐతే– జనవరి దాటి ఇక్కడుండడానికి మొదట్నించీ ఇష్టపడ్డంలేదు.

కాగల కార్యం తీర్చిన గంధర్వుడయ్యాడు ప్రఫుల్ల.

ఈ విషయం రాలెక్‌కి చెప్పి, నా సంతోషాన్ని ప్రకటించాలని అనుకున్నాను కానీ– ఆయన కోపకారణం తెలుసుకోకుండా, ఈ విషయమై బయటపడకూడదనుకున్నాను.

రాలెక్ ఆంతర్యం తెలిసేదాకా, కాస్త డిప్లొమాటిక్‌గా వ్యవహరించాలనుకున్నాను.

రాలెక్‌కి టైమంటే టైమే. సరిగ్గా అరగంటలో వచ్చాడు. వస్తూనే, "ఉత్తరం చదివావా?" అనడిగాడు.

"ఊఁ మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ వచ్చింది" అన్నాను.

"ఔను. మనం ఆర్నెల్లడిగితే మూణ్ణెల్లు వచ్చింది" అన్నాడు రాలెక్ అదోలా.

"ఔను. అదైనా– ఉత్తరం వ్రాసింది నువ్వు కాబట్టి, నీమీద గౌరవంతో ఇచ్చినది..." అన్నాను.

"హుఁ గౌరవం" అదోలా నవ్వాడు రాలెక్. ఆ నవ్వులోనూ కోపమే ప్రతిఫలించింది.

నేనేదో అనబోయి ఆయనింకా ఏదో అనబోతున్నాడని గ్రహించి ఆగిపోయాను.

"నేను బాగా ఆలోచించి నీకు ఆర్నెల్లు ఎక్స్‌టెన్షన్ అవసరమని తేల్చాను. నేనన్నా, నా మాటన్నా గౌరవమున్నవాడు– అర్నెల్లూ ఇవ్వాలి..." అని ఇంకా ఏదో అనబోతుంటే–

"అసలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చే పరిస్థితే లేనప్పుడు, నీమీద గౌరవంతో మూణ్ణెల్లకు వీలు చేసుకున్నట్లు వ్రాశాడాయన"– ఉత్తరం సరిగ్గా చదివాడో లేదోనని మరోసారి వివరణ ఇచ్చాను.

"ఎక్స్‌టెన్షన్ ఇచ్చే పరిస్థితి లేకపోతే సారీ చెప్పేసి కాదనాలి. అప్పుడు నేనాయన పరిస్థితిని అర్థం చేసుకుని గౌరవిస్తాను. లేదూ ఆయనకి నామీద చెప్పలేనంత గౌరవముంటే– ఆ గౌరవంతో నేనడిగిన ఆర్నెల్లూ ఇవ్వడానికి వీలు చేసుకోవాలి. మధ్య ఈ మూణ్ణెల్లేమిటి? ఇదేమన్నా కూరగాయల బేరమా, లేక నామీద గౌరవం సగమే అనుకోవాలా?" అన్నాడు రాలెక్.

అప్పటికి నాకు రాలెక్ ఆంతర్యం అర్థమైంది.

గౌరవమంటే మాటల్లో కాదు, చేతల్లో కనబడాలి.

అడిగిందాంట్లో సగమే ఇచ్చి దాన్ని గౌరవం అనుకోవడం మన దేశంలో అనుసరించే సంప్రదాయం.

అందుకే ఏ ప్రాజెక్టుకైనా నిధులు కావాల్సొచ్చినప్పుడు, అవసరమైనదానికి కనీసం రెట్టింపు అడుగుతూ ప్రపోజల్సు ఇవ్వడం మాకు రివాజు.

అలా కాకుండా మేము ప్రపోజల్లో నిజాయితీగా మాకు కావాల్సిన మొత్తమే అడిగినా, అవతలివాళ్లు నమ్మరు. ఎక్కువే అడిగి ఉంటామని ఊహించేసుకుని, మేమడిగిందాంట్లో కనీసం సగమైనా తగ్గించి గ్రాంట్సు ఇవ్వడం, శాంక్షనింగ్ అథారిటీస్‌కి రివాజు.

ఈ రివాజు బ్రిటిషువారినుంచి మనకు సంక్రమించిందంటారు. ఐతే వారి దేశంలో ఇది అనుసరించరట. ఎందుకంటే అక్కడ ప్రభుత్వం పాలితులకి సేవిక. ఇక్కడ ప్రభుత్వం పాలితులకి యజమాని.

మనకు స్వతంత్రమొచ్చింది. ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తున్నాం. ఆ ప్రకారం ప్రభుత్వం పాలితులకి సేవిక. కానీ మనమలా అనుకోకుండా ప్రభుత్వాన్ని యజమాని గానే భావిస్తున్నాం.

పాశ్చాత్యులు మనకు చెప్పింది వాళ్లు చెయ్యరు. మనం మాత్రం వాళ్లు చెప్పిందే గుడ్డిగా అనుసరిస్తాం. ఉదాహరణకి–

ఎమ్మెస్సీ అయ్యేక పై చదువులకోసం విదేశ సంస్థలకి నేనెప్పుడూ దరఖాస్తులు పెట్టలేదు కానీ, నా కొలీగ్సు చాలామందే అలాంటి ప్రయత్నాలు చేశారు.

అప్పట్లో చదువుకి స్వంత డబ్బుతో విదేశాలు వెళ్లే స్తోమతు ఉన్నవారు అరుదు. దరఖాస్తు పెట్టినవారు ఆర్థిక సాయం కోరేవారు. అది లభిస్తేనే అక్కడికి వెళ్లేవారు.

ఆర్థిక సాయం కోరుతూ ఉత్తరం వ్రాసినప్పుడు పాశ్చాత్య సంస్థలు ఇచ్చే సమాధానాలు కొన్ని చూశాను.

వాటిలో మొదటి నాలుగైదు పేరాల్లో అభ్యర్థి గొప్పతనాన్ని ఆకాశానికెత్తేస్తాయి. ఎంతలా అంటే– ఇప్పుడు ప్రఫుల్ల రాలెక్‌కి వ్రాసిన ఉత్తరంలో నాకందిన పొగడ్తలు సూర్యుడిముందు దివిటీలా ఉంటాయి.

ఇంతా చేసి ఉత్తరం చివర్లో ఒకేఒక్క వాక్యంలో ఆర్థిక సాయం ఇవ్వలేకపోతునందుకు విచారం ఉంటుంది.

మొత్తం ఉత్తరం సారాంశం ఆ చివరి వాక్యమే!

అదే పాజిటివ్ ఉత్తరం ఐతే అందులో– ఆర్థికసాయం అందిస్తున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరుస్తూ ఒకేఒక్క వాక్యం ఉంటుంది. మిగతా ఉత్తరమంతా–ఆర్థికసాయపు వివరాలు, నియమావళి ఉంటాయి.

రీసెర్చి రోజుల్లో మావాళ్లు అంటూండేవాళ్లు– 'ఉత్తరం పెద్దదైతే చివరి వాక్యం ఒక్కటే చదివి ఏడు. చిన్నదైతే నియమావళి చదువుకుని మురిసిపో' అని.

ఇప్పుడు ప్రఫుల్ల కొంత పాశ్చాత్య సంప్రదాయాన్నీ, కొంత భారత సంప్రదాయాన్నీ కలగలిపాడు. రాలెక్ తట్టుకోలేకపోయాడు.

ఈ విషయమై అంతకంటే లోతుగా ఆలోచించనవసరం లేదు. రాలెక్‌కి కోపమొస్తేనేం– నాకు మూణ్ణెల్లు ఎక్స్‌టెన్షన్ వచ్చింది. కొంత లోకజ్ఞానం కూడా పెరిగింది.

అదలాగుంచితే రాలెక్‌కి ప్రఫుల్లమీద కోపమొచ్చినా– నా వర్కుమీద బాగా ఆసక్తి ఉంది.

నేనక్కడ మరింత కాలం ఉండాలనుకున్నాడు. ఉండడానికి వీలు కాకపోతే, ఎలాగో అలా నా వర్కు పూర్తయ్యేలా చూడాలనుకున్నాడు.

అందుకే తనవద్ద ఎమ్మెస్ చేయడానికి చేరిన లూయీజీ అనే శిష్యుణ్ణి, నాకు అసిస్టెంటుగా అప్పజెప్పాడు.

లూయీజీ పూర్తి పేరు జోసెఫ్ లూయీజీ. అతడిది టునీషియా. అఫ్రికాలో ఉండే అరబ్ దేశం.

లూయీజీ గోధుమవర్ణంతో, చక్కని కనుముక్కు తీరుతో, చూడముచ్చటగా ఉంటాడు. భారీగా కాకుండా ఇంచుమించు నాకులాగే పల్చగానూ, ఉంటే నాకంటే ఓ గుప్పెడు పొడుగూ ఉంటాడు.

లూయీజీకి పెళ్లయింది. పిల్లలు లేరు. వాళ్ల జంట కూడా చూడముచ్చటగా ఉంటుంది. ఆమె కూడా అప్పుడప్పుడు లేబరేటరీకి వచ్చేది. ఆమె ఎక్కువగా జీన్సు వేసుకున్నా, సంప్రదాయపు అరబిక్ వనితలాగే కనిపించేది.

శ్రీమతి. పిల్లలు లేబరేటరీకి అప్పుడప్పుడు వస్తూండడంవల్ల– మా రెండు కుటుంబాలకూ కొంత పరిచయమైంది. ఐతే– కనబడినప్పుడు చిరునవ్వులకు మాత్రమే మా స్నేహం పరిమితం.

నేనూ, లూయీజీ మాత్రం కంబైండ్ రీసెర్చి కారణంగా బాగా సన్నిహితులమయ్యాం.

ఇండియన్సుకి భిన్నంగానూ, అక్కడి సంప్రదాయానికి అనుగుణంగానూ– లూయీజీ కూడా ముక్కుసూటి మనిషి.

అతడు ధారాళంగా జర్మన్ మాట్లాడతాడు. ఇంగ్లీషు కూడా వచ్చు. ఆ రోజుల్లో నాతో సహా చాలామందికి సుపరిచితం కాని కంప్యూటరు విషయంలో అతడికి కొంత శిక్షణ ఉంది.

లేబరేటరీలో కంప్యూటరుకోసం పెద్ద గది ఒకటి ఉంది. ఒకే ఒక్క కంప్యూటరు యంత్రం గదినిండా పరుచుకుని ఉండేది. దానికి ఒక ఆపరేటరు ఉండేవాడు.

కంప్యూటరు వాడాలంటే, ముందు మనం ప్రోగ్రాం వ్రాసుకుని తీసుకెళ్లి ఆపరేటరుకి ఇవ్వాలి. అతడికి వీలైన రోజున డేటాతో వెడితే, గంటలకి గంటలు (ఒకోసారి రోజులు కూడా) పట్టే ఈక్వేషన్సుకి గంట లోపులో సొల్యూషన్సు లభిస్తాయి.

కెటలిటిక్ ఈక్వేషన్సు క్లిష్టమైనవి. వాటి పరిష్కారానికి కంప్యూటరు పరిజ్ఞానం బాగా ఉపయోగపడుతుంది. లూయీజీ కంప్యూటరు గురించి మాట్లాడుతున్నప్పుడు, అప్రయత్నంగానే నా కళ్లలో ఆరాధనాభావం తొంగిచూసేది.

లూయీజీ నావద్ద చేరే నాటికే, మా కెటలిటిక్ రియాక్టరు సిద్ధమైంది. ఐతే అంతవరకూ అలాంటి రియాక్టర్ల గురించి చదవడమే తప్ప, పని చేసి ఉండకపోవడం వల్లనూ, జర్మన్–ఇంగ్లీషు గజిబిజి కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొనక తప్పలేదు.

మనకి అన్నీ తెలిసినా ఒకోసారి తప్పటడుగు వేస్తాం.

ఉదాహరణకి చిన్నప్పుడు మా ఊళ్లో జరిగిన చిన్న దుర్ఘటన.

నేను చదివింది రాజమండ్రి గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీలో. ఉండేది ధవళేశ్వరంలో మా తాతగారింట్లో. అమ్మానాన్నలు అక్కడికి దగ్గర్లో కోనసీమలోని పేరవరం గ్రామంలో ఉండేవారు. సెలవుల్లో పేరరవరం వెళ్లి కొన్నాళ్లుండేవాణ్ణి.

అలా వెళ్లినప్పుడు ఒకసారి మా ఊరికో ఓ హరిదాసు వచ్చాడు.

మాది ఊరికి మధ్యలో ఉండే ఎత్తరుగుల ఇల్లు. హరికథకు అనువైన ప్రదేశం. అందుకని హరికథలకు, బుర్రకథలకు, నృత్యప్రదర్శనలకు– మా ఇల్లే వేదిక.

సాధారణంగా అరుగునానుకుని రోడ్డుమీద స్టేజి కట్టేవారు. ఒకోసారి అరుగుమీదే స్టేజి ఏర్పాటు చేసేవారు.

కార్యక్రమానికి కరెంటు మా ఇంట్లోంచే. అందుకు అనువుగా కొంత కరెంటు వైరు మా ఇంట్లోనే వదిలేసి ఉంచేవారు.

దురదృష్టం కొద్దీ ఆ రోజు కరెంటు కనెక్షన్ ఇవ్వడానికి లైన్‌మాన్ ఊళ్లో లేడు. హరిదాసు నా సాయం కోరాడు.

బీయస్సీలో నా మెయిన్ సబ్జక్ట్సు లెక్కలు, ఫిజిక్సు, కెమిస్ట్రీ. కాబట్టి నిస్సంకోచంగా ఒప్పుకున్నాను. కానీ కరెంటుతో వ్యవహారమని మా నాన్నగారు ససేమిరా అన్నారు. నాకు ఉక్రోషం వచ్చినా మనసులో దాచుకుని ఊరుకున్నాను.

హరిదాసు నీరసపడిపోయి, పెట్రోమాక్సు లైట్లకి కబురు పెట్టించాడు.

అప్పుడు ఊళ్లోనే ఎస్సెస్సెల్సీ చదువుతున్న భద్రం అనే కుర్రాడు ముందుకొచ్చాడు.

వైరింగులో మా ఊరి లైన్‌మాన్‌కి చాసార్లు సాయపడ్డాట్ట.

ఇటుపక్క ప్లగ్గునుంచి వైరులాగి అటుపక్క బల్బులు పెట్టడమే కదా, అదో పెద్ద పనే కాదు అన్నాడు.

నాకు నిజమే ననిపించింది.

ఇటు ప్లగ్గుపిన్‌నీ, అటు పెద్ద బల్బుహోల్డర్లు రెండింటినీ కలుపుతూ– సుమారు ఐదు మీటర్ల కరెంటు వైరు సిద్ధంగా ఉంది. నాన్నగారికి అదే చెబితే, "నువ్వు వైరు ముట్టుకోకు. వాణ్ణి పూర్తిగా నమ్మకు. సరిగ్గా కనెక్షనిస్తున్నాడో లేదో పైనుంచి సూపర్వయిజ్ చెయ్యి" అన్నారు.

ఆయన నామీద ఆమాత్రం నమ్మకముంచారని నేనూ, సమస్య తీరిందని హరిదాసూ సంతోషించాం.

భద్రం కనెక్షనిచ్చి చూస్తే, ఒకసారి రెండు బల్బులూ దివ్యంగా వెలిగాయి. ఐతే వైరు పొడవు ఓ రెండు మీటర్లు తక్కువైంది. "దాందేముందీ, వైరు మా ఇంట్లో ఉంది. అదీ ఇదీ కలుపుదాం" అంటూ భద్రం వాళ్లింటికెళ్లి అదనపు వైరు తెచ్చాడు. ఒకసారి దీపం వెలిగించిన ధైర్యంతో తను తెచ్చిన వైరుని ప్లగ్‌పిన్‌కి కనెక్ట్ చేశాడు.

అంతవరకూ బాగానే ఉంది. కానీ పాత వైరూ కొత్త వైరూ కలిసిన చోట రాగి వైరు ఎక్స్‌పోజ్ అయింది. అక్కడ బ్లాక్ టేప్ చుట్టి కవర్ చెయ్యాలి.

అదృష్టంకొద్దీ, హరిదాసు తన సరంజామాలో వెదికితే అలాంటి టేపు చిన్న ముక్క దొరికింది.

"ఇది చాలు. నేను సరిపెడతాగా" అన్నాడు భద్రం.

సరిగ్గా అప్పుడే అమ్మ నన్ను పిలిస్తే, లోపలికెళ్లాను. మరుక్షణంలో ఢాంమని చప్పుడు.

ఇంట్లో కరెంటు పోయింది.

ఏం జరిగిందంటే, బ్లాక్ టేపు ముక్క తక్కువుందని– పాజిటివ్, నెగెటివ్ తీగలకి విడివిడిగా కాక కలిపి చుట్టేసి కనెక్షనిచ్చాడు భద్రం.

అదేమంటే– నేనే అలా చెప్పానన్నాడు.

హరిదాసుకి పెట్రోమాక్సు లైటు తప్పలేదు.

మర్నాడుదయం లైన్‌మాన్ వచ్చి బయట ఎలక్ట్రిక్ స్తంభంమీద ఫ్యూజు వేసేదాకా మా ఇంట్లో కరెంటు లేదు.

నిజానిజాల విషయం ఎలాగున్నా– అది నాకు అవమానమే!

అలాంటిదే ఇప్పుడిక్కడ బెర్లిన్లోనూ జరిగింది.

అక్కడ భద్రం, ఇక్కడ అహమ్మద్.

అహమ్మద్ ఇంకా పిజి చేస్తున్నాడు. జర్మన్ భాషమీద మంచి పట్టుండడంవల్లనూ, నాతో మొదట్నించీ అందరికంటే ఎక్కువ చనువు, స్నేహభావంతో ఉండడంవల్లనూ– చాలా విషయాల్లో నేనతడి సాయం తీసుకునేవాణ్ణి.

ఇంకా పీజీ కాని తను ఓ పోస్ట్ డాక్టరల్ ఫెలోకి సాయపడుతున్నానని అతడికీ గర్వంగా ఉండేది.

మా రియాక్టరు సిద్ధమయ్యేక, దానికి డిజిటల్ టెంపరేచర్ ఇండికేటర్ కనెక్ట్ చెయ్యాల్సి ఉంది. కనెక్ట్ చేద్దామంటే దానిమీద చాలా సంకేత పదాలు జర్మన్ భాషలో ఉన్నాయి. అక్షరాలు ఇంగ్లీషువే కాబట్టి, అన్వయించుకోవడం అంత కష్టం కాదు కానీ నేనిలాంటి విషయాల్లో రిస్కు తీసుకోను.

అహమ్మద్‌ని సాయానికి పిలిచాను.

అహమ్మద్ కాలరెగరేసుకుంటూ వచ్చి, "ఇది చాలా సింపుల్ కనెక్షన్. ఐనా జాగ్రత్తగా స్టడీ చేస్తాను" అన్నాడు.

అతడు చాలాసేపు స్టడీ చేస్తాడు కాబోలనుకుని నేను టాయిలెట్‌కి వెళ్లాను.

నేను తిరిగొచ్చేసరికి, కేవలం ఐదు నిముషాలు. అంతే!

అప్పటికి అక్కడ అహమ్మద్‌తోపాటు రియాక్టర్ తయారు చేసిన ఇద్దరు వర్క్‌షాప్ ఇంజనీర్లూ ఉన్నారు.

జరిగిందేంటంటే– నేనిలా వెళ్లగానే అహమ్మద్ అలా కనెక్షన్ చేసేసి అలా వెడుతున్న ఇంజనీర్లని పిలిచాడు. రియాక్టరుకి ఇండికేటర్ తనే కనెక్ట్ చేశానని చెప్పుకోవాలని అతడి తపన. ఐతే అతడు మిల్లీవోల్ట్సు పాయింటుని మెయిన్సుకి కనెక్ట్ చేశాడు. అంటే బయట్నించి వచ్చే 220 వోల్ట్సు కరెంటు ఆ పాయింట్లోకి వెడుతుంది. కనెక్షనివ్వలేదు కానీ, ఇస్తే ఇండికేటర్ కాలిపోయుండేది.

వాళ్లా విషయం చెప్పగానే అహమ్మద్ ప్లేటు మార్చేశాడు. "కనెక్షన్ రావు చేశాడు. ఎలాగుందో చూడమని నన్ను పిలిచాడు. నాకు అనుమానమొచ్చి మిమ్మల్ని పిలిచాను. మంచిదే అయింది. లేకపోతే...." అంటూండగా నేననక్కడికొచ్చాను.

రియాక్టర్ డిజైనింగ్ సమయంలో నేనూ, ఆ ఇంజనీర్సూ ఎన్నో విషయాలు చర్చించి ఉన్నాం. నేనిస్తున్న వివరాలవల్ల తమ అవగాహన పెరిగిందని వాళ్లు నన్ను మెచ్చుకుంటే, వాళ్లడిగే వివరాలవల్ల నా పరిజ్ఞానం పెరిగిందని నేను వాళ్లకి బాకీ తీర్చుకున్నాను.

అందువల్ల వాళ్లకీ, నాకూ పరస్పరం సత్తాలు తెలుసు.

"రావ్! ఈ కనెక్షన్ నువ్విచ్చావంటే, నేను నమ్మను" అన్నాడు వాళ్లలో బెర్గర్.

విషయం అర్థమై, నేను అహమ్మద్ వంక చూశాను. అతడు నన్ను జాలిగా, అర్థింపుగా చూస్తున్నాడు.

ఏంచెయ్యాలో తెలియక, "పొరపాట్లు ఎవరికైనా వస్తాయి. పొరపాటుని అజ్ఞానం అనుకుంటే అది పొరపాటు" అన్నాను నర్మగర్భంగా.

"జీ హాబెన్ రెష్ట్ (యు ఆర్ రైట్)" అని నవ్వుకుంటూ వెళ్లిపోయారు వాళ్లిద్దరూ.

అప్పుడు నేను అహమ్మద్ వైపు తిరిగి, "నువ్వు పొరపాటు చేసి, నామీదకు తోసెయ్యడం బాగోలేదు" అన్నాను. కోపంగా కాదు, మందలిస్తున్నట్లు!

"నువ్వేమో డాక్టరేటువి. నీకు నీ దేశంలో ఉద్యోగముంది. మహా అయితే కొన్ని నెలలుంటావిక్కడ. నీగురించి కాస్త తప్పుగా అనుకున్నా నీకొచ్చిన నష్టమేం లేదు. నా సంగతి అలా కాదు. నా పీజీ పూర్తి కావాలి. ఆతర్వాత కూడా ఇంకా ఇక్కడే కొన్నేళ్లుండాలి. నామీద ఇంప్రెషన్ పోతే– మనుగడ కష్టమౌతుంది" అన్నాడు అహమ్మద్ జాలిగా.

"అలాంటప్పుడు ఇంప్రెస్ చెయ్యడానికి ఇలాంటి చెత్త ప్రయత్నాలు చెయ్యకూడదు. నాకు నష్టం లేకపోయినా పరువనేది ఉంటుందిగా, అది నాతోనే కాదు, నా దేశంతో కూడా ముడిపడింది మరి" అన్నాను.

"ఏమైతేనేం, పొరపాటుకి సారీ. మళ్లీ ఇలాంటివి జరుగనివ్వను. ఇప్పటికి రక్షించావు. అందుకు థాంక్స్" అన్నాడు అహమ్మద్.

"తెలిసింది నిర్భయంగా చెప్పాలి. తెలియంది నిస్సంకోచంగా ఒప్పుకోవాలి. అదీ మంచి సైంటిస్టు లక్షణం" అన్నాను.

"నువ్వు మంచి సైంటిస్టువని ఇక్కడ అందరికీ తెలుసు. ఆపైన– ఇక నీ కెటలిస్టుల టెస్టింగు మొదలౌతుందిగా– అవి జర్మన్ కెటలిస్టులకంటే గొప్పగా పని చెయ్యక పోతే చూడు..." అన్నాడు అహమ్మద్ అభిమానంగా.

"అహమ్మద్ హిందువు కాకపోవచ్చు. కానీ తథాస్తు దేవతలకి అలాంటి పట్టింపు ఉండదనికూడదు" అనుకుంటూ అతణ్ణి చూస్తే...

అప్పుడు అతడే తథాస్తు దేవతలా ఉన్నాడు.

అది నా భ్రమ కాదని అప్పుడు నాకు తెలియదు...

నేనూ నా కెటలిస్టులూ

నేను తయారు చేసిన కెటలిస్టుల్ని స్టడీ చెయ్యడానికి ఎంచుకున్నది– వాటర్ గాస్ షిఫ్ట్ రియాక్షన్. అందుకు అవసరమైనవి ఆర్గాన్, కార్బన్ మోనాక్సయిడ్– గ్యాస్ సిలిండర్లు. స్టీమ్ జనరేటర్. 1 నుంచి 20 అట్మాస్ఫియర్ల ఒత్తిడిని తట్టుకోగల రియాక్టర్. లోనికి వెళ్లే బయటికొచ్చే వాయువుల పరిమాణాల్ని కొలిచే గాస్ క్రోమటోగ్రాఫ్. టెంపరేచర్, ప్రెషర్ పరిమాణాల్ని తెలిపే మీటర్లు.

బెర్గర్ బృందం సహకారంతో ఈ రియాక్టర్ సిస్టమ్– తయారు కావడానికి ఆరేడు నెలలు పట్టింది.

రియాక్షన్ అధిక ఒత్తిడిలో స్టడీ చెయ్యాలి కాబట్టి– ఈ సిస్టమ్‌లో కనెక్షన్లన్నీ ఎక్కడా లీక్ అన్నది లేకుండా టైటుగా ఉండాలి.

మనం ఇళ్లలో వాడే ప్రెషర్ కుక్కర్లో లీక్ లేకుండా రబ్బర్ గాస్కెట్ వాడతాం. ఐతే అందులో ప్రెషర్ రెండు అట్మాస్ఫియర్లు దాటదు. దాటితే కుక్కర్ పేలే ప్రమాదం కూడా ఉంది.

రియాక్టర్లో ఒత్తిడి 1 నుంచి 20 అట్మాస్ఫియర్లదాకా ఉంటుంది. కనెక్షన్లు దగ్గర ప్రత్యేకమైన వాషర్లు వాడాలి. నట్లు–స్క్రూలు చాలా టైటుగా బిగించాలి. ఏమాత్రమూ లీక్ లేకుండా చూడ్డం ఈ సిస్టమ్‌కి చాలా అవసరం.

రియాక్షన్ జరిగేది కార్బన్ మోనాక్సయిడ్, నీటి ఆవిరి మధ్య. ఎంతెంత పంపుతున్నదీ గాస్ క్రోమటోగ్రాఫ్ లెక్క చెబుతుంది. ఐతే మన చుట్టూ ఉండే వాతావరణంలో ఆక్సిజను, తేమ వగైరాలుంటాయి కాబట్టి, రియాక్షన్ పైన వాటి ప్రభావం పడే అవకాశముంది. రియాక్షన్ కేవలం మనం పంపిన వాయువుల మధ్యనే జరగాలంటే, అందుకు రియాక్టర్లో వాతావరణం జడంగా ఉండాలి. అందుకు రియాక్టర్ని ముందు జడవాయువులతో నింపాలి. తర్వాత జడవాయు ప్రవాహాన్ని కొనసాగిస్తూనే, రియాక్షనుకి అవసరమైన వాయువుల్ని మనకి కావాల్సిన కొలతల్లో పంపాలి. వాయువుల పరిమాణాల్నీ, నిష్పత్తుల్నీ, ఒత్తిడినీ, రియాక్టర్ టెంపరేచర్నీ మార్చుకుంటూ– అత్యధికమైన కన్వర్షనుకు కావాల్సిన కండిషన్లు కనుక్కోవాలి. స్థిరమైన కన్వర్షన్ రావడానికి రియాక్షన్ని కనీసం 36 గంటల సేపు కొనసాగించాలి.

ఈ తతంగం ప్రతి శాంపిలుకీ ఉంటుంది.

మా రియాక్షనుకి జడవాయువుగా ఆర్గాన్ గ్యాస్ వాడాం. అది జడం కాబట్టి లీకయినా ప్రమాదం లేదు. నీటి ఆవిరి లీకైనా ప్రమాదం లేదు. సమస్యంతా కార్బన్ మోనాక్సయిడ్ తోటే. అది విషవాయువు.

లీక్ విషయం అలాగుంచితే– రియాక్టర్లో ఒత్తిడిని మార్చడం మరో పెద్ద సమస్య. ఆ మార్పు స్టీమ్ జనరేటర్ నుంచి పంపే నీటి ఆవిరి ప్రవాహగతిపై ఆధారపడి ఉంటుంది. ఆ ప్రవాహగతిని శాసించేది, డోసియర్ పంపు ద్వారా స్టీమ్ జనరేటర్లోకి పంపే నీటి ప్రవాహగతి. ఆ గతిలో చిన్న మార్పు చాలు– ఒత్తిడిని ఎన్నో రెట్లు పెంచడానికి.

పుస్తకాల్లో చదివి జీర్ణించుకున్న విశేషాలే ఐనా– వాస్తవంలో, అందులోనూ ఆదిలో– ఇవన్నీ కత్తిమీద సామే!

అంతవరకూ నేను గాస్ సిలిండర్లతో కానీ, హై ప్రెషర్ రియాక్టర్లతో కానీ పనిచెయ్యలేదు.

చిన్నప్పుడు సోడా కొట్లలో గాస్ పట్టే తతంగం చూసి, అమ్మో అనుకునేవాణ్ణి. ఒత్తిడి ఎక్కువై మెషీన్ పేలిన వార్తలు విని బెదిరిపోయేవాణ్ణి. ఇంతా చేసి ఆ ఒత్తిడి రెండు అట్మాస్ఫియర్లే!

ఇక ఇంట్లో వాడే ప్రెషర్ కుక్కర్ని నేనెప్పుడూ గృహసాధనంగానే తప్ప రియాక్టరుగా గుర్తించలేదు.

బెర్లిన్లో మా లేబరీటరీలో– సిలిండర్లు, రియాక్టర్లతో పని చేస్తున్న చాలామందిని గమనించాను. వాటితో వ్యవహరించడాన్ని చాలా లైటుగా కూడా తీసుకున్నాను. ఇప్పుడూ తీసుకునేవాణ్ణి నాదాకా రాకపోతే!

నా టెస్టింగ్ ప్రక్రియకు అలవాటు పడ్డంకోసం ముందు కొన్ని డమ్మీ రన్స్ చేశాను. ఆ పాట్లు, వివరాలు అప్రస్తుతం.

నాలుగు రోజుల్లో కొంచెమేమిటి, బాగా ధైర్యం వచ్చింది. "ఓస్, ఇంతేనా?" అని కూడా అనిపించింది.

జర్మనీలో ప్రసిద్ధి చెందిన గిర్డ్‌లర్ కంపెనీ కెటలిస్టుల్ని పరిశ్రమల్లో ఈ రియాక్షనుకి వాడతారు. నేను వాటి శాంపిల్సు ముందుగానే తెప్పించి ఉంచుకున్నాను.

నేను తయారు చేసిన కెటలిస్టులతో పోల్చడానికి ముందు– రియాక్టర్లో పారిశ్రామికంగా ఉపయోగిస్తున్న ఆ శాంపిల్సు వాడి చూడాలి. మా కెటలిస్టులు వాటిలో మూడింట రెండొంతుల ప్రభావం చూపినా ఎంతో కొంత సాధించినట్లే అనుకోవచ్చు.

గిర్డ్‌లర్ కంపెనీ కెటలిస్టులతో ట్రయల్ రన్సు బాగా జరిగాయి. కన్వర్షన్ 40 శాతానికి అటూ ఇటూగా వచ్చింది. రాలెక్ కూడా ఎంతో సంతోషించాడు– రియాక్టర్ బాగా పని చేస్తోందని.

ఇక నా కెటలిస్టులతో టెస్టింగు మొదలెడితే– అప్పుడు జరిగింది అద్భుతం.

అది అహమ్మద్ సంకల్పబలమో, తథాస్తు దేవతల దీవెనో– మా కెటలిస్టు 98–99 శాతం కన్వర్షన్ ఇచ్చింది.

నా సంతోషానికి మేర లేదనుకుంటే– నన్ను మించిన సంతోషం అహమ్మద్‌ది.

ప్రయోగాలు నేనొక్కణ్ణే చేసుకుంటున్నా– అతడు రోజులో కనీసం ఐదారుసార్లు నన్ను కలిసి రియాక్షన్ యోగక్షేమాలు విచారించేవాడు. కన్వర్షన్ ఇంత బాగా వచ్చిందని తెలియగానే, అతడు లేబరేటరీ అంతా టాం టాం వేసేశాడు.

వార్త కార్చిచ్చులా పాకింది. చాలామంది కొలీగ్సు వచ్చి నన్ను అభినందించి వెళ్లసాగారు.

ఇది నాకు ఇబ్బందిగా అనిపించింది. ఏదైనా నిలకడమీద సాధించడం నాకిష్టం.

పరిశ్రమలను నడిపిస్తూ ప్రపంచప్రఖ్యాతి కాంచింది గిర్డ్‌లర్ కెటలిస్టు. అందుకు ఆ కంపెనీ ఎన్నో ట్రయల్సు– అదీ భారీ ఎత్తున చేసి ఉంటుంది. ఒక చిన్న లేబరేటరీలో ఓ చిన్న రియాక్టర్లో చిన్న ప్రయోగం చేసి– నా కెటలిస్టు అంతకంటే గొప్పదని ఎలా అనుకుంటాను?

సైన్సులో ఇలా డిగ్రీ తెచ్చుకుని అలా నోబెల్ ప్రైజు సాధించడం సాధ్యమా? ఆ వెనుక ఎంత కృషి ఉండాలి?

వార్త రాలెక్‌కి తెలిసి పరుగున నా వద్దకొచ్చాడు. ఫలితాల్ని ఒకటికి రెండుమార్లు పరీక్షించాడు. వాటిని గిర్డ్‌లర్ కెటలిస్టు ఫలితాలతో సరిపోల్చాడు.

"ఇది నేనూహించలేదు. నిజంగానే మన కెటలిస్టు అద్భుతం" అన్నాడు.

కానీ ఆ పొగడ్తకు తగ్గ భావం ఆయన కళ్లలో కనబడలేదు. గొంతులో వినబడలేదు.

'ఒక సామాన్య భారత శాస్త్రజ్ఞుడు, అంతంతమాత్రం పరిజ్ఞానంతో– సాంకేతికంగా, వైజ్ఞానికంగా అత్యున్నత స్థానంలో ఉన్న విదేశీ (ఆయనకు స్వదేశీ) కెటలిస్టుని మించిపోవడమా?' అన్న అసంతృప్తి ఆయన మొహంలో కనబడింది.

కలిసి పని చేస్తున్నాం కాబట్టి, మర్యాదకు 'మన' అన్నప్పటికీ, ఆయన నా శాంపిల్సుని ఇండియన్ ప్రోడక్ట్సుగానే భావిస్తాడని తెలుసు నాకు. ఐనా ఆయన పొగడ్త నాకు కొంత సంతోషాన్నిచ్చింది.

"అద్భుతమన్నది చాలా పెద్ద మాట! ఫలితాలు బాగున్నాయి కాబట్టి కొంచెం ఉత్సాహంగా ముందుకెళ్లొచ్చు. అంతే!" అన్నాను.

అప్పుడు రాలెక్ మొహంలో కొంచెం సంతృప్తి కనబడింది, "అది నిజమే కానీ, కన్వర్షన్లో మన కెటలిస్టు గిర్డ్‌లర్‌ని మించిపోవడం నిజం. ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటి?" అన్నాడు.

"ఒకేఒక్క ప్రయోగంతో నేనే నిర్ణయానికీ రాలేను. అదీకాక, గిర్డ్‌లర్‌ది ఇండస్ట్రియల్ కండిషన్లలో టన్నుల్లో వాడినప్పుడు నిరూపితమైన ప్రోడక్టు. మన కెటలిస్టు లేబరేటరీ కండిషన్లో, మిల్లీగ్రాముల్లో వాడగా వచ్చిన ఫలితాలివి. రెంటినీ ఎలా పోల్చగలం?" అన్నాను.

రాలెక్ మరికొంచెం తృప్తి పడ్డాడు. కానీ అదే లేబరేటరీ కండిషన్లో గిర్డ్‌లర్ కెటలిస్ట్ ఇచ్చిన ఫలితాలు గొప్పగా లేవన్న విషయం ఆయన బుర్రను దొలిచేస్తోందని ఊహించగలను. ఎందుకంటే అదే నా బుర్రనూ దొలిచేస్తోంది.

"ఇప్పుడేం చేద్దామానుకుంటున్నావ్?" అన్నాడు రాలెక్.

అదాయన పద్ధతి. తన బుర్రలో ఏదో ఉంటుంది. చెప్పడు. నన్నే అడుగుతాడు. తన బుర్రలో ఏముందో అదే నేనూ చెప్పేదాకా, ఏమేమో సందేహాలు వెలిబుచ్చుతూనే ఉంటాడు. తననుకున్న సమాధానం వచ్చేక సరేననడమే కాదు, నా విచక్షణని ప్రశంసిస్తాడు కూడా.

గురువులకు ఇది అనుసరించతగ్గ మంచి పద్ధతి. ఆలోచనలో శిష్యుణ్ణి గురువు స్థాయికి తీసుకుపోయి, శిష్యుడిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు సహకరించే చక్కని పద్ధతి.

అప్పటికి ఆయనతో చాలా నెలలు వ్యవహరించి ఉన్న నాకు ఆయన మనసులో ఏముందో తెలియదా?

"నేను నా పద్ధతిలో చేసినవి ఇలాంటివి మొత్తం ఏడు రకాల కెటలిస్టు శాంపిల్స్ ఉన్నాయి. ఒకటిప్పుడు టెస్టు చేశాం. మిగతావీ టెస్టు చేద్దాం. ఈ కెటలిస్టు తయారీకి పుస్తకాల్లో ఇచ్చిన రొటీన్ పద్ధతిలో చేసినదీ ఓ శాంపిల్ ఉంది. దాన్నీ టెస్టు చేద్దాం" అన్నాను.

అనుకున్నట్లే రాలెక్ దాన్ని వెంటనే ఓకే చేశాడు.

నా ట్రయల్సు మొదలయ్యాయి. నేను చేసిన శాంపిల్సన్నీ కూడా 98–99 కన్వర్షన్ ఇచ్చాయి.

అంతవరకూ బాగానే ఉంది. పుస్తకాల్లో ఇచ్చిన రొటీన్ పద్ధతిలో చేసిన శాంపిల్ కూడా అదే ఫలితాన్నిచ్చింది.

అంతే! ఒక్కసారిగా నా ఉత్సాహం మీద నీళ్లు చల్లినట్లయింది. ఇది నేనూహించలేదు.

రాలెక్ మాత్రం, "ఇలా జరుగుతుందని ఊహించాను. నువ్వూ ఊహించి ఉంటావనే నా నమ్మకం. అందుకే అప్పుడు ఇండస్ట్రియల్, లేబరేటరీ కండిషన్ల గురించి మాట్లాడావు. యు ఆర్ టూ మెట్యూర్డ్" అన్నాడు.

నాలో మళ్లీ ఉత్సాహం. "అన్ని శాంపిల్సూ ఒకే ఫలితాన్నిచ్చినా మన పరిశోధనకో ప్లస్ పాయింటుంది. రొటీన్ పద్ధతిలో తయారు చేసిన పది గ్రాముల శాంపిల్ని వడబోసి నీటితో కడగడానికి 24 గంటలకు పైగా పట్టింది. మన శాంపిల్సు వడబోతకి పావుగంట కంటే ఎక్కువ పట్టదు. అందువల్ల ఇండస్ట్రియల్ లెవెల్లో ఎంత సమయం, వ్యయం కలిసొస్తుందో వేరే చెప్పాలా?" అన్నాను.

రాలెక్ వెంటనే, "ప్లస్ పాయింటదొక్కటే కాదు. లేబరేటరీ కండిషన్లో మన శాంపిల్సు గిర్డ్‌లర్‌ని మించిపోయాయి" అన్నాడుత్సాహంగా.

నేను నవ్వి, "అది భ్రమ అని నీకెప్పుడో తెలిసుంటుంది. నాకూ తర్వాత అర్థమయింది" అన్నాను.

"ఏమర్థమయింది?" అన్నాడు రాలెక్ కుతూహలంగా.

"ఆ కెటలిస్ట్ శాంపిల్ మనం మార్కెట్లో కొన్నాం. అది బిళ్లల రూపంలో ఉంది. తయారనప్పుడు శాంపిల్ పొడరులా ఉంటుంది కదా! బిళ్లలుగా మార్చడానికి దానికి ఏదో బైండర్ కలపాలి. టాబ్లెట్ మెషీన్లో ప్రెస్ చెయ్యాలి. ఈ మార్పుల వల్ల దాని కన్వర్షన్ శక్తి తగ్గడం సహజం. కానీ పరిశ్రమల్లో బిళ్లలే తప్ప పొడర్లు వాడడానికి వీలు కాదు కదా!" అన్నాను.

రాలెక్ మొహం వెలిగింది, "ఏదో కారణముండాలనుకున్నాను కానీ, ఎందుకో నాకిది స్ఫురించలేదు. మరి మన రియాక్టర్లో పొడర్లనే వాడుతున్నాం" అని, "అన్నట్లు కంపెనీ శాంపిల్ని పొడరు చేసేకే కదా వాడాం. ఐనా కూడా....." అన్నాడు సాలోచనగా.

ఏవేవో కలిపి, దానిపై ఒత్తిడి తెచ్చి బిళ్లగా చేసేక దాన్ని నూరితే వచ్చిన పొడరు శాంపిలుకీ, తయారీలోనే పొడరుగా వచ్చిన శాంపిలుకీ ఉండే తేడా ఒకోసారి హస్తిమశకాంతరం కావచ్చని నాచేత చెప్పించాలని ఆయన ఉద్దేశ్యమయుండొచ్చు. అది నెరవేర్చాను.

రాలెక్ మరింత తృప్తిపడి, "ఏదేమైనా ఈ పరిశోధన సత్ఫలితాలు ఇచ్చినట్లే అనుకోవాలి. పేటెంటుకి అవకాశముందని కూడా అనిపిస్తోంది. అందుకు మనం చాలా లోతుగా స్టడీస్ కొనసాగించాల్సి ఉంటుంది. వివిధ కండిషన్లలో స్టడీ చెయ్యాలంటే ఒకో శాంపిలుకీ 2–3 రోజులు పడుతుంది. అది నీ ఒక్కడివల్లా అవదు" అన్నాడు.

అలా లూయీజీ నావద్ద చేరాడు. ఐతే ఇక్కడో చిన్న అపార్థం వచ్చింది.

శాంపిల్స్ సిద్ధం. రియాక్టరు సిస్టమ్ సిద్ధం. టెస్టింగ్ ప్రొసీజర్ సిద్ధం.

తన ప్రాజెక్ట్ పని నల్లేరుపై బండి నడక అని లూయీజీ అనుకున్నాడు. కానీ పని మొదలైన నెల రోజుల్లోనే అతడి కలలు కల్లలయ్యాయి.

ఒత్తిడి పెంచినప్పుడల్లా రియాక్టర్ లీకయ్యేది. నట్లూ, స్క్రూలూ బిగించడానికి భుజబలం ఎక్కువ అవసరపడేది. నేనూ, లూయీజీ ఎయిర్ కండిషన్డ్ వాతావరణంలో కూడా– గనిలో, వనిలో, కార్ఖానాలో పని చేసే శ్రామికుడిలా చెమటలు కక్కేవాళ్లం.

మధ్యలో గాస్ క్రోమటోగ్రాఫ్ ట్రబులిచ్చేది. డోసియర్ పంపు ట్రబులిచ్చేది. ఆదిలో అలాంటి సమస్యల్ని పరిష్కరించడానికి బాగా ఎక్కువ సమయం పట్టేది.

మొత్తంమీద ఒకో శాంపిల్ మీద స్టడీస్ పూర్తి చెయ్యడానికి ఒకోసారి పది రోజులు పట్టేది.

"ఇలాగైతే ఈ స్టడీస్ ఎప్పటికి పూర్తి కాను?" అన్నది లూయీజీ బెంగ.

మరో సమస్య ఏమిటంటే–

రియాక్షన్ మొదలయ్యేక సిస్టమ్ ఆపడానికి లేదు. సుమారు 250–400 డిగ్రీల సెల్సీయస్ టెంపరేచర్లో, 1–20 అట్మాస్ఫియర్ల ఒత్తిడిలో, ఆగకుండా పనిచేసే స్టీమ్ జనరేటర్, ఓపెన్ అయి ఉన్న గ్యాస్ సిలిండర్లు– వీటిని వాటి మానాన వదిలి వెళ్లడానికి లేదు కదా! ఎవరో ఒకరు దగ్గరుండాలి. పగలు ఫరవాలేదు. పనివేళలు, లంచి టైములు మార్చుకోవచ్చు. అదీకాక లేబరేటరీలో ఎవరో ఒకరుంటారు. మరి రాత్రి....?

"ఒక రాత్రి నువ్వు, ఒక రాత్రి నేను వంతులవారీగా సిస్టమ్‌కి కాపలా కాద్దాం" అని లూయీజీకి చెప్పాను.

లూయీజీ నొచ్చుకుని, "నువ్వొద్దులే, రాత్రిళ్లు నేనుంటాను" అన్నాడు. ఎంత నొక్కించినా వినలేదు. ఐనా నాకే అది అమానుష మనిపించింది. అందుకని రాలెక్ చేత చెప్పించాలనుకున్నాను.

రాలెక్ నేను చెప్పింది విని ఆశ్చర్యపడ్డాడు. అందుకు ఒకటి కంటే ఎక్కువ కారణాలే ఉన్నాయి.

"ఇది నీ పీహెచ్‌డి స్టడీ కాదు. డాక్టర్స్కాలర్సుగా వచ్చి సత్ఫలితాలు సాధించినవాళ్లున్నారు కానీ, ఇలా రాత్రింబవళ్లు కష్టపడడం నమ్మలేకుండా ఉన్నాను" అన్నది మొదటి కారణం.

"లూయీజీ నావద్ద చేరి కొన్ని నెలలయింది. ప్రాజెక్ట్ పూర్తి చెయ్యడానికి మామూలుగా రెండేళ్లు. కనీసం ఏడాది పడుతుంది. అందుకు శ్రమ పడక తప్పదు. అతడికోసం నువ్వెందుకు శ్రమపడాలి?" అన్నది రెండో కారణం.

"కంటిన్యుయస్ రియాక్షన్లకోసం లేబరేటరీలో మెయింటెనెన్స్ స్టాఫ్ ఉన్నారు. వాళ్లకి అప్పజెబితే దగ్గరుండి చూసుకోవడమేకాక, ఆ సమయంలో అవసరమైతే రీడింగ్సు కూడా తీసుకుంటారు. మీరొచ్చి ఇక్కడ రాత్రిళ్లు ఉండడమెందుకు?" అన్నది మూడో కారణం.

రాత్రిళ్లు లేబరేటరీలో పడుకునే సమస్యకు అలా పరిష్కారం లభించింది. ఐనా రియాక్షన్ గతిని బట్టి- రాత్రిళ్లు అక్కడుండిపోవాల్సిన అగత్యం అప్పుడప్పుడు కలిగేది. అలాంటప్పుడు లూయీజీ అక్కడుండిపోయేవాడు.

లూయీజీ రాత్రిళ్లు లేబరేటరీలో ఉండాల్సొచ్చినప్పుడు, సాయంత్రం ఐదుకి బదులు 3-4 గంటల మధ్యలో ఇంటికెళ్లిపోయేవాడు. రాత్రి తొమ్మిది దాటేక భార్యా సమేతంగా లేబరేటరీకి వచ్చేవాడు. పడుకుందుకు అక్కడ ఏర్పాటుండేది.

అలాంటి రోజుల్లో నేను సాయంత్రం ఐదుకి ఇంటికెళ్లకుండా లేబరేటరీలో రియాక్టరుకి కాపలాగా ఉండిపోయేవాణ్ణి. శ్రీమతి నాకోసం ఫలహారం పాక్ చేసి, పిల్లల్ని తీసుకుని 7-8 మధ్యలో అక్కడికొచ్చేది.

పెళ్లయినప్పట్నించీ నేనూ, తనూ వేరే వేరే ఊళ్లలో ఉన్నప్పుడు తప్ప- విడిగా భోంచేసిన సందర్భాలు తక్కువ. ఇప్పుడు ఒక్కణ్ణే తినడం వెలితిగా అనిపించి, తనని కూడా లేబరేటరీకి ఫలహారం తెచ్చుకోమని చెప్పాను మొదటి రోజున.

"ఆమాత్రం నాకు తోచకపోలేదు. కానీ పిల్లలు కూడా మనతోపాటు తామూ లేబరేటరీలోనే తింటామంటున్నారు. అక్కడ మిమ్మల్ని తప్ప బయటివాళ్లని తిననివ్వరని చెప్పాను" అని వెంటనే సంజాయిషీ ఇచ్చింది శ్రీమతి.

"అవున్లే, జాతకాల్ని తీసిపారేస్తాం కానీ, మనకేం జరగాలో అన్నీ వాటిలోనే రాసిపెట్టుంటాయని ఇప్పుడనిపిస్తోంది" అని నిట్టూర్చాను.

"ఉన్నట్లుండి జాతకాల ప్రసక్తి తెచ్చారేం?" అంది శ్రీమతి అశ్చర్యంగా.

"నీకు ఓ రైతుతో పెళ్లవుతుందనీ, పల్లెటూరి జీవితం గడుపుతావనీ, గంపెడు పిల్లలుంటారనీ- నీ జాతకంలో ఉండేదిగా" అన్నాను.

"ఐతే?!"

"ఈ లేబరేటరీ ఓ పొలం. నేనో రైతుని. నాకు భోజనం తెచ్చే రైతు భార్యవి నువ్వు" అన్నాను.

ఈ మాట నేననడం మొదటిసారి కాదు.

విశాఖపట్నంలో ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేస్తున్నప్పుడు కూడా నేను లేబరేటరీలో ఉండిపోతే తను నాకోసం కేరియర్ తెచ్చేది. రాత్రి పదింటికి కలిసి ఇంటికొచ్చేవాళ్లం. అప్పుడనేవాణ్ణి ఈ మాట.

శ్రీమతికి అది గుర్తొచ్చినట్లుంది, "అవున్లెండి. ఇంట్లోనే కూర్చునేవాళ్లకి- బెర్లిన్లో ఉంటేనేం, స్వంతూర్లో ఉంటేనేం- రెండూ ఒకటేగా! అంచేత నాది పల్లెటూరి జీవితమే! ఇక పిల్లలంటారా, వీళ్లిద్దరూ గంపెడుమంది పెట్టు" అని నవ్వేసింది.

కొరివితో తల గోక్కోవడమంటే ఇదే!

జర్మనీ వచ్చేక మేము బెర్లిన్ తప్ప మరో ఊరు చూడలేదు. బహుశా చూడమేమో కూడా!

శ్రీమతి నన్ను దెప్పుతోందనుకోవచ్చు. కానీ ఇలాంటివి తీగ తెగేదాకా లాగే అలవాటు మాకు లేదు. లూయీజీ వచ్చేదాకా మేమక్కడ సరదాగా కబుర్లు చెప్పుకునేవాళ్లం.

బాబుకి పెద్దగా తెలియకపోయినా, పాప లేబరేటరీ వాతావరణాన్ని చూసి, కుతూహలంతో చాలా ప్రశ్నలు వేసేది.

పాపని అప్పుడే సైన్సు నాలెడ్జిలో ముంచెత్తెయ్యాలన్న కోరిక నాకు లేదు. అందుకని కథలు చెప్పేవాణ్ణి.

ఇలా కథలు చెప్పడం నాకు పుట్టుకతో వచ్చింది. మచ్చుకి–

భువనేశ్వర్లో ఉద్యోగంలో జాయినవడానికి సతీ సమేతంగా మెయిల్లో వెడుతున్నప్పుడు– శ్రీకాకుళం దాటేక వచ్చిన సుమ్మాదేవి అనే ఊరి పేరు చూసి, "ఊరికి ఇలాంటి పేరెక్కడా వినలేదు" అని శ్రీమతి ఆశ్చర్యపడింది.

అప్పుడామెకు పదహారేళ్లు. చేసిన రైలు ప్రయాణాలే వేళ్లమీద లెక్కెట్టొచ్చు. తెలిసిన ఊళ్లూ తక్కువే.

"నీకు కాశీమజిలీ కథలు తెలుసుగా! అందులో ఓ సిద్ధుడు కాశీకి వెడుతూ, తోడుగా గోపన్న అనేవాణ్ణి తీసుకెడతాడు. ఆ గోపన్నకి ఎక్కడైనా కొత్తగా ఏమన్నా కనబడితే అడుగు ముందుకి పడేది కాదు. సిద్ధుడివద్ద ఏ విశేషానికి సంబంధించిన కథనైనా తెలుసుకునే మహిమ ఉన్న మణి ఒకటుంది. దాని సాయంతో ఆయన ఆ కథ తెలుసుకుని వాడికి చెప్పేవాడు. మీ నాన్నగారు పెళ్లికి పెట్టిన ఉంగరముందే, దానికి నేను వేయించిన రాయి అలాంటి మణే. దాని సాయంతో సుమ్మాదేవి కథ చెప్పనా?" అనడిగాను శ్రీమతిని.

తను చెప్పమంది. నేను చెప్పాను.

అదక్కడితో ఆగలేదు. తర్వాతనుంచి ఆమె వచ్చే ప్రతి ఊరి వెనుకా కథా అడగసాగింది.

అవధానికి అప్రస్తుత ప్రసంగంలా నాకది సవాలయింది. ఐతే నేను కథ చెప్పగానే అభినందనపూర్వకంగా, ముచ్చటగా చూసే ఆమె చూపు– సామాన్య వానరంలాంటి నా ఊహాశక్తిని, హనుమంతుడి పరిమాణానికి పెంచేసేది.

దాంపత్యపు తొలిరోజుల్లో మరపురాని మధుర ఘట్టాల్లో ఆ రైలు ప్రయాణమొకటి.

ఇప్పుడు సంసార సాగరయానంలో– పిల్లలతో మధుర ఘట్టాలు నడుస్తున్నాయి.

అప్పుడు శ్రీమతి– ఇప్పుకు కొమరిత.

రియాక్టర్ని మాంత్రికుడి గుహగా మార్చేశాను. కొంచెం సైన్సు, కొంచెం మంత్రం, కొంచెం సాహసం, కొంచెం చమత్కారం– ఇవన్నీ కలిసి ఓ పెద్ద కథ తయారైంది.

పాప పెద్ద పెద్ద కళ్లు చేసుకుని ఎంతో కుతూహలంగా వింది. కథ మొదలైన కొద్ది క్షణాల్లోనే బాబు కూడా శ్రోతగా మారిపోయి బుద్ధిగా విన్నాడు. ఆశ్చర్యమేమంటే శ్రీమతి కూడా ఆ సమయంలో వాళ్లలో తనూ ఒకతె అయింది.

కథ పూర్తయ్యేక పాప చాలా ఆనందపడింది. నా కెటలిటిక్ రియాక్టరు దానికిప్పుడు ఓ జానపక కథకు స్థావరంలా, చిత్ర విచిత్రాల సమ్మేళనంగా అనిపిస్తోంది.

కథ ఐపోవడం బాబుకి అంత తృప్తిగా ఉన్నట్లు లేదు. వాడు పాపని గోకి,

"అక్కా! ఇంకేమైనా అడుగు. నాన్నగారు ఇంకో కథ చెబుతారు" అన్నాడు వాడి యాస తెలుగులో.

తనూ అడగొచ్చని వాడికి స్ఫురించినట్లు లేదు. అదీకాక ఆ వయసులో తమ్ముడికి అక్కమీద ఉండే ఆరాధనాభావమొకటి!

అంతలో లూయీజీ సతీ సమేతంగా వచ్చాడు. పరస్పరం పలకరింపులు. మర్యాదకి కుశల ప్రశ్నలు.

వాళ్లకీ మాకూ కామన్ టాపిక్సేముంటాయ్– పది నిముషాల్లో మేం 'వీడర్ జెహెన్ చెప్పి అక్కణ్ణించి బయల్దేరాం.

నడుచుకుంటూ హాల్లో మెట్ల దగ్గరికి రాగానే పాప అడిగింది, "రాలెక్ అంకుల్ లేరా?" అని.

దానికి రాలెక్‌తో చిన్న పరిచయముంది.

ఒకరోజు సాయంత్రం అప్పటికప్పుడు బయటికి వెళ్లే ప్రోగ్రాం అనుకుంది శ్రీమతి. అందుకని పిల్లల్ని తీసుకుని ఐదు కాకుండా లేబరేటరీకి వచ్చేసింది.

అప్పుడు నేను రాలెక్‌తో మట్లాడుతున్నాను. ఆయన మావాళ్లని చూసి విష్ చేసి శ్రీమతికి షేక్‌హాండిచ్చాడు. అది చూసి పాప కూడా చెయ్యి సాచింది.

ఆరడుగులకి చాలా ఎక్కువే ఉండే అంతెత్తు మనిషి రాలెక్. నేనే ఆయనముందు పిట్టలా ఉంటాను. ఇక పాప సంగతి చెప్పాలా?

ఆయన ముచ్చటగా పాపని చూసి, తన చూపుడు వేలుని ముందుకి సాచాడు. పాప తన చిట్టి చేతులతో ఆ వేలిని పట్టుకుంది.

ఆ హాండ్–ఫింగర్ షేక్ పాపకి కొత్తగా, వింతగానే కాదు, వినోదంగానూ అనిపించింది. ఇంటికొచ్చి ఆ సన్నివేశాన్ని తల్చుకుని తల్చుకుని నవ్వింది. మరోసారి రాలెక్‌నుంచి అలాంటి షేక్‌హాండ్ పొందాలనుంది దానికి.

"లేరమ్మా!" అని ఏదో చెప్పబోగా, "ఇప్పుడింకో కథ మొదలెట్టకండి. ఇంకేమైనా కబుర్లు చెప్పుకుందాం" అంది శ్రీమతి.

"కథ ఉంటే చెప్పాలిగా మరి" అన్నాను. ఇంతకీ నాకప్పుడు కథ చెప్పే ఉద్దేశ్యం లేదు.

"అసలే మన పాపకి గుర్తెక్కువ. పెద్దయ్యేక ఎవరైనా అడిగితే, 'చిన్నప్పుడు జర్మనీలో ఉండేవాళ్లం. మా నాన్నగారు లేబరీటరీలో మాకు కథలు చెప్పేవారు' అనగలదు జాగ్రత్త!" అని హెచ్చరించింది.

"పాయింటే" అనుకున్నాను.

నలుగురం భవనంలోంచి రోడ్డుమీదకి వచ్చాం.

అప్పటికి సమయం పది కావస్తోంది.

ఆ సమయంలో ఆ ఏరియాలో నడవడం కొత్త మాకు.

ఎర్న్స్ట్‌రాయిటర్ ప్లాట్జ్ దాకా నడిస్తే అక్కడ ఊబాన్ దొరుకుతుంది. తదుపరి స్టేషన్ డాయిచే ఓపర్‌లోనే మేం దిగాలి.

కానీ ఆ సమయంలో ఊబాన్ ఎక్కడం ఇష్టం లేదు. ఎందుకంటే పిల్లలతో నడిచినా మాకు కలిసొచ్చే సమయం పది నిముషాల లోపే!

మా పిల్లలు చక్కగా నడుస్తారు. నడవడానికి ఇష్టపడతారు కూడా.

ఆ రోజు నడుస్తూ మేమో చిత్రం చూశాం.

రోడ్లకి పక్కన ఫుట్‌పాత్ లుంటాయిగా– అవి చాలా విశాలంగా ఉంటాయి. వాటి పొడుగునా రంగురంగుల పూలు పూసే సీజనల్ మొక్కలుంటాయి. వాటిని దాటుకుంటూ నడవడమే ఆహ్లాదకరమైన అనుభవం.

అప్పుడు జరుగుతున్నదేమంటే– కొంతమంది తోటమాలులు– పూలమొక్కల్ని మార్చేస్తున్నారు. మొక్కలతోపాటు అవి పూసిన పూల రంగులూ మారిపోతున్నాయి. అంటే తరచుగా ఫుట్‌పాత్‌మీద ఉండే పూలమొక్కల్ని ఇలా రాత్రిపూట మార్చేస్తుంటారన్న మాట!

నిత్యావసరమైన బాటల్నీ, ఆ బాటలపక్కన ఉండే మురుగుకాల్వల్నీ– మరమ్మతులొచ్చినా వాటి మానానికొదిలేసి– ఖర్మం చాలక వాటికి మరమ్మతు చేస్తే– ఘనకార్యం చేసినట్లు ఫీలయ్యే మన మునిసిపాలిటీలెక్కడ?

తమ నగరాన్ని నిత్యనూతనంగా తీర్చి దిద్దాలన్న తపనతో, రాత్రికి రాత్రి కొత్త పూలమొక్కల్ని నాటే ఈ భావన ఎక్కడ?

మన సంస్కృతి, సంప్రదాయాల్ని ఘనమైనవిగా పదే పదే వల్లించే మనలో ఎక్కడో ఏదో లోపముందనిపించదూ!

పేదరికం, అధిక జనాభా– అన్నవి కుంటిసాకులు. మన ధ్యేయం, దృక్పథం– వీటిని సమీక్షించుకోవాలి!

మేమా మనోహర దృశ్యాన్ని చూసి పరవశిస్తూ– నెమ్మదిగా ఇల్లు చేరుకున్నాం.

పిల్లలు వెంటనే పడుకున్నారు కానీ– మాకు వెంటనే నిద్ర పట్టలేదు.

అవీ ఇవీ మాట్లాడుకొనడంలో లూయీజీ ప్రసక్తి వచ్చింది. యథాలాపంగా రీసెర్చి వర్కు విషయంలో అతడికి కలిగిన ఆశాభంగం గురించి చెప్పి జాలి పడ్డాను.

శ్రీమతి జాలి పడలేదు. అప్పుడామె అన్న మాటలు– నేనూహించనివి.....

నేనూ నా కెటలిస్టులూ

"రాకరాక జర్మనీ వచ్చాం. మనకి మళ్లీ ఇలాంటవకాశం వస్తుందో రాదో తెలియదు. మీరేమో, వచ్చినప్పట్నించీ ఊళ్లోనే అక్కడక్కడ తిప్పి కాలం గడిపేస్తున్నారు. నూతిలో కప్ప అని సామెతుంది కదా! అలా మేము విదేశ సందర్శనానికి సంబంధించి బెర్లిన్లో కప్పలం. ఇది డబ్బుకోసం చూసే సమయం కాదు. నాకు యూరప్ చూడాలనుంది. ట్రిప్ ప్లాన్ చెయ్యండి" అంది శ్రీమతి.

నేను లూయీజీ ప్రసక్తి తెస్తే ఆమె యూరప్ ట్రిప్పు గురించి దెప్పిందని మనసులో విసుక్కున్నప్పటికీ- కొంచెం ఆలోచిస్తే ఆమె అన్న మాటలో న్యాయముందనిపించింది. డబ్బు ఎప్పుడైనా సంపాదించొచ్చు. మళ్లీ ఇలాంటవకాశం రాదు మరి!

"ఇలా ఆలోచించలేదు. డబ్బులు బాగా మిగుల్చుకోవాలన్న అశ లేకపోతే- యూరప్ ట్రిప్పు మనకి అసాధ్యమేం కాదు. ఓంప్రకాష్‌తో మాట్లాడనా?" అన్నాను.

శ్రీమతి నవ్వి, "మీరూ ఇక్కడికొచ్చి ఇంత కాలమైంది. ఇంకా అతడిమీద ఆధారమేనా? మీకై మీరుగా ఏమైనా చెయ్యండి. లేదా అతణ్ణి కాక ఇంకెవర్నయినా అడగండి. కాస్త వెరైటీగా ఉంటుంది" అంది.

"అందరికీ ఓంప్రకాష్‌లా అన్నింటా సమర్థత ఉండదు" అని నేనింకా ఏదో అనబోతుండగా...

"అన్నింటా సమర్థతా? ఒకప్పుడు తను మెహ్‌రోత్రాని చూసి నవ్వేవాడని మీరే చెప్పారు. ఇప్పుడు మెహ్‌రోత్రా అతణ్ణి అపహాస్యం చేస్తుంటే అంతటి సమర్థుడూ తెగ ఉక్రోష పడుతున్నాడుటగా" అంది శ్రీమతి.

మెహ్‌రోత్రా ఉదంతాన్ని గుర్తు చేసిన శ్రీమతి టైమింగ్ గొప్పది.

మెహ్‌రోత్రా నాకు ఓంప్రకాష్ ద్వారా పరిచయమయ్యాడు. నాకు తెలిసిన చాలామంది ఉత్తరాదివాళ్లకిలాగే- హిందీ పట్ల దురభిమానం కలవాడు. అందువల్ల ఇతర ప్రాంతీయుల్లో ఎక్కువమంది భారతీయులు అతడితో స్నేహం చేసేవారు కాదు.

ఓంప్రకాష్ మాతృభాష ఒరియా. కానీ ఇంగ్లీషు అంత ధారాళంగానూ హిందీ కూడా మాట్లాడతాడు. అందుకని ఆదిలో మెహ్‌రోత్రా అతణ్ణి బాగా అభిమానించేవాడు. ఐతే ఓప్రకాష్‌ది విశాల దృక్పథం. అతడికి భాష, ప్రాంతం వగైరాలతో నికిత్తం లేకుండా అక్కడున్న భారతీయులు చాలామందితో సత్సంబంధాలుండేవి. పైగా కలుపుగోలు మనిషి. స్నేహశీలి. చలాకీగా ఉంటాడు. అనుక్షణం తన పరిజ్ఞానాన్ని పెంచుకోవడమే అతడి లక్ష్యం. ఆ పరిజ్ఞానాన్ని నలుగురికీ ఉపయోగపడేలా వాడ్డంవల్ల చాలామందికి ఇష్టుడు. అక్కడ అతడి స్నేహంవల్ల ప్రయోజనం పొందినవాళ్లలో నేనొకణ్ణి.

ఒకరోజు మెహ్‌రోత్రా ఉత్తరాది మిత్రులతో తన గదిలో సమావేశమై ఉన్న సమయంలో- ఓంప్రకాష్ నన్నతడికి పరిచయం చేశాడు.

"రావ్ అంటే మదరాసీ. ఔనా?" అన్నాడు మెహ్‌రోత్రా. అప్పట్లో తెలుగువాళ్లని అంతా మదరాసీలు అనేవారు.

"కాదు. తెలుగువాణ్ణి. మాది ఆంధ్రప్రదేశ్" అన్నాను.

"ఏదో ఒకటిలే- దక్షిణాదివాడివి. రాష్ట్రం వదిలి ఒరిస్సా కొచ్చావు కాబట్టి, ఈపాటికి నీకు హిందీ బాగా వచ్చి ఉండాలి" అన్నాడతడు.

"నాకు హిందీ రాదు. ఇంగ్లీషొచ్చుగా. దాంతో మానేజ్ చేస్తున్నాను" అన్నాను.

మెహ్‌రోత్రా వెంటనే, "నో, డాక్టర్ రావ్! ఇంగ్లీషు మనకి పరాయి భాష. ఇప్పుడు మనమేమో పరాయి దేశానికొచ్చిన భారతీయులం. ఇక్కడ మనం కలిసినప్పుడు మన భాష కదా, మాట్లాడు కోవాలి" అన్నాడు.

నిజానికి నాకు హిందీ సినిమాల్ని అర్థం చేసుకునేటంత హిందీ వచ్చు. వ్రాయగలనుచదవగలను. అవతలివాళ్లు మాట్లాడితే అర్థం చేసుకోగలను కానీ ధారాళంగా మాట్లాడలేను.

అప్పట్లో స్కూల్ ఫైనల్ పరీక్షలో పాస్ అవాలంటే, హిందీ పరీక్ష రాయడం కంపల్సరీ. ఐతే పాసై తీరాలన్న నియమం లేదు. అందుకని కొందరు ఆన్సర్ పేపర్ మీద ప్రశ్నపత్రాన్ని ఎక్కించేసేవారు.

నేనలా కాదు. హిందీలో కూడా పాసయ్యాను. స్కూల్ ఫైనల్లో హిందీతో ప్యాసవడం, విడిగా హిందీలో మాధ్యమిక పరీక్ష ప్యాసవడం సమం కాబట్టి, నేరుగా రాష్ట్ర విశారద పరీక్ష వ్రాయడానికి అర్హత సంపాదించాను. అవసరమనిపించక రాయకపోతే అది వేరే సంగతి!

ఈ వివరాలు వినగానే మెహ్‌రోత్రా మొహం వెలిగింది, "అదీ ఇండియన్ స్పిరిట్. నీకు భాష చాలా సులభంగా వచ్చేస్తుంది. మనం కలిసినప్పుడల్లా హిందీలో మాట్లాడుకుందాం. తప్పులుంటే సరిచేస్తాను" అన్నాడు.

అప్పటికే జర్మనీలో జర్మన్లు, "నువ్వు జర్మన్లోనే మాట్లాడు. తప్పులుంటే సరిచేస్తాం" అని నొక్కిస్తున్నారు. అంచి స్కాలర్‌షిప్పిచ్చి, రీసెర్చి సదుపాయాలు కల్పించినందుకు- కృతజ్ఞతగా నేనా భాష నేర్చుకుంటున్నాను. పరిచయమైన ఇండియన్సంతా ఒకొక్కరుగా తమ భాష నేర్చుకోమంటే- అందుకు తగిన ఆసక్తి నాకుండాలి కదా!

నేను వెంటనే, "ఎవరికైనా మాతృభాష ఒక్కటే స్వంతం. తక్కినవన్నీ పరాయివే. పరాయి భాష నేర్చుకోవాలంటే అందుకు ఆసక్తి ఐనా ఉండాలి. లేదా ప్రయోజనముండాలి. నాకు సంగీత సాహిత్యాలపట్ల ఉండే ఆసక్తి భాషల పట్లలేదు. ఇక్కడికొచ్చి జర్మన్ నేర్చుకున్నా అది తప్పనిసరయిందంతే!" అన్నాను.

మెహ్‌రోత్రా వెంటనే, "నో డాక్టర్ రావ్! మనం భారతీయులం. హిందీని పరాయి భాషలతో పోల్చకూడదు. అది మన జాతీయభాష. అది నేర్చుకోవడం తప్పనిసరి" అన్నాడు.

అతడలా నొక్కించడం నాకు నచ్చలేదు. "నాకు తెలిసి మనం మాట్లాడే హిందీనిండా ఉర్దూ పదాలే. ఉర్దూ మనకి పరాయి పాలన వల్ల పుట్టుకొచ్చిన భాష. ఇంగ్లీషునీ అలా తీసుకుని జాతీయభాషకిచ్చే గౌరవాన్ని కొనసాగించడలో తప్పేముంది?" అన్నాను.

సంభాషణ తప్పుదారిన పడుతోందని అనుమానమొచ్చిందో ఏమో, ఓంప్రకాష్ కలగజేసుకుని, "రావ్ హాజ్ ఏ పాయింట్. తను ఒరిస్సా వచ్చి ఐదేళ్లు దాటింది. హిందీ మాటటుంచు. ఒక్క ముక్క ఒరియా రాదు. అలాగే మానేజ్ చేస్తున్నాడు. లోకల్సుతో అతడికే ఇబ్బందీ లేదు. దటీజ్ ఇండియన్ స్పిరిట్" అన్నాడు.

ఆ రోజు సంభాషణ అక్కడితో ఆగిపోయింది. కానీ శ్రీమతి వచ్చేలోగా మెహ్‌రోత్రాని మరిన్నిసార్లు కలుసుకోవడం జరిగింది.

మెహ్‌రోత్రాకి నేనంటే ఇష్టమే. ఎందుకంటే నాకు 1957 తర్వాతనుంచి 1974 వరకూ వచ్చిన హిందీ సినిమాల పరిజ్ఞానం చెప్పుకోతగ్గది. అది తెలిసేక హిందీ సినిమాల గురించి నన్ను చాలా ప్రశ్నలు వేశాడు. కొన్ని తెలుసుకుందుకు. కొన్ని పరీక్షించడానికి. నా ప్రతిభమీద నమ్మకం కుదిరేక, నన్ను హిందీస్ సినిమాల ఎన్‌సైక్లోపిడియా అనేవాడతడు. కానీ అంత తెలిసి కూడా హిందీ మాట్లాడకపోవడం అతడికి అసంతృప్తిగా ఉండేది.

ఒకసారి మాటల సందర్భంలో నేనతడితో అన్నాను, "నువ్వు నన్ను మదరాసీ అన్నావు. తెలుగువాణ్ణని చెప్పేక కూడా, అంతా దక్షిణాది వాళ్లే కదా అన్నావు. దేశప్రేమికులకు భాష ఒక్కటే ముఖ్యం కాదు. దేశంలోని ఇతర ప్రాంతాల గురించి కూడా అవగాహన ముఖ్యం. ఎందుకంటే మదరాసీలంటే తమిళులు. ఆంధ్రప్రదేశ్‌లో ఉండేది తెలుగువాళ్లు. నాకు తెలిసి రెండు భాషలకూ సామ్యం లేదు"

మెహ్‌రోత్రా ఇబ్బందిగా మొహం పెట్టి, "నాకు దక్షిణభారతం గురించి అట్టే తెలియదన్న భావం నీక్కలిగినట్లుంది...." అన్నాడు.

"అయ్యో! నా ఉద్దేశ్యమది కాదు. మాటవరసకి నీ ప్రసక్తి తెచ్చినా, నిజానికి నేను చెప్పాలనుకున్నది నా గురించి. నేను తెలుగువాణ్ణి కదా. మా ఊళ్లో తెలుగొక్కటే చలామణీలో ఉన్న భాష. అక్కడ కొందరు ముస్లిములున్నారు. వాళ్లు తమలో తాము హిందీలో మాట్లాడుకుని, బయటివాళ్లతో తెలుగులో మాట్లాడతారు. మేమంతా చక్కని సామరస్యభావంతో కలిసిమెలిసి ఉంటున్నాము. ముస్లిములు మాట్లాడేది ఉర్దూకి దగ్గరైనా, మేమది హిందీ అనే అనుకునేవాళ్లం. అందుకని హిందీ ముస్లిముల భాష అనుకునేవాళ్లం. ఎంతలా అంటే, హిందీ సినిమాల్లో హోలీ పండుగ చూపించేవారు కదా, అది ముస్లిముల పండుగ అనుకునేవాణ్ణి నేను. ఉద్యోగరీత్యా భువనేశ్వర్ వచ్చేవరకూ ఆ అభిప్రాయమే కొనసాగింది" అన్నాను.

మెహ్‌రోత్రాకోసం అలా చెప్పినా, అందులో కొంత మాత్రమే నిజం. కాలేజి రోజుల్లో హోలీ పండుగ గురించి నాకదే అభిప్రాయముండేది. కానీ నేను ఆంధ్రా యూనివర్సిటీలో రీసెర్చి చేసే సమయంలో అది మారింది.

నెహ్రూ మరణానంతరం భారత ప్రధానిగా నియమితుడైన లాల్ బహదూర్ శాస్త్రి జాతీయవాది. ఆయన ఇంగ్లీషుని పక్కకి నెట్టి- హిందీని ముఖ్య రాజ్యభాషగా మార్చబోతున్నట్లు ప్రకటించాడు. అప్పుడు తెలిసింది నాకు- హిందీని రాజ్యభాషగా ప్రకటించమని మహాత్ముడు ఎప్పుడో నిర్దేశించాడని,

లాల్ బహదూర్ ప్రకటన దక్షిణ భారతంలో చాలామందికి నచ్చలేదు. ప్రతిఘటన అలవాటు లేని ఆంధ్రప్రదేశ్ ఐతే- నోరు విప్పి ఒక్క మాట కూడా ప్రతికూలంగా అనలేదు.

కానీ తమిళనాడులో (అప్పట్లో మద్రాసు రాష్ట్రం) మాత్రం హిందీకి వ్యతిరేకంగా అతి తీవ్రమైన ప్రతిస్పందన వచ్చింది. అది బలమైన ఉద్యమంగా మారింది. మద్రాసులో హిందీ సినిమాల ప్రదర్శన ఆగిపోయింది. దుకాణాలపై హిందీ బోర్డుల్ని పీకిపారేసి మంటల్లో వేసేశారు. హిందీని బలవంతంగా తమపై రుద్దడాన్ని సహించమంటూ- తమిళ పౌరులు దేశమంతా ప్రతిధ్వనించే నినాదాలు చేశారు. అది ఏ దశకు చేరుకుందంటే, కొందరు పెట్రోలు వంటిమీద పోసుకుని అంటించుకుని చనిపోయారు. ఈ ప్రక్రియను ప్రతిఫలించే- 'సెల్ఫ్ ఇమ్మొలేషన్' అనే పదం అప్పుడే ప్రాచుర్యంలోకి వచ్చింది.

లాల్ బహదూర్ శాస్త్రి భారతీయుల ప్రియతమ నాయకుడు. దేశభవితవ్యానికే ప్రాధన్యాన్నిచ్చే ఆయనకు తాపట్టిన కుందేలుకి మూడే కాళ్లనే మొండితనం లేదు. మహాత్ముడి అడుగుజాడల్లో నడవాలని తను చేసిన ప్రకటన కొందరిలో ఇంతటి భావోద్వేగాన్ని రేకెత్తించడం ఆ మహనీయుడు తట్టుకోలేకపోయాడు. 'దేశప్రజలందరూ సన్నద్ధులై ఆమోదముద్ర వేసేదాకా- హిందీ ఇంగ్లీషు స్థానాన్ని ఆక్రమించదు' అని నిర్ద్వంద్వంగా ప్రకటించి- హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని నిలువరించాడు.

నాకు హిందీ అంటే వ్యతిరేకత లేదు. మెహ్‌రోత్రాకు వాస్తవం అర్థం కావాలనే నేను మా ఊరి ముస్లిములు, హోలీ- ప్రస్తావన తెచ్చాను.

అప్పటికి ఊరుకున్నా మెహ్‌రోత్రా నాదగ్గర హిందీ టాపిక్ వదల్లేదు. నేనంటే తనకి ఏర్పడిన ఇష్టంతో- నా భావాల్ని తనకు అనుకూలంగా మార్చడానికి ఏవేవో సంఘటనలు చెప్పేవాడు.

చివరిఒక్కసారి తప్పనిసరై నేనతడికి మద్రాసులో హిందీకి ప్రతికూలంగా వచ్చిన ఉద్యమం వివరాలు, దానికి లాల్ బహదూర్ అంతటివాడు దిగిరావడం చెప్పాను.

వెంటనే మెహ్‌రోత్రా నాకో ఆసక్తికర సంఘటన చెప్పాడు.

ఒకసారి అతడు, మరో మిత్రుడితో కలిసి ఆఫీసు టూర్‌మీద మద్రాసు వెళ్లి కంపెనీ గెస్ట్‌హౌసులో దిగేట్ట. అక్కడి పనివాళ్లు అంతా తమిళులేనట. వాళ్లకి బొత్తిగా హిందీ రాదు. వీళ్లు వాళ్లతో హిందీలోనే మాట్లాడుతూ, వాళ్లూ హిందీలో మాట్లాడాలని నొక్కించేవారుట. వీళ్లకోసం హిందీ వచ్చిన వేరే పనివాళ్లని పిలుస్తామంటే ఒప్పుకోలేదుట.

చివరికి వాళ్లమధ్య ఒక ఏర్పాటు జరిగింది.

ఆప్రకారం మెహ్‌రోత్రా నెమ్మదిగా హిందీలో మాట్లాడితే, బాయ్ ఆ మాటల్ని కాగితంమీద తమిళ అక్షరాల్లో వ్రాసుకుని, బయట హిందీ వచ్చినవాళ్లకి చూపించి అర్థమేమిటో తెలుసుకోవాలి. అలాగే తామివ్వాల్సిన జవాబులు కూడా అవతలివాళ్లనడిగి తెలుసుకుని కాగితంమీద తమిళ అక్షరాల్లో వ్రాసుకుని, వీళ్లముందు చదవాలి.

"నువ్వు నమ్మవు డాక్టర్ రావ్! మేమక్కడ రెండు వారాలున్నాం. నాలుగే నాలుగు రోజుల్లో వాళ్లకి మాతో వ్యవహరించడానికి సరిపడ హిందీ భాషా పరిజ్ఞానం వచ్చేసింది" అన్నాడు మెహ్‌రోత్రా.

"ఇందులో నువ్వు సాధించినదేమిటి?" అన్నాను చిరాకుని బయటపడనీకుండా.

"నువ్వు చెప్పావుగా, మద్రాసులో హిందీకి వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమం జరిగిందని. ఆ తర్వాతనే మేమక్కడికి వెళ్లాం. అక్కడివాళ్ల చేతనే హిందీ మాట్లాడించాలని నా పట్టుదల. సాధించాను. వాళ్లు మాతో హిందీలో మాట్లాడుతూ సలాం కొడుతుంటే- ఓహ్ అదో గొప్ప కిక్కులే. ఆ కిక్కు కోసం వాళ్లకి ఊహించినకంటే ఎక్కువమొత్తమే టిప్పుగా ఇచ్చామనుకో" అన్నాడు మెహ్‌రోత్రా.

అంటే- అవతలివాళ్ల పేదరికాన్ని ఆసరాగా తీసుకుని, నాలుగు డబ్బులిచ్చి తన సరదా తీర్చుకున్నాడన్నమాట!

మెహ్‌రోత్రా మాత్రం అలాఅనుకోవడం లేదు, "ఈ ఉద్యమాలూ అన్నీ పెద్ద ట్రాష్. తగినవిధంగా ప్రలోభపెడితే, ఎంత పెద్ద ఉద్యమనేతలూ మనం చెప్పినట్లు ఆడతారు" అన్నాడతడు.

"అది నిజమే! ఇలాంటి అభిప్రాయం చాలామందికే ఉంటుంది. నాకు తెలిసిన రంగరాజన్ కూడా ఇదే పని చేశాడు" అన్నాను.

రంగరాజన్ కథ అప్పటికప్పుడు నేను కల్పించి చెప్పలేదు. అది నాకు భువనేశ్వర్లోని ఓ ఉత్తరాది మిత్రుడు చెప్పాడు.

రంగరాజన్ తమిళుడు. భాషాభిమానమే కాదు, ఆచారవ్యవహారాల్లోనూ అతడికి పట్టింపు ఎక్కువ. అటువంటివాడు ఉద్యోగరీత్యా కొన్నాళ్లు ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఉండాల్సొచ్చింది.

రంగరాజన్ దైవభక్తుడు. మధురలో బృందావనానికి తరచుగా వెడుతుండేవాడు. కానీ సంస్కృతీ సంప్రదాయాల్లో మిగతావారితో కలిసేవాడు కాదు. ఐతే అతడు ఎవరికీ ఇబ్బంది కలిగించేవాడు కాదు. తన మానాన తను బ్రతికేవాడు. ఇతరులకు సాయం చేసే గుణం ఉండడంవల్ల ఇరుగుపొరుగులతణ్ణి అభిమానించి గౌరవించేవారు. ఎవరైనా తుంటరులు

కావాలని అతణ్ణి అపహాస్యం చేస్తే- వెంటనే హైలెవెల్లో పోలీస్ కంప్లయింట్ ఇచ్చేవాడు.
అక్కడ అతడికున్న పలుకుబడో, లేక పొరహక్కులు సధించడంలో అతడికున్న సమర్థతో చెప్పడం కష్టం కానీ- ఆ తుంటరులకి తగిన హెచ్చరికో, శిక్షో పడేది.

కేవలం రంగరాజన్‌కి తగిన పాఠం చెప్పాలనే- కొందరు తుంటరులూ, కొందరు ప్రాంతీయ దురభిమానులూ- హోలీ పండుగకోసం ఎదురు చూస్తున్నారు.

హోలీ పండుగ మన సంప్రదాయంలో ఒక విలక్షణ, విచిత్ర వేడుక. అప్పట్లో అది ఉత్తరాదికి మాత్రమే పరిమితమైంది.

హోలీనాడు మర్యాదస్థులు సాటివారిని కలుసుకుని- నుదుటికి బొట్టు పెట్టి, కొన్ని పొడి రంగులు కొద్దిగా మొహానికి పూసి, కొద్దిగా బట్టలపై చల్లి వెళ్లిపోతారు. ఐతే పండుగ వచ్చేసరికి ఉత్తప్పుడు మర్యాదస్థులైనవాళ్లల్లో కూడా చిలిపితనం పుట్టి, అల్లరిగా, చిల్లరగా ప్రవర్తించడం కద్దు. అందుకు ప్రతిఘటించకపోతే- వారిని తేలికగా వదిలిపెడతారు. ప్రతిఘటిస్తే మాత్రం- రెచ్చిపోతారు. రంగు నీళ్లతో మొదలై- మురికినీళ్లు చల్లడం, పేడ లాంటి అశుద్ధ పదార్థాలు కలిపిన నీళ్లు పొయ్యడం, ఓ పట్టాన వదలని పెయింట్లు పుయ్యడం, బట్టలు చింపెయ్యడం దాకా వెడుతుంది. కొందరైతే రంగు నీళ్ల డ్రమ్ములో ముంచి తేలుస్తారు. ఇంకా కొంతమంది నీళ్ల మడుగుల్లోకి విసిరేస్తారు. ఆ రోజు ఎవరేం చేసినా అది ప్రతిఘటించకుండా ముచ్చటపడాలని స్థానికులు అనుకుంటారు. ఇలంటి పండుగల్లో తుంటరులకి ఆకాశమే హద్దు. వాళ్లలో కొందరికి ప్రతి హోలీ పండుగకీ కొందరు లక్ష్యంగా ఉంటారు.

సత్సంప్రదాయంగా మొదలైన హోలీ వేడుక- క్రమంగా గాడి తప్పి- అవాంఛిత సంఘటనలకూ దారి తీస్తోంది. ఐనా ఆనాటి విశేషాల్ని అ నాటితోనే మర్చిపోవాలని సరిపెట్టుకునేవారున్నారు.

రంగరాజన్ అలా సరిపెట్టుకునే రకం కాదు. అతణ్ణి లక్ష్యంగా చేసుకున్నవారు వదిలే రకం కాదు..

హోలీ పండుగకు ముందే కొందరు శ్రేయోభిలాషులతణ్ణి ఆ విషయమై హెచ్చరించి, "నువ్వు ప్రతిఘటిస్తావు. అది జనాల్ని రెచ్చగొడుతుంది. పోనీ అని ప్రతిఘటించకుండా లొంగిపోయినా- కొందరు నిన్ను వదలరు. మా మాట విని- వెంటనే మీ ఊరెళ్లి- హోలీ అయ్యేక తిరిగిరావడం అన్నివిధాలా మంచిది" అని సలహా ఇచ్చారు.

రంగరాజన్ తోణకలేదు. బెణకలేదు. ఊరెళ్లను కాక వెళ్లనన్నాడు.

"ఇది ప్రజాస్వామ్యం. అంగీకారం లేకుండా తాళి కట్టిన భార్యకు దగ్గరవకూడదని శాసించే గొప్ప చట్టం మనది. అలాంటి రాజ్యాంగమున్న దేశంలో పొరుణ్ణి నేను. నా అనుమతి లేకుండా నాతో ఎవరూ హోలీ ఆడకూడదు. అది శాసన ధిక్కారం. నాకు హోలీ పండుగ నచ్చదు. ఎవరైనా బలవంతంగా ఆడితే అది అత్యాచారంతో సమానం" అని అతడు వాదించాడు. ఆ మేరకు తనను సంఘ వ్యతిరేకశక్తుల్నించి కాపాడవలసిందిగా ఆయన ముందుగానే కోర్టుని వేడుకున్నాడు,

అప్పుడు జరిగింది విచిత్రం.

పండుగ రోజు ఉదయానే స్నానం చేసి- తెల్లటి బట్టలు వేసుకుని ఇంటి బయటకు వచ్చాడు రంగరాజన్. అతడి చుట్టూ నలుగురు సాయుధ పోలీసులు ఉన్నారు. రంగరాజన్ జోలికొచ్చినవాళ్లని అరెస్టు చేస్తామని వాళ్లు చెప్పారు.

రంగరాజన్ ఇంట్లో కూర్చోలేదు. పోలీసుల సాయంతో అతడు ఊరంతా తిరిగాడు.

అంత పెద్ద నగరంలో మొత్తం పౌరులంతా రంగుల మయమై కనబడుతున్న తరుణంలో అతడొక్కడూ- తెల్లని మల్లెపూవులాంటి బట్టల్లో మెరిసిపోతూ ఊరంతా తిరిగాడు.

ఈ కథ విన్న మెహ్‌రోత్రా, "నేను నమ్మను. నా కథకు కౌంటరుగా ఈ కథ అల్లి చెప్పావు. ఔనా?" అన్నాడు.

"నువ్వు చెప్పింది కథ అని నేననుకోలేదు. నేను చెప్పింది కథ అని నువ్వూ అనకూడదు. నీది కథ ఆనుకో. దానికి కౌంటరొకటి ఉంటుందని నువ్వు గ్రహించాలి" అన్నాను.

"దానికీ దీనికీ సామ్యమెక్కడుంది? అది ఓ గెస్ట్‌హౌస్‌లో నలుగురు మనుషులమధ్య జరిగింది. ఇక్కడ ఒక నగరంలో ఒక వ్యక్తి మొత్తం నగరవాసులందరికీ విరుద్ధంగా ప్రవర్తించాడు. ఇంట్లో కూర్చుంటే సరిపోయేదానికి, ఊరంతా పర్యటించడం ద్వారా- నగరంలో అధిక సంఖ్యాకుల మనోభావాలు దెబ్బతినేలా చేశాడు. అది కూడా శాసన ధిక్కారమే!" అన్నాడు మెహ్‌రోత్రా.

"హోలీ ఆడేవారు ఆట ఆడ్డానికి బాధితుల అనుమతి తీసుకోకపోవడం శాసన ధిక్కారం కదా! ధిక్కారానికి ధిక్కారంతో బదులిచ్చాడు రంగరాజన్. అంతే!" అన్నాను.

"ఐనా దీనికీ, నా మద్రాసు గెస్ట్‌హౌస్ సంఘటనకీ సామ్యమేమిటి?" అన్నాడు మెహ్‌రోత్రా.

"చాలా సామ్యముంది. నీవద్ద డబ్బుంది. ఆ డబ్బుతో కొందరు పేదవాళ్లని అసహాయుల్ని చేసి నీక్కావాలసిన కిక్ పొందావు. ఒక మహా నగరంలో పౌరుడిగా తన రక్షణ బాధ్యతను ప్రభుత్వానికి అప్పగించి- రంగుల్లో ములిగి తేలుతున్న ఎందరో జనం మధ్య తెల్లటి బట్టల్లో మెరిసిపోతూ- చూపరులను అసహాయుల్ని చేసి కిక్ పొందాడు రంగరాజన్. మద్రాసులో నీకూ మధురలో అతడికీ కూడా సామరస్య భావం లేదు. కిక్ కావాలి. అదీ సామ్యం" అన్నాను.

మెహ్‌రోత్రాకి ఏమనాలో తెలియలేదనుకుంటాను. చెయ్యిజాపి, "ఐ గాట్ యువర్ పాయింట్" అన్నాడు ఇంగ్లీషులో.

నేనతడికి షేక్‌హాండిచ్చి, "షుక్రియా" అన్నాను హిందీలో.

ఆ తర్వాతనుంచి మేమెప్పుడూ భాషలు, ప్రాంతాల గురించి వివాదాస్పద చర్చలకు వెళ్లలేదు. అంతవరకూ మామధ్య జరిగిన సంభాషణలు- మా మధ్య స్నేహభావానికీ అడ్డు కాలేదు.

నేను ఎక్కువగా ఓంప్రకాష్‌తో తిరిగేవాణ్ణి.

నేనే కాదు, చాలామంది ఓంప్రకాష్‌తో స్నేహాన్ని ఇష్టపడేవారు. సలహాలకూ, సూచనలకూ అతణ్ణి సంప్రదించేవారు.

తనంతటివాడు తానని మెహ్‌రోత్రా అభిప్రాయం. అతడికి ఓంప్రకాష్ పాప్యులారిటీ అసూయను కలిగించేది. ఇద్దరూ కలిసినప్పుడు అతడిపై ఏదో విసురు విసిరేవాడు. ఓంప్రకాష్ తిప్పికొట్టేవాడు. మెహ్‌రోత్రా నవ్వులపాలయ్యేవాడు.

అది ఓంప్రకాష్‌లో కొంత అహంకారాన్ని పుట్టించింది. అదే అతడి కొంప ముంచింది.

మెహ్‌రోత్రా, ఓంప్రకాష్- ఇద్దరూ థీసిస్ సిద్ధం చేసుకుంటున్నారు. ఇద్దరిలో ఓంప్రకాష్‌కి అప్పటికే ఇంటర్నేషనల్ జర్నల్సులో మంచి పబ్లికేషన్సు ఉన్నాయి. మెహ్‌రోత్రా థీసిస్‌తో పోలిస్తే- తన థీసిస్‌కి విలువెక్కువన్న అతడి అభిప్రాయంతో చాలామంది ఏకీభవించేవారు.

ఇక థీసిస్ సబ్మిషన్ దగ్గరపడుతోందనగా- అప్పుడు పేలింది బాంబు.

జర్మన్ యూనివర్సిటీలో థీసిస్ సబ్మిట్ చెయ్యడానికి- జర్మన్ భాషలో ఒక స్థాయి పరీక్ష ప్యాస్ కావాల్సి ఉంది. అందుకు మినహాయింపు ఉన్నదని ఓంప్రకాష్ గట్టిగా నమ్మాడు. అతడా పరీక్ష వ్రాయలేదు. ఆ విషయమై ఎవర్నీ సంప్రదించలేదు.

మెహ్‌రోత్రాకు జర్మన్ పరీక్ష ప్యాసవడం కంపల్సరీ అని తెలుసు. అతడు కష్టపడి చదివి పరీక్ష క్లియర్ చేశాడు. థీసిస్ సబ్మిట్ చెయ్యడానికి అతడికింకే అడ్డంకీ లేదు.

ఓంప్రకాష్ థీసిస్ విషయంలో ఎంత నమ్మకంగా ఉన్నాడంటే- అతడు అప్పటికే ఓ అమెరికా యూనివర్సిటీలో అడ్మిషన్ సంపాదించాడు. థీసిస్ సబ్మిట్ చెయ్యగానే అమెరికా వెళ్లిపోవాలనుకుంటున్నాడు. ఆ విషయమై చాలామంది అతణ్ణి అభినందించారు కూడా.

ఇప్పుడు ఓంప్రకాష్ థీసిస్ వెనక్కి వెళ్లింది. అభినందించినవారు అంతా ఇప్పుడు సానుభూతి చూపిస్తున్నారు. వాళ్లలో మెహ్‌రోత్రా కూడా ఉన్నాడు.

"నా అభిప్రాయంలో ఓంప్రకాష్ సర్వజ్ఞుడు. అన్నీ తెలిసిన అతడికి ఇదీ తెలుసనుకున్నాను. లేకుంటే నాకీ విషయం మొదట్నించీ తెలుసు. నాకే తెలిసిన ఇంత చిన్న విషయం అతడికి తె;ఇయకపోదా అని ఊరుకున్నాను. లేకపోతే అడిగిమరీ చెప్పేవాణ్ణి...." అన్నాడతడు.

మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు- అన్నట్లు మెహ్‌రోత్రా అన్న ఈ మాటలకు ఓంప్రకాష్ డీలా పడిపోయాడు.

"చాలా సార్లు మా మధ్య ఈ పరీక్ష గురించిన ప్రసక్తి వచ్చింది. అది ప్యాసవాల్సిన అవసరం లేదని నేను నమ్మకంగా చెబుతుంటే, నవ్వి ఊరుకున్నాడే తప్ప మాటవరుసకి కూడా- అసలు విషయం చెప్పలేదు" అని ఓంప్రకాష్ నావద్ద వాపోయాడు.

ఒకరిది అహంకారం. ఒకరిది అసూయ. రెండూ కలిసి ఇప్పుడు ఓంప్రకాష్‌ని దెబ్బతీశాయి.

శ్రీమతి నాకిప్పుడా విషయాన్నే గుర్తు చేసింది.

"నువ్వన్నది నిజమే! ఓంప్రకాష్ ఇప్పుడున్న పరిస్థితుల్లో, మన యూరప్ ట్రిప్పు ప్రస్తావన సబబు కాదు. మరి ఈ విషయంలో నాకు సాయం చెయ్యగలవారెవ్వున్నారూ!" అన్నాను సాలోచనగా.

"ఉన్నాడుగా మీ స్టూడెంటు లూయీజీ. అతణ్ణడగండి...." అంది శ్రీమతి.

తను మా యూరప్ ట్రిప్పుకి లూయీజీ ప్రస్తావన తేవడంలోని అంతరార్థం నాకప్పుడు తెలియలేదు.....

1974-75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది - అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.
అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి
- రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి - చదవడం మొదలెడితే - ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016-2020లోనూ - 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ'. రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే' మార్చి 2018లో ముగిసింది. ఏప్రిల్ 2018నుంచి చివరి విడతలో 'మలి సందడి' అంశాల వివరణ మొదలైంది. ఇవి కూడా జరిగిన వరుస క్రమంలో కాక, పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకం కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

నేనూ నా కెటలిస్టులూ

రాలెక్ దగ్గర చేరడానికి ముందే లూయీజీ భార్యతో కలిసి యూరప్ అంతా చూసి వచ్చాడు. ఆ విశేషాలు అప్పుడప్పుడు నాతో చెప్పి, నన్ను కూడా యూరప్‌కి ఓ ట్రిప్ వేసుకోమని సలహా ఇచ్చాడు. నేనతడికి చెప్పాను- వ్యవధి తక్కువ కావడంవల్ల- నాకున్న సమయం చాలా విలువైనదనీ- దాన్ని రీసెర్చికి వాడుకోవడంలో ఉన్న తృప్తి ప్లెజర్ ట్రిప్పులో ఉండదనీ...

అప్పుడు లూయీజీ ఆశ్చర్యపడ్డాడు. సరదాలకంటే సైంటిఫిక్ పరిశోధనలకి ప్రాధాన్యమిచ్చేంత అంకితభావం నాలో ఉందనుకుని నావంక ఆరాధనాభావంతో కూడా చూశాడు.

అప్పుడర్థమైంది నాకు- నేను నన్ను ప్రాజెక్ట్ చేసుకున్న తీరు అలా ఉన్నదని!

నిజానికి నేను రీసెర్చే ప్రాణంగా బ్రతకడం లేదు. నా సరదాలు నాకున్నాయి.

ఇక్కడ అనుకోకుండా నా ప్రయోగాలు క్లిక్కయ్యాయి. వెళ్లేలోగా వీలైనంత డేటా రాబట్టాల్సిన అగత్యమూ ఉంది. లేకుంటే ఈనగాచి నక్కల పాల్జేసినట్లవుతుంది. ఆ విషయం అలాగుంచితే- డబ్బు సమస్య ఉండనే ఉంది.

లూయీజీ ఆరాధనాభావం కొంచెం మొహమాటంగా అనిపించినా, నా దృక్పథాన్ని మరింత స్పష్టంగా అతడికి వివరించే ప్రయత్నం చెయ్యలేదు. క్రమంగా నా గురించి అతడికీ తెలియకపోదులే అనిపించింది.

ఇప్పుడు శ్రీమతి ప్రతిపాదించిన యూరప్ ట్రిప్పు గురించి చెబితే- అతడికి నా గురించిన కొంత వాస్తవం గ్రహింపుకి రావచ్చు.

మర్నాడే నేనతడికి మా యూరప్ ట్రిప్పు ఆలోచన చెప్పి, ప్లానింగుకి సలహా అడిగాను.

తమకు తెలిసింది చాలా కొంచెమే కావచ్చు. ఐనా ఆ కొంచేన్నే సలహా రూపంలో ఇవ్వడానికి ఆత్రపడేవాళ్లు లోకంలో చాలామందే ఉంటారు. అందుకని లూయీజీ ఉత్సాహపడతాడనుకున్నాను.

నేను చెప్పింది వినగానే లూయీజీ మొహం పాలిపోయింది, "ఆర్యూ సీరియస్" అన్నాడతడు.

అతడి ముఖంలో ఆశ్చర్యం లేదు. కలవరముంది.

అందుకు ఆశ్చర్యపడుతూనే- "యా!" అని, "అలా అడిగావేం?" అన్నాను వెంటనే.

"వెళ్లను వెళ్లను అనేవాడివి కదా- ఉన్నట్లుండి నీకీ ఆలోచన ఎలా వచ్చిందీ, ఎందుకొచ్చిందీ?" అన్నాడతడు. ఇప్పుడూ అతడి గొంతులో కుతూహలం లేదు. కలవరమే ధ్వనించింది.

అందుకు కారణం శ్రీమతి అని చెప్పడం నాకిష్టం లేదు. ఐతే ఇదివరలో నేనన్నదానికి విరుద్ధమైన నిర్ణయం కాబట్టి సంజాయిషీ ఇవ్వడం నా బాధ్యత అనిపించింది. ఆ ఇచ్చే సంజాయిషీ కూడాతిరుగులేనిదై ఉండాలి. అతణ్ణి మరో ప్రశ్న వెయ్యకుండా నిలువరించాలి.

ఇలాంటివి నాకు వెన్నతో పెట్టిన విద్య!

కొంతకాలంగా లూయీజీ ఈ ప్రాజెక్ట్ తనకు అనుకోని భారమైనట్లు అసంతృప్తి ప్రకటిస్తున్నాడు.

రాలెక్ తనకి చెప్పిందాన్ని బట్టి- ఈ ప్రాజెక్ట్ వడ్డించిన విస్తరిలాంటిదని తననుకున్నాట్ట. అందుకని ఎంతో ఉత్సాహంగా చేరాడు.

తీరా మొదలెట్టేక చూస్తే- చాలా వర్క్ మిగిలిపోయి ఉంది. రోజూ అతడూ నేనూ కలిసి పని చేసినా రాత్రింబవళ్లు కృషి చేయాల్సి వస్తోంది. అదీ ఒకటి రెండ్రోజులు కాదు, వారాలు కాదు, నెలలపాటు పని చెయ్యాలి.

"ఇంత శ్రమ పడాల్సి ఉంటుందని అనుకోలేదు. ఇప్పటికిప్పుడు ఇంకో ప్రాజెక్ట్‌కి మారినా నా పని సులభమౌతుందేమో" అని తరచుగా గొణుక్కుంటున్నాడు లూయీజీ.

నాకతడి తీరు నచ్చలేదు. సతాయింపులా అనిపించి, "పోనీ రాలెక్‌కి చెప్పనా- నిన్నింకో ప్రాజెక్ట్‌కి మార్చమని" అనడిగాను.

లూయీజీ ఒప్పుకోలేదు, "నీ ప్రాజెక్ట్‌లో చేరి, ఇంకోదానికి మారి- నిన్ను చిన్నబుచ్చడం నాకిష్టం లేదు" అన్నాడు.

ఆ సమాధానమే నాకు చిన్నతనంగా అనిపించింది. అతడి భుజం తట్టి, "చూడు లూయీజీ! ఇలాంటి మొహమాటాలుంటే జీవితంలో పైకి వెళ్లలేం. నువ్వు అనవసరంగా నాగురించి ఎక్కువ ఆలోచిస్తున్నావు. నిజానికి ఈ ప్రాజెక్టు కానీ, ఇక్కడి రీసెర్చి ఫలితాలు కానీ- నా భవిష్యత్తుని గొప్పగా మార్చుయ్యబోవడంలేదు. ఇక్కడికి రావడం, వెళ్లడమే నా కెరియర్‌కో అచీవ్‌మెంటు. ఇప్పటికే పీహెచ్‌డీని. ఉద్యోగంలో స్థిరపడ్డాను. ఇక్కడకూడా ఆశించినకంటే మంచి ఫలితం వచ్చింది. ఇప్పుడు మనం చేస్తున్నది డేటా జెనరేషన్. స్టడీ చేసేది కైనెటిక్సు. వీటివల్ల మరికొన్ని రీసెర్చి పేపర్సు రావచ్చు తప్ప అసలు ప్రాజెక్టు ఐపోయినట్లే! నీ సంగతలా కాదు. నువ్వింకా స్టూడెంటువి. నువ్వు చేస్తున్నది డిగ్రీకోసం. నీకు టైమీజ్ గోల్డ్. నువ్వు నీ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని, తొందరగా డిగ్రీ రావడానికి ప్రాజెక్ట్ మారాలని అనుకుంటే, అది నాకు చిన్నతనం ఎందుకౌతుంది? నా కారణంగా నీ డిగ్రీ ఆలస్యమైతేనే నాకు చిన్నతనం. ప్రాజెక్ట్ మారడం వల్ల నీకు కలిసొస్తే నీకంటే ఎక్కువగా నేను సంతోషిస్తాను. అందుకే రాలెక్‌తో మాట్లాడతానన్నాను" అన్నాను.

నా మాటలకి లూయీజీ తడబడ్డాడు. "కొన్నాళ్లుగా పరిచయం. నీ సంగతి నాకు తెలియదా? కానీ ఒకసారి ఒప్పుకున్నాక, వెనకడుగు వెయ్యడం నాకు నచ్చదు. అందులోనూ ఈ వర్క్‌కి అలవాటు పడ్డాను. టైముదేముందీ- మూణ్ణెల్లు అనుకున్నది ఆర్నెల్లు పట్టొచ్చు. మధ్యలో నిన్నొదిలెయ్యడం నాకే అసంతృప్తిగా ఉంటుంది" అన్నాడు.

అతడి మాటల్లో నాకోసం త్యాగం చేస్తున్నాడన్న భావన ఉంది. అది నా అసంతృప్తిని పెంచింది. ఇన్నాళ్లూ నా ప్రాజెక్ట్ అతడికి డిగ్రీ తెచ్చి పెడుతోందని గర్వంగా ఫీలైనవాణ్ణి. ఇప్పుడు నాకోసం అతడు త్యాగం చేస్తున్నాననుకోవడం జీర్ణం కావడంలేదు.

అతడితో కొనసాగాలా? అతడికి విముక్తి కలిగించాలా?

నా సందిగ్ధాన్ని శ్రీమతికి చెప్పినప్పుడు, అది అవకాశంగా తీసుకుని- తను యూరప్ ట్రిప్పు ప్రతిపాదించింది.

ఇప్పుడు లూయీజీ యూరప్ ట్రిప్పు ఆలోచన ఎందుకొచ్చిందీ అనడుగుతున్నాడు.

ఐతే నేను మాత్రం శ్రీమతి పేరు చెప్పదల్చుకోలేదు. నాకోసం త్యాగం చేస్తున్నానన్న అతడి భావనకు ప్రతిగా అతడికోసం నేను త్యాగం చేస్తున్నట్లు స్ఫురింపజేసే బదులివ్వాలి అనుకుని, "మిస్టర్ లూయీజీ! తొందరగా డిగ్రీ వస్తుందన్న ఆశతో ఈ ప్రాజెక్టులో చేరావు. అది పొరపాటని నీకిప్పుడు అనిపిస్తోంది. నీకీ ప్రాజెక్ట్ వర్కు భారంగా మారింది. బయటపడే దారి కనిపించక సతమతమౌతున్నావు. నిజానికి నీకీ వర్కు నేను తగిలించలేదు. రాలెక్ తగిలించాడు. నిన్ను ఇందులోంచి బయటపడెయ్యమని ఆయనకి చెప్పగలను కానీ నాకది ఇష్టంలేదు. నీకు మాట రాకుండా, నీ కోరిక తీరడంకోసమే నేను యూరప్ ట్రిప్పు వేసుకోవాలనుకుంటున్నాను" అన్నాను.

లూయీజీ ఆశ్చర్యంగా, "రెండింటికీ లంకె ఏమిటి?" అన్నాడు.

అలాంటి లంకెలు కల్పించడంలో నేను సిద్ధహస్తుణ్ణి. ప్రస్తుతానికి అది కల్పనలా కనిపించినా అందులో నిజం కూడా చాలా ఉంది. ఎందుకంటే బెర్లిన్లో అడుగెట్టేక- నేనీ ఊరు దాటి వెళ్లలేదు. ఇక కొన్ని నెలల్లో ఇండియాకి తిరిగి వెళ్లాల్సి ఉంది.

"ఆ మాట చెప్పి, నేను యూరప్ ట్రిప్పు వేసుకుంటానని చెబితే రాలెక్ అర్థం చేసుకుంటాడు. ఆ ప్రకారం ప్రాజెక్టుకి సంబంధించి నా వర్క్ విషయంలో కైనెటిక్సు స్టడీ మానేస్తానని చెబితే ఆయన కాదనడు. నా ఇన్వాల్మెంట్ లేకుండా, నీ ఒక్కడివల్లా కైనెటిక్స్ వర్క్ ముందుకెళ్లదు కాబట్టి - ఆయన నిన్ను వేరే ప్రాజెక్టుకి మార్చవచ్చు" అన్నాను.

"మరి నీ వర్క్ ఏమౌతుంది?" అన్నాడు లూయీజీ.

"ఇందాకనే చెప్పానుగా! ఇప్పటికే నాకావాల్సిన సమాచారం అందేసింది. ఇప్పుడు మనం చేస్తున్న స్టడీస్ కేవలం నీ డిగ్రీకి ప్రాజెక్ట్ రిపోర్టు కోసం. మనం కలెక్ట్ చేస్తున్న డేటా కైనెటిక్సు కట్టడానికి. దీన్నించి మంచి పబ్లికేషన్సు వస్తాయి. నీ డిగ్రీకే కాదు, నాకూ మా లేబరేటరీలో ఇచ్చుకుందుకు మంచి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారౌతుంది. కానీ అది నాకంత ముఖ్యం కాదు" అన్నాను.

లూయీజీ ముఖభావాలు మారాయి. "రాలెక్ ఒప్పుకుంటాడా?" అన్నాడు.

"నా దగ్గర రెండు కొత్త ప్రాజెక్టులకి ప్రపోజల్సున్నాయి. వాటి స్టడీ ఇప్పటి స్టడీ అంత కష్టం కాదు. నేను రెండ్రోజులు లైబ్రరీకి వెళ్లి కొత్త ప్రపోజల్ తయారు చేసి రాలెక్‌కి చూపించి ఒప్పిస్తాను" అన్నాను.

లూయీజీ అప్పటికేం మాట్లాడలేదు.

ఇచ్చిన మాట ప్రకారం నేను రెండ్రోజులు లైబ్రరీలో గడిపి కొత్త ప్రాజెక్టొకటి తయారు చేశాను. అది లూయీజీకి చూపించి, "దీన్ని జర్మన్లోకి తర్జుమా చేయి. రాలెక్‌కి చూపిద్దాం" అన్నాను.

లూయీజీ ఆ ప్రపోజల్ చదివాడు. నావంక అదోలా చూసి, "నాకోసం నువ్వు చాలా శ్రమ తీసుకున్నావు. ఇంటికెళ్లకుండా ఎక్కువసేపు లైబ్రరీలో గడిపావు. బాసుల్లో నీలాంటి వాళ్లుంటారని నేనూహించలేదు" అన్నాడు.

"నేను నీకు బాసుని కాదు. కొలీగుని. అది సరే- మన బాస్ రాలెక్ దగ్గరికెప్పుడు వెడదాం" అని సరిచేశాను.

లూయీజీ నవ్వి, "రాలెక్ నీకు బాస్ కావచ్చేమో, నాకు మాత్రం నువ్వే బాసువి. ఏం మాట్లాడాలో నీతోనే మాట్లాడతాను" అన్నాడు.

అతడి నవ్వులోనూ, గొంతులోనూ ధ్వనించిన కొత్త స్నేహభావానికి ఆశ్చర్యపడుతూనే, "మరి ప్రాజెక్ట్ నానుంచి మార్చేక రాలెక్కే నీకు బాస్. ప్రాజెక్ట్ మార్చడానికి ఆయనతో మాట్లాడ్డానికి నేనొక్కణ్ణే కాదు, నువ్వూ ఉండాలి" అన్నాను.

"అది సరే! ఇంతకీ ప్రాజెక్ట్ మార్చడమెందుకూ?" అన్నాడు లూయీజీ ఏమీ ఎరగనట్లు.

"ఎందుకంటే నేను యూరప్ ట్రిప్పుతో బిజీ. మన ప్రాజెక్టు వర్కు నీ ఒక్కడివల్లా కాదు....." అని ఇంకా ఏదో అనబోతుండగా....

"నన్నిందులోకి లాగి, ఉన్నట్లుండి యూరప్ వెడతానంటే ఎలా? నేనేమైపోతాను?" అన్నాడు లూయీజీ.

అతడా మాట యథాలాపంగా అనలేదు. ఆ గొంతులో కంగారు, బెంగ ఉన్నాయి.

"నువ్వేదో ఐపోవడమేమిటి? నీకోసమే కదా, నేను యూరప్ ట్రిప్పు వేసుకునేది?" అన్నాను.

"ఒక్క నిముషం డాక్టర్ రావ్! నేను కాసేపు మాట్లాడొచ్చా?" అన్నాడు లూయీజీ.

"కాసేపే ఏం? ఎంతసేపైనా మాట్లాడొచ్చు. నీ భవిష్యత్తు నాకూ బాధ్యతే మరి!" అన్నాను.

లూయీజీ చెప్పడం మొదలెట్టాడు.

ఈ రెండ్రోజుల్లోనూ అతగాడూ లైబ్రరీకి వెళ్లేట్ట. కొత్త ప్రాజెక్ట్ కోసం కాదు. నా గురించి తెలుసుకోవడానికి.

కెమికల్ ఆబ్స్ట్రాక్ట్సులో ఇండెక్సులో నా పేరున వెదికేట్ట.

"నువ్వు సామాన్యుడివి కాదు. చాలా మంచి వర్కు చేశావు. నీతో కలిసి పని చెయ్యడం నాకు గర్వకారణం" అన్నాడు లూయీజీ.

తెల్లబోయాను.

నా గురించి నాకు తెలుసు. అప్పటికి నా రీసెర్చి పబ్లికేషన్సు కొన్ని ఇంటర్నేషనల్ జర్నల్సులో వచ్చిన మాట నిజమే ఐనా- అవి చూసి నాతో కలిసి వర్కు చెయ్యడం గర్వకారణమనుకునేటంత విశేషమైనవి కాదు.

లూయీజీ నన్ను ఉబ్బెయ్యడానికి ప్రయత్నిస్తున్నట్లు గ్రహించాను. కానీ ఏమనాలి?

తర్వాత అతడు మాట్లాడిందాన్నిబట్టి, లూయీజీ ఆంతర్యం నాకు అర్థమైంది.

అంతకాలం అతడు నా పని తను చేస్తున్నానని అనుకున్నాడు.

నేను వర్కు ఆపేసి- యూరప్ వెడతానని అనగానే- అర్థమయిందతడికి- అతడి వర్క్ నేను చేస్తున్నానని!

మా వర్క్ పూర్తయితే నాకో పేపరు రావచ్చు. లూయీజీకి డిగ్రీ వస్తుంది.

అలాంటప్పుడు సాధారణంగా పనంతా అతడిమీదే పడిపోవాలి. మరి నేనా భారాన్ని సగంకంటే ఎక్కువే మోస్తున్నాను.

నేను యూరప్ వెడతానని అనగానే, లూయీజీ వాస్తవంలోకి వచ్చాడు. తనకి నేనెంత అవసరమో గుర్తించాడు.

లూయీజీలో వచ్చిన ఈ మార్పు నాకు సంతోషం కలిగించింది. ఐనా తటపటాయిస్తూ, "బాగా ఆలోచించు. ప్రాజెక్ట్ మారితే ఇప్పుడున్న వర్క్‌లోడ్ బాగా తగ్గుతుందేమో!" అన్నాను.

"నువ్వు కొత్త ప్రాజెక్ట్ ప్రపోజల్ తేగానే అర్థమైంది నాకు- వర్క్‌లోడ్ గురించి నేనన్నది సిల్లీగా ఉందని! ఫర్దర్ డిస్కషన్సొద్దు. ఇప్పుడీ ప్రాజెక్ట్ నీ ఒక్కడిదే కాదు. నాదీను. ఇద్దరం కలిసి పని చేసినా, నువ్వు ఇండియా వెళ్లే సమయానికి- మన ప్రాజెక్టులో ఇంకా కొంత వర్క్ ఉండిపోతుందని! అది పూర్తి చెయ్యడం కూడా నా బాధ్యతగా భావిస్తాను" అన్నాడు లూయీజీ.

అతడన్నది సిల్లీగా ఉన్నదని నాకెప్పుడో తెలుసు.

ఇక్కడికి తీసుకొచ్చిన ప్రాజెక్టుకి ఆధారం నా పీహెచ్‌డీ థీసిస్. ఈ ప్రాజెక్టుకోసం ఇండియాలో కొంత బేసిక్ వర్క్ చేశాను. ఇక్కడికొచ్చి మరికొంత చేసి శాంపుల్స్ తయారు చేశాను.

వాటిని స్టడీ చేసే దశలో లూయీజీ నాతో కలిసాడు. అంటే అప్పటికి అతడికి సుమారు ఏణ్ణర్థం టైం కలిసొచ్చింది.

కొత్తగా ప్రాజెక్ట్ తీసుకుంటే కథ మొదటికొస్తుంది.

శాంపుల్ స్టడీ దశకి రావడానికి ఎన్నాళ్లు పడుతుందో తెలియదు. అసలు స్టడీకి శాంపుల్స్ వస్తాయన్న గ్యారంటీ కూడా లేదు.

నా ప్రాజెక్ట్ విషయానికొస్తే- అది వడ్డించిన విస్తరి. అందుకే రాలెక్- లూయీజీని నాతో కలిపాడు.

ఆ విషయం లూయీజీకి ఇప్పటికి అర్థమైంది.

"ఐతే మా యూరప్ ట్రిప్పు కాన్సిల్ చెయ్యాలేమో! కానీ నా శ్రీమతి ఒప్పుకుంటుందో లేదో" అన్నాను సాలోచనగా.

"డాక్టర్ రావ్! నువ్వు వెరీ టాలెంటెడ్! యూరప్ ట్రిప్పుకి నీకు మళ్లీ మళ్లీ అవకాశాలొస్తాయి. రావాలని నేను కూడా అల్లాని ప్రార్థిస్తాను. నా డిగ్రీకి మాత్రం నీ అవసరం చాలా ఉంది"

నవ్వొచ్చింది. నా ప్రగతికి అల్లా సాయం చెయ్యడం — సెక్యులరిజానికి గొప్ప ఉదాహరణ.

"నా ఫ్యూచర్ గురించి కాదు కానీ- నా శ్రీమతి ఒప్పుకోవాలని ప్రార్థిస్తే ప్రార్థించు అల్లాని" అన్నాను.

"దానికి అల్లాని ప్రార్థించడమెందుకు? నేనే నీ శ్రీమతిని వేడుకుంటాను" అన్నాడు లూయీజీ.

ఆ మాట నిజాయితీగా అన్నాడతడు. అప్పుడతడి మొహం చూస్తే జాలేసింది. ఎలాగైనా శ్రీమతిని ఒప్పించాలనిపించింది. కానీ ఎలా?

సాయంత్రం ఇంటికెళ్లేక జరిగింది ఆమెకి చెప్పాను.

శ్రీమతి మొహం గంభీరంగా ఐపోయింది, మీరెప్పుడూ ఇంతే! ఏదీ దూరమాలోచించరు" అంది.

ఆమె వివరణ తార్కికంగా ఉంది.

'యూరప్పంతా ఒక్కలాగే ఉంటుంది, ఒక్క సిటీ చూస్తే అన్నీ అలాగే ఉంటాయి' అని సరిపెట్టుకుని, యూరప్ ట్రిప్పుని ఎప్పుడో పక్కన పెట్టేశామంటే కారణం- ఆర్థిక ప్రయోజనాలు.

"ఇప్పుడు లూయీజీ ప్రాజెక్ట్ మారి ఉంటే- ఏంచేసేవారు? నిజంగానే యూరప్ ట్రిప్పు వేసేవారా?" అందామె.

అంటే ఆమెకి నేనీ ట్రిప్పు వేస్తానని నమ్మకం లేదు.

ఇప్పుడు లూయీజీ నన్ను బ్రతిమాలిన విషయం కూడా నమ్మినట్లు లేదు.

మా ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ఎంత నమ్మకమున్నా- అప్పుడప్పుడు అనుమానించుకుంటూనూ ఉంటాం.

ట్రిప్పు ఎగెయ్యడానికి నేనిప్పుడు లూయీజీ వంక పెడుతున్నానని ఆమె అనుకుంటోందని ఇప్పుడు నాలో అనుమానం పుట్టింది. అందుకని, "నీ సరదా కంటే ఇంకేవీ నాకు ముఖ్యం కాదు. నువ్వు అనగానే నేను యూరప్ ట్రిప్పుకి కన్విన్సయ్యాను. ఐతే లూయీజీ ప్లేటు ఫిరాయిస్తాడని నేనూహించలేదు. ఐనా అంతమాత్రాన అతడికోసం- మన ట్రిప్పు కేన్సిల్ చెయ్యాలనేం లేదు. అతడి ఫ్యూచర్ కోసం- నా ప్రాణానికి ప్రాణమైన నిన్ను నిరుత్సాహపర్చలేను" అన్నాను.

శ్రీమతి నవ్వి, "నాకు నిరుత్సాహమెందుకు? నేనేమైనా యూరప్ ట్రిప్పు గురించి కలలు కంటున్నానా, ఆశ పడుతున్నానా! మనమొకసారి అనుకున్నాక, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి. అదీ నా పోలసీ" అంది.

"అలాంటప్పుడు మరి నువ్వే ట్రిప్పు ఎందుకు ప్రపోజ్ చేశావు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఎందుకంటే- మీరు తనకెంత అవసరమో లూయీజీకి తెలిసి రావాలని! అనుకున్నట్లే జరిగిందిగా- మనకిక మళీ బెర్లినే యూరప్!" అంది శ్రీమతి నవ్వుతూ.

"అంటే, ఇలా జరుగుతుందని ముందే ఊహించావా?" అన్నాను మరింత ఆశ్చర్యంగా.

"ఇందులో ఊహించడానికేముంది? మా చుట్టాల్నించి నేర్చుకున్నది చాలదూ!" అందామె.

శ్రీమతిది గొప్ప పరిశీలన.

ఆమె చుట్టాల్లో ఇద్దరి గురించి తరచుగా చెప్పేది నాకు.

ఒకాయనున్నాడు. మంచి మనసు. ఎదుటివాళ్లని ఇట్టే నమ్మేస్తాడు. ఎదుటివాళ్ల కష్టాలకు ఇట్టే కరిగిపోతాడు. వాళ్లని ఆదుకుందుకు తనవద్ద లేకపోతే, ఇతరులనుంచి కూడా అప్పు చేస్తాడు. ఇంతా చేసి, తనేదో పరోపకారం చేశానని అనుకోడు. 'నీకు సాయపడే అదృష్టం నాకొచ్చింది' అంటాడు వినయంగా.

మరొకాయనున్నాడు. ఎంగిలి చేత్తో కాకిని కూడా కొట్టడు. కానీ పోస్టాఫీసులోనో బ్యాంకులోనో ఎవరికైనా సంతకానికి అవసరమైతే, క్యాప్ తీసి పెన్నిస్తాడు.మళ్లీ వెనక్కిచ్చేదాకా వాళ్ల పీకెలమీద కూర్చుంటాడు. "ఆ సమయంలో నేను పెన్నివ్వకపోతే, వాళ్లకి పెన్నిధి పోయేది" అని తన ఔదార్యం గురించి చిలవలూ పలవలూ అల్లి ప్రచారం చేసుకుంటాడు.

మొదటాయన్ని అప్పు తీసుకున్నవాళ్లు కూడా చిన్నచూపు చూస్తారు. రెండో ఆయన్ని అప్పడిగి భంగపడ్డవాళ్లు కూడా- పొగడ్తలతో ఆకాశాని కెత్తేస్తుంటారు.

"వినయం, మర్యాద అందరికీ అర్థం కాదు. తప్పుడుదని తెలిసినా ప్రచారానికి జనం పడిపోతారు" అంది శ్రీమతి.

విషయాన్ని ఆమె బాగా అర్థం చేసుకుంది.

రాలెక్ లూయీజీని నాకు సహాయకుడిగా ఇవ్వడాన్ని నా అదృష్టంగా చెప్పుకున్నాను.

అదీకాక లూయీజీకి కంప్యూటర్సు వాడకంలో కొంత పరిజ్ఞానముంది. అప్పట్లో కంప్యూటరంటే ఒక గది పట్టేటంత ఉండేది. దానికి ప్రత్యేకంగా ఓ ఆపరేటర్ ఉండేవాడు. మన రియాక్షన్సుకి సంబంధించిన ఈక్వేషన్సుని ఆపరేటరు వద్దకి తీసుకెడితే- అతడో ప్రోగ్రాం రాసిస్తాడు. ఆ ప్రోగ్రాంకి అనుగుణంగా డేటాని కంప్యూటర్లోకి ఎక్కించాలి.

లెక్కల్లో ప్రవేశమున్న ఎవరికైనా- అది సృజనాత్మకత అవసరం లేని అవగాహన అని నాకు తెలియదు. అదో బ్రహ్మవిద్య అనుకునేవాణ్ణి.

కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నాకు రాదనీ, అది లూయీజీకి వచ్చుననీ- అందువల్ల నా ప్రాజెక్టు వర్క్ మరింత సులభమౌతుందనీ- లూయీజీతో పాటు చాలామంది వద్ద అనేవాణ్ణి.

దాంతో లూయీజీ- నాకోసం తను శ్రమ పడుతున్నాననుకున్నాడు. నా యూరప్ ట్రిప్పు ప్రతిపాదన వినేదాకా అతడలాగే అనుకున్నాడు. అప్పుడు తెలిసిందతడికి- నిజానికి అతడికోసం నేను అనవసరమైనా శ్రమ పడుతున్నానని!

అది గ్రహించిన శ్రీమతి అతడి కళ్లు తెరిపించడానికి యూరప్ ట్రిప్పు ప్రతిపాదించింది తప్ప- తను ఎప్పుడో బెర్లిన్‌తోనే సరిపెట్టుకుంది.

అప్పట్నించీ లూయీజీ నాపట్ల కృతజ్ఞతాభావంతో ప్రవర్తించడం మొదలెట్టాడు.

నేను మాత్రం- లూయీజీ నావల్ల లాభం పొందుతున్నాడన్న భ్రమకు గురి కాలేదు. ఎందుకంటే అతడి కారణంగా నా ప్రాజెక్టు విలువ పెరుగుతున్న మాట కూడా నిజం. నా ఒక్కడివల్ల అంత పని కాదు.

ఎటొచ్చీ గతంలోలా అతణ్ణి మరీ ఎక్కువ పొగడ్డం తగ్గించాను. అతివినయం ధూర్తలక్షణమౌనో కాదో కానీ- ఎదుటివాళ్లని ధూర్తులుగా మార్చే అవకాశం కూడా ఉన్నదనడానికి ఇదో ఉదాహరణ.

ఏది ఏమైనా ఆ తర్వాత- లూయీజీ, నేనూ అక్కడ సమిష్టిగా, ఇష్టులుగా ఎంత కృషి చేశామంటే- ఇద్దరం క్రిస్మస్ రోజుల్లో కూడా లేబరేటరీకి వెళ్లి పరిశోధనలు కొనసాగించాం. నేను నా ప్రయాణం ఒకటి రెండు రోజులుందనగా కూడా లేబ్‌కి వెళ్లాను.

మా ఇద్దరిమధ్యా ఈ సయోధ్యకు కారణమైన శ్రీమతి విషయం కూడా నేనెక్కువ ఆలోచించలేదు. ఎందుకంటే- తను యూరప్ ట్రిప్పు నిజంగా లూయీజీని మార్చడానికి ప్రతిపాదించిందా? లేక ఊహించని విధంగా లూయీజీలో మార్పు రావడంవల్ల తనకేమీ నిరుత్సాహం కలగలేదని నన్ను నమ్మించడానికి ప్రయత్నించిందా అన్న అనుమానం రావచ్చు.

అది నాకిష్టం లేదు.

నా కెటలిస్టుల వ్యవహారం ఇలాగుంటే- మా తిరుగు ప్రయాణం దగ్గరపడుతోంది. ఇప్పటివాళ్లకు అర్థంకాని విశేషాలతో- అదో పెద్ద హడావుడి.

స్వర్గారోహణ పర్వం

మనిషి జీవితంలో అంతిమ ప్రయాణం ఊర్ధ్వలోకాలకి. అవి మనకంటే పైన ఉన్నది కాబట్టి- ఆ ప్రయాణాన్ని ఆరోహణం అంటారు. ఈ ప్రయాణం సామాన్యులకైతే తనువు చాలించాకనే మొదలౌతుంది. మహాభారత కావ్యంలో పాండవులు అసామాన్యులు కాబట్టి భార్యా సమేతంగా బొందితోనే స్వర్గానికి బయల్దేరారు. అదే ఆ కావ్యంలో చివరిదైన స్వర్గారోహణ పర్వం.

కలికాలంలో ఊర్ధ్వలోకాలు కూడా భూమ్మీదే ఉంటాయి. సామాన్యులైనా, అసామాన్యులైనా జీవితకాలంలోనే కర్మఫలాన్ని బట్టి వాటి అనుభూతుల్ని పొందుతుంటారు.

ఈ నవలకు తొలిభాగమైన 'ఫారిన్ వెళ్లాలండి' నవలలో పాశ్చాత్య దేశాలను స్వర్గంతో పోల్చడానికి ఉన్న అవకాశాల్ని పరిశీలించాం. ఇండియా నుంచి జర్మనీకి వెళ్లే అవకాశాన్ని బొందితో స్వర్గారోహణం అనగల మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నాం.

తర్వాతి భాగం 'ఫారిన్ వెళ్లానండి' నవలలో, ఆ స్వర్గంలోని మంచిచెడ్డల లోతుపాతుల్ని అవగాహన చేసుకునేందుకు సహకరించే ఎన్నో విశేషాల్ని పంచుకున్నాం.

ఇక నాకు ఇక్కణ్ణించి స్వదేశానికి తిరిగివెళ్లే సమయం వచ్చింది. ఇప్పుడు నేనున్నది స్వర్గం ఐతే స్వదేశాన్ని ఏమనాలి?

నరకం అందామా అంటే- నాకక్కడ సుఖ సంతోషాలున్నాయి. భూలోకమందామా అంటే- ఇప్పుడు నేనున్నదీ భూలోకంలో ఒక భాగమే!

మనకైతే- 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నది రామాయణ కాలంనుండి వస్తున్న మాట.

జనని, జన్మభూమి- స్వర్గంకంటే గొప్పవని ఆ శ్లోకార్థం.

ఇప్పుడున్నది స్వర్గం ఐతే- నేను తిరిగి వెళ్లబోతున్నది- స్వర్గంకంటే ఎక్కువైన మాతృదేశం.

ఆర్థికంగా, సాంకేతికంగా మనకంటే ఉన్నత స్థానంలో ఉన్నది కాబట్టి అక్కణ్ణించి ఇక్కడికి రావాలంటే ఆరోహణం. ఇక్కణ్ణించి అక్కడికి వెళ్లాలంటే అది అవరోహణం.

నిజం చెప్పాద్దూ- స్వర్గారోహణమప్పటికంటే, ఈ అవరోహణ గురించిన భావనకే నా తనువు, మనసు ఉప్పొంగుతున్నాయి. ముహూర్త మెప్పుడా అని తహతహలాడుతున్నాను.

శ్రీమతికి మనసులో ఏముందో తెలియదు కానీ- ఆమెకు నా తహతహ చికాకు కలిగించింది.

"పుట్టినూరు కోనసీమలో. అదెలాగూ దాటొచ్చేశారు. ఇక ఉద్యోగం ఒరిస్సాలో ఐతేనేం, బెర్లిన్లో ఐతేనేం?" అందామె.

ఒరిస్సా కూడా నాకు స్వదేశమే అని చెప్పాచ్చు. కానీ అ విషయం ఆమెకు తెలియకనూ కాదు, ఆమె ప్రశ్నకు బదులూ కాదు.

"ఇక్కడ మనకెవరు ఉద్యోగమిస్తారు?" అన్నాను అదే నా సమస్య అయినట్లు.

"కన్యాశుల్కంలో- నాకు పిల్లనెవరిస్తారు అన్న లుబ్ధావధానుల్లా అనకండి. మీకిక్కడ చాలా అవకాశాలున్నాయి. వాటిని ఉపయోగించే ప్రయత్నమేమైనా చేశారా- అది చెప్పండి" నిలదీసింది శ్రీమతి.

తల్లికి బిడ్డ, భార్యకి భర్త- ఈ ప్రపంచంలో చాలా గొప్పవాళ్లలా అనిపిస్తారు. నేను ఊఁ అనాలి కానీ బెర్లిన్లో ఎన్నో ఆఫీసులు నా మెడలో ఉద్యోగమాల వెయ్యడానికి సిద్ధంగా ఉన్నాయని శ్రీమతి అభిప్రాయం. ఖండించి ప్రయోజనం లేదు. తనొప్పుకోదు.

"ఎలా ప్రయత్నిస్తాను? డెప్యుటేషన్ పూర్తవగానే బుద్ధిగా ఇండియా వచ్చేస్తాననీ, వచ్చేక కనీసం మూడేళ్ల దాకా మరెక్కడికీ వెళ్లకుండా మా ఆఫీసుకే నా సేవలందిస్తాననీ- బాండ్ రాశాను. తెలుసుకదా!" అంటూ మరో సంజాయిషీ ఇచ్చాను.

"అలా ఎందుకు బాండ్ రాశారు?" చిరాకు పడింది శ్రీమతి.

ఇప్పుడలా అంటోంది కానీ, నిజానికి బాండ్ వ్రాసినప్పుడు నాతోపాటు తనూ ఎంతో సంతోషపడింది. ఒకటి ఫారిన్ అవకాశానికి. రెండు- తిరిగొచ్చేక నా ఉద్యోగం కనీసం మరో మూడేళ్లు గ్యారంటీ!

అదీ అప్పట్లో నా మనఃస్థితి. లేకుంటే, నాది సర్వీసు సెంట్రల్ గవర్నమెంటు సర్వీసులాంటిది. ఒకసారి ప్రొబేషన్ పూర్తి చేసేక, ఉద్యోగం లోంచి తొలగించడం- తివిరి ఇసుమున తైలంబు తియ్యడమంత కష్టం. ఐనా అభద్రతా భావం నన్ను నిత్యశంకితుణ్ణి చేస్తుంది.

"ఈమాత్రం తెలియదా? బాండ్ రాయకపోతే- నన్నిక్కడికి పంపించరు..." అన్నాను.

ఐతే శ్రీమతి ఈ విషయమై ఎంత ఆలోచిస్తోందంటే, భువనేశ్వర్లో లోపాయికారీగా నేను చెప్పినవీ, తను విన్నవీ అన్నీ కలిపి ఓ ఫైలుగా తయారు చేసి సిద్ధంగా ఉంది.

నాకులాగే బాండ్ వ్రాసి- స్కాలర్‌షిప్పుమీదో, డెప్యుటేషన్ మీదో మా ఆఫీసునుంచి విదేశాలు వెళ్లినవాళ్లలో నలుగురు అమెరికానుంచి వెనక్కి రాలేదు. వాళ్లకి ఏటా ఒకసారి మా హెడ్డాఫీసునుంచి వార్నింగ్ లెటర్సు వస్తుంటాయి.

"పంపడం ఆఫీసుకి వాలాయతీ. ఊరుకోవడం వీళ్లకి ఉత్తమం. కొన్నేళ్ల తర్వాత ఆ ఉత్తరాలు వాటంతటవే ఆగిపోతాయి. అదీ ఆ బాండ్ విలువ. అప్పట్లో ఆమాత్రం తెలియలేదు. బాండు రాస్తే ఈ ఆఫీసుకి కట్టుబానిసనైపోతానన్న అనుమానంతో- నార్వే వెళ్లడానికి మంచి ఆఫరొస్తే వదులుకున్నాను. అలా ఓ గోల్డెన్ ఆపర్చ్యూనిటీ మిస్సైపోయాను. తర్వాతనుంచి కాపర్ ఆపర్చ్యూనిటీస్ కూడా రాలేదు" అని ఆఫీసులో ఓ సీనియర్ సైంటిస్టు వాపోతుంటాడు.

కొందరు లోపాయికారీగా అనేదేంటంటే- అతడు నార్వేకి అప్లై చేశాడు కానీ, ఆఫర్ రాలేదు. ఆఫర్ వచ్చిందనీ, బాండ్ రాయడం ఇష్టం లేక, వదులుకున్నాననీ అతడంటాడు. నాలాంటి కొందరు నమ్మడమో, నమ్మినట్లు నటించడమో చేస్తారు. ఈ బాండ్ అలా కూడా ఉపయోగపడుతోందని కొందరంటారు.

నేను మాత్రం- బాండుకి విలువ లేదనేవారితో, 'అది నాకు తెలుసు, మీకు తెలుసు. దానికేం తెలుసు?' అంటాను.

శ్రీమతి నాకు కొందరి పేర్లు చెప్పి, "వాళ్లు ధైర్యే సాహసే లక్ష్మీ అనుకున్నారు. మీరూ అలా ధైర్యం చెయ్యాలి. లేదూ పిరికివాళ్లన్న ముద్ర వేయించుకుంటారు" అంది.

"నిజాయితీ పిరికివాళ్ల లక్షణమనుకునేవాళ్లకి- నేను పిరికివాణ్ణే. కనీసం నువ్వలా అనుకోకుండా ఉంటే చాలు నాకు" అంటూ శ్రీమతి ముందరి కాళ్లకి బంధం వేశాను. అక్కడితో ఆ సంభాషణ ఆగింది.

ఐతే నా పిరికితనం బయటపడే సంఘటన మరొకటి జరిగింది.

నేను ఇండియాకు తిరిగి వెళ్లాల్సిన రోజులు దగ్గరపడుతున్నాయి. ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాను. ఈలోగా ఇక్కణ్ణించి సేకరించాల్సిన సమాచారం ఉంటే సూచించమనీ, తప్పక సేకరిస్తాననీ- ఇండియాలో నా బాస్ భరత్‌కి ఉత్తరం వ్రాశాను.

నేనా ఉత్తరం వ్రాయడానికి సైన్సుమీద ప్రేమ కాదు. భరత్ మీద అభిమానం. ఎందుకంటే, ఆయన మొహమాటస్థుడు. ఇక్కణ్ణించి తనకి ఏమైనా కావాలంటే, అడగడానికి వెనుకాడతాడు. సంకోచించొద్దనడానికీ లేఖ ఒక సూచన. అదాయన అర్థం చేసుకోగలడు.

దానికాయన్నుంచి వెంటనే బదులొచ్చింది. కానీ అది నేనూహించినది కాదు.

"తొందరపడి వెనక్కి వచ్చెయ్యకు. మన ఆఫీసు నీకు మూడు నెలలకే ఎక్స్‌టెన్షన్ ఇచ్చినప్పటికీ, దాన్ని ఆర్నెల్లు చెయ్యాలని- జర్మనీనుంచి 'డాడ్' ఆఫీసువాళ్లు పట్టుబడుతున్నారు. నేను కూడా అందుకు నా వంతు ప్రయత్నిస్తున్నాను" అన్నది ఆ లేఖాంశం.

ఆ ఉత్తరం భరత్ కాక ఇంకెవరైనా వ్రాసుంటే- నమ్మేవాణ్ణి కాను. ఎందుకంటే భరత్ సబ్జక్టులో దిట్ట మాత్రమే కాక నిజాయితీపరుడు కూడా! తనకు నష్టం కలగడం తథ్యమైనప్పుడు కూడా నియమపాలనకే ప్రాధాన్యమిస్తాడు. ఈ కారణాలవల్లనే- నేను మా లేబరేటరీలో ఆయనకు పూర్తిగా కట్టుబడి ఉన్నాను.

నాకు తెలియకుండా జర్మనీనుంచి 'డాడ్' ఆఫీసు కూడా నాకోసం ప్రయత్నాలు చెయ్యడమేమిటని ఆశ్చర్యపోయి, రాలెక్‌ని అడిగాను.

ఆయన ఆశ్చర్యపోలేదు సరికదా, గొప్ప మొహం పెట్టాడు, "నా మాట కాదంటే నేనూరుకుంటానా? బాన్‌లో 'డాడ్' హెడ్డాఫీసుకి గట్టిగా ఉత్తరం వ్రాశాను. వాళ్లు రంగంలోకి దిగినట్లున్నారు" అన్నాడు.

పాఠకుల సౌకర్యార్థం- అప్పటి జర్మనీ పరిస్థితిని మరోసారి గుర్తు చేస్తున్నాను.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆ దేశం రెండు భాగాలయింది. తూర్పు జర్మనీలో వ్యవస్థ కమ్యూనిజం. పశ్చిమ జర్మనీలో వ్యవస్థ కాపిటలిజం. అంతవరకూ ఉమ్మడి జర్మనీకి రాజధానిగా ఉన్న బెర్లిన్ నగరం కూడా రెండు భాగాలు చెయ్యబడింది. అందులో తూర్పు బెర్లిన్- తూర్పు జర్మనీకి రాజధాని అయింది. నేనుంటున్న పశ్చిమ బెర్లిన్, తూర్పు జర్మనీలో ఉన్న పశ్చిమ జర్మన్ నగరం. ఎవరైనా బయట్నించి పశ్చిమ బెర్లిన్‌కి రావాలంటే, తూర్పు జర్మనీలోకి ప్రవేశించాలి. రెండు జర్మనీలూ ఒకటై, మళ్లీ మొత్తం బెర్లిన్ ఆ దేశానికి రాజధాని అయింది కానీ- అంతవరకూ పశ్చిమ జర్మనీ రాజధాని బాన్ నగరం. అన్ని ముఖ్యసంస్థలకు లాగే 'డాడ్' హెడ్డాఫీసు కూడా బాన్ నగరంలోనే ఉండేది.

అంటే నాకు చెప్పకుండా రాలెక్ కూడా నా గురించి తన ప్రయత్నాలు చేస్తున్నాడన్నమాట!

శ్రీమతి నా గురించి అనుకుంటున్నది నిజమేనా- అని ఒక్క క్షణం అనిపించినా- తర్వాత నా ఆలోచనలు వేరే దారిలో వెళ్లాయి.

మా డైరెక్టర్ ప్రఫుల్ల మొండి మనిషి. తనకి నచ్చనిది ఆపడానికి ఎంత దూరమైనా వెళ్లగలడు. ఇంతకాలం నేనాయనకు చేసిన, చేస్తున్న నచ్చని పని- ఒక్కటంటే ఒక్కటే! అది నా బాస్ భరత్‌కి విధేయుడిగా ఉండడం. ఐతే అది నా అసహాయత అని సరిపెట్టుకుంటున్నాడు. తను వద్దన్నా అదనంగా మూడు నెలలు ఇక్కడుండాలని ప్రయత్నించడాన్ని ఆయన సహించడు. ఇప్పటికే మండిపడుతుంటాడు.

భరత్‌కీ ప్రఫుల్లకీ అంతగా పడదు. ఇప్పుడు భరత్ నాకోసం చేసే ప్రయత్నాలా అగ్నికి ఆజ్యం పోస్తాయి.

సైంటిఫిక్ రీసెర్చిలో రాజకీయాలు మహా మహా సత్యేంద్రనాథ్ బోస్ వంటివారికే తప్పలేదు. నేననగా ఎంత? కానీ అటు రాలెక్‌కీ, ఇటు భరత్‌కీ వాళ్ల ప్రయత్నాలు మానుకోమందామని చెబుదామంటే, మర్యాదగా ఉండదు

ఈ పరిణామం గురించి నేనింతలా ఆలోచించాను కానీ, శ్రీమతి మాత్రం, "మనకిక్కడ ఇంకా కొన్నాళ్లుండాలని రాసిపెట్టినట్లుంది. లేకపోతే మీరడక్కపోయినా రాలెక్ మీకోసం అంతలా పట్టుబట్టడు. అదీకాక, మీరిక్కడ అదనంగా మరో

మూణ్ణెల్లుంటే- మీరు అడక్కుండానే ఇక్కడ మీకేదో ఆఫరొస్తుందని నాకనిపిస్తోంది.
అప్పుడు బాండ్ సంగతి మర్చిపోయి ఇక్కడే సెటిల్ కావచ్చు" అంది.

మరీ చిన్న వయసులో పెళ్లి చేసుకుని నాతో వచ్చేసిందేమో- ఆమెకి తనవాళ్లకంటే కూడా నేనే ఎక్కువ. నేనే తన ప్రపంచం. నాతో కలిసిన ఆ ప్రపంచంలో- ఆమెకి ఇండియాకంటే జర్మనీ ఎక్కువ ఆకర్షణీయంగానూ, సదుపాయంగానూ అనిపించడం అసహజం కాదు.

"బాండ్ విషయంలో- దానికి విలువివ్వనివాళ్లు మనకి ఆదర్శంకాదు. మన ఆదర్శం నిజాయితీయే" అని ఆమెకు నచ్చజెప్పబోయాను.

శ్రీమతి వెంటనే, "మీరు నిజంగా నిజాయితీకోసం వెనక్కెళ్లిపోదామంటే, నా ఓటు మీకే! కానీ అసలు విషయం వేరే ఉంది. మీకే ఇక్కడ ఉండాలని లేదు. తొందరగా ఇండియా వెళ్లి మనవాళ్లని కలుసుకోవాలని మీ తహతహ. అందుకే ఇక్కడుండే ప్రయత్నాలు చెయ్యడం లేదు. కానీ కాస్త ఆలోచించండి. ఇండియాలో మనకేముంది- నెలజీతం తప్ప! ఇక్కడున్నామనుకోండి, అక్కడ పదేళ్లలో కూడబెట్టలేనిది- ఇక్కడ ఒక్క ఏడాదిలో సంపాదించొచ్చు. దాంతో మనవాళ్ల అవసరాలు తీర్చొచ్చు. ఏదో అనుకుంటాం కానీ, క్రమంగా మనవాళ్లకీ మన కంటే మన డబ్బే ఎక్కువ బాగుంటుంది. సంతోషిస్తారు" అంది.

ఆమె చెప్పింది చాలావరకూ నిజం. కానీ ఆమె అనుకుంటున్నట్లు అవకాశాలు నన్ను వెదుక్కుంటూ రావు. అందుకు నేను బాగా చొరవ చెయ్యాలి. అది నావల్ల కాదు. ఆపైన నేను నిజంగానే బాండ్‌కి కట్టుబడి ఉన్నాను. ఆ విషయం ఆమె నమ్మదల్చుకోలేదు.

అలాగని- శ్రీమతికి తనవాళ్లన్నా, జన్మభూమి అన్నా ఆకర్షణ లేదనుకోను. కానీ జన్మభూమిలో మా జీవితం గొప్పగా లేదు. అదప్పుడు తెలియలేదు. ఇక్కడికొచ్చేక తెలిసింది. ఈ జీవితాన్ని వదులుకోవాలని అనిపించడంలేదు.

ఇక నేను చెయ్యగలిగిందొక్కటే! తిరిగి వెళ్లేక- ఆమెకు అక్కడ కూడా ఇంత మంచి జీవితం ఇవ్వాలి. కానీ అదంత సులభసాధ్యమా?

రోజులు పరుగెడుతున్నాయి. నాకొచ్చిన మూణ్ణెల్ల ఎక్స్‌టెన్షనూ అయిపోవస్తోంది. తొందరపడొద్దన్న భరత్ ఉత్తరం తర్వాత, మా ఆఫీసునుంచి నాకే సమాచారమూ లేదు. ఏం జరుగుతోందక్కడ?

ఏంచెయ్యాలో తెలియక భరత్‌కి ఉత్తరం వ్రాస్తే, ఆయన్నుంచి బదులు లేదు. కానీ- భువనేశ్వర్లో మా ఆఫీసునుంచి ఉత్తరం వచ్చింది.

'నీ స్కాలర్‌షిప్ కాలపరిమితిని మూడు నెలలు పొడిగించడానికి అనుమతినిస్తూ గతంలో నీకు లేఖ వ్రాసాం. ఆ ప్రకారం నీవు రానున్న జనవరి మొదటి వారంలో ఆఫీసుకొచ్చి జాయినవాలి. కానీ నువ్వక్కడ అదనంగా మరో మూణ్ణెల్లు ఉండడానికి, అక్కడి 'డాడ్' ఆఫీసు ద్వారా ఇక్కడి ఆఫీసుమీద ఒత్తిడి తీసుకొస్తున్నావు. ఇది నియమభంగం. ఈ విషయమై నీమీద క్రమశిక్షణ చర్య ఎందుకు తీసుకోకూడదో వివరించ గోరతాము'

ఇదీ ఆ లేఖలో సారాంశం.

వ్రాసింది డైరెక్టరు కాదు. సీయస్ రావు అనే కొత్త అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు.

ఈ సీయస్ రావుగారి రాక గురించి అప్పటికే నాకు కొలీగ్సు ఉత్తరాల ద్వారా తెలిసింది.

కన్నడిగుడు. ఆయన, కుటుంబ సభ్యులు తెలుగు ధారాళంగా మాట్లాడుతారు. కాలనీలో తెలుగువారిలో ఒకడిగా కలిసిపోయాడు. మావాళ్లు జరుపుకునే తెలుగు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు.

'ఆయన సాహితీ ప్రియుడు. మీరెప్పుడొస్తారా, ఎప్పుడు కలుసుకుందామా- అని ఎదురు చూస్తున్నాడు' అని నా మిత్రుడు రవి ఉత్తరంలో వ్రాశాడు కూడా. ఆయన్ను కలుసుకుని పరిచయం చేసుకోవాలని నాకూ ఆత్రంగా ఉంది.

ముఖాముఖీ కలుసుకోకుండానే ఇప్పుడిలా జరిగింది మా పరిచయం. నిజానికాయన పంపింది లేఖ కాదు. తాఖీదు.

శ్రీమతికి చూపించాను. చదివి, "భయపడుతున్నారా?" అంది.

"భయమా, ఎందుకు? నావల్ల తప్పు జరిగితే కదా!" అన్నాను.

శ్రీమతి తృప్తి పడలేదు, "భయం కాకపోతే, మీలో ఆ టెన్షనెందుకు?" అంది.

"టెన్షనేం లేదు. కానీ మన జర్మనీ ట్రిప్పులో ఇంతవరకూ అన్నీ సజావుగా జరిగిపోయాయి. చివర్లో ఈ అపశ్రుతి ఏమిటీ అని కొంచెం అప్సెట్ అయ్యానంతే!" అన్నాను.

"మీవల్ల తప్పు జరగలేదని నమ్మకమేగా?"

"నూటికి నూరు శాతం" అన్నాను.

"ఐతే దీనికి దీటుగా బదులివ్వండి. ఏంచేస్తారో చూద్దాం" అంది శ్రీమతి.

ఆ గొంతులో ధ్వనించిన కసికి ఆశ్చర్యపోయాను.

దీటుగానే బదులివ్వాలని నాకూ ఉంది. కానీ పేదవాడి కోపం పెదవికి చేటు.

సీయస్ఐఆర్ సంస్థలో దేశమంతటా ఉన్న నలభైకి పైగా లేబరేటరీలన్నింటికీ- ఒకే ఒక్క విషయంలో సామ్యముంది. లేబరేటరీకి డైరెక్టర్ అంటే- రాష్ట్రానికి ముఖ్యమంత్రిలా అనుకోవడంలో!

పాలకుడూ, పాలితులూ సైంటిస్టులే కాబట్టి- రాజకీయాలు అంతగా ఉండవు. ఉన్నా వాటిలో అంతగా పస ఉండదు. ఐతే వివాదాలు వచ్చినప్పుడు మాత్రం- 'నా మాటే శాసనం' అన్న అధికారధోరణిని భరించాలి. తర్కం వాడితే అది కంఠశోషే ఔతుంది.

అందుకో చిన్న ఉదాహరణ.

ఇది భువనేశ్వర్లో కాదు- మరో రాష్ట్రంలో లేబరేటరీలో జరిగింది.

ఒక సైంటిస్టుకి కొన్నేళ్లుగా ప్రమోషన్ రావడం లేదు. ఐదేళ్లలో మూడు ఇంటర్వ్యూల్లో ఫెయిలయ్యాడు.

'నేనంటే డైరెక్టరుకి ఇష్టం లేదు. అందుకే నాకు ప్రమోషన్ రావడం లేదు' అని అతడు హెడ్డాఫీసుకి ఫిర్యాదు చేశాడు. హెడ్డాఫీసు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఓ త్రిసభ్య కమిటీ వేసింది. ఆ కమిటీ సమావేశంలో డైరెక్టరు, 'ఇతగాడు ఏ ప్రయోగమూ శ్రద్ధగా చెయ్యడు. ఒక్కసారి కూడా ఊహించిన ఫలితం రాలేదు' అని తన మాట చెప్పాడు. కమిటీ ఆ సైంటిస్టుని సంజాయిషీ అడిగింది.

'సర్! ఈయన నాకు డైరెక్టర్. ఈయన మాట నేను వినాలి. వింటాను. కానీ ప్రయోగాలు కూడా తన మాట వినాలంటే, ఇక ప్రయోగాలు చెయ్యడమెందుకు? ఆయనే ఫలితం చెప్పేస్తే సరిపోదూ! నేనైతే, చెప్పిన ప్రయోగం చెప్పింది చెప్పినట్లు చెయ్యగలను. ఊహించిన ఫలితం రాకపోతే, ఎందుకు రాలేదో చెప్పగలను. ఊహించిన ఫలితం రావడానికి ప్రయోగంలో మార్పులకు ప్రయత్నించగలను. కానీ ఆయన చెప్పిన ప్రయోగానికి, ఆయన చెప్పిన ఫలితమే వచ్చేలా చెయ్యలేను' అన్నాడా సైంటిస్టు. ఆ సంజాయిషీ ఆ సైంటిస్టు ప్రమోషనుకి సహకరించిందా, లేదా అన్నది అప్రస్తుతం. ఐనా అది మన కమిటీల పనితీరు తెలిసినవారెవరైనా ఊహించగలరు.

ఇండియాలో మా లేబరేటరీలో భరత్‌కీ, ప్రఫుల్లకీ అంతగా పడకపోయినా- ఇంతవరకూ నాకు వారిద్దరితోనూ కూడా గొడవలు లేవు. డైరెక్టరు అడ్డుపడుంటే నాకీ జర్మనీ అవకాశమొచ్చేదే కాదు. ఎక్స్‌టెన్షన్ కూడా అడిగినంతా ఇవ్వకపోయినా కొంత ఇవ్వడం ఆయనకు నేనంటే మరీ అయిష్టం లేదనడానికి నిదర్శనం. ఇప్పుడు మూడు నెలల అదనపు సమయంకోసం రగడ జరగడం నాకిష్టం లేదు.

సుమారు రెండేళ్లు ఇక్కడ హాయిగా ఉన్నాను. కుటుంబంతో కలిసి ఏడాదిగా సంతోషంగా గడిపాను. వెళ్లేటప్పుడు సంతోషంగా వెళ్లాలి. వెళ్లేక మా ఆఫీసులో నన్ను సగౌరవంగా రిసీవ్ చేసుకోవాలి. అంతా ఆహ్లాదకరంగా జరిగిపోవాలి.

అంటే ముందు నేను ఆ అదనపు మూడునెలల గురించి నాకేదో అన్యాయం జరిగిన భావననుంచి బయటపడాలి.

ఇక శ్రీమతి నన్ను దీటుగా బదులివ్వమంది. అది నా ఆత్మాభిమానానికి స్ఫూర్తి.

కర్ర విరక్కూడదు. పాము చావకూడదు. ఇంకోలా చెప్పాలంటే- బ్లో హాట్ బ్లో కోల్డ్ టెక్నిక్ వాడాలి!

ఆ మాట నేననగానే శ్రీమతి, "నాతో మీరెప్పుడూ బ్లోహాటే- బ్లో కోల్డులో మిమ్మల్ని చూడలేదు. ముందు నాతో ప్రాక్టీసు చేసి, తర్వాత ఉత్తరం వ్రాయండి" అంది.

అది విసురు అని నాకు తెలుసు. తనకి కోపమొస్తే, నేను రెట్టింపు కోపం తెచ్చుకోవడమే తప్ప, బ్రతిమలాడింది లేదని తనంటుంది. అందులో కొంత నిజముందని నాకూ తెలుసు. అందుకని వాదించడానికి బదులు మాట మారుస్తుంటాను.

"సరే, నీతో ఉన్న ప్రాక్టీసు ఆధారంగానే ఇప్పుడో ఉత్తరం డ్రాఫ్ట్ చేస్తాను. అది బ్లో హాట్ బ్లో కోల్డ్ ఔనో కాదో నువ్వే చెప్పాలి" అని జవాబివ్వడానికి సమయం ఇవ్వకుండా ఉత్తరం మొదలెట్టాను.

ఆ ఉత్తరంలో వ్రాసిన ప్రకారం....

నాకు జర్మనీలో అడ్వాన్స్‌డ్ రీసెర్చి చేసే అవకాశం కలిగించినది డైరెక్టరు. ఆయనకు కృతజ్ఞుణ్ణి. పశ్చిమ జర్మనీ చూడతగ్గ గొప్ప దేశం. అక్కడున్నది అనుసరించదగ్గ గొప్ప వ్యవస్థ. సైంటిఫిక్ రీసెర్చికి- అక్కడివారిది పరిణతి చెందిన సాంకేతిక నైపుణ్యం. వారి పాలనా వ్యవస్థ ఆదర్శప్రాయం. అక్కడున్న సదుపాయాలు, ప్రొఫెసర్ రాలెక్ వంటి ప్రతిభావంతుల సాహచర్యం- సైంటిస్టుల కల. నా ప్రయోగాలు సత్ఫలితాలనివ్వడం నా అదృష్టం. అందువల్ల మా లేబరేటరీకి మంచి పేరు రావడం నాకు గర్వకారణం. డైరెక్టరు అదనంగా నాకిచ్చిన మూడు నెల్ల సమయం సద్వినియోగం కావడంతో నాకు పరిపూర్ణతృప్తి కలిగింది. అందుకే ఉన్నది చాలనుకుని, భువనేశ్వర్లో మాసంస్థలో మా డైరెక్టరుతో ఈ అనుభవాలన్నీ పంచుకునే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. బాధ్యత తెలిసిన సైంటిస్టుగా, నియమపాలనకు ప్రాధాన్యమిచ్చే ఉద్యోగిగా- తిరుగు ప్రయాణానికి ఏర్పాటు చేసుకుంటున్నాను.

అది బ్లో కోల్డ్. ఇక బ్లో హాట్ కొస్తే-

ఆఫీసునుంచి అడ్మిసిస్ట్రేటివ్ ఆఫీసర్నుంచి నాకో ఉత్తరమొచ్చింది. ఆ ఉత్తరంలో వ్రాసినవన్నీ తప్పుడు ఆరోపణలు. ఆ విషయం ఋజువు చెయ్యడానికి తగిన ఆధారాలు నావద్ద ఉన్నాయి. ఆ ఆఫీసరు నాపై చేసిన ఆరోపణలకు ఆధారాలు విచారించి, అతడు ఈ ఉత్తరం వ్రాయడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించేడా అన్నది పరిశీలించాలి. అందుకు అనువుగా ఉంటుందని- ఆ ఆఫీసరు నాకు లేఖగా పంపిన తాఖీదు జిరాక్సు కాపీని జతపర్చి- ఆ మేరకు డైరెక్టరుకి ఉత్తరం వ్రాశాను.

నేనా ఆఫీసరు గురించి ఉత్తరంలో అంత ఘాటుగా వ్రాయడానికి కారణాలున్నాయి.

ఒకటిః నా నిజాయితీ. ఎక్స్‌టెన్షన్ గురించి నేనెప్పుడూ ఎవరిమీదా ఒత్తిడి తేలేదు. తెచ్చానని ఎవరైనా ఆరోపించినా అందుకు సాక్ష్యం లేదు. సాక్ష్యం లేకుండా అఫీషియల్‌గా అటువంటి ఉత్తరాలు వ్రాయకూడదు.

రెండుః నిజానికా ఉత్తరం వ్రాయించింది మా డైరెక్టరని నాకు తెలుసు. ఏదో అక్కసులో నన్ను బెదిరించాలన్న ఆలోచన కలిగింది. సాక్ష్యం లేకుండా ఆలాంటి ఉత్తరం వ్రాయకూడదు కాబట్టి- తను వ్రాయకుండా, ఆఫీసరు చేత వ్రాయించాడు. అది పొరపాటని తెలిసినా ఆఫీసరుకది అసహాయత. పై అధికారికి సలహా ఇవ్వగలడు కానీ, పాటించకపోతే ఆయన శాసనాల్ని పాటించక తప్పదు. ఆ విషయం తెలిసినా నేను- ఆ ఉత్తరానికి ఆఫీసర్నే తప్ప డైరెక్టర్ని తప్పు పట్టలేదు. నా కోపం న్యాయమైనదే ఐనా- అది ఆఫీసరుమీదనే కానీ తనమీద కాదని డైరెక్టరు అనుకోవాలి.

మూడుః ఆ ఉత్తరం ఆఫీసు ఫైల్సులో నమోదై ఉండదని నా నమ్మకం. నమోదు కాని ఉత్తరానికొచ్చిన జవాబుపై చర్యలేముంటాయ్!

శ్రీమతికి ఈ ఉత్తరం చదివి వినిపిస్తే, "మీ ఉత్తరం బ్లో హాట్, బ్లో కోల్డ్‌కి మెచ్చుకోతగ్గ ఉదాహరణ అని ఒప్పుకుంటాను. కానీ ఈ ప్రాక్టీసు నాతో జరిగిందని మాత్రం ఒప్పుకోను. కర్ణుడికి కవచకుండలాల్లా ఈ కళ మీకు పుట్టుకతో వచ్చి ఉండాలి" అంది వెంటనే.

అని ఊరుకుందా, "ఇన్నాళ్లూ మీకు చేతకాదు కామోసనుకుని సరిపెట్టుకుంటున్నాను. ఇకమీదట నాకు కోపమొస్తే మీరు రెట్టింపు కోపంతో బదులిస్తే సహించేది లేదు" అని హెచ్చరించింది.

నేను వ్రాసిన ఆ ఉత్తరాన్ని శ్రీమతికి తప్ప ఇంకెవ్వరికీ చూపించలేదు. మర్నాడది పోస్టు చేసేక- మనసు బాగా తేలిక పడింది.

ఇక తిరుగు ప్రయాణానికి టికెట్ బుక్ చెయ్యాలి. పీత కష్టాలు పీతవి అన్నట్లు- ఆ బుకింగు కూడా స్వర్గావరోహణలో తన పాత్ర పోషించింది....

స్వర్గావరోహణ పర్వంలో ఎప్పుడు, ఎక్కడ, ఎలా

మకాం మార్చే ప్రయాణానికి- ఎప్పుడు, ఎక్కడ, ఎలా అనే మూడు నిర్ణయాలు ముఖ్యమైనవి, క్లిష్టమైనవి అంటారు. ఆ మాట అందరికీ, అన్నివేళలా వర్తిస్తుందనను. కానీ- ఏడాదిపాటు విదేశంలో సకుటుంబంగా కులాసాగా గడిపిన మాకు- స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ఈ నిర్ణయాలు ఎన్నో సందిగ్ధాలకు దారి తీసిన మాట నిజం. వాటిలో ప్రయాణం 'ఎప్పుడు'- అన్న విషయానికొస్తే-

నావంటి స్కాలర్సు విషయంలో డాడ్ సంస్థ చాలా ఉదారంగా ఉంటుంది. నెల జీతం అంతకు ముందు నెలలో చివరి తేదీకే ఇచ్చేస్తుంది. ఇక తిరుగుప్రయాణమయ్యే నెలలో కూడా– నెలాఖరు దాకా ఉండక్కర్లేదు. మొదటి ఎనిమిది రోజులు పని చేస్తే చాలు! అందుకని మేము 'ఎప్పుడు' వెనక్కి వెళ్లిపోతామన్న విషయం డాడ్ ఆఫీసుకి ముందుగా తెలియబర్చాలి.

ఆ పని చేసేయొచ్చుగా, దీనికి మీమాంస ఎందుకు, అంటే–

డాడ్ ఉదారంగా వ్యవహరించినా– నేనొచ్చిన రీసెర్చి పని పట్ల నాకూ బాధ్యత ఉంది. రీసెర్చిపరంగా ఇక్కడుండే ప్రతిరోజూ నాకెంతో విలువైనది. వాటిలో ఒక్క రోజు వదులుకున్నా– ఆ మేరకు ఇండియాలో మా సంస్థకు నష్టమే!

మామూలుగా నా స్కాలర్‌షిప్ అక్టోబర్ 31 వరకూ. ఎక్స్‌టెన్షన్ తర్వాత అది వచ్చే సంవత్సరం మార్చి 31 వరకూ అయింది. కానీ మా ఆఫీసు అనుమతించింది డిసెంబర్ 31 వరకూ. కాబట్టి నేను డిసెంబరు 31 తర్వాతనే ఇండియాకు ప్రయాణమవాలని నా ఉద్దేశ్యం.

శ్రీమతి ఒప్పుకోలేదు. మనిషికి నిజాయితీ, బాధ్యత ఉండాలని నేనూ అంటాను. కానీ ఈ విషయంలో అవి అర్థరహితం. మీరే చూడండి– డిసెంబర్ చివరి వారమంతా సెలవులే. ఆఫీసుకి కూడా చాలామంది రారు. ఇక్కడుండడం– ఉన్నామన్న పేరుకే" అందామె.

అదీ నిజమే!

యూరప్‌లో క్రిస్మస్ చాలా పెద్ద పండుగ. నేను గ్రహించిన మేరకు జర్మనీలో డిసెంబర్లో ముఖ్యంగా 24, 25 తేదీల్లో వైనాక్టెన్ పేరిట ఘనంగానూ, ఆత్మీయంగానూ వేడుక జరుపుకుంటారు. తమ ప్రేమాభిమానాల్ని కానుకల రూపంలో పంచుకుంటారు. ఆ రెండు రోజులూ అక్కడ పోస్టాఫీసుతో సహా అన్ని సంస్థల కార్యాలయాలూ మూసేస్తారు.

24 బుధవారం అయింది, 25 లక్ష్మివారం. 26 శుక్రవారం. తర్వాత శని, ఆదివారాలు. ఆ తర్వాత ఆ నెలకు మిగిలిన పనిదినాలు మూడంటే మూడు. ఆ తర్వాత జనవరి 1 కొత్త సంవత్సరం.

తిరిగేవాళ్లు తిరుగుతారు. తాగేవాళ్లు తాగుతారు.

వారివారి అభిరుచుల ప్రకారం వైనాక్టెన్ ఎంజాయ్ చెయ్యాలని అంతా అనుకుంటారు.

కొత్త సంవత్సరం దాటేవరకూ ఆఫీసులకి వెళ్లేవారుండరు– ఏ నాలాంటివారో అతికొద్దిమంది తప్ప!

ఐనప్పటికీ నాకు డిసెంబర్లో ప్రయాణమవడానికి మనసొప్పలేదు. శ్రీమతికి నచ్చజెప్పడానికి అట్నించి నరుక్కొచ్చాను.

యూరప్‌లో క్రిస్మస్ వేడుకలు చూడడం కూడా ఒక గొప్ప అనుభవం. గత సంవత్సరం ఆ వేడుకల్ని చూసి దిమ్మెరపోయాను. శ్రీమతి, పిల్లలు అవి చూడలేదే అని తెగ బాధ పడ్డాను. క్రిస్మస్ లోగా వాళ్లను తీసుకు రావాలంటే– అప్పుడు తేదీలు కుదరలేదు.

వాళ్లు జనవరిలో వచ్చారు. మేమక్కడ ఉండేది అక్టోబరు వరకూ మాత్రమే కాబట్టి– మావాళ్లకు క్రిస్మస్ వేడుకలు చూసే అవకాశం లేదనే అనుకున్నాను.

కానీ అనుకోకుండా మేము డిసెంబర్ 31వరకూ ఉండడానికి– ఇటు డాడ్, ఇటు మా ఆఫీసూ కూడా సమ్మతించాయి.

మన దేశంలో సంక్రాంతి, ఉగాది, వినాయకచవితి, దసరా– ఇలాంటి పండుగ వేడుకలకోసం ఏటా ఎదురు చూస్తుంటాం.

పేదలతో నిండిన పేద దేశంలోనే ఇలా ఉంటే– జర్మనీ డబ్బుతో మూలిగిపోతున్న దేశం. డబ్బు లెక్కలేనివాళ్లు జర్మన్లు.

ప్రతి రోజూ పండుగలా జరుపుకునే ఈ దేశంలో క్రిస్మస్ లాంటి పండుగ వేడుకలెలా ఉంటాయో చూడ్డం ఓ గొప్ప అనుభవం కాదా?

"కుదరనివాళ్లకి కుదరదు. మనకి అవకాశం వచ్చింది. ఈసారి మీరు పక్కనుండడంవల్ల రెట్టించిన ఉత్సాహంతో ఇక్కడి క్రిస్మస్ వేడుకల్ని అస్వాదిస్తాను" అన్నాను శ్రీమతితో.

నేను చెప్పింది అర్థమైన మేరకు పిల్లలు బాగా ఉత్సాహపడ్డారు. దాంతో శ్రీమతికి కూడా తన ఉత్సాహాన్ని బయటపెట్టక తప్పలేదు.

జనవరి మొదటి వారానికి మా ప్రయాణమని నిశ్చయించేక– ఆఫీసులో మిత్రులకి చెప్పాను.

"అప్పుడే నువ్వెళ్లిపోయే రోజు వచ్చేస్తోందా?" అని డెకర్ట్, మ్యుల్లర్ బాధ పడ్డారు.

కిర్ష్‌నర్ తనూ బాధ పడుతూనే, మాపిల్లల ఆటలకి తాత్కాలికంగా తనిచ్చిన కిరాణా దుకాణం బొమ్మని ప్రస్తావించాడు.

మా ప్రయాణానికి ఇంకా నెలన్నరపైన ఉన్నప్పటికీ– నేనా బొమ్మని మర్నాడే ఆఫీసుకి చేర్చాను. కారులో ఐతే డిక్కీలో ఇమిడిపోతుంది కానీ, దానికోసం కిర్ష్‌నర్ని మా ఇంటికి పిలిచే ఉద్దేశ్యం లేదు. ఎందుకంటే– ఇంటికొస్తే తినడానికో, తాగడానికో ఏమైనా ఇచ్చి పంపడం మర్యాద. కానీ ఆతిథ్యం అతడికి ఇబ్బంది. ఆపైన అతడి మనసు మంచిదే కానీ, ఇబ్బందికి సద్దుకుపోయే ఔదార్యం తక్కువ. ఆసక్తి ఐతే అటూ ఇటూ కూడా తక్కువే.

బొమ్మ తిరిగివ్వగానే కిర్ష్‌నర్ మొహం ఇంతయింది, "నాకేం అర్జంటు లేదు. ఇంకా టైముందిగా" అని మర్యాద చూపాడు. అది తనకు బాల్యస్మృతి అనీ, దాచుకోవాలన్న మమకారాన్ని చంపుకోలేకపోతున్నాననీ, లేకపోతే మా పిల్లలకు శాశ్వతంగా ఇచ్చేసేవాణ్ణని సంజాయిషీ కూడా ఇచ్చాడు. కాస్త ముందు చెబితే కారు తీసుకొచ్చేవాణ్ణంటూ– నేనది మోసుకొచ్చినందుకు నొచ్చుకున్నాడు.

"పిల్లల సంగతి తెలియనిదేముంది? ఎంత గొప్ప వస్తువైనా వాళ్ల మోజు కొన్నాళ్లే! నువ్విచ్చిన ఈ బొమ్మతో ఇన్నాళ్లు ఆడుకోవడమే విశేషం. ఇక ఈ బొమ్మ విషయానికొస్తే– కూడా స్వదేశం తీసుకెళ్లడానికి అనువైనది కాదు. ఐనా పిల్లలు మనసు పడి బలవంతపెడితే, కొనాల్సి వచ్చేదేమో! అప్పుడైనా వెళ్లేముందు ఇక్కడే ఇంకెవరికో ఇచ్చేసి ఉండేవాణ్ణి. నువ్వు నాకా అగత్యం తప్పించి పెద్ద మనసుతో ఈ బొమ్మనిచ్చావు. అందుకు నీకు థాంక్స్ చెప్పాలి" అని మనస్ఫూర్తిగా అన్నాను.

ఏషియన్సు అంటే అతడికి కొంత చిన్నచూపు. కొంత అసహనం. తనకు సహకరించే కొలీగ్స్ లేక మాట్లాడేటప్పుడు తనని తాను అదుపు చేసుకునేందుకు ప్రయత్నించేవాడు. నేను శాంతంగా తిప్పికొడితే ఉడుక్కునేవాడు. ఐతే నేనతణ్ణి ఒక్కసారి కూడా పల్లెత్తు మాట అనలేదు. ఇతర జర్మన్ కొలీగ్సే నావంటివారి పట్ల అతడి మాతతీరుకి నొచ్చుకునేవారు. మా విషయంలో ఆఫీసులో తనొక్కడి ప్రవర్తనా భిన్నంగా ఉన్నట్లు అతడికే గ్రహింపుకొచ్చిందేమో, క్రమంగా అతడిలో మార్పు మొదలైంది. చివరకు తనే ఆఫర్ చేసి– మా పిల్లలకు తన చిన్నప్పటి బొమ్మనివ్వడానికి కారేసుకుని మా ఇంటికొచ్చేడు. అప్పటి మా ఆతిథ్యాని పరోక్షంగా చిన్నబుచ్చినా– నా పట్ల స్నేహభావానికి లోటు రానివ్వలేదు.

వందల సంవత్సరాల రాజరికపు దాస్యసృంఖలాలనుంచి విముక్తులమై, ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాం. తర్వాత దశాబ్దాలు గడిచినా, మన నాయకులు– ప్రజాసేవ చేస్తామని సామాన్య ప్రజలముందు చేతులు జోడించి వేడుకుని, అలా లభించిన ఓట్లతో ప్రజానాయకులై– ఆ సామాన్య ప్రజలనే అహంకారంతో నిరసిస్తున్న దేశంనుంచి వచ్చాను నేను.

రెండవ ప్రపంచయుద్ధంలో సర్వనాశనమైన దేశాన్ని– ప్రపంచదేశాల్లో ఒక ఉన్నత ఆర్థికవ్యవస్థగా నిలపాలన్న ఆశయాన్ని– అపూర్వమైన స్వయంకృషితో– పాతికేళ్లలోనే సాధించిన పౌరులున్న దేశమిది. వారిలో కొందరికి అహంకారముంటే ఆ అర్హతనూ వారు సాధించుకున్నారని సరిపెట్టుకోగలను.

అందుకే కిర్ష్‌నర్ అంటే నాకెప్పుడూ స్నేహభావం తప్ప మరొకటి లేదు.

అక్కడున్న నా మిత్రులలో అహమ్మద్‌కి నావద్ద చొరవ ఎక్కువ. సున్నితమైన అంశాన్ని కూడా నావద్ద ప్రస్తావించడానికి సంకోచించడు. నా తిరుగు ప్రయాణం గురించి విని, "రావ్! నాదో సలహా! ఎలాగూ జనవరిలో వెడదామని అనుకుంటున్నప్పుడు ప్రయాణం జనవరి 8 తర్వాత పెట్టుకో. ఆ నెల స్కాలర్‌షిప్ కూడా దక్కించుకోవచ్చు" అన్నాడతడు.

ఈ సలహాకి బదులుగా, నేను సూటిగా నా మనోభావాల్ని చెప్పొచ్చు. కానీ అందువల్ల అతణ్ణి చిన్నబుచ్చినట్లవుతుందే తప్ప మరే ప్రయోజనమూ ఉండదు.

అహమ్మద్ మంచివాడే కానీ– నీతీ నిజాయితీల పట్టింపు తక్కువ. అలాగని అతడిపై నాకు తక్కువ భావం లేదు.

నీతి, నిజాయితీలకు ఈ ప్రపంచంలో సరైన నిర్వచనం లేదు. ఒక జీవన విధానానికి అలవాటుపడ్డ నేననుకునే నీతి, నిజాయితీలు అతడికి విచిత్రంగా అనిపించొచ్చు. అతడి జీవన విధానంలో, అతడుంటున్న సమాజంలో, అతడు నమ్మే సిద్ధాంతాల్లో– నేననుకునే నీతి, నిజాయితీలకున్న ప్రాధాన్యం వేరు కావచ్చు.

ఏ మనిషికీ చెడ్డవాడిననిపించుకోవాలనుండదు. దుర్మార్గుడు కూడా తను మంచివాడిననే అనుకుంటాడు. తన మంచితనానికి గుర్తింపు లభించాలని తాపత్రయం కూడా పడతాడు.

అహమ్మద్ నాకా సలహా ఇవ్వడంవల్ల– అతడికేం ప్రయోజనం లేదు. నాకు లాభం చెయ్యాలన్న సదుద్దేశ్యంతో ఆ మాటన్నాడు. అలాంటప్పుడు అతడికి నీతి, నిజాయితీల గురించి నా భావాలు చెబితే, అదతణ్ణి చిన్నబుచ్చడమే ఔతుంది.

ఒక విధంగా అతడి సలహాలో అర్థమూ ఉంది.

నాకు డాడ్ ఆరునెలలు ఎక్స్‌టెన్షన్ ఇచ్చింది. జనవరినుంచి మార్చి దాకా నేనిక్కడే కొనసాగితే, ఆ మూడు నెలలూ కూడా ఠంచనుగా నా జీతం అందుతుంది. మూడు నెలలు దాటి ఉండొద్దన్నది మా ఆఫీసు శాసనం. దాన్ని పాటించాలా వద్దా అన్నది నా ఇష్టం.

నేను మా ఆఫీసు శాసనాన్నే పాటించాలనుకున్నాను. అంటే మూడు నెలలకి మాత్రమే జీతం తీసుకోవాలి. అహమ్మద్ చెప్పినట్లు జనవరికి కూడా జీతం తీసుకున్నానా– నేను నాలుగు నెలల జీతం తీసుకున్నట్లు ఔతుంది.

అందుకు డాడ్ అభ్యంతరపెట్టదు. కానీ మనస్సాక్షి!

ఇదంతా అహమ్మద్‌కి చెప్పడం అనవసరం అనుకున్నాను. అతడి సలహాని మెచ్చుకుని, థాంక్స్ చెప్పాను. వోభీ ఖుష్, మైభీ ఖుష్!

జనవరి మొదటివారంలో 5వ తేదీ దాటకుండా టికెట్లు బుక్ చెయ్యాలని నేను, శ్రీమతి కలిసి ఓనిర్ణయానికొచ్చాం. అలా 'ఎప్పుడు' మీమాంస తీరింది. ఇక 'ఎక్కడ' అన్న మీమాంస.

జనవరిలో ప్రయాణమనుకోగానే శ్రీమతి, "మన ప్రయాణం ఎక్కణ్ణించి?" అనడిగింది.

"ఎక్కణ్ణించేమిటి? మనం కొన్న టికెట్లు రానూ పోనూ అని మర్చిపోయావా?" అన్నాను ఆశ్చర్యంగా.

శ్రీమతి వెంటనే, "తెలియక మొసళ్ల కొలనులో దూకి, ఎలాగో వాటి బారినుంచి తప్పించుకుని బయటపడితే అది అదృష్టం. ఐతే అదృష్టాన్ని నమ్ముకుని మళ్లీ మొసళ్ల కొలనులో దూకితే అది ఆత్మహత్యతో సమానం కదూ!' అంది నర్మగర్భంగా.

నాకు అర్థం కాలేదు, "హాయిగా వెనక్కి తిరిగివెడుతున్నప్పుడు ఈ ఆత్మహత్యల ప్రస్తావన ఎందుకు?" అన్నాను ఆశ్చర్యంగా.

"ఇప్పుడు నేనొక్కత్తినీ, ఇద్దరు పిల్లల్నీ సామాన్నీ తీసుకుని ఈస్ట్ బెర్లిన్ వెళ్లి, ఏరోఫ్లోట్ విమానమెక్కి, మాస్కోలో దిగి, అక్కడ కొన్ని గంటలు ఆగి....." అని ఇంకా ఏదో అనబోతుంటే–

ఆమె మాటల లోతు అప్పుడర్థమైంది, "అర్థమైంది. మళ్లీ అలాంటి ప్రయాణం చెయ్యలేనంటావు. అంతేనా?" అన్నాను.

"ఔను. ఈసారి మీరు పక్కన లేకుండా నేను ప్రయాణం చెయ్యను" అంది శ్రీమతి.

విమానంలో భార్యాబిడ్డలతో కలిసి ప్రయాణం చెయ్యడం నాకూ ఇష్టమే!

కానీ ఇక్కడో మెలిక ఉంది.

నేనున్నది జర్మనీ. డాడ్ జర్మన్ సంస్థ. వారి కార్యక్రమాలన్నింటికీ జర్మన్ లావాదేవీల ముడి ఉంటుంది.

నేనిక్కడికి లుఫ్తాన్సా విమానంలో వచ్చాను. లుఫ్తాన్సాలోనే వెళ్లాలి. లుఫ్తాన్సా జర్మన్ కంపెనీ.

నేను భార్యాబిడ్డలతో కలిసి ఇండియాకు తిరిగి వెళ్లాలంటే, లుఫ్తాన్సాలోనే వెళ్లాలి. వాళ్ల టికెట్ ఖర్చు డాడ్ భరించదు. నేనే పెట్టుకోవాలి. లుఫ్తాన్సా టికెట్ ధర ఏరోఫ్లోట్‌లో రానూపోనూ కలిపి అయిందానికంటే ఎక్కువ.

పోనీ నేను, మావాళ్లూ కలిసి ఇంకేమైనా ఫ్లైట్లో వెడదామంటే అప్పుడు డాడ్ నా టికెట్ ఖర్చు భరించదు. లుఫ్తాన్సా ఐతేనే వాళ్లు నా ఖర్చు భరిస్తారు.

ఈ విషయమై మిగతా ఇండియన్స్ ఏంచేస్తున్నారని వాకబు చేశాను.

వాళ్లు కూడా ప్రయాణం భార్యాబిడ్డలతో కలిసి చెయ్యడం లేదు. ఐతే తమవాళ్ల రాకపోకలకి ఏరోఫ్లోట్‌లో కాక, ఎయిరిండియాని ఎంచుకున్నారు.

ఎయిరిండియా గురించి నాకూ తెలుసు. శ్రీమతి ఇక్కడికి వచ్చేటప్పుడు కూడా ఎయిరిండియా ప్రపోజలూ వచ్చింది. రానూపోనూ కలిపి ఒక మనిషికి ఏరో ఫ్లోట్‌లో పన్నెండొందలైతే, ఎయిరిండియా పదమూడొందలు.

ఐతే నేను ఏరోఫ్లోట్‌ని ఎంచుకోవడానికి కారణం– వంద రూపాయలకు కక్కుర్తిపడ్డం కాదు.

ఎయిరిండియా చార్టర్డ్ ఫ్లైట్స్ నేరుగా బెర్లిన్‌కి రావు. వచ్చేవాళ్లు నెదర్లాండ్‌లో ఆమ్‌స్టర్‌డామ్‌లో దిగాలి. ఎక్కేవాళ్లూ అక్కణ్ణించే ఎక్కాలి.

ఏరోఫ్లోట్ ఐతే నేరుగా బెర్లిన్ వచ్చేయొచ్చు కదా అనుకున్నాను. కానీ ఆ బెర్లిన్ తూర్పు బెర్లిన్ కావడమూ– ఆ విమానాశ్రయం తూర్పు బెర్లిన్లో కాకుండా తూర్పు జర్మనీలో ఉండడమూ– ఆ కథంతా ఇదివరకు చెప్పుకున్నాం కదా!

శ్రీమతి మొసళ్ల కొలనుని ప్రస్తావించడానికి అదీ కారణం!

అప్పుడైతే తెలియదు. ఇప్పుడు తెలుసు కాబట్టి– ఆ తప్పు మళ్లీ చెయ్యకూడదంటుందామె.

నేను వెంటనే ఈ టికెట్లు బుక్ చేసిన ట్రావెల్ ఏజంట్ సేన్‌కి కబురెట్టాను. అతడు వచ్చాడు.

పరిస్థితిని వివరించి చెప్పేక, అతడు కొన్ని విషయాలు చెప్పి మమ్మల్ని నిదానంగా అలోచించుకోమన్నాడు.

ఒకటిః బుక్ చేసిన టికెట్ కేన్సిల్ చెయ్యదల్చుకుంటే– ఏరోఫ్లోట్ సంస్థకి కనీసం మూడు నెలలు ముందు చెప్పాలి. లేకపోతే రిఫండ్‌గా వచ్చే మొత్తం బాగా తగ్గిపోతుంది. ఇప్పుడు మేమిచ్చిన టైం ఆరు వారాలే కాబట్టి కొంత నష్టానికి సిద్ధపడాలి.

రెండుః టికెట్‌ని ఇండియా వెళ్లే వేరెవరికైనా బదిలీ చెయ్యొచ్చు. మాకెవరికైనా తెలిసినవారుంటే సరేసరి, లేకుంటే తన వంతు ప్రయత్నం తను చేస్తాడు. ఎటొచ్చీ అందుకు కొంచెం టైం పట్టొచ్చు.

మూడుః ఎయిరిండియా విమానం ఎక్కడానికి ఆమ్‌స్టర్‌డామ్ వెళ్లాలన్న నియమం లేదు. జర్మనీలో ఫ్రాంక్‌ఫుర్ట్ నించి కూడా ఎయిరిండియా ఫ్లైట్సున్నాయి.

నాలుగుః పశ్చిమ బెర్లిన్ నుంచి ఫ్రాంక్‌ఫుర్ట్ వెళ్లడానికి విమానంకంటే ట్రైన్ ఐతే చౌక. విమానంలోనే వెళ్లాలని అనుకుంటే, టికెట్లను ముందుగా తనే బుక్ చేస్తాడు.

అతడు చెప్పింది సావధానంగా విన్నాక, "టికెట్ బదిలీ చెయ్యడానికి మాకు తెలిసినవారెవ్వరూ లేరు. నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. మిగతా విషయాలు రెండు మూడు రోజుల్లో చెబుతాను" అని అతణ్ణి పంపేశాను.

అతడు వెళ్లిపోయేక, "ఒక విషయంలో నా నిర్ణయం ఐపోయింది. నువ్వు ఏరోఫ్లేట్‌లో వెళ్లడం లేదు. ఆలోచించాల్సిందల్లా– మనం కలిసి ప్రయాణం చెయ్యాలా, విడివిడిగా వెళ్లాలా అని!" అన్నాను.

కలిసి ప్రయాణం చెయ్యాలనుకుంటే– ఖర్చు తడిసి మోపెడౌతుంది. కానీ ఆ నిర్ణయం నేను కాదు, తను తీసుకోవాలి.

శ్రీమతి క్షణం కూడా జాప్యం చెయ్యలేదు, "ఎయిరిండియా ఫ్రాంక్‌ఫుర్ట్‌నుంచి బయల్దేరుతుందిగా, మీరు మమ్మల్ని అక్కడ ప్లేనెక్కించండి. ముంబైలో దిగేసరికి మీ అన్నయ్య మమ్మల్ని రిసీవ్ చేసుకుంటాడు. ఇందులో పెద్దగా అలోచించాల్సిందేముంది?" అంది.

మొదట్నించీ తనంతే! ఏ నిర్ణయం తీసుకున్నా ఆర్థికపరిస్థితిని అంచనా వేస్తుంది. అందులో తనకి కాస్త ఇబ్బంది ఉన్నా, తేలిక చేసి చెప్పి, నా మనసు తేలిక పరుస్తుంది.

ఏరోఫ్లోట్ విషయమై ఆమె అభ్యంతరంలో న్యాయముంది. అసలు తనకంటే ముందు నేనా విషయం ఆలోచించాల్సింది.

ఏమైతేనేం మా ప్రయాణం 'ఎక్కడ' అన్నది తేలిపోయింది. పశ్చిమ బెర్లిన్‌నుంచి కలిసి ట్రైనులోనూ, ఫ్రాంక్‌ఫుర్ట్ నుంచి విడివిడిగా విమానంలోనూ వెళ్లాలన్న నిర్ణయమయ్యేక- సేన్‌కి చెప్పేశాను. తర్వాత...

నేననుకున్నట్లే మావాళ్ల టికెట్లు బదిలీ చెయ్యడానికి ఎవరూ దొరకలేదు. అటు డాడ్, ఇటు సేన్‌కి చెప్పి మా టికెట్లు బుక్ చేయించాం.

ఈ ప్రయాణంలో మావాళ్ల గురించి నాకు అదనంగా 800 మార్కులు ఖర్చు చెయ్యాల్సొచ్చింది.

ఆర్థికపరంగా పెరిగిన ఆత్మవిశ్వాసం కొంత. అక్కడ ఎంతో పొదుపుగా ఉండడం కొంత. ఆ ఖర్చు మాకు భారంగా అనిపించలేదు.

మా టికెట్లకు డేట్సు వచ్చేశాయి.

మేమంతా కలిసి ట్రైన్లో ఫ్రాంక్‌ఫుర్ట్ వెడతాం. అక్కడ ముందు మావాళ్లని నేను ప్లేనెక్కిస్తాను. మర్నాడు రాత్రికి నా ప్రయాణం.

ఎప్పుడు, ఎక్కడ అన్నది తేలిపోయింది. ఇక 'ఎలా' అన్న మరో ముఖ్యాంశం మిగిలింది.

మా ఇద్దరివీ పెద్ద కుటుంబాలు. ఆపైన ఉమ్మడి కుటుంబాలు కూడాను.

అన్నలు, అక్కలు, తమ్ముళ్లు, చెల్లెళ్లు, మేనత్తలు, మేనమామలు, పినతల్లులు, బాబాయిలు, తలిదండ్రులు, అత్తమామలు....

ఇవి దూరపు బంధుత్వాలు కావు. మేమంతా ఏదో ఒక సమయంలో ఒకే కుటుంబం అనిపించేలా కలిసి ఉన్నవాళ్లం. అందరితోనూ మరచిపోలేని అత్మీయానుబంధముంది.

అలాగే భువనేశ్వర్లో మా ఆఫీసులోనూ- ముఖ్యంగా తెలుగువారిలోనూ చాలామందితో- మేమంతా ఒకే కుటుంబం అనిపించేటంత ఆత్మీయానుబంధం ఉంది.

వీలు, ప్రాధాన్యాల్నిబట్టి కుటుంబానికో, వ్యక్తులకో- చిన్నదో, పెద్దదో- జ్ఞాపిక ఇవ్వాలనుకున్నాం.

అప్పటికే కొందరు మమ్మల్ని స్టెతస్కోపు, ఆడియో కాసెట్లు, ఫోటో రీల్సు వగైరాలు కావాలని అడిగారు. కూడా తీసుకెడితే బరువు ఎక్కువౌతుందని కాసెట్లని మాత్రం మేము పోస్టల్ పార్సెల్సుగా కొందరికి పంపాం. ఎందుకంటే మాకు కావాల్సిన కాసెట్లని కూడా మేము మా పేరిట పార్సెల్సుగా పంపుకున్నాం.

జ్ఞాపిక ఆలోచన మొదట్నించీ ఉండడంవల్ల బయటికెళ్లినప్పుడల్లా- ఎవరికి ఏ కానుక ఇవ్వాలీ- ఎంతలో ఇవ్వాలీ అన్న ధ్యాసతో దుకాణాల్ని గమనిస్తుండేవాళ్లం. మరీ నచ్చినవీ, అనువుగా ఉన్నవీ వెంటనే కొనేసినా- వాయిదా వేసినవి చాలా ఉన్నాయి.

ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చింది.

నాలుగున్నర దశాబ్దాల్లో వచ్చిన మార్పులవల్ల అప్పటి మా ఆలోచనలు హాస్యాస్పదంగా అనిపించవచ్చు. కానీ అప్పుడవి ఆధునికంగానే అనిపించేవి...

అప్పట్లో ఇండియాలో చాలామందికి టేపు రికార్డరు కొనడం సంగతి అటుంచి చూడడమే పెద్ద విశేషం. ఇప్పుడు నిత్యావసరాలుగా పరిగణించబడే ఎన్నో ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాలింకా మార్కెట్లో లేవు.

షాపులకెడితే కొన్న సరుకులు వేసుకుందుకు కూడా సంచులు తీసుకెళ్లాల్సి ఉండేది. ఉచితంగా ప్లాస్టిక్ సంచీలు (క్యారీ బాగ్స్) ఇచ్చే సంప్రదాయం మున్ముందు ఒకటొస్తుందన్న ఊహ కూడా లేదు. ఉదాహరణకు...

నాకంటే రెండేళ్లముందు జర్మనీ వెళ్లిన ప్రసాద్ అనే ఓ కొలీగ్– ఇండియాలో వాడుకుందుకు అనువుగా ఉంటాయని కొన్ని ప్లాస్టిక్ సంచులు తెచ్చుకొచ్చాడు. తనకి ఇష్టులైన ముగ్గురికి తలో ప్లాస్టిక్ సంచీ ఇచ్చాడు. వాళ్లలో నేనూ ఉన్నాను. ఆ సంచీ మాకు దక్కిందని కొలీగ్సులో కొందరు అసూయ పడ్డారు. మేము కూడా ఆ సంచిని దాన్ని అపురూపంగా దాచుకున్నామే తప్ప వాడలేదు.

ఆతర్వాత రెండేళ్లకి నాకు జర్మనీ అవకాశమొచ్చింది. అప్పటికి తను కూడా జర్మనీ వస్తానని తెలియని శ్రీమతి నాతో, "వచ్చేటప్పుడు మీరు ప్లాస్టిక్ సంచులు కాస్త ఎక్కువగానే తీసుకురండి. మనం వాడుకుందుకే కాదు, వీలైనంత ఎక్కువమందికి ఇద్దాం" అంది.

శ్రీమతి బెర్లిన్ చేరేక– షాపింగులో వచ్చిన ప్రతి ప్లాస్టిక్ సంచీనీ పారవేయకుండా ఒకచోట దాచి ఉంచేది.

కేవలం సంచులే కాదు. డెక్‌మిల్ష్ పేరిట అమ్మే పెరుగు డబ్బాలు ఖాళీ అయ్యేక– వాటిలో ఒక్కటి కూడా పారెయ్యకుండా మేముండే గదిలోనే ఓ మూల దాచిపెట్టేది. ఇండియా వెళ్లేక వీలైనన్నాళ్లు వాటిని మేము వాడుకోవాలనీ, అడిగినవాళ్లకిఇవ్వాలనీ మా ఉద్దేశ్యం.

ఇక ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ పరికరాల విషయానికొస్తే– వాటిలో ముఖ్యమైనవి ట్రాన్సిస్టర్లు. అవి అరచేతి పరిమాణంలో ఉండేవి. మామూలు చొక్కా జేబుల్లో సులభంగా ఇమిడిపోయేవి. అవి రకరకాల ఆకారాల్లో ఉండేవి.

జర్మన్సుకి ఇష్టమైన ఆట ఫుట్‌బాల్. ఆ బంతి ఆకారంలో 'ఫుస్‌బాల్ రాడియో' ట్రాన్సిస్టర్ చాలా ఆకర్షణీయంగా ఉండేది.

టేపురికార్డరుకి తగిలించి వినడానికి– పిల్లో స్పీకర్, స్టెతస్కోపులా ఉండే స్టెతో క్లిప్. కరెంటుతో చార్జి చేసుకునే బేటరీలు. ముడిస్తే వానిటీబ్యాగులో ఇమిడే గొడుగులు. ఇంకా పిల్లలాడుకునే రకరకాల బొమ్మలు. సావనీర్సు.

ఒకటా రెండా ఎన్నో ఆకర్షణీయమైన పరికరాలు.

అన్నీ చిన్న సైజువే చూసి కొనేవాళ్లం. ఆ కొనడం కూడా మామూలుగా డబ్బిచ్చి కొనడం కాదు. కొన్న ప్రతి వస్తువుకీ బిల్లు తీసుకుని, ఒక ఆకుపచ్చ దరఖాస్తు కాగితంమీద కొన్న వస్తువు వివరాలు, కొన్న ధర వేసి– దుకాణపు స్టాంప్ వేయించేవాళ్లం.

అందుకు కారణముంది.

మా ఇంటికి అతి దగ్గర్లోనే ఉన్న విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసేలో పెద్దవీ, చిన్నవీ అన్ని రకాల షాపులూ ఉన్నాయి. చెప్పాలంటే ఏం కొనాలన్నా వేరే వీధికి వెళ్లనవసరం లేదు.

చిన్న అవకాశం వస్తే వదులుకోకుండా ఎదుటివారికి కొత్త రకం కానుక ఇవ్వడం మొదట్నించీ మాకు అలవాటు.

బెర్లిన్ వచ్చినప్పట్నించీ కూడా మేము వీలు కుదిరినప్పుడూ, కొండొకచో వీలు చేసుకునీ– షాపుల్లో తిరిగేవాళ్లం. అందువల్ల మాకు అక్కడ దొరికే వింత వస్తువులు చాలా తెలుసు. ఏమైనా కొత్త వస్తువుంటే చెప్పమని కొందరు ఇండియన్సు కూడా మమ్మల్ని అడిగేవారు.

మా మిత్రులు రావుగారికి చాలా మొహమాటం. కానుకలు తీసుకోవడం ఇష్టముండదు. వాళ్లింటికి పిలిస్తే ఏ అకేషనూ లేకుండా జాగ్రత్త పడేవారు. నవంబర్ మూడవ తేదీన వాళ్లబ్బాయి పుట్టినరోజని అంతకుముందెన్నడో కలుసుకున్నప్పుడు మాటల సందర్భంలో చెప్పారు. అది గుర్తుంచుకుని ఆ రోజుకి అతడికి కానుక ఇవ్వాలని ముందుగానే షాపులన్నీ తిరిగి ఓ ఆటోమాటిక్ కారు కొన్నాం. రిమోట్‌తో నడుస్తూ, నడుస్తున్నప్పుడు ఏదైనా అడ్డొస్తే దానంతటదే పక్కకు తిరిగే ఆ కారు పేరు 'కంప్యూటర్ ఆటో'. అది మాకెంతగా నచ్చిందంటే, మా పిల్లలకూ ఒకటి కొన్నాం.

కొడుకు పుట్టినరోజుకి రావుగారినుంచి మాకు ఆహ్వానం రాలేదు. ఆయన మొహమాటం తెలిసినవాళ్లం కాబట్టి, మేమా సాయంత్రం వాళ్లింటికెళ్లి బాబుకి కానుక ఇచ్చి సర్ప్రైజ్ చేశాం.

ఆ కారు బాబుకే కాదు– తలిదండ్రులకీ నచ్చింది. "ఇలాంటివన్నీ మీకెక్కడ దొరుకుతాయండీ" అన్నారు శ్రీమతి సత్యవతి మెప్పుకోలుగా.

ఇప్పుడీ ప్రస్తావన ఎందుకంటే– చాలా షాపులవాళ్లు మమ్మల్ని చూడగానే గుర్తు పడుతున్నారు. ఎంతలాగంటే ఓ షాపతను మా వివరాలు అడిగి, "ఐతే నువ్వు మీ దేశానికి తిరిగి వెళ్లిపోతావన్న మాట! కూడా తీసుకెళ్లడానికి చాలా కొంటున్నావు కాబట్టి నీకు నాదో సలహా! కొన్నాక ఆయా షాపుల్లో అడిగి ఆకుపచ్చ దరఖాస్తు ఫారం తీసుకో. స్వదేశం తీసుకెళ్లే ప్రతి వస్తువు వివరాలూ వ్రాయి. ఆ కాగితం మీద స్టాంప్ వేయించుకో. నువ్వు స్వదేశం చేరేక ఆ కాగితం, ఇక్కడ నీకు తెలిసున్నవాళ్లకి పంపితే– కస్టమ్స్ డ్యూటీ మినహాయింపుగా నీకు కొంత డబ్బొస్తుంది" అని సలహా ఇచ్చాడు. అప్పట్నించీ ఆ సలహాని తూచా తప్పకుండా పాటిస్తున్నాం....

ఆప్తులకు, ఆత్మీయులకు కానుకలు వెదకడానికి దుకాణాల్లో తిరుగుతుంటే- మా బడ్జెట్లో కొనడానికి కూడా ఈ దేశంలో ఎన్ని రకాల ఆకర్షణీయమైన వస్తువులు ఉన్నాయోననిపించింది. అక్కడ పాతబడినవే ఎన్నాళ్లు వాడినా మోజు తీరవు అనిపిస్తుంటే- రోజురోజుకీ ఏదో ఒక కొత్త వస్తువు బజార్లోకి వస్తోంది.

అవికాక మేము మా కూడా ఇండియాకి తీసుకుని వెళ్లాల్సిన- మిక్సీ, టేపు రికార్డర్లు వగైరాలకు స్పేర్సు, అనుబంధ పరికరాలు కూడా చాలా ఉన్నాయి.

మాకున్నది ఒక్కటే గది. అందులో ఉన్న ఫర్నిచర్- ఓ మంచం, చిన్న బల్ల, దాని చుట్టూ నాలుగు కుర్చీలు. ఇంకా ఓ మూల తాళమేసిన మూడున్నర అడుగుల ఎత్తు బీరువా. దానిమీదనే టేపు రికార్డర్, పుస్తకాలు, మిక్సీ వగైరాలు పెట్టుకుంటాం. మేము కొన్న, దాచిన వస్తువుల్ని ఇండియానుంచి తెచ్చుకున్న పెట్టెల్లో కాళీ ఉన్న మేరకు ఉంచాలి. లేదూ గదిలోనే ఓ మూలగా ఉంచాలి.

మేము వరుసగా అవీ ఇవీ కొంటుంటే గది నిండిపోతూ గోడౌన్లా తయారౌతోంది. మాకు మసలడానికి ఇబ్బందిగా అనిపించినా పిల్లలు కూడా సహకరించే టైపు కాబట్టి సద్దుకుపోగలుగుతున్నాం. ఇంటికెవరైనా వస్తే- తిరుగు ప్రయాణం హడావుడిలో ఉన్నామని చెప్పొచ్చు కానీ- కొన్నవన్నీ వాళ్లముందు ప్రదర్శించడం ఇష్టంలేక- వాటిని గుట్టగా పోసి పైన దుప్పటినో, చీరనో కప్పుతున్నాం.

ఐతే అన్నింటినీ విమానంలో తీసుకెళ్లడం ఎలా?

అప్పట్లో విమాన ప్రయాణానికి మనిషికి 20 కేజీల లగేజి, హ్యాండ్ లగేజిగా మరో 15 కేజీలు మాత్రమే ఉచితం. అదనపు బరువుకి కిలోకి ఇంత అని తీసుకునే ఛార్జి చాలా ఎక్కువ. నేనిక్కడికి వచ్చేటప్పుడు 13.5 కేజీలతో వచ్చాను. శ్రీమతి వచ్చినప్పుడు పిల్లలతో కలిపి ముగ్గురు మనుషుల లగేజికి అవకాశమున్నా తనూ 20 కేజీల లోపు బరువుతోనే వచ్చింది.

ఇప్పుడు మాకు మొత్తం 80 కేజీలు లగేజిగానూ, 60 కేజీలు హ్యాండ్ లగేజిగానూ తీసుకెళ్లే అవకాశముంది. మేము కూడా తీసుకెళ్లేవీ, కానుకలూ వగైరాలు ఆ పరిమితికి లోబడి ఉండాలి.

ఇంట్లో వెయింగ్ మెషీన్ ఉంది. బరువు అంచనాకి రోజూ అది వాడేవాళ్లం.

"ఈ ప్రయాణం పేరు చెప్పి రోజూ దీని మొహం చూడాల్సి వస్తోంది" అని విసుక్కుంది శ్రీమతి.

ఆ విసుగుకి కారణముంది.

జర్మనీ వచ్చేముందు నా బరువు 48 కేజీలు. శ్రీమతి అంతకంటే బాగా తక్కువ. చాలామంది మమ్మల్ని అండర్‌వెయిట్ దంపతులు అనేవారు.

జర్మనీ వచ్చేక ల్యూనబర్గులో నాలుగు నెలలు జర్మన్ భాష నేర్చుకున్నాను కదా- నేనున్న ఇంట్లో వంట సదుపాయం లేక- పాలు, బ్రెడ్-బటర్-జామ్, పళ్లతో సరిపెట్టుకునేవాణ్ణి. ఆ మాత్రానికే నేనక్కడ ఎనిమిది కేజీల బరువు పెరిగాను. నా ఎత్తుకది ఇంకా అండర్‌వెయిటే.

బెర్లిన్ వచ్చేక వెయింగ్ మెషీన్ కొన్నాను. ఇంట్లోనే బరువు చూసుకునే సదుపాయం థ్రిల్లింగ్‌గా అనిపించింది. శ్రీమతి వచ్చేక రోజూ మేము, పిల్లలు బరువులు చూసుకుంటూ థ్రిల్ అయ్యేవాళ్లం. కానీ అది కొన్నాళ్లే!

వచ్చిన మూడు నెలలకి తన బరువు త్వరగా పెరుగుతున్నట్లు శ్రీమతి గుర్తించింది.

దాంతో పాలు తాగడం మానేసింది. బ్రెడ్‌కి తను వెన్న రాసుకోవడం మానేసింది. ఈ విషయం నాకు తెలియదు. తెలిసుంటే- చలిదేశంలో అది కూడదని చెప్పి ఉండేవాణ్ణి.

ఏది ఏమైనా శ్రీమతి బరువు ఎప్పుడు చూసుకున్నా, మునుపటికంటే ఎక్కువుండేది. నేనూ పెరుగుతున్నాను కానీ తనంత వేగంగా కాదు.

ఒకప్పుడు బాగా అండర్‌వెయిట్ అనిపించుకున్న నేను కొద్దిగా ఓవర్‌వెయిట్ అయ్యాను. నాకంటే బాగా తక్కువ బరువుండే శ్రీమతి క్రమంగా నన్ను దాటించేసేక తను బరువు చూసుకోవడం మానేసింది.

బరువు పెరగడానికి- థైరాయిడ్ వగైరా ఆరోగ్యసమస్యలు కూడా కారణం కావచ్చని అప్పట్లో మాకు తెలియదు. అందుకని బరువు పెరక్కుండా ఆపడానికి ఆహారంలో ఏం తగ్గించాలో తెలియక చాలా మథనపడేది.

ఒలోముచ్‌కీ బంధువు హెర్ షేరర్- ఆ ఇంట్లో మాతోపాటే వేరే గదిలో ఉంటున్నాడుకదా! అతడు శ్రీమతిని బిడ్డలా ఫీలై ఎంతో ఆత్మీయంగా పలకరించేవాడు. ఒకరోజున అతడు శ్రీమతితో, "నీకు వళ్లొస్తున్నట్లు అనిపిస్తోంది. శ్రద్ధ తీసుకోకపోతే ఒలోముచ్‌కీలా ఐపోగలవు జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

శ్రీమతి స్వతహాగా సరదా మనిషి. తనమీద తనే హాయిగా జోకులేసుకోగలదు.

బరువు పెరక్కుండా ఆపడానికి తను తీసుకుంటున్న జాగ్రత్తలేవీ పనిచెయ్యకపోవడంతో- తన వళ్లు గురించి దిగులుపడ్డం మానేసింది. ఓ లావుపాటి మనిషిగా తనకి తానే గుర్తింపునిచ్చేసుకుంది.

ఆమె హేరర్ తనకు చేసిన హెచ్చరికని నాకు చెప్పిన విధానమే అందుకు నిదర్శనం.

'ఒలోముచ్‌కీ లా' అన్నప్పుడు- హేరర్ ఆమె లావుని సూచించడానికి రెండు చేతుల్నీ ఎలా కదిపాడో- అభినయించి చూపింది. సినిమాలో ఒక హాస్య సన్నివేశాన్ని మిత్రులతో పంచుకునే ఉత్సాహమే తప్ప- అప్పుడామెలో ఏమాత్రం ఉక్రోషం కనబడలేదు నాకు.

బరువు చూసుకోవడం మానేసేక వెయింగ్ మెషీన్ని తాకడానికి కూడా ఇష్టపడేది కాదు శ్రీమతి. అదేమంటే దాన్ని తాకితేనే తన బరువు పెరిగిపోయిన అనుభూతి కలుగుతోందనేదామె. ఎందుకంటే- తన బరువు పెరగడానికి మరో కారణం దొరకడంలేదు.

దాంతో పిల్లల బరువు చూడాలన్నా, అది నేనే చూడాలి తప్ప- తనా మిషన్ని తాకేది కాదు.

చిత్రమేమిటంటే- మేమిద్దరం అలా అలా బరువు పెరుగుతుంటే పిల్లల బరువు మాత్రం మారేది కాదు. ఏడాదిలో ఇద్దరూ తలో కేజీయో, కీజీన్నరో పెరిగారో ఏమో!

ఎదుగుతున్న పిల్లలు బరువు పెరగరేమనిపించినా- చూడ్డానికి మిసమిసలాడుతూ, ఎప్పుడూ హుషారుగా కనిపిస్తూ, నవ్వుతూ తుళ్లుతూ ఉండడంవల్ల మనసు కలవరపడలేదు.

ఇప్పుడు సామాన్ల బరువు చూడ్డానికి శ్రీమతికా మెషీన్ని పదేపదే తాకడం తప్పనిసరయింది. అలా తాకినప్పుడు రోజుకోసారైనా విసుక్కోవడమూ తనకి మామూలయింది.

ఇక సామాను సద్దడానికి- ఇండియానుంచి నేను తెచ్చుకున్న సూట్‌కేస్ పాడయింది. సరుకులు ఉంచడానికే తప్ప మొయ్యడానికి పనికిరాదు. శ్రీమతి తెచ్చింది కొంత ఫరవాలేదు కానీ- ఇప్పటికే అది మా బట్టలు వగైరాలలతో సగానికి పైగా నిండింది.

సామాను సద్దడానికి మూడు సూట్‌కేసులు కొన్నాం. వాటిలో సద్దుతున్నప్పుడు అర్థమయింది- అంత సామానూ ఇండియా తీసుకెళ్లడం మావల్లకాదని. ఐతే అక్కడ వాడినవాటితో సహా ఏదీ వదలడానికి మనసొప్పలేదు.

ఆ విషయమై పదిమందినీ వాకబు చేసేక చాలా విషయాలు తెలిశాయి.

పోస్టాఫీసు ద్వారా కొన్ని సామాన్లు సీమెయిల్లోనూ, కొన్నింటిని ఎయిర్ మెయిల్లోనూ పంపొచ్చు. ఎయిర్ మెయిలుకి చార్జి ఎక్కువే కానీ త్వరగా చేరుతుంది, మంచి కండిషన్లో చేరుతుంది. కాబట్టి- విలువైనవీ, తేలికైనవీ ఎయిర్ మెయిల్లో పంపొచ్చు.

సీమెయిల్ కారు చౌక. కానీ ఎప్పటికి చేరుతుందో, అందులోని వస్తువులు ఏ కండిషన్లో ఉంటాయో చెప్పడం కష్టం. కాబట్టి పోయినా ఫరవాలేదనుకున్నవాటినే సీమెయిల్లో పంపాలి.

అప్పటికి మేము వాస్తవానికి వచ్చాం.

సీమెయిల్ కోసం సంచులు తెచ్చి ప్యాక్ చేస్తున్నప్పుడు- పాడైపోయిన ఫ్యూజులు, చెప్పులు లాంటివి ఇండియా తీసుకెళ్లడం అవసరమా అన్న ఆలోచన కలిగింది. జర్మనీలో వాడినవి అన్న స్మృతి తప్పితే వాటికి ప్రాముఖ్యం లేదు. వాటిని పక్కన పెట్టాం.

ఇంకా ప్లాస్టిక్ సంచులు, డబ్బాలు వగైరాలపై మమకారాన్ని కూడా చంపుకున్నాం.

మా ఆలోచనల్లో ఎంత మార్పొచ్చిందంటే- కొన్నవాటిలో అపురూపమైనవిగా భావిస్తున్న కొన్ని ఐటమ్సుని కూడా సీమెయిల్లోనే పంపాలని నిర్ణయించాం. మచ్చుకి కాసెట్టే టేపులు. ఇతరులకివ్వాల్సినవి కాక- ఒకటా రెండా, మాకోసం పట్టుకెడుతున్నవే వందకి పైగా ఉన్నాయి.

సీమెయిల్‌కని తయారుచేసిన పార్సెల్సు ఎత్తు నాలో సగముండేది. తీసుకెళ్లడానికి స్వంతంగా కారు లేదు. మిత్రుల్ని అడగాలన్నా, ఒక్క ట్రిప్పు చాలదు. అందుకని మా పాట్లు మేమే పడాలనుకున్నాం.

పాశ్చాత్య దేశాల్లో ఎవర్నీ ఎవరూ పెద్దగా పట్టించుకోరు. మోయగలిగిన సంచులు మోస్తూ రోడ్డుమీద నడుచుకుంటూ పోవడం- ఇక్కడ చిన్నతనం కాదు. కూలీల అవసరం లేదు.

ఇండియాలో ఐతే బరువు భుజంమీద పెట్టుకుని రోడ్డుమీద నడిచేది కూలీలు మాత్రమే.

మా సీమెయిల్ పార్సెల్సు బరువు ఎయిర్ మెయిల్‌కి ఖరీదు ఎక్కువ కావచ్చు కానీ- మోయడానికి తక్కువే. నేనైతే నాలుగైదు కేజీల బరువుని అవలీలగా మోసెయ్యగలను.

మా ఇంటికి పోస్టాఫీసు ఎంతో దూరం లేదు. కిలోమీటరుకి అటో ఇటో ఉంటుందేమో!

భువనేశ్వర్లో పిల్లలిద్దర్నీ ఎత్తుకుని కూడా మూడు కిలోమీటర్లంటే నల్లేరుపై బండి నడకలా భావించే మాకా బరువు లెక్కలోది కాదు.

నలుగురం కలిసి బయల్దేరేవాళ్లం. మనదేశపు మనస్తత్వాన్ని వదులుకోలేక- నేను సంచిని భుజానికెత్తుకునేవాణ్ణి కాదు. రెండు చేతులూ చాచి- ఉత్తరాదివాళ్లు మిత్రుల్ని ఆత్మీయంగా కౌగలించుకున్నట్లు పట్టుకునేవాణ్ణి.

మొదటి పార్సెల్ పంపేక చాలావరకూ అదనపు సామాను సీమెయిల్లో పంపడమే ఉత్తమం అనిపించింది.

కూడా తీసుకెళ్లాల్సిన వాటిలో- మాది కానిది- నటరాజన్ ఇచ్చిన ఎలక్ట్రికల్ టైపు రైటర్ ఒకటుంది.

నటరాజన్ ఫెలోషిప్ ఎక్స్‌టెన్షన్ తీసుకోలేదు. నాకంటే మూడు నెలలు ముందే అతడి ప్రయాణం.

అతడు టైపింగులో ఎక్స్‌పర్ట్. టైప్ మెషీన్ ఎక్కువగా వాడతాడు. ఎలక్ట్రికల్ టైప్ రైటర్ చూసి, నేను టేప్ రికార్డర్ చూసినప్పటికంటే ఎక్కువ థ్రిల్లయ్యాడు. అది కొనుక్కోవాలని మనసు. కానీ-

"నేను ఒక్కణ్ణి. ఎక్కువ సామాను తీసుకెళ్లలేను. టికెట్లు నాలుగు కాబట్టి- నీకు వీలవుతుందేమో చెప్పు. కొని- బెర్లిన్ వచ్చినప్పుడు మీ ఇంట్లో వదిలి వెడతాను. మొహమాట పడకు. ఇక్కడికొచ్చేక నీకంటే క్లోజయిన మిత్రులే- ఫ్యామిలీతో ఇండియా వెడుతూ- ఈ ఐటం తీసుకెళ్లడం మావల్ల కాదన్నారు. కాబట్టి నీకు కుదరదన్నా నేనేమనుకోను" అని ఉత్తరం రాశాడతడు.

అప్పటికి లగేజి గురించిన అవగాహన నాకంతగా లేదు. మారాలోచన లేకుండా ఒప్పుకున్నాను.

నేను ఒప్పుకున్నాననే అతడా టైపురైటర్ కొన్నాడు. నాకు తెచ్చిచ్చినప్పుడు, "నువ్వు చేస్తున్నది చాలా గొప్ప త్యాగం. ఒక మంచి మిత్రుడిగా నిన్ను జీవితకాలం గుర్తుంచుకుంటాను" అన్నాడు.

ఇంత చిన్న విషయానికి మరీ అంత పెద్ద పొగడ్తా అనుకున్నాను. అందులోనూ జర్మన్ లాంగ్వేజి నేర్చుకుంటున్నప్పుడు అనేక ఆదివారాలు అతడిచ్చిన ఆతిథ్యం సామాన్యమైనదా? మాటవరసకి కూడా అతడా ప్రసక్తి తేడు.

నటరాజన్ ముక్కు సూటి మనిషి. టైపురైటరుకి కస్టమ్స్ డ్యూటీ పడుతుందని, దగ్గిరుంచమని నాకు 150 మార్కులు ఇవ్వబోయాడు.

"డ్యూటీ పడొచ్చు, పడకపోవచ్చు. అవన్నీ ఇండియాలో చూసుకుందాంలే" అన్నాను.

"సకుటుంబంగా ఉంటున్నావు. నీవద్ద ఎంతో డబ్బుండదు. నాకు డబ్బులు బాగానే మిగిలాయి. నువ్విది తీసుకెళ్లడమే మహోపకారం. ఇంకా డ్యూటీ బాధ్యత కూడా ఇవ్వ;లేను. ఒకవేళ డ్యూటీ పడకపోతే- అదంతా తర్వాత ఇండియాలో చూసుకుందాంలే. ప్రస్తుతానికి నీకివి అక్కరకొస్తే వాడుకోవచ్చు కూడా" అంటూ బలవంతాన డబ్బు నాకిచ్చి వెళ్లాడు.

ఇప్పుడు సద్దుళ్లకు ఆ ఐటమ్ నాకు కాస్త ఇబ్బందిగానే మారింది.

ఆ టైపురైటర్ చిన్న బ్రీఫ్ కేసులా ఉంది. పెట్టెలో పెడితే చాలా చోటు ఆక్రమిస్తుంది.

అదీకాక మాకున్న గ్రుండిగ్ స్టీరియో టేపు రికార్డరు సైజు కూడా ఇంచుమించు అదే. ఎటొచ్చీ చూడ్డానికది బ్రీఫ్‌కేసులా ఉండదు. పెట్టెలో టైపురైటర్ కంటే తక్కువ చోటు తీసుకుంటుంది.

హాండ్ లగేజి 15 కేజీలు ఉండొచ్చు. టైపురైటర్ ఆలోపే ఉంటుంది కాబట్టి- దాన్ని హాండ్ లగేజిగా తీసుకెళ్లొచ్చనుకున్నాం.

"అందువల్ల మరో లాభం. చూడ్డానికిది బ్రీఫ్‌కేసులా ఉంది కాబట్టి- కస్టమ్సు వాళ్లు డ్యూటీ వెయ్యకపోవచ్చు" అంది శ్రీమతి.

"ఔనౌను" అంటూ నేనూ సంబరపడ్డాను.

అప్పటికి మాకింకా కస్టమ్సు వారి 'శోధన పరాక్రమం' గురించి తెలియదనడానికి- మా సంబరాలే నిదర్శనం.

మళ్లీ మా సీమెయిల్ కార్యక్రమానికొస్తే-

శనివారం పోస్టాఫీసు పనిచేస్తుంది. ఆఫీసుకి సెలవు. కాబట్టి పోస్టాఫీసుకి శనివారాలు వెళ్లేవాళ్లం.

మొత్తం ఐదు పార్సెలయ్యాయి. పార్సెల్ పార్సెల్‌కీ మాకు జ్ఞానం, అనుభవం, పరిణతి, వాస్తవంపట్ల అవగాహన పెరుగుతూ వచ్చాయి.

మొదటి పార్సెల్ అయ్యేసరికి మావద్దనున్న సామానులో చెత్తకు చేరాల్సినవి పెరుగుతూ, చెంతనుండాల్సినవి తరుగుతూ వచ్చాయి.

నాలుగు పార్సెల్సు అయ్యేసరికి, మా సామాను మేము కొన్న పెట్టెల్లో ఇముడుతుందన్న ధైర్యం వచ్చింది.

జర్మనీలో ప్రాసీజర్సు సింపుల్. కస్టమర్-ఫ్రెండ్లీ.

మొదటి పార్సెల్ పంపగానే- హమ్మయ్య అని నిట్టూర్చినా- రెండో పార్సెల్ పంపేక మూడో పార్సెల్ పంపడానికి ఉత్సాహం పుట్టింది.

ఒకో పార్సెల్ పంపడం ఐపోతుంటే- ఈ పని ఐపోతే- శనివారం తోచేదెలా అనిపించే స్థితికి చేరుకున్నాం.

ఐతే చివరిదైన ఐదవ పార్సెల్ సమయంలో ఒక దురదృష్టకర సంఘటన జరిగింది.

అ రోజుపోస్టాఫీసుకి ఒక జర్మన్ వనిత తన పెంపుడు కుక్కతో వచ్చింది.

బొచ్చుకుక్క. చిన్నపిల్ల. పిల్లలు కూడా చేతుల్లోకి తీసుకుని ఆడించేంత చిన్నది.

మా పిల్లలు అటూ ఇటూ చూడ్డంలో బిజీ ఐపోయి కుక్కపిల్లని చూడలేదు.

చూడముచ్చటగా ఉందని నేనే చూపించాను.

వాళ్లు కుతూహలంగా దాన్ని చూశారు.

కుక్కపిల్ల వాళ్లని చూసింది. ఉత్సాహంగా మొరిగింది.

నాలుగైదేళ్ల వయసున్న భారీ కుక్కలది కూడా చిన్నపిల్లల మనస్తత్వం అంటారు. పెద్దవాళ్లు వాటిని చిన్నపిల్లల్లా ముద్దు చెయ్యాలి. చిన్నపిల్లలు వాటితో ఆడుకోవాలి.

ఈ కుక్కపిల్లని చూస్తుంటే ఏడాది నిండిందనిపించదు.

దానికి మెడలో గొలుసు లేదు. చటుక్కున అది పిల్లలమీదికి వచ్చింది.

వచ్చింది అనడంకంటే ఉరికిందనడం సబబు.

బాబు హడిలిపోయి రెండడుగులు వెనక్కేసి తల్లి వెనుక దాక్కున్నాడు.

"భయపడకు. అది పెంపుడు కుక్క. నిన్నేమీ చెయ్యదు" అన్నాను.

పాప కూడా భయపడింది. కానీ నా మాటలు విని మేకపోతు గాంభీర్యంతో అక్కడే నిలబడింది. ఐతే ఉరికిన కుక్కపిల్ల వేగంగా తనవైపు వస్తుంటే- ఆ గాంభీర్యం కొంత సడలింది. ఐనా నేను పక్కనే ఉన్నానన్న ధైర్యంతో- దాన్ని పొమ్మన్నట్లు చేయి విదిలించి సైగ చేసింది.

ఇంకా ముందుకు వస్తుంటే- 'పో పో' అంది గట్టిగా.

కుక్కపిల్లకి ఏమర్థమయిందో- అది చటుక్కున పాపమీదకి ఉరికి కాలు పట్టుకుంది.

అలా జరుగుతుందని నేను ఊహించలేదు. కంగారు పడ్డాను.

పాప భయపడిపోయి బ్యారుమంది.

ఆ ఏడుపు విన్న కుక్కపిల్ల స్వంతదారు- జర్మన్ వనిత చటుక్కున- "నైన్ నైన్" అని కుక్కపిల్లని హెచ్చు స్వరంలోనే మందలించింది.

కుక్కపిల్ల పాప కాలు వదిలింది కానీ, ఇంకా అక్కణ్ణించి కదలకుండా పాపనే చూస్తోంది.

పాప భయంగా నా కాళ్లు గట్టిగా పట్టుకుంది.

జర్మన్ వనిత మరింత గట్టిగా కుక్కపిల్లని పిలిచింది.

అప్పుడు కుక్కపిల్ల యజమానురాల్ని చూసింది. ఆమె కళ్లలో హెచ్చరిక అర్థమైనట్లుంది- ఆమెవైపు మళ్లింది.

జర్మన్ వనిత పాపను సమీపించి, బుగ్గలు నొక్కి, "భయపడ్డావా?" అంది ముచ్చటగా. తర్వాత నావైపు తిరిగి సారీ చెప్పింది.

"కుక్కపిల్ల మెడలో గొలుసు లేదు" అని చెప్పానామెకి.

అమె నవ్వి, "పాపని చూసి ముద్దు పడిందంతే! కరిచే టైపు కాదు" అనేసి అక్కణ్ణించి వెళ్లిపోయింది.

"మీదకొచ్చింది. పిల్లల్ని బెదరగొట్టింది. చిన్నపిల్ల కాలు పట్టుకుంది. ఏమయిందో కూడా చూడకుండా- సారీ చెప్పి వెళ్లిపోతుందేమిటీ!" అంది శ్రీమతి విసుగులో కోపాన్ని మేళవించి.

నాదీ సేమ్ ఫీలింగ్. ఐతే- 'ఏమయిందో చూడకుండా' అన్న శ్రీమతి మాటకు స్పందించాను.

అప్పటికి పాప తన కాలునే చూసుకుంటూ వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఎందుకు ఏడుస్తోంది? కుక్కగానీ కరిచిందా?

పాప దళసరి ఉన్ని పంట్లాం వేసుకుంది. కుక్క కాలు పట్టుకున్నా దాని పళ్లు పంట్లాంలోంచీ కిందకు దిగవని నా నమ్మకం.

మరి పాప ఎందుకేడుస్తోందీ అనుకుంటూ అక్కడే చతికిలబడి పాపని ఒళ్లోకి తీసుకున్నాను. మాటలతో ఓదార్చుతూ- దానికి తెలియకుండా- ఏ కాలునైతే కుక్కపిల్ల పట్టుకుందో- ఆ కాలు వద్ద పంట్లాం అడుగునుంచీ వెనక్కి మడిచి చూసి ఉలిక్కిపడ్డాను.

కుక్కపిల్లవి రెండు పళ్ల గుర్తులు ఉన్నాయి కాలుమీద. అంటే పాపని కుక్క కరిచింది.

గుండె ఆగినంత పనయింది.

కుక్క కాటు అంటే మాటలు కాదు. బొడ్డు చుట్టూ ఇంజక్షన్లు చేయించాలి. పాప ఆ బాధకి ఓర్వగలదా అన్న వ్యధ ఒకటి!

బాబుకి చెయ్యి విరిగినప్పుడు హాస్పిటలుకి సంబంధించిన పూర్తి బాధ్యతని రావుగారు తీసుకున్నారు.

అంతకుముందూ ఆతర్వాతా కూడా- మాకు మేముగా హాస్పిటలుకి వెళ్లాల్సిన అవసరం పడలేదు. ఇప్పుడు మళ్లీ రావుగార్ని ఇబ్బంది పెట్టాలా అన్న సంకోచం...

నేనిలా ఆలోచిస్తుంటే శ్రీమతి పాప కాలును పరీక్షగా చూసి, 'కుక్క కరిచినట్లు లేదు. కాలుని కాస్త గట్టిగా పట్టుకున్నట్లుంది. ఆ ఒత్తిడికి కాలుమీద పళ్ల గుర్తులు పడ్డాయి. ఎక్కడా రక్తం లేదు. ఆ సొట్టలు కాసేపట్లో పోతాయి" అంది.

అమృతోపమానమైన మాటలవి!

ఆ మాటలు నాకు ఉపశమనం కలిగించగా నేను కూడా పరీక్షగా చూస్తే తను చెప్పింది నిజమేననిపించింది.

"ఐనా అది పెంపుడుకుక్క. అదీ తెల్లవాళ్ల పెంపుడుకుక్క. తప్పకుండా దానికి రెగ్యులర్‌గా యాంటీ రేబీస్ ఇంజక్షన్లు చేయిస్తుంటారు. మన సంగతి అటుంచు. ఇంట్లోవాళ్లని ముద్దుగా కరిస్తే- వాళ్లకీ ప్రమాదమే కదా!" అన్నాను.

నాకు నేను సద్దిచెప్పుకుంటున్నానో శ్రీమతికి ధైర్యం చెబుతున్నానో తెలియదు.

నా మాటలకు శ్రీమతి మొహం మరింత వికసించింది.

పాప జడుసుకుంది. ఇంటికెళ్లేక కూడా మామూలు మనిషి కావడానికి కాసేపు పట్టింది.

చిన్నపిల్ల. దానికి మా మనసులో భయం తెలియదు.

రాత్రి పడుకునేముందు దాని కాలు మరొక్కసారి చెక్ చేశాం.

కాలిమీద కుక్కపిల్ల పళ్ల గుర్తులు మాయమయ్యాయి. ఎక్కడ కరిచిందో కూడా చెప్పలేం!

తర్వాత పాప నిద్రపోయినా-మా ఇద్దరికీ కూడా ఓపట్టాన నిద్ర పట్టలేదు.

కలత నిద్రలో మెలకువ వచ్చినప్పుడల్లా పాపను ముట్టుకుని చూస్తున్నాం.

తెల్లవారింది. పాపకు జ్వరం రాలేదు.

మెలకువొచ్చేక నిన్న జరిగిన విషయమే మర్చిపోయి- ఎప్పటిలా హుషారుగా ఉంది. తమ్ముడితో ఆటల్లో పడింది.

'హమ్మయ్య' అనుకున్నాం.

ఏ విషయంలోనైనా అమితోత్సాహం పనికిరాదు. కానీ నేను-

ఆ మర్నాడు సోమవారం ఆఫీసుకెళ్లేక యథాలాపంగా అన్నట్లు కుక్కకాటు గురించి వాకబు చేశాను.

రేబీస్‌కి ఇంక్యుబేషన్ పీరియడ్ ఉంటుందిట. అది ఒకరోజునుంచి ఏడాది దాకా ఉంటుందిట.

ఒకోసారి జీవితకాలంలో ఎప్పుడైనా బయటపడొచ్చుట.

ఈ వివరాలు తెలుసుకోవడం- కొరివితో తల గోక్కునట్లయింది.

పాపకి ఇంజక్షన్లు చేయించడం సేఫ్ అనిపించినా- అవసరం లేకుండా ఉత్తపుణ్యాన ఇంజక్షన్లు చేయించడం సబబు కాదనిపించింది.

చిన్నప్పుడు రామాయణ పురాణశ్రవణానికి వెళ్లినప్పుడు- శాస్త్రిగారు చెప్పారు,
'మనిషికి జీవితం వడ్డించిన విస్తరి కాకూడదు. ఎక్కణ్ణించో ఏదో ప్రమాదం పొంచి ఉన్నదన్న భీతి ఎప్పుడూ మనసులో ఉండాలి. ఆ భీతి ఒక భ్రమ అన్న ధైర్యంతో జీవించాలి. రాముడైనా, లక్ష్మణుడైనా, సీత ఐనా, హనుమంతుడైనా- అలాగే జీవించి ధన్యులయ్యారు' అని.

ఆ మాటలిప్పుడు గుర్తొచ్చాయి. నా భీతిని భ్రమగా గుర్తించాను.

'పాపని కుక్క కరవనేలేదు. కరిచినా దాని కాటు ప్రమాదకరం కాదు' అని మనసుకి కాస్త గట్టిగానే సద్దిచెప్పాను.

నేను రేబీస్ ఇంక్యుబేషన్ పీరియడ్ విషయం శ్రీమతికి చెప్పలేదు- అనుమానబీజాన్ని ఆమెలోనూ నాటడం ఇష్టంలేక!

ఆ భీతి ఏమాత్రం లేని శ్రీమతి ధైర్యమే నాకిప్పుడు ఆలంబన!

ఇండియాకు తిరుగు ప్రయాణంలో భాగంగా ఆఫీసులో నాకు కొన్ని ముఖ్యమైన పనులున్నాయి. వాటిలో నాకోసం ప్రత్యేకంగా తయారు చేసిన కెటలిటిక్ రియాక్టర్ని మా లేబరేటరీకి తీసుకెళ్లే అవకాశాన్ని విచారించడం మొదటిది. విచారించవలసిన విషయం ఏమిటంటే- ఆ రియాక్టర్ ఇక్కడ లేబరేటరీకీ పనికొస్తుంది కాబట్టి- అసలా ప్రస్తావనే వద్దని రాలెక్ నాకు సూటిగానే చెబితే- నిరుత్సాహపడ్డాను.

ఐతే ప్రొఫెసర్ రాలెక్‌కి నాపట్ల విముఖత ఉందనడానికీ లేదు.

క్రిస్మస్ సెలవులకి ముందే ఆఫీసులో ఒకొక్కరికే వీడ్కోలు చెప్పినప్పుడు, అంతా నాకు శుభాకాంక్షలు చెప్పారు. రాలెక్ శుభాకాంక్షలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. 'త్వరలోన్ వాన్ హుంబోల్డ్ట్ ఫెలోషిప్ మీద ఇక్కడకొస్తావు. నాదీ హామీ' అన్నాడాయన.

ఇండియాలో నేనున్న పరిస్థితుల్ని బట్టి- ఆయన ఆఫర్ని నేనుపయోగించుకోగల అవకాశం తక్కువ. ఐతే ఆ మాట రాలెక్‌కి చెప్పలేదు.

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడని ఓ చెవిలో వినిపిస్తున్నా, నందో రాజా భవిష్యతి అని మరో చెవికి వినిపిస్తోంది మరి.

ఆఫీసులో అంతా క్రిస్మస్ పేరు చెప్పి 2-3 వారాల సెలవులు తీసుకున్నా- లూయీజీ మాత్రం తన సెలవుల్ని రెండు మూడు రోజులకే పరిమితం చేసుకున్నాడు. అతడు లేబరేటరీకి వెళ్లి కెటలిస్ట్ టెస్టింగ్ కొనసాగిస్తుంటే- రోజూ ఏదో టైములో నేనూ వెళ్లి అతడికి నా శక్తి మేరకు సాయం చేసేవాణ్ణి.

తిరుగుప్రయాణం హడావుడిలో ఉన్న నేను ఆ సమయంలోనూ లేబరేటరీకి వస్తూండడం కేవలం తనకోసమేననిపించి నొచ్చుకునేవాడు లూయీజీ. అతడు మరీమరీ ధన్యవాదాలు చెబుతూంటే, నాకది అవసరమైనకంటే ఎక్కువనిపించి ఇబ్బందిగా ఉండేది. అప్పటికీ ప్రాజెక్టు నాది కూడా కాబట్టి- నాది బాధ్యతానిర్వహణకిందే వస్తుందని పలుమార్లు చెప్పినా తన బుర్రకి ఎక్కించుకునేవాడు కాదు.

అదలాగుంచితే- సుమారు ఏణ్ణర్థం పాటు నేను చేసిన రీసెర్చి వివరాలన్నీ సేకరించడం మరో పని.

సాధారణంగా ఏ లేబరేటరీలోనైనా సైంటిస్టులకి లేబరేటరీ పనికి ప్రాక్టికల్ నోట్‌బుక్ ఉంటుంది. దాన్ని సైంటిఫిక్ డైరీలా దాచకుండా మెయింటైన్ చెయ్యడం నా అలవాటు. అంటే అందులో- చేస్తున్న ప్రయోగాల వివరాలూ, వాటి ఫలితాలతోపాటు- రోజూ ఏంచేస్తున్నదీ, ఏం చెయ్యబోతున్నదీ వివరంగా రాస్తాను. ప్రొఫెసరుతో, సాటివారితో జరిపిన వైజ్ఞానికపరమైన చర్చల వివరాలూ అందులో ఉంటాయి.

ఐతే ఎక్కువమంది ఆ నోట్‌బుక్‌లో ప్రయోగాల్నీ, ప్రయోగఫలితాల్నీ మాత్రమే రాస్తుంటారు. నేను మాత్రం- విశాఖపట్నంలో పిహెచ్‌డి కాలం నాటినుంచీ ఆ నోట్‌బుక్సుని డైరీలాగే మెయింటైన్ చేసేవాణ్ణి. ఆ పుస్తకం చదివితే- వేరెవరైనా నా ప్రయోగాల్ని ఎలా మొదలెట్టానో తెలుసుకోవచ్చు. నేనెక్కడ ఆపానో అక్కణ్ణించి కొనసాగించవచ్చు. కొన్ని భావి ప్రయోగాలకు ప్రేరణ కూడా పొందవచ్చు.

పిహెచ్‌డికి ఐతే ఆ పుస్తకాలు నా స్వంతమే కానీ, ఉద్యోగరీత్యా చేసే సైంటిఫిక్ వర్క్ విషయంలో- అవి ఆ సంస్థ ఆస్తి. సంస్థను వదిలి వెడుతున్నప్పుడు ఆ పుస్తకాల్ని సంస్థ లైబ్రరీలో నమోదు చేయాలి.

నేను జర్మనీకి బయల్దేరినప్పుడు అలాంటి మూడు పుస్తకాల్ని అక్కడ లైబ్రరీలో అప్పగించి వచ్చాను. తిరిగి వెళ్లేక మళ్లీ తీసుకోవచ్చు.

ఇక్కడ బెర్లిన్ లేబరేటరీలో ఒక్క ఏడాదిలోనే నావి మూడు పుస్తకాలున్నాయి. వాటిలో ప్రయోగ ఫలితాలతో పాటు- గతానికీ, భావికీ సంబంధించిన విలువైన సమాచారముంది. ఆ పుస్తకాల్ని సంస్థకి అప్పగించేముందు- వాటి పేజీలన్నింటినీ జిరాక్సుగా తీసుకుందుకు అనుమతి కోరాను. అందుకు రాలెక్ వెంటనే ఒప్పుకోవడమే కాక, 'అవి నీ రీసెర్చికి సంబంధించిన విశేషాలు. వాటిమీద నీకు హక్కుంది. ఎటొచ్చీ ఇలా అనుమతి కోరి ఆ వివరాలు తమతో తీసుకువెళ్లినవాళ్లు అరుదు' అన్నాడాయన.

నాకు తెలిసిందేమిటంటే- ఇలాంటి స్కాలర్‌షిప్పు మీద వచ్చినవాళ్లలో కొందరు రీసెర్చిని సీరియస్‌గా తీసుకోరు. సీరియస్‌గా తీసుకున్నవాళ్లలో కొందరు- తమకు కాన్ఫిడెన్షియల్ అనిపించిన సమాచారాన్ని నోట్సులోకి ఎక్కించకుండా వేరే వ్రాసుకుంటారు.

అటు సంస్థ పట్లా, ఇటు రీసెర్చిపట్లా- నిజాయితీగానూ, అంకితభావంతోనూ వ్యవహరించానని రాలెక్ నన్ను మెచ్చుకున్నాడు.

నిజాయితీ నా వ్యక్తిత్వంలో భాగం. నాకు తెలిసి సామాన్యుల్లో నావంటివారే ఎక్కువ. అంకితభావం విషయానికొస్తే- నాకు రీసెర్చి బ్రతుకు తెరువు. ఆమేరకు నిజాయితీగా బాధ్యతను నిర్వహిస్తాను. అలా నేనో సామాన్య శాస్త్రజ్ఞుణ్ణి.

అంకితభావం విషయానికొస్తే- నాకు రీసెర్చికంటే వ్యక్తిగత జీవితమే ప్రధానమని ఒప్పుకోకపోతే నా నిజాయితీకి అర్థంలేదు.

జిరాక్సు చేసిన కాగితాల్ని ఇంటికి తెచ్చేసుకున్నాను.

లేబరేటరీలో నా పేరున ఉన్న వస్తువులన్నీ క్రిస్మసుకి ముందే వెనక్కిచ్చేసి- నోడ్యూస్ సర్టిఫికెట్ తీసుకున్నాను.

క్రిస్మస్ సందర్భంగా ఇంచుమించు నిర్మానుష్యమైన లేబరేటరీ బావురుమంటున్నా- నగరం మాత్రం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

సంపన్న దేశం. వైభవ ప్రదర్శనకు అలవాటుపడ్డ జనం. అతిముఖ్యమైన పండుగ.

ఊరంతా అలంకరణలు. ఇంట్లో ఏంచేస్తారో తెలియదు కానీ, ఇల్లు దాటి బయటకొస్తే, పెద్దపండుగ జరుపుకుంటున్న ఉమ్మడి కుటుంబంలోకి ప్రవేశించినట్లుండేది. రాత్రిళ్లు రంగుల హరివిల్లులో సంచరిస్తున్నట్లుండేది.

బెర్లిన్ నగరానికి చిహ్నం ఎలుగుబంటి. బెర్లినర్ బేర్ పేరిట ఎన్నో సోవనీర్లను అమ్మేవారు.

నగరంలో ఎలుగుబంటిలా వేషం వేసుకుని కొందరు తిరిగేవారు. వారు కనిపించినవారిని ఆప్యాయంగా సమీపించి కరచాలనం చేసేవారు. అలా కరచాలనం చేస్తూ చాలామంది ఫొటోలు తీసుకునేవారు.

మేము కూడా అలా ఫొటోలు తీసుకున్నాం. బాబు మాత్రం ఎలుగుబంటిని చూసి బయటపడి అమ్మ కొంగు చాటుకి వెళ్లిపోయాడు. పాప మేకపోతు గాంభీర్యంతో ముందుకెళ్లి- ఒకడుగు వెనక్కు వేస్తూ చేయి జాపి కరచాలనమిచ్చింది.

క్రిస్మస్ సమయంలో సకుటుంబంగా అక్కడ గడపడం జీవితంలో మరచిపోలేని గొప్ప అనుభవం.

ఇక ప్రయాణం విషయానికొస్తే-

శ్రీమతికి అంత ఆనందంగా లేదు. మళ్లీ తనూ, పిల్లలూ నేను లేకుండా విమాన ప్రయాణం చెయ్యాలంటే ఆమెకు అధైర్యంగా ఉంది.

"హనుమంతుడిలా నీ సామర్థ్యం నీకు తెలియక ఊరికే బెంగ పడుతున్నావు" అని- బెర్లిన్ చేరడానికి తను చేసిన సాహసయాత్రని గుర్తు చేసి, "అప్పటితో పోలిస్తే, ఇప్పుడీ ప్రయాణం నీకు నల్లేరుపై బండి నడక" అని ప్రోత్సహించాను.

"ఎన్ని చెప్పండి! మీరు లేకుండా పిల్లలతో నేనొక్కత్తినీ మళ్ళీ ప్రయాణం చెయ్యడమంటే- పాప బెర్లినర్ బేర్‌కి షేక్‌హ్యాండు ఇవ్వడం లాంటిదే నాకు" అంది శ్రీమతి.

తనకు ఎలా ధైర్యం చెప్పాలని అనుకుంటుండగా, ఓ ఇండియన్ మిత్రుడు మాకు శ్యామలరావు అనే కొత్త మిత్రుణ్ణి పరిచయం చేశాడు.

శ్యామలరావు నాకంటే కొంచెం పెద్దవాడు. ఆయనకి ఇద్దరు పిల్లలు. వాళ్లూ మా పిల్లలకంటే పెద్దవాళ్లు. విశేషమేమంటే- ఆయన కూడా సకుటుంబంగా ఇండియా వెడుతున్నాడు. అదీ శ్రీమతి వెళ్లే విమానంలోనే!

ఆయన్ని ఇంటికి విందుకు ఆహ్వానించాం.

శ్యామలరావు సహృదయుడు. స్నేహపాత్రుడు. కలుసుకున్న కాసేపటికే మా కుటుంబం, వారి కుటుంబం సన్నిహితులమైపోయాం.

"ప్రయాణం గురించి బెంగ పెట్టుకోకు చెల్లెమ్మా! ఫ్రాంక్‌ఫుర్ట్‌లో మీవారు నిన్ను విమానం ఎక్కించేక- బొంబాయిలో నిన్ను మీవాళ్లకి అప్పగించే పూచీ నాది" అన్నాడాయన.

ఆ మాటలకు శ్రీమతి మొహంలో కొత్తగా ప్రవేశించిన ధైర్యాన్ని చూసేక- నాకూ కొంత ఊరట కలిగింది.

వాళ్లు వెళ్లేక, "అంతా నీ సంకల్పబలం. తిరుగు ప్రయాణంలో అన్నీ నువ్వనుకున్నట్లే జరుగుతున్నాయి" అన్నాను శ్రీమతితో.

ఆమె ఒప్పుకోలేదు, "నా సంకల్పానికే అంత బలముంటే- మీరే నాతో వచ్చేవారు" అంది. నేనిక ఆ ప్రస్తావన మానుకున్నాను.

కలకత్తాలో ఉండే అన్నయ్యనుంచి ఉత్తరం వచ్చింది. తను బొంబాయి వచ్చి శ్రీమతిని రిసీవ్ చేసుకుంటానని. అన్నీ సజావుగా జరిగి పోతున్నాయని ఉత్సాహం కలిగినా- ఆ మాట శ్రీమతి వద్ద అనలేదు. నేను తనతో కలిసి ప్రయాణం చెయ్యడం లేదుగా....

ఎయిర్‌మెయిల్, సీమెయిల్ పార్సెల్సు పంపడం ఐపోయింది. కానుకలు కొనడం ఐపోయింది. ఇంట్లో సద్దుళ్లు ఐపోయాయి. ఆఫీసులో అందరితో వీడ్కోలు ఐపోయింది. ఆఫీసుకీ వీడ్కోలు ఐపోయింది. బెర్లిన్‌లోని ఇండియన్ మిత్రులకీ వీడ్కోలు ఐపోయింది.

విశేషమేమంటే- నగరమంతా క్రిస్మస్ వేడుకల్లో తలమునకలై ఉంటే- ఒలోముచ్‌కీ మాత్రం లూయీజీ అంత శ్రద్ధగా తన డ్యూటీ చేసుకుపోతోంది. ఉదయమే తొమ్మిది లోపులో బయటకు వెళ్లిపోతుంది. రాత్రి తొమ్మిదికి కాస్త అటూ ఇటూలో తిరిగొస్తుంది.

క్రిస్మస్ రోజున మాత్రం ఆమె ఇంట్లోనే ఉంది. ఆరోజు మమ్మల్ని తన వాటా గదికి పిలిచింది.

"మీరంతా నాకు నచ్చారు. మీరు వెళ్లిపోతున్నారంటే నాకు చాలా బాధగా ఉంది" అందామె.

ఆమెనుంచి అలాంటి సెంటిమెంటల్ డైలాగ్ వింటానని ఊహించలేదు. అందుకే ఆశ్చర్యపడుతుంటే, ఆమె రుమాలు తీసుకుని కళ్లొత్తుకోవడం నాకు పెద్ద షాక్.

ఆ ఇంట్లో మావాళ్లున్నది ఏడాది. కలుసుకుని మాట్లాడిన సందర్భాలు మూడో నాలుగో ఉంటాయి. అవీ ఆత్మీయతకు సంబంధించి కాదు. పిల్లాడు నవ్వాడన్న ఫిర్యాదో, అడ్వాన్సు కావాలన్న రిక్వెస్టో!

ఆమె వృత్తి కూడా సంసారపక్షం కాదు. సెక్స్ కీనోలో (పోర్న్ సినిమాలు చూపించే థియేటర్సు) టికెట్లు అమ్ముతుంది.

ఆమెనుంచి ఇలాంటి సెంటిమెంటు బయటపడ్డంతో నా మనసు చెమర్చింది.

ఆమె మా పిల్లల్ని దగ్గరగా తీసుకుంది. వాళ్లకి ఓ గుడ్డ బొమ్మ ఇచ్చి, "నా గుర్తుగా ఉంచుకోండి" అంది. తర్వాత శ్రీమతిని దగ్గరగా తీసుకుని ఆప్యాయంగా భుజం తట్టింది.

"మీరు వెళ్లే రోజున ఆ సమయానికి బహుశా నేను ఇంట్లో ఉండను. తాళాలు హెర్ షేరర్‌కి అప్పగించండి. ఇదే మీకు నా వీడ్కోలు" అంటూ ఆమె నాకు షేక్‌హాండ్ ఇచ్చింది.

అక్కణ్ణించి షేరర్ నాతో బయటకొచ్చి, "ఈరోజు చాలా పెద్ద విశేషం. ఒలోముచ్‌కీని ఇంత సెంటిమెంటల్‌గా ఎప్పుడూ చూడలేదు" అని- మా అందరితో కరచాలనం చేసి, "నేనూ మిమ్మల్ని బాగా మిస్సవుతాను. కానీ ఒలోముచ్‌కీలా కళ్లు తుడుచుకోను" అని నవ్వేసి అంతలోనే అప్రయత్నంగా కళ్లు తుడుచుకుని వెళ్లిపోయాడు.

మా వాటాలోకెళ్లగానే పిల్లలు కొత్త బొమ్మతో ఆటలో పడ్డారు. ఆ గుడ్డ బొమ్మ మొహం తమాషాగా జోకర్‌లా ఉంది. కాళ్లూ చేతులూ తలా మొండెం అన్నీ వేలాడుతూ ఎలా కావాలంటే అలా వంగుతూ ఊగుతున్నాయి. పిల్లలకది వినోదంగా ఉంది.

శ్రీమతి నాతో, "సెక్స్ కీనోలో టికెట్లమ్మే మనిషికి ఇంత సెంటిమెంటా?" అంది.

అది నిరసన కాదు. తిరస్కారభావం కాదు. కేవలం ఆశ్చర్యం.

సెక్స్ కీనో అక్కడి సంస్కృతిలో ఒక భాగం. అనేకులకు దినచర్యలోనూ ఒక భాగం. ఎంతలా అంటే- క్రిస్మస్ వేడుకల సమయంలో కూడా- వైనాక్టెన్ పేరిట రెండు రోజులు తప్ప- ఏడాది పొడుగునా ఇంచుమించు అన్ని రోజులూ అవి తెరచి ఉంటాయి. అంటే జనాల్లో అక్కడ వాటికి అంత ఆదరణ ఉంది.

ఏదాది పొడుగునా ఇంచుమించు అన్ని రోజులూ ఒలోముచ్‌కీ అక్కడ టికెట్లు అమ్ముతోందంటే- అదామె సేవాగుణం కింద రాదా?

ఇలా నేను వివరిస్తే శ్రీమతి నవ్వేసి, "ప్రతీదీ తిరకాసుగా ఆలోచించడం మీకు అలవాటే కదా!" అంది.

ఏమైతేనేం- ఒలోముచ్‌కీకి వీడ్కోలు చెప్పడం కూడా ఐపోయింది. ఇక బెర్లిన్ నగరానికి వీడ్కోలు చెప్పాలి.

ఇక్కడికొచ్చేవరకూ నేను చాలా ఎక్కువగా మసలిన ఊళ్లు మూడే మూడు. రాజమండ్రి, విశాఖపట్నం, భువనేశ్వర్.

కాలినడకపై ఎక్కువ ఆధారపడ్డం వల్లనేమో ఆ ఊళ్లలో చాలా ప్రాంతాల్లో కళ్లకు గంతలు కట్టి వదిలేసినా మసలగలను.

ఇప్పుడు బెర్లిన్ అలాగైపోయింది.

అలాగైపోవడమంటే- మసలడానికి మాత్రమే కాదు. అదో అనుబంధం.

రైల్వే స్టేషన్. కుర్‌ఫ్యూర్‌స్టెన్ డామ్, ఎర్న్‌స్ట్ రాయిటర్ ప్లాట్జ్, డాయిచే ఓపర్, చార్లోటెన్‌బర్గ్ ప్యాలస్, విల్మెర్స్‌డార్ఫర్ స్ట్రాసే- ఈ పరిధిలో రోజూ కొన్ని కిలోమీటర్లు కాలినడకన చుట్టేస్తుండే ప్రాంతాలు.

ఆ అనుబంధం మనసుకే కానీ మాటలకి అందదు.

రాజమండ్రిని వదిలినప్పుడు మనసు అంతగా చలించిపోలేదు. ఎందుకంటే- అది నేను పుట్టిపెరిగిన ప్రాంతం. తరచుగా వస్తూ పోతూ ఉంటాను. కానీ విశాఖపట్నం అలా కాదు.

అక్కడికి నేను పైచదువులకోసం వచ్చాను. కొత్తగా సంసారం కూడా ప్రారంభించాను. ఊళ్లోని వీధివీధితోనూ నడక అనుబంధముంది.

ఉద్యోగం కోసం విశాఖపట్నం వదిలి భువనేశ్వర్ వెడుతున్నప్పుడు- గుండెలు పిండినట్లయింది. కన్నీళ్లు ఆగలేదు.

మళ్లీ అక్కడకు వచ్చే అవకాశాలు తక్కువనే కాదు. స్వరాష్ట్రాన్ని వీడి వెడుతున్నానన్న భావన కూడా మనసును కలచివేసింది.

ఇప్పుడు అలాంటి భావన బెర్లిన్ వదిలి వెడుతుంటే కలిగింది.

ఊరితో అనుబంధం. ఊరివాళ్లతో అనుబంధం.

ఆ అనుబంధాలకి శాశ్వతంగా దూరమౌతున్నాను. గుండె బరువెక్కదూ!

బెర్లిన్లో మరో ముఖ్యానుబంధం ఎస్సెస్ రావుగారిది కదా! చివరిసారిగా వాళ్లింట్లో కలుసుకున్నప్పుడు- "మీ ప్రయాణం రోజున- మై కార్ ఈజ్ యట్ యువర్ సర్వీస్" అన్నాడు రావుగారు.

"సామాను ఎక్కువుంది. కారు సరిపోదు. టాక్సీలో వెడతాం" అన్నాను వెంటనే.

"టాక్సీలేం మా కారుకంటే పెద్దవిగా ఉండవు. మీకూ, మీ సామానుకీ చెరో టాక్సీ కావాలి. కాబట్టి ఓ టాక్సీని బుక్ చేద్దాం. ఓదాంట్లో సామాను, మరోదాంట్లో మనుషులు" అన్నాడు రావుగారు.

"మీకెందుకండీ శ్రమ! రెండు టాక్సీల్ని బుక్ చేద్దాం" అన్నాను.

శ్రీమతి సత్యవతి నవ్వి, "నేనూ అదే మాటన్నాను. మాకు మాత్రం స్టేషనుకి రావాలనుండదా! రెండు టాక్సీల్ని బుక్ చేద్దామన్నా. కానీ ఈయనో పెద్ద పిసినారి- తను ఖర్చు పెట్టరు. ఎదుటివాళ్లని ఖర్చుపెట్టనివ్వరు" అంది.

ఐతే అసలు కారణం వేరే ఉంది.

వాళ్ల పిల్లలు బాగా చిన్నవాళ్లు. ఇంట్లోనైనా ఉండాలి. లేదా ఎవరింట్లోనైనా ఫరవాలేదు. రైల్వే స్టేషన్ లాంటి చోట వాళ్లని సముదాయించడం ఇబ్బంది.

"మనం వెడుతున్నది సాయానికి. పిల్లలతోనే సరిపోతే వాళ్లకేం సాయపడతాం" అని రావుగారు అనడంతో- ఆయనొక్కరే స్టేషనుకి వస్తారని అంతకుముందే నిర్ణయం ఐపోయింది.

ఈ విషయం మాకు ముందే తెలియడంవల్ల ఆమె మాటలు ఆ దంపతుల సరస భాషణలని గ్రహించినా, "రావుగారిపై పిసినారి ముద్ర అన్యాయం. మాకోసం ఆయనే రెండు టాక్సీలు బుక్ చేస్తారు" అన్నాను.

"మహానుభావా! ఇక్కడ ఇంకో ఇబ్బంది ఉంది. టాక్సీలో ఐతే సామాను డిక్కీలోనే తప్ప సీట్లపై పెట్టనివ్వరు. అందుకని మీ సామాను మా కార్లో, మీరు టాక్సీలో- అదీ సంగతి" అని విషయానికొచ్చాడు రావుగారు.

"సామానుకని ప్రత్యేకంగా టాక్సీని బుక్ చెయ్యలేమా?" అన్నాను.

"మీకు టాక్సీలోనే వెళ్లాలని మరీ మనసుగా ఉన్నట్లుంది. మా కారుకి టాక్సీ బోర్డు తగిలిస్తా లెండి" అన్నాడు రావుగారు నవ్వుతూ.

మరి వాదనలు పెంచలేదు. ఈ అభిమానానికీ, ఆత్మీయతకూ శాశ్వతంగా దూరమౌతున్నామన్న బాధ మాత్రం రెట్టింపయింది.

ప్రయాణం రోజు రాత్రి పెందరాళే భోంచేశాం. మర్నాటికోసం పులిహోర ఉప్పుపిండి, పెరుగన్నం ప్యాక్ చేసుకున్నాం.

రావుగారు తనింటినుంచి ఫోన్ చేసి- టైము అడ్రసు చెప్పి- టాక్సీ మా ఇంటికొచ్చేలా బుక్ చేశాడు.

టాక్సీకంటే కాస్త ముందుగానే మా ఇంటికొచ్చి సామాను కిందకి దింపడంలో సాయం చేశాడు.

బక్కగా ఉండే హెర్ షేరర్ కూడా సామాను దింపడంలో కొంత సాయం చేశాడు.

టాక్సీ సరిగ్గా అన్న టైముకే వచ్చింది.

సామాను రావుగారి కారు డిక్కీలోనూ, సీట్లలోనూ పెట్టగా మా టాక్సీ డిక్కీ కూడా కొంచెం అవసరమైంది.

సామానుతో బెర్లిన్ స్టేషన్లో దిగగానే- ల్యూనబర్గ్ నుంచి బెర్లిన్ వచ్చిన రోజు గుర్తుకొచ్చింది.

అప్పుడు అదంతా కొత్త.

ఎదురుగా కనబడే 21 అంతస్తుల ఐరోపా సెంటర్ కొత్త. క్రమశిక్షణకు మారుపేరైన సంపన్నదేశంలో- రైల్వే స్టేషన్లో తాగుబోతులు తిరుగుతుండడం కొత్త.

ఇప్పుడవన్నీ పాతబడ్డాయి.

మేము అలవాటుపడ్డ ఆ పరిసరాలన్నీ- 'మిత్రమా! ఇవి మనకు చివరి చూపులు' అంటున్నట్లు తోచింది.

పదహారు నెలల్లో జీవితానికి సరిపడ అనుభవాల్ని మూటకట్టి ఇచ్చిన ఆ మహానగరానికి వీడ్కోలు చెబుతూ ప్లాట్‌ఫాం చేరాను.

నిముషం కూడా తప్పకుండా ట్రయిన్ టైముకి వచ్చింది.

మేమెక్కాల్సిన బోగీని సులభంగానే గుర్తించాం.

ఊబాన్ అనుభవంతో- శ్రీమతి, పిల్లలు అవలీలగా ట్రయినెక్కారు. నేను, రావుగారు కలిసి సామాను మా బోగీలోకి తరలించేశాం.

రద్దీ లేకపోవడంవల్ల బోగీ చాలా విశాలంగా అనిపించింది.

రావుగారికి వీడ్కోలు చెప్పడం అయింది. ఆ మహానుభావుణ్ణి జీవితంలో మళ్లీ ఎప్పుడైనా ఎక్కడైనా కలుస్తామో లేదో తెలియదు.

ఆ క్షణంలో కలిగినది మాటలకందని అనుభూతి.

ట్రయిన్ కదిలింది.

జర్మనీలో ఒక ఊర్నించి మరో ఊరికి దూరప్రయాణం చేసే ట్రయిన్ ఎక్కడం మావాళ్లకి అదే మొదటిసారి. బహుశా చివరిసారి కూడా!

నాలోనూ శ్రీమతిలోనూ ఏదో తెలియని ఉద్వేగం. పిల్లలకేముంది- తలిదండ్రులం పక్కనున్నాం కదా! వాళ్లలో ఉత్సాహమూ, కుతూహలమూ ప్రస్ఫుటమౌతున్నాయి.

వాళ్లు మాముందు సీట్లలో కూర్చున్న యువ జంటని కుతూహలంగా చూస్తున్నారు.

ఇద్దరూ తెల్లవాళ్లు. వాళ్లు ప్రేమికులని తెలుస్తూనే ఉంది. ఒక మనిషి నడుం వాల్చుకునేటంత చోటున్న సీట్లో- ఒక్కరికి కూడా చోటు లేదన్నట్లు ఇద్దరూ ఒకరినొకరు హత్తుకుని కూర్చున్నారు.

రంగులో, దుస్తుల్లో, వేషధారణలో, తనుభాషలో- తమకు పూర్తి భిన్నంగా కనబడుతున్న మమ్మల్ని వాళ్లు కుతూహలంగా చూస్తున్నారు.

శ్రీమతి చీరలో ఉంది. బొట్టు పెట్టుకుంది. చేతికి గాజులు. నాకు కాస్త దూరంగా, మొహమాటంగా కూర్చుంది.

మా నలుగురిలో వారికి మరీ భిన్నంగా అనిపించింది శ్రీమతే!

కుతూహలం ఎంత ఉన్నా- ఎక్కువసేపు చూడ్డం మర్యాద కాదని ఆ జంటకు మాత్రం తెలియదా!

మానుంచి దృష్టి మళ్లించుకుందుకు ఆమె తన ప్రియుడితో కబుర్లు మొదలెట్టింది.

జర్మనీలో యువతీ యువకులు కలిసి ప్రయాణం చేస్తున్నప్పుడు- యువతులు నోరు విప్పితే ఆగకుండా మాట్లాడ్డం చాలాసార్లు చూశాను. అలాంటి సందర్భాల్లో యువకులు తలూపుతూ, చిరునవ్వులు చిందిస్తూ స్పందించడం కద్దు.

ఆ యువతులు ఏం మాట్లాడుతున్నారో విని మనసులో అనువదించుకోవాలనుండేది.

అసలే నా భాషా పరిజ్ఞానం అంతంతమాత్రం. ఆపైన బయట వివిధ శబ్దాలు. అందువల్ల నా కోరిక తీరలేదు.

అవి విని అర్థం చేసుకుని ఉంటే- 'ఆచార్యదేవా, ఏమంటివేమంటివి' వంటి సుదీర్ఘ సంభాషణల్ని- మన సినిమాల్లో ప్రేమికులకు కూడా అన్వయించేలా- సినీ రచయితలకు మార్గదర్శకం చెయ్యగలిగేవాణ్ణి.

ఆమె మాట్లాడుతోంది. అతడు సైగలతో స్పందిస్తున్నాడు.

మాట్లాడుకుంటూ మేము వారిని గమనించీ గమనించనట్లున్నాం. వాళ్లూ మావిషయంలో అంతే!

ట్రయిన్ కదిలి పది నిముషాలు గడిచిందో లేదో- ఆ ప్రేయసీప్రియుల తనుభాషలో మార్పు చోటు చేసుకుంది.

ఏం జరగబోతోందో తెలుసు.

అప్రయత్నంగా పిల్లల్ని చూశాను.

వాళ్లకి ఆ జంటపై ఆసక్తి పోయినట్లుంది. ఇద్దరూ ఒకరికొకరు అభిముఖంగా కూర్చుని ఏవో ఆడుతున్నారు.

శ్రీమతిని చూస్తే- ఆమె ఓసారి ఆవులించి వెనక్కి జారగిలబడింది.

నిద్ర వస్తోందో, నటిస్తోందో తెలియదు. కానీ మా ఎదుట ఏం జరుగనున్నదో ఆమెకీ తెలుసు.

ఇప్పుడా జంటకి ఎదుట మేమున్నామన్న స్పృహ లేదు. వారి లోకం వారిది.

ఆమె తన ముఖాన్ని అతడికి దగ్గరగా చేరుస్తోంది. అతడు వెనక్కి తగ్గుతున్నాడు.

అసలే చలి దేశం. ఆపైన శీతాకాలం.

ఆమె ఊపిరి వెచ్చదనం ఆ చలి వాతావరణానికి లొంగక- అంత వేడిగానూ నా సీటుకి చేరి నన్ను తాకుతోంది.

చొరవ ఆమెది. అనాసక్తత అతడిది అనిపిస్తున్నా- ఆ జంట ఆలింగనం దీర్ఘ చుంబనానికి దారితీసినప్పుడు- అతడి చేతులు ఆమె చుట్టూ బలంగా బిగిశాయి.

ఇలాంటివి చూడ్డం ఇక్కడ నాకేం కొత్త కాదు. ఐనా అప్రయత్నంగా, "పడక గదికీ, పదిమందిలో ప్రయాణానికీ తేడాతెలియని- ఇదేం సంస్కృతి?" అనిపించింది.

చటుక్కున మా వాళ్లని చూస్తే- పిల్లలు అప్పుడే నిద్ర పోతున్నారు.

శ్రీమతి కూడా వెనక్కి వాలి నిద్రపోతోంది. అది నటన కాదని మొహం చూస్తేనే తెలుస్తోంది.

అంటే- ఎదుటి జంటని ఆమె సాధారణంగా తీసుకుందా? మరి నేనెందుకు అలా తీసుకోలేకపోయాను?

"ఇన్నాళ్లున్నారు. ఇంకా వీళ్ల సంస్కృతిని అర్థం చేసుకోలేదా? ఇదేం సంస్కృతి మీది" అంటున్నాయి శ్రీమతి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు.

నేనిక ఆ జంటని పట్టించుకోలేదు. క్రమంగా నాకూ నిద్ర పట్టింది.

ఒక రాత్రివేళ మెలకువొచ్చి చూస్తే- ఆ ప్రేయసీ ప్రియులు కూడా నిద్ర పోతున్నారు. ఒకరికొకరు దగ్గరగా కాదు- తగినంత దూరంలోనే!

అలా ఆ రాత్రి గడిచి తెల్లారేసరికి ట్రయిన్ ఫ్రాంక్‌ఫుర్ట్ చేరింది....

విమానం ఎక్కబోతూనూ

ప్రతి మనిషి జీవితానికీ ఓ పరమార్థం ఉంటుంది. అది నెరవేరడానికి సృష్టికర్త మనిషికి ఆయువునిస్తాడు. ఆయువు తీరేదాకా ఆ పరమార్థ సాధనకు కృషి చెయ్యడం మనిషి బాధ్యత. ఎవరైనా ఆత్మహత్యకు తలపడితే- ఆ బాధ్యతను విస్మరించినట్లే! అందుకే చాలామంది ఆత్మహత్యను మహాపాతకం అంటారు. ఐతే దీనికి మరో కోణం కూడా ఉంది.

మనిషి శరీరానికే తప్ప ఆత్మకి చావు లేదు. బ్రతికున్న మనిషి దుస్తులు మార్చినట్లు ఆత్మ శరీరాలు మారుస్తుందని కొందరంటారు. ఐతే మరణం అంటే ఒక జీవితాన్నుంచి మరో జీవితానికి ప్రయాణమన్న భావన కూడా ఉంది. చనిపోయినవాళ్లు స్వర్గానికో నరకానికో పోతారనడం ఈ భావననుంచే పుట్టింది. అదీ ఒక ప్రయాణమే కాబట్టి దానికో ప్రయాణసాధనం అవసరం. మహాభక్తులు కన్ను మూసేక, వారిని ఊర్ధ్వలోకాలకు తీసుకెళ్లడానికి దేవదూతలు విమానాలు తీసుకొచ్చినట్లు మన పురాణాల్లో చాలా కథలున్నాయి. అదే భావనకు సమకాలీన కథాసాహిత్యంలో శ్రీకారం చుట్టిన ఘనత మహాకథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిది.

సుమారు నూరేళ్ల క్రితం ఆయన 'విమానం ఎక్కబోతూనూ' అనే కథ వ్రాశారు.

ఆ కథ బొబ్బిలియుద్ధానికి సంబంధించినది. బొబ్బిలి రాజు రంగారావు తను ఓటమి అంచున ఉన్నట్లు గ్రహించేక– రాణివాసపు స్త్రీలని ఆత్మహత్య చేసుకోమని ఆదేశిస్తూ మహారాణి మల్లమ్మకు కబురంపాడు.

మల్లమ్మ పతివ్రతే కాదు, వీరవనిత కూడా. అవమానకరమైన పరిస్థితి ఏర్పడినప్పుడు పోరాడి చావాలనుకుంటుంది తప్ప ఆత్మహత్య చేసుకొనడం ఆమెకు సుతరామూ ఇష్టం లేదు. కానీ భర్త ఆదేశం ఆత్మహత్యకే పరిమితమవడం ఆమెకు బాధ కలిగించింది. శత్రువుని గాయపర్చాల్సిన కైజారుని తనకుతానుగా తనపైనే ప్రయోగించాల్సిరావడం దౌర్భాగ్యమని వాపోయింది. తను స్త్రీ కాబట్టి, వీరస్వర్గం పొందే అవకాశాన్ని కోల్పోవాలన్న ఆచారాన్ని నిరసించింది. భర్త ఆదేశాన్ని కాదనలేని అసహాయతకు బాధ పడుతూ– తన ప్రాణాలు తనే తీసుకుంది.

ఆత్మహత్యకు ముందు ఆమె మనోభావాల్ని ప్రతిఫలించింది– 'విమానం ఎక్కబోతూనూ' కథ.

సుమారు నూరేళ్లక్రితం ప్రచురితమైన ఈ కథ– మహిళలకు సంబంధించి మనం పాటించే ఆచారాల్ని స్వాభిమాన మహిళల దృష్టికోణంలో విశ్లేషిస్తుంది. ఆలోచనలో, స్పందనలో– ఆ కాలానికి కనీసం నూరేళ్లు ముందున్న కథ ఇది.

ఇప్పుడీ కథ ప్రస్తావన ఎందుకంటే– బెర్లిన్ నుంచి ఫ్రాంక్‌ఫుర్ట్ దాకా ట్రయిన్లో వచ్చిన మేమిప్పుడు మా స్వర్గావరోహణానికి విమానం ఎక్కబోతున్నాం. అప్పటి మా మనోభావాలకిది తగిన శీర్షిక అనిపించింది.

ఇండియాలో ట్రయిన్లు అనూహ్యంగా ఆలస్యం కావడం కద్దు. అలాంటప్పుడు రైల్వే ప్లాట్‌ఫారంమీద మకాం వేసిన సందర్భాలు చాలామందికి సర్వసాధారణం. కొందరు బెడ్డింగులో, దుప్పట్లో పరుచుకుని అక్కడికక్కడే కునుకు తీస్తారు. మేమలా చెయ్యలేక, కూర్చుని జాగారం చేసేవాళ్లం.

ఇప్పుడు ఫ్రాంక్‌ఫుర్ట్ విమానాశ్రయంలో మాకు అలాంటి పరిస్థితే వచ్చింది.

శ్రీమతి పిల్లల ప్రయాణం సాయంత్రం. నా ప్రయాణం మరుసటి దినం.

హొటల్ గది తీసుకుని విశ్రాంతి తీసుకుని నెమ్మదిగా ప్రయాణం కొనసాగించడానికి తగినంత సమయముంది. కానీ మాకున్న సామాను ఎక్కువ.

ట్రయిన్ మమ్మల్ని నేరుగా ఎయిర్‌పోర్టులోనే దింపింది కాబట్టి సామానుతో సహా అక్కడ ప్లాట్‌ఫారంమీదకి తరలించాం. అక్కణ్ణించి సామాను అవసరమైన చోటకి తరలించడానికి ట్రాలీలున్నాయి, ఎస్కలేటర్లున్నాయి.

ఏణ్ణర్థం క్రితం– మొదటిసారి ఈ విమానాశ్రయం చూశాను. అప్పుడు మాతో వచ్చిన డాడ్ చీఫ్ ఫ్రా ఇంగా రోవెన్ ఆ విమానాశ్రయంలో 200 గేట్లున్నాయని గొప్పగా చెబితే ఆశ్చర్యంగా విన్నాను. కొత్తగా ఓ ఆధునిక సంపన్న పశ్చిమ దేశంలో అడుగెట్టిన థ్రిల్‌తో పాటు, హానోఫర్ వెళ్లే విమానాన్ని క్యాచ్ చెయ్యాలన్న తొందరలో ఈ ప్రదేశాన్ని అంత శ్రద్ధగా చూడలేదు.

తర్వాత మళ్లీ ఇదే రావడం!

ఆ ప్రదేశం విమానాశ్రయంలా లేదు. మహానగరంలో నడి బజారులాగుంది. దుకాణాలు, థియేటర్లు, హొటళ్లు ఉన్నాయి.

సామానంతా ఒకచోట పెట్టుకుని కూర్చున్నాం. తినడానికి పిండి పులిహోర, పెరుగన్నంతో పాటు– పిల్లలకోసం ప్రత్యేకంగా తెచ్చిన బిస్కట్లు, పాల పాకెట్లు కూడా ఉన్నాయి.

ఇలాంటప్పుడు మా పిల్లలు మేం పెట్టింది తినడమే తప్ప ఇది కావాలి, అది కావాలని మారాం చెయ్యకపోవడం మా అదృష్టం.

ముఖప్రక్షాళనం, ఫలహార సేవనం అయ్యేక– శ్రీమతి సామాను దగ్గర కూర్చుంటే, నేను పిల్లల్ని చుట్టుపక్కల తిప్పి చూపించాను. ఆసక్తికరంగా ఉన్న దృశ్యాల్ని ఫొటోలు తీశాను.

ఎయిర్‌పోర్ట్ ఆరేడంతస్తుల భవనం. కారులో వచ్చేవారు ఏ అంతస్తుకా అంతస్తు దగ్గరకు నేరుగా వచ్చి కారు పార్కు చేసుకోవచ్చు. మెలికలు తిరిగి పైకి ఎగబాకిన పెద్ద కొండచిలువలా ఉన్న ఆ కారు పార్కింగ్ ఏరియా చూసి థ్రిల్లయిన నేను– ఉండబట్టలేక నా మనోభావాల్ని పిల్లలతో పంచుకున్నాను. పాపకి కొంత అర్థమైంది కానీ బాబు ఆశ్చర్యంగా విన్నాడు.

పిల్లల్ని వెనక్కి తీసుకొచ్చేక, "ఇంతసేపు పట్టే మాటైతే నలుగురం కలిసి తిరుగుదాం. లేదా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. చుట్టూ జనాల్ని చూస్తూనే ఇక్కడ కాలక్షేపం చేసేయొచ్చు" అంది శ్రీమతి.

ఒక్కత్తీ కూర్చోవడంవల్ల తనకి బోరు కొట్టిందని అర్థమై, "ఒకచోటే ఎంతసేపని కూర్చుంటాం. సామాను వదిలేసి తిరుగుదాం. మన దేశంలోలా కాదు. ఇక్కడ ఏమీ పోవు" అన్నాను.

"ఇక్కడా పోలీసు స్టేషన్లున్నాయి. జైళ్లున్నాయి. అంటే వాటి అవసరం ఉందనేగా! మన జాగ్రత్త మనం తీసుకుంటేనే– ఎవరైనా మనకు సాయం చెయ్యగలిగేది?" అని శ్రీమతి నన్ను మందలించింది.

"అది సరే కానీ– కూర్చుని మాట్లాడుకునేందుకు కబుర్లేముంటాయ్?" అన్నాను.

"మొదటిసారి మనిద్దరం కలిసి ట్రయిన్లో విశాఖపట్నంనుంచి భువనేశ్వర్ వెడుతున్నప్పుడు చాలాసేపు కూర్చునే కిటికీలోంచి ప్రకృతి దృశ్యాల్నీ, కొత్త కొత్త రైల్వేస్టేషన్లనీ చూశాం. మీరేమో ప్రతి ఊరికీ ఆ పేరెందుకొచ్చిందో అప్పటికప్పుడు కల్పించి కథ చెప్పేవారు. ఆ ప్రయాణం ఎంత బాగుందో!" అంది శ్రీమతి వెంటనే.

నిజంగానే మా జీవితంలో అదొక మధుర సన్నివేశం.

నేను చెబుతున్న కథ అప్పటికప్పుడు కల్పించినదని తెలిసి కూడా– కొత్త స్టేషను వచ్చినప్పుడల్లా కథ అడిగేదామె. పసితనం, చిలిపితనం, అమాయకత్వం, గడుసుతనం, ముచ్చట, కుతూహలం– కలగలిసిన ఆమె ముఖభావాలు– తలచినప్పుడల్లా నిలువెల్లా పరవశుణ్ణి చేస్తాయి నన్ను.

"ఇక్కడ స్టేషన్లూ లేవు. ప్రకృతీ లేదు..." అన్నాను.

"కానీ మనుషులున్నారు. తెల్లవారు, నల్లవారు, యెల్లోవారు– ఇలా రంగురంగులవాళ్లు. అంతా ఎవరి హడావుడిలో వాళ్లుండి పక్కవాళ్లని పట్టించుకోలేని దశలో ఉన్నారు. ప్రతి ఒక్కరికీ ఓ కథ ఉంటుంది..." శ్రీమతి ముఖంలో అప్పుడే అలనాటి భావాలొచ్చేశాయి.

"చెప్పండి నాన్నగారూ" అని పాప అనేదాకా నాకు పిల్లల ఉనికే గుర్తు రాలేదు.

ఇప్పుడు నేను చెప్పే కథలకి ఒకరు కాదు– ముగ్గురు స్పందిస్తారు. ఈ అనుభవం అప్పటికంటే మనోహరం కాగలదనిపించింది.

చుట్టూ చూస్తే– అంతవరకూ మామూలుగా కనిపించిన మనుష్యులు– ఇప్పుడు కథల్లో పాత్రల్లా కనిపించారు.

వాళ్ల కథలు నాకు తెలియవు. కానీ నాకు తోచిన కథ ఆపాదిస్తే– అడిగేదెవరు?

ముందు మాకు దగ్గర్లో నిలబడి సీరియస్‌గా ఏదో చర్చిస్తున్న నడివయసు తెల్ల జంటని ఎన్నుకున్నాను.

వాళ్లు దంపతులో, స్నేహితులో, ఇప్పటికిప్పుడు ఇక్కడ పరిచయమయ్యారో తెలియదు. నేను మాత్రం వాళ్లని దంపతుల్ని చేసేశాను.

"ఆయనకి సినిమా చూడాలనుంది. ఆమెకి చర్చికి వెళ్లాలనుంది" అంటూ మొదలెట్టాను.

ఆయనకి సినిమాలంటే ఎందుకు అభిమానమో చెప్పాలి కదా– అందుకో కథ చెప్పాను. అలాగే ఆమెకు భక్తి ఎందుకొచ్చిందో మరో కథ!

శ్రీమతి ముచ్చటగా వింటోంది. పిల్లలు కుతూహలంగా వింటున్నారు.

"చివరికి వాళ్లు రెండూ వద్దనుకుని, ఏదైనా ఊరికెడదామని ఎయిర్‌పోర్టుకొచ్చారు" అన్నాను.

"ఏ ఊరెడతారు?" అంది పాప కుతూహలంగా.

"అదే తేలక, ఇద్దరూ గొడవ పడుతున్నారు" అన్నాను.

శ్రీమతి కిసుక్కున నవ్వింది. ఆమె నవ్విందని పిల్లలు నవ్వారు.

అంతలోనే ఆ జంట అక్కణ్ణించి కదిలారు. దంపతులు కారేమో మరి– వెళ్లేటప్పుడు చెరోవైపూ వెళ్లారు.

"వాళ్ల గొడవైపోయినట్లుందే– వెళ్లిపోతున్నారు– ఎక్కడికో మరి!" అంది శ్రీమతి.

"చివరికి ఇద్దరూ చెరో ఊరూ వెడదామనుకున్నారు. చెరో ఊరూ వెళ్లే బదులు– ఈ ఊళ్లోనే ఉండి– ఒకరు చర్చికీ, ఒకరు సినిమాకీ వెడితే సరిపోతుందిగా– అని విడిపోయారు" అన్నాను.

ఆశ్చర్యంగా పాపకీ కథ నచ్చడమే కాదు, దూరంగా వెడుతున్న ఇద్దరు చైనావాళ్లని చూపించి వాళ్ల కథ చెప్పమంది.

అలా కథలు చెప్పుకుంటుంటే టైమ్ తెలియలేదు. శ్రీమతి హెచ్చరించి మమ్మల్ని భోజనానికి సిద్ధం చేసింది.

మా భోజనాలయ్యేసరికి వెతుక్కుంటూ మావద్దకొచ్చాడు శ్యామలరావు.

ఆయన్ని చూడగానే శ్రీమతికి వెయ్యేనుగుల బలమొచ్చింది. ఉత్సాహంగా పలకరించింది.

శ్యామలరావు కూడా ఎంతో స్నేహపూర్వకంగా మాట్లాడాడు. ప్రయాణంలో శ్రీమతికి అండగా ఉంటామని ధైర్యం చెప్పాడు.

"లగేజి చెకిన్ చేస్తే ఓ పనైపోతుంది. ఇప్పుడే మా సామాను అక్కడికి చేరవేశాం. మా ఆవిణ్ణక్కడ కూర్చోబెట్టి, నేనిలా వచ్చాను. మీ సామాను కూడా అక్కడికి చేరేద్దాం" అన్నాడు శ్యామలరావు.

ఆయన ఇలాంటి ప్రయాణాల్లో అనుభవజ్ఞుడిలాగున్నాడు. ట్రాలీ తీసుకొస్తే, ఆయన సాయంతో మా సామాను షిఫ్టింగు సులభమైంది.

ఆయనకు థాంక్సు చెప్పాను. ఆయన భార్య శ్రీమతిని ఆప్యాయంగా పలకరించింది. ఇద్దరూ కాసేపు కబుర్లు చెప్పుకున్నారు.

ఎయిరిండియా లజేజి చెకిన్ వద్ద ఒక నల్లతను, తెల్లతను ఉన్నారు. ఇద్దరూ చెట్టంత మనుషులు. దిట్టంగా ఉన్నారు కానీ లావు కాదు.

మావైతే ఇరవై కేజీలకు అటూ ఇటూ ఉండే సూట్ కేసులు కానీ– అక్కడ మావాటికి డబల్ సైజు సూట్ కేసులు చాలానే ఉన్నాయి. అవి మేము రెండు చేతులూ ఉపయోగించినా పైకి లేపడం కష్టం. వాటినా నల్లతను ఒంటిచేత్తో అవలీలగా ఎత్తుతుంటే– చిటికెన వ్రేలితో గోవర్ధనగిరిని పైకెత్తిన పోతనగారి 'నల్లనివాడు' గుర్తుకొచ్చాడు.

నల్లతను లగేజిని వెయింగ్ మెషీన్‌మీద పెడుతున్నాడు. తెల్లతను రీడింగు చూసి వాటికి లేబుల్సు వేస్తున్నాడు. బరువు పరిమితిని దాటితే అదనపు రుసుము వసూలు చేస్తున్నాడు.

అక్కడే ఓ తెల్లమ్మాయి కూడా ఉంది. ఆమె ప్రయాణీకుల్ని పలకరించి చిన్న చిన్న టిప్సు ఇస్తోంది. ఆమె శ్రీమతిని చూసి స్నేహపూర్వకంగా నవ్వింది. మా పిల్లల్ని చూసి ముచ్చటపడి ఇద్దరికీ చిన్న సైజు చాక్లెట్లు చెరొకటీ ఇచ్చింది.

పెట్టెల బరువు ఎక్కువుంటే అదనపు చార్జి తప్పనిసరి. హ్యాండ్ లగేజిలో మనిషికి 15 కేజీలవరకూ ఉచితం కాబట్టి– పెట్టెల్లో వస్తువుల్ని హ్యాండ్ లగేజికి మార్చుకోమని సలహా ఇచ్చిందామె.

మా సూట్‌కేసుల బరువు ముందుగా చూసుకోమని సలహా ఇచ్చి అందుకు తన వంతు సాయం చేసింది. అన్నీ కూడా ఐదారు కేజీలు ఎక్కువుండడం గమనించి– పిల్లలిద్దరున్నారు కాబట్టి వాళ్లకీ హ్యాండ్ లగేజి అనుమతిస్తారనీ, ఆ సదుపాయం ఉపయోగించుకోమనీ చెప్పింది.

పిల్లలిద్దరికీ బెర్లిన్లో వాడిన చిన్న ట్రాలీలున్నాయి. వాటిని వాళ్లు సులభంగానే లాగుతున్నారు. వాటిలోకి వాళ్లు లాగగలిగినన్నీ, శ్రీమతి హ్యాండ్‌బ్యాగులోకి తను మోయగలిగినన్నీ వస్తువుల్ని తరలించాం.

ఆ తర్వాత కూడా సూట్ కేసుల బరువు రెండు మూడు కేజీలు అదనంగా ఉన్నాయి. ఉసూరు మనిపించినా– వాటికి డబ్బు కట్టడానికి మానసికంగా సిద్ధమయ్యాం.

నల్లతను మా సూట్‌కేసులు నాలుగూ వరుసగా తూకం వేశాడు. తెల్లతను బరువు నోట్ చేసుకున్నాడు. అన్నీ బరువెక్కువే.

చార్జి ఎంత వేస్తాడోనని భయపడ్డాను. కానీ అతడోసారి నావంక చూసి, స్నేహపూర్వకంగా నవ్వి, "ఓకే" అన్నాడు.

ఆ ఓకేతో మాకు– కనీసం ఓ వంద మార్కులైనా కలిసొచ్చింది. అతడికి థాంక్సు చెప్పాను.

హ్యాండ్ లగేజి ఐతే వాళ్లిక బరువు చూడలేదు. చెకిన్ ఐనట్లు లేబుల్సు వేసేశారు.

మావాళ్లకి హ్యాండ్ లగేజి తప్ప మిగతా సామానంతా చెకిన్ ఐపోవడంతో ఎంతో తేలికగా అనిపించింది.

"పిల్లలూ, నేనూ ఈ హ్యాండ్ లగేజితో విమానం ఎక్కగలమా అని భయంగా ఉంది" అంది శ్రీమతి.

"మేమున్నాంగా, మీకేం భయం లేదు" అని శ్యామలరావు వెంటనే అభయహస్తమిచ్చాడు.

అది రాజకీయాల్లో ఎన్నికల వాగ్దానంలాంటిదని అప్పుడు తెలియదు.

ఇక మిగిలింది నా సామాను ఓ సూట్ కేసు, హ్యాండ్ లగేజి.

సూట్‌కేసు బరువు చూసుకుంటే అదనంగా దగ్గర దగ్గర పది కేజీలుంది. శ్రీమతి, నేను హ్యాండ్‌బ్యాగులోకి కొంత బరువు తరలించాం.

హ్యాండ్‌బ్యాగ్ చాలా పెద్దదే కానీ– దాన్ని నేను మొయ్యగలగాలి కదా! అందుకని సూట్‌కేసు బరువు పూర్తిగా తగ్గించలేకపోయాం.

ఆ రెండింటినీ ఎయిర్‌పోర్టులోనే ఓ లాకర్లో పెట్టివచ్చాను.

అప్పటికి శ్యామలరావు లగేజి చెకిన్ మొదలైంది.

శ్యామలరావు మొదటి సూట్ కేసు రెండు కేజీల బరువెక్కువుంది.

తెల్లతను ఏదో అనేలోగానే శ్యామలరావు కలగజేసుకుని, "ఇంటివద్ద హై క్వాలిటీ జర్మన్ వెయింగ్ మెషీన్ మీద తూకం వేశాను. పరిమితికి ఓ కేజీ తక్కువే వచ్చింది. ఇక్కడ మెషీన్లో ఏదో తేడా ఉన్నట్లుంది" అని వాళ్లవంక స్నేహపూర్వకంగా చూసి నవ్వాడు.

ఎయిర్‌పోర్టులో లగేజి విషయంలో సాధారణంగా 2–3 కేజీలకు చూసీ చూడనట్లు ఊరుకుంటారని విన్నాను. ఐతే ఊరుకోకపోతే మనం చెయ్యగలిగింది ఏంలేదని కూడా విన్నాను.

అనుభవజ్ఞుడు కదా– ఎందుకైనా మంచిదని శ్యామలరావు వాళ్ల ముందరికాళ్లకు బంధం కూడా వేస్తున్నాడనుకున్నాను.

కానీ ఆ తెల్లతను ఆయన మాటలు పట్టించుకున్నట్లు లేదు. మొదటి సూట్‌కేసుకి 2 కేజీలు అదనమని వ్రాశాడు. తర్వాత రెండో పెట్టెకి మూడు కేజీలు వ్రాశాడు. వాళ్లిద్దరి హ్యాండ్ లగేజిని కూడా తూకమేసి మరో ఐదు కేజీలు కలిపి, "ఇళ్లలో వాడే మెషీన్సుని మేము పట్టించుకోం. ఎయిర్‌పోర్టులో మెషీనే మాకు ఆధారం" అని మొత్తం పది కేజీలకు చార్జి చేశాడు.

శ్యామలరావు మొహం వివర్ణమైంది.

"మీరు ఒకొక్కరికి ఒకోలా పరిమితి నిర్ణయిస్తారా?" అన్నాడు కోపంగా.

ఆయన బరువు విషయంలో మాకొచ్చిన కన్సెషన్ని ప్రస్తావిస్తున్నాడని అర్థమై క్షణంపాటు భయమేసింది! శ్యామలరావు మా పెట్టెల్ని వెనక్కి రప్పించి మళ్లీ తూకమేయిస్తాడా అని అనుమానం కలిగింది. .

తెల్లతను ఆయనకు సమాధానమివ్వలేదు. "నెక్స్ట్" అన్నాడు నల్లతనితో.

నా మనసు తేలిక పడింది.

శ్యామలరావు డబ్బు కట్టేశాడు కానీ బాగా అప్సెట్టయ్యాడు.

నిజానికి నేనూ అప్సెట్టయ్యాను. ఫ్రాంక్‌ఫుర్ట్ నుంచి బొంబాయి వెళ్లడానికి శ్రీమతికి తోడుగా ఉంటానని భరోసా ఇచ్చి, ఎయిర్‌పోర్టులో మాకు చెప్పుకోతగ్గ సాయం చేసిన మనిషి.

ఆయనకిలా అవకుండా ఉంటే బాగుండేదనిపించింది.

శ్యామలరావుకి అదనపు చార్జి పడడం న్యాయమే ఐనా ఆయన ఉక్రోషంలో న్యాయముంది. ఇంచుమించు అదే బరువుకి మాకు ఏ చార్జీ పడలేదు.

కారణమేమిటి?

ఆ సమయంలో తూకం చూసినవాళ్ల మూడ్ బాగుండడమా లేక శ్యామలరావు అతితెలివికి పోయాడా?

కొన్ని ప్రశ్నలకు జవాబులుండవు. అందుకే అదృష్టం అనే పదం పుట్టింది.

అక్కణ్ణించి కదిలేక నేను శ్యామలరావుకి కొన్ని ఓదార్పు మాటలు చెప్పి ఉపశమనం కలిగించాలనుకున్నాను.

గెల్చినవాడు ఓడినవాడిపై చూపించే సానుభూతి ఉపశమనాన్ని కలిగించదు సరికదా ఉక్రోషాన్ని ప్రకోపింపజేస్తుంది. క్రీడాకారులు అందుకు భిన్నం కావచ్చు కానీ– శ్యామలరావు క్రీడాకారుడు కాదు.

అందుకేనేమో– అంతవరకూ స్నేహపూర్వకంగా ఉన్న ఆయన ఉన్నట్లుండి ముభావంగా మారాడు.

"చిన్న పనుంది, మళ్లీ కలుస్తాం" అంటూ భార్యతో సహా అక్కణ్ణించి వెళ్లిపోయారు.

అప్పుడు వాళ్లిద్దరి మొహాలూ చూస్తే– మళ్లీ కలుస్తామా అనిపించింది.

'విమానంలో శ్రీమతికి కొండంత అండ పోయినట్లే!' అనుకుని నిట్టూర్చాను.

కొన్ని స్నేహాలంతే!

అవి చెడిపోవడానికి ఇద్దరిలో ఎవరి తప్పూ ఉండనక్కర్లేదు. ఒకరి అదృష్టం చాలు– రెండోవారు దూరం కావడానికి!

కాసేపటికి సెక్యూరిటీ చెక్ సమయమైంది.

శ్రీమతి తన హ్యాండ్‌బ్యాగుని భుజానికి తగిలించుకుంది. ఆ బరువుకామె భుజం కొద్దిగా వంగింది.

పిల్లలిద్దరూ వాళ్ల ట్రాలీల్ని హుషారుగా లాగుతున్నారు. వాళ్ల వయసుకవి బరువెక్కువే ఐనా– ఆ వయసిచ్చిన ఉత్సాహం, కుతూహలం– వాటిని కొంత తేలిక చేశాయి

క్రమంగా వాళ్లు నాకు దూరమౌతుంటే– నా కళ్లు శ్యామలరావుకోసం వెదికాయి. ఎక్కడా జాడ లేదు.

'సెక్యూరిటీ లోపల మావాళ్లకు తప్పక కనిపించకపోడు' అనుకున్నాను మనసులో.

దాన్ని ఆశ అనుకుందుకు లేదు– దురాశేనేమో!

వాళ్ల విమానం వెళ్లిపోయింది. ఇక నా ప్రయాణముంది. అది నేడు కాదు. రేపు!

అంటే ఈ రాత్రంతా అక్కడే గడపాలి.

చాలావరకూ సామాను శ్రీమతితో వెళ్లిపోయింది. నా సామాను లాకర్లో ఉంది.

చేతులూపుకుంటూ ఒంటరిగా తిరగడం హాయిగానే ఉంది– మనసులో శ్రీమతి ఒంటరి ప్రయాణం గురించిన బెంగ లేకపోతే!

బెర్లిన్ వచ్చినప్పుడు శ్రీమతి చాలా ఇబ్బందిపడింది. కానీ వెళ్లేటప్పుడు అంత ఇబ్బంది లేదు.

'నేను స్వయంగా విమానం ఎక్కించాను. తను బొంబాయిలో దిగగానే అన్నయ్య రిసీవ్ చేసుకుంటాడు' అని మనసుకి సద్దిచెప్పాను.

ఆ తర్వాత ఎయిర్‌పోర్టులోజరిగిన విశేషాలు కొన్ని జీవితాంతం గుర్తుండిపోయేవే!

వాటిలో ముఖ్యమైనది– విమానాశ్రయంలో రైలు ప్రయాణం.

ఎయిర్‌పోర్టులో ఒకచోటనుంచి ఒకచోటకి వెళ్లడానికి ట్రైన్ సదుపాయముంది. దానికి టికెట్ అవసరం లేదు.

కాలక్షేపానికి ట్రయినెక్కి తదుపరి స్టేషన్లో దిగాను. కాసేపక్కడ తిరిగేక– వచ్చినచోటకి వెళ్లడానికి మళ్లీ ట్రయినెక్కాను.

వచ్చినప్పుడైతే ప్రయాణానికి ఐదు నిముషాలు పట్టింది. తిరిగి వెళ్లడానికి పావుగంట దాటినా స్టేషన్లొస్తున్నాయి కానీ, ట్రైన్ ఆగలేదు.

వచ్చేటప్పుడు కాలాన్నీ, దూరాన్నీ సరిగ్గా అంచనా వెయ్యలేదేమో అనుకున్నాను తప్ప కంగారు పడలేదు. ఐతే అరగంట గడిచినా ట్రైన్. ఐతే అరగంట గడిచినా ట్రైన్ ఆగకుండా ఇంకా ముందుకు పోతుంటే భయమేసింది.

కిటికీలోంచి బయటకు చూస్తే భవంతులు, రోడ్లు కనబడ్డం లేదు. అసలు నగరం ఛాయలే లేవు.

'ఎచటికి పోతావీ రాత్రి?' అన్నారెవరో చెవిలో.

'అవతలి గట్టుకి' అన్న జవాబు మనసులో మెదలగానే– దాన్ని చెవిదాకా చేరకుండా ఆపడానికి కష్టపడ్డాను.

అదృష్టం– మెదడు చురుగ్గా పని చేసింది. ఆ తర్వాత ఒకటి రెండు నిముషాల్లో ఏదో స్టేషన్లో ట్రైన్ ఆగితే చటుక్కున దిగిపోయాను.

అంతే– చలి! మామూలు చలికాదు. జనవరి మొదటి వారపు చలి. నా వంటిమీదున్న ఓవర్‌కోటు ఆ చలిని ఏమాత్రం ఆపడం లేదు.

ఎయిర్‌పోర్టులోనూ ట్రయిన్లోనూ హీటింగ్ ఉండడంవల్ల తెలియలేదు కానీ– రైల్వే ప్లాట్‌ఫారంమీద అలాంటి సదుపాయం లేదు. వణుకుతూనే చుట్టూ చూశాను.

ప్లాట్‌ఫారంమీద జనసంచారం లేదు. దూరంగా ఓ మనిషి కనిపిస్తున్నాడు.

సమీపంలో ఎక్కడా నగరమున్నట్లు లేదు. ఏదో పల్లె శివార్లలో ఉన్నట్లనిపించింది.

అర్థమైంది నాకు. చాలా పెద్ద పొరపాటు చేశాను. అటు వెళ్లాల్సిన ట్రైనుకి బదులు ఇటు వెళ్లే ట్రైనెక్కాను.

తెలియని దేశంలో పరిమిత జ్ఞానంతో తెలియని ట్రయినెక్కాను. అనుకోకుండా ఫ్రాంక్‌ఫుర్ట్ నగరం విమానాశ్రయంనుంచి– జర్మన్ గ్రామీణ వాతావరణంలోకి దూసుకొచ్చాను.

అదీ రేపు ఇండియాకు ప్రయాణం పెట్టుకుని!

గుండె దడదడ కొట్టుకుంది.

అంతలో దూరంగా కనిపించిన మనిషి నడక వేగం పెంచి నావద్దకు పరుగున వచ్చాడు. నన్ను చూసి టికెట్ అడిగాడు.

అప్పుడు తెలిసింది– అతడు స్టేషన్ మాస్టరని!

గుండె కొట్టుకునే వేగం పెరిగింది.

నావైపునుంచి ఈ స్టేషనుకి రావడం ఒక తప్పు. ఈ ప్రయాణానికి టికెట్ లేకపోవడం మరో తప్పు!

దేశంకాని దేశంలో టికెట్‌లెస్ ట్రావెల్!

ఈ నేరానికి ఇక్కడ ఎలాంటి శిక్ష ఉంటుంది?

జైలు శిక్షా లేక జరిమానాయా?

జరిమానా ఐతే ఎంత కట్టాల్సి ఉంటుంది?

"టికెట్" అన్నాడు స్టేషన్ మాస్టర్ మళ్లీ....

భయంతోనో, ఉద్వేగంతోనో వళ్లు వేడెక్కింది. ఆ వేడికి ఎముకలు కొరికే చలికే వణుకొచ్చి కాసేపు టెంపరేచర్ని చాటేసింది.

స్టేషన్ మాస్టరుకి– టికెట్ లేదని చెప్పాలని అనుకున్నాను. కానీ నేరుగా అలా చెప్పడానికి, నేరస్థుడిలా ఫీలవాలి.

అందుకని అసలు టికెట్ ప్రసక్తి రావివ్వకుండా సమస్యను పరిష్కరించాలనుకున్నాను. కొంచెం తెలివి వాడి, 'ఇదే స్టేషన్?' అనడిగాను జర్మన్ భాషలో.

నాకు జర్మన్ గొప్పగా రాకపోయినా– గ్యోతే ఇన్‌స్టిట్యూట్లో చదివిన జ్ఞానముంది. ఏణ్ణర్థంపైన జర్మనీలో మసలిన అనుభవముంది. అవసరమైనప్పుడు– యాక్సెంటుని స్థానికుల స్థాయికి దగ్గర్లో తీసుకురాగలను.

ఆయన స్టేషన్ పేరు చెప్పి, ఎందుకన్నట్లు చూశాడు.

నేనాయన చూపుల్ని పట్టించుకోకుండా, 'ఇక్కడికి ఫ్రాంక్‌ఫుర్ట్ ఎయిర్‌పోర్ట్ ఎంత దూరం?' అన్నాను.

అనుకున్న ఫలితం సాధించాను. ఆయన కనీసం ఆ క్షణానికి టికెట్ విషయం మరిచి, 'ఎందుకు?' అన్నాడు ఈసారి నోటితో.

'ఎయిర్ పోర్టులో ఒక ట్రైనెక్కబోయి ఇంకొకటి ఎక్కాను. ఎయిర్‌పోర్ట్ దాటి ఇంతవరకూ రావడంతో ఇక్కడ దిగిపోయాను. రేపే నా ప్రయాణం. వెంటనే వెనక్కి వెళ్లాలి. ఏదైనా ట్రయినుందా?' అన్నాను.

ఆయనకి పరిస్థితి అర్థమైంది. 'జర్మన్ బాగా మాట్లాడుతున్నావు. ఎన్నాళ్లనుంచి ఉంటున్నావిక్కడ?' అనడిగాడు.

'హమ్మయ్య– టికెట్ ప్రస్తావన తేలేదు' అనుకున్నాను. కొంత ధైర్యం వచ్చింది. నేను జర్మన్ బాగా మాట్లాడుతున్నానన్న ప్రశంస ఆ ధైర్యాన్ని మరికాస్త పెంచింది.

ఆయనకి నా గురించి ఏంచెప్పాలో క్షణాలమీద తట్టినా ఒక్క నిముషం ఆగాను.

మరీ ఎక్కువ మాట్లాడితే జర్మన్ విషయంలో నా పరిమితులు బయటపడకుండా, జాగ్రత్తగా పదాల్ని ఎంచుకున్నాను.

'నేను కెమిస్ట్రీలో డాక్టరేట్ చేశాను. సైంటిస్టుని. ఆహ్వానం మీద వచ్చాను. నేనిక్కడికొచ్చి ఏణ్ణర్థం దాటింది. నా భార్యాబిడ్డల్ని నేడే ఇండియాకు పంపేశాను. రేపు నా ప్రయాణం' అన్నాను.

జర్మనీలో పెద్ద చదువులు చదివేవారు తక్కువ. మెట్రిక్ కాగానే వృత్తిపనుల్లోనో, వ్యాపారంలోనో శిక్షణ తీసుకుని, తమ కాళ్లమీద తాము నిలబడే ప్రయత్నం చేస్తారు. చదువు అక్షరజ్ఞానానికే తప్ప, ఉద్యోగం కోసమని వారనుకోరు. ఉద్యోగాలకు ఎగబడేవారూ తక్కువే. ఐతే పెద్ద చదువులు చదివేవారన్నా, ముఖ్యంగా సైంటిస్టులన్నా– అక్కడి సామాన్యులకి చాలా గౌరవం. బయట తిరుగుతున్నప్పుడు నా డాక్టరేట్ డిగ్రీ ఎన్నోమార్లు నాకక్కడ ప్రత్యేక గౌరవాన్ని ఆపాదించింది.

ఈ నేపథ్యాన్ని గుర్తుంచుకుని నేను చెప్పిన వివరాలు– స్టేషన్ మాస్టరుపై నేను కోరిన ప్రభావాన్నే చూపించాయి.

నా వివరాలు విని అతడి కళ్లు పెద్దవయ్యాయి. నావంక ఎంతో గౌరవంగా చూశాడు. తర్వాత దగ్గరుండి ఎయిర్‌పోర్టుకి వెళ్లే ట్రయిన్ ఎక్కించాడు. టికెట్ లేదని కానీ, ఫైను కట్టాలని కానీ పొరపాటున కూడా అనలేదు.

అప్పటికే వేడెక్కిన వళ్లు. వేడిగా ఉన్న ట్రయిన్ కంపార్టుమెంటులో చేరగానే ముందు ఉక్కబోసింది. ఉక్క తగ్గి, వాతావరణం ఆహ్లాదంగా మారడానికి కాసేప్పట్టింది.

ఐతే నాలో టెన్షన్ ఇంకా పోలేదు. వెడుతున్నది ఎయిర్‌పోర్టుకా, మరో కొత్తచోటుకా అన్న బెంగ మనసుని ఆక్రమించుకుంది.

ఎయిర్‌పోర్ట్ చేరగానే– ఇండియాలో ఆంధ్రాలో మా ఊరు పేరవరాన్ని చూసినంత ఉత్సాహం కలిగింది. అక్కడ దిగి తేలికగా ఊపిరి పీల్చుకుని, 'రేపు విమానం ఎక్కేదాకా ఇక ఎయిర్‌పోర్టులో ట్రయిన్స్ ఎక్కకూడదు' అనుకున్నాను.

లాకర్లో హ్యాండ్ లగేజి బ్యాగు కాక– నటరాజన్ ఇచ్చిన ఎలక్ట్రికల్ టైపు రైటర్ ఉంది. అది చిన్న బ్రీఫ్ కేసులా ఉంటుంది. ఆరెండింటినీ లాకర్లోంచి రేపే తీసుకోవాలనుకున్నాను.

ఇక నాదగ్గర భుజానికి వ్రేలాడే చిన్న సంచీ తప్ప ఇంకేం లేవు. ఆ సంచీలో బ్రషింగ్ సామాను, పళ్లు, ఫలహారం, పెరుగన్నం ఉన్నాయి.

కొద్దిగా పిండి పులిహోర, పెరుగన్నం, అరటిపండు తిన్నాను. జనసముద్రాన్ని చూస్తూ కాసేపు విమానాశ్రయంలో తిరిగాను. ఐతే భార్య, పిల్లలు పక్కన లేకపోయేసరికి– అంతమంది జనమున్నా ఒంటరిగానే ఫీలయ్యాను.

ఒంటరితనం పోవడానికి చుట్టూ జనాన్ని చూస్తూంటే– నేను శ్రీమతికి వాళ్ల గురించి కథలు కల్పించి చెప్పడం గుర్తొచ్చింది. ఇప్పుడా జనంలో ఎవరైనా నాకులాగే– తమవాళ్లకి నా కథ ఊహించి చెబుతున్నారేమోనని పరీక్షగా చూస్తే– వాళ్లలో ఎవరూ నా గురించి పట్టించుకున్నట్లే అనిపించలేదు.

ఒకచోట కూర్చుని కళ్లు మూసుకున్నాను. నిద్ర రాలేదు.

టైంచూస్తే ఇంకా ఎనిమిది దాటిందంతే!

మామూలుగా పదిలోగా పడుకునే అలవాటు లేదు. ఈలోగా అటూఇటూ తిరిగితే– వంటికి కాస్త వ్యాయామం కూడా అనుకున్నాను.

తిరుగుతుంటే పది నిముషాల్లోనే బోరు కొట్టింది. అంతకంటే కూర్చుని కళ్లు మూసుకుంటే– ఏమో నిద్రొచ్చినా రావచ్చనిపించింది.

అంతలో అక్కడో సెక్స్ కీనో ఒకటి కనబడింది.

బెర్లిన్లో మా ఇంటామె ఒలోముచ్‌కీ– సెక్స్ కీనోలోనే టికెట్లమ్మేది. వచ్చి అక్కడ సినిమా చూడమని, ఆదిలో ఒకసారి ఆహ్వానించినట్లు గుర్తు. కానీ ఎరిగున్నవాళ్లకి తెలిసేలా– అలంటి సినిమాలు చూడ్డానికి మొహమాటం.

శోభన్ ఘోష్ చొరవ లేకపోతే నేనా మొహమాటాన్ని జయించి శ్రీమతితో కలిసి పోర్న్ ఫిల్మ్ చూసుండేవాణ్ణి కాను.

ఇక్కడ నన్నెరిగినవాళ్లూ లేరు. పట్టించుకునేవాళ్లూ లేరు.

'మెలకువగా ఉండి కళ్లు మూసుకుని కూర్చునే కన్నా– కాసేపు ఆ హాల్లో కూర్చుంటే సరిపోతుంది కదా!' అంది మనసు.

అని ఊరుకోలేదు– 'ఇండియా వెళ్లేక ఇలాంటి సినిమా ఊసెత్తడానికే ఉండదు. చూడ్డానికి మిగిలిన ఆఖరి అవకాశమిదే!' అని కూడా ప్రోత్సహించింది.

ఐతే గుప్పెట మూసినంతసేపే కదా రహస్యంపై ఆసక్తి!

మన సినిమాల్లో సన్నివేశాలు– ఆ సిద్ధాంతంమీదనే రూపొందడంవల్ల– రెచ్చగొట్టే దృశ్యాలున్న సినిమాలు పాతికేసి వారాలు కూడా ఆడతాయి. ఐతే ఈ సినిమాలు తెరచిన గుప్పెటవంటివి. చూడనప్పుడుండే ఆసక్తి చూసేక ఉండదు.

ఐతే కడుపు నిండినవాడికి కూడా ఇష్టమైన వంటకం కనబడితే పుట్టే కక్కుర్తి లాంటిదే నాకప్పుడు కలిగింది.

ఓ గంటన్నరసేపు హాల్లో కూర్చుని సినిమా చూశాను.

ఒక ఆశ్రమం. అందులో ఒక బాబా. ఆయన మన బాబాలకిలాగే ఉన్నాడు కానీ తెల్లవాడు.

ఆశ్రమంలో అందమైన ఆడపిల్లలు. వాళ్లకోసం ఎగబడే మగాళ్లు.

వాళ్లెవరూ మనుషులనిపించదు. వంటిమీద బట్టల్లేకుండా జంతువుల్లాగే మసలుతున్నారు.

అదలాగుంచితే– ఆ సినిమాలో స్త్రీకి రక్తమాంసాలున్న మనిషిగా గుర్తింపు లేదు.

పురుషుడి వినోదం కోసం ఎందుకైనా సిద్ధపడే యంత్రం స్త్రీ!

కోరికల వెర్రితలకు పరాకాష్ట. కొంత హింస. కొంత జుగుప్స.

ఆశ్చర్యమేమంటే– ఆ సినిమా చూస్తున్నప్పుడు తొలిసారి చూసిన వికారం లేదు నాలో. నాకే అలాగుందా అన్న అనుమానంతో– ఓరగా చుట్టూ చూస్తే– నా చూపులకు అందినవారంతా నిర్వికారంగానే అనిపించారు.

వచ్చినవాళ్లలో కుర్రాళ్లకంటే నడివయస్కులే ఎక్కువ.

ఇలాంటి సినిమాలు ఎందుకు తీస్తారు? మనిషిలో– ఇలాంటి అసహజపు కాంక్ష అంతర్లీనంగా ఉంటుందా?

స్త్రీపురుషులకి పరస్పరాకర్షణ కలగడానికి– నిషేధించబడిన ఓ ఆపిల్ పండు కారణమని బైబిల్ చెబుతుంది. ఏమైతేనేం– చెయ్యాల్సిన పని ఆ ఆపిల్ చేసేసింది. ఇప్పుడింకా ఈ సినిమాల అవసరముందా?

కొన్ని దేశాలు వీటిని నిషేధించాయి. అంటే– అప్పుడా ఆపిల్ ప్రేరేపించినకంటే పెద్ద నేరాలు, ఘోరాలు ఈ సినిమాలవల్ల జరగొచ్చనా?

అదే నిజమైతే– ప్రపంచ దేశాలన్నీ వీటినెందుకు నిషేధించవు?

బెర్లిన్లో ఉండగా ఈ సినిమాల గురించి ఎక్కువ ఆలోచించడానికి సమయం దొరకలేదు.

ఇప్పుడు ఒంటరిగా, ఈ విమానాశ్రయంలో, లభించిన చివరి అవకాశాన్ని ఉపయోగించుకున్నప్పుడు– మనసులో ఈ సినిమాలపై లోతైన విశ్లేషణ మొదలైంది.

తొలిసారి చూసినప్పుడు– కుతూహలం కలగలిసిన కాంక్ష కలిగితే– ఇప్పుడు వేదాంతం!

ఉద్రేకంకంటే ఎక్కువగా జుగుప్స కలగడంతో– ఏదో తప్పు చేసినట్లనిపించి అసంతృప్తి కలిగింది.

'మళ్లీ జీవితంలో ఈ తరహా సినిమాలు చూడను' అనుకున్నాను.

అలా అనుకోగానే నాకు చిన్నప్పుడు చందమామలో చదివిన తోడేలు కథ గుర్తుకొచ్చింది.

ఒకసారి ఒక తోడేలు వరదలో చిక్కుకుని, నీటి మధ్య చిన్న గుట్ట కనబడితే దానిమీదకు ఎక్కింది. ఎక్కడా తిండి దొరికే మార్గం లేక, 'నేడు ఏకాదశి. అదృష్టం కొద్దీ ఉపవాసం చేసే అవకాశమొచ్చింది' అని సంతోషించింది. అంతలో ఒక మేకపిల్ల ఈదుకుంటూ అదే గుట్ట ఎక్కింది. తోడేలు దాన్ని చూసి, 'మళ్లీ తిండి ఎప్పటికి దొరుకుతుందో, ఉపవాసం సంగతి తరువాత చూసుకోవచ్చు' అనుకుని మేకపిల్లమీద దాడి చెయ్యబోయింది. చురుకైన ఆ మేకపిల్ల తోడేలు తనపై దూకేలోగానే, మళ్లీ నీళ్లలోకి దూకేసి ఈదుకుంటూ ఎటో వెళ్లిపోయింది. అప్పుడు , 'ఇంకా నయం, ఉపవాసం చెడిపోయేది' అనుకుని సంతోషపడింది తోడేలు.

మనిషి బలహీనతల్ని ఆసరాగా తీసుకునే దురాకర్షణలుంటాయి. కథలో తోడేలులా– నిరసిస్తూనే వాటిని దూరం పెట్టలేనివారు ఎక్కువ కావడంవల్లనే– అవి నిరాటంకంగా కొనసాగుతున్నాయి.

లేకుంటే నేడు నేనా సినిమా చూడ్డమెందుకు? మరి చూడనని నిర్ణయం చేసుకోవడమెందుకు?

ఆ విమానాశ్రయం గయ లాంటి పుణ్యక్షేత్రం కాదు కాబట్టి– నా మాటకు కట్టుబడాల్సిన బాధ్యత ఉండదన్న ధైర్యమేమో మరి!

సినిమా చూసి బయటకొచ్చేక– ఓ అరగంట ఎయిర్‌పోర్టులో తిరిగేసరికి, నిద్రాదేవత కరుణించింది.

నిన్న సకుటుంబంగా– నేడు ఒంటరిగా– ఎయిర్‌పోర్టులో నిద్రపోయాను.

మర్నాడు ఆరవకుండానే మెలకువ. బాత్రూంకి వెళ్లి ముఖప్రక్షాళన చేసుకున్నాక– వళ్లంతా చిరాగ్గా అనిపించింది.

ఒకటి– రోజూ స్నానం చెయ్యడం అలవాటు. రెండు– నిన్న స్నానం చెయ్యలేదు.

ఇవి కాక మోడో కారణముంది.

బాత్రూంలో స్నానాల గది ఉంది. అందులో టబ్బుంది. ఆ టబ్బుకి ప్లాస్టిక్ తెర ఉంది.

తెరవెనుక మనిషి స్నానం చేస్తున్నట్లు తెలుస్తుంది కానీ– ఆ మనిషి ఆడో మగో కూడా తెలియనంత అస్పష్టంగా కనిపిస్తుంది.

కీనోని చూడగానే సినిమా చూడాలనిపించినట్లే– ఆ టబ్బు చూడగానే స్నానం చెయ్యాలని మనసు ఉవ్విళ్లూరింది.

తెర వెనక్కి వెళ్లాను. తెరని లాగాను. టబ్బు వెనక కొక్కేనికి సంచీ తగిలించాను. తగినంత ప్రైవసీ ఉండడంతో– బట్టలు తీసేసి వాటినీ కొక్కేనికి తగిలించాను. టబ్బులోకి వెళ్లాను.

టబ్బులో కుళాయికి– మనకు కావాల్సిన టెంపరేచరు అడ్జస్ట్ చేసుకునే సదుపాయముంది.

బాగా చలిగా ఉంది కాబట్టి– వేణ్ణీళ్లు అరవై డిగ్రీలు పెట్టుకున్నాను.

కుళాయి తిప్పితే ముందు చల్లని నీళ్లొచ్చాయి. చేతికి తగలగానే వేళ్లు కొంకర్లు పోయాయి. క్రమంగా నీళ్లు వేడెక్కుతూ– చేతికి హాయిగా అనిపించగానే వంటిమీద పోసుకుని, 'ఇంట్లో ఇలా కావాల్సిన వేడి తెచ్చుకోగలిగితే, వేరే స్వర్గసుఖముంటుందా?' అనుకున్నాను.

ఆ సుఖం కొద్ది క్షణాలే. నీళ్లు వేడెక్కడం ఆగలేదు. ఇంకా ఇంకా వేడిగా మారుతూంటే వళ్లు కాలుతున్నట్లయింది. అలా పది క్షణాలు చూసి– ఇంక వేడి భరించలేక చటుక్కున టెంపరేచర్ ముప్పైకి తగ్గించేశాను.

నీళ్ల వేడి తగ్గింది. అప్పటికే మంటగా ఉన్నా– కొద్ది క్షణాలకే వళ్లు తట్టుకుంది.

నీళ్లు అంతలా ఎందుకు వేడెక్కాయి? హీట్ కంట్రోల్ సరిగ్గా లేదా? విమానాశ్రయాల్లో ఇలాంటి కంట్రోల్సుని చెక్ చేసుకోవద్దా?

స్నానమయ్యేక ఎయిర్‌పోర్ట్ అథారిటీస్‌ని కలుసుకుని ఫిర్యాదు చెయ్యాలనుకున్నాను. కానీ– నీళ్ల వేడి ముప్పైకి తగ్గించేక– స్నానం హాయిగానే ఉంది. ఏమని ఫిర్యాదు చెయ్యాలి?

అలా ఆలోచిస్తుంటే– బుర్రలో ఏదో వెలిగింది.

నీళ్లు మరిగేది వంద డిగ్రీలవద్ద కాబట్టి, అరవై డిగ్రీల దగ్గరైతే– వంటికి వెచ్చగా ఉంటుందని నేననుకున్నాను. కానీ మన శరీరపు ఉష్ణోగ్రత సుమారు 37 డిగ్రీలు. అంతకంటే రెండుమూడు డిగ్రీలకంటే ఎక్కువ వేడిని శరీరం భరించగలదా అని ఆలోచించలేదు.

భువనేశ్వర్లో బయట సగటు ఉష్ణోగ్రత సుమారు 35 ఉంటుంది. కాబట్టి అక్కడ 35 డిగ్రీల వేడి ఉన్న నీళ్లు– వంటికి వేడి అనిపించక పోవచ్చు. కానీ ఇక్కడ బయట ఉష్ణోగ్రత 20 డిగ్రీలు. నీళ్లు 30 డిగ్రీల వేడిలో ఉన్నా చేతికి వెచ్చగా అనిపిస్తాయి.

ఇంత చిన్న విషయం నాకెందుకు తట్టలేదు?

నేను కాలేజిలో చదువుతున్నప్పుడు మా తాతగారు, 'డిగ్రీ చదువుతున్నా, వీడికింకా లోకజ్ఞానం అబ్బలేదు' అని వ్యాఖ్యానించేవారు.

అప్పుడు నాకు కోపమొచ్చి, 'ఈ పెద్దోళ్లున్నారే' అనుకునేవాణ్ణి కానీ, బహుశా ఇలాంటి సందర్భమొచ్చి ఉండొచ్చని ఇప్పుడనిపిస్తోంది.

ఏమైతేనేం– శాస్త్రజ్ఞానానికీ, పరిజ్ఞానానికీ, లోకజ్ఞానానికీ ఉన్న అంతరం అర్థమైంది నాకు.

ఆతర్వాత టెంపరేచర్ని నలబై దాటనివ్వకుండా ఓ అరగంట సేపు టబ్బు స్నానం చేశాను. హాయిగానే ఉన్నా– అరవై డిగ్రీల చురక కూడా తన వంతు అనుభూతిని ఇస్తూనే ఉంది.

స్నానమైంది. విడిచిన బట్టలే మళ్లీ వేసుకోవడం అసంతృప్తిగా అనిపించినా తప్పలేదు.

ఆతర్వాత పెద్దగా విశేషాలేం లేకుండానే– లగేజి చెకిన్ సమయం ఆసన్నమైంది.

ఈసారి కూడా చెకిన్ సమయంలో– నా సూట్ కేసు బరువు 3 కేజీలు ఎక్కువే ఉంది.

తూకమేసినవాడు స్నేహపూర్వకంగా నవ్వి, ఓకే అనగానే– 'ఎంతమంచివాడవురా' అని పాడుకున్నాను అప్రయత్నంగా.

వెంటనే ఈ విషయాన్ని శ్రీమతితో పంచుకునే సదుపాయముంటే ఎంత బాగుణ్ణు అనుకున్నాను. కానీ ఆ వెంటనే శ్యామలరావు ఊహలోకొచ్చాడు.

ఆ ఊహలో ఆయన విమానంలో కూర్చుని ఉన్నాడు. పరీక్షగా చూస్తే, మావాళ్లకి మూడు వరుసలు వెనక్కున్నాడు. శ్రీమతికి నేనందించిన సమాచారం విని ముప్పై వరసలు వెనక్కెళ్లిపోయాడు.

'ఇప్పుడాయన్నెందుకూ తల్చుకోవడం! మీ అదృష్టానికి సంతోషించి అంతటితో సరిపెట్టుకోండి' అని శ్రీమతి మందలించినట్లై, ఆ ఊహలోంచి బయటపడ్డాను.

మన అదృష్టం మనకిచ్చే సంతోషంకంటే, అందుకు ఇతరులు అసూయపడితే వచ్చే కిక్ ఎక్కువ– అని గ్రహించినవాడనై– సిగ్గుపడ్డాను.

మిగతా సామాన్లలో టైపురైటర్ ఫ్రీ, అదికాక హ్యాండ్ బ్యాగ్ ఉంది.

తూకమేసే అతను బ్యాగు బరువు చూస్తే– 35 కేజీలుంది. పరిమితి 15 కేజీలు.

ఏమంటాడోనని బెంగగా చూస్తే, అతడు దానికి లుఫ్తాన్సా టాగ్ తగిలించి– 'ఇది క్యాబిన్ బ్యాగేజి కాబట్టి నీతోనే ఉంచుకో' అన్నాడు.

తేనె మనసులు సినిమాలో కృష్ణ, 'అయ్యబాబోయ్– జోకుమీద జోకు' అన్నట్లు– 'అయ్యబాబోయ్, షాకుమీద షాకు' అనుకున్నాను.

అప్పుడు వద్దనుకున్నా శ్యామలరావే గుర్తుకొచ్చాడు.

కూడా తీసుకెళ్లడానికి బాగుంటుందని కొన్నాం ఆకుపచ్చటి ఆ బ్యాగు. సైజు కాస్త పెద్దదే ఐనా చూడ్డానికి హ్యాండ్ లగేజిలాగే ఉంది.

ఐతే అందులో అంత బరువు పడుతుందనుకోలేదు.

ఏమైతేనేం– ఆ బ్యాగు కొనడమూ, దాన్ని ముప్పై ఐదు కేజీల బరువుతో నింపడమూ– మంచికే అయిందని సంతోషించాను.

అప్పుడే నాకు చిన్నప్పుడు చూసిన 'నథింగ్ బట్ ట్రబుల్' సినిమా గుర్తొచ్చింది. అందులో లారెల్ అండ్ హార్డీలు– ఓ గుర్రపు మాంసం ముక్కని కొయ్యడానికి చాకు పనిచెయ్యక, సుత్తిని తెస్తారు. అదీ కుదరక రంపాన్ని తెస్తారు. కొయ్యడానికే అంత కష్టంగా ఉంటే– దాన్ని తినడమెలా అన్నది వారికి స్ఫురించదు.

ఇప్పుడు నా క్యాబిన్ లగేజిని అదనపు చార్జి లేకుండా పట్టుకెళ్లనివ్వడంవరకూ బాగానే ఉంది.

కానీ దాన్ని విమానంలోకి మోసుకెళ్లడం ఎలా? ముప్పై ఐదు కేజీల బరువుని మొయ్యడానికి నా రెండు చేతులూ కూడా చాలవు.

ఐనా రెండు చేతులూ ఉపయోగించడానికి– ఒక చేయి టైపురైటరుకి బుక్కయిపోయింది.

'మొహమాటపడకు. నీకు కష్టమైతే ఇది తీసుకోవద్దు' అని నటరాజన్ టైపురైటరు ఇచ్చేటప్పుడు హెచ్చరించాడు పాపం.

కానీ నేనిప్పుడు అదెందుకు తీసుకున్నానా అని విచారించడం లేదు. 'ఐనా– బ్యాగుని రెండు చేతులతో పట్టుకుని విమానం ఎక్కుతుంటే చూడ్డానికి బాగుండదు. అందులోనూ అది క్యాబిన్ బాగేజి. చిటికెన వ్రేలితో ఎత్తేలా ఉండాలి' అనుకున్నాను.

చిటికెన వ్రేలితో కాకపోయినా ప్రాక్టీసు చేస్తే ఆ బ్యాగుని ఒంటిచేత్తో ఎత్తలేనా– అనుకుని వెంటనే ప్రాక్టీసుకి ఉపక్రమించాను.

భారతంలో భీముడు ద్రౌపది కోరిన సౌగంధికపుష్పంకోసం గంధమాదనపర్వతంమీద తిరుగుతుండగా, హనుమంతుడు ముసలికోతి వేషంలో తోకని దారికి అడ్డంగా పరిచి పడుకున్నాడు. భీముడు తప్పుకోమంటే, తను

కదలలేననీ, తోకని భీముణ్ణే తీసి పక్కకు పెట్టమనీ చెప్పాడు హనుమంతుడు. ఐతే భీముడంతటివాడు తన బలమంతా పెట్టినా కూడా, ఆ తోక అంగుళమైనా కదల్లేదు.

ఇప్పుడు నా క్యాబిన్ లగేజి ఆ తోకలాగే ఉంది.

ఎక్కడ సమస్యుందో అక్కడే పరిష్కారం వెదుక్కోమంటారు. ఆ బెంగలోనే నాకు హనుమంతుడి గురించిన మరో కథ గుర్తుకొచ్చింది.

హనుమంతుడికి తన బలం తనకి తెలియదు. ఎవరైనా పొగిడి ఉబ్బేస్తే నూరు యోజనాల సముద్రాన్ని కూడా లంఘించగలడు.

చిన్నప్పుడు మా అమ్మ అదే సూత్రం అనుసరించి– నన్ను విపరీతంగా పొగిడి నేనసాధ్యమనుకున్న పనుల్ని నాచేతే చేయించేది.

అలా చెట్టెక్కి మామిడికాయలు కోశాను. బొగ్గుల బస్తాని పెరట్లోంచి నీళ్లగదిలోకి మార్చాను. అటకెక్కి– తేళ్లకీ, జెర్రెలకీ భయపడకుండా– పాత ఇత్తడి సామాను తీశాను. ఇలా ఎన్నో---.

అలాంటప్పుడు మా సూర్యం బాబాయిని నాకు ప్రేరణగా చెప్పేది అమ్మ.

అవసరమైనప్పుడు సూర్యం బాబాయి 24 కుంచాల బస్తాని (ఇప్పుడు క్వింటాలు) ఒంటిచేత్తో ఎత్తి భుజంమీదేసుకుని మోసేవాట్ట.

అది గుర్తుకు రాగానే నాలో కొత్త ఊపొచ్చింది. నా క్యాబిన్ లగేజి క్వింటాల్లో మూడో వంతే మరి!

నన్ను నేను ప్రోత్సహించుకుని బ్యాగుని ముట్టుకుంటే– అది దూదిపింజలా గాల్లోకి లేచింది.

దాన్ని ఒంటిచేత్తో ఎత్తి సెక్యూరిటీ చెక్‌కి వెళ్లాను. బాగా ధైర్యం వచ్చింది.

బ్యాగు పక్కనెట్టుకుని కుర్చీలో కూర్చున్నాక, కుడిచెయ్యి చచ్చుబడిపోయినట్లనిపించింది.

దానికి ప్రాణం పొయ్యడానికి కాసేపు మౌనం వహించి, 'కమాన్! నువ్వు లేస్తావు. బ్యాగుని విమానంలోకి చేరుస్తావు' అంటూ చేతిని మోటివేట్ చెయ్యసాగాను.

అదృష్టం– కాసేపటికి చెయ్యి కాస్త కదిలింది. కొద్ది క్షణాల్లోనే అది మామూలయింది. హమ్మయ్య అనుకున్నాను.

ఒక పని మనవల్ల ఔతుందా అని తెలుసుకుందుకు ముందు ప్రయత్నం కావాలి. ఆ ప్రయత్నానికి మానసిక బలం ఉండాలి. ఆ బలముంటే– ఒకోసారి అసాధ్యాల్ని కూడా సుసాధ్యం చెయ్యొచ్చు.

అప్పుడు నేను ఎడం చేత్తో ఎలక్ట్రికల్ టైప్ రైటర్, కుడి చేత్తో 35 కేజీల బ్యాగూ తీసుకుని నడుచుకుంటూ విమానంలోకి చొరబడ్డానంటే– అది నా మానసిక బలమే అనుకోవాలి.

ఐతే నడుస్తున్నంతసేపూ నేను పూర్తిగా కుడివైపుకి ఒరిగిపోయానన్న సంగతి నాకు తెలుస్తోంది.

విమానంలో అడుగెట్టగానే పసుపు బట్టల యూనిఫాంలో లుఫ్తాన్సా ఎయిర్‌హోస్టెస్ యువతి నాకు వెల్కమ్ చెప్పింది. నేను రెస్పాండవడానికి తలొంచబోతే అది ఆమెవైపు కాక కుడిపక్కకే ఒరిగింది.

అలాగే ఆమెను దాటుకుని ముందుకెళ్లాను.

అక్కడ సీటుకి దారిచూపించే ఎయిర్‌హోస్ట్ యువకుడు నన్నాపి– అదోలా చూశాడు.

నేను బ్యాగు కింద పెట్టి, ఏదో అనబోతుండగా– 'అదేమిటి?' అనడిగాడు ఇంగ్లీషులో.

అతడా బ్యాగ్ గురించే అడుగుతున్నాడని గ్రహించి, తటపటాయిస్తూనే 'క్యాబిన్ లగేజ్' అన్నాను. అనగానే సిగ్గు ముంచుకొచ్చింది.

మా పెళ్లి తంతులో గుమ్మం దగ్గర ఆపి– నా పేరు చెప్పమన్నప్పుడు నా భార్య కూడా అంత సిగ్గుపడి ఉండదు. అప్పుడు నేనా బ్యాగుని 'క్యాబిన్ లగేజి' అనడానికి నేను పడ్డ సిగ్గు కొలతలకు అందదు.

అతడా బ్యాగుని కళ్లార్పకుండా ఒక్క క్షణం చూసి, 'ఇది క్యాబిన్ లగేజా?' అన్నాడు. ఆశ్చర్యంతో కాబోలు అంతకంటే మాట రాలేదతడికి.

నాకూ మాట రాక, 'ఊఁ' అని తలడించాను.

'ఏదీ, ఒకసారి పైకెత్తి చూపించు' అన్నాడతడు.

బ్యాగు పైకెత్తుదామంటే– నా కుడిచెయ్యి చచ్చుబడిపోయి ఉంది. కదల్లేదు.

ఏమనుకున్నాడో అతడే బ్యాగుని పైకెత్తబోయాడు.

ఆరడుగులు కాకపోయినా ఇంచుమించు అంత పొడుగూ ఉన్నాడు. నాకంటే చాలా బలంగా కనిపిస్తున్నాడు. ఐనా అతగాడు కూడా ఆ బ్యాగుని పైకి లేపలేక, ఆ ప్రయత్నమాపి, 'నో నో' అని తల అడ్డంగా ఆడించి, 'దీన్ని తూకం వేయించేవా?' అనడిగాడు.

'ఊఁ' అన్నాను.

''విమానం బయల్దేరడానికింకా టైముంది. కిందకెళ్లి మరోసారి బరువు తూపించుకుని రా' అన్నాడతడు.

గుండెల్లో రాయి పడింది. జాలిగా, అమాయకంగా చూశానతణ్ణి.

నా మొహం చూస్తే ఏమనిపించిందో ఏమో– 'సరేలే' అంటూ నా సీటుకి దారి చూపించాడు.

అంతేకాదు– తన కొలీగ్ సాయం తీసుకుని, నా సీటుపైన క్యాబిన్లో ఆ బ్యాగుని పెట్టి, దాని పేరుని సార్థకం కూడా చేశాడు.

అప్పటికి నేను పూర్తిగా మామూలు మనిషినై, అతడికి థాంక్సు చెప్పాను.

పరిసరాల్ని గమనిస్తుంటే– అంతకుముందు జర్మనీ రావడానికి ఢిల్లీలో లుఫ్తాన్సా ఎక్కిన సంఘటనలన్నీ నెమరుకొచ్చాయి. (ఆ వివరాలు ఇదే పత్రికలో– మా 'ఫారిన్ వెళ్లాలండి' నవల చివర్లోనూ, ఫారిన్ వెళ్లానండి నవల మొదటి భాగంలోనూ లభిస్తాయి).

అప్పుడు నేను భూతలస్వర్గంగా భావించబడే సంపన్న పాశ్చాత్యదేశానికి వెడుతున్నాను. ఇప్పుడు 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అనుకుంటూ స్వదేశానికి తిరిగి వెడుతున్నాను.

ఈ మధ్యలో ఎన్ని అనుభవాలు! ఎన్ని అనుభూతులు! ఎన్ని అనుబంధాలు!

అన్నిటినీ విడిచి వెళ్లిపోతున్నానంటే గుండె బరువెక్కింది. విమానం రన్‌వేమీద కదలగానే, 'ఔఫ్ వీడర్‌జెహెన్ డాయిచ్‌లాండ్' అనుకున్నాను. కొత్త బంధాల్ని తెంచుకోలేక నాలో కొంచెం అసంతృప్తి కూడా చేరుకుంది. ఐతే కొన్ని గంటల్లో స్వదేశం పలుకనున్న స్వాగతం– అక్కడ నాకోసం వేచిఉన్న అనుభవాలు, అనుభూతులు, అనుబంధాలు– ఆ అసంతృప్తిని తొలగించడానికి ఎంతోసేపు పట్టలేదు.

జననీ జన్మభూమిశ్చ

నాలో దేశభక్తి ఎంతుందో, అసలుందో లేదో నేనెప్పుడూ అంచనా వేసుకోలేదు. కానీ 'మరికొద్ది క్షణాల్లో విమానం బొంబాయి విమానాశ్రయంలో దిగబోతోంది' అన్న ప్రకటన, బయటి ఉష్ణోగ్రత వివరాలు వింటుంటే– ఆ క్షణంలో తనువు నిలువెల్లా పులకరించింది. ఆ ఉత్సాహంతోనేమో– నా స్పెషల్ 'క్యాబిన్ లగేజి'తో ఎయిర్ పోర్టులో దిగడం కష్టమనిపించలేదు, దిగడానికి ఎంతోసేపూ పట్టలేదు.

బొంబాయి ఎయిర్ పోర్ట్. అంటే ఇండియా. నేను ఇండియాలో ఉన్నాను.

దిగుతూనే ఓవర్ కోట్ తీసేశాను. స్వెటర్ తీసేశాను. వీడ్కోలు జర్మనీకే కాదు– ఆ దుస్తులకి కూడా! ఎందుకంటే– భువనేశ్వర్లో ఉష్ణోగ్రత చలికాలంలో అప్పుడప్పుడు పది డిగ్రీల సెంటిగ్రేడుకి దిగువకి వెడుతూంటుంది. రాజమండ్రి నివాసికి ఆ చలి బాగా ఎక్కువే. ఐనా నాక్కక్కడ స్వెటర్ అవసరపడలేదు. అసలు నేను కొన్న మొదటి స్వెటర్ ఢిల్లీలో– జర్మనీ ప్రయాణానికి విమానం ఎక్కబోయేముందు!

చలి దుస్తులనుంచి లభించిన స్వేచ్ఛని ఆస్వాదిస్తూ ఓసారి చుట్టూ చూశాను.

అది 1976 జనవరి. అప్పటికింకా మన విమానాశ్రయాలు అంతర్జాతీయ స్థాయి చేరుకోలేదు. విదేశాలతో పోలిస్తే తేడా చాలా స్పష్టంగా తెలుస్తోంది.

1966లో వచ్చిన సంగీతలక్ష్మి సినిమాలో కాబోలు– ఎన్టీ రామారావు ఎవరి సాయంతోనో ఓడ ప్రయాణం చేసి, వేరే దేశంనుంచి స్వదేశం చేరగానే కుంటుకుంటూ దిగి, ఒడ్డున మట్టిని చేత్తో తీసి, 'నేను పుట్టిన మట్టి ఇదీ, నేలమీది స్వర్గమిదీ' అని పాడతాడు.

ఈ విమానాశ్రయంలో కూడా ఆ పాటకు అనువైనంత మట్టి ఉంది. తనువునింకా జర్మనీ వాసనలు అంటిపెట్టుకుని ఉన్నాయేమో, నాకా మట్టి– నేలమీద స్వర్గాన్ని గుర్తు చెయ్యలేదు. సెంటిమెంట్లకు అతీతంగా– మిగతా ఫార్మాలిటీస్ పూర్తి చేసే హడావుడిలో ఉన్నాను మరి!

సామాను కలెక్ట్ చేసుకుందుకు కాసేప్పట్టింది. ట్రాలీ దొరకడంతో, నా 'క్యాబిన్ లగేజి'ని తరలించడం సులభమైంది.

ఇక కస్టమ్స్ చెక్. ఫ్రాంక్‌ఫుర్ట్‌లో లగేజి చెకిన్– సాటి ఇండియన్నుని కూడా అసూయకి గురి చేసేంత లాభంగా అయింది. ఇండియాలో కస్టమ్స్ చెక్ గురించి, ఇంతవరకూ స్వంతూరు దాటివెళ్లనివారు కూడా కథలుకథలుగా చెప్పుకుంటారు. అందుకని మనసులో కాస్త భయంగానే ఉంది– కూడా తెచ్చుకున్న వస్తువులకి ఎంతెంత డ్యూటీ కట్టాలోనని.

అప్పటికీ జర్మనీలో ఇండియన్ మిత్రులు కొన్ని టిప్స్ ఇచ్చారు. ఆ ప్రకారం– కస్టమ్స్ ఆఫీసర్ని సంతోషపెట్టడానికి మూడు ఐటమ్సు కొని దగ్గరుంచుకున్నాను. కోన్యాక్ బ్రాందీ, బ్లాక్ అండ్ వైట్ విస్కీ, 555 సిగరెట్లు. ఇందులో సిగరెట్లు విమానంలో కొన్నాను.

నేను ట్రాలీ తోసుకుంటూ వెడుతుంటే– 'ఇటు' అన్న మాట గంభీరంగా వినిపించి ఆగి అటు చూస్తే–

ఓ నడివయస్కుడు. హుందాగా ఉన్నాడు. నన్నే చూస్తున్నాడు. అతడికి నాతో పనేమిటా అని కొంచెం చిరాగ్గానే చూశాను.

'కస్టమ్స్' అన్నాడతడు స్నేహపూర్వకంగా నవ్వుతూ.

ఉలిక్కిపడ్డాను. కస్టమ్సువాళ్లు క్రూరంగా చూస్తూ, వేటకుక్కల్లా మీదికి దూకుతారని విన్నాను. నేను కూడా మరీ అంతలా కాకపోయినా, హిందీ సినిమాల్లో ప్రాణ్, కెయన్ సింగుల్లా (ఇది బొంబాయి కాబట్టి) ఉంటారని ఊహించుకున్నాను. కానీ అతడి ముఖం బల్‌రాజ్ సహానీ అంత మంచిగా, ప్రసన్నంగా ఉండేసరికి 'గెట్ రెడీ ఫర్ అనదర్ డోస్ ఆఫ్ జెలసీ' అని శ్యామలరావుగార్ని గుర్తు చేసుకున్నాను.

అన్నిటికంటే ముందు 'కస్టమ్సు' అన్న మాట వినగానే, నా ముఖంలో చిరాకు మాయమై అసంకల్పితంగా వినయం వచ్చేసింది. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి 'నమస్తే!' అన్నాను. అతడు ప్రతినమస్కారం చేసి, ఆ వెంటనే చేయి చాచి కరచాలనం చేశాడు.

అతడు ట్రాలీమీదున్న నా సామాన్ని ఎగాదిగా చూశాడు. తర్వాత నన్ను పరీక్షగా చూశాడు.

మొహం చూడగానే తెలిసిపోయినట్లుంది, "మీకిది మొదటి ఫారిన్ ట్రిప్పా?" అన్నాడు.

'ఊఁ' అన్నాను.

గొంతులోంచి పలికింది ఏకాక్షరమే ఐనా, దానిలో భయం, ఆశ వగైరా ఎన్నో భావాలు మిళితమై ఉన్నాయి.

"ఐతే మిమ్మల్నెక్కువ ట్రబుల్ పెట్టను. పెట్టెలన్నీ తెరవనక్కర్లేదు. వాటిలో ఏమేమున్నాయో వివరంగా చెప్పండి" అన్నాడతడు.

నిజాయితీగా, బుద్ధిగా వివరాలు చెప్పాను. అతడు శ్రద్ధగా విన్నాడు. మొహం చూస్తే నా నిజాయితీని అనుమానించినట్లు లేదు.

"టైపురైటరు, టేపు రికార్డరు, కెమేరా– ఆ మూడూ చూపించండి, చాలు" అన్నాడు.

అర్థమైంది. మిగతావాటికి డ్యూటీ పడదు. కొంచెం సంతోషం కలిగినా, ఈ మూడింటికీ ఎంత వేస్తాడోనన్న బెంగ కూడా ఉంది.

ఎలక్ట్రికల్ టైపురైటరు బయటే ఉంది. గ్రుండిగ్ స్పూల్ టైపు స్టీరియో టేపు రికార్డరు, కోనికా కెమేరా బయటకి తీశాను.

తీసేటప్పుడు మిగతావి అతడి కళ్లబడకుండా జాగ్రత్త పడ్డాను. వాటి వివరాలతడికి చెప్పి ఉన్నా– ఏమో, చూస్తే బుద్ధి మారుతుందేమోనని అనుమానం.

అతడు కెమేరాని ఎగాదిగా చూసి, "ఇది అటోమాటిక్ కెమేరా కదూ!" అన్నాడు. దానికైతే డ్యూటీ లేదంటూ నాకు వెనక్కిచ్చేశాడు. అది పాకెట్ సైజుది కావడంతో ఉత్సాహంగా చొక్కా జేబులోకి తోసేశాను.

'ఎలక్ట్రికల్ టైపురైటరు, స్టీరియో టేపురికార్డరు– రెండింటిలో ఒక దానికి ఎగ్జెంప్షన్ ఇవ్వచ్చు. ఒకదానికి డ్యూటీ కట్టాలి" అన్నాడతడు. నానుంచి కస్టమ్స్ డ్యూటీ తీసుకోవడం అతడికి బాధగా ఉందనిపించింది, ఆ గొంతు వింటే!

నేనెక్కువ ఆలోచించలేదు. "దేనికైతే తక్కువ డ్యూటీ పడుతుంది?" అన్నాను కాస్త చనువు తీసుకుని.

"దేనికైనా పన్నెండొందలే. రెండూ మీకోసమే ఐనా, రెండూ ఎవరికోసమో ఐనా– దేనికి డ్యూటీ కట్టినా ఫరవాలేదు. ఒకటి మాత్రమే మీకోసమై– మరొకటి ఎవరికోసమో ఐతే– చాయిస్ ఈజ్ యువర్స్" అన్నాడతడు.

అతడు సామాన్యుడు కాదు. కానీ సామాన్యుల మనస్తత్వాల్ని ఔపోసన పట్టినవాడు. సామాన్యులకు వీలైనంత సాయపడేవాడు.

ఒక్క క్షణం ఆలోచించాను.

టైపురైటరు నటరాజన్‌ది. డ్యూటీ పడితే కట్టమని అతడు నాకు డబ్బు కూడా ఇచ్చాడు. కస్టమ్స్ ఆఫీసరు సూచన ప్రకారం, డ్యూటీ దానికే కట్టాలి. అదీకాక పన్నెండొందలంటే తక్కువ మొత్తం కాదు. నేనైతే వందో రెండొందలో ఉంటుందనుకున్నాను. ఐనా కూడా డ్యూటీని నటరాజన్‌కి అంటగట్టడం స్నేహధర్మం కాదనిపించింది. పోనీ, ఆ డ్యూటీని ఇద్దరం పంచుకుంటే...?

ఏదేమైనా టేపు రికార్డరుకే డ్యూటీ కట్టాలని నిర్ణయించుకున్నాకనే మనసు కుదుటపడింది.

"టేపు రికార్డరు నాకోసమే! కానీ డ్యూటీ కొంచెం తగ్గదా?" అన్నాను జాలిగా.

అతడు టేపు రికార్డరు ధర అడిగాడు. ఎన్నాళ్లనుంచి వాడుతున్నామో తెలుసుకున్నాడు. మనసులో మరోసారి లెక్కలు వేసి, 'సారీ! పన్నెండొందలకు తగ్గదు" అన్నాడు.

'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్నట్లు ఇలాంటిచోట్ల నాన్నుడు ప్రమాదం. అందుకని మాటలు పెంచలేదు. పక్కనే ఉన్న ఎక్స్‌ఛేంజిలో మార్కులు కొన్ని రూపాయల్లోకి మార్చి అతడికి డబ్బిచ్చాను. అతడు వెంటనే రసీదు కూడా ఇచ్చాడు.

ఆ రసీదు చూడగానే– నాకొకటనిపించింది. దానిమీద టేపు రికార్డరుకోసమని వ్రాసి ఉంది. అది నటరాజన్‌కి చూపించి, అందులో సగం టైపురైటరుకి అని చెబితే, అది కక్కుర్తి అనిపించుకుంటుంది. తన టైపురైటరు డ్యూటీ ఫ్రీగా ఇండియా చేరిందంటే– అతడు సంతోషిస్తాడు– ఆ సంతోషం ముందు ఆరొందలో లెక్కా అనుకున్నాను.

అలా అనుకోగానే గుర్తొచ్చింది నాకు– కస్టమ్స్ ఆఫీసరుకోసం చిరుకానుకలు తెచ్చానని. బంధుమిత్రులకోసం కానుకలు కొన్న నేను– అంత మంచి ఆఫీసరుకి ఏమైనా ఇవ్వడం ధర్మమనిపించింది.

"అది లంచం కాదా?" అడిగింది మనసు.

"చెకింగుకి ముందిస్తే లంచం. చెకింగైపొయ్యాకిస్తే– కానుక" అంది విచక్షణ.

బై చెప్పి వెళ్లబోతున్న అతడితో, 'నా దగ్గిరున్నవాటిలో మీకిష్టమైనది ఏమైనా తీసుకుంటే, ఐ విల్ బి మోర్ హాపీ" అన్నాను.

తీసుకుంటాడా, కేకలేస్తాడా అని సంకోచించాను కానీ, "ఏమిస్తారు?" అన్నాడతడు నవ్వి.

"బ్లాక్ అండ్ వైట్ విస్కీ, కోన్యాక్ బ్రాందీల్లో ఏదైనా సరే! రెండూ కావాలన్నా సరే!" అన్నాను.

అతడు మళ్లీ నవ్వి, "అవేం వద్దు. సిగరెట్లేమైనా ఉంటే..." అన్నాడు.

ప్యాకెట్ జేబులోనే ఉంది. తక్కున 555 సిగరెట్ ప్యాకెట్ తీశాను.

"ఇదా? వద్దులెండి– థాంక్స్ ఫర్ ది ఆఫర్" అని వెళ్లిపోయాడతడు.

అప్పుడు స్ఫురించింది నాకు. అతడు బొంబాయి విమానాశ్రయంలో కస్టమ్స్ ఆఫీసరు. రోజూ లక్షలు, కోట్ల విదేశీ వస్తువుల్ని హాండిల్ చేస్తుంటాడు. నా కానుకలు అతడి రేంజికి ఆనతాయా?

అలాగని నాకతడిపై గౌరవభావం తగ్గలేదు. నాలాంటి సామాన్యుల్ని వేధించే కక్కుర్తి లేనందుకు అతణ్ణి మనసులో అభినందించాను.

సామానుతో బయటికొచ్చేసరికి అన్నయ్య ఎదురుచూస్తున్నాడు. సుమారు రెండేళ్లక్రితం జర్మనీ వెడుతున్న నాకు వీడ్కోలు చెప్పడాని కొచ్చాడు అన్నయ్య. మళ్లీ ఇప్పుడు స్వదేశానికి ఆహ్వానించడానికి బొంబాయిలో విమానాశ్రయానికొచ్చాడు.

ఇద్దరం ఒకర్నొకరు ఆప్యాయంగా, ఆత్మీయంగా పలకరించుకున్నాం. మొన్న శ్రీమతి, పిల్లలు క్షేమంగా చేరినట్లూ, తను వాళ్లని రిసీవ్ చేసుకుని, మా దూరపుబంధువుల ఇంట్లో ఉంటున్నట్లూ చెప్పాడు.

టాక్సీ ఎక్కేక– నేను నాకు తటస్థపడ్డ కస్టమ్స్ ఆఫీసర్ గురించి అన్నయ్యకి చెప్పి, ఇండియాలో కస్టమ్స్ వ్యవస్థని తెగ పొగిడాను.

అన్నయ్య వెంటనే, 'అలా పొగిడెయ్యకు. మొన్నటి కస్టమ్స్ ఆఫెసర్ మనవాళ్లని బాగానే తొడిగేశాడు'' అన్నాడు.

పెట్టెలన్నీ తెరిచి చూపించమన్నారుట. తెరిచేసరికి వాటిలో ఉన్న చిరుకానుకల్ని చూసి అతడికి కళ్లు చెదిరిపోయేయిట.

"ఇన్ని దేనికి? వ్యాపారం చేస్తారా?'' అనడిగేట్ట ఆ ఆఫీసరు.

మాది చాలా పెద్ద కుటుంబమనీ– అందరికీ కానుకలు తీసుకెడుతున్నామనీ, వస్తువులెక్కువున్నా అవి ఖరీదైనవి కావనీ శ్రీమతి వాళ్లకి వివరణ ఇస్తుండగా– అన్నయ్య కూడా అనుమతి తీసుకుని లోపలికి వెళ్లేట్ట. ఆఫీసరుకి తన హోదా చెప్పి, శ్రీమతికి వత్తాసుగా మాట్లాడబోతే– ఎందుకో ఆ ఆఫీసరుకి మరింత కోపం వచ్చిందిట.

"నేను కలగజేసుకోకపోతే ఏమయేదో– నేను మాట్లాడేక ఆ ఆఫీసరు, మొత్తం వస్తువులన్నింటికీ కూడా డ్యూటీ కట్టాలన్నాడు. వాటిలో ఉన్న మిక్సీ, మరికొన్ని గృహోపకరణ వస్తువులు– ఏడాదిగా వాడుతున్నట్లు నిదర్శనాలు చూపినా, పట్టించుకోలేదు. మొత్తం మూడువేల ఆరొందలు వేశాడు'' అన్నాడు బాధగా.

ఒక్క క్షణం అప్పెట్టయ్యాను. ఐతే ఒక్క క్షణమే!

అన్నయ్య బ్యాంకు ఆఫీసరు. తన హోదాకు సమాజంలో చాలా విలువుంది. అది ఎన్నోమార్లు నేనే స్వయంగా చూశాను. నిన్న కస్టమ్స్ డ్యూటీ తగ్గించడానికి– తన హోదా ఉపయోగపడలేదన్న బాధ ఇప్పుడు అన్నయ్య గొంతులో ధ్వనించింది.

'అనువు కానిచోట అధికులమనరాదు' అని మనం గ్రహించడం ఒక ఎత్తు.
మనం గ్రహించాలని ఎదుటివారు అనుకోవడం ఇంకో ఎత్తు.

"మన బంధుమిత్రులకి విదేశీ కానుకలిచ్చే అవకాశం రావడం మన అదృష్టం. అందుకు మనం సంతోషించాలి. ఆ అదృష్టానికి కొంత మూల్యం చెల్లించాల్సొస్తే చెల్లిస్తాం తప్ప– మన సంతోషానికి దూరం కాలేము" అన్నాను.

అది అన్నయ్యకు అనునయంగా మాత్రమే కాదు, నా మనసుకు స్ఫురించిన యథార్థం కూడా!

ఇక మేము మా గూళ్లు చేరుకోవాలి.

నా ప్లేన్ టికెట్ భువనేశ్వర్ వరకూ ఉంది. మావాళ్లు ట్రయిన్లో రావాలి కాబట్టి, అందుకు తగ్గట్లే మా ప్రయాణానికి ప్రోగ్రాం వేసుకున్నాం.

నేను విమానంలో ముందు కలకత్తా చేరుకుంటాను. నా శ్రీమతినీ పిల్లల్నీ తీసుకుని అన్నయ్య కలకత్తా వచ్చేక, అక్కణ్ణించి మావాళ్లు ట్రయిన్లోనూ, నేను విమానంలోనూ భువనేశ్వర్ చేరుకుంటాం.

ట్రయిన్లో ప్రయాణం చేస్తున్నప్పుడు– చలి దేశంలో ఏడాదిపైన ఉండి, మిసమిసలాడిపోతున్న శ్రీమతి– పిల్లలముందు తాను వెలవెల బోయాననీ– ట్రయిన్లో అందరి కళ్లూ మావాళ్లమీదనేననీ– అన్నయ్య తర్వాత నాకు గర్వంగా చెప్పాడు.

కలకత్తానుంచి భువనేశ్వర్ వెళ్లడానికి మాకు వెంటనే బుకింగ్సు దొరకలేదు. అలా అక్కడ అన్నయ్యింట్లో నేనో రెండూరోజులూ, మావాళ్లు వారం రోజులూ ఉండిపోవాల్సొచ్చింది.

అక్కడున్న రెండ్రోజుల్లోనూ– ఫారిన్ వెళ్లొచ్చినవాళ్లకి మన దేశంలో విలువ పెరిగిపోతుందని అర్థమైంది నాకు.

అన్నయ్య బాస్‌కోసం నేను బ్లాక్ అండ్ వైట్ విస్కీ బాటిల్ తెచ్చాను. బొంబాయిలో కస్టమ్స్ ఆఫీసర్లా కాక, ఆయన ఆ కానుకకి తెగ మురిసిపోయాడు. మిసమిసలాడిపోతున్న నన్ను చూసి, "మీ అన్నదమ్ముల్లో ఇంత తేడా ఎలా వచ్చింది?" అనడిగాడు.

"మొదట్నించీ మావాడిది పచ్చటి ఛాయ. నేను చామనఛాయలో కొంచెం నలుపువైపే ఉంటాను" అన్నాడు అన్నయ్య గర్వంగా.

నన్ను చూసి గర్వపడ్డం అన్నయ్యకు కొత్త కాదు. మా ఇద్దరికీ వయసులో ఉన్న తేడా ఏడాదికి ఎనిమిదిరోజులు తక్కువ. ఆరో తరగతి నుంచి ఏడాది రీసెర్చిదాకా– ఇద్దరం కలిసి చదువుకున్నాం. తను ఆర్ట్సు, నేను సైన్సు. అంతే తేడా!

ఐతే పెర్సనాలిటీలో నేనెప్పుడూ తనకి తీసికట్టే!

తను నాకంటే పొడుగు. మామూలుగానే హుందాగా ఉంటాడు. డ్రెస్ సెన్సు మరింత హుందాతనమిచ్చింది.

ఇప్పటి మిసమిస– నాకు జర్మనీ పూసిన పూత. అక్కడ వాళ్లమధ్య నాకది తెలియలేదు. ఇక్కడ నాకిది శాశ్వతం కాదని తెలుసు.

నేను భువనేశ్వర్ విమానాశ్రయంలో దిగినప్పుడు ఆఫీసు నాకోసం కారు పంపింది. ఐతే నాకు స్వాగతం పలకడానికి– యాభైమందికి పైగా రావడం ఆశ్చర్యాన్ని కలుగజేసింది.

తెలుగువాళ్లు చాలామంది కుటుంబాలతో వచ్చారు. ఉత్తరాది, ఒరియా మిత్రులు కొందరొచ్చారు. వాళ్లందరితో ఉత్తరాల ద్వారా కంటాక్టులో ఉండడం ఒక కారణమేమో కానీ– విదేశమెళ్లి తిరిగొచ్చిన ఒక మామూలు సైంటిస్టుని రిసీవ్ చేసుకుందుకు ఎయిర్‌పోర్టుకి అంతమంది రావడం– అంతకు ముందూ ఆతర్వాతా– అక్కడ నేనెరుగను.

కాలనీలో– అప్పటికే నాకోసం అందుబాటులో ఉన్న చిన్న క్వార్టరొకటి తాత్కాలికంగా నాకు అలాటయింది. ఐతే అది ఖాళీ అవడానికి మూణ్ణాలుగు రోజులు పట్టొచ్చు. అంతవరకూ రవి ఇంట్లో అతిథిగా ఉన్నాను. రవి దంపతులు అక్కడ అందర్లోకీ మాకు సన్నిహితులు.

రాగానే రవి ఇంట్లో సామాను పెట్టుకుని, ముందు ఆఫీసుకెళ్లి డైరెక్టర్ ప్రఫుల్లని కలుసుకున్నాను.

కుశల ప్రశ్నలైన వెంటనే ప్రఫుల్ల నాతో, "నీ లెటర్ చూశాను. నువ్వు రాసింది కరెక్టే. పొరపాటు ఇక్కడే జరిగింది" అన్నాడు.

జర్మనీలో గడువుకు మించి మూణ్ణెల్లుండడానికి ఆఫీసునుంచి అనుమతి లభించేక– కనీసం మరో మూణ్ణెల్లు ఇవ్వమని డాడ్ సంస్థ ఆఫీసుని కోరింది. అది నేను చెప్పి వ్రాయించినట్లు భావించిన మా ఆఫీసు, నాపై చర్య ఎందుకు తీసుకోకూడదన్నట్లు తాఖీదు పంపింది నాకు. డాడ్ ఆఫీసు మా ఆఫీసుకి రిక్వెస్టు పంపితే, దానికి నామీద చర్య ఏమిటని– ఆఫీసుని తప్పు పడుతూ ప్రఫుల్లకి నేనుత్తరం వ్రాశాను.

ఇప్పుడు ప్రఫుల్ల చెబుతున్నది ఆ ఉత్తరం గురించే!

ఇప్పుడాయన ఆ ఉత్తరాన్ని ప్రస్తావిస్తాడనుకోలేదు. "ఇంతకీ ఈ పొరపాటెలా జరిగింది సార్!" అన్నాను ఆశ్చర్యం ప్రకటిస్తూ.

"ఇదివరకు అడ్మినిస్ట్రేటషనుకి అధికారి 'ఏఓ' అనగా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరొక్కడే! ఇప్పుడు 'ఏ'ఓపై అజమాయిషీకి కొత్తగా 'సిఒఎ' అనగా కంట్రోలర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌ని నియమించారు. అలా ఇటీవలే వచ్చిన సిఒఎ రావు కొంచెం తిక్క మనిషి. అడ్మినిస్ట్రేషనుపై పూర్తి పెత్తనం తనదే అనుకుంటూ, ఒకోసారి నాకు చెప్పకుండానూ కొన్ని నిర్ణయాలు తీసుకుంటాడు. నీ విషయంలో అదే జరిగింది. నీ ఉత్తరం చూసేక నాకది తెలిసి, వెంటనే పిల్చి గట్టిగా మందలించి, ఆ కరెస్పాండెన్సుని ఫైల్లోంచి తీసేయించాను. జరిగిందానికే మనుకోకు. అతడి తరఫున నేను సారీ చెబుతున్నా" అన్నాడు ప్రఫుల్ల.

ఐతే కొలీగ్సు ఉత్తరాల ద్వారా రావు గురించి కొంత తెలుసు నాకు. ఆయన కన్నడిగుడు. తెలుగు బాగా రావడమే కాదు, తెలుగు సాహిత్యమంటే ప్రీతి. ఇంట్లో అంతా తెలుగు పత్రికలు చదువుతారు. ఆయనొచ్చిన కొన్నాళ్లకే– కాలనీవాసులకు కొత్త సదుపాయా లొచ్చాయి. ఆఫీసులోనూ, కాలనీలోనూ నిస్వార్థపరుడన్న పేరు కూడా తెచ్చుకున్నాడు.

ప్రఫుల్ల మంచివాడే కానీ, అక్కడ అందరికీ తనే పై అధికారినన్న అహముంది. సిఒఎ రావు తనకంటే మంచిపేరు తెచ్చుకోవడం ఆయనకు నచ్చలేదు. వారిద్దరికీ అంతగా సయోధ్య లేదు.

ప్రఫుల్లని కలుసుకున్న కాసేపటికే రావు వచ్చి నన్ను కలిశాడు. ఎలా తెలిసిందో ఆయనకి అప్పుడే ప్రఫుల్ల తన గురించి నాకు చెప్పిన విషయం తెలిసింది.

"నేను అడ్మినిస్ట్రేషన్‌కి సర్వాధికారిని కావచ్చు కానీ, ప్రఫుల్ల నాకు పై అధికారి. ఆయనకు సలహా ఇవ్వగలను కానీ, నా సలహాని కాదంటే తను చెప్పినట్లే చేసి తీరాలి. మీ విషయంలో ఆయన చెప్పినట్లే చేశాను. నన్ను అపార్థం చేసుకోవద్దు" అన్నాడు సంజాయిషీగా.

నేనాయన భుజం తట్టి, "మీరు నాకు కొత్త కానీ, ప్రఫుల్ల నాకు కొత్త కాదు. మీరు చెప్పకపోయినా, జరిగిందేమిటో నేనూహించాను. ఐతే ఒకందుకు నాకు సంతోషంగా ఉంది. ఆ ఉత్తరం పంపడం పొరపాటని ప్రఫుల్ల ఒప్పుకున్నాడు" అన్నాను ఓదార్పుగా.

ఈ అనుభవాలతో నేను ఇండియాకు తిరిగొచ్చేసిన అనుభూతి పూర్తిగా కలిగింది. 'ఫారిన్ వెళ్లానండి' అనడం మాని, 'తిరిగొచ్చేశానండి' అనుకునే అనుభవాలు మొదలయ్యాయి. ఆ అనుభవాలు అందరికీ సుపరిచితమే కాబట్టి– వాటిలో ఈ రచనకు సందర్భానుసారమైన వాటిలో కొన్నింటిని మాత్రం ఇక్కడ సూచనప్రాయంగా తెలియజేసి– సెలవు ఎతెసుకుంటాను.

నేను రాకపోతే రీసెర్చి వర్కు స్తంభించిపోతుందనీ, జర్మనీలో కొనసాగడానికి– అతికష్టంమీద మూడునెలలు ఎక్స్‌టెన్షన్ ఇస్తున్నాననీ, అంతకుమించి అదనంగా ఒక్కరోజు కూడా నన్ను వదులుకోలేమనీ ఆఫీసునుంచి ఉత్తరం వచ్చింది కదా! తిరిగొచ్చేక నా రీసెర్చికి ఏర్పాట్ల మాటటుంచి, నేను కూర్చునేందుకు గది ఏర్పాటు చెయ్యడానికే ఆర్నెల్లు పట్టింది. ఆ సమయంలో నేను ఎక్కువగా లైబ్రరీలో గడిపేవాణ్ణి.

బెర్లిన్లో లూయీజీ నా వర్కుని పూర్తి చేసి, ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిట్ చేసి డిగ్రీ సంపాదించుకున్నాడు. అచ్చు పుస్తకంగా వచ్చిన ఆ రిపోర్టుకి ఆథర్సులో లూయీజీ, రాలెక్‌లతో పాటు నా పేరు కూడా ఉంది. అందులోని కొన్ని పరిశోధనా ఫలితాలు అంతర్జాతీయ సైంటిఫిక్ జర్నల్లో రీసెర్చి పేపరుగా ప్రచురితమయ్యాయి. నేనా రిపోర్టుకి కాపీ తీయించి ఆఫీసులో

సబ్మిట్ చేశాను. లైబ్రరీలో ఉంచడంతో దాని చరిత్ర ముగిసింది. ఐతే ఆ రిపోర్టు, రీసెర్చి పేపరు– ఆ తర్వాత నాకొచ్చిన ప్రమోషన్లో ప్రముఖపాత్ర వహించాయి.

ప్రొఫెసర్ రాలెక్ నాతో రెగ్యులర్ కరెస్పాండెన్సులో ఉండేవాడు. ఆయన గురువు ప్రొఫెసర్ కోల్బెల్ జన్మదిన వేడుకలకు నాకు ఆహ్వానం అందేది. కోల్బెల్ చనిపోయినప్పుడు ఆ విషాదాన్ని కూడా అక్కడివాళ్లతో పంచుకున్నాను.

రాలెక్ నన్ను 'వాన్ హుంబోల్ట్ట్' అనే ప్రతిష్ఠాత్మకమైన ఫెలోషిప్ కోసం తన ద్వారా అప్లై చెయ్యమని ఉత్తరం వ్రాశాడు. నేను ప్రఫుల్లకు చెప్పి, "మీరు సరేనంటే, ఆయననుంచి వర్క్ ప్రోగ్రాం తెప్పిస్తాను" అన్నాను. ఆయన ప్రోగ్రాం తెప్పించుకోమన్నాడు. కానీ రాలెక్ నిజంగానే పది పేజీల ప్రోగ్రాం పంపేసరికి తడబడి, "డబ్బు సంపాదించుకుందుకు ఫారిన్ వెళ్లడానికి నీకు మరో అవకాశం నేనే కల్పిస్తాను. ప్రస్తుతానికి వద్దు" అన్నాడు. ఓ రీసెర్చి సంస్థ సర్వోన్నతాధికారి, రీసెర్చి ఫెలోషిప్‌ని ధనలోభంగా భావించడాన్ని అప్పుడే కాదు, ఇప్పటికీ నేను జీర్ణించుకోలేకపోతున్నాను. ఐతే విదేశీయులకి అసలు విషయం చెప్పడానికి మనసొప్పక, 'వాన్ హుంబోల్ట్ట్'కి అప్లై చెయ్యడానికి అనుమతి లభించలేదు' అని రాలెక్‌కి ఉత్తరం రాశాను. అప్పుడాయనకొచ్చిన కోపమింతా అంతా కాదు. నాకు ప్రోగ్రాం పంపడానికి తను చేసిన నెల్లాళ్ల కృషి వృథా అయునందుకు నన్ను నిందించాడు. ఐనా మా సంబంధాలు మాత్రం తెగిపోలేదు. ఏటా మేము గ్రీటింగ్సు చెప్పుకునేవాళ్లం. ఆయన రిటైర్మెంటు వేడుకకి నాకు ఆహ్వానం అందింది. రాలెక్ శిష్యుల ద్వారా ఆయన మరణవార్తందినప్పుడు– కుటుంబసభ్యుడు పోయినంత బాధ కలిగింది. ఆయన్ని మళ్లీ కలుసుకునే అవకాశం రాకపోవడం నాకో విషాదం.

కూడా తెచ్చుకున్న ఫారిన్ ఎక్స్‌చేంజి డిపాజిట్ చేసి– అప్పట్లో అరుదైన బజాజ్ చేతక్ స్కూటర్ కొన్నాను. అది నడపడం చేతకాక, మంచి లాభానికి దాన్ని అమ్మేశాను.

నటరాజన్ నాగపూర్‌నుంచి తన మిత్రుణ్ణి పంపి, ఎలక్ట్రిక్ టైపురైటర్ తెప్పించుకున్నాడు.

తిరిగి ఇవ్వక్కర్లేదు మెర్రో అని చెప్పినా– నా తొలి ఓవర్‌కోటుని– పూనానుంచి తన మిత్రుడి ద్వారా వెనక్కి పంపాడు శోభన్ ఘోష్. మొక్కపాటి వారు 'పార్వతీశం' టోపీ కథ ఊరికే వ్రాయలేదు మరి!

ఆర్థికంగా అభివృద్ధి చెందిన ఒక విభిన్న వ్యవస్థలో కొన్నాళ్లుండి వచ్చేక, ఆర్థికంగా అంతగా అభివృద్ధి చెందని మన వ్యవస్థలో ఎన్నో లోపాలు కన్పించవచ్చు. కానీ ఇది మన వ్యవస్థ. ఆ లోపాలవల్ల కలిగే అసంతృప్తిని– ఇక్కడి అనుభవాలు, అనుభూతులు, అనుబంధాలు– పూర్తిగా తొలగించగలవు. అందుకు 1974–76కి ముందూ, ఆ తర్వాతనుంచి నేటివరకూ– సుఖ సంతోషమయమూ. ఉత్సాహభరితమూ అయిన మా జీవితమే నిదర్శనం.

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ!

సెలవు!

కౌముదికి వందనాలు

నన్ను డెప్యుటేషన్ మీద జర్మనీ పంపడానికి మా ఆఫీసు నిర్ణయించినప్పుడు– 1973–74ఎదురైన అనుభవాల్ని– 'ఫారిన్ వెళ్లాలండి' అనే నవలగా రూపొందిస్తే– 'ఉదయం' మాసపత్రిక ప్రచురించింది. 1974–76లో జర్మనీలో పొందిన అనుభవాల్ని అదే తరహాలో క్రోడీకరించి 'ఫారిన్ వెళ్లానండి' నవల వ్రాశాం. అప్పట్లో ప్రాచుర్యమున్న 'నవలానుబంధం' ప్రక్రియకు అనుగుణంగా పేజీలు నిర్ణయించడంవల్లనేమో– వ్రాసింది చదివితే నవలకు సినాప్సిస్‌లా అనిపించింది. పక్కన పెట్టేశాం.

కొత్త శతాబ్దంలో ఆవిర్భవించిన కౌముది వెబ్ పత్రిక కొత్త ఒరవడులను ప్రదర్శిస్తూ, మా అభిరుచులకు అనుగుణంగా ఉన్నట్లు తోచింది. ఐతే 'ఫారిన్ వెళ్లానండి' ప్రచురణకు రెండు ఇబ్బందులున్నాయి. ఇది ఎన్నో ఏళ్లక్రితం ప్రచురితమైన 'ఫారిన్ వెళ్లాలండి'కి కొనసాగింపు. పాఠకుల సౌలభ్యానికి– మొదటి భాగాన్ని మళ్లీ ప్రచురించాలి. అదలాగుంచితే, మాకు సాహితీపరంగా ఉన్న ఇతర కమిట్‌మెంట్ల వల్ల రెండో భాగాన్ని ఏకబిగిన వ్రాసివ్వలేము. ఆ విషయం శ్రీ కిరణ్‌ప్రభకు చెబితే– మొదటి నవలను పునర్ముద్రించడానికీ, తదుపరి రెండో భాగాన్ని అంచెలంచెలుగా అందుకునేందుకూ వారు సుముఖులయ్యారు. అందుకు సహృదయంతోపాటు– రచయితపై బాగా నమ్మకముండాలి. ఎందుకంటే మధ్యలో కౌముది నమ్మకానికి పరీక్ష కూడా వచ్చింది.

నవల రెండో భాగం నడుస్తుండగా– అనారోగ్యం ఇబ్బందివల్ల నవలను కొనసాగించలేమన్న అధైర్యం కలిగి, మధ్యలో ఆపేద్దామా అనుకున్నాం. కానీ 'మీ అనారోగ్యం తాత్కాలికం. నెలకి కనీసం ఒక్క పేజీ అయినా పంపుతూ నవలను సీరియల్‌గా కొనసాగించండి' అన్నారు కిరణ్‌ప్రభ. పత్రికా సంపాదకుడినుంచి అటువంటి స్పందన ఉంటే, రచయితలను అనారోగ్యం ఏంచెయ్యగలదు? మేము వారికి ఏ నెలా ఆరు పేజీలకు తక్కువ కాకుండా పంపుతూ– మా మర్యాదను కాపాడుకోగలిగాం.

మరొకందుకు కూడా కౌముదికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఈ నవల రెండో భాగం మొదలెట్టినప్పుడు, ఇంత పెద్దది ఔతుందనుకోలేదు. కానీ కౌముది ప్రోత్సాహం మమ్మల్ని కాలయంత్రంలో 1974లోకి తీసుకుపోయింది. అప్పటి జీవితం మొత్తాన్ని మళ్లీ ఆస్వాదించాం. తొలుత వ్రాసిన సినాప్సిస్‌లో లేని ఎన్నో అంశాలు గుర్తుకొచ్చాయి. వయసొచ్చేక బాల్యంలో చేష్టల్ని విడియోలో చూసినప్పుడు కలిగే లాంటి అపూర్వానుభూతిని పొందాం. నలభైఏడేళ్ల క్రితం అనుభవాలు, అనుభూతులు– నిన్న జరిగినట్లు అనిపించి అలరించాయి. మాలోని పాఠకులకోసమని రచనలు చేసే మాకు పూర్తి సంతృప్తినిచ్చిన మరో రచన ఇది. కౌముదికి కృతజ్ఞతలు చెప్పకుండా ఎలా?

ఈ నవలలోని పాత్రలు సజీవాలు. ఇందులోని ఓ విశిష్ట పాత్ర శ్రీమతి ఎస్ఎస్ రావు– కౌముదిలో నవల చదివి స్పందించి– 46 ఏళ్ల తర్వాత గతానుభూతుల్ని మాతో పంచుకొనడం ఒక అద్భుతానుభవం.

మళ్లీ మేము జర్మనీ వెళ్లలేదు. కానీ ప్రస్తుతం జర్మనీలో ఉన్న మా అమ్మాయి రాజకుమారి, అల్లుడు సాంబశివరావు– ఇటీవలే బెర్లిన్ వెళ్లి, మేమిచ్చిన వివరాల్ని బట్టి 1974–75లో మేమున్న ఆ ఇంటిని గుర్తించి, బయట్నించి చూసి రావడం మరో విశేషం!

ఈ నవల పాఠకులకు నచ్చితే– ఆ ఘనత పూర్తిగా కౌముదిది. నచ్చకపోతే అన్న ప్రసక్తి లేదు. ఎందుకంటే– పాఠకులకు నచ్చనివి కౌముది ప్రచురించదు.

కౌముదికి, పాఠకులకు 2023కి నూతన సంవత్సర శుభాకాంక్షలు.